పచ్చనాకు సాక్షిగా...

సినబ్బ కతలు

మిట్టూరోడి కతలు

మునికన్నడి సేద్యం

పాల పొదుగు

సుందరమ్మ కొడుకులు



# మిట్టూరోడి పుస్తకం

# మిట్టూరోడి పుస్తకం



**టామ్ సాయర్ బుక్స్**

**209, అన్నమయ్య టవర్స్**

**యాదవ కాలనీ, తిరుపతి – 517 501**

**ఫోన్:(0877)2242102**

# మిట్టూరోడి పుస్తకం

–నామిని


| | | |
|---|---|---|
| మొదటి ముద్రణ | : | నవంబర్, 2013 |
| ముఖచిత్రం | : | తోట వైకుంఠం |
| బొమ్మలు | : | బాపు<br>తోట వైకుంఠం |
| ఫోటోలు | : | ఆర్.ఎం. ఉమామహేశ్వరరావు, కిరణ్‌క్రాంత్ |
| ప్రచురణ | : | టామ్ సాయర్ బుక్స్, తిరుపతి |
| ముద్రణ | : | సాయిబాండ్స్ ప్రింట్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్, చెన్నై |
| ప్రతులకు | : | విశాలాంధ్ర అన్ని బ్రాంచీలూ,<br>నవోదయ, కాచిగూడ, హైదరాబాద్ |
| **పేజీలు** | : | **608** |
| **వెల** | : | **360 రూపాయలు** |

ఇదీ వరస...


**పచ్చనాకు సాక్షిగా... 6-131**

1) ఎర్రని ఎండలో మా అమ్మ కడుపు 7
2) ...ఇదంతా నా కడుపు మంట 12
3) మా ఇంట్లో మాంసం కూర 15
4) మూడేళ్లు విద్యాశాఖా మంత్రినే... 18
5) ఊపిరి పోయిన ఊదోడు 21
6) మా పగోళ్లు-ఎన్ను మింద గువ్వలు 24
7) పని మిందనే కలవరం 27
8) థూ ఈ బతుకు బతకాల్నా? 29
9) మా ఆవు వంటిదే మా అమ్మ 32
10) నా రెక్కలున్నంత కాలం 35
11) కూలోళ్లతో మా అమ్మ కటీనం 38
12) లబలబా నోరు కొట్టుకోనా? 42
13) కష్టం బలే పుణ్యం గదా! 44
14) మా అమ్మ - (మా తాత) 47
15) కట్టె ఇస్కూల్లో, మనసు బంక చేనులో...! 50
16) ...పడిన వాడిని నాకు తెలుసు 53
17) మా నాయిన మట్టిపాదం 56
18) మా నవ్వులోడి దుఃఖం 59
19) మా అమ్మ - బూమమ్మ 62
20) బండెడు కష్టం చేసినా... 65
21) అన్నం మాకెంతో పిరం 68
22) ఎండలో దీనురాలు 71
23) మా గడపెక్కిన కత్తెర పల్లాయన 74
24) మా నాయిన ముహూర్తం పంచె 77
25) నీడ బలే కరువు గదా! 80
26) అంగిడి బియ్యం, తంగేడు కట్టె 83
27) మా పూలపూల కోడిపెట్ట 86
28) అత్తినీరా, ఇడ్లీలో, రొట్టే బిస్కె 89
29) మాకు చేతనైన వైద్యం 92
30) మా అంజలి కోరిక 95
31) ఏడుపు పాట - మా అమ్మది 98
32) తిరప్తి మార్కెట్టులో మా కూరగాయలు 101
33) నా మింద అలిగిన మా అమ్మ 104

34) పొయ్యి మంటెయ్యకుండా ఇదేమి ముదిగారం! 107
35) మా అమ్మ కడుపాత్రం 110
36) రాత్రిపూట మా అమ్మ గోష్ట 113
37) బతకాలని బండాట 117
38) నాది కడుపు గాదు, రాయల చెరువు తూము! 121
39) మా యమ్మకు నేను బాద గురువునంట! 124
40) కొడవటికంటి సినక్క - నామిని నారప్ప 128

**సినబ్బ కతలు** **132 - 226**

41) రామబజినా సేయరా! ఆడపిల్లతో పని ఏమిరా!! 133
42) గుడ్డిపోలియన్ ది గ్రేట్ 137
43) తంతే తలకోనలో పడే కత 140
44) గుడిమల్లమోడి బూందీ దగ్గిర నా చాతుర్రిం 143
45) మా గూనయ్యోరికి గుణపాఠం 147
46) మా యెంగట్లచ్చిం పలక డాన్సు 151
47) మా గెడ్డాం అయ్యోరి పుణ్యం 154
48) గుర్ గుర్ గుడుగుడు మోటర్ 158
49) మా ఇంటి తీగూర ఇజీకోల్టు పొరుగింటి పుల్లగూర 162
50) తెల్ల కోకల కత 166
51) బూడీసుల సుబ్రమణి 169
52) మద్యానాలకు మకరాజవదామని... 173
53) చిన్నికృష్ణా నిన్ను చేరి కొలుతు 177
54) మా సిడిజిర్లాండోడి వైబోగం 180
55) మా గరిమినాబిగోడు 184
56) సోదర సోదరీమణులాలా సొరకాయ బుర్రలాలా... 188
57) ఇది ఏమి మాయా! శ్రీకృష్ణుని దయలేకపోయా! 192
58) ఆర్య వ్యవహారంబున దృష్టంబు గ్రాహ్యంబు 197
59) శ్రీరామజయము కలుగవలెను 201
60) మై నేమీజ్ లోభి నా కొడుకు 205
61) గుచ్చు గుచ్చు పుల్లా - దాంకో పుల్లా..! 209
62) మా నటరాజా సర్వీసులో- 213
63) మా ట్రిమ్మోడి కడుపులో గలాంబులాం 217
64) మా సోసీలయ్యోరి సాంఘిక శాస్త్రం 219
65) చిత్తానూరులో పెండ్లి బోజినాలు 223

**మిట్టూరోడి కతలు** **227 - 329**
66) బతుకుగోరే తల్లి 228
67) కుచ్చుంటే కత, లేస్తే కత- 232
68) నగరి కాలవలో జుట్టుబావ 237
69) మా రామస్తానం ఎందుకు బతకతా వుండాదంటేనంట- 241
70) నా పుంజున్నువ్వు... నీ పుంజున్నేను- 244
71) రొయ్యాస్పత్రిలో చెంగాళత్త డ్రామా 248
72) నో! షి ఈజ్ ద నాట్! 252
73) మా కమలత్త కూర తెచ్చిందహో! 256
74) పెళ్ళానికి బయపడే పెరుగు సాయిబు 260
75) నాది కోతి చేష్టా - మా పొట్టవ్వది నీతి మాటా- 264
76) నెత్తి బరువు నేల దిగే కత 268
77) మిట్టమింద సుబ్బీ - నేనూ ఒగటి! 272
78) రెయ్యి స్కూల్లో తిన మరిగి... 276
79) పాపాత్మ ఇది ఏమి పాటు రా! సిగ బట్టేవు నీకేమి చేటు రా!! 281
80) కర్రెక్క జెప్పేది మొగోడే లేడంట! 285
81) దున్నపోతు దున్ని చావాల! 288
82) జంటిలుమెన్ల చేత జుట్లు పట్టించిన నారద మఖాముని 293
83) మా కన్నెబావ రామబక్తి 298
84) దేముడు మెచ్చిన తప్పు 301
85) బాసకత బక్కమ్మకు తెలుసు 305
86) కష్టిజీవే నా బావ 310
87) రంగ రంగ నిన్ను నమ్మితి! ఏ నాటికైన రంగా నీ పాదమే గతి!! 314
88) అమ్మకి జేజే! 318
89) కడుపు గాల్చిన కన్నకూతురు 323
90) అలివేలు మంగమ్మకొక దండం 325

**మునికన్నడి సేద్యం** 330 - 466
**పాల పొదుగు** 467 - 502
**సుందరమ్మ కొడుకులు** 503 - 538
**నా కుశాల - నా మనేద** 539 - 583
**మిట్టూరోళ్ల ఫోటోలు కొన్ని....** 584 - 608

# పచ్చనాకు సాక్షిగా...



నా అణకవైన అక్క
జయలక్ష్మికి...
నా మోసకారి అక్క
జయలక్ష్మికి...

# ఎఱ్ఱని ఎండలో మా అమ్మ కడుపు

మా పలుకొటం అయ్యోరికి గెడారం వుండేది గాదు. ఆయన కుడి చేతి మణికట్టు మీద ఒక వాత వుండేది. మా పిలకాయల్లో శానా మంది మణికట్లకు అటువంటి వాతలు వుండాయి.

పిలకాయలు– అని అన్నాక, వాళ్ళు మట్టిలో ఆటలాడుకోకుండా వుండలేరు గదా. మట్టి తినని పసి పిలగాడు– పసి పిలగాడే గాదు గదా. పసితనంలో మట్టి తింటే పసికిర్లు వస్తాయని, అవిట్ని రాకుండా చేసేటందుకు మాకు ఆ వాతల్ని పెట్టిస్తారు మా పెద్దోళ్ళు. మా సిత్తూరు జిల్లా సెంద్రగిరి తాలూకాలో కొటాల అనే గ్రామం వుండాది. ఇటువంటి వాతలు పెట్టడంలో ఆ వూరు పెక్యాసి పొందింది. సూడబోతే, మా అయ్యోరికి కూడా కొటాల వాత తప్పలా.

మా ఇస్కూలు పిలకాయలం సాటుమాటుగా అనుకుంటాం: "ఒరే, అయ్యోరు కూడా సిన్నప్పుడు మట్టి తిన్నాడ్రో" అని–

సేతికి గెడారం లేని మా అయ్యోరు – ఒరే గెంట పదకొండున్నర అయిందేమో వూళ్లోకి పోయి చూసేసి రండ్రా – అనేవోడు. ఆ మాట అయ్యోరి నోట ఎప్పుడొస్తాదా – అని మేమంతా కాపెట్టుకుని వుండేటోళ్లం. మా వూర్లో ఒకరిద్దరి సేతికి తెల్లటి కప్పల మాదిర గెడారాలు వుండాయి. కానీ వోళ్లు ఆ సమయానికి ఇంట్లో వుండరు గదా. మా వూళ్లో పెర్మినెట్టు గెడారం ఒకటుండాది. అది మా వూరి వి.ఎల్.డెబుల్యూ ఇల్లు. (ఆయన మా మేనత్త కొడుకే.)

అయ్యోరు – టైం జూసేసి రండ్రా – అని అన్నాక ఒకటో తరగతోళ్ల నుంచి అయిదో తరగతి వాళ్ల దాకా పది మంది అయినా పైకి లేస్తారు ఆత్రం ఆత్రంగా. ఆ పది మందిలో ఎనిమిది మంది అయ్యోరి సేత దెబ్బలు తింటారు. ఇద్దరు మాత్రం వి.ఎల్.డబ్ల్యూ గోడ గెడారం కాడికి పోతారు.

నేను గూడా ఒకసారి టైం జూసేసి వచ్చే దానికి పోతిని. టిక్కూటిక్కూమని శబ్దం చేసే ఆ గెంట గెడారం కాడ నేను ఒళ్లు మరిసి పోయి నిలబడి పోతిని. వి.ఎల్.డబ్ల్యూ అక్క – టైం పదకొండూ నలఫైరా – అని చెప్పినాక

కూడా నేను మళ్లా అయిదు నిమిసాల దాకా ఆ గోడ గెడారం కల్లానే రెప్పార్పకుండా చూస్తా వుండి పోతిని.

అసలు మద్దేనం పూట టైం జూసే దానికి బోడి వి.ఎల్.డబ్ల్యూ గోడ గెడారం అఖ్ఖరే లేదు. పదకొండున్నర గెంటకాడ మన నీడ మన పాదాల దగ్గర్నే వుండి పోతుంది. అది గుర్తు పెట్టుకుంటే చాల్దా – అని మా పిలకాయలం శానా సార్లు అనుకున్నాం గూడా.

అయ్యోరు గెంట కొట్టమంటాడు. ఆ గెంట కొట్టేదానికి – నువ్వా – నేనా – అనేసి ఇరవై మంది అయినా పైకి లేస్తాం. పందొమ్మిది మంది అయ్యోరి సేతి దెబ్బలు తింటాం.

ఇస్కోల్నించి బైట పడినాక వూర్లోకి పోవటం రెండు నిమిసాల పని. నడస్తా వుంటే శానా సార్లు పలకను కింద వేసేద్దామని అనిపిస్తుంది. ఒక సారి ఇసిక వుండే సోట గుండెలు బిగ పట్టుకోని పలకను జార విడిసినాను. హమ్మ. ఆ పూట పలక పగల లేదు. పగలని పలకను తీసుకోని కండ్లకు అద్దుకుందామనిపించేది. 'మంచి పలక, నాది బుజ్జి పలక' అని ఆ వోడు పోయిన పలకను అరిచరిచి మెచ్చుకోవాలనిపించేది. మళ్లీ ఒకసారి జార విడుద్దామని మనసు గుంజేది. అమ్మో, బయం – పగిలి పోతే–!

దీగూడులో పలకను పెట్టేసి –

అమ్మ దగ్గిరికి పట్టూ పరుగు!

వొచ్చేసింది కయ్యాగాలవ. ఆ కయ్యాగాలవ మాది గాదు. ఆ కయ్యాగాలవలన్నీ మావే అయివుంటే – మా అమ్మ అక్కడెందుకు వొంగి కలుపు పెరకతా వుంటింది? అవన్నీ మావే అయి వుంటే – మా అమ్మ ఈ పాటికి ఇంటికాడ కూలోళ్లకు వేయవలసిన సంగటి ముద్దల్ని లెక్క వేసుకుంటూ వుంటింది!

మా అమ్మ వొంగి వుండే కయ్య దగ్గిరికి పోతాను నేను. మా అమ్మ నా అలికిడి విని పైకి లేసి నన్ను జూస్తింది. మా అమ్మ తెల్లారి కయ్యల్లోకి వొచ్చేసే ముందర నుదుట కుంకుమ బొట్టు పెట్టుకుంటుంది గదా! అదప్పుడు చెమటకు, ఎండకు ముక్కు మీద వరకు కారుతూ వుంటింది.

“ నా సిన్న కొడుక్కి ఇస్కోలు యిడిసినారు. వొచ్చేసినాడు.” అని అంటింది మా అమ్మ. ఆ మాట నాకు గెనిమీ్మద వుండగానే వినబడతాది.

మా అమ్మ మోకాట్లోతు బురదలో వొంగి కలుపు మొక్కలు పెరకతా వుంటే సూర్యుడు మిడిమేలంగా ఎండను కురిపిస్తా వుంటాడు. ఆమె కయ్యిలో అసోబుసోమని గస పోసుకుంటూ పని చేస్తా వుంటింది. అయినా నేను, “అమ్మా, నేన్నీదగ్గిరికి రావాల” అని ఆగడం చేస్తాను.

“వొద్దమ్మా, వొద్దు, బురద, దిగబడి పోతావు” అని అంటింది, వొంగి ఆమె పని ఆమె చేసుకుంటూనే.

నేను మళ్లీ ఏదో ఒకటి అరిసి సెప్తాను.

“అమ్మా, అమ్మా! ఇస్కోల్లో రాముడు నా యెనకాన్నించి యెంటికలు పెరికినాడు, నిజ్జింతో పచ్చనాకు సత్తెంగా ... వోడు నా యెంటికలు పెరికినాడమ్మా. అయ్యోరు నాకు పలకలో అఆలు రాసిస్తే కిస్టడు ఎంగిలూంచి నా అచ్చిరాల్ని తుడిపేసినాడమ్మా.” అని దిగులు దిగులుగా అరిసి సెప్తాను.

“ఆ నా బట్టల్ని కనిపించనియ్యి. ఎగిసి తంతాను” అని... అమ్మ – రాముడ్ని, కిస్టడ్ని తిట్టి, “ ఒరే యెదవా! ఎండరా, నీడకు పో, సంగటి ఈపాటికి వస్తా వుంటింది. తిందువులే.” అని అంటుంది.

నేను నీడకు సచ్చినా పోను, మా అమ్మకు ఇది బలే బాద.

“అమ్మా అమ్మా సిరంజీవుడు బలేటోడమ్మా, వోడి సంగతి నీకు తెలవదు. వోడు నన్ను పేరు పెట్టి పిలవనే పిలవడమ్మా. ‘ఒరే గుడ్డోడా, ఒరే గుడ్డోడా!’ అనే అంటాడమ్మా. ఏమమ్మా, నాకు గుడ్డా?” అని సిరంజీవుడి గురించి చెప్తాను.

“మనకు గుడ్డి అయితే పోనీలే. వాడి మొకం సెందర బింబమంటనా?” అని మా అమ్మ సిరంజీవుడ్ని తిట్టకుండా యాష్టపోతుంది. (సిరంజీవుడు నాకు అన్న అవతాడు వరసకి).

నేను అంతటితో ఆగకుండా గనిమీ్మదనే చేరుకుని వొంగి వుండే మా అమ్మతో, “ అమ్మా, అమ్మా.....” అని ఏదో చెప్పబోతాను.

మా అమ్మ వినకుండా, “తప్పమ్మా, తప్పు. వొరసబెట్టి శాడీలు సెప్పటం తప్పు.” అనంటుంది. నాకు సిన్నతనమై పోతుంది.

“నేను అపద్దం సెప్పటం లేదమ్మా, పచ్చనాకు సత్తెంగా....” అనంటాను మళ్లీ.

ఇంతలో మా అమ్మతో మునం పట్టి పని చేసే ఒకామె, “ఒరే నా బట్టా! గెనిమీమ్మద చేరుకోని సబువులు చెప్పకుంటే, అక్కడ చెంబు వుండాది. అన్ని నీళ్లు తేబో, గొంతు ఎండక పోతా వుండాది. గెంట నుంచి ఒకే దప్పిక గాని, పోయి రాబోరా.” అంటింది. నేను ఆమె మాటకు బదులుగా, “గెంట నుంచి దప్పికా? నిన్ను నీళ్లు తాగొద్దని నిన్నెవుడు కొట్నాడమ్మా చెప్పుతో?” అని అంటాను. (ఆమె నాకు అత్త వరస). “నేను నీళ్లకనీ, వుచ్చకనీ పోతా వుంటే నీ లంజి వచ్చి తీస్తిందా తియ్యవలసిన కలుపు?” అని అంటుందామె.

నేను చెంబు తీసుకోని నీళ్లకు ఎలబారతాను. నడస్తా నడస్తా చెంబు మూతిని మొకానికి అడ్డంగా పెట్టుకోని నా యిష్టం వచ్చింది మాట్లాడుకుంటాను. చెంబులో నుంచి నా మాటలు నాకే బలే యిచ్చిత్రంగా యినిపిస్తాయి.

అప్పట్లో మా వూళ్లోని కయ్యల్లో ఒకే ఒక ఆయిలు మిసినీ వుండేది. అది ‘జెక్కు బుక్కు జెక్కు బుక్కు’ మంటా నీళ్లను తోడేది. ఆ మిసినీకి రెండు పైపులు. ఒకటి లావుది. ఇంకొకటి బలే సన్నంది. లావు దాంట్లో గుండా మంచి నీళ్లు. సన్న గొట్టంలో గుండా వుడుకు నీళ్లు వచ్చేవి. దప్పికతో అల్లాడే మా అత్త నోటికి వుడుకు నీళ్లు ఎత్తక పోయి ఇచ్చి, ఆమె నోట్లో అన్ని వుడుకు నీళ్లను పోసుకుని తుపుక్కుమని వూంచేస్తే నవ్వాలనిపించేది. ఒకసారి ఆ మాదిరిగా ఇచ్చినాను కూడా.

ఇంతలోనే సంగటి గంప వచ్చేది. చేసే పని చాలించి మా అమ్మ కాళ్లూ చేతులూ కడుక్కుని కుంకుం బొట్టు లేని మొకంతో నీడకు వచ్చేది.

మా అమ్మ భాగానికి రెండు సజ్జ సంగటి ముద్దలు, పిడికిడు గోగాకు వూరుబిండి.

సంగటి ముద్దల్ని సేతుల్లో యేసుకోని మా అమ్మ నన్ను తోడుకొని ఒక చెట్టు నీడకు వచ్చేది.

నా నోటికి సంగటి కవళాలు అందిస్తాది మా అమ్మ. ఆ సజ్జ సంగటి ముద్దలు చేసిన తల్లిని బలే తిట్టేది.

అవి సజ్జ సంగటి ముద్దలు కాబట్టే ఇంత చిన్నవిగా వుండాయే, ఒక వేళ బియ్యం సంగటి ముద్దలైతే యింకెంత చిన్నవిగా వుండేవో? – అని మా అమ్మ అనేది.

సజ్జ సంగటి తినేదానికి బాగుండదు.

ఆకిలి గదా,

నేను మా అమ్మ తినిపించే కవళాలన్నీ తినేసి అన్ని నీళ్లు తాగేసే వాడ్ని.

మా అమ్మకు ఒక్క ముద్ద కూడా మిగిలేది గాదు.

మా అమ్మకు మిగిలిన ఆ కాసంత సంగటిని చూసి బయపడే వాడ్ని.

ఒక రోజు మా అమ్మ ఆ కాసంత సంగటిని చేత బట్టుకుని చెట్టు నీడ నుంచి ఎఱ్ఱాటి ఎండకల్లా చూసి,

"ఒకరికి ముగ్గురు బిడ్డల్ని కని నేనేం వారుకున్నాను? ఈ పిలకాయల్ని నా కడుపులో ఎందుకు పుట్టించినావురా నా బట్టా దేముడా! నాకు పిలకాయలు కావాల దేముడా – అని నేను నీ గుడికొచ్చి వర పడినానంటరా కూలి పోయిన దేముడా!" అనింది.

నేను మా అమ్మకల్లా అదొక మాదిరిగా చూస్తే –

"తింటావా?" అనడిగి ఒక కవళం పెట్టబోయింది.

నేను నా నోటికడ్డంగా చెయ్యి పెట్టేసి మా అమ్మ చేతి కవణాన్ని మా అమ్మ నోటికే అందించినాను.

# ...ఇదంతా నా కడుపు మంట

మా అమ్మ కలుపు తీసేసి ఇంటికి వచ్చే సరికి తిరమల కొండ మీద పాల బల్బులు సోలుపుగా మండతా వుంటాయి. దీపం వెలిగే మా ఇల్లు నా కంటికి బలే వుండేది.

మా కాడిమాను దండెం మీద చీలికా పేలికా నీడలు దీపపు వెలుగులో ఎదురు గోడ మీద పొడుగ్గా పడేవి. మా అమ్మ నీడ నా కంటికి దిగులు దిగులుగా కనబడి బయం వేసేది.

రెండు మానికల బియ్యం కూడును మా అమ్మ వార్చగానే–

నులక మంచం మీద అలుపు తీర్చుకునే మా నాయిన, 'ఏమే, అన్ని చిట్టుడుకు నీళ్లు' – యివ్వమనే వాడు. బలే లో గొంతు మనిషి మా నాయిన.

అప్పుడు మా అమ్మ కూర చెయ్యడానికి రడీ అవతా వుండేది.

మా అమ్మ మా నాయినకు సమాధానమైనా చెప్పకుండా పని చేసుకుంటూ పొయ్యేది.

మా అమ్మ నిష్టూరానికి మా నాయిన గుండెల్లో నుంచి మాటలు రానిచ్చి, "లోకమంతా ఎండలో వొంగి పని జేసినట్టు, నేను మాత్తరం పచ్చని చెట్టుకు ఉయ్యాల కట్టుకోని ఊగినట్టు." అనేవోడు.

మా అమ్మ మా నాయిన మాటకు పొడుగ్గా గాలి వొదిలి అన్ని గంజి నీళ్ళను ముంతలో పోసి మంచి నీళ్ళను జోడీ చేసి తగు మాత్రంగా వుప్పు వేసి మా నాయిన మంచం కింద పెట్టి వచ్చేది.

మా వాళ్ళంతా నీళ్ళు పోసుకునే సరికి కూటేళ అయిపోయేది. ఆ పాటికి మా అమ్మ కూర చట్టి దించి రోలు మీద పెట్టి గుత్తి కట్టితో కూరను ఎనిపేది.

అది – వుత్తి మిరప కాయ కూర! దోసిడు మిరప కాయల్ని రెండు దోసిళ్ళ నీళ్ళల్లో వేసి వుడక బెట్టడం, తరవాత వుప్పు వేసి పామెయ్యడం, అదీ ఆ కూర కత.

కూరై పోయినాక మా అమ్మా నేనూ పెళ్ళోకి పోయి గుడ్డలిప్పేసి – వుడుకుడుగ్గా నీళ్లు పోసుకొనే వాళ్ళం. పొగులంతా పనిజేసి మా అమ్మకు ఒళ్లు అలిసి పోయి వుంటుంది. వుడుకు నీళ్ళ ముంతను పైన కుమ్మరించుకోని మా అమ్మ ముంత ముంతకూ మూలిగేది.

అందరమూ అన్నాలకు కుచ్చుంటాం.

సత్తుగిన్నెలో కూడూ కూరా వేసుకుని కూర్చొని నేను మా అమ్మకల్లా గిన్నెకల్లా మార్చి మార్చి చూసే వాడ్ని.

ముందూ యెనకా సూడకుండా మా అన్నా, మా అక్కా, ఒకరికి మించినట్లు ఒకరు ముక్కులు సీదుకుంటా, నోళ్లల్లోకి గాలిని ఎగ పీల్చుకుని కారాన్ని అణసర చేసుకుంటా తింటా వుంటారు.

నేను నానస్తా వుంటే మా అక్క పెద్దరికాన్ని నెత్తినేసుకుని, "సెడిదీ బడిదీ కడుపు నిండికీ తింటే గదా, బిడ్డి పెరిగి పెద్దోడయ్యేది." అని అంటింది. "నేను తిన్ను బో." అనేసి నా చేతుల్తో గిన్నిని బయం బయంగా తోసేస్తాను.

నేను మా నాయిన కల్లా జూసి, "అయ్యా, అయ్యా, బలే కారింగా వుండాది గదా కూడు." అనడగతాను.

దానికి మా నాయిన, "ఏమోనయ్యా, రుచులు మాకేం తెలుసు? కారిం గీరిం అంటే వినే దానికి నాకు నీ మాదిరి అమ్మా, అయ్యా లేరే!" అనేవాడు.

"తిను రే కన్నా, నువ్వు తినకుంటే రేపు పొద్దు మొలవదు రే నాయినా." అని ఎగతాళిపడే మా అక్కను సైగ చేసి చిన్న దెబ్బ ఒకటి మా అమ్మ కొట్టి నాకు అన్నం తినిపించేది. నేను తినేసే వాడ్ని. చాపల మీద చేరే వాళ్లం.

మా అమ్మకు నిద్దరతో కండ్లు మూతలు పడతా వుంటాయి. నాకు మాత్రం నిద్దర పట్టదు.

రాత్తిరంతా మా అమ్మను వులిక్కి పడేటట్టు పైకి లేపి, "అమ్మా అమ్మా మంట, అమ్మా అమ్మా కడుపు మంట, అమ్మామ్మే, కడుపులో కలబెట్టినట్టు వుండాది," అనే వోడ్ని. ఆ మాటలంటూనే మంట పెట్టే వుసురు కాయని చేతుల్తో నలిపేసే వాడ్ని. మా అమ్మ నా చేతుల్ని చేతుల్లోకి తీసుకోని, "నలుపుకో వద్దు నాయినా, నలుపుకో వద్దు." అని మదన పడేది.

"అమ్మా కడుపులో కారిం గాని, మంట గాని, వుసురు కాయ బగ్గుమని మండతా వుండాదమ్మా–" అనే వోడ్ని నిద్దర్లోకి పోతా వుండే మా అమ్మతో. ఆ మాటను గుక్క తిప్పుకోకుండా లచ్చ సార్లు అనాలనిపించేది.

"కడుపు నిండికీ నీళ్లు తాగీ కొడకా! వుడుకూ గిడుకూ వొదిలి పోతింది నాయినా." అనేది మా అమ్మ నిదర మొహంతో.

"అమ్మా అమ్మా, నిజ్జింతో కడుపు మంట గాని, కడుపులో ఎండ గాసినట్టు వుండాదమ్మా." అనే వాడ్ని.

ఈ మాట మా అమ్మకు బలే బాద గలిగించేదిగా వుండాది. ఆ మాట అనిన నన్ను మా అమ్మ రెండు చేతుల్తో జవురుకుని, "ఈ దీనురాలి కడుపులో ఎందుకు పుడితివిరా అష్ట దరిద్రపు కొడకా! వుత్తి మిరక్కాయ కూర యేసినందుకు మంటకు వోర్చుకో లేక నిన్న మన బిడ్డ అల్లాడి పోయినాడే – అనేసి, నేను రేపు నీకు పెరుగూ కూడూ పెట్టబోతానా నాయినా!" అని మా అమ్మ నిద్దర కండ్లలోకి నీళ్లను తెచ్చుకోని ఎక్కిళ్ళతో అదిరి పొయ్యేది.

మా అమ్మ నా గురించి అట్లా ఏడవటం నాకు బలే నాయంగా అనిపించేది.

"అమ్మా, వొంటికి వొచ్చినట్టుగా వుండాది. అమ్మామ్మే, మాటిమాటికీ వొంటికి వొచ్చినట్టుగా వుండాది. కడుపులో అలివి గాని మంట–" అని ఆ చీకట్లో ఆ రాత్తిరంతా నేను మా అమ్మ కండ్ల నీళ్లను దప్పిక తాగేసే వాడ్ని.

# మా ఇంట్లో మాంసం కూర

**మాం**సాన్ని చూస్తే నాకు అమ్మా అబ్బను చూసినట్టే. మా వూళ్లో ప్రతీ ఆదివారం ఒక యేట తల తెగి పొయ్యేది.

పొట్టేలు తోలు తీసి ఆయాలు ఒక వారగా, మెత్తని కూర ఒక వారగా ఎముకల్ని ఒక వారగా.... వేస్తూ వుంటే మా పిలకాయలమంతా ఒళ్లు మరిచి పోయి చూస్తుండే వాళ్లం. వేటను కోసే గొడ్ల కొట్టంలో ఏదో గంగిరెద్దులాట జరగతా వుండినట్టు మేమంతా అక్కడ నిలబడుకోని, కూర కోసం గిన్నెలు తెచ్చే ఆడోళ్లకు కూడా తావు ఇచ్చే వాళ్లం కాము. మా గుంపును జూసి యేటను నరికిన మనిషి ఒక వరి పోచను చేతికి తీసుకుని, "ఏందిక్కడ చూసేది! ఇదేమన్నా గంగ జాతరా! ఇక్కడేమన్నా పప్పులు బెల్లాలు పెడతా వుండారా? పొండి పొండి." అంటూ అదిలించే వాడు. మా పిలకాయలం ఆయన బెదిరింపులకు బయపడి పోయి కొట్టం బయటకు వచ్చేసి తడికల గుండా మాంసాన్ని చూస్తూ వుండి పోయే వాళ్లం.

మా మా అమ్మలు ఎంత సేపుటికీ గిన్నెలు తీసుకుని మాంసం కోసం వచ్చే వాళ్లు కారు. మేం ఆత్రం ఆత్రంగా ఇండ్లకు పరుగులు పెట్టే వాళ్లం. నేను మా అమ్మ కొంగు పట్టుకొని, "అమ్మా, అమ్మా, వూళ్లో యేటను కోస్తా వుండారు. కూర తేమ్మా" అని అడుక్కునే వాడ్ని. మా అమ్మ గోగాకు కాడల్ని తుంచి తుంచి చాటలో వేస్తూ వుండి పోయేది. ఆ రోజు సంగటిలోకి గోగాకు వూరుబిండి అని నాకు తెలిసిపోయే సరికి నేను మొకం మటమటా పెట్టుకోని, "ఎప్పుడూ గోగాకు వూరిబిండీ, వుత్తి మిరపకాయ కూరేనో!" అని నిష్టూర పోయే వాడ్ని. నా నిష్టూరాన్ని చూసి మా అమ్మ ఫలానా "చట్టిలో చెని క్కాయలుండాయి. వలుచుకుని తినుపో" అనేది.

"నిన్నిప్పుడు చెనిక్కాయలు అడిగినానా? చియ్యల కూర తెమ్మంటే 'చెనిక్కాయలు ఎత్తుకోరా' అంటిందీమె." అంటూ నేను మా అమ్మ ఒడి చేరి ముదిగారానికి పోబోతాను. ఒకటికి పది సార్లు అడిగితే మా అమ్మ చియ్యల కూర తెచ్చినా తేవచ్చుననిపించి నేను మళ్లీ మళ్లీ "అమ్మా, లెయ్, ఈ ఒక్క రోజుకి కూర తే–" అని అడుక్కునే వాడ్ని.

మాంసం కూర కోసం నేను గోజారడాన్ని జూసి మా అమ్మ, "నన్ను వురిబాదలు పెట్టొద్దొరేయ్. నా చేతిలో రూక వుంటే నీ చేత అడిగించుకుంటానా నాయినా! నేనే తేనా?" అంటుంది. ఆ మాటతో నా మొకం చిన్నదై పోతుంది! "నేను నిన్ను ఉరి బాదలు పెడతా వుండానో!" నిష్టూరంగా అనేసి వీధిలోకి వచ్చేస్తాను.

–మా అమ్మ మాంసం కూరను సంవచ్చరంలో పండగ రోజుల్లో మాత్రమే తెచ్చేది. పండగ పూట కూడా అర కేజీ మాత్రమే తెచ్చేది. 'నాలుగు రూపాయలు పెట్టి ఒక కేజీ తెస్తే ఏమో?' అని నేనే గాదు, మా నాయిన కూడా అని వుండాడు.

మా అమ్మ అర కేజీ తేగానే నేను గుండెకాయ ముక్కను నిప్పుల్లో కాల్చుకొని – మా అన్న, మా అక్క కళ్లు కప్పి తినేసే వాడ్ని! ఇంట్లోకి మాంసం తెచ్చిన రోజునైతే నేనెప్పుడూ పొయ్యి ముందర్నే వుండి మా అమ్మతో ఎంతో కులుకుగా లక్ష మాట్లాడే వాడ్ని. కూరను పొయ్యి మీద నుంచి దించగానే మేమంతా కూర్చునే వాళ్లము.

మా అమ్మ అతి జాగర్తగా గరిటను కూర చట్టిలో పెట్టి మాంసం వేసే తీరు చెప్పనలివి గానిది. అటువంటి సమయాల్లో మా నాయిన శానా సార్లు, "బంగారు బంగారు ...జాగర్త జాగర్త... తూకం తూకం..." అని మా అమ్మను నవ్వుతూ ఎగతాళి చేసే వాడు. అది ఎగతాళిగా తీసుకోకుండా మా అమ్మ మొకం నల్లంగా పెట్టుకోని, "ఒకరికి ముగ్గురి బిడ్డల్ని కనిపించి, నా ఎదాన తోస్తివి గదే–" అనేది. మా నాయినకు గూడా మాంసం కూర తెచ్చిన రోజున రెండు కడుపులు వుండేవి. చింతకాయ వూరుబిండితో రెండు ముద్దలు తినే మా అయ్య పండగ రోజున మాంసం కూర (వాసన) తో మూడు ముద్దలు మింగేసి గుటగుటా గుండు చెంబుడు నీళ్లను తాగేసే వాడు. మా నాయిన వొంగుకొని మాంసం కూర (వాసన) తో సంగటి తింటూ ఉంటే నా కంటికి మా నాయినలో – ఏనుగెక్కిన రాజానందం కనిపించేది. మా నాయన కూడా, తూచి తూచి మాంసం కూర వేసే మా అమ్మతో, పసి పిల్లవాడి మాదిర, 'ఇంకొంచెం, ఇంకొంచెం' అని గోజారే వాడు. మా నాయిన మాంసం కూర కాడ గోజారింపుకు మా అమ్మ కుమిలి పొయ్యేది. "నా స్వామికి కడుపు

నిండికీ, ‘ఇంక నాకొద్దు’ అనేటట్టు ఎప్పుడు పెట్టబోతానో గదా!” అని మా అమ్మ మదన పడేది. మాంసం కూర తెచ్చిన పండగ పూట మా అందరికి మా అమ్మ వడ్డించే సరికి – మా అమ్మ పెద్ద కార్యం జరిపించేసినట్టు పొడుగ్గా గాలి వొదిలేది. ఆ రోజు మా అమ్మ కుశాలగా కూడా వుండేది.

చియ్యల కూర పులుసులో సంగటి ముద్దలను అద్దుకుని తినేది మా అమ్మ. ఆమె జన్మంలో ఒక కారపు చియ్యను నోట్లో వేసుకుని నమిలి చీమిడి తుడుచుకుంటూ వుంటే నేనీ పాపిష్టి కళ్లతో చూసి వుండ లేదు.

పండగల పూట నేనూ, మా అన్న, మా అక్క, మా అయ్య మాత్రం ఆ కాసిని చియ్యల్ని నమిలి, ఎముకల్తో కుస్తీ బట్టినాక–

కనకాంబరాల పూల తోట మాదిరి కేళీ విలాసంగా కళకళలాడిపోయే వాళ్లం.

# మూడేళ్లూ విద్యాశాఖా మంత్రినే...

మా ఇస్కూలు పిలకాయలకందరికీ ఆరోగ్య శాఖా మంత్రి తలకాడ గుండుగా తయారయినాడు. ఆరోగ్య శాఖా మంత్రి అంటే – ఎవుడో గాదు, మా ఇస్కూల్లో మాతో కూడా చదువుకునే వాడే!

మా ఇస్కోల్లో యాభై మంది పిలకాయలం వుంటే మా అయ్యవారు ముగ్గుర్ని మంత్రుల్ని చేసినాడు.

మా ఇస్కూలు ముందర ఒక ముచ్చటైన పూల తోట వుండేది. దాంట్లో నందివర్ధనం చెట్లూ వరలక్ష్మి చెట్లూ, కాగితాల పూలు పూసే చెట్లూ వుండేవి. వాటన్నిటీన్ని ...నీళ్ళు పోసి, గొడ్ల ఎరువు వేసి...జాగర్తగా కాపాడుకునే బాద్దెత యెవసాయ శాఖా మంత్రిది. ఈ శాఖను మా అయ్యవారు రామా నాయుడికి అప్పగించినాడు. రామా నాయుడు మూడో తరగతిలో వుండినా అయిదో తరగతి వాడి మాదిర కొంచెం పొడుగ్గా వుండే వాడు. ఆ వయసులోనే వాడు ఒక రోజు వాళ్ల నాయిన విడిచిన మేడిని పట్టుకొని కొండ్ర వేసేసినాడు. 'మా రాముడు పెద్దోడైతే మా ఇంటాయన సేద్యమంతా చేసెయ్యడా!' అనేది రాముడి అమ్మ కూడా. వాడి చేతికి వచ్చింది వ్యవసాయ శాఖ. ప్రతీ ఆదివారం నాడు వాడు ఇస్కూలికి వచ్చి గెంట కొట్టే వాడు. మేమంతా ముంతలు పట్టుకొని ఇస్కూలుకు వచ్చి చెట్ల పాదుల్ని తొణికేటట్లు చేసేసి తడితడిగా ఇండ్లకు చేరే వాళ్లం. వ్యవసాయ మంత్రి పని అంతటితో అయిపొయ్యేది.

నాకు చదువు కొంచిం బాగనే వచ్చేది. ఎనిమిదో ఎక్కాన్నీ, జనగనమణనీ ...కండ్లు మూసుకొని, మడిజేతులు గట్టుకొని గుక్క తిప్పుకోకుండా అప్పజేప్పేసే వాడ్ని. ఇందుకనే నాకు విద్యాశాఖను అప్పగించినాడు మా అయ్యవారు. సందేళ సందేళ మా పిలకాయల ఇండ్లకు పోయి చదవతా వుండారో లేదోనని చూసి ఆ మరసనాడు అయ్యోరుకు చెప్పడం... ఇదీ నా పని.

నా విద్యా శాఖతో, రామానాయుడి వ్యవసాయ శాఖతో మా పిలకాయ లెవురూ ఇబ్బందులు పడలేదు.

మా అయ్యవారు ఉమామహేశ్వర నాయుడ్ని ఆరోగ్యశాఖా మంత్రిగా పెట్టినాడు. ఉమ్మడు కుదిమట్టంగా వుండే వాడు. వాడు నాలుగు బారల

పొద్దెక్కే సరికి ఆముదం పెట్టుకొని, పాపిట్లోకి వెంట్రుక పడకుండా దువ్వించుకొని, ఇస్త్రీ చేసిన గుడ్డల్ని వేసుకొని, మజ్జిగాకూడూ తినేసి ఇస్కోలుకు వచ్చే వాడు. వచ్చి ఇస్కోలు గడప ముందర నిలబడి–

అన్ని కూట్నీళ్లను గొంతులో పోసుకొని పలకా బలపాన్ని సేత పట్టుకొని పరిగెత్తుకుంటా వచ్చే మమ్మల్ని, ఇస్కోల్లోకి పోనీకుండా ఆపు జేసేసే వాడు!

ఉమ్మడు ఒక్కొక్కర్నే –

"రేయ్, మొకాన ఆ చీమిడేంది? సబ్బుతో మొకం కడుక్కోని రాబో"–

"ఒరేయ్, ఏందిరా ఆ నిక్కరా? అగ్గిలో యేసినా కాలదే? వేరేది యేసుకోని రా!"

"చొక్కాయ లేకుండా ఇస్కోలికి వచ్చేసినావే, ఇదేమన్నా మీ ఇల్లా, గవుర్మెంటోడి ఇస్కోలా?"

"ఆ తలకాయ చూడా! గెద్ద గూడు మాదిర! చమురు పెట్టుకొని పాపిట ఏర్పరుచుకొని రా!"

–అంటూ వాడు మా పిలకాయల మానాబిమానాల్ని మాకులకు కట్టేసే వాడు.

నాకు రోజూ తలకు చమురుండేది గాదు. నాకు దినుమ్మూ నిక్కర చీలికై పేలికై (పిర్రల కాడ అయితే మరీ యిదిగా) అగ్గికి కూడా యెరవకుండా వుండేది. ముక్కు ఎప్పుడూ కారుతూ నాలిక్కి అంత రుచిని తెలపతా వుండేది. ఒంటి మీద నాలుగైదు పుండ్లు రసి కడుతూ వుండేవి. వీపుకు చిరిగిన చొక్కాయ అయినా వుండేది గాదు.

నాకు ఆరోగ్య శాఖ పెద్ద చెర అయిపోయింది.

ఉమ్మడికి బయపడి–మా అమ్మ 'పడిశం పడుతుంది రో' – అంటా వుండినా వినకుండా మంచి నీళ్లు పెట్టుకొని, నానా అగచాట్లూ పడి పాపిటెత్తుకొని, ఇస్కోలుకు వస్తే,

ఆరోగ్యశాఖా మంత్రి నా ఒంటి మీద – అది దరిద్రం ఇది దరిద్రం – అని లక్ష తూట్లు చెప్పే వాడు.

వాడికి నా గోళ్లు పొడుగ్గా ఉండకూడదంట. నా గోళ్ళల్లో మట్టీ మశానం ఉండగూడదంట. నా గోళ్ళను కత్తిరించుకొని రమ్మంటాడు. నేను ఆ మాటను వినేసి మా వూరి భజన గుడిలోని నున్నాటి రాతి మీద నా గోళ్ళను అరగ రుద్దే వాణ్ని. శుభ్రమైన గోళ్ళతో మళ్లీ ఇస్కూలుకు వస్తే మళ్లీ ఏదో ఒక తూటు చెప్పేవాడు. నాకు వాడితో వేగ లేక ఎద్దును మోసినంత కష్టమనిపించేది.

ఒక రేపటేళ ఆరోగ్య శాఖా మంత్రి నన్ను పెట్టిన యింసను తల్చుకొని బొరోమని ఏడ్చుకుంటూ, మా అమ్మ పని చేసుకునే కయ్య కాడికి పోతిని.

"ఏమి కొడకా, నిన్ను ఆరోగ్గి శాఖా మంత్రి ఇస్కోల్లోకి రానీ లేదా నాయినా..." అంటా నా దగ్గరికొచ్చింది మా అమ్మ.

నేను మాట్లాడబోయి మా అమ్మ మోకాళ్ళ సందన తల పెట్టి 'ఓ' అని ఎక్కిళ్లు పెట్టేస్తిని.

నన్ను చంకనెత్తుకొని మా అమ్మ నేరుగా బురద కాళ్ళతో ఇస్కోల్లోకి వొచ్చి,

"మాకు ఆరోగ్గిం యాడ నుంచి వొస్తింది పలుకొటం అయ్యోరా! మేం కుప్పల మీద బతకతా లేం అయ్యోరా! దున్ని బతికేటందుకు బూములేకుండా, దూకి చచ్చేటందుకు బావుల్లేకుండా హీనం బతుకు బతకతా వుండాం దేవరా! మా పిలకాయలు మాడు చెక్కల నీళ్ళతో పెరిగి పెద్దోళ్లు కావలసిందే సామీ! నీకు అప్పజెల్లిని, నీ కాళ్లు పట్టుకుంటా – వొక్కల ముక్కలగా వచ్చే నా బిడ్డని ఎతల పాలు జెయ్యకుండా నాలుగచ్చిరాలు నేర్పిచ్చి పుణ్యం గట్టుకో నాయినా!" – అనేసి బారడు పొడుగు నిష్టూరం పోయింది.

# ఊపిరి పోయిన ఊదోడు

ముసిలమ్మకు మా అమ్మ వయసే వుండేది. అయితే ఆమెకు వయసుకు మించిన గూని వుండేది. తల కూడా భలే నెరిసి వుండేది. పళ్ళు బయట పెట్టుకుని ఎల్ల కాలమూ పెదాలు ఎండుకు పోయి వుండేది. ఆమె ఒంటి మీద ఒక మాసిన రవిక వేసుకుని వుండగా నేను చూసి వుండ లేదు. ముసిలమ్మకు నా ఈడు కొడుకు వుండే వాడు. వాడు నాకు జత, సావాసుకోపు. ముసిలమ్మా, మా అమ్మా ఇద్దరూ ఒకే రోజు మమ్మల్ని ఇస్కోల్లో చేర్పించి పలకా బలపాల్ని మా చేతికి ఇచ్చినారు.

ముసిలమ్మ కొడుకు నెత్తురే లేని వాడి మాదిర పాలి పోయి వుండే వాడు. కను రెప్పను కిందికి తెరిచి చూసినా నెత్తురు జాడ వుండే ఎఱ్ర రంగు కనిపించేది గాదు. వాడు మట్టిని భలే తినే వాడు. పది మందిమి పలకా బలపాలు పట్టుకుని ఇస్కూలుకు పోతా వుంటే, ముసిలమ్మ కొడుకు సందు జూసుకుని గబీమని వొంగి పిడికెడు మట్టిని తీసుకుని, గులకను నోటితో వూదేసి వట్టి దుమ్మునే నోట్లో పోసుకునే వాడు. మట్టి నాలిక మీద నానే కొద్దీ వాడు లొట్టలు వేసే వాడు. వాడ్ని పెద్దోళ్ళు ఎంత మంది ఎన్ని రకాలుగా భయిపించినా వాడా అలవాటు మానే వాడు గాడు. ఇంట్లో ముసిలమ్మ కళ్లు, అక్కల కళ్లూ కప్పి చట్టిలో వుండే బియ్యం నూకను జేబులో పోసుకొని బొక్కలాడే వాడు. వాడికి మట్టి అన్నా, బియ్యం అన్నా అంత పిచ్చిగా వుండేది. ఈ అలవాట్ల వల్లనో ఏమో వాడు ఊది పోయినట్టు అగుపించే వాడు. అందుకని వాడ్ని మా పిలకాయలు గానీ, కడకు పెద్దోళ్లు గానీ అంతా 'ఊదోడా, ఒరే, ఊదోడా!' అని పిలిచే వాళ్ళం. ఊదోడికి ఒంట్లో నెత్తురు పెట్టాలని, అర చేతుల్ని తెరచి చూస్తే నెత్తురు కమ్మి నట్టు కనబడాలని భలే కోరిగ్గా వుండేది. ఒకటీ రెండ్లు నూరు ఎంచే దాకా పరుగు తీసినా సందిట్లావు గస రాకూడదని కలలు గనే వాడు. ఒక రోజు గుడ్ల కోడిని వాడికి అప్పగించేసి ముసిలమ్మ పని మీద కయ్యల్లోకి పోయింది. ఆ రోజు కోడి గుడ్డు పెట్టింది. అది– అది వరకే పద్నాలుగు గుడ్లను పెట్టి వుండింది. ఆ రోజు కోడి గుడ్డే పెట్ట లేదని ముసిలమ్మతో బొంకేసి వూదోడు ఆ గుడ్డును పగలగొట్టేసి ఎఱ్ర జొనతో సహా తాగేసినాడంట.

"ఒరె ఒరె, సుబ్రమణీ! చూడు చూడు, నా కన్రెప్పలు తెర్చి చూడు. నిదానంగా నిమ్మళించి చూడ్రో, నా అరి చేతులు చూడు, నెత్తురు పెట్టి వుండ లేదా?" అని వాడు నేను ఎక్కడికి పోతే అక్కడికి వచ్చి అడిగినాడు. "నువ్వు తాగిన కోడి గుడ్డు యింకా అరిగి ఒంట బట్టి కూడా వుండదనుకో, ఇంతలోనే నెత్తురు పెట్టేస్తుందో?"– అని నేను నిప్పుల మీద నీళ్లు జల్లినట్టుగా మాట్లాడినాను. వాడు ముఖం నల్లంగా పెట్టుకొని అలిగినట్టుగా పొయ్యేవాడు.

బలిసిపోయి, మనిషి నెత్తురు నెత్తురుగా, గుండ్రంగా, నున్నంగా తయారై పోవాలని వాడికి రోజురోజుకూ ఆశ భలే పెరిగి పోయింది. అంత ఆశలో కూడా వాడికి మట్టి మీద, బియ్యం మీద మాత్రం ఆశ చావ లేదు. అవిట్ని మాత్రం వాడు సందు దొరికినప్పుడల్లా తింటానే వచ్చినాడు. బలిసేటందుకు చిట్కాల్ని వాడు పెద్ద పెద్ద వాళ్ళని కూడా అడిగేవోడు.

"య్యో, బలవాలంటే ఏం తినాలయా?"

బలిసేటందుకు ఒక్కొక్కాయన ఒక్కొక్క విధంగా చెప్పే వాడు. ఒకరు చెప్పినట్టు ఒకరు చెప్పే వాళ్లు కారు. –బుడ్డ శెనగల్ని రాత్రి పూట నీళ్ళల్లో నాన బెట్టి తెల్లారి పాచి పండ్లతో తినాల.

– రోజూ రెండు పిడికిళ్ళ చెనిగ్గింజలు అంత బెల్లంతో నంజుకుని తిను.

ఈ మాదిరిగానే కొన్నిరోజులు గడిచినాయి. ఒక రోజు –

నేను అన్ని కూటి నీళ్లు తాగి పలకా బలపం తీసుకుని వూదోడి ఇంటికి పోయినాను.

వాళ్ళ అమ్మ ఆ రోజు శివం తొక్కతా వుండినట్టు లేదు. పాపం, ముసిలమ్మ ఆ రోజు మేకల దొడ్డి అని అనుకోకుండా, పాచి పని అని అనుకోకుండా, వూదోడినే కాపెట్టుకొని వుండింది.

వూదోడు ఆ రోజు మరింత ఉబ్బి వున్నాడు. అది బలుపు మాత్రం కాదు. వాడి రూపు నా కంటికి కొంచెం భయంగా వుండింది.

ముసిలమ్మ ఆ రోజు కొడుకుని ఒళ్లోకి తీసుకొని చద్ది తినిపించబోతా వుంది.

అప్పుడు ఎందుకనో, ఏ సంకటం వల్లనో వుబ్బి పోయి వుండిన వూదోడు, "అమ్మా, వొద్దు, అమ్మా, అమ్మా చద్ది కూడు వొద్దు. నాకు ఒళ్లేమీ బాగలా, నాకు అర్ధ రూపాయికి ఎనిమిది ఇడ్డీలు తీస్కరా, తినేస్తా. ఈ చద్ది నాకొద్దు. చద్ది తాగితే ఇంకా వూది పోతా" నని అమ్మకు ఆరోగ్గిం గురిచ్చి చెప్పినాడు. తిరపతికి తోడుకు పోయి ఒళ్లును డాకట్రుకు చూపించమన్నాడు. అప్పుడు ముసిలమ్మ కొడుకు గెడ్డాన్ని పట్టుకొని, "నన్ను వుడకాడిపించకుండా యీ చద్ది కూడు తిను కొడకా. నీ వుబ్బు అంతా దిగి పోతుంది, నాయినా!" అని చద్ది కూడు తినిపిస్తా వుంటే నేను ఇస్కూలుకు వచ్చేస్తిని.

అయ్యవారు ఇస్కూల్లో, రిజిస్టరులో వూదోడు పేరు చదివినప్పుడు నేను లేచి నిలబడి, "వూదోడికి ఒంట్లో సంకటంగా వుండాది సార్, వాడు వుబ్బిపోయి వుండాడు సా." అని చెప్పినాను.

ఆ మరసనాడు అయ్యోరు రిజిస్టరులో వూదోడు పేరు పిలవనే లేదు.

వూదోడికి వూపిరి పోయింది. వూపిరి పోయిన వూదోడ్ని వూరి పెద్దోళ్లు పసుపు గుడ్డల్లో చుట్ట జుట్టినప్పుడు ముసిలమ్మ, "నా మింద అలిగి పొయ్‌నావా నా కొడకా! నా కండల్ని మెతుకుల్ని జేసి నిన్ను సాకగలనే గాని...నీకు పాలుగా, గుడ్లుగా, పండ్లుగా పెట్టి బద్రంగా, జాగర్తగా ఎన్ను మీద గువ్వ మాదిరి సాక్కో లేదని ఈ దీనురాలి మింద అలిగి పోయినావా కొడకా!" అని ఎదుర్రొమ్ము కొట్టుకొని ఏడిస్తే నేను మా అమ్మ కాళ్ళకాడ జేరి చూసినాను.

ఆ రాత్రి నాకు చలీజెరం తగిలింది. కల్లో వూదోడు కనబడి, "మా అమ్మ బలేటి లంజిరా, వూది పోయినప్పుడు కూడా చద్ది పెట్టింది. ఇడ్డీలు పెట్టమని చిలక్కి చెప్పినట్టు చెప్పితే యినిందా? అందుగ్గదా నా వూపిరి పోయింది..." అన్నాడు.

నిద్దర్లేచినాక నాకు ముసిలమ్మ ఏడుపుపాట అంతా గుర్తుకు వచ్చింది.

# మా పగోళ్ళు ఎన్ను మింద గువ్వలు

"నువ్వింకా పసి బిడ్డవా?" – అని అనడం మా అమ్మ మొదులు పెట్టేసింది. నా ఎనిమిదో సంవచ్చరం నుంచి సంగటీ సలిబిండీ తేరగా తినేసి అమ్మ కొంగు పట్టుకుని ఆ మాటా ఈ మాటా అనడంతో పొద్దు పోవడం అనేది లేకుండా పోయింది. తెల్లవారి నిద్ర లేవంగానే మా అమ్మ నాకు బుద్ధి మాటలు చెప్పి నన్ను కయ్య కాడికి పంపించేది. అప్పుడు కయ్యిలో వరి నాట్లు వేసి వుండినామనుకోండి. మా అమ్మ ఒక డబ్బా, కఱ్ఱా చేతికి ఇచ్చి కయ్యకాడికి పంపించేది. పురుగుల కోసం అడుసులో వాలే కొంగల్ని నాట్లు తొక్కనీకుండా డబ్బాను కఱ్ఱతో కొడుతూ వుండాల నేను. మంచు వేళల అడుసులో వాలే కొంగల్ని డబ్బా చప్పుడుతో బెదిరించడం నాబోటి పిలకాయలకు కులుకుగానే వుండేది.

చద్ది వేళకు పైన కొంగలు రావు. చద్ది వేళ దాకా వుండి ఇంటికి వచ్చేసే వాడ్ని– డబ్బా, కఱ్ఱలతో. ఇటువంటి చిన్ని చిన్ని పనులను, మనిషికి సెగ తగలని పనులను మా అమ్మ నా చేత చేయించడం మొదలు పెట్టింది. 'నేను కయ్య కాడికి పోను బో' అని మొండికి తిరుక్కుంటే మా అమ్మ, "తప్పు కొడకా, తప్పు, నువ్వేమన్నా పసి బిడ్డవా! ఇప్పుడు పెండ్లి చేస్తే ఇద్దరి బిడ్డల్ని కనవా? (ఈ మాట మా అమ్మ నోట మాటి మాటికీ వినబుద్ధి వేసేది.) నువ్వేమన్నా గవునీరు కొడుకువా? యెగసాయదారుడి బిడ్డ నిద్దర మొకంతోనే పైరును చూడాల నాయినా!" అనేది. ఇన్ని మాటలు విన్నాక నోటి మాటెత్తకుండా తల గీరుకుంటూ కయ్య కాడికి పొయ్యే వాడ్ని.

వరి పైరు నాట్లు మీద వుండగా వచ్చే కొంగలతో పెద్ద ఇబ్బంది ఉండేది గాదు. వరి ఎన్నుబోయి పాల మీద వుండినప్పుడు వాలి, పాలంతా తాగేసే గువ్వలతో మాత్రం భలే పెద్ద చిక్కు. ఒకే కయ్యిలోకి అయిదారు వందల గువ్వలు కూడా గుంపు గట్టి ఝుం ఝుం మంటూ వాలేసేవి. గంగ జాతరలో పలకలు వాయించినట్లుగా డబ్బాను వాయించినా ఆ నాయాలీ గువ్వలు, మొండివి, ఎన్ను మీద నుంచి కదిలీ మెదిలేవి గావు. పెద్దగా రాద్ధాంతం చేసేస్తే అవి మర్యాదకు లేచి పోయినట్లుగా లేచి పోయి అవిశె చెట్ల మీదనో

వేప చెట్ల మీదనో వాలి, కాసేపు మనం రెక్క ఆర్చుకోగానే మళ్లా అవి ఎంతో సొంతంగా వచ్చి ఎన్నుల మీద మకాం పెట్టేవి. ఈ గువ్వల మొండి తనంతో వేగ లేక ఒక్కొక్క సారి వాటి కల్లానే చూస్తూ వుండి పోయే వాణ్ని. చెట్టూ చేమా నడుమ, పచ్చంగా వుండే వరి పైరు మీద, అందునా పాలెన్ను మీద పడి పొయ్యేటట్లుగా కూర్చునే గువ్వ కంటికి బలే యింపు గొలిపేది. పాలెన్ను మీద గువ్వ – పాలు తాగితే తాగింది గానీ – చూసేటందుకు మాత్రం ముద్దు గొలిపేది. పటం గట్టి పెట్టుకో తగింది – పాలెన్ను మీద గువ్వ.

మా పిలకాయల పని మా పిలకాయలది. లేకుంటే, ఎంత సేపని వేగుతాం, ఆ గువ్వలతో? వాటికి తెల్లారని లేదు, మద్యానమని లేదు, సందేళని లేదు. ఎప్పుడుపడితే అప్పుడు వచ్చి వాలి పాలు తాగడమే బతుకుగా పెట్టుకుని మా ప్రాణాల్ని తీస్తాయి. గువ్వల్ని డబ్బాతో అదిలించేటప్పుడు మాటి మాటికీ ఇల్లు గుర్తుకొచ్చేది. ఊళ్లో భజన గుడి దగ్గర మనల్ని మోసం చేసేసి పిలకాయలంతా కుందుడు బిళ్ల ఆడుతూ వుండినట్టు అనిపించేది. ఇంటి దగ్గర మా జయలక్ష్మి అక్క నాకు ఈ శిక్ష వేసేసి – రాగి రొట్టెలు చేసుకొని తినేస్తూ వుందేమోనని కుళ్ళి పొయ్యే వాణ్ని. ఇంటికి పోవాలంటే మా అమ్మ ఆ మాటా ఈ మాటా చెప్పి వెనక్కి పంపిస్తుందని తెలుసు. ఒక్క సారిగా పైర్ల నడుమ జెమినీ వుండినట్టు తోచేది.

నేనూ, నా జోడీ మా అమ్మను వాడూ, వాడమ్మను నేనూ (గాలికి) తిట్టుకుంటూ మోట నీళ్ళల్లో మునుగుతూ వుండి పొయ్యే వాళ్ళం, పొద్దు నడిమిట్టకు రాంగానే సంగటి తినడానికి మోట నీళ్లలో నుంచి లేచి ఇండ్లకు పోదామనుకుంటూ...

ఒక రోజున, ఇదే మాదిర ఒంటి మీద చెడ్డీ లేకుండా మోట నీళ్ళల్లో మునగతా వుంటే మా అమ్మ తట్ట, కొడవలితో వచ్చి నన్ను జూసి ఊపిరి పీల్చడం మరిచి పోయింది.

అప్పుడు నేను నవ్వబోయి మానేసినాను. మా అమ్మ ఒళ్ళు మరిచి పోయి, రాయి మాదిర అయిపోయింది. ఒళ్లంతా తడిసి వుండిన నేను భయంతో వణికిపోయినాను.

ఒక్క క్షణంలో మా అమ్మ బెత్తాన్ని సంపాయించి నన్ను పట్టుకొని, "నా బట్టా, నిన్ను మోట తోలి, నీళ్లు కట్టి సేద్యం చేయమన్నానా? పైరుని కాపెట్టుకుని గువ్వల్ని అదిలిస్తా వుండమని చెప్పి పంపితే – మునగతా వుండావా? నా బట్టా, రోజుకు ముప్పయి మూడు సార్లు 'అమ్మా అన్నం' అని నన్ను పెరక్క తింటావు గదరా, చేసిన పైరును గువ్వలకు ధార పోస్తే ఏం పెరక్క తిందామనుకున్నావు రా, ముండ నా బట్టా" అని బారడు పొడుగు తిట్టి ఇష్టం వచ్చినట్టు కొట్టేసింది.

ఇంక కొడితే ఊపిరొదిలేస్తానని బెత్తం విసిరి పారేసి, కాలిపొయ్యే ఇంటిని ఆర్పే దాని మాదిర కయ్య కాడికి పరిగెత్తింది.

డబ్బా చేతికి తీసుకుని కఱ్ఱతో కొట్టి, 'వుహ్వ్వా, వుహ్వ్వా...' అని గుండెల్లో నుంచి మా అమ్మ అరవడంతో, అందాక ఎన్నుల మీద రాణి వాసం చేస్తా వుండిన గువ్వలు బిత్తరపోయి లేచినాయి. ఎన్ని? తల్లో వెంట్రుకలన్ని!

మా అమ్మ గువ్వల గుంపునీ, నన్నూ మార్చి మార్చి చూస్తే – నేను కుమిలి పోయినాను! అప్పుడు తలొంచాల్సిందే గదా! వొంచితిని. మా అమ్మ నాతో మాట్లాడకుండా ఆమె మానాన ఆమె గొంతు కూర్చుని గనిమ మీద పచ్చ గడ్డిని కొడవల్తో కోస్తూ ఉండి పోయింది.

ఆ రోజు మా అమ్మ చేత చావు దెబ్బలు తిన్నా కూడా నేనే అణిగి వుండాల్సి వచ్చింది. మా అమ్మ నన్ను దరి చేర్చుకొని నా ఒంటిని తడిమితే నేను అంతా మరిచి పోదామనుకున్నాను. "రేపట్నుంచి డబ్బానే నమ్ముకోను, వొడిశీల, కేట్రుబాలు కూడా తెచ్చుకుని ఈ గువ్వల సంగతంతా చూస్తాన్లే అమ్మా" అని ఎక్కిళ్ళు పెట్టేసినాను.

కొడవలిని విసిరి అవతల పారేసి గువ్వలు మళ్లీ వాలడానికి వచ్చినా పట్టించు కోకుండా మా అమ్మ నా తల్లోని పేన్లు చూస్తూ, "చేసిన కాసింత పైరూ గువ్వలకు దార పోస్తే – నిన్ను ఏ గంప కింద మూసి పెట్టేది కొడకా! ఎకరాల కొద్దీ బూములుండే మత్తేపులైతే గువ్వలకు బయపడ్రు గానీ మనం జాగర్తగా వుండక పోతే ఎట్ట కొడకా!" అని కండ్లు తుడుచు కొనింది.

# పని మిందనే కలవరం

మా అమ్మ వొక్కల ముక్కల కోక గట్టి, వొక్కల ముక్కల రైక వేసుకొనినా – ఆమిగాని ఆ చేతికి ఎనిమిది, ఈ చేతికి ఎనిమిది లెక్కన పచ్చ గాజులు గాని పెట్టించుకొనింది అంటే– చూసే దానికి కొళ్ళగా వుండేది. మా అమ్మవి కట్టి చేతులే అయినా, ఆమి చేతలకు గాజులు బలే అమిరేవి. అంతా సరేగాని, ఆ పని మిందా ఈ పని మిందా పడి అల్లాడి జనుల చేత దిష్టి పెట్టించుకొనే మా అమ్మ – మన చేతలకు గాజులుండాయో లేవో అని నిదానం మింద చూసుకొని, పాలుమారకుండా పెట్టించుకుంటే గదా! నాయాలీ సీమ, ఎంత దరిద్రంలో వుండినా మటుకు – గాజులకు కూడా వాచి పోయి వుండామా మేము! మంచి మద్యానం, కూచంద్ర పేట నుంచి వచ్చి మా వూళ్ళో గాజులమ్ముకునే గాజలాయనకు ఒక మానిడు వడ్లు కొలిసి, మేము తినే సంగటే ఒక ముద్ద పెడితే–ఆయన మా అమ్మ కోరిన రకాలను చూపిచ్చి, ఏ రకం గాజులు కావాలంటే ఆ రకం గాజులను పెడతాడు గదా! గాజుల కాడనా మనం మిగలబెట్టి పొయ్యేటప్పుడు మన కూడా మూట గట్టుకోని పోబొయ్యేది? మా అమ్మ చేతల్ని మొగోడికి మాదిరిగా ఇకారంగా, మొండిగా పెట్టుకొని, గలగల మనకుండా కలుపు తీస్తావుంటే మా నాయిన– "యిప్పుడుండే బైసాట్లు చాలక యిదొక కొత్త రకం బైసాట్లా? అ చేతలకు నాలుగు గాజల్ను కూల్చెయ్యేమి?" అని మా అమ్మను కసురుకో లేక బారడు పొడుగు నిష్టూర పొయ్యే వాడు. ఈ మాత్రం మాట మా నాయిన అనినందుకు మా అమ్మ 'ఓ' అని కుశాల పడి, "ఇంగ బతక్కపొయ్‌నా పరవాలా నేను! మీ నాయినకు గూడ నామింద గేపకం పడింది గదరా సినబ్బా!" అని నాతో ముదిగారానికి పొయ్యేది. నేను గూడా మా నాయినకు సపోరటగా నిలబడి, "లేకుంటే నీకు మాత్రం ఎట్ట సగిస్తిందమా, బంగారట్టా చేతల్ని ఆ మాదిరితో మొండిగా అయ్యోమంటా పెట్టుకొనే అందుకు!" అని మా అమ్మను దండించే వాడ్ని. ఈ మాటలకు మా అమ్మ ఈ కలిగ్గాన ఎక్కడా వుండని గొంతును తెచ్చుకొని, "ఓయబ్బో! అబ్బా గొడుకులిద్దురూ ఈ దినుం నామింద యాడలేని కలవరం బెట్టుకున్నారే! అంత మొగలాయిలే అయితే ఆ చేతికి

రెండు, ఈ చేతికి రెండు బంగారు గాజులు చెయ్యించండేమి, పెట్టుకుంటా. ఈ మట్టివి చీటికి మాటికి సిటక్ పటక్‌మని పగిలి పోతా గదా వుండాయి" అనేది. ఆ మనిసితో యింగేమీ మాట్లాడలేక మా నాయిన గనిమెక్కి–ఎద్దల్ను నీళ్ళు తాపాలనే సాకు ఒకటి వుండాది గదా, ఆయనకు–పొయ్యేవాడు.

ఎప్పుడో ఆర్నెల్లకో, సమ్మచ్చరానికో గాని గాజుల శెట్టి దగ్గిర గాజులు పెట్టించుకోని మా అమ్మ – కుంకాన్ని మాత్రం దినుమ్మూ ఏమారేది గాదు. మా అమ్మ మొకాన్ని మీరు ఎప్పుడన్నా వచ్చి చూసుకుందురు రండి– కుంకుం బొట్టు ఎండకు, కస్టానికి కారతానో, లేకుంటే ఒద్దిగ్గానో మా అమ్మ నొష్టన వుండనే వుంటాది. మా ఇంట్లో, మా దీగూడులో సందేళ సందేళ మండతా వుండే ఇత్తలి దీపానికి ఆ కొనానా, ఈ కొనానా ఎప్పుడు బట్టినా కుంకం వుండినట్టే– మా అమ్మ మొకాన గూడా ఎప్పుడూ దా బొట్టు వుండును. అవితే, మా అమ్మ పెండ్లి జేసుకున్నప్పుడు కాళ్ళకు యెండి మట్టిలు పెట్టుకొని వుంటాది గదా! వాటిని ఆ మనిసి ఎప్పుడు ఎక్కడ నీగేసిందో గాని– అప్పుట్నించి ఎన్ని కొనినా అవి మా అమ్మ పాదాలకు వుండాటం లా. నేనూ, మా అమ్మ– అందరం అడుసు కయ్యల్లో పరిచిన అకు మండల్ని తొక్కతాం గదా– మా అమ్మ మళ్ళ గనిమ ఎక్కినాక చూసుకోని, "ఒరే! సినబ్బా! అడుసులో యాడనో మట్టిలు నీగేసుకున్నాను రా! ఎట్టరా వీటితో" అని నవ్వు మొకంతో మాట్లాడేది. వాటిని నీగేసిన మా అమ్మ మీద నేను గూడా ముదిగారంతోనే బారడు నిష్టూరం పోయి, "వుండు, వాటిని– అయికోరట్లో దావా యేసి–కోరటకు ఈడద్దారి!" అనే వాడ్ని.

అ పసి బిడ్డి మొకం దానితో అంతకన్నా ఏం మాట్లాడుదును?

# ఛూ, ఈ బతుకు బతకాల్నా?

ఒళ్లు అలిసి పొయ్యో ఏమో ఆ రాత్రంతా మా నాయిన జ్వరంతో ముక్కతా మూలగతా వుండిపోయినాడు. మూలుగును కొంచేపు ఆపి, అదొక రకం గొంతుతో, “కండ్లు బూశులు కమ్మతా వుండాయి, నోరు ఎండకపోతా వుండాది. కూట్నీళ్ళల్లో అంత వుప్పేసి యియ్యి” – మా అమ్మను అడిగినాడు. మా అమ్మ తెల్లటి గుండు చెంబులో కూట్నీళ్లు పోసుకుని, చెంబును గుండ్రంగా తిప్పుతూ, ఉప్పు కరగదీసుకుంటూ వచ్చి మా నాయినకు ఇచ్చింది.

మా నాయిన గుట గుటా కండ్లు మూసుకుని తాగేసి మళ్ళీ మంచం మీదికి వాలిపోయినాడు. వెల్లికిలా పడుకొనిన మా నాయిన కండ్లు మాత్రం తెరుచుకునే వుండినాయి. నోరు కూడా తెరుచుకుని, గాలిని ముక్కుతో గాకుండా, నోటితోనే పీల్చుకుంటూ వుండినాడు. మా నాయినకు గొంతులో గల్ల కట్టినట్టుండాది. దగ్గితే నోటి నిండికీ గల్ల వచ్చినట్టుగా వుండాది. ఆ అంత గల్లనూ ఆయన నోట్లోనే పెట్టుకొని మా అమ్మతో, “ఏమే, అగ్గో, యిట్టరా, పెంకులో అంత మట్టి పోసి నా కాడ పెట్టు.” అన్నాడు. ఆయన నోట్లో నుంచి వచ్చిన ఈ రెండు మాటలు వినడానికి అదొక మాదిరిగా వుండినాయి. మా అమ్మ అప్పుడు దీగూడులో వుండిన వేలెడు డబ్బీలో నుంచి కుంకుం తీసుకుని బొట్టు పెట్టుకుంటూ వుండింది.

మా అమ్మ మా నాయిన దగ్గరికి వచ్చి, “ఇట్ట జూడా!” అనింది. మా నాయిన వెల్లికిలా పడుకొని వుండడంతో, కప్పును చూస్తా వుండిన ఆయన కండ్లు మా అమ్మకల్లా యిచిత్రంగా తిరిగినాయి. నోట్లో వుండిన ఉమ్మిని మా నాయిన మొకం అదొక మాదిరి పెట్టుకొని మింగినాడు. “పెంకులో అంత మట్టి పోసుకొని రాయే – అంటే, కొట్టే దాని మాదిరి నిలబడుకోనుండావా?” అన్నాడు మా నాయిన నిష్ఠూరంగా. ఆ మాటతో మా అమ్మ కొంచెం మెత్తబడినట్టుండాది. “అగ్గో జెరానికే మనిషి ఈ మాదిరి అయిపోతే ఎట్ట? లెయ్, పైకి లెయ్. లేచి మడి కాడ దాక పోయిరా. నీకు పట్టిన మంకు వదిలి పోతింది.” అనింది. మా నాయిన జెరం మా అమ్మకు గబీమనిపించినట్టు లేదు. ‘వొస్తింది, వొచ్చిన దోవన పోతింది.’ అన్నట్టుగా వుండాది మా అమ్మ.

అప్పుడు మా నాయిన, చుట్టూ తిరుగులాడే ఈగల్ని చప్పట్లతో చంపడానికి యాతన పడతా వుండినాడు. మా అమ్మ, "థూ, దరిద్రపు యెదవా, ఆ మాదిరిగా ఈగిల్ని కొట్టొద్దని నీకొక్క సారి చెప్పేది! నువ్వే ఈ కొంపకు సగం దరిద్దరం, వూళ్లో మొగోళ్లు ఈ మాదిరిగానే పొనుకోని ఈగిలు కొట్టుకుంటా వుండారా? అట్ట లేచి పోయి చూడుబో. వాళ్ల వాళ్ల పనుల్ను ఎంత బటువుగా చేసుకుంటా వుండారో! ఇదేం కర్మరా బగమంతుడా! సందు దొరికితే సాలు, కాళ్లు చాపేసి పడుకుందాము – అనుకుంటా వుంటే! మొగోడు – పనిని తెలుసుకోని పోతా వుండాల. పెతీ పని – యెనకాన ఆడది వుండి చేయించాలంటే జరుగునా? నీతో ఎందుకు మాట్లాడాల?" అని మా అమ్మ ఇంకా ఏదో అంటా వుండగానే మా నాయిన తెంపు చేసుకున్న వాడి మాదిరిగా మంచం మీద నుంచి లేచి కూర్చున్నాడు. మా నాయిన అదొక రకం నవ్వు నవ్వి, "నియ్యమ్మా, నస నాయాలీ ముండా." అన్నాడు.

"ఒంట్లో చలి పుడతా వుండాది. చెప్పిన మాట విని పొయ్యి మంటెయ్యి. వుడుకుడుగ్గా సంగటి చెయ్యి. అంత చింత కాయ వూరుబిండి నూరు." అని కోరినాడు మా నాయిన. మా అమ్మ అందుకు బదులుగా నోటి మాట ఎత్తకుండా ఒక తెల్ల గిన్నెలో చద్ది పోసుకుని కూర్చుని నన్ను పిలిచింది. మా నాయిన పక్కనే, మా అమ్మా నేనూ కూర్చొని చద్ది తాగతా వుండాం. మా అమ్మ శబద్దం చేస్తూ పొడుగ్గా గాలి వొదిలి, "వుడుకుడుగ్గా సంగటి తినే దానికి జెరం అడ్డం లేదో! నీ చేష్టలు చూస్తా వుంటే ఒళ్లు మరిచి పోతా వుండాది, చేసే పనంతా పక్కన పెట్టేసి జెరం అని దొంగ యేసికం యేస్తా వుండావే, అది చాల్దా? మిరప తోట చుట్టూ తడికలు నాటాలా వొద్దా? ఈ రోజు నాటకుంటే బీర తీగెలు మిరపచెట్లు మీదికి ఎక్కవా? పక్కన రామనాదుడి మిరప తోటను చూసినావా?...నువ్వు చేసే పన్లకు నేను గాబట్టి నీ మొకాన అంత ఏరగతా వుండా. యింకొక ఆడది గాన అయివుంటేనా!" అనింది.

మా నాయినకు ఒళ్ళు తెలవని కోపం వచ్చిట్టుండాది. ఆయన వున్నట్టుండి కేకరించి ఎంగిలి వూంచగా, అది మా ఇద్దరి నడుమ వుండిన చద్ది గిన్నెలో పడింది. ఇంట్లో వుండిన కత్తిని తీసుకుని, "థూ, ఈ బతుకు బతకాల్నా?... నీయమ్మను మాలోడు చెయ్య..." అంటూ మిరప తోట చుట్టూ తడికలు

కట్టడానికి మా నాయిన గడప దిగినాడు. మా అమ్మ నన్ను లేచి చెయ్యి కడుక్కోమనింది.

మా అమ్మ అరి చేత్తో గల్లను గిన్నెలో నుంచి ఎత్తి కింద పారేస్తే కోడిపిల్ల వచ్చి గల్లను తినేసింది. మా అమ్మ గిన్నెలోని చద్దిని తాగేసింది. అడివికి మేకలు తోలుకు పోయే వాళ్ళ ఇళ్ళలో – తెల్లవారి వుడుకుడుగ్గా సంగటిని వొండుతారు. అటువంటి ఇంటికి పోయి – మద్యానం ఇచ్చేస్తామని చెప్పి – మా అమ్మ ఒక ముద్ద ఉడుకుడుకు సంగటిని బదులుగా తెచ్చింది. తరవాత చింతకాయ ఊరుబిండి నూరింది.

ఇద్దరం మా నాయినకు సంగటి ఎత్తక పోయినాం, ఆ తెల్లారి పూట.

# మా ఆవు వంటిదే మా అమ్మ

మాకు ఒకటిన్నర ఎకరా సేద్యం వుండేది. దున్నుకునేటందుకు ఒక తెల్లావు, ఒక పుల్లావు వుండేవి. అవి ఆవులు మాదిరిగా వుండకుండా అచ్చు ఎద్దులు మాదిరిగానే వుండేవి. కొమ్ములు పొడుగ్గా వుండి, పొదుగుల్ని ఎండ బెట్టుకుని వుండేవి. అవి కోడె దూడల్ని చూసినప్పుడు తోకలు పైకెత్తేవి గావు. కోడె దూడలు ఎదురు పడి మా ఆవుల మీదకి మోర ఎత్తుకుని వచ్చినా, మా ఆవులు గమ్మున నడిచేవి. అవి కట్టుకు వచ్చి సూటివి అయ్యేవి గావు. ఈనడం – మా ఆవుల జాతకంలోనే లేకుండా పోయింది.

ఆ బక్కావులతో సేద్యం చెయ్యలేక మా నాయిన చచ్చి సున్నమయ్యే వాడు. మా ఆవులకు ఒంటి మీద చురుకే లేకుండా పోయింది. అర చేతిని తోక మీద వేసి 'డిర్'మంటే మా తెల్లావు గానీ, పుల్లావు గానీ వులిక్కిపడి అడుగు ముందుకేసేదే గాదు. మా నాయిన తెల్లారినాక కొట్టంలోకి వచ్చి వాటిని లేపడానికి యాతన పడే వాడు. 'హెయ్' అని మా నాయిన అలికిడి చేస్తే అవి విననట్టు వుండి పొయ్యేవి. కసువు పోచను తీసుకుని 'ఛెయ్' అన్నా అవి కదిలీ మెదిలేవి గావు. అరి చేతుల్తో వాటి వీపు మీద పిడి గుద్దులు గుద్దితే నిష్టూరాన్ని కండ్లలో పెట్టుకుని చూస్తున్నట్లు కనబడేవి. మా నాయిన కోపంతో తోకల్ని విరిచెయ్యబోతున్నట్టు మెలి పెడితే బలవంతాన అవి పైకి లేచేవి.

ఒక్కో ఆవు కింద మూడేసి పేడకళ్లు కూడా వుండేవి గావు. అవి దేముడి సత్యానికే వేసినట్టుగా పిడికిడేసి పేడకళ్లు రెండు వేసేవి. ఒక తెల్లారి పూట నేను మా సాయిత్ర ఒదిన కొట్టాన్ని చూసినాను. ఆ కొట్టంలో అధవా ఎనుము కూడా చేటడేసి పేడకళ్లను ఒకే రాత్రికి కనీసం మూడు వేసేది. మా కొట్టంలో మా ఆవులకు మంచి సౌక్రిం లేదు. ఎప్పుడూ పైర్లు పండించినట్టు వుంటామే గాని అదేం ఖర్మో మంత్రం వేసినట్టుగా మా వామిలో గడ్డి వుండేదే గాదు. అందుకని మా ఆవులు పెరుక్కు తినడానికి గడ్డే వుండేది గాదు.

గొడ్డూ గోదకు గెడ్డి ఎంతో, కుడితీ అంతే. మా కొట్టంలో ఒక మూల ఒక మట్టి తొట్టి వుండేది. అదే మాకు కుడితి తొట్టి. అయితే మా కుడితి తొట్టి అందరాల కుడితి తొట్టి గాదు. అది ఎప్పుడూ తేటగా వుంటింది. పైన్నించి

చూస్తే మా తొట్టి అడుగు అద్దం మాదిరి కనిపిస్తుంది. నేను శానా దఫాలు మా సాయిత్ర వొదిన వాళ్ల కుడితి తొట్టి చూసినాను. ఆ తొట్టి చూస్తే నాకు యిచ్చిత్రంతో ఒళ్లు నా సోదీనంలో వుండదు. అది భలే మడ్డి మడ్డిగా వుంటింది. ఆ తొట్టిలో నీళ్లు నీలం రంగులో కూడా వుంటాయి. మా సాయిత్ర ఒదిన కుంచుడు బియ్యాన్ని నీళ్లల్లో నానబోసి కడిగి, ఆ నీళ్లను ఆ తొట్టిలో పోస్తింది గదా. మళ్లీ అయిదు నిమిషాల్లో రెండు మానికల ఉద్ది పప్పును కడిగిన నీళ్లను తెచ్చి పోస్తూ వుంటుంది. మళ్లీ ఏదో వొక సందులో ఆమె, మిగిలి చద్ది పట్టి పోయిన ఒక ముద్ద సంగటిని కూడా అందులోకి తెచ్చి బుడుంగుమని వేసేస్తూ వుంటుంది. మా సాయిత్ర ఒదిన వాళ్ల కుడితి తొట్టి అడుగు భాగం నాకు ఇంత వరకు కనిపించ లేదు. ఆ తొట్టిలో అంటిపండు తోళ్లు, వుడికిన వంకాయలు కూడా తేలుతూ వుంటాయి. మా సాయిత్ర వదిన వాళ్ల కొట్టంలో ఎద్దుల పలుపులు విప్పితే అవి కుడితి తొట్టి వద్దకు లాక్కొని పోతాయి. అవి కుడితి చేరీ చేరంగానే మూతిని వంచి నోరు పట్టకుండా సంగటినీ, ఏందేందో తింటూ ఉంటాయి. తరవాత నీళ్లు తాగతాయి. సాయిత్ర ఒదిన కుడితి తొట్టినీ, వాళ్ల ఎద్దుల వైబోగాన్ని చూసేటందుకు నాకు రెండు కండ్లూ చాలేవి గావు.

మా నాయిన మా ఆవుల పగ్గాల్ని విప్పి కుడితి తొట్టి వద్దకు బలవంతాన తోలుకు పోతాడు. అవి ఈ మాత్రం కుడితి నీళ్లు ఏ మంచి నీళ్ల కాలవలో దొరకవు అన్నట్టు యాష్టగా కుడితి తొట్టిని చేరతాయి. మా నాయిన ఆవుల్ని కుడితి తొట్టి వద్దకు తోలుకు వచ్చినాక సొంపుగా ఈల వేస్తాడు. మా ఆవులు ఈల వింటాయే గాని కుడితి తొట్టిలో మూతి వంచి నీళ్లు తాగవు. వాటికి ఆ తేట నీళ్లంటే భలే మంట.

(మా కుడితి తొట్టిని గమనించినాక నాకు ఒక నమ్మకం కుదిరింది. పల్లెటూళ్లలో జరుగుబాటైన ఇల్లు ఏదో నేను భలే సులువుగా కనిపెట్టేస్తాను. అందుకు నేను కుడితి తొట్టినే సాక్ష్యంగా తీసుకుంటాను).

చురుకు లేని మా బక్క ఆవుల్ని కయ్య కాడికి తోలుకు పోవడం మా నాయినకు గగనంగా వుండేది. అవి అడుగుల్ని తొందరగా వేసేవి గావు. కయ్య కాడికి పోయినాక అవి మడక దున్న లేక చచ్చేవి. మూడు కొండ్రలను దున్నే సరికి అవి నోట్లో నురుగును పెట్టుకొని ముందుకు పోకుండా కయ్యలో

పడక వేసేవి. కయ్యిలో దున్నకుండా పడుకునేసే ఆవుల్తో సేద్యం చెయ్యడం మా నాయినకు భలే అగుమానంగా వుండేది. 'థూ' అని ఎంగిలూంచి మడక మేడిని వదిలి నెత్తి మీద చేతులు పెట్టుకునే వాడు. పడుకునేసిన ఆవుల్ని పైకి లేపే సరికి మా నాయినకు తాతలు అగుపించే వాళ్లు. ముల్లుకర్రతో మూలిగి మూలిగి కుమ్మినా అవి నెత్తురు కార్చుకునేవే గాని శౌర్యంతో పైకి లేచేవి గావు. అట్లా ముల్లు కర్రతో పొడిచి పొడిచి మా ఆవుల ముడ్డి అట్టగట్టి పోయింది.

ఈ ఆవుల్తో నేనీ సేద్యం చెయ్యలేనని మా నాయిన మా అమ్మతో కొట్లాట పెట్టుకోకుండా ఇంటికి అన్నానికి వచ్చే వాడే గాదు. 'ఎద్దుల్తో అవితే నేను బండెడు సేద్యం చేస్తాన'ని మా అమ్మతో నిష్టూర పడి నస పెట్టే వాడు.

బక్కావుల్తో సేద్దిం చేసి ఒక సందేళ పూట ఇంటికి వచ్చినాడు మా నాయిన. ఆ రోజాయన నిష్టూరంగా వుండినాడు. బకెట్లో నీళ్లు తోడి పెట్టి జాము సేపయినా పోసుకోవడానికి పైకి లేవలేదు. 'ఆవుల్తో సేద్దిం జెయ్యడం పాతకమంట. నాకు కడంత కాలంలో ఎట్టా సావు వస్తిందో!' అని గొణిగినాడు.

మా నాయిన ఆ మాదిర గొణగతా వుంటే మా అమ్మ మంచం కోడు మీద పడి పోయేటట్టుగా కూర్చుని మాసిన కొంగుతో మొకం తుడుచుకుంటూ, "ఓయబ్బో, నీది అంత మెత్తని మనుసో! ఆ ఆవుల్తో సేద్దిం చేస్తా వుంటే నీకు కండ్లల్లో నీళ్లు కాలవలు కడతా వుండాయో! నేను లేనా బక్కగా? నా ఒంటి మింద నీకు బండెడు కండలు కనబడతా వుండాయా, ఎట్ట! కొట్టాంలో వుండే ఆ ఆవుదానికీ, ఈ ఆడదానికీ తేడా ఏంది? ఆవుల్తో సేద్దిం జెయ్యడం పాపమంట...లెయ్ లెయ్..." అని మా అమ్మ కొంచిం నిష్టూరంగా, కొంచిం ఎగతాళి, కొంచిం బాదగా అని మా నాయిన్ని అలక తీర్చబోయింది.

మా అమ్మకు మొకం చూపించకుండా తప్పు చేసినోడి మాదిర తల గీరుకుంటూ మా నాయిన పెరట్లోకి గాకుండా వీదిలోకి పొయ్నాడా సందేళ పూట.

# నా రెక్కలున్నంత కాలం...

పొచి పండ్లతో చదువుకుంటే చదువు బాగా వస్తుందని, మా అమ్మ నన్ను తెల్లారు జామునే నిద్ర లేపేది. నేను వేప చమురుతో వెలిగే మట్టి దీపం ముందర గొంతు కూర్చుని పుస్తకం చేబట్టే వాడ్ని. అప్పటికి మా అమ్మ తట్ట కింద కోళ్ళను వీధిలోకి తోలి, కళ్లాపి కలుపుతూ వుండేది.

అటుమంటి తెల్లారు జాము పూట వూళ్లో నుంచి కోడి కూతలతో పాటు సొంపైన శబ్దాలు విన వచ్చేవి. దిగువ వీధిలో నుంచి అబ్బులు బావ గొంతు, “ఎవడబ్బా సొమ్మాని కులుకూతూ తిరిగేవు రామాచంద్రా!” నిష్టూరం పొయ్యేది. ఎగవ వీధిలో నుంచి ధర్మా నాయుడు దుర్యోధనుడి తమ్ముడై పోయి, “పట్టక నిన్నేల విడుతూనే, జడ పట్టక నిన్నేల విడుతూనే, నువ్వు పతివ్రత అంటేను జడుతూనే!” అని రంకె వేస్తా వుంటాడు. ఈ రెండు పాటలకి అడ్డంగా లచ్చుములత్త కొడుకు జనాద్రి గాడు (పాలు చాలక) అల్లల్లల్లా అని అరిచి కుప్పలు పెడతా వుంటాడు.

ఇవన్నీ వింటూనే నేను నిగిడి నిగిడి, నీలిగి నీలిగి, వూగి వూగి, ‘శేత యెన్న ముద్ద, సెంగల్వ పూదండ’ లక్షా తొంభైయ్యారో సారి చదవతా వుంటాను. చదవమన్నప్పుడల్లా నేను తెలుగు పుస్తకాన్నే ముందరేసుకునే వాడ్ని.

అదేం ఖర్మోగాని ‘శేత యెన్నముద్ద’ పద్యాన్ని చదువుతూ వుంటే నాకు నెత్తిన నెమిలీక, చేతిలో పిల్లంగట్టి వుండినట్టే పెగ్గిగా అనిపించేది. ‘చందమామ రావే జాబిల్లి రావే!’ చదవతా వుంటే అమ్మ చంకనెక్కి చందమామను చూసినట్టే వుండేది.

మబ్బు మబ్బుగా వుండంగానే మా అమ్మ అన్ని పొచి పనులూ చేసేసును. ఆవుల కిందా, ఎనుము కిందా వుండిన పేడకళ్లన్నీ తట్టలో వేసి వూడ్చేసును. ఇంటి ముందర కళ్లాపి చల్లి, చిటికె వేసినంతలో నక్షత్రం ముక్కర పోసేసును.

చాందబాయి దగ్గర్నించి నీళ్లు కూడా తెచ్చి తొట్టి నింపేసును.

ఇన్ని పనులు చేసినా పొద్దు మొలిచేది గాదు. ఇంకా మబ్బు మబ్బుగానే వుండేది.

పనేమీ లేక మా అమ్మ వేప చమురు దీపం దగ్గిరికి వచ్చి నా పక్కన కూర్చునేది. నేను చదివే వేమన్న పద్యాలు ఆమెకు అర్తమై పోయినట్టు 'మ్, మ్, మ్' అంటూ వూ కొట్టేది. మా అమ్మ – వూ కొట్టింపు నాకు సయించినట్టుగా వుండి నా నోటి జోరును కొంచెం పెంచే వాడ్ని.

–యిస్పదాబి రామ యినుర యేమా!– అని నేను వూపిరి కొద్దీ దీర్ఘం తీసే వాడ్ని. నా బడాయిని చూసి మా అమ్మ, 'చదువంటే సరస్పతి. పెగ్గి లేకుండా చదువు నాయినా' అనేది. ఆ మాటతో నేను మామూలుకు వచ్చే వాడ్ని.

నేను చదివే తీరును గమనించి మా అమ్మ మురిసి పోయేది. ఈ కలిగ్గంలో నా మాదిర బాగా చదివేటోడే లేడని అనుకుని నన్ను దేముడ్ని చూసినట్టు యిచ్చిత్రంగా చూసేది. అటుమంటి సమయాల్లో మా అమ్మ నా ముందర దేముడికి ఆరతినిచ్చే బక్తురాలి మాదిర వుండేది.

అప్పుడు నాకు చదవడానికి సిగ్గనిపించేది.

ఒక తెల్లారు జాము పూట ఆ మాదిరిగా సిగ్గు పడి పోయిన నన్ను మా అమ్మ ఒళ్లోకి తీసుకొనింది. నా నెత్తి మీద చెయ్యేసి నిమిరింది. రెండు చేతుల్తో నా ఎదను ఆమె ఎదానకు అదుముకొని మారిపోయిన గొంతుతో–

కానీ గానీ వయసులో మా అమ్మ కడుపులో నేను పడినానంట. అప్పుడు మా అమ్మకు ముప్పైయ్యేళ్లంట, అప్పటికే మా అమ్మకు మా అన్నా, మా అక్కా కలిగినారు. ఒక కొడుకూ, ఒక కూతురూ చాల్దా, ఇంకా మనకు బిడ్డలెందుకు – అని మా అమ్మ ఒకే దిగులు పెట్టుకొనిందంట. 'ఇద్దరు బిడ్డల్నే పొస్తులు పెడతా వుండానే! పుట్టబొయ్యే వాడ్ని చంపుకోనా'– అనిపించి మా అమ్మ ఒకే దుఃఖ పడిందంట. మా అమ్మకొచ్చిన కష్టాన్ని మా అమ్మ మా నాయినతో, "ఏమే, మళ్లీ అంటు తప్పితిని!" అని చెప్పిందంట. తూర్పేదో, పడమరేదో తెలవని మా వెర్రి అయ్య, "ఇంకేం కొదవ లేదులే" – అంటూ ఎగతాళిగా అనేసి గడప దిగి తల గీరుకుంటూ వెళ్లి పొయ్‌నాడంట. మా అమ్మ నేరుగా మా అవ్వ దగ్గరికి పోయి ఏడ్చుకునిందంట. మా అవ్వ– కూతురు కష్టానికి కండ్ల నిండికీ నీళ్ళు పెట్టుకుని, "నీకెందుకు కూతరా ఇంక బిడ్డలు? నీకుండే కయ్యిలుగాలవలు పంచుకునే దానికి ఇంకా పుట్టాల్నా బిడ్డలు? వుండే ఇద్దర్నీ

రాలి పోకుండా సాక్కుంటే చాల్లే తల్లీ! నా మాటిని పచ్చి వెదురాకు పిడికెడు–నీళ్లల్లో వుడక బెట్టుకుని తాగెయ్ కూతరా!" అనిందంట. మా అమ్మ ఆ వైద్యం చేసుకునేటందుకు వెదురు పొద దగ్గరికి పోయిందంట. వెదురాకు పెరుక్కుంటూ వుంటే మా అమ్మ మనసుకు భలే కష్టం వేసిందంట. కాళ్లూ జేతులూ ఆడక అక్కడే గొంతు కూర్చుని మొఖానికడ్డంగా కొంగు కప్పుకొని బొరోమని ఏడ్చేసిందంట. మళ్ళ వెదురాకు పెరుక్కోని ఇంటికి రాలేదంట.

తొమ్మిది నెలలకంతా నేను భూమ్మీద పడి కేర్‌మన్నానంట. పోగొట్టు కోవాలనుకున్న గర్భం కండ్ల ముందర కనబడే సరికి మా అమ్మకు భలే కులుకు అయిందంట. అప్పట్నించి మా అమ్మకు నేనంటే భలే జ్ఞాపకమంట. వుయ్యాల్లో నన్ను పండేసి వరి పైర్లో కలుపు తీస్తా వుంటే నా రూపు నీళ్లల్లో కనపడేదంట.

మా అమ్మ లోగొంతుతో అంతా చెప్పి, "ఆ పొద్దు నేను పోగొట్టుకుని వుంటే ఈ పొద్దు నువ్వు నా ముందర ఈ పద్యాలు చదువుదువా, నాయినా!" అని మా అమ్మ కండ్లను మసక జేసుకొనింది. ఆ రోజు మా అమ్మను కరుచుకున్న నేను ఒక లాగాన విడి పడ లేదు.

–ఓ– అని ఎక్కిళ్లు పెట్టేసినాను. మా అమ్మ నా ఏడుపుకు వీపు మీద అరి చేత్తో తట్టి తట్టి, "పుట్టక ముందే చంపాలనుకున్న ఈ లంజ పుట్టినాక మాత్రం చంపకుండా వదల బోతుందా? అని ఏడస్తా వుండావా నాయినా. ఏడుపొద్దు కొడకా! ఒరే, యెర్రెదవా! నీ అమ్మకు రెక్కలు వుండాయిరా! ఆ రెక్కల్లో సత్తా వుండినంత కాలం నువ్వుంటావురా యెర్రి కొడకా! వైబోగంగా నిన్ను పెంచలేక పోయినా, నా కడుపును ఎండ గట్టుకోని నీ కడుపుకు అంత పెడతానురా! లోకంలో ఇంక బతకలేము అని తెలిసి పోయినాక నిన్నొదిలి నేనే పోతానా? చెరి కొంచెం తాగేసి పోదాం కొడకా! నువ్వు ఏడవొద్దు, నా రెక్కలుండాయి, నువ్వు ఏడవొద్దు. ఏడిస్తే గస వొచ్చి వూపిరి తిరగదు. నాయినా, నువ్వు ఏడవద్దు." అంటూనే మా అమ్మ గస పెట్టి ఏడ్చింది.

# కూలోళ్లతో మా అమ్మ కటీనం

వానా కాలంలో ఒక పంటా, ఎండా కాలంలో ఒక పంటా వస్తింది గదా. ఎండా కాలంలో వచ్చిన పంటను మాకు మేమే బటువు జేసుకునే వాళ్లం. అప్పుడు తొందరేమీ వుండదు. ప్రతీ వానా కాలం–కూలోళ్లను పెట్టడం–మా అమ్మకు తప్పేది గాదు. కూలోళ్లకు కూలులిచ్చి, సంగటి ముద్దలేసి పనులు జేయించు కోవడం మా అమ్మకు మునక్కడగా వుండేది.

ఉత్తరాజి నుంచి వచ్చిన కూలోళ్లు మూటా ముల్లెలు గనిమల మింద పెట్టి కయ్యల్లో వొంగే కాడికి పొద్దు నాలుగు బారలు ఎక్కేసును. ఆ వానా కాలంలో ముగ్గురాడోళ్లు, ఇద్దరు మొగోళ్లు మాకు కూలికి వచ్చినారు. వాళ్లు కయ్యల్లో వొంగినారో లేదో అప్పుడే–మాకు చద్ది కావాలని అడిగినారు. రాత్రి తిన్నారో లేదో పాపం అనుకోకుండా ఆ మాట వినని దాని మాదిర వుండిన మా అమ్మ, 'వీళ్లు చద్ది కాడా, సంగటి కాడా మన మానాలను తీసి మాకులకు కట్టెయ్య బోతారు!' అని గొణిగేది. కాసేపు ఆ కూలోళ్లు మునం పట్టినాక, వాళ్లకు బారడు ముందర వుండిన మా అమ్మతో, "ఏమమ్మా తల్లా, కడుపులో మంట గాని. చద్ది నీళ్లు పోయమ్మా" అని మళ్లా అడిగే వాళ్లు. ఆ మాటలకు గోగ్గాయలు వొంటికి తగిలినట్టుగా మా అమ్మ, "ఇంత లేకే ఏం చద్ది? ఒకే సారి సంగటి తెస్తా" అనేది. వానొచ్చేటట్టుగా వుండే ఆకాశాన్ని నిమ్మళంగా జూసి, మా అమ్మ కన్నా చిన్న వాడైన కూలోడ్ని పట్టుకొని, "అనా" అని, "గమ్మున పని గానియ్యండి. ఇంట్లో చద్దిలేదు. నా సిన్న కొడుక్కి గూడా ఈ రోజు చద్దిలా. ఒకేసారి వుడుకుడుగ్గా సంగటి జేసుకొని వస్తా. టయిము ఇప్పుడే పది గంటలైపాయ గదా. ఇప్పుడు చద్దేంది? ఇంగ రొండు గంటలుండండి, ఇంటికి బోయి ఒకే సారి సంగటి జేసుకొని వస్తా" అని నంగి నంగిగా మాట్లాడేది మా అమ్మ. ఈ మాటలను వినిన వొక ఆడామె చివక్కన తల పైకెత్తి, "టయిం ఏడు గంటలు గూడా కాలేదు తల్లా. పాసి నోటితో ఎందుకు అపద్దం జెప్తావు" అని వాతలు వేసినట్టుగా మాట్లాడింది. ఇదంతా మా నాయినకు సగించక అయన పని ఆయన చేసుకుంటానే, "ఏమే, కడుపులో ఆకిలి బెట్టుకొని వాళ్లు కయ్యలో పని

చెయ్యలేరు గాని, నువ్వు పొయ్ ఎసురు పెట్టుబో" అనే వాడు. మా నాయిన నోట్లో మాట నోట్లో వుండంగానే మా అమ్మ కసిరినట్టు చూసేది. అప్పుడనంగానే మబ్బుల్లో నుంచి మూగి ఎండ కాసేది. ఆ ఎండను ఆస్తిని జూసినట్టుగా జూసి మా అమ్మ, "దేముడి దర్మాన ఎండ గూడా కాస్తా వుండాది. తిండి మింద పడి అల్లాడకుండా పని గానియ్యండి, ఆర్నెల్ల పంటను మొలకలెత్తించబోకండి సాములాలా" అని కడ మాటగా జెప్పి పనికి వంగేది. ఆ నిమిసంలో మా అమ్మ పక్కన వంగి పని చేయడానికి ధైర్నం చాలేది గాదు. మా నాయిన మింద కోపంతో, "ఈ మొగోడు చావబోయేదెప్పుడు? నేను సుకపడ బొయ్యేదెప్పుడు?" అనేది.

"ఏడేడు పద్నాలుగు రాజ్జాలు తిరిగినాము గాని ఇటుమంటి తల్లిని యాడా జూడలా." అని పైకే అనుకుంటా కూలోళ్లు పని జేసుకుంటా వుండే వాళ్లు. ఆ రోజు కూలోళ్ల నిష్టూరాలకు తల వొంచక పోవడంతో మా అమ్మే గెలాయించింది. మా అమ్మ పదకొండు గంటలకు ఇంటికి ఎలబారి మద్యానం ఒంటి గంటకంతా సంగటి జేసుకొని మడి కాడికి వచ్చింది. ఏమనుకొనిందో ఏమో ఆ రోజు మా అమ్మ పెద్ద ముద్దలు జేసింది.

చేతులు ఆరకనే మా అమ్మ మళ్లా మునం పట్టడం జూసి కూలోళ్లు "కొంచేపు రెక్క ఆర్చుకోవద్దా అమా–" అని అడిగినారు. "మీ అందరికన్నా బక్కగా వుండా." అనింది మా అమ్మ. వాళ్లు కూడా మా అమ్మతో గూడా పనికి వొంగుతుండగా తొమ్మిది పదేండ్ల పిలగాడు అక్కడికి వచ్చినాడు. నా ఈడైన వాడ్ని చూడంగానే మా అమ్మ, "ఒరే, గెనిమ్మింద పోయి కుచ్చో" అనింది. అప్పుడు కూలోళ్లల్లో ఒకాడామె, "వాడు మాకన్నా జోరుగా పని జేస్తాడు. వాడ్ని గూడా శెనగ తోట పెరకనీ" అనింది. "లేత రెక్కలు గదా వాడెందుకు లే" అనేసింది మా అమ్మ! (నావి మాత్రం ముదురు రెక్కలో!)

ఆ పిలగాడు కూడా మునం పట్టనే పట్టినాడు. 'వాడికి కూలి అడగర్లే. రాత్తిరికి అర ముద్ద సంగటి వేసేస్తే సరి పోతింది గాని' అనుకున్నట్టు మా అమ్మ గమ్మున వుండిపోయింది. సాయంకాలం కాక ముందరే– మూడు గంటలకే తిరమల కొండ మింద దిగిన వాన అయిదు నిమిసాలల్లో మా కయ్యల్లోకి వచ్చి వంగింది. ఇంత బిరీన వాలిన వాన బిరీన్నే తెరిపిస్తిందిలే–

అనుకొని మా అమ్మ ఆ వానకు బయపడకుండా మునం నుంచి తల పైకెత్తనే లేదు. కూలోళ్లు మాత్రం బిత్తరక పోయిన వాళ్ల మాదిర మునాలను వొదిలేసి పరిగెత్తేద్దామన్నట్టు నిలబడినారు. "ఎంత పాపానికన్నా వోరుస్తారు గాని, కాసింత పుణ్యానికి వోర్చుకోరు గదా" అనింది మా అమ్మ. చినుకులు అంతకంతకూ బలమై పోయినాయి. కూలోళ్లూ, మేమూ మా ఇంటికి వరుగులు బెట్టేసినాము. మా ఇంటికి పోయినాక వాన మంత్రం వేసినట్టు వెలిసి పోయింది. అంత వాన పడినాక–మడికాడ పని జోరుగా జరగదని మా అమ్మ మళ్ల కూలోళ్లను శెనగ తోటలోకి రానీ లేదు. 'మద్యానం వరకు కూలిచ్చేస్తా, అర్ద కూలి. ఇంక వొద్దులే' అనేసింది. 'అదేందమ్మా, సందేళ దాకా మా దగ్గిర పని జేయించుకొని ఇప్పుడు వొద్దనేస్తా వుండావు? ఈ రెండు గంటలూ మమ్మల్నెవురు పిలస్తారు?" అన్నారు కూలోళ్లు. మా ఇంట్లో వాళ్లమే వాన వెలిసినాక మడి కాడికి పోయి కుదురుగా పని జేసుకున్నాం.

ఆ రాత్రి కూలోళ్లు మా ఇంటి ముందర కొచ్చి–సంగటి వేయమని–వీదిలో కుచ్చున్నారు. "మద్యానం నుంచి మీరెక్కడ జేసినారు పని? ఇప్పుడు సంగటేసేదీ లేదు, పట్టేదీ లేదు" అని మొండికి తిరుక్కొనింది. వాళ్లు వీదిలోకి వచ్చి ఆ మాదిరిగా వుంటే మా నాయినకు అగుమానంగా తోచి, "మద్యానం నుంచి కూలి యిచ్చేది లా. ఎందుకు కూలోళ్లను యింటి ముందర పెట్టుకొని తగరారు. అయిదు మందికీ పది ముద్దలు సంగటి వేసెయ్" అన్నాడు. ఆ రోజు మా అమ్మ కోపంతో మా నాయిన్ని తలకు పట్టి ఒకటిచ్చింది. మా నాయిన, "నేను తినను ఈ రోజు. నా సంగటి కూడా కూలోళ్లకే యేసెయ్." అని గూడా అన్నాడు. మా అమ్మ ఆ రాత్రి మాకూ కూలోళ్లకూ సంగటి జేసింది. మొత్తం పన్నెండు ముద్దలైంది. కూలోళ్లకు తలా రెండు ముద్దలు వెయ్యకుండా తలా ఒక ముద్దే వేసింది. (నా ఈడు పిలగాడికి కూడా).

ఆ రోజు కూలోళ్లు అర్ద కూలీ తీసుకొని, అర్ద కడుపుకు తినేసి పోయినారు. ఆ రాత్రి మంచం మింద పడుకోని వుండిన మా నాయిన లేచి చేతులే కడుక్కోలేదు. మా అమ్మ నాతో "మీ నాయిన్ని సంగటికి లేవమను" అని చెప్తే నేను మా నాయినతో అన్నాను. మా నాయిన 'థూ నియ్యమ్మ' అని లేచి రెండు మింగడలే తినేసి పడుకున్నాడు. మా అన్న, మా అక్క నేను

కూడా తినేసినాము. మా అమ్మ పడుకునే ముందర సంగటి చట్టికి అంటుకొని వుండిన మాడు చెక్కలను అన్ని నీళ్లల్లో కలుపుకొని ఒక గలాసుడు తాగి నా పక్కలో పడుకొనింది. అంత వొట్టి కడుపుతో పొనుకుంటే కంటి నిండికీ మాయమ్మ ఎట్ట నిద్ర పోతాదో నాకెప్పుడూ అర్తం గాదు.

# లబలబా నోరు కొట్టుకోనా?

జయను నేనెప్పుడూ మాడి తోపుల్లోనే చూసే వాడ్ని. జయ వాళ్ల అమ్మా నాయిన మాడి కాయల కాలంలో తోపుకు కావిలి వుండేటోళ్లు. మిగతా కాలంలో వాళ్లు – ఏ మత్తేపు పంపు సెట్టు మోటారు దగ్గిర్నో ఒక సపారేసుకొని అందులో కాపరం వుండేటోళ్లు. అడివిలో తేనె తీసి, పుట్టగప్పి ఈసుళ్లు పట్టి, కయ్యాగాలవల వెంబడి తిరిగి ఎలికల్ని పట్టి బతుక్కునే వాళ్లు. జయ వాళ్ల నాయిన నడిపాయనకు రెండో కూతురు. మాడి తోపుల్లో పెరిగిన బిడ్డ గాబట్టి ఆ అమ్మికి కోయిలలంటే బలే సరదాగా వుండేది. కోయిల ఏ కొమ్మ మిందనో కూచ్చోని పసుప్పచ్చని మాడి చిగురును కొరకతా వుండి, వున్నట్టుండి కూసేది. అప్పుడు జయ దానితో పందెం కట్టి, జయ కూడా దాని మాదిరే కూసేది. కోయిలకు పౌరుషం జాస్తి. అది ఇంకా గొంతు పెంచి తొందర తొందరగా కూసేది. జయ కూడా కోయిలకు తగ్గేది కాదు. చివరికి జయ గొంతుతో వేగులాడ లేక కోయిల ఎక్కడికో వెళ్లిపోయి మొకం తప్పించేసేది. జయ గెలుపును సాధించేసినట్టుగా చప్పట్లు గొట్టి పకపక నవ్వేది. జయను నేను నెలకు రెండు మూడు సార్లు కూడా చూడలేక పొయ్యేవాడ్ని. నడిపాయన కాలు ఒక చోట వుండేది గాదు. ఆయన బతుకు యారవ కోసరం ఎక్కడ పడితే అక్కడ తిరుగులాడే వాడు.

జయతో ఒక గెంట వుండి రెండో గెంటలో ఇల్లు చేరడానికి మనసొప్పదు. ఈ నా ఇబ్బంది తొందర్లోనే పొయ్యింది. ఏడెనిమిదెకరాలు కలిగిన లక్ష్మక్క – అని మాకు ఒక మేనత్త (మా నాయినకు అక్క) వుండేది. వాళ్ళకు మూడు నాలుగు ఎనుము గొడ్లు వుండేవి. వాటిని మేపడానికి జయను నడిపాయన కుదిర్చినాడు. అప్పుడు నాకు బలే కుశాల కలిగింది.

జయ ఎంత పనికైనా బలే వోర్చేది. పొట్టిగా, లావుగా వుండే జయకు – బోకులు తోమడం, చేంద బాయి నుంచి నీళ్లు తేవడం, ఎనుముల కింది పేడాచెత్తా తోసి దిబ్బలో వెయ్యడం నీళ్ళు తాగినంత లేసుగా వుండేది. తెల్లారి తొమ్మిది గంటల కాడ జయ ఎనుముల్ని కట్టు గూటాల నుంచి విడిచి పెట్టి కయ్యల్లోకి తోలుకుని పొయ్యేది. ఆ అమ్మి ఎనుముల్ని విడిచి పెట్టేది చూసి,

నేను కూడా మా ఒక్కగానొక్క ఎనుమును విడిచి తోలుకు పొయ్యే వాడ్ని. గుండ్రూటంగా, బలే అందంగా వుండే జయతో ఎల్లవేళలా వుండడం నాకు బలే కులుకుగా వుండేది. ఎలిక తోకంత జడకు మూరడు ఎర్ర రిబ్బనును (కుచ్చు పోసుకోకుండా) పొడుగ్గా జార విడిచెయ్యడం చూడ ముచ్చటగా వుండేది. ఆ అమ్మి మెడ కంఠం కాడ గీతలు మరిస్తే మరుపురానివి. జయ ఎనుముల్ని మేపడానికి కుదిరిన రెండు మూడు నెలల్లో ఒక కష్టం వచ్చి, ఆ కష్టం ఆ అమ్మినే అంటుకుని వుండి పొయ్యింది. ఆ అమ్మిని చూసిన ప్రతి వాడూ (పదారేండ్ల మొదులు ముసిలోడు దాకా) వదిలే వాడు గాడు. జయ పరుగులు తీసినా ఒదిలి పెట్టకుండా ఆ అమ్మిని పట్టుకుని, కాళ్ళ సందున అదుంకొని, ఎద మీద చేతులేసి లేని రొమ్ముల్ని వున్నట్టు పిసికేసే వాళ్ళు. వూపిరి సలపకుండా నలిగి పొయ్యే జయను వాళ్లు విడిచే వాళ్లే కారు. పక్కనే వుండే నాకు జయ దుఃఖం వినిపిచ్చి గుండెలు పెరిగి పెద్దవై పోతున్నట్లుగా బరువెక్కేవి. జయను అట్లా ఏపించే వాళ్ళతో ఎదురు తిరిగి లాభం లేదని నేను ముదిగారంగా, జయ మీద ఒరిగి పోయిన వాళ్ళని ఎక్కడ పడితే అక్కడ చక్కలగిల్లి పెట్టేసే వాడ్ని. సందు జూసుకుని జయ తప్పించుకోగలిగేది. ఈ చెర తప్పించుకున్న జయ ఒక రోజు, 'నన్ను లంజను చేసీబోతారు దొంగనా బట్టలు!' అని మగవాళ్లని తిట్టింది. ఎనుములు మేపడానికి కుదిరిన ఆరు నెలలకు అంటే, జయకు పదో సంవచ్చరానికల్లా పాపం రొమ్ము కట్టు ఏర్పడి పోయింది. ఒకనాడు పెద్దోళ్ల పాత రైకను వేసుకొని ఎనుముల కాడికి వచ్చిన జయను కష్టం చేసుకునే ఒక ముప్పైయ్యేళ్ల రైతు పట్టుకుని వుడకాడిపించినాడు. అరగంట ఆయన జయ ఎదాన చేతుల్ని తియ్యనే లేదు. గుక్క తిరక్క బొరోమని ఏడ్చేసింది జయ.

నా చక్కలిగింత కూడా ఆ మొండి నాకొడుకు దగ్గిర ఫలించలేదు. ఆయన్నుంచి విడివడిన జయ ఎనుముల్ని వదిలేసి ఎవరూ లేని చోటికి పరిగెత్తింది. ఏర్పడీ ఏర్పడనట్టు కనిపిచ్చే రొమ్ముల మీద – గుండ్రూటంగా అందంగా వుండే జయ – చేతులేసుకొని, "సుబ్రమణీ! ఎట్ట? వాళ్ళ ఎదాన పడి నోరు కొట్టుకోనా?" అని దిగులుగా అడిగి మోకాళ్ల సందున తల పెట్టుకొనింది.

# కష్టం బలే పుణ్యం గదా!

మా అమ్మ నలుగురు కూలి మనుషుల్ని పెట్టాల్సిన చోట ఒక్క మనిషిని కూడా పెట్టేది గాదు. వేరుశెనగ తోటలో గడ్డిని తవ్వాల్సి వచ్చినప్పుడు మా నాయిన 'మంతో గూడా నలగర్ని పిలువు' – అనే వాడు. మా అమ్మ, "మన పని మనకు బరువా ఏమి? ఈ కాలం కూలోళ్లు పని జేస్తారా, పడతారా? దొంగ నా బట్టలు, కూలికొచ్చి పొద్దు పోగొడతారే గాని రెక్కాడిస్తారా? గెడ్డి తవ్వను పిలిస్తే – గెడ్డి మీద మట్టి తవ్వి పోసేస్తారే గాని గెడ్డి వేళ్లు తెగేటట్టు తొవ్వుదురా, ఏమి? అయినా నువ్వు సంపాదించి పెట్టుండే ఈ ఎకరాల్లో పని జేసేటందుకు కూలోళ్లు అక్కరా? నీ పెళ్లాన్ని, బండెడు కండలు పెట్టుకుని (మా అమ్మ అక్కుసు) నేనుండ లేదా, ఇంటి కాడా కయ్యకాడా పని చేసేటందుకు?" అంటూ బారడు పొడుగు చదివేది. మా నాయిన మా అమ్మకల్లా ఒళ్లు మరిచి పోయి చూసి నోట ఏ మాటా పెట్టకుండా మొఖం తప్పించేసే వాడు.

పొద్దు మొలిచీ మొలవకనే మా అమ్మ కయ్యల్లోకి నడుస్తూ వుంటే వూళ్లో కొంతమంది ఆడోళ్లు, "చినక్కా! ఎందుకా రీతిగా అల్లాడి ఆకులు మేసేది? ఈ బూమ్మీద కడంతగాలం సీలలు కొట్టుకోని వుండబోతావా? ఈ రోజుండి రేపు నువ్వూ సచ్చే దానివే గదా! కూడా మూటాముల్లి ఎత్తుకోని పొయ్యేది లేదు గదా! ఆ మాత్రానికి ఎందుకా తపన. బాగా కడుపుకు తిని నిమ్మళంగా బతుకు!" అనే వాళ్లు. "మీకేం తల్లులాలా, చెప్తారు! అన్నిందాలా సక్రంగా వుండేటోళ్ళు. నూక గావాలన్నా, ఒక రూక గావాలన్నా నాకెవరు జేస్తారు సకాయం? వూరికే వుండకుండా, మొగుడ్ని పక్కలో యేసుకుని ఒకరికి ముగ్గురు బిడ్డల్ని కంటినే! వాళ్లకు ఒక దోవ చూపించొద్దా! పియ్యి దినో, పిడకలేరో... మేమూ వూపిరి పెట్టుకోవాల గదా!" అనేసి మా అమ్మ కయ్యలోకి వచ్చి వంగేది.

మా ఇంట్లో అయిదు మందిమి వుంటే అయిదు మందిమీ బక్కబక్కగా వుండే వాళ్లం. నేను మడి కాడ నుంచి ఖాళీ తట్టను బుజానికి వేలాడేసుకొని వీధుల గుండా వస్తా వుంటే ఒకామె, "ఒరే సుబ్రమణీ! నీ అమ్మ నీకు కూడు

యేస్తా వుండాదా లేదా? అదేందిరా సామీ, కంప కంపగా అయిపోయినావు. తలకాయ తప్ప నీలో ఏముండాదిరా! పురి కట్టే బిడ్డివి గదా, నీ ఈడు పిలకాయల్ని జూడు – కొండను పిండి జేసే పొట్టేండ్లు మాదిర వుండారు!" అనేది. ఆ పక్కనే వుండే ఇంగొకామె, "వీడన్నా కొంచిం నయం. వీడి అన్న – నాగులుగోడికి ఇరవైయ్యేండ్లు వుండవా! వాడ్ని చూడు. వాడైతే దిన్దినానికి దిగ్గరిగి పోతా వుండాడు. ఆ చినక్క చెయ్యి చిట్టిది గదా. అది పిలకాయల చేత కూడా (కూలీనాలిని పెట్టకుండా) కష్టం చేయించు కుంటుందే గాని అంత కూడు పెట్టే బుద్ధి దాని దగ్గిర యాడిది?" అనేది. నాకా మాటలు విని – నా తలకాయ నాకు తెలవకుండానే వాలి పొయ్యేది. ఆ మాదిరిగా అనే వాళ్ళు నా ముందరే గాకుండా మా అమ్మ ముందర్నే అనేస్తే అమ్మ ముఖం కాసింతగా అయిపొయ్యేది. "మీకు నోరుండాది. నాకు చెవులుండాయి. అనండి, అనండి!" అంటూ మా అమ్మ అదొక రకం నడత నడుస్తూ – ఆ మాదిరిగా అన్నవాళ్ళ నుంచి దూరమయ్యేది.

సరిగ్గా ఇటువంటి కాలంలోనే మా శెనగతోట తవ్వకానికి వచ్చేది. మా వూరికి ఒక మైలు దూరంలో వుండే రామాపురంలో కూడా ఇదే కాలంలో భారతం తిరనాళ్లు జరిగేవి. రామాపురం వాళ్లు వారం రోజులు పగలు పూట భారత కథను హరిదాసు చేత చెప్పించే వాళ్ళు. భారత కథకు ఆ చుట్టు పక్కల వూళ్ళల్లో వాళ్ళు చానా మంది కాలి నడకన పోతూ వుంటే – మా ఇంటిలో వాళ్ళం శెనగ తోట తవ్వకుంటూ వుండే వాళ్ళం. ఆ దారిన కథకు – ఎక్కువగా పొయ్యే ఆడవాళ్ళను చూసి మా అమ్మ మా నాయిన పక్కన చేరుకుని, "నాకా యోగం లేదు గదా" అనేది. "నిన్ను నేను పగ్గాలేసి కట్టేసి వుండానా! నువ్వూ పోయేమి?" అనే వాడు మా నాయిన. "నీ దగ్గిర బొట్టు కట్టించుకున్న రోజే ఆ పాపం పుణ్యం వొదిలేసినాను గదా!" అనేది మా అమ్మ యాష్టగా.

ఒక రోజు కమ్మ ఖండ్రిగ నుంచి కథకు పోతూ ఒకాడామె, "సున్నం వుంటే పెట్టు చినక్కా" అంటూ తవ్వకుంటూ వుండిన మా అమ్మ దగ్గిరికి వచ్చింది. ఆమె మా అమ్మ చేతిలో నుంచి తొలికను బలవంతంగా లాక్కుని, "కతకు రా! ఒక పాపం పుణ్యం లేకుండా ఏంది నీ సంగతి? అరిదాసు ఆడామె. ఆమె చెప్పే కతను అచ్చులు పచ్చులు గూడా ఆలకిస్తుండాయి. నా

మాట విని రా. ఈ రోజు దౌపతికి చీరలు పెరికే కత చెప్తింది" అని బలవంతం చేసింది. మా అమ్మ, "శెనగతోట తడారి పోతా వుండాది. చూడు గడ్డి యెట్ట మొలిసి పోయిందో!" అని సూపిచ్చింది. "ఏంది సినక్కా! మనిసి యెడ్డీమడ్డిగా గొడ్డు మాదిరిగా కష్టం జేసేస్తే సరిపోతిందా? ఛూ, వొచ్చే జల్మ నీకు వుండాలా వొద్దా? యమ లోకంలో చిత్రింసలు పడాలని వుండాదా?" అనింది, సున్నానికొచ్చిన ఆడది.

మా అమ్మ ఎంతో దైర్నంతో, "నా కన్నా పున్నాత్మురాలు ఎవురు, ఈ లోకమ్మీద? నేనేం వీడికీ వాడికీ కొంగు పరిచి బతకలా, నా రెక్కల కష్టంతో బతకతా వుండా. నన్ను చిత్రింసలు పెడితే దేముడికి మారు జల్మ వుండునా ఏమి?" అనింది.

# మా అమ్మ – (మా తాత)

"**ఈ** ఎండలు కాసే బూమండలం మింద నాకెవ్వర్లేరు. నన్ను ఒక నా సవితీ, ఒక నా బట్టా కనలా, నా అంతట్నేనే నేరుగా ఆ ఆకాశంలో నుంచి ఈ బూమ్మీద దబీమని పడినా, ఒక తిక్కలోడికి పెళ్ళాన్నైనా, ముగ్గురి బిడ్డల్ని కనినా, అంతే. అంతకు మించి నేనెవురికీ ఏమీ గాను, రాముడుండే ఈ రాజ్జిమ్మీద నాకంత నీడ లేదు" – అనింది ఒక రోజు మా అమ్మ, మా తాతను ఎదురు గుండా పెట్టుకుని. మా అమ్మకు కూడా నాయిన వుండాడని తెలిసినప్పుడు నేను మా అమ్మకల్లా యిచ్చిత్ర పోయి చూస్తిని. మా తాత వాళ్ల వూరు మా వూరికి కనిపిస్తూనే వుంటింది. మధ్యన అడ్డం కొన్ని కయ్యిలే. మా అమ్మ అయిదారు నెలలకొక సారి కూడా మా తాత వాళ్ల ఇంటికి పొయ్యేది గాదు. పసి బిడ్డనైన నాకు గూడా మా తాత వాళ్ళ ఇల్లు సొంత ఇల్లు మాదిరి అనిపించేది గాదు.

వాళ్ల వూళ్లో ఒక రోజు నేను దిక్కులు చూస్తా నడస్తా వుంటే, ఒక ఎదుర్రాయికి బొటన వేలును కొట్టుకొని, బోర్లా పడిపోయి పెదాన్ని చిట్లించుకుని జొడజొడా రక్తాన్ని కారించుకున్నాను. అప్పుడు చేంద బావి దగ్గిర నీళ్లు చేందతా వుండిన ఒకాడామె పరిగెత్తతా వచ్చి నన్ను ఎత్తి, నా నెత్తుర్ని తుడిచి, "నువ్వెవ్వురివి? ఏ వూరి పిలగాడివిరా, యెర్రి నా కొడకా!" అనడిగింది. ఒళ్ళంతా అదిరి పోతా నిలబడుకున్న నేను నోరు తెరచి ఏమీ చెప్పలేకపోతిని. అప్పుడు ఇంకొక ఆడామె వచ్చి, "మర్రిచెట్టు కాడ దిగినారు చూడు, పిచ్చిగుంట్ల వాళ్ళు! వాళ్ళ పిలగోడేమో!" అనింది. నాకు అప్పుడు ఒళ్లు తెలవకుండా దుక్కం వచ్చింది. అప్పుడు చేందబావి దగ్గిరికి బిందీ, బొక్కినీ ఎత్తుకుని వస్తా వుండిన మా అవ్వ పరుగున వచ్చి, "అయ్యయ్యో! వాడు నా మనవడు గదా. మిట్టూరులో మా చినక్కను ఇచ్చినాం గదా. దాని చిన్న కొడుకు గదా వీడు. సుబ్రమణి, పేరు–" నన్నెత్తుకొని అనింది.

మా తాత నేను కనపడినప్పుడల్లా, "ఎన్నో తరగతి నాయినా!" అనడిగేవాడు. ఆయన దగ్గిరికి పోయి అయన కండ్లకు తగిలించుకున్న గుడ్డి అద్దాలను తీసుకొని, నా కండ్లకు పెట్టుకుందామని లోపల్లోపల వుండినా – నేను ఆయన దగ్గిరికి చేరి ముదిగారాలకు పోకుండా, "మూడులో నుంచి నాలుగులోకి

మారినాను." అనేవాడ్ని. మా తాత, "మొన్న ఆ నడమ కనిపించి ఒకటో తరగతి అని చెప్తివి గదరా! నీకు చదువు బలే వస్తా వుండాదే!" అని ఆచ్చర్య పొయ్యే వాడు.

మా నాయిన అప్పుడప్పుడు తమాసకు, "కొట్టి తరిమేస్తా. అమ్మగారింటికి పోయి మూల కుచ్చుంటావు" అనే వాడు. మా అమ్మ, "అద్దో, ఆ మాటనద్దు, నాకు కన్నతల్లీ, కన్నతండ్రీ వుండుంటే నేను ఈ రీతిగా మాదిగ దాని కన్నా అద్దోన్నంగా ఎందుకుంటా?" అంటూ ఆమె చేతుల్ని మాసిపోయిన ఆమెకల్లా చూపించుకునేది.

మా అమ్మకు మా తాత అంటే గొంతు కాడికి వుండేది. మా తాతకు వుండే నాలుగెకరాల్లో ఒక్క అయిదు గుంటల్ని నా పేరన రాసియ్యమని – మా అమ్మ శానా సార్లు శత పోరిందంట మా తాతని. ఒక రోజు మా తాత ముందర మా అమ్మ గొంతు కూచ్చుని, "చెవుల్లోకి లోలాకులు, ముక్కుల్లోకి పుడకలు, నడుంకి వొడ్డాణం, నాకొద్దు నాయినా, ఒక్క అయిదు గుంటల్ని రాసియ్యి. ఆ కయ్యిలో కష్టం చేసుకుని నా బిడ్డల్ని నేను సాక్కుంటా"నని ఒక గెంట సేపు పోరకలాడింది. మొబ్బులు గమ్మిన ఆకాశం మాదిరి మా తాత గమ్మున వుండిపోయి, "ఇంక నేనొస్తానక్కా!" అనేసి వాళ్ళ వూరికి పోయినాడు.

మా తాతకు ఒక కొడుకు వుండే వాడు. ఆయన చంద్రగిరికా పక్క – నడుంపల్లి అనే వూళ్ళో – పిల్లను తీసుకోని అక్కడికే ఇల్లిటానికి పోయినాడు. ఇక్కడుండే కయ్యిగాలవ అమ్ముకోని మా అవ్వా మా తాత కూడా మా మేనమామతో కూడా నడుంపల్లికి పూడ్సినారు. అయిదారేండ్లయినాక మా తాతకు మా అమ్మను చూడాలనిపిచ్చి రమ్మని వాళ్ళూరి చాకలాయన చేత కబురు పంపించినాడు.

మా అమ్మ, "నన్ను చూసేదానికి వోడెవుడు? థూ థూ, వోడ్ని నాయినని నేనెప్పుడూ అనుకోలా, వోడు చచ్చిన్నాటికి వొచ్చి వోడి గుంత మింద పిడికెడు మట్టేసి వొస్తానని చెప్పు" అని చాకలాయనతో చెప్పి పంపించింది.

(ఇదంతా మొన్నా మొన్న జరిగింది. నేను ఎమ్మెస్సి తొలి సంవచ్చరంలో వుండగా మా తాత చచ్చిపోయినట్టు కబురు వచ్చింది. చావుకు ఎలబారుతున్న మా అమ్మతో పాటు నేను ప్యాంటు వేసుకోబోతుంటే మా అమ్మ, "ఎందుకురా?

బస్సోడు నీ అమ్మా మొగుడా? రానూ పోనూ నాలుగు రూపాయలు రుథా!" అనేసింది. అయితే మా అమ్మ మా తాత దినానికి నన్ను, "వస్తావా సినబ్బా!" అని పిలిచింది. "సావుకే రాలేదంట, దినానికి ఎందుకులే మ్మే!" అనేసినాను. దినానికి పోయి వచ్చిన మా అమ్మ అనింది: "మీ మేనమామ దినాన్ని బలే గనంగా జరిపిచ్చినాడు. రెండు వేటల్ని నరికినాడు. యిస్తరాకులో దోసిడు (మాంసం) కూరను వేసుకుని కుచ్చుంటే కూడు కడుపులోకే పోలా, యిస్తరాకులో నువ్వే కనిపిస్తివి. వొచ్చుంటే కడుపారా తినుండవా!" అనింది. మా అమ్మ మాటకు మోకాళ్ళ సందన తల పెట్టుకుని బొరోమని ఏడ్చినాను. ఆ మాట గుర్తుకు వచ్చినప్పుడల్లా ఈ గుక్కెడూపిర్ని పోగొట్టుకుంటే పోలా – అనిపిస్తుంది నాకు. మా అమ్మ రెక్కల కష్టాన్ని తిని, ఆమె ముందర్నే పీనుగై పోలేక, ఈ మానం చెడ్డ బతుకు బతకతా వుండాను.)

# కట్టె ఇస్కూల్లో,
# మనసు బంక చేనులో..!

మా ఇస్కూలుకు వుత్తరంగా బంక చేను వుండేది. ఆ బంక చేను ఒక తోపు మాదిరి వుండేది. తోపులో దిక్కు తెలవకుండా చీకి చెట్లు వుండేవి. ఆ చీకి చెట్ల సందుల్లో రెండు మూడు గడ్డి వాములు. అక్కడే ఒక వెలగ చెట్టు, రెండు నేరేడు చెట్లు, నాలుగు చింత చెట్లు, ఒక్కటంటే ఒక్కటి రేగు చెట్టు, రెండు నీలం మాడి చెట్లూ వుండేవి.

మా ఇస్కూలు పిలకాయలకు బంక చేను తల్లి మాదిరిగా. నా ఈడు పిలకాయలందరికీ ఇస్కూలు కన్నా బంక చేనే గొప్పదిగా అనిపించేది. రోజూ ఇస్కూలుకు ఎగనామం పెట్టేసి బంక చేనులోనే వుండి పోదామనిపించేది.

శివరాత్రి వచ్చీ రాకనే బంక చేనులోని చింత చెట్లు కాపుకు వచ్చేవి. చింత చెట్లు కాపుకు వచ్చినాక పిలకాయలకు కాలు ఇస్కూల్లో నిలిచేదే గాదు. బంక చేనులోకి పరుగులు తీద్దామనిపించేది.

ఇస్కూల్లో రోజుకు ఒంటేలు అవసరం ఎన్ని సార్లు వస్తింది? మఖా ఐతే నాలుగు సార్లు! ఇస్కూల్లో నేను ఆరు గంటలు వుంటే నాకు ఇరవై సార్లు ఒంటేలు అవసరం వచ్చేది! మా అయ్యోరు మా పిలకాయలతో “మీకంతా అతి మూత్ర వ్యాధి వుండాదిరా ముండ నాయాళ్లారా!” అని అనే వాడు.

నేను మాటి మాటికీ పైకి లేచి అయ్యవారి కల్లా చూపుడు వేలును చూపించే వాడ్ని. నన్ను బయటకు పంపించక పోతే వున్న చోటున్నే నిక్కరును తడుపు కుంటానన్నట్టు మొకం పెట్టే వాడ్ని. అయ్యోరు ‘పోరా, రోత నాయాలా!’ అనే వాడు. నేను కుశాలగా ఇస్కూలు బయట నుంచి బంక చేనులోకి పరుగులు తీసి చింత చెట్ల కింద తారుకులాడే వాడ్ని. రెండు మూడు చింత కాయలు దొరికినా దొరికేవి. చింత చెట్లను వొదిలి మళ్లా ఇస్కూలుకు పోవాలనిపించేది గాదు. పది నిమిసాలైనా రాలని చింతకాయల కోసరమే ఎదురు చూడాలనిపించేది. మళ్లా వెంటనే ఇస్కూలుకు పోకుంటే అయ్యవారు,

"వుచ్చ పోసుకోవడం ఎంత సేపురా యెదవా!" అని బెత్తం ఆడిస్తాడేమోనని భయం. దొరికిన ఒకటి, రెండు చింతకాయలు చాలు దేవరా! అనుకొని ఇస్కూలుకు పోయి కూర్చునే వాడ్ని. ఇస్కూల్లో కూర్చున్నాక మనసు పలక మిందా, బలపాల మిందా వుండేదే గాదు. చింత చెట్ల కిందనే చుట్టకలాడేది. మా అయ్యవారు, "మీ కట్టె ఇస్కూల్లో, మనసు బంక చేనులో! మీకు చదువు ఎట్టొస్తుందిరా ముండ నాయాళ్ళారా!" అని తిట్టినాడు.

ఆ మాదిరిగా ఆశగా ఏరుకునే చింత కాయల్ని మా పిలకాయలెవురూ చప్పరించరు. బొప్పె వూడ పెరికి చప్పరించడానికి కావు ఆ చింతకాయలు. ఇంట్లో చారు పెట్టడానికి ఇబ్బంది పడే అమ్మలకు ఇవ్వడానిక్కూడా గాదు.

మా వూళ్ళోకి– చింతకాయల కాపు కాలంలో వొకాయన గెనిశె గడ్డలు తెస్తాడు, అమ్మడానికి. గెనిశి గెడ్డలు అమ్మే ఆయన దగ్గర తూకం– వుంటాది. పిడికిడు చింతపండు ఇస్తే పిడికిడు గెనిశి గెడ్డలు ఇస్తాడు. అందుకోసం మాకు చింత పండు అంటే అమ్మా అబ్బను చూసినంత కులుకు.

మా జేబుల్లోకి ఒక చింతకాయ రావాలంటే అందుకు మేము చానా ఇబ్బందులు పడే వాళ్లము. అయ్యోరికి ఒకటికి పదిసార్లు వేళ్లు చూపించి బయట పడడం బలే కష్టమైన పని. తీరా చింత చెట్టు కిందికి పోతే ఒక్క కాయా దొరకదు చానా సార్లు. ఈ చింతకాయలతో వుండే కష్టాలు చెప్పాలంటే శానా వుండాయి. తెల్లారి పదిన్నర గంటలప్పుడూ, సందేళ మూడున్నరప్పుడూ అయ్యోరు రూలు ప్రకారం ఒంటేలుకు ఇంటర్వెల్లు బెల్లు కొడతాడు గదా. అప్పుడు పిలకాయలంతా రాళ్లతో చింత చెట్టు కిందికి చేరిపోతాము. ఒకడికి వుత్తరం మింద నమ్మకం, ఇంకొొక్కడికి దచ్చినం మింద నమ్మకం. ఒకొొక్కడు ఒకో దిక్కుకల్లా నిలబడి గురి చూసి చింత చెట్లోకి రాళ్లు విసిరే వాళ్లము. రాళ్లు మాత్రం కింద పడేవి. ఒక విత్తు చింతకాయ అయినా కింద పడేది గాదు.

ఇన్ని కష్టాలకు వోర్చినా రోజుకు పిడికెడు గనిశ గడ్డలైనా సంపాదించలేక పోయే వాళ్లం. అయినా చింత చెట్టు మింద ఆశ చచ్చేది గాదు. అయిదో తరగతి పాసై పోయి ఆరో తరగతిలో చేరే దాకా నాకు బంక చేను మింద ఆశ చావలేదు. అయితే ఒక్కసారి మాత్రం రోత బుట్టింది:

ఒక రోజు బయట గాలి తోలతా వుండడం పసిగట్టి, ఈ గాలికి పది చింత కాయలైనా సంపారించచ్చునుకోని అయ్యోరికి ఒక వేలు చూపించినాను. ఆ రోజు అయ్యోరికి బలే కోపం వచ్చింది. ఆయన ఆ అంత కోపాన్నీ అణుచుకొని, "వుచ్చ వస్తా వుండాదా?" అనడిగినాడు. భయం భయంగా తలూపినాను. అయ్యోరు నన్ను బయటికి పంపినాడు. నాతో కూడా మా లీడర్ను పంపినాడు. నేను ఉచ్చ నిజంగానే పోస్తానో, పోయనో లీడరు చూడాల. ఆ రోజు కానగ బెత్తం వల్ల నా అరిచేతులు మాగి పోయినాయి. (నేను ఉచ్చ పోయలేక పోతిని).

రేగ్గాయలు, ఎలక్కాయలు, నేరేడు పండ్ల కాలంలో కూడా యిదే వాటం. అయ్యోరు కొట్టిన కత అప్పుటికప్పుడు మరిచి పోయి ఒకటికి పదిసార్లు పైకి లేచి బంక చేనులోకి పరిగెత్తి ఒక రేగు పండో, ఒక మామిడి పిందెనో తినాలనే అనిపించేది. ఒక తెల్లారి పూట మా అమ్మ ఇడ్నీలు చేసింది, మా పొయ్యి మిందన్నే. ఆ రోజు నాలుగిడ్నీలు తిని నీళ్ళు తాగి ఇస్కూలుకు వచ్చినాను. ఒంటేలుకు బెల్లు కొట్టినప్పుడు బంక చేను కల్లా పోదామనే అనిపించలేదు, నిజంగా.

# ...పడిన వాడిని నాకు తెలుసు

మూడో తరగతి సంవచ్చరం పరీక్షలు ఇంక పది రోజుల్లో మొదులవ తాయనంగా అనుకుంటా నా మీద ఏ దేముడికో థూ థూ అని రోత బుట్టినట్టుండాది. నాకు ఒళ్ళంతా తీట వచ్చేసింది. అట్టా ఇట్టా తీట గాదు. నా ఒళ్లు నాది గాకుండా చేసేసిన తీట. ఒక రోజు – అశోకుడు పాఠాన్ని పలకలో రాసుకుంటూ వుంటే చేతి వేళ్ల సందన ఒకే నవ్వ వుండింది. గీరుకున్నాను. తాట లేచిపోయిందక్కడ. ఆ సందేళ నా వేళ్ళ సందున, ఇంకా ఎగువన చెమట కాయల వంటివి శానా అగుపించినాయి. నిమ్మళంగా ఒక చోట కూచ్చుని అన్నీ గిల్లుకున్నాను. అక్కడంతా తడి తడిగా అయిపోయింది. ఆ రోజు నా ఒంటి మీద పొడ సూపిన తీట నాలుగైదు రోజుల్లో ఒళ్లంతా సోకి పోయింది. అన్నం తింటూ కూడా ఎడం చేత్తో తొడల సందన ఇష్టం వచ్చినట్టు గీరుకోవడం చూసిన మా అమ్మ, "ఒంటికి ఏందో తెచ్చుకున్నావు గదరా నా సిన్న కొడకా!" అనింది.

మా అమ్మ కళ్లల్లోకి నేను దిగులుగా చూస్తే, మా అమ్మ నా చేతుల్ని పరీక్షగా చూసి, "ఒరె యెఱ్ఱెదవా! తీట..." అని గుర్తించింది. అంతకు ముందు నాకది తీట అని తెలవదు. "తీట వస్తిందంటే రాదా? ఎప్పుడూ మట్టిలో ఆట్లాడే పనే. ఒళ్లంతా మట్టి జేసుకుని, సందేళ పూట నాలుగు ముంతలు నీళ్లు పోసుకోకుండా అంత తినేసి పొనుకుంటావు. మనిషిలో శుబ్బరం వుంటే గదా – తీటా గీటా రాకుండా వుండేటందుకు!" అనింది మా అమ్మ. అప్పుడు మా అమ్మను ఎగిసి తన్నినా ఖర్మాల్లేవనిపించింది – తీరా వచ్చే తీట రానే వచ్చేసినాక ఈ రీతిగా మాట్లాడతా వుంది గదా! సందేళ మా అమ్మ తీరు ఏ రీతిగా వుండునంటే – కష్టం చేసేసి కయ్యి కాడి నుంచి వచ్చినాక ఆమె మూతిని మూరడు పొడుగు పెట్టుకొని వుంటింది. నేను ఒళ్లంతా మట్టితో వచ్చినా ఆమె నన్ను జలజారు గుంత దగ్గరికి తీసక పోయి వుడుకుడుగ్గా నీళ్లు పోసి నా ఒళ్లంతా రుద్దదు. నోరంతా తెరిచి నా అంతట నేనే, "అమ్మా నీళ్లు పోద్దువురా" అని అంటే, ఆమె నెత్తిన ఏదో బరువు పెట్టుకుని వుండినట్టుగా వుండి, "పద పాలు తాగే పసి బిడ్డవి గదా, కాళ్ళ మీద పండేసుకుని లాల పాడి చిట్టుడుకు నీళ్లు పోస్తాను." అని ఎగతాళి పడి నన్ను అగుమానించేది.

నా అంతట నేనే, బకెటంత పొడుగైనా వుండని నేనే, ఆ బకిడీని పొంత దగ్గరికి ఎత్తుకొచ్చి, అన్ని నీళ్ళను తోడుకుని, దాన్ని బలవంతంగా పెరడు దగ్గరికి మోసుకొని పోవాల. తీరా పెరడు దగ్గరికి పోయినాక అక్కడ రుద్దుకోవడానికి చేతికి సరిపొయ్యే నున్నటి రాయి ఒకటి వుండేది. ఆ రాయిని ఒంటి మీద పెట్టుకోవాలంటేనే నాకు ఒళ్లు మంట. ఆ రాయిని మాయం చేసేసినా మా అమ్మ ఎ(ర సబ్బు తెస్తిందేమో ననిపించి ఒక రోజు దాన్ని పూరవతల అద్దారపాకు పొదలో పారేసినాను. మరసటి రోజు సందేళకంతా అడివి నుంచి మా అక్క మళ్లీ అటువంటి రాయే ఒకటి తెచ్చి పెరట్లో పెట్టింది. ఆ రాయి అంటే నాకు వుండే కసి కొద్దీ పెరట్లోకి పోయిన నేను, నీళ్లు పోసుకోవడం మరచి పోయి కోపం కొద్దీ ఆ రాయిని పెరటి బండకేసి విసిరిసిరి కొట్టేవాడ్ని. అది టంగుటంగుమని మోగేది. దాన్ని ఎగిసెగిసి తన్ని, దాని మీద తుపుక్కు తుపుక్కుమని ఎన్నిసార్లు ఎంగిలూంచినానో ఆ పరమాత్ముడికి తెలవాల. నీళ్లు పోసుకునే బారం పసి పిలకాయల మీద వేసేస్తే - వాళ్లు సరిగ్గా పోసుకుంటారా? అరవా కొరవాగా ఒంటికి నీళ్లు పోసుకున్నా మళ్లీ విప్పేసిన గుడ్డలే వేసుకోవాల... ఇదీ జరుగు కత. తప్పంతా నాదేనన్నట్టు మా అమ్మ మాట్లాడితే నాకు కోపం రాదా ఏమి!

పరీక్షలకు ముందే ఈ తీటను పోగొట్టుకుందామని నేను పడరాని పాట్లు పడినాను. నాతో కూడా చదువుకునే బాలయ్యకు ఎప్పుడూ ఒళ్లంతా పుండ్లు వుండేవి. వాడు ఇస్కూల్లో కూడా తల వాలేసుకుని పుండ్లు మీద వాలే ఈగల్ని చాకచక్యంతో చంపుతూ పక్కన వుండే పిలకాయలకు చూపిస్తూ వుండే వాడు. వాడ్ని తోడు తీసుకుని కయ్యల దగ్గరికి పోయినాను. కయ్యల్లోని గబ్బుచెట్ల ఆకుల్ని తుంచి తుంచి ఆ పాలను తీట కాయల మీద పెడితే చల్లంగా వుండేది. ఈ వైద్యమూ పని జేయలేదు. ఆ తీట వున్నన్నాళ్లూ నేను నిద్ర పోకుండా, మా అమ్మను నిద్ర పోనీకుండా చంపినాను. మా అమ్మ ఒక రోజు నా చొక్కా నిక్కరా విప్పేసి నా ఒంటికంతా గబ్బు ఆకుల రసం పూసి నన్ను ఎండలో ఒక్క గంట నిలబెట్టింది. ఆ గెంటా నీడన నిలబడుకొని వుంటే భూలోక రంభ నవ్వి నవ్వి చచ్చింది. ఆ అమ్మి నన్ను అంటుకోనివ్వనే లేదు. ఆ అన్ని రోజులూ, ఆ అమ్మి పావడకు ఎట్లయినా సరే నా ఒంటినంతా రుద్దేసి, ఆ అమ్మికి కూడా తీట తెప్పిద్దామనుకున్నాను. కానీ వీలు గాలేదు.

కడ వైద్యంగా ఒక రోజు మా నాయిన నన్ను గుడ్డలిప్పించి ఒక మురికి కోనేరులో నిలబెట్టినాడు. నీళ్లల్లో నుంచి చేపలు, నా ఒంటి మీది తీటని కొరుక్కు తినేస్తూ వుంటే సుకంగా వుండింది. ఇన్ని వైద్యాలు చేసినా తొలి పరీక్ష (తెలుగు) రోజున నాకు తీట సగానికి సగం వుండింది. (మా పిలకాయల్లో అప్పుడే కొంతమందికి ఆరంభమైంది.) పిలకాయలం నిలబడుకొని, పలక అంచును ఎదమీద ఆనించుకుని వుంటే అయ్యవారు 'బౌద్ధ స్థూపము'ను రాయమని 'డిక్టేటు' చేస్తున్నాడు. ఆ పదం రాయ లేక, ఎక్కడెక్కడో గీరుకో లేక చచ్చి సున్నమైనాను. ఆ నా బాద పైన దగద్దమానంగా మండేవోడికి తెలుసు, నాకు తెలుసు.

# మా నాయిన మట్టి పాదం

**మా** వూరికి తూర్పు దిక్కున మాకు ఒక ఎకరా వుండేది. దాన్ని మేము 'తూరుగా మడి' అనే వాళ్ళం. ఆ కయ్యకు మంచి వూట బావి వుండడం వల్ల నీటి సౌకర్యం భలే వుండేది. నేను నాలుగో తరగతో ఎంతో చదవతా వుండగా మా వూరికి రెండు విత్తుల చెనిక్కాయల (చిన గుత్తి) పంట వచ్చింది. అంతకు ముందు మా వూరోళ్ళం అందరం కూడా మా వూరికి పడమరగా వుండే వెలి చేనులో మూడిత్తుల చెనిక్కాయలను మాత్రమే (వాన ధర్మాన) పండించే వాళ్ళం. అది పండితే పండె, లేకుంటే లా. చిన గుత్తి పంట రాగానే మేము మడి కట్టులో కూడా చెనిక్కాయల పంట వెయ్యడం మొదలు పెట్టినాము. ఒక దఫా మేము మా తూరుగా మడి మొత్తం చిన గుత్తి వేసినాము. ఊరు ఊరంతా బీడును నాలుగు సాళ్లే దున్నితే మా నాయిన ఎనిమిదో తొమ్మిదో చాళ్లు దున్నినాడు. కయ్యలో ఎక్కడైనా మట్టి పెళ్ళలు కనిపిస్తే నేనూ మా అమ్మా ఆ మట్టి పెళ్ళల్ని ఆ మట్టి పెళ్ళలకే ఢీకొట్టి నుగ్గు నుగ్గు చేసినాం. మా దుక్కి రాగి పిండి మాదిరిగా అయిపోయింది. శెనగపప్పు వేయక ముందే ముప్పయి కేజీల - మూడు పదిహేడులు - అనే ఎరువును మా నాయిన ఆ ఎకరాలో చల్లినాడు.

చివరగా మా నాయిన మడక దున్నుతూ వుంటే మా అమ్మ, నేను, మా అన్న, మా అక్క చాళ్ళలో పప్పు వేసినాము. మా నాయిన పప్పు వేసేటప్పుడు మడకను అతి జాగ్రత్తగా దున్నే వాడు. మా అమ్మలం బిడ్డలం పప్పు వేసే తీరు లోకానికే యిచ్చిత్రమని మా వూరోళ్ళంతా ఎగతాళి చేసే వాళ్ళు. మరీ మా అమ్మ అయితే వొళ్ళును బలే వంచి, చాలు లోకి పడిపోతుందేమో అన్నట్టుగా పప్పును వేసేది. బలే పొట్టి మనుషులమైన మేము అందరం మా అమ్మ రీతిగానే పప్పును వేసే వాళ్ళం. పప్పుకూ పప్పుకూ మధ్య పిడికెడేసి దూరం వుందో లేదోనని పప్పుల్ని చాలులో జతలు జతలుగా వేస్తున్నామేమోనని మా అమ్మ అప్పుడప్పుడూ - మేము పప్పు వేసే చోటికి వచ్చి తనిఖీ చేసును.

నేను అచ్చం మా అమ్మకు వలెనే పప్పును జాగ్రత్తగా వేసే వాడ్ని. మా అక్కను వేలెత్తి చూపే ప్రసక్తే వుండేది గాదు. మా అన్నతో మాత్రం, "ఒరే,

ఆర్నెల్ల పంట, ఒక చోట జతలు జతలుగా వేసేసి, ఒక చోట బీడు పెట్టేసేవురా సామీ!" అనేది. పప్పు వేసేసిన వారంలో వేసిన ప్రతీ గింజా మొలకెత్తేసును. మా అమ్మా నేనూ తెల్లారీ సాయంకాలం మొలకలను చూసుకునే వాళ్లం. పూత పట్టేటప్పుడూ, పూత పట్టినాకా ఒకటికి రెండుసార్లు తవ్వి ఒక పచ్చిక మొలక కూడా లేకుండా చేసే వాళ్ళం. వూళ్ళోవాళ్ళు, "నారప్ప వాళ్ల శెనగతోట బలే వుండాది. నరగావు అడగతా వుండాది" అని చెప్పుకుంటూ వుంటే మా అమ్మకు (దిష్టి తగులుతాదని) నచ్చేది గాదు.

వూళ్ళోకెల్లా మా శెనగతోట బలే వూరేది. ఒక్కో చెట్టుకైతే అరవైయ్యేసి, డెబ్బయ్యేసి కాయలు గూడా వూరేవి. వూరు వూరంతా గుంతలు కొట్టుకొని చెనక్కాయల్ని రాలగొడుతూ వుంటే మేము మాత్రం కయ్యలో ఒక పందిరి వేసుకుని నిదానంగా పదీ పన్నెండు రోజులు కాయల్ని వొలుచుకునే వాళ్ళం. కాయల్ని చెట్టు నుంచి ఒలవడంలో మా అమ్మ, నేను, మా అక్క బలే నేర్పు చూపే వాళ్ళం. మా అన్నా మా నాయినా మాతో సమానంగా ఒలిచే వాళ్ళు కారు. మా నాయిన అయితే వూడలతో సహా దుసి పోసేసే వాడు. పనంతా అయిపోయినాక మా కళ్ళాన్ని చూడటానికి రెండు కండ్లూ చాలేవి గావు. ఒక ఎకరాయే అయినా నలభై మూటల చెనిక్కాయలు అయ్యేవి మాకు. "చెనిక్కాయలన్నీ నారప్ప పరమే!" అనేవాళ్లు మా కళ్ళంలో రాశిని చూసి. "అందరికీ ఊరినట్టే మాకూ వూరినాయి. అసలు భూమిలోనే సగం కాయలు పోయినాయి!" అనేది మా అమ్మ. మా అమ్మకు ఎంత పంట పండినా పండినట్టు వుండేది కాదు.

బలిజ పల్లి నుంచి అప్పయ్య అనే వ్యాపారస్తుడ్ని చెనిక్కాయల కొలతకు మా అమ్మ పిలిచింది. ఆయన గోతాలు ఎత్తుకుని కళ్లంలోకి వచ్చినాడు. (40 కేజీల) మూట అరవై రూపాయలు ధర. విత్తనాలకూ, చమురుకూ పెట్టుకున్నవి మిగలంగా ముప్పయి రెండు మూటలయినాయి. మా వూళ్ళో ఆ దఫా రెండెకరాలు చెనిక్కాయలు వేసిన వాళ్ళకి కూడా అన్ని కాలేదు. అప్పయ్య కొలత అయిపోంగానే మా నాయిన నన్ను రహస్యంగా పిలిచి, "ముప్పయి రెండు మూటలకు అరవై రూపాయల లెక్కన ఎంత డబ్బురా!" అనడిగినాడు కూర్చోని.

నేను తల గీరుకుని, 'పలకా బలపం లేదు పో' అన్నాను. అప్పుడు మా నాయిన నన్ను ఒళ్ళో కూర్చోబెట్టుకుని ఒక చిన్న పుడకను నా చేతికి ఇచ్చి పాదం చూపించినాడు. నాకు అర్థమైంది. మా నాయిన పాదం మీద మట్టినంతా తుడిచేసి నేను లెక్క వేయగలిగినాను. రెండు నిమిషాల్లో నేను లెక్క తేల్చి చెప్పినాను. అందులో నుంచి పన్నెండు నూర్లు తీసెయ్యమన్నాడు. మా నాయిన పాదం మీదనే తీసివేత జరిగింది. ఎంత మిగిలిందో చెప్పినాను. మిగిలిన లెక్క ఎక్కడో చూపించమన్నాడు. మా నాయిన పాదం మీదన్నే ఒక చోట వేలు చూపించి 'యిదీ' అన్నాను. పాదంలో ఒక మూల వున్న ఆ సంఖ్యని మా నాయిన కండ్లకద్దుకున్నాడు.

# మా నవ్వులోడి దుఃఖం

అష్ట తెలివిలూ కలిగినోడు మా మాదిగ పల్లి నాగరాజు. పిడికెడు చెనిక్కాయలో, చేరడు బియ్యమో జేబులో పోసుకుని వాడి పక్కన చేరాలంటే మా పిలకాయలకు చచ్చేటంత బయం. "ఒరే అయ్యవారి మీద ఒక కేసొచ్చింది. రేపో ఎల్లుండో వడమాల పేట పోలీసోళ్ళొచ్చి అయ్యోరి చేతికి బేడీలు తగిలిచ్చకుంటే నాపేరు తీసి కడగా పెట్టి మెట్టుతో పదారు దెబ్బలు కొట్టు." అనే వాడు నాగరాజు, నిమ్మళంగా ఉన్నట్టుండి. మమ్మల్ని చావగొట్టే అయ్యోరి చేతికి బేడీలు పడబోవడం మాకెంతో కమ్మంగా వుండి, అదేదో యిలావరిగా తెలుసుకుందామని మనసు గుంజేది. "నాగరాజా, నాగరాజా ! ఏం జరిగిందిరా, చెప్పు చెప్పు" అంటూ ఎంతో ఇదిగా మేము వాడ్ని బతిమాలుకునే వాళ్లం. నాగరాజు అయ్యవారి సంగతి ఏం చెప్పకుండా, "నోరు – పుర పురా – అంటా వుండాది. అన్ని సెనిక్కాయలు పెట్ట" మనే వాడు. మారు మాట్లాడకుండా మా చేయి జేబులోకి పొయ్యేది. "అయ్యోరు వూళ్లో జరిపిచ్చే కతలన్నీ,... కతలు... పోలీసోళ్లకు తెలిసినాయి." అనేసి మళ్లీ చెనిక్కాయలు పెట్టమనే వాడు. వాడి చేతిలో అన్ని పెట్టి, "మళ్ల మళ్ల–" అనే వాళ్లం. "మళ్లా లేదు గిళ్లా లేదు. జీపు ఈ పాటికి నడవలూరు కల్లా వచ్చేసుంటుంది. పోదాం పదండి. పోలీసోళ్ల సందున పసి పిలకాయలం మనమెందుకు?" అని వెళ్లి పొయ్యే వాడు. వుత్తి జేబుల్తో మేం తలలు గీరుకునే వాళ్లం.

మా పిలకాయల బుడ బుడకలు పుష్పావతి అనే అమ్మి దగ్గిర ఎంత మాత్రమూ వాగేవి గావు. నాగరాజు ఒకసారి ఆ అమ్మినే బోల్తా కొట్టించి దోసిడు కారాసును పెట్టించుకుని తిన గలిగినాడు. వాడు ఎక్కడుంటే అక్కడ చింత కాయలు రాలినట్టుగా వుండేది. ఒంటికి రోగం పట్టినట్టుగా వుండే నాగరాజు ఎప్పుడూ తమాషాగా వుండేవాడు. ఇస్కూల్లో వాడి పక్కన కూర్చోవాలని అయిదో తరగతి వాళ్లు కూడా తపన పడే వాళ్లు. వాడి కుడి చెయ్యి ఒకడి పిర్రని గిల్లతా ఉంటే, వాడి ఎడం చెయ్యి ఇంకొకడి ఎంట్రుకల్ని పెరకతా వుంటుంది. గిల్లించుకున్న వాడు గానీ వెంట్రుకలు పెరికించుకున్న వాడు గానీ నాగరాజు అమ్మ, అక్కల జోలికి పోకుండా, మిగతా ఇస్కూలు పిలకాయల అమ్మలక్కందరి దగ్గరికీ పోయి వస్తారు.

వాడి కోతి చేష్టలు పసిగట్టిన అయ్యవారు ఒకరోజు వెదురు బెత్తంతో చావగొట్టేసినాడు. "సా...సా...సాసాసా...యింక కొట్టొద్దు సా–" అని అరచి కుప్పలు పెట్టేసినా అయ్యవారు విడిచే వాడు గాడు. అటువంటప్పుడు గూడా వాడు ఇస్కూల్లో పిలకాయల్ని నవ్వించే వాడు. "సాసా...ఇంక కొడితే సా వుచ్చలు పోసేస్తా..." అని అయ్యవారిని బెదిరించే వాడు. "ఇంత బయం వుండే వాడివి ఇస్కూల్లో కుదురుగా వుండలేవా? పిలకాయలందరికీ చాట చెవులోడు, గండు ముక్కోడు.. అని మారు పేర్లు పెడతావా?" (అయ్యవారికి గండోడు – అని పేరు పెట్టినట్టు ఆయనకు తెలవదు.) అంటూ అయ్యవారు బెత్తాన్ని ఆడిస్తూనే వుండే వాడు. "సా నిజంగా చెప్తా వుండా సా.. మళ్ల చెప్పలేదని అనుకునేవు సా.. అగ్గో, ఇంక గాన కొడితే ఉచ్చపోసేస్తా సా.." అని మమ్మల్నందర్నీ నవ్వించే వాడు. ఒకొక్క సారి నాగరాజు అయ్య వారి చేత దెబ్బలు తింటూనే ఊపిరి బిగ పట్టుకుని నవ్వేసే వాడు. "ఆ నవ్వాపు. నేను కొట్టడం ఆపతా." అని అయ్యవారు చెప్పినా కూడా వాడు నవ్వు ఆపలేక పోయేవాడు. అయ్యవారే చేతులు నెప్పి పెట్టినట్టుగా వదిలేసే వాడు. ఏ జంతువు ఏ రకంగా వుచ్చలు పోస్తుందో చెప్పి చెప్పి నవ్వించే వాడు. కుక్క పోసినట్లు పోయబోయి ఒకసారి వెల్లకిలా పడిపోయినాడు. అప్పుడు మా ఇస్కూలు పిలకాయలు జమున, పుష్పావతి, నాగేశ్వరి, భూలోక రంభలతో సహా నవ్వలేక చచ్చి సున్నమైనాము. నాగరాజు ఒట్టి పోకిరి మనిషేగాదు. వాడే ఒక రోజు 'చదువంటే అచ్చిరాలు గాదు, సరస్వతిరోయ్' అని చెప్పినాడు. తెలుగులోనే గాదు సాంగీక, సామాన్య, గణిత శాస్త్రాల్లో గూడా వాడికి బలే నేర్పు వుండేది. వాడు ఎంత తెలివైన వాడంటే ఒకసారి అయ్యవారు ఇస్కూల్లో ఒక విచిత్రమైన ప్రశ్న వేసినాడు. ఆ ప్రశ్న పాఠాల్లో వుండేది గాదు. "ఒక వేప చెట్లో ఎనిమిది గువ్వలుంటాయి. అయిదు గువ్వల్ని టుపాకీతో వేటగాడు నేల గూల్చినాడు. చెట్లో ఇంకెన్ని గువ్వలుంటాయి?" ఆ ప్రశ్నకి మేమెవ్వరం సరైన జవాబు చెప్పలేక పోయినాం. అందరమూ ఎనిమిదిలో నుంచి అయిదు తీసివేసి – మూడు గువ్వలుంటాయని చెప్పినాం. నాగరాజొక్కడు – గువ్వలు చెట్లో వుండవు – అని చెప్పినాడు. అంతటి తెలివిమంతుడు మా మాదిగ పల్లి నాగరాజు.

తూరూగా పుట్టే పొద్దు పరంటగా పుట్టినా ఇస్కూలు మాననని – మాకు ధైర్యం చెప్పే నాగరాజు ఒక రోజు ఇస్కూలుకు వచ్చి, "ఈ రోజే కడ, రేపట్నించి ఇస్కూలికి రానురే!" అని చెప్పినాడు. "ఒట్టి అపద్దాలు. నాగరాజు ఇస్కూలుకు

రాకుండా మానునా, ఏమి?" అనింది భూలోక రంభ. అప్పుడు నాగరాజు, "నిజ్జింతో, పచ్చనాకు సత్తెంతో" – అన్నాడు. వాడు సత్యాలు చెయ్యడం చూసి నిజమేనని అనుకుని, "ఏందిరా" అనడిగినాం ఎండి పోయిన పెదాల్తో. "ఏమి అంటే – ఏమి చెప్పుదురా? మా అమ్మా మా నాయిన ఇద్దురూ కలిసి నన్ను ఇస్కూలికి నిల్చి పొమ్మన్నారు. మా అమ్మా మా నాయినా ఇద్దురూ పనికి పోతారు గదా, మాకు రెండు ఆవుగొడ్లు వుండాయి గదా, మా అక్కకి పెండ్లయి పోయింది గదా, వాటిని అడవికి తోలుకుని పొయ్యేదానికి మనిషా? అందుకని నన్ను ఇస్కూలుకు నిలిచి పొమ్మంటా వుండారు, మా ఇంట్లో వాళ్లు." – మొకం నల్లంగా పెట్టుకుని చెప్పినాడు నాగరాజు. మా అందరికి నోట్లో తేమ లేకుండా అయిపొయ్యింది. "అందుకు నువ్వు ఒప్పుకున్నావా?" అనడిగింది జమున.

"ఒప్పుకోక ఏం జేసేది? అమ్మా నాయినోళ్ళ మాట కాదనేటందుకు వుండాదా? వల్లపడదు గదా! ఇంక నిలిచి పోవలసిందే" అనేసినాడు నాగరాజు. ఆరోజు ఒంటేలుకు బెల్లు కొట్టినప్పుడు నాగరాజుకు మా పిలకాయలు శానామంది అదీ ఇదీ పెట్టినారు తినేటందుకు. నాగరాజు అన్నీ తినినాడు. భూలోక రంభ, "నాగరాజా, నాగరాజా ! రేపట్నించి ఇస్కూలికి రావు గదా. మాకు కుశాల లేదు గదా. ఒరే ఒరే, కుక్క వుచ్చులు పోసినట్టు పొయ్‌రా." అని బతిమాలుకొనింది. నాగరాజు కాళ్లూచేతులు ఆడనివాడి మాదిర అయిపోయినాడు. వాడు మనిషికి మాదిరే నిలబడుకుని ఒంటేలు పోసు కున్నాడు. వాడి కుశాల అంతా ఏమయ్యిందో, వాడు గమ్మన వుండిపోయినాడు.

ఆ మరుసట్రోజు నుంచి మేం ఇస్కూలుకు వస్తా వుంటే నాగరాజు మాదిగ పల్లి నుంచి చంకలో చిక్కం, చేతిలో కత్తి పట్టుకుని ఆవుల వెంట అడివికి పోతూ కనిపించే వాడు.

# మా అమ్మ - బూమమ్మ

మాకు కష్టం చేసే అంత కయ్య వుండేది గాదు. మా ఊరికి తూరూగా ఒక ఎకరా, దచ్చినంగా అర ఎకరా, బంక చేను తప్పించి మాకు జానడు జాగా ఈ కలిగ్గం మింద ఎక్కడా లేదు. మా నాయిన తెల్లారీ తెల్లారక ముందర్నే మడకా కాడిమాను బుజాన బెట్టుకొని, ఎద్దుల్ని తోలుకొని దచ్చినంగా మడికాడికి పోతాడు గదా–పది గెంటలకంతా దున్నేసి యింటి కొచ్చేస్తాడు. "అప్పుడే దున్నేసినావా సామీ–" బిరీన ఇంటికి వచ్చేసిన మా నాయినతో అనేది మా అమ్మ. "మడక పిడి పట్టుకునే సంగతి నాకు తెలుసా? వచ్చి నేర్పియ్యేమి, నేర్చుకుంటా–" నంటా మా నాయిన నులక మంచం మింద యెల్లాలకల పడుకునే వాడు. అప్పుడు మా అమ్మ "నర మానుడికి దున్నే అంత కయ్య వుండాలరా. మనకు దచ్చినంగా ఇంగొక అర ఎకరా బూమి వుండుంటే ఎంత బాగుండు!" –పొడుగ్గా గాలి పీల్చుకొని అనేది. మాకు బూమి ఇంత కొంచిం వుండబట్టే మేము బలే బటువుగా సేద్యం చేసుకునే వాళ్లం. మా నాయిన మడక దున్నతా వుంటే మేము చాళ్లల్లో వేరుశెనగ పప్పు వేస్తాం గదా. ఆ రకంగా కొంగ్రలు వేసి మా నాయిన దున్నుతూ ఉంటే కయ్య నాలుగు మూలలా మూరడేసి యెడం కఱ్ఱు తెగక బీడు పొయ్యేది.

కయ్య అంతా పప్పు వేసేసినాక మా అమ్మ పార దీసుకుని, దోసిడు శెనగ్గింజలు కొంగులో పోసుకొని నన్ను పిలిచేది. కయ్యలో బీడు పోయిన ఆ నాలుగు మూలల్నీ మా అమ్మ పారతో కుళ్లగిస్తా వుంటే, ఆ మట్టిలో బిత్తెడేసి దూరానికి ఒక శెనగ గింజను పూడ్చి పెడతా వుండేవాణ్ణి. మా ఊళ్లో నాలుగు, అయిదు ఎకరాల బూములు కలిగిన వాళ్లు–ఆ మూలల్ని మా అంతగా గుర్తు పెట్టుకోరు. మా అమ్మ మటుకు, "ఆ మూలలు అర్నెల్లు ఎందుకు బీడు పోవాల? ఆ నాలుగు మూలల్లో మనం కొన్ని శెనగ్గింజలన్నా గుచ్చి పెడతాం గదా. అవి అన్నీ మొలిచి కాయలు కాస్తే ఎన్నయ్యేది!" అంటా లెక్కలు వేసి నాకు చెప్పేది. కయ్యల్లో శెనగపప్పు అంటే–మా ఇంట్లో వాళ్లం వేస్తాము. అడుసు మడిలో వరిపైరును నాటడం–మా అమ్మకు

తప్ప–మిగతా మాకెవురికీ చేతనయ్యేది గాదు. మేము అయిదు గుంటలే వరి మడి చేసినామనుకో. ఆ అయిదు గుంటల్లో మా అమ్మ ఒక్కటే వరి నారును నాటలేదు.

ఒక్కటే గూడా నాటును గాని, అందు కోసరం నాలుగు నాళ్లు పట్టును. నారుతో అంత ఆలీశం పనికిరాదు గాబట్టి మా అమ్మ మాలపల్లికి పోయి నలుగురు ఆడోళ్లను కూలికి పిలిచేది. వాళ్లు మా కయ్యిలో వొంగి నాటతా వుంటే మా అమ్మ బలే ఆగడం చేసేది. "తల్లులాలా, ఆర్నెల్ల పైరు. కొంచిం గుష్టి పెట్టుకొని నాటండి. కఱ్ఱ కొంచిం వొత్తుగా నాటండి. బీడు బెట్టబోకండి సాములాలా" అంటా మా అమ్మ వాళ్లను ఈ రకం మాటలతో ఉప్పున బెట్టి పప్పున పామేది. నిజానికి మా యమ్మ యెయ్యి జన్మలు కమ్మ కులంలో పుట్టినా మాలోళ్లంత నాణ్యంగా వరి నాటకం నాటలేందు.

వాళ్లు కయ్యిలో నాటతా వుంటే మా అమ్మ కయ్య గనిమ మింద గొంతు కూర్చుని గనిమ వారగా వరి నారును గుచ్చతా ఉండేది. కయ్యిలు దండిగా కలిగిన వాళ్ల గనిమలయితే మూరడు ఎడం వుండును గాని మా గనిమలు బలే సన్నంగా వుండేవి. కయ్యిల్లో సమ్మచ్చరానికి రెండు సార్లు పైర్లు పెడతాం మేము. పైర్లు పెట్టే ముందర మా నాయిన గనిమ వారలను పారతో నరికి కయ్యిల్లో కలిపేసే వాడు. దీంతో మా గనిమల మింద మాకు నడవడమే కష్టమై పోయింది. మా కయ్య గనిమలను అడ్డదోవ చేసుకొని మా ఊరిలో నుంచి గంగిరెడ్డి పల్లికి పోయే వాళ్లు – మా సన్నటి గనిమల మింద కాలు నిలవక, "గనిమల మింద కూడా పండించి దనమంతుడు కాబోతాడు ఈ నారప్ప"అని అనుకునే వాళ్లు. కొంతమందయితే అ గనిమల మింద నడవడం కుదరక, వేరుశెనగ మొలకలెత్తిన మా కయ్యిల్లో దిగి నడుచుకుంటా పోతారు. కయ్యిల్లో పడిపోయిన ఆ కాలి బాటను చూసి మా అమ్మ, "నానా జాతులకు పుట్టిన నా బట్టలు నా సవుతులు పైరు పండే కయ్యిలో కాలి బాట పెట్టేసినారు గదమ్మా. మొలకల మింద కాళ్లతో నడిచి బండ జేసేసినారు గదమ్మా. వాళ్ల కాళ్లల్లో పుండు బుట్టదా?" అని తిట్టేది. ఈ రకంగా తిట్టడం వల్ల గంగిరెడ్డి పల్లి మాలామాదిగోళ్ల దగ్గిర మా అమ్మ చెడ్డ పేరు కూడా ఎత్తుకొనింది.

మా అమ్మ అప్పుడప్పుడూ కష్టనిష్టూరాలను బూమమ్మతో చెప్పుకునేది. మా శెనగ తోట చీడ పట్టకుండా బాగా పండితే, "మనదేముండాది, కష్టం

తప్పు. అంతా బూమమ్మ దయ.” అనేది. కయ్యల్లో పచ్చంగా, నరగావు అడగతా వుండే మా పైరును జూసి మా అమ్మ నాతో, “సినబ్బా. నీకు సిన్నాయన్లు, పెద నాయన్లు లేరు. పిన్నములు, పెద్దములు లేరు. నీకు అవ్వల్ను, తాతల్ను సంపారిచ్చి పెట్టలేదు నేను. నీకొక సకాయం చేసేదానికి, మొండిగా వుండే నీ వొంటి మిందికి ఒక గుడ్డ పేలిక తీసిచ్చేటందుకు నీకు మేనమామ గూడా లేడు. (అందురూ వుండారు. వాళ్ల మింద మా అమ్మ అక్కుసు.) సినబ్బా, నాకు మనుసులు ఎంతో మంది ద్రోగం చేసుండారు, నా కష్టం తినుండారు. అగ్గో, ఈ బూమమ్మేరా, నేనంటే పడి సచ్చేది. ఈ చేతల్తో ఒక గింజను ఈ బూమమ్మ కడుపులో పెడితే, నాకు చాటడు గింజలు ఇస్తా వుండాది రా. దండం పెట్టు నాయినా” అని నా చేతులను జోడీ జేసి కయ్యా గాలవలకు దండం పెట్టించేది మా అమ్మ.

అయితే ఒక రోజు మా అమ్మ చేసిన సంగటీ కూరా మా అమ్మకే సగించలా. ఆమె చెట్టునీడన గబగబా సంగటి తినడం ముగించి, అరి చేతుల్తో బూమమ్మను తట్టి, నిష్టూరపోయ్, “నా బండెడు కండలూ నీకు దారాదత్తం చేసినానే, నాకూ నా బిడ్లకూ వొంటి మిందికొక గుడ్డా, కడుపు నిండికి అంత కూడా!” అని ఎండలో పడి కయ్యలో మునం పట్టింది మా అమ్మ.

# బండెడు కష్టం చేసినా...

ఉన్నట్టుండి మా పిలకాయలకు జ్వరాలు వచ్చేవి. బేదులు పెరుక్కునేవి. అమ్మవారు పొడ సూపేది. వూళ్లోని మా బోటి చిన్న పిలకాయలందరికీ ఏదో ఒక జబ్బు వచ్చేది. ఇదే మాదిర మా గొడ్డూ గోదకు కూడా రోగాలు దాపురించేవి. బొబ్బోబ్బో–మని ఇల్లంతా తిరుగులాడే కోడి క్షణంలో ముడుక్కొని కొక్కరించేది. శేరు పాలను పిండిన ఎనుము కడుపు వుబ్బ వేసుకుని గడ్డిని మూచూడకుండా పోయేది.

ఇటువంటి కానీగాని పరిస్తితులకంతా కారణం వూళ్లోకి గంగమ్మ జొరబడి కోపగించుకోవడమని మా పెద్దోళ్లు నమ్మేవాళ్లు. అప్పుడు మా వూరి పెద్దోళ్లు 'చల్ల' పోయాలనుకుంటారు.

మా వూరికి నడీ మధ్య వుండే భజనగుడికి (పడమర) నాలుగు బారలకు అవతల గంగమ్మ మిట్ట అనే చోటు ఒకటి వుండేది. అక్కడ నాలుగడుగుల పొడవాటి పలచని బండ ఒకటి ఉండేది. అదే గంగమ్మ మిట్ట.

అక్కడ మంగళవారం పూట చల్ల పోసేవారు. ఆ మాదిరిగా నాలుగు మంగళ వారాలు చల్ల పోసే వారు. సోమవారం సాయంకాలమే మా వూరి తోటివాడు (చెంగయ్య) వూరి వీధుల్లో వరి ఎంట్లకు వేపమండలు, నల్లేరు మొక్కలు గుచ్చి తోరణాలు కట్టేవాడు.

తోరణాలను చూసి 'రేపు వూళ్లో చల్లపోస్తారు రోయ్' అని మా పిలకాయలం కుశాలతో ఎగిరేవాళ్లం. మంగళవారం పొద్దు నాలుగు బారలు ఎక్కే సరికి, మా వూరి గంగమ్మ మిట్ట మీద పెద్ద కడియాల అండాకు పసుపు, కుంకుమ బొట్లు పెట్టి, అండా చుట్టూ మాడాకులు కట్టి వుంచే వాళ్లు. మా వూరి ఆడోళ్లు మొఖాలు కడుక్కొని కుంకుం బొట్టు పెట్టుకుని, వచ్చి అండాలో చద్ది నీళ్లను పోసేవాళ్లు.

మా అమ్మ కూడా ఒక ముంతలో అన్ని కూటినీళ్లు పోసుకుని గంగమ్మ మిట్ట కాడికి బయలుదేరేది. ఆ ముంతలో నేను చేయి పెట్టి చాలా దఫాలు చూసినాను. ముంతలో గంజినీళ్లు వుండేవే గాని నాలుగంటే నాలుగు మెతుకులు

వుండేవి గావు. మా ఇంట్లో ప్రతీ తెల్లారి పూట చద్ది సరిపోయేటట్లు కూడా వుండదు. అయిస్కూలు చదివే మా నాగులన్న గొంతులో అన్ని కూట్నీళ్లు పోసుకుని, చేతికి తగిలించుకొనే కేరియర్లో మద్యానం తినడానికి అన్ని కూట్నీళ్ళ మెతుకులతో ఎనిమిదిగంటలకంతా పొరుగూరు (కట్టకింద వెంకటాపురం) వెళ్లి పొయ్యేవాడనుకుంటా. మా నాయిన కూడా వుత్తుత్తి కడుపుతో మోట బానను మోసుకుని చురుకు లేని బక్క ఆవులను తోలుకొని కయ్య కాడికి పొయ్యేవాడు.

గంగమ్మ మిట్ట కాడ అండా వుప్పు లేని చద్ది కూడుతో నిండి పోతుంది. అపుడు పిలకాయలందరికీ కడుపు నిండా కుశాల.

చద్ది తాగవచ్చు గదా.

వుప్పులేని చద్దన్నం మూడు గుక్కలు కూడా తాగలేము. మా వూళ్లల్లో చల్ల అంటేనే – వుప్పు లేని చద్దికూడాయనే!

మా పిలకాయలు తెలివి మీరినోళ్లం. చిటికలు వేసి ఎప్పుడో ప్లాన్లు కూడా వేసి పెట్టుకున్నాం. రెండు ఎండు మిరపకాయలను కాల్చుకున్నాను. పిలకాలయమంతా దోసిళ్లు పట్టుకొని కూర్చున్నాం.

చల్ల తాగే వాడ్ని. కడుపు ఫిట్టుగా అయిపొయ్యేది. చిరుగుల చొక్కాయి ముందుకు తోసుకు వచ్చేది. చద్ది ముక్కలాన వుండేది. కడుపు పగిలిపోతిందే మోనని భయం వేసేది. గంగమ్మ మిట్టకాడ గొంతు కూర్చుని అట్లాగే వుండి పోదామనిపించేది.

చల్ల పోయడం అయిపోతుంది. పైకి లేవడం వుక్కిష్టంగా వుంటుంది. చల్ల తాగేసి నేరుగా ఇండ్లకు పోకూడదు. వూరి బయట వుండే తూర్పు బావి దగ్గరకు లబ లబామని నోరు కొట్టుకుంటూ పరిగెత్తతా పోయి చేతులు కడుక్కోవాల.

నడవడమే కష్టం అయిపోతుంది. ఏ రీతిగా పరిగెత్తుదును?

ఈ కడుపు నిండిన బాధ బలే కులుకుగా వుండేది.

మా పిలకాయల గుంపు, పరుగు తీస్తా వుంటే నేను బొజ్జ భారంతో మెల్లిగా అడుగులేసుకుంటూ మునక్కడగా పోతావుంటే దార్లో మా వూరి

పెద్దోళ్లు ఒకరిద్దరు నన్ను, "ముండ నాయాలా! ముక్కలాన చద్ది తాగకుంటే ఏమి?" అని ఎగతాళి ఆడే వాళ్లు.

తూర్పు బావి దగ్గర్నించి ఇంటికొచ్చే సరికి కడుపు కొంచిం వెలితి పడి భలే హాయిగా వుండేది. అపుడు నేను, "అమ్మా, అమ్మా, నా నోట్లో యేలు పెట్టు. నీ యేలికి చద్ది తగలకుంటే అప్పుడు నన్నడుగు." అనే వాడ్ని మా అమ్మతో.

"రోజూ తెల్లారి తెల్లారి ఇదే మాదిరి చద్ది తాగితే నేను ఇంతకు రెండింతల లావై బలిసిపోనా అమ్మా!" అని అడిగే వాడ్ని.

అప్పట్లో మా అమ్మ నా నిండిన కడుపును తడుముతూ నన్ను దగ్గరికి తీసుకోని, "దినుమ్మా ఇంట్లో నిండాల్సిన నీ కడుపు ఈ రోజు వీధిలో నిండిందా నాయినా! బగమంతుడా! బండెడు కష్టం చేస్తా వుండానే, నా బిడ్డి కడుపు నా ఇంట్లో నిండనిస్తే నువ్వు వోర్చుకోలేవా?" అనింది, మొఖం చిన్న బెట్టుకోని.

# అన్నం మాకెంతో పిరిం

మా అమ్మ పెండ్లిండ్లకూ చావులకూ అంతగా పొయ్యేది గాదుగాని – దినాలకు మాత్రం టంచనుగా ఆజరయ్యేది. కయ్యల్లో ఎంత పని వుండినా మద్యానం పూట గెంటా గెంటన్నర తీరిక జేసుకుని ఆ కార్యానికి పోయి వచ్చేసి మా నాయిన చేతి నిండికీ వక్కాకు యిచ్చేది. దినానికి పోయేటప్పుడు మా అమ్మను మా నాయిన బలే తిట్టేవోడు. "నియ్యమ్మా ముత్తరాశి నాయాలీ ముండా. దినానికి పోవద్దే అని ఒక్క రోజు నిన్ను మెట్టుతో కొట్టేది! నీకు ఈనం మానం లేదా? అంత దూరం నడిచి పోయి ఆ కూడు తినేసి వచ్చే దానికి? ఛూఛూ. మాడు చెక్కలు తిని, మంచినీళ్లు తాగినా మానంగా బతకాల్నే!" అనేవాడు మొకం రోతగా బెట్టి.

మా అమ్మ ఆ తిట్లకు యిదై పోకుండా, "నువ్వు కొంచెం తగ్గు మామో! నువ్వు శానా దూరం పొతుండావే, ఎంత దూరం పోయినా మళ్లీ తిరిగి రావాల్సిందే గదా! కొంచెం తగ్గు నా మేనమామ కొడకా!" అంటూ వక్కాకును మా నాయిన చేతిలో పెట్టేది. మా నాయిన ఆ వక్కాకునందుకుంటూ ముసిముసి నవ్వులు నవ్వే వాడు. "దినం బెమ్మాండంగా జరిగింది. ఓయమ్మో ఎంత జనమో! మూట బియ్యమన్నా చలవ అయ్యుంటాయి. ఎక్కడెక్కడోళ్లో వచ్చినారు దినానికి. వాళ్లంతా కూడు లేక వొచ్చినారా ఏమి? ఇంక పోతే ఉద్దిపప్పు వడలు రెండు వేసినారు. ఒకటికి మూడు మాట్లు ఇంతేసి కూడు (చేసే పని చాలించి రెండు చేతుల్తో చూపించేది.) వేసినారు. చేమాకు పుల్లగూర, వుల్లగడ్డ తాళింపు, రసం, మజ్జిగ, ఇంతకు మించిన బోజినమా నువ్వూ నేనూ తినేది? దినం బాగా జరిగింది. వీదిలోకి వచ్చి కుచ్చున్న మాలా మాదిగోళ్లకు కూడా – లేదని తిప్పి పంపించకుండా వేసినారు." అని మా అమ్మ బారడు పొడుగు చెప్పుకుంటూ పోయి, ఒళ్లో నుంచి అప్పుడనంగా రెండు ఉద్దిపప్పు వడలు తీసి నాకొక్కడికీ ఒకటిచ్చి, మిగతాది మా అన్నకూ మా అక్కకు అంతంత తుంచి పెట్టేది. మా నాయినకు ఇదంతా సయించక, "నేను వామిలోకి పోయి ఎద్దుల్ని (చెనిక్కాయలను మేము కండ్ల జూసినాక ఆవుల్ని అమ్మేసి ఐదున్నర జానల ఎద్దుల్ని పట్టుకోగలిగినాము) నీళ్లు తాపేసి వస్తా." అంటూ మా నుంచి

దూరం అయిపొయ్యేవాడు. పోతున్న మానాయిన్ని చూసి మా అమ్మ, "మీ అయ్య బలే మానస్తుడు రా." అనేది. అంతలోనే మా అమ్మ మా అక్కకల్లా తలతిప్పి, "సంగటి ఏమన్నా మిగిలిందా ఏమి?" అని అడిగేది. "నువ్వే చెప్పితివి గదా – 'నేను దినానికి పోతాను తల కొట్టేసి రెండు మానికల బియ్యం వెయ్యమని,' చేసిన సంగటి సరీ పొయ్యింది" అని మా అక్క చెప్పడంతో మా అమ్మ నిమ్మళ పడేది.

ఒక రోజు – చంద్రగిరికా పక్క మా కమ్మ కులంలోనే ఒక మనిషి చచ్చిపోతే దినం జరగతా వుండింది. మా వూరికి ఆయన వస్తా పోతా వుండిన మనిషి. అదే రోజున మా వూరికి ఒక్క మైలు దూరంలో వుండే రామాపురంలో ఇంకొక దినం జరగతా వుండింది. రామాపురంలో అంతా రెడ్లు. రెడ్లకూ మాకు ఒకరి మొకాలొకరికి తెలుసునే గాని బందుగులు మాత్రం కాము. మా నాయుడి దినానికి మా వూరోళ్లు శానా మంది ఎలబారినారు. ఒకాడామె మా గడప మీద కాలువేసి, ఇంకో కాలును వీదిలోనే పెట్టుకొని, "చినక్కా దినానికి రావా?" అనింది. ఇంగొకామె, "చినక్క సంగతి నీకు తెల్దా? శార్జీ నువ్వు పెడితే చంద్రగిరికి వొచ్చి తినేసి వొస్తింది. లేకుంటే కాలి నడకన రామాపురం పోతింది. శార్జీ నువ్వు పెడతావా, రారా!" – మా అమ్మ మొకాన్నే అనేసింది. వాళ్లట్ట పోగానే మా అమ్మ, "మీరు పొండే లంజ నా సవుతులాలా, దినానికొచ్చిన మొగోళ్లకు కోకచ్రైకలు చూపించను పోతా వుండారు మీరు. మీతో నాకేం పని?" అనేసి ఎంగిలూంచింది. ఆ మద్యానం మా అమ్మ మా అమ్మబోటి ఆడోళ్లతో రామాపురం పోతూ పోతూ నన్ను కూడా తోడుకుని పోయింది. అక్కడ నేను తొలిసారిగా అప్పళాన్ని, తిరగబోత పెట్టిన మజ్జిగలో కరింపాకును చూస్తిని. మా అమ్మ పసి పిల్లవాడైన నాకొక్కడికీ ఒక్క విస్తరాకు వేయిస్తూ వుంటే బంతిలో వుండిన ఒకాడామె నవ్వాపుకోలేక పోయింది.

(నాకీ నడుమ పెండ్లయింది. నేను నా భార్య వాళ్ల ఇంట్లో వుండగా మా అమ్మ కాలి నడకన నా దగ్గరికి వచ్చింది. నన్నూ మా అమ్మనూ చాప మీద కూర్చున బెట్టి నా భార్య ప్రభావతి మా ఇద్దరికీ చెరి – ఏడెనిమిది ఉద్దిపప్పు వడలు వేసి దోసిడేసి కొరమేను చేపలు పెట్టింది. ప్రభావతి బయట పడగా మా అమ్మ నా చెవిలో, "నీ పెండ్లానికి యింత పెద్ద చెయ్యి పనికి రాదురా

సామీ.” అనింది నవ్వి. ఎంతో కుశాలతో తింటూ వుండగా మా అమ్మ, “రోజూ ఈ మాదిరిగా గాన తింటే యింక ముప్పైయ్యేండ్లు బూమమ్మకు సేవలు జెయ్యనా?” అనింది, ఆమె గిన్నెలో నుంచి నా గిన్నెలోకి ఒక చేప తునకను ఎత్తి వేయబోతూ.)

# ఎండలో దీనురాలు

మద్యానమైతే చాలు, "నేను రాను పో!" అని కొండెక్కి కూర్చునే వాడ్ని. జమున, "ఒరే రారా రేయ్!" అని అడుక్కునేది. "నువ్వు లచ్చి రూపాయలు నా కాళ్లకాడ కుమ్మరించినా, ఆ ఎండలో నీతో కూడా రానమ్మీ!" – అని నేను ఎంతో బిగించుకునే వాడ్ని.

అప్పుడు జమున నిష్టూరంగా, "అంతేలేబ్బా, సుబ్రమణెమా, నువ్వు ఈ జమునతో కూడా వస్తావా? ఆ భూలోక రంభతో అయితే పరిగెత్తతావు!" అనేది. భూలోక రంభ ఎక్కడ ఉంటే అక్కడే వుండేవాడ్ని నేను. ఆ అమ్మి ఇల్లు, మా ఇల్లు పక్క పక్క గావడం వల్ల వీధిలో బండాట మొదలు, తోపులో కోతి కొమ్మచ్చి దాకా ఆ అమ్మితోనే ఆడేవాడ్ని. మా పిలకాయలకూ నాకూ తగరాదులు వచ్చినప్పుడల్లా, వాళ్లు నన్ను, "ఆహా, భూలోక రంబా! ఓహో, భూలోక రంబా! ఎక్కడబ్బా నీ పెళ్లాం భూలోక రంభా?" అని ఎగతాళి చేసే వాళ్లు. ఈ ఎగతాళి నాకు పెద్ద చెర అయిపోయింది. పెద్దపెద్ద వాళ్లు కూడా నన్నూ భూలోకనూ చూసినప్పుడు ఇదే వరస. భూలోక మాత్రం, "అనుకోనీలే. కొండను చూసి కుక్క మొరిగితే కొండకు చేటా, కుక్కకు చేటా?" అని నన్ను ఓదార్చేది.

జమున నన్ను ఏమి అనాలో అది అనే సరికి నేను జంకినాను. "మ్మే, జమునా పాపం పుణ్ణెం తెలవకుండా ఆ మాదిరిగా అనొద్దు. ఇపుడు నేను నీతో కూడా వస్తా వుండాను. వచ్చినంత మాత్రాన మనిద్దరం మొగుడూ పెళ్లాలం అయిపోతామో! అబ్బ యీ వూరంత యిచ్చిత్రపు వూరును ఎక్కడా చూళ్లేదబ్బా, నాశనం–" అంటూ జమునతో కదిలినాను.

పాపం జమునకు ఇదొక పెద్ద గాచ్చారం. వాళ్లకు ముప్పై నలభై దాకా గొర్రెలుండేవి. ఆ గొర్రెల కాడికి వాళ్ల అత్త పొయ్యేది. ఆమె గొర్రెల దగ్గిర వుంటే మద్యానం పూట జమున సంగటి ఎత్తుకు పోవాల. పదకొండున్నరకు ఇస్కూలు బెల్లు కొట్టేస్తే పన్నెండు గంటలకంతా జమున సంగటి తినేసి, అత్త సంగటిని సత్తు గిన్నెలో నెత్తిన పెట్టుకుని తోడు కోసం పడి చస్తుంటాది. అవును, తోడు లేకుంటే కష్టమే. మిట్ట మద్దేనం, నడి రాత్తిరితో సమానమంట. దెయ్యాలుంటాయి. ఒక రోజు జమున తోడు దొరక్క ఒంటిగా పోతా వుంటే

తాటిచెట్టులో నుంచి ఎండు మట్ట ఒకటి గలగలమని శబద్దం చేస్తా పడిందంట. అప్పుడు జమున 'రామ రామా!' అని మనసులో అనుకున్నా కూడా ఆ అమ్మి గుండెలు భయంతో నీళ్లయి పోయినాయంట. ఎవరిదైనా ప్రాణమే గదా. మిట్ట మద్దానం పసిబిడ్డ ఒంటిగా...

మా వూరి బాట దాటి బస్సు బాటలోకి వచ్చినాం. బాట నిండా పుల్ల దుమ్ము. పుల్లదుమ్ములో కాళ్లు బలే కాలతాయి. మా తలల్లో చమురు లేక పోవడం వల్ల తలా కాళ్లూ మాడి పోతా వుండాయి. 'స్, అబ్బా, స్, అబ్బా!' అని అనుకుంటూ నడిచినాము. "మీ అత్త గొర్రెల్ని ఎక్కడ మేపతా వుంటింది జమునా!" అనడిగినాను. "రంగారెడ్డి మిట్టల్లో!" అని చెప్పింది. రంగారెడ్డి మిట్టలకు వచ్చే సరికి జమున నెత్తిమీది సత్తుగిన్నెని పట్టుకుంటే చేతులు బొబ్బలు కట్టినాయి. రంగారెడ్డి మిట్టల్లో ఒక చిగురించిన చింతచెట్టు కింద సత్తుగిన్నెను దించి చూట్టూతా చూసినాం. ఎగుడు దిగుడుగా వుండే ఆ బీడులో జమున వాళ్ల గొర్రెల జాడే కనిపించ లేదు. జమునకు వాళ్ల అత్త మీద బలే కోపం వచ్చింది. "కనిపించనియ్యి, నా సవితిని తన్నేస్తాను. మద్దానం మిట్టల్లో వుంటాను – సంగటి తెమ్మని చెప్పి ఎట్టనో పోయింది. ఇప్పుడెట్ట? ఈ ఎండలోఎక్కడని ఎతుకుదుం?" అని జమున దిగులు పెట్టుకొనింది. రోడ్డు బాటలో ఒకాయన నెత్తిన పైగుడ్డ వేసుకుని వస్తా వుండినాడు. జమున ఆయన్ని, "య్యో, ఒక ముండమోపి ఆడది అక్కడెక్కడన్నా గొర్రెల్ని మేపతా వుండిందా?" అని అడిగింది. ఆయన జమున కల్లా అదొాక మాదిరిగా చూసి, "రెడ్డోరి తోపులో ఒక తెల్ల గుడ్డలామె వుండింది." అని పోబిడి చెప్పినాడు. రెడ్డోరి తోపులో జమున వాళ్ల అత్త కనిపించింది. జమున తిడతాదేమోనని, "మిట్టల్లో గొర్రెలు నిలవలేదు జమునమ్మా. అవి నిలుకు లేకుండా పరిగెత్తతా వుండాయి!" అనిందామె ఎండుకు పోయిన పెదాల్తో. అత్త జమున నోటికి బయపడడం చూసి జమున తిట్టలేదు. సత్తు గిన్నెలోని సంగటి ఎండకు వుడుగ్గానే వుండి, పొక్కులు గట్టి పోయింది. సంగటి మీద వుండిన గోగాకు వూరుబిండి పెంకు మాదిర అయిపొయ్యింది. ఆ సంగటిని, ఆ వూరుబిండినీ అరి చేతుల్లోకి తీసుకునింది జమున వాళ్ల అత్త.

ఆమె ఆ పొద ఎండలో వెలగ చెట్టు కింద గొంతు కూర్చుని తినబోతుండగా ఒక్క సారి గొర్రెలకల్లా చూసి, మళ్లీ పైకి లేచి, "ఈ సంగటినన్నా ఈ గొర్రెలు

నన్ను తిననీబోతాయా?" అనేసి ఎండలోకి నడిచింది. ఆ రోజు ఆమెను గొర్రెలు ఏడిపించిన తీరు చెప్పనలవి గానిది. ఎక్కడ చూసినా ఎండేగాని పచ్చిక కనబడక గొర్రెలు ఒక చోటున నిమిషమైనా వుండ లేదు. అవి డొక్కల్ని దిగ వేసుకుంటూ, ముక్కుల గుండా వూపిరిని గస పోసుకుంటూ ఆ పక్కకూ ఈ పక్కకూ పరుగులు పెట్టినాయి. అర చేతుల్లో సంగటి పెట్టుకొని వాటి వెనకబడి వాటిని ఒక చోట నిలవేయకుంటే, అవి పరిగెత్తతా పోయి చేనుల్లో పడతాయి. జమున వాళ్ల అత్త ఆ రోజు గొర్రెల వెంట పరుగులెత్తుతూనే తినవలసి వచ్చింది. గొర్రెలు ఒకచోట కాసేపు నిలిస్తే బాగుండుననిపించింది నాకూ జమునకూ. "నువ్వు తినత్తా. మేమిద్దరం గొర్రెల కాడ వుంటాం." అని జమున అనిందే గాని మేం ఆ గొర్రెల్ని ఆపలేక పోయినాం. ఎక్కిళ్ళకు సొరకాయ బుర్రలోని నీళ్లు తాగాలన్నా వీలుగాలేదు, జమున వాళ్ల అత్తకు. నారతో పదారు ముళ్లు వేసినా తెగిపోయిన చెప్పులను ఒక చేతిలో, పరుగులు తీస్తూ తినినా ఇంకా మిగిలిన పిడికెడు ఎండు సంగటిని ఇంకొక చేతిలో పెట్టుకొని, చెప్పిన మాట వినకుండా ఎండలో పరుగులు తీస్తున్న ఆ ముండా గొర్రెల్ని చూస్తూ–

"ఛూ, ఈ మానం చెడ్డ బతుకు బతికే దానికన్నా నీళ్లు లేని బావిలో గుబుళ్లుమని దూకి నడుములిరిగి చస్తే ఏమి?" అనింది, జమున వాళ్ల అత్త.

అప్పటికే మా ఇస్కూలు బెల్లు గణగణ మనడం వినిన జమున, "ఈ ఎండలో ఇంత దూరం వచ్చి రోజూ నీకు సంగటి తేలేను తల్లీ, ఇంత లేటా? – అని ఇప్పుడా గండయ్యోరి దగ్గిర దెబ్బలు తినాల." అంటూ అత్త మీద అలిగి కండ్ల నీళ్లు పెట్టుకోబోయింది.

# మా గడపెక్కిన కత్తెరపల్లాయన

మా ఇంట్లో ఎంత మంది వుంటే అంత మందిమీ ఒంటి మీదికి సరిగ్గా గుడ్డల్లేకుండా అల్లాడే వాళ్లం. మా నాయినకు రెండు ఎనిమిది మూర పంచెలు వుండేవి. సందేళ సందేళ ఒంటికి నీళ్లు పోసుకునేటప్పుడు పంచె విప్పిన మా నాయిన చిరుగుల్ని చూపించి, “ఇది మనం చెడ్డ బతుకు గాదో?” అని మా అమ్మతో అనే వాడు! “నువ్వు కొనిపెట్టిన పట్టు కోకలు టంకు పెట్టిలో మూలగతా వుండాయే!” అని మా అమ్మ ఈ రకంగా మాట్లాడే సరికి మా నాయిన మారు పలక్కుండా నీళ్లు పోసుకుని మళ్లీ ఆ మాసిన పంచెనే అతి జాగ్రత్తగా (చిరుగులు గదా!) గోచీ పెట్టుకునే వాడు. అప్పట్లో మా అన్న, “నాకొక వైటు పాంటూ, వైటు సరట్టూ తీసియ్యకుంటే నేను పరీచ్చలు రాయను.” అనేవాడు. “అదెవుతో, మజ్జిక్కి గతి లేనిది, పెరుక్కు చీటీ రాసి పంపించిందంట. మనకెందుకు నాయినా పయ్యింట్లు? పంట మాసూలు రాగానే మందంగా వుండే ఒక నిక్కరా ఒక చొక్కాయా కుట్టించుకుంటే చాల్దా?” అని సర్ది చెప్పేది మా అమ్మ.

అప్పట్లోనే పండగ నెల పెట్టి వుండింది. మా అక్క ఈడు ఆడపిల్లలంతా గొబ్బీలు తట్టతారు. మా అక్క ఒక సందేళపూట మా అమ్మ చేత జడ వేయించుకుంటూ, “రేప్పండగ పూట గొబ్బీలు తట్టాల. ఈ పాత గుడ్డల్తో సచ్చినా తట్టను. సిలక పచ్చ పైట, సిలక పచ్చ పావడా, సిలక పచ్చ రైకా తీసియ్యకుంటే...” అని మా అక్క గుక్క తిప్పుకోకుండా యెచ్చరిక జేసేది. మా నాయినే గుడ్డల్తీసియ్యమని అడిగినప్పుడు యింక నేను మాత్రం వుంటానా? “రేపో ఎల్లుండో ఇస్కూలికి ఇనస్పెట్రు వస్తాడంట. నా మాట అపద్దమైతే అయ్యవార్ని అడిగి కనుక్కో. ఇనస్పెట్రు ఇస్కూల్లోకి వచ్చినప్పుడు సింపిరి గుడ్డలు వేసుకుని వుండినామో మన వీపు విమానమ్మోత మోగితిందంట. అయ్యోరు గట్టిగా చెప్పినాడు.” మా అమ్మ గెడ్డం పట్టుకుని ఒద్దికగా చెప్పే వాడ్ని.

మా అందరికీ అన్నాలు వేస్తూ అనేది మా అమ్మ: “బిచ్చిగత్తె మాదిర ఇంక నేనీ కోకలు కట్టుకోలేను. మీ నామిని జాతి అంత విడిచి పెట్టిన జాతి ఇంకొకటి వుండదు. మీ ఇంటి ఆడది ఒక్కలు ముక్కలుగా వుంటే మీకు మన సెట్ట ఒప్పుతా వుంది? నాకు రెండు నేత కోకలు - ఆరు మూరవి - తీసియ్యండి.”

ఈ మాటలకు మా నాయిన – ఉడత పిల్ల కిచకిచామన్న రీతిగా – ఆయనలో ఆయనే నవ్వుకునే వాడు. అప్పుడు మా నాయిన, "మా జాతిని గాన తిడితే మెట్టు దెబ్బలు తింటావు." అంటూ మా అమ్మకు యెచ్చరిక జేసేవాడు. అది తిట్టేగాని, బలే ముదిగారపు తిట్టు. మా నాయిన మా అమ్మను దబాయించి తిట్టి, అవసరమైతే కొట్టలేదని కూడా మా అమ్మ (నిజంగా) బాద పడేది. మా నాయిన కడుపు నిండికీ అన్నం తిని, నోట్నిండికీ వక్కాకు వేసుకుని నములుకుంటూ, ఎనిమిది మూర పంచెని మాటి మాటికీ ఎగగట్టు కుంటూ, ఆ భుజం మీదికీ ఈ భుజం మీదికీ పై గుడ్డను మార్చుకుంటూ భజనగుడి దగ్గరికి పోయి, తిన్నె మీద కూర్చుని, అందరాల బీడీ ముట్టిస్తే బాగుండునని మా అమ్మ మా నాయిన గురించి మదన పడుతూ వుండేది.

ఒక రోజు ఒక పండగ పూట మా నాయిన చేతికి రెండు రూపాయలు ఇచ్చి (సారాయి) తాగేసి రమ్మనింది. మా నాయిన ఒద్దంటే, "మొగోడి లచ్చినాలే లేవే!" అనింది. ఆ మాటతో మా నాయిన ఆ రోజు తాగేసి వచ్చినాడు. అయితే ఆయన వికారంగా మాటల్లోకి దిగకుండా మంచం మీద ముసుగేసుకుని పడుకున్నాడు. పడుకుని వుంటే మా నాయిన్ని చూసి మా అమ్మ, "నా మొగుడంత తిక్కలోడు ఈ కలిగ్గాన వుండునా?" అనింది. అది సుతా మా నాయిన తాగింది లేదు, మా అమ్మ ఎంత పోరినా.

కత్తిరపల్లి నుంచి ఒకాయన మా వూరికి గుడ్డల మూటను నెత్తిన పెట్టుకొని అమ్మడానికి వచ్చేవాడు. ఆయన గుడ్డల్ని అప్పులకు కూడా ఇచ్చేవాడు. ఆయన ఊళ్లోకి వస్తే చాలు ఆయనకి బలే గిరాకీ, మర్యాదా వుండేవి. పిలిచిన వాళ్లకు పలకలేక ఆయన చచ్చే వాడు. ఒకసారి నేనూ మా నాయినా కయ్యి కాడి నుంచి తిరిగి ఇంటికి వస్తూ వుంటే కత్తిర పల్లి మనిషి అగుపించినాడు. "అయ్యా, అగ్గో, కత్తిరపల్లాయన!" అని మా నాయినకు చూపించినాను. మా నాయిన నిష్టూరమూ, నా ఏడుపూ మా అమ్మ చేత – రెండు గుడ్డ పేలికల్ని కొనిపించలేక పోయినాయి.

ఆ సారి మాకు పదైదు మూటల వడ్ల గింజలు పండినాయి. తిరపతి నుంచి బొమ్మలాయన అని ఒక యాపారస్తుడు మా వూర్లో గింజల్ని కొలుచుకొని పొయ్యేవాడు. ఆయనకు పది మూటలు మేము అమ్మినాము. నలభై పదులు

నాలుగువందల రూపాయలను మా అమ్మ బొమ్మలాయన చేతినుంచి తీసుకొని రెండు కండ్లకూ అద్దుకొనింది. ఆ మరసనాడు కత్తెరపల్లాయనను మా అమ్మే మా ఇంటికి పిలుచుకొని వచ్చినప్పుడు గూడా మా నాయిన ఉడత పిల్ల కిచకిచమన్న రీతిగా నవ్వినాడు.

# మా నాయిన మూర్తం పంచ

పెండ్లి మూర్తానికి మా అమ్మకు– మా నాయినోళ్లు పెట్టిన మూర్తం కోక యాడ బొయ్యిందో గాని– మా అమ్మోళ్లు మా నాయినకు బెట్టిన మూర్తం పంచె మాత్రం (ఈ రోజుటికీ) మా టంకు పెట్టిలో బద్రంగా వుండాది. మా అమ్మ ఎప్పుడు టంకు పెట్టి తెరిసినా– ఆ పంచిని చూసుకునేటందుకు నాకీ రొండు గండ్లూ చాలేవి గావు. ఆ పంచిని గట్టుకొని మన నాయిన ఒకప్పుడు పీటల మింద కూచ్చున్నాడా– అని తలుచుకుంటేనే యిచ్చిత్రంగా వుండేది. నిజ్జింతోనే దాని సోకు చెప్పనలివి గానిది. దాని రంగు పచ్చనా– అంటే, పచ్చన గాదు. ఒక్క పచ్చనలోనే రకరకాల రంగులు వుంటాయి గదా. ఆ రంగుల్లో ఏదో ఒక రంగుతో వుండేది మా నాయిన మూర్తం పంచె. మనం ఎంచ లేక చస్తామే గాని, ఒకేళ ఎంచనే ఎంచితే– ఆ పంచ మింద లచ్చా తొంబైయ్యారు గళ్లన్నా సన్నవీ బన్నవీ వుంటాయి. ఆ ఎనిమిది మూర పంచెలో – పంచ సరిగంచు చూస్తేనే కడుపు నిండి పోతా వుండేది. పంచ పుట్టక పుట్టినా అంత సోకు గలిగి వుండే దాని మింద– అంతంత పొడుగు మీసాలతో తిరుగులాడడానికి వాటికి మనసెట్ల వొప్పుతా వుండాదని నేను బొద్దింకల మింద ఎక్కడ లేని నిష్టూరంతో వుండే వాడ్ని. అప్పుడెప్పుడో ఒక దపా రాజ్జి పరిపాలన జేసే నెకురూ తిరపతి కల్లా వొచ్చి వుంటే మా నాయిన అదే పనిగా పోయి చూసొచ్చిన సంగతిని చెప్తా వుండేవాడు. మా నాయిన చూసొచ్చిన పాపం పున్నెం అదొొక్కటిగానే వుండేది.

“సినబ్బా, నెకురూను గాన నువ్వు జూస్తే ఏమందువో రే! ఎల్లకాలం నెయ్యాకూడు తిన్నోడు గదా. చెంపలను గాన గిల్లితే – మర్రి చెట్టులో నుంచి గారినట్టు పాలు కారతాయనుకో. ఆ మహన్నబావుడు మన మాదిరిగా ఏ పొద్దన్నా నొష్టన చెమట దీసి యిసిరేసి వుంటాడా!” అని నాకు తెలవని అదెవురో ఒకాయనను గురిచ్చి మా నాయిన ఆ రీతిగా చెప్తా వుంటే నేనే మాటా నోట బెట్టకుండా వినుకుంటా పొయ్యే వాడ్ని. మా నాయిన మూర్తం పంచిని చూడంగానే, ఆయన నెకురూను గురిచ్చి చెప్పంగా నేనడిగిన పెశండం యిదే: “ఏమయ్యా, అపుడు నెకురూ ఏ రకం పంచ కట్టి వుండినాడు?

అది నీ మూర్తం పంచికన్నా బాగుండిందా?" అని అడిగేస్తిని. నేను ఎగతాళి పడతుండానని మా నాయిన నన్ను "కడగా పో" అని గమ్మనుండి పొయ్‌నాడు గాని నాది యాసండమా?

ఒక రోజు మా నాయిన పెళ్లో జేరుకొని కట్టుకొనే దానికి మారు పంచ లేక, ఇందాక కట్టుకొనిందే నీళ్లు పోసుకున్న వొంటి మింద మళ్ళా పెట్టలేక మా అమ్మతో తగలాటానికి దిగినాడు. ఆ సందు జూసుకొని, బీగం లేని మా టంకు పెట్టిని తెరిచి, నా చేతల్తో నేను మా నాయిన మూర్తం పంచిని తెచ్చి పెళ్లో వుండిన మా నాయినకు, "దీన్నప్పుడప్పుడు కట్టుకుంటా వుంటే ఏమి? టంకు పెట్టిలో బెట్టి పూజి జెయ్యకుంటే దీన్ని అప్పుడుప్పుడు కట్టుకుంటే ఏమి? ఏ వస్తువన్నా వాడతా వుంటేనే గదా నాలుగు నాళ్లు మనుబడికి వస్తింది" అని బుద్ధి జెప్తా అందిస్తా వుంటే, అదురు మొకమోడైన మా నాయిన మా అమ్మకు బయపడో ఏమో– మళ్లా పాత పంచినే ఒంటి మింద బెట్టి, "పెద్దోళ్లకు సిన్నోళ్లకు అందరికీ అధవై పోయినా. అందరికీ ఈనమే నేను." అనేసి నేనిచ్చిన పంచను చేతల్తో పట్టుకోనే లేదు. అవితే అప్పుడు మా నాయిన నిలుకు లేకుండా ఆయనలో ఆయనే 'ఓ' అని ఉడత పిల్ల మాదిర్తో నవ్వులాడుకుంటా వుండిపోయినాడు. ఇదంతా నా పిచ్చి గాకపోతే ఎట్ట బతికినోడు మా నాయిన? నేనంటే శనోరం శనోరం మా అమ్మను వురి బాదలు బెట్టి తలకు పోయించుకుంటాను గాని, మా నాయిన ఏ శనోరం అన్నా తలకు పోసుకొని వుండునా? సమ్మచ్చరంలో – మా ఇంట్లో మేము చేసుకొనే – పండగలు మఖా అవితే ఎన్ని, నాలుగు! ఈ నాలుగు నాళ్లే గదా మా నాయిన తలకు బోసుకొనేది! నేను చమురు పెట్టుకోకుండా 'ఓ' అని ఎండకు తిరగతా వుంటే, "ఉచ్చి మాడిపోకుండా తలకు చమురు పెట్టుకో ఏమిరా ముండమోపి యెదవా" అనే మా అమ్మ – ఏ పొద్దన్నా మా నాయిన తలకు చమురు పెట్టి వుండునా! ఎప్పుడన్నా మంచి ఎండా కాలంలో మా నాయిన చేతికి చమురు చెంబును ఇచ్చి, "పెట్టుకో!" అనేది మా అమ్మ. మా నాయిన నవ్వు మొకంతో చమురు చెమ్మును అందుకొని, తలకు పెట్టుకొని మోకాళ్లకు, మోచేతలకు కూడా రాసుకొని – అద్దం దగ్గిరికి పోయి నిలబడుకోని మా ఇంట్లో ఎంత మంది వుంటే అంత మందికీ నవ్వు వచ్చే రీతిలో – చెక్క దూబేనితో తల దువ్వుకొనే వాడు. అబ్బా, తల దూకొనే

దానికే అంత సిగ్గుబడి పోవాల్నో! అంత సిగ్గు గల్లాయన అయిన మా నాయిన – ఎప్పుడో కట్టి విడిచేసిన మూర్తం పంచెను కట్టుకొంటాడా ఏమి?

మా వూళ్లో సమ్మచ్చరం సమ్మచ్చరం మా ముక్కు దేముడ్ని – గరుత్మంతుడ్ని – వూరేగిస్తారు గదా! ఆ రోజు దేముడికి కట్టే పంచి ఎవురిదనుకున్నారు? మా నాయిన పెండ్లి పీటల మింద కూర్చుని కట్టినాడే పట్టుపంచె – దాన్నే! ఏడెనిమిదెకరాల రైతుల గ్గూడా అంత మంచి మూర్తం పంచ లేనట్టే గదా లెక్క.

ముక్కు దేముడ్ని మామూలుగా చూస్తే – ఆ ముక్కు పొడుగుకు నవ్వు వస్తాదే గాని మా నాయిన మూర్తం పంచెలో చేరుకొని ఊరు ఊరంతా మెరవణ జేసే గరుత్మంతుడిని చూస్తే – బయమూ బక్తీ కలుగును. మా నాయిన పంచలో దగద్ద మానంగా వుండే గరుత్మంతుడు మా ఇంటి ముందరికి వచ్చినాడు ఒక దపా ఊరేగింపుగా, మంగల మేళాలతో.

గంగ జాతర్లప్పుడు ఇనాం కోసరం మాల చెంగడు మా ఇంటి ముందర నిలబడి, మా కొలం పేరు జెప్పి, మా గోత్రం పేరు జెప్పి, మా ఇంటి పేరు జెప్పి, మళ్ల మా నాయిన పేరు చెప్పి, "నీ లంజి కొప్పులో జడబిళ్ల మెరవగా–" అని యేలపదం వేసినాడు. యేలపదాలంటే నామటుకు నాకు ఎంతో కుశాలగా వుండేది. గంగ జాతరకు గూడా మాల చెంగడు యేలపదం వేస్తాడు గదా. అప్పుడన్నా మనం మా నాయిన చేత మూర్తం పంచ కట్టించి, మాల చెంగడు, "ఓ నామినీ నారప్పా నాయుడా! నీ లంజ కొప్పులో జెడబిళ్ల మెరవగా!" అని యేల పదం వేస్తా వుంటే చూడాలని అనుకున్నాను గాని – ఎక్కడ అటుమంటి జాతర్లు వస్తా పోతా వుండాయే గాని మా నాయిన మూర్తం పంచెను వొంటి మింద పెట్టకనే వుంటే!

# నీడ బలే కరువు గదా!

**ఒ**క్క మడక దున్నడం మాత్రం మా నాయినకు అంత కష్టంగా తోచేది గాదు. మేడిని పట్టుకొని ఒంటి భారాన్నంతా దాని మీద వేసేసి, నడిచినంత సులువుగా ఆయన ఆ పని చేసే వాడు. మిగతా పనుల్ని చేసేటప్పుడు ఎద్దును మోసినంత అగచాట్లు పడిపొయ్యే వాడు. ఒళ్లంతా కదిలి పొయ్యే పార పనిలో ఆయన బలే అలిసి పొయ్యేవాడు. ఐదు నిమిషాలు వొంగి పారతో నరుకును, అయిదు నిమిషాలు గొంతు కూర్చుని మోకాళ్ల సందన తలకాయ పెట్టుకుని (మిడిమేలపు ఎండలోనే) అలుపు తీర్చుకుణ్ణు. మా నాయిన పార పని చేస్తా 'ఓ' అని గస పెట్టేస్తా వుంటే, ఒకసారి మా అమ్మ కోకను గోచిపాతగా పెట్టుకుని, "మనిషిని మించి పోతిందా కష్టం!" అంటూ రోషంగా పారందుకుని రెండు నరుకులు నరకబోయింది. గస పోసుకుంటున్న మా నాయిన, మోకాళ్ల సందు నుంచి తలను చివక్కన పైకి లేపి, "నేన్సచ్చినాక ఆ పని నువ్వే చేసుకుందువులే. ఇప్పుడెవురన్నా చూస్తే నా నోట్లో ఏరగబోతారు!" అని పారందుకున్నాడు. మా అమ్మ గాలొస్తే కొట్టక పొయ్యేటట్టుగా బక్కబక్కగా వుంటిందేగాని ఆమెతో కూడా పని చెయ్యడానికి మా నాయిన వల్ల అయ్యేది గాదు. మా అమ్మ మునాన్ని మా నాయిన అందుకో లేక ఎప్పుడూ బారడు వెనకాన్నే వుండేవాడు. మళ్ల, మా అమ్మ కంటే మా నాయిన మూరడు పొడుగు.

మాకు 'రామక్క' అని ఒక మేనత్త వుండేది. ఆమె పెద్దకొడుకు పేరు ఎత్తిరాజులు బావ. మా అత్త మొగుడ్ని నేను చూసి వుండలేదు. ఆయన మా ఎత్తిరాజులు బావ, మా జైచంద్ర బావ చిన్న పిలకాయలుగా వుండినప్పుడే చచ్చి పోయినాడంట, ఏదో సంకటం వచ్చి. సేద్దిం నాద్దిం మా ఎత్తిరాజులు బావే జరిపించే వాడు. ఆయనకు నీటి యారవ కలిగిన ఆరెకరాల దాక కయ్యి వుండేది. ఆయన ఒక దఫా చేసుకోలేక ఆయిదు గుంటల్ని మాకు వారానికి చెప్పినాడు. ఆ కయ్యిలో అంతకు ముందు చెరుకు పండి వుంటే దాన్ని కొట్టేసి గానుగ ఆడుకొనినాడు. ఆ చెరుకునే మమ్మల్ని మొక్క విడుచుకోమన్నాడు. కయ్యి మాత్రం ఎత్తిరాజులు బావది, అందులోని కష్టమంతా మాది. వచ్చిన పంటలో రెండొంతులు ఎత్తిరాజులు బావకు, ఒక వంతు మాకు. మేమెప్పుడూ (అంతకు ముందు) చెరుకు తోట వేసి వుండలేదు.

మా కాసింత కయ్యల్లో మేము కొంత మడి, కొంచెం శెనిగి, రూంత రాగి, ఇంకొంచం మిరప తోట వేసుకునే వాళ్లం. మాకు చెరుకు పంట బలే కొత్త. అందుకని మా ఇంట్లో వాళ్లు చెరుకు తోట కయ్యల్ని కళ్లకద్దుకున్నాము. చెరుకు తోట మోకాటెత్తు పెరిగినాక అందులోని గడ్డీగాదం తవ్వవలసి వచ్చింది. రేపు తవ్వుతామనగా ఈరోజు రాత్రి మా నాయిన, "మనతో కూడా ఇద్దరు కూలోళ్లను పిలుద్దామా?" అనడిగినాడు. మా అమ్మ, "ఇద్దరు సరిపోతారా? ఆరుమందిని పిలువు. ఇద్దురైతే చాలరు." అనింది. మా అమ్మ నిష్టూరంగా ఆడిన ఆ ఎగతాళికి, మా నాయిన మా అమ్మకల్లా గాకుండా ఏదో ఒక దిక్కుకల్లా ఒళ్లు మరచిపోయి చూసి, పొడుగ్గా గాలి వొదులుకుంటూ, మంచాన్నెత్తుకుని వీధిలోకి వచ్చి చుక్కల కింద వేసుకుని పడుకున్నాడు. మరసటిరోజు తెల్లారి మా అమ్మే ముందుగా తొలికిలు తీసుకొని తవ్వడానికి ఎలబారింది. మా నాయిన మా సొంత కయ్యని ఒకసారి చూసుకొని, తరవాత మా అమ్మ, మా అన్న, మా అక్క తవ్వే చెరుకు తోట కాడికి వచ్చినాడు. అప్పటికే మూడు బారల పొద్దు ఎక్కి వుండటం గమనించిన మా నాయిన, "ఇంక చాలు లెయ్యండి. అన్ని చద్దినీళ్లను గొంతులో పోసుకొని ఒకేసారి వద్దారి." అన్నాడు. అపుడు మా అమ్మ మా నాయినకల్లా వురిమి చూసింది. "ప్చ్, నోరు తెరిస్తే తప్పై పోతా వుంటే" – అనేసి మా నాయిన తొలిక అందుకుని కూర్చున్నాడు. మా అమ్మే ఇంటికి పోయి అందరికీ చద్ది తెచ్చింది. చద్ది తాగేసి వొంగినారు. పదీ పదిన్నర గంటల కాడ మా అమ్మ ఇంటికి ఎలబారింది. మా ఇస్కూలు దగ్గిర్నే చెరుకుతోట వుండడం వల్ల అయిదే అయిదు నిమిషాల్లో ఇల్లు చేరినాము. చిటికె వేసినంతలో చేసేస్తింది మా అమ్మ సంగటీ కూర. పొద్దు నడీమిట్టన వుండగా మా అమ్మ అందరికీ సంగటి తెచ్చింది. నా సంగటిని నేను ఇంటికాడనే తినేసినాను గాని మా అమ్మ తినలేదు. అది ఎండల కాలమే. మా అమ్మ గనిమ మీదనే సంగటి, నీళ్ల బిందె (బలే చిన్నది) దించి, "ఇంక రండి." అనింది. మా అమ్మ సంగటిని గనిమ మీదనే దించినా గనిమ మీద ఒక అవిశె చెట్టు వుండడంతో చీమంత చీమంత నీడ మూరడు వుండింది. సూర్యుడు నెత్తిన వుండడం వల్ల, అవిశె ఆకులు కాసింత కాసింతే వుండడం వల్ల, నీడ నల్లంగా వొత్తుగా లేదు. మా నాయిన, "అక్కడనా, ఇప్పుడు మనం తిండి తినబొయ్యేది?" అన్నాడు నిష్టూరంగా. పది బారలకవతల దండిగా

కొమ్మలు గలిగిన…ఎత్తిరాజుల బావది మాడి చెట్టు వుండేది. "సంగటిని మాడి చెట్టు కాడికి ఎత్తక పద." అన్నాడు మా నాయిన. చెరుకాకులు పదునుగా వుండడం వల్ల, ఎండ బలే కాస్తా వుండడం వల్ల ఆయనకు వళ్లు గీసుకుని పోయి, ఉప్పుదేలిపోయి వుండింది. "ఈ అగుతారంతో నేనా సంగటి తినలేను పద, మాడి చెట్టుకాడికి. బావిలో మునిగి ఒళ్లు తేలిక పడందే నేనా సంగటి తినలేను." అన్నాడు. "మళ్లయినా చెరుకు తోటలోకి, ఎండలోకి రావాలసిందే గదా, ఆ పాటికి యిప్పుడు పోయి మునిగేసి రావాల్నో! చేసే పని – అయిపోజేద్దామని లేదే నీకు!" అనింది, మా అమ్మ నిష్టూరంగా. మా అమ్మ, మా నాయిన ఈ మాదిరి బదులుకు బదులు అనుకుంటూ వుండగా – మా అక్క మా అన్న– ఈ అవిశె నీడే మనకు గతి అన్నట్టుగా – ఆ కాసింత నీడకు ఒదిగి అరిచేతులు మాత్రం కడుక్కుని, సంగటి వెయ్యమన్నట్లుగా మా అమ్మకల్లా చూసినారు. మా అమ్మ వాళ్ల చేతుల్లో సంగటి వెయ్యనే వెయ్యడం చూసిన మా నాయిన చేతిలోని తౌలిక విసిరి పారేసి, కోపంతో కణికెడు ఎంగిలిని నేల మీద వూంచి, చేతులు కూడా కడుక్కోకనే వచ్చి సంగటి ముద్దను అరిచేతిలో వేసుకొని కూర వేయమని సంగట్లో గుంత చేసుకొని మా అమ్మకల్లా చూసినాడు. మా అమ్మ కూర పోసింది. కోపం వచ్చిన మా నాయినకు గస వచ్చింది. ఆ మూరడు నీడ మా అక్కకూ, అన్నకే సరిపోయింది. వీపు మీద ఎండ పడి చెమట కారింది. మా నాయినకు ఎక్కడో నవ్వ పుట్టింది. గీరుకోలేక పోయినాడు. అప్పుడు మా నాయినకు దుక్కం వచ్చింది. పసివాడి మాదిరి కండ్లలో నీళ్లు పెట్టుకుని, "నీకు మంచి కాలం రాదు!" అన్నాడు మా అమ్మను. "మాడి చెట్టుకిందికి పోయి వుంటే నిమ్మళంగా తిని గెంటసేపు పొనుకోని రెక్క ఆర్చుకుని వుండమా!" అని మా నాయిన ఎగదీసుకున్నాడు.

"మిమ్మల్ని ఎండలో పెట్టి నేను నీడకు పోదామనా? ఈ పని అయిపోతానే ఇంకొక పని చేసుకోవచ్చని గదా! ప్చ్, లోకాన మహన్నబావులందరికీ చావు వస్తా వుండాది. అది నాకు రాలేదే!" అనింది మా అమ్మ తలొంచుకొని.

# అంగిడి బియ్యం, తంగేడు కట్టె

ఒకసారి చాకలి పెద్దోడు ఇస్త్రీ పెట్టెలోకి బొగ్గుల కోసం మా అమ్మను అడగ్గా, "పెద్దోడా! ఈ నారప్ప పెళ్లాన్ని బొగ్గులడగను నీకు నోరెట్టొచ్చింది? నా పాచి పండ్లను నా పొయ్యిలోని బొగ్గుతో నేను ఏ రోజూ తోమలా. తెల్లారి తెల్లారి పొండ్లను ఇటికి రాయి పొడితో తోముకుంటా వుండాను." అని చెప్పింది.

– మా పొయ్యి బలే దిక్కు లేని పొయ్యి. చిటికెన వేలితో నీళ్లు తాగినంత సులబంగా విరిచి పారెయ్యగల పుడకలు మా పొయ్యి పక్కల పడి వుండేవి. మా పొయ్యిలో పిడికెడు బూడిదను నేను చూసితినే గాని కణికెడు బొగ్గును నేను చూసి వుండలేదు.

ఒకసారి మా పొయ్యి (వానకు) నాని నాని విడిపోయింది. మా అక్క బిత్తర పోయి, "అమ్మా, అమ్మా, పొయ్యి పూరాగా పడిపొయ్యింది. ఇంకెట్ల?" అని బలే గాబరా పడి అడిగింది. మా అమ్మ పట్టించుకోనే లేదు. "పడిపోతే ఏం బొయ్యింది? ఇప్పుడేమన్నా మనం ఆ పొయ్యిమీద వంటలు వండబో తామా?" అనింది. ఆ మాట అనినప్పుడు మా అమ్మ – కయ్యలోనుంచి ఇంటికి వస్తూ వానకు –తడిసి పోయి వుండింది. తడి కోకను విప్పేస్తే పొడి కోక లేనందువల్ల మా అమ్మ అట్లానే గొంతు కూర్చుని వాన శబద్దం వింటున్నట్టు వణుకుతూ వుండి పోయింది. మా నాయిన కూడా ఒక పక్క తడి పంచతోనే వొణుకుతూ, "దీన్ని విప్పేసి వేరే పంచ కట్టుకోకుంటే చలికి ఎక్కడి ఒళ్లు అక్కడ పట్టుకుపోతిందేమో!" అని గొణుగుతూ వుండినాడు. అప్పట్లో గడగడా మా అమ్మతో మాట్లాడడానికి నాకు కొంచెం జంకు కలిగింది. మా అక్క కూడా అదే పరిస్తితిలో వుండడం వల్ల మా అక్క మాటాపలుకూ లేకుండా ముగ్గుపిండి చిప్పను చేతికి తీసుకుని చుక్కల ముగ్గు పెట్టడాన్ని నేర్చుకుంటూ వుండిపోయింది. ఆ అమ్మి ముగ్గు పోసేది చూస్తానే, నేను కొంచెం గొంతు తగ్గించి, "అకా అకా, ఎసురు పెట్టేటందుకు మనకు పొయ్యి?" అనడిగినాను. "సినబ్బా, నువ్వు గమ్మనుండు. మనకెక్కడి జోలి! అంత పెడితే తిందాం. లేదంటే కడుపులో కాళ్లు పెట్టుకుని ముడుక్కుందాము." అని మాట్లాడింది మా అక్క. ఆ అమ్మి ప్రశ్నకు ఇందాక మా అమ్మ బదులు చెప్పలేదని కొంచెం కోపం పెట్టుకున్నట్టు వుండాది. మా అమ్మమీద అలిగినట్టుగా కూడా వుండాది.

బైట వాన పడతా వుండడం వల్ల పొద్దు పోకనే మబ్బు పడిపోయింది. అప్పుడే రాత్రి అయిపోయినట్టు, కూడు తినే కూటేళ దాటినట్టుగా వుంది. కడుపు నిండా ఆకిలి. మా అమ్మ ఏందో పోగొట్టుకున్నట్టుగా, దగ్గిరికి పోతే కసిరేటట్టుగా వుండడంతో – మా అక్క తుడిచి తుడిచి పోస్తున్న చుక్కల ముగ్గునే చూస్తా వుండిపోతిని. మా అక్క మా అమ్మకల్లా జూసి, తరువాత నా చెవి దగ్గరికి వొంగి, "ఇపుడు మనింట్లో ఎవురన్నా చస్తే తలకాడ పెట్టే దీపంలోకి చమురు గాని, కాళ్లకాడ పోయడానికి మానెడు వడ్లగింజలు గాని లేవు తెలుసా?" అనింది. నేను వులిక్కి పడినాను. "ఇపుడెట్టా? ఎసురు పెట్టేదానికి పొయ్యి లేకుండా, ఎసుట్లోకి బియ్యమూ లేకుండా.. ఇప్పుడెట్టా?" అని గట్టెంగా అరిచేసినాను. అరిచేసినాక నాకు గభీమనిపించింది. మూతి నల్లంగా పెట్టుకోని మా అమ్మకల్లా చూసినాను. "నా బట్టా, ఏం బిడ్డరా, నువ్వు? ఎప్పుడూ ఇరైనాలుగ్గంట్లూ కూటి మీదనేనా కలవరం? ఎప్పుడెప్పుడు ఎసురు పెట్టబోతారా, ఎప్పుడెప్పుడు మన పిండాకూడు మనకు వెయ్యబోతారా అనేనా కలవరం?" అనింది మా అమ్మ చానా కరుగ్గా. ఆమె అంతటితో వూరుకోకుండా, "ఎందుక్కన్నాను, యీ కూలిపోయిన బిడ్డల్ను? ఈ నా బట్టలు గాన లేకుంటే నేనంత తాగి వూపిరి వొదిలేసి వుండనా? యిపుడు చస్తే – ఆ నా సవితి బిడ్డల్ని సాకలేక సచ్చిందని – లోకులు అంటారే!" అంటూ ఆమె చాలాసేపు అక్కసునంతా వెళ్లబోసుకొనింది. మా అమ్మ అనాల్సిన మాటలన్నీ అనేసినాక నాకూ ఒక మాట అనాలనిపించింది, "పసిబిడ్డిని గదా, మీకు మాదిరిగా ఆకలికి వోర్చుకోగలగతానో? ఎప్పుడో మద్దేనం పదకొండు గంటలకు ఎలక్కా యంత సంగటి తిన్నాను. ఆ సంగటి యింకా వుంటుందో?" అని అనే దైర్నం చాలక గమ్మన్నే వుండిపోయినాను.

మా అక్క నా ఆకల్ని గమనించిన దాని మాదిరి పైకిలేచి సంగటి చట్టి చూసింది. చట్టికి కరుచుకుని వుండవలసిన సంగటి గోకు కూడా లేకుండా పొయ్యే సరికి, "చట్టిలో మాడి పోయిన సంగటి చెక్కలు కూడా లేవు." అనింది. మా నాయిన అపుడు తల వొంచుకోని, "సందేళ నాలుగ్గంటల కాడ కడుపులో మంటగా ఉంటే ఆ గోకుడు, నీళ్లల్లో కలుపుకోని నేను తాగేసినా." అన్నాడు. అపుడు మా అమ్మ, "ఆయనేమన్నా మొగోడా? ఇస్కూలుకు పొయ్యే పసిబిడ్డ గదా! కన్నావు. నా నెత్తిన తోసినావు. ఇంక పట్టించుకోవు గదా!" అనింది.

అపుడు మా నాయిన, "ఎవురన్నా ఇక్కనా పక్కనా వింటే బైసాట్లు, నేను మానస్తుడ్ని. నీ నసను నేను తట్టుకోలేను. ఏ చెట్టుకో తాడేసుకోని యేలాడేస్తా." అని గొణిగినాడు. ఈ బెదిరింపులు మామూలే గదా అనుకుని, మా అమ్మ మళ్లీ నసకు దిగి, "ఇపుడు చేరడు నూకలేదు ఇంట్లో. పోయి ఎక్కడన్నా రెండు కుంచాల బీపు గింజలు తీసకరా. అంత వుడకేసి పిలకాయలకు పెడతా. ఆడదానికి ముప్పయి మూడు అరవైయారు సబిలీ జెయ్యాల మొగోడు." అని దబాయించింది మా అమ్మ. మా నాయిన, "నేను మొగోడ్ని అవితే గదా–" అని గొణిగేసి గడప దిగి, నెత్తిన గుడ్డ వేసుకుని వానలో ఎట్టనో పోయినాడు. మా అమ్మ కూడా చేటను కొంగులో పెట్టుకుని వీధిన పడింది. "అమ్మ పోయింది, ఎక్కడికో చెప్పుకో చూద్దాం." అన్నాను మా అక్కతో. "నాకు తెలుసు నువ్వు చెప్పుకో చూద్దాం." అనింది మా అక్క. 'ంయ్యబి' అని చెప్పినాను బలే కుశాలగా. (కుశాలలు ఎక్కువైపోతే తిరగేసి మాట్లాడే వాళ్లం) మూడురాళ్లు తెచ్చి పొయ్యి చేసింది మా అమ్మ. ఎసురు పెట్టింది. బియ్యం నానబోసింది.

మా అమ్మ పొయ్యి ముందర యెచ్చంగా వుండిపోయింది. "పాపిష్టిదాన్ని. ఆయన్ని నసబెట్టి యింట్లో లేకుండా జేసినా. వుండుంటే పొయ్యి సెగన గుడ్డల్ని ఆరబెట్టుకుని వుండును" అనింది. ఆ రోజు చింతకాయ తుక్కు సంగటి చేసింది.

పుల్లంగా, కారంగా, ఉప్పంగా వుండే చింతకాయ తుక్కుతో అన్నాలు తినేసినాము. ఇంకా వాన పడతానే వుండాది. పొయ్యి ముందర కూర్చున్న మా నాయినకు సెగ తగలక మళ్లీ మంచం మీదికి వచ్చి వణికినాడు. అరవా కొరవా కాపరాలను అంగిడి బియ్యం, తంగేడు కట్టె అంటారు మా పెద్దోళ్లు. ఇటువంటి కాపరాలే మా వూరి నిండా.

# మా పూల పూల కోడి పెట్ట

మా ఇంట అది ఎప్పుడు పుట్టిందో నాకు తెలవదు గాని నేను ఒకటో తరగతిలో చేరినప్పటికే అది గుడ్లు పెడతా వుండింది. దాని ఈకలకు ముచ్చట గొలిపే రంగులు శానా వుండేవి. చామంతి రేకులు, మల్లెపూలు, కనకాంబరాలు, పాల సముద్రం పూలు ఒక చోట కలబోసినట్టుగా వుండేది ఆ మా పూల పూల కోడి పెట్ట. 'మన పెట్ట బలే జాతైనదిరా' అనేది మా అమ్మ. ఇండ్ల కప్పులు మీదికి ఎక్కే పోకిరీ గుణం దానికి వుండేది గాదు. పొరుగిళ్ల అటకల్లో గుడ్లు పెట్టేసి, మా ఇంటికి వచ్చే చెరుపు పనులు అదెప్పుడూ చేసేది గాదు. సంవచ్చరానికి రెండు విడతలు పజ్జెనిమిదేసి గుడ్లను పెట్టి ఒక్క గుడ్డును కూడా మురగనివ్వకుండా పొదిగేసును. పిల్లల్ను గెద్దల పాలు చేయడం దాని వంశంలోనే లేదు. అటువంటి జాతైనది మా పూల పూల కోడిపెట్ట. అది అలివిగాని సంసారం జేసే ఆడామె మాదిరిగా గౌరవంగా కనిపించేది. అది రోజుకు – మా ఇంట్లో తిరుగులాడే – రెండు మూడు జెర్రిల్ని ముక్కుతో పొడిచి చంపేసినా, ఒక్క జెర్రి తునకైనా ఆశించకుండా పిల్లలకే పెట్టేసును.

మా అమ్మ దాని ముందర పోసే చేరడు నూకను మరింతగా ముక్కుతో పొడిచి పొడిచి పొడి చేసి పిల్లల చేత తినిపించేది. టెంకాయ చిప్పలలో మేము పోసే నీటిచుక్కల్ని పిల్లల చేత తాపించేది. పిల్లలను పొదిగినప్పుడు మా పూల పూల కోడి పెట్ట ఆర్భాటం కండ్లతో చూడవలసిందే. మా ఇంట్లోకి మమ్మల్ని తప్పించి ఇంకొక పురుగును అది రానిచ్చేది గాదు. ఒకసారి వీధిలో పోతూ వుండిన చేకూరి చంద్రకేశవులు నాయుడి కాలును అది రక్తం కారేట్టు పొడిచి పారేసింది. అది పిల్లల్ని వెంటేసుకుని తిరిగేటప్పుడు మా ఇంటికి నా ఈడు పిలకాయలు రావాలన్నా బయపడి చచ్చేవాళ్లు. పిల్లల్ని మూడు నెలలు వెంటేసుకుని తిప్పినాక మా పూల పూల కోడి పెట్ట, "ఇంక మీ బతుకు మీరు బతుక్కోపొండ్రా నాయిన్లారా!" అన్నట్టుగా అది కేర తోలేసేది. ఆ సాయంకాలం నుంచే మేము పూల పూల కోడి పెట్టకు తనీగా ఒక తట్టను కేటాయించే వాళ్లం. తల్లీ పిల్లల్ని ఒక తట్టలో గాన వేసినామంటే దానా దర్మం లేకుండా పెట్ట పిల్లల్ని పొడిచి పారేసును.

నేను నాలుగో తరగతికి మారి మూడు నెలల పరీక్షలు కూడా రాసేసినాను. అపుడు మా పూల పూల కోడి పిల్లల్ని పొదిగింది. పొదిగిన నాలుగైదు నాళ్లల్లో పిల్లలన్నీ గడప ఎక్కడం కూడా నేర్చుకునేసినాయి. ఆ రోజు మా ఇస్కూలుకు లీవు వుండింది. మా అమ్మ కయ్యల్లో పనికి ఎలబారుతూ వుండగా నేను కొంగు పట్టుకుని, "నేంగూడా..." అనడిగినాను. "నువ్వొద్దమ్మా. ఆట్లాడుకోను పిలకాయల దగ్గిరికి పోకుండా, కోడి కాడ జాగ్రత్త నాయినా" అని చెప్పేసి మా అమ్మ పనికి పూడ్సింది. నిజంగా మడి కాడ కన్నా కోడి కాడ కూడా బాగానే వుంటింది. నేను ఇంటి కాడనే వుండి పోతూ, "అమ్మా, ఈ పిల్లల్లో పుంజులెన్నో, పెట్టలెన్నో చెప్పేసి పోమ్మా!" అనడిగితే, మా అమ్మ నవ్వేసి పోయింది.

ఇంట్లో కోడీ నేనే. పిల్లలూ కోడీ గొడ్ల కొట్టంలోకి పోయినపుడు, పిల్లలెక్కడ కుడితి తొట్టిలో పడి వూపిరి పోగొట్టుకుంటాయేమోనని జాగర్తగా వుండినాను. భూలోక రంభ, పుష్పావతి నా దగ్గిరికి వచ్చి పొదుగ్గా తోకలుండే – మరుమల్లె పూలు ఏరుకుందాం రారా – అని పిలిస్తే నేను, 'అమ్మో! కోడి దగ్గిర మనిషా?' అనేసినాను. నాకు మా కోడితో పొద్దు బలే పోయేది. దాన్ని నేను బలే వుడకాడిపించే వాడ్ని. నేను గొంతు నిండికీ గాబరాను తెచ్చుకుని, బూమ్మీదికి వాలబోయే గెద్దను తరిమేస్తున్నట్టుగా అరిచే వాడ్ని. మా చిన్ని చిన్ని కోడి పిల్లలు వూపిరి బిగపట్టుకుని పరిగెత్తతా పోయి కొట్టంలోని గాడిలో దాంకొనేవి. కోడి, మెడను పైకెత్తి బలే జాగర్తగా గెద్ద రాకడను కనిపెట్టేది. కాసేపు తరువాత 'గెద్దా లేదు గిద్దా లేదు.' అనుకొని పిల్లలు తల్లి దగ్గిరికి వచ్చి చేరేవి. నేను మళ్లీ అటువంటి అరుపునే అరిచి తల్లీ పిల్లల్ని బయపెట్టి చంపేవాడ్ని. 'నువ్వు గమ్మనుండ్రా యెదవా! బిడ్డలు బయపడతా వుండారు.' అన్నట్టు నిష్టూరంగా చూసేది మా పెట్ట. (నేను గమ్మనుంటే నన్ను సుబ్రమణి అని ఎందుకంటారు?)

మా పెట్ట సందేళ పూట కాళ్ల కింద పడిపోయే పిల్లల్ని తప్పించుకుంటూ ఒక బండ కింద వుండిన సన్నటి మూరడు పొడుగు పురుగును చూసి బండ కిందికి పోయింది. పిల్లలూ నేనూ కూడా మా కోడి పురుగును పొడిచి పొడిచి చంపే తీరును చూస్తూ వుండి పోయినాము. ఏ దేముడు ఆడ్రు చేసినాడో గాని ఒక గెద్ద గబీమని బూమ్మిందికి వాలతా వుండగానే నేను బిత్తర పోయి అరిచినాను. మా కోడి పురుగును వొదిలి బిడ్డను తన్నుకొని పోతా వుండిన

గెద్దను గమనించి, అది కూడా గెద్దతో పాటుగా బలే ఎత్తుకు ఎగిరింది. ఎంతో పౌరుషంగా ఎగిరిన మా కోడి వూపిరి పోగొట్టుకుని దబీమని కీచు కీచుమనే బిడ్డల సందున పడిపోయింది. నా ముక్కులకు పీల్చుకునేటందుకు గాలి దొరక లేదు. తల పైకెత్తి చూసినాను. ఆ మధ్యనే మా వూరి మీదికి వచ్చిన రెండు కరెంటు కమ్మీలు ఒకదాన్నొకటి కొట్టుకుంటూ కనిపిచ్చినాయి!

మాంసం కూరంటే పడి చచ్చే మా ఇంట్లో వాళ్లం – ఆ చట్టిడు కూరను మూచూడనైనా లేదు. మా అమ్మ, “శౌర్రంగా బతికింది, శౌర్రంతో చచ్చింది. దాందీ జీవం అంటే!” అనింది.

కోడి చచ్చి పోయిన నెలనాళ్ల దాకా మా ఇంట్లో ధాటీగా మాట్లాడిన మనిషే లేకపాయ.

# అత్తి నీరా, ఇడ్లీలో, రొట్టెబిస్కే

"అమ్మా, తినే దానికి ఏమన్నా వుంటే పెట్టమ్మా–" నోరు తెరిస్తే ఎప్పుడూ ఈ మాటే వూడి పడేది. ఈ మాట విని వినీ అరోసికం పుట్టి పోయిన మా అమ్మ, "బతికినంత కాలమూ ఇదే పాటా? నీ నోటి గుండా యింకొక మాట రానియ్యేమి? విందాము" అనేది. అయిదు నిముసాలు ఏం మాట్లాడకుండా గమ్మునే వుండి మళ్లీ అదే పాట పాడే వాణ్ని. "పన్నెండో ఎక్కం కంటస్తం బెట్టాల. తినే దానికి ఏమన్నా వుంటే పెట్టమ్మా" అని. "ఇంట్లో నీకు అడ్డమా? ఏమన్నా వుంటే ఎత్తుకుని తినుబో" అనేది మా అమ్మ. ఆమె నా చేతిలో ఏమన్నా అంత పెట్టేది దాన్ని నేను తినేది – ఇదంతా అయ్యే పనేనా? అన్నట్లు వీధిలోకి వచ్చేసే వాణ్ణి. ఒకాయన నెత్తిన కుండ పెట్టుకుని, "అత్తి నీరమ్మా, అత్తి నీరా! ఒళ్లు నెప్పులకు, నడుం నెప్పులకు, కీళ్ల నెప్పులకు అత్తి నీర ఎత్తిన గురువు. అత్తి నీరా!" అని దీర్ఘం తీసుకుంటూ పోతుండే వాడు. వీధిన పడిన నేను మళ్లీ గడపెక్కి, "అమ్మా, అమ్మా, రెండు నాళ్లుగా నాకు ఒకే నడుము నెప్పులుగాని, అత్తి నీర పోయించమ్మా!" అని అడుక్కునే వాణ్ణి.

"అవును పాపం. సేద్యమంతా నువ్వే చేస్తుండావే, నీకు నడుం నెప్పులు గదా." అని ఎగతాళి పడేది. చివరకు మా అమ్మ నా చెర పడలేక, "పిలువు" అనగానే నేనాయన్ని పిలిచే వాణ్ణి. ఆయన కుండను దించి కుండలోని సత్తు లోటాతో అత్తినీరును తీసుకుని మళ్లీ అందులో కుమ్మరించే వాడు.

భలే తేటగా వుండేవి అత్తి నీళ్లు. "ఎంత నాయినా అత్తి నీర" అనడిగేది మా అమ్మ. "మానెడు వడ్ల గింజలకు నాలుగు లోటాలు తల్లీ!" అనే వాడాయన. "అది అత్తి నీరా గాదు పాడూ గాదు. ఒట్టి సక్కిరి నీళ్లు. ఆ సక్కిరి నీళ్లకు మానెడు వడ్ల గింజలా? వడ్ల గింజలు వూరికే రాలా! ముప్పై మూడు అరవైయ్యారు సత్తువలు వేస్తే వస్తా వుండాయి." అంటూ మా అమ్మ అత్తి నీరును తీసి పారేసి వడ్లగింజల్ని పొగిడేది. మా అమ్మ మాటలకు అయన, "మ్మో, అట్ట మాట్లాడొద్దు, అత్తి నీరులో మిస్టీకు వుంటే అపుడు మాట్లాడు, వింటాను. అప్పటమైన నీరమ్మా. నువ్వు గలాసుడు తాగు, నీలో వుండే వూష్ణం బయట పడక పోతే అపుడు అడుగు. తలొంచతా. అత్తి వేరును

తెగ్గొట్టి కుండ కట్టితే కారిన నీళ్లివి. నువ్వేమో తీసి పారేస్తా వుండావు." అంటూ ఆయన అత్తి నీరుకు పటం గట్టేవాడు. నాకు ఆయన మాటలే నిజ్జమనిపించేవి. ఆయన నా చేతికి సత్తు లోటాలో గుక్కెడు అత్తి నీరును ఇచ్చి తాగమనే వాడు. మా అమ్మకల్లా చూడకుండా ఆ అత్తి నీరును గొంతులో పోసుకునే వాడ్ని. "అబ్బ, భలే తియ్యంగా వుండాయి" అని మెచ్చుకునే వాడ్ని. మా అమ్మ నా మాటను ఎగతాళి చేసి, "చక్కెర నీళ్లు తియ్యంగా వుండక కమ్మంగా వుంటాయా?" అనేది. అత్తి నీరు గల్లాయన మొఖం చిట్లించుకోని, "తల్లీ బేరానికి వచ్చినోడ్ని, పొద్దు పోగొట్టొద్దు." అనేవాడు. మా అమ్మ అందుకు బదులుగా ఆయనతో రచ్చకు దిగి పోతున్నట్లుగా, "నిన్ను పగ్గాలేసి కట్టేసి వుండామా, వచ్చిన దారిన పో ఏమి?" అనేది. ఆయన పాపం సణుక్కుంటా గడప దిగేసే వాడు. నాకు మా అమ్మ మీద –చిటా–మనిపించి వీధిలోకి వచ్చేసే వాడ్ని.

ఇంకొక ముసలాయన నెత్తిన అద్దాల పెట్టెలో రొట్టె, బిస్కెట్టులు పెట్టుకొని, "రొట్టేబిస్కే" అని అరుచుకుంటూ పోతుండే వాడు. ఆయన మా వూరికి సదా వచ్చే ముసిలాయనే. ఆయన జాతీ జన్మాన ఎప్పుడూ 'రొట్టే బిస్కెత్' అనేవాడు గాదు. ఎప్పుడూ "రొట్టేబిస్కే"–అనేవాడు. ఆ అరుపు బలే విన సొంపైనది. సిగ్గూ లజ్జా వొదులుకుని మళ్లీ మా అమ్మ దగ్గరికి జేరి ఎంతో నంగిగా, "అమ్మా, అమ్మా, బన్ను రొట్టి తీసియ్యమ్మా!" అని సొన పెట్టేవాణ్ణి. పొయ్యి ముందర పొగకు కండ్లు తుడుచుకుంటూ మా అమ్మ, "సందేళ రాగి పిండి రొట్టెలు చేసుకుందారి. ఈ లోపల అది తీసియ్ ఇది తీసియ్ అని నన్ను పెరుక్కు తినొద్దు నాయినా." అనేది. మా అమ్మ కఠీనానికి నేను ఊపిరి పీల్చడం మరిచి పోయి, "ఇందాక అత్తి నీర తీసియ్యమంటే తీసియ్యలా, నోరంతా తెరిచి అడిగినందుకైనా ఏదన్నా ఒకటి తీసీరాదో!" అని నిష్టూర పోయి మళ్లీ గడప దిగే వాడ్ని.

–మా అమ్మ ఈ ఒక్క రోజనే గాదు. ఆమె జన్మంతా ఇంతే. ఆవిరితోనే వుడికే ఇడ్లీలంటే నాకు ప్రాణం. అవి ఎనిమిది తిని అన్ని నీళ్లు తాగేసి చేతుల్ని నిక్కరకు తుడుచుకుంటూ గడప దిగి గోలీగుండ్లు ఆడుకుందామని నాకు మనసు గుంజుతూ వుండేది. మా వూరి భజన గుడికి పడమరగా, తిరపతి నుంచి ఒకామె వచ్చి, ఒక గుడిసె వేసుకుని ఇడ్లీలు అమ్మేది. ఒక్క

ఇడ్నీ అణా. తిరపతామె ఇడ్నీలు తీసీమని నేనెన్ని సార్లు యేడ్చినానో లెక్కే లేదు. మా అమ్మ ఎప్పుడూ తీసీ లేదు. జ్వరమొస్తే చచ్చినట్లు తీసిస్తింది గదా– అని నాకు జ్వరమొస్తే బాగుండుననిపించేది. ఒకసారి నాకు మూసిన కన్ను తెరవకుండా జ్వరం గాసింది. నోరంతా చేదై పోయింది. అంత జ్వరంలో గూడా తెల్లారి పూట మా అమ్మ మూకుడులో అన్ని గెంజినీళ్లు, అన్ని కూటి మెతుకులు ఎత్తుకుని వచ్చి, "ఈ చద్దినీళ్లు తాగీ కొడకా, జ్వరం చల్లగా వదిలి పోతుంది నాయినా!" అనింది, నా కాళ్ల కాడ జేరి. నాకు భలే కోపం వేసింది. కండ్లల్లో ఆవిరి గమ్మింది. వచ్చే పాపం రానే వస్తిందని నేను మా అమ్మ డొక్కల్లో కాలితో కుమ్మినాను. మా అమ్మ నా కుమ్ముకు, "అబ్బా" అని మూలిగి, "బిడ్డి సిన్నోడివే గాని, దెబ్బ సిన్నదా?" అనింది.

వీధిలో పడిన నాకు ఇదంతా గుర్తుకు రావడంతో నా ముందు నుంచే రామాపురం ముసిల్ది వక్కా పొవ్వాకు గంపలో శెనగ వుండలు, రంగు మిఠాయిలు పెట్టుకుని పోతా వుంటే చూసీ చూడనట్టు వుండి పోతిని. మా అమ్మ దగ్గిర నా బుడ బుడకలు వాగవే!

మా వూరికి దక్షిణంగా ఆనుకునే ఒక చింత చెట్టు వుండాది. ఆ చెట్టుకింద రెండు మూడు పేడ దిబ్బలుండాయి. (మా పేడ దిబ్బ వాటిల్లో ఒకటి) ఆ దిబ్బలకవతల ఒక చీంచీంత చెట్టు వుండాది. ఆ చెట్టు కాడికి చేరినాను. ఆ చెట్టుకు అంతా ముండ్లే. ఎక్కలేము. అప్పట్లో ఆ చెట్టు నిండా దోర దోర చీమంత చీమంత గుడ్లు! ఏ ఉడతో, ఏ చిలకో వచ్చి ఒక్క గుడ్డును కొరికి కింద పడవేయక పోతుందా? అనే ఆశతో చెట్టు కల్లా ఎగ జూపెట్టుకొని వుండి పోతిని.

# మాకు చేతనైన వైద్యం

వానాకాలం పెట్టీ పెట్టంగానే నాకు ఉబ్బసం వొచ్చేసును. టపాసుల పండగ పది నాళ్లు వుండగానే ఆకాశం మబ్బులు పట్టేస్తింది గదా. ఆ కాలంలో చేతి నిండికీ పని కూడా వుంటింది. "నాకు –చద్దిపొయ్ అమ్మా, కడుపు నిండికీ తాగేస్తా" నంటే ఆ రోజు మా అమ్మ వినింది గాదు. "వొద్దు కొడకా. దానికి తోడు సద్దిగాన తాగినావంటే – నువ్వు మా బిడ్డగాదు మళ్లీ!" అని మా అమ్మ ఇటువంటి నంగి మాటలు చెప్పి, మడి కాడికి ఎలబారింది. నేను మా గడప మీద కుచ్చున్నోడ్ని లేవనే లేదు. మా వీధిలోని కోళ్లన్నీ నా ముందర్నే చేరిపోయినాయి. నేను మాటి మాటికీ దగ్గుదును, నోటి నిండికీ గల్ల జేసుకుని, తుపుక్కుమని వీధిలోకి వూంచుదును. "ప్చ్, వూరి కోళ్లన్నీ తినేసి పోతా వుండాయి గదా. మన పూల పూల కోడి పెట్ట వుండుంటే ఎంత బాగుండును! బగమంతుడు అది బతికితే చూడలేక పోయినాడు గదా!" – మా పూల పూల కోడి పెట్టను తలచుకొని నేను కొంచెం సేపు దుఃక్క పడినాను.

మా ఇంట్లో నుంచి నీడ దిగుకుంటూ వచ్చి మా గడప చేరింది. 'అప్పు డెప్పుడో వస్తానని చెప్పిన మనిషి, పొద్దు నడి మిట్టకొచ్చినా, ఇంకా వస్తా వుండాదేమో చూడు–' అని మా అమ్మను తలచుకుని నేను నిష్టూర పోయినాను. నేను మళ్లీ గడప మీదికొచ్చి కుచ్చున్నాను. నేను మెడకాయ బాగా వొంచి ఎదుర్రొమ్ముకల్లా చూసుకున్నాను. నా మెడలో నల్లటి తాడుకు వేలాడుతూ వుండినాడు– వొక చేత్తో గదా, యింగొక చేత్తో సంజీవినీ పరవతాన్ని పట్టుకొనిన ఆంజనేయుల సామి. నిరుడు, నేను మూడో తరగతిలో వుండగా, యిదే మాదిరిగా నాకు వుబ్బసం వొస్తే మా అమ్మ తిరప్తికి తోడుకొని పోయి, మంగలాయిన చేత వెయ్యించుకొచ్చిందీ దండ. ఈ దండ వెయ్యించుకొని వొచ్చినప్పుడు సామి దరమ్మాన నాకు గస అణసర అయ్యింది. కానీ మళ్లీ ఈసారి వచ్చింది. మా ఇంటికి మూడు యిండ్లకా పక్కన వుండిన బజన గుడిని దాటుకొని నన్ను చూసిన మా అమ్మ జోరైన నడకతో నా దగ్గిరికి వచ్చింది. నేను గడప మీది నుంచి పైకి లేచి, కటీనమైన చూపులతో మా అమ్మకల్లా జూసి, "బతికినాడో సచ్చినాడోనని చూసేసి పోదామని వొచ్చినావా, నియ్యమ్మా, ముండ నాయాలీ ముండా, నువ్వు వొస్తానని చెప్పిందెప్పుడు,

వొచ్చిందెప్పుడే లంజి నాయాలీ ముండా!" అని నేను నోటికొచ్చినట్టు తిట్టేసినాను. ఆ సమయంలో దగ్గు యాడబొయ్యిందో నాకే తెలవదు. మా అమ్మ గమ్మున్నే వుండడం జూసి వచ్చే పాపం రానే వొస్తాదని, "మడికాడ ఎవుడ్ని ఎగజూపెట్టుకుని వుండినావే, ఈనపు నాయాలీ ముండా, ఈ గడప్మిందనే చచ్చుంటే నాకు దిక్కెవురే కోతి నాయాలీ ముండా." అని నేను గొంతు పెంచేసినాను. అప్పుడు నాకు దగ్గు వచ్చి, నోటి నిండికీ చేరుకున్న గల్లను, వీదిలో వుండిన కోళ్లకు గాకుండా, యింట్లో వుండిన మా అమ్మ పక్కన తుపుక్కుమని వూంచేసినాను.

మా అమ్మ నిమ్మళమైన గొంతుతో,"శానా దూరం పోతుండావు గదరా నా సిన్నకొడకా. నన్ను కట్టుకున్నోడు అన్లేదు గదరా నన్నిన్ని మాటలు!" అనింది. మళ్ల తిట్టలేదు మా అమ్మను.

మా అమ్మ బియ్యం గాలించే తీరును చూస్తా వుంటే, నన్ను వెతుకులాడుకుంటూ వీదిలో వుండిన పిల్లల కోడి పిల్లల్ని యెంటేసుకుని మా యింట్లోకి వచ్చింది. మా అమ్మ, "ఆ కూలి పోయిన కోళ్లను తోలెయ్ ఒక మాట జెప్తా" అనింది. నేనా కోడి పెట్టను తరిమేసి మా అమ్మకు దగ్గిరిగా వొచ్చి కూచ్చుంటే, "కముసు తగిల్తే నీకా దగ్గు అణసర అవితిందిరా. ఈ రోజు ఏమి వారం! బేస్తవారం గదా. ఆదివారం దాకా బిగపట్టుకుని వుండు. అరకేజి తెచ్చేస్తా. తిందువు. నీ దగ్గుకు అదే మందురా!"– నాకు ఎప్పుడు గస వచ్చినా ఈ మాటే మాట్లాడేది మా అమ్మ. ఆ ఆదివారం పూట మా అమ్మ అదలాబదలా యింట్లో పని ముగించుకుని సత్తు గిన్నిలో చద్ది పోసుకుని మడి కాడికి ఎలబారింది. అప్పటికి నాకింకా దగ్గు అట్టనే వుండింది. "ఆదోరం సీకూర తెస్తామన్నావు గదమే, ఎదా?" అని నేను నిష్టూరమాడితిని. గడప దిగిన మా అమ్మ నాకల్లా అయ్యోమన్నట్లు చూసి, "ఏం సినబ్బా, నువ్వింకా పసి పిలగోడివా? ఎందుకురా నా కడుపు మంట పెట్టుకుంటావు? వచ్చే బేస్తవారం నాడే గదా టపాసుల పండగ. ఆ రోజు తేమా కూర? ఆ మూడు దినాలు కండ్లు మూసుకుని వుండలేవా?" అని మా అమ్మ లోగొంతుతో నన్నే నిష్టూర పోయి మడి కాడికి ఎలబారింది. బజన గుడి దాకా పోయిన మా అమ్మ, ఏందో గుర్తుకు వచ్చిన దాని మాదిరిగా నిలబడి పోయి, వెనక్కి తిరిగి మళ్లీ నా కాడికి వచ్చింది. "ఇంగొక వైద్దిగం వుండాదిరా సినబ్బా. పెద్దోళ్ల మాటను

ఎందుకు తోసెయ్యాల. నువ్వు బంక చేనులోకి పొయ్, కుక్క తలకాయ వుండాది చూడు, కుక్క తలకాయ, దాన్ని తీసకరా, కుక్క తలకాయి గాని తెచ్చినావంటే, నేను మడికాడ నుంచి రాంగానే నూరి పోస్తా."

'కుక్క తలకాయ తెద్దాం రామ్మే!' అని బూలోకను పిలిస్తే, ఎగనీలక్కుండా వొచ్చింది. నేనూ, బూలోక బంక చేనులోకి పోయినాము. మా వూళ్లో ఎప్పుడన్నా సమ్మచ్చరానికి, రెండేళ్లకు వొక కుక్క చచ్చిపోతే, దానికి తాడు గట్టి, ఈడ్చుకొని పోయి బంక చేనులోనే వేసే వాళ్లము. బంక చేను బలే రోతయిన చోటు. మాదిగోళ్లు కూడా అక్కడ్నే గొడ్లు కోసుకుంటారు. బూలోక వెతికి వెతికి, "దొరికిందిరే!" అని గట్టింగా అరిచింది. నేను దగ్గిరికి పోయి చూద్దును గదా – అది తొడ లావు దున్నపోతు ఎమిక. ఎనుము దూడల తలకాయలు తెల్లతెల్లంగా కనిపిస్తా వుండాయే గాని ఎంత వెతికినా కుక్క తలకాయ మాత్రం కనిపించ లేదు. కొంచేపు మేమిద్దరం యెతకడం చాలించుకోని, బలుస కంప మీదపడి, బలుస కాయలు తిని నోరంతా వొగురు చేసుకున్నాము. "మా అమ్మను తోడుకొని వద్దాములే. ఇంక పోదాం రా రంబా!" అనేసినాను. బూలోక నాలుగడుగులు వేసి, ఏందో కాలికి తగులుకోగా ముందుకు పడబొయ్యింది. కిందికి చూద్దుము గదా తెల్లంగా మట్టిలో పూడుకు పోయిన ఒక బొప్పె కనిపించింది. బూలోక రెక్క లావు వుండిన వొక కట్టిని సంపాయించి నేలను తవ్వి చూస్తే – యింకేమి, అది కుక్క తలకాయే! ఆ పుర్రి దవడల్లో కనుగుంతల్లో నిండిపోయి వుండింది మట్టి. ఆ పుల్లతో మట్టినంతా తొలిగించేసినాము. ఏమరుపాటున వుండిన బూలోక చేతుల్లోనుంచి ఆ కుక్క తలకాయను పెరుక్కొని, పడేదీ లేచేదీ కూడా తెలవకుండా మా ఇంటికి పరిగెత్తి, అక్కడ్నించి మడికాడికి పరిగెత్తి, కలుపు తీస్తా వుండిన మా అమ్మకు కుక్క తలకాయ చూపించి, "యింగరా, యింటికి పదారి." అని వొళ్లు తెలవని కుశాలతో పిలిచినాను.

# మా అంజలి కోరిక

మా వూరి నడి బొడ్డున రాముల వారి గుడి వుండేది. ఆ గుళ్ళో మటుకు రాములు వారి విగ్రహం వుండేది కాదు. ముక్కు పొడుగ్గా వుండి, రెక్కలు కలిగిన ఒక కొయ్య విగ్రహం వుండేది. రాములు వారు ఆ రీతిగా వుండునా? అది గరుత్మంతుడి బొమ్మంట. చెవిటి తాత (పూజారి) చెప్పినాడు. ఆ గరుత్మంతుడి బొమ్మతో మా పిలకాయలకు పొద్దు బలే పొయ్యేది. ఆ బొమ్మ అంటే మాకు ఎంతో కులుకు. దాన్ని చూస్తే మాకు నవ్వు వచ్చేదే గాని భయమూ భక్తి కలిగేవి గావు. దాంతో ఎగతాళి పడాలని మా అందరికీ మనసు గుంజేది. ఒక పిలగాడు వీదిలో వెతికి ఒక బీడీ ముక్కను పట్టకొచ్చి గరుత్మంతుడి చేతిలోపెట్టి, 'బీడీకాల్చు. కాల్చి ముక్కుల గుండా పొగ వదలక పోతే–' అని నాలుక కొరుక్కునే వాడు. గరుత్మంతుడు దిగులు దిగులుగా అయిపొయ్యే వాడు. బీడీ కాల్చే వాడు గాడు. దాంతో ఆ పిలగాడు గరుత్మంతుడి ఆ చెంపా ఈ చెంపా వాయించేసే వాడు. మా గుళ్లో గర్భగుడి కూడా వుండేది. అందులో–పెద్దవి–దేముడి పటాలు వుండేవి. అక్కడికి పోయిన పిలగాడు చెంపలేసుకోకుండా వుండలేడు. గర్భగుడిలోని పటాలంటే మాకు భలే భయమూ, భక్తీ. మా వూరికి ఉత్తరంగా, ఇస్కూలుకా పక్క మాదిగపల్లి వుండేది. మాదిగపల్లి వాళ్ళకు కూడా ఒక గుడి వుండేది. ఆ గుడి గుడిసె మాదిరి వుండేది. ఆ గుడిసె గుడిలో ఒక మూల ఒక త్రిశూలం వుండేది. త్రిశూలం మింద కుంకుం బొట్లూ, పసుపు బొట్లూ, ఎండి పోయిన బిత్తెడు మల్లెల దండా వుండేవి. అది మాతమ్మ దేవళమంట. మాదిగ పల్లి నుంచి అంజలి అని ఒక అమ్మి, నాగరాజు, సురేంద్రుడు, జయరాముడు ఇస్కూలుకు వచ్చేవాళ్ళు.

"మీ వూరి గుడి గుడిసి. దాంట్లో గెంట కూడా వుండదు."

"దేముడే వుండడు. త్రిశూలమే దేముడో?"

"మాతమ్మ దేవళం అని మీ గుడికి పేరు. అందులో మాతమ్మ లేదు, గీతమ్మ లేదు."

"అసలు మా గుడికాడికి వచ్చీ రాంగానే మీ మాదిగి పల్లోళ్ళంతా వొంగనబడి మొక్కుకుంటారు. మా వూళ్ళో వాళ్ళం మీ గుడికిల్లా ఎగా దిగా కూడా చూడం." –ఈ రకంగా మా వూరి పిలకాయలం మాదిగ పల్లి పిలకాయల్ని ఏడిపించే వాళ్ళం. వాళ్లు మా దేముడ్ని ఎగతాళి చెయ్యడానికి తల గీరుకొని ఆలోచించే వాళ్ళు. "మీ దేముడు–ముక్కు దేముడు. గువ్వ మాదిరిగా రెక్కలు, బలే యికారపు దేముడు." అని మాత్రం అనేవాళ్లు.

మేం అప్పుడు–ముక్కు దేముడు గర్భగుళ్ళోని అసలు దేముళ్ళకు బిళ్ల జవాను తెలుసా?– అనే వాళ్ళం. వాళ్ళకు గర్భగుడిలో వుండే దేముడి పటాల సంగతి తెలవదు. వీధిలో నుంచి గరుత్మంతుడ్నే చూసి ఎగతాళి చేస్తారు. అంజలి అయితే ఒక దఫా, "ఒరే నాగరాజా, వాళ్ళ వూళ్లో ముక్కు దేముడే దేముడు. అసలు గర్భగుడే లేదు. అందులో పటాలు లేవు. వీళ్లు చెప్పేదంతా అపద్దం." అని మొండికి తిరుక్కొనింది.

అంజలి అంతమాట అనడం విని మేం వూపిరి పీల్చడం మర్చి పొయ్యే వాళ్ళం. 'దేముడి సత్తెంతో అంజలీ. గర్భగుళ్లోనే మంచి దేముడి పటాలుంటాయి. నువ్వుగాన చూస్తే ఒళ్లు మరిచిపోతావంతే. బ్రమ్మాండమైన పటాలు. ఓయమ్మో, భలే పెద్దవి." అని మేం ఎన్ని చెప్పినా నమ్మేదిగాదు అంజలి. "అన్నీ వుత్తవి. పటాలు లేవు, గిటాలు లేవు. వుంటే చూపించండి." అని సవాలేసేది. చెవిటి తాతకు మంచిమాటలు చెప్పి అంజలిని ఎట్లయినా సరే మా వూరి గర్భగుళ్ళోకి తొడుకోని పోయి పటాలన్నీ చూపించి నమ్మకం కుదిరించాలని మా వూరి పిలకాయలం అనుకున్నాం.

"నేనొస్తాను గర్భగుళ్ళోకి. తొడక పోయి చూపిచ్చండి." అని కచ్చితంగా నిలబడేది అంజలి. ఆ అమ్మితో మాట్లాడాలంటే బయం అయిపోయింది మాకు. అదా రాములవారి గుడి! అంజిలా, మాదిగ పిల్ల! ఎట్ట, ఈ పిల్లను ఆ గుళ్లోకి తీసకపోయి పటాల్ని సూపిచ్చే మార్గం ఎట్ట?– అని ఆలోచించి మాకు తల పట్టగట్టి పొయ్యేది. అంజలి నోటికి బయపడి మా గుడి గొప్పతనాన్ని గురిచ్చి చెప్పడం మా పిలకాయలం మానేసినాం. ఒక సందేళ పూట– మాదిగ పల్లిలో నుంచి ఒక ఆడామె శివం తొక్కతా మా వూళ్లోకి వచ్చింది. ఆమె మింద మాతమ్మ పూనతాదంట. ఆ ఆడామె వూగిపోతా

మా వూళ్ళోకొచ్చి గుడిముందర ఆగింది. ఆగి వాళ్ల గుడిసె గుడిలో వుండే త్రిశూలాన్ని మా గుడి ముందర గభీమని గుచ్చి "కొలో జగా!" అనింది.

'కొలోజగా' మాతమ్మ అనే యీ మాటంటే నాకు వొణుకు. అది తమాసమాటగా వుండాదా మీకంటికి. యింక పెపంచకమంతా మనుసుల్లే కుండా కొళ్లబోతాదని. ఆమె వెనకాన మాదిగపల్లి వాళ్లు కూడా వచ్చినారు.

మాతమ్మకు ఉగ్రం వచ్చిందని తెలిసి మా వూరి పెద్దోళ్ళంతా మా గుడి వద్దకు చేరినారు. నేను కూడా మా అమ్మ కాళ్ళకాడ చేరినాను.

ఆ మాదిగపల్లె ఆడామెనీ, త్రిశూలాన్ని చూస్తావుంటే నా గుండె–కోడి గుండెకాయ ఆయిపోయింది. మా పిలకాయలందరికీ ఆ ఆడామెను చూసి బలే బయం కలిగింది. అంజలి బయమూ బక్తీ లేకుండా ఆ ఆడామెను ఆనుకుని నిలబడి వుండింది. మా పిలకాయలకు అంజలి దైర్నం చూసి యిచ్చిత్రం కలిగింది. ఆ మరసట్రోజు అంజలితో మా వూళ్ళోని పిలకాయలం శానా మంది బక్తితోనే మాట్లాడినాం.

–మీ త్రిశూలానికి బలే శగితి. అదంటే మాకు బయం, బక్తి–అని మటుకు చెప్పలేదు. ఆ పిల్లే అర్తం చేసుకొనింది.

అంజలి ఇస్కూలు మానేసి మేకల్ని మేపడంలో కుదిరి పోయినాక కూడా మేం కనిపించినప్పుడల్లా, "ఏమండ్రా, మీ గర్భగుడిని నాకు చూపించకనే పోతా వుండారే!" అని నిష్టూరమాడతానే వుండేది.

# ఏడుపు పాట మా అమ్మది

ఎండ మిడిమేలంగా కాస్తుండగా, మా అమ్మ వెదురు దబ్బలతో అల్లిన ఒక తట్టను బుజానికి వేలాడేసుకుని, "మడి కాడికి పోయి తట్టడు పచ్చి కసువు పెరక్కొస్తా." అని మా అక్కతో చెప్పి ఎలబారింది. అప్పుడు మా అక్క మాకు కలిగిన ఒక్కగానొక్క మంచాన్ని వీధిలో వేసి, నులక తాళ్ల మీద దుడ్డుకట్టితో కొడుతూ, రాలిపోయిన నల్లుల్ని అరి కాళ్లతో నలిపేస్తా వుండింది. నేను వెనకాన్నే వస్తా వుండినట్టు – మడి కాడికి నడక సాగించిన మా అమ్మకు తెలిసింది గాదు. ఇరుగ్గా వుండే సందుబాట మలుపు తిరిగినాక నేను 'డ్డాయ్' మని మా అమ్మను బయపెట్టబోతే ఆమె ఉలిక్కి పడకుండా యెనిక్కి తిరిగి జూసింది. "నువ్వంట్రా దొంగోడా?" అని నవ్వింది.

నేను మా అమ్మ పక్కన జేరి నడస్తా నడస్తా ఒక మాట అడిగితిని: "అక్క మళ్లీ పెద్దమనిషైంది గదమ్మా! నాకు తెలుసులే!"

మా అమ్మ, "తంతా పట్టుకోని. నీకెట్ట తెలుసురా ముండా యెదవా?" అనింది. (మా అక్క నెలకు ముందర పెద్ద మనిషైతే నట్టింట బైట ముస్టి మండలతో దడి కట్టి పది దినాల పాటున కూర్చోబెట్టినాము) "అక్క ఈ దినుమంతా నట్టింట్లోకే పోలా. నేను పోయి రెండు మానికల బియ్యం తెచ్చిస్తే మద్యానం సంగటి జేసింది. అపుడు నువ్వు మడి కాడ వుండినావు." అని మా అమ్మకు బదులు చెప్తిని. మా అమ్మ నాకల్లా ఎపుడూ చూడని చూపు చూసి, కొంచేపు గమ్మున నడిచినాక, "ఔ, అక్క మళ్లీ బైట జేరింది. అయినా, ఇవన్నీ నీకేల రా పంగమాలిన యెదవా? వేసింది తిని, పోసింది తాగి, పసి పిలగోడి మాదిరి పడి వుండక–" అని కసిరింది.

మా అమ్మ దోవ చేసుకుని బలే ఎత్తుకు పెరిగిన మా చెరుకు తోట నడీ మధ్యకు చేరింది. తోటలో వుండిన పచ్చి కసువుకు ఎండ సొక్రిం లేకపోవడం వల్ల కోడికాళ్లు పడిపోయి బలీనంగా వుండింది. ఆ కసువును మా అమ్మ కొడవలి లేకుండానే పిడికిళ్లు పిడికిళ్లుగా పెరకడం మొదలు పెట్టింది. అంతకు ముందే ఎప్పుడో విరిగి పోయి వుండిన చెరుకునొకదాన్ని చేతికి తీసుకుని, గలగలామని ఎండిపోయిన దాని సోగను విరిచి, మూరడు పొడుగు చెరుకు

బిళ్లలను మా అమ్మ నా చేతికిచ్చింది. ఆ చెరుకు పాలు నా నోటికి పులిసి పోయినట్టుగా తోచింది. చెరుకు తింటూ గనిమ మీద వుండిన కందిచెట్లను చేరి, ముదిరి పోయిన కంది కాయలను జేబీలో వేసుకుంటూ వుండిపోతిని. కంది చెట్ల దగ్గిర ఎంతోసేపు వుండడం నాకు సగించ లేదు. మళ్లీ మా అమ్మ దగ్గిరికి వొచ్చి చూద్దును గదా – పచ్చి కసువు పెరుక్కుంటూనే బొరోమని ఏడస్తా వుండింది. నేనక్కడికి రాంగానే మా అమ్మ పాట కూడా ఎత్తుకొనింది. ఆమె పాడిన పాట నాకు మొత్తంగా గుర్తు లేనే లేదు. అవితే ఆమె పాటను మొదులు పెడుతూ పాడిన పదాలు – మళ్లీ మళ్లీ పాడడం వల్ల – ఆ రెండు పదాలు మాత్రం నాకు ఇంకా గుర్తుండాయి. "నా బతుకు –నీటి కన్నా పలసనా! దూదికన్నా సులకనా!" మా అమ్మ పద పదానికీ ఎగదీసుకోవడం వల్ల గొంతు గరగరామని నాకు బిత్తర గొలిపింది. మా అమ్మకు తెలవకుండా యింటికి పరిగెత్తి, "అక్కా! అక్కా! అమ్మ చెరుకు తోటలో ఒంటిగా కుచ్చోని బొరోమని ఏడస్తా వుండాది." అని చెప్పి మా అక్కను తోడుకోని వొద్దామనిపించింది. అవితే కాళ్లూ జేతులూ ఆడక నేను ఎట్ట నిలబడిన వాడ్ని అట్టనే నిలబడి పోతిని. కాళ్లల్లోకి సత్తా తెచ్చుకుని పోదామనిపిచ్చే సరికి నాకు సందుబాట గుర్తుకు వచ్చింది. సందుబాటలో పెద్ద మొగోళ్లే బయపడతారంట. నడి రాత్రీ మిట్ట మద్యానమూ దెయ్యాలకు ఒకటే గదా! నేను మా అమ్మ దగ్గిర్నే ఏడుపు పాట వింటూ బయంతో నిలబడి పోతిని.

మా అమ్మకు ఎండ పొడ వల్ల ఒళ్లంతా గుబగుబమని చెమట పట్టేసింది. నుదుటి మీదుండిన కుంకుం బొట్టు ఎర్రంగా కారి, ముక్కుమీది కన్నీటి చుక్కలతో కలిసిపోయి, మా అమ్మ ఒళ్లోకి బొట్లుబొట్లుగా జారినాయి. కొంచేపు మా అమ్మ పాట వినే సరికి నాకు బయం పోయి ఆత్రం కలిగింది. చెవుల్ని చేటలు మాదిర చేసుకుని, చడీ చప్పుడు లేకుండా కూర్చుని వినినాను.

నేనందాక మా తాత పెండ్లాం చెంగమ్మ మా అమ్మను కని వుంటుందని అనుకునే వాడ్ని. కాని అది తప్పు. మా అమ్మ – మా తాత మొదటి పెండ్లాం కూతురు. మా అమ్మను కనిన ఆడమనిషి పురుట్లోనే ఏదో సంకటం వల్ల చచ్చిపోయిందంట. అప్పుడారంబమైనాయంట, మా అమ్మకు కష్టాలు. మడక పిడి తప్పించి యింకొకటి తెలవని మా నాయినతో మా అమ్మ గాబట్టి వేగులాడిందంట. మా పెద నాయిన– మా నాయిన్ని వేరే పెట్టేటప్పుడు మా

అమ్మకు కట్టుకున్న కోక తప్పించి మారు కోక లేకపోయిందంట. నేను పుట్టక ముందెపుడో ఒక దపా, మా వూరు మొత్తంగా కాలి పోయిందంట. పెదబాలశిచ్చ దాకా చదువుకొనిన మా పెదనాయిన గింజనూ, రూకనూ సమకూర్చుకోని మిద్ది కట్టుకుని నిలబడినాడంట. మా చిన్నాయనకు బామ్మర్దులు అండగా నిలిచినారంట. మా అమ్మా మా నాయినా మాత్రం మూడు రాళ్ల పొయ్యి మీదికి సొలిగెడు బియ్యం లేక, తనకలాడి పోయినారంట. ఇంటి ముందర నేరేడాకుతో పందిరేసి, అన్ని వసద్దులతో, ఒక ఆడ కూతురికి పెండ్లి చేయడం బలే కష్టమైన పని అని కూడా మా అమ్మ ఆ పాటలో చెప్పుకొనింది. ఇటువంటి పెద్దపెద్ద సంగతులతో పాటుగా చిన్నచిన్న వాటి ప్రస్తావన కూడా చేసింది.

పొగులంతా కష్టపడిన మా అమ్మకు రాత్రిపూట మంచం మీద వొళ్లు వాల్చాలని అనుకునేదంట. పదార్రూపాయలిచ్చి మంచం కోళ్లను తెప్పించుకుని, నులకను పేనిచ్చుకునే తావకాశం ఇప్పటికి కలిగింది గాదంట. ఈ మాటలను పాట రూపంలో అంటుండగా నాకు కండ్లల్లో ఒక్కసారిగా నీళ్ళూరి కారిపోయినాయి. అప్పుడు మా అమ్మ మన తెలివిలోకి వచ్చి కొంగుతో మొకం తుడుచుకుని నాకండ్లు తుడిచింది. ఒక పెద్ద చెరుకు విరిచి నా చేతిలో పెట్టి దుఃక్కం లేని గొంతుతో, “నా అక్కుసు దేముడితో చెప్పుకుంటా వుంటే నువ్వెందుకురా ఏడ్చేది?” అనింది మా అమ్మ.

# తిరప్తి మార్కెట్టులో మా కూరగాయలు

ఒక్క గుంట లేదా అర గుంట నేలలో మేము మిరప తోట నాటే వాళ్లం. మిరప నారును మేము చదరంగా వుండే దుక్కి మీద గాకుండా, బోదెల మీద నాటే వాళ్ళం. ఆ బోదెల నడుమన్నే రెండు మూడు కాలవలు–మూరడు యెడం కలిగినవి– వుండేవి. ఆ కాలవల్లో ఎరగడ్డలు గుచ్చి పెట్టే వాళ్ళం. అదే కాలవల మీద గోగు గింజలూ గుచ్చే వాళ్ళం. బోదెల్లో అక్కడక్కడా వంకాయ నారునూ, బెండ గింజల్నూ నాటేవాళ్ళం. మిరప తోట నాటిన ఆ కయ్యి గనిమ చుట్టూతా శానా బీర గింజల్ని మా అమ్మ గుచ్చి పెట్టేది. బలే తొందరగా మిరప తోట కాపుకు వచ్చేసును. మిరప తోట చుట్టూతా తడికెలు నాటినందు వల్ల బీర తీగెలు, సొర తీగెలు తడికల్ని కనిపించనీకుండా కమ్మి వేసేవి. ఆ బీర తీగెలు పసుపు రంగు పూతను బయట పెట్టేవి. కడుపుతో వుండిన ఆడామె మాదిరిగానే నిండుగా వుండేది పూతా పిందెకు వచ్చిన మిరప తోట. మా అమ్మ ఒక తట్టా, ఆ తట్టలో ఒక చిన్న బుట్టా వేసుకొని మిరప తోట కాడికి ఎలబారినప్పుడల్లా నేను మా అమ్మను వెంబడించే వాడ్ని. "మిరపతోటలో ఒక చోట కూర్చోవాల నువ్వు. ఆ పక్కకూ ఈ పక్కకూ తిరిగి పూతాపిందెను రాలగొట్టకూడదు." అని మా అమ్మ ముందే యెచ్చరిక జేసేది. మా అమ్మ మిరప తోటలో గోగాకును దుసి తట్టలో పోసుకునేది. వంకాయలు, బీరకాయలు దండిగానే వుండేవి. మా గండు అయ్యవారి తలకాయంత వుండేవి, ఒకటి రెండు సొర కాయలు. నేను వుల్లి పువ్వుల్ని నోట్లో పెట్టుకుని మా అమ్మకు తెలవకుండా తెల్లటి మిరప పూతను తుంచి తుంచి పోసేస్తుండే వాడ్ని. నాలోనే నాకు నవ్వు వచ్చి ఎంతో కులుకుగా వుండేది అప్పుడు.

మా అమ్మ కాయగూరలతో నిండి పోయిన ఆ తట్టను– ఒక్కటీ ఎత్తి నెత్తి మీద పెట్టుకొనే తీరు బలే తమాషైనది. నేను ఒక్క చేయి వేసినా ఫలితం వుండేది గాదు. మా అమ్మ బూమ్మీద గొంతు కూర్చునేది– శౌర్యంతో, అదొక రకం గొంతుతో మ్ అని, రెండు చేతుల్తో తట్టను లేపేది. ఆ బరువైన తట్ట ఎంతో యిచ్చిత్రంగా మా అమ్మ మోకాళ్ళ మీద చేరేది. నేను కండ్లు మూసి తెరిచే లోపల మా అమ్మ నెత్తి మీద తట్ట నిలదొక్కుకుని వుండేది. అప్పుడు మా అమ్మ నా కంటికి– మా వూరి దేవత గంగమ్మ వలె, లేదా మా వూరి

మాదిగ పల్లి వారి దేవత మాతమ్మ వలె అనిపించేది. మా అమ్మ మామూలు ఆడామె గాదు. ఈమెలో ఏ దేవతో పూని వుండవచ్చును– అనిపించి నాకు బయం కూడా వేసేది.

"సినబ్బా, నాయినా జాగర్తగా నడువు. కాళ్ళు తగులుకోని పడేవు."– అంత బరువు ఎత్తుకుని జాగ్రత్త చెప్పే సరికి నాకు ధైర్యం వచ్చేది. 'మన అమ్మే, మాతమ్మ గాదు.' అనిపించి నాకు ధైర్యం వచ్చేది. మా అమ్మ ఇంటికి వచ్చినాక తట్టను కుమ్మరించి కళకళలాడే వంకాయల్ని మాత్రం తట్టలో వేసి పుచ్చినవి నేలన్నే విడిచేది. తరవాత కత్తిపీటను దగ్గిరికి లాక్కోని పుచ్చిన భాగాన్ని జాగ్రత్తగా కోసి యివతల పారేసి మిగతా భాగాన్ని కూరకు తయారు చేసేది. "అబ్బ కళకళలాడే వంకాయలు మనం తినకూడదా, ఏమి?" అంటూ తట్టలో వుండిన వంకాయను నేను పుచ్చు వంకాయల్లో కలిపేసే వాడ్ని. అప్పుడు మా అమ్మ, "అమ్మో, మార్కెట్టుకా?" అని ఆ మంచి వంకాయను తీసి మళ్లీ తట్టలోనే వేసేది. పుచ్చు వంకాయల్లో నుంచి వచ్చే పురుగుల్ని వేలితో పిసపిసా నలిపి నలిపి అట్లాడుకునే వాడ్ని నేను. మా అమ్మ కాయలతో, కాయలపైన గోగాకుతో నిండి వుండిన తట్టమీద పలచటి తడిగుడ్డను కప్పి ఒక మూల పెట్టేసేది.

ఆ మరసటి రోజు తెల్లవారు జామున నిద్ర పోతుండిన నన్ను చల్లటి చేతులతో (అప్పటికే పాచి పని అంతా చేసేసి వుండడం వల్ల) నిద్రలేపి "మారికెట్టుకు పోతుండా, ఇంద, అయిదుపైసాలు, అయిసు తీస్కో. అక్కను ఏడిపించకుండా వుండు. మద్యానానికి వచ్చేస్తా." అనేది. నిద్రకండ్లతో నేను తలూపే వాడ్ని. మా అమ్మ వూర్లో ఇంకొందరి ఆడోళ్లతోపాటు ఆ తెల్లవారు జామున తిరపతికి బయలుదేరేది. ఆర్సిలీ కొండనుంచి మా వూరి మీదుగా తిరపతికి ఒక బస్సు వుండేది గాని దాన్ని ఎక్కేవారు గారు. కాలి నడకన ఆరు మైళ్లూ బరువుతో నడిచే వాళ్లు. మా వూరికి వుత్తరంగా కనిపించే తిరమల కొండల కింద తిరపతి వుంటుందని తెలుసేగాని తిరపతి నేనెప్పుడూ చూసి వుండలేదు. ఇస్కోల్లో కూచ్చుని తిరపతి మార్కెట్టుని, మా అమ్మని....గుర్తు జేసుకుంటూ వుండే వాడ్ని. మా అమ్మ మద్దేనం ఒంటిగంటకంతా వచ్చేస్తుందని తెలిసి వూరి బయటే వుండే వాడ్ని.

మా అమ్మ వచ్చేది. ఇంటికి వచ్చీ రాగానే నాకు రెండు వడలు ఇచ్చేది. అప్పుడనంగా మా అమ్మ ముగ్గు పిండిని నోట్లో వేసుకుని పండ్లు తోముకునేది. అప్పటికే పెద్దమనిషైన మా అక్క (అప్పుడు నాకు తొమ్మిది మా అక్కకు పదిహేడేండ్లు.) "తిరప్తి గొడ్డు బోయిందా? అద్ద రూపాయికి నాష్టా చేసుంటే ఏమి?" అని మా అమ్మను తిట్టేది. "మారికెట్టు గేటుకు పావలా ఇచ్చి, నాష్టాకు అర్ద రూపాయి యిస్తే- వచ్చిన అయిదార్రూపాయల్లో మిగిలేదేంది మళ్ళ?" అనేది. మార్కెట్టుకు పోయినన్నాళ్లూ మా అమ్మ తిరప్తిలో చెయ్యి కడిగిన పాపాన పోలేదు. కొనూపిరితో మా ఇంటికొచ్చినాకే ముగ్గు పిండిని నోట్లో వేసుకునేది.

# నా మింద అలిగిన మా అమ్మ

నేనెప్పుడూ మా అమ్మ కొంగు పట్టుకొనే తిరుగులాడే వాడ్ని. మా అమ్మ నా పక్కన్నే వుండినా నేను మాటి మాటికీ, "అమ్మా, అమా మే, ఓ అమా–" అని మా అమ్మ వూకొట్టే దాకా ఒప్పుకునే వాడ్ని గాను. మా అమ్మ కూడా నా మాటలను శ్రద్ధగా విని, వూకొట్టి, అదీ యిదీ మాట కలిపేది. నేను ఇస్కూలు నుంచి వచ్చి మా గడప ఎక్కంగానే మా అమ్మను వరసగా నాలుగు కూతలు పిలిచేస్తాను. ఇంటి లోపల – కుండ కాడ, చట్టి కాడ – వుండిన మా అమ్మ కూడా చురుకైన గొంతుతో, "వుండాను రే, యాడికీ పూడవలా, ఈడనే వుండాను." అనేది. నేను వచ్చే సరికి మా అమ్మ గాన ఇంటి కాడనే లేకుండా వుండిందో, పలకను నులక మంచం మీద పారేసి మా తూర్పు మడి కాడికి పరుగులు బెడతాను. ఒకొక్కసారి మా అమ్మ ఆ మడి కాడా వుండేది గాదు. అప్పుడు నేను గస నిండిన గొంతుతో ఎంతో ఆత్రంగా, అక్కడే పగ్గాలు పట్టుకుని ఎద్దులను మేపుతుండిన మా నాయినను, "అయా, అయా, మా అమ్మేది? యాడ బొయ్యిందీ? ఇంటి కాడా లేదు, మడి కాడా లేదు, యాడబోయినట్టయా, మా అమ్మ?" అని గాబర గాబరగా అడిగే వాడ్ని.

అపుడు మా నాయిన ఎంతో నిమ్మళంగా వుండి, చేతుల్లో వుండిన రెండు పగ్గాలను ఎద్దుల వీపు మీద వేసేసి, వక్కాకు పెట్టుకొనే బొడ్డు దగ్గర మూటను విప్పి ఏదో వెతుకులాడే వాడు. నేను –వక్క కోసరం చూసుకుంటా వుండాడేమోనని –అనుకునే వాడ్ని. అది తప్పు. మా నాయిన ఆ మూటనంతా కాసేపు వెతికిన వాడై, "ఇయ్యాళ దాకా వొళ్లోనే వుండిందిరా మీయమ్మ. ఇప్పుడే ఇక్కడెక్కడనో పడి పొయ్‌నట్టుగా వుండాది." అనే వాడు. ఈ మాటలను మా నాయిన ఎగతాళి నిండిన మొకంతో అనకుండా, నిజం మొకంతోనే అనే వాడు. నేను మా నాయినను అదొక రకం చూపు చూస్తా వుండంగానే, మా నాయిన కయ్య గనిమల చుట్టూరా వెతుకులాడే వాడు. "ఏమో రా, మీయమ్మ యాడా కనబడలా. సందేళ లోపల యెతికి మళ్లీ వొళ్లో పెట్టుకొని వస్తాన్లే, నువ్వు పద." అనే వాడు. 'మూసి పెట్టిన కోళ్లను దొబ్బక పోయేటట్టు వుంటావు. నువ్వు కడుపులో ఇన్ని ఎగతాళులు పెట్టుకోనుండావా, నాయినా!' అనుకొని మా నాయిన తీరుకు నేను యిచిత్ర పొయ్యే వాడ్ని. అంతలోనే నాకు పట్టలేనంత

కోపం వచ్చేసును. నేను మా నాయిన అని కూడా తలవకుండా, "వొరే, నియ్యమ్మా ముండ నాయాలా. మా అమ్మను అడగతా వుంటే నీకు ఎగతాళిగా వుండాదా వాయ్. రానీ నా కొడకా, మా అమ్మతోనే చెప్తా"నని మా నాయినను తిట్టేసే వాడ్ని. (నేను తిట్టాలని మా నాయిన ఎప్పుడూ కాపెట్టుకొని వుంటాడు.)

అపుడు మా నాయిన ఎంతో బయాన్ని తెచ్చుకొని, "ఒరే, దసిరా బుల్లోడా, మీ అమ్మతో చెప్పద్దురే. నువ్వు గాన మీ అమ్మతో చెప్తే, మీ అమ్మ నన్ను నెత్తిన వుండే కొమ్ముల్తో కుమ్మేస్తింది రే." అని నన్ను బతిమాలుకునే వాడు. ఎవరూ లేనిది చూసి ఈ రీతిగా మా నాయిన నాతో ఎగతాళి పడతా వుంటే నాకు దుఃక్కం వచ్చేసును. అపుడు చెప్పేవాడు మా నాయిన: "మీ అమ్మ దక్షిణంగా మడికాడ". అంతే నేను రయ్ అని చువ్వ మాదిరిగా మా అమ్మను చేరేవాడ్ని. మా నాయిన మాట తీరును మా అమ్మతో నేను వరస బెట్టి చెప్పుతా వుంటే మా అమ్మ నవ్వు మొకంతో అంతా వినేది. మా అమ్మ దగ్గిర వుంటేనే చాలు, నాకు ఎంతో కుశాల.

ఒక రోజు నా మనసుకు కష్టం వేసిన సంగతి ఒకటి జరిగింది. అందాకా కయ్యల్లో కష్టం చేసి – మా అమ్మ, నాయిన, మా అన్న, మా అక్క, నేను – ఒక చెట్టు నీడన చేరుకుని సంగటి తింటూ వుండాం. అదే చెట్టు నీడన అమ్మణ్ణి అత్త అని మా వూరు ఆడామె కూడా, సంగటి తింటూ వుండింది. ఆమెకు ఆ రోజు నన్ను ఉడకాడిపించాలని బుద్ధి పుట్టింది. ఆమె మామూలుగా వుండే గొంతుతో, "ఒరే, నా బట్టా, అసలు నీది మా వూరు గాదు, మా కమ్మ కులం గూడా కాదు నీది. అనంతపురం జిల్లాలో కదిరి వుండాది జూడు, అదీ నీ వూరు. అక్కడ అడక్క తినే సుగాలోళ్లు వుంటారు జూడా, వాళ్లూ నీ అయి నోళ్లు." అనింది. ఆ మాటల వల్ల నాకు కోపం వచ్చి, "నువ్వుబోయే నీయమ్మా, రండ నాయాలీ ముండా." అని కసురుకొని గమ్మున వుండిపోయినాను. అపుడు మా నాగులన్న, "చెప్పు అమ్మణ్ణత్తా, నువ్వన్నా నిజ్జిం చెప్పు. వీడు మా రెక్కల కష్టం తినేదే గాక, రేపు కయ్యల్లో బాగానికి కూడా రాబోతాడు. సాకిన వాళ్లం, మేం చెప్పలేక పోతా వుండాం. నువ్వన్నా వాడికి నిమ్మళమైన నిజం చెప్పు." అన్నాడు. అప్పుడు ఆ మాటలను వినిన మా అమ్మ గూడా గమ్మన తల వంచి వుండింది. అమ్మణ్ణత్త పొడుగ్గా గాలి వొదిలి, నిజం చెపుతున్న దాని మాదిరిగా, "నువ్వు ఎన్ని రోజులుండినా... మాకు దక్కే వాడివి గావు. నిన్ను కన్నవాళ్లు

రేపో ఎల్లుండో వచ్చి నిన్ను తోడుకు పోతారు. సమ్మచ్చరం సమ్మచ్చరం కదిరివాళ్లు కరువు బాద పడలేక మన దిక్కుకల్లా వొచ్చి కూలీనాలీ చేసుకుని పొట్ట బోసుకుంటారు గదా. వాళ్లు ఒక దపా ఇక్కడికి వచ్చినారు. అపుడు నువ్వు పాలు తాగే పసి బిడ్డివి. నిన్ను విడిచి పెట్టి వాళ్లు పొయ్‌నారు సాక లేక. అప్పుడు ఈ చినక్క... నాగులుగోడి అమ్మ... కనికరం కలిగింది గాబట్టి... నీకు అంత సంగటిబెట్టి సాకతా వుండాది. 'వుండే నా ఇద్దురు బిడ్డల్నే నేను సాకలేను. మీ బిడ్డను మీరు తీసక పోదురు రండి.' అంటా మీ అమ్మ మొన్ననే నాగులుగోడి సేత జాబు రాపిచ్చింది. పచ్చని చెట్టుకింద కుచ్చోని నేను అపద్దాలు సెప్తానా?" అనింది అమ్మణ్ణత్త బాద నిండిన గొంతుతో. ఆ మాటలు విని నా గుండెకాయలు నీళ్లయి పోయినాయి. దానికి తోడుగా మా అన్న, "అనంతపురం జిల్లా అపద్దం గాదు. కరువు అపద్దం గాదు, సుగాలోళ్లు అపద్దం గాదు, అమ్మణ్ణత్త మాట అపద్దం గాదు." అన్నాడు. నాకు దుఃక్కం పెరుక్కు వచ్చింది. "ఏమి చినక్కా, నా మాట అపద్దమా!" అని అమ్మణ్ణత్త అడిగితే, మా అమ్మ వయసులో పెద్దదయిన ఆమె మాటను కాదనలేక గమ్మున వుండింది. ఇదంతా అపద్దమే అని నాకు తెలస్తానే వుండినా, కదిరివాళ్లు కరువులో మా వూరొచ్చేది నిజమే. నాకు దుఃక్కం వచ్చేసింది. మా అమ్మ తలెత్తి నన్ను చూసినా, నేనామెను చేరడానికి బయపడి ఎక్కిళ్లు పెట్టేసినాను. మా అమ్మను, "అమా, అమా–" అని గాకుండా ఏ ఆడామెనో పిలిచిన రీతిగా, "మో, మో" అని పిలవాల్నా? అనిపించి నేను లబ లబా నోరు కొట్టుకుని అరిచేసినాను. మా అమ్మ నన్ను ఒళ్లోకి తీసుకుని, "అంతా తమాసకు గదా, వాళ్లనింది, యెర్రెదవా!" అని నా బయం పోగొట్టింది.

ఆ సందేళ మా అమ్మను నేను "అమా అమా, మే అమా–" అని ఎన్ని కూతలు పిలిచినా పలకలేదు. నేను దగ్గరికి పోయి మా అమ్మను "నిన్ను గదా పిలిచేది. యినపళ్లా." అన్నాను. మా అమ్మ, "ఎవురో ఏదో అంటే – నన్ను నీ అమ్మ గాదని – నమ్మేసినావే నీతో నాకేం పనిరా ముండమోపి యెదవా?" అనింది ముదిగారంగా.

# పొయ్యి మంటెయ్యకుండా ఇదేమి ముదిగారం!

మన మానుడి జల్మ ఎంత పాపానికన్నా వారుస్తాది గాని కాసంత పుణ్యానికి వార్చదు గదా ఎండ మిడిమేలంగా కాస్తా వుండినా మా అమ్మ, మా నాయిన, మా అన్న, మా అక్క, నేను – అయిదు మందిమి వుంటే అయిదు మందిమీ కయ్యిలో వొంగనబడి పని చేస్తాము గాని, పళపళమని గుడ్డ తడిసే మాత్రం చినుకులు పడినా – కయ్యిల్లో నుంచి లేచి ఇంటికి పరిగెత్తతా వచ్చేసే వాళ్లం. వానా కాలం పెట్టిందంటే నాకు, మా నాయినకు గుండికాయల్లో చలీజెరం కాసేది. ఒక పక్కన వాన జొరోమని కురస్తా వుంటే, ఇంకొక పక్కన మన సేద్దిం పనుల్ను మనం కానిచ్చుకోలేము గదా! వానా కాలంలో – చద్దేళ కాంగానే నేనూ మా నాయిన ఒకే దపా చద్ది చట్టికాడికి పోయి చెయ్యిపెట్టి చూసేసి వస్తాము. అపుడు మా అమ్మ ఎరగనోచ్ అని ఒక మూలన కుచ్చోని వణకతా వుంటింది. చూస్తా వుంటే ఆ మనిసి యింకొంచేపుటికన్నా పైకి లేచి పొయ్యి మంటేసి, మాకంత కాంచి పోసేటట్టుగా కనపడటం లా. ఆ చలిలో నేను యింట్లో అట్టా యిట్టా తిరుగులాడడం చూసి, "సినబ్బా, యిట్టరా. నా పక్కన కరుచుకోని కుచ్చుందువు. నన్ను చలి ఎత్తెత్తి యేస్తా వుండాది. రా" అని పిలిచేది. అదే మంచి సందు అనుకొని, "అమా, ఆకిలిగాని, చద్ది లేకుండా ఎట్టమా?" అని అంటా మా అమ్మ పక్కలో కూచ్చుని గెట్టంగా మా అమ్మ మోకాళ్ళను పట్టుకొనే వాడ్ని.

నేను అనిన ఈ మాటకు మా అమ్మ నా తలకాయిలో చేతులు బెట్టి దువ్వతా, "ఇంత చలిలో చద్ది తాగను ఎట్ట సగిస్తిందిరా నీకు, నాశినం–" అని మా అమ్మ చద్ది మీద రోత పడేది. ఆ మనిసితో యింగేమీ మాట్లాడ లేక నేను మా అమ్మ పక్కలో నుంచే మా నాయిన కల్లా చూసే వాడ్ని. మా నాయిన, 'నువ్వే మీయమ్మతో ఇంగొకమాట ఎగస్టాగా అని చూడు' అన్నట్టు నాకల్లానే చూసే వాడు. మా నాయినే మా అమ్మ దగ్గిర నోటి మాట ఎత్తడానికి బయపడి చస్తాడు గాని – మా అమ్మ అంటే నాకేమన్నా బయమా, బక్తా? అనుకొని నేను, "ఎట్టా ఇంట్లో చద్దిలేదు గదమా. పొయ్యి మంటేసి సంగటి

జేసెయ్. తలా ఒక ముద్ద తినేద్దారి" అని ఎంతో జోరుగా అంటే, అందుకు మా అమ్మ, "చూస్తా వుండావు గదరా సినబ్బా నువ్వే– నా వనవాసరం, వుండే నాలుగు కట్టిలు వానకు తడిసి పొయ్ పాములు పాములుగా వుండాయి, కనబళ్లా?" అనేది. ఆమె యాక్సను చూస్తా వుంటే తెల్లారికి మమ్మల్నందిర్నీ పొస్తులు బెట్టేసి, ఆ నానుడు కట్టిల్తో ఏ అగచాట్లో పడి మా అందరికీ మద్యానం సంగటి చేసేటట్టు వుండాది. మా అమ్మను నేను, నియ్యమ్మా నంగి నాయాలీముండా–అని లోపల్లోపల్నే తిట్టుకుని, మా నాయినకల్లా చూస్తే, మా నాయిన నన్ను 'ఇట్టరా' అని కంటితోనే సైగ జేసినాడు. నేనూ మా నాయినా నెత్తిన పై గుడ్డలు వేసుకొని వీదిలోకి పోతా వుంటే మా అమ్మ, 'యాడికో అబ్బాగొడుకులు?' అని అనుకుని వుంటాది గాని, మేము నేరుగా మా గొడ్ల కొట్టాంలోకి వస్తిమి. మా నాయిన నన్ను పైకెత్తి చూరు పట్టిస్తే నేను అటవ ఎక్కేసినాను.

ఆ అటవలో దొబ్బుమాలినన్ని వుండాయి – కట్టిలు. నేను రెట్ట లావు వుండే కట్టిల్ని సందెడుతో సందెడు జవురుకొని అటవ మీద నుంచి కిందేసినాను. మా నాయిన నన్ను కిందకు దించుకుని, కట్టిల్ని సందిట్లో పెట్టుకోంగా – ఇద్దరమూ ఇంట్లోకి పోయినాము. మా నాయిన మా అమ్మకల్లా జూసి, "యింగ మంటెయ్ పొయ్యిని!" అని సందెట్లోని కట్టిల్ని పొయ్యి దగ్గిర యేసినాడు. మా ఆరాటం చూసి మా అమ్మ నవ్వు మొకంతో, "ఏమి, మద్దానం దాక కండ్లు మూసుకొని మ్మనుండలేరా? ఉత్తర కొండను, దచ్చిన కొండను పొల్లించి దొల్లించి ఏకం జేసినారా ఏమి, అంత ఆకిల్తో వుండే అందుకు? ఒక పక్క నుంచి వూపిర్లు పోతా వుండినట్టు 'ఓ' అని ఎగర్తా వుండారే – ఆకిలి ఆకిలి అంటా?" అని తగలాటం పెట్టుకొనింది మా అమ్మ. ఉత్తర కొండను, దచ్చిన కొండను పొల్లించి దొల్లిస్తేనేనా ఆకిలి? వూరికేనే వుంటే నర మానులకు ఆకిలెయ్యదా ఏమి? ఈ వానలో గూడా ఎక్కడికి బొయ్ పని చెయ్యలేదనో ఈమికింత నిష్టూరం అనిపించి నాకు మా అమ్మ మీద చిటా అనిపించింది.

అట్ట గూడ యిపుడు చేసే అందుకు ఏమి పనులు వుండాయి? వాన దేముడు కూడా మా మాసూలంతా ఒబ్బిడి అయినాకనే వొచ్చినాడు. మొన్న మొన్న మేము మడిగోసి ఇరవై మూటల దాకా వడ్లను ఇంట్లోకి తెచ్చుకొని మా యెదురు బొట్ట నిండికి పోసుకున్నాము. పని వుండినప్పుడు ఒక్కొక్కరం

యిద్దర మనసల పని చెయ్యాలా? అప్పుడు వూరికే వుండినామా? పని లేనప్పుడు తింటా కుచ్చుంటే దాంట్లో తప్పేమి వుండాది? మా నాయిన మాటా పలుకూ లేకుండా మంచం మీద యెల్లాలకల వాలి పోతే నాకు కోపం వచ్చింది. 'ఈయనొక అతకల జచ్చిన మొగోడు. ఈయన ఈ రకంతో నోట్లో నాలిక లేకపోబట్టి గదా – ఆమి ఈ వాటంతో చేస్తా వుండేది' అనిపించి నేను మా నాయిన మీద అసింక పడినాను. చద్దేళ తిండి కోసరం నేనూ మా నాయిన ఈ మాదిరిగా గోజారతా వుండి, మా అమ్మతో పోరకలాడతా వుంటే అప్పటికే పెద్ద మనిషై పోయి వుండిన మా అక్క, మా అన్న నోటి మాట ఎత్తకుండా వుండారు. మా అక్కకైతే మా అమ్మ ఎంత చెప్పితే అంతగానే వుండేది. మా అన్న యేసింది తిని, పోసింది తాగి పొయ్యేవాడే గాని ఒక్క మాట అనే వాడు గాదు. వచ్చుండే చావంతా మా నాయినదీ, నాదిగానే వుండేది. మా నాయిన కొంచేపు మంచం మీదనే పొనుకోని వుండి, మళ్ల పైకి లేచి, "చిన్నయిలూ! ఎద్దల్ని, ఎనుమును విడువు బో, మన మాదిరిగానే అవి గూడా ఎందుకు అక్కడ చచ్చేది? వాటిని తోలక పోయి అడివికి తోలేసి వద్దారి." అని నన్ను పిలిచినాడు. మేమిద్దరం రెండు గోతాలు ఎత్తుకొని నెత్తినేసుకుని, (మా అమ్మ గొడుగు తీసిస్తే గదా మాకీ గోతాల రాత తప్పేది) గొడ్లతో గూడా అడివికి పోయి మద్యానానికంతా వచ్చి – సంగటికి కుచ్చున్నాము. మా నాయిన ఒక ముద్దను – వుప్పంగా పుల్లంగా కారంగా వుండే చింతకాయ వూరిబిండితో వూద్చుకొని తినేసి, రెండో ముద్ద కోసరం మా అమ్మకల్లా చూస్తే, "మన దరిద్రానికి, పని లేని కాలం ఆకిలి గూడా ఎక్కువవతాదిలే, పట్టు!" అని నవ్వతా మా నాయిన గిన్నిలోకి యింగొక ముద్ద తెచ్చి యేసింది.

# మా అమ్మ కడుపాత్రం

"దక్షిణ తట్టు నారప్ప పెండ్లాం మాదిరి ఆడది గాన నాకు దొరికి వుంటేనా, నా నట్టింట గోడలకు బంగారు పూత పూసేసి వుండనా?"– వురుకులు పరుగుల మింద ఆ పనీ ఈ పనీ చేసే మా అమ్మను చూసి ఒకరిద్దరు మొగోళ్లు అనే వాళ్లు. అప్పుడు మా అమ్మ నవ్వు నిండిన మొకంతో, "అయ్యో, నువ్వెప్పుడూ మా ఇల్లు చూడనే లేదో! చుట్టుపక్కల వూర్లల్లో వాళ్లంతా బండ్లు కట్టుకొని నారప్ప గోడల్ని చూసేసి పోతా వుండారే! వొచ్చి ఒక రోజు నువ్వూ చూడేమి!" అనేది ఎగతాళిగా, అట్టా అనే వాళ్లతో.

దోవన పోయే వాళ్లు అనే మాటలకేమి గాని మా అమ్మ మటుకు బలే ఆత్రం మనిషి. ఎంతో కష్టం పడి కయ్యల్లో పైర్లు ఎక్కించేసినా, మళ్ల గూడా మా అమ్మ నిమ్మళంగా వుండి రొండు గాళ్లూ ఒకచోట పెట్టేది గాదు. 'చెయ్యాల్నే గాని పనికి కరువా?' అన్నట్టు వుండేది మా అమ్మ. 'మళ్ళ దగ్గిర పనంతా అయిపొయ్యింది. ఈ రోజు అమ్మ యింటి కాడనే వుంటింది'– అని అనుకుంటామనుకో. అవితే మా అమ్మ మంచి ఎండ పూట, "సినబ్బా వొచ్చేటట్టుగా వుంటే నాతో కూడా రా" అని పిలిచేది. "యిప్పుడెక్కడికమా? యిప్పుడేం పని వుండాది మడి కాడ–" అన్నాను. "ఏమిటికి, ఎక్కడికి– అని అడక్కుండా రా, బలంతం మాత్రం లేదబ్బో" అనింది. ఆమె మాట తీరుకు నేనెంతో కుశాల పడి ఆమెతో ఎలబారినాను.

నేనూ మా అమ్మ–మా మాదిగ పల్లికీ, మా ఇస్కూలుకీ నడీ మద్యన వుండే మూడు చింత మాకుల కాడికి వచ్చినాము. ఆ మూడు చింత మాకులకూ కొంచెం తూరూగా మాకు ఒక వామి వుండాది. ఆ వామిలోనే పొగులు పూట మేము ఎద్దుల్ని కట్టేస్తాము. అక్కడనే కసువు వామి, శెనగ తీగ వామి, అవిసి కట్టెల వుద్ద వుండాయి. ఎద్దులేసే పేడకళ్లను ఎత్తి వేయడానికి వొక చిన్న మొక్క పొరక, వొక పేడ చేట, తట్ట వుండాయి మా వామి కాడ. మా అమ్మ వాటిని ఎత్తుకొని వామి ముందర వుండిన పేడ దిబ్బను దాటుకొని చింత మాకుల కాడికి వచ్చి వొంగింది.

పొద్దు నడి మిట్ట నుంచి కొంచెం పరంటగా వాలతా వాలతా వుండింది. మా అమ్మ ఎందుకని నన్ను పిలుచుకొని వచ్చిందో నాకు అర్థం అయి పోయింది. చింతాకు రాలే కాలం గాబట్టి చింత మాకుల కింద కొంచెం వత్తుగానే చింతాకు రాలి వుండింది. ఆ చింత మాకులు మావే. మావంటే మొత్తం అక్కుదారులం మేమే అని గాదు. అవి బాగాల చింత చెట్లు.

మా అమ్మ వొంగి పొరకతో తోస్తా వుంటే పరంట దిక్కుగా దుమ్ము రేగింది. మా అమ్మ దుమ్ము దూరకుండా పైట కొంగును పైన కప్పుకొని, నన్ను తూరూగా వచ్చి ఒక చోట కుచ్చోమనింది. మా అమ్మ చెప్పిన మాటను నేను విని ఒకచోట గొంతు కుచ్చున్నాను. పైకి ఎగ జూస్తే మాకులో నుంచి ఒక చింత రెమ్మ వూడి గాలికి తమాషాగా వూగతా వూగతా నేల మింద పడడానికి వస్తా వుండింది. అది పైనుంచి కిందికి దిగతా దిగతా వుంటే, ఈనెలో నుంచి ఒక్కొక్క ఆకే వూడిపోయి, గాలికి ఆ పక్కా ఈ పక్కా తిరుక్కుంటా కింద పడిపోయినాయి. రెమ్మ ఈనె– మా అమ్మ పొరకతో తోసి వేయగా తెల్లంగా సుబ్బరంగా వుండిన– నేల మింద పడింది. ఆకులు మాత్తరం చెల్లాచెదురై పోయినాయి.

మా అమ్మ కొంచేపట్లోనే ఒక చెట్టు కింద తోసేసింది. చింతాకూ దుమ్మూ కలిపి ఎనిమిది కుప్పలయినాయి. నేను చాట తీసుకొని, చింతాకును రెండు చేతుల్తో చాటలోకి తోసుకొని, దగ్గిర్లోనే వుండిన మా వామి ముందరి పేడ దిబ్బలో పోసేసినాను. మా అమ్మ మూడు మాకుల కిందా వుండిన చింతాకును తోసే సరికి నేను చాటతో చింతాకునంతా దిబ్బకు చేర్చేసినాను. నేను చింత మాకు కింద మా అమ్మకు చెయ్యి తోడు, వాక్కు తోడుగా వుండంగానే పొద్దు గూట్లో పడిపొయ్యింది. మా వూరికి వుత్తరంగా కయ్యలు వుండిన వాళ్లు నెత్తిన కసువు మోపులు పెట్టుకొని, ఎద్దుల్ని తోలుకొని ఇండ్లకు పోతుండారు. ఒక ఎద్దు మా చింత మాకుల దగ్గిరికి వచ్చే సరికి తోక పైకెత్తి వుచ్చలు పోయకుండా పేడ వేసింది. ఎద్దు నిలబడి గాకుండా పోతా పోతానే పేడ వేయడం వల్ల మా అమ్మ రెండు బారల్లోనే మూడు చోట్ల వొంగి పేడ ఎత్తుకొని చాటలో వేసుకొనింది.

మా అమ్మ, "సినబ్బా, నువ్వు గావాల్సుంటే యింటికి పో, నేను మాదిగి పల్లి దాకా పొయ్యొస్తా. గొడ్లు దోవ పొడుక్కూ పేడ యేసుకుంటా

వచ్చుంటాయి. చాటడు చిక్కినా చిక్కినట్టే గదా!" అంటా చాటతో గూడా వుత్తరంగా నడిచింది. మాదిగి పల్లి దాటి, ఎస్.వి.ఎమ్, ఎ.పి.ఎమ్ బస్సులు దుమ్ము రేపుకుంటా తిరుగులాడే రోడ్డు బాట కాడికి వచ్చి నాలుగు పేడకళ్లు ఏరుకొని యింటికొచ్చేసినాము.

ఆ రాత్రి మా అక్క నా గిన్నెలో ఉలవ గింజల కూర వేస్తా వుంటే మా అమ్మ అడ్డం పడి, "వొద్దమ్మా, వొద్దు. నా సిన్న కొడుకు ఈ రోజు నన్ను కాపెట్టుకునే వుండి కస్టపణ్ణాడు. నేను చింతాకు తోసే కొందికి, చేటతో ఎత్తక పోయి దిబ్బలో పోసినాడు. వోడు, ఆ కూరతో తినలేడు" అంటా ముదిగారానికి పోయి, వుల్లగడ్డల కూర వేయించుకొని వస్తానని చెప్పి మా పెద నాయినోళ్ల యింటికి పోయింది మా అమ్మ.

# రాత్రి పూట మా అమ్మ గోష్ఠ

**మా** అమ్మకు నులక మంచం మీద పొనుకోని నిద్ర బోవాలని బలే కలవరంగా వుండేది. మాకు వుండే ఒక్కగానొక్క నులక మంచాన్ని మా నాయిన వక్క కొరికినంత సేపు గూడా ఏమారే వాడు గాదు. ఇంక పొనుకోబోతాడనంగా, ఎద్దల ముందర ఎండు కసువు యేసేసి రావడానికి మా నాయిన కొట్టంలోకి పోతాడు గదా, ఆ సందు జూసుకొని మా అమ్మ మంచం మీద నడుము అట్ట వాల్చంగానే, మా నాయిన – ఇందాక మంచం మీద ఏందో పెట్టి మరచి పోయిన వస్తువును యెతుకులాడదాం అన్నట్టు గబ గబా వచ్చి నిలబడి, "వొకే తూగుగా వుండాది, నాకు. లెయ్, పొనుకోని కన్ను మూస్తా." అని తల గీరుకొనే వాడు. 'నడుములు నిలబడక గదా ఆ మనిషి పొనుకొనింది. పొనుకోనీలే, మనం కొంచేపు వీధిలో వుండే బండ మీద కూచ్చుందాం!' అని అనుకోకుండా మా అమ్మ ఆ మంచం మీద నుంచి లేచే దాకా మా నాయిన ఒంటి కాలి మీద నిలబడే వాడు.

మా అమ్మ మా నాయిన మీద నిష్టూరంతో, "కర్ముడా! నీకు రాలేదే చావు?" అని పొదుగ్గా గాలి వొదిలి, మంచం మీద నుంచి పైకి లేవడానికి ఒళ్లు అలిసి పోయిన మా అమ్మ ఆపసోపాలు పడేది. ఈ కాసింత మాటకే మా నాయిన మూతి మూరడు పొడుగు పెట్టుకోని, పైగుడ్డను వుత్త నేల మీద పరిచి, మోచేతిని తల కింద బెట్టుకొని వొడ్డిగిల పొనుకునే వాడు. మా నాయిన బెదిరింపును జూసి మా అమ్మ, "ఏం పరవాలేదులే, పొనుకో, నిన్ను కట్టుకున్నప్పుటి నుంచి నేను పొనుకోవాటం లా, ఆ వాటంగా? ఈ వొక్క రోజుటికి పొనుకో, ఏ అరిగి పోవులే!" అని, అంతలోపే, "ఆ యెదవనే వచ్చి కూలిపొమ్మను మంచమ్మింద, మనమే పొనుకుందాం కింద. తెల్లారే కొందికి చచ్చి పోతామేమో చూద్దారి!" అని పొనుకొనిన నన్ను లేవగొట్టేది. నేనూ మా అమ్మ మంచం మీద నుంచి లేచి పోయినాక, మా నాయిన పిల్లి మాదిరిగా మంచమెక్కి నిగడ దన్నుకోని, ఎద్దు బుస గొట్టినట్టు, గురక బెట్టే వాడు. ఇదంతా ఏమిటికి! ఫలిత కాలంలో కళ్లాంలో వుండే వడ్ల రాశికి కావలిగా రాత్రి పూట మా నాయిన పోతాడు గదా. "మంచాన్ని ఈడనే వుండీబో" అని మా అమ్మ – పసి బిడ్డ దూది మిటాయిని అడిగినట్టు అడిగినా,

మా నాయిన మంచాన్ని యింట్లో వుండనిచ్చే వాడు గాడు. దాన్ని పాలుమారకుండా ఎత్తి నెత్తిన బెట్టుకొని గనిమల మీద పడతా లేస్తా, మడి కాడికి ఎత్తుకొని పొయ్యేవాడు, 'కింద పొనుకుంటే, ఒళ్ళు నెప్పులు మళ్ల రెండు నాళ్ళు పోవు నాకు' అని అనేసి. మా అమ్మ మంచాన్ని అడిగి నోరు కడుక్కునేదే గాని, ఆమికి మంచం మాత్రం దక్కేది గాదు. మంచం మీద పొనుకోవాలని మా అమ్మకు ఎంత కలవరం రా... అంటే, మా పెద నాయిన కొడుకు కుప్పన్న ఆ పనీ ఈ పనీ అంటా ఎప్పుడూ తిరపతికి పోతా వస్తా వుండేవాడు. ఆయన ఒకొక్క దపా రాత్తిర్లు గూడా తిరప్తిలోనే నిలిచి పొయ్యే వాడు. తిరప్తి నుంచి మా వూరి రోడ్డు బాట మీదుగా ఆర్సిలీ కొండలకు బోయే లాస్టు బస్సు ఆరను వినిన మా అమ్మ బలే కరుకైన గొంతుతో, "సినబ్బా యింక మీ పెద్దన్న రాడుగాని, ఒక మంచం మిగలాగా వుంటుంది గదా, వాళ్ల యింట్లో. వీదిలో యేసుకొని పొనుకుందాం పదరా" అని లేపి, మా పెద నాయిన యింట్లో వుండే మంచాన్ని తెచ్చుకొని వీదిలో వేసి, నన్ను పక్కలో వేసుకొని పొనుకునేది మా అమ్మ. అటుమంటప్పుడు, తెల్లారినాక ఆ రాత్రి నిద్రబోయిన తీరును గురించి మా అమ్మ ఎంతో కుశాలగా, "సినబ్బా రాత్రి నా వొళ్లు నాకు తెలవలా, నా జీవుడు యాడేడ తిరిగినాడో గాని, నేను బోయిన మొద్దు నిద్ర అంతా యింతా గాదురా" అని చెప్పుకొనేది.

రాత్రి పూట మా అమ్మకు ఒక లాగాన పక్క కుదిరేది కాదు. మాకు చింపిరి చాపలు రెండు వుండేవి. వాటిని అంటేసి నేలమీద పరిచి, మా అమ్మ, నేను, మా అక్క పొనుకునే వాళ్లము. నాకు గాని, మా అక్కకు గాని దుండు అలవాటు వుండేది గాదు. తవుడుతో మూట గట్టిన ఒక దుండును మా అమ్మ తల కింద బెట్టుకొని కింద ఏ రకం మెత్తా లేకపోవడం వల్ల పక్కలు నెప్పి బుట్టిన మా అమ్మ సగించీ సగించనట్టు నిద్రను తెచ్చుకొనేది. పొగులంతా రొండు గాళ్లు ఒక చోట పెట్టకుండా పని మీద అల్లాడి ఆకులు మేసే మా అమ్మ ఎప్పుడూ, 'వొళ్లంతా సూదుల్తో పొడిచినట్టుగా వుండాదిరా' అని అంటా వుండేది. ఈ మాదిరిగా పక్క మీద సౌక్రిం కుదరక తపన బడే మా అమ్మకు, పక్కన్నే పొనుకునే నా పోరు పెద్దదిగా వుండేది. నేను పరంట పక్కకు తలకాయ బెట్టుకొని, తూరాగా కాళ్లు బెట్టుకొని పొనుకుంటాను గదా! ఆ మాదిరిగా పొనుకున్న వాడ్ని నా మానాన నేను నిద్రబోకుండా, నుసల్తా,

మెసల్తా ఆ రాత్రంతా మా అమ్మ మానాన్ని తీసి మాకులకు కట్టేసి యేడికి చూస్తానంట. నేను పొనుకున్నోడ్ని పొనుకున్నట్టే వుండకుండా నిద్రలో మోచేతుల్తో మోకాళ్లతో మా అమ్మను 'ఓ' అని కుమ్మేస్తానంట. మా అమ్మ మీద కాళ్లూ చేతులు వెయ్యకుంటే, నాకు నిద్ర అనేది పట్టేదే కాదుగాని, మోకాళ్లతో మోచేతల్తో నేనేమిటికి కుమ్మతాను– అనిపించి మా అమ్మ చెప్పేవన్నీ అపద్దాలనుకునే వాడ్ని. రాత్రి పూట నడి జాము కాడ, మా అమ్మ పక్కలో పొనుకున్న వాడ్ని దొల్లుకుంటా దొల్లుకుంటా, పొయ్యి దగ్గిరికి వచ్చి పుల్లా పుడక తగలంగా బిత్తరపోయి అరిచేస్తే, మా అమ్మ మళ్లీ నన్ను పక్కలో వేసుకొనేది. అవును, రాత్రి పూట మనం మన అమ్మ తల కాడ గుండుగానే వుండాం – అనిపించి నాకు చిన్నతనంగా వుండేది. అప్పుడప్పుడూ మా అమ్మ, తమాసకు, నన్ను పక్కలోకి చేరనీకుండా, "నా కస్టం యింకా తినాలనుకుంటే, నా పక్కలో పొనుకొని చంపద్దు. మీ అయ్య దగ్గిర పొనుకోబో" అనేది. మా నాయిన, "చిన్నయిలూ పొనుకుందువురా" అని మంచం మీద చోటు చూపించే వాడు.

మా అమ్మ పది సందేళలు ఒళ్లుకు నీళ్లు పోసుకోకనే వుంటే మాత్రం ఏమి, ఆమె కట్టుకున్న గుడ్డల్ని పదైదు నాళ్లు విప్పకుంటే మాత్రం ఏమి – ఆమి దగ్గర పొనుకుంటే చాలు అప్పుడే మూదేవి నా మీద వాలి, నేను నిద్రబొయ్యే వాడ్ని. మా నాయిన అప్పుడే నీళ్లు బోసుకొని పెళ్లో నుంచి వచ్చినా చిటిక యేసినంతలో ఆయనకు గుబగుబమని చెమట బట్టేసేది. నా కాళ్ల కాడ కోటి వరాలు కుమ్మరించినా, మా నాయిన పక్కలో నేను పొనుకోలేను సామీ.

మా అమ్మ అనిన ఆ మాటకు నేను మూతి నల్లంగా పెట్టుకొని, గోడ వారగా కూచ్చుంటే మా అమ్మ నవ్వు మొకంతో చాప మీద జరిగి, "రారా, నా సిన్న కొడకా, నీ దగ్గిర కాళ్లతో చేతల్తో కుమ్మించుకోకుంటే నాకు మాత్రం నిద్ర బడితిందా." అని నన్ను పిలిచేది. కోటి వరాలు చేసే ఆ మాట వినంగానే, నేను మా అమ్మ పక్కలో చేరుకొని మా అమ్మ వాసనను మూచూస్తా నేను ఒళ్లు తెలవని నిద్రను పొయ్యేవాడ్ని.

చలి కాలమన్నా సరే అనుకోవచ్చు గాని, ఎండా కాలంలో నిద్ర మా అమ్మకు యింకా తల కొరివిగా వుండేది. గాలి వస్తా, పోతా వుండే ఇల్లు

గాదు మాది. ఎండా కాలంలో మా అక్క ఒకటే తలుపులు తెరిచేసి యింట్లో పొనుకునేది గాని, మా అమ్మ, నేను వీధిలో పొనుకునే వాళ్లం. మా పెద నాయినోళ్ల యింటి ముందర నిలువుల మీద ఆనించి, ఒక మందంగా వుండే బండ వుండేది. ఆ బండ పొగులంతా ఎండకు 'ఓ' అని కాగి మేము పొనుకునే సరికి–దోసిలు బోసుకునే పెనుం మాదిరిగా వుండేది. మా అమ్మ సందేళ సందేళ మడి కాడ నుంచి రాంగానే దాని మీద వరసగా నాలుగైదు ముంతలు నీళ్లు జల్లినా అది చల్లబడి చచ్చేది గాదు. ఒక్కొక్క రోజవితే, పని మీద బడి నీళ్లు చల్లాటమే మరిచి పొయ్యేది. ఆ వుడుకు బండ మీద నన్ను పండేసుకుని, మా అమ్మ –పక్కన్నే మంచం మీద పొనుకోని వుండే మా నాయిన మీద నిష్టూరంతో అదీ యిదీ సొనగతా వుండేది. "తెల్లారే కొందికి ఈ వుడుకు బండ మీద నేనూ నా కొడుకు ఆవిరై పోతాము. మళ్ల రామ రామా అంటా నువ్వే రాజ్జిమేలుకుందువులే!" అని మా నాయినతో నసకు దిగేది. మా నాయిన మా అమ్మ కాళ్ల కాడ జేరి, "సినబ్బ యింట్లోకి బోయి అమ్మి పక్కలో పొనుకుంటాడులే, నువ్వు రాయేమి, మంచం మీద పొనుకుందువు" అని మా అమ్మను పిలిచేవాడు. మా అమ్మ ఈ మాటలకు శివంగి మాదిరిగా పైకి లేచి, "కొత్త పెండ్లి కూతుర్ని పిలిచినట్టు పిలస్తా వుండావే, మొగుడా. మరేదగా పోయి పొనుకోబో. పైకి లేచినానంటే మెడ జివ్వలకు బట్టి వొగటిస్తా!" అనేది. ఈ మాటలతో మా నాయిన నోటి మాటెత్తకుండా మంచమ్మీద పొనుకోంగానే, నేనూ మా అమ్మా ఆ వుడుకు బండ మీద 'ఓ' అని నవ్వుకొనే వాళ్ళం.

# బతకాలని బండాట

ఉండినంతలో మేము అందరి వొప్పందం బాగానే బతకతా వుండినట్టు నాకు అనిపించేది. కానీ మా అమ్మ మాటలు వింటే మటుకు – మా అమ్మ ఎంతో బీదరాలుగా, మా నాయిన ఒక దీనుడిగా, వాళ్ళ కడుపున పుట్టిన మా అన్న, మా అక్క, నేను – ముందు జల్మలో కర్మాలు చేసుకున్నట్టుగా అనిపించేది. మా అమ్మ చేసిన అర ముద్ద సంగటి తినేసి నాలుగు గళాసుల నీళ్ళు తాగేసినాక – నన్ను మించినోడు ఈ కలిగ్గాన లేనట్టుగా నేను ఎంతో కుశాల పడిపొయ్యే వాణ్ణి. నా కుశాలను చూసి మా అమ్మ ఎంతో తియ్యంగా వుండే గొంతుతో, “నా గుక్కెడూపిరి పోతే నువ్వు ఈ ఎండలు కాసే బూమండలం మింద ఎట్టా బతకతావురా, నా ఎఱ్రి సిన్న కొడకా!” అనేది. నేను ఒంటి మింద రసి కారతా వుండే మూడు నాలుగు పుండ్లు పెట్టుకుని, చమురు లేని తలకాయను చీకేసిన తాటిపండు మాదిరి పెట్టుకొని, పిఱ్రల కాడ చినిగి పోయిన నిక్కరును – నాలుగు గుండీలు వూడి పోయిన ఆ నిక్కరును మొలతాడు బలం మింద అంటి పెట్టుకోని వుంటే, వీపు మింద ఏ రకం చొక్కాయా లేకుండా, “నాకేం కొదవ మే, నువ్వు మాటలాడే కుళ్ళు మాటలకు ఏం వుండాదిలే గాని” అనే వాడ్ని.

ఒకసారి మా తూరూగా మడి గనిమల మింద మా అమ్మ శొంఠి కసువును కొడవలితో కోసుకుంటా వుంటే నేను పక్కన్నే వుండినాను. అపుడు మా వరి మడి పొట్ట కరుకు మింద వుండింది. ఈనబడిన గొడ్డు మాదిరి మా నాలుగు కయ్యిలు కంటికి ఎంతో నిండుగా కనిపించినాయి. నేను తమాసకు మా వరి మడి పొట్టలో నుంచి ఒక ఎన్నును పెరికేసినాక, మా అమ్మకు చూపించినాను. మా అమ్మ కోపం పడకుండా, ‘నీతో ఎట్ట వేగులాడేదిరా’ అన్నట్టు, “ఇట్టా కోతి పనులు గాన చేసినావంటే యింగెప్పుడూ మడి కాడికి నిన్ను తొడుకోని రానురే!” అని బెదిరిచ్చింది. ఆ బెదిరింపులకు నేను బయపడకుండా నేను ఆ ఎన్నును కొలత వేస్తే నా మూరడుతో మూరడు వుండింది. ఆ ఎన్ను పొడుగును చూసి నేను బిత్తర పోయినట్టుగా, “అమా అమా, మూరడు పొడుగు వుండాది. ఇంగ మనకేం కొదవ మే? అయ్యో

అయ్యో – మనం కోరినన్ని వడ్లగింజిలవతాయి. మన బిడ్డలు, బిడ్లకు బిడ్లు తినినా ఈ వడ్లు అయిపోతాయా?" అని అరిచేసినాను. మా అమ్మ, అక్కడ మేమిద్దరమే గాక యింకెవరో ఒక మనిషి వుండినట్టు, "కొట్టరా వాడ్ని మూతికి పట్టి చెప్పుతో" అనింది. "నా మాట అపద్దమైతే చూడమా. ఎన్ను మూరడు వుండాది. ఈ పద్దైదు గుంటలూ నలపై అయిదు మూటలు గావా ఏమి?" అనడిగినాను. నా మాటలకు మా అమ్మ బదులుగా, "పైరుకు దిష్టి పెట్టద్దు. గమ్మునుండు. మఖా అయితే గుంట రెండు మూటలవబోతాది. ఆ లెక్కన ముప్పై మూటలే గదా!" అనేది. నేను కూడా మా అమ్మ లెక్కనే ఒప్పుకుని "ముప్పై మూటలు అవితే మాత్రం అవేమన్నా తక్కవా? సమ్మచ్చరానికి మనం మఖా అవితే – రోజుకు ఆరు పూటలు తిన్నా – ఆరు మూటల వడ్లు తినబోతాం. అయిదు సమ్మచ్చరాలు, మన కింకేమీ కొదవలా. కాలు మింద కాలేసుకోవచ్చు, పో" అనేసినాను. 'కళ్యాంలోనే ఇరవై మూటలు కొలత వెయ్యాల రా. లేకుంటే నీ అమ్మా మొగుళ్ళు ఒప్పుకుందురా ఏమి?' అనేది అప్పులోళ్లకు బయపడి మా అమ్మ. 'మనకేమి కొదవ లే' అని నేనన్నప్పుడల్లా మా అమ్మ ఈ రకంగా నిప్పుల మింద నీళ్ళు జల్లినట్లుగా మాట్లాడేసును.

అదే వరి మడి మంచి ఎండల్లో కోతకు వచ్చింది. 'ఇంతకు మించిన పని మనకేముండాది లే. ఈ పనవతానే మళ్ళ గింజను కర్చు జేసుకుంటా తిని కూచ్చోవడమే గదా' అనుకొని మా అమ్మ ఒక్క కూలి మనిసిని కూడా పిలవక పోవడంతో మా ఇంట్లో మనుసులమే రోజూ వరి మడి కోసుకున్నాం. పైరు మొలగొలుకులు కావడం వల్లా, మంచి సత్తవ వేయడం వల్ల మోకాటెత్తు పెరిగింది. వరిపైరు బాగా గంటలు కూడా కట్టింది. కోస్తే పిడికిడుతో పిడికిడయ్యేది. ఆ పిడికిడూ వాది వెయ్యాలంటే, దాన్ని లేపలేక రెక్కలు బరువుతో గుంజుకు పొయ్యేది. ఈ మాదిర అయిదు రోజులు కోస్తే గాని ఆ పద్దైదు గుంటలూ మేము కొయ్యలేక పోయినాం. అంతా అయిపోయినాక మా నాయిన, మా అన్న, మా అక్క, నేను, "అమ్మ, కోత పనై పోయింది" అని పొడుగ్గా గాలి పీల్చుకున్నాం.

మా అమ్మ మటుకు నన్ను పిలిచి కోత అయిపోయినాక మొక్కలతో వుండిన మా కయ్యలను చూస్తా, "సినబ్బా, ఇదంతా దేముడి మహిమ వల్ల

మళ్లా పైరయి పోయిందనుకో. మనం మళ్ళా కోసుకోమా! కష్టానికి వెరుస్తామా రా?" అనింది. ఆ మనిషిని మేం నలగరం యిచిత్ర పోయి చూస్తిమి. ఆ సందేళ మా అమ్మ రెండు బకిడీల నీళ్ళను కాగబెట్టుకుని పెరట్లో కూర్చునింది. మా అక్క అపుడు పొయ్యి దగ్గర కూచ్చోని కూడు చేస్తా వుండింది. మా అమ్మ వీపు రుద్దించుకోవడానికి నన్ను పిలిచింది. జానా బిత్తెడు మనిషైన మా అమ్మ వొళ్లు తేలిక పడాలని ఎంతో వుడుకుడుగ్గా నీళ్ళు పోసుకొనింది. మా అమ్మ ఒక్క ముంత నీళ్ళను పోసుకుని, సగించినట్టుగా ఆ పెరట్లో అట్టనే రెండు నిమిసాల పాటు గమ్మున వుండి పోయింది. కొంచేపు తాలినాక మా అమ్మ తడి ఆరతా ఆరతా వుండిన వీపును నా కల్లా మళ్ళించి, "సినబ్బా, నిదానంగా ఈపు రుద్దరా" అనింది. నేను మా అమ్మ ఈపును గోళ్ళతో గోకి ఇబ్బంది పెట్టకుండా అరి చేతుల్తో మా అమ్మకు సగించేటట్టుగా రుద్దినాను. నేను రుద్దే కొందికి మా అమ్మ ఒంటి మింద మట్టి రేళ్లు రేళ్లుగా లేవడం మొదలు పెట్టింది. ఆ మట్టినంతా చేరడు నీళ్లతో కడిగేసి మా అమ్మ వీపును మళ్లా నున్నటి రాయితో రుద్దినాను. నేను అందుకు ఎంతో కుశాల పడి, "అమ్మా, నీ కాళ్ళూ జేతుల మింద ఎంత మట్టి పేరుకు పోయిందో పట్టు" అని, ఆ పక్కకు తిరిగి మా అమ్మ కాళ్ళూ జేతులూ రుద్దినాను. అంతా రుద్దేసినాక మా అమ్మ వొంటి మింద – ఆ వుడుకు నీళ్ళను ముంతతో నిలుకు లేకుండా కుమ్మరించినాను. ఆ రోజు మా అమ్మకు నేనే నీళ్ళు పోసినాను.

ఎంతో తేలిక పడి మా అమ్మ – మా నాయిన ఇంట్లో లేనిది చూసి నులక మంచం మింద పడక యేసేసింది. అయిదు నిమిసాలల్లో మా అమ్మకు చలీజరం వచ్చి వొళ్ళు కుదేసేసింది. అంతలోనే మా అమ్మ వొళ్ళంతా చలవలు కమ్ముకు పోయింది. జిల్లుమని అయిసును పట్టుకున్నట్టుగా మా అమ్మ వొళ్లు శీతలం కమ్ముకుని పోయింది. మంచం దగ్గిరికి బిత్తరపోయి చేరిన నన్ను మా అమ్మ దగ్గిరికి తీసుకుని తడుములాడతా వుండంగానే మా అమ్మకు నోటి మాట పడిపోయింది. ఊపిరాడనట్టయి పోయింది. మా అక్క లబలబా నోరు కొట్టుకుని శీతలం కమ్ముకు పోయిన మా అమ్మ అరికాళ్ళనూ, అరి చేతులనూ ముద్ద పసుపుతో వుడుకు బుట్టేటట్టు గెట్టంగా రుద్దడం మొదలు పెట్టింది. మా అమ్మ నా వొళ్ళో తలబెట్టుకుని కండ్లు మూసుకుని తల

వాలేసేసింది. మా అమ్మ చచ్చి పోయిందని మా అక్కా, మా నాయినా ఓ అని వూరెత్తుకు పొయ్యేటట్టు ఏడ్చేసినారు. నాకు గుండె కాయల్లో గాలి లేక ఊపిరి తిరగ లేదు. నా నడుములు విరిగి పోయినట్టు వొంట్లో సత్తా లేకుండా పోయింది. నిర్జీవంగా వుండిన మా అమ్మను విడిచి పెట్టి, మా నట్టింట దీగూడు ముందు జేరి, నోట మాట బెట్టకుండా మనసులోనే, "సుబ్రమణి సామీ, మా అమ్మను బతికిచ్చు, చచ్చిపోయిన మా అమ్మను నువ్వుగాన బతికిచ్చినావంటే, నేను పెద్దయినాక బాగా సంపాదిచ్చి నీ వుండీలో వెయ్యిన్ని నూట పదార్లు యేస్తా సామీ" అని మొక్కుకున్నాను. బయట మా అక్క ఒక పక్క మా అమ్మ మింద పడి గుండెలు కొట్టుకుంటా ఏడస్తానే, ఇంకొక పక్క పసుపుతో అరికాళ్ళు, అరిచేతులూ రుద్దేయడం వల్ల మా అమ్మ సోదీనంలోకి వచ్చి, ఏడుస్తున్న వాళ్ళను జూసి – వొద్దని తలాడించింది.

ఆ రాత్రి తొమ్మిది గంటలకంతా మా అమ్మ మన మనిసై చారూ కూడూ తినింది. అప్పుడు మా అన్న, మా నాయిన, మా అక్క కూడా నాకు మాదిరిగానే "మనకేమి కొదవ? దేముడిచ్చిన బూమి కాసింత వుండాది గదా. నువ్వు ఆత్రం తగ్గించు. ఒంటికి మించిన కష్టం నువ్వు పడబోక" అన్నారు. అపుడు మా అమ్మ నవ్వు మొకాన్ని దాచుకోని, "పాలు మాదిరి కాస్తా వుండాది యెన్నెల, పదండి. మడికాడికి పోయి, వాదులను కట్టలు గట్టి వుడ్దేద్దాం" అని అంటా వుంటే, మేం అదరం మా అమ్మను పటాల్లో వుండే దేవత మాదిరిగా అనుకొని పకపకా నవ్వేసినాం.

# నాది కడుపు గాదు,
# రాయల చెరువు తూము!

"నియ్యమ్మా కోతి మొకం నాయాలీ ముండా, నిన్ను ఒక్కసారి గదా మెట్టుతో గొట్టేది–గిన్నిలో కూడేసుకొని ఈదిలోకి బోవద్దే అని!" –అని మా నాయిన నెత్తిన నోరు బెట్టుకుని 'ఓ' అని సొనగతా వుండినా మా అమ్మ యినిపిచ్చుకోకుండా, గిన్నిలో కూడేసుకున్న పాటిన్నే మా గడప దిగి ఈదిలోకి బొయ్యేది. మా నాయిన్ను లెక్కలో యేసుకోకుండా పోయిన మా అమ్మను జూసి, మా నాయిన, "ఇడిసి పెట్టేసిన దాంతో యింగ మాట్లాడేదే ముండాది?"– అని ఆ మంచం మిందనే యెల్లాలకల పొనుకోని కుళప రోగంతో కుల్లి పోతా వుండేవాడు. మా నాయిన అనిన పై మాటను బొటువుగా వినిన నేను, మా నాయిన చేతలకు తగలకుండా దూరంగా వుండి, మా నాయిన కాళ్ల వేళ్ళను బట్టి పెరికేసి, "నువ్వు గానియ్యే నారప్పా! నిన్నే లేరా నాయినా–యిడిసి పెట్టకుండా ఇంతింత పొడుగు పగ్గాలతో కట్టేసి వుండేది!" అని ఒక సూది మాటను అనేసి మా అమ్మతో గూడ నేనూ గడప దిగేసే వాడ్ని. గిన్నిలో కూడు యేసుకొని ఈదులు దిరిగే తీరుబాటు – మా అమ్మకు పొగులు పూట యాడ వుంటింది? ఈ ముదిగారం అంతా రాత్రి పూటే జరిగేది. మా అమ్మ ఈదిలో ఆ కాసింత దూరమూ నడస్తా నడస్తానే–మా ఇంట్లో యేసుకున్న మా కూరను, కాసింత కూట్లో కలిపి ఒక పిడసను నోట్లో యేసుకొనేది. ఈ లోపల్నే మా అమ్మ రావాలనుకొన్న బక్కమ్మ యిల్లు రానే వచ్చేది. మా అమ్మ బక్కమ్మోళ్ల దాలముందరానికి ఆనుకోని గొంతు కూచ్చొని, "బక్కమ్మా, ఏం కూర మే!" అనడిగి, వాళ్లది ఏమి కూరన్నా గానియ్యండి ఒక్క గెంటిడు కూరను కూట్లో యెయ్యించు కొనేది. మా అమ్మ కల్లా యెగ జూపెట్టుకుని వుండే నన్ను, "సినబ్బా బక్కమ్మోళ్ల కూర బలే వుండాది, తింటావా రా!" అనడిగి, అడిగీ అడగంగానే చేత్తో ఒక పిడసను బట్టుకోని నా నోట్లోకి చాపేది. నేను అంతకు ముందర్నే గదా మా యింట్లో తిని వుంటిని. నా కడుపులోకి యింత లోకే ఏ దూము గంగమ్మ జొరబడి

వుండును? అదేమి నాశినమో ఒక్కో కూరకు ఒక్కో కడుపు లెక్కన, నాకు యెన్ని కడుపులు వుండాయో–పైన మండేవోడికి దా తెలవాల. మా ఇంట్లో వొట్టి మిరక్కాయ కూర చేస్తే– 'యాడన్నా కూరెయ్యించు కొని రాబో'– అని మా అమ్మ మిందికి వొంటి కాలి మింద పొయ్యే నేను–బక్కమ్మోళ్ల వొట్టి మిరక్కాయ కూరతో మా అమ్మ కూడును కలిపి కలిపి పెడతా వుంటే– నేను వొద్దనకుండా ఏడెనిమిది పిడసల్ను లడ్డూ మిటాయి మాదిరిగా వరసగా తినేసి, మళ్లా మా అమ్మ కల్లా తలెత్తి, "యింగ నా కొద్దు తల్లా, నా వల్ల గాదు" అనేవాడ్ని పెద్ద సేద్యం చేసి అలిసి పోయిన మొగలాయి మాదిరి! అపుడు మా అమ్మ, "యింగ వొద్దనే దానికి నా గిన్నిలో కూడు యాడిదిరా కడుపోడా! పెట్టే కొందికి తినెయ్యను దా తినేస్తివి గదరా!" అనేది.

నన్ను ఎప్పుడెప్పుడు ఒక మాట అందామా అని కాపెట్టుకొని వుండే బక్కమ్మత్త, "ఏమిరా సినబ్బా, నువ్వేమన్నా ఆడదానివా? నీ కెప్పుడూ ఆడోళ్లతో– యిరై నాలుగ్గంట్లూ–ఏమి పనిరా! ఏమి సినమ్మా–వీడికి నువ్వు యింగా వొళ్లో కూచ్చన బెట్టుకొని పాలిస్తా వుండావా ఎట్ట?" అని బక్కమ్మత్త నాతో, మా అమ్మతో ఒకేసారిగా మాట్లాడి, "సినమ్మా, కూడు దండిగా వుండాది యింట్లో. ఇంగవేసి పెట్టిన చారు గూడా గమగమ అంటా ముక్కల్ని అదర గొట్టేస్తా వుండాయి. తిందువుండు" అని బక్కమ్మత్త వాళ్ల యింట్లేకి బోయి, కూటి బొవానితో మా అమ్మ దగ్గిరికి వచ్చి అన్నం వెయ్య బొయ్యింది. మా అమ్మ "నాకొద్దు, సినబ్బ తినింది నాలుగు పిడసలే గదా. నాకొద్దు తల్లా, చారుంటే కొంచం బొయ్, కడుపులో ఏమో గుడగుడా అంటా వుండాది, తాగేస్తా" అని గిన్నిని బక్కమ్మకు అందకుండా కడగా బెట్టేది. మా అమ్మ ఈ మాదిరిగా ఈదల్లోకి వచ్చి ఒకరింటి కాడ ఒక కూర యెయ్యించుకొని తింటాదే గాని, పిడికిడు కూడు మాత్రం ఆమి ఊపిరి బొయ్‌నా వెయ్యించు కొనేది గాదు. బక్కమ్మ కూటి బొవాని చేతిలో బెట్టుకొని ఎంత యిద్దం జేసినా, మా అమ్మ కూడు వొద్దంటే వొద్దని–పుల్ల యించి నేలేసేసేది. "అన్నం కాడ బడాయి చూపించొద్దు. వెయ్యించుకొని తినమ్మా..." అని నేను మా అమ్మను ఎగదోలినా ఆమె యినేది గాదు. మా అమ్మతో యేగలేక బక్కమ్మత్త బొవానిని యింట్లో బెట్టేసి గిన్నిడుతో గిన్నిడు చారు మా అమ్మకు పోసేది. మా అమ్మ బక్కమ్మ పోసిన చారును నోటి కాడ బెట్టుకొని, గబక్కన తీసేసి, "తాగతావా

రా, చారు బాగుండాయి." అని నాకల్లా చూసి ముందరికి చారు గిన్నిని తోసేది. నేను బక్కమ్మత్తకు బయపడి, "నాది కడుపా రాయల చెరువు తూమా? ఏమనుకున్నావు నువ్వు నా కడుపును.. తాగెయ్, నావల్ల గాదు." అనే వాడ్ని. అప్పుడు బక్కమ్మ నా మింద యిక్కడెగిరి అక్కడ దూకేది. "తల్లి తినేటపుడు బిడ్డి దగ్గిరుండొచ్చంటరా నంగి నా బట్టా, అయిదో తరగతో ఎంతో చదువుకుంటా వుండావు గదరా, ఆ మాత్రం తెల్దా నీకు?" అని కసురుకొనేది.

# మా యమ్మకు నేను బాద గురువునంట!

మా అమ్మ అప్పుడప్పుడూ నన్ను బట్టుకోని, “సినబ్బా, నువ్వు– నన్ను బతికిచ్చేటోడివి గాదు; నన్ను ఏపిచ్చే దానికే పుట్టినట్టుండావు.” అనేది. మంచి పచ్చిక కాలంలో ఎనుమును యాడ తోలితే ఆడ– వొంకోని దాని వొళ్ళు అది తెలవకుండా మేస్తింది గదా. నేను ఇస్కూలు నుంచి రాంగానే మా అమ్మ ఎనుమును విడిచి చిన రేకల గుంట కాడికి తోలుకొని పొమ్మంటే నేను ఎంతో పనిమంతుడి మాదిరిగా తోలుకొని పొయ్యే వాడ్ని. అందాకా కట్టు గూటం కాడ దాని చావు అది చచ్చిన మా ఎనుముది–మా వూరికి దగ్గిర్లోనే వుండే చిన రేకల గుంటలో వొంగనబడి ‘ఓ’ అని మేస్తా వుంటే–నాకు కలవరమంతా యింటి కాడికి పోవాలనే వుండేది. ఆ ఒక్క గెంట సేపు గూడా ఎనుము కాడ వుండి, పొద్దు పోగొట్టాలంటే నా వల్ల గాక, యింటికి బోయి మా అమ్మతో మాటలు జెప్దామని వుండేది. దొంగోడు తలుసుకోవాల్నే గాని ఎన్ని అయిడీలు దొరకవు? ఎనుమును వీపుకు బట్టి కొట్టకుండా, దాని కాళ్లకు బట్టి వో అని కొట్టేసే వాడ్ని. పాపం, మా ఎనుముది, ‘వీడికి యిదేమి పోగాలం రా బగమంతుడా!’ అని నాకల్లా యిచ్చిత్రంతో చూసినా, నేను రెక్కార్చుకోకుండా కాళ్లకు బట్టే వాయించేసే వాడ్ని.దొక్కలకు బట్టి కొడితే బొచ్చు అంతగా వుండని మా ఎనుము మింద వాతలు కంటికి కనిపిస్తాయి గదా. ‘ఎనుమును అట్ట కొడితివేమిరా కర్మడా?’ అని మా అమ్మ మళ్ల నన్ను తిట్టదా! అందుకని నేనీ దొంగేసికం వేసి, కాళ్లకు బట్టే కొట్టి–దాన్ని మా యింటికల్లా పరుగులెత్తించే వాడ్ని. ఎనుమును తోలుకొని పొయ్‌నట్టే పొయ్, అంతట్లోనే ఇంట్లో మా అమ్మ కండ్ల ముందర నేను కన బడి పొయ్యే సరికి, మా అమ్మ, “ఏమిరా ఈనుడా! అపుడే ఎనుముందోలుకోని వచ్చేస్తివి?” అనడిగేది. నేనందుకు, “ఏమి జేద్దునమా? ఆ కూలిపొయ్‌న గొడ్డు ఎనుమైతే గదా! మనకు సరిగ్గా దొరికిందది. వూళ్లో గొడ్లన్నీ నిలుకు లేకుండా మేస్తా వుంటే–ఈ కూలిపొయ్‌న గొడ్డు మోర అట్ట వంచి మేస్తే! చిన రేకల గుంటలో నిలబడుకోని మోర పైకెత్తుకోనే వుండింది. దానికి దూడ మింద కలవరం అమా! ఆ కలవరంతో అది–నేను ఎంత నిలేసినా నిలవకుండా, ఇంటికి వొంయ్యక్ వొంయ్యక్ అంటా పరిగెత్తతా వచ్చేసింది.

చచ్చినానుకో దాన్ని నిలెయ్యలేక!" అని మా అమ్మకు జల్లి చెప్పేసే వాడ్ని. (నిజంగానే ఎనుము ఈనిన నాలుగైదు దినాలు మాత్రం అది మేతను గూడా లెక్కలో యేసుకోకుండా ఎప్పుడెప్పుడు బిడ్డ దగ్గిరికి పరిగెత్తేద్దామా అని పరిగెత్తేసేది, మనం ఎంత నిలేసినా.) మా అమ్మ ఆ కాసేపు నిదానం మింద నా మాటల్నన్నిట్నీ యినుకోని, మళ్లా, "దానికేమి దూము రోగం రా! ఈని నెలయింది గదా, యింకా దేనికుంటాది దూడ మింద కలవరం! మంచి పచ్చిక కాలంలో మెయ్యకుండా–" అని ఎనుమును మళ్లా తోలుకొని చిన రేకల గుంట కాడికి వచ్చేది. ఆ గుంట కాడ ఎనుము వొంచిన మూతిని ఎత్తకుండా మేస్తానే వుండేది. మా అమ్మకు అప్పుడు నా దొంగేసికం తెలిసి పోయి, "నా బట్టా, ఈ వొగిసులో అప్పుడే జల్లి జెప్పేది గూడ నేర్చుకున్నావా? నిన్నేమి అనాల్సింది పన్లా. నా కడుపట్టాంటిది. దానికి బట్టి కొట్టుకోవాల నేను. నువ్వు బతికిచ్చే వాడివి గాదుబో నా కొడకా, నన్ను ఏపిచ్చే వోడివే!" అని నిష్టూరం మాటలన్నీ మాట్లాడి నన్ను ఎనుము కాడనే బెట్టి, మా అమ్మ యింటికి బోయి ఎసురు బెట్టుకొనేది.

మా అమ్మ జెప్పినట్టు నేను ఏపించే వాడ్నే గాకపోతే సమ్మచ్చరంలో రెండుసార్లు శెనగ తోటను పెరకతాం గదా. ఆ కాలంలో నా నోటికి అడ్డమనేదే వుండేది గాదు. ఎప్పుడూ పచ్చి చెనిక్కాయల్నో, లేదంటే వాటిని కాల్చుకొనో వుడక బెట్టుకొనో పరపర మంటా తింటానే వుండే వాడ్ని. చెనిక్కాయల కాలంలో అవితే రాత్రి పూట–నడిజాము కాడ నిద్ర లేచి, కాసేపు అట్టా ఇట్టా దొల్లి "అమా, కడుపు నొప్పి!" అనే వాడ్ని. చెనిక్కాయల్ను వొబ్బిడి జేసుకొనే కాలంలో – మా అమ్మకు పొగులు పూట బలే వొళ్ళలిసి పొయ్యే అంత పని గదా. మా అమ్మ నిద్దర కండ్లతో 'ఆ, వూ' అనేదే గాని లేచి కూచ్చునేదే గాదు. నాకు అప్పుడు కడుపు నెప్పా, పాడా? ఎక్కా ముక్కా చెనిక్కాయలు తినేసి వుండడంతో ఆ యాళగాని యాళ దొడ్డికి వచ్చేది. నిద్ర బోతా వుండే మా అమ్మ పైకి లేచే దాకా నేను, "అమా, కడుపు నొప్పి, అమామే కడుపు నొప్పి! బైటికి కూచ్చుంటే పోతిందమా!" అనే వాడ్ని. మా అమ్మ కండ్లు నులుముకుంటా లేచేదాకా నేను వూరుకొనే వాడ్ని గాదు. మా అమ్మ నా కోసరం అని నిద్ర లేచి, మళ్ళా పసి బిడ్డి మాదిరిగా నిద్రతో వొరిగి పొయ్యేది. నేను మా అమ్మ బుజాలు బట్టుకొని, "అమా, అమా!"

అంటా వుండి పొయ్యే వాడ్ని. "ఈదిలోకి పొయ్యి కూచ్చో బో! తెల్లారి లేస్తానే తోసేస్తా గాని!" అనేదే గాని మళ్ళా లేచేది గాదు. నాకు ఆ మబ్బులో కండ్లు తెరిచి చూడాలంటేనే బయమనుకో. నేను వొంటిగా ఈదిలోకి బోయి యింటి ముందర్నే అయినా దొడ్డికి కూచ్చుందునా! దెయ్యాలంటే బలే బయం నాకు. 'అమా మే బయ్యం అమా' అని అంటే మా అమ్మ లేచి జారి పోయిన కోకను వొడి మాదిరిగా జేసుకొని, నన్ను ఏ మాటా అనకుండా ఈదిలోకి కాళ్ళీడ్చుకుంటా వచ్చి – నేను దొడ్డికి కూచ్చుంటా వుంటే, నేను బయ పడకుండా నన్ను కాపెట్టుకొనే వుండేది.

ఆ తెల్లారి మా అమ్మకన్నా ముందరగా నిద్దర లేచిన బూలోకరంబోళ్ళ అమ్మ –బీకమ్మ–ఈదిలో వుండే నా ఏరగడ జూసి, "ఇట్టా పన్లు కమ్మోళ్ళు జేస్తారా యాడన్నా? ఈదిలో బైటికి కూచ్చున్నోళ్ళను గుంతల్లో బెట్టి గెంట వాయించనానీ–" అని తిడతా వుంటే, మా అమ్మ "బీకమ్మా, వరవాతన నిద్దర లేచి ఏమిటికి తిడతావు ఆ మాదిర్తో! మా సినబ్బే రాత్రి కూచ్చున్నాడు. వుండు తోసేస్తా" అని మా అమ్మ చాటా పొరకా ఎత్తక పోయింది. పసి బిడ్డినని మాటే గాని, పెద్దోళ్ళు గూడా కుచ్చోరు అంత బైటికి. చాటడుతో చాటడు వుండాది. అప్పట్నించి మా అమ్మ – నడిజాము కాడ నేను దొడ్డికి పోవాలన్నప్పుడు నన్ను దొడ్డికి ఈదిలో కూచ్చోనిచ్చేది గాదు. నిద్దర కండ్లతో లేచి, "చావు, దిబ్బల కాడికి.." అని మా ఇంటికి దచ్చినంగా నాలుగు బారల్లోనే వుండే దిబ్బల కాడికి తొడుకోని పొయ్యేది. గుండీలు వుండని నిక్కరుకి పిన్నీ వేసుకునుంటాను గదా, జారిపోకుండా. ఆ మబ్బులో పిన్నీ వూడి వచ్చేది గాదు. అది గూడా మా అమ్మ కర్మకు బాద్యురాలయ్యేది. మా అమ్మ దాన్ని వూడబెరికి –నన్ను దిబ్బల కాడ కూచ్చన బెట్టి మా అమ్మ చింత చెట్టుకింద కూచ్చుని నిద్రతో తూగతా వుండేది. నేనా దిబ్బల సందున దొడ్డికి పోతా – కైలాసాన్ని చూసుకుంటా వుంటే, మా అమ్మ చింత చెట్టు కింద ఆమి చావు ఆమి చస్తా వుండేది. నా బైటికి నేను గెంట సేపు కూచ్చునే వాడ్ని.

మా అమ్మ "సినబ్బా! సినబ్బా" అని మాటిమాటికి నన్ను పిలస్తా వుంటే, నేను అక్కడ కూచ్చునే "వస్తానుండమా!" అని కొంచింగా కసురుకునే వాడ్ని. బైటికి కూచ్చోని, కడుపు నెప్పి అంతా తీర్చుకోని యింటికి వచ్చి కాళ్ళు

కడుక్కున్నాక– నేను ఎంతో దర్జాగా అలివిగాని నిద్రబొయ్యే మాయమ్మతో ఆ మాటా ఈ మాటా మాట్లాడాలనిపించేదే గాని నిద్ర మాత్రం పట్టేది గాదు.

"అమా, ఎందుకమా, నాకు అప్పుడప్పుడూ రాత్తిర్లు వస్తిందే బైటికి?" అని నిద్రబోతా వుండే మా అమ్మను వూగించి వూగించి వొకసారి అడిగితే మా అమ్మ, "చెనిక్కాయలు చమురు వస్తవ గదా. అందుకని–" అని చెప్పింది. నేను దాంతోనన్నా గమ్మన వుండకుండా, "అంత చమురుంటిందో చెని క్కాయల్లో!" అనడిగినాను. దాంతో మా అమ్మ – "నా బట్టా! తెల్లారి ఎప్పుడు నిద్ర లేచినా నిన్నడిగే వాళ్ళు లా. నాకు నీ మాదిరిగా తీరితిందంటరా రండ నా బట్టా! నా బట్టా – నువ్వు నాకు కొడుకువి గాదు. నా బాద గురువు– నువ్వు!" అనింది కడుపు కాలిపొయ్.

# కొడవటికంటి సినక్క-నామిని నారప్ప

మా అమ్మకూ మా నాయినకూ కాసుకు పడదని-దూరంగా వుండి చూసేవాళ్లు అనుకుంటారే గాని అదంతా వొట్టి అపద్దం. మా అమ్మ - మా నాయిన మీద వుండే యాష్ట కొందికీ - ఒకే మాటను ఒకటికి పదిమాట్లు అనినా, అది మా నాయినకే గాకుండా మాకు గూడా గోగ్గాయల నస మాదిరి అనిపించకుండా ఎక్కడ లేని ముదిగారంగా వుండేది. మా వూరికి ఒక మైలు దూరాన వుండే రామాపురంలో మంచి పనుల కాలంలో భారత తిరనాళ్లు జరగతా వుండేవి. ఎప్పుడూ ఏదో ఒక పనిని నెత్తినేసుకొని తిరుగులాడే మా అమ్మ పనుల కాలంలో బీడుగా వుండునా ఏమి? అందుకని భారత కత ఒక పక్క జరగతా వుంటే, ఇంగొక పక్క మా అమ్మ రొండు గాళ్లూ ఒక చోట పెట్టకుండా పని మీద బడి అల్లాడతా వుండేది. రామాపురంలో మంచి మద్యానం రొండు గంటల కాడ మొదులైన అరికత పొద్దు గూకే దాకా జరగతా వుండేది. అక్కడ అరిదాసు చెప్పకపోతా వుండే కత, ఇక్కడి శెనిగి తోటలో తవ్వకం తవ్వుకుంటా వుండే మాకు పొల్లు బోకుండా ఏ మాట కామాట మైకు సెట్టులో అంతా చెవులకు కట్టినట్టుగా ఇనపడతా వుండేది. మా అమ్మ ఆ మాటలను చెవల్లో యేసుకోవటం మానుకొనేసి, మా నాయినతో పెట్టుకొనే తగలాటం బలే తమాషైనది.

మా ఇంట్లో అందరి కంటే బుడంకాయనైన నన్ను పెద్ద మనిషిగా పెట్టుకోని, "ఏ పొద్దయితే ఈ మొగోడి సేతిలో బొట్టు కట్టించుకున్నానో ఆ పొద్దే యిరం పరం వొదులుకొనేసినానురా సినబ్బా!" అనేది. మా అమ్మ చూసేది మాత్రం నాకల్లాగాని, అనేది మాత్రం మా నాయినతోనే. మా అమ్మ నోటికి బయపడి మా నాయిన ఎంత వొంగి వుండినా, మా అమ్మ గమ్మునుండకుండా, మళ్లా, "పుట్టినాను, పుట్టుడాముదాలకు చేటుగా! ఒక మంచా, ఒక చెడ్డా - నా కూలిపోయిన బతుక్కు? మాలవి, మాదిగివి గూడా పోయి కత యినేసి వస్తుండాయి. కమ్మ పుట్టక పుట్టి నాకా బోగం లేకపాయ గదా!" అని మా నాయిన్ని ఏమన్నా ఒకమాట అనేదాకా - చెంగదోలేది. 'మనకు చెవులు యినపళ్లా కండ్లు కనపళ్లా' అన్నట్టు మా నాయిన మూగెద్దు మొకమేసుకుని గమ్మున వుండేవాడే గాని, నోరు తెరిచి పొల్లెత్తు మాట అనేవాడు

గాదు. దీంతో వుక్కురోసం తెచ్చుకొని మా అమ్మ- మా అమ్మకూ మా నాయినకూ నడీ మద్యన వుండే నన్ను అడ్డం తలమని, "దొబ్బితా పట్టుకోని!" అని తవ్వతా తవ్వతా వుండిన లిక్కిని పైకెత్తి మా నాయిన మీదికి మారేది. తొలికితో ఎక్కడ ఒక దెబ్బేస్తిందేమోనని మా నాయిన ఉలిక్కి కూడా పడకుండా, ఉడత మాదిర కీసుకీసుమనే నవ్వును నోటబెట్టి, "నన్ను జూస్తే నీకు యాసండంగా వుండాదా ఎట్ట? కయ్యలోకి అడుగుబెట్టింది మొదలుకోని ఒకే కాలు గీరతా వుండావే నా మిందికి? నీ మిందికి రచ్చకు వచ్చే సత్తుమానం నాకు లేదు తల్లా!" అని మా నాయిన పెండ్లాంతో నంగి నంగిగా మాట్లాడినట్టు గాకుండా పోలేరమ్మతో మాట్లాడినట్టుగా బిడిం బిడింగా మాట్లాడి, ఎండలో పని చేస్తా వుండే మా అమ్మల బిడ్డలకు నవ్వు తెప్పించేవాడు. అమ్మకూ, నాయినకూ జుట్లు ముడేసి యేడిక చూడాటంలో నన్ను మించిన మొగలాయి ఈ కలిగ్గాన ఇంగొకడు లేడు గదా! అందుకని, నేను ఇదే సందుగా అనుకొని, "అమ్మా! మద్యానం మా నాయినతో తమాసకు, 'మాయమ్మా నేనూ కతకు బోతా వుండాం. నీతో చెప్పమనింది' అని అంటానే, మా నాయిన నా మీద ఈడ ఎగిరి ఆడ దూకినాడు. 'సందేళ ఆ నక్కజాగల దాన్ని యింట్లోకి రానీనని చెప్పు' అని వోయమ్మో ఏమి వూగించినాడో చేతులు! మనం ఎందుకు, మద్యలో పుల్లలు బెట్టేది? అని ఇయ్యాళ దాకా నీకు చెప్పలా నేను!"- ఆ మాటా ఈ మాటా కై గట్టుకొని జల్లి జెప్పి మా అమ్మను మా నాయిన మీదికి యింగా యింగా ఎగదోలే వాడ్ని. దీంతో మాయమ్మ ఒంటి కాలెత్తుకొని మా నాయిన మిందికి పోయి, "అవునా, యిక్లామార్కుడా, అవునా? నేను తిర్నాళ్లకు పోతే సందేళ నువ్వు నన్ను కుమ్మేస్తావో? ఎంత పొడుగు వుండాయి నారప్ప నాయుడా, నీ నెత్తిన కొమ్ములు?" అని వొగలొగలుగా మా అమ్మ మా నాయినను అదీ యిదీ అని మాకు ఆ శెనగ తోటలో కైలాసాన్ని చూపించేది. దీంతో అమ్మలం బిడ్డలం అందరమూ మా అమ్మ పక్కన చేరుకొని, ఒంటిగాడై పోయిన మా నాయిన్ని తలా ఒకమాట-'అర్ద బడాయి జాస్తిలే దీనికి', 'పట్టుకొని ఒక దొబ్బు దొబ్బితే'- అనేసి, కోతికి కోలాటం యేసినట్లు మా నాయిన్ని తలా ఒక ఆట ఆడిపించే వాళ్లం.

పాపం, మా నాయిన మా పోరు పడలేక, "మీరు నాకు బిడ్డిలా, పగోళ్లు గదా!" అని మొకం మటమటా బెట్టుకొని బారడు పొడుగు అలిగే

వాడు. నేను మా నాయిన్ని మళ్లా ఏదన్నా ఒకటి అందామని రడీ అవబోతా వుంటే, మా అమ్మ మెల్లంగా, "ఒరే సూదలోడా! గమ్మనుండు. ఆయన మళ్ల పసి బిడ్డి మాదిర ఏడ్చేస్తాడు సామీ. ఆయన బలే మెత్తనోడు. మీ నాయిన ఒట్టి దూది మిటాయి గదరా సినబ్బా!" అని యిచ్చిత్రంగా మాట్లాడేది. ఈ మనిసి యింతలోనే ఎంత మారిపోయిందిరా సామీ –అని నాకు యిచ్చిత్రం కలిగేది. మా నాయినను మళ్లా నవ్విపించాలని, మా అమ్మ, "మీ నామిని జాతి అంత ఈనపు జాతి యింగొకటి లేదురా సినబ్బా. జాతుల్లోకంతా కడగొట్టు జాతి అది!" అనేది నాతో. దీంతో మా అక్క, మా అన్న, నేను అందరం మా నాయినలో కలసక పొయ్యే వాళ్లము. మా అమ్మ బలే మాటకారి గదా! ఆమితో మాట్లాడి, గెలాయించడం మా వల్లా అయ్యేది గాకుండా పోయింది. "కొడవటికంటి ఆడదాన్నయిన నేను మీ జాతిలో పడినాను గదా! నన్ను ఎట్ట చూసుకోవాల మీరు? చూడండి, మీ జాతిలో పడిన ఒక ఆడ కూతుర్ని మీరు ఎట్ట చూసుకుంటా వుండారో? నాకెప్పుడన్నా మీకు మీరుగా ఒక నాలుగు కోకలు దీసిచ్చి, ఆరు రైకలు దీసిచ్చి, ఒక పదినాళ్లు నీడన కూర్చున బెట్టి నాకు కూడేసిందంటరా మీ జాతి? మీ ఇంట్లోకి వచ్చిన ఆడదానికి ఇదా మీ జాతి జేసే మరేద?" అని మాకే యాద గలిగేటట్టుగా మాట్లాడేది. నేను నా తెలివిని అంతా కూడగట్టుకోని, "దానికి మా నాయిన్ని అనాల గాని, మా జాతిని తిడితే ఎట్టమ్మా?" అని నేను మా నాయినలో నుంచి మళ్లా మా అమ్మలోకే చేరుకొనే వాడ్ని. మా అమ్మ పక్కన మేము చేరుకుంటే, మా నాయినను అనవచ్చును గాని, నోరు లేని మా నాయిన పక్క చేరితే కాసింత మాట గూడా మాట్లాడలేము.

అన్ని పనుల్నా చక్కబెట్టుకొనేసి, మా అమ్మ ఒక మద్యానం పూట – నన్ను యెంటేసుకొని దరమ రాజుల తిరనాళ్లకు ఎలబారింది. మా అమ్మా, నేనూ కతకు పోతా వుండామని తెలిసి మా నాయిన మూతి మూరడు పొడుగు పెట్టుకుని వుంటే మా అక్క, "ఏమి, నీ దగ్గిర్నే వుండి ఒక్కొక్క మొటిక్కాయి యేస్తా వుండాల్నా? అప్పటికి గాని నీకు సగించినట్టు వుండదు గదా! సందేళ మళ్లా వొస్తిందిలే, మళ్లా తిందువుగాని మొటిక్కాయలు!" అని మా నాయినతో ఎగతాళి పడింది. మా అమ్మా నేనూ కతకు నడస్తా వుండంగా నేను మా అమ్మతో, "పాపం, నాయిన్ను గూడా కతకు పిలిచుంటే వొచ్చుండడా అమా!"

అన్నాను. అందుకు మా అమ్మ,"మీ అయ్య పది మందిలోకి వచ్చేవాడు గాదురా సినబ్బా! ఆయనకు ఆ కత అర్తమన్నా అవునా? పాపం, పుణ్యం తెలుసునా ఆ మనిషికి! ఆయినే ఒక దరమ రాజనుకో, ఆయనకేమిటికిరా దర్మరాజుల కత?" అనింది. నిజ్జంతో మా నాయిన ఎదురు గుండా వుండినప్పుడు అన్ని ఎగతాళులు పడి, కాసుకు గాకుండా మాట్లాడే మా అమ్మ మా నాయిన లేనిది జూసి, ఆయనకు పటం గడతా వుండేది. అరిదాసు కత జెప్తా వుంటే నడీ మధ్య గంగాళంలో కుంకం బెట్టుకోని, దచ్చిన వెయ్యమని పూజారి తిరగతాడు గదా! అప్పుడు మా అమ్మ నా చేతిలోకి పది పైసాలిచ్చి, గంగాళంలో వెయ్యమని అయిదు చిటికిల కుంకమ ఎత్తుకొనింది. మా అమ్మ బొట్టు పెట్టుకొని, నాకు బెట్టింది. మిగిలి పోయిన కుంకాన్ని పాపిట్లో పెట్టుకుంటాదేమో అని నేను చూస్తా వుంటే, మా అమ్మ దాన్ని కొంగులో మూట గట్టుకొనింది. అది మా అక్కకే, మా అన్నకే అనుకుంటే – ఆ సందేళ వీదిలో బండ మీద కూర్చోని వుండే మా నాయిన నవ్వు మొకం గూడా మా అమ్మ బొట్టు పెట్టింది.

# సినబ్బ కతలు



కొండ మింద
నా పెండ్లి జరగతా వుండినా,
గొడ్లు మేపుకుంటా
వుండి పోయిన మా నాయినకి –



# రామ బజినా సేయరా !
# ఆడపిల్లతో పని ఏమిరా !!

మా మిట్టూరు పలుకొటంలో నా కర్మ ఎట్టదా కాలి పోయిందో, అట్టనే యెంగటాపరం అయిస్కూల్లో గూడా కాలి పోయింది. ఆడపిలకాయల దగ్గిర మెరిట్టు లేని బతుకు ఏమి బతుకు? మా వూరి ఇస్కూలు చదువు అయిపొయ్‌నాక, 'మనం ఈ ఇస్కూల్లో అంటే బూలోకరంబ, జమున, పుస్పావతుల దగ్గిర అధవై పొయ్‌నాం. ఇంగ అయిస్కూల్లో ఆడ పిలకాయిల దగ్గిరన్నా మనం, మతింపుగా బతకాల.' అని నేను కనిన కలలన్నీ అయిస్కూలు మెట్టెక్కంగానే గుల్లేరి పొయ్‌నాయ్. మా ఎలిమెంట్రీ ఇస్కూలు నుంచి నాతో ఒప్పందంగా ఆడపిలకాయిలందురూ పాసయినారు గాని, వాళ్లమ్మలు, "ఇంగ సదివింది సాల్లే, కుండా చట్టి కాడ వుండండి. ఆడది ఎంత చదువు చదివినా చట్లు తోమాల్సిందే గదా!" అని వాళ్లను ఐస్కూలుకి నిలిపేసినారు. ఒక రకంతో నేను కోరిన కొండ మింద వాన కురిసినట్టే అయింది. ఒకవేళ బూలోకా జమునా వాళ్ళు టిపను కేరీర్లు ఎత్తుకోని అయిస్కూలుకి ఎలబారుంటే – వాళ్లు నన్నా అయిస్కూల్లో గూడా "వొరె వొరె, గుడ్డోడా!" అని పిలిసుంటారా, నా మానాన్ని నిలువునా తీసేసుంటారు.

నేను ఆరో తరగతిలో చేరంగానే ఆడ పిలకాయిలతో మాట్లాడకుండా వుండి, ఎలిమెంటరీ ఇస్కూల్లో మాదిరిగా ఆడ పిలకాయిల్తో 'ఇక్కికిక్కీక్కీ' అని

పండ్లిచ్చకుండా వుండాలని పతిగ్ని చేసుకున్నాను. క్లాసు జరిగేటప్పుడు ఆడ పిలకాయలు ముందర కుచ్చుంటారు. నేను ఎంతో పొట్టి మనిషినైనా, పాటం జెప్పే అయ్యోరు నాకు సరిగ్గా కనపడక పొయ్‌నా పరవా లేదని, ఆడ పిలకాయిల పొడ కూడా తగలకుండా నేను యెనకాన కూచ్చునే వాడ్ని. ఈ మాత్రం యెచ్చిరికతో వుండక పోతే, నేను ఆడ పిలకాయిల దగ్గిర కనాగష్టం అయిపోతాను. ఎలిమెట్రీ ఇస్కూల్లో కోపాలొచ్చినప్పుడు బూలోక రంబా వాళ్ళు నన్ను మొగోడని గూడా తలవకుండా ఎన్నిసార్లు నన్ను, 'గుడ్డి నా బట్టా!' అని అనలేదు? అదీ నా బయిం.

ఇంత బయిమూ బక్తీ వుండినా ఏమి సుకం? నా నొష్టన రాత సరిగ్గా వుంటే గదా! ఒక రోజు మంచి మద్యానం పూట బాయి కాడ అన్నం తినేసి, కడుపు నిండికీ నీళ్లు దాగేసి మా క్లాసులోకి వచ్చి, ఆడపిలకాయిల కల్లా ఎగాదిగా గూడా చూడకుండా బుద్ధ బగమానుడు మాదిరిగా చక్కా ముక్కళ్లు యేసుకోని లెక్కలేసుకుంటా వుంటే నాగబూసన అనే అమ్మి నా దగ్గిరికొచ్చి కూచ్చునింది. అయిస్కూలు చదువులు చదివే ఈ మొగోడి(నా) దగ్గిరికి ఒక అమ్మి వచ్చి బుజ్జిగా కూచ్చోవడం నాకు బలే కుశాల అనిపిచ్చి ఎగాదిగా చూసినాను. ఎంతోమంది ఆడపిలకాయిలు ఈనీపారం యేసుకుంటారే గాని, నాగబూసన బులుగు పావడా తెల్ల రైకా యేసుకుంటే చేసిపెట్టిన బొమ్మ మాదిరిగా అంత తీరుగా వుండును. 'మనమై మాట్లాడి ఎందుకు పలచనై పోవాల, ఆ అమ్మినే ముందు మాట్లాడనీ' అని నేను బిగించుకున్నా. ఆ అమ్మి, "ఒరే, ఒరే! నాకు గూడా లెక్కలేసెయ్యిరా. నాకు బలే కష్టంగా వుండాయి–" అనింది. నాకు బలే కోపం వచ్చి, దాన్ని కనపడనీయకుండా నిష్టూరంగా మొకం పెట్టినాను. మీరు ఒకటి మరచిపోబాకండి, నేను చదూకునేది అయిస్కూలు, ఇది ఎలిమెట్రీ ఇస్కూలు గాదు, ఇక్కడ కూచ్చుంటే ఒక రూలు, లేస్తే ఒక రూలు. ఆ రూలు పకారం అయిస్కూలు చదువులు చదివే ఆడ పిలకాయిలు మొగ పిలకాయలతో మాట్లాడాల్సి వస్తే, "ఒరే!గిరే!" అని మట్టూ మరేద లేకుండా పిలవగూడదు. 'అబ్బయా!' అనాల. అదే మాదిర్తో మొగ పిలకాయలు గూడా ఆడ పిలకాయిల్ని 'ఒమే గిమే' అనకుండా 'అమాయా!' అని పిలవాల. నా నిష్టూరాన్ని పసి గట్టేసిన నాగబూసన, "ఏం అనుకోబాక, ఎన్నెస్సెన్నూ! నన్ను గూడ నువ్వు

నోటికొందికీ ఒమే అని పిలువు. నేను క్లాసు టీచరుతో గాని చెప్తే నీ మెట్టుదీసి నా పాపిట్లో కొట్టు" అని నవ్వింది. మళ్ళా ఆ అమ్మే, "మన వూళ్లల్లో మనకా వాడికలు లేవు గదరా! ఇక్కడ మాత్రం ఏమిటికి? నేనయితే మా వూర్లో మా బావను గూడా ఒరే అంటా. నిన్ను గూడా అంటాన్రా!" అనే కొందికి నాకు కుశాలై పోయింది. నేను గూడా ఆడ పిలకాయిల్ని 'ఒమే ఒమే' అని పిలవక నా నోరు చవి చెడిపోయి వుండాది. నేను అదే చాన్సుగా, "నాగబూసనా, ఒమే బూసనా! నీ లెక్కలన్నీ నేనేసి పెడతాన్లే. బయపడద్దు, బూసనా! కదమే! ఏందిమే!" అని నా ఒళ్లు తెలవకుండా ఆ అమ్మిని 'ఒమే ఒమే' అని లచ్చి సార్లు పిలిచేసినాను. నేను అయిదు నిమిసాలల్లో ఆ అమ్మి లెక్కలన్నీ గిలికేసి, "ఇందమే!" అని నోటు పుస్కం ఆ అమ్మి చేతల్లో పెడతా ఆ అమ్మి కండ్లల్లోకి బారడు పొడుగు చూసినాను దీచ్చతో. ఆ అమ్మి వున్నట్టుండి, "ఒరే ఎన్నెస్సెన్నా! నువ్వు కండ్లార్చకుండా నా కండ్లల్లో కండ్లుబెట్టి చూడరా!" అని నాకు దగ్గిరగా జరిగింది. నా చేతిలో ఎవురో కొండ లడ్డు తెచ్చి పెట్టినట్టుగా, "ఓ, ఎంత సేపైనా చూస్తాను మే, నేనసలు రెప్పెయ్యకుండా జాము సేపు చూడగలను. ఏమో అనుకున్నావు నన్ను నువ్వు" అని నేను జాము సేపు చూసినాను. ఆ యమ్మి ముక్కుల గుండా పొడుగ్గా గాలి బీల్చి, "నీకు కుడి కన్ను మెల్ల, ఉత్తరం చూడమంటే దచ్చినం చూస్తా వుండాదది. మీ వూళ్లో ఆడపిలకాయిలు నిన్ను 'ఒరే గుడ్డా!' అని అనరా?" అనడిగేసింది. నా నెత్తిన బండ బడిపొయ్యింది. ఇంకేమి జరిగితే ఏమిలే– అని నేను మొండి ధైర్యాన్ని తెచ్చుకుని, "మొగోళ్ళకు కుడి కన్ను మెల్ల అయితే అదురుష్టం అమా. మా అమ్మ జెప్పింది. కావాల్సుంటే అడుగు – నా దశ తిరిగి పోతింది చూద్దువుండు." అనేసినాను గాని నేను అగుమానంతో పిడికిడై పొయ్‌నాను. ఒక రోజు సావాసంలోనే ఆ యమ్మి ఎంత మాట అనేసిందో చూసినావా బగమంతుడా, అనుకోని, 'నువ్వు బోయే బ్యాక్కు పరసనాలిటీ ఫ్రంటు మునిసిపాలిటీ నాయాలీ ముండా! నువ్వా ఒకాడదేనా?' అని లోపల్లోపల తిట్టుకునేసినాను.

ఆ అమ్మి అంతటితో నన్ను ఒదిలీకుండా మద్యానం మద్యానం పిలిచి, "ఒరే! పాలయిసు నువ్వొగటి తీసుకోని నాకొకటి తేబో!" అని ఇరై నయాపైసల రాగిబిళ్ల నా చేతల్లో బెట్టేది. సగానికి సగం కమీసను వస్తా వుంటే మనం కాదనగూడదని ఆ అమ్మి కాల్తో చెప్పిన పని చేత్తో చేసే వాడిని. మొగ

పిలకాయిలకు ఈ సంగతి తెలిసి పొయ్, "నువ్వుబోరా ఆడోళ్లకు చాపలు మోసే నాయాలా! పది పైసాలు సంపాయించుకోని అయిసు తిను. ఆడోళ్ళకు పనులు జేసిపెట్టి ఆ అయిసులు తినకుంటే ఏమి?" అని నన్ను ఏపించే వాళ్లు. నా దగ్గిర నాగబూసన అలుసు జూసుకొని అందురాడోళ్ళు నా దగ్గిర ఇష్టం వచ్చిట్టు పనులు చేయించుకునే వాళ్లు. ఒక రోజు రోశమ్మ అనే అమ్మి జామెట్రీ బాక్సు తెరిచి ఉప్పురాళ్ళు నా చేతల్లో బెట్టి, నూరుకోని రమ్మనింది! నేను తెచ్చిన నున్నుప్పుతో జామెట్రీ బాక్సులోని మాడికాయ ముక్కలు అద్దుకుని తిన్నారు వాళ్ళంతా. (ఆడ పిలకాయల జామెట్రీ బాక్సుల్లో ఏ పొద్దూ వృత్త లేఖిని, మూల మట్టం వుండవు.)

నేనిదంతా అయ్యే పని గాదులే అని ఒక రోజు ఒక అయిడీ యేసినాను. మనం చినిగి పొయ్న నిక్కర, చినిగి పొయ్న చొక్కాయితో అయిస్కూలికి వస్తా వుండామనే గదా వాళ్ళకు మనమంటే అధవ? నేను ఆ మరసనాడే తోసుకునే ఇనప గుండు నొకదాన్ని చాకలోళ్ల రవికి దారాదత్తం చేసేసి, ఇస్త్రీ చేసి పెట్టిన మంచి కాకి నిక్కరా తెల్ల చొక్కాయీ ఒక రోజుకని అడిగి తీసుకున్నాను. (వాళ్ల నాయిన తిరపతి నుంచి గుడ్డలు తెచ్చి, మా వూళ్లో చలవ జేస్తాడు). కాకి నిక్కర కింద తెల్ల చొక్కాయిని టక్కు జేసుకుని, యాడనో పౌగ్రడ సంపారిచ్చి మొకం నిండికీ పూసుకొని అయిస్కూలికి వచ్చినాను. ఆ సమియంలో, ఏమాటకా మాటే గదా, శోబనబాబు ఏమిటికీ పనికి రాకుండా పొయ్నాడు నా తావన. ఆ మద్యానం నాగబూసన నాకల్లా తలెత్తి చూసిందో లేదో, ఆ యమ్మి మెల్లకన్ను అని యెక్కిరించిన నా కుడి కన్నుతో మూడుసార్లు కన్ను కొట్టేసినాను! ఆ పిల్ల నవ్వు మొకంతో, "నామిని సుబ్రమణ్ణెం నాయుడా, ఇట్రా!" అని పిలిచింది. జేబీల్లో చేతులు బెట్టుకోని దగ్గిరికి పోతే, నా నెత్తికి బట్టి కేళీ ఇలాసంతో ఒకటిచ్చి, "ఇంద నీకొకటీ నాకొకటీ పాలయిసు!" అని ఇరై పైసాలబిళ్ళ చేతికిచ్చింది. ఇంక చేసేదేముండాది, కండ్లనిండికీ నీళ్లు బెట్టుకోని, అయిసుకు పోతా పోతా– "రామ బజినా సేయరా ఆడపిల్లతో పని ఏమిరా?"



# గుడ్డి పోలియన్ ది గ్రేట్!

ఏడో తరగతిలో వుండంగా ఏదన్నా ఒగటి కనిపెట్టేద్దామని నాకు బలే పిచ్చి పట్టుకొనింది. మనం గాని దేముడి దర్మాన ఏదన్నా ఒగటి కనిపెట్టేస్తే – మళ్ల ఏడో తరగతి కామన్ పరీచ్చలకు గూడా కూచ్చోవాల్సిన పన్లేదు. ఎవురో ఒకరు కొలువిచ్చి నెలకు మున్నూరో నన్నూరో సంబళం యిస్తారు.

అంతా సడేగాని యింతకూ ఏమి కనిపెట్టేది? తెలుగు పుస్తకానికి సమందించి కనిపెట్టే దానికి ఏముండాది? వేమన్న పద్యాలను నోరు మూస్కోని కంటస్తం పెట్టాల్నే గాని, ఏమి కనిపెడతాం? అదే మాదిర్తో సాంగీకలో అశోకుడు – బావులు తొవ్విచ్చినాడంటే తొవ్విచ్చినాడు, అంతే గదా!

అవితే సామాన్య శాస్త్రాన్ని చదవతా వుంటే ఏదన్నా ఒగటి కనిపెట్టాల కావాల అనిపిస్తింది. నాకీ పిచ్చి పట్టడానికి మా సైన్సయ్యోరు చార్లెస్సే కారిణం. ఆయనొకనాడు, "మీరూ వుండారు దేనికిరా, యెదవ నాయాండ్లాలా! చెట్టులో నుంచి ఎలక్కాయలో నేరేడు పొండ్లో పడతా వుంటే ఏరుకొని తిన్నారే గాని మీకా అయిడీ వచ్చిందా? నూటన్ మఖాశయుడు ఒకసారి యాపిలీ పండు చెట్టులో నుంచి నేల పడేది జూసి బూమ్యాకర్శన కనుక్కున్నాడు. మీరూ వుండారు ఏమిటికి? గంగమ్మ జాతర కాడ దున్నపోతుల బొందులు మిమ్మల్ను నరకనా?" అని మా పిలకాయల్నందర్నీ ఎగతాళి జేసినాడు.

దీంతో మాకందరికీ రోసాలు వచ్చేసినాయి, బారడేసి పొడుగు.

ఛూ ఏదన్నా కనిపెట్టని బతుకు ఏమి బతుకు?–అని శౌర్రానికి పొయ్‌నాం.

ఏదన్నా కనిపెట్టేటట్టయితే సైన్సులోనే కనిపెట్టాల. యింగొక మార్గం లా. నేను నిజ్జింతో నెత్తిన చెయ్యేసి చెప్తా వుండా– మూడట్టల ప్రయోగాన్ని ఎవురూ కనిపెట్టకుండా వుండుంటే నేను కనిపెట్టి తీరుందును. నా ఖర్మానికి ఆయనెవురో బాద్యుడై దాన్ని గూడా నాకు మిగల్చకుండా కనిపెట్టేసినాడు, పాపాత్ముడు! నేనేమి బడాయిగా అనేమాట గాదిది, ఆర్కిమెడీస్సూత్రాలనయితే ఈ ఎన్నెస్సెన్ను కనిపెట్టి వుండలేడు గాని, మూడట్టల ప్రయోగాన్ని వక్క కొరికినంత సేపుట్లో కనిపెట్టేసి, నా తడాఖా అంతా చూపించుందును బాంచత్. అయినా యిప్పుడు బాదపడి ఏమి లాబం?

నేను పట్టుబడితే వొదిలే నాకొడుకుని గాను. కరంటు అనేది అప్పుడప్పుడే మా వూళ్లల్లోకి వచ్చింది. మా వూళ్లోకే అప్పుడప్పుడే వచ్చిందంటే యింగ దేశానికంతా ఎప్పుడెప్పుడో వచ్చుంటుందా? వచ్చుండదు గదా! కరంటు మింద ఏదన్నా ప్రయోగం జేసి ఎన్నెస్సెన్ సూత్రాలనో, ఎన్నెస్సెన్ ప్రయోగమనో రాసి సైన్సయ్యోరికి ఒక కాపీ, రాష్ట్రపతి వి.వి.గిరికి ఒక కాపీ అంపిచ్చి నా మొగలాయితనం చూపిద్దామనుకున్నాను. ఇందులో బాగంగా నేను ఉత్తరంగా తిరిగి మా తిరమల కొండలకు దండంబెట్టి రంగంలోకి 'జై సీతారాం' అని దిగినాను. నాలుగు కానగాకులు పెరికి, మా ప్లగ్గులో బెట్టి, కానగ పుల్లను ప్లగ్గులో దూర్చి సిచ్చి యేసినాను.

కరంటు ప్లస్ కానగాకు ఇజీకోల్టు కాకర పువ్వొత్తులు అయితిందనుకుంటే–

నాకు సాకుగొట్టి మా తలుపుకాడ యిసరకొచ్చి పడుండాను. నాకు బలే సిగ్గయి పూడిసింది. అప్పుడనంగా కారివేటి నగరం బస్సు నగరానికి పోతా వుండింది. మా వూరి టేజీ కాడ ఎవురో ఒక మనిసి దిగినాడప్పుడే. నేను యెనకాన నిచ్చెనెక్కేసి బస్సు పోతా పోతా వుంటే దిగి చూసే ప్రయోగం చేద్దామనుకుంటిని. మా టేజీ దాటుకోని బస్సు స్పీదు అయింది. అప్పుడు దిగినాను– బోల పడినాను! దేముడుండాడు గాబట్టి గండం దప్పింది. (ఈ రోజుటికీ నా కుడి చేతి మణికట్టు కాడ నరం తప్పిన గుర్తుండాది.) మా వూరి బంగారక్క దగ్గిర ఆందింతో నాలుగు నాళ్ళు వరసగా తోమిచ్చుకున్నాను. ఇంక లాబం లేదని దుఃక్కంతో కనిపెట్టే అయిడీలను చాలించుకున్నాను.


మనకా యోగం లేదు. బగమంతుడు నొష్టన రాయలేదు – అని సరిపెట్టు కున్నాను.

అవితే ఒక రోజు నేను మా ఎనుమును పరంటగా అడివిలోకి తోలుకొని పొయ్‌నాను. మద్యానం పన్నెండు గంటల కాడ దాకా బాగనే వుండింది. రెండు నుంచి మొదులు బెట్టిందండీ వాన– అది వాన గాదు! అడివిలో వుండే అందురూ తడిసి పోతుండారు. నేను ప్లానేసి, తెల్లారి వస్తా వస్తా అన్నం కట్టుకుని వచ్చిన గిన్నిలోకి, నా నిక్కరా చొక్కాయి వూడబెరికి దోపుకున్నాను. నేను మొండిగా వుండానప్పుడు. బూలోకరంబ వాళ్లంతా ఎక్కిరిస్తే ఏమిగాని, నా గుడ్డలను వానకు తడవకుండా గిన్నెలో పెట్టుకొని కడుపుకు ఆనించుకున్నాను. నాలుగైదు గెంటల కాడ వాన తెరపిచ్చింది. అప్పుడేసుకున్నాను, ఒంటి మిందికి గుడ్డలు. అందరూ తడిసి పొయ్యుండారు. ఎనుముల్ను తోలుకోని వూళ్లోకి వస్తుండాము.

మా వూళ్లోకి మంచికీ చెడ్డకీ వచ్చి కార్నాలు జేసే బాపనయ్యోరు యాడ నుంచో వస్తా కనపడినాడు. వానకు ముద్దముద్ద అయిపొయ్యుండాడు. ఆయన నాకల్లా యిచ్చిత్రంతో చూసి, "అంత వాన పడితే నువ్వొక్కడివే తడవకుండా వుండావేమిరా నామినోడా?" అనడిగినాడు.

బాపనయ్యోరు నన్ను పలకరించినందుకు నేను చేతులు జోడిచ్చి, "నా చేతిలో ఒక విద్య వుండాది అయ్యోరా! వాన మంత్రం అని ఒక దాన్ని కనిపెట్టినా." అని చెప్తే ఆయన నవ్వతా పొయ్‌నాడు.

ఈ వాన మంత్రాన్ని నేను మా యెంగటాపరం అయిస్కూల్లో నడవలూరు పిలగోడికొకడికి చెప్తే వాడు అంతా విని, "గుడ్డి పోలియన్ ది గ్రేట్!" అనేసి పరిగెత్తినాడు.



# తంతే తలకోనలో పడే కత

నాకు పిర్రల కాడ నిక్కర, బుజాల కాడ చొక్కాయి చినిగి పొయ్‌నా యెంగటాపరం అయిస్కూలుకు పొయ్యే దానికి అగుమానం లేదు గాని, సత్తు కేరీరులో కూడు కట్టక పోతా వుంటే మాత్రం బలే బైసాట్లుగా వుండింది. కోడి గెలిమినట్టు అచ్చిరాలు రాసే ఉమ్మడికి టీలు కేరీరు, పుస్కాలకు గూడ సరిగ్గా అట్టలేసుకునేది రాని రాముడికి టీలు కేరీరు, చదువు మింద శ్రద్ధే లేని రాజిగోపాలుడికీ టీలు కేరీరు. నేనేమన్నా మా అమ్మకు నెల తక్కవగా పుట్నానా, నాకు మాత్రం ఈ సత్తు కేరీరు అగుమానం ఏందిరా శాస్త్రం జెప్పిన బ్రమ్మం గారా? అని నేను నడవలూరులో వుండే బ్రమ్మం గార్ని నిలేసి వుండాను. చెప్పాల్సిన శాస్త్రాలన్నీ డోలు వాయించి చెప్పేసిన బ్రమ్మం గారికి గుళ్లో మాత్రం నోరూ వాయీ లేకుండా నిరామయంగా అయిపోయి, మూగెద్దు మాదిర్తో గమ్మనుండాడు. "ఒరే సినబ్బా! నువ్వు యెంగటాపరం అయిస్కూలికి పోతా పోతా దినామూ నా గుళ్లోకి వచ్చి అంత ఈబూదిని నొష్టన పెట్టుకొని పో. నలపై దినాలు ఈ మాదిర్తో చెయ్, మీయమ్మకు బుద్ధి పుట్టి నీకు టీలు కేరీరు తీసిస్తింది" అని చెప్పినాడు బ్రమ్మంగారు నాతో. సరే, దేముడి మాట మనమెందుకు కాదనాలని చేసి చూసినాను. నలపై ఒకటో రోజు మా కొట్టాంలో వుండే మా బుజ్జి ఎనుము పేగు దూడను ఈనింది. పాల చుక్కను కండ్ల జూసే యింటికి ఎంత వైబోగం? మల్లారం నుంచి మా వూరికి వచ్చే ఒక ముండమోపి ఆడామెకు మా అమ్మ తెల్లారీ సందేళా పడి పాలు పోయ

మరిగింది. పడి పాలు అంటే అర శేరు, ఎనపై నయినాపైసలు. పది నాళ్ళ పాల రూక టీలు కేరీరు మింద పెడితే – నాకు చందమామ మాదిర్తో దగద్దమానంగా యెలిగి పొయ్యే టీలు కేరీరు. అయిస్కూలికి టీలు కేరీర్లో నెల్లూరు మొలగొలుకులు కూడు ఎత్తక పోతే ఏమి, కేడి బియ్యం కూడు ఎత్తక పోతే ఏమి? టీలు కేరీర్లో ఏమి ఎత్తక పొయ్‌నా ఎంత మతింపు! మా వూరికి మంగళవారమాయన అని ఒకాయన మంగళోరం, మంగళోరం తిరపతి నుంచి టీలు సామానం తెచ్చేటోడు. ఆ పుణ్యాత్ముడిది ఏమీ తప్పులా, వాయిదాల పకారం గూడా సొత్తును అమ్మే వాడు. మా మిట్టూరుకి మూడు మైళ్ల దూరంలో వుండే యెంగటాపరానికి బుదోరం బుదోరం వచ్చేటోడు. మా మంగళోర మాయన పేరు యెంగటాపరంలో బుదోరమాయన. నేను మాయమ్మ ముందర పొడుగ్గా నిలబడి, చూపుడు వేలును బారడు పొడుగు ఆడించి, "అమా, యిప్పుడే చెప్తా వుండా, మళ్ళ చెప్పలేదనుకొనేవు! ఎనుము ఈనింది గదా! ఈ ఈతలో నువ్వు నాకు కేరీరు కొనియ్యాల." అని యెచ్చిరిక జేసినాను.

'ఈడు పట్టుకుంటే మళ్ళ వొదలడు గదా' అని మాయమ్మ, "కుచ్చోని గదరా పొనుకోవాల. ముందు కుచ్చోనియ్, మళ్ళ పొనుకుంటా" అని శాస్త్రం మాట్లాడేది. నేను కోపంతో, "నువ్వు నేర్చిన మాటలు కట్టిపెట్టు వాయ్. నాకు గాని టీలు కేరీరు తీసీకుంటే–" అని నత్తి కొరుక్కునే వాడ్ని. నేనింత కోపంతో కానీగాని మాటలు మాట్లాడినా, మాయమ్మ గాంధీ తాత పక్కింటి దాని మాదిరిగా శాంతంతో, "ఏమి నాయినా, నువ్వు సత్తు కేరీరులో అన్నం కట్టుకోని పోతే నీకు తలగుడ్డ నేల పడిపోతిందా? చదువుకునే పిలగోడికి బడాయి వుండగూడదురా తండ్రీ!" అని నాకు మైసూరు శాండిలు సోపేసేది. మా అమ్మ అంతటితో నోరు మూసుకోకుండా, మా మేనత్తకు ముత్యాలు నాయుడు అని ఒక కొడుకుండేటోడు. ఆయన ఎచ్.ఎచ్.ఎల్.సి. పాసయి మా వూరికి వీఎల్‌డబుల్యూ అయిపొయ్‌నాడు. ఆయనకు మా మేనత్త మొగుడు ఒక పలక తీసిచ్చినాడంట. ఆ పలకతోనే ఆయన తమ్ముడు దేవరాజులు నాయుడు గూడా చదువుకుని ఈ పొద్దు పెద్ద డాకట్రుగా అమిరికాలో వుండాడు. దేవరాజులు చదువుకున్న పలకతోనే మా చిన్నాయన కొడుకులు గూడా చదువుకున్నారంట. ముత్యాల నాయుడు అయిస్కూలికి, ఏ కేరీరయితే ఎత్తక పొయ్‌నాడో అదే కేరీర్తో బడాయిలకు పోకుండా యింత మందీ చదువుకుని

వూళ్లేలతా వుండారంట. నేను మా కోతి మొకం దాన్ని అడిగింది టీలు కేరీరు తీసియ్యమనా? ఇటుమంటి కతలు చెప్పమనా?

మా నంగిదాని కతలు ఈ మాదిర్తో వుంటే అయిస్కూల్లో ఆ సత్తు కేరీ నా మానం తీసి కానగ మాకులకు కట్టేస్తా వుండాది. ఒక సారి మా సోసీలయ్యోరు కిష్ణారెడ్డి (ఈయన్ను మేము బొగ్గోడు అనుకుంటాము) నన్ను పైకి లేపి, "ఒరే మిట్టూరు గుడ్డోడా! ఈరోజు నీ కేరీని పూరా లేపేస్తా. ఏమి, టిఫను?" అనడిగినాడు. మా బొగ్గోడు బలే వోగు నాయాలు. ఆయన ఆడ పిలకాయిల కేరీర్లను దినామూ తీసి ఒక్కో కేరీర్లో రెండు పిడికిళ్లేసి బొక్కలాడేస్తాడు. నేను లేచి నిలబడి, "సంగటి, వొట్టి మిరక్కాయ కూర సా తింటావా సా?" అనడిగినాను. బొగ్గోడు, "తీస్కరా!" అననన్నాడు. నేను నా కేరీరును ఎత్తక పొయ్ యిస్తే, ఆ బొగ్గు నా కొడుకు చేతల్లోకి తీసుకోకుండా, "ఈ అందమైన కేరీర్లో బలే అందంగా వుండునబ్బా సంగటి. పద పద!" అనేసినాడు. వాడనిన ఈ మాటలకు క్లాసు క్లాసంతా, సత్తు కేరీర్లు తెచ్చే నా కొడుకులు గూడా రేలంగిని చూసి నవ్వినట్టు ఒకే నవ్వేసినారు. క్లాసులో నా గాచ్చారం ఈ వాటంతో వుంటే, సందేళ యింటికి వచ్చేటప్పుడు పుస్తకాల మింద వుండే నా సత్తు కేరీరుకు మాటి మాటికీ మూత వూడి పొయ్యేది. అది కింద పడిందంటే టీలు కేరీర్లు తెచ్చే నాయాండ్లు తమాస తమాసగానే ఒకడు మూతను రెడ్డి గుంటలో పడేటట్టు, యింగొకడు కేరీరును రెడ్డి గుంటను ఆనుకొని వుండే లంజ గుంటలో పడేటట్టు తన్నేటోళ్లు.

ఒక రోజు నా కల్లో మాయమ్మ, పద్నాలుగు రూపాయలు పెట్టి జమ్మాచారంగా వుండే ఒక టీలు కేరీర్ను కొనేసింది. నేను అక్కుసుతో నా సత్తు కేరీర్ను ఎదురుగుండా పెట్టుకొని ఈడ్చి తన్నినాను. నేను తన్నిన తన్నుకు నా కేరీరు లంజి గుంటలోకి పొయ్ పడకుండా, ఆకాశి మార్గాన ఎగరతా ఎగరతా పొయ్ తలకోనలో పడింది. ఆ తెల్లారి మాయమ్మ, మాయక్క నా కర్లింగు హెయిర్లను గుత్తిగా పట్టుకోని, "నాబట్టా! రాత్తిర్లు మా పక్కల్లో పొనుకున్నావంటే దూలానికి యేలాడదీసేస్తాము. నిద్దర్లో ఒక్కొక్క తన్ను తన్నినావంటే – తలకోనలో పొయ్ పడేటట్టుగా వుంటే! నీకు యాడిదిరా నిద్దర్లో అంత శగితి?" అని నన్ను తగులుకున్నారు.



# గుడిమల్లమోడి బూందీ దగ్గిర నా చాతుర్రిం!

ఒడియార్ అయ్యోరు కసాగు, గసాప్ర లెక్కలు చెప్తా వుంటే నేనా యినే రకం?

నేనా రోజు తెలివి తక్కవై కూచ్చోలేదు, గుడిమల్లం సుబ్రమణ్ణెం రెడ్డి పక్కలో! పాము చెవులంటారే, ఆ రకంతో నావి పాము ముక్కులు. సుబ్రమణ్ణెం రెడ్డి అక్కకు రేపో ఎల్లుండో పెండ్లి పెట్టుకున్నారు. ఆ సంగతి మా అయిస్కూలు యావత్తుకూ చెప్పేసి వుండాడు సుబ్రమణ్ణెం. ఆ నాయాలు ఆ దినుం టిపన్ కేరీర్లో నిండా బూందీని పోసుకోని వచ్చేసుండాడు. ఆ కేరీర్లో బూందీ అనేదే లేకపోతే అయ్యోరు పాటం చెప్పేటప్పుడు గూడా వాడు దాన్ని పసి పిలగోడ్ని ఒళ్ళో కూచ్చో బెట్టుకున్నట్టు, అంత యెచ్చిరికతో వుండునా?

ఆ రోజు సుబ్రమణ్ణెంతో మనం ఏం మాట్లాడినా సరే, వాడు మూతి మూరడు పొడుగు పెట్టుకోని, నిగుడు చూపిస్తా వుండినాడు.

హిందీ అయ్యోరంటే మా గుడిమల్లమోడికి ఉచ్చే.

"ఒరే సుబ్బా! ఇందీ అయ్యోరు – గూనోడు – యిచ్చిన వోం వర్కు చేసుకోనొచ్చినావంటరా?" అనడిగితే వాడు మనిషిని దగ్గిరికి రానీకుండా, "చేసుకోని వస్తే దెబ్బలు తప్పించుకుంటా, చేసుకోని రాకపోతే దెబ్బలు

కొట్టించుకుంటా. పగలబొయ్యేది నా ఈపు గదా! నీకేమి?" అని సిద్దాంతరం మాట్లాడినాడు.

నేను ఎటుమంటోడ్ని? నా దగ్గిర్నా సుబ్బడి బుడ బుడకలు? 'నా కొడకా! నీ కాడ వుండే ఆ బూందీ అంతా నీ దగ్గిర్నే పెట్టించుకొని తినక పోతే – నేను దచ్చిన తట్టు నారప్పకే పుట్టలేదనుకుంటా.' అనుకొని నాకు యాడ లేని శౌర్రిం వచ్చేసింది. 'నా కొడుక్కి యిదిగాదు మంతరం' అనుకొని నేను నా చాతుర్రిం అంతా చూపించేసినాను.

గుడిమల్లమోడు బలే ఉబ్బుల మనిసి. వాడు అక్కినేని నాగేస్ప్రరావు పారిటీ. నాగేస్ప్రరావంటే వాడికి అమ్మా అబ్బను చూసినట్టే. వాడ్ని మన యెనకాన బెట్టి మనం నాగేస్ప్రరావు నాగేస్ప్రరావు నాగేస్ప్రరావు అని అనుకుంటా మనం ముందుకు పోతా వుంటే, వాడు కండ్లు మూసుకోని మనతో గూడా, తలకోన దాకా అయినా సరే వచ్చేస్తాడు.

ఒడియార్ అయ్యోరి చావు ఒడియార్ అయ్యోరు చస్తా వుంటే, నా చావు నేను చస్తా, సుబ్బడి మీదికి వొంగి, "నువ్వంటా వుంటే నేను ఏమో అనుకున్నాను గాని, వీరో అంటే నాగేస్ప్రరావేరా సుబ్బా! ఆడదాని పక్కన మొగోడు వుండాలనుకుంటామే గాని, దున్నపోతు వుండాలనుకుంటామా రా సుబ్బా!" అని నాగేస్ప్రరావుని పొగిడేసి, పాపం పుణ్ణెం లేకుండా ఎన్టీ రామారావును తిట్టి పారేసినాను. నేను అంతకు ముందు రోజు కూడా ఆడది చెరువులో పడిపోతే నాగేస్ప్రరావుకు ఈత రాదు గదా, దూకలేక బొరోమని ఏడస్తాడని, అదే రామారావయితే ఎగిరి దూకి, ప్రాణాలు కాపాడతాడని, మొగలాయి అంటే రామారావే అని, ఆడ పుట్టక పుట్టాల్సిన నాగేస్ప్రరావు వాళ్లమ్మ కడుపులో తొమ్మిదో నెల్లో వుండంగా మొగ రూపు వచ్చేసిందని, ఇటుమంటివి శతకోటి అని, మా సుబ్బడ్ని వుడకాడిపించి వుండాను. నేను గబక్కన ఇట్ట తిరుక్కునే కొందికి సుబ్బడి చెయ్యి మెల్లంగా బూందీ వుండే కేరీరు మిందికి పోయి, మూత లేపేసింది. నేను అంతటితో గమ్మనుండకుండా, ఆ బూందీలోకి మనోడి చెయ్యి పొయ్, పిడికెడు ఎత్తుకొని నా చేతల్లో పెట్టుకొనేటట్టుగా, "సుబ్బా! నువ్వేమన్నా అనుకో, ఈ పొద్దుట్నుంచి మా తల్లి సాచ్చిగా నేను నాగేస్ప్రరావు పారిటీ. నాకీ బుద్ధి నిన్న సందేలనే వచ్చింది. నిన్న సందేలనంగా రైసు

మిల్లు కాడికి పోబట్టి పేపర జూస్తిని. దసిరా బుల్లోడులో నాగేస్ప్రరావు వాణీస్పర నడుంను గెట్టంగా పట్టేసి, మెడ కాడ మూడు జాముల సేపు మూచూస్తా వుండాడు. అంత యాక్సను రామారావు వల్లా అవునా? ఒరే సుబ్బా, నేనొకటి చెప్తా వుండా, ఎవ్వురికీ చెప్పకుండా మనుసులోనే పెట్టుకో, యాక్సనంటే కూలోడి మాదిరిగా మూటలు మొయ్యడం గాదు!" అని గొణిగేసినాను.

సుబ్బడి మొకం చాటంత అయిపోయింది. మా గుడిమల్లమోడు ఇప్పుడు ఒడియార్ అయ్యోరి క్లాసులో యాడ వుండాడు? ఏనుగంబారీ ఎక్కి ఏడేడు లోకాలు తిరగతా గదా వుండాడు. మా రామాపరం రెడ్డి పిడికిడుతో పిడికిడు బూందీని దారాళంగా ఎత్తుకొని నా కాళ్ళకాడ (అప్పట్లో అవి నా చేతులు గాదు.) పోసినాడు.

అప్పుడు నేను దానా ధర్మం లేకుండా నా చొక్కాలో పోసుకొని తలొంచుకుని నమల్తా వుండినాను. అది ఒడియార్ క్లాసా, థూ కాదు, అది ఆ ముక్కాలు గంటా కైలాస కోన!

నేను మాటి మాటికీ నాగ్సేస్ప్రరావును బుజాల మిందికి ఎత్తి మునగ చెట్టు మింద కూచ్చోబెట్టడంతో, మా గుడిమల్లమోడు నా చేతల్లో బూందీ పొయ్యడంతో టక టకా అయిపోతా వుండాది టయిం. ఒక దపా అయితే గుడిమల్లమోడు నా చేతల్లో బూందీ పోస్తా, "ఒరే, ఎన్నెస్సెన్నా! నేనొక పిడికిడు తింటాన్రా!" అని నా కల్లా నొచ్చుకోని చూసినాడు. నేను కఠీనంగా మూతి బెట్టి, "వొరే సుబ్బా, నువ్వింటి కాడ ఎంతన్నా తినచ్చు గదరా, ఒక గంపడు బూందీ అన్నా వుండదంటరా మీ యింట్లో? అంత బూందీని అక్కడ బెట్టుకోని ఈ కేరీర్లో వుండే బూందీని తినేస్తావా, నాకు పెట్టకుండా? నాగేస్ప్రరావు మాదిరితో దారాళంగా వుండరా! రామారావు మాదిరితో ఎందుకు కుళ్ళుకోని చస్తావు?" అన్నాను. దాంతో వాడు ఆ బూందీ కోసరం ఆశించకుండా నా నోట్లోనే పెట్టి నీళ్ళు పోసేసినాడు.

మనకెందుకు పారిటీలు? మనం రామారావు పారిటీ గాదు, నాగేస్ప్రరావు పారిటీ గాదు. మనకు కడుపు వుండాది. దాని పారిటీగా వుండి, ఆ బూందీనంతా దొబ్బి తినేసినాను ఆ ముక్కాలు గంటా. గెణ గెణ గెణ కొట్టేసినారు

గంట. గబ గబ గబ పెట్టేసినాడు గుడిమల్లమోడు బూందీ అంతా. చేతులిదిలించుకొని పైకి లేసేసినాము.

మంచి మద్యానం అయిపోయింది. నేను సుబ్బడ్ని తలవకుండా నా కేరీరు ఎత్తికొని బావుల దగ్గరికి తినే దానికి ఎలబారినాను. సుబ్బడు మూతి నల్లంగా పెట్టుకొని, "సుబ్బారే! నా కేరీరంతా అయిపోయింది గదరా. ఇప్పుడు నాకు అన్నమా? నీతో గూడా వస్తా(న్రా, చెరి కొంచిం తిందామా!" అని నసకు తగులుకున్నాడు. నాకు బారడు పొడుగు వచ్చింది కోపం. వచ్చే పాపం రానే వస్తిందని, "అందుకు నేనేం జేసేది? అక్కినేని నాగేస్ప(రావును అడుగుబో, పొయ్!" అని కసిరేసినాను. అప్పుడనంగా సు(బమణ్ణెం రెడ్డోళ్ళ వూరోడు ఒకడు వచ్చి, "అన్నం తినే దానికి రాకుండా ఎన్నెస్సెన్‌తో మాట్లాడతా వుండావు ఏందిరా?" అనడిగినాడు.

సు(బమణ్ణెం నా కల్లా ఒక చెయ్యి చూపించి, ఖాళీ టిపిను బాక్సు కల్లా యింకొక చెయ్యి చూపించి, "ఏంది అంటే, ఏం చెప్పేది రా? నా బూందీ రా!" అని కండ్ల నిండా నీళ్ళు పెట్టుకున్నాడు.



# మా గూనయ్యోరికి గుణపాఠం

మా పిలకాయిలం మద్యానం పూట బావుల కాడ అన్నాలు తినేసి రాంగానే, మా అయ్యోర్లందరూ అన్నాలు తినేసి కేరీర్లు కడిగిచ్చుకునే దానికి మా కోసరం ఎదురు జూస్తా వుంటారు.

అయ్యోర్లు వోం వర్కులు గీం వర్కులు చెప్పితే పిలకాయిలకు నిష్టూరం గాని, ఇట్టా పన్లు కాల్తో చెప్తే చేత్తో చేసే దానికి వోల్ రెడీ గదా!

మా అయిస్కూలు మొత్తం మీద పద్నాలుగు మందో పదైదు మందో అయ్యోర్లు వుండేవాళ్ళు. పిలకాయిలు వందల్లో గదా! ఎవురో పుణ్యం జేసుకున్న పిలకాయిలకే ఈ కేరీర్లు కడిగే చాన్సు దొరికేది.

నేను మా యింటి కాడ నుంచి తెచ్చుకొనిన అన్నాన్ని వక్క కొరికినంత సేపుట్లో తినేసి అందరికన్నా ముందర్నే వచ్చి మా స్టాఫు రూము కాడ వుండే అశోక చెట్టు కాడ తారుకులాడే వాడ్ని.

నేను జేసుకున్న కర్మం ఏమో గాని నేను మా ఇందీ అయ్యోరు గూనోడి–కండ్లల్లోనే పడేటోడ్ని. ఆయన తేపు మింద తేపు తేపతా, "మిట్టూరోడా! రారా!" అని పిలిచి కేరీరు చేతికిచ్చేటోడు.

మా ఇందీ అయ్యోరి కేరీరు నా మోకాటెత్తు వుండి, నాలుగు అరలు కలిగి వుండేది. ఒక దాంట్లో కూడు, ఒక దాంట్లో కూర, దాని మింద ఒక అంటాకు, దాంట్లో ఏపుడు, యింగొక అరలో మిరాల చారు. యింగొక దాంట్లో

పెరుగు! ఇన్ని వరైటీలు తినే మా ఇందీ అయ్యోరి కడుపు కైలాసం గదా! మాయమ్మ నా సత్తు కేరీరులో అంత చద్ది కూదు పిడిసి, దాంట్లోకి కూర అనేది గూడ చెయ్యకుండా జాడీలో వుండే వూరిగాయ వూటనేసేసి అంపిచ్చేది. ఈ రకం కూదు తినిన నా కడుపు, మా ఇందీ అయ్యోరి కేరీరును చూస్తే రగలదా!

నేను నెత్తిగొట్టుకుంటా మా గూనయ్యోరి కేరీరును బాయి కాడికి ఎత్తకొచ్చి మూత యిప్పేటోడ్ని. మా ఇందీ అయ్యోరి పిచ్చి గాకపోతే, మళ్ళా ఈ కేరీర్ని నేను కడగాల్నా? ఆ కేరీర్ని మా ఇందీ అయ్యోరే నాకి నాకి కడిగేసుంటే! ఆ కేరీర్లో ఒక అన్నం మెతుకు గాని, కూర మరక గాని వుంటే నా పేరుదీసి కడగా పెట్టండి.

నేను మా ఇందీ అయ్యోరు కడిగేసిన కేరీర్ని మళ్ళా కడగతా వుంటే, మా గుడిమల్లమోడు సైన్సయ్యోరి కేరీరును కడిగే దానికి బాయి కాడికి తీసుకొచ్చి, కుశాలతో, “కడిగిందే కడగరా మెల్లకన్ను గుడ్డోడా!” అని అంటా వచ్చినాడు. ఆ అదురుష్టవంతుడ్ని జూసి నేను కుళ్ళిపోతా, మళ్ళా కడిగేసిన ఇందీ అయ్యోరి కేరీరుకు మూతేస్తా నల్లంగా మూతి బెట్టుకున్నాను.

గుడిమల్లమోడు సైన్సయ్యోరి కేరీరు మూత యిప్పతా వుంటే నాకు నోట్లో ఓ అని నీళ్లూరతా వుండాయి. సైన్సయ్యోరి కేరీరులో అన్నం అరలో దోసిడు కూడు, కూర అరలో చేరడు చేమాకు పుల్లగూర, ఉల్లగెడ్డ పొరుటు, చారు అరలో చారు, పెరుగు అరలో సగానికి సగం పెరుగు.

నా కష్టమే రుధా.

గుడిమల్లమోడి కష్టానికి ఫలితం!

నాకు కడుపు కాలిపొయ్, “ఇందీ అయ్యోరు నాకు పుట్టి రుడం తీర్చుకుంటాడు రేయ్, కేరీరు కడిగేటోడికి పిడికెడు గూడా వొదలకుంటే ఎట్టరా? అబ్బ అబ్బా యింత నీసా?” అని యాస్ట పొయ్‌నాను.

నేను ఆర్నెల్లు, సమ్మచ్చురం ట్రై జేసినా నాకు అశోక చెట్ల కింద మా సైన్సయ్యోరి కేరీరు బోగం దక్కనే లా. సెప్తే నమ్మరు గాని, స్టాఫురూములో నుంచి ఇందీ అయ్యోరు బైటకు రాను, నన్ను పిలవను – దీంతోనే ఏడులో

నుంచి ఎనిమిదిలోకి గూడ మారిపొయ్‌నాను. ఈ కాలంలో నూరు తూర్లయినా ఇందీ అయ్యోరి కేరీర్ను కడిగుందును. ఒక్క మెతుకంటే ఒక మెతుకు నోట్లో యేసుకోనుండను.

'ఇందీ అయ్యోరా! పగ సాదిస్తా!' అని తొడ గొట్టి నాకు నేనే పతిగ్న చేసుకోనుండాను.

మా ఇందీ అయ్యోరిది వేమూరు. మా అయిస్కూలు వుండే యెంగటాపరానికి వేమూరికి మైలుకు పైనే వుండాది. ఇస్కూలు పిలకాయిల్ని లాస్టు పీరిడ్డులో యింటికి పంపించి కేరీరు తెప్పించుకుంటాడు. ఎనిమిదిలో వుండంగా బుదోరం నాడు ఫోర్తు పీరిడ్డు ఇందీ పడింది. ఆ పాటం యినే దానికన్నా ఇందీ అయ్యోరి వూరికి పొయ్ కేరీరు తెచ్చేదే పుణ్యం.

ఆ దినం వాన తుంపర తుంపరగా పడతానే వుండింది. ఇందీ అయ్యోరు పాటం జెప్పేది పక్కన బెట్టి, "కేరీరుకు ఎవురు బోతా(ర్రా!" అనడిగినాడు. చివక్కన లేచి నిలబడినాను. "గొడుగు లేకుండానే నేనొక్కడ్నే పొయ్ తెస్తా." అన్నాను.

"పో" అన్నాడు ఇందీ అయ్యోరు.

పొయ్‌నాను వేమూరికి.

అన్నం పెట్టి కేరీరిచ్చింది అయ్యోరమ్మ.

నడిదోవలో కానగ చెట్టు కింద కేరీరు మూత యిప్పినాను.

అన్నం, కందిపొప్పు కూర, మిరాల చారు, కోడిగుడ్డు అట్టు, పెరుగు! ఒరెడెఖా!

పది పిడికిళ్ళ కూడు!

వోల్మొత్తం ఆమ్లెట్టు!

ముక్కాల వాశి కందిపొప్పు, సగం మిరాల చారు.

ఇన్ని తిన్నాక కారం ఎత్తుకొనింది.

పై అరలో పెరుగుండాది గదా!

కేరీర్ను ఎత్తక పొయ్ స్టాఫు రూములో పెట్టేసినాను.

ఆ మరసట్రోజు అయ్యోరమ్మ చెప్పింది వినేసొచ్చిన మా ఇందీ అయ్యోరు, నేను సైన్సయ్యోరి క్లాసులో వుంటే పక్కకు పిలిచి నా సామిరంగా కానగ బెత్తంతో కొట్టినాడు చూడండి!

"తింటే తిన్నావు,

పిడికెడు కూడు వుండియ్య గూడదా?

తింటే తిన్నావు,

సగం ఆమ్లెట్టు మిగల్నియ్య గూడదా?

తాగితే తాగినావు

కాసిని చారుండీ గూడదా?

గతికితే గతికినావు

చారడు పెరుగుండీ గూడదా!" అని పాట మాదిర్తో పాడి ఇందీ అయ్యోరు రెండు బెత్తాలను ఇరగ్గొట్టినాడు. పిలకాయిలందరూ ఒకే నవ్వడం. మా ఇందీ అయ్యోరి దుఃక్కం జూసి నేను దెబ్బ దెబ్బకు – మా పిలకాయిలకు మించి నవ్వడం.

మా ఇందీ అయ్యోరికి చేతులు నెప్పులెత్తుకున్నాయి.

నాకు నవ్వి నవ్వీ నోరు నెప్పెత్తుకొనింది.



# మా యెంగట్లచ్చిం పలక డాన్సు

మా వూళ్ళకల్లా 'యెంగట్లచ్చిం డేరా' రావాల్నే గాని, కట్టకింద యెంగటాపరంలో వుండే బలరామా టాకీసులో జ్యోతిలచ్చిం 'సూదిలో దారం సందులో బేరం' అని ఎంత కన్నుగొట్టినా, చూసే దానికి ఈగిల్లదప్ప మనసులుండరు. ఆ జ్యోతిలచ్చిం అట్టాంటిదే యెంగట్లచ్చిం కాళ్ళ సందన పంగటించి పదారు పదారు ముప్పైరెండు సార్లు దూరాల్సిందే బాంచత్. జ్యోతిలచ్చిం ఎవరుగాని? ఆ గోలుకొండ వుండాదే అదొచ్చి యెంగట్లచ్చిం డాన్సు జూసినా 'ఒరబ్బా!' అని అంతెత్తు ఎగిరేసును.

బోడిరెడ్డి చలేంద్రం కాడ మాడి తోపులో పెట్రమాక్సు లైటు కింద పలకల దరువు మద్యన యెంగట్లచ్చిం 'మామా మామా!' అని వక్క గొరికినంత సేపు కాలాడించాల్నే గాని, జెనంలో వుండే మా వూరి ఇలామంతు బావ 'ఏమే ఏమే బామా' అని జాము సేపు బుజాలెగరెయ్యాల్సిందే!

ఎంతోగాదు కాల్రూపాయికే ఈ యేడికంతా. ఒకే టిక్కట. అంతా నేలే. నేలమీద కూచ్చునే పాపాత్ముడెవుడు? అందరూ మాడి కొమ్మల మిందనే గదా! యెంగట్లచ్చిం డేరా బోడ్రెడ్డి చలేంద్రం కాడికి వొచ్చిందంటే చాలు – మా అమ్మతో ఆ మాటా ఈ మాటా చెప్పి పావలా దొబ్బక పొయ్ చూసొచ్చే వాడ్ని. తిరపతి గంగ జాతర్లో వుండునా అంత కేళీ ఇలాసం!

యెంగట్లచ్చిం అంత శుద్ధమైన ఆడది నాగలోకంలో అన్నా వుండునా ఏమి? చంకల్దాకనే రైకేసుకొని, మోకాళ్ళూ, తొళ్ళూ కనపడేటట్టు – ఆమె

జాతీ జన్మాన డాన్సు యేసునా ఏ పొద్దన్నా? అబ్బో, బలే బొటువైన డాన్సది! ఆమె డాన్సు యేస్తావుంటే సుట్టూరా నిలబడుకోని ఆమె మొగుడూ, మర్దులూ, అన్నాదమ్ముళ్ళూ వాయిస్తారు చూడండి, అదీ దరువంటే! 'అగ్గో ఆయనే యెంగట్లచ్చిం మొగుడం'టే– చూడను రొండు కండ్లూ చాలవేమో అనుకున్నా. ఘాఘూ వొట్టి వొక్కల ముక్కల మనిషి. ఆ మనిషిని చూస్తే నాలుగు నాళ్లు నీళ్ళు తాగలేము మళ్ళ. కాకి చేతికి మిరప్పొండు అందించినట్టే గదా. అదొక ఈడా జోడా నాశినం? ముందు జెల్మలో వాడు జేసుకున్న పున్నెం గాకపోతే అంత ఈనపు మొగోడికి యెంగట్లచ్చిం పెళ్ళామా? దేముదు యాడ వుండాడు జెప్పండి?

నడి జాముకంతా డాన్సు అయిపూడిస్తింది. యెంగట్లచ్చిం నోట్లో యేళ్ళు పెట్టుకొని, మొగోళ్ళంతా కుళ్ళుకొని చచ్చేటట్టు ఒక ఇజిలు యేసేసి, మాకందరికీ చేతులూగిచ్చేసి డేరాలోకి పూడిస్తింది. అంతే. ఆ రాత్రికి మళ్ళీ ఆ మనిసి మనకు కనపడదు. ఎవుడన్నా ఒక ఇకారపు మొగోడు ఆ రాత్రి తెల్లవాదులూ ఆ మాడి తోపులోనే తారుకులాడి తవుసు జేసినా దేముడు పత్తెచ్చం గావాల్నే గాని యెంగట్లచ్చిం అయితిందా!

నేనొక నాడు ఆత్రం ఆత్రంగా పొగులు పూటే బోడిరెడ్డి చలేంద్రం కాడికి యెంగట్లచ్చింని చూసుకునే దానికి పోతిని. ఇటువంటి సమయాల్లో తాంచారం పనికొచ్చునా? ఆమె వొచ్చేదే సమచ్చురానికొక దపా. మంచి ఎండా కాలంలో వొస్తిందా (అప్పుడే గదా చెనిక్కాయల పంట, జనాల చేతల్లో నాలుగు రూకలు మెదిలేది) పదీ పన్నెండు నాళ్ళుండి పోతింది. మనం యిపుడు తాంచారం చేస్తే మళ్ళా మళ్ళా చూడలేము గదా అని చలేంద్రం కాడికి పోతిని. నేను పొయ్యే కాడికే నా ఈడోళ్ళు –పన్నెండు పదృ్మూడేండ్ల పిలకాయిలు యెంగట్లచ్చిం డేరా చూట్టూరా చేరుండారు. అక్కడ ఒక ఒంటెద్దు బండి. వాళ్ళు యాడికిబోతే ఆడికి ఆ సామాను, ఈ సామాను ఈపుల మింద మోసుకొని పొయ్యేదానికి రెండు మూడు గాడిదిలూ వుండాయి. ఆ డేరా కాడ ఒక ఒక్కల ముక్కల ఆడామె ఒళ్ళో ఒక బిడ్డిని పండేసుకొని పాలిస్తా, ఇంగొక బిడ్డికి పేన్లు చూస్తా వుండింది. ఆమె యెంగట్లచ్చిం అని తెలవని నేను మెల్లంగా, "ఒరే ఒరే యెంగట్లచ్చిం యాడబొయ్యిందిరా సాములాలా! ఆమిని చూడాలని యింత

దూరం వొచ్చినాను." అనడగినాను. వాడు, "నీ కండ్లలో ఎవురు దొబ్బినారు? యెదురుగా యెంగట్లచ్చాన్ని పెట్టుకొని, నన్నడగతా వుండావా?" అనన్నాడు.

పెట్రమాక్సు లైటు కాడ డాన్సు ఆడే ఆ మనిసికి, చింత చెట్టు కింద గాడిదల పక్కనుండే ఈ మనిసికి నాగలోకానికీ, నక్కకూ వున్నంత వారా వుండాది. నేను నమ్మకుండా, "ఒరే అబ్బా నాది జుట్టుగాదు, కిరాపు, జుట్టు బెట్టుకోని వుండే మోటు మనిసికి చెప్పినట్టు చెప్పబాక. యెంగట్లచ్చిం ఆమేనని నీ కెవురు జెప్పిరి? ఆమె డాన్సు ఏ పొద్దన్నా చూస్తివంటిరా ముతాలి నాయాలా?" అనడిగినాను. నేనన్ని అనినా యింక ఏమి లాబం? ఆమే యెంగట్లచ్చిం. ఈ సందులోనే యెంగట్లచ్చింకి సమందించిన మొగోళ్ళు యాడనో కాకుల్ను కొట్టుకొచ్చి కూర చేసుకొనే దానికి రడీ అవతా వుండారు. అంతేమిటికి, పొగుటి పూట యెంగట్లచ్చిం అంతటామె వూళ్ళోకి చట్టైత్తుకోని వచ్చి, 'అమ్మా, తల్లా!' అని మా గడపల ముందర నిలబడుకోవటం ఈ పాపం చేసిన కండ్లతో ఎన్నిసార్లు చూళ్ళా నేను! 'ఇదా యెంగట్లచ్చిం బతుకు' అని నేను ఎన్నో యావత్తులుగా నిరామయం అయిపోయి వుండాను. 'చింత చెట్టు కింద యెంగట్లచ్చిం ఈనమే. రాత్రి పూట పలక డాన్సు దగ్గిర మాత్రం యెంగట్లచ్చిం దగద్ధమానం!' అనుకొని ఆమె డాన్సుకు మాత్రం పోకుండా వుండలేదు.

మా వూళ్ళకు డాన్సుకొచ్చే యెంగట్లచ్చింకి ఎంత పేరురా అంటే–

ఆమె ఒక దఫా మా వూళ్ళ కొచ్చినప్పుడు మా వూళ్ళో కృష్ణమ్మ అనే అత్త వరసామె ఒకామె కడుపుతో వుండిందంట. యెంగట్లచ్చిం బోడిరెడ్డి చలిందరం కాడ డాన్సు యేసేటప్పుడే కిష్టమ్మత్తకు ఆడబిడ్డ పుట్టింది. కిష్టమ్మత్తకి పుట్టిన బిడ్డకి కన్నూ ముక్కు – బాగుండే కొందికి 'యెంగట్లచ్చిం' అని పేరు బెట్టుకొనింది.



# మా గెడ్డాం అయ్యోరి పుణ్యం

పచ్చంగా వుండే ఆ మాడి తోపులో ఒక్కొక్కర్నే నిలబెట్టి "మీ అమ్మ మింద వ్యాసం చెప్పండ్రా ముండ నాయాండ్లాలా!" అని కానగ బెత్తాల కట్టను ఆడించే వాడు మా పరమాత్మాచారి అయ్యోరు.


అయిస్కూలు మెట్టెక్కినాక, మా పిలకాయలకు తల కాడ గుండుగా తయారైనాడు ఆ గెడ్డాం అయ్యోరు. మా వూళ్ళో వుండిన ఎలిమింటిరీ స్కూల్లో అయితే తెలుగుకు, సాంఘీకకు, సామాన్యకు, గణితానికి అన్నిటికీ ఒక్క గండయ్యోరే వచ్చి చదువు చెప్పేవాడు. ఈ యెంగటాపరం అయిస్కూల్లో అదేం కర్మమో గాని, ఒక్కొక్క దానికి ఒక్కొక్క అయ్యోరు వచ్చి శిండకు పన్నెండు చెప్పేవాడు. మా ఆరో తరగతి పిలకాయిలం అందరి అయ్యోర్ల దగ్గిరా–కడాకు ఇందీ అయ్యోరి దగ్గిర కూడ ఎట్టనో ఒకట్ల గెలాయించినాం గాని, ఈ తెలుగయ్యోరి దగ్గిర మాత్రం తలకాయిలు పట్టుకోని కూచ్చునేసినాం. శుక్రోరం శుక్రోరం ఏడో పీరిడ్డు అంటే లాస్టు పీరిడ్డు తెలుగు జెప్పటానికి గెడ్డాం అయ్యోరు వస్తా వుంటే మాకు వుచ్చలు పడేవి. ఆయన శుక్రోరం పీరిడ్డులో పాటం జెప్పకుండా, మా పిలకాయిల్లో ఒకడ్ని పైకిలేపి, "మీ అమ్మను గురిచ్చి వ్యాసం జెప్పరా, అడివి నాయాలా?" అనేవాడు. ఆ పిలగోడు పైకి లేచి, మడి జేతులు గట్టుకోని, మాడి చెట్లకల్లా బిక్కిరి చూపులు చూస్తా నిలబడేవాడు. గెడ్డాం అయ్యోరు క్లాసులోకి వస్తా వస్తా తెచ్చుకున్న కానగ బెత్తంతో వాడికి పెండ్లి జరిపిచ్చి, "పుట్టినావు నాయాలా, పుట్టుడాముదాలకు

చేటుగా! ఏమిటికిరా, నీ జల్మ? నీళ్ళు లేని బాయిలో దూకి నడుములిరిగి చావేమిరా?" అని, ఆ పిలగోడి మానం తీసి, ఆడపిలకాయిల ముందర్నే ఆ మాడి మాకులకు కట్టేసే వాడు. ఒక రోజు యింక గెడ్డాం అయ్యోరు క్లాసులోకి వస్తాడనంగా, మా ఆరో తరగతి పిలకాయిలమంతా ఒక తాటి మింద నిలబడి ఒక మాట మింది కొచ్చినాం. ఆ మాట పకారం గెడ్డాం అయ్యోరు వచ్చి, "అమ్మ మింద వ్యాసం చెప్పండి" అని అనంగానే, మేమందరం ఒకే దపాగా, "మేం మా అమ్మల మింద వ్యాసాలు చెప్పలేం, సా. మేం ఆవల మింద, పతివర్తల మింద అయితే చెప్తాం సా."అని అనెయ్యాల. గెడ్డాం అయ్యోరు ఆ దినం మంచి మంచి పేము బెత్తాలతో క్లాసులోకి వచ్చి, ఒకడ్ని పైకి లేపి, "నడవలూరోడా! ఈ రోజన్నా మీ అమ్మ మింద వ్యాసం జెప్పరా, వినాల" అని అన్నాడు. మేం అందరం ఒకర్నొకరం చూసుకొని, ఎవరికి వాళ్ళమే తలకాయిలు వాలేసుకొని, "మేం చెప్పలేం సా, ఆవల మింద అయితే ఎంత కావాల్సుంటే అంత చెప్తాం సా" అనేసినాం. అంతే ఈరప్పనాయుడి ఖండ్రిగ నుంచి వచ్చే ఆ గడ్డామయ్యోరు ఉగ్రం తెచ్చుకోని పొటేలి దూరినట్టు మా మింద పడిపొయ్, దొరికినోడ్ని దొరికినట్టే మా పట్టలు వూడదీసేసినాడు. మేమంతా "ఓయమ్మల్లో ఓయక్కల్లో–" అనుకుంటా తనకలాడి పొయ్నాం. కానగబెత్తాన్ని బాలనాగమ్మలో మాయల పకీరోడు ఆడించినట్టు ఆడించి, "ఆవల మింద వ్యాసాలు చెప్పడానికి ముండమోపి ఆడది చాలురా. మీ అమ్మల మింద వ్యాసాలు చెప్పేదానికి మీకేమి తీపు రోగంరా, ముండ నాయాండ్లాలా!" అని చింత నిప్పులు కక్కినాడు మా గెడ్డాం అయ్యోరు సందిట్లావున గస పోసుకుంటా. "నాయాండ్లాలా! ఆ మకా తల్లులు కన్నోడి అగచాట్లన్నీ పడి, తెల్లారి నిద్దరలేచి మీ కేరీర్లలో అంత వొండిపెట్టి అంపిస్తా వుంటే గదా, మీరొచ్చి ఈ చెట్ల కింద కూర్చోని చదవతా వుండేది. లేకుంటే ఈ పాటికి గొడ్లు కాసుకుంటా వుండరా! అటువంటి మకలచ్చుముల మింద ఒక చిన్న వ్యాసం అన్నా చెప్పలేరంట్రా ముఠాలి యెదవలాలా!" అని మళ్ళా ఒక దపా మా క్లాసు మిందపడి తుక్కు రేగ్గొట్టే వాడు. గెడ్డాం అయ్యోరి దోవే వేరుగా వుండేది. అయ్యోర్లందరూ పాంట్లూ చొక్కాయిలు యేసుకొని ఇస్కూలికి వస్తే, మా గెడ్డాం అయ్యోరు– కాళ్ళకు చెప్పులనేటివి గూడా లేకుండా, ఒక పంచి గట్టుకుని నాము కొమ్ముతో మొకాన పొడుగ్గా బొట్టు పెట్టుకొని, ఒక్కా ముక్కల జుబ్బా ఒకటి యేసుకోనొచ్చి, ఈ మాదిర్తో మా చావు కండ్ల జూసేవాడు.

ఆయన పెట్టే బాదల్ను మేము ఓర్చలేక ఒకనాడు మా ఆరో తరగతి స్క్వాడు లీడర్లు ఎనిమిది మందిమీ, కాలవగెడ్డన కానగచెట్ల నీడన రాసికంగా మీటంగి బెట్టుకొని, "మనం గెడ్డాం అయ్యోరి క్లాసుకు పోకుండా ట్రయికు జేద్దాం. ఈ సంగతిని యెడ్‌మేస్త్రీ దాకా తీసకపోయ్, డి.ఇ.ఓ. నుంచి గెడ్డాం అయ్యోరికి వ్రాస్టింగ్ ఆర్డర్లు తెచ్చేద్దాం" అని ఒక నిర్నయానికి దా వచ్చేసినాం. ఆ నిర్నయానికి రావడానికి మేమంతా యెనక తొక్కులు తొక్కతా వుంటే, గెడ్డాం అయ్యోరు కాలవగెడ్డ మిందికి ఒంటేలు పోసుకొనే దానికి గా వచ్చినట్టుండాడు. అంతే, మాకు తెలవకనే మేమంతా కానగ మాకులెక్కేసి కోతీకొమ్మచ్చి ఆడతా వుండినట్టు యాక్సన్లు చేసేసి గెడ్డాం అయ్యోరికి డవుటు రాకుండా చేసేసినాం. ఏడో పీరిడ్డుకు ముందర, మా స్క్వాడు లీడర్లమందరము, ఒకరి మొకాలు ఒకరం చూసుకొనే దానికి సగించక, గెడ్డాం అయ్యోరి క్లాసుకు మంత్రం వేసినట్టు వచ్చి కూర్చునేసినాం. ఒక స్క్వాడు లీడ్రు నాకల్లా అదొక రకం చూపు చూస్తే, నేను యింగొక రకం చూపు చూస్తా, "స్టయికులు చెయ్యడం ఎంతసేపు పని? వక్క కొరికినంత పని. అవితే స్టయికులు చేస్తే మనల్ని సరస్వతి అంటదంట. అదీ నా బయిం." అనేసినాను.

మా గెడ్డాం అయ్యోరి దగ్గిర ఏది చేసినా తప్పుగానే వుండేది. ఆయన వచ్చి కుర్చీమింద కూర్చోంగానే, మనం తల వాలేసుకుందుమా మనల్నే లేపి నిలబెట్టి, "చెప్పు వ్యాసం!" అంటాడు. అందుకని నేను ఒక ఎత్తు యేసి, యాడలేని దైర్నాన్నంతా కూడగట్టుకోని గెడ్డాం అయ్యోరి కండ్లల్లో కండ్లు బెట్టి ఆర్పకుండా చూసినాను. గెడ్డాం అయ్యోరు, "మిట్టూరోడా! లేచి చెప్పురా, అక్షులు, పక్షులు ఆలకించాల. మీ అమ్మమింద గుక్క తిప్పకుండా వ్యాసం జెప్పు" అని నన్నే లేపినాడు. 'ఒరే, నా కొడకా!' అనుకొని, నేను లేచి, నోటి మాటెత్తకుండా, తల వాలేసుకున్నాను. గెడ్డాం అయ్యోరికి ఉన్నట్టుండి ఎప్పుడూ రానంత కోపం వచ్చేసి–"రెండు నెలల్నుంచి సతాయిస్తా వుండారు గదరా. ఒక్క నాయాలి చేత నాలుగు మాటలు చెప్పించలేక పోతుండానే!" అని ఆయన శౌర్రానికి పోయి, నన్ను రూళ్ళ కర్రతో చావగొట్టేసినాడు. నా కాకి నిక్కర మింద వుండిన దుమ్మంతా దెబ్బకు పూడిసింది, పాపం! నేను కేర్ కేర్ మని, అల్లల్లా అని, బేర్ బేర్ మని– పుట్టినప్పుడు గూడా ఏడిసుండను – అంత ఏడుపు ఏడ్చేసి, "చెప్తాను సార్, చెప్తాను సా" అనేసి దండం బెట్టేసినాను.

"చెప్పు" అనేసి గెడ్డామయ్యోరు, కుర్చీమింద కూచ్చుని కండ్లు మూసుకున్నాడు. నేను ఇంక చెప్పకుంటే వూపిరి పూడిస్తిందని బిత్తరక పోయి, బలంతాన నోరు తెరిచి, యెక్కిళ్ళ నడిమధ్యన, "మా అమ్మ పేరు సినక్క. మా అమ్మ జానా బిత్తిడు మనిసి. మా అమ్మ పొగులు పొద్దుల గూకునా రొండు గాళ్ళూ ఒక సోట బెట్టకుండా పనిమింద బడి అల్లాడి పోతింది. మా అమ్మ ఒక్కల ముక్కల ఆడది..." అని చెప్తా వుంటే పిలకాయిలంతా నవ్వాపుకోలేక పకపకా నవ్వేసినారు. గెడ్డాం అయ్యోరు నాగుబాము నాగాసొరం ఇంటా వున్నట్టు తలూగించి నా వ్యాసం ఇంటా వుండినోడల్లా, చివక్కన తల పైకెత్తి, క్లాసు మింద పడి, "నాయాండ్లాలా, ఎగతాళా మీకు? మిమ్మల్ను చంపేసి వడమాల పేట జెమినీలో కూచ్చుంటా నవ్వినారంటే"–అని అందర్నీ ఊదగొట్టేసినాడు. "చెప్పరా మిట్టూరోడా!" అని మళ్ళాబోయి కుర్చీమింద కూర్చునేసినాడు. నాకు దీంతో గొప్పయిపోయి, నేను, "మా అమ్మ బలే కఠీనురాలు. మా అమ్మ చాకలోళ్లకు గూడా సరిగ్గా సంగటేసేది గాదు. మా అమ్మ గూడా కడుపుకు సరిగ్గా తినేది గాదు. మా అమ్మ...మా అమ్మ...మాయమ్మ" అని బారడు పొడుగు చదువు చదివినట్టు చదివేసినాను. గెడ్డాం అయ్యోరు నవ్వు మొకంతో, "అమ్మ, నేను కోరిన కొండమింద వాన కురిసింది, ఈ పొద్దు–" అనేసి నన్ను పైకి లేపి క్లాసు క్లాసంతా ఆడపిలకాయిలతో సహా చెంప దెబ్బలు దగ్గిరుండి వేయించినాడు. ఆ దినం నుంచి శుక్రోరం ఎవురు అమ్మ మింద వ్యాసం జెప్పలేకపోయినా, నన్నుజెప్పమని మా గెడ్డాం అయ్యోరు శతపోరేవాడు. శుక్రోరం, శుక్రోరం, నాచేత చెంపదెబ్బలు దినలేక ఆరో తరగతంతా చచ్చి సున్నమైపోయింది. "నాకు సిన్నంగా చెంపదెబ్బలెయ్..." అని ఆడపిలకాయిలు, మొగపిలకాయిలు మధ్యాహ్నం పూట నాకు అయిసులూ, టీలూ తీసిస్తావుంటే... నేను రోజుకొక రకంగా మా అమ్మ మింద వ్యాసం చెప్తా వుండేవాడ్ని. ఒక రోజు మా వూరోడొకడు, "మో, మీ సినబ్బ నువ్వు చాకలోళ్ళకు సంగటెయ్యవని అయిస్కూల్లో గెంట వాయించినట్టు చెప్తావుండాడు." అని మా యమ్మకు చెప్పేసినాడు. మాయమ్మ, "నా మానం యింటికాడ తీసేది గాక, అయిస్కూల్లో గూడ తీస్తా వుండావా..." అనడిగినా నేను యినకుండా, గెడ్డాం అయ్యోరు ముందరికి అక్షులు పక్షులు రమ్మని వినమనే వాడ్ని.



# గుర్ గుర్ గుడుగుడు మోటర్

మా అమ్మ కుండా జట్టి మూసేసి, పైట కొంగుతో నట్టింట దీపాన్ని ఆర్పుతాదో ఆర్పదో - అప్పుడే మా పక్కింటోళ్ళు మిడిమేలంగా గురకలు కానిచ్చేస్తా వుంటారు. చెవల్లో జోరీగలు సుమారు గదా, ఆ గురక కన్నా. మా నాయన మంచం మింద, మా అమ్మ, మా అక్క, నేను చాపల మింద జేరుకుని–సామీ పరమాత్మా, ఎట్ట సామీ మాకు నిద్దర పట్టబొయ్యేది, అని మాలో మేమే మలగుల్లాలు పడతా వుంటాము. దేముడి దర్మాన మా యింట్లో సీగిటీగలు గూడా తక్కవే. ఈ గురకలే మమ్మల్ని ఉప్పున బెట్టి, పప్పున పామేది. మా నాయిన మరేదగా కొంచేపు చూస్తాడా, మళ్ల ఈగలు దోలుకునే గొడ్డు మాదిర మొకం చిటకరించుకొని, లేచి కూచ్చొని, “ఒరే, సినబ్బా లెయ్‌రా, లేసి ఆ లంజిల్ను నీ ఎడం కాలి మెట్టుతో కొట్టేసి రాబోరా. వచ్చే పాపం రానే వస్తింది గాని, అంతగా వుంటే తిరమల కొండకు బొయ్ బోడిగుండు కొట్టించుకొని వద్దువు”– ఈ మాటల్ని అనేసి నిమ్మళ పడతాడు. నేను మేలుకోని వుండేవాడ్ని గాబట్టి నాకీ మాటలు యినబడినాయి గాని, ఇవి గురకలు బెట్టే పక్కింటోళ్ళకు తగుల్నా ఏమి?

మా పక్కిల్లంటే ఎవుర్ది? మా బూలోక రంబోళ్ళదే గదా. వాళ్ళు పొయ్యి మంటేస్తే, సరిగ్గా కాలే కట్టెలు బెట్టి వూది చస్తే గదా, మేము కండ్లు నులుం కోవాల. అవీ మా ఇండ్ల ఏరుపాటు. మా నాయిన కొంచేపు తాలినాక, “పోతే పోయింది ఒక మూట సిమిటీ, ఒక బండి ఇటికి రాళ్ళు. వాళ్ళకూ

మనకూ సమందం లేకుండా గోడ కట్టేస్తే"– అనేవాడు. మా అమ్మ ఆ గురకలతో పాటు 'ఈ నసేంది సామీ' అని, "తొందర పడొద్దుండు, తెల్లార్నిచ్చి సిమిటీకి పోదువు గాని, ఇప్పుడే గాని ఎలబారేవు!" అని యాసండం పడి కసురుకునేది.

ఆడ మలయాళం– అంటారే, అది మా బూలోక రంబోళ్ళ ఇల్లే గదా. ముగ్గురాడోళ్ళుండే ఆ గుండంలో ఒక మొగోడు– మా లచ్చుం బావ గూడా వుండాడు గాని ఏమిటికి? తెల్లారి ఆవల్ను అడివిలోకి తోలుకోని సందేళ ఇంటికి రావాటం, రాత్రి పూట ఇంట్లో తినిన చెయ్యి, ఈదిలోనో వూళ్ళో ఎవురింట్లోనో ఆరకుంటే ఆ మనిషికి నిద్దర బట్టేది కాదు. రాజ్జమంతా– ముక్కులు చీలిపొయ్ వుండే దొ్రవ్వకు, ఆమె కూతురు బీకత్తకు, ఆమె కూతుర్లు – నీలావతికి, బూలోక రంబకే. ఈ నలుగురాడోళ్ళలో కొంచిం నైసు మనిసి బూలోక రంబే. ఆ అమ్మి చచ్చినా గురక బెట్టేది గాదు. 'సుబ్రమణీ! రాలీలో పొనుకున్నట్టే వుంటాదిరా నాకు రాత్రి పూట. వాడికై పాయ. మా అవ్వ పక్కలో పొనుకోకుంటే నాకు నిద్దరే పట్టదే!' అని వాళ్ళ ఇంట్లో గురకల్ను గురిచ్చి ఆ అమ్మి మాతో చెప్పి మా అందర్నీ నవ్విపించేది. బూలోక రంబ ఆ యింట్లో తప్పుబుట్టి పోయిన బిడ్డ. ఆ అమ్మికది చోటే గాదు పాపం. ఇంక దొ్రవ్వ, బీకమ్మ, నీలావతి ముగ్గురూ ముగ్గురే. ఒక్క గురకలోనే గాదు అన్నిట్లో గూడా. ఒకర్ని తియ్యాల్సిన పన్లా, ఇంగొకర్ని తొయ్యాల్సిన పన్లా. ముగ్గురూ తోమిన గుర్రాలున్నట్టు పిడిగుండ్లు మాదిరిగా జమాయించి వుండే వాళ్ళు. దొ్రవ్వ అంటే ముసిల్ది, బీకత్తంటే నడి తరంది. ఈ నీలావతి కేం పోగాలం అని! రేపో ఎల్లుండో ఒకడి చేత కట్టించుకోవాల్నే బొట్టు. వాడి పక్కలో జేరి ఈ వాటంతో గురకలు పెడితే – ఆ యమ్మి రాత ఏ తీరుగా వుండును? సేతి గుడ్డతో మూతి తుడుచుకోవాల్సిన వొగిసనుకో నీలావతిది. ఆ వొగిసులో ఆ గురక ఆ అమ్మికి ఏమిటికిగా అబ్బి వుండును! అవ్వకు మించి అమ్మగా, అమ్మకు మించి బిడ్డగా గురకలు బెట్టి మా ఈదిలో వోళ్ళెవ్వురికీ నిద్దర్లేకుండా చేసినారే! మా అమ్మ ఒకసారి అననే అనింది. "గుడు గుడు మోటార్లు ఏమి జెయ్యాలరా సినబ్బా ఈ గురకల దగ్గిర!" అని నవ్వు మాటలన్నీ చెప్పేది మా అమ్మ వాళ్ళ గురకల గురిచ్చి.

ఒక రోజు వాళ్ళ గురకలతో మేము యేగ లేక చానా మందిమి మా లచ్చుం బావతో చెప్పుకొని, “ఏమి సామీ? నువ్వు మళ్ళ కాడ యాడన్నా ఇల్లు గట్టుకోని పోతావా, లేకుంటే మమ్మల్ను వూరొదిలి పూడవమంటావా? ఇదేమి చెర. చస్తా వుండాం నిద్దర్లు లేక. పొగులంతా సేద్యాలు చేసే మనసలకు రాత్తిర్లో నిద్దర సౌఖ్రిం లేకుంటే ఎట్ట?” అని నవ్వులాడుకున్నాము. అత్త అన్నా, పెళ్ళాం అన్నా, కూతుర్లన్నా ఎగతాళిగా వుండే మా లచ్చుం బావ ఏమంటాడు చెప్పండి, మా మాటలకు? మాతో గూడా ఆయన గూడా నవ్వి, “ఒరే సినబ్బా, మీ బీకత్త ముక్కును మూసిపెట్టి, గురకను అణసర జేసి, దాని పక్కలోనే పొనుకోని నిద్దరపోరా. అది గూడ మనిసి లేక అల్లాడతా వుండాది” అనేవాడు.

(అసలు కత వుండబొయ్యేది ఇప్పుడు గదా. నేను ఎనిమిదో తరగతిలోనో, తొమ్మిదిలోనో వుండంగా మా నీలావతికి పెండ్లయి పూడిసింది– వేణన్న అనే ఆయనతో. సాములాలా, మీరు నిజ్జం చెప్పినా యింటారు, అపద్దాలు చెప్పినా యింటారు. మనం నరమానులం గదా. వుడికిన పొట్ట పేగునైనా తెంపుకోలేని బలీనులం మనం, మనకేం దెలుసు–ఆడ, పైన మండేవోడికి తెలవాలగాని– పెండ్లయిన మరసనాడే నీలావతికి ఆ గురక యాడబోయిందో! ఆ యమ్మి నిద్దరబొయ్యే సంగతి మా వేణన్నకే తెలవదంట. అంత మోటు మనిషి ఎంత నైసయి పోయిందో చూస్తిరా. దీన్నట్ట వుండియ్యండి–నాకు పొట్ట బొడిస్తే– అమ్మ, ఆవు– అనే తెలుగచ్చిరాలు బైట బడాల్నేగాని ఒక్క ఇంగిలీసు ముక్క గూడా రాదు. నేను బలే పూరు ఇంగిలీసులో. ఇంటర్మెట్టులో స్టోరీలు కంఠతా పెట్టలేక నేను చచ్చి సున్నమయ్యే వాడ్ని. వాటితో ఇద్దం జేస్తా వుంటే మా నాయిన మంచం మింద చేరుకుని పెట్టే గురక చెప్పనలివి గానిది. నేను మా అమ్మను నిద్దర లేపి, ‘అమ్మా, మా అయ్య గురక జూడా!’ అని కండ్లల్లో నీళ్ళు బెట్టుకునే వాడ్ని. మా అమ్మ మా నాయిన్ని, “ముండ మొకం యెదవా! యెన్న బడేటప్పుడు బాన పగలగొడతావా! ఇంత సదువు సదివిచ్చినాం సినబ్బను. నీ గురక దరమ్మాన వోడు ఇంటర్మెట్టు పయిలై పోకా!” అని తిట్టేది. నీలావతి ఎవురికీ తెలవకుండా మా నాయినకు చేర్చినట్టుండాది ఆ గురకను. దొౖరవ్వ ముసిలామె అయిపోయి చచ్చేపాయ. బీకమ్మకూ గురక అనేది మరుపుకొచ్చె, ఇప్పుడు మా నాయినకు తగొలుకొనె అందరి గురకలూ. అంతకు ముందు లేంది ఒకేసారి గానా!

ఇంతలేకే ఏమాయె కత. ఇప్పుడు గదా వుండేదంతా. నేను – 26 ఏండ్లన్నా నిండీ నిండకుండా వుండే నాకు ఏమిటికి బట్టినట్టు ఈ గాచ్చారం? నేను ప్రబావతి పక్కలో పొనుకుంటానా, మళ్ళ నా వొళ్ళు నాకు తెలిస్తే! ప్రబావతి నిద్దర పట్టక, “అబ్బా, ఓ అబ్బా – సరిగ్గా పొనుకో ఏమి! గురకను బరించగా వుండ్లేదు సామీ!” అని మాటి మాటికీ నన్ను కుమ్మి కుమ్మి నా నిద్రకు చేటు చేస్తా వుండాది. నా గురక మాత్రం నాకు తెలవకుండా వుండాది. ఒక రోజు తెల్లారి నా బార్య, “ఇట్లయితే నా వల్లా గాదు సామీ. అవరా అవరా, అంత గురకా?” అని తెగేసి చెప్పింది. నేను మూతి ఎంత నల్లంగా బెట్టుకున్నా ఆ అమ్మి ఇదే మాదిరితో అంటా వుండాది.

నా బార్య అమ్మగారింటికి పొయ్ రెండు నాళ్ళల్లో వస్తాననిన మనిషి, పది నాళ్ళవతా వుండాది, ఇంగా రాలా. నాకేమో బయంగా వుండాది సాములాలా!).



# మా యింటి తీగూర
# ఇజీకోల్లు పొరుగింటి పుల్లగూర

నేనేననుకుంటే మా నాయిన నా కన్నా పసి పిలగోడుగా తయారైనాడు. మిట్టూరు నుంచి మూడు మైళ్లకా పక్కనుండే యెంగటాపురం అయిస్కూలుకు పొయ్ ఏడో తరగతి చదివే నేను - మా అమ్మ కేరీర్లో ఏమి పెట్టిస్తే దాన్ని ఎత్తక పొయ్ - నోటి మాట ఎత్తకుండా తింటా వుండాననుకో, నన్ను చూసయినా మా నాయిన బుద్ధి తెచ్చుకోని మాయమ్మ ఏమి పెడితే అది తినేసి, పీట మింద నుంచి పైకి లేచి తేపుకుంటా పోవద్దా? (దొంగ నాకొడుకుని, కత కోసరమని ఈ మాదిర్తో ఇక్కడ చెప్తుండానే గాని తిండి కాడ, నీళ్ళ కాడ నేను మా అమ్మను ఎన్ని ఉరి బాదలు పెట్టలేదు?)

మా నాయిన తిండి కాడ కుచ్చుంటే చాలు, మొకం మటమటలాడించే వోడు. సంగటి ముద్దలో నుంచి ఒక్కొక్క కవణాన్నే తుంచుకోని, కూరలో అద్దుకొని- బలవంతంగా మాత్తర్లు మింగినట్టు మింగేటోడు. మాయమ్మ "ముండమొకం యెదవా, తిండిని ఎంత ఇష్టింతో తినాల. అంత కష్టింతో తింటే అది ఒంట బడితిందా?" అని తిట్టేది మా నాయిన్ను. మా పాపిష్టోడు పుల్లంగా కారంగా వుప్పంగా ఎంతో జెమ్మాచారంగా వుండే కూరను పట్టుకోని, "చవ్వంగా వుండాది. దీంట్లో నాలుగు వుప్పురాళ్ళు కూల్చెయ్" అనేవాడు. ఈ మాటకు మాయమ్మ నాకల్లా జూసేది. నేను తింటా వుండినోడినల్లా పైకిలేచి

మా నాయిన యెంటికల్ని చేత్తో పట్టుకోని, "ఆల్రైటుగా వుండే కూరను బట్టుకోని వొప్పీరం జెప్పతావా? నోరు మూస్కోని గమ్మన తింటావా ఏమి జెప్పతావు? అమా, అందుకో కట్టె–" అని బెదిరించే వాడ్ని. మాయమ్మ దయ తలచి కట్టి అందుకోకుండా, "ఆ జుట్టు వొదులురా సామీ, లేచి పూడవబోతాడు కూడు తినకుండా!" అని మాట్లాడేది. మా నాయిన నాతో తగరారు పెట్టుకుంటే సంగటి కూడా దొరకదని తెలిసి, "ఒరే, సిన్నయిలూ! మీ వొదినోళ్ళింటి కాడ అంత కూర యేగించుకుని రాబో, నేను తినలేను ఈ నాశినాన్ని!" అనన్నాడు ఒద్దికగా. ఇంక ఆ మొగోడ్ని ఏమి జేసేది చెప్పండి? నేను మా నాయిన జుట్టొదిలేసి మా వొదినోల్లింటికి గిన్ని ఎత్తుకుని పొయ్‌నాను. ఆ రోజు మా వొదినోళ్ళది బెండకాయ వూరుబిండి. పిడికిడు వూరుబిండిని వెయ్యించుకొని, ఈదిలోకి వచ్చి అంత నాలిక మింద వేసుకుందును గదా – థూ నాశినం – అనే టైపులో వుండాది ఆ వూరుబిండి. దాన్నెత్తుకొచ్చీ రాంగానే మాయమ్మ గూడ దాన్నంత నాలిక మింద యేసుకోని నా మాదిర్తోనే అనింది. "మనకా వూరిబిండి థూ నాశినం, మీ నాయినకు అదే గదా తిరమల కొండ లడ్డు. వూల్లోళ్ళు చేసిన ఏ కూరన్నా అంతే ఆ ఈనపు మొగోడికి. వోడి గుంతలో యెయ్ దాన్ని" అని మా అమ్మ అనంగానే నేను ఆ వూరుబిండిని మా నాయిన గిన్నిలో యేసినాను. నేనూ మా అమ్మ ఏందో పనుండి పెళ్లోకి పొయ్ వచ్చి చూద్దుం గదా – మా నాయిన గిన్నెలో ముద్ద వుడీస్ అయిపొయ్యుండాది. మా నాయిన గిన్నిని, చెయ్యిని మార్చి మార్చి జాము సేపు నాకతా వుండిపొయ్‌నాడు.

మాయమ్మ మా నాయిన్ని పొడుగ్గా చూస్తా, "ఆమాత్రం తిండి ఈ ఇంట్లో కూరతో తినుంటే నాకు అంతకు మించి ఏమి గావాల? అంతా నా జల్మరాత, ఆ తల్లి (మా వొదిన) జేసుకున్న పుణ్యం" అనింది వొళ్ళు మరిచిపొయ్. దీనికి మా నాయిన నవ్వు మొకంతో, "ఆ మాదిర్తో కూరలు జేసేది నేర్చుకో, బెండకాయ వూరిబిండి నువ్వూ నూరతావు. ఏమిటికి, కుక్కలకు యెయ్యనా!" అనేసి పెళ్లోకి బొయ్ నాకిన చెయ్యిని నాకతానే కడుక్కున్నాడు. ఇంకొంచేపు తాలినాక మా వదిన గోడ కాడికి వచ్చి, "సినబ్బా! మీదేమి కూర?" అనడిగింది. నేను ఆ మాటతో గూడా, మా అమ్మ చేసిన చేమ గెడ్డల పులుసును యేసక పొయ్ మా వొదినకిస్తే– వాళ్ళు లొట్టలేసుకుంటా తినేసినారు. మాయమ్మ

చేమగెడ్డల తోలు తీసేసి, చింత పులుసు దండిగా పోసి నెంబర్‌వన్‌గా చేసింది ఆ కూరను. కోడిగుడ్ల పులుసు ఆనాటి మా చేమగెడ్డల పులుసు కాళ్ళ సందన దూరినా పనికొచ్చుండదు. ఆ కూరే మా నాయినకు సగించ లేదంటే ఇంక మాయమ్మ ఏ బాయిలోకి పోయి దూకితే కర్మాలు తీరును?

ఒక పూట అని గాదు, దినానికి మూడు పూటలుంటే మూడు పూటలూ మా నాయినతో ఈ మాదిరిగా – మా అమ్మ గాబట్టి యేగులాడింది గాని ఆ సీతమ్మ తల్లి అయినా కుండాజట్టి మా నాయిన మొకాన వొక్కలేసేసి పుట్టింటికి పూడిసుంటింది.

మేము చేమ గెడ్డల కూర జేసిన మూడు నెలలకేమో మా వొదిన అదే చేమ గెడ్డల కూర జేసింది. మేము నిజ్జింతోనే మా వొదిన ఆనాడు జేసిన బెండకాయ వూరుబిండి చేసినాము. మా నాయినకు సంగటి ముద్ద యేసి, పిడికిడుతో పిడికిడు బెండకాయ వూరిబిండి యేస్తే గిన్ని ముందర కూర్చుని పక్క చూపులు చూస్తాడే గాని కవణం ఎత్తుకోని మింగడే! నేను కూరగిన్ని ఎత్తక పొయ్ మా వొదినోళ్ళింటి కాడ నుంచి చేమ గెడ్డల పులుసు ఎత్తకొస్తే మా నాయిన, “కూర నోటికి ఎంత రుసిగా వుండాది!” అని ఇచ్చిత్ర పోయి రెండు ముద్దలు మింగేసి మంచం మీద చేరినాడు. ఇంక ఈ కడుపు మంటకు మేము యాడబోదుము?

ఇది జరిగిన నాలుగు నాళ్లకు నాకు ఒక అయిడీ వచ్చింది. ‘ఈ ముండ మొకం యెదవతో యిట్ట గాదు, యింగ ఈ అయిడీని అములు జేసి తీరాల్సిందే!’ అని ప్లాను యేసుకున్నాను. ఒక రోజు మా అమ్మ బలే దరిద్రపు కూర జేసింది. గబగబా అన్ని నీళ్ళల్లో బీర కాయలు కోసి వుడక బెట్టి, అన్ని శెనిగ్గింజలు కొట్టి తియ్యంగా చేసింది. ఆ కూరతో నేను ఒక్క కవణాన్ని తినలేక పొయ్‌నాను. మా అమ్మకు జరగదు గాబట్టి అర ముద్ద తినేసి చెయ్యి కడుక్కునేసింది. మా అక్క అంత వూరిగాయ వూటతో తినిన సాంగిం చేసింది. యింగ కాసేపిట్లో అనగా మా మగ మకారాజు మంచం మింద నుంచి తిండికి దిగబోతాడు.

ఆ రోజు మా వొదిన (మా పెద నాయిన కోడలు) వొంకాయ పుల్లగూర చేసింది. దాన్ని కూరగిన్నిడుతో కూరగిన్నిడు కూర యెయ్యించకొచ్చి పెట్టినాను. ఆ కూర బ్రమ్మాండంగా వుండాది.

మా నాయిన, “సినబ్బా! మనది ఏమికూర నాయినా!” అనడిగినాడు.

నేను తడుముకోకుండా, “వంకాయ పుల్లగూర గదా!” అనేసినాను.

మా నాయిన యదాపకారం, “బలే తేమగా వుండబోతింది!” అని యెక్కిరిస్తా వచ్చి పీట ముందర కూచ్చున్నాడు. మాయమ్మ గిన్నెలో ముద్ద సంగటేసింది. నేను వంకాయ పుల్లగూరను మా నాయిన గిన్నెలో యేసినాను. మా నాయిన ఒక సంగటి కడిని వంకాయ పుల్లగూరతో అద్దుకొని నోట్లో పెట్టుకొని, “థూ, నాశినం!” అనేసి “పక్కింటోళ్ళ కూరేమి!” అనన్నాడు. నేను, “బీరకాయ తియ్యగూర. యెయ్య మంటావా?” అనన్నాను.

“వుంటే యెయ్!” అనన్నాడు, మా నాయిన ఆత్రం ఆత్రంగా.

మా బీరకాయ తియ్యగూరను ఎత్తకపొయ్ గిన్నెలో యేస్తే నాకి నాకి నిమిసంలో ముద్ద తినేసి రెండో ముద్ద కోసరం మాయమ్మ కల్లా ఎగ జూసినాడు.

మాయమ్మ రెండో ముద్ద యేసింది.

మా నాయిన సగించినట్టు తింటా తింటా, “ఇదీ కూరంటే! నోటికి ఎంత రుసిగా వుండాది! నీ జల్మలో ఇటుమంటి కూర చేసుందువా?” అనన్నాడు.

మా అమ్మ, “నిజమేలే, యింగ లెయ్, నీ ముండ మొకాన ఎండ కాసింది గాని!” అనింది నవ్వు మొకంతో.

ఆ రోజు మాయమ్మ, మాయక్క, మాయన్న, నేను–నవ్విన నవ్వును యింగ ఏ జల్మలో నవ్వబోతాము?



# తెల్ల కోకల కత

మా కట్టకింద యెంగటాపరం అయిస్కూలుకు పొయ్యే దానికి మూడు దోవలుండాయి. బస్సులు తిరిగే రోడ్డుబాట బడే పోతే వస్తింది. అయితే అది చుట్టు. బస్సు దప్ప మనుసులు పోగలగతారా అంత దూరం, బ్రమ్మాండమైన రెండు అడ్డ దోవల్ను బెట్టుకొని! ఒక అడ్డ దోవ – రంగారెడ్డి మిట్టల మిందగా పోతే వస్తింది. ఇంగొక అడ్డ దోవ– చెలంగారి పల్లి మింద పోతే, మా వూర్నుంచి మూడు మైళ్ళ దూరం వుండే మా అయిస్కూలు వస్తింది.

నాకు రంగారెడ్డి మిట్టల మింద మా అయిస్కూలుకు పోవాలంటే బలే వుక్షిష్టంగా వుండేది. ఒకప్పుడయితే రంగారెడ్డి మిట్టల మింద పోవాలంటే చివల్‌రోడ్డు మీద పోయినట్టు జెమ్మాచారంగా వుండేది. అవితే, నాలుగు నాళ్ళు చెలంగారి పల్లి మింద పొయ్యే సరికి నాకు రంగారెడ్డి మిట్టల మింద రోతబుట్టి పోయింది.

చెలంగారి పల్లి దోవమింద నాకు వున్నట్టుండి అంత మునాశ ఎందుకు పుట్టినట్టు? ఒకప్పుడు ఆ దోవ అంటే కాలెత్తే వాడ్ని, ఇప్పుడు ఆ దోవ అంటే ఎందుకు పడి చస్తా వుండాను? ఆ దోవలో మా అమ్మా నాయినా ఏమన్నా లిబ్బి పూడిసిపెట్టి వుండారా? అందుకని నేనా దోవ మింద పోవాలని అల్లాటం పడతా వుండానా?

అంతా చెప్పినాక, “ఒరే, ముండమోపి నాయాలా!” అని తిడితే తిట్టినారు గాని,

దరమాత్ములాలా, పాలూకూడూ తినే పున్నాత్ములాలా–

ఎనిమిది లోనో, ఏడు లోనో నేనొక దపా చెలంగారి పల్లి గుండా మా అయిస్కూలు పోతా వుండాను. అంతకు ముందర అదే దోవన ఎన్నో సార్లు పోయుండాను గాని ఒక రోజున–

చెలంగారి పల్లి మొగదలలోకి వచ్చిన నాకు ఒక ముండమోపామె ఎదురు పడింది. ఆమెను తొలగేసుకొని నాలుగడుగులు యేసినానో లేదో మళ్లా ఒక తెల్ల కోకలామె బొక్కినా, చేంతాడూ ఎత్తుకోని చేంద బావికల్లా పోతా వుండింది. ఆమెను దాటుకోని ఒక ఇంట్లేకల్లా చూద్దును గదా– ఇంగొక తెల్లగోకలామె చేటలో ఏందో చెరగతా వుండాది. నేను వస్తా వుండే ఈది ఎన్ని బారలో తెలుసా? మహా అవితే పదిబారలు. ఇప్పటికి మూడయింది గదా, ఆ ఈదిని దాటి ఎడం పక్కకు తిరగతా వుంటే కుక్క మిందికి రాయి విసిరేసి తిట్టతా మళ్ళా ఒక తెల్లగోకలామె.

అయ్యా సామీ, నేనిదంతా చెప్పలేను, ఇరై ఇండ్లుండే ఆ వూరిని, ఆ వూరి కయ్యాగాలవల్ను దాటే కాడికి నాకు పన్నెండు మంది తగిల్నారు తెల్లగోక లోళ్లు. ఆ రోజు మా ఇస్కూలికి పోతా పోతా నేను 'ఓ' అని మదన పడితిని. 'ఇదేందిరా, బగమంతుడా, ముండమోపుల్ని యేళ్ళ మీద యెంచుకునే బుద్ధి మనకే ఎందుకు పట్టుకొనింది రా పరమాత్మా!' అని.

చెప్పద్దా–ఆ రోజు ఇస్కూల్లో నాకంతా జయమే. ఒక్క పొరపాటు జరిగుంటే! ఆ తెల్లగోకలోళ్ల దరమ్మమో ఏమోగాని, ఆ రోజనంగానే యెడ్డమాస్టరు లీవు బెట్టుండె, ఇంగిలీసు కలాసు ఎగిరి పోయె. హిందీ అయ్యోరి దగ్గిర దెబ్బ తప్పించుకుంటి.

ఆ పొద్దుట్నుంచి నాకు అదొక వాడికై పోయింది. నేను వుండంగా వుండంగా రంగారెడ్డి మిట్టల దోవనే మర్చిపోతిని. చెలంగారి పల్లి మిందబడి పోవడం నాలో నేను తెల్లగోకలోళ్ల కోసరం యెతకడం లెక్కలేసుకోవడం, ఏ పొద్దు కూడా నాకు పది మంది కన్నా తక్కువ కనపళ్ళా. ఒక రోజవితే పద్మూడు, పద్నాలుగు మంది గూడా.

పోనీ, వోళ్లందరూ ముసిలోళ్లా, అంటే కాదే. నాకు దినామూ కనిపించే తెల్ల కోకలోళ్లల్లో అయిదారు మందన్నా నున్నంగా ఈగి వాల్తే జారిపొయ్యేటట్టు

నమనమలాడతా వుండారే. మొకాన అరి చెయ్యంత కుంకుం బొట్టు పెట్టుకొని వుండే నిండు ముత్తయిదులు ఏమి జెయ్యాల వాళ్ళ దగ్గిర! 'ఈళ్ల మొగుళ్లందరూ కలిసి మాట్లాడుకోని కైలాసానికి దొబ్బేసి ఈళ్లను వొంటిగోళ్ళను చేసుందురా ఏమి!' అనుకునే వాడ్ని. 'దోవలోనే యింత మంది కనిపిస్తా వుండారే, ఇంగ ఇండ్లల్లో ఎంతమంది వుండారో! 20 ఇండ్లుండే వూళ్లో ఇరైమంది తెల్లగోకలోళ్ళా!' అనుకొని మా వూళ్ళో లెక్కేసే వాడ్ని. మా వూరంటే పెద్దది. అరై దెబ్భై ఇండ్లుండే వూరు మాది. దాంట్లోనే పదిమంది తేలలేదే!

చెలంగారి పల్లిలో నాకు ఎదురు పడే వోళ్లతో మాట్లాడాలని నాకు బలే కుశాలగా వుండేది. ఒకరోజు చద్దెత్తుకొని పోతా వుండే ఒకామెను బట్టుకొని, 'మో టయిమెంత అయివుండును మో' అని అడిగేసి నా జిల తీర్చుకుంటిని. ఆమె నాకల్లా నవ్వు మొకంతో చూసి, "చదువుకు బోయే నా బట్ట, నన్ను టైమడిగితే ఎట్టరా సామీ, నేను టయాల మిందనా బతకతా వుండేది!" అని ఆమె తిడితే బలే కులుకై పోయింది నాకు.

నేను పదో తర్తిలోనో ఏమో రాజారామ మోహనరాయ్ మాదిరి మనుసుల గురించి జబాబుల్ను కంటస్తం పెడతా వుంటే నాకు చెలంగారి పల్లి తెల్లగోకలోళ్లే కండ్లల్లో మెదిలేటోళ్ళు. 'పసిబిడ్డను ఎత్తక పొయ్ ముసిలోళ్లకు పెండ్లి చేసేస్తే కత యింత గాక?' అనిపించేది.

(నేనన్నా తెలివిగా వుండాల్నా వొద్దా? అదే వూళ్ళోకి బోయి నాకన్నా ఏడెమినిదేండ్లు సిన్నదిగా వుండేదాన్ని చూసి బొట్టు కట్టుదునా? మా ప్రభావతిది చెలంగారి పల్లే గదా. నాకు బలే బిత్తర – యిదంతా గాని తలుచుకుంటే!)



# బూడీసుల సుబ్రమణి

మా వూరి నుంచి యెంగటాపరం అయిస్కూలుకు వుండే రోడ్డుబాట వొట్టి ముండమోపిది. ఇంటి కాడ కూర్చోని మా యమ్మ చెప్పే దానికి ఏముండాదిలే – దినామూ మూడు మైళ్ళు నడిసి పొయ్, మూడు మైళ్ళు నడిసొస్తే గదా తెలిసేది. (అంతా వొట్టిదే కాళ్ళకు చెప్పులు గావాలని ప్లాను)

స్లిప్పర్లు యేసుకోని తపతపా అని కొట్టుకుంటూ నడిసిపోతా వుంటే మనకు ఎంత మతింపు! ఈ నాలుగూళ్ళల్లో వుండే ఆడోళ్ళు మనకల్లానే చూస్తారు గదా!

"అమామే, ఇదే చెప్పాటం, రోసగల్లోడు మాటి మాటికీ చెప్పడు. అరి కాళ్ళు చూడు పగిలి పొయ్‌నాయి చెప్పుల్లేక. ఈ వొగిసులోనే ఆనిగాళ్లు వొచ్చెయ్యబోతాయి. మంచి మాటల్తో చెప్పులు తీసియ్యి. లేదన్నావా యిస్కూలికి నిల్చిపోతా. ఆ పని చెయ్యంది నీకు బుద్ధి రాదులే" అని పుల్లించి నేలేసేసినట్టు తేల్చి చెప్పేసినా. దీనికి మా యమ్మ, "వొరే నాయినా నువ్వు ఇస్కూలికి పోకుంటే – ఈ పొయ్యి మండదురే. ఆ పొద్దు మొలవదురే. లోకం కోసరమన్నా నువ్వు ఇస్కూలికి పోతావస్తా వుండురా యెర్రి యెమ్మన్నా!" అని మా ఎలిగారం మొకంది నాతో యాసండం పడింది.

నాకు రగిలి పొయ్, "నీతో యాసండం పడేదానికి లేనువాయ్ నేను. మాటంటే మాటే నాది. సందేళ పూట కడపట్లోకి వచ్చి నిలబడు. నీ యింటి ముందర్నే గదా గంగిరెడ్డిపల్లి ఇస్కూలు పిలకాయిలు పొయ్యేదీ వచ్చేదీ. వాళ్ళ

కాళ్ళకల్లా జూడు –బ్రమ్మడికి లేవా చెప్పులు? మల్లారం సుబ్రమణ్ణెం రెడ్డికి లేవా చెప్పులు? ఎవురికి లేవో చెప్పు, చెప్పులు? (ఆ యిద్దరికి దప్ప యింగెవ్వురికీ లేవు ఆ వూళ్ళో) వాళ్ళతో గూడా ఒట్టి కాళ్ళతో పోవాలంటే తల పడిపోతా వుండాది. అగుమానం గాని–" అని దుక్కంతో మాయమ్మ జుట్టును పట్టుకోని, "ఈ మాదిర్తో నా దగ్గిర చెప్పు దెబ్బలు తినేకన్నా నాకు మెట్లు తీసియ్యేమే శీనాగతి బట్టిన నాయాలీ ముండా!" అని మానం దప్పిన మాటల్ని అడిగేసి ఈదిలోకి వచ్చేసినాను. నేను మళ్ళా బుద్ధి మార్చుకొని, "అమామే, అమామే!" అంటా యింట్లోకి పొయ్‌నాను. దీనికి మాయమ్మ, "అడగాల్సినవన్నీ అడిగేసినావనుకో, ఇంగా ఏమన్నా మిగిలుండాయా, కొడకా! ముప్ఫైయ్యేండ్లకు పైగా మీ అయ్యకు కాపరం చేస్తా వుండా. ఏ పొద్దన్నా ధర్మాత్ముడు నా జుట్టు పట్టుకుని వుండునా! కట్టుకున్నోడికి లేని అతికారం కన్నోడికి వచ్చింది గదా! అంతా బగమంతుడి ఏరుపాటు. కాదనే దానికి నేనెవుర్ని?" అని నైసు మాటలు మాట్లాడింది. నాకు అయ్యోమనిపించి నేను గూడా నైసు మాటల్లోకి దిగిపొయ్, "అమా! గంగిరెడ్డిపల్లిలో నాగూర్రెడ్డి కొడుకు వుండాడే బ్రమ్మానందరెడ్డి– వాడు నన్ను 'ఒరే గుడ్డి నా కొడకా!' అని అన్నాడు. వాడికి ఒక చెవ్వు మూసక పొయ్యుండాది. మెల్లకన్ను వుండబట్టే నన్ను 'గుడ్డి నా కొడుకు' అంటే నేను గమ్మనుంటానా? నేను ఆ మాటకు 'ఏమిరా చెవ్వు నా కొడకా! చెప్పు దెబ్బలు తినకుండా వుండు' అని అన్నా. ఐకోరట్లో ఐనా ఇది నాయమే గదా! మాటకు మాట తప్పా? అవితే వాడు, 'చెప్పులే లేవు గదరా నీకు. చెప్పుతో ఎట్ట కొడతావురా చెప్పులకు గెతిలేన్నా కొడకా!' అని అందురూ నవ్వేటట్టుగా తిట్టినాడు. అదీ నా శౌర్రిం. నాకు చెప్పులే వుండుంటే వాడా మాట అనుండడు గదమా!" అని పాయింటు జెప్పినాను.

దీనికంతటికీ మా యమ్మ, "నువ్వు కాలోజీ మెట్టెక్కురా, నీకు ప్యాంటు, కాళ్ళకు మెట్లు తీసీకుంటే అప్పుడడగరా" అని శపత్తం చేసింది. నేను తలకాయి పట్టుకుని యింగేం మాట్లాడకుండా గమ్మనుండి పోతిని.

ఒక సారి మంచి ఎండా కాలంలో మా యింట్లో ఎదకొచ్చినవి ఆరేడు దాకా కోళ్ళు వుండినాయి. ఇంగ రేపో ఎల్లుండో రోగాలు రాబోతాయి. అప్పటికే మా వూళ్ళో ఎగ వీధిలోకి రోగాలు వచ్చి ఒక్కొక్క కోడే సొర్గానికి చేరుకుంటా వుండాది. మా నాయిన ఎదకొచ్చిన కోడిపిల్ల కల్లా చెయ్యి జూపిచ్చి, "రోగాలొచ్చి

చస్తే మళ్ళ బాగుంటిందా నీకు? ఒక దాన్నన్నా కొయ్యేమి? రుసిగా పసిగా తిందాము" అనన్నాడు మాయమ్మతో. దీనికి మా యమ్మ సూరీకాంతం మాదిర్తో చేతులూగిచ్చి, "దినామూ ఒక దాన్ని కోసి పెడతానుండు, తిందువుగాని, ఈ యింటికి కొత్తల్లుడా!" అని యాక్సను చేసింది. అదే రోజు నాతో, "సినబ్బా, మీ నాయిన కండ్లు వీటి మింద పడినాయి గాని, మనం తిరప్తికి పొయ్ వీటిని అమ్మేద్దాం పద" అనింది. నేను డబుల్రైటుగా తిరప్తికి ఎలబారినాను. కార్వేటి నగరం బస్సోడు మా అమ్మా గొడుకుని జూసి బస్సు నాపి, "ఎక్కండి" అన్నాడు. "దొంగ నా బట్టలు! కోళ్ళకు గూడ టిక్కట ఇయ్యమంటారు!" అని బస్సోడ్ని తిట్టి మా యమ్మ తిరప్తికి నడవను మొదలుబెట్టింది. ఆరు మైళ్ళూ నడిసేసినాం ఆ మాటా ఈ మాటా మాట్లాడుకుంటూనే. డీలక్సు హోటలు ముందర కూర్చున్నాం. లడ్లు మాదిర్తో అమ్ముడై పొయ్‌నాయ్ మా కోళ్ళు. అరీశబట్టే ఒక్కో కోడి పన్నెండు రూపాయలు పలికింది. డెబ్బయ్ ఎనపై రూపాయలు మా యమ్మ వక్కాకు చిత్తిలో చేరుకున్నాయి. మా యమ్మ – నన్ను ఒక వోటలుకు పిలసక పొయ్ రూపాయికి నాష్టా పెట్టించేసింది. కాలు రూపాయికి వడలు తిని నీళ్ళు తాగేసి, "కడుపుబ్బక పొయ్యింది. యింగ నా కొద్దురా తంత్రీ!" అని యాక్సను జేసేసింది మాయమ్మ.

క్రిష్ణాపురం తానా దగ్గిర ఒక ముసిలాయన– బూడీసుల్ను, చెప్పుల్ను పెట్టుకోని కుట్టుకుంటా వుండేవాడు. అడుగు ముందుకే పళ్ళా నాకు.

"అమా, చెప్పులమా!" అని పట్టుకున్న కొంగును వొదల్లా.

మాయమ్మా నేనూ చెప్పుల తాత దగ్గిర గొంతు కూర్చున్నాం.

నేను "యో, తాతా! ఆ బూడీసులు ఎంతయా?" అనడిగినాను బూట్లు చేత బట్టుకోని.

"ఎనిమిది రూపాయలు" చెప్పినాడు తాత.

"ఎవురెవురో యేసుకోని తొక్కేసిన బూడీసులు గదా అవి. వాటికి ఎనిమిది రూపాయిలా?" అని పైకి లేచేసింది మాయమ్మ.

"మ్మో, కూచ్చోమ్మా! పెద్ద పెద్ద గౌనీర్ల బిడ్డలేసుకున్న బూడీసులమా యివి!" అని మాయమ్మను బలవంతాన కూచ్చునబెట్టినాడు.

"అమా, బ్రమ్మానంద రెడ్డివి స్లిప్పర్లే గదా. అవే ఎనిమిది రూపాయలా 95 నయాపైసలు. ఇవి బూడీసులు! ఎనిమిది రూపాయిలకు కండ్లకద్దుకోని తీసుకోవచ్చు" అని నేను గూడా మా యమ్మను ఎగేసినాను.

బేరం కాడ పడినాము. లేచినాము.

నాలుగు రూపాయలకు కుదిరింది.

మరుసట్రోజు–

బూడీసుల్ను యేసుకుని ఇస్కూలికి పోతే–

కట్టుకునే దానికి దారాలు కూడా లేని ఆ పాత బూడీసుల్ను జూసి పిలకాయిలందరూ ఎగతాళి చేసేదానికి మళ్ళుకున్నారు.

నేను నేరుగా బ్రమ్మడి దగ్గిరికి పొయ్‌నాను. "ఏమిరా, గుడ్డి నాయాలా!" అన్నాడు వాడు.

నేను నా బూడీసుల కల్లా, వాడి మొకం కల్లా మార్చి మార్చి చూస్తా, "మాటలు మరేదగా రానీరా చెవ్వు నా కొడకా! యెచ్చూ తక్కవ లేకుండా మాట్లాడినావంటే బూడీసుల్తోనే కొడతా!" అని బెదిరించినాను.



# మద్యానాలకు మకరాజవదామని...

కాసు బ్రమ్మానంద రెడ్డి నాకొక పక్క మేలుజేస్తే, మా అమ్మ, "అన్న చదివింది చాల్లే, నువ్వు ఇస్కూలికి నిల్చిపోరా సినబ్బా! మీ నాయిన ఇంక సేద్యం చెయ్యలేడు. అన్నాదమ్ముడూ ఇద్దరూ చదువుకు బోతే, సేద్యం ఎవుడు జేస్తాడు?" అని నా చదువుకు అడ్డం పడింది తమాసకు.

నేను ఆరో తరగతిని చచ్చి తవుసు జేసినా, పాసయి వుండేవాడ్ని గాను. ఆరో తరగతిలో చేరినాక ఏ,బీ,సీ,డీలు నేర్చుకున్నాననుకో, సంవత్సరం పరీచ్చలను ఏ రీతిగా రాసుందును, ఏ రీతిగా పాసయ్యుందును? కాసు బ్రమ్మానంద రెడ్డి మా ఇస్కూలు పిలకాయిల పాలిట దేముడు మాదిరిగా దిగొచ్చి, ఆరో తరగతికి, ఎనిమిదికి, తొమ్మిదికి ఫయిలు అనేది లేకుండా చేసేసినాడు. అటెండెన్సు వుంటే చాలు, పరీచ్చలు రాసినా, సరిగ్గా రాయక పొయ్‌నా – పిలకాయిలందరూ మొగలాయిలుగా పాసయి పోవాల్సిందేనని బ్రమ్మానంద రెడ్డి ఒక రూలు పాసు జేసినాడు. ఆ 'బి.పాసు' దర్మాన నేను ఆరో తరగతిని గట్టెక్కేసినాను. నేననే ఏంది? నేతగిరి పల్లి నుంచి వచ్చే మునెమ్మ ఆరో తరగతిలోనే పెద్దమనిసై పోయిందంట. ఆ పిల్ల గూడా బ్రమ్మానంద రెడ్డి దర్మాన పాసయి పూడ్సింది.

నేను ఆరు పాసవ్వంగానే ఏడును బిరబిరా చదివేసి, ఏ జిల్లాకో ఒక జిల్లాకు కలట్రుగా పూడద్దామనుకున్నాను నిజ్జంగా. మాయమ్మ మూతి మూరడు పొడుగు బెట్టుకొని ఆ మాట అనే కొందికి నేను నిరామయం అయిపొయ్‌నాను.

ఆ రోజు పొద్దు నాలుగు బారలెక్కేసింది.  మా ఈ ఎల్ డబ్యూ గోడ గెడారంలో గెంట తొమ్మిదై పోయింది. మా అమ్మ కేరీర్లో అంత చద్ది కూడేసి నన్ను ఇస్కూలుకు 'పో' అని అనిన పాపాన పోలా. తొమ్మిదీ ముక్కాలుకంతా మేము యెంగటాపరం అయిస్కూలుకు పోవాల. మా అమ్మ నన్ను పో అనాల్నే గాని, రామ బాణం మాదిరిగా ఆ మూడు మైళ్ళూ దగద్దమానంగా పరిగెత్తదా మనుకున్నా. మా అమ్మ నన్ను యెనకాన రమ్మని, "మడి కాడికి పోదాము రా, పనుండాది" అని ముందుకు నడిచింది.  నేను పళ్ళు పటపటా కొరికి, "పద ముండా, నా జుట్టు నీ చేతల్లో పెట్టుకుంటివి గదే ఈనప నాయాలీ ముండా" అని లోపల్లోపలే బలే తిట్టుకునేసినాను.  మేము అడుసు మడిలో చేరి కట్టెలు ఏరుకుంటా వుంటే మా అమ్మ, "చూడు ఈ లంజ మనల్ను ఇస్కూలుకి నిలిపేసింది – అని కడుపు మంట పొద్దురా సినబ్బా, నేను నిన్ను చదవెయ్యలేను – ముప్పైమూడు అరవైయ్యారు యెగేసి! రేపు ఇస్కూల్లో బిల్డింగు ఫీజంట, పెసల్ ఫీజంట–అంతా ఇరైనాలుగు రూపాయలు కట్టద్దా? యాడ నుంచి తెద్దును కొడకా!" అని నా మొకం కల్లా జూడకుండా మా అమ్మ యాష్ట పోయింది. నేను అదే నిమిసంలో ఒక అయిడీకి వచ్చేస్తిని.  'ఆమె చదవేస్తేనే మనం చదివేదేంది? మనమే మన కాళ్ళ మింద నిలబడి చదువుకుందారి. అబ్రాము లింకన్ను ఎవురు చదవేస్తే చదివినాడు!' అనుకున్నాను. ఆ రాత్రి మాయమ్మ మజ్జిగా కూడూ పోస్తే నేను కోడి గెలిమినట్టు గెలిమినానే గాని ఆరా తీరా తినలేదు. మా అన్న, "ఏమిరా, ఈరోజు ఇస్కూలుకి పోలేదేమి? అప్పుడే ఇంజినీరు కోరసు చదివేసినోడి మాదిర ఇస్కూలుకి నాము పెట్టేసినావే. మెట్టు దెబ్బలు తినకుండా రేపు ఇస్కూలుకి ఎలబారు" అని నన్ను బట్టుకొని కసిరినాడు.  మా నాయిన గూడా, "ఏమి నాయినా! మమ్మల్నంటే మా అమ్మా అయ్యా చదవెయ్యలేదనుకో. నీకు అమ్మా అయ్య వుండారు గదా. మట్టి పిసుక్కునే రాత నీకేమిటికి?" అన్నాడు. మా అమ్మ గూడా, "ఈ రోజు మడి కయ్యలో పనుండిందని నేనే నిలిచి పొమ్మన్నా. సినబ్బను ఇస్కూలికి నిల్చి పొమ్మంటే నాకు మారు జలమ్మ వుందునా ఏమి?" అని బక్కమ్మ అనే ఆమెతో చెప్పుకొనింది గాని, నేనెటువంటోడ్ని, రోసం ముందర బుట్టి, మళ్ళ నేను బుట్టింది!  ఆ రాత్రి నేను కంటి మింద రెప్పెయ్యలా. 'మన చేతిలో ఒక లచ్చి రూపాయలనేటివి ఉంటే, మనం ఒకరు చెప్పినట్టు యినుకోవాల్సిన పన్లేదు గదా!  పొమ్మన్నప్పుడు

పొయ్, వొద్దన్నప్పుడు నిల్చి పొయ్యేదానికి నేనేమన్నా గంగెద్దునా? సీమూ నెత్తురు వుండే నర మానుడ్ని గదా! లచ్చి సంపాయించబొయ్యే మార్గమెట్ట?' అని నేను మా అమ్మ కోకను కప్పుకొని ఆలోసిన జేస్తా వుండిపొయ్నాను. నేరుగా లేచి తిరపతికి పూడద్దామనుకున్నాను. తిరపతికి బోతే తిరపతిలో వోపినన్ని ఏనుగులుంటాయి. ఏనుగు పేడ యేసీ యెయ్యంగానే ఆ పేడను కాళ్ళతో కసాబిసా తొక్కేసినామంటే మనకు మంచి జరిగితింది. లచ్చి రూపాయల లిబ్బి మనకు యాడనో ఒకసోట దొరికిపోతింది. ఆ దుడ్డును బేంకీలో కట్టుకొని, దాని మీద వచ్చే వొడ్డీతో మన చదువును మనం చదువుకోవచ్చు. అప్పుడు, మనమంటే మన అమ్మకు గూడా గవరంగా వుండును. తిరపతి మా వూరికి ఆరుమైళ్ళే . 'పోదామా' అని లేస్తే – వోయమ్మో బయం! ఒంటికి పోసుకోవాలంటేనే మా అమ్మను వూగించి వూగించి నిద్ర లేపతానే! అంత దూరం ఎట్ట పోదును? ఉమ్మడ్ని నిద్ర లేపి, వాడ్ని గూడా తిరపతికి తోడుకొని పోదునా? వాడా! వాడు, మద్యానాలకే మకరాజు అయిపోదామనే వాడు. వాడ్ని గాని తోడుకొని పోతే ఏనుగు పేడను నన్ను తొక్కనీడు. అందుకని నేను ఉమామహేస్పరిడికి ఈ అయిడీ చెప్పాలనుకోలా. రేపు మద్యానాలకల్లా మన చేతికి రూక రాకుంటే లాబంలా! ఎట్ట, ఎట్ట? మనసుండాల్నే గాని మార్గాలకు కొదవా?

బగమంతుడు లేడని అనుకోవాల్సిన పనిలా. నాకొక బుద్ది పుట్టింది. ఆ మరసనాడు ఆదోరం. ఇస్కూలికి లివ్వు. నేను పొడుగ్గా వుండే ఒక అవిశ కట్టిని చేత బట్టుకొని పులులు పొడిచే వాడి మాదిరితో చెట్టూజేమ మింద పడినాను. ఒక కానగ మాకు కల్లా పొడుగ్గా చూస్తా వుంటే పచ్చారు బాము కంటికి కనిపించగా 'ఓయమ్మల్లో' అని కడగా వచ్చేసినాను. ఇంకొక అరగెంట తారుకులాడితే అసింకంగా ఒక వూసరబిల్లి కనిపిచ్చింది. అది నాకు అనావశిం. రెండు ఊడగ పొండ్లను చప్పరిద్దాం గదాని ఊడగ మాకు కల్లా పొతే, అక్కడ గదా – తొండ కనిపిచ్చింది! తొండకు ఉడత మాదిరిగా చురుకుండదు. దాని చావు నా చేతల్లో రాసి పెట్టి వుండడం వల్ల, ఆ తొండ నాకల్లా పొడుగ్గా చూసింది. నేను దయా దాచ్చిన్యాలకు పోకుండా అవిశి కట్టితో దాని నడుం మింద వాయించినాను. తొండ యెల్లాలకల పడింది. నిమిషంలో చంపేసి, నిక్కరిప్పి ఉబ్బబెట్టుకున్న ఒంటేలన్నీ తొండ మింద పోసినాను.

అమ్మ, ఇంక నాకు కోరుకున్నంత డబ్బు దొరికి పోతింది. వూళ్లోకంతా మకరాజునై పోతాను. ఒక చిన్న జీపు కొనుక్కోని, అంతో యింతో సంబళం పారేసి ఒక డ్రైవోర్ని పెట్టుకొని, యెంగటాపరం అయిస్కూలు ముందర ఆపతాను. మా యెడ్‌మేస్త్రీ–స్కూలు ఇనస్పెట్రు అని వుచ్చబోసుకుంటా, జీపు దగ్గరికి వస్తాడు– జీపులో నేనుంటా!

నేను ఆ పని చేసేసి నేరుగా ఒక గుంట దగ్గిరికి పొయ్‌నాను. ఆ గుంట కట్ట మింద నేను నడస్తా వుంటే, నా కాలికి ఏదో తగులుకుంటింది. నేను బోల పడబొయ్ నేల జూస్తాను. తళుకు తళుక్కుమంటా నా కంటికి ఒకటి కనిపిస్తింది. నేను బూమిని జానడు లోతు లోడేసరికి నాకొక బంగారు కడిం కనిపిస్తింది. ఆ బంగారు కడిం కార్వేటి నగరం రాజులు, రాణులు మా గుంటలో జలకాలకని వచ్చి పారేసుకొనుంటారు. అది నాకు జిక్కితింది.

నేను మద్యానం సంగటికి కూడా పోకుండా చెరువు దగ్గిర్నే యెతుకులాడతా వుండిపొయ్‌నాను. ఎవ్వరికీ డవుటు రాకుండా బిక్కిరి చూపులు చూస్తా వుండినాను. కడుపులో ఆకలి జమాయిస్తా వుండాది. ఎంతకీ లిబ్బి దొరక లేదు. నాకు దుక్కం పెరక్కొచ్చింది. దేముడి మింద అపనమ్మకం కలగతా వుండంగా – నేను ఒక కాలవకల్లా చూస్తే నా కంటికి పళపళమంటా వుండిన పది రూపాయల నోటు!

నమ్మినోడెప్పుడూ సెడిపోడే!



# చిన్ని కృష్ణా నిన్ను చేరి కొలుతు

పోతే పొయ్యింది ముప్పై అయిదు నయా పైసలు. నేను ఒక కవరు దీసుకొని మా జిల్లా కలెక్ట్రుకు ఒక అర్జీ బెట్టుకుందామనుకున్నాను.

"మా కట్టకింద యెంగటాపరం అయిస్కూలు ప్లే గ్రవుండు ఒట్టి దండగ మొకంది. అది మా పిలకాయిల చావును కండ్ల జూస్తా వుండాది. మాలా మాదిగోళ్ళను పిలిపిచ్చి, పల్లేరు గాయలు మొలిసి పొయ్న మా గ్రవుండును – పట్టా భూములుగా రాసిచ్చేస్తే వాళ్ళన్నా మీ పేరు జెప్పుకోని బతికి పోగలరు!"– ఈ అర్జీ మింద మా పిలకాయలు నూరూ నూట యాపై మందన్నా సిగ్నేచర్లు చేసే వోళ్లుండారు.

నాకు మా పల్లేరుగాయిల గ్రవుండంటే అంత కడుపుబ్బరం.

ఆటలనేటివి మా వూళ్ళో ఒక రకంగా వుంటే ఆ కూలిపోయిన ప్లే గ్రవుండులో ఇంగొక రకంగా వుండేవి.

మా డ్రిల్లయ్యోరు–కబాడీ గూడా ఆడుకోండ్రా – అనంటాడు గానీ, అవితే మొగోళ్ళు మొగోళ్ళే ఆడుకోవాలంట. ఇది మా డ్రిల్లయ్యోరొక్కడే నేర్చిన కొత్త రూలుగా వుండాదబ్బా. "డింగిరి డింగిరి మామా, నా డ్రిల్లయ్యోరు మామా! మొగోళ్ళతో గూడా కబడిక్ ఆడేది మా వొంగిసంలోనే లేదు. నువ్వు కావాల్సుంటే దిక్కులేని కోరట్లో దావా యేస్కోబో!" అనేసి నేను కబాడి కోర్టును బాయికట్టు జేసుండాను. (నిజ్జింగా చెప్పాలంటే నన్నే రెండు కబాడీ టీములోళ్ళూ బాయికట్టు

జేసుండారు. రెండు పక్కలా వుండే కెప్టెను నాకొడుకులిద్దరూ 'ఈడు మాకేమిటికి?' అని నన్ను తొంబై ఆమడలు తోసేసి వుండారు!) అయినా, మొగోళ్ళతో కబడిక్ ఆడాలని మనకు, మనసులో గూడా లేదనుకో.

కొంతమంది కబడిక్ ఆడతా వుంటే చానామంది పుడుబాలు ఆడతా వుండారు. ఆ పుడుబాలంటే నాకు గొంతు కాడికి వుండేది కసి. దాని మొకం చూస్తేనే ఎగిసి ఎడం కాల్తో తందామనిపిస్తింది. పాపం, ఆ పుడుబాలుది నాకన్నా ఈనం బతుకు. ఎవుడు తన్నినా తన్నిచ్చుకోవాల గదా.

నేను ఐజంపూ లాంగుజంపూ ఆడేవోళ్ళ దగ్గిరికి గూడా పోకుండా – ఆడ పిలకాయిలు ఆడుకునే రింగు ఆట దగ్గిరికి చేరుకున్నాను. రోశమ్మ ఈ పక్క వేసిన రింగును కళావతి ఆ పక్కన పట్టేసింది. కళావతి ఆ పక్క యేసిన రింగును ఈ పక్క నాగబూసన పట్టలేక పోతే గబక్కన కోరట్లోకి దూకి పట్టేసి నాగబూసన కల్లా పొడుగ్గా చూసినా.

"ఓయమ్మల్లో ఓ యక్కల్లో!" – నా పాపం జేసిన జుట్టు డ్రిల్లయ్యోరి చేతిలో వుండాది! "ఆడారి నాయాలా! ఎన్నిసార్లు చెప్పాల్రా, డ్రిల్లు పీరిడ్డులో ఆడోళ్ళ దగ్గిరికి రావద్దని! అదేమన్నా నర్తనశాలా? నువ్వు ఆడారి రూపమెత్తి ఆడోళ్ళకు విద్యలు నేరిపిచ్చే దానికి? పద పుడుబాల్ ఆట కాడికి" అని నన్ను పుడ్‌బాల్‌ను తన్నినట్టు తన్నడం మొదలు బెట్టినాడు మా డ్రిల్లయ్యోరు. అప్పుడు అష్ట వంకర్లూ తిరిగిన నా మూతిని నాగబూసనం జూసి, "సాసా, సుబ్రమణి మాకు రెఫరీగా వుంటాడు లేసా. వాణ్ణి కొట్టబోకు సా" అని అనింది ఆ అమ్మగన్న బిడ్డ.

మా దూర్వాసుల మొకమోడికి కనికరమనేది కలికానికన్నా వుంటే గదా. నా జుట్టు వొదలకుండా, "ఆడ పిలకాయిల్తో ఆడి ఆడి ఆడ పిలకాయిల సపోరట గూడ సంపాదిచ్చినావంటరా ఆడంగుల నాయాలా! మొగోడి ఆటలు ఆడి మొగ బతుకు బతకరా!" అని కొడతా పుడుబాలు ముందర తోసినాడు.

(నాగబూసన నాకల్లా జూస్తా మళ్లా రింగును పట్టుకోలేక పొయ్యింది కన్నారు.)

డ్రిల్లయ్యోరి నా కొడుకును తిట్టుకుంటా పుడుబాలును దుఃక్కంతో చూస్తా వుండి పోతిని. మా డ్రిల్లయ్యోరు నా మింద కత్తి గట్టి, "గ్రవుండును పదారు చుట్లు చుట్టరా!" అని నాకు శిచ్చ యేసినాడు.

నా పని సఫా!

పల్లేరుగాయల గ్రవుండు మింద రవుండ్లు మొదలు బెట్టినాను.

ఒక మూల ఆడోళ్ళ రింగు కోర్టు వుండడంతో రవుండు రవుండుకూ ఆడోళ్ళ రింగాట జూసే బాగ్గెం దొరికింది. మంచి చాన్సు గదరా! అనుకొని గ్రవుండంతా పరిగెత్తడం రింగు కోర్టు దగ్గిర పెండ్లి నడక నడవడం చేసినాను.

'ఒరే డ్రిల్లయ్యోరా! నువ్వు మొగోడైతే నాతో గూడ గోలీ గుండ్ల ఆటలో దిగు. నీ మోచేతి చిప్పలు పగిలేటట్టు దోకించక పోతే అప్పుడడుగు. కోతీ కొమ్మచ్చి అంటావా – సైరా చిన్నప రెడ్డీ సై! యెన్నెల్లో మీ వూరికే వచ్చి ఆడ పిలకాయిల్తో గెన్నేరు కుప్పలు పెట్టమంటావా. కమాన్ కం విత్ మి. దటీజ్ మై విల్ అండ్ ప్రెజరు రా. వూ ఆర్ యు ఆస్క్ మి టు ప్లే విత్ పుడుబాలురా, బోసడీకీ' అని పైకే తిట్టుకుంటా రవుండ్లు మొదలు బెట్టినాను.

పదారో రవుండు నాకు తెలవకనే అయిపొయ్యింది. ఆడ పిలకాయిలు రింగును కడగా పారేసి బ్యాటు ఎత్తుకున్నారు. బ్యాటు బాలు పాపం కోర్టు దాటి నాకల్లా పడింది. దాన్ని యిసిరి కోర్టులో యెయ్యకుండా ఎత్తకపోయ్ నాగబూసన చేతికి పూలచెండు మాదిర్తో ఇచ్చినాను, 'నాగబూసనా! ఈడనే వుంటాను. చెండు కోర్టు బయట పడితే ఎత్తిస్తా వుంటాన్లే!" అని చెప్పినాను.

మళ్ళా కోర్టు దాటి పడింది చెండు, ఎత్తిస్తా వుంటే–

"ఓ యమ్మల్లో ఓ యక్కల్లో!"


నేను హోల్మొత్తంగా మా డ్రిల్లయ్యోరి చేతల్లో–

యేసినాడు ఒక దెబ్బ!

నేను పరిగెత్తినాను పుడుబాలు దగ్గిరికి.

ఈడ్చి తన్నినాను పుడుబాలును.

"గోల్ గోల్…గుడ్డోడు గోల్ గొట్టేసినాడు రే–" గ్రవుండంతా మన పేరు మోగి పొయ్యింది బాంచత్.



# మా సిడిజిర్లాండోడి వైబోగం

ఈ దెబ్బతో దక్షిణ తట్టు (అంటే మా) నారప్పోళ్ళ దశి తిరిగి పోతిందనుకున్నారు మా వూరోళ్లందురూ.

"పోనీ పాపం, ఇన్నాళ్ళు పీనిగి కష్టిం చేసినారు. ఇంగన్నా కాలు మింద కాలేసుకొని తిననియ్యండి" అనన్నారు ఒకరిద్దరు కనికిరం గలిగినోళ్ళు.

మాయమ్మతో వొకరిద్దరు ఆడోళ్ళు, "ఏమి జేసుకుంటారు ఆ డబ్బునంతా? రెండు రూపాయల వడ్డీకి మారస్తారా?" అనడిగినారు.

నేనయితే చిన్న గుడు గుడు మోటార్ను ఒక దాన్ని తీసుకొని, యెనక సీట్లో ఏ నా కొడుకునీ ఎక్కించుకోకుండా, పుస్తకాలను పెట్టుకోని రంయ్‌మని మా అయిస్కూలి ముందర బ్రేకేసి కంటద్దాలను చేతిగుడ్డతో తుడుసుకుంటా క్లాసు రూమ్‌లోకి పొయ్, అందురూ నేల మీద కూర్చుంటే, నేను మా ప్యూను మునికిష్టయ్యను, "ఒరే, ఆడ యాడన్నా ఒక గాద్రేజి కుర్జీ వుంటే తీసకరారా!" అని అదలాయిద్దామనుకున్నాను.

మీ అందరికీ అప్పళాయి గుంటలో ఒక సుట్టం, నేంద్రగుంటలో ఒక సుట్టం, పుంగునూరులో ఒక సుట్టం వుంటారేమో! వాళ్ళంతా ఎంత?

మాకు సిడిజిర్లాండు నుంచి ఒక సుట్టపాయన వచ్చినాడు. సుట్టపాయన అంటే ఏదో బీరకాయ పీసు సుట్టపోడు గాదు సాములాలా! మాయమ్మోళ్ళ నాయినుండాడు సూడండి, మా తాత! మా తాతకు సొయానా అన్న కొడుకు.

అంటే మా అమ్మకు పెద నాయిన కొడుకు. దగ్గిర వరస. తోడ బుట్టిన తమ్ముడే గదా లెక్కకు.

"సిన్నప్పుడు అందురూ 'బాన కడుపోడు బాన కడుపోడు' అని ఎగతాలి జేసినారు మా తమ్ముడ్ని. ఈ రోజు సూడండి – ఎంతటోడయినాడో! సిన్నప్పుడెప్పుడో మమ్మల్నొదిలేసి రంగం పూడ్సినాడు. అన్నినాళ్లూ తమ్ముడు యాడ బొయ్‌నాడో అని బయ్‌టికి అనుకోకుండా కడుపులోనే కుళ్లిపొయ్‌నాం. ఈ రోజు మమ్మల్నందర్నీ సూసి పొయ్యేదానికి వచ్చినాడు. వాడ్ని చూస్తా వుంటే మాకు ఆస్తి మాదిరిగా వుండాది!" అని మా సిడిజిర్లాండు మామ మా వూరు రాంగానే మా అమ్మ, కండ్లల్లో కలికిం యేసుకొనిందో ఏమో 'ఓ' అని ఏడ్చేదానికి పెట్టుకొనింది. మా యమ్మ మా సిడిజిర్లాండు మామ సేతులు బట్టుకోని, "వొచ్చినావా? తమ్ముడా, వొచ్చినావా! మా కడపల్లో వుండే దుఃక్కాన్నంతా తీర్చే దానికి వొచ్చినావా తండ్రీ, వొచ్చినావా?" అని కండ్లల్లో వుండే నీళ్ళను జలజలా రాల్చేసింది.

సిడిజిర్లాండులో కొన్ని కోట్లు సంపాదిచ్చి మా వూరికొచ్చేసిన మా మామ– మా యమ్మకూ మా పెద్దమ్మకూ, మా సిన్నమ్మకూ యెంగటేస్పర సామి కన్నా ఎక్కువై పొయ్‌నాడు.

మా మామ మా పెద్దమ్మోళ్ళ ఇంటికి పొయ్, "అక్కా! సిడిజిర్లాండులో ఏడు కోట్లతోనో, ఎనిమిది కోట్లతోనో ఎండు చేపలు పొడి కొట్టే ప్యాక్ట్రీ ఒకటుండాది. డబ్బుకు దిగులు లేదు మనకు. నాకు తోడబుట్టిన ఆడకూతర్లకు తలా లచ్చేసి రూపాయి లిచ్చేసి పోతే బతికి పోతారు గదా అని మనూరు యెతుక్కుంటా వస్తిని" అని చెప్పినాడంట. దీనికి మా పెద్దమ్మ, "ఒరే తమ్ముడా! నీకు ముగ్గురు అప్పజెల్లెళ్ళ లోకీ నేనే గదరా దీనురాలు. ముగ్గర కొడుకుల్ని వొదిలేసి సిన్న జెరానికే మీ బావ (మా పెద్దమ్మ మొగుడు) లేత ప్రాయంలోనే చచ్చిపాయ. సినక్క కాపరానికీ దిగుల్లా. సంపూర్ణ (మా పిన్నం) కాపరానికీ దిగుల్లా. నేనే గదరే ఈనంగా బతకతా వుండేది!" అని మా సిడిజిర్లాండు మామ సెవల్లో వూదేసిందంట. ఈ మాట మాయమ్మకు తెలిసిపొయ్, "సినబ్బా మీ మామనిట్ట పిలచక రాబో! గుడినీ, గుళ్ళో లింగాన్నీ మింగేసే మనిసి మీ పెద్దం. అదేమి తక్కువైన నా సవితి గాదు. మా తమ్ముడ్ని యిట్ట పిలచకరాబో!"

అని చెప్పి పొయ్యిలో ఎప్పుడూ పెట్టని లావు బిరసన కట్టెలను పెట్టి యింతెత్తు మంటేసింది పొయ్యి. నేను పరిగెత్తతా పొయ్ మా సిడిజిర్లాండు మామను ఈడ్చుకొచ్చేసినాను. ఇంతలోనే మాయమ్మ ఒక బొవాణి నిండికి ఉద్దిపప్పు వడలను కాంచి పెట్టేసుండాది. మా యమ్మ టీలు పిలేటు నొకదాన్ని సంపాదిచ్చి దాన్ని చింత పండుతో చందమాం మాదిర్తో తోమి, దాంట్లో ఆరారు పన్నెండు వడలు బెట్టి దాంట్లో సొలిగిడు నెయ్యి, దోసిడు సక్కిరీ పోసింది. మా సిడిజిర్లాండు మామ తలొంచుకోని నెయ్యిని, వడల్ను, సక్కిర్ని పిసికి పిసికి తింటా వుండాడు.


మా మామ ఆత్రాన్ని జూసి మా యమ్మ దుఃక్కంతో, “మీ కూలిపొయ్‌న దేశింలో వుద్దిపప్పు వడలు వుండవు గదరా తమ్ముడా! అక్కడంతా గోదుమ రొట్లూ అవీ గదా!” అని ఏడిసింది. మా మామ టీలు పిలేటును కాళీ జేసేసి పెళ్లోకి బొయ్ చేతులు కడుక్కునేసినాక మాయమ్మ మా మామను యింట్లోకి పిలిసింది. అప్పుట్లో వడ్ల గింజల్ను పోసుకునే బొట్టను, వడ్లు లేక వొట్టిదాన్ని తాళ్ళతో పైన త్రావులకు యేలాడదీసి వుండాము. మా యమ్మ మా మామకు దాన్ని దుఃక్కంతో చూపిచ్చి, “కరువురా తమ్ముడా కరువు. గెంటిడు గింజిలు యింట్లేకి వచ్చి ఎంత కాలమయ్యిందో! నా ముగ్గురి బిడ్లను గంప కింద గదా మూసి పెట్టి వుండాను. అన్నీ తెలిసినోడివి, దేశిదేశాలు తిరిగినోడివి, యింగ చెప్పాల్నా?” అనేసింది.

మా సిడిజిర్లాండు మామ తిరప్తికీ మా వూరికీ తిరగతా నాలుగు నాళ్ళు వుండినాడు. ఆయన దూలం మాదిర్తో ఎంత పొడుగో ఎంత లావో చెప్పలేము. అయన యేసుకున్న ప్యాంటు, సరట్టు దేవ లోకాన వుండే దేవేంద్ర మకరాజుకు గూడా వుండుండవు. మా సంపూర్ణ పిన్నం మంచి పెట్ట వొకటి వుంటే దాని గొంతు కోసి మా మామకు అరువుగా పెట్టింది. మా యమ్మ వుక్రోసంతో, “అది పెట్టను కోస్తే మనం పుంజును కొయ్యలేమా! నేనేం అంత గతి లేందాన్నా!” అనేసి నడవలూరు పందేల్లో కత్తి గట్టాల్సిన జాతయిన పుంజును కోసి పారేసింది. మా సిడిజిర్లాండు మామకు సిడిజిర్లాండులో కోళ్ళు లేవో ఏమి నాశినమో దండిగా కూర తిని నాడు.

మా సిడిజిర్లాండు మామ, ఇంక నాలుగు నాళ్లల్లో, “నేను దేశం పూడవాల. అక్కడ పెళ్ళాం పిలకాయిలు అందురూ నా గురిచ్చి బొరోమంటా వుంటారు.

నేను మనసల్ను నమ్మలేక మెడ్రాసు బేంకీలో నాలుగు లచ్చిలు కట్టేసి వచ్చుండాను. పొయ్యేస్తానుండండి." అనేసి మదరాసు పొయ్‌నాడు.

రెండు నెలల దాకా ఆశి జావని మాయమ్మ, మా పెద్దమ్మ, మా పిన్నమ్మ మూడో నెల్లో ఒక రోజు ముగ్గురూ వుడ్డ జేరి, "మన సొత్తు ఎవుడెవుడో తినేసి పోతుండాడు గదా. వాళ్లల్లో సిడిజిర్లాండోడు వొకడు. వోడు మన తమ్ముడో గాదో! దొంగ మొకం నా బట్ట!" అని మెటికిలించినారు.



# మా గరిమినాబిగోడు

మా గరిమినాబిగోడు ఆడ పుట్టక గాని పుట్టుంటే బారడు పొడుగు జడ వుండుండును.

అగ్గో, నేనీ మాట రాస్తా వుండానో లేదో అప్పుడే మా గోడమింద బల్లి ధని పలికింది అందుకని–క్రిష్ణ క్రిష్ణ క్రిష్ణ కిష్ణ క్రిష్ణ–

గరిమినాభి అనగా నేమి? ఇది రెండు మార్కుల కొశిను. దీనికి సమాదానం మహా అవితే మూడు గీతలు. అంతా రాసుకుంటా పోతే ఒక్క పేరా గూడా రాదు.

మా గరిమినాబిగోడు అంటే ఎవురు? అనే దానికి ప్లవన సూత్రాలకు జవాబు రాసినట్టు బారడు పొడుగు రాయాల్సుంటుంది.

గరిమినాబిగోడు అసలు పేరు నేనిప్పుడు నిజ్జింతో మర్చిపొయ్‌నాను. వాడు నెన్నూరు నుంచి వచ్చి మా అయిస్కూల్లో చదువుకునే వాడు. నా కన్నా సమ్మచ్చరమో, రెండేండ్లో జూనీరు. రెడ్ల పిలగోడు.

మా అయిస్కూల్లో అందరికీ మారుపేర్లుండాయి గాని, గరిమినాబిగోడి పేరే యిచిత్రం. నాకు కన్ను కొంచెం మెల్ల గాబట్టి నన్ను – గుడ్డి పోలిగోడు అనంటారంతా. దీంతోనే వూరుకోకుండా నా మారు పేరులో నుంచి 'పోలి' అనే దాన్ని ఏరుకోని, నాకు నె 'పోలి'యన్ అనే పేరు పెట్టేసినారు. నెపోలియన్ అంటే ఎవురబ్బా, వాడు మిట్టూరు గుడ్డోడా – అని నా గురిచ్చి కొంచిమన్నా

ఆలోచిస్తారు గాని, గరిమినాబిగోడు అని అనంగానే 'నెన్నూరోడు గదా' అని పిలకాయిల మొదలుకొని అయ్యోర్లదాకా అందరికీ మస్టన్‌షడ్‌గా తెలుసు.

గరిమినాబిగోడికి ఆ పేరు అయిస్కూలు మెట్టెక్కినాకే వచ్చింది. వాడికి ఎలిమెంట్రీ స్కూల్లో ఏమి మారు పేరు వుండిందో ఎవురికీ తెలవదు. ఎప్పుడైతే వాడు అయిస్కూలుకు వచ్చి మూడు నెలల పరీచ్చలు రాసినాడో ఆ నాటి నుంచి వాడికి గరిమినాబిగోడు అనే పేరు వచ్చేసింది.

మూడు నెలల పరీచ్చలో, సైన్సు పరీచ్చలో గరిమినాబిగోడికి నూటికి రొండంటే రొండే మార్కులు వచ్చినాయి. గరిమినాభి అనగా నేమి? అనే దానికి వాడు పొల్లు పోకుండా సమాధానం రాసి రొండు మార్కులు సంపాదిచ్చుకున్నాడు. ఇంకొక ప్రశ్న జోలికి గాని వాడు పొయ్యుంటే!

మా గరిమినాబిగోడికి గరిమనాభి అంటే ఎంత ఇష్టంరా అంటే మా తెలుగయ్యోరు చిన్నయ సూరి పాఠం చెప్తా వుండినా వాడు తెలుగు పుస్కాన్ని ముందర బెట్టుకోకుండా, సైన్సు పుస్కాన్ని ముందర బెట్టుకోని గరిమనాభి పాఠాన్ని తెరిచి చూస్తా వుండి పొయ్యేవాడు. గరిమనాభి పాఠంలో ఒక గడ్డిని తోలుకుని పొయ్యే – బండి బొమ్మను వేసుంటారు గదా! ఆ బొమ్మను రెప్పార్చకుండా చూస్తావుండి పొయ్యేవాడు మా గరిమినాబిగోడు.

గరిమినాబిగోడికి అర్నెల్ల పరీచ్చలో సైన్సులో పెద్ద కోడిగుడ్డు వచ్చింది. ఆ దఫా గరిమనాభి అనగా నేమి? అనే ప్రశ్న రానేలా.

ఒకదఫా సోసీలయ్యోరు అశోకుడి పాఠం చెప్తా వుంటే వీడు గరిమనాబి బొమ్మను తలొంచుకోని చూసింది చూసినట్టే వుండాడంట. సోసీలయ్యోరు వాడ్ని పైకి లేపి ఆ పీరీడ్డంతా ఒంటి కాలి మింద నిలబెడితే అప్పుడు కూడా సోసీలు పుస్తకం చేత బట్టుకోకుండా గరిమనాభి పుస్తకాన్నే చేతిలో పెట్టుకుని చూస్తా వుండిపోయే వాడంట. ఇంగ వాడ్ని ఎవుడేం జేసేది సెప్పండి?.

ఈ గరిమినాబిగోడు అచ్చం గాంధీతాత మనమడే. వాడ్ని మనం ఎన్ని ఎగతాళులు చేసినా వాడు మనల్ను పొల్లెత్తు మాట అనేవాడు గాదు. కొండను జూసి కుక్క మొరిగితే కొండకు చేటా – అన్నట్టు వాడి మానాన వాడు గరిమనాభి బొమ్మను చూస్తానే వుండిపొయ్యేవాడు. మనం వాడ్ని యింగా యింగా

ఏడిపించాలని ఎంటికలు పట్టి పెరికితే, “గమ్మనుండురా ముండనాయాలా!” అని మొగ తిట్టు తిట్టకుండా, “ఏమిరా నా బట్టా” అని ఆడ తిట్టు తిట్టేవాడు. వాడు మొగ తిట్టు తిట్టంగా మొగ పిలకాయలు ఎవురూ వినలా. ఈ ఆడబుద్ధికి తోడుగా వాడు ఆడ పిలకాయలకు జడలేసినట్టు, వాళ్ళ వాళ్ళ అమ్మలు గూడ వెయ్యరంట.

ఒకసారి మా డ్రాయింగు అమ్మోరమ్మ – కుండలోకి వొంగి కాకి నీళ్ళు తాగినట్టు – బొమ్మ వెయ్యండిరా అంటే మా గరిమినాబిగోడు మాత్రం వాలిపోతా వాలిపోతా వుండే గడ్డిబండి బొమ్మవేసి, గరిమనాభిని యారో మార్కుతో చూపించి మా అమ్మోరమ్మకు నవ్వు తెప్పించినాడు.

మా క్లాసు టీచరయిన ఇంగ్లీషయ్యోరు చార్లెస్ గరిమినాబిగోడ్ని పట్టుకొని వుతగ్గొట్టేసి, ఎర్ర సున్నాలతో నిండిపోయిన వాడి ప్రోగ్రసు రిపోర్టను విసిరి పారేసి, “రేపు, మీ నాయిన్ను తోడుకోని రా. నాయాలా ఆ గరిమినాభిని పెండ్లన్నా చేసుకోని కాపరమన్నా పెట్టేమిరా?” అని కసురుకొనేసినాడు. ఆ మరసనాడు గరిమనాబిగోడు వాళ్ల నాయిన్ను తోడుకోని వచ్చినాడు. వాళ్ళ నాయిన ప్రోగ్రసు రిపోర్టలో వుండే ఎర్ర సున్నాలను జూసి బిత్తర పోయి, “ఎట్టనో మీరే వాడ్ని సక్రం అయిన మార్గంలో పెట్టండయ్యా! కన్నోడ్ని గదా నేను కొట్టలేను వాడ్ని.” అనేసి పొయ్‌నాడు. ఇంత జరిగినాక గూడ వాడు ఇస్కూలు వదిలినాక సందేళపూట నెన్నూరుకు పోతా పోతా గరిమనాభిని గురించి చదవతా చదవతా ఆ బొమ్మను చూస్తా చూస్తా పొయ్‌నాడంట. ఒక రోజు సైన్సయ్యోరు బోర్డు మీద అయస్కాంత ధర్మాలను వివరిస్తా బొమ్మలు గీస్తా వుంటే వీడు గడ్డిబొమ్మను గీసుకుంటా వొళ్లో తలకాయి పెట్టుకోనుండడం జూసి సైన్సయ్యోరు వచ్చి, “నాయాలా! నిన్నేమి చేస్తే పాపాలు తీరునురా!” అని సైన్సు పుస్తకం చిత్రాకులు పత్రాకులుగా చింపేసినాడు. దాంతో తిక్క కుదిరిందనుకుంటే వాడు వాళ్ళమ్మను ఏడిపిచ్చి ఏడో తరగతి పిలగోడు దగ్గిర వుండిన సైన్సు పుస్తకాన్ని అర్ధ రేటుకు కొనుక్కోని ఆ మరుసనాడు తెలుగు పీరిడ్డులో గరిమనాభి బొమ్మను చూసుకుంటా వుండిపొయ్‌నాడు. వాడూ, వాడి గరిమనాభే గాని ఒకడితో కలిసే పనే లేదు. ఈ వాటంతోనే ఒక సమ్మచ్చరం గడిసి పొయ్యింది. ఏ రోజూ ఇస్కూలుకు రాకుండా మానని గరిమనాబిగోడు బ్రమ్మాంద రెడ్డి ధర్మాన ఆరో తరగతి పాసయి పొయ్‌నాడు.

మా పిలకాయిలం అందరం, "ఏడో తరగతి సైన్సు పుస్తకంలో గరిమనాభి పాటం లేదు గదా. ఇంక గరిమనాభిగోడి గతి ఎట్ట?" అని అనుకుని నవ్వుకున్నాం. వాడు ఏడో తరగతి మెట్టెక్కితే గరిమనాభి పీడ యిరగడై పోతిందనుకుంటే–

ఒకనాడు ఏడో తరగతి యిందీ పీరిడ్డులో ఆరో తరగతి సైన్సు పుస్తకాన్ని ముందరేసుకుని గడ్డి బండి బొమ్మను ఆశిదీరా చూస్తావుండి పొయ్‌నాడు గరిమనాబిగోడు.

ఇందీ అయ్యోరు గరిమినాబిగోడి యెనక్కు వచ్చి--



# సోదర సోదరీ మణులాలా

# సొరకాయ బుర్రలాలా...

... అనేసి వుపన్నాసానికి తగులుకున్నాడు మా యెడ్ మేస్త్రి మిటాయోడు.

మా యెడ్‌మేస్త్రి పేరు ముని కిష్టారెడ్డే అయినా, ఆయన మాటి మాటికీ ప్యాంటు జేబీలో చేతులు బెట్టి ఒక్కొక్క మిటాయి ఎత్తుకోని నోట్లో యేసుకోని చప్పరిస్తానే వుండడం వల్ల మా పిలకాయలం 'మిటాయోడు' అని పేరు పెట్టుకున్నాం లే.

మా మిటాయి యెడ్‌మేస్త్రీకి మిటాయిలంటే ఎంతిస్టమో పది మంది ముందర మాట్లాడేదంటే అంతిస్టం.

ఆయన మా అయిస్కూలు పిలకాయిల్ని ఏ రకంతో యేంచుకోని తినేటోడురా అంటే–

తెల్లారి క్లాసు రూముల్లోకి పోక ముందు ఇస్కూలు పిలకాయిలంతా ప్రేయరు జెయ్యాల గదా. ప్రేయరుకని మేమంతా మా ఇస్కూలు నడీ మద్యన వుండే ప్రేయరు ఆలులోకి వచ్చి సోలుపులుగా నిలబడే వాళ్ళం. అది ప్రేయరు ఆలా, పాడా? చుట్టూరా ఆశోక చెట్లుండే మా ప్రేయరు ఆలంటే బీడన్న మాట. ఆ బీట్లో మేమంతా నిలబడీ నిలబడంగానే, మా యెడ్‌మేస్త్రి టేజీ ఎక్కేటోడు. మా ఎస్పిఎల్ గూడా టేజీ ఎక్కి యెడ్ మేస్త్రికి సెల్యూట్ జేసేటోడు.

ఆ సెల్యూట్‌కు బదులుగా మా యెడ్‌మేస్త్రీ గూడా సెల్యూట్ జేసేస్తే సరిపోవును. ఆయన ఆ పని జేసేసి టేజీ దిగకుండా, "విద్యార్థినీ విద్యార్థులారా" అని తగులుకునేటోడు.

"ఇంక అయినట్టే!" అని మేమంతా ముక్కుల గుండా, నోటి గుండా బారడు పొడుగు గస వొదిలేటోళ్ళం.

సందు దొరికితే సాలు మా మిటాయయ్యోరు ఈ వాటంతో వుపన్నాసానికి తగులుకునేటోడు. తెల్లారి లేచి తిరప్తిలో పేపర్లు చదివేసి, చదివిందాన్నంతా గస పోసుకుంటా దంచేసేటోడు. రాయలసీమలో వుండే కరువును గురిచ్చి ఒకరోజు చెప్పిందే చెప్తా వుండినాడు. రైతులు గొడ్డూగోదను అమ్ముకొనేస్తా వుండారని ఆ టేజీ మింద 'ఓ' అని (నిజంగానే) బాదపడి పోయే వాడు. ఎక్కడ బొరోమని ఏడ్చేస్తాడేమోనని మేమంతా బిత్తర పోయినాం.

మంచి మద్యానం ఎండనన్నా బరిస్తాం గాని, తెల్లారి పది గంటల కాడ కాసే రేపటెండను బరిచ్చడం బలే కస్టం. ఆ ఎండలో నిలబడుకోని మేము ఆ ఉపన్నాసం యింటా వుంటే వుక్కలు బోసేసి, అక్కులు ఎండక పోతా వుండాయి. పస్టు పీరిడ్డు టయాన్ని గూడ ప్రేయరు ఆల్లోనే తీస్కునేసినాడు యెడ్‌మేస్త్రీ. అయినా ఆయనకు చాల్లా. చేతిగుడ్డతో మొకం తుడుచుకుంటానే, గస పోసుకుంటానే మాట్లాడతా వుండాడే గాని టేజీ దిగలేదే! మేము తెల్లారి యిండ్ల కాడ తాగేసి వచ్చిన చద్దులు ఈ ప్రేయరు ఆల్లోనే ఓం స్వాహా అయిపొయ్యేవి.

ఏడో తరగతి రిజల్టు వచ్చినాక మా యెడ్‌మేస్త్రీ చెప్పిన ఉపన్నాసం కంటస్తం పెట్టతగింది. ఆయన యిచ్చిన ఉపన్నాసం యింటా వుంటే పాసయిన మా విద్యార్థులంతా, "ఏడో తరగతిని ఎందుకు పాసైతిమిరా, బగమంతుడా?" అని తలకాయిలు పట్టుకోవాల్సి వచ్చింది. గొప్ప పేరొచ్చినోళ్ళంతా ఏడో తరగతి పయిలై పోయినోళ్ళేనంట. అందుకని పయిలై పోయినోళ్ళు చచ్చిపొయ్యే ఏర్పాట్లు చూడకుండా బతకాలంట. ఆ రోజు మా మిటాయి టేజీ దిగకుండా అదరగొడతానే వుండిపొయ్‌నాడు.

ఆ రేపటెండలో – కాలు గెంటయ్యింది, అర గెంటయ్యింది, ముక్కాలు గంటయ్యింది.

మా మిటాయయ్యోరు ప్రేయరు ఆలే క్లాసు రూములనుకున్నాడు!

ఉపన్నాసం కాలు గెంటలో వుండంగా నాకు పకపకా నవ్వొచ్చింది. అర గంటయినాక బొరోమని దుఃక్కం వచ్చింది. ముక్కాలు గెంటయినాక తెగింపు వచ్చేసింది.

మా పిలకాయిల్లో గురుస్వామి అనేటోడు ఒకనాడు ఈ బాద పడలేక, "నేనే టేజీ ఎక్కి మిటాయోడ్ని కింద తోసేద్దును. నేను పది పాసయినాక యెడ్‌మేస్త్రీ కాండక్టు సర్టిపిడతలో బ్యాడు అని రాసేస్తాడనే నా బయమంతా! లేకుంటే అదెంత సేపు పని?" అనన్నాడు.

సరిగ్గా నా బయింగూడా– గురుసాంగోడి బయిం మాదిరిదే!

అవితే ఈ ఉపన్నాసాల పీడ నుంచి మా విద్యార్థులను విరగడ చేస్తే నాకు పైలోకంలో సుకం వస్తింది. అంతకన్నా పుణ్యం ఏముండాది.?

నేను ఆలోచించినాను. ఆలోచించినాను. ఆలోచించినాను. బారడు పొడుగు ఆలోచించినాను.

అమ్మ!

వొచ్చింది అయిడీ!

ఏముండాది?

వొళ్ళు సోదీనం తప్పినట్టు దబామని కింద పడిపొయ్‌నాను. ఎన్టీవోడ్ని మించినట్టు చేసినా యాక్సను. ప్రేయరు ఆలంతా, "గుడ్డోడు సోదీనం దప్పి పడి పొయ్‌నాడ్రే!" అని దద్దరిల్లి పొయ్యింది.

యెడ్‌మేస్త్రీ టేజి దిగి పరిగెత్తినాడు. ఎవురుతో జెప్పి పరిగెత్తతాడు? తమాస పనా? క్రిమినల్లు కేసు వచ్చేస్తింది లేకపోతే!

ఎవరో ఒక టీచరు (సైన్సయ్యోరే, బాగ చూసినా) చెంబుతో నీళ్ళు తెచ్చి మొకాన జిలకరించినాడు.

దీంతో నాయంగా కండ్లు తెరవాల గదా!

తెరిసినా.

బలవంతాన నడిసినట్టుగా నడిసి క్లాసు రూములోకి పోబొయ్‌నా.

"స్టాఫు రూములో కొంచేపు పొనుకుందువు రా!" అని అయ్యోర్లంతా నా సుట్టూరా చేరి పిలస్తుండారు.

పొయ్‌నా, స్టాఫ్ రూములోకి.

"తెల్లారి చద్ది తాగలేదు సా. అందుకని ఎండకు సోదీనం తప్పినా." అని చెప్పినా.

"ఏమన్నా తింటావా?" మా యెడ్ మేస్త్రీ ఆత్రంగా జేబిలో చెయ్యి బెట్నాడు.

మిటాయిలిస్తాడేమోనని బిత్తరక పొయ్, "నాలుగు కేకులు తిని, ఒక టీ తాగతాన్ సా." అన్నా.

ప్యూను కేకులు తెచ్చినాడు.

కడుపులో దుత్తడు చద్ది ముక్కలాన వుండాది! వీట్నీ తోసినా. కేకుల బోగం ఆ దినమంతా అనుబోగించినా. నాలుగు నాళ్ళు యెడ్‌మేస్త్రి నా దెబ్బకు బిత్తరపొయ్ ఉపన్నాసం జోలికి పొయ్యుంటే!

అయిదో రోజు మళ్ళా, "విద్యార్థినీ విద్యార్థులారా...." అని రెండు నిమిసాలు మాట్లాడంగానే గురుసాంగోడు వాలిపొయ్‌నాడు.

దొంగ నా కొడుకు, కేకులు దొబ్బదామనే!

ఈ మాదిరిగా మా పిలకాయలం రోజుకొకరు కేకులు తిందాం గదా అనుకుంటే మా యెడ్‌మేస్త్రీ–

"మీకు కేకుల్ని, టీల్ను కొనియ్యలేన్రా సామీ. ఉపన్నాసం లేకుంటే మీకే గదా నష్టిం" అని ఎస్.పి.ఎల్. ఇచ్చిన సెల్యూటును అందుకోని మిటాయి చప్పరిస్తా టేజీ దిగేసినాడు పాపం.



# ఇది ఏమి మాయా !

# శ్రీకృష్ణుని దయ లేక పోయా !!

"నాకు మూడ్డు బాగ లేదురా గుడ్డోడా!" అంటా క్లాసు రూములోకి వచ్చినాడు మా లెక్కలయ్యోరు.

దీంతో పిలకాయలకందరికీ ఒక్కసారిగా మూడ్డొచ్చేసింది! ఆయనకు మూడ్డు బాగుండి ఏస్కోబీస్కో అని ఆల్జీబ్రా మొదులుబెడితే మళ్ళ మన మైండు గాబ్రా గదా! బగమంతుడు మన పక్కన వుండాడు గదా అని మేమంతా ముక్కుల గుండా జెమ్మాచారంగా గాలి వొదిల్నాం.

నాటకాల పిచ్చి బలే వుండే మా లెక్కలయ్యోరు, "ఈ రోజు పాఠాలు జెప్పే పని బెట్టుకోను. నేనొక పాట బాడతా, మీరంతా తలా ఒగటి పాడాల. సరా?" అని అనడంతో మేమంతా అయనకు పటం గట్టి పూజలు కానిచ్చేసినాం.

క్లాసులోకి వచ్చీ రాంగానే టేబిలు మింద పిడికిడు చాకు పీసులు పడేసి కుర్జీలో కూచ్చోనన్నా కుచ్చోకుండా, మాధవపెద్ది సత్తెం గొంతుతో,

"కట్టుకో కట్టుకో

పట్టుచీర

పెట్టుకో పెట్టుకో

పెళ్ళీబొట్టు

చుక్కలాంటీ చిన్నదానా

జున్ను ముఖ్కలాగా వున్న ధాణా!"

అని గంటసాల పాట బాడినాడు.

లెక్కలకు తగులుకోకుండా, ఏదో ఒక పాట ఎట్టనో ఒకట్ట పాడినాడు గదా అని – మా కనికరం కలిగిన లెక్కలయ్యోరికి – జోరుగా చప్పట్లు గొట్టేసి, ఆయన నెత్తిన ఒక కుచ్చుల కుళాయిని పెట్టేసినాం.

"నెక్టు చాన్సు ఎవురు తీసుకుంటా(రా?" అని మా లెక్కలయ్యోరు మా మొగ పిలకాయిల కల్లా గాకుండా మా ఆడ పిలకాయిల కల్లా చూసినాడు.

ధనమ్మ అనే అమ్మి జెండా ఎత్తినట్టు రకీమని చెయ్యిని పైకి లేపి నెక్స్ట్‌చాన్సును ఎవ్వరికీ వొదలకుండా తీసుకొనింది.

ఆయమ్మి చిలక నవ్వినట్టు నవ్వి, కొంగ మాదిర్తో మెడకాయిని వాలేసుకుని, సుశీల పాటను,

"చరి లేరు నీకెవ్వరూ!" అని పాడింది, ఎల్లార్‌ఈస్వరి గొంతుతో.

'ధనమ్మా డవున్ డవున్' అని అరిస్తే మిగతా పాడేవోళ్ళు గూడ పాడకుండా బయిపడతారని బయిపడి మేమంతా మా ఖాళీ కేరీర్ల మూతలూడదీసి దమాదమా వాయించేసినాము. నేనవితే, 'వనుసు మోర్! వనుసు మోర్!' అని లేసి లేసి అరిసేసినాను. నన్ను కుచ్చునబెట్టే దానికి మా లెక్కలయ్యోరు నలగర పిలకాయిల్ని పైకి లేపాల్సొచ్చింది!

కోదండడు ఉగ్రం వచ్చినట్టు పైకి లేసి, "నేన్సా నేన్సా, నేను పాడాల్సా!" అని ఇద్దం జేసి చాన్సు కొట్టేసినాడు. ఆ నా కొడుకు డ్రామాలో పద్యం పాడతానని ప్రామిస్సు జేసి, పైకి నిలబడి, కండ్లు మూస్కోని,

"జెండాపై కపిరాజు

ముందు సితవాని శ్రేణియం గూర్చి" చెప్పినాడు.

వాడు పద్యం జెప్పడం జూసి మా పిలకాయిలకంతా బారడు పొడుగు కోపాలొచ్చేసినాయి. మేము లెక్కలయ్యోరు వొద్దంటా వున్నా యినకుండా పైకి లేచి, "కోదండడు చెనంలో సిడవునవ్వాల" అని అరిచేసినాం. వాడినకుంటే వాడి రెండు చేతుల్నూ పది మంది పిలకాయిలం పట్టుకోని గుంజేసి సిడవున్ జేసేసి, ఇరై మందిమి స్టాండప్ అయిపొయ్‌నాం –"మేం పాడాల, మేం పాడాల, మాగ్గాడ పాటలొచ్చు."

మా లెక్కలయ్యోరు మా అల్లకల్లోలం జూసి మూతి నల్లంగా బెట్టుకోని, "మీరీ వాటంతో చేస్తే నేను పైథాగరస్ సిద్ధాంతరం చెప్పేస్తాన్రోయ్" అని బెదిరిచ్చినాడు.

దీంతో మేమంతా పిండ్రాప్ చైలెన్సయి పొయ్‌నాం.

వున్నట్టుండి గెడ్డపారను కిందేసినట్టుగా మా లెక్కలయ్యోరు, "ఒరే గుడ్డా! నువ్వు గానీరా! పాడ్రా!" అని నన్ను పైకి లేపినాడు. నేను కులుక్కుంటా, "థాంక్స్, థాంక్స్ సా," అని అనబొయ్, మా లెక్కలయ్యోర్ని ప్రేమతో చూసి, "టాటాసా, టాటాసా!" అని అనే కొందికి పిలకాయిలంతా ఓ అని సప్పట్లు గొట్టేసి నవ్వేసినారు.

"ఏంసా నా మాటకే ఇంత సప్పట్లుగా వుండాదే! యింగ నేను పాడితేనా? వుండండి నా పొవ్వాకు చూపిస్తా!" అని ఎత్తుకున్నాను.

"సీను – ఇరాట పర్వం. కీచకుడు సైరంధ్రిని కావాలంటాడు. వాడి పోరు పళ్ళేక ద్రౌపతమ్మ తల్లి భీముడి సలాతో కీచకుడ్ని నర్తనశాలకు రమ్మంటాది. అప్పుడు కీచకుడితో ద్రౌపతమ్మ యాసండంగా పాడిన పాటిది." అని ఉపోద్ఘాతం ఇచ్చేసి తగులుకున్నాను నేను. మనం ఆడ గొంతును అప్పు తెచ్చుకోవాల్సిన పన్లేదు గదా.

"వొస్తే వొచ్చావు గాని వోరి కీచకా

ఒక శేరు బొరుగులు తేరా వోరీ కీచకా!" అని నేను ఈది నాటకం పాటను అడుగేసి పాడే కొందికి మా పిలకాయిల కుశాల అంతా యింతా గాదు.

"ఇంతలేకే ఏమయ్యింది. ఆవ గింజలో అర్ధం గాలేదే!" అనేసి మళ్లా,

"వొస్తే వొచ్చావు గాని వ్వోరి కీచకా ఒక కట్ట తమలపాకులు తేరా వ్వోరి క్కీచకా!"

"కీచకా! వొక్క, ఆకు యేస్కుంటే మజా గుంటిందిరా కీచకా!" అని అని మళ్లా కీచకుడి గొంతుతో, "సెబాస్ సైరంధ్రీ! ఇంకా ఏం గావాల? పంచభక్ష పరమాన్నాలు వొద్దా?" అని అన్నాను. మళ్ళా ద్రౌపది గొంతుతో, "వొస్తే వొచ్చావుగాని ఓరి కీచకా ఒక శేరు ఒక్కలు తేరా ఓరి కీచకా!

వొస్తే వొచ్చావు గాని ఓరి కీచకా!

పీనిగి మింద కప్పే మీట్రు పైగుడ్డ తేరా ఓరి కీచకా" అని పాడి, "సైరంధ్రీ! తెల్ల గుడ్డెందుకే భామామణీ? పట్టు మంచం తెస్తానే నెరజాణా!" అనన్నాను. మళ్లా ద్రౌపది గొంతుతో,

"నీకు తెలవదు లేరా కీచకా

వొస్తే........

ఒక వెదుర్ల పాడెను తేరా వోరి కీచకా!" అని పాడి, కీచకుడి మొకం బిత్తరపొయ్‌నట్టు యాక్సను చేస్తా వుండానో లేదో,

సాములాలా! ఆ గందర్వులన్నా చెప్పి వస్తారేమో గాని – మా క్లాసు రూములోకి ముందు డి.ఈ.వ., ఆ యెనకాన యెడ్‌మేస్తిరి!

నా గొంతున్నే బలవంతాన నొక్కేసినా. క్లాసంతా చైలెన్సు. మా లెక్కలయ్యోరు నవ్వునాపి వొణుకు నాపలేక పోతా వుండాడు. నేను టేబిలు మిందుండే ఒక పీసాఫ్ చాక్‌ను ఎత్తుకోని నేరుగా నా సీట్లోకి వచ్చినాను.

నేను సైలెంటుగా కూర్చోబోతా వుంటే మనుసొప్పని డి.ఇ.వ. నన్ను 'ఇట్రా' అని బోరడు కల్లా చెయ్యి జూపిచ్చి, "పైతాగరస్ సిద్దాంతరాన్ని రుజువు జెయ్" అనన్నాడు నిప్పులు గక్కతా.

సడే సడే!

సిద్దాంతరాన్ని చెప్పనే తెలవనోడు, సిద్దాంతరాన్ని రుజువు జేస్తాడా? ఇది గూడా తెలవనోడు డి.ఇ.వ. ఎట్టయినాడో?

ఇది మా క్లాసు హోల్మొత్తం చెప్పాలేక, చెయ్యాలేక పోతే డి.ఇ.వ. చెప్పలేక పొయ్నట్టు అగుమానంగా తలొంచుకుని పూడ్సినాడు.

ఆయన్ను సాగనంపేసి, మా యెడ్మేస్త్రీ, మా లెక్కలయ్యోరు(?) మా ప్యూను – ముగ్గురూ మూడు కట్టల కానగ బెత్తాలను క్లాసు రూములోకి తెచ్చినారు.

మా పిలకాయిలందరికీ అప్పుడు మూడ్డు బాగలేక పొయ్యిందిరా సామీ పరమాత్మా!

ఇది ఏమి మాయా! శ్రీకృష్ణుని దయ లేకపోయా!!



# ఆర్య వ్యవహారంబున దృష్టంబు గ్రాహ్యంబు

ఏడో తరగతి పాసై ఎనిమిదో తరగతి చదవతా వుండాను–అంటే, నేను మైనీరు పిలగోడి కింద గదా లెక్క. వూళ్ళో మైనీరు పిలగోడు ఎంత గవరంగా బతకాల! మనం పొట్టిగానే వుండినా, అదేమీ లేదనుకోని, నాలుగు మూర పంచె–పెద్దంచు గల్లది–కట్టుకోని మాటి మాటికీ విప్పనూ కట్టుకోనుగా బడాయి బడాయిగా పెగ్గి పెగ్గిగా మనల్ని మనమే చూసుకుంటా, ఈదులు తిరగాల గదా! ఇట్ల గాకుండా నోట్లో యేలేసుకోని ఇస్కూలు లీవులప్పుడు రెండు ఎనప గొడ్లను కట్టెత్తుకోని మేపేదానికి పోతే మనల్ను ఎవరు మతిస్తారు? తిన్ని మింద కూచ్చోనుండే పైటేసుకున్న ఆడపిల్ల–అప్పుడప్పుడే రుజువయింది–పైకి లేవక పోతే మానె, కాలు మింద కాలేసుకోకుంటే చాలు. మనం యిదివరకటి పిలగాడిమి గాదు - ఇప్పుడు చదివేది అయ్యరు పారము. మాయమ్మ నా దగ్గిరికొచ్చి, నా మొకం చూట్టూ చేతులు తిప్పి మెటికలించి, "నా అణకవైన కొడుకు!" అనంగానే నేను ఐసై పోయి చేతికి కట్టెత్తుకోని ఎనుముల కాడికి పోగూడదు అని శపత్తం జేసుకున్నాను. నేను ఇంట్లో వుండినప్పుడు మాయమ్మ, 'ఈడు మన సిన్నకొడుకే గదా' అనుకొని, "ఒరే సినబ్బా, ఆ చాట యిట్ల ఎత్తియ్యి." అని అడిగినా, ఆ పని చేస్తే అది ఆడంగి పని కిందకొచ్చేస్తిందేమోనని బయపడి, "ఏదన్నా మొగ పని వుంటే చెప్పుమా. బతికినంత గాలం నా తావున ఆడ పన్లే చెయ్యిస్తావా?" అని కసురుకునేవాడ్ని.

నోటితో ఈ మాట అంటానే, చేత్తో ఆ చేట ఎత్తియ్యకుంటే నావల్ల గాదు మళ్ళ. మాయమ్మ, "ఒరే మడి కాడికి పొయ్ పొయ్యిలోకి కట్లెత్తుకోని వద్దాము రారా" అంటే, "నేను చదువుకోవాలమా! నేను చదువుకోవాల" అనేసి ఏదో ఒక దరిద్రపు పుస్తకాన్ని – సైన్సునే – చేత బట్టుకునే వాడ్ని. మాయమ్మ ఏ పనన్నా చెప్పనియ్యండి నేను, "చదువుకోవాల, చదువుకోవాల!" యిదే నా జవాబు. ఒక రోజు మాయమ్మ, "ఒరే సిన్నయ్యలూ! మడి కాడికి పొయ్ పేడతట్టలు యేసేసి వద్దాము రారా!" అని బయమూ బక్తీ లేకుండా పిలిచింది. నాకు ఒళ్ళట్ట రగిలి పొయ్యింది. పేడకళ్ళు మహలక్ష్మితో సమానం గదా ఎత్తకపోదాం అని ఒక పక్క గుంజతా వుండినా నేను నిబాయించుకోని, "మరేదగా గమ్మనుండు. అయిస్కూలు చదివే పిలగోడి దగ్గిర పేడ తట్టలు మొయ్యిస్తావా?" అని నాలిక కొరుక్కొని మాయమ్మను కొట్టబోతాను. మాయమ్మ– మాయమ్మకు మాత్రమే అలివి అయిన ముదిగారంతో నా బంగారట్టా కర్లింగు హెయిర్లను పట్టుకొని, "మంచి మాటల్తో పేడతట్ట ఎత్తుకుందువురా!" అని కొట్టంలోకి ఈడ్చుక పోయింది, మా ఈదిలో వుండే ఆడోళ్ళ ముందర్నే. ఇంక నేను చేసేది లేక తలపైన వుండే కర్లింగులు ఎక్కడ వరస్ట్‌గా తయారవుతాయోనని బయపడతానే పేడతట్ట నెత్తుకోని మాయమ్మ యెనకాన్నే మడి కాడికి నడిచినాను. కయ్యిలో పేడ తట్టలేసేసినాక మాయమ్మ, కయ్య గెనిమ మింద గొంతు కూర్చోని నన్ను పక్కన బెట్టుకోని, "నేన్నీకు రెండు కతల్జెప్పాల్రా సినబ్బా! ఇప్పుడే చెప్పాల కావాల!" అని మొదులుబెట్టింది. ఆ రెండు కతలూ చెప్పడమే ఈ కతలో వుండే మతం.

"ఒక రైతంట. ఆ రైతుకు ఒక పెళ్ళామంట. రైతు ఒట్టి ముండమోపి మొకమోడంట. రైతు పెళ్లాం మాత్రం సివంగి అంట. ఉత్తర కొండను దక్షిణ కొండను దొర్లించి పిండిజేసే రకమంట రైతు పెళ్ళాంది. రైతు మాత్రం రెండు కాళ్ళూ చాపేసి గురక పెట్టేదానికి ఇరవై నాలుగ్గంటలూ చాలేవి గాదంట. ఒకసారి రైతు చెరువు కింద ఎకరాను మొలగొలుకుల మడి చేసినాడంట. పంట ఇరగ పండిందంట. పంట నిండికి గువ్వలు చేరిపొయ్‌నాయంట. పండిన పంటను కోసుకునే దానికి రైతుకు ఒళ్ళు బొలువైందంట. ఈ పొద్దు కోద్దాం రేపు కోద్దాం అంటానే వాయిదాలు పెడతా వుండాడంట. పంటమింద గువ్వలు మాత్రం పండగ చేసుకుంటా వుండాయంట. ఒక రోజు సందేళనంగా

వచ్చిన తల్లి గువ్వలతో పిల్లగువ్వలు, "అమ్మలాలా అమ్మలాలా! మనం వేరే పంట చూసుకోవాల. ఈ రోజు మద్యానం రైతు పంట కాడికి వచ్చి రేపే కూలోళ్లను పెట్టి కొయ్యించేస్తాను– అని అంటా వుండినాడు" అని చెప్పినాయంట. పిల్ల గువ్వల మాటలకు పెద్ద గువ్వలు కీసుకీసుమని నవ్వి, "ఆ రైతు మాటలను నమ్మబాకండి. వాడి ముండ మొకాన ఎండ కాసిందిలే కానీండి. కూలోళ్ళతో మడి కోయిస్తాడంటనా! వాడి బైస ఆరిందిలే. మీరు బయపడబోకండి. కూలోళ్ళు అంత తేలిగ్గా రారు. ఆ రైతు అంత తేలిగ్గా కొయ్యడు." అని దైర్నం చెప్పినాయంట. గువ్వలు, పిల్లలు మళ్ల పది దినాలు కేళీ విలాసంతో బీపు గింజలను తింటా వుండినాయి. పదకొండో దినం తల్లి గువ్వలు రాంగానే పిల్లగువ్వలు, "అమ్మలాలా అమ్మలాలా! ఈ రోజు సందేళ రైతు పెళ్ళాం మడికాడికి వచ్చింది....." అని చెప్పినాయో లేదో తల్లి గువ్వలు గుండెలు బాదుకుంటా, "రైతు పెళ్ళాం వచ్చిందా, అవితే బిలాబిలామని లెయ్యండి. ఈ పంటకు మనకు రుణం తీరిపొయ్యింది. తెల్లారేకొందికి మనం వేరే పంట చూసుకోవాల. రైతు కూలోళ్లను నమ్మతాడు. రైతు పెండ్లాం సొంతంగా వుండే రెక్కల కష్టాన్ని నమ్మితింది. ఇంక లెయ్యండి...." అనేసి ఎగురుకుంటా లేచిపొయ్‌నాయంట. దీంతో ఈ కత అయిపొయ్యింది.

ఇంగొక కత. ఒకూళ్ళో చీమిడి ముక్కల సిద్దా రెడ్డంట. ఎత్తు పొండ్ల ఎల్లా రెడ్డంట. చీమిడి ముక్కలోడికి, ఎత్తు పొండ్లోడికి మాటిమాటికి జెరాలు వచ్చేయంట. జెరం రాంగానే చీమిడి ముక్కలోడు ఇడ్డెన్లుగా పాలుగా తాగేవోడంట. జెరం – చీమిడి ముక్కలోడు దగ్గర్నే వుంటే మనం ఇడ్డీలు తినచ్చు, పాలు తాగచ్చు, మంచాన పొనుకోవచ్చు అని ఎపుడూ ముక్కలోడ్నే అంటిపెట్టుకోని వుండేదంట. ఎల్లా రెడ్డి మాత్రం అన్ని మెతుకులు నోట్లో పోసుకుని పార బుజానేసుకోని మడికాడికొచ్చి ఎండలో వొళ్ళలిసి పొయ్యేటట్టు పని చేసేటోడంట. జెరం – ఎత్తు పండ్లోడి దగ్గర్నే వుంటే మనకు సౌక్రిమే లేదు. వీడు ఎండలో పనిజేసి మనల్ను చంపతాడు – అని బయపడి ముక్కలోడి దగ్గిరికి పొయ్యేదంట" అని చెప్పింది మాయమ్మ. అంతా చెప్పి "రైతూ ముక్కలోడూ ఎవురో తెలుసా?" అనడిగింది. "ఓ తెలుసు" అన్నా. "చెప్పా?" అనింది మాయమ్మ. "మా నాయన!" అని కరట్టుగా చెప్పినా.

మాయమ్మ పేడతట్టను చేతిలోకి తీసుకోని ఇంటికి ఎలబారతా వుంటే, "రైతు పెండ్లాము, ఎత్తు పొండ్లోడు నువ్వే! అవును!" అన్నా.

మాయమ్మ, "నేను చెప్పిన కతను రాబొయ్యే నీ పెళ్లాం దగ్గర చెప్పించుకోకుండా బతుకురా సినబ్బా!" అనింది.



# శ్రీరామ జయము కలుగ వలెను-

ఆరు సబ్జెక్టులకు ఆరు నోటు బుక్కులను మెయింటెయిను చెయ్యాలంటే దేముళ్ళు దిగి రావాల్సిందేనబ్బా. కనాగష్టం హిందీకి గూడా నోటు బుక్కు పెట్టకుంటే మా గూనయ్యోరు మా వీపుల్ను విమానం మోత మోగించేటోడు. మా అయ్యవార్ల సంబడం ఎట్టుండేదంటే కొసిన్లను ఎర్రింకీతో రాసి, జవాబుల్ను బులుగింకీతో రాయాలంట. మా పిలకాయలం తలకాయిల్నైతే కర్లింగులెత్తైత్తి శ్రద్ధగా దువ్వుకుంటాము గాని, ఈ దరిద్రపు నోట్సు మింద అంత జాగర్తలు ఎక్కడ చూపిద్దుము? నేను మా గూనయ్యోరు బొరోమని ఏడస్తాడు గదా అని దయదలిచి హిందీకి గూడా సిక్సీ పేజీ నోట్ బుక్కును పెట్టి రాసినాను. మా గూనయ్యోరు ఒక రోజు మా నోట్సులను తనికీ చేసేదానికి ఆరంబమై నేను కొసిన్లను రెడ్డింకీతో రాయలేదని గెంటసేపు తొడబెల్లం పెట్టినాడు. మా గూనయ్యోరు, పొండ్లు గిటక్కరుచుకోని, "ఏమిరా మిట్టూరోడా? అరగొండ బెల్లం కన్నా తియ్యంగా వుండాదా తొడబెల్లం?" అని యెక్కిరిస్తా యెక్కిరిస్తానే నన్ను ఇంసించేదానికి పెట్టుకున్నాడు. ఇదిగాదు అసలు కత.

ఆ మద్యానం లీజరులో నా దగ్గిరికి మునెమ్మ అనే అమ్మి వచ్చి, "సుబ్రమణీ! ఇంద, ఈ ఎర్రింకీ పేనా ఇంద!" అని నా చేతల్లో మాతా రైటరు పేనా పెట్టి, "ఇంక అడగన్లే, అది నీకే. నువ్వే పెట్టుకో!" అని ఇచ్చింది. నిజంగా ఈ మాటలు అప్పట్లో నాకు అరగొండ బెల్లం కన్నా తియ్యంగా వుండినాయి. దేముడు మన పక్కన వుండబట్టి ఇందీ అయ్యోరు మనల్ను తొడబెల్లం పెట్టినాడు

అనిపిచ్చింది. అంతకు ముందెప్పుడూ మునెమ్మతో నేను, నాతో మునెమ్మ బేటీ అవ్వలేదు. మమ్మల్ను ఈ వాటంతో కలిపినందుకు (మునెమ్మ ఏమోగాని) నేను మాత్రం మా గూనోడికి ఋణపడి పొయ్‌నాను. ఈశ్వర అల్లా తేరేనామ్ అనేసి ప్రార్థనలు కానిచ్చి నేను రంగంలోకి దిగిపొయ్‌నాను. (ఎనిమిదో తరగతిలో వుండంగానే నాగబూసనకు మేనమామతో పెండ్లయి పొయ్యింది. దానికి తోడు ఇస్కూలికి గూడ నిలిచిపొయ్యింది. నాగబూసన నా చేతికి పత్రిక ఇచ్చినపుడు నేను మూతిని మూరడు పొడుగు పెట్టినాను.)

మాకు మద్యానం వన్నవరు లీజరు వుంటాది గదా. ఆ లీజరులో ఒకనాడు మునెమ్మ మా అయిస్కూలుకు ఆనుకుని వుండే మాంగో తోపులో ఒంటిగా కూచ్చోని వుండింది. నాకు ఆ అమ్మిని కలవాలంటేనే బెదురు పుట్టింది. ఎందుకు పుట్టిందిరా అంటే నాకు కుడి కన్ను మెల్ల అయితే, ఆ అమ్మికి ఎడమ కన్ను మెల్ల. మమ్మల్నిద్దర్నీ నా క్లాసుమేట్లల్లో ఏ నాకొడుకు చూసినా అయస్కాంత సూత్రాలను తిరగేసి స్వజాతీయాలు ఆకర్షించుకొనును అని ఎగతాళి చేస్తారనే నా బయమంతా. ఈ ఒక్క బయంతోనే మేమిద్దరం ఇన్నినాళ్ళూ ఎదురుకెదురుగా నిలబడుకోను గూడ లేదు. పిచ్చి నాకొడుకులు, గుడ్డి నాకొడుకులు మా మునెమ్మను మెల్లకన్ను అనుకుంటారే గాని, ఆ అమ్మి మాత్రం భలే నాణ్యమైన మనిషి. ఆ అమ్మి నాణ్యమంతా ఆ అమ్మి పొడుగాటి జెడలోనే వుండాదని నేను ఎవుర్తోనైనా సరే సవాలేసి మాట్లాడగలను. ఆడదానికి యెంటికలే గదండ్రా నాణ్యం!

నేను ఆ అమ్మి దగ్గిరికి అడుగులో అడుగేసుకుంటా పొయ్‌నాను. ఇంక నిమిసంలో ఆ అమ్మి కండ్లు మూసి పెట్టి, "నేనెవుర్నో చెప్పుకో మునెమ్మా!" అని వుందును. మునెమ్మ టకీమని యెనిక్కి తిరగకుండానే, "నా యెనకాల వచ్చేది మిట్టూరు సుబ్రమణ్యం!" అనింది. చూసినారా ఎంత తెలివైందో!

నేను మాడి మాను మొదులు చేరి మునెమ్మ జడను పొడుగ్గా చూస్తా, "నిన్ను చూస్తే తెలుస్తా వుండాది – ఈ రోజు శుక్రోరం గదా! నువ్వు తలకు ఏమి చమురు పెడతావు మునెమ్మా! అబ్బబ్బ జడ వుండేది అంత పొడుగా! దాంతోగాని కొట్టినావంటే నా పని అంతే గదా!" అని మాట్లాడినాను. మునెమ్మ నాకల్లా ఎగజూసి, కాలవకు పోతా వుండిన యెడ్‌మేస్త్రి మిటాయోడ్ని చూపిచ్చి,

“అయ్యో! అయ్యో!” అని బెదిరిపొయ్యింది. నన్నూ మునెమ్మనూ ఒక తావున చూసిన మిటాయోడికి చచ్చి సున్నమైనా దవుటు రాదు. నేను మునెమ్మ జడపట్టి పెరకతా వుండినా, మా యెడ్మేస్త్రీ, “మిట్టూరోడు, మునెమ్మ కలిసి ఇంగ్లీషు నోట్సు రాస్తా వుండారు” అనుకుంటాడు. అంత అమాయకమైన మొకాన్నిచ్చినాడు నాకా బగమంతుడు.

ఇంక మేము క్లాసు రూములోకి పోబోతామనంగా మునెమ్మ, “సుబ్రమణీ! నువ్వు మొగోడైతే నాకు తెలవకుండా నా యెనకాన్నే వచ్చి కండ్లు మూసిపెట్టు. అట్ట గాని మూసి పెట్టినావంటే నీకు బ్లూ ఇంకీ పేనా ఇస్తా!” అనింది.

“చూద్దామా?” అన్నాను.

“చూద్దాములే పా” అనింది.

అప్పుట్నించి మునెమ్మ నన్ను లచ్చి కండ్లతో కాపలా కాస్తా వుంటే ఆ అమ్మిని నేను శతకోటి కండ్లతో కాపలా కాసేవాడ్ని. ఒక రోజు మునెమ్మ బావి దగ్గిర కేరీరు కడగతా వుంటే యెనకాన్నే పొయ్‌నా.

లాబం లా.

“సుబ్రమణ్యం!”

చెప్పేసింది.

మా పందెం పుణ్యమా అని ఇస్కూలికి రావాలంటే నాకు తలకాయ నెప్పి అనేది లేకుండా పొయ్యింది. ఈ పందెం అనేదే లేకుండా వుండుంటే ఆ పాఠాలు వినలేక నేను తొమ్మిదిలోనే ఇస్కూలికి నాం పెట్టేసి ఎనుములు మేపుకుంటా వుందును. (దేముడు దయదలిచి ఎనుములు మేపే వుండాల గాని ఇటుమంటి మునెమ్మలు వందలు గదా!)

ఒకరోజు డ్రిల్లు పీరిడ్డులో మేమంతా గ్రవుండులో వుండాము. మునెమ్మ, “తలకాయి నొప్పిగా వుండాది సా!” అని సాకు పెట్టేసి కానగ చెట్టు కింద చేరుకొనింది.

నేను యెనకాన్నే పొయ్‌నాను. మునెమ్మ రింగాట చూస్తా చూస్తా నా సంగతే మరిచి పొయ్యింది. ఆ రోజు గూడా శుక్రోరంగానే వుండాది. బారదు

పొడుగు జడ పొడి పొడిగా అల్లుకోనుండాది. మూరడు పొడుగు మల్లెపూలు పెట్టుకోనుండాది.

నేను మునెమ్మ యెనకాన చేరుకున్నాను. బులుగింకీ పేనా మనకు బహుమానం రాకుంటే మానె– అనేసి నేను పొడుగ్గా ముక్కుల గుండా గాలి పీల్చినాను. పూల వాసన జమాయిస్తా వుండాది. నేను గెలవాలనుకునిందో ఏమో నన్ను గమనించనట్టు యాక్సను జేస్తా వుండాది.

నేను ముక్కుల్తో ఎగ బీల్చినాను.

హాచ్.....శ్రీరామచంద్ర ప్రభో!

మళ్ళా–

హాచ్..... శ్రీరామ!

ఆ అందమైన మొకంది నాకల్లా తిరిగి, "ఎట్ట బతకబోతావురా సుబ్రమణీ! పూల వాసనకే ఇన్ని తుమ్ములా? ఇంద బులుగింకీ పేనా!" అని పేనా నా చేతికిచ్చి నన్ను మెచ్చుకునిందా దయగలిగిన తల్లి.



# మై నేమీజ్ లోభి నా కొడుకు

ఆ రోజు నిద్దర లేస్తానే నేను నక్క మొకం చూసినట్టుండాను. మాయమ్మ నా చేతిలో దగదగా మెరస్తా వుండే అద్ద రూపాయి బిళ్ళ పెట్టి, "ఈ రోజు చద్దికూడు తక్కవ పడిందిరా సినబ్బా! (ఏ రోజు చద్దికూడు ఎక్కవ పడిందే సినక్కా!) ఈ దినం టిపిను కేరీర్లోకి కూడును కట్టియ్యలేను గాని ఈ అద్ద రూపాయితో యెంగటాపరంలో నాష్టా చెయ్యి" అనింది. దీంతో నేను కోరిన కొండ మింద వాన కురిసినట్టయింది.

బంగారు నగలను చుట్టి పెట్టుకుంటారే నీలం రంగు కాతికం – అటుమంటి కాతికంలో నా అద్ద రూపాయి బిళ్ళను చుట్టుకోని బద్రంగా జేబీలో పెట్టుకున్నాను. సత్తు టిపను కేరీరు లేకుండా వొట్టి పుస్తకాలే పట్టుకోవడంతో నా చేతికి ఎక్కడలేని నాణ్యం వచ్చేసింది. నేనాపూట యెంగటాపరం అయిస్కూలికి టిపను కేరీరు తేలేదన్న సంగతి మా వూరి పిలకాయిలందరికీ చెనంలో తెలిసి పొయ్యింది. అందురూ నా చుట్టూ చేరి, "ఏమిరా, ఈ రోజు కేరీరు తేలేదు ఏమిరా?" అని అడిగే దానికి పెట్టుకున్నారు. నేను జాలి కలిగేటట్టు మొకం పెట్టి, "మాయమ్మకు నూగింజలు యేగేటట్టు జెరం కాస్తా వుండాదిరా. అందుకని రాత్రీ, తెల్లారీ పొయ్యి మంటెయ్య లేదు" అని అతికేటట్టు అపద్దం చెప్పినాను. అందురూ నాయట్టా దొంగ నా కొడుకులే వుందరు గదా. పాపం మా వాళ్లంతా, "దాందేముండాదిలే. మా అందర్తో గూడ తిందువు గాని" అని నాకు ధైర్యం చెప్పినారు. 'అమ్మ! యింక మనం ఢిల్లీతో పోట్లాడొచ్చు'

అని నేను నిమ్మళపడినా. ఎవురన్నా ఒక పూట అయిస్కూలికి అన్నం తేకుండా వుంటే మద్యానం పూట వాడ్ని పిలచక పోయి తలా అంత పెట్టేది మామూలే. అయినా కాలాలు దిన దినానికి మారి పోతా వుండాయి గదా! 'అన్నం తేనోడు పోస్తుండడం దర్మం' అనుకోని వాళ్ళంతా వాళ్ళ అన్నాలను వాళ్ళు తినడానికి పోతే మనం ఏమి చెయ్యాల అని నేను బయపడినాను గాని అదిప్పుడు తీరిపొయ్యింది.

నా కన్నా ఒక సమ్మచ్చరం జూనీరైన రాముడు అనేవాడు తెలివిలో నా జుట్టులో దూరి పొయ్యేటోడు. వాడు నా పక్కన నడస్తా నడస్తానే నా జేబీని చేత్తో టకీమని కొట్టి, అద్ద రూపాయి బిళ్ళ తగిలిందో ఏమో, "మీ యమ్మ నాష్టాకు డబ్బిచ్చిందా?" అనడిగినాడు. ఇప్పుడేమి జవాబు చెప్పాలరా మండేవోడా? దీంతో నా గుండికాయిలు నీళ్ళయి పొయ్‌నాయ్. "మా యమ్మ నాష్టాకు డబ్బిచ్చే రకమా? ఆ సంగతి మీకు తెల్దా?" అని అందామంటేనా ఈ నా కొడుకులు బిట్లు చెక్కు చేసే స్వాఁడు మాదిర్తో నన్ను చెక్కు జేసేస్తారు. అప్పుడన్నా మన బండారం బైట పడి పోతింది. నేను బగమంతుడి మింద బారం వేసేసి, మూతి నల్లంగా పెట్టుకోని, "ఆ, ఇచ్చింది ఒక అద్ద రూపాయి" అని చెప్పినా. నా నోటి మాట నోట్లో వుండగానే ఉమ్మడు, "ఆ అద్ద రూపాయికి బటానీలు వెయ్యించుకోని తలా పిడికిడు తినేద్దాములే" అని అనేసినాడు. అప్పటికి ఈ నా కొడుకులు నాకు చేసిన లాబమేమిరా ఈస్పరా పరమేస్పరా? దీనికన్నా జబర్దస్తీగా నాష్టా అంగిట్లోకి పొయ్ అయిదిడ్లీలు, లెక్కలేనంత సాంబారు తిని తాగచ్చు కదా కుర్జీమింద కూచ్చోని! నాకు శౌర్రిం వచ్చేసింది. ఇది మనకు దేముడు విసిరిన సవాలు. మద్యానం పూట వాళ్లదే తలా అంత తినెయ్యాల. ఆ అద్ద రూపాయిని మనంతట మనమే కర్జు పెట్టుకోవాల. అదీ మొగలాయితనం అనిపించింది.

ఆ రోజు మా వూరి పిలకాయిలవి బలే కూళ్ళు, బలే కూరలు. ఉమ్మడిది ఉడుక్కూడూ, కోడిగుడ్డు పులుసు. (వీడు ప్రాథమిక పాఠశాలలో ఆరోగ్య శాఖా మంత్రిగా వుండినాడు.) వీడు ఈ రోజు మద్యానం చచ్చినట్టు మనకు సగం కోడిగుడ్డు పంచి పెట్టాల్సిందే. దుర్యోధనుడి మాదిరిగా బాగం పెట్టకుండా బిగించుక్కూచ్చోవాలంటే కుదరదు గదా! ఇంక రాముడిది ఉల్లగెడ్డల కూర, కిష్టడిది ముల్లం గెడ్డలు. రాజగోపాలుడిదవితే గోసిముట్టి. వీళ్ళంతా కేరీరు

మూతతో మూతడు అన్నం పెట్టినా మన కడుపు కైలాసం అయిపోతింది. నాకు నోట్లో నీళ్లూరడం మొదులుబెట్నాయి. మేము మా అయిస్కూలికి నడస్తా నడస్తా వుంటే మద్య వంక ఒకటి వచ్చింది. పుస్తకాలన్నీ పక్కన బెట్టేసి మా వాళ్ళంతా కబడీ ఆటకు దిగినారు. అప్పుడనంగానే నాకు ఇంజనీరు ప్లాను ఒకటి తలకాయలోకి వచ్చి చేరుకొనింది. ఎపుడు కబడీ ఆడినా తెల్ల కాతికం తీసుకుని పాయింట్లు వేసే నేను ఆ రోజు కోర్టులోకి దిగి ఆడినాను. ఒక ఆటలో ఒకేసారి కూతకు పొయ్‌నాను. ఆ నాకొడుకులు నన్ను భారత్ లైను గూడా తొక్కనీకుండా పట్టేసినారు. అయిదారు మంది నాపైన పడిపోయినారు. నాక్కావాల్సిందిదే. ఇంజనీరు ప్లాను పూర్తయ్యింది నా తలకాయలో.

మద్యానం ఫోర్తు పీరిడ్డు కాంగానే మా ప్యూను మునికిష్టయ్య గెంటను వాయించి పారేసినాడు. నేను అక్కినేని నాగేస్ప్రరావు కన్నా ఒకాకు ఎక్కువ మేసి నాష్టా అంగిడికల్లా పరిగెత్తబొయ్‌నాను. ఉమ్మడు, రాముడు గస పోసుకుంటూ వచ్చి నన్ను పట్టుకోని, "సిగ్గు పడొద్దురా సుబ్రమణెమా! మాతో కూడా వచ్చి తిందువురా!" అని పెరుకులాడినారు. అయినా నేను, "వొద్దులే" అనేసి వాళ్ల పట్టు నుంచి విడిపించుకోబొయ్‌నట్టు యాక్సను చేసినాను. వాళ్లు నన్ను బలవంతంగా అన్నాలు తినే బావి దగ్గిరికి తీసుకొని పొయ్‌నారు.

రకానికొక కూడు.

రకానికొక కూర.

ఆ కూడు, కూర తింటా వుంటే కేళీ విలాసంగా వుండాది. ముక్కలాన తిన్నాను. పదిమంది పదింతలు పెడితే ఎంతయినట్టు!

అందరికన్నా యెనకాన మూత కడగడానికన్నట్టు పంపు దగ్గిరికి పొయ్‌నాను. అది పొద. ఎవురూ లేరు. జాగర్తగా అద్ద రూపాయి బిళ్ళను జిల్లేడు చెట్టులో పెట్టి, అది కనబడకుండా ఒక మట్టిపెళ్ళ పడేసినాను. మూత కడిగేసి అందర్లోకి వచ్చినాను.

నాకు అన్నాలు పెట్టిన నా కొడుకులందురూ (నాకు పాపం అంటకుండా వుండు గాక!) నన్ను అంగిడికి తీసుకు పొయ్‌నారు. జేబీలో చెయ్యి పెట్టి చూస్తే అద్ద రూపాయి బిళ్ళ లేదు! కావాల్సుంటే అందురూ చేతులు పెట్టి చెక్ చేసుకోండన్నాను. నన్ను నమ్మక అందురూ తనికీ చేసినారు.

నిజమే!

"మీతో కూడా అన్నానికి రాకుండా వుంటే నా గతి ఏమై వుండేది!" అన్నాను నమ్మకం కలిగేటట్టు.

"వంకలో కబడీ ఆడిందే తప్పు! అక్కడ పొయ్యింది బిళ్ళ" అని నేనే అన్నాను.

సరే, లీజరులో అందరూ హోం వర్కుల్లో మునిగి పొయ్యుండారు. బావి దగ్గరికి వచ్చి బిళ్ళనెత్తుకోని అంగిట్లేకి పొయ్‌నాను. దండిగా తిని వుండాను గదా! తూగు వస్తా వుండాది. అందుకని ఒక స్ట్రాంగు టీ ఒక బన్ను రొట్టి అద్దుకుని తినేసినాను.

(తిని తాగేస్తే సరిపోయిందంట్రా సుబ్బా!)



# గుచ్చు గుచ్చు పుల్లా - దాంకో పుల్లా..!

**ఆ**ర్నెల్ల పరీక్షల లివ్వులంటే నాకంత కుశాల ఏమిటికి? అప్పుడు మా వూరికి పరంటగా వుండే తెల్ల రాళ్ళ మిట్ట, నూగు జేను మిట్ట, అడ్డొంక, కోనలో బాయి, అండాసామి గెండి - యిదంతా పచ్చికి పడి పొయ్యుంటాది, అక్కడికి బొయ్ మాకు వుండే వొక్కగానొక ఎనుమును రీతిగా మేపు కుందామనా? అక్కడికి బొయ్ ఆడోళ్ళతో గూడా ఆ యాటా ఈ యాటా ఆడతా కోతి మాదిర్తో ఎగర్దామని!

నాకు ఆర్నెల్ల పరీక్షల లివ్వులు - తిరమల కొండతో సమానం. చద్ది తాగేసి ఎనుమును తోలక పోతానా, అంతే మళ్ళ దాని మొకం నేను జూడను. అక్కడికి మా మిట్టూరోళ్ళే గాక, దిగూరోళ్ళూ, గంగిరెడ్డి పల్లోళ్లు, రామాపర మోళ్ళు గొడ్లను తోలుకోని జాతికొకరం చేరిపోతాం.

అక్కడికి పోంగానే మొగోళ్ళంతా - మొగోళ్ళా పాడా - నా ఈడోళ్ళు, అంతా ఒకటై పోయి జిల్లంగోడి, కబాడీ ఆడతా వుంటారు. నేను నా జాతీజెల్మాన మొగోళ్ళతో కలిసే పని బెట్టుకోను. నేను నైసు నైసుగా ఆడ పిలకాయల్తో గూడా చేరిపోతా వుంటే, ఏ అమ్మో ఒకమ్మి తమాసకు, "ఒరే, సినబ్బా. నీకు పొగులు పొద్దలగూకు మా ఆడ పిలకాయిల తోకల కాడ ఏమి పని? మొగోళ్ళతో కలుసుకోని, మొగోడు మాదిర్తో వుండి, మొగోళ్ళ ఆటలు ఆడుబో ఏమి?" అని కబడీ ఆడే మొగోళ్ళ కల్లా చెయ్యి చూపించేది. ఆ యమ్మి గూడా మాట వరసకు ఆ మాట అనిందే గాని, అది పచ్చనాకు

సత్తెంతో అన్నమాట గాదు. ఆ యమ్మి మాట పకారం నేను మొగోళ్ళతో కలిసినానే అనుకో, ఆ యమ్మే ఎవురికీ తెలవకుండా నా చెయ్యి పట్టి పెరికేసి, "నీకు వోళ్ళతో ఏం పన్లే, రా, సినబ్బా! మనం దూరంగా పొయ్ ఆట్లాడుకుందారి" అని పిలిసేనును. ఆ యమ్మి ముదిగారంగా అనిన ఆ మాటకు బదులుగా నేను గూడా తమాస తమాసగానే, "ఏమ్మే, ఆ కబడీ ఆట ఎటుమంటిదో నీకు తెలవదా? నీ మాట పకారం నేను కబడీ ఆటే ఆడతాననుకో. నేను కూతకు పొయ్నపుడు ఎవురన్నా కుమ్మితే – మళ్ళ నీ గతెట్ట!!" అని ఎగతాళికి పొయ్యేవాడ్ని. ఆ మాటలో వుండే అర్తాన్ని తెలుసుకొనేసి ఆ యమ్మి నా మింద పడి పడి అర గెంట సేపు నవ్వి, "రారా సినబ్బా, నువ్వు మా ఆడ పిలకాయలతో గూడా కబడీ ఆడుదువు గాని–" అని చెయ్యి బట్టి పెరికేది.

మా వూళ్ళో ఎంత మంది ఆడ పిలకాయలుంటారో అంత మందితో గూడా నేను పొయ్, కబడీకి రడీ అయ్యేవాడ్ని. పుస్పావతిని, జయను, జమున్ను, బూలోక రంబను, ఎంతమంది వుంటే అంతమందినీ ఒక పక్కనబెట్టి, నేనొకడ్నే ఒక పక్కలో వుండేవాడ్ని. కబడీ ఆట ఎంతో యెచ్చిరికతో ఆడాల గదా. నేను మాత్రం బలే సోంబేరితనంతో ఆడేవాడ్ని. నేను కూతకు బోయి, దొంగ గొడ్డు ఈ పొద్దో రేపో కలుపు తియ్యాల్సిన మడిలో, సపాయిగా పొయ్, పడిపొయ్నట్టుగా – నేను పొయ్ వాళ్ళలో పడిపొయ్యేవాడ్ని. వాళ్ళందరూ గూడా నా కాళ్ళను, చేతల్ను పట్టేసి నా వొక్కడి మిందా పడిపొయ్యే వాళ్ళు. నేను మాత్రం 'కబాడీ కబాడీ' అని ఎంత సేపందును? అందుకని వూపిరి పీల్చుకునే దానికి వీలుగా వుండే – 'అత్తాకు, ఆరాకు, సన్న సన్న బీరాకు'– అని గెంటసేపు కూత బెట్టేవాడ్ని. ఈ కూతను ఎంత సేపైనా అనుకోవచ్చు. ఈ వాటంతో రెండు మూడు గెంటల సేపు కబడిక్ ఆట ఆడి కైలాసం చూసుకొనే వాడ్ని. ఎంత సేపని ఒకే ఆట ఆడుదుం? మళ్ళ కాసేపు తాలినాక ఇల్లోళ్ళ జయ చేతినొకదాన్ని నా చేతల్లోకి దీసుకొని, నా చెయ్యి నొకదాన్ని ఆయమ్మి చేతల్లో బెట్టి, మా ఇద్దరం ఆ పొరంబోకు బూముల్లో పొరంబోకులమై పోయి, "నీ మొగుడూ నా మొగుడూ జోడు, నీ కయ్యా నా కయ్యా బీడు"– అని నేను గూడా ఆ కొంచేపూ ఆడదాన్నై పొయ్యేవాడ్ని. ఆ యాటల్లో పాటల్లో నేనెంత యిచ్చుకొనేవాడ్నంటే – నా ఇచ్చు, అక్కడికి

కనిపించే పెద కాలోజీల బిల్డింగుల మింద గాలిపటమై ఎగర్తా వుండేది. (ఆ పొరంబోకు బూముల్లో నుంచి వుత్తరంగా చూస్తే తిరపతి యూనోర్శిటీ యావత్తూ కనిపించేదిలే.)

ఈ మాదిర్తో ఎగిరెగిరి వొళ్ళలిసి పోతిందా, మళ్ళ అండా సామి గెండిని చేరుకొనే వాళ్ళం. ఆ అండాసామి గెండిలో కొంచేపు మునగదామని ఒకరి మింద ఒకరం పడతా గెండి కాడ చేరితే నన్నా ఆడపిలకాయలందురూ యేంచుకొని తినేసే వాళ్ళు. అండాసామి గెండిని దిగితే దుర్గ సముద్రం అనే వూరు వచ్చేది. గొడ్లన్నీ గెండి దిగేసి ఆ వూళ్ళోకి పోతాయేమో అని, ఆ వొళ్ళు బలిసిన ఆడవి నాతో, "ఒరే సినబ్బా, మా ఎనుములు గెండి దిగినాయేమో పొయ్ చూసేసి రాబోరా!" అని నాకే పని చెప్పేవి. ఆ ఆడ పిలకాయలందురూ, వాళ్ళ జాతీ జెల్మాన వాళ్ళ ఎనుముల్ను వాళ్లు చూసుకొనే వాళ్ళు కారు. వాళ్ళందరికీ నేనొక్కడ్నే అధవ. ఇంక నేను వాళ్ళతో తగలాటం పెట్టుకోకుండా, ఆ ముండ్లన్నీ కాళ్ళల్లో యించుకొని, అదంతా తిరిగి వాళ్ళ ఎనుముల్నన్నిట్నీ నేనే చూసుకొనే వాడ్ని. 'అయిస్కూల్లో ఆరో కలాసు చదవతా, ఈ ఎనుముల్ను చూసే బాద తప్పలేదేమిరా బగమంతుడా!' అని ఆ కొంచేపు నిష్టూర పొయ్యేవాడ్ని. ఈ బాద గూడా – ఆడ పిలకాయలందురూ పావళ్ళను గోచిపాతలుగా పెట్టి, గెండిలో దిగే దాకనే. వాళ్ళు గోచిపాతలు పెట్టంగానే నేను రంకెలేస్తా నా నిక్కరా చొక్కాయ యిప్పేసి, తలకోనలో పడేటట్టుగా యిసిరేసి 'గోయిందా గోయిందా!' అని వాళ్ళతో గూడా చెరువులోకి నడిచే వాడ్ని. చెప్పద్దా, నేను మా బూలోకరంబ కన్నా, జమున కన్నా, పుస్పావతి కన్నా, జయ కన్నా పిడికిడేమి కరమ్మ, జానడు పొట్టి. మన మొగోళ్ళం రోజుకు రాగ్గింజ అంత పొడుగు పెరిగితే, ఆడది రోజుకు వడ్ల గింజంత పొడుగు పెరిగి పోతాదనే మాట అపద్దమా, ఏమి?

జయతో గూడనో, పుష్పావతితో గూడనో నాకు గెమనం లేదు. ఆ యమ్మి చెరువులో ఎంత దూరం పోతే నేనూ అంతే దూరం కేళీ యిలాసంగా పూడిస్తిని. అప్పుటి నా కుశాల అంతా యింతా కాదు. నా మెడ మునిగి పోయింది. ఆ ఆడోళ్ళ ఎద గూడా నీళ్ళల్లో తడవలా. నేను బుద్ధి గలిగినోడ్నయితే అప్పుడే నేను యెనక్కి తిరిగి గెడ్డ ఎక్కొద్దా! పొయ్‌నాను

పొయ్‌నాను, వాళ్ళ యెనకాన్నే పొయ్‌నాను. సాములాలా, వక్క కొరికినంత సేపుట్లో నా ముక్కుల్లోకి నీళ్ళు పోవాటం జరిగి పొయ్‌నాయి. అప్పుడన్నా నేను యెనక్కి మళ్ళుండొద్దా! ఆ యాడోళ్ళతో, “ఒమే! గుచ్చు గుచ్చు పుల్ల దాంకో పుల్ల ఆట ఆడదామా – ఈ అండాసామి గెండిలో – ” అని ఒక్కడుగు ముందుకేసినాను. నా కాళ్లు లేచిపొయ్ నేను నీళ్ళల్లో మునిగిపొయ్, కండ్లు తేలేసేసి బేర్ బేర్ మనేసినాను. ఆ పున్నాత్ముంరాళ్ళు నన్ను ఎట్టదా లాగి గెడ్డన చేర్చినారో ఆడ మండే వోడికి తెలవాల! నాకు పొయ్‌న వూపిరి మళ్ళా వచ్చింది.

నాకు ప్రాణాల మింద బయమూ బక్తీ వుంటే ఆ మరసనాడు గూడా ఆడపిలకాయలు గోచిపాతలు పెట్టీ పెట్టక ముందే నేను నా నిక్కరా, చొక్కాయి పెరికేసి నీళ్ళల్లోకి రండి అని వాళ్ళను పిలుద్దునా!



# మా నటరాజా సర్వీసులో-

మా యెంగటాపరం అయిస్కూలు పిలకాయిల కన్నా అలిపిరి కాడ కోతులే సుమారు. (హవ్వ! అలిపిరి కాడ కోతుల సంగతి తెలవదా, ఎప్పుడన్నా మా తిరమల కొండకు చద్దికూడు మూటెత్తుకోని నడిచి పొండి.)

పది గెంటలకు ఇస్కూలయితే- మా వూరు నుంచి తెల్లారి ఎనిమిది గంటలకే ఎలబారే వాళ్ళం. మూడు మైళ్ళు నడిచే దానికి రెండు గంటలా? మా మానాన మేము తలొంచుకోని దోవ నడిచే వాళ్ళమయితే మమ్మల్ని టీనేజీలో వుండే ఇస్కూలు పిలకాయిలమని ఎందుకంటారు?

రంగారెడ్డి మిట్టల నుంచి నడవలూరు దాకా బీడే వుండాది. ఆ బీడులో టెలిపోను స్తంభాలు! రంగారెడ్డి మిట్టల కాడికి రాంగానే నేను నా పుస్తకాలను, కేరీరును కిందబెట్టి, నాలుగు రాళ్ళను ఏరుకొని చేతిలో బెట్టుకునే వాడ్ని.

గురి ఇసయంలో మనం కిరీటికి మేనల్లుళ్ళం. మా పిలకాయిలందురూ పుస్తకాలు, కేరీర్లు పక్కనబెట్టి నా చుట్టూ చేరి,

'గుడ్డి కన్నులో

గూటం కొట్టి

యేప మానులో

దీపం పెట్టి

యెగర గొట్టరా

గుడ్డోడా!" అని కోరస్‌గా పాడతా వుంటే, మనం మెల్లకన్నుతో గురి చూసి రాయి ఇసిరే వాళ్ళం. టెలిపోను స్తంభంలో పింగాణీ గుబ్బనుంచి వైర్లు లాగి వుంటారు గదా! ఆ పింగాణి గుబ్బ మన దెబ్బకు పిచ్చుల్ పిచ్చుల్!

పాపం! ఈ టెలిఫోన్ల డిపార్టుమెంటులో పని చేసే వాళ్ళు నా దెబ్బలకు (రిపేరు చెయ్యలేక) చచ్చి సున్నమవతా వుండే వాళ్ళు. నా సహపాటి విద్యార్థినీ విద్యార్థులు నా మెల్లకంటికి వుండే గురిని చూసి కుళ్ళుకొని చచ్చి, నన్ను, "గుడ్డోడా! గుడ్డోడా!" అని పిలిచి సతాయిస్తా వుండేవాళ్లు.

ఈ రంగారెడ్డి మిట్టల్లో మేం ఈ ఘనకార్నిం చేసేసి నడవలూరు చేరే వాళ్ళం. మా దోవకు నడవలూరే అడ్డం వచ్చేది గాని, ఆ వూరోళ్ళ బూములు అడ్డం వచ్చేవి గావు. కాబట్టి వాళ్ళు బతికి పొయ్‌నారు.

నడవలూరు దాటితే చలంగారి పల్లి. ఈ ముండమోపి వూరికి ఈ పేరే గాక పెద్దినాయుడి ఖండ్రిగ అని యింగొక పేరు గూడా. పైర్లు భలే పండించడంలో ఈ వూరికి మంచిపేరు! వీళ్ళ పైర్లగుండా మా అయిస్కూలు పిలకాయల దోవ ఎట్ల నడిచేదో పోతనామాత్యుడై వుంటే పద్యాలు పద్యాలుగా రాసి అదరగొట్టేసుండును. ఒక దఫా చలంగారి పల్లి రైతులందరూ వంకవార కయ్యల్లో చెనిక్కాయల పంట యేసినారు. అది పూతకు వచ్చీ రాంగానే మా కండ్లు దాని మింద పడిపొయినాయ్. మేము ఎంత మంది పిలకాయిలం వుంటామో అంత మందిమీ ఆ శెనిగి తోటలోకి వొంగి తలా ఒక్కచెట్టు పెరికి, 'వూడలే దిగలేదు గదండ్రా' అనే వాళ్ళం కోరస్‌గా. మేము ఈ మాదిర్తో పెరికెయ్యగా మిగిలిన చెట్లు నెలా ఒకటిన్నర నెల తరువాత పిందిలు దించింది. మళ్ళా మేమంతా ఆ తోట మింద పడి, తలా ఒక చెట్టు పెరికి, "యింక పదైదు దినాలు ఓర్చుకుంటే తినేదానికి పక్కంగా వుంటాయి." అనుకున్నాము. మేము ఈ మాదిర్తో పెరకడం చూసిన రైతు ఒక కానగ మండను పెరుక్కుని, "నా కొడకలాలా! లేత పైరును మీ నోళ్లల్లో పెట్టుకొని నీళ్ళు పోసుకుంటా వుండారు గదండ్రా! పైరును ఈ మాదిర్తో నాశినం చేస్తా వుండారు. మీకు మంచి కాలాలు వస్తాయండ్రా లమిడీ కొడకలాలా!" అని అంటా మా పైకి వచ్చేవాడు. మేం పశువులం కాము గదా. నాలుగెద్దులు, అడవిలో ఒక పులీ

కత చదువుకున్న వాళ్ళం కాబట్టి మా పిలకాయిలం అందరం పిరికి పందల మాదిరిగా పరుగులెత్తకుండా ఐకమత్యంతో వుండినాం. మేమంతా కలిసి, "మేం గూడా పైర్లు పండించే వాళ్ళమే పెద్దాయనా! మా వూళ్ళో శెనిగి తోట కాయలు వూరిపొయ్యింది. ఈ వూళ్ళో పైర్లు ఎట్టుండాయో అని ఒకొకరం ఒక చెట్టు పెరికినాం. ఇదే తప్పయితే కోరట కేసెయ్" అని లా పయ్యింటు తీసినాం.

ఆ శెనిగి తోట విరగ పండిపొయ్యిందని మా పిలకాయిలం సేద్యాలు చేసి అలిసి పొయ్న వాళ్ళ మాదిరిగా చానా సంతోష పడినాం. ఏ సందులోనో ఒక సందులో పెరుక్కుని తింటానే వుండాం. కంటికి నేల కనపడగూడని పైరు మా పుణ్యాన తెరపలు తెరపలుగా అయిపొయ్యింది. ఆ రైతు కడుపు కాల్తే మాకేమి గాని, మేము మా ఇండ్ల కాడనుంచి బెల్లపు ముక్కలు తెచ్చుకోని నంజుకొని నంజుకొని తింటా వుండాం. ఆయన మా బాద పడలేక తెల్లారి మేము ఇస్కూలికి పొయ్యేటపుడు సందేళ ఇండ్లకు పొయ్యేటపుడు శెనిగితోట కాడ కాపు యేసేటోడు. మాకంతా చేతులు కట్టేసినట్టయి పోయి ఆయన దగ్గిరికి రాంగానే అందరమూ,

"బంకోడు బంకోడు భం

బంకోడు బంకోడు భం"

అని మాకు మేమే సంగీతం కట్టుకోని ఆయన్ను ఏడిపించే వాళ్ళం.

మా దెబ్బకు గోలుకొండే అబ్బా! అంటిందనుకో. యింక ఆ రైతు ఎంత! ఆ మీసాల రైతు మా దెబ్బకు బయపడి పోయి శెనిగి తోట యెయ్యడం మానేసి వరిమడి చేసినాడు. వరిమడిని కలుపు తీసేదాకా దాంట్లో మేము యేలు కూడా పెట్టలేక పోయినాం. అది పాలెన్ను పోంగానే మేమంతా గువ్వ పిల్లలమై పోయి ఒక్కొక్క ఎన్నే పెరికి పెరికి పాల గింజలను కొరికి ఆ పాలను చప్పరించే వాళ్ళం. ఎన్ను కాయ వాలిపొయ్ కంకులేసింది. ఇంక జూడండి తలా ఒక ఎన్ను పెరుక్కోని వడ్ల గింజల్ని కొరకతా పొయ్యే వాళ్లం. అందురూ దీంతోనే సరిపెట్టుకుంటే నేను లోభి నాకొడుకుని గావడం వల్ల నాలుగైదు కంకుల్ని నిక్కర జేబులో యేసుకోని ఇంటికి వచ్చి మా కోడిపెట్ట ముందర

దుసి పోస్తే మా కోడి పండగ జేసుకొనేది. మాయమ్మ నా పనిని జూసి, "నీయంత ప్రవేజకుడు, యోగ్గుడు ఎవురుంటార్రా!" అని కుశాల పడేది.

మేము ఇన్ని పనులు చేసినా మమ్మల్ని నాలుగు దొబ్బులు దొబ్బని ఆ రైతు వొట్టి చప్పిడి నా కొడుకని తెలిసిపొయ్యింది. మేమంతా జబర్దస్తీగా వడ్ల గింజల్ని కొరుక్కుంటా ఇస్కూలికి పోతా వుంటే ఆయన మా అందరికల్లా గుర్రుమని చూసినాడు. పిలకాయిలందరం నవ్వేసినాము. నాకు పాపం పండిపోబట్టి, నేను నవ్వుతో వూరుకోకుండా,

"మీసాలు రొయ్యకు లేవంట్రా

ఒరే సచ్చినోడ!" అని సినిమా పాట పాడేసినాను.

ఆ మీసాల రైతుకు వచ్చిందండీ బారడు పొడుగు కోపం! బిడ్ల గల్లోడో ఏమో నన్ను కొట్టలేక నేరుగా మా అయిస్కూలికి మా యెనకాన్నే వచ్చినాడు.

అయిదు నిమిసాల తరువాత మా యెడ్‌మేస్త్రీ మిటాయోడు నన్ను పిలిచి, "ఎంత పొడుగురా నాయాలా నీకు మీసాలు? జానడు లేవు. రింగు లీడరు అయిపొయ్‌నావంట్రా నాయాలా!" అని నాకు పేము బెత్తంతో పూజ జరిపిచ్చినాడు.

నేను మరసనాడే మీసాలాయన మిందికి పోటీకి పొయ్, మా ఇంటికాడ గడ్డాలు మీసాలు బోడిగా షేవింగు జేసుకోని వచ్చినాను.

పిలకాయిలందురూ నవ్వితే, "మనం మీసాల రైతుకన్నా పొడుగ్గా మీసాలు పెంచాల, మీసాలు తొందరగా రావాలంటే ముందు వాటిని గొరగాల, అదీ నా అయిడీ!" అని చెప్పినాను.

మరుసట్రోజు ముగ్గురు నలుగురు మీసాలు గొరిగేసినారు. నిజంగానే మాకు పదో తరగతిలోనే మీసం వచ్చేసింది.



# మా త్రిమ్మోడి కడుపులో గలాంబులాం

మా త్రిమ్మోడ్ని గురిచ్చి కజ్జెప్పుకుంటే నాక్కండ్లుండవ్.

మా క్లాస్‌మేట్లల్లో బాగా గెమనం పెట్టుకోదగిన వాడు మా త్రిమ్మోడు.

మా త్రిమ్ము నా కొడుక్కి బడాయి బలే జాస్తి.

మద్యానం మద్యానం ఇస్కూలు ఇడిచి పెట్టంగానే మేమంతా బాయి దగ్గిరికి పొయ్ అన్నాలు తింటాం గదా!

మా త్రిమ్మోడు కానగ చెట్టు నీడన చేరుకోని, కేరీరు మూత యిప్పి, దాంట్లో వుండే పెరుగును గుట గుటా తాగేసి, "నాకిప్పుడు త్రిమ్ముగా వుండాది!" అనేటోడు. ఈ మాదిర్తో ఒక రోజూ రెంద్రోజులే గాదు.

దినామూ అంతే.

రోజూ కేరీరు నిండికి పెరుగు పోసుకోని రావడం, మద్యానం పూట కండ్లు మూస్కోని పాయిసం తాగినట్టు తాగడం, "నా కడుపులో త్రిమ్ముగా వుండాది!" అని పెగ్గికి పోవడం!

"మీరు మద్యానం మద్యానం తినే కూటి మెతుకుల్లో ఏముండాదిరా? చప్పిడి మెతుకుల్లో విటమిన్లా పాడా? శక్తే వుండదు. పెరుగులో అవితే

ఎ.బి.సి.డి. ఎక్స్. వై.జడ్ అన్ని విటమిన్లూ వుంటాయి!” అని మీసాలు తిప్పేటోడు మా త్రిమ్ము నాకొడుకు.

పెరుగును ఇంగిలిపీసులో ‘కరుడు’ అనంటారంట. ఆ మాటను లచ్చి సార్లు చెప్పుండాడు మా తావున.

“అన్నాన్ని గూడా మీల్స్ అని ఇంగ్లీషులో అంటార్లే వాయ్, నీ పెరుక్కే గాదు ఇంగ్లీసులో పేరుండేది!” అని మా పిలకాయిలంతా తగులుకునే వాళ్ళం.

అయినా వాడు పొగులు పొద్దలగూకు అన్నాన్ని చులకన జేసి, పెరుగుకే పట్టం గట్టేవాడు.

మా త్రిమ్మోడిది కొత్తఖండ్రిగ అనుకుంటా. ఆ వూరోడొకొడు త్రిమ్మోడి బండారం బైటేసినాడు.


“త్రిమ్మోడోళ్ళకు నాలుగు ఎనుములుండాయి. అవి ఒగటి మార్చి ఒగటి ఎప్పుడూ ఈనతానే వుంటాయి. ఇంట్లో ఎప్పుడూ పాలూ పెరుగే. వాళ్ల అమ్మ కేరీర్లోకి అన్నం చెయ్యనే చెయ్యదు. ఈ పెరుగును నేను తాగలేను అని త్రిమ్మోడిది ఒకటే రోదన” అని కొత్తఖండ్రిగ పిలగోడు కతంతా చెప్పేసినాడు.

మేము త్రిమ్మోడ్ని ‘దినామూ పెరుగేనంట్రా’ అని వాడ్ని చంపుకొని తింటామని బయపడి వాడే మాటి మాటికీ ‘త్రిమ్ము, త్రిమ్ము!’ అని తిరుక్కున్నాడు.

ఒక రోజు త్రిమ్మోడు మాడి తోపులో నా దగ్గిర బైటపడి పొయ్‌నాడు. మద్యానం అన్నాలు తిని గెంటయినా కాకనే, “ఒరే సుబ్బా! నాకెందుకో కడుపులో గలాం బులాం అని తిప్పతా వుంటింది. దినామూ యింతేరా” అని అన్నాడు.

నేనిదే సందని, “నియ్యమ్మా ముండ నాయాలా! పెరుగుతో కూడా అన్నం కూడా తినురా! గలాం బులాం తగ్గితింది!” అని చెప్పేసినాను.

“మా వూరికొచ్చి ఈ మాట మాయమ్మతో చెప్పుదువు రారా!”



# మా సోసీలయ్యోరి సాంఘిక శాస్త్రం

మా సోసీలయ్యోరు ఏమన్నా నెల తక్కువగా పుట్నాడా? అయ్యోర్లందరి మిందా కతల్జెప్పి సోసీలయ్యోరి కత చెప్పకుంటే నేను వలపచ్చికం చూపించినట్టు గదా! మా సోసీలయ్యోరంటే మా అందరికీ బలే యిది. ఆయన మా పిలకాయిల్లో పిలకాయే గాని అయ్యోర్లల్లో అయ్యోరు గాదు. 'మనం బియ్యే చదివినాం. వీళ్ళు పదో తరగతి చదవతా వుండారు. అందుకని వీళ్ళకు సాంఘిక శాస్త్రం నేర్పిద్దాం' అనే బడాయి మా సోసీలయ్యోరికి ఏ మాత్రం వుండేది గాదు. మా పదో తరగతి సాంఘిక శాస్త్రాన్ని మా సోసీలయ్యోరు ఎడం చేత్తో గూడా తాకుండడు.

పదో తరగతి పరీచ్చలు యింక రెండు నెలల్లో మొదలవుతాయనంగా మా సోసీలయ్యోరు బయపడి, "ఏమంద్రా ముండ నాయాండ్లాలా! సిలబస్సు కంపిలీట్టు గాలేదు. భౌగోళిక శాస్త్రాన్ని చెప్పుకుందామా?" అని వరి పంటకు అనుకూల పరిస్తితులు, అది పండు ప్రదేశాలు చెప్పనారంబం చెయ్యబొయ్యి నాడు. పెతర నా కొడుకులమైన మేము ఆయన నోట్లో మాట నోట్లో వుండగానే, "సాసా! ఇది 1947 గాదు 1975. మాకు జుట్లు గాదు వుండేది క్రాపులు. సాంఘిక శాస్త్రాన్ని గూడా చదవాల్నా? మేము గ్యాసు కొట్టి పాసయిపోతాం లే సా. మీరు పాటం చెప్పద్దు పిలీస్!" అని అడుక్కున్నాం. మా సోసీలయ్యోరు దెబ్బతో పాటం నిలిపేసినాడు.

దీంతో మా అందర్తో పాటు మా పంది మొకమోడికీ బలే కుశాల అయిపొయ్యింది. మా సోసీలయ్యోరు నన్ను, "ఒరే గుడ్డోడా! స్టాండప్!"

అని పైకి లేపబొయ్‌నాడు. ఆయన లెయ్యమన్నంత మాత్రాన్నే నేను లేచి నిలబడితే చులకనయి పోతామని కూచ్చోనే, "ఏం సా? ఏమీ? చెప్పు. కూచ్చోనే వుంటే గూడా నువ్వు చెప్పేది వినిపిస్తిందిలే చెప్పు." అన్నాను. కానగ బెత్తం అంటే అర్తం తెలవని మా పుణ్యాత్ముడు, "అవున్లే. అనావశింగా లేచేదెందుకు గాని? రెండో ప్రపంచ యుద్ధం గురించి గ్యాస్ కొట్టు. సాంఘిక శాస్త్రంలో మీ ప్రతాపం ఏ మాత్రమో వింటాను" అనన్నాడు. నేను కండ్లు మూసుకోని గడగడా చెప్పబొయ్‌నాను. సోసీలయ్యోరు నా పక్కకు వచ్చి నిలబడుకోని వినడం మొదలు పెట్టినాడు. నేను చెప్పడం మొదులు బెట్టినాను.

"రెండో ప్రపంచ యుద్ధం ఒక దేశానికీ మరికొన్ని దేశాలకీ మధ్యన జరిగింది. అది జరగతా వుండినప్పుడు మనం ఎవ్వరమూ పుట్టిగూడా వుండము. ఆ యుద్ధం మన తాతల కాలం నాటిది. ఇంటి కాడ నిమ్మళంగా వుండక దేశాలు తిరిగే చియాంగ్ చుంగ్ వంటి చరిత్రకారులు ఆ యుద్ధ వివరాలను పుస్తకాలలోకి ఎక్కించినారు. ఆ యుద్ధంలో కట్టిలు, కత్తులతో పాటు ఫిరంగులు, తుపాకులను కూడా రాజులు ప్రయోగించినారు. యుద్ధంలో ఇరుపక్షాల వారు వేలాది మంది మరణించారు. అందులో పురుషులు, స్త్రీలు గలరు. అదంతా కడుపు మంట. రెండో ప్రపంచ యుద్ధాన్ని తలుచుకుంటేనే కడుపు అట్లనే రగిలి పోతుంది. ప్చ్, ఈ చల్లని పూట ఆ చావులన్నీ ఎందుకులే" అని అయిదు మార్కుల కొశిను గదా 25 పంక్తుల దాకా జవాబు చెప్పినాను. నేను అంతా చెప్పేసి, "ఏం అయ్యోరా! నేనేమన్నా పొరబాటు చెప్పినానా!" అనడిగినాను. మా అయ్యోరు సంతోషంతో ఈలేసి, "నేనైతే ఫైవ్ బై ఫైవ్ రా. అయిదుకు అయిదు మార్కులు. సెభాష్!" అనేసినాడు.

పరీచ్చలు దగ్గిరికి వచ్చేస్తా వుండాయి గదా అని మా అయ్యోరు నిజ్జంగానే బయపడి పొయ్, రోశమ్మను పైకి లేపి, 'వరిపైరు ఎక్కడెక్కడ పండుతుంది? దాని అనుకూల పరిస్థితులేవి?' అనడిగేసినాడు. ఆడబిడ్డ గదా అణకవగా వుండక పోతే పెండ్లీ పెటాకులు లేవని బయపడి పొయ్ ఆయమ్మి పైకిలేచి, జడ ముందరేసుకుని అచ్చులు పచ్చులు ఆలకించేటట్టుగా, "వరిపైరు పండించడానికి రైతులకు ముందు కావాల్సింది కయ్య. అది పారడానికి బావిలో నీళ్ళు చాలా ముఖ్యము. ఇంగ్లీషు ఎరువులు వేసేకన్నా మేక,

గొర్రెల పింటికలు, ఆవు, ఎనుము, ఎద్దుల పేడ చాలా అవసరం. ఇంత కన్నా అనుకూల పరిస్థితులు అక్కర లేదు. ఇకపోతే అవి పండు ప్రదేశాలు వరుసగా – నడవలూరు, నెన్నూరు, పెద్ది నాయుడి ఖంఁడ్రిగ, పుల్లమనాయుడి ఖంఁడ్రిగ, కమ్మపల్లె, వీరప్ప నాయుడి ఖంఁడ్రిగ, చల్లావారిపల్లె, సొరకాయిల పాళెం, అప్లాయి గుంట, ఎనుముల పాళెం,....” ఆపెయ్, ఆపెయ్ బ్రమ్మాండం, అని మా బుద్ధుడు నెత్తిన నోరు పెట్టుకోని అరిచినా మా రోశమ్మ వినలేదు.

మా తిరపతి అయ్యోరు క్లాసులో ఏనుగునెక్కి, “సెభాష్ రా! అద్భుతం! సాంఘిక శాస్త్రంలో మీకు దిగులే లేదు. నా పేరు నిలబెట్టినారు. మీ అందరూ సాంఘీకలో సెన్ పర్సెంటు. ఒక్కడు గూడా రాలడు, కోమి టోళ్ళు పేపర్లు రుద్దినా సరే!” అనేసి మా ప్రతాపాన్ని మెచ్చుకున్నాడు.

మా పిలకాయిలంతా, “సడేలే సా. మా అయ్యలు, మా తాతలు ఈ చదువులు చదివే బతకలేదు గాని, నువ్వు సోసీల్ స్టడీస్ పక్కనబెట్టి ‘సాంఘిక శాస్త్రం’ చెప్పు సా!” అన్నాం.

“ముందు జనగణమన కానీండి. ఆ తరువాత సాంఘీక చెప్తా!” అన్నాడు.

మేమంతా కూచ్చోనే, ‘చదువెందుకు–పది ఎనుములున్న పాలు తాగవచ్చు. చక్కిరి కలుపుకొని పెరుగు తినవచ్చు.

కడుపులో తిప్పినప్పుడల్లా మజ్జిగ సేవించవచ్చు.

పేడను పిడకలుగా తట్టుకోవచ్చు. చదువెందుకు?’ అని పాడేసినాము.

“సాసా? టైమెంత సా?” అనడిగినాం.

“ఇంక పది నిమిసాలే వుండాదంఁడ్రా బెల్లు కొట్టేదానికి!” అనన్నాడు.

“అయ్యయ్యో! ఈ రోజు టైము వేస్టు సా. సాంఘీక శాస్త్రం చెప్పు సా!” అని ఉపద్ర బెట్టినాం.

మా అయ్యోరు ఉడత పిల్ల మాదిర్తో ముసి ముసి నవ్వులు నవ్వి, “ఈ రోజు ఎస్.వి.ఎం. బస్సులో....!” అనన్నాడు.

“ఆమె కనిపించిందా లేదా సా?” అని ఆత్రం పట్టలేక అడిగేసినాం.

“కనిపించిందిరా. చంకన పాల క్యానుతో, చేత శేరు డబ్బాతో!” అని దినామూ చెప్పే సాంఘీక శాస్త్రాన్ని చెప్పను మొదలు పెట్టినాడు మా సోసీలయ్యోరు.



# చిత్తానూరులో పెండ్లి బోజినాలు

ఎడం చేత్తో హాల్ టిక్కెటు పట్టుకోని, కుడి చేత్తో మాయమ్మ తలను పట్టుకుని, “మా యెడ్‌మేస్త్రీ మిటాయోడు హాల్ టిక్కట్లు గూడా ఇచ్చేసినాడు. ఈ రోజు నాకు ప్యాంటు షర్టు కుట్టిస్తేనే సరిపొయ్‌నావు. లేకుంటే తిరప్తికి పొయ్ పరీచ్చలు రాయనే రాయను. నాతో గూడా చదువుకునే ఆడ పిలకాయిలందరూ పావడ మిందికి దావెనేస్కోని పరీచ్చలకు కుచ్చుంటా వుండారు. చచ్చి తవుసు జేసినా నేను నిక్కర్తో పరీచ్చలు రాయను. ఒకేళ నీ బలంతాన రాసినా పయిలై పోయేటట్టు రాసేస్తాను!” అని వీపుకు పట్టి రెండు గుద్దులు గుద్దినాను. మాయమ్మ ఏమి చెప్తిందో గూడా వినకుండా, “చేతికి గెడారం లేకుండా పరీచ్చలు రాయనియ్యరంట. నిమిసి నిమిసం వాచీ చూసుకుంటా గదా పరీచ్చలు రాయాల. ఇన్నూరో, మున్నూరో నీవి గాదనుకో. నాకు యెచ్చెంటీయో, రీకోనో తీసియ్యి. ఇంట్లో పదీ పన్నెండు మూటల దాకా వడ్లగింజలు వుండాయి గదా. బొమ్మలాయినకు కొలిచి, ప్యాంటు సరట్టు, వాచీ తీసియ్యి. లేకుంటే నీకే నష్టం. కాలేజీ మెట్టెక్కాల్సిన నీ సిన్నకొడుకు ఇంటి కాడనే ఎనుములు మేపతాడు. మళ్ళ కోడల్ను గూడా సంపారిచ్చు కోలేవమ్మా” అనేసి మాయమ్మను బిత్తర పెట్టేసినాను. ఈ ఇన్ని మాటలకూ మాయమ్మ, “వద్దంటే పుట్టినోడికి ఎంత బడాయి వచ్చిందమ్మా! ప్యాంటు, సరట్టు, వాచ్చీయేనా? మెళ్లో మైనీరు పిలగోడి చైను వద్దా? వొంకీ వుంగరాల్లేకుండా పరీచ్చల్లో అచ్చిరాలు కుదర్తాయంట్రా దక్షిణ తట్టు నారప్ప కొడకా!” అని డోలు వాయించి కావమ్మ కత చెప్పబొయ్యింది.

పద్దైదు యేండ్లుగా మా యమ్మతో యేగతా వుండాను. నా దేముడి సత్యం నాకు తెల్దా! మనం బెంగుళూరుకు టెండరు బెడితే కనీసం పుంగునూరైనా మనకు జాతీయం అయితింది. అందుకనే నేను ఇన్ని ప్లాన్లు యేసి మాయమ్మతో మాట్లాడి వుండాను.

ఇప్పుడు నాకు అర్జంటుగా పది రూపాయలు గావాల. మా అయిస్కూలి పిలకాయిలందరికీ హాల్ టిక్కెట్లు వచ్చేసినాయి గదా. మా యెంగటాపరం అయిస్కూలికి చిత్తానూరుకు మహా అవితే మూడు మైళ్ళు. తండ్రి కన్నా తల్లి దయ గలిగిందన్నట్టు మా యెంగటేస్పర స్వామి కన్నా మా అలివేలు మంగమ్మ కనికిరం గల్లది. పరీచ్చలు రాయబొయ్యే మేము తిరుమల కొండకు పొయ్, సామి ముందర నిలబడితే, ఆయన, “బాగా చదవండిరా. పాసు చేస్తాను గాని!” అని మాటియ్య బోతాడు. మనం కూడా ఆయన ముందు ఒకటి మాట్లాడితే తక్కవని, రెండు మాట్లాడితే ఎక్కవని బయపడి పోతాం. అవితే మంగమ్మ ముందర నిలబడుకోని, ఎంతో ధైర్నంగా, ముదిగారంగా, “స్క్వాడు రానివ్వద్దు. ఎత్తకపొయ్‌న బిట్లు పరీచ్చల్లో వచ్చేటట్టు చూడు. మా జేబీలల్లో గైడ్సు పెట్టుకొని పొయ్‌నా మమ్మల డీబారు చెయ్యద్దు. అందరికీ ఫస్టు క్లాసులు ప్రసాదించు!” అని అడిగేస్తాం. మంగమ్మ కూడా బిడ్డమైన మమ్మల్ను ఒళ్లోకి తీస్కోని, “స్క్వాడుకు బయపడకుండా బిట్లు కొట్టుకోండి. ఒకరి పేపర్లు ఒకరికి ఇచ్చి పుచ్చుకొని, ఏ ఆటో ఒక ఆట ఆడి పాసుకండి. లేకుంటే మీ అమ్మలతో పాటు నేను గూడా దుఃఖ పడతా. పాపం, పసి పిలకాయిలకు పరీక్షలు పెట్టి యేడిక జూస్తారు యెదవ నా కొడుకులు” అని మా మాట మాట్లాడితింది. ఆమె సంగతి మాకు తెలుసు గాబట్టే మా అయిస్కూల్లో హాల్ టిక్కెట్లు చేతికి వచ్చినాక పిలకాయలందురూ అమ్మవారి గుడికి పొయ్ దండాలు పెట్టేసి రావడమనేది సంపర్దాయికమై పొయ్యింది. చిత్తానూరు నుంచి తిరప్తికి అట్నే పొయ్ ఒక షో చూస్తే గూడా మంచిదే గదా. దీనికి పది రూపాయలు అన్నా జేబిలో వుండాలని చెప్పేసి నేను ప్యాంటు సరట్టు వాచీల ప్రస్తావన తెచ్చినాను.

మా అమ్మ నేను నిజ్జింగానే పరీచ్చలకు నామం పెడతానేమోనని బయపడి, పామునోట్లో తలకాయి పెట్టో ఏమో పదిరూపాయలు పెరక్కొచ్చింది. ఆ పది చూసినాక నా కాలు ఇంట్లో నిలవనేలా.

ఆ సందేళపూట యెంగటాపురం అయిస్కూలు కాడ పిలకాయిలమంతా వుడ్డ చేరినాము. అందరం చిత్తానూరు గుడికి ఎలబార్నాము. మా మొగపిలకాయిలలో ఒకర్ని తియ్యాల్సిన పనిలేదు, ఒకర్ని తొయ్యాల్సిన పనిలేదు. అందరం వాహినీ వారి పెద్ద మనుషులమే కావటం వల్ల మాతో గూడా ఆడపిలకాయలెవురూ చిత్తానూరు గుడికి రాలేదు. (ఒకేళ వచ్చి వుంటే ఆ రోజు గుళ్ళో జతలు జతలుగా పెండ్లిండ్లు జరిపేసుకొని వుండమా!) ఈ ఒకే బాధతో ఆరేడు గెంటలకల్లా మేము గుడి చేరుకున్నాము.

మా అందరితో అలివేలు మంగమ్మ, (చిత్తానూరు అమ్మ వారిని గూడా మేము మంగమ్మ తల్లనే అంటాము.) "పాపం అయిదూ పదితో మీరంతా నా దగ్గిరికి వచ్చినారు. నా వుండీలో మీరేమీ దుడ్డూ దుగ్గాణి యెయ్యాల్సిన పనిలేదు. మిటాయిలూ బొరుగులూ తీసుకోని తినండి చాలుగాని. నేనేమీ అనుకోన్లేరా!" అని చెప్పడం వల్ల మేము కాలణా ఖర్చులేకుండా గుళ్లోకి పొయ్ (మా ఇంట్లోకి మేం పొయ్‌నట్టు) దణ్నాలు పెట్టేసి వచ్చినాం. ఒక కట్ట భక్తిమాల బీడీలను కొనుక్కోని కోనేటి కట్ట మింద కూచ్చోని బీడీలు తాగినాం.

అప్పటికే మబ్బు పడి పొయ్యింది. ఇంక తిరప్తికి పోవాలనుకున్నాం.

నాగ స్వరాలు, మంగళ మేళాలు వినిపిస్తుండగా నాకు కొన్ని లక్షల వరహాల విలువ జేసే ఒక అయిడీ వచ్చింది.

నేను మా పిలకాయిలతో, "ఇప్పుడే తిరప్తికి ఎందుకు? ఎనిమిది గెంటల కాడ చిత్తానూరులోనే అన్నాలు తినేసి మళ్ళ పోదాం తిరప్తికి" అని అన్నాను.

"ఒరే! గుడ్డోడికి చిత్తానూరులో చుట్టాలున్నట్టుండా(రా!" అనన్నాడు బడ్ బడ్ బడ్డన్న.

"ఒరే ముండా! చిత్తానూరులో తిండికి కరువా? చుట్టాలూ పన్లా, పక్కాలూ పన్లా!" అని అన్నాను.

మా మబ్బు నా కొడకలకు ఎవ్వరికీ నా ప్లాను అర్థం గాలేదు. నేను చేతికి మైకును అందుకోని, "మనం కండ్లు మూసుకోని ఏదో ఒక సత్రంలోకి పోదాం. చిత్తానూరులో దినానికి నాలుగు పెండ్లిండ్లు జరగతానే వుంటాయి గదా! సత్రంలోకి పోతాం, కూచ్చుంటాం, తింటాం, వస్తాం!" అని చెప్పినాను.

వోటలుకు పెట్టే రూక మిగిలిపోతింది గదాని కొంత మంది మొకాలు యింత్తై పొయ్నాయి.

చిత్తానూరులో పోలీసు టేసిని వుండాదని బయపడి పొయ్న గండు సుబ్బడు, "తంతారు పట్టుకోని!" అని అన్నాడు.

"ఎవురూ తన్నరు. పెండ్లి కూతురోళ్ళు-పెండ్లి కొడుకు చుట్టాలనుకుంటారు. పెండ్లి కొడుకోళ్ళు-పెండ్లి కూతురి చుట్టాలనుకుంటారు. మీకా దిగుల్లా! రండి పోదాం!" అనేసినా. పెండ్లి సత్రంలోకి దూరినాం.

తిన్నాం. దర్జాగా తేపుకుంటా బయటికి వచ్చి తిరప్తికి బస్సెక్కినాం.

బస్సులో నా కాళ్ళకు చెప్పులు చూసిన మా పిలకాయిలు, "ఎప్పుడు కొన్నావురా నా కొడకా? భలే వుండాయే!" అనన్నారు.

"రేపు తిరప్తిలో పరీచ్చలు రాస్తాం గదా! తిరప్తిలో తార్రోడ్లు గదా! కాళ్ళు కాల్తాయి గదా! చెప్పులు కావాల గదా! నా కాళ్ళకు సరిపడే జత చూసి పెండ్లోళ్ళవి తెచ్చుకున్నా. బాగుండాయి గదా!" అని నేను బస్సు తిరప్తికొచ్చే దాకా కులికినా!

# మిట్టూరోడి కతలు




మాయమ్మకూ, నాకూ,
సరోజత్తకూ, బక్కమ్మకూ,
పొట్టవ్వకూ, రామస్తానమ్మకూ,
శారదక్కకూ, మిట్టమింద సుబ్బికీ,
శివమ్మ కూతురికీ, ఎర్రమ నాయుడికీ,
కన్నెబావకూ, పెరుగు సాయిబుకూ...
ఒకరికనేమి---
ఈ కతల్లో వుండే వాళ్లందరికీ...
(ఒక్క నా పెళ్ళానికి తప్ప!)



# బతుకు గోరే తల్లి

"కుంచమంత కూతురుంటే తల్లి మంచం దిగాల్సిన పన్లేదంటారు. నా సవితీ, నువ్వూ వుండావు ఏమిటికి? నిన్నుగని నేనేమి సుక పడినట్టు?"

"నువ్వు నన్ను కన్నావా? నా సవితీ, కండ్లుండవ్ నా సవితీ, నువ్వు నన్ను కన్నావని అన్నావంటే! కక్కినావు. వొక తిక్కలోడి ఎదాన తోసినావు. నా మంచేమి సెడ్డేమి అని ఏ పొద్దన్నా సూసినావా సేయ్?"

"కుక్క మొరిగినట్టు మొరగద్దు, పెట్టినమ్మను ఈదిలో యెయ్యొద్దు సేయ్. ఆంజినేయుల్సామి గుళ్లో రెండేలు బెట్టి జేసినా పెండ్లి. వాచ్చీ వుంగరంతో సఖా మూడేలు బెట్టి ఉగాది సాంగిం బెట్టినా. ఆ పొద్దుట్నుంచి ఈ పొద్దుటికీ ముఫ్పైమూడూ అరైయ్యారూ నా ఇంటికాణ్ణుంచే ఎత్తక పోతుండావు. కోడిపిల్లల్ను జూసన్నా బుద్ధి తెచ్చుకోయే లంజి నా సవితీ, మూడు నెల్లు అయ్యాగాకనే కేరేజాట్ అని పిల్లలు కోణ్ణొదిలేసి వాటి బతుకవి బతకతాయి గదే! మానుడి జల్మ ఎత్తి ఇరై యేండ్లు దాటతా వుండినా నీకా బుద్ధి అబ్బక పాయ గదే సోంబేరి నా సవితీ!"

"యెంగటేస్పర సామి గర్భగుళ్ళో జేరి చెప్తా - నేనూ నా బిడ్లూ నా మొగుడి రెక్కల కష్టిమే తింటుండాం. ఒక నా బట్ట కష్టిం ఒక నా సవితి కష్టిం తినింది మాకు తెల్దు. నీ సొత్తు ఎర్ర నయా పైసా తినింది నాకు తెలవదు గదే

కొరంగి దానా! ఏమమ్మా, నా మొగుడికి నువ్వు టెంకాయ తోటలూ, మాడి తోపులూ రాసిచ్చేసి వెండి వుయ్యాల గట్టిపెట్టి వూగమనుండేది?"

"అమ్మమ్మా నేను సంపాయించ లేదమ్మా టెంకాయ తోట్లూ, మాడి తోపులూ! నా మొగుడు జర్జీ గాదు. నా మొగుడు కలెక్టరు గాదు. నా మొగుడా గవునీరు గాదు. నా మొగుడు బక్కయ్యోళ్ళ పెదబ్బ! మేముండాం, మా రెక్కలుండాయని బూమమ్మకు కండలు దారబోసి నాలుగు కవణాలు మింగతుండాం. మొగుణ్ణి పక్కలో యేస్కోని నిన్ను కన్నపుడు తెల్దు నాకు–బతికినంత కాలం నీకు సరఘరాలు జెయ్యాలని! పాపం పుణ్యం లేకుండా కన్నతల్లని గూడ తలవకుండా మానం తప్పిన మాటలన్నీ అడగతా వుండావు. మరిచి పోవద్దు సేయ్ నీకూ వుండాదొక్కూతురు!"

"నాక్కూతురుండే కత నిన్ను జెప్పమన్లేదు సేయ్. మాటుంటే నన్నడుగు. దానికీ నీకూ, ఏమి సమందం? దాని జోలికి పోబాక. ఈ నిమిసం వరకు నాకూ వొకమ్మగారుండారని ఆశి వుండింది. కుక్క ఆశి గుంట్రాయితో పొయ్‌నట్టు ఆ ఆశా ఈ పొద్దుటితో పొయ్యింది. నేన్నీకు కూతురే గాదు పగరాల్నే అనుకో. ఇంత మనిసిని నీ గడప తొక్కి నోరంతా తెరిచి గదా ఇరై రూపాయలడిగింది! అదీ ఎందుకడిగినా? తిరప్తికి బొయ్ సిల్మా జూసేసొద్దామని అడిగినానా? డిపోకు రెండ్రూపాయల బియ్యం వొచ్చినాయన్నారు. ఈ దినం తీస్కోకుంటే ఆ డిపో నా బట్ట రేపు లేదనేస్తాడు. కార్డు తేరకు పూడిస్తింది. అందుకని సిగ్గిడిసి నీ దగ్గిరికొచ్చి ఇరై రూపాయలడిగినా. ఇయ్యగూడదా నువ్వు? వరవాతన నోట్లో నీళ్ళు బొయ్యకనే లేదని బొంకినావు. నీ బొడ్డు తెంచుకుని పుట్టలేదా సేయ్ నేను? ఈ పొద్దు నా చేతిలో ఇరై బెట్టి రేపే నా దుడ్డు నాకియ్యి అని కూచ్చోనుంటే నీది నీ మొకాన పారేసుండనా? రాయ సేయ్, నువ్వు రాయివి. ఆ రాయన్నా కష్టిం చెప్పుకుంటే ఇని కరిగి పోతింది గాని నువ్వా? నీయంత కటీనురాలు ఈ ఎండలు గాసే బూమండలంలో వుంటిందా? పోనీ, నీ దగ్గిర నిజ్జంగానే రూక లేదనా? నీ దగ్గిర రూక వుండేదీ లేందీ నాకు తెలవదా? నీ దగ్గిర నేను లేదనిపించుకోని పొయ్ నా కారడను కంసలోళ్ల శివమ్మకు నిలవన ఇచ్చేస్తినే. నాకెక్కడా పాము నోట్లో యేలు పెట్టినా దొరక్క గదా నీ గుండానికొచ్చి అడిగింది. అయ్యోమన్నావా నువ్వు? ఆ గబ్బు నోటితో నాకు లేదన్నావు. గెంటకు ముందర సుబ్బులోళ్ళ కిష్ట బావకు

నూర్రూపాయలు రెంద్రూపాయ్‌లొడ్డీకి మార్చినావు. నీకు కండ్లుంటాయా సేయ్? నువ్వు చచ్చి యెల్లాలకల నిన్ను పండబెట్టుండినా నీ మొకం జూడన్ నా సవితీ!"

అమ్మాకూతర్ల నడిమద్య గెంట సేపుట్నించి రగిలింది రగిలింది, ఇప్పటికి ఆరిపొయ్యింది.

సరోజత్తా, ఇజాలచ్చిమీ వొరసబెట్టి, 'నువ్వు ముందు మాట్లాడు నేను మళ్ల మాట్లాడతా' అని సిల్మాలల్లో మాట్లాడినట్టు మాట్లాడుకున్నారు అని గదా నేనిక్కడ మీకు జెప్పింది. అట్టగాదు. వాళ్లమ్మ వొక్క మాటనే కొందికి ఇజాలచ్చిం అడ్డం దూరి– నాలుగు మాటలనింది. ఒక దఫాలో అవితే సరోజత్త 'నా మొగుడు గవునీరా, నా మొగుడు కలెట్రా' అని కుడి చేతిని పిడికిలిగా జేస్కోని ఎడం చేతిలో గుద్ది గుద్ది అడిగింది. ఆ అమ్మాగూతర్ల మద్య జరిగింది జరిగినట్టు చెప్పాలంటే దేముళ్ళు దిగి రావాల్సిందేనబ్బా. ఆ మాటల్లో నేనొక్కటీ కైగట్టి చెప్పలా. నేనెంత మఖా కవిని అయినా గూడ అటుమంటి మాటల్ను కైగట్టను నాకు సత్తా లేదబ్బా. మీరు నమ్మితే ఎంత నమ్మకుంటే ఎంత గాని – ఆ అమ్మాగూతర్ల తగరారును కాతికంలో రాస్కోని మీకిప్పుడు చెప్తుండా.

ఇజాలిచ్చిం దాని దోవన అది పొయ్‌నాక నేను సరోజత్తను చేరుకున్నా. ఇందాక నేను వాళ్లిద్దరి సందులోకి నోరడ్డం యేస్కోని పొయ్యుంటే బంగారట్టా మాటలు నాకు దొరికుందునా? అందుకనే నోరు మూస్కోనుండి మంచి పని జేసినా. "ఏమే సరోజత్తా, నువ్వు జేసిన పని నాగ్గూడ సరిపళ్ళేదే! ఇర్రై రూపాయలు కూతురికి గాదని ఆడెవురికో నూర్రూపాయలు వొడ్డీకిచ్చినావంటే – అది తిడితిందంటే తిట్టదా? దాన్దేం తప్పుండాది?" అని ఇజాలచ్చింని యెనకేసు కోనొచ్చినా.

"చెప్తాను ఇనురా నా బట్టా! ఎవుర్ది తప్పుంటే వాళ్ళను కొట్టు నీ ఎడం కాలి మెట్టుతో!" అనేసి చెప్పకొచ్చింది సరోజత్త.

"తెల్లారి రెండు లీటర్లు, సందేళ రెండు లీటర్లు పాలిచ్చే ఆవుగొడ్డుండాది దానికి. పాల డిపో నుంచి పదైదు దినాలకొక దఫా నూటా యాపై రూపాయలదాకా దానికి చేతికొస్తా వుండాయి. ఆ రూకంతా ఏమవతా వుండాది? వూళ్లోకి అంటి పొండ్ల గంప రాగూడదు. వుప్పు చేపలు రాగూడదు.

గెనిశి గెడ్డలు రాగూడదు. కనాగష్టం ఐసులు రాగూడదు! అదేమన్నా పాలు తాగే పసి బిడ్డా? నోరును కట్టుకోలేదా? సినబ్బా, తినేస్తే తిరమల కొండను తినెయ్యొచ్చు తెలుసునా? ఏమబ్బా! ఆమే, ఆమె మొగుడూ జమీందారు దొబ్బితేనా పుట్టుండేది! కోడిగుడ్డు పొరుటు లేంది సంగట్లో చెయ్యి బెట్టేది లేదా? ఆవుగొడ్డు పాలిచ్చేటప్పుడే నీకు బియ్యానికి రూక లేకపొయ్యిందంటే ఆ ఆవుగొడ్డు వొట్టిపొయ్‌నాక నీ గతి ఏమైతిందో తెలుసుకున్నావా? ఎంతదా నువ్వు ఎగవీదిలో వుండి, నీ అమ్మగారు దిగవీదిలో వుంటే మాత్రం నీకు అయిదు గావాలన్నా పది గావాలన్నా చట్టిలోకి వుప్పు గావాలన్నా మిరక్కాయ గావాలన్నా ఆ వీది నుంచి ఈ వీదికి ఎగేస్కుంటా పరిగెత్తితే సరిపాయనా? మేమంతా ఈ మాదిర్తో జేసుంటే బిడ్డాపాపను సాక్కోనుంటామా? మొగుళ్లను పక్కల్లో యేస్కోని కనేస్తే సరిపోదు.

మనం ఒక బిడ్డి తల్లయినాక– మనగ్గాదు నోరుండేది మన బిడ్డకు – అనుకోవాల!"

"ఇంక ముగించే సరోజత్తా, కతై పొయ్యింది గాని!"

"ఇంతలేకే ఎక్కడై పొయ్యిందిరా నా బట్టా! ఇందాక నా కూతురు నోరంతా తెరిచి అడిగితే ఇరై రూపాయలు లేదన్నాను గదా. ఇప్పుడే ఇన్నూర్రూపాయ లెత్తుకోని తిరప్తికి పోతుండా. నా మనవరాలు– అదే దాని కూతురు – అడుగు తీసి అడుగేస్తా వుండాది గదా. ఈ ప్రాయంలో దానికి యెండి గొలుసులు కావొద్దా?"



# కుచ్చుంటే కత, లేస్తే కత-

బక్కత్త మా గడపట్లో కూచ్చొని సంగటి తింటా తింటా వుండిందల్లా, "సినబ్బా! లోటాతో అన్ని నీళ్ళు తేరా!" అనడిగింది నన్ను.

ఒకాడది ఇంత మొగోణ్ణి - మొగోడని గూడా తలవకుండా నీళ్ళు తెమ్మనేదేంది, లేచి తెచ్చుకోలేదా అన్జెప్పి నా పెళ్ళానికి బారడు పొడుగొచ్చింది కోపం.

"ఏమమ్మా, నీకంత రాణివాసం వచ్చుండేది. ఆయన తెచ్చియ్యాల్నా నీకు నీళ్ళు? నువ్వు తేవద్దబ్బా!" అని మొండికి కూచ్చునింది మా తిమురు బట్టిన ఆడది.

"ఏమిరా సినబ్బా! నా మాటా, నీ పెళ్ళాం మాటా రా? తెచ్చిస్తావా తెచ్చియ్యవా!" అని బక్కది పందెమేస్కొనింది.

నేను లోటాతో అన్ని నీళ్ళు ముంచకొచ్చిద్దాం గదాని పైకి లేవబోతుంటే మా ప్రబా, "నువ్వు నీళ్ళే తెచ్చియ్యి - నేను చచ్చినట్టే!" అని వొట్టుకు దిగింది.

"అంత బిడ్డి మొదులుకొని మా కొంగులు పట్టుకుని తిరగతా వున్నోడివి. నువ్వు పెద్ద కాలోజీలో చదవతా వుండినప్పుడు గూడ నీ దగ్గిర నీళ్లు ముంచిచ్చుకునే తాగినాం- ఈ వూళ్లో ఆడోళ్లందరం. నా బట్టా, ఈపొద్దు నీకూ వొక పెళ్లాం కలిగిందని దాని చేతుల్లోకి పొయ్‌నావంటే నీకూ మాకూ చెల్లే!" అని నన్ను బిత్తర బెట్టింది బక్కత్త.

బక్కత్త చెప్పిందాంట్లో ఆవగింజంత గూడ అపద్దం లా.

ఆ మాటల్తో గూడ పైకి లేచి గుండు చెమ్ముతో గుండు చెమ్ముడు నీళ్ళు తెచ్చిచ్చినా. బక్కమ్మ సంగటి తినేది కానిచ్చి గిన్నెని మా ఇంట్లోనే కడుక్కొని (నా పెళ్లాం మాటల్లో చెప్పాలంటే యాళాపాళా గూడ లేకుండా) వాళ్లింటికి పూడిసింది.

అప్పుడు మా ఇంట్లో నేనూ మా ప్రబానే వుండాం. ఎక్కడ నన్ను బట్టుకోని నాలుగు తగిలిస్తిందోనని నాకు వుచ్చ పడతా వుండాది.

తినే గిన్నెను ఇంట్లో పెట్టేసి బక్కత్త మా ఇంటి ముందర కొచ్చి, "రారా సినబ్బా చింత చెట్టు కాడికి, ఇంట్లోనే ఎందుకు పొదగతా వుంటావు కోడి పెట్ట మాదిర్తో!" అని పిలిచింది.

నేను కుళ్లతా వుండే మా ఇంటిదాంతో,

"నువ్వు కుళ్లిచావే లంజా నేను కులికి చస్తానే లంజా" అని నడుం వూగించీ అది నవ్వే మాదిరిగా కొంచింగా డాన్సు జేసీ ఇంట్లో నుంచి బైట పడి చింత చెట్టు కాడికి చేరినా. కాకిగూడ బయపడి చచ్చేటట్టు కాస్తుండాది ఎండ. చింత చెట్టు కింద నేనూ, కడుపత్తా, బక్కత్తా, నీలావొతీ, కర్రెక్కా వుండాం. మాకు మాట్లాడుకునే దానికి ఏమీ దొరకనట్టే వుండాది, అందరం గమ్మనుండాం. ఇంతలో బీకత్త (బక్కత్త వేరే, బీకత్త వేరే. బీకత్త అంటే బూలోక రంబోళ్ళ అమ్మ) కూతుర్ని, "మే, నీలా! రాయేం మే, చింత పొండన్నా కొట్టుకుందాం. గమ్మనుండేదేమిటికి?" అని పిలిచింది. నీలావతి ఆ మాటతో గూడా ఇంటికి ఎలబారింది.

మాలో నుంచి పోతా పోతా వుండే నీలావతి కల్లా జూస్తా, "దీందీ ఒక బతుకేనా కడుపమ్మీ?" అనింది బక్కత్త కడుపత్తతో.

కడుపత్తతో సఖా మేమంతా, "ఏమి ఏమి?" అనడిగినాం.

"అది – నీల – చచ్చినాక గాని మూట కట్టుకోని పోతిందా? అబ్బే, దాని బతుకు కుక్క గూడ బతకదు!" అని బక్కత్త మొకాన్ని అసింకంగా బెట్టింది.

"బిడ్డా పాప లేని గొడ్డు ముండలకు బలే ఆత్రమమ్మా! ఆ ఆత్రం బిడ్లగన్నోళ్ళ కుండదే!" అని బక్కత్త చెప్పబొయ్యే కతకు వూపొచ్చేటట్టు కర్రెక్క డోలు వాయించింది.

"అంత గాక! కోరిన తిండి తిని, కోరిన కోక గట్టుకోని నీలావతి చావొచ్చును గదా? ఆ యమ్మి తినే తిండి, ఆ యమ్మి కట్టే గుడ్డ –థూ మాదిగిది బతుకునా అటుమంటి అద్దోన్నపు బతుకు?" అని నేను తాళమేసినా.

బక్కత్త జోరుగా కతలోకొచ్చింది.

"తెల్లారనంగా కసిమి కాలవకల్లా నేనూ దానమ్మ బీకిదీ ఎనుములు్ను తోలక పొయ్‌నాం. సినబ్బా, ఎనుములు చస్తిమా బతికితిమా అన్జెప్పి మేస్తుండాయి. మేం ఎనమల తోలక పొయ్ గెంట గూడ అయ్యుండదు. బీకిది 'టైె మెంతయి వుండును బక్కమ్మా?' అనడిగింది. 'మఖా అయ్యుంటే తొమ్మిదీ తొమ్మిదిన్నర అయ్యుంటింది' అన్జెప్పినా. మళ్ల అర గంట తాలినాక, 'సంగటేళ అయ్యుండదా బక్కమ్మా?' అనడిగింది. 'సంగటేళ దాటాలంటే ఇంగ రొండు గంటలు పోవాల బీకక్కా!' అని చెప్పినా. సినబ్బా నువ్వు నిజం చెప్పినా ఇంటావు అపద్దం జెప్పినా ఇంటావు – బీకిదాని తపన యాల జెప్తావులే! ఎనుములు ఆవురావురుమని మేస్తా వుంటే, 'ఎనుములు మూతి వొంచతా వుండాయా? ఇంగ తోల్దాం పట్టు' అని మేసే గొడ్లను తోలును. 'పొద్దు పరంటగా వాలిపోతా వుంటే ఇంగా సంగటేళ కాలేదంటావా?' అని నాతో యాష్ట పోవును. నేనా మనిషి అల్లాటం జూసి, 'అంతగా వుంటే నీ ఎనుములు్ను నువ్వు తోలకపో. నేనిప్పుడిప్పుడే రాను.' అనేసినా. ఎనుముల్ని బీకిది అంత బిరీన యింటికి తోలకపోతే 'అందరి గొడ్లూ మేస్తా వుంటే మన గొడ్లనప్పుడే ఏమిటికి తోలకొచ్చేసినావు సేయ్' అని కూతురు నాలుగు దొబ్బి వొదిలి పెట్టదా? నాకే పాపం అనిపించిందిరా – బీకిదాని గోష్ట చూస్తే!" అని కత ముగిచ్చింది.

బక్కత్త జెప్పిన కతలో బీకిదాని కొచ్చుండే కష్టిం మాకు తెలిసిపొయ్యింది.

"పాపం! తెల్లారి ఎనుములు తోలక పొయ్యేటప్పుడు బీకమ్మకు కడుపు నిండికీ నీలావతి చద్ది పోసుంటే గదా! అసలు నీలావతి చద్దికి సరి పడేటట్టు ఏ పొద్దన్నా వొండి వార్చితే గదా!" అని బక్కత్త కతలో చెప్పని సంగతులు్ను కర్రెక్క జెప్పింది.

ఇంతలో బక్కత్తకు గూడా కూతురు దగ్గిర్నుంచి పిలుపొచ్చింది.

"నేను పోతా వుండానమ్మా! మన కతే ఎంతెంతో వుంటే ఇంగొకరి కత మనకెందుకు?" అంటా బక్కది గూడా మాలో నుంచి పూడిసింది.

పోతా పోతా వుండే బక్కత్తన్జూస్తా, "ఇదొకాడదని ఇది ఇంగొకరి కత జెప్తింది! చెప్పాలంటే దీందే చిన్నప రెడ్డి కత ఎంతుండాదో అంతుండాది!" అని కడుపత్త మొదులుబెట్టింది.

"దీనంత వొళ్ళు బలిసిన ఆడది ఈ సిత్తూరు జిల్లాలో వుండదు గదా!" అని నేను డోలు వాయించినా.


"సరిగ్గా జెప్పినావురా సినబ్బా!" అని కర్రెక్క తాళమేసింది.

చెప్పలేని కుశాలతో కడుపత్త జోరుగా కతను గానిచ్చింది.

"ఈ పొద్దు తెల్లారి జామున జరిగిందే ఇది. అది ఆడదే అవితే, అది కమ్మోడికి పుట్టింది నిజ్జమే అయితే – కోడి కూతెయ్యంగానే మళ్ళ కంటి మింద రెప్ప పడితిందా? ఆడదానికి నిద్రెక్కడి నుంచొస్తింది? కాళ్ళు ఇరేస్కోని వొంటి మింద కోక జారిపొయ్న కత గూడ తెలుస్కోకుండా నడీదిలో యెల్లాలకల గంగమ్మాల పొనుకుని నిద్రపొతే సరిపోతిందా? సినబ్బా! తెల్లారుజామైపొయ్యింది. బజిని గుళ్ళో రేడీ పాడే దానికి ఆరంబమైంది! పాల ట్రాక్టర ఎలబారేసింది గూడా. అయినా గూడ ఈ బక్కది పెద్ద దున్నపోతాల సందిట్లావు గురక కానిస్తానే వుండాది. పైకిలేచి ఆవుగొడ్డుకు అంత పిండీ తవుడు బెట్టి పాలు పిండి కేను కాడికి తెచ్చేది తెల్దా? తెల్లారి నిద్ర లేచి నా మిందికొచ్చింది జగడానికి – ఏం కడుపమ్మీ, పాలు పిండుకోని మా ఇంటి దోవన్నే పోతివి గదా, నన్నొక కూతేసి నిద్దర లేపక పొయ్నావా–అని! ఏమి సేయ్, నిన్ను జోల పాడి నిద్దర్లేపేదానికి నేనేమన్నా నీకు బిళ్ళ జవానా? దాన్నోట్లో నోరు బెట్టేదానికి జంకి ఏం మాట్లాడకుండా గమ్మునుండి పొయ్నా!" అని కడుపత్త మర్మం అనేది కాసింత కూడా లేకుండా డైరక్టుగా కత జెప్పి ముగిచ్చింది.

ఇంతలో నా పెళ్ళాం, "ఏమబ్బా, ఆ చింత చెట్టు కింద వుండినంత నాణ్యంగా ఈ ఇంట్లో లేదా? కొంచేపన్నా ఇంట్లో కాలు నిలస్తా వుండాదా? పైకి లేచి ఇట్ట వస్తావా రావా?" అంటా నా మిందికి కాలెత్తుకోనొచ్చింది.

"నువ్వు నన్ను తన్నను గూడ తన్ను. తన్నులన్నా తింటా గాని నేను మాత్రం ఈడ నుంచి అచ్చిరమంటే కదల్ను. ఎందుకంటావా? మాలో నుంచి ఇంతకు ముందు నీలావతి పొయ్యింది. ఆయమ్మి మింద సరైన కత చెప్పుకున్నాం. మళ్ళ బక్కత్త పొయ్యింది. ఆమెను గురించి గూడా చెప్పుకున్న కతను ఇప్పుడే ముగించినాం. ఇంగ నేను గూడ ఇక్కణ్ణుంచి నువ్వు పిలిచినావు గదా అని కదిల్తే 'పెళ్ళానికి బయపడి బతికే ఈడూ ఒక మొగోడేనా?' అని కడుపత్తా, కర్రెక్కా నా గురిచ్చి కత మొదులు బెట్టరా? నేన్రాన్ సామీ నేన్రాన్!" అని వూరెత్తక పొయ్యేటట్టు గెట్టంగా అరిచినా.



# నగిరి కాలవలో మా జుట్టు బావ

మా జుట్టు బావ నన్నొక దఫాలో యెంటికతో సమానంగా జేసి చూసినాడు. అదెట్టయా అంటే–

మా జుట్టు బావ నాకు మేనత్త కొడుకు. మన మేనత్త కొడుక్కొక కూతురుంటే మనం గమ్మనుంటామా, కాళ్లు జాపేసి? అంత చావు నా కొడుకులు ఇక్కడెవ్వరూ లేరు. ఎమ్మేస్సీ రెండు సమ్మచ్చరాలూ అయిపోంగానే నాకు పెళ్లి పిచ్చి పట్టుకొనింది. తెల్లారిపూట మా యమ్మ చద్దిబోసి నంజుకునే దానికి మారేడు కొమ్ములు బెడితే నేను ఎడం చేత్తో గూడా ముట్టలా. మద్యానం పూట మాయమ్మ సంగట్లోకి ఉప్పు చేపల కూర యేసినా నేను ఎండం కంటితో గూడ చూళ్లా. రాత్రి పూట మాయమ్మా మా నాయినా, "ఏమిరా సిన్నయ్యలూ? మేము నీకు పెండ్లిజెయ్యకుంటే మా మింద అలగాల గాని అన్నం మింద అలిగితే ఎట్టరా ఎర్రి ఎమ్మన్నా?" అనేసి నన్ను అన్నం తినమని బలంతం జేసినారు. "మంచి మాటల్తో పెండ్లి జేస్తారా, అక్కడెక్కడన్నా నీళ్లు లేని బాయిలో దూకి నడుములిరిగి చావమంటారా?" అని పుల్లించి నేలేసినట్టు అడిగినా. మాయమ్మా మా నాయినా ఇద్దురు కూడా అరుసోద్దక పోయి, "పెద్దోణ్ణి అక్కడ బెట్టి సిన్నోడికి పెండ్లి జేస్తారా యాడన్నా? కొంచెం తాళు, అన్నకు జేసి మళ్ల జేస్తాం" అని నా కాళ్లూ జేతులు బట్టుకున్నారు. "మరేదగా చెప్తావుండా – అన్నకూ నాకూ వొకే మూర్తంలో జరిగిపోవాల పెండ్లి! ఇది పండగ నెల. వొచ్చే వొయ్యాశి నెలకంతా నేను మా అత్తగారూర్లో అల్లిం తింటుండాల" అని కడ మాటగా

చెప్పేసినా. (పెండ్లి కాడ తాంచారం చెయ్యకూడదు. మా నాయిన గూడ మూడు నెల్లు సేద్యం గీద్యం అనుకోకుండా అలిగితే అప్పుడు జేసినారంట పెండ్లి.) దీంతో మాయమ్మా మా నాయినా నేరుగా మా జుట్టు బావ దగ్గరికి పొయ్, "ఏమిరే జుట్టోడా! మన సినబ్బ తొందర పడతుండాడు. మురగమ్మనిచ్చి పెండ్లి జేసేద్దాంరా" అనడిగినారు. అప్పుడు మా జుట్టుబావ సత్యవేడులో ఎగిరి పలమనేరులో దూకి, "మీకు ధర్మంగా వుండాదేమో సెప్పండి. మీరే నా బిడ్డకి తల్లీదండ్రీ అనుకోని సెప్పండి, మురగమ్మ నడుం కాడికన్నా వొస్తాడా సినబ్బ? రేపు వోళ్ళు మొగుడూ పెళ్లాలై తిరప్తికి సిల్మాకు బోతావుంటే దోవ పొడుక్కూ చూసినోళ్ళు కాకి నోటికి మిరప్పొండనుకుంటారే గాని – వోడు చదివిన చదువు ఎవుడికి కనబడితింది?" అని దొబ్బి తోసినాడంట. మా వోళ్లకు చింతకాయ కొరికినట్టయిపొయ్ కాళ్లీడ్చుకుంటా వొచ్చేసినారు. మా జుట్టు మామ మాటల్లో ఆవ గింజంతయినా అపద్దంలా. మా మురుగ జడంత పొడుగన్నా వుండానా నేను? ఆశికి మితం వుండాల. నేను యేసిన యెయ్యటంతోనే ఢిల్లీకి నిచ్చెన్లేసినా. మా జుట్టు బావ దగ్గిర మా పంబ ఏం వాగలా. అగ్గో, ఆ జుట్టు బావ మింద చిన్న కత జెప్పాల్సిన పని బడింది నాకీ పొద్దు.

మా జుట్టుబావకు నాలుగు కయ్యలుండాయి వొరసగా. అంతా కలిసి ఎకరానే! అయితే ఏమి, ఒక పైరు జేస్తాడు, ఒక పైరు జెయ్యడు అనాల్సిన పన్లా. "నా కూతురు అంగిట్లో పసుపు తెచ్చి మొకాన పూసుకుంటే ఎట్ట?" అన్జెప్పి ఆ కాసింత కయ్యలోనే బారడు పొడుగు పసుపు కూడా పండిస్తాడు.

"చేతి నిండా కయ్య లేదురా. నా చేతి కింద నాలుగెకరాల కయ్య వుండుంటేనా–" అని దినానికొక సార్రైనా కలవరించే వోడు. నిజ్జమే. మా మాం చేతిలో పైరు కిష్టమ్మా అని ఇరగ పండితింది.

కయ్యాగాలవ మింద అంత కలవరం వుండే మా జుట్టుబావ ఒకనాడు నా కాడికొచ్చి, "మన పెద్దోళ్ళు సంపారిచ్చిన కయ్యను వూలోళ్ళకిచ్చేసేదేమిటిరా, బేరం జెప్తా, నువ్వు తీస్కోరా సినబ్బా!" అనన్నాడు.

మొదుట్లో నేను తమాసకనుకున్నా గాని వాడెమ్మా కడుపు కాలా నిజ్జంతోనే కయ్య అమ్ముకుంటాడంట.

"ముప్పైవేలు బెట్టి కయ్య కొనే అంత మొగోణ్ణి నేను గాదులే గాని, నువ్వు కయ్యమ్మేస్తే ఎట్ట బతకబోతావు సామీ!" అన్నా.

"ఈ కయ్యల్లో మాల కష్టం చేసే కన్నా రొండు ఆవుగొడ్లు పట్టుకోని పాలు బోసుకుంంటే బతికి పోలేమా?" అనేసి కయ్యమ్మే దానికి నిజ్జంగానే సిద్ధపడి పొయ్‌నాడు.

మా జుట్టుబావ బావి కొంచెం బోల పడిపొయ్యింది. పదేండ్లకు ముందర సరేగాని ఇప్పుడీ కరువు కాలంలో దాంట్లో నీళ్ళు దోసిడూ చేరడే!

"ఈ నీళ్ళు లేని కాలంలో కయ్యెందుకని అమ్మేస్తా వుండావా సామీ తెలివిగా?" అని నవ్వినా.

"నీళ్ళు మన బాయిలో లేకుంటే ఏమి? రేపో ఎల్లుండో నగిరి కాలవ మన కయ్య పక్కన్నే గదా? మొన్ననే ఇంజినీర్లొచ్చి అంతా కొల్తలు తీస్కోని పొయ్‌నారే! నీళ్లు లేగ్గాదు. వొంటిగోణ్ణి. సేద్యం నావల్లా గాలా. అయినా ఈ సేద్యాలల్లో ఏమొస్తా వుండాది? నా కయ్యమ్మి ముప్పై యేలు బేంకీలో యేస్తే అయిదేండ్లలో అర్వై యేలు గదా!" మా జుట్టుబావ తెలివికి నేను బిత్తర పొయ్‌నా.

పట్టు పట్టుమని మా జుట్టు మామ కయ్య అమ్మెయ్యనే అమ్మేసినాడు, ముప్పై వేలకు. బేంకీలో ఫిక్సుడు యేసినాడంట జుట్టోడు – అని రొండు నాళ్ళు మా వూరోళ్ళం దాన్నే ఒక కతగా జెప్పుకున్నాం.

జుట్టుబావ కయ్యమ్మేసినాక మూడు వేల రూపాయలకొక మంచి జెర్సీ ఆవును పట్టుకున్నాడు.

ఒక బిడ్డా, ఒక గొడ్డూ వూరికే పైరై పొయ్యేది లా. వాటితో పడీ లేస్తేనే గొడ్డయినా బిడ్డయినా!

"ఏం జుట్టు సామీ, చేతిలో కయ్య లేకుండా ఆవును ఎట్ట సమాలిస్తా వుండావు?" అని జుట్టు బావను ఎవురన్నా అడిగితే, "నూర్రూపాయలు బెట్టి ఒక బండి ఎండు కసువు తోలించుకున్నా." అని జెప్పేవాడు.

జెర్సీ ఆవు ఏనుగుతో సమానం. ఏనుగుకు మేతందించడం సామాన్యమా? ఆ బండి కసువు నెలకంతా వురువు లేకుండా అయిపొయ్యేది.

గొడ్డునెంత సేపూ కొట్టంలో కట్టేసుకోనుంటే జరుగునా? కాళ్ళు సాగేటట్టు తిప్పులాడద్దా? గొడ్డు కూడా వొంగనబడి నాకులాడితేనే దానికీ కడుపు నిండినట్టుండేది!


కయ్యలేనోడు – కయ్యల్లోకి గొడ్డునెట్ట తోలకపొయ్యేది!

ఒకనాడు మా జుట్టుబావ వూలోళ్ళ కయ్యల్లో ఆవు గొడ్డును బయం బయంగా మేపుకుంటా వుంటే, “నువ్వు కయ్యమ్మింది పొరబాటు గదా!” అని కొంచిం కారిం జల్లినా.

అప్పుడు బైటపడింది అసలు కత.

“మీ యత్త నస బరించలేకనే కయ్యనమ్మేసి దిక్కులేనోడినై పోతిరా సినబ్బా! ఆ కయ్యను తెగనమ్మే దాక మీయత్త నన్ను రొండుగాళ్ళూ ఒక సోట పెట్టనిచ్చిందా? కరకంబాడిలో ఎన్టీరామారావు నగిరి కాలవకు టెంకాయకొట్టి పూజ జరిపించేసి పొయ్‌నాడు చూసినావా, ఆ మరసనాడే మనూరికి ప్లాన్లు గియ్యాలని ఇంజినీర్లు రాలా! అప్పుడా ఇంజనీర్లు రామచంద్రాపరం కాడ నిలబడుకోని ‘నగిరి కాల్వ ఇట్టొస్తింది’ అని తూరుపు దిక్కుగా చేతులు చూపించినారంట. నా కయ్య కూడా తూరుపు దిక్కన్నే గదా వుండేది. అంతే! ‘మనకుండే గోచిపాతంత కయ్య గవుర్మెట్టోడు కాలవకు తీసుకునేస్తాడు. నువ్వా కయ్యను కాలవ రాక ముందే అమ్మతావా అమ్మవా’ అని కుచ్చునింది మీ యత్త. ఆ ఇంజనీరు నా కొడుకులు రామచంద్రాపరం వొచ్చినప్పుడే మీ యత్త ఇడ్డెన్లు తెద్దామని రామచంద్రాపరం పొయ్యుండింది!

ఈ కాలంలో మనం చూళ్లేని నగిరి కాల్వలో పడి కొట్టక పోతి గదరా సినబ్బా – మీ యత్త పోరు పళ్లేక!”



# మా రామస్తానం ఎందుకు బతకతా వుండాదంటేనంట-

ముందరొక చిన్న కజ్జెప్పి మళ్ళ బోతా అసలు కతలోకి.

పాండవులు అరణ్య వాసం జేస్తా వుంటారు. అన్నదమ్ముళ్ళకు కందమూలాలు తెద్దామని బీమసేనుడు అట్లా పోతాడు. అదేమి కర్మమో యాడ గూడా ఏమీ దొరకవు. సరేలే అనుకోని వొక చెరువు దగ్గిరికి చేరి దోసిడు నీళ్లు తాగబోతాడు. అప్పుడా చెరువు గల్ల యక్షుడు, "నేనడిగే ప్రశ్నలకు జవాబులు చెప్పి మళ్ళ తాగు నీళ్ళు" అని అడ్డమేస్తాడు. 'దప్పిగ్గాన్నోడితో నీ పెసండాలేంది సామీ' అని లెక్క జెయ్యకుండా బీముడు నీళ్లు తాగి చచ్చిపోతాడు. ఇదే వాటంతో నకులుడూ, సఖాదేవుడూ, అర్జునుడితో సగా అందురూ సచ్చిపోతారు. తమ్ముళ్లను యెతుకులాడుకుంటా ఆ చెరువు కాడికే వచ్చి ధర్మరాజూ అన్ని నీళ్లు తాగబోతాడు. యక్షుడు యదా పకారం ప్రశ్నలడగతాడు. సూక్షిం తెల్సినోడు గదా – ధర్మరాజు అన్నిటికీ సరిగ్గా జెప్తాడు. యక్షుడు కుశాల పడిపోయి, 'నీ తమ్ముళ్ళల్లో వొకర్ని కోరుకో – బతికిస్తా' నంటాడు. ధర్మరాజు నకులుణ్ణి కోరుకుంటాడు. యక్షుడు ఆచ్చిరీక పోయి, 'గదా యుద్ధంలో మొగలాయినీ, ఇలు యిద్దెలో ఇక్లామార్కుణ్ణీ పక్కన బెట్టి నకులుణ్ణి కోరినావేమి ధర్మనందనా?' అని అడగతాడు. అప్పుడు ధర్మరాజు పాలూ కూడూ తినే నోటితో ఏమంటాడయ్యా అంటే–

"కుంతి పేరు జెప్పేదానికి నేను మిగిల్నాను గదా, మాద్రి పేరు జెప్పేదానికి నకులుడు వుండొద్దా?"

బారతం మొత్తం మింద నాకీ ఘట్టం మఖా ఇష్టం. నా చిన్నప్పుడు రామాపరంలో జరిగే ధర్మరాజుల తిరనాలలో హరిదాసు ఈ కత జెప్తా వుంటే ఇని ధర్మరాజులు పాటించిన నీతికి దుఃక్కం వొచ్చి బొరోమని ఏడ్చేసి వుండాను. నేను బతికింత కాలం గుర్తు బెట్టుకునేటట్టు ధర్మరాజులు ఎంత యిదితో మాట్లాడినాడో మొన్నంటే మొన్ననే మా రామస్తానం అంతే యిదితో మాట్లాడి నన్ను ఏడిపించింది. ఆమె మాటల్ను మీకు జెప్పేస్తే ఈ కతలో నా మతం తీరిపోతింది.

అర్జునుడికి ఎన్ని పేర్లో నాకు అన్ని (మారు) పేర్లు. వాటిలో అన్నిటి కన్నా నా కిష్టమైన మారు పేరు – రామస్తానం మిండగోడు! మేము యెంగటాపరం అయిస్కూలికి పొయ్యే దోవలోనే వుండేది రామస్తానం మడి. రామస్తానం ఎప్పుడు జూసినా ఏదో వొగటి చేస్తానే వుండును కయ్యలో వొంగొని. ఒకనాడు నేను మా ఉమ్మడితో, "రామస్తానం అవ్వ బలే కష్టిజీవిరా" అన్నా. మా పిలకాయలకు ముసిలోళ్లను లంజిలుగా తగిలించడం వొక కుశాల. వాడు ఆ మాటతో గూడా, "రామస్తానం బలే కష్టిజీవి లేరా, రామస్తానం మిండగోడా!" అనన్నాడు. రామస్తానం మనవడు రాజగోపాలుడు గూడా నన్ను, "ఏమిరా రామస్తానం మిండగా!" అనేటోడు. నేను గూడ అందుకు తగ్గట్టుగానే, "అవున్రా నేను రామస్తానం మిండగోణ్ణే. ఏం జేస్తారో చేస్కోబొండి" అని కుచ్చునే వోణ్ణి.

ఇది మేం పిలకాయలంగా వుండేటప్పటి కత.

రామస్తానానికి మూడెకరాల దాకా వుండాది కయ్య. ఆమె కొడుకి పేరు కుక్కలాయన. అసలు పేరు యెంగట్రత్నం నాయుడనుకుంటా. రామస్తానం వాళ్లకు నీటి సౌక్రిం లేదు. వూలోళ్ల బావల నీళ్లను కయ్యలకు పారగట్టుకొని అగచాట్లు పడతా వుండేటోళ్లు. ఎన్ని నాళ్లీ బందరాట అన్జెప్పి రెండేండ్లకు ముందర కుక్కలాయన వొక బాయి తొవ్వినాడు. బాయిలో యిసికొచ్చింది. ఎనిమిది మట్లు తొవ్వినాక (మట్టుకు ఆరడుగులు, అదీ లెక్క.) నీళ్ళు కనిపించినాయి. ఇసికి వరస బాయిగదా ఇంకొన్ని నీళ్ళు చేరితే బాయి వుర్లి

మొత్తం పడిపోతిందని కుక్కల బావ బిత్తరపొయ్ బాయి తొవ్వడం నిలిపేసి ఇరైయేలు దాకా కర్జుపెట్టి సిమిటీతో కిందినుంచి పైదాకా ట్రాంగుగా వరలు బోసేసినాడు. మళ్లీ మట్టు లోతు తవ్వి చూసును గదా – ఆ చేరడు నీళ్లే. సరేలే అన్జెప్పి అంత లోతు బాయిలో నాలుగించీ బోరు డెబ్బై ఎనపై అడుగులేసినాడు. కోతికన్నా గీత చక్కంగా వుండాల గదా. నీళ్లే పళ్లా. బాండూ పత్రాల మింద కుక్కల బావకు 30 వేల దాకా అప్పు. ఇప్పుడు కుక్కలాయన కయ్యగల్ల చక్రొర్తి అయినా తిరప్తికీ వూరికీ బండి బాడిగిలు తోలుకుంటా ఆయన చావు ఆయన చస్తా వుండాడు.

రామస్తానం ఇంగా రెండు మూడేండ్లు లేచి తిరుగులాడుండును గాని ఈ మనేదతోనే మనిసి వుడిగి పొయ్యింది. చేతికి దుడ్డుకట్టి గూడా వొచ్చేసింది. కండ్లల్లో పూలు బడిపొయ్ అద్దాలు గూడ తగిలిచ్చుకొనింది.

ఒకనాడు మా రామస్తానం ఎగవీది నుంచి మా దిగీదికి వచ్చుంటే నేనే తమాసగా, "ఏం సామీ, ఇంక గుంతకల్లుకు టిక్కట తీస్కోక పొయ్నావా? పీతిలో వుచ్చులో పడకుండా ఇంగ నువ్వు పొయ్యేదే మేలు గదే రామస్తానమా?" అన్నా తమాసగా.

రామస్తానం తమాస తమాసగా కొంచేపు మాట్లాడినాక కడాన నాలుగు మాటలనింది.

"నా చక్రవర్తి కొడుకు వుండే అప్పుతోనే అల్లాడతా వుండాడు. ఈ టయింలో నేను జస్తే మళ్లా మూడేలు అప్పుజేసి గదా నాకు దినాలు జెయ్యాల. దినం చెయ్యకుంటే నీబోటి నా బట్టలు తల్లి చస్తే దినాలు చెయ్యలేదు చూడని నా కొడుకుని బొక్కలాడరా? మా అప్పు తీరే దాక నేను బతికేది బతికేదేరా నా బట్టా!"



# నా పుంజున్నువ్వు... నీ పుంజున్నేను-

సూటి గొడ్లను కూట్నీళ్లకు బేరం జేసే మా తెల్లాయనే మా పుంజును జూసి, "అర్రై రూపాయలకిస్తావా సినబ్బా!" అనడిగితే, "దొబ్బుదువుండు దోస పొండు! మా పుంజును మేము నడవలూరు పందాలల్లో కత్తి గట్టమా. అంత లేసుగా దాన్ని అమ్మతామా?" అని నిన్నంటే నిన్ననే ఎగ నీలిగినాను.

అటుమంటి పుంజు ఈ పొద్దు వుడీస్!

"మన పుంజు యాడా కనపళ్లేదబ్బా. యెతకని తావులా!" అంటా కాళ్లీడ్చుకుంటా వచ్చింది మా చేతగాని ఆడది.

కోళ్లు మాకు పైరయినట్టు మా వూళ్లో ఎవురికీ గావు. మా పెట్ట వొక గీటు చేస్తే దాంట్లో సగానికి సగం ఎప్పుడూ దొంగలకే. ఈ మాదిర్తో దొంగలకు పోను మిగిలిన వాట్ని మాసూలు జేసి మాయమ్మ మా సిన్నప్పట్నుంచి గూడా మా అందరికీ గుడ్డాగుసురు యెగేసేది. పండగా పాడూ వస్తే కాలీశ కూర తెచ్చుకునేది తెల్సేగాని కోణ్ణి గోస్కునేది మాకు తెల్దు (రోగం వొచ్చి చచ్చిన కోణ్ణి కోసుకొనేది మాత్రం తెల్సు.)

కోడి ఆస్తి ఒక ఆస్తని అనుకోవాల్సిన పన్లా. అయినా గూడ నిమ్మళం దొరకద్దా!

ఆ రోజనంగా సమియానికి మాయమ్మ ఇంట్లో లేదు. మా వొదిన కనుంటే ఆమెకు సేవలు జేస్తా తిరప్తిలో ఆడోళ్లాస్పత్రిలో వుండింది.

ఇప్పుడెట్టరా బగమంతుడా?

మన కోడి యాడా కనపళ్లేదని తెలవంగానే మనం ఏం జెయ్యాలంటే – వూళ్లో నాలుగీదులూ తిరగతా మానం తప్పిన మాటలన్నిట్నీ అడిగెయ్యాల. మన సొత్తు గెట్టిదైతే ఆ తిట్లు గాలికి పోవు.

“ఏమే దేబ్యే మొకందానా! కోడి కనబళ్లేదంటా మూదేవి మొకమేస్కోని రాకపోతే కొంగు బొడ్లో దోపి మీయమ్మ గారూర్లో నేర్చిన తిట్లన్నీ తిట్టలేవా? దిగు దిగు, అర్జంటుగా గడప దిగు. నాలుగ్గెంటల కాడ కూడ నేను చల్లిన నూకను మన పుంజు తినుండాది. ఎవ్వురో ఇప్పుడే పట్టి కమ్మేసుకునుంటారు. ఇంతలేకే గొంతు కోసుండరు....” అని నేను మా ప్రబాను ఉపద్ర పెట్టినా.

“ఈ మొగలాయి సంపారిచ్చిన కోళ్ల ఫారాన్ని ఎవురో దొబ్బకపొయ్‌నారని ఈదులు తిరగతా తిట్టాలంట!” అని అది నా మిందికే ఎగబడొచ్చింది.

“నీకు ఇంట్లో వుండే నోరు ఈదిలో వుండదే!” అని దాన్ని కొంచేపు గోకి నేన్ దిగినా గడప.

రాత్రి పూట మా కోడి పుంజు వొదిగే చింత చెట్టు కింద చేరి, “ఈ పొద్దు నా సొత్తును తింటారు సరే, రేపు నాకు పుట్టి నా రుడం తీర్చద్దా? వూలోళ్ల సొత్తు వుక్కళంగా తినేస్తే సరిపోతిందా? మీ నోళ్లల్లో గండుమల్లి పుండు పుట్టదా? మరేదగా మంచి మాటల్తో మా పుంజును ఇడిసి పెట్టండి!” అనేసి దొంగలకు కొంచిం టైమిచ్చినా.

“పదైదు నూర్రూపాయల వుజ్జోగం జేస్తుండాడు. కోడి బోతే పొయ్యిందిలే అని గమ్మనుండాడేమో చూడు సినబ్బ! ఆడదానికి మించినట్టు అడగతా వుండాడు మాటలు!” అని నన్ను మెచ్చుకుంటా ఇంట్లో నుంచి ఈదిలో కొచ్చింది కడుపత్త.

“రెయ్యి డూటీకి నేనిప్పుడు ఆపీసుకు ఎలబారాల. ఈ పొద్దు ఆపీసుకు నాం బెట్టేది గేరంటు. ఏదో ఒకటి తేలాల్సిందే. నా కోడి పుంజునెవరైతే కమ్మేసుకున్నారో వాళ్ల ఇల్లు ముందర మూసేసి యెనక తెరిచేస్తారు! దొంగ మొకం నా బట్టల్ నా సవుతుల్ దగ్గిర కోళ్లను ఎట్ట కాపాడుకొనేదమ్మా” – నా నోటికి బీగమేసేసింది నా పెళ్లాం!

నేను మొగ పుట్టక పుట్టి ఆడ తిట్లు తిడతా వుంటే నా పెళ్లాం తలగుడ్డ నేల పడిపోతా వుండాదంట!

ఇంక లాబం లేదన్జెప్పి ఇంట్లోకొచ్చేసినా. పెళ్లో నీళ్లు పోసుకుంటా వుండినా గూడా నా నోరు పడతానే వుండాది.

"కష్టిపడాల, కూడు తినాల. ఈ మాదిర్తో దొంగసొత్తు తిని కండలు బలవ పెట్టుకుందామనుకుంటా వుండారా, నా కొడుకులాలా నా కూతుండ్లాలా"

నా తిట్లు ఆడోళ్లు గూడా నేర్చుకునేటంత బాగుండాయి.

ఇంతలో నా సావాసకోపు యెర్రోడొచ్చి, "సుబ్బరమణ్ణెం! నీకు రాత్రికి మటన బోజినం, పార్టీ అనుకో!" అని గొణిగినాడు నా చెవల్లో.

వాడు పార్టీ అన్జెప్పి నన్ను నేరుగా వాడి మడి కాడికి తొడుకోని పొయ్‌నాడు.

బాగ మొబ్బుడి పొయ్యింది.

నిజ్జంగానే పార్టీ. దుత్త నిండికీ కల్లు. ఒక బొవాని నిండికీ మటను. నేనూ, యెర్రోడూ, ఆంజిగోడూ, బ్రమ్మానందడూ– మేం నలగరమే!

"యెర్రా! కూతురు బుట్టినా గూడా బెమ్మాండమైన పార్టీ ఇచ్చినాడు మా యెర్రోడు – అని పేపరకేస్తాలేరా!" అని ప్లాస్టీకు జగ్గుతో ప్లాస్టీకు జగ్గుడు ఈత కల్లును వాయించిడిసి పెట్టినా.

తాగినంత కల్లు!

తిన్నంత కూర!

"ఏమిరా యెర్రం! అంతిల్లు బెట్టుకోని ఈ మడికాడ రడీ జేసినావేమిరా పార్టీని?" కల్లు తాగిన కుశాలలో నా వొళ్లు నాకు తెలవకుండా అడిగినా.

"ఆడదాందగ్గిర మాంసం కూర వొండించుకొని రీతిగా తిన్న మొగోడెవుడు జెప్పు? వుడికిందో లేదో అని వొక తునక, వుప్పు బట్టిందో, పట్టలేదో అని వొక తునక, కారం సరిపొయ్యిందో లేదో అని వొక తునక, ఇంగ మనకు మిగిలేదేంది మూడు ఎనికిలా?" అని సిద్దాంతరం మాట్లాడినాడు మా యెర్రం.

ఇంగొక్క జగ్గు కల్లును అదర దొబ్బినా.

నేనా రోజు తినిన కూర – నా పెళ్లానికి కోపం వొస్తే వొచ్చింది గాని– నేనొకింటికి అల్లుడైనాను గదా అక్కడ గూడా నాకంత దక్కలా.

అది సున్నమేసిన కల్లు. నాకు తెల్చు. నా కండ్లు గిర్రన తిరిగినాయి.

మా ఆంజిగోడు నాకు శ్రీరామచంద్రుడి మాదిర్తో కనిపిస్తుండాడు.

యెర్రోడు నా చేతులు బట్టుకోని,"సుబ్బరమంజిం! నీకు బాగ కైపెక్కినాక వొగటి జెప్తా" అనన్నాడు.


"నీ దర్మాన ఎక్కిందిరా!" అన్నా.

"అయితే ఇను! చెప్పకుంటే నా నోట్లో గండుమల్లి పుండు పుడితిందేమోనని బయం! సందేళ నాలుగూ నాలుగున్నర గంటల కాడ మా పెట్టను మీ పుంజు తరుంకోని తరుంకోని–"

నాకర్తమైంది.

"నిలిపెయ్, ఇంగ జెప్పద్దు!"

అప్పుడు నా మూతిని జూసేదానికి ఆంజిగోడు ఇష్టి పడక, "ఏంరా సుబ్బా! మనిండ్లల్లో మనుసొప్పి మన కోణ్ణి మనం కోసుకునే కత జరిగేదేనా? ఇంట్లో ఆడవి వొప్పుకుంటాయా? తాగే పాలను తిరప్తిలో అమ్మినట్టు తినే కోళ్లను గూడా అమ్మాలంటా వుండ్లా! నా పుంజు నీ పెట్టన్ తరంతా వచ్చినప్పుడు నువ్వు కోస్కో. నీ పుంజు నా పెట్టన్ తరంతా నా ఇంటికొచ్చిప్పుడు నేను గొంతు కోసేది కోసేదే వాయ్ – నువ్వు మూతినెంత పొడుగు బెట్టినా!" అని శాస్త్రం మాట్లాడినాడు.



# రొయ్యాస్పత్రిలో చెంగాళత్త డ్రామా-

ఈ కతను నేన్జెప్పినట్లు తెలిస్తే మాత్రం మా చెంగాళత్త నా కాడికొచ్చి, "నా బట్టా రొయ్యాస్పత్రిలో నా డ్రామా గురిచ్చి గూడ పేపరకేసేసినావంటరా ముండ నా బట్టా!" అంటా కోకెత్తి నా మొకానేసేసి నన్ను వూపిరాడకుండా చేసీ బోతింది! అందుకే ముందే చెప్పేస్తా వుండానబ్బా - రొయ్యాస్పత్రిలో పన్జేసే వుజ్జోగస్తుళ్లు మాత్రం చెవల్లో దూదులు బెట్టుకోండి. (మా రొయ్యాస్పత్రిలో దూదిగ్గూడ కరువేరా బోసడీకే!)

ఇంగ నేను కత కానిస్తా-

స్కైలాబ్ పడిపోతిందనే పుకారొచ్చినప్పుడు - అది రేపు పడబోతిందనంగా ఈ పొద్దే మా వూళ్లో నాలుగు పోతులు తెగి పోతే గెంట టయంలోనే కూరంతా గెద్ద తన్నక పొయ్‌నట్టు తన్నక పొయ్‌నారు మా వూరోళ్ళు! ఇంక ఈ రోజే గదా బతకబొయ్యేది, రేపేమన్నా బతకబోతామా, తినాల్సిందంతా ఈ పొద్దే తినేద్దాం - అనే దీంతో! ఆ పొద్దు గూడా చెంగాళత్త, "కలిగ్గం అంత లేసుగా మునిగి పోదురా తిక్కలెదవ లాలా!" అన్జెప్పి అంత చింత కాయ వూరుబిండి నూరుకొని సంగట్లో యేస్కోని తినింది.

చెప్పాలంటే చెంగాళత్తకు ఎప్పుడూ ఎనప గొడ్డో అవు గొడ్డో ఈనతా వుండాల్సిందే. ఇంట్లో పాల చుక్క కనబడతా వుండాల్సిందే. అదీగాక వుడుబొయ్యే బెండ తోట వుడుబోతా వుంటే, పూతకొచ్చే వంకాయ తోట పూతకొస్తా వుంటాది.

ఒక రోజు పాల కేన్లెత్తేస్కోని పొయ్యే టాకట్ర చెడిపోబట్టి మా వూరికే రాలా. ఆ రోజు పాలను లీట్ర మింద అర్ధ రూపాయి తగ్గించి చాకలోళ్లకు పోసేసింది. పుచ్చు బెండ కాయల్నూ, అదవా కంటికి తప్పి పొయ్న ముదురు వంకాయల్ను గూడా ఒక గుడ్డలో సప్రేటుగా కట్టుకోని తిరప్తి మార్కెటుకు పోవాల్సిందే. కొంచిం పరిస్తితి తక్కువగా వుండేటోళ్ళు ధర తగ్గించి చెప్తే వాటినీ తీస్కుంటారంట.

ఇంట్లో అంత నారాగోరాగా తిండి తింటా వుండినా వూళ్లో ఎవురన్నా, 'అది కడుపుకు ద్రోహం చేసుకుంటుండాద'ని చెప్పుకోని నవ్వుకుంటారేమోనని చెంగాళమ్మకు బలే వుక్రోసం.

ఒకనాడు బక్కత్తా, మాయమ్మా, నేనూ మా తిన్నె మింద ఈదిలో కుచ్చోనుండాం. బక్కత్తకూ, చెంగాళత్తకూ అదేమి నాశినమోగాని వాళ్లిద్దరూ అంత బిడ్డలుగా వున్నప్పట్నుంచి గూడా నిప్పుకూ వుప్పుకూ వున్నట్టేనను కుంటా. ఆ పొద్దు మేం ఈదిలో కూచ్చోనుంటే చెంగాళత్త పేడ తట్టెత్తుకోని పోతాపోతా ఆమె తేపిన తేపులను నేనిక్కడ ఎట్ట జెప్పేది? రెండు ముద్దల సంగట్ని కేజీ కోడి కూరతో తిన్నా గూడా ఆ మాదిరి తేపులు రావు. ఆ చెంగాళది బజిన గుడి కల్లా తిరిగే దాక గూడ 'బ్రేవ్ బ్రేవ్' అని బారడు పొడుగు తేపు మింద తేపు తేపతా పొయ్యింది.

"ఏమి సినమ్మా, దానికి నన్ను జూస్తే ఏమి? అది తేపే ఇదానం జూస్తివా? అంత వుప్పేస్కోని గుండు చెమ్ముడు కూట్నీళ్లు తాగంగానే దానికి అన్ని తేపులు యాడ నుంచొస్తాయి?" అని ఆమె దూప్పు తేపుల్ను బట్టుకోని బక్కత్త ఎగతాళి జేసింది, మాయమ్మతో. ఒక దినం చెంగాళత్త బెండ కాయలు అమ్ముకోని కర్నాల వీధిలో వస్తా వుంటే నేను ఎదురు పడినా. "సినబ్బా, మంచి డాకట్ర వుంటే చెప్పరా నా బట్టా!" అనడిగింది.

"ఏమి సామీ, నీ వొంటికేమి?" అనడిగినా.

"వొళ్ళంతా నిరుసత్తాగా వుండాదిరా నా బట్టా! లేచి తిరుగులాడేటట్టు లేను. నాలుగు బులుకోసు బాటళ్ళెక్కించుకుంటే నరాల్లోకి డైరక్టరగా సత్తా వొస్తింది గదాని అనుకుంటుండా" అనింది.

నాకు నిజ్జంగా బలే దుఃక్కమొచ్చింది. మా వూళ్ళ పక్క ఇదొక వాడికైపొయ్యిందందరికీ. "నాకేమో వొళ్ళు నిండా డిమాండుగా వుండాది డాకట్రా! నాలుగు బులుకోసు బాటిళ్ళు ఎక్కించా!" అంటా మాబోటి తెలవనోళ్ళు డాకట్రల దగ్గరికి పోతారు. డబ్బుకు పియ్యి దినే కొంతమంది నా కొడుకులు, "నిజమేనమ్మా! నీ వొళ్ళు శానాశానా డిమాండు కొచ్చేసింది. కొన్నాళ్ళు బెడ్డు మింద చేరు. ముప్పై గులుకోజు బాటళ్ళు యెక్కించాల్సిందే నీకు!" అని వుపద్ర పెడతారు.

"అతా, చెంగాళతా! గులుకోజు నీళ్లంటే మంచి నీళ్లతో సమానం. నా మాటిని మంచి కూరగా మంచి కూడుగా నువ్వూ నీ బిడ్డలూ తినండి. మన కయ్యలో పండిందంతా తిరప్తిలో అమ్మేస్తే ఎట్ట జెప్పు? తిరప్తోళ్లకేనా నోరుండేది? మనకు లేదా? నా మాటిని దినానికి కనీసం కాలు లీటరు పాలు పొయ్యి సెగన బెట్టుకోని చేమిరేసి అన్ని మజ్జిగ్గా తాగు" అని మొకాన నవ్వనేది లేకుండా చెప్పినా.

"నా బట్టా! ఒక బిడ్డ తండ్రయినాక గూడ నీకీ కుశాల మాటలు పోలేదే!" అనేసి గులుకోజు బాటళ్ళు ఎక్కించుకొనే దానికి చెంగాళత్త డాకట్ర దగ్గరికి పోనే పొయ్యింది.

ఇది జరిగిన రొండేండ్లకనుకుంటా – నేనొక దినుం పనుండి రొయ్యా స్పత్రికి పొయ్యుంటే చెట్టు కింద కనిపిచ్చింది, 'సినబ్బా!' అని పిలస్తా చెంగాళత్త.

"సచ్చినా గూడ నువ్వింతే గదరా నా బట్టా! ఇరై దినుములుగా నేనీడ బెడ్డు మిందుండాననుకో. 'మన అత్త ఏమి కనపళ్ళేదే!' అని వొస్తివా?" అని నిష్టూర పొయ్యింది.

"కూరగాయల యాపారం మింద తిరప్తికీ ఇంటికీ తిరగతా వుంటివను కుంటి సామీ, నాకీ కత తెల్దు" అని నొచ్చుకోని చెప్పినా.

"టీలో రొట్టినద్దుకోని తిందువురా" అని కేంటీనుకల్లా పిలచక పొయ్, "నీ వొళ్లులో మిస్టీకు ఏమి సామీ?" అనడిగినా.

"నాకేమన్నా తీపు రోగమా పాడా?" అని నవ్వి, "తిరప్తిలో ప్రవేటు (డాకట్రలు) నా బట్టలకు బులుకోసు బాటళ్లకని ఎంత డబ్బని దారబోసేది

రా నా బట్టా? ఇరై దినాలకు ముందర నా వొళ్లు నిండా డిమాండయి పూడిసింది. డాకట్రు దగ్గరికి పోతే నాలుగు నాళ్ళు బెడ్డు మిందుండి దినానికి పది లెక్కన బులుకోసు బాటళ్ళెక్కించుకోమన్నాడు. 'పోరా నా బట్టా' అనుకోని వొక రిక్సాను మాట్లాడుకోని ఎక్కినా. రొయ్యాస్పత్రికి రాంగానే వోపీ టిక్కట్లిస్తారే అక్కణ్ణే రిక్సా దిక్కుండానే తేల కండ్లేసేసి యెల్లాలకల పడిపొయ్‌నట్టు డ్రామా ఆడేసినా. రిక్సా వోడికి రూక ముందర్నే ఇచ్చేసినానులే. ఆస్పత్రిలో తొందర తొందరగా బెడ్డు మింద చేర్చుకొనేసినారు. పద్దినాలు పాలూ రొట్టీ ఇచ్చినా గూడ ముట్టలా. బులుకోసు బాటల్లే కనీసం నూరన్నా ఎక్కించుంటారు. మళ్ల రొట్టీపాలు తాగేదానికి మళ్లుకున్నా. నాలుగు నాళ్లుగా అన్నమిస్తుండా రిప్పుడు. ఈ ఇరై దినాలూ కయ్యిలో ఏం పైరు గూడా లేదులే. వోపిగ్గా వుండగలిగినా. ఈ పొద్దే డిశ్చార్జిం. వొళ్లు ఇంగెప్పుడు డిమాండు కొచ్చినా ఈ ఆటే ఆడతా. మీ మామతో చెప్పి ఆయన చేత గూడ ఈ డ్రామా యెయ్‌పిస్తా. ఆయనొళ్ళు గూడా నిండా డిమాండు కొచ్చేసింది పాపం!" పొడిచి గెలిచేసినట్టు చెప్పుకొస్తా వుండాది.

ఈ సమియంలో నవ్వేటంత పంగమాలిన నా కొడుకునా నేను?



# నో! షి ఈజ్ ద నాట్!

"ఎన్ని పుంగునూర్లవితే వొక బెంగుళూరు? నీ మాదిరి సినబ్బలు ఎందురైతే రా వొక ఇంద్రాణి? నువ్వూ వుండేసొచ్చినావు ఐద్రాబాద్‌లో. కానీ, ఏమి సుకం? నీకు మన మోటుతనం పొయ్యిందా? ఇంద్రాణి వొచ్చింది ఐద్రాబాద్ నుంచి. దాని మాటలు పొయ్ ఇనుబో, డిల్లీ కోటల్ దాటతా వుండాయ్!" అంటా మా గడప తొక్కింది బక్కమ్మ.

"ఐతే ఇంద్రాణి ఐద్రాబాద్ నుంచి అమ్మగారింటి కొచ్చింది. ఇదే గదా నువ్విచ్చే సమాచారం?" అని అన్నా బక్కమ్మతో.

"అయితే నేను గూడా పొయ్ ఇంద్రాణి మాటలు ఇనేసొస్తా" అనేసి మాయమ్మ ఈదినబడి పొయ్యింది.

ఇంతటితో ఇంద్రాణి ప్రస్తాపన పోలా. నేను సంగటి తినేసి ఎండ పూటన చింత చెట్టు కింద చేరినా.

అక్కడ ముత్యాలక్క ఏమనిందంటే, "ఇంద్రాణి మన మాటే మరిచి పొయ్యింది. ఆయమ్మికి ఐద్రాబాద్ బాస వొచ్చేసింది. ఆయమ్మి యాస అర్తం గాక వాళ్లమ్మా నాయిన గూడ తనకలాడి పోతా వుండారు"

ఇదేందిరా సామీ–నేను యాడికి బోతే ఆడికి ఇంద్రాణి ప్రశంస వస్తా వుండాది.

ఇంద్రాణి ఈ మిట్టూర్లోనే మా ముందర్నే పుట్టింది. మాకు తెలిసినంత వరకూ మా వూళ్లోనే అయిద్దాక చదివి, యెంగటాపరంలో పద్దాక చదివి మొన్నా మొన్ననే పెండ్లి జేస్కోని ఐద్రాబాద్కు పొయ్యొచ్చింది.

చింత చెట్టు కింద చేరినోళ్ల పేర్లన్నీ చెప్పాలంటే శానా పొడుగ్గా చెప్పాల. ఎందుకులే, మేమంతా ఇంద్రాణిని ఎగతాళి చేసేదానికి మళ్లుకున్నాం.

"మీరేమో ఇంద్రాణి దాక పోతుండారు. మనూర్లో అయిదారు మంది మొగ పిలకాయలు నెల్లూరు టీచర్ ట్రైనింగ్ కాలేజీలో చేరి –పోయిన బస్సుకే తిరుక్కోనొచ్చి –'ఏంటీ ఎలా వున్నారూ' అని రాజమండ్రోళ్ల మాదిర్తో బారడు పొడుగు దీర్ఘం తీస్తా వొస్తారే! మనం వోళ్ల కత చెప్పి నవ్వుకోవద్దా?" అని నేను నాకు చెల్లయిన ఇంద్రాణికి సపోరటగా నిలబడి లా పాయింటు తీసినా.

ఇంద్రాణికి బందుగైన కడుపత్త గూడా, "పాలు గల్ల చోట పిల్లిగా, కూడుగల్లచోట కుక్కగా లేంది, ఈ కాలం బతకలేం గదా! ఐద్రాబాద్లో కాపరం చేస్తా మిట్టూరు బాస మాట్లాడితే మతింపు వుంటిందా?" అని మాట్లాడింది.

"నన్ను ఏడేడు పధ్నాలుగేండ్లు రాజమండ్రి జెమినీలో పెట్టండి. నేను మిట్టూరు మాట మాట్లాడతా వూళ్లోకొస్తానో, రాజమండ్రి మాట మాట్లాడతా వూళ్లోకొస్తానో చూద్దురు గాని" అని మళ్లా నేను క్రాసు జేసి మాట్లాడినా.

"ఎవుర్నో ఒకర్ని ముందరేస్కోని ఎగతాళి చేసి నవ్వుకోందే నీకు తినింది అరగదు గదా!" అంటా మా సందులోకి నోరడ్డమేస్కోని దూరింది మా ఆడది.

అమ్మ, దొరికింది లంజ! నేనెవురెవుర్నో ఎక్కిరించే కన్నా నా పెళ్ళాన్నే సొంతంగా ఎక్కిరించుకుంటా, ఇనండి!

మేం ఐద్రాబాద్లో వుండంగా మా ప్రబా నన్ను బట్టుకోని, "ఏమబ్బా, నువ్వు మొగోడైతే మామూలు బాసలో కత రాయి. మా యమ్మ అట్టనింది, మా నాయిన అట్టన్నాడు అని ఇంట్లో జరిగేటివీ, వూళ్లో జరిగేటివీ రాసేస్తే సరిపోతిందా?" అని సవాలిసిరింది.

"మామూలు బాసంటే ఏందే పిచ్చిదానా?" అనడిగినా.

"యండమూరి, మల్లాది రాస్తారే ఆ బాసలో రాయి" అనడిగింది పాపం కన్నారు.

"ఆ బాసలో వాళ్లిద్దురూ రాస్తుండారు గదే, చాల్దా? ఆ పంగమాలిన బాసను రాసే దానికి ఈ సినక్క కొడుకు సుబ్రమణి గావాల్నా?" అని నాకు నేను పటం గట్టుకున్నా.

ఇంక ఈ తిక్కలెదవతో పని గాదులే అనుకోని ఒకనాడు ఒక కాతికంలో ఏందో రాసి 'చూడ్రా పిచ్చి మొకమా' అని ఇచ్చింది. నేను దాన్ని చూసినా.

దాంట్లో తొలి మాట– అది అమలాపురం! అని వుండింది. రెండో మాటగా వాడెవుడో ముండ నా కొడుకు ప్రదీప్ కుమార్ అంట వాడు స్కూటర్‌లో పోతాపోతా అదెవుత్తినో 'యెనకానెక్కు' అనంటాడంట. ఆ బాస యండమూరి, మల్లాది రాసినట్టుంటే మళ్ల నేను దాన్ని చదవలా.

ఆ కాతికాన్ని లక్షా తొంభయ్యారు ముక్కలుగా చింపి, "అమలాపురం ఏ జిల్లాలో వుండాదే లంజా?" అనడిగినా.

అది "గుంటూరు!" అనింది టకామని.

దాని ఉచ్చికి మిరియాలు దిగేటట్టు వొక్క మొటిక్కాయ ఇచ్చినా. (నిజంగానే. అప్పుడు పెండ్లయిన కొత్తలే.)

"అమలాపురం ఏ జిల్లాలో వుండాదో గూడా తెలవకుండా ఆ వూరోళ్ల మింద కతలు రాస్తావంటే లంజా? నీకెన్ని గుండికాయలే, గుండిలు తీసిన బంటా? నువ్వు కతే రాయాలంటే– నువ్వు పుట్టి పెరిగిన చలంగారి పల్లి లేదా? మీ అవ్వగారూరు – కమ్మపల్లె లేదా? నా కొంప కూల్చను – మా మిట్టూరికి కోడలుగా వొస్తివే. ఈ వూరు లేదా? ఇంకెప్పుడన్నా ఇట్టా కత గాని నా ముందరికి రాసి తెస్తే కోరట కేసి ఇడాకులిచ్చేస్తాన్ లంజా!" అని దాన్ని బెదరగొట్టినా.

కాబట్టి నా పెళ్లాం గూడా పెద్ద మనిషేం గాదు. నేను కుచ్చుంటే ఒకటీ లేస్తే వొకటీ దానికి కర్చు కియ్యబట్టి సరిపొయ్యింది గాని లేకుంటే అది, ఐద్రాబాద్ నుంచి మా వూరు రాంగానే విజీవాడోళ్ల మాదిర్తో 'ఏమండోయ్' అని తయారై వుండదా?

ఇదీ కత. అసలు కతలోకి జొరబడి వచ్చిన ఈ పిట్ట కతను పక్కన బెట్టుకుందాం.

"సినబ్బా! పైకి లేచి ఇంద్రాణి దగ్గరికి పొయ్ రాబో, నేను చెప్పేదిదే. మళ్లొచ్చి నువ్వే జెప్తావు. నేనెందుకు పొమ్మన్నానో!" అంటా వొచ్చింది మాయమ్మ ఇంద్రాణి దగ్గిర్నుంచి అప్పుడే.

తప్పేటట్టులా. ఇంద్రాణితో బేటీ అవదామని జెప్పి నేను ఎలబారినా.

"ఏంటన్నయ్యా? కూర్చో అన్నయ్యా!" ఇదీ ఇంద్రాణి తొలి మాట.

"ఏంటో అన్నయ్యా! సిటీలో అంతా ఈ రోజు నల్లా వుంటే రేపు నల్లా వుండదు. అయ్య బాబోయ్ ఆ పాట్లు" ఇది మా ఇంద్రాణి చెల్లి రెండో మాట.


"నువ్వేమో ఏకంగా నెగటివ్ ప్లేస్ కొచ్చి చేరిపొయ్యావు. హాయిగా వుందా అన్నయ్యా?" ఇది ఆయమ్మి మాట్లాడిన మూడో మాట.

ఇంక నా మాట చెప్పేదా?

"ఏంటేంటో ఇంద్రాణీ! మి, ది నామిని ఈజ్ ద బ్యూటీఫుల్ రైటర్ బట్ నాట్ ఏ గ్రేటెస్టు రైటర్! అక్కడ సిటీలో క్రాస్ రోడ్స్‌లో శాంతీ థియేటర్‌లో శివ సిల్మా అయ్య బాబోయ్ భయంకరస్ అంట గదా! మీ వారిని అడిగినట్టు చెప్పు ఇంద్రాణీ...!" నాకు నవ్వు పట్టకుండా వుంటే అక్కణ్ణుంచి లేచి పరిగెత్తతా చింత చెట్టు కాడికొచ్చేసినా.

నేను చింత చెట్టు కాడికి రాంగానే మా నీలావతి, "ఏం సినబ్బా! ఇంద్రాణి మన మనిషి గాదు గదా! అంతా ఆ పక్క మనిషే గదా!" అనడిగింది.

"నో, షి ఈజ్ ద నాట్, షి ఈజ్ ద ఐద్రాబాదర్!" అని చెప్పి చింత చెట్టు కింద వుండినోళ్లనంతా ఓ అని నవ్విపించినా.



# మా కమలత్త కూర తెచ్చిందహో!

"ఆహా ఇదేమిటి?

హాశ్చర్యమైనది!

ఈ సుందరాంగి ఎవతొ

ఇచట మెరియుచున్నది!"

–గంగిరెడ్డి పల్లెలో మునిరెడ్డి వేటను కోస్తా వుంటే అక్కడ గిన్నెత్తుకోని నిలబడుకో నుండిన కమలత్తన్జూసి యిచ్చిత్ర పొయ్ నేనీ పాట పాడినా.

లేకుంటే మా కమలత్తేంది, అర కేజీ మాంసం కూర కోసరం గిన్నెత్తుకోని వచ్చేదేంది?

ఆ రోజు పండగ్గాడ కాదు. కనాగష్టం ఆదోరమే. ఆదోరం పూట చీకూర తినే తెగింపు మా కమలత్తకు వొచ్చేసిందంటే నాకు యిచిత్రమేనబ్బా!

ఒక రోజు కమలత్తకూ సరోజత్తకూ అలివిగాని తగరారు పడిపొయ్యింది. ఇద్దురూ ఓ అని తిట్టుకున్నారు. అపుడు సరోజత్త ఒక మాటనింది. "నువ్వు వాన కురిసినప్పుడే గద సేయ్ తల దువ్వేది!" అని.

సరోజత్త చెప్పింది అచ్చిరాలా నిజ్జం. కమలత్తకు సమందించినంత వరకు – వాన కురిస్తేనే తల దువ్వేది! ఆడది తల దువ్వి జడేస్కోవాలంటే మాటలా?

తల నిండికి చమురు పెట్టందే చిక్కిడిసి యెంటికలు జడకు అణుగునా? వాన పడినప్పుడు తల తడిస్తే దువ్వకోని జడేస్కోవడం బలే ఈజీ గదా!

అంత జాగర్త ఆడదీ, దరిద్రురాలూ – ఈ పొద్దు అర కేజీ కూర కోసరం వొచ్చిందంటే నాకు పొద్దు పరంట పుట్టితిందనిపించింది. అదీగాక అది మంచి ఎండా కాలం. జాతర కూడా పొయ్యింది. జాతర పోంగానే వానొకటి పడితింది గదా. ఆ వానకు పచ్చిక చిగిరిస్తింది కదా. ఆ చిగురు కసువును కోళ్లు మేస్తాయి గదా. అపుడు పిల్లలూ, కోళ్లూ రోగాలు తగిలి చస్తాయి గదా! మా వూళ్లో అర కేజీ కోడిపిల్ల రోగం తగిలి చస్తే దాన్ని – కోడి గల్లోళ్లే కోస్కోని తినేస్తాం. అరకేజీ కన్నా తక్కువ తూగే చిన్న చిన్న పిల్లలవితే కొందురు శుద్ధిగోళ్లు అసింకానికి పొయ్ ఆ చచ్చిన పిల్లల్ను ఈదిలో పారేస్తారు. ఆ పిల్లలు కమలత్తకు తిరమల కొండ లడ్డుతో సమానం. నిన్నంటే నిన్ననే మా కోడి పిల్లొగటి రోగమొచ్చి చచ్చింది. "కొయ్ బ్రబా తిందాము" అని పోరినా మా ప్యాసనుగత్తె దాన్ని ఈదిలో పారేసింది. ఆ పిల్లను కమలత్త వొందుకొనింది. రోగం తగిలిన కోడి పిల్లల్ను ఒక పక్క తింటా వుండినా ఆగమేగాల మింద కమల్లంజ చీకూర కోసరం వొచ్చిన ఇసోసం ఏందిరా బగమంతుడా?

నేనరకేజీ, కమలత్త అర కేజీ కూరెత్తుకోని మా వూరికల్లా నడస్తుండాం.

"ఏమి సామీ, ఏమి కత?" అనడిగినా.

"తెలవనట్టు అడగతుండావు గదరా నా బట్టా!" అనిందది.

"నిజ్జంతోనే నాకు తెల్దు. నువ్వు కూరాకుకు (మేం మాంసం కూరను కూరాకని గూడా అంటాంలే) వొచ్చినావంటే చాటంత మబ్బెక్కి చెరువు నిండే వాన పడితింది! ఇది గేరంటు. సడే గాని ఏమి ఇసోసం! కర్నాటక లాట్రీ ఏమన్నా తగిలందంటే లంజా?" అనడిగినా.

"నిన్న నువ్వు నాకు జెప్పింది వొట్టిదేనంటరా నా బట్టా" అనింది.

నిన్న నేను దానికేం అపద్దం జెప్పి చచ్చినానో ఎంత గుర్తు జేసుకున్నా మనుసుకు రాలా.

"వొట్టిదే అవితే చెప్పరా – ఇప్పుడు గూడ మించిపొయ్యిందిలా. యెనక్కి పొయ్ కూరను ముస్రెడ్డికి వాపసు ఇచ్చేసొచ్చేస్తా!" అని అడుగు ముందెయ్య కుండా నిల్చి పొయ్యింది.

“నేను నిన్ననంగా నీయట్టా బోసడీకల్తో లచ్చి మందితో మాట్లాడుంటా. నా దోవకడ్డంగా చీమొచ్చినా దాని కష్టిం సుకం అడిగి కనుక్కోందే పోను గదే, తెల్దా నీకు?” అని మాట్లాడే కొందికి కమలత్తకు నిరామయమై పొయ్యింది.

“నాబట్టా! మట్టి గుఱ్ఱాన్ని నమ్మి యేట్లో దిగితి గదరా– అయితే నిన్న జెప్పింది ఈ పొద్దు జెప్పలేదంటే అది వొట్టి దూప్లీకేటన్న మాట” అని కమలత్త నోట్లో తేమ లేకుండా మాట్లాడింది.

అమ్మ. నాకొచ్చింది గెమనానికి!

నిన్న కమలత్తతో నేనొక మాటన్నా.

“బేంకీల్లో పది వేఱ్ఱూపాయల దాకా లోను తీసుకున్నోళ్ళు ఇంగ కట్టాల్సిన పన్లా” అని చెప్పినా, అంతే. “అయితే ఐఓబీలో నేను మూడేండ్లకు ముందర ఏడు నూర్లు తీసుకున్నా. ఆ అప్పు ఎగిరి పొయ్యిందంటావా?” అని ఇక్కడెగిరి అక్కడ దూకింది కమలత్త కుశాలతో. ఈ కత నేను మర్చే పొయ్నా.

“పేపర్లో పన్జేసే నా బట్టవు గదా. నీ మాట నమ్మొచ్చులే” అని నస గూడా బెట్టకుండా సరిగ్గా నమ్మింది.

“అదా! అందుకనా నువ్వు కూరకొచ్చింది?” అన్నా అసలు కత గెమనానికి రావడంతో.

“సినబ్బా! నువ్వు నిన్న నాతో జెప్పిన మాటను గమ్మనన్నా వుండకుండా మీ మామ చెవల్లో యేసినా, అప్పట్నుంచీ మీ మామ – బేంకీలో అప్పుగూడా ఎగిరి పొయ్యింది గదా, ఎల్లకాలం రోగం కోళ్ళనే తెచ్చి నా ఎదాన కొట్టకుంటే అర కేజీ కూర తెచ్చి నా పిండాకూట్లో యెయ్యొచ్చు గదా – అని పాడిందే పాడినాడు. అందుకు సామీ ఈ పని!” అని చెప్పింది.

నేనెటుమంటోణ్ణి! నిప్పుల మింద నీళ్లు జల్లినట్లు, “సదే సదే! కొడమలి లేకనే నేను నాలుగెకరాల మొలగొలుకులు మడిని కోసే రకమనుకో! నామాట నమ్మినావా? తిక్కల్దానా, నీ అప్పు ఎగరకొట్టేదానికి గవుర్మెట్టోడికి నీ మాదిరిగా తిక్కనుకుంటివా? ఇప్పుడేంలే, అర కేజీ కూరే గదా, పదాం పా!” అని మాట్లాడినా.

కమలత్తకు మూతి నల్లంగా పూడిసింది. నన్ను అసింకంతో బారదు పొడుగు జూసి, "నా బట్టా! నీ మాదిరిగా ఆంధ్రజోతోళ్ళ సొత్తు తిని మదమెక్కి లేన్‌రా. తిని ఏరిగేసే దానికి పదైదు రూపాయలు పెట్టగలనంటరా నేను, మళ్ల కతలు గూడ రాస్తుంటావు, వాళ్లట్ట బతికినారు, వీళ్లిట్ట బతికినారు అన్జెప్పి!" అని గిరక్కన గంగిరెడ్డి పల్లి కల్లా తిరిగింది.

ఇంక లాబం లేదన్జెప్పేసి, "నా వొక్క బిడ్డి సొచ్చిగా బేంకీలల్లో అప్పెగిరి పొయ్యింది. నీకా బయ్యంలా, నా మాటిను" అని గెడ్డాం బట్టుకోని చెప్పినా.

"ఏమో నా బట్టా! నేనప్పు కట్టేది నిజ్జిమే అవితే ఈ పదైదు రూపాయలు నిలబెట్టి వసూల్జేస్కుంటా నీ తావన!" అని నాకు యెచ్చిరిక జేసేసి మా సంసారి కమలత్త, మా బిడ్డలు గల్ల కమలత్త మళ్లా మా వూరికల్లా తిరిగింది, అర కేజీ కూరతో!!!



# పెళ్లానికి బయిపడే పెరుగు సాయిబు

మా ఆవు ఈనింది.

దానెమ్మా నాయాలీ ఆవు ముగ్రు పాలే రెండు లీటర్లిచ్చింది.

ముగ్రు పాలే రెండు లీటర్లిచ్చింది, వొళ్లారితే తెల్లారి మూడూ సందేళ మూడూ పిండితిందని మా ఇంటోళ్లం కుశాల పడిపొయ్‌నాం.

"సినబ్బా! మీ ఆపీసోళ్లంతా విజీవాడ పక్కోళ్లు గదా. వోళ్లకు జున్నంటే బలే ఇష్టిం అనుకుంటా గదరా. లీటరయిదు రూపాయిల్జెప్పినా వోళ్లు కండ్లకద్దుకోని కొనుక్కుంటారు. సీసాలల్లో పోసిస్తా, ఎత్తక పోతావా?" అనడిగింది మాయమ్మ.

"నిద్దర్లేస్తే వొకరి మొకం వొకరం చూసుకుంటాం గదమా, 'కూడా పన్జేసే వోళ్లగ్గూడా ఈ నాకొడుకు పాలమ్మినాడు జూడు' అని అనుకుంటారే! వూరికే పోసిస్తానంటే ఎత్తకపొయ్ – నాకంటే పై ఉజ్జోగస్తులొకరిద్దరికిస్తానమ్మా!" అని జెప్పినా.

"నువ్వు జెప్పేది – మన నోరు కట్టిపెట్టి వూలోళ్లకు ఎత్తకపొయ్ ఇస్తానంటావా? బాగుండాది శాస్త్రం. బతికే పని ఏదీ జెయ్యవు గదా నువ్వు." అనేసి మాయమ్మ ఆ నాలుగు పూటలూ జున్ను చేసింది.

జున్నయ్యేది చాలుకోని పాలు పాలైనాయి. నాకు బుద్ధి తెలిసినాక అర శేరు పాలను పొయ్యి మింద బెట్టి నాలుగు పిడకల్ను పొయ్యిలో యేసిన పాపాన మేం పొయ్యుండం. మఖా అవితే సొలిగా రెండు సొలిగలే!

"లేత పాలు గదా. యెన్న శాతం రాదు. నాలుగు దినాలు మీరే కాగబెట్టుకోని తాగీయండి" అన్నారు మా పాల డిపో వోళ్లు

సడే సడే. కాగబెట్టుకుని తాగేది – తెల్లారి మూడు లీటర్లూ సందేళ మూడు లీటర్లూనా? మావి కడుపులా రాయల చెరువు తూములా?

సరే, తెల్లారి పాలూ సందేళ పాలూ కాగబెట్టి చేమిరేసినాం. ఒక పెద్ద కుండకయ్యింది పెరుగు.

అంత పెరుగును ఎక్కడమ్మాలబ్బా?

మా మాదిగ పల్లోళ్లగ్గూడా గొడ్డూ గోదా వుండాయి. కాబట్టి వోళ్లు పావలాగ్గూడ పెరుగును పోసుకోరు. అవితే, రామచంద్రాపరం కాడ ఎరికిలోళ్లుండారు. వాళ్లకు మేపుకొనే దానికి పందులూ, వుప్పమ్ముకునే దానికి గాడిదలూ వుండాయే గాని గొడ్డూ గోదా లేవు. వాళ్లకు పెరుగు పిరిమే.

పెరుగులో నీళ్లు కలిపి పలసంగా (ఎట్టుండిన పెరుగు అట్టనే తాగితే తాగినోళ్లకు ఒళ్లు వుడుకు చేసేస్తిందంట, మాయమ్మ జెప్పింది!) చేస్కోని మా అమ్మాగొడుకులం అమ్మకానికి ఎలబారినాం.

"ఏమబ్బా! మీయమ్మ అమ్ముకోనొస్తింది గాని నువ్వింటి కాడనే వుండబ్బా!" అని మా ఇంటిది నా గెడ్డాం బట్టుకోని అడిగింది.

దాని మొగుడు పెరుగమ్మను బోతే దానికి అగుమానం!

"నీకేమమ్మా, నీ మొగుడంటే ఆంధ్రజ్యోతిలో వుజ్జోగస్తుడు. నువ్వమ్మవు పెరుగు, నాకెవురుండారు, పాలో పెరుగో అమ్మి పొట్ట బోస్కోవద్దంట సేయ్" అని దానికి సరిగ్గా జవాబు చెప్పేసి గడప దిగినా.

ఎరికిలోళ్లు సగానికి సగం పెరుగు పొయ్యించుకున్నారు. రేటు దర్మంగానే పెట్టినాం. లోటాడు కాలు రూపాయి.

ఇంకా మిగిలి పొయ్యింది. అమ్మే చోటు గూడా మిగిలిందిలే.

మా వూరికి పరంటగా చిన్న గుట్టొకటి వుండాది. ఆ గుట్ట దగ్గిర సాయిబులు బండ కొడతా వుంటారు. వాళ్లగ్గూడా పాలూ పెరుగూ బలే పిరెం. ఈ మాదిర్తో ఎవురన్నా లేత పెరుగెత్తుకోని బోతే– గెద్ద తన్నక పోయ్‌నట్టు తన్నక పోతారు. ఆడికి పొయ్‌నాం మాయమ్మా గొడుకులం. గుల్ల కొట్టే సాయిబులు దండిగానే పొయ్యించు కున్నారు. నీళ్లు బాగా కలిపినాం గదా యింగా మిగిలి పొయ్యింది – రెంద్రూపాయల పెరుగు.

దాన్నెత్తుకోని ఇంటికొచ్చేస్తా వుంటే జరిగిందీ కత.

సాయిబూల కాలనీని దాటుకోని వొస్తా వుంటే ఒక సాయిబూ, “మో ఇట్రా!” అని మాయమ్మను సైగ జేసి పిలిచేసి గబక్కన – ఒక కొట్టంలోకి దూరేసినాడు. ఆ సాయిబు ఇందాక బండ మింద గుల్ల కొడతా కనిపించినాడు. పేరు సైదా సాయిబనుకుంటా.

“ఏం సాయిబా!” అంటా పొయ్‌నాం.

“ఎంతమా పెరుగు?” అనడిగినాడు ఆత్రం ఆత్రంగా.

“లోటాడొచ్చి కాలు రూపాయి.” అని చెప్పినాం.

“ఒక్క లోటా ఇయ్.”

మాయమ్మ లోటాకు పెరుగిచ్చింది.

గుటగుటా తాగేసినాడు.

ఇంగొక లోటా అడిగినాడు.

మాయమ్మ ఇంగొక లోటా ఇచ్చింది.

గుటగుటా తాగేసినాడు.

“మాయాడది గుల్ల గొట్టేది నిలిపేసి వొచ్చీబోతింది. చూడన్నో!” అని నన్ను కావిలి బెట్టి మళ్లా ఒక లోటా అడిగినాడు.

ఆ వాటంతో నాలుగు లోటాల పెరుగు పొయ్యించుకోని తాగేసినాడు.

"ఏమిరా నీయమ్మా కడుపు కాలా! దొంగతనంగా అన్ని లోటాలు పొయ్యించుకోని తాగేస్తా వుండావు. ఈ పెరుగునంతా ఇంట్లో బెట్టుకోనుంటే నీకూ నీ పెళ్ళాం బిడ్డలకూ కాదంట్రా ముండెదవా?" అనింది మాయమ్మ.

"మ్మో, గమ్మనుండమ్మా చాలుగాని.

నాపెళ్లాం బలే లంజిమా.

అది తిన్దు, తాగదు.


నన్ను తిన్నీదు, తాగనీదు.

ఎండకు బండ మింద పన్జేసి పన్జేసి వొళ్లుడుకు జేసేసింది. నాలుగు నాళ్లయిందమా, వుచ్చబోసి!

రేపు గూడ పెరుగు తే, తల్లా!

నాలుగ్గాదు ఆరు లోటాల్ దాగి నీ డబ్బు నీకిస్తా.

ఈ కత నా పెళ్లానికి జెప్పేరు సాములాలా!"



# నాది కోతి చేష్టా –
# మా పొట్టవ్వది నీతి మాటా–

రెయ్యి డ్యూటీ  జేస్కోని ఇంటికొచ్చే సరికి యెచ్చూ తక్కవ ఎనిమిదై పొయ్యింది.

పచ్చికాలం గదా. అదలా బదలా గొంతులో అన్ని సద్దినీళ్లు బోస్కోని ఎనుములు్ను యిడిసి పెట్టినా.

నాకిష్టమైన వాటిల్లో ఎనుములు్ను మేపేది మొదుటిది. (ఈ మాట నేనంటే– దరిద్రుడు దరిద్రం కోరతాడంటే ఇదే గదా– అని అంటింది మా ఇంటిది.)

ఎనుములు్ను దక్షిణంగా మడి కాడికి తోలినా. ఆ యాళకే  నీలావతీ, శారదమ్మా, పిత్తల చెంగయ్య కోడాలూ – ఒకరా ఇద్దురా మా దక్షిణంగా పట్టెడంతా గొడ్డూగోదతో రామందాడిగా వుండాది. ఎనుములు్ను మనం కట్టిబట్టి మేపేది ఏమీ వుండదు. యాడ జూసినా పచ్చికే. నాబోటి పోరంబోకు నాయాలీ దునపోతులు రెండు తప్ప ఎనుములన్నీ మోరెత్తకుండా సగించినట్టు నాకులాడతా వుండాయి. వాటి పని వాటిది. మన పని మనది. పట్టిడంతా కల జూసినా, వూరికే వుంటే వూరా పేరా?

పొట్టతాత పెండ్లాం పొట్టవ్వ పారతో కసువును తొవ్వుకోని తట్టకేసుకుంటా అగచాట్లు పడతుండాది.

యెనకాన్నే దాని దగ్గిరికి పొయ్ వాణీస్పర కొంగును నాగేస్ప్రావు బట్టుకొన్నట్టు దాని కొంగును పట్టుకున్నా.

"రాయే చిన దాన రంగం పోదాము రాయే చిన దానా!" అని పాడతా ఈడ్చినా.

అది వాణీస్పర వులికి పడినట్టు వులికి పడకుండా బిత్తరక పొయ్ ఎండ తగలకుండా కండ్లకడ్డంగా అరిచెయ్యి బెట్టుకోని నాకల్లా దీచ్చగా జూసి, "వొరె నా బట్టా నువ్వా? ఇంగెవురన్నా గానయ్యుంటే మొక్క పొరకతో వాయించిడిసి పెట్టుందునే!" అని దీర్గం దీసింది. "అదేమబ్బా సినబ్బా! ఇంగెవురన్నా గాని కొంగు పట్టుకుంటే పొరకతో వాయించిడిసి పెట్టేదీ నువ్వు బట్టుకుంటే మాత్రం సగించినట్టు గమ్మనుండేదీనా? మీ ఇద్దరికీ నడిమద్య ఏందో వుండినట్టుండాది గదబ్బా." అని నన్ను కొంచిం ఎగదోలింది పిత్తల చెంగయ్య కోడాలు.

"నా లంజ గదా ఇది. మా పొట్టతాత జెజ్జెనకం అయినప్పట్నుంచి ఇది పక్కలోకి మనిసి లేక అల్లాడతా వుంటే పెతి రాత్రీ పొయ్ నేను గదా తగల్తా వుండేది. పాలు దాగే పసిబిడ్డ గ్గాడ తెలుసునే ఈ కత. నా పెళ్లాం నిద్దర్లేస్తే పొద్దు పొయ్యే దాకా 'నువ్వు పొట్టవ్వను జూస్కోని గదా నన్నీ మాదిర్తో సాదిస్తా వుండేద'ని ఒకే పాట గదా." అన్నా.

నా మాటలకు చావు దంపులై పొయ్‌నట్టు అందురూ నవ్వతా వుంటే పొట్టవ్వ మాత్రం ఆర్మోనియం పెట్టె మాదిర్తో కీసుకీసుమని నవ్వింది.

నేను తమాసను ఇంకొంచిం ఎక్కువ జేస్తా, "అత్తా అత్తా అత్తా నువ్విచ్చిన కూతురు చచ్చె, నీకు బేరం వొచ్చె!"

అని పాడి అది జుట్టుకు ముడేస్కోనుండిన పేలికను టకీమని వూడ బెరికేసినా. అంతటితో గమ్మనుండకుండా రామారావు జయపర్దను లగుడ్సుకున్నట్టు నేను మా పొట్టవ్వను లగుడ్సుకున్నా. ఎంత సేపుటికీ దాన్ని వొదల్లా.

నా పనికి పొట్టవ్వ గూడ వొళ్లంతా కదిలి పొయ్యేటట్టు నవ్వతా, "పసోళ్ల నందర్నీ వొదిలి పెట్టేసి ముసిల్దానికి వాసి పొయ్‌నావు ఏం రా నా బట్టా? ఇంగ నన్ను యిడిసి పెట్టరా ముండమోపులకు పసుబ్బాసే నా బట్టా!" అనింది.

నేను కొంచిం దయదలిచి దాన్ని అంతటితో ఇడిసి పెడదామనుకున్నా. ఈ ఆడోళ్లు గమ్మనుంటారా?

"సినబ్బా సినబ్బా ఇంద, ఈ పూలు ఇంద. పొట్టవ్వ కొప్పులో బొయ్ పెట్టు" అని తల్లో పూలు తీసిచ్చింది శారదక్క. నేను శారదక్క మాటను కాదనకుండా నేరుగా పొయ్ ఆ పూలను పొట్టదాని తల్లో బెట్టేసి పరిగెత్తతా వొచ్చేసినా.

"వొరే నా బట్టా! ముండమోపి తల్లో పూలు బెడతావంట్రా, నా బట్టా?" అని చచ్చిన పామును పైనేసినట్టుగా బయపడి పూలను తీసి కింద పారేసింది.

"నన్ను ముండ మోపులకు పసుబ్బూసే నా బట్టని తిడితివి గదే! ముండమోపులకు వొట్టి పసుబ్బూసేస్తే సరిపాయనా, పూలు బెడితే గదా వాటి నాణ్యం తెలిసేది." అనేసి, "గమ్మన కొంచేపు గెనిం మింద కుచ్చోయే లంజా! నేను తొవ్విస్తా కసువు." అన్జెప్పి పొట్టవ్వ చేతల్లో నుంచి పార తీసుకున్నా.

"లంజా మిండగోడు ఎప్పుటికన్నా వొగటే!" అనేసి మా చుట్టూరా వుండిన ఆడోళ్లందురూ మా జోలికి రాలా మళ్ల.

ఇయ్యాల దాక కతంతా కోతి మార్గాన నడిచింది గదా. ఇంగ దీన్ని నీతి మార్గాన నడపతాన్ జూడు.

పొట్టవ్వకు ఎనపయ్యేండ్లే వుంటాయో తొంబయ్యే వుంటాయో పైన మండేవోడికి దా తెలవాల. పొట్టవ్వ మనవరాలి కొడుకే ఎనిమిదో తొమ్మిదో చదవతా వుండాడంటే ఇంక చెప్పాల్నా?

"నీ వొంటికి మించిన కష్టిం గదా - ఈ కసువు తొవ్వే పని? నీకెందుకు సామీ అగచాట్లు? ఇంటి కాడ గమ్మన కూచ్చుంటే నిన్ను చెయ్యమనే వోడెవుడు చెప్పు?" అనడిగినా.

"చెయ్యకుంటే ఎవురు చేస్తారు, సామీ. మీయమ్మకు మీరు ఎద్దు కొమ్ములు మాదిర్తో ఇద్దురు పిలకాయలు- మొగ పిలకాయలు. నువ్వు అచ్చు గొట్టి, మీయన్న పిలకాయల్ను గొట్టి (మాయన్న ఇస్కూలు జెప్తాడు.) సంబళాలు తీస్తారు. నా కొడుకు ఎద్దుల గొట్టి ముద్దలు తినేవోడు గదరే, నేను బతికినంత కాలం వాడికి సఖాయంగా వుండకుంటే ఎట్టరే?" అని మాట్లాడింది.

చెప్పద్దా– పొట్టవ్వది బాగా జరుగుబాటైన కుటుంబరమే. మొన్నామొన్ననే బాయిలో నాలుగించీ బోరేస్తే మొగలాయిగా పడిపొయ్‌నాయ్ నీళ్లు.

“మీకేం వా గాడు? నీళ్లు గల్ల సేద్యమైపాయ. గింజకి కరువులా. కూటికి జరిగితే కోటికి జరిగినట్టు గదా.” అని దాని కుటుంబరం పరీస్తితి దానికే ఇలావరి జేసినా.

“నీ దర్మాన మాకేం తక్కవలా, అయినా నేను మీ పొట్ట తాతకు సంసారం జేసిన ఆడదాన్ని గదరా నాబట్టా. నాకీ రోజుటికి ఆవజీవాలు అణిగి పొయ్‌నా గమ్మన ఈగిలు కొట్టుకుంటా ఇంటికి దరిద్రంగా వుండలేన్రా నా బట్టా! ఈ పొద్దు తెల్లారి మా ఈదిలో జరిగింది వొక కత మాదిర్తో చెప్తా యిను.

ఒకమ్మ నిద్దర్లేవంగానే ఇడ్డెన్లు బెట్టుకోని తింటా వుండింది. ఇంగొకమ్మ సుంయ్ సుంయ్ మని దోసిలు బోస్కోని తింటా వుండింది. ఇంగొక బాసేలి పచ్చిపులుసు కూడు తిరగబోస్తా వుండింది. నేనీ ముగుర్నీ చూపెట్టుకోనుండి నాకు కలిగిన అన్ని కూట్నీళ్లను నోట్లో పోసుకోని గమ్మనుండినా. కొంచేపు తాలినాక ఇడ్డెన్లు తిన్నమ్మ వరిమళ్లో కలుపు తియ్యను పొయ్యింది. దోసిలు తిన్నమ్మ చెరుకు తోటల్లో మోడుదులు పెరక్కొస్తానంటా పోతా వుండింది. పచ్చిపులుసు కూడు తిరగబోసిన బాసేలి బెండకాయలు కొయ్యాలన్జెప్పి పని మింద పడి పోతా వుండింది.

తిని తాగే వోళ్లన్ జూసి గమ్మనుండొచ్చు. ఆ పనీ ఈ పనీ చేసుకునే వాళ్లన్ జూసి మొగుడికి సంసారం చేసే ఆడది – అది ఎంత ముసిల్దయినా గమ్మన కాళ్లు జాపేసి కుచ్చోలేదురా ముండ నా బట్టా!” అని పొట్టవ్వ పటం గట్టుకోని పెట్టుకోదగిన చిన్న కతొగటి జెప్పింది నిజ్జంగానే.

“మంచి మాటలు నాలుగు చెప్పినావే లంజా! ఈ మాటల గుండా

నేర్చుకునేదేమన్నా వుంటే నేర్చుకుంటానే లంజా!” అని వొంగి దాని కాళ్ళను కండ్లకద్దుకున్నా.



# నెత్తి బరువు నేల దిగే కత

“గోవును చంపితే పాతకం, దీన్ని చంపితే రాచ్చేసిని చంపినంత పుణ్యం. ఇది చావాల్నే గాని సుబ్రమణ్యం– డాకట్ర సర్టిఫికేట్టు ఎత్తక పొయ్ మండలాపీసులో ఇస్తే నా లోను ఎగిరి పూడిస్తింది!” అనేసి ఆంజిగోడు ఆ ఆవును దుడ్డుకట్టితో చావ గొట్టేసినాడు.

గవుర్మెట్టోడికి పడాల్సిన దెబ్బలు పాపం నోరూ వాయీ లేని ఆ ఆవుకు పడిపొయ్ నాయి. ఎట్టంటారా–

ఆంజిగోడు ఆవు గావాలన్జెప్పి లోనుకు రాసుకున్నాడు. గవుర్మెట్టు – వాడికి ఆవు శాంక్సం జేసింది. ‘పుంగునూరుకు రా, నీకు ఆవును పట్టిస్తాం’ అని కాతికం వస్తే ఆంజిగోడు పుంగనూరు పొయ్నాడు. పుంగునూర్లో సంత జరిగింది. ఆ సంతలో వుండిందండీ ఈ ఆవు! “నాలుగు వేల్రూపాయలకు కండ్లకద్దుకోని పట్టుకోవచ్చు. ఈ ఆవును పట్టుకుంటావా, లేకపోతే లోను కాంసిలు జేసీమంటావా?” అని పశూల డాకట్రా, బేంకీ పీల్డు ఆపీసరా ఆంజిగోణ్ణి బిత్తర బెట్టినారు. ఆవు చూపులకేమో సుందరాంగిగా వుండాది. మనోడు సరేనని వొప్పుకున్నాడు, ఆవును తోలకొచ్చుకున్నాడు.

ఆ పొద్దుట్నుంచి ఆంజిగోడూ, ఆంజిగోడి పెళ్లాం ఆ ఆవు కడుపులోనే నిద్ర పొయ్నారు. ఆంజిగోడు ఆ ఆవును సూటి మిందనే పట్టినాడు.

ఆవు బాగా గుండు తేలింది.

“నా కష్టాలన్నీ తీరిపొయ్‌నట్టే సుబ్రమణ్యం. తెల్లారి నాలుగూ, సందేళ నాలుగూ ఇయ్యదంటావా ఈ ఆవు? నాలుగు లీటర్లు పిండే ఆవు గదా, నాలుగు వేలకు పట్టినా, దీంట్లో 1300 సబ్సేడ్ పొయ్యింది. ఇంగ నేను కట్టాల్సింది 2700– రూపాయి వొడ్డీ లెక్కన. కర్చులకు పోను తొలి ఈతలోనే గవుర్మెట్టోడి అప్పు తీర్చేస్తా” అని ఆంజిగోడు కులికేవోడు.

ఆవీనింది. అదీ కోడెదూడను ఈని ఆంజిగోణ్ణి కొంచిం బాద పెట్టింది.

ఆవు ఈనంగానే కుక్క ఆశ గుండ్రాయితో పొయ్‌నట్టు పొయ్యింది.

ఆ ఆవు జేసిన పన్లు ఎన్నని జెప్పేది!

పొదుగు దగ్గిర కూచ్చోని పాలు పిండతా వుంటే అది సంసారి గొడ్డయితే సగించినట్టు గమ్మనుండాల. అది సంసారి గొడ్డయితే గదా–

పొదుగులో చెయ్యి బెడితే చాలు – అప్పుడే పైటేసుకున్న ఆడపిల్లగ్గాని చక్కలగిల్లి వుంటిందే అట్ట – ఎగిరి పడేది!

దాన్దగ్గరుండే చేష్టలకు – ఆంజిగోడి పెళ్లాం చేతలకు మట్టి గాజుల్ని పెట్టుకునేది గూడ చాలుకొనింది. గాజులు గలగలమంటే గాడిది తన్నినట్టు తన్నేది. అందుకని ఆంజిగోడి పెళ్లాం ఆ చేతికి రెండూ, ఈ చేతికి రెండూ ప్లాస్టీకు గాజులు తగిలించుకునేది. అయినా సరే పొదుగు దగ్గరికి పొయ్ కుచ్చుంటే, ఆ కోతి మొకం ఆవు పట్‌మని మొకానికి బట్టి తన్నేది – మూతి పొండ్లు రాలి పొయ్యేటట్టు.

“నిండా మోసం సుబ్రమణ్యం. ఈ ఆవు గల్ల నా కొడుకు – పశూల డాకట్రతో, బేంకీ పీల్డు ఆపీసరతో మాట్లాడుకోని నా నెత్తిన పెట్టేసినాడు. ఈ నాలుగూళ్లల్లో లోను మింద పట్టుకొచ్చిన ఆవులన్నీ ముండ మోసినాయని తెలిసీ మోసపోతినే! అప్పిచ్చే నా కొడుకులు నేరుగా మన చేతికే ఇస్తే మనమే అన్నీ బొటువుగా జూస్కోని పట్టుకోమా? అంతా మోసం!” అని ఆంజిగోడు నెత్తిన చేతులు బెట్టుకునేసినాడు.

ఆంజిగోడు ఆ ఆవును నిలవన అమ్మెయ్యాలని కూచ్చున్నాడు. మా నాలుగూళ్లల్లో ఆ ఆవు కత అందరికీ తెలిసి పొయ్యింది. వూరికే ఇచ్చినా మేత దండగ్గదా – అనేటట్టుండారు.

ఆ ఈత ఆ మాదిరిగా గుల్లేరి పొయ్యింది గదా. ఆ ఆవు మళ్లా కట్టి సూటిదైంది. ఈ సూటి మిందనే దాన్ని అమ్మెయ్యాలనుకున్నాడు.

ఆవు ఎనిమిదో నెల సూలులో వుండంగా వొకటి జరిగింది–

నేనూ ఆంజిగోడూ మిట్ట చేనులో గొడ్లను మేపుకుంటా వుండాం. అక్కడికొచ్చినారండీ ఇద్దరు బేరగాళ్లు పాపం!

ఆ సమియంలో నేనూ, ఆంజిగోడూ పంచలు మాత్రం కట్టుకోని చొక్కా గిక్కా ఏం లేకుండా బుజాల మింద పై గుడ్డలేస్కోని వుండాం.

"ఏమబ్బా, ఆవునిస్తారా?" అనడిగినారు బేరగాళ్లు.

"మేతకు నిండా అగచాట్లుగా వుండాదన్నా! బేరం కుదిర్తే ఇచ్చేసేదే! మా ఇంటిది వప్పుకోదు గాని, కుదిర్తే ఈడనే ఇచ్చేస్తా!" అనన్నాడు ఆంజిగోడు తిక్కలోడి తరహాలో.

ఆవు నిండు చూలు మిందుండాది గదా, తోమిన గుర్రం మాదిర్తో నిగనిగలాడతా వుండాది.

మేం మంచి వొయిసు మిందుండినా మా మాటా అదీ పాత కాలం గొల్లోళ్ల మాదిర్తో వుండడం వల్ల వాళ్లల్లో వొకడు, "ఇచ్చే బేరం చెప్పండ్రా!" అనన్నాడు 'అబ్బా' వొదిలేసి, 'వొరే' లోకి దిగి.

"మీరు పాలూ కూడు తినేవోళ్లు గదన్నా. ఆవున్జూసి మీరే మతింపు చెయ్యండి." అన్నా, లోకంలో వుండే అమాయకాన్నంతా గొంతులోకి తెచ్చుకోని.

"సొత్తు గల్లోళ్లు, మీరు చెప్పండి!" అనన్నారోళ్లు.

"మా బేరమైతే మూడు వేలన్నా. ఈ బేరానికి అమ్మానని తెలిస్తే మా ఇంటిది చాటెత్తుకోని తరుంకుంటాదనుకుంటా." అని ఆంజిగోడు నంగి నంగిగా అన్నాడు.

"మ్మరీ అంత అన్యాయంగా బేరం చెప్పద్దురా ఆంజిగా! నువ్వు ఆవును పట్టిందే నాలుగున్నర వేలు గదరా సామీ" అనన్నా నేను గమ్మనుండకుండా.

నా మాటలకు వొకడికి కోపమొచ్చి, "నువ్వు గమ్మనుండరా ముండ నాయలా! సొత్తు నీది గానప్పుడు నువ్వు రెండూ రెండు చేతల్తో మూస్కోని గమ్మనుండేం వాయ్." అనన్నాడు.

'నన్ను బట్టుకోని – రెండు వేల రూపాయల వుజ్జోగస్తుణ్ణి బట్టుకోని – ముండ నాయాలా అనీ, వాయ్ అనీ అంటారా' అని నాకు గొంతు కాడికొచ్చింది కోపం.

మాకు కావాల్సిందిదే. నేనూ ఆంజిగోడూ ఎప్పుడో సైగలు కానిచ్చుకున్నాం. బంగారట్టా ఆవుగొడ్డును బేరం జెప్పేది తెలవక, మేపుకోను కష్టిమై అమాయక తనంతో మా పెద్దోళ్లకు (అంటే మా ఆడోళ్లకు) తెలవకుండా ఆవును అయిన కాడికి సగంగా అమ్మేస్తా వుండామని వోళ్లు నమ్మాల!

"ఇందరా రెండున్నర వేలు! ఇంగ మాట్లాడకుండా పగ్గం చేతికియ్." అనన్నారు బేరగోళ్లు.

ఆంజిగోడికి నవ్వు పొడచకొస్తా వుండాది, నేనూ బిగబట్టుండా.

ఆంజిగోడు, "బిడ్డా పాపగల్లోణ్ణినా! నా పెళ్లాం నన్ను నాలుగు తంతిందనా, ఇంగా ఇన్నూర్రూపాయిలిచ్చి పట్టుకోని పొండనా!" అని తలగీరుకున్నాడు పిచ్చోడి మాదిరిగా.

వాళ్లు, "ఈ నూరు తీస్కోని గమ్మనుండండి. మీకు మంచి బేరమే లెండిరా!" అననేసి మా ఆంజిగోడి నుంచి పగ్గం అందుకున్నారు.

ఎక్కడ చాన్సు తప్పి పోతిందేమోనన్జెప్పి బేరగాళ్లు అసోబుసో అంటా ఆవును తరుంకోని అదే పోవాటం!

వాళ్లు కనుమరుగు కాంగానే, "సుబ్రమణ్యం, నా నెత్తి బరువు నేల దిగింది సుబ్రమణ్యం!" అని కుశాల ఆపుకోలేక ఆంజిగోడు నోట్లో యేళ్లు బెట్టి నాలుగిజిళ్ళు కానిచ్చినాడు.



# మిట్ట మింద సుబ్బీ - నేనూ వొగటి!

మా పెండ్లయిన రోజు రాత్రి నేను చచ్చి తవుసు చేసినా నా పెళ్లాం దగ్గిర్నుంచి ఒక్క మాటను గూడ రాబట్టుకోలేక పొయ్‌నా. నేను మా ప్రబాతో, "ఏమబ్బా ప్రబాకర నాయుడా! మాట్లాడబ్బా, అంతగా నీ నోటి ముత్యాలు రాలిపోతే– నీ మొగుణ్ణే గదా, ఏరుకుంటాన్లే!" అని ఎంత నైసుగా మాట్లాడినా నేను దాన్ని లొంగేసుకోలేక పోయినా. అటుమంటి దాన్దగ్గిర మూడో దినం తిరిగేకల్లా నేను అధవై పొయ్‌నా.

మనం యెన్నతో ఇసిరేస్తే అవతల మనిసి మంచి రాయితో ఇసిరేస్తా వుంటే– ఏం మాట్లాడతాం చెప్పు? మా కోతిది నోట్లో నాలుగు వొక్క పొలుకులేస్కోని నమల్తా వుంటే నేను సున్నం రాసి తమలపాకులు అందించినా. అది నేనందించిన తమల పాకుల్ను వొక పక్క నమల్తా, ఇంగొక పక్క ఎర్రంగా వుండే నోటితో, "ఏమబ్బా, నువ్వు నాకన్నా బలే పొట్టి గదా!" అని మొరిగింది. నాకు గబీమనింది. అయినా మొకంలోకి తెచ్చుకోకుండా,"మఖా అంటే నాలుగడ్డేళ్లు నేనే కురచగా వుంటాన్లే!" అనేసి ఆ ప్రస్తాపన అంతటితో ముగిద్దామనుకున్నా. పొడుగ్గా వుండేటోళ్ళు ఆ ప్రస్తాపనను ఇంగా పొడిగిస్తారు గదా! అది టకీమని జెండా మాను మాదిర్తో పైకి లేచి నిలబడి, "నా పక్కనొచ్చి నిలబడు, కొలతలు కానిద్దాం" అని సవాలేసింది. నేను మూతి మూరడు పొడుగు బెట్టి గుదిగాళ్లు కొంచిం పైకి లేపి దాని పక్కజేరి కొలతేసినా. "నువ్వెంత నిక్కతావో నిక్కి కొలతేస్కో." అని మాట్లాడింది నా రవిడీ పెళ్లాం. చెప్పద్దా,

నేను జానడు తక్కవే. "అదే జయపర్దా చంద్రమోకను మాదిర్తో వుంటా మనుకుంటా." అంటా వొచ్చి చాప మింద చేరి ఇంక ఆ టాపిక్కు మారద్దామని, "ఏమబ్బా రేపు తిరప్తికి సిల్మాకు పోదామా?" అన్నా. అది కుడుమిస్తే పండగనే రకం గాదే!

"అది సరేగానబ్బా, నువ్వు నడిచేటప్పుడు ఆడదాని మాదిర్తో చేతులూగించే దేమిటికి? మొదుటసల్లో నీక్కొంచిం గూని గూడా వున్నట్టుండాది. ఎందుకు, అట్ట వొంగి నడిచేది? రొమ్మిరుచుకోని నడవలేవా?" అని అది నాకు వూపిరి తిరగనీకుండా నాలుగు కొసినీలేసింది. అప్పట్లో నేనుండింది సిరిచాప గాదు, ముండ్ల కంప!

ఆ మరసనాడు మా ఆలీ మొగుళ్లం ఎక్కడికో పోవాల్సొచ్చింది. మేం వాళ్లూళ్లో వుండే ఇస్కూలు దాటతా వుండాం. ఇస్కూలు పిలకాయలంతా చింత చెట్టు కింద వుడ్డ జేరి ఎక్కాలు కంటస్తం బెట్టుకుంటా వుండారు. ఆ పిలకాయలు మాకల్లా చూసినారో లేదో గాని- పిలకాయలంతా కలిసి మాట్లాడుకున్నట్టు పడి పడీ నవ్వేసినారు- వాళ్లకు మాలో ఏమి కనిపించిందో గాని! వాళ్ల దగ్గిర అయ్యోరు లేనట్టుండాడు. మమ్మల్ను చూసినంత దూరం వోళ్లు నవ్వతానే వుండారు. నాకు బలే కుశాల అయిపొయ్యింది. వాళ్లను ఇంగా నవ్విపిద్దామని చెప్పి నా పెళ్లాం చేతిని చేతల్లోకి తీస్కోని వాళ్లకల్లా చూపించి చేతులూగిద్దామనుకుంటే ప్రబావతి చేతిని ఇసిరికొట్టి, "సిగ్గులా రూంతన్నా! మన నడతకు పిలకాయలే అట్ట నవ్వతా వుండారే, ఇంగ పెద్దోళ్ల నవ్వు చెప్పాల్నా?" అని నన్ను కాసుకు గాకుండా మాట్లాడేసింది.

నా మొకం ఇంతై పొయ్యింది.

"నేను నీ ఇంటికి చూపులకొచ్చినప్పుడే - వాడికి కన్నొకటి మెల్లగా వుండాది, నడిచేది గూడ చేతగానట్టుండాది, వాడొట్టి ఆడ రేకలోడుగా వుండాడు, వాణ్ణి నేను చేస్కోనంటే చేస్కోనని పుల్లించి నేలేసేసుంటే- నాకు తగ్గదాన్నెవుర్నన్నా నేను చేస్కో నుండనా? పెండ్లయినాక నాకిన్ని సొట్టలు జెప్పడం నీకు దర్మమా ప్రబా?"అని కండ్ల నిండికీ నీళ్లు బెట్టుకోని అడిగినా. ఇది నా పెళ్లాం దగ్గిర నా కత. ఇంక మొగుడి దగ్గిర మిట్ట మింద సుబ్బి కత జెప్తా.

మా జుట్టు బావ వుండాడు గదా, ఆయనకు పిల్లనిచ్చిన అత్త వుండాది గదా, ఆమె తమ్ముడి పెళ్లామే, మిట్టమింది సుబ్బి!

మిట్ట మింద సుబ్బి అచ్చు గొట్టినట్టుండును బీమసేనుడి మాదిర్తో!

సుబ్బికి పెండ్లి చూపులకొచ్చినపుడు వాళ్లమ్మ సుబ్బి మొగుడితో చెప్పనే చెప్పిందంట! “నా కూతురు తిన్నాక నువ్వు తినాల. నా కూతురికి కడుపే కైలాసం. దాని కడుపు జూస్కోని పో నాయినా!” అని!

దానికి సమ్మతి పడే సుబ్బి మెళ్లో తాళి గట్టినాడు.

సుబ్బి దండి మనిసి. అట్టనే దాని చెయ్యిగూడ దండే! రెండు మానికల బియ్యం ఎసుట్లో బోస్తే ఆరేడు ముద్దల సంగటైతింది గదా. మిట్టమింద సుబ్బికీ, దాని మొగుడికీ, దాని కూతురికీ, చాకలోళ్లకూ ఆ సంగటి సరిపోతిందనుకో. అవితే సుబ్బి చెయ్యి దండి గదా – నాలుగు మానికలు పోసి పది ముద్దల సంగటి కెలికి పెట్టేస్తింది.

“ఏమే లంజి ముండా, అంత సంగటి కెలికి పెట్టేసినావు?” అని మొగుడు దండిస్తే, “చీమంత సంగటి చేదారం చెయ్యను. నీకా దిగుల్లా నేను తినేస్తాన్లే” అని దైర్నం జెప్పేది మొగుడికి. అది చెప్పినట్టే జరుగును, సంగటి ఎంత మిగిలినా వుడీస్ అయిపోవును.

“ఒసే లంజా! ఆడదానికంత కడుపు వుండగూడదే! నువ్వు కొంచిం కడుపు తగ్గించే!” ఇదే పాట మిట్టమింద సుబ్బి మొగుడికెప్పుడూ.

ఆ పొద్దు మిట్ట మింద సుబ్బోళ్లకు పనగొట్టే పని. మా పక్క పన గొట్టే పని మొగోడిది. మొగోడి పని సుబ్బి చెయ్యలేదు గదా. ఎకరా వరిమడీ అదొక్కటే కోసేస్తింది! పన కొట్టేదానికి ఆ రోజు కూలోళ్లు ఎంత మందొచ్చినారో కూడా తెల్దు. “చూసేసొస్తా, మళ్ల చేద్దువు సంగటి!” అనేసి సుబ్బి మొగుడు మడి కాడికి పొయ్యొచ్చినాడు. సుబ్బికి వోపికలా. ఇరై ముద్దల సంగటి, చట్టిడుతో చట్టిడు వంకాయ పుల్లగూరా పామి పెట్టేసింది.

సుబ్బి మొగుడికింత పొడుగొచ్చింది కోపం!

పక్కన్నే వుండిన రోకల బండను తీస్కోని కూచ్చున్నాడు.


“కయ్యిలో కొచ్చుండేది ఇద్దురు కూలోళ్లే. నువ్వు చేసుండే సంగటి అయిదు మందికైె మిగిల్తింది! తిను లంజా, ఎట్ట తింటావో తిను!”

సుబ్బి బిత్తరక పొయ్ సంగటికి కూచ్చునింది!

నిజ్జం, అపద్దం పైన మండే వోడికి తెలవాల. మా మిట్ట మింద సుబ్బి ఎనిమిది ముద్దలు తినిందంట!

అంతే, మొగుడికి చేతులెత్తి దండం బెట్టి ఈ మాదిర్తో అనింది

“నీకు చూపులకొచ్చినప్పుడే మా యమ్మ జెప్పలేదా సామీ! నేను నలగర మనసల పని జేసేదాన్ని, ముగ్గర మనసల సంగటి తినే దాన్ని. బండెడు కష్టిం జేసి బానడు సంగటి తింటే తప్పా సామీ? రోకల బండను కడగా పారెయ్ తండ్రీ!”



# రెయ్యిస్కూల్లో తిన మరిగి...

"నా బట్టా రేయ్, కొంచేపు మాటలు జెప్పురా! నవ్వుకోని బోతాను." అంటా వొచ్చింది ఒకాడది, బాగ తీరుబాటు జేస్కోని. ఒకాడది అనంటా వుండావే దానికి బొడ్డు కోసి పేరు పెట్టలేదా దాని తల్లీ దండ్రీ– అంటే పేరుకేం, వుండాది కానీ నేన్చెప్పను. ఎందుకంటే అది మొండిది. రేపీ కత పేపర్లో రాంగానే వూళ్లో ఎవరో ఒకరు వూరికే వుండకుండా తమాస జూద్దాం అనిపించి, "ఏం సామీ, సినబ్బ నీ కత రాసేసినాడే పేపర్లో!" అనన్నారనుకో, మళ్ల దాంతో మనం యేగలేం. అది నేరుగా నా దగ్గిరికొచ్చి తల గిల్లి మొలేసేస్తిందని బయం గాదు. "ఏంరా నా బట్టా! నా కత మింద నీకు యెయ్యి రూపాయిలన్నా వొచ్చుండవా? అయిదు నూర్లన్నా ఇయ్యిరా నా బట్టా!" అని గొంతు మిందొచ్చి కుచ్చుంటాది. అటుమంటి కిలాడి లంజది. అందుకని దాని పేరు నేన్చెప్పను.

"సరే కుచ్చో నవ్విపిస్తా!" అనే కొందికి అది ఈదిలో మా తిన్నె మింద కుచ్చునింది. సందలగూకన గదా అందరికీ తీరుబాటే లే.

నేను చెయ్యి దాని మిందేసి చక్కలగిల్లి బెట్టే దానికి పూనుకున్నా.

అది గలగల నవ్వి, "ఈ వాటంతో అయితే నా మొగుడు కూడా నవ్విపిస్తాడు. మాటల్జెప్పి నవ్విపించరా నా బట్టా అని నేను ముందర్నే నిన్ను పొరకతో కొట్టి చెప్పినాను గదా." అనిందది.

"సడే వుండు." అని నేను ఇంట్లో (గుడ్లు పెడతా) వుండిన నా పెళ్లాన్ని, "ప్రబావతీ!" అని పిలిచినా, దానికినపళ్లా.

"యశోదమ్మ కూతరా!" అని మళ్లా పిలిచినా, అది చెవల్లో యేస్కోలా!

మరేదకిది కాలం గాదన్జెప్పి, "ఏమే లంజా!" అనే కొద్దికి, "అగ్గో, వస్తుండా నుండబ్బో!" అంటా అది ఈదిలోకొచ్చింది.

తిన్ని మింద కూచ్చున్నాడది అప్పుడే ఒక నవ్వు నవ్వేసింది.

"నిన్నేం జరిగిందంటే నా పెళ్లాం అట్ట, నేనిట్ట ఈదిలో మంచాలేసి పొనుకున్నాం. నాకు మంచం మింద ఎంత సేపు దొర్లినా పొర్లినా కంటి మింద రెప్పనేది పళ్లా. మాకు కొంచిం ఎగవన మా అన్నా మా వొదిన గూడా మంచాలేస్కోని పొనుకోనుండారు. నాకు నిద్ర పట్టలేదు గదా. నేను నా పెళ్లాం దగ్గిరికి పొయ్ గొంతు పెంచి, 'ఏమబ్బా! వొళ్లు నిండా వుడుకు చేసేసిట్టుండాది. మంచి మద్యానం ఆపీసుకు ఎలబారతాను గదా! ఎండ గదా! ఇంట్లేకి రాబ్బా – వొచ్చి అన్ని చక్కిరి నీళ్లు ఇయ్యబ్బా! అన్నా. నా పెళ్లాం నేను నిజ్జం చక్కిరి నీళ్లకేమో అనుకోని అది నిద్ర కండ్లతో నన్ను కసురుకోని, 'కంటి నిండా నిద్రబొయ్యే మనిషిని లేపే దానికి నీకు చేతులెట్టాడినాయి? అలమార్లో చక్కెరి డబ్బా వుండాది, పొయ్ తాగుబో!' అని కసిరేసింది. నాకు లేదా నోరు? 'నా గడపలో నువ్వు కాలుపెట్టినప్పుడు నేనేం జెప్పినాను ప్రబా? వొళ్లు బొలువొద్దు. బాగ కష్టిపడు, కూడు తిను – అని చెప్పినా. ఆ వొళ్లు బొలువును నువ్వు నీ అమ్మగారింటికి పంపి ఇంట్లేకి రా' అని లేపినా. పాపం అది నిద్ర కండ్లతో తలుపు తీస్కోని ఇంట్లేకొచ్చింది. నాకు నిజంగానే వుడుకై పొయ్యిందా? నిన్న రాత్రి నా పెళ్లాం నాకు చక్కిరి నీళ్లు కలిపిచ్చిందా? ఏదీ, నెత్తిన చెయ్యేస్కోని దాన్ని చెప్పమను లంజను?"

"సిగ్గులేని మొగోడ్రా నువ్వు!" అనేసి అదీ, నా పెళ్లాం పడీ పడీ నవ్వేదానికి పెట్టుకున్నాయి. వాళ్ళతో గూడా నేంగూడా నవ్వే దానికి పెట్టుకోని, "ప్రబా, ఈ రోజు గూడ నాకు ఉడుకై పొయ్యింది చక్కిరి నీళ్లిస్తావా?" అని వాళ్లనింకా నవ్విపించి నేనూ నవ్వుతుంటే – ఈ కతను ఏ మార్గానికి తీసక పోదామనో ఏమో అసోబుసోమంటా వచ్చిన ఆదిలచ్మి, "చిన్నాయనా చిన్నాయనా!" అంటా నా రెక్కలూగించి నా నవ్వునాపింది.

"ఏం ఆదిలచ్చీ ఏమ్మా!" అన్నా. ఆదిలచ్మి మా నామినోళ్ళ ఆడబిడ్డ. పదో తరగతి చదివి ఇంటి కాడనే రెయ్యిస్కూల్లో పన్జేస్తుండాది.

"సూపరైజరొచ్చేసినాడు సిన్నాయనా!" అని అంగలార్చింది ఆదిలచ్మి.

నాకు అర్తమై పొయ్యింది. రెయ్యిస్కూలు సూపరైజరొచ్చేసినాడూ అంటే ఆదిలచ్మికి ఇప్పుడు అర్జెంటుగా ఇరై మంది మొగోళ్లూ ఆడోళ్లూ– వయోజనులు – కావాల.

"నువ్వు గూడ రా సిన్నాయనా ఈ రోజు!" అని భంగపొయ్యింది ఆదిలచ్చిం. "ఏం తల్లీ ఎమ్మెస్సీ మేతమెటిక్స్ చదివేసినోణ్ణి! ఇప్పుడు రెయ్యిస్కూల్లో కొచ్చి అఆలు గూడ రావన్నట్టు యాక్సను చెయ్యమంటావా? క్రిష్ణలీల ఈ వాటంతో వుండాదా? సరే పద!" అనేసి ఎలబారినాను.

ఆదిలచ్చిం మాత్రం ఏం జేసేది పాపం?

ముప్పైయ్యేండ్లకు పైబడిన మొగోళ్లు– రెయ్యి, పెళ్లాల పక్కల్లో పొనుకుంటే పైర్లు వాటిపాటికవి పండిపోవు. గవుర్మెట్టోడేమో వాడిపాటికి వాడు రెయ్యిస్కూలు శాంక్సం జేసినాడు మా వూరికి. పిలిచి పీటేసినా ఎవుడు బోతాడు ఆ ఇస్కూలికి? ఆదిలచ్చింకి గూడా సుకమే! ఈ మాదిర్తో సూపరైజరొచ్చినప్పుడు ఇరై మందిని వడేసి పట్టుకోని పొయ్ నాలుగచ్చిరాలు చెప్పించినట్టు ఆదిలచ్చిం, ఒకచ్చిరం నేర్చుకున్నట్టు వాళ్లూ యాక్సం జేస్తేనే చాలు – నెల బెట్టేకొందికి ఆదిలచ్చిం చేతిలో నూటాముప్పై రూపాయలు పడిపోతాయి.

పదో తరగతి పస్టుగా పాసైన నా పెళ్లాం, ఓపన్ యూనివర్సిటీలో బిఎ రెండో సమ్మచ్చరం గూడా పాసై పోయిన బుజ్జీ, రెండున్నర వేల రూపాయల జీతగాడినైన నేనూ ఎలబారినాం రెయ్యిస్కూలికి.

రాత్రి ఎనిమిదయ్యే కొందికి రెయ్యిస్కూల్లోకి ముప్పై మంది దాక చేరిపొయ్నాం.

వాళ్లల్లో ఆడోళ్లే ఎక్కువ మంది. మాకందరికీ తలా ఒక పలకా, పుస్కం ఇచ్చింది ఆదిలచ్మి.

కుర్జీమింద సూపరైజరు కుచ్చున్నాడు. నిలబడుకోని బోరడ్‌లో ఏందో రాసి చూపిస్తా వుండాది ఆదిలచ్చిం. ఆయమ్మి రాసి చూపిచ్చింది మేం పలకలో రాసినట్టుగా కొంచెం సేపు యాక్సం జేసినాం.

ఆ తరవాత సూపరైజరు, "మీరంతా మీ పేర్లను పలకలో రాసి చూపిచ్చండి." అనన్నాడు.

పేరును వున్నట్టుండి రాసీగూడదు గదా, పేర్లో వొత్తులీగూడదు, అచ్చిరాలు – అడుసు మళ్లో కొంగలు తొక్కినట్టు – వొ(క్రంగా రాయాల.

ఆదిలచ్చిం ఇల్లే రెయ్యిస్కూలు. సూపరైజరుకు కోడి వుడకతా వుండాది. వాసన జమాయిస్తా వుండాది. మేమంతా అచ్చిరాలు వొక్కోటిగా రాసి పేరును తయారు జేస్తా వుంటే – ఆదిలచ్చిం ఇంట్లేకి పొయ్ కూరలో మసాలా నూరి యేసినట్టుండాది. అబ్బ ముక్కులు పగిలిపొయ్‌నాయి.

నేను సైగ్గా బైటికి పొయ్ ఆదిలచ్చింని చేరుకోని వుడకతా వుడకతా వుండిన కూరను రెండు ముక్కలు నోట్లో యేస్కోని, "మనింట్లోకా లేక వాడికా?" అనడిగినా.

"అయ్యో నా చిన్నాయనా! కోడి మెడ తెగేదాక – రెయ్యిస్కూలికిచ్చిన లాంతర్లెక్కడ, కిరసనాయిలెక్కడ, నోటు బుక్కులెక్కడ అని దర్బారంతా చేసినాడు. ఆయన కండ్ల ముందర కోడి తెగినాక కొంచిం శాంతించినాడు. ఇరై రూపాయలు చిన్నాయనా, ఫారం కోడి! కేజీ పడతాది, కూర చేసిందాన్ని నాగ్గూడ గెంటిడు పెట్టడు! సూపరైజ్ కొచ్చినప్పుడల్లా వొక కోడి." అని సణిగింది.

"కాబట్టే గద తల్లా, ఇంటికాణ్ణే వుండి, వొక్క పూట గూడ రెయ్యిస్కూలు చెప్పకుండా – నెల బెట్టే కొందికి నూట ముప్పై చేతిలో యేస్కుంటుండావు." అని ఆయమ్మి వుజ్జోగాన్ని పొగిడినా.

"అయ్యో రాత! ఆ నూట ముప్పైలో అరవై తీస్కునేస్తాడు. మనకు మిగిలేది డెబ్బయ్యే! ఆ డెబ్బైలో కోడి కర్చు మసాలా కర్చు. మాయమ్మ– నువ్వు రెయ్యిస్కూలు చెప్పేది నిలిపెయ్, ఆ సూపరైజు నా బట్టకు మనం కోసి పెట్టలేం కోళ్లను – అని నన్ను పోరతా వుండాది." అని నాకు అసలు కత చెప్పేసి సూపరైజరు దగ్గిరి కొచ్చింది.

నేను గూడా రెయ్యిస్కూల్లోకి పొయ్ పలకెత్తుకోని దాంట్లో $a+b+c=0$ అయితే $a^3+b^3+C^3=3abc$ అని నిరూపించి పారేసి, సూపరైజరు దగ్గిరికి పలక తీస్కొచ్చి, "చూడు సా పొగులంతా నా పన్లు నేను జేస్కోని, రెయ్యంతా

ఈ ఇస్కూల్లో ఆదిలచ్చిం దగ్గిర చదువు చెప్పించుకోని ఎంత నేర్చుకున్నానో చూడు సా. ఆదిలచ్చిం చదువు బాగ చెప్తింది సా, ఆయమ్మి దగ్గిర నెలనెలా అరవై తీస్కోవద్దు సా." అన్నా. సూపరైజరు బిత్తర పొయ్ లేచి నిలబడి, నాకు సెల్యూట్టు జేసి, "సా మీరు నామిందొచ్చిన సూపరైజరా? చిత్తూరు నుంచొచ్చినారా?" అనేసి వొణికి పొయ్నాడు.

"ఏం, వుడకతా వుండిన కోడి కూర్లో నాగ్గూడ బాగం పెడతావా?" అనడిగినా ముక్కుల్తో గాలి ఎగబీల్చి.

"నేను తప్పు జెప్పన్ సా. నెలకు అరవై తీస్కునేది నిజమే. దాంట్లో నలపై మీకూ, మిగతాది డైరెక్టర్‌కీ, అగ్గో నాకీ కోళ్లే సా దక్కేది?" అని కండ్ల నిండికీ నీళ్లు బెట్టుకున్న సూపరైజరును జూస్తే నాకే దుఃఖం వొచ్చింది.



# పాపాత్మ ఇది ఏమి పాటు రా !
# సిగ బట్టేవు నీకేమి చేటు రా !!

అన్నం తినేసినా. ఇంక ఆరాతీరా చెయ్యి నాక్కోవాల గదా, నాకతా వుండా.

"చెయ్యి నాకద్దురా దరిద్రపు మొగోడా! నీకంతగా కావాలంటే చెప్పు – ఎంత తింటావో అంత కూడు మళ్లా పెడతా!" అని కసురుకొనింది మా దెయ్యం మొకంది.

అన్నం చాలక గాదు నేను చెయ్యి నాక్కొనేది! తిన్నంత సేపు చెయ్యి నాకందే నాకు తిన్నట్టుండదు. దీన్ని మా నాయిన్నుంచి నేర్చుకున్నా, భద్రంగా కాపాడకొస్తుండా.

సరే, ఇది పూట పూటా వుండే గలాటే లే!

ఒక కొంగు కనిపించి టకీమని మాయమైంది. అంతే, చెయ్యి నా నోట్లోకి పోలా. ఈదిలోకి పొయ్ చూద్దును గదా – మా కంసలోళ్ల శివమ్మ కూతురు.

అదిప్పుడు పరావూరి కోడాల్లే. నేను ఐద్రాబాదులో వుండంగానే అది వొకింటిదై పొయ్యింది.

"ఏమే, ఎంతదా అక్కర తీరే పొయ్యిందనుకో – ఇంక అంతేనా? వూళ్లేకొచ్చి నాక్కనపడకుండానే తిరగతా వుండావు గదే! ఎప్పుడు దిగినావే వూళ్లో నా సిన పెళ్లామా?" అంటా దాన్ని అడ్డగించుకున్నా.

"యెయ్యి రూపాయల జీతగోడివై పోతివి గద మామా. అప్పుడంటే మాతో గూడా ఎనుములు మేపతా వుంటివి. ఇంక నువ్వు– కనిపించినా మా బోటోళ్లతో మాట్లాడబోతావా సామీ!" అననిందది.

"అట్టా కత మన్దగ్గిర లేదు సేయ్! నేనప్పుడూ, ఇప్పుడూ, ఎప్పుడూ నీ చేతల్లో మనిసినే లేయే పిల్లా!" అని దానిక్కొంచిం దైర్నం యిచ్చినా.

"మాయమ్మ వూరెత్తక పొయ్యేటట్టు నా కోసరం అరస్తా వుండబోతింది. బైటొచ్చి శానా సేపైంది. తింటా వున్నట్టున్నావు తినుబో, మళ్లొచ్చి మాట్లాడతా." అనేసి అది పొయ్యింది.

ఏమిరా ఈ  నా కొడుకు ఒకమ్మ గన్న కూతుర్ని లంజనీ, వొసే అనీ ఈనంగా మాట్లాడతాడు– అని నా గురిచ్చి కోపం బెట్టుకుంటా వుండారు గదా! అట్టుండండి. మా దీదీకి (నా కూతురు) ఇంగా నోరు గూడ తిరగ లేదనుకో. మా బ్రమ్మాచ్చారి బావ (శివమ్మ మొగుడు) నా కూతురు ఈదిలో కనిపిస్తే చాలు, ఏమంటాడో తెలుసునా?" ఏయ్ సినబ్బ కూతరా, లంజా! బిరి బిరా సమర్తాడే పిల్లా! మా మాణిక్యం గోడు నీతోనే ఆడాలంట గుచ్చు గుచ్చు పుల్లాట!" అనంటాడే! వొకర్తో వొకరికి ఈ మాదిరి తమాస గూడ లేకుంటే ఇంగ మిగిలింది అమాసేనబ్బా!

నేను చెయ్యి కడుక్కోని నా పెళ్లాంతో నాలుగు నస మాటలు మాట్లాడినానో లేదో, "సినబావా!" అంటా వొచ్చేసింది శివమ్మ కూతురు. (కనిపించినప్పుడు లంజా అనేది తప్ప దాని పేరు గూడ ఏమో నాకు తెలవదు.)

నేను ఆడోళ్లతో ఆడ మాటలు మాట్లాడి పోకూవర్తీ కనుక్కుంటా వుంటే మా ప్రబాకు సుర సుర సురమంటా వుంటింది. నేను దానికి బయిపడి శివమ్మ కూతుర్ని, 'రాయే, మనం చింత చెట్టు కింద చేరదాం.' అని దాన్ని చింత చెట్టు కాడికి తొడక పొయ్‌నా. ఆ రాత్రి పూట అక్కడ దాంతో మీటంగి బెట్టినా.

అది నోరు తెరిచింది తెరిచిందే, "నా మొగుడు మంచోడు గాదు బావా!" అని మొదులు బెట్టింది.

"నీ మొగుడే గాదు. ఈ కలిగ్గంలో ఎవురి మొగుడు మంచోడే?" అని లా పయ్యింటు తీసినా.

నా మాటను అది పట్టించుకోలా.

"అదిగాదు బావా, నెల జీతం తీస్తా వుండావు. నీ పెళ్లాం – మా యక్క – నీ యింటికొస్తా వొస్తా ఏం తెచ్చింది?" అనడిగింది కరుగ్గా.

"మీయక్క – అదే నా పెళ్లాం – నా ఇంటికొస్తా వొస్తా నోరు తెచ్చింది గంపెడంత నోరు ఘనంగా!" అన్నా.

"నువ్వు సరైనోడు సామీ!" అని దాని కడుపు మంటను కొంచేపు అణుచుకోని నవ్వింది.

"నా వోళ్లు నన్ను నీ ఎదాన తోసేసినారే. పెట్టినా కొట్టినా నువ్వే గదా నాకు. పెండ్లి గాక ముందు అమ్మా నాయిన! పెండ్లయినాక సమస్తం నువ్వే గదా? మాటొస్తే చాలు మీ అమ్మా నాయినా ఏమిచ్చినారే – అని గీరేది! నీ నట్టింట దీపం బెట్టేదానికి నన్నిచ్చినారే! అది చాల్దా? నా కొడకా! నిన్ను పెండ్లి జేసుకోక ముందు దోసిడు కూకుడు కాయల్తో నా రొండు చేతులు నొప్పులు బుట్టేట్టు పులిమినా ఇడవకుండా వుండినాయి బారడు పొడుగు యెంటికలు! జుట్టు పిడికిళ్లు పిడికిళ్లుగా బట్టుకోని గుంజి గుంజి గుంజి ఈ పొద్దు తలెంటికల్లేకుండా జేస్తివి గదరా! దినామూ నువ్వు నిద్దర్లేచి కొలిం మంటేస్తే నేను పొయ్యి రగలేస్తా. నువ్వు ఆర్నెల్లకొక సారి గూడా కొలిం పని చెయ్యకుండా అరువులరువులుగా వొండి పెట్టమంటే నేనేమి వొండి పెట్టేదిరా నీ ముండ మొకాన ఎండకాయ!"

దాని మొగుణ్ణి నేనే అయిపొయ్‌నా. అది నాకెదురుగా నిలబడుకోని మొగుణ్ణి అడిగినట్టే అడగతా వుండాది నన్ను బట్టుకోని.

"ఒక దఫాలో అవితే వోడు బెట్టే యింసలు వోర్వలేక నీకు జెప్పి పేపరకే యిద్దామనుకున్నా బావా, నేనూ మా నాయినా గూడా, ఎంత వొరకని వోర్చుకోమంటావు జెప్పు? పేపరకు దొబ్బి పోలీసోళ్లకు పట్టిచ్చేద్దామని గూడ అనుకున్నాం. మళ్లా యెనక తొక్కులు తొక్కినాం. ఏంది బావా లేకుంటే? పిలకాయలు పుట్టలేదనేది గూడ నా తప్పేనా? నాలో ఏదో మిస్టీకు వుండబట్టే పుట్టలేదంట. నా బట్టా కొడకా! నువ్వు శుద్ధమైన మొగోడైతే నాకెందుకు పుట్టరు? నువ్వు శుద్ధం గాక నాకు పుట్టలా."

“నేను శుద్ధమైన మొగోణ్ణేనే! నా పెళ్లానికొక బిడ్డి పుట్టుండాది, పొయ్ చూడుబో! నా నోట్లో నుంచి వూడి పడినట్టుండాది. నాలో శుద్ధం లేదంటావా!” అని ఇకారంగా ఎగతాళి పడేవాణ్నే గాని దాని కండ్లల్లో యాడుండినాయో అన్ని నీళ్లు బొరోమని ఏడ్చేదానికి పెట్టుకొనింది.

నా బిడ్డ సాచ్చిగా చెప్తా వుండా – నేను మా యెంగటేస్పరా యూనోర్సిటీలో రొండేండ్లు చదివినా, ఒక్క పాఠం అంటే వొక్క పాఠం నేర్వలా. పదేడు పజ్జెనిమిదేండ్లు గూడా వుండవు దానికి – రొండేండ్లు వొక మొగుడి కింద కాపరం జేసిందో లేదో ఎన్ని పాఠాలు నేర్చిందిరా బగమంతుడా!

నాకది శివమ్మ కూతురి మాదిరిగా కనిపించలా. నాకు యాపై ఏండ్లు అయినట్టు, మొగుడి దగ్గిర శుద్ధం లేక నా కూతురు నా కాడికొచ్చి కండ్ల నీళ్లు పెట్టుకున్నట్టు నేనేం జెయ్యాల్నో తెలవక చేతులు పిసుక్కుంటా వుండినట్టే అనిపిచ్చింది.

ఏడ్చేడ్చి అదే తెగాయింపు జేస్కోని నిమ్మళానికొచ్చింది. నేను బాద పడతా వుండానని తెలిసి కడాన నాలుగు నవ్వు మాటలు మాట్లాడింది.

“ఇంకా రెండేండ్లు చూస్తా బావా! నా దోవలో కొస్తే సరి. లేకపోతే తిట్టా తిట్టను, కొట్టా కొట్టను, వొటక్కాయలు పట్టుకుంటే చాల్దా? అటుమంటి నా కొడకలందరికీ అదే శిచ్చ!”



# కర్రెక్క జెప్పేది మొగోడే లేడంట!

"సినబ్బా, మా ఇంటి దాకా వొచ్చి పోదువు రారా, కాపీ గూడ పెట్టిస్తా తాగేసొద్దువు గాని..." అంటా కర్రెక్క నన్ను పిలిచింది.

బంతిలోకి వొద్దంటే ఇస్తరాకు తూటు అంటా నేను మా వూళ్లో ఎక్కడికన్నా తయారవతా వుంటాననుకో. "రారా నాబట్టా నా ఇంటికి." అనంటే చాల్దా, నేను కర్రెక్క ఇంటి ముందు వాలనా? కాపీలు బెట్టిచ్చే మరేద నాకెందుకబ్బా!

కర్రెక్క యెనకాన్నే ఎలబారినా. ఆయక్క నా కోసమన్జెప్పి నులక మంచం వాల్చడమే గాక దుప్పిటి తెచ్చి పరిచింది గూడా.

నేను కుచ్చున్నా.

కర్రెక్క పొయ్యి రగలేసి కాపీ చట్టి పెట్టింది.

"సినబ్బా, మీ ఆపీసులో అయిదారు నూర్లు సంబళం తీసే పిలగోణ్ణొకణ్ణి చూడేమి? మన శుబరత్ననిచ్చి పెండ్లిజేద్దారి." అని కర్రెక్క డైరక్టరుగా మాట్లాడింది.

నేను గూడా డైరక్టరగానే, "అకా, మా ఆపీసులో ఎక్కువ మంది విజీవాడ పక్కోళ్లే. ఆ పక్కోళ్లు పెండ్లి దగ్గిర బలేటి నాయాండ్లు. వోళ్లు లచ్చిలడగతారు. వాళ్లతో మనం తూగలేం."అన్నా.

కర్రెక్కకు ఒక కొడుకూ, ఇద్దురు కూతుర్లూ. శుబరత్న పెద్ద కూతురు. దానికిప్పుడు ఇరై ఏండ్లనుకుంటా. అది ఏ ఆటో ఒక ఆట ఆడి పదో తరగతి

పాసయిపొయ్యింది. పియ్యి దినో పిడకలేరో దాన్ని బాగా సదివిద్దామని జెప్పి కర్రెక్క దాన్ని పద్మావతీ కాలేజీకి పంపిచ్చింది. శుబరత్న ఇంటర్మెట్టు పరీచ్చలు రాసుంటే గదా – పాసయ్యే దానికి పయిలయ్యే దానికీ! శుబరత్నకు అటెండెంసు చాలకొచ్చి దాన్ని పరీచ్చలకే కుచ్చోనీ లేదంట. నాగార్జునుడిదో, బాలకిష్ణందో, సుమనదో– ఎవుడిదో ఒకడిది తిరప్తిలో సిల్మాలు ఆడతానే వుంటాయి గదా. ఇది కాలోజీకి నాంబెట్టి సిల్మాలు చూడ మరిగింది. ఇప్పుడు ఇంటికాడ సంగటి చట్టీ కూర చట్టీ కాడ వుండాది – ఎల్లంటే ఓ అంటే వీ అంటే ఈ అంటే లవ్వు లవ్వు లవ్వులే అని పాడుకుంటా!

"ఈ కాలం వుజ్జోగస్తుళ్లు దొరకడం బలే కష్టమకా! నా మాటిని మంచి సేద్యగాడికిచ్చి చేసెయ్ పెండ్లి!" అని అన్నా వూదుకోని వూదుకోని కాపీ తగతా. కాపీ తాగేసి గమ్మనబోతే ఎట్ట, ఏదో వొగటి అనాల గదాని!

ఒకప్పుడు కర్రెక్క, "నా కూతురు నీడ పాటున్నే వుండాల. నా మాదిర్తో అది ఎండకు పోగూడదు. వుజ్జోగస్తుణ్ణి చూసి పెండ్లి జేసేస్తే..." అని కలలు కంటా వుండేది.

"సేద్యం జేస్కునేవోళ్లు గూడ ఏం తక్కవగా లేరు. 'కోళ్ళ పారం పెట్టియ్, చేసుకుంటాం' అంటుండారు. వాళ్లకు కోళ్ళ పారం పెట్టించే కన్నా అంతో ఇంతో చేతిలో బెట్టి వుజ్జోగస్తుడికిచ్చేదే మేలు." అని కర్రెక్క అష్ట తెలివులుతో మాట్లాడతా వుంటే యిచ్చిత్రక పొయ్‌నా.

కర్రెక్క ఈ మాదిర్తో ఎంత మందిని అడిగిందో కాని ఒకనాడు ఒక వుజ్జోగస్తుడు చూపులకొచ్చినాడంట. వోడు ఏదో పాక్ట్రీలో నన్నూర్రూపాయలు సంబళం తీస్తా చెకుర్టీ గార్డుగా వుండాడంట. కర్రెక్క శుబరత్నను వోడి చేతల్లో పెట్టేసే దానికి సిద్దమై పూడిసింది. చూపులైనాక మాటలు జరిగినాయి.

"పది వేలూ, పది సవరాలూ పెట్టి పెండ్లి జేసిస్తా." అనిందంట కర్రెక్క.

దానికి చెకుర్టీగార్డు, "నాకు పరమాలలో వొకరు నలపై వేలూ, నలపై సవరాల బంగారూ పెడతామని దినామూ వస్తుండారు. పిల్ల నలుపని నేను కొంచిం జంకతుండా." అని కోసినాడంట.

"నేనంత దూరం రాలేను నాయినా!" అని కర్రెక్క చెకుర్టీ గార్డును సాగనింపించిందంట.


తిరప్తి దేవస్తానంలో గార్డనులో నీళ్లుబోసే ఎన్నెమ్మారొకడు, 'నాకు జీతం తొమ్మిది నూర్లని చెప్తా కర్రెక్క దగ్గిరి కొచ్చి, "ముప్పై వేలకు తక్కవ పైసా అయితే వొప్పుకోను, 30 సవరాలకు తక్కవ గ్రాము తగ్గితే నేనిదే పోతా!" అని బెట్టు చూపించినాడంట.

కర్రెక్కకు బాయి కింద రెండెకరాల కయ్యగూడా వుండాదనుకో. అయితే మాత్రం వుండేదంతా శుబరత్నకే ఇచ్చి పంపించేస్తే ఇంక వుండే కొడుకునీ, కూతుర్నీ ఏ గంప కింద మూసిపెట్టాల?

రెండు నెల్లు తాలినాక నేనొక సమందాన్ని కడుపులో బెట్టుకోని మాట్లాడదాం గదాని కర్రెక్క గడపెక్కబోదును గదా–

"ఈ రెండేండ్లా సమందాలు చూసి చూసి నా తల పట్టగట్టి పొయ్యిందిరా సినబ్బా!

'అది అంత పొడుగుండి' వుజ్జోగం చేసే ప్రతి నా బట్టా నా గడప తొక్కేది – 30 వేలూ 30 సవరాలూ అడిగేది! 'అది అంత పొడుగుండి' రెండెకరాల సేద్యం జేసే ప్రతి నా బట్టా నా గడప తొక్కేది – కోళ్లపారం పెట్టియ్యమనేది! ఆ నా బట్టలకు 'అది అంత పొడుగుండేది' నిజ్జిమే అయితే – వొక్క నా బట్టన్నా చేసి పెట్టిన బొమ్మ మాదిర్తో వుండే నా కూతుర్ని ఆరా తీరా జూసి – దాన్నియ్యండి నేనేలుకుంటానని అడగడా? ఆ కొజ్జా నా బట్టలు నాకు అల్లుళ్లుగా వుండేమి సుకం, లేకేమి సుకం?" అని కర్రెక్క కట్నం అడిగే పనికిమాలిన్నాకొడకల మింద వుండే అక్కుసునంతా నా మింద తీర్చుకొనింది.



# దున్నపోతు దున్ని చావాల!

మంచి మద్యానం దాటినా నేనింకా ఆపీసుకు కదల బారకుండా చింత చెట్టు కింద కుచ్చోనుండడం జూసి, "నాబట్టా! నీకీ పొద్దు రెయ్యి డూటీనా? అట్టయితే పొగులంతా వూళ్ళోవుండి మమ్మల్ను సంపతా వుంటావు గదా!" అని అంటా వొచ్చి కూలబడింది కమలత్త.

"నాకు పొగులు డూటీ అయితే మాత్రం రెయ్యంతా వూర్లో వుండి మిమ్మల్ని సంపకుండా వొదిలి పెడతానంటే లంజా!" అని నా మాటకు నేనే నవ్వేదానికి బెట్టుకున్నా.

"ఈ నాబట్టతో మాట్లాడాలంటే ఏడావుల నెయ్యి తాగేసి రావాలమ్మా!" అనేసి నోటికి బీగమేస్కునింది కమలత్త.

మేం ఈ మాదిరిగా మారట్లు పడతా వుండంగానే మార్కెట్టత్త అంత దూరంలో నిలబడి 'ఇట్రా!' అన్నట్టు నన్ను చేత్తో సైగజేసి పిలిచింది.

"దీనికీ నాకూ నడిమద్దె సైగలేందని! దేముడిచ్చిన నోరుండంగా నన్ను సైగ జేసి పిల్చేది చూడండి మార్కెట్టుది! వోహో, మొగుడు ఇంట్లో లేనట్టుండాడు, పిల్ల సందు జూస్కోని సైగ జేస్తుండాది. వొరెడెఖా, మంచి చాన్సు గదరా, అయితే ఎండ పూట–" అని నేను – ఆడోళ్లంతా వొకరి మింద వొకరు పడి నవ్వుకునేటట్టుగా – మార్కెట్టు దాన్దగ్గరికి చేరుకున్నా.

మార్కెట్టుది నా తలకు బట్టి వొక్కటిచ్చి, "నా బట్టా - నిన్ను చేటా పొరకతో కొడితే గూడ కర్మ తీరదురా." అని అంటా ఇంటికి తొడుకోని పొయ్యింది. దానికంటే ముందుగా తలుపు తోస్కోని గుడిసిలోకి దూరదా మనుకుంటే తలుపు రాలా.

"తలుపు గెడేస్కోని ఇంట్లో ఆ పాపిస్టోడుండాడు, గెంట సేపుట్నించి గెడి తియ్యకుండా సతాయిస్తా వుండాడు. పెద్ద మనిసిగా నిన్ను పిలిపించినా." అనింది మంచి ఎండలో తిన్నిమింద కూచ్చుంటా.

మార్కెట్టత్త మొగుడి పేరు పెదబావ. అసలు పేరు ఎవుడికి తెల్సు?

నేను మరేదైన గొంతుతో, "పెదబావా! తలుపు తియ్ సామీ, నేనొచ్చేసి నాను గదా! అంతా సగపెడతా గదా, అయినా మా అత్తను ఇంట్లో యేస్కోని గెడేస్కున్నా ఒకర్తం గాని - తలుపు తియ్, తలుపు తియ్, నాయమ్మ గదా!" అన్నాను.

"ఇది పెద్ద మనుసులతో వొగదెగే తగరారు గాదులే పోరా సిన్నోడా! అది నన్ను అమాసకీ పౌర్నానిగ్గూడా మొగోడని తలవడం లేదుగాని-" అని లోపల్నుంచి లోగొంతుతో అన్నాడు పెదబావ.

తలుపు సందులో నుంచి చూస్తే - నా కొడుకు పై గుడ్డను నేల మింద పరుచుకోని యెల్లాలకల సుకంగా పొనుకోనుండాడు. పొద్దు నడి నెత్తిన వుండాది గదా. చూరు నీడ గూడ లేక మేం ఎండలో మాడతా వుండాం.

"మాయత్త నిన్ను మొగోడని తలవడం లేదా? పాలూకూడూ తినే నోటితో అపద్దాలెందుకు చెప్తావు మామా! నిన్ను మొగోడని తలవకుంటే - మొన్ననంగా మొన్న గుడ్డలంగిట్లోకి నన్ను పిలచక పొయ్ నీ కోసరం అన్జెప్పి మీట్రు పదేడ్రూ పాయలు బెట్టి పటాపటేలు డాయరు గుడ్డ తీస్కొనె, మంచి ఎనిమిది మూర పంచెలు రెండు తీస్కొనె! నిన్నాడదిగా తలిచే వుంటే నీకు పావళ్లూ ఆరుమూర కోకలూ తీసిచ్చుండదా!" అన్నాన్నేను కొంచిం నవ్వు గొంతుతో.

"ఒరే నియ్యక్కా గుడ్డి నాయాలా, ఆ కిండల్ మాటలు కట్టిపెట్టు వాయ్! నేనూ నా పెళ్లాం పడుకుంటాం లేచుకుంటాం. మద్య నీకేం జోలి? నువ్వూ నీ పెళ్లాం గుద్దులాడుకునేటప్పుడు నేనుగాని ఎప్పుడన్నా అడ్డమొచ్చినానా?

మంచి మాటల్తో పో ఇక్కణ్నుంచి–" అని కరుగ్గా అన్నాడు పెదబావ నా ఎగతాళి కనుక్కునేసి.

"పోనీలే పాపం అనుకునే కొంందికి చానా ముదిరి పోతా వుండావే! నా కొడకా మంచి మాటల్తో తలుపు తీస్తావా, గెడ్డపార తెచ్చి పగలగొట్ట మంటావా?" అని నేను బెదిరింపులకు దిగినా.

మార్కెట్టత్త మూతి మింద యేలేసి నన్ను సైగజేసి, "తిట్టద్దు. నాబట్టా కొడుకు వురి బోస్కోని చస్తానని కుచ్చోనుండాడు. అన్నంత పనీ జేస్తే మళ్ళ నేనే దేముడి మింద పడి కొట్టుకునేదిరా సామీ." అని గొణిగింది.

"అసలింతకీ ఏమి కత?" అని నేను గెట్టంగా అడిగినా.

మార్కెట్టత్తగూడా గొంతు పెంచి, "ఏమంటే ఏం జెప్పేది? తిని, మదం! అదే కత!" అనింది.

నాకు అర్తమైపొయ్ బారడు పొడుగు నవ్వొచ్చేసింది!

పాపం పెదబావ ఏమనుకున్నాడో ఏమో మళ్లా నాతో మాట కలిపి, "నువ్వా మొగోడే గదంట్రా నాయాలా! ఉప్పా కారం గదా తినేది! ఆడదాని మొకం జూడాలని అమాసకీ పౌర్నానికన్నా అనిపించదా– ఎంత అరైయేండ్ల ముసిలోణ్ణే అయినా!" అనన్నాడు.

ఆ మాటల్ను మార్కెట్టత్త చెవల్లో యేస్కోకుండా, "ఆ మొగోడేమో గెడేస్కోని లోపల్నే తినేసి చెయ్యి కడుక్కునేసినాడు. నాకు ఆకిల్తో కడుపు దగదగమని మండతా వుండాది. తలుపు తియ్యమను సామీ" అని మార్కెట్టత్త అనడం, నేను తలుపును ఎగిసెగిసి తన్నడం, బిత్తర పొయ్న పెదబావ గెడి తియ్యడం టకటకా జరిగిపొయ్నాయి.

తిక్కలోడు పెదబావ తల గీరుకుంటా బైటికొచ్చినాడు.

"నా కొడకా! నిన్నిప్పుడేం అన్ను. యెల్లాలకల పొనుకోని ఎంగిలూంచు కుంటే మన మిందే పడతాది, వూళ్లో అగుమానం. మడికాడికొస్తావు గదా, ఆడ జూసు కుంటా నీ కత! మూడు పూటలా తింటే గూడ అంత మదమా?" అని పటపట పండ్లు కొరికి ఇంట్లేకి పొయ్యింది మార్కెట్టుది.

“చూడ్రా, ఆ రవిడీ లంజ నన్ను బయపెట్టేది చూడ్రా! నీకిది దర్మంగా వుండాదేమో చెప్పరా!” అని ఏడుపు మొకంతో అన్నాడు పెదబావ.

“అది సరేగాని, తలుపు గెడేస్కుంటే మాత్రం తమరికి అంత దైర్నం యాడనుంచొచ్చింది? నేను మీ మొగుడూ పెళ్లాల నడిమద్యకు రాగూడదా?” అని కొసినీ యేసి చెయ్యి పైకెత్తినా.

నేను కొడతానేమోనన్జెప్పి పెదబావ పాపం వులిక్కి పడి నా చెయ్యి పట్టుకునేసినాడు. ‘కొట్టన్లే కొట్టన్లే’ అని మాటిచ్చి, “కొంచేపు నవ్వుకుందాం, చింతమాకు కాడికి రా పోదాం” అని చింతమాకు కాడికి తొడుకోనొచ్చినా. మార్కెట్టుది చస్తిమా బతికితిమా అన్జెప్పి ఆకిలికి సంగటి కవణాలు మింగతా వుండాది.

నిజ్జంగా ఆడ వాటికి మూడో కన్నున్నట్టుండాది. లేకుంటే మార్కెట్టు దానింటి కాడ ఏం జరిగిందో వీళ్లకెట్ట తెలిసి పొయ్యింది?

“నిన్ను మార్కెట్టుది సైగ జేసినప్పుడే అనుకున్నా– పెదబావ తలుపు గెడేస్కోనుంటాడని– వోయమ్మో, మొగుడూ పెళ్లాలిద్దరికీ ఎప్పుడూ ఇదే రచ్చగదా!” అంటా మొదులు బెట్టింది కడుపత్త.

మార్కెట్టత్త ఇంటి గుట్టు ఎప్పుడో రచ్చకెక్కి పొయ్యిందన్న మాట. అయినా, ఇట్లా మాటలు తమాస కిందికొస్తాయేగాని లజ్జ పడిపొయ్ అగుమానప్పడి పొయ్యేటట్టేమీ వుండవు. మొన్నగాక మొన్న బైట ఈదిలో మంచమేస్కోని పొనుకోనుండా నేను. నీలావతి, “ఏం సినబ్బా, శివరాత్రి పోవాల శ్రీరామ నవమి రావాల, మళ్లగదా ఈదిలో మంచాలేస్కోని పొనుకునేది. ఇప్పుడు మంచు గదా. పడిశం బట్టదా?” అనింది. “నిజమే నీలవతీ! మంచే కానీ, ఏం జేద్దును చెప్పు, నాకు రెండు రోజులుగా బలే నడుం నెప్పి గాని, ఇంట్లో పొనుకుంటే నా పెళ్లాం గుంటకు గుక్కడు నీళ్ళు తాపిస్తిందే!” అన్నా. ఈ మాటకు మా ఈది పొడుగూకా ఒకే నవ్వు!

సరే, ఆడోళ్లంతా పెదబావను తగులుకున్నారు సామీ–

“ఆడదానికి ముగ్గురు పిలకాయలు పుట్టిపోతే మళ్లుండదు మొగోడి మింద! ఈ పిలకాయల్నెట్టరా పెద్దోళ్లను చేస్కో బొయ్యేదనే కలవరమే గాని– దాని

మింద ఏ ఆడదానికన్నా వుంటిందా? అరవైయ్యేండ్లయి నాయనుకో, నువ్విప్పుడు ఆడదాని మొకం జూడాలంట సేయ్" అని కమలత్త పెదబావ తలకుబట్టి వొక్కటిచ్చుకునింది.

"ధూ, అదొక గలీజు పని గదా. మనవళ్ళూ మనవరాళ్లూ గూడ అయిపొయ్‌నారు. ఈ నాబట్టా కొడుక్కి దాని మింద రోత బుట్టలేదు చూడా!" అని వాంతి చేసుకోబొయ్యింది కడుపత్త.

ఈ ఇన్ని మాటలకూ సమాదానంగా పెదబావ–

"మా తొట్టికి పది బిందెల నీళ్లు పడతాయి. తొట్టి నిండేదాకా వొంచిన నడుమెత్తకుండా, గసనేది తెలవకుండా బోరింగు కొడతా. తెల్లారి పొయ్ మడిలో మడక కట్టినానంటే మద్యానాలకు ఎకరా దున్నేసొస్తా. చద్ది తాగేసి అడివికి పొయ్‌నానంటే సంగటేళకంతా ముగ్గురు మనసల బర్తీతో కట్టెల మోపు తెస్తా. ఇన్ని పన్లకు పనికొచ్చే ఈ మొగోడు – ఆ పని కాడ మాత్రం సోంబేరిగా వుండి పోవాల్నో? దున్నపోతు దున్ని చావాల! మొగోడేం జేసి చావాల్నో మీకు తెలవదంటే లంజిలాలా?" అని మమ్మల్నందర్నీ నవ్విపించి నవ్విపించి చంపినాడు.



# జంటిలు మెన్ల చేత జుట్లు పట్టించిన నారద మఖాముని

మా మిద్దె మింద మేం తట్టడు చింత కాయలు ఎండబోసుంటే ఎవుత్తో చాటడు కాయలు దొబ్బేసింది!

తట్టడు చింత కాయలు వూరికే రాలేదు నాయినా, పోతే పొయ్‌నాయి లే చాటడు కాయలనుకునే దానికి!

మాకు అయిదు చింత మాకులుండాయి. మాకంటే మా వొక్కరికే గాదులే, ఆ మాకుల్లో అయిదుమందికి బాగాలుండాయి. మాకూ, మా పెద నాయినోళ్లకూ, మా సిన్నాయినోళ్లకూ మా బూలోక రంబోళ్లకూ, మా నీలావతోళ్లకూ. అందర్లోకీ చిన్న బాగస్తులం మేమేనంటబ్బా! మాకుండే బాగానికి కాపు ఇరగ కాసినా మఖా అయితే మా వరకు నాలుగు తట్టలొస్తాయి. ఆ సమ్మచ్చరం ఏ లంజి కండ్లల్లో కంపలు గొట్టుకోని దిష్టిబెట్టి చచ్చిందో పూతే పట్టలా. కొమ్మకు చాటడు కాయలు గూడా కాపు దిగలా. గాలికి రాలిపొయ్‌న కాయల్నే తలా అన్ని ఏరుకున్నాం. బర్‌మని గాలి తోలిందంటే చాలు నేనూ మాయమ్మా మా మాకుల కింద తయారయ్యేవోళ్లం. రాలిన కాయలను రాలినట్టే ఎత్తి వొళ్లో యేస్కునే వోళ్లం. "సినబ్బ ఆపీసుకు పొయ్యేది గూడ చాలుకునేసినట్టుండాడు. ఎప్పుడూ ఆ చింత మాకల కిందనే తారుకులాడతా వుండాడు." అని మా సరి బాగస్తులు నామింద నిష్టూర పొయ్యుండారు గూడ.

శివరాత్రి రోజనంగా బలే తోలింది గాలి. ఆ రాత్రి మాయమ్మా గొడకలకు ఇంట్లో నిద్రనేది పట్టలా. "వుండే అరగాయ పరగాయ ఈ గాలికి రాలిపొయ్యింటాయిరా సినబ్బా." అనింది మాయమ్మ. మంచి అమాసతో వొస్తింది శివరాత్రి. మా వూళ్లోకంతటికీ నేనూ మాయమ్మా బలే జూటాలం. మనం తెల్లారే దాకా మనింట్లోనే కాళ్లు చాపేసి పొనుకుంటే జరగాల్సిన పన్లు అచ్చిరమంటే జరగవు. తెల్లంగా తెల్లారనిచ్చి అయిదు మంది బాగస్తులూ ఆ చెట్ల కిందకి పోతే తలా అన్ని దొరికితే దొరికె. లేకుంటే అవీ లా. అందుకన్జెప్పి మేం మంచి నడిజాం కాడ నిద్ర లేచి చింతచెట్ల కింద రడీ అయిపొయ్‌నాం. మాంతమైన మొబ్బు. ఆ మొబ్బులో చింతకాయ కంటికి కనిపించునా? అయితే ఏమి, కాళ్ల కింద పడి బొప్పట్లు శబద్దం జేస్తాయి గదా. ఇద్దరం రెండు చాటల దాకా ఏరుకొనేసి ఒక పాపం మాకు తెలవదన్నట్టు ఇంటికొచ్చి పొనుకొనేసినాం. ఆ తెల్లారి బాగస్తులందరూ చింత చెట్టుకాడ చేరిపొయ్‌నాక మాయమ్మా గొడుకులం కడుపులోనే నవ్వుకుంటా చింతచెట్ల కాడికి చేరుకున్నాం, "ఏమి నాశినమో రాత్రంతా వొళ్లు తెలవకుండా నిద్రపొయ్ చచ్చినాం. బజిన గుళ్లో రేడీ యేసిన కతగూడ తెల్లా." అని అంటా. చెట్ల కింద వొక్క కాయుంటే! మా బాగస్తులకు మా మింద డవుట్టు రాకుండా మాయమ్మే, "నా బట్టలు నా సవుతులు రాత్రికి రాత్రే ఏరుకోని పూడ్సుంటే ఇంగా ఎక్కడవి కాయలు! రారే సినబ్బా, పోదాం." అనేసి ఇంటికొచ్చేసినాం. (ఈ కతను మా భాగస్తులు చదివితే ఎట్టరా బగమంతుడా?)

ఇన్ని డ్రామాలేస్తే వొచ్చినాయి నాయినా ఆ చింత కాయలు!

మా మిద్దెకి ఈదిలో నుంచి వుంటాయి మెట్లు. మా పన్లల్లో మేముండి మిద్ది మిందుండిన చింత కాయల్ను ఏమారినపుడు ఏ యమ్మో పుణ్యం గట్టుకొనింది. ఈ పొద్దు చింత కాయల్ను పొనీ అనుకుంటే రేపు మిరక్కాయల్ను గూడా పోనీలే అనుకోవాల్సి వుంటాది.

నేను దొంగను పట్టుకోవాల కావాల అని తీరుమానం జేసుకున్నా. నాకు తెల్చు దొంగెవురో! అయినా మనకుగా మనం ఎందుకు బైట పడాల?

ఈ మద్దిస్తాన్నెత్తుకోని నేను నీలావతోళ్లింటికి పొయ్‌నా. నీలావతంటే బూలోక రంబోళ్ల అక్కన్నమాట.

"ఏం మే నీలామణీ! సరిపోతిందా మీకీ న్యాయం? మా మిద్దె మింద జరిగుండే మోసం చూద్దువురా. తట్టడు చింత కాయల్ను కాయక్కాయకు తగలకుండా నెరిపినా. చాటడు కాయలకు పైన్నే దొంగతనం పొయ్యుండాయి. ఇట్టా దొంగ లంజిల్ను ఈ ఈదిలో బెట్టుకోని మేం కాపరాలు ఎట్ట జేద్దుం?" అని మాట్లాడినా

"సినబ్బా! నా చేతిలో చెయ్యేసి నాకు మాటిచ్చినావంటే దొంగెవురో నేన్జెప్తా. నువ్వు ఆడదాని కన్నా అన్యాయం సామీ. నీ నోట్లో నూగ్గింజ నాన్దు. అదీ నా బయ్యం." అని దొంగను జెప్పేదానికి జంకింది నీలావతి.

నేను నీలామణి చేతిలో చెయ్యేసి, "నీకా బయ్యంలా. దొంగెవురో జెప్పు. కడుపులో బెట్టుకుంటానే గాని 'ఏమి ఇట్టా పన్జేసినావే?' అని ఆ మనిసిని అడిగిన పాపాన పోను. ఆ మనిసెవురో తెలిస్తే దాందగ్గిర ఇంగన్నా జాగర్తగా వుంటాం గదా!" అని నమ్మబలికినా.

"సినబ్బా, దానికి నోరు జాస్తి. నేన్జెప్పినట్టు గాని తెలిస్తే అది నన్ను పండబెట్టి పచ్చ బోసేస్తింది. చెప్పేస్తా వుండాన్ సామీ – ఆ పన్జేసింది యింగెవురు – దనలచ్చిం!" అని చెప్పెయ్యనే చెప్పేసింది!

నేను డవుట్టు పడుండేది గూడ దనలచ్చిం మిందనే. అది మా ఈదిలోకి కొంచిం పనోడే లే. దనలచ్చిం అంటే బక్కత్త కూతురు. అది నా కండ్ల ముందర పుట్టిన లంజే.

నేను నీలామణి చేతిలో చెయ్యేసి ప్రమాణకం జేసిన కత ఆ నిమిసంలోనే మరిచి పొయ్‌నా.

నేను నేరుగా దనలచ్చిం దగ్గిరికి పొయ్, "ఏమే దనలచ్మీ, నన్ను బావా బావా అంటా వుండి నాకే టెండరు బెట్టినావంట సేయ్. చాటడు చింత కాయల్ను ఎవుత్తో టకరా జేసేసింది గదే మా మిద్దె మింద! నాకు నీ మింద డవుట్టు లేదనుకో!" అని ఆ మాటెత్తి చూసినా.

అది గుండికాయలు నీళ్లయి పోయినట్టుగా, "ఎవురు బావా?" అనడిగింది.

"ఇపుడు నాతో ఎవురు బావా అంటుండారే వోళ్లే!"

"నా మింద నీకు చెప్పిందే లంజి?" అని అది బుస్సమని పైకి లేచింది.

"నీలావతి!" టకీమని జెప్పినా.

కొంగును బొడ్లో దోపి సందిట్లావు గస పోసుకుంటా, "మే నీలక్కా! నేను సిన్నబావోళ్ల మిద్ది మింద నుంచి చింత కాయలు దొబ్బకొచ్చేసినట్టు చెప్పినావంటనే, నీ కండ్లతో నువ్వు జూసినావేమో నా ఎదురుంగా చెప్పుమే!" అంటా దనలచ్చిం నీలావొతి గడపట్లోకొచ్చి సవాలేసింది.

నీలావతికి నా మొగం కల్లా జూసే దానికి రోతబుట్టి పొయ్యింది.

నిండా మునిగినాక చలేముండాదన్జెప్పి నీలావతి ఇంగ జేసేది లేక, "నువ్వట్టా పన్లు చేసే జెంటిల్ మేనే గదా!" అనింది.

"ఏంది సేయ్, నేను జెంటిలుమేనా?" అని నీలావతి కల్లా దనలచ్చిం కొరక తినేటట్టు జూసింది.

"అవును సేయ్ నువ్వు జంటిలు మేనే! నువ్వు జంటిలుమేనని లచ్చిసార్లంటా. నేనింట్లో లేంది జూసి నువ్వు నా ఇంట్లోకి జొరబడి ఉప్పుడు బియ్యం దొబ్బక పొయ్న జెంటిలుమేను నువ్వు గాదో?" దనలచ్చింని నోటి మాటెత్తనీకుండా బెదరగొట్టాలని చూసింది నీలామణి.

'నువ్వు లంజ' అని లచ్చిసార్లు అన్నా మా వూరాడోళ్లు పడతారు గాని 'నువ్వు జెంటిలుమేను' అని గొణిగినా అగుమానంతో అల్లాడి పోతారు. అన్నిటికన్నా పెద్ద తిట్టు జెంటిలుమేననే తిట్టు.

నా చింతకాయల కత యెనక్కి బొయ్యింది. జెంటిలుమేను కత ముందరికొచ్చింది.

"వొసే, నేను గాదే జెంటిలుమేను, నీయమ్మ జెంటిలుమేను, నీ పిన్నం జెంటిలు మేను. నీ పెద్దం జెంటిలుమేను. నీ వొంగిసిమంతా జెంటిలుమేన్ల వొంగిశం!" అంటా అక్కుసుతో దనలచ్చిం నీలావతి పైబడ కొచ్చింది.

"నువ్వు నన్ను లచ్చిసార్లు జెంటిలిమేనంటే నేన్నిన్ను కోటిసార్లు జెంటిలుమేనంటా.. జెంటిలుమేన్ తనం మాలో లా. మీరింగా – పుట్టకతోనే జెంటిలుమేన్లు!" అంటా నీలావతి రంయ్‌మని దనలచ్చిం కల్లా ఎగబడింది.

కొంచేపుటికి –

ఈ జంటిలుమేను జుట్టు ఆ జంటిలుమేను చేతల్లో!

ఆ జంటిలుమేను జుట్టు ఈ జంటిలుమేను చేతల్లో!

పోతే పొయ్‌నాయి చాటడు చింతకాయలు! బొప్పిలూడదీసి, ఈనెదీసి గింజ కొట్టేస్తే మఖా అయితే రెండు కేజీల పొందు అవునా?

నాగ్గావాల్సిందిదే!

తాటి కాయంత సంగటి ముద్ద తినేసి ఆపీసుకు పొయ్యేవోణ్ణి, ఆ రోజు ఎలక్కాయంత సంగటితోనే కడుపు నిండి పొయ్యింది!


పేంటేస్కోని ఈదిన బడినా.

వొకర్నొకరు తిట్టుకుంటా–

నీలావొతి ఇంటి ముందర నీలావతి!

దనలచ్చిం ఇంటి ముందర దనలచ్చిం!!

“మాకు మాకు జుట్లు పట్టించేసి ఆపీసుకు బొయ్యేది జూడు – జెంటిలుమేను!” అని ఇద్దురూ నన్ను తిట్టేదానికి మళ్లుకున్నారు.



# మా కన్నెబావ రామబక్తి

కన్నెబావ గురిచ్చి కజ్జెప్పుకుంటే మనకు రామకోటి రాసినంత పుణ్యం.

ఒక పండగ పూట కన్నెబావ మా ఇంటికొచ్చి నన్ను చింత చెట్టు కాడదాక తొడక పొయ్ నా చేతులు బట్టుకోని, "కూర తినాల వాయ్. ఒక కేజీ ఎత్తియ్." అనడిగినాడు.

ఆ బావ ఆ మాటన్నాడో లేదో నా కండ్లల్లో నీళ్లు చింత గింజలు దూకినట్టు దూకినాయి.

నేను గబక్కన వొంగి ఆయన పాదాలు తాకి, "నువ్వు కాల్తో చెప్పిన పనిని నేను చేత్తో చేసేదానికి ఎప్పుడూ సిద్ధమే సామీ. నా నెత్తిన ఒక మొటిక్కాయిచ్చి, 'నీయక్కా నాయాలా! నేను కూర తినాల, పంపువాయ్ వొక కేజీ.' అని నా దగ్గిర నువ్వు జబర్దస్తీ చేస్తే నాకు సంతోసం సామీ" అని కండ్లనీళ్లు తుడుసుకోని వేటను కోసే చోటికి పొయ్నా – కూర తెచ్చి మా కన్నెబావ కాళ్లకాడ పెడదామని!

కన్నెబావ గురిచ్చి మళ్ల జెప్తా. ముందు కన్నెబావ వొంగిశం గురిచ్చి చెప్తా.

కన్నెబావోళ్ల తాత ముత్తాతలకు బూములు బావులు ఎన్నున్నాయో చెప్పలేమంట. పెద్దోళ్ళ కాలంలో వొకసారి రాయల చెరువు నిండిపొయ్ తూముకు అడ్డంగా వొక దున్నపోతు తలకాయ తగలక పొయ్యిందంట. దాంతో చెర్లో నీళ్లు బైటికి రాక చెరువు కట్ట తెగేదానికి పెట్టుకునిందంట. అపుడు

కన్నెబావ వొంగిశస్తుడొకాయన తూములోకి దూకి దునపోతు తలకాయిని బైటికి తీసినాడంట. అందుగ్గాను రాయలవారు కన్నెప్పగారి వంశస్తులకు పట్టెడలు పట్టెడలు బూములు రాసిచ్చినాడని పేరు. వాళ్లను గురిచ్చి చెప్పుకునే ఇంగొక తమాసా కత ఏమంటే – కార్వేటి నగరం రాజావారు మా వూరి గుండా గుర్రం మింద పోతా వుంటే ఒక నేరేడు చెట్టు నిండా పొండ్లు కనిపించినాయంట. గుర్రం మింద నుంచే నేరేడు మండను అందుకోని నాలుగు పొండ్లు దుసి నోట్లో యేసుకుందామని రాజావారు చెయ్యేసి అందుకోబోతే మండ అందలేదంట. రాజావారు ఆగకుండా నగరానికి పూడ్సినాడంట. ఆ నేరేడు చెట్టు కాడనే మడక దున్నుకుంటా వుండిన కన్నెబావోళ్ల తాత నేరేడు పొండ్లు దుసుకోని అడ్డదోవన రాజావారి కంటే ముందర్నే నగరం చేరుకోని రాజావారొచ్చినాక ఆ పొండ్లు ఆయన చేతల్లో పోసినాడంట. దాంతో రాజావారు గమ్మునుంటాడా? కొన్ని ఆస్తులు రాసిస్తాడు గదా!

ఇవంతా ఎంత మట్టుకు నిజమో మనకు తెల్దు. తిరమల శనివారాల్లో అంటే బ్రమ్మోత్సవాలప్పుడు వొక్కపొద్దులుంటాం గదా! ఆ వొక్కపొద్దులప్పుడు గూడా వందల మందికి కన్నెబ్బగారు అన్నాలు పెట్టిన కతను మాయమ్మ ఎన్నోసార్లు చెప్పింది. మా అమ్మను కన్నప్పుడు మా అవ్వకు పాలు దండిగా పడినాయంట. ఆ పాలు మాయమ్మకు మిగిలి పొయ్యేవంట. ఆ పాలను మాయవ్వ కన్నెప్పగారింట పిలకాయలకు ఇద్దరికి తాపించేసి రెండు ముద్దల సంగటి తినేసొచ్చేదంట.

నిజ్జంగా అడిగినోళ్లందరికీ కాదనకుండా కనికిరానికి పొయ్ – నలగరికి అంత పెట్టీ పోసీ ఇపుడు కన్నెప్పగారి వొంగిశం బీదరాలయ్యింది.

కన్నెబావకు రెండెకరాల దాకా కయ్య వుండాది. ఇద్దురు కూతుండ్లు. పెండ్లిండ్లయి పొయ్ వాళ్లగ్గూడా పిలకాయలై పొయ్‌నారు. మేలు కాలంలో ఆ రెండెకరాలు పైరెక్కింది గాని ఈ కరువు కాలంలో బీడు కిందే లెక్క. అప్పుజేసి బోరు యేస్తే చుక్క పల్లా. చేసుకునే దానికి సేద్యం లేనప్పుడు పొట్టబోస్కునే దానికి కూలికి పోవద్దా? కన్నెబావకిప్పుడు కనీసం డెబ్బై అయిదు సమ్మచ్చ రాలన్నా వుంటాయి. ఆ వొగిసులో కూడా పిలిచినోళ్లకంతా కూలికి పొయ్‌నాడు. కన్నెబావతో పని చేస్తావుంటే ఎవురికీ కష్టం తెలవదు. నేను ఇంటర్మెట్టు పరీచ్చలు రాసినాక రెండు నెల్లేమో లీవులిస్తారు గదా ఆ లీవుల్లో ఇంటికాడ

గమ్మునుండేదెందుకు, దినానికి అయిదు రూపాయిలొస్తాయి గదాని – నేను వరి కోతలకు పొయ్‌నాను. అపుడు తెలిసింది నాకు కన్నెబావ ఎంత పండితుడో! ఆయన బారతం రామాయణం చెప్తా వుంటే వినే దానికి రెండు చెవ్వులూ చాలవు. కన్నెబావతో గూడా కష్టిం జెయ్యాలంటే అందరికీ కులుకే. మా మూడూళ్లల్లో రామాయణం, బారతం గురిచ్చి కొంతన్నా తెలుసంటే అది మా కన్నెబావ పుణ్యమే.

నేను కూర తెచ్చి మా కన్నెబావ చేతల్లో బెట్టి, "ఇంకేం సామీ నువ్వు కనబడి నాకు మూడు నెల్లవతా వుండాది. ఎట్టగా వుండావు, ఏంగా వుండావు?" అనడిగినా.

"వూళ్లో వుండేదే లేదు వాయ్. ఎక్కడ భజన జరిగితే అక్కడికి పొయ్యేదే!" అనన్నాడు.

నిజమే, మా పక్క గుడిలేని వూరుండదు. (మా అత్తగారూర్లో మాత్రం నిజ్జంగానే లేదబ్బా– ఛ, ఛ, అది వూరుగాదులే నాశినం!) మా రైతులకు ఏదన్నా మేలు జరిగితే బజిన బెట్టిస్తారు. పురండాలు చెప్పిస్తారు. ఎవురన్నా బోరేస్తే ఎల్లాకొల్లిగా నీళ్లు పడిపొయ్‌నాయనుకో, అప్పుడు రైతు బజిన బెట్టించి శాస్త్రం జెప్పిస్తాడు.

"మంచి పుణ్యంలే బావా! రాముణ్ణి గురిచ్చి తల్చుకోవడం, ఆయన గురిచ్చి శాస్త్రం జెప్పుకోవడం అంటే చిన్న పుణ్యమా? పుణ్యమంతా నీకేలే!" అన్నా ఆయనకేమన్నా కడుపులో బాద వుంటే అది కొంచిం నిమ్మళ పడితింది గదాని.

"నువ్వు జెప్పేది చానా పొరబాటు మాట వాయ్. ఒక పక్క సేద్యం జేస్కుంటానే, ఇంగొక పక్క బాగవతం జెప్పేసినాడు పోతన. ఆ మాదిర్తో నా కష్టిం నేను జేస్కుంటా ఇంగొక పక్క రామాయణం చెప్పుకుంటా వుండినానే అదీ నాకు పుణ్యకాలం. ఇప్పుడు బావిలో బండ పడిపొయ్యింది, బక్కెద్దులు మూల పడిపొయ్‌నాయ్, సేద్యం నాశినమై పొయ్యింది, నాకు బతుకే లేకుండా పొయ్యింది! అందుకని పొట్టకు జరిగితింది గదాన్జెప్పి రామబజిన జేస్తుండా. ఇది రామబక్తి అంటే రాముడు గూడ మెచ్చుడ్రా నీ యక్కా నాయాలా!" అనేసి పొయ్‌నాడు కన్నెబావ.



# దేముడు మెచ్చిన తప్పు

మంచి ఎండ పూట నేనాపీసుకు ఎలబారి పోతా వుంటే, "టీ బెట్టిస్తా, తాగేసి పోదువురా సినబావా!" అంటా పిలిచింది సుశీల.

"నోరంతా తెరిచి టీ తాగుదువురా బావా అని పిలిచినావు. అదే పదివేలు. నువ్విచ్చేసినావు. నేను తాగేసినాను. వొస్తా. పరమాల బస్సు తప్పోబోతాది. అది ముందే లంజి బస్సు." అనేసి ముందుకు పోబొయ్‌నా.

"ఒక్క గెంట ఆపీసుకు లేటుగా బోతే పనంతా యాడిదాడ నిలిచి పోతాదా? ఇచ్చిత్రంగా వుండాదే, రాబావా!" అని అది నన్ను భంగపోయింది.

"నా పెళ్లాంతో అయితే ఆ మాట అన్ను. నీతో గాబట్టి అంటుండా – ఒక్క గెంట లేటుగా గాదు, నా జీయిత పరంతం పోకున్నా ఆపీసు పన్లేమి నిలవ్వు. పైగా బాగ్గాడ జరగచ్చు. అయితే ఈ నా కొడుకు టయానికొస్తాడు అని మేనేజిరు దగ్గిర మనం పేరెత్తుకోవాల గదా. అందుకనే ఎవురన్నా సరే ఆపీసుకు టయానికి పోవాల. అదీ కత." అంటా దాని మాట పకారమే సుశీలింట్లోకి పొయ్‌నా.

పొయ్యిమింద వుడకతా వుండిన కూర చట్టిని దించి టీ బెట్టే దానికి పూనుకొనింది సుశీల.

నేనెందుకన్నా మంచిదన్జెప్పి కడపట్లోకొచ్చి ఈదిలోకి తొంగి చూసినా. "మా నాయుడిప్పుడల్లా రాళ్లే! అయినా నా మొగుడు నీయంత పనికిమాలోడు గాదులే!" అని అది నవ్వేదానికి బెట్టుకొనింది.

"నా పెళ్లామొస్తిందేమోనని నాకు బయ్యిం గాని, నీ మొగుడొస్తే నాకేం బయ్యమే?" అని మాట్లాడి దాన్ని ఇంకొంచిం జాస్తిగా నవ్వి పించినా

ఈ మాదిర్తో మేమిద్దరం నాలుగు తమాస మాటలు మాట్లాడుకునే కొందికి టీ దాని పాటికది రడీ అయిపొయ్యింది.

ఒక గలాసులో నాకు పోసిచ్చింది. వూదుకోని వూదుకోని తాగతుండా. కడ గుక్క తాగేసి, "ఇంక నన్ను ఆపీసుకు పోనియ్యే లంజా!" అని అన్నానో లేదో సుశీల ఇరై రూపాయల కాతికం నా చేతల్లో బెట్టి, "కోడిగుడ్డు సబ్బా ఫారిన్ లఫ్లీ!" అని మెడకాయ వాలేస్కోని కొంచిం సిగ్గుపడింది.

"ఇట్టా వస్తువులు నా పెళ్లానిగ్గావాల గానీ నీకెందుకే, చేసిపెట్టిన బొమ్మాల వుండావు. నీకిదేం ఖర్మే." అని దాని జుట్టు ముడికి బట్టి ఒక్క మొటిక్కాయేసినా.

సుశీల కొట్టంలో కల్లా చెయ్యి జూపించి, "ఆ ఆవు వుండబట్టే గద సామీ మనం ఇందాక టీ బెట్టుకొని తాగింది! ఆవు పాలిచ్చేటప్పుడన్నా నా కొడుక్కి కోడిగుడ్డు సబ్బు పుయ్యకపోతే ఎట్ట?" అనింది కుశాలగా.

సుశీల వాళ్లకు సెంటు నేల లేదు. ఏ రకంతోనో ఒక రకంతో ఆవు గొడ్డును మేపుకొని మొగుణ్ణి టాకట్ర పన్లకు పంపించుకుంటా సంసారాన్ని నెట్టకొస్తా వుండాది.

"చిల్లర మిగిల్తే అడగను, చాలకుంటే ఇయ్యను." అని సుశీల అంటా వుంటే, "అట్టనే లే తల్లీ, అట్టనే లే!" అనేసి ఈదిన బడినా.

కట్టుమడి చింత మాకల కాడికి వొద్దును గదా – గాడిదొకటి కేశువులోళ్ల శెనగ మొలకలో చేరుకొని తొక్కి నాశినం చేస్తా కనిపిచ్చింది. అర్నెల్ల పైరు గదా. కంటితో చూసీ తప్పించుకోని ఎట్టబోదు? ఎవుర్తోనన్నా చెబ్దామన్నా దోవలో ఎవ్వరూ లేరు.

ఆ గాడిద గల్ల నాకొడుకులు ముందర కాళ్లకు బందాలు గూడ యెయ్యకుండా ఇడిసిపెట్టేసినట్టుండారు. నేను దానిమిందికి మట్టిపెళ్ల యిసిరేసి పైరులో నుంచి కడగా తోలబోతే అది లెక్కలో గూడ యేసుకోకుండా అరస్తా పైరులోనే చుట్టకలాడింది. లాబం లేదన్జెప్పి కట్టినొకదాన్ని సంపాదిచ్చి దాని

మింద పడినా. అది పరిగెత్తి పరిగెత్తి మా చెరుకు తోట దగ్గరికి పొయ్ నిలబడి నా కల్లా ఎగజూసింది.

కర్మరా బగమంతుడా, కేశువులోళ్ల శెనగ మొలకల్లో వుండిన గాడిదను నా అంతట నేనై మా తోటలోకి తోలినట్టయి పాయ గదా!

నేను కాలిక్కాలికి కొట్టుకుంటా మళ్లా అంత దూరం పొయ్, "లంజా, మంచి మాటల్తో బాటలోకి పా!" అని కట్టెను దాని మిందికి ఇసిరేస్తే అది మా తోటలోకి దూరనే దూరేసింది. గస పోసుకుంటా నేను తోటలోకి దూరంగానే అది బిత్తరపొయ్ తోట బైటికొచ్చి వొయ్యంకలు బెడతా బీట్లోకి పరిగెత్తి అక్కణ్ణుంచి బాట మార్గం పట్టేసింది. పెద్దోళ్లు – గాడిద – అని వూరికే అన్లా.

ఇప్పుడు చెరుకు తోటలో నేనూ లేను గాడిదా లేదు గదా. అయినా చెరుకాకులు గలగల మన్న శబద్దం రావడం ఆగలేదే! అనుమానప్పడి నడి తోటలోకి పొయ్ చూద్దును గదా – మోసులు పెరకతా సుశీల!

ఇంతకుముందే టీ బెట్టిచ్చింది గదా అందుకని గొంతును కొంచిం నిమ్మళంగానే వుంచి, "మాయమ్మ అడివికి ఎనుములు తోలుకోని పొయ్యిందని తెల్సు, నేను ఆపీసుకు నీ ముందర్నే ఎలబారి వచ్చేసినానని తెల్సు, నా పెళ్లానికి వొళ్లు బొలువనీ, అది వూపిరి పోతా వుండినా పైరుకల్లా వొచ్చి తొంగి చూడదనీ తెల్సుకున్నావు. ఇంక సినబావ చెరుకు తోటనంతా రాజ్యం యేలొచ్చునని అడ్డదోవన తోట్లో దూరినావా మఖాతల్లీ!" అన్నా.

సుశీల ఏం బెదరకుండా, "గవుర్మెట్టోడు అంటే అర్తం పనికిమాల్నోడు అని గదా! ఆకిలిగొన్నోడికి గవుర్మెట్టోడు కూర బెడతాడే గాని దాంట్లేకి అసలైన కూడు బెట్టడు. ఆ వాటంతో నాకు ఆవు లోను ఇచ్చినాడు. కానీ ఆవును మేపుకునే దానికి మార్గమా? ఈ బూమండలం మింద నాకు సెంటు నేల లేదే! మఖామఖా దేవస్తానమోడే రెండేనుగుల్ను మేపలేక నెత్తిన చేతులు బెట్టుకుంటా వుండాడు. ఒకాడది – ఈ జెర్సీ ఆవుకు మేత అందించేది ఎంత గగనం? అయినా మీ తోట్లో నేను మోసులు పెరకడం ఇది పదైదో సారో, ఇరయ్యో సారో!" అనింది.

మా ఆడోళ్ల కత ఇట్టుంటిందబ్బా! నాకు కడుప్మంట బొయ్ నవ్వొచ్చింది. (మా తోట్లో ఇన్ని మోసులు బెట్టుకోని వాటిని పెరకను నాకూ మాయమ్మకూ

మనుసొప్పక– కనీసం ముప్పై సార్లన్నా సిద్దయ్య వాళ్ల తోటలో మోసులు పెరికినోళ్లం మేమే గదా!)

"లంజా మాకు లేవా గొడ్లు? అవి తినవా మోసులు? అయినా పచ్చని పైర్లో ఇట్టా కిరాతకానికి వొగదెగతుండావు. నరకంలో చిత్రింసలు పడతావు పో!" అని కొంచిం యేదాంతం మాట్లాడి చూసినా – రేపు మరసనాటికైనా సుశీల మా తోటలోకి అడుగు బెట్టదేమోనని

నా మాటలకు సుశీల ఏం లోపడకుండా, "చిన్న కతొకటి చెప్తా యిని మళ్లజెప్పు! నీకు పేపరకేసే దానిగ్గూడ పనికొస్తాదిలే. నాబోటి ఆడదొగటి చచ్చిపొయ్యిందంట. యముడు దున్నపోతునేస్కోని వొచ్చేకొందికే ఆయమ్మను శివుడు పూల రతం మిందెక్కిచ్చుకోని సొర్గానికి తీసక పోతా వుండాడంట. 'దేవరా! అది చాకలోడికి లచ్చి సార్లు కొంగు పరిచిన లంజి. దానికి పూల రతమా, సొర్గమా?' అనడిగినాడంట యమధర్మరాజు. శివుడు కోపంతో, 'ముయ్ బొక్క. నీకు దర్మమనేది తెలిసుంటే ఆ దున్నపోతు మింద బ్రమ్మ నెక్కించుకోని నరకానికి తొడకపొయ్ నీ తనవి దీరా చిత్రింసలు బెట్టుకో. ఈ మఖా తల్లికి బ్రమ్మ రెక్కలిచ్చినాడే గాని – కష్టిం జేసుకునే దానికి బూములు బావులిచ్చినాడా? పైగా ఏటా బాలింతను జేసి ఏడుమంది పిలకాయల్నిచ్చినాడు ఘనంగా! బూలోకంలో చాకలోళ్లకు మోకాట్లోతు నీళ్లు, మోకాట్లోతు కూడు అని సామెత! మన పిలకాయలకంత సంగటి పెడతాడు గదాని ఈ మఖా తల్లి చాకలాయనకు కొంగు పరిచింది. అంతేగాని నువ్వూ నీ బ్రమ్మా పెట్టింది తిని మదం బట్టి పొయ్‌గాదు!' అన్నాడు." అని బంగారట్టా కజ్జెప్పింది.



# బాసకత బక్కమ్మకి తెలుసు

మడికాడ గుంటగింజేరాకుతో పొండ్లు తోముకోని శుబ్బరంగా ఇంటికొస్తా వుంటే, "వొరే ఆంధ్రజోతి ఎడీట్రా ఇట్రా!" అని నన్నడ్డగించుకున్నారు బజిన గుళ్లో వుండే మొగోళ్లు. (వీళ్లే కొంచిం మేల్లే. మా అత్తగారూర్లో నాకు పిల్లనిచ్చినోడైతే, "మావోడు ఆంధ్రజోతికి చీఫ్ ఎడీట్రబ్బా. రేపో ఎల్లుండో ఎడీట్రగా ప్రమోసం ఈబోతారు." అని చెప్పుకుంటా వుంటాడు.)

మనకు మొదుట్నుంచి గూడ మొగోళ్లతో ఎక్కువగా మాట్లాడే అలవాట్లు లేవు. మొగ నా కొడకల్తో ఒకటి మాట్లాడితే తక్కువ, రెండు మాట్లాడితే ఎక్కువ. నేను నెత్తి గొట్టుకుంటా బజిన గుళ్లోకి పొయ్ కుచ్చున్నా.

"అచ్చిరాస్యత దూటీలేసి కలెక్ట్రు మమ్మల్ను సంపతా వుండాడు. దీని మింద ఒక దినం ఎడిటోరియం రాయిరా – పిలకాయిలకు అచ్చిరాలు నేర్పిచ్చే కొందికే అయ్యోర్లకు తలలు పట్టగట్టి పోతా వుంటే ఇంక పెద్దోళ్లగ్గూడా నేర్పిచ్చాలంటే అయ్యోర్లు పొయ్ ఏ ఏట్లో దూకాల అనేసి నీ ఎడిటోరియంలో వాయించిడిసిపెట్టరా!" అనన్నాడు ఏడో తరగతికి ఇంగిలిపీసు చెప్పే అయ్యోరొకడు.

"ఈ ఇద్దం అయిపొయ్ ఏదో వొగటి తేలేదాకా అచ్చిరాసిత మింద ఎడిటోరియం రాయలేన్ సామీ!" అని నేను పుల్లించి నేలేసినట్టు తేల్చి చెప్పేసినా.

"అద్సరేగాని నువ్వు పేపరోడివి గదా – ఈ చంద్రశేకర గవుర్మెట్టు చీత్తే వూడిపొయ్యే ముక్కేనంటావా? పాపం చంద్రశేకరకి మూడు మొకాల్

తెలవనట్టుండాయే! అమెరికా విమానాలకు ఆయన దగ్గిరుండి పెట్రోలు పొయ్యడం మాత్రం బలే ముదావకం.” అనన్నాడు కోళ్లపారం కాడికి దినామూ పొయ్ పేపరు చదివేటోడొకడు.

“రిజర్వేషన్ల మింద దినానికొక ఎస్సే రాసిస్తా. ఎడిటోరియం పక్కన యేస్కోరా. దీని మింద నేను గొడవ జెయ్యాలనుకుంటుండా. నా ఎస్సేలు ఈనాడోడికిస్తే లడ్డాల యేస్కుంటాడు గాని, జోతోడివి నిన్ను బెట్టుకోని –” అనన్నాడు సూదులు పొడిసే దానికి మా వూళ్లేకొచ్చిన ఆరెంపీ డాక్టరు.

మొదుటసల్లో మొగోళ్లతో మాటలే ఇంత అనర్థంగా వుంటాయి. పెద్దపెద్ద చదువులు చదూకున్న మొగోళ్ల మాటలైతే ఇంగా నాశినంగా వుంటాయి. సమియం వొచ్చింది గాబట్టి చెప్తా–

నేనొక మూడేండ్లు ఐద్రాబాదులో వుజ్జోగం చేసినాన్లే. ఆడ సందేలయితే చాలు ఏదో ఒక మీటంగి బెటేస్తారు. సమాజం – సాహిత్యం, సమాజం– మానవ సంబంధాలు, సమాజం – మార్క్సిజం, సమాజం – భాషాశాస్త్రం... ఈ మాదిర్తో సమాజం తర్వాత ఒక డేష్ బెట్టి అన్నెం పున్నెం తెలవని ఆ సమాజం పక్క ఇంకేదో ఒక పదం పెట్టి మీటంగి బెట్టేస్తారు. ఈ మీటంగుల్లో మాట్లాడే వోళ్లు ఎక్కువగా పొప్సార్లు, లక్సర్లు. వీళ్లకైతే లీవులు దండిగా వుంటాయి. పైగా సందేలయితే ఇండ్లకొచ్చేసే ఉద్యోగాలు గూడా. ఇంట్లో గమ్మనుండేదెందుకులే అన్జెప్పి సందేళ సందేళ మైకుల ముందు కొచ్చేస్తారు. ఐద్రాబాదులో చేకూరి రామారావు (పాపం మా బూశమ్మది గూడ ఈ ఇంటి పేరే!) అని వొక పొప్సారు వుండాడు. ఒక మీటంగిలో అద్యచ్చుడుగా, ఇంగొక మీటంగిలో ప్రధాన వక్తగా, మరొక దాంట్లో ముక్కె అతిథిగా ఈ మాదిర్తో ఆయన కనబడని మీటంగంటూ వుండదులే.

ఒక సందేల పూట ఆయన సమాజం – సాహిత్యం అనే టాపిక్కు మింద మాట్లాడతా వుండాడు. సాహిత్యం (అంటే కతలూ అవీలే!) సమాజంలో నుంచే పుడతాది. అది ఆకాశంలో నుంచి దబీమని నేల పడదు. సమాజంలో గూడా మహరాజులూ బీదలూ వున్నట్టే సాహితీవేత్తల్లో గూడా మహారచీతలూ మామూలు రచీతలూ వుంటారు. మహా రచయితలు మహరాజుల గురించి, మామూలు రచయితలు మామూలు వాళ్ల గురించి రాస్తారు.”

ఈ మాటలకు ఇద్దురు తప్పట్లు కొట్టేసినారు. నా పక్కనుండే వోడైతే నోటు బుక్కు తీసి ఆ ముత్యాలను ఏరి పెట్టుకునేసినాడు.

నోట్ బుక్కోడికి ఏదో డవుటొచ్చి పేనాతో తల్లో గీరుకుని పైకి లేచి, "సాహిత్యం సమాజంలో నుంచి పుడతాదని అన్నారు. నోట్ చేసుకున్నాను. మరి, ఆ సమాజం ఎందులో నుంచి పుడతాదో కొంచిం చెప్తారా – నోట్ చేసుకుంటాను." అనడిగినాడు.

"చాలా మంచి ప్రశ్న." అని ఆయన మెచ్చుకోని ఆ ప్రశ్నకు ఇలావరిగా సమాదానం జేప్పేదానికి మళ్లుకున్నాడు.

అబ్బ! కజ్జెప్తే రంజకంగా వుండాల గాని, ఇదేంది? కతలో అందురూ మొగోళ్లే వుంటే (చెప్పేవోడితో సఖా!) అది ఇట్టనే ఏడస్తాది.

పాండురోగం బట్టిపొయ్‌న ఈ కతకు నవ్వు మొకం ప్రసాదించు బక్కత్తా – అంటా నేను బక్కత్త దగ్గిరికి పొయ్ కుచ్చున్నానో లేదో "ఏరక తినే కోడి ముక్కులో ముల్లిరిగి పాయ గద సినబ్బా!" అనింది.

కోడి ఎన్ని పెంట కుప్పల్ను కలబెట్టి ముక్కుతో ఏరుకోని తింటే దాని కడుపు నిండేది! అట్టా కోడి ముక్కులో ముల్లిరిగితే – ఆహా–

"ఏం జరిగిందత్తా?" అన్నా.

"మిసినీ కాయిలు కాలిపొయ్యింది. అయిదు నూర్లే గావాల్నో ఆరు నూర్లే గావాల్నో!" అని మదన పడింది.

నేనా ఇంట అడుగు బెట్టే కొందికి బక్కమ్మ మూతి మూరడు పొడుగు బెట్టుకోనుండింది. బక్కదాని కూతురు దనలచ్చిం గూడా అదే వాటంతో వుండింది. అంటే అమ్మాగూతురికిద్దరికీ లగడా పడినట్టుండాది. బక్కత్తకు మొగదిక్కు లా. గంగులు బావ చచ్చిపొయ్ నాలుగేండ్లు కావస్తుండాది. కొడుకింకా చేతికందలా. దనలచ్చింకి పెండ్లి జేసింది. సేద్యం జరిగితింది గదాని బక్కత్త అల్లుణ్ణి ఇంట్లో పెట్టుకొనింది.

"అదిగాదు సినబ్బా. వూళ్లో అందురూ ఎట్టెట్ట చేస్కోని ఎట్టెట్ట బతకతా వుండారు. మాకు అదంతా ఏం లేదబ్బా. మడి మద్యానం చేను సందేళ.

ఇదీ మా వాటం. పది రూపాయలుంటే సారా పొట్లాం. అయిదు రూపాయ లుంటే కల్లుముంత. రెంద్రూపాయ లుంటే బీడీకట్ట. చేతిలో పదిపైసాలే వుండిందనుకో – ఒక మిటాయ తీస్కునేది నోట్లో యేస్కోని చప్పరిస్తా తిరిగేది!" అల్లుడు అని పేరు జెప్పకుండా అనేదానికి బెట్టుకొనింది బక్కత్త.

దాన్నేమన్నా వొప్పుకుంటాది గాని మొగుణ్ని అనగూడదు. ఇదీ దనలచ్చిం సిద్ధాంతరం.

"ఏం బావా! ఆ మొగోడు సేద్యమనేది చెయ్యకనే వుంటే ఆ బొట్టలోకి పదైదు మూటల వొడ్ల గింజలు ఎట్టొచ్చుంటాయి? ఆ మొగోడు కొంచేపు గసార్చుకోగూడదు – ఈమె ఈ వాటంతో నసకు తగులుకుంటాది! ఈ కొంపలో ఎప్పుడూ ఇదే రచ్చ." అని మొగుడికి సపోరటొచ్చింది దనలచ్చిం.

"చెప్పుకుంటే బైసాట్లు సినబ్బా. వాడు జేసేది సేద్యమా? వాడికన్నా కొండ మంగలోడు సుమారు. కాలు కేజీ బెండ గింజలు తెచ్చి పెట్టి ఇరై దినాలయ్యింది. బీట్లో మడగట్టి ఒక్క చాలు దున్నినాడేమో పోయ్ చూడు. ఎద్దుల్లేవా, మడక లేదా? ఏం లేదు చెప్పు? ఏమన్నా అంటేనా? మొండికేసి మడి మొకం అనేది చూడకుండా రోడ్డు బాట తిరగతా వుండేది. యాళకంత తినేసి పొయ్యేది! ఈ అమాయకవైన పెళ్లాం ఏం అనదు. అనేదంతా ఈ గయ్యాళి అత్తే! యాళదప్పి పనిచేసే కన్నా ఆ పని చెయ్యకనే వుంటే మేలు. బెండకాయలు కేజీ నాలుగు రూపాయలమ్మతా వుండాయిప్పుడు. అవి ఎనపై పైసల కాడికొచ్చినాక నా అల్లుడు కయ్య దున్ని – నాటబోతాడు! ఏదన్నా వొక్కమాట అంటే చాలు – ఆ బొట్ట చూపించేది, మేం చెయ్యకనే వుంటే ఆ వొడ్ల గింజ లెట్టొచ్చినాయని అడిగేది! ఆ వొడ్ల గింజలు తెచ్చి ఇంట్లో పోసి నలపైనాళ్లయ్యింది. మూల కుండలోకి మూడిత్తులొచ్చినాయి, ఇంక మనకేంలే అని వొక్క పని అంటుకునేది లా. ఆ గింజలు ఎన్ని నాళ్లొస్తాయి. మూడు నెలల్లో వూది పారెయ్యమా? పనిడిసి పని చేసే వోడే లోకం మింద మొగోడు! తెల్లారి చద్ది తాగినాం లే అని చెప్పి మద్యానం సంగటి నిలపతామా? మద్యానం సంగటి తిన్నాం లే అన్జెప్పి రాత్రికి కూడు తినకుండా వొదల్తామా? ఇంట్లో వొడ్ల గింజలు తెచ్చి పోసేసినాం అన్జెప్పి నెల్నాళ్లు రెస్టు దీస్కోవాల్నా – గవునీరు మాదిర్తో? మొగుడింట్లో కొస్తానే గిన్నెత్తుకోని వాడికి అన్నం బెట్టేది నేర్చుకుంటే చాలదు

ఆడది! మొగోణ్ణి నసబెట్టి పనికి ఎగదోలేది ఆడది– నిజ్జమైన ఆడది! నేర్చుకోని బతుకే గుడిసేటి ముండా!”

“వుండత్తా, నోటు బుక్కు తెచ్చుకుంటానుండు. నాకు మాట దొరికితే మాణిక్యం దొరికినట్టు. మళ్ల నేను మరిచి పోతాన్ తల్లా!” అంటా నోటు బుక్కు కోసరం మా ఇంటికి పరిగెత్తినా.



# కష్టజీవే నా బావ!

నా వరకు నాకు బుద్ధి మాటలంటే బలే ఇష్టం.

మా ఇంట్లో వొక కుంటి కోడి వుండాది. కొక్కర తీగొచ్చి గూడా అది కోలుకో గలిగింది. అది గీటు గీటుకూ పద్నాలుగు గుడ్లు పెడతాది. నా పెళ్లాం వోగు లంజ గదా. అది నాలుగు గుడ్లనన్నా అట్టు పోసుకోని (వొకరికి అంత గిల్లి పెట్టకుండా) తినేస్తింది. మిగిలిన పది గుడ్లనూ పొదగేస్తే వొక్క గుడ్డును గూడా మురగనీకుండా ఇడగతాది మా కోడి.

పది పిల్లల్ను యెంటేస్కోని అది మా కొట్టంలో తిరగతా వుంటే నాకు చూసే దానికి రెొండు కండ్లూ చాలవనుకో. మా కుంటి కోడి కంటికి జెర్రి కనిపించిందనుకో, ముక్కుతో పొడిచి వక్క కొరికినంత సేపుట్లో చంపేసును. పిల్లల కోడికి ఆకిలి బలే జాస్తి. ఇర్రై అయిదు దినాలు గంపలోనే వుండి పొదగతాది గదా! ఆ ఆకిలికి వార్చలేక చచ్చిన జెర్రిని వొక్క గుక్కలో మింగేద్దామా అని మా కుంటి కోడి ఆశికి పోతాది గాని అంతలోనే, "వొకరికి పది పిల్లలై పోయినాక మనం మన నోరు కట్టుకోకుంటే ఈ పిల్లల సాక్కోలేం. ఈ పిలకాయలు పెద్దయి పొయ్యేదాక మనం మన కడుపు చూసుకోగూడదు. ఆ తరవాత వాటి బతుకు అవి బతుక్కుంటాయి–" అని దానికదే బుద్ధి మాటలు జెప్పుకొని చచ్చిన జెర్రిని పిల్లల్ను తినమంటాది. పిల్లలకు ఆత్రం గదా. వొకపిల్ల జెర్రిని పేడతట్ట కాడికి ఎత్తుకోని పొయ్ – ఒక్కటే ముక్కుతో పొడుచుకోని ఆరా తీరా తిందామని ఆశి పడితే – అంతలోనే ఇంకొక పిల్ల ఆ జెర్రిని

పెరుక్కునేస్తాది. ఈ మాదిర్తో అర గెంటయినా పిల్లల్లో పిల్లలకు తగరార్లు వొచ్చి ఆ జెర్రి వొకదాని ముక్కులో నుంచి ఇంకొక దాని ముక్కులోకి మారతానే వుంటాది. అప్పుడు మా కుంతి కోడి నవ్వుకుంటా వొచ్చి, "వొక కడుపులో పుట్టిన పిలకాయిలే ఇట్ట కీచులాడుకుంటే ఎట్టరా నా తండ్రులాలా! అక్క కడుపు నిండితే చెల్లి కడుపు నిండినట్టు కాదా? నాకేది దొరికినా మీ ముందర్నే యేస్తాను గదా – తలా కొంచిం తినేది నేర్చుకోండిరా నా యెర్రి నాగన్నలాలా! మీకేది దొరికినా మీ కడుపే కైలాసం అనుకోకుండా మీ తోడబుట్టిన వాళ్లక్కూడా అంత పెట్టేది నేర్చుకోండిరా నా కానాచ్చుల కొండాచ్చులాలా!" అని బిడ్డలకు బుద్ధి మాటలు చెప్పింది. ఇంతదాకా ఎందుకు? దూడకు ఆవు పాలిస్తా దూడను వొళ్లంతా నాకతాది గదా – అది నాకడం గాదు, బుద్ధి మాటలు చెప్పడం! మనం వోపిగ్గా కుచ్చుని వింటే వినిపిస్తాయి.

ఇవన్నీ ఒక ఎత్తయితే తల్లి బిడ్డకు చెప్పే బుద్ధి మాటలు వొక ఎత్తు. కూతురు ఈడుకొచ్చింది. పసిబిడ్డ గదా ఏం తెలస్తాది? దోవన పొయ్యే పెతీ మొగోణ్ణి నిలబెట్టి మాట్లాడుతుంటాది. ఆడబిడ్డ రుజువైనాక వొద్దిగ్గా వుండాల గదా. తల్లి చెప్పింది: "పెద్ద బిడ్డయినావు, ఇంక నువ్వుండే చడి తెలవగూడదు. ఇంటికాడ వొంచిన తల మడికాడ గాని లేపగూడదు. మడికాడ వొంచిన తల ఇంటికాడ గానీ లేపకూడదు. నువ్వు పాలు పట్టిన వరెన్నుతో సమానం. ఎన్ను మింద గువ్వ వాలితే ఎన్నుకు చేటా గువ్వకు చేటా? అది తెలుస్కోని బతుకు కూతరా! ఇది అన్ని కాలాల కాలం గాదు నాయమ్మా!" ఈ రకంతో బిడ్డలకు తల్లులు బుద్ధి మాటలు చెప్తేనే మురిసిపొయ్ ఇదంతా చెప్పకొచ్చినానే, అట్టాటోణ్ణి తల్లికి ఒక బిడ్డ బుద్ధి మాటలు చెప్తే దాన్ని కతగా చెప్పకుండా గమ్మనుంటానా?

మా కాంతొదినకు ఇద్దురు కూతుండ్లు. కాంతొదినకు మొగుడుండాడు గాని లేనోడి కిందే లెక్క. జబ్బు మనిసి. ఆయన్నను కాంతొదినే కుచ్చనబెట్టి కూడెయ్యాల. పోనీ, ఏమన్నా కయ్యాగాలవ వుండాదా అంటే పది గుంటలు వుండాది గాని తొండలు గుడ్లు బెట్టే నేల. వుండేమి సుకం, లేకేమి సుకం? నికరంగా చెప్పుకోవాలంటే ఆమెకుండేది ఆమె రెక్కలు– అంతే! బూములు బావులు సక్రంగా వుండేటోళ్లే ఇద్దరు బిడ్లకు పెండ్లి చెయ్యాలంటే, 'ఓయమ్మల్లో ఓయక్కల్లో' అని బిత్తరక పొయ్ చస్తుండారు. కాంతొదినకు కష్టిమే అని

అనుకుంటా వుంటే వొకనాడు కమలత్త నా దగ్గిరికొచ్చి "కాంత కూతురికి – పెద్ద దానికి – పెత్తానంరా సినబ్బా! బాస్కరుడు చేసుకుంటానంటా వుండాడంట." అని చెప్పింది ఏదో మాటమింద మాటొచ్చి.

నేను నోట్లో యేళ్లు బెట్టుకొని, ఇజిలేసి, ఉత్తరంగా తిరమల కొండలకల్లా తిరిగి, "యెంగటేస్పర సామీ, నువ్వుండావు! నిన్ను కండ్లార చూడలేని గుడ్డి నా కొడుకుల మాటకేం గాని– దిక్కులేనోళ్ల పాలిట నువ్వుండావు!" అన్నాను సంతోసం పట్టలేక.

కమలత్త చెప్పిన మాట ఇన్నాక కాంతొదిన పగోళ్లు తప్ప సంతోస పడకుండా ఎవురూ వుండలేరు.

నిజ్జం చెప్పుకోవాలంటే కాంతొదినకు – అల్లుడు కాదగినోడు గాదు బాస్కరుడు. బాస్కరడిది పెద్ద కుటుంబరం. రేపు పెండ్లయినాక బాస్కరడికి పది నాళ్లు వుద్దిపొప్పు వడలతో అల్లిం పెట్టే తాహత్తన్నా కాంతొదినకు వుండాదా అంటే లేదు!

బాస్కరడిది పెద్ద మనుసే. కాంతొదిన పరీస్తితి తెలిసిగూడా ఆ ఇంటికి అల్లుడు కాదలచినాడంటే వాడు మంచోడి కిందే లెక్క– అని అనుకుంటా వుంటే వొకనాడు బక్కత్తొచ్చి, "బాస్కరిడి సమందాన్ని కాంత కూతురు కాంసిలు చేసేసిందంటరా!" అని నవ్వింది. బక్కత్త ఆ మాటను ఎగతాళిగా అనింది.

లేకుంటే బంగారట్టా సమందాన్ని పెద్దమ్మి (కాంతొదిన ఇద్దరి కూతుర్లనూ పెద్దమ్మి, సిన్నమ్మి అనంటాం.) కాదనడం ఏంది?

ఒక లెక్కెత్తుకుంటే పెద్దమ్మిని పెండ్లి చేస్కునే యోగ్గిత బాస్కరడికి లేదు. పెద్దమ్మి ఎఱ్ర రూపాన నాణ్యంగా వుంటాది. నాణ్యాన్నేం కొరక్క తినంలే గాని, పెద్దమ్మి సంసారానికి లాకీ అయిన ఆడది. కయ్యిలో వొంగిందంటే – మొగోడి మాదిర్తో చేస్తాది సేద్యం. బాస్కరుడు– మనిసి బాగుండడు. పైగా సోంబేరి నాకొడుకు. ఇవన్నీ లెక్కలోకి రావు. రేపు బాస్కరడి కుటుంబరం వేర్లు పోయినా వాడి బాగానికి మూడెకరాలు వొస్తాయి. చాల్దా? మొత్తం మీద బాస్కరుణ్ణి కాదనుకోవడం పెద్దమ్మి తల తిమురే.

నేనాయమ్మికి బుద్దీమద్ది చెప్పి చూద్దామని కాంతొదిన ఇంటికి పొయ్‌నా. ఆ సమియంలో కాంతొదిన గూడా కూతురికి ఏందో నూరి పోస్తా వుండాది.

నన్ను చూడంగానే, "చూడు సినబ్బా! హరిహరాదులు చెప్పినా ఈ ముండ చెవల్లో యేసుకోవడం లా. పది నాళ్లుగా తిండీ నీళ్లూ మానేసి చెప్తా వుండా – కాదంటే కాదని పుల్లించి నేలేసేస్తా వుండాది!" అనింది.

"చూడు పెద్దమ్మీ, నీకు లోకం తెల్దు. బాస్కరడికేం తక్కవ? దేముడి దర్మాన వాడి చూపు నీ మింద పడింది. అదే పదేలనుకొని నువ్వు తలొంచాల." అని చెప్పినా నేను ఆ యమ్మి బతుకు గోరి. పెద్దమ్మి నాకూ బిడ్డతో సమానం గదా. ఆయమ్మి సిగ్గూ గిగ్గూ పడకుండా, "చిన్నాయనా! బాస్కర బావ సోంబేరి. ఆయన ఏ పొద్దన్నా మడిలో మడక దున్నతా వుంటే నువ్వు చూసుంటే చెప్పు, లేదా ఈ వూర్లో ఎవరన్నా చూసుంటే చెప్పమను! ఆయనకు ఆస్తి ఎంతుండి మాత్రం ఏం చేసేది?" అని కసువు పోసను తీసి పారేసినట్టు తీసి పారేసింది.

"ఈ కాలంలో ఆ ఈడు మొగోళ్లు ఎవురు జేస్తుండారు సేద్యాలు?" అని వాళ్లమ్మ ఏదో అనబొయ్యింది.

పెద్దమ్మి అమ్మ మాటలకు అడ్డం వొచ్చి "ఆ మాటనొద్దు, ఎవురూ సేద్యాలు చెయ్యకుంటే బూములెట్ట పండతుండాయి? ఈ మద్దిస్తాన్ని ఐకోరట దాకా తీస్కపోవద్దు. బాస్కర బావ సోంబేరోడు. రోడ్లు తిరిగి చీట్లాట ఆడేది తప్ప ఆయనకేమీ తెలవదు. పైగా తాగతాడు. ఆ రెండూ గూడా మొగలాయి పన్లని మీరు మెచ్చుకుంటారు. తినేసి తాగేస్తే – తిరమల కొండ గూడ రెండేండ్లల్లో కరిగిపోతాది. నన్ను ఆ సోంబేరోడికిచ్చి తగలగట్టే దానికన్నా నా వొప్పందం కష్టిం జేసుకుని బతికే వొక మాదిగోడికిచ్చి కట్టబెట్టు. నా బతుకు నేను బతుక్కుంటా!" అని బుద్ది మాటలు మాకు చెప్పింది ఆ మఖాతల్లి!



# రంగ రంగ నిన్ను నమ్మితి!
# ఏ నాటికైన రంగా నీ పాదమే గతి!

పొద్దున లేవంగానే నాకూ నా పెళ్లానికీ మాటల్లేకుండా పొయ్‌నాయి.

దాని అక్క మొగుడు మొన్నటి దాకా ఒకే ఒక టాకట్రకు యజమానుడు. నాలుగు నాళ్లకు ముందర వాడు రెండు టాకట్రలకు యజమానుడైపొయ్‌నాడని తెలిసినప్పుట్నుంచి ఇది మూతి మూరడు పొడుగు బెట్టుకోని నన్ను సాదించే దానికి రడీ అయింది.

"నీ అక్క మొగుడు రెండు టాకట్రలకు యజమానుడై పొయ్‌నాడని కుళ్లి చస్తుండావే! నీ మొగుడు ఈ పొద్దుటికి మూడు పుస్తకాలకు – యజమానుడైనాడని మీ అక్కగూడా నీ మాదిరే కుళ్లి చస్తా వుంటిందిలే కానీ ప్రబావొతీ!!" అని నేను దాన్ని వోదార్చే దానికి పెట్టుకున్నా.

నా తమాస మాటలకు మా వయ్యెస్ రాజశేకర రెడ్డి నవ్వుకోకుండా నా మిందికి వొంటి కాలెత్తుకోనొచ్చి, "ఈ పుస్తకం రాసినందువల్ల ఈ ఎర్ర నయాపైసా నాకిచ్చినారు అని ఏ పొద్దన్నా నా చేతల్లో నాలుగు రూకలు పెట్టినావా? సిగ్గు గూడా లేకుండా మళ్ల మాట్లాడతా వుండావు– టాకట్ర టైరు గాదు గదా దాని పొగ గొట్టం అంత చెయ్యవు నీ పనికిమాలిన పుస్తకాలు!

వొక ఆడబిడ్డ చాలు సామీ అని అంటా వుండినా ఇనకుండా మళ్లీ ఈ పనిచేసి పెట్టినావు (ఈ మాటనే నాటికి నా పెళ్లానికి ఏడోనెల.) నా పిలకాయిలకు బోకు చేతికిస్తావులే–" అని బారడు పొడుగు నసకు తగులుకొనింది.

నాకు రగిలి పొయ్యింది.

"నువ్వు గమ్మనుండే కమీనిస్టు లంజా? పందికి పన్నీరు వాసన తెలిస్తిందంటే యెదవ లంజా!" అని దాన్ని వొంగన బెట్టి వీపు మింద ముచ్చటగా మూడు (చిన్న చిన్నవే) పిడి గుద్దులు గుద్దినా. (అది నా ఎదుర్రొమ్మును పట్టి నన్ను తొయ్యడం, నేను యెల్లాలకల పడిపోవడం అవన్నీ నేను చెప్పుకోగూడదు. నా పెళ్లాం బలే బలశాలి!)

అంతే, ఆ తగరారులో నేను మళ్ల దాంతో మాట్లాడలా.

ఆ పొద్దు శుక్రోరం. నా మకారాణి తలకు పోసుకొని, జుట్టు ముడేస్కొనింది. దానికి కొప్పే పెద్దదనుకో, దానికి తోడుగా కొప్పుకు ఎర్ర టవలు చుట్టుకుంటే నా కంటికి అది మకలచ్చిం మాదిరి కనిపించింది. నేను రాజీ కొచ్చేసి ఆ కొప్పు మిందుండే టవలు పెరికేసి కిసుక్కుమని ఉడత పిల్ల మాదిర్తో నవ్వుదామనుకున్నాను గాని సిగ్గూ సింగారం అడ్డమొచ్చింది.

మా పతివర్త కూతురు దేముడి పటం ముందరికి పొయ్ జాము సేపు నిలబడి (మేం తిరప్తిలో ఇంటి జాగా తీసుకునేటట్టు చూడు సామీ అనేమో.) దండం బెట్టుకొనింది.

ఆ తర్వాత జడ కానిచ్చి, పొగడ్ర పూసి రడీ అయిపొయ్యింది. అంతదాక బాగానే వుండాది గాని అది వైరు బుట్ట తీస్కోని దాంట్లో నాలుగు బెల్లం ముద్దలూ, బియ్యప్పిండీ, ప్లాస్టీకు డబ్బాతో ప్లాస్టీకు డబ్బాడు శెనగ చమురూ సర్దేసింది.

ఒరె లంజ, దీని వాటం చూస్తా వుంటే ఈ వొస్తువులన్నింటినీ తీస్కోని అమ్మ గారింటికి గాని రడీ అవతా వుండాదా ఎట్ట?

ఇదే నిజం. అది నా కూతుర్ని గూడ రడీ జేసేసి చంకనేస్కోని, వైరు బుట్టను చేతికి తీస్కోని నా కల్లా చూడబొయ్ మెడకాయి తిప్పుకొనింది.

"అమ్మా! దొబ్బుదువుండు దోసపొండు!" అని రాజబాబు మాదిర్తో ఎగిరి దూకి దాని చేతిలో వుండిన వైరు బుట్టను లాక్కున్నా. "ఇక్కణ్ణుంచి అక్కడికి సరఫరాలు చేసేది ఎప్పట్నుంచి మొదులు బెట్టినావు తల్లమ్మా!" అన్నాను.

"నీ సొత్తు చీమంత గూడా నా అమ్మగారి కొద్దు. వాళ్లేం అంత అనర్ధంగా బతకతా లేరు. మా ఇంటికి పొయ్ బెల్లం నిప్పట్లు జేస్కోని రేపొస్తాను మామా!" అనిందది.

"నా ఇంటి కాణ్ణించి బెల్లం, బియ్యప్పిండీ, చమురూ ముప్పైమూడూ అర్రైయ్యారు వొస్తువలూ ఎత్తుకోని నీ ఇంటికి పొయ్ నీ ఇంటికాడ బెల్లం నిప్పట్లు చేస్కోనొచ్చే కర్మ ఏమి? ఇది ఇల్లు గాదా? ఇక్కడ పొయ్యి లేదా?" అని కొసినీ లేసినా.

"ఇక్కడ పొయ్యి మింద చమురు పెట్టి పొయ్యి ముట్టించగానే – చమురు సుయ్‌మనేది ఇనీ ఇనంగానే నూరు మంది పిలకాయలొస్తారు, ఇన్నూరు మంది ఆడోళ్లొస్తారు. తలా వొకటియ్యాల గదా. మళ్ల మిగిలేదేంది? ఈ కొంపలో ఏమన్నా చేస్కోని ఎత్తిపెట్టుకోని నాలుగు నాళ్ళుగా తినింది లేదురా తండ్రీ!" అని నెత్తీనోరు కొట్టుకొనింది.

దాని బాద నాకర్తమయ్యింది. అమ్మ లంజా! అదా నీ తెలివి?

నేను నా చిన్నప్పుడు ఎవురింటి కాడైనా అప్పచ్చుల పెనం సుయ్ మంటే నేనక్కడ పొయ్ నిలబడుకునే వాణ్ణి, తోస్తే గూడ కడగా వచ్చేవాణ్ణి గాను. నా చేతల్లో ఒకటో రెండో అప్పచ్చులు పెడితేనే అక్కణ్ణుంచి కదిలేది! నేను బతికిన బతుకును అంత తేలిగ్గా మర్చిపోతానా? ఒకసారి బక్కమ్మ తిరప్తి నుంచి చేతి సంచితో రోడ్డు బాటలో బస్సు దిగింది. ఆ చేతి సంచిలో అంటి పొండ్లుండాయని నాకు తెల్సు. యెనకాన్నే, ఆమెతో కూడా ఇంటికొచ్చినా, పసిబిడ్డ గదాని నా చేతిలో ఒక అంటి పొండు బెట్టింది. దాన్ని తినేసినా, తోలుతో గూడా. బక్కమ్మ ఒక అంటి పొండు తిని తోలు ఇసిరి ఈదిలో పారెయ్యబోతా వుంటే, "బంగారట్టా తోలు, నాకియ్!" అని ఆ తోలు గూడా తీస్కోని జివురుకోని తినేసినా. నేను బతికిన బతుకును అంత తేలిగ్గా మర్చిపోతానా?

"ఏం పర్వాలేదులే, నువ్వు బెల్లం నిప్పట్లు మన పొయ్యి మిందే చెయ్యి. ఇంట్లోకి – అప్పచ్చులు పోసే కత తెలుస్కోని – వొచ్చే ప్రతి మనిసికీ తలా

వొగటియ్యి. అక్కడ నీ అమ్మగారింట్లో ఇన్నూరప్పచ్చులు పోస్తే – నువ్వెక్కడికి తేబొయ్యేది – యాబయ్యే గదా! అక్కడ మీ నాయనకూ, మీ అమ్మకూ, నీకు ముగ్గురూ చిన్నాయన్లు – వాళ్లకు ముప్పై మంది పిలకాయిలు! వాళ్లంతా నోళ్లు బీగాలేస్కుంటారా, నువ్వు నిప్పట్లు చేస్తా వుంటే! నిజ్జం చెప్పాలంటే నాకు– నా సొత్తు నీ వాళ్ళు తింటే మనేద, నా వాళ్లు తింటే కుశాల!" అని దంచి వొదిలి పెట్టినా.

అది పెవడ లంజ గదా.

"నోరు మూస్కోని గమ్మనుండు. నాకు బెల్లం నిప్పట్లంటే చానా ఇష్టిం. నేను దాంచి పెట్టుకోని తినాల. మూడో కంటికి తెలవకుండా నేను నిప్పట్లు తెస్తా, మనమే నెల తినొచ్చు!" అని గొణిగి నాకు దండం బెట్టింది, దాని మాట ఈసారికి వినమని.

"సరే వుండు లంజా, నీ మిందికి నా ఆడోళ్ళను ఇడస్తా వుండు. 'నా పెళ్లాం మీ అందరికీ బయపడి వాళ్లింటి కాడ నిప్పట్లు చేస్కొనొస్తిందంట. ఇక్కడ చేస్తే మీ చెర ఆ పిల్ల పడలేదంట అని అరిసి చెప్తానుండు' అని గడప దిగి, నా కెదురు పడిన నీలావతితో, "మే, నీలావతీ! నాపెళ్లాం–" అనబొయ్‌నానో లేదో నా పెళ్లాం పయానం మానుకోని, "గమ్మునుండబ్బే, పొయ్యి ముట్టిస్తుండా గాని!" అనింది.

నిజ్జంతోనే నా పెళ్లాం పొయ్యి ముట్టించింది. పెనం పెట్టింది. పెనంలో చమురు సుంయ్‌మనింది.

పక్కింట్లో నుంచి గిరిగోడు తొంగి చూసినాడు. ఈదిలో పోతా పోతా వుండిన దినకరుడు మా గడపెక్కి దిగకుండా అయిపొయ్‌నాడు.

నీలావొతి పనుండినా లేకుండినా, "ఏమమ్మా పబావొతీ!" అంటా వొచ్చింది.

నా పెళ్లాం కుళ్లి చస్తుండాది! నేను కులికి చస్తుండా!



# అమ్మకి జేజే!

నానకు జేజే– అని మా కోతి (నా కూతురికిది ముద్దు పేర్లే) పాడతా వుండేది యిని యీ కజ్జెప్పే దానికి కుచ్చుంటా వుండా.

రేణిగుంట రోడ్డులో మా ఆంద్రజోతి నుంచి నాలుగడుగులేస్తే ఎస్టేటు అని వొస్తింది.

ఆడ రెండు మూడు టీ అంగిళ్ళుండాయి. టీ తాగి సిగిరెట్టు ముట్టించి కానగ చెట్టు కింద వుండే చలవ బండ మింద కొంచేపు కుచ్చోనొచ్చే అలవాటు నాకు.

ఆడ జరిగిందీ కత.

ముగ్గురాడోళ్లూ, ఇద్దరు మొగోళ్లు నాకు అంత దూరంలో కుచ్చోని మాట్లాడుకుంటా వుండారు. వాళ్ల మాటలు చెవల్లో యేసుకునే కొందికి నాకు అర్తమై పొయ్యింది. వాళ్లు ఇప్పుడనంగా పెండ్లి చూపులకు పొయ్యేసి వొచ్చినట్టుండారు. వీళ్లు ఆడబిడ్డి గల్లోళ్లు. పెండ్లి కొడుకుని గురిచ్చి వాళ్లల్లో ఒకాడది ఈ మాదిర్తో పొగిడింది.

“వాణ్ణి గురిచ్చి వూర్లో ఎవుర్నడిగినా అదే మాట. వాడికి వాళ్లమ్మన్నా అప్పజెల్లి అన్నా ముడ్డిలో మిరక్కాయ తుంచి పెట్టినట్టే నంట. ఒక దినం వాళ్లమ్మకూ వాడికీ పెద్ద తగరారు పడి పొయ్యిందంట. ఆ జగడంలో వీడు వాళ్లమ్మను – నువ్వు బోయే కంసలోణ్ణి జేసే లంజా – అని వుండింది వుండినట్టు

అడిగేసినాడంట. అంతే అది నేను చస్తానని గెడేస్కోని, మళ్ల వూర్లో వోళ్లు వొచ్చి – ఇంత రాద్ధాంతరం జరిగిందంట. ఇంక వాడి చెల్లయితే పెండ్లయినాక వీడికి బయపడి అమ్మగారింటి మింద ఆశే వొదులుకునేసిందంట. వీడికి పెండ్లి కావడం – అమ్మను వేరే పెట్టేస్తాడు గూడా. మన బిడ్డను పూలల్లో…"

కడుపు కాలి పోతా వుండాది. ఇంక నేను చెప్పడం నిలిపేస్తా.

ఇట్టా ఆడ లంజిలు గూడా లోకం మింద వుంటాయి. యిచ్చిత్ర పడాల్సిన పన్లా. ఆ ఆడదాని మాటలు నాలుగు వినే కొందికే నాకు వొళ్లు పొగలు బొయ్యింది. ఉచ్చిన యెంటిక చివక్కమని పైకి లేచింది.

"అట్టాటోడితో అయితే నా పెళ్లాం బలే సుకపడుండేది లంజ!" అన్నానేను వున్నట్టుండి.

వాళ్లంతా బిత్తరక పొయ్ ఒక్కసారిగా నాకల్లా తిరిగి జూసినారు. వాళ్లందురూ గూడా పల్లెటూరోళ్లుగానే వుండారు. ఆ ఇద్దురు మొగోళ్లు నా మింద చెయ్యి జేస్కున్నా గూడా పర్వాలేదులే అన్జెప్పి, నేను నవ్వు మొకంతోనే,

"నువ్వు కడుపుకేం తింటావమ్మా?" అనడిగినా.

నా మాటకు మొగోళ్లు బొమ్మలు మాదిర్తో గమ్మనుండి పొయ్‌నారు గాని ఆ ఆడది మాత్రం, "న్నో నీకేం మా జోలి? అప్పట్నుంచి చూస్తుండా, మేమేదో మా కర్మ గురిచ్చి మాట్లాడుకుంటా వుంటే మెడకాయ వొరగేస్కోని మాకల్లానే చూస్తుండావే! పక్కన మొగోళ్లుండేది గూడ తెలవకుండా–" అనింది. నేనామె మాటలకు అడ్డామొచ్చి, "నీ అందమైన మొకాన్ని జూసి వొళ్లు మర్చిపొయ్‌నాన్లే!" అన్నా.

వాళ్లల్లో ఒక మొగాయన బలంతంగా నోరు తెరచి, "చదూకున్నోడిగా వుండావు. పరా ఆడోళ్లతో ఇవేం మాటలబ్బా?" అనన్నాడు నంగిగా.

"చదూకున్నోణ్ణి గాబట్టే, అమ్మకూ అబ్బకూ పుట్టబట్టే ఆ ఆడమనిషితో రచ్చబెట్టు కోవాల్సొస్తా వుండాది. పరా ఆడోళ్లు గాబట్టే మాటల్తో వొదిలి పెడతా వుండా. అదే మా వూరాడదైయ్యుంటే ఈ పాటికి దాన్ని కోకిప్పేసి తెగ్గోసుందును!" అన్నానేను నవ్వు మింద నవ్వు నవ్వతా.

"అప్పటికి నా జుట్టు తెగ్గొయ్య లేకనే గదా నువ్వా మాట అన్నావు–" అని పేగులు పెరక్కొచ్చేటట్టు గింజుకునిందా ఆడది.

మొగోళ్లకు బలే కోపాలొచ్చేసినాయి. ప్యాంటూ చొక్కాయి యేస్కోనుండబట్టి సరిపొయ్యింది గాని లేకుంటే వాళ్లు నన్నీ పాటికి కండకూ ఎనిక్కీ సమందం లేకుండా చీల్చి పారేసుందురు.

"రేయ్ బోసడీకీ, నీకేంరా?" అని నోరు జారేసి, "అన్నో నాకింక మాటలు మీరిపోతాయి. నా నోరు మంచిది గాదు, గమ్మన లేచిపో." అని నాకు మరేద ఇచ్చి జూసిందామె.

"సరే, నాగ్గూడ టైమైంది. ఒక్కమాట చెప్పేసి పోతా – మీరు మీ బిడ్డను ఆ ముండ నా కొడుక్కి ఇచ్చేకన్నా గొంతు మింద కాలేసి తొక్కి చంపీయండి. అంతేగాని ఆ ఎదవ నా కొడుక్కి మాత్రం ఇయ్యబోకండి" అనేసి నేనాపీసుకు ఎలబారొచ్చేసినా.

ఇయ్యాళదాక ఈదిలో జరిగిన కతను చెప్పుకున్నాం గదా, ఇప్పుడు మా ఇంట్లో జరిగే కతను గూడా చెప్పుకోవడం దర్మం.

మా అత్తగారు గూడా – పైన మనం చెప్పుకున్నామే, అటుమంటోళ్లే. నేను ఐద్రాబాదు నుంచి తిరప్తికి వుజ్జోగాన్ని మార్చుకొని వొచ్చేసినాను గదా! మా అత్తగారోళ్లు మూతి మూరడు పొడుగు పెట్టుకునేసినారు. అల్లుడు ఐద్రాబాదులో ( ఆ పెట్రోలు పొగలు పీలస్తా) వుండాడంటే వాళ్లకు మతింపు గదా! పోనీ కనీసం వీడు తిరప్తిలోనన్నా కాపురం పెట్టి మన పరువు నిలబెడతాడేమో అని గూడా ఆశి పడినారు గాని, నేనెటుమంటోణ్ణి? నేరుగా మా మిట్టూరులో పెట్టినా కాపరం.

"వాడికి అమ్మ పిచ్చి జాస్తబ్బా! ఎప్పుడూ ఆమె కొంగు పట్టుకోని తిరగతా వుంటాడు. రెండు బస్సులు మారి అంత అగచాట్లు పడి ఆ ఆపీసుకు పొయ్యేకన్నా తిరప్తిలో కాపరం పెట్టుకోవచ్చు గదా!" అని మా అత్తగారు చాటుగా మాటుగా నా మింద నిష్టూరపొయ్యేటోళ్లు.

మా అత్తగారి గురించి కూడా చెప్పుకునేదెందుకు? నా పెళ్లాన్ని గురించే చెప్పుకుంటే పోలా. దీన్ని గురించి గూడా ఎక్కువగా చెప్పుకుంటే నా కడుపు కాలిపోతాది గాబట్టి టూకీగా చెప్పేస్తా.

ఆ మాటా ఈ మాటా ఒక గెంట అమ్మతో మాట్లాడితే తప్పా? మాయమ్మా నేనూ మా చిన్నప్పుడెప్పుడన్నా తిరప్తికి పోతే బస్సోడికెందుకని – నాలుగు వడలు చార్జీ డబ్బుల్తో కొనుక్కోని నమల్తా, ఆ మాటా ఈ మాటా మాట్లాడు కుంటా నడుసుకుంటానే వచ్చేస్తాం.

ఒకనాడు నా పెళ్లాం నడవింట్లో ఏందో పని జేసుకుంటా వుండింది. నేనూ మా యమ్మా వొక గెంటగా ఏందో చెప్పుకుంటా, నవ్వుకుంటా చెనిక్కాయలు వొలుసుకుంటా వుండాం. "సినబ్బా నీకు నా దగ్గిరేం పని? నీకొక పెళ్లామై పొయ్‌నాక ఇంకా తల్లేందిరా ఎదవా? నువ్వు దాన్దగ్గరికి పో, అది కుళ్లతా వుంటాది, దానికీ బాద గదా?" అని చెప్పినా నేను యినే రకం గాదు గదా!

ఇంతలో నా పెళ్లాం వున్నట్టుండి గెడేసేసింది.

నేనూ మాయమ్మా బిత్తర పొయ్‌నాం.

నేను ఒక్కడుగులో కిటికీ దగ్గరికి పొయ్, "ప్రబా, నా ప్రబా, తలుపు తియ్ ప్రబా! ఇప్పుడు నేను తప్పుగా ఏమీ అన్లేదు గదా ప్రబా, నువ్వు చచ్చి పోవద్దు ప్రబా!" అని నా పెళ్లానికి దండాలు పెట్టేసినాను, అదెక్కడ వురి బోస్కోని చస్తాదో అన్జెప్పి.

అది నా మాట వినక, మూతి నల్లంగా పెట్టుకోని, "అమ్మా కొడుకే వుండండి నాయినా! తమరికి మాతో ఆడేదానికి మాటలే వుండవు గదా. నువ్వు ఆత్మలో గూడా పెళ్లామని అనుకోవు. నేను బతికి మాత్రం ఏమి సుకం?" అని దండెం మిందుండే కోక తీస్కోని దూలానికి యేలాడ దీయబోయింది.

"ప్రబా ప్రబా ప్రబా! ఇదన్యాయం ప్రబా! నాకు మా అమ్మంటే ఆశ, నువ్వంటే తమాస! నువ్వు మీ అమ్మగారింటికి పోతే నీకోసం నేనెంత తపన పడిపోతానో మా అమ్మనడుగు!" అని పెట్టిన దండం తియ్యలా.


మా అమ్మకైతే కాళ్లూ జేతులు అదురు పుట్టిపొయ్ వొళ్లు సోదీనం తప్పి పడిపొయ్యే టట్టుండాది.

“ప్రబా ప్రబా! నీ కాళ్లు పట్టుకుంటా, తలుపు తియ్ ప్రబా!” అని అడుక్కుంటే అది దయతలిచి తలుపు తీసేసింది.

అంతే, దాన్ని జడ పట్టుకోని నాలుగు గుద్దుదామనుకున్నా. మాయమ్మ బాద పడతాదని గమ్మనుండినా.

“పాదాలుండంగా ఎవురూ శిరసుకు పూజ్జెయ్యరు. తల్లుండంగా పెళ్ళాన్నెవురూ నెత్తిన బెట్టుకోరు తల్లీ! మేం చిన్నప్పట్నుంచి అట్ట బతికినోళ్లం!” అనింది మాయమ్మ నా పెళ్లాంతో. దానికి మంచి మాటనేది అర్తం కాదుగదా!

(కత ఇంతటితో అయిపొయ్యింది గాని ఆ రాత్రి నాపెళ్లాం నా మింద కాళ్లూజేతులేసి ఏం చెప్పిందో తెలుసునా: “నా మొగుణ్నీ, నా బిడ్డనూ ఇడిసి పెట్టి నేనెందుకు చస్తా? మన పరుపును ఒక ఎలిక కొట్టేస్తా వుండాది. అది కనిపించిందున్నట్టుండి. చంపదామని తలుపేసినా. నువ్వే వేరే రకంగా అనుకుని బయపడినావు. అమ్మా కొడుకుని కొంచేపు ఏడిపిద్దామని ఆ యాక్సను జేసినా!” అని ఆ పిచ్చి లంజ గోడను బల్లి కరుచుకున్నట్టు కరుచుకునింది!)



# కడుపు గాల్చిన కన్న కూతురు

కసిం కాలవ నుంచి ఎనుములు తోలుకోనొచ్చి కొట్టంలో కట్టేస్తా వుంటే నా పెళ్ళామొచ్చి చెప్పింది, "ఏమబ్బా, శారదమ్మ చచ్చిపొయ్యింది."

నా గుండికాయలు నీళ్లయి పొయ్‌నాయి, వొళ్లంతా దడ పుట్టిపొయ్యింది.

శారదక్క నాకు తోడ బుట్టిందాంతో సమానం. చెప్పాలంటే నన్నొక ఇంటివాణ్ణి చేసింది శారదక్కే. తనపల్లి దగ్గిర సుబ్రమణ్యం స్వామి గుళ్లో ఆడికృత్తిక రోజున నేను ప్రభావతిని చూసినా. బారడు పొడుగు జడతో పిల్ల కులుకులాడిగా వుంటే, "చేసుకుంటే ఈ లంజనే చేసుకోవాల!" అని పంతంబట్టి అప్పటికప్పుడే ఇంటికొచ్చి పెత్తానానికి మాయమ్మనూ, శారదమ్మనూ జతజేసి ప్రభావతి వాళ్లవూరు పంపించి దాన్ని పెండ్లి చేస్కునేదాకా వొంటి కాలి మిందుండినా.

నా పెండ్లి జేసిన శారదక్కను గురిచ్చి ఈ రకంగా కడుపు కాలే కత చెప్పుకోవాల్సి వస్తాదని అనుకోలేదురా బగమంతుడా!

రెండు చేతల్లో రెండావుల పగ్గాలనూ, నెత్తిన తట్టనూ పెట్టుకుని దినానికి (మా ఇంటి ముందర) తొంభై మార్లు తిరగతా అగచాట్లు పడతా వుండే శారదక్క నాతో ఎప్పుడూ, "నేను పడే తిప్పలన్నీ కతగా రాయేమిరా, సినబ్బా!" అని అడిగేది.

శారదక్కకు జెరమొచ్చిందంట. ఏం జేస్తిందిలే, పోతాది – అనుకోని గమ్మునుంటే అది ఒక్క దినానికే మనిసిని నిండా లొంగదీసేసింది. రెండోరోజు డాక్టర్ల దగ్గరికి పోవడం, వాడు సూదెయ్యడం, శారదమ్మ అప్పటికప్పుడే చచ్చిపోవడం–

రెక్కల కష్టంతో బిడ్డల సాక్కునే తల్లుల ప్రాణాలను అంత లేసుగా ఎందుకు తీసక పోతావురా కూలిపొయ్‌న దేముడా!

ఈ పాపం జేసిన కండ్లతో శారదక్క శవాన్ని చూడబొయ్యేది ఎట్ట?

ఆమె ముగ్గరి బిడ్డలూ ఆమె మింద పడి కొట్టుకుంటా వుంటే నీకు కేళీ విలాసంగా వుంటాదంటరా యెంగటేస్పరా!

శారదక్కింటికి పొయ్‌నా. పిలకాయల్ను తల్లి దగ్గరికి రానీకుండా ఏయమ్మో వొకమ్మ జాగర్త తీసుకునింది.

మొగుడు నెత్తిన చేతులు బెట్టుకుని – పెళ్లాం చచ్చినోడి మాదిర్తో వుండాడు అనంటారే, నిజ్జంతో అట్టనే వుండాడు.

శారదక్కోళ్ల అమ్మ వొక్కటీ పైనబడి కొట్టుకుంటా వుండాది. ఆమె కూతురి మింద పడి, పాడిన ఏడుపు పాటలో నాలుగు మాటలు చెబ్దామనే ఈ కతను మొదులు బెట్టినా.

శారదక్కకు చిన్నప్పుడు బలే వుక్క పోసేదంట. బిడ్డను చీకటీగలు కుడతాయని బిడ్డ మింద పైటకొంగు కప్పితే ఆ బిడ్డ వుక్కకు పైటకొంగును తొలగదోసేసేదంట. అప్పుడు గాని బిడ్డకు వూపిరి తిరిగేది గాదంట.

ఇదంతా ఆ తల్లి తలుచుకొని –

"ఇప్పుడు నిన్ను బారట్లోతు గుంత తొవ్వి పూడ్చి పెట్టేస్తారు గద కూతరా! పైటకొంగును పైనేస్తేనే వుక్కకు అల్లాడి పోతుంటివే, ఇప్పుడంత లోతు మట్టిలో ఎట్ట పొనుకుంటావే నా అమాయికవైన కూతరా! నా పైటకొంగును తొలగ దోసేసినట్టు, ఆ మట్టిని గూడ తొలగదోసేసి నువ్వు చక్కా వొచ్చి నా వొళ్లో కూచ్చోయే నా పిచ్చి కూతరా!" అని పాట పాడి ఎదుర్రొమ్ము కొట్టుకుంటా వుంటే – ఈ దుఃక్కం ఎట్ట బరించేదిరా బగమంతుడా!



# అలివేలు మంగమ్మకొక దండం

మా ఇంటి ముందర చేపల గంప దింపించినా.

మడి కాడికి ఆవును తోలక పోతా వుండిన కర్రెక్కా, బోరింగు కాడ బోకులు తోముకుంటుండిన కదుపక్కా, మొగుడికి చద్ది పోస్తా పోస్తా వుండిన నీలావొతీ అందురూ చేపల గంప చుట్టూరా వుడ్డజేరి పొయ్‌నారు.

చేపలు తెచ్చిన ఆడమనిసి – రాయల చెరువు పేట ముండమోపి. నాకు చిన్న తమాస చేద్దామనిపించింది.

నేను చేపల గంపలో చెయ్యిబెట్టి, “ఇవి గెరిగేన్లు గదా, బలే వుండాయ్, తెల్లారు జామున్నే పట్టినట్టుండారు, కొన్ని ప్రాణాల్తో గూడ వుండాయే! కండ్లు మూసక్కొని కొనుక్కోవచ్చు – కేజీ ఇర్రై అయిదు రూపాయల్లెక్కన. మ్మో, మాకొక కేజీ తూంచు!” అన్నా కేజీ తక్కిడ చేపలామె చేతల్లోబెట్టి.

అంతే ఆ నిమిసంలోనే అక్కడంతా గలాం బులాం అయిపొయ్యింది.

అంత మంది ఆడోళ్ల ముందర నన్ను పట్టుకోని కొట్టలేక నా పెళ్లాం పండ్లు పట పట కొరికి, “నువ్వు ఏమిటి మొగోడుగా వుందువు? వూళ్లో ఇంత మంది మొగోళ్లుండారు, వొక్కడన్నా చేపల గంప కాడికొచ్చినాడా? మొగోడికి బేరం జెయ్యనొచ్చా? అసలవి కొరమేన్లన్నా కావే. గెరిగేన్లకు ఇర్రై అయిదు రూపాయలు పెడతారా ఎవురన్నా? ఆడోళ్లు బేరం చేస్తారు. నువ్వు నోర్మూసక్కొని ఇంట్లేకి పో. అర కేజీ ఎత్తుకుని నీ గుంత మింద యేస్తాన్లే!” అనింది.

ఆడోళ్లు గూడ ఒక్కొక్కరే నా మిందికి తగులుకోబోతుండగా నేను గూడా నోరడ్డం యేస్కోని, "ప్రబావొతీ, నువ్వు ఇంట్లో ఒక మూల కుచ్చునే ఆడదానివి. నీకు లోకం ఏం తెల్చు చెప్పు? నేనంటే పది మందిలోకి పొయ్యేవోణ్ణి వొచ్చేవోణ్ణి. పదూళ్లు తిరిగినోణ్ణి. మొన్న తిరప్తిలో రెడ్డమ్మ మెస్సులో చేపను పెట్టించుకోని తిన్నా. అది ప్లేటులో చేప తలకాయి, తోకా పెట్టి – అందుగ్గాను ఏడ్రూపాయలు వొసూల్జేసింది! ఆ లెక్కన లెక్కేస్కో. అంతెందుకు గంగిరెడ్డి పల్లిలో మేకను కోసి మేకపోతన్జెప్పి పొట్టతోళ్లూ, ఎనికలూ యేస్తే కేజీ కూరెంత? ముప్పైయ్యా ర్రూపాయలు. అందునా ఇవి మన చెరువు చేపలు. తేనె వున్నట్టుంటాయి. నీకేం తెల్సే లంజా, ఒక కేజీ చేపలు తీస్కో!" అన్నా.

నా పెళ్లాం వొళ్లు మరిచిపొయ్, "చూడమ్మా, ఆ మొగోణ్ణి ఏం జేస్తే కర్మ తీరునుమా?" అనడిగింది కర్రెక్కను.

కర్రెక్కా కడుపక్కా నీలావొతీ ముగ్గూరూ ఒకే దపా మాటల్తో నామిందికి రాబోతుండగా నేను వూరెత్తక పొయ్యేటట్టు గొంతు పెంచి, "నా పెళ్లాం మాట వినబోకండి. అది ప్రతిదీ తీసేసి మాట్లాడేస్తింది. గాందీ తాతను గూడ కమీనిస్టోళ్ళనట్టు 'వోడా?' అనేస్తింది. మనింటి ముందరికి చేపలొచ్చినాయి గదాని కేవిలంగా అడగబోకండి. అవే చేపలు తిరప్తిలో అయితే కేజీ నలపై రూపాయలు! ఇంక మీ యబ్బతోడు, వూరు గాబట్టి ఇరై అయిదు ఇయ్యేచ్చు!" అనేసి నేను కడగా వొచ్చి తిన్నె మింద కుచ్చునేసినా.

ఇంతసేపుటిగ్గానూ చేపలామె నోరు తెరిచి, "ఆయన్న కరట్టుగా మాట్లాడినాడు. తప్పు రూంత గూడ మాట్లాళ్లా. నేనూ కాలిక్కాలికి కొట్టుకుంటా రాయల్చెరువు పేట నుంచి తెచ్చినాను గదమా. అక్కణ్ణే నేను కేజీ ఇరై రెండు లెక్కన తెచ్చినా. నాకు కాలి తిప్పట కన్నా కూలి దక్కద్దా? ఆయన్న చెప్పినట్టు ఇరై అయిదు గాక పొయ్‌నా ఇరై మూడు పెట్టుకోని ఎత్తుకోండి. చేపలు బాగుండాయి. తిరప్తిలో మొన్నంతా కనాగష్టం ఎరగడ్డలు కేజీ పన్నెండు రూపాయలు అమ్మలేదంటమ్మా?" అని లా పాయింటు తీసింది.

చేపలామె మాటలినిన కడుపక్కకు వొళ్లు మండిపొయ్, "మ్మో నువ్వు గూడ బాగ దొబ్బే దానివిగా వుండావే! ఆ నా బట్టకు బేరం జేసేది తెల్సునా? వాడు మూడు మొకాల్ తెలవనోడు. గెరిగేన్లు మేమెప్పుడూ తీస్కోలేదా, తిన్లేదా?

కేజీ పదాగ్రూపాయ ల్లెక్కన పెట్టుకో. తలా కేజీ తీస్కుంటాం. మద్యానానికంతా నువ్వు ఇల్లు జేరిపోతావు." అనింది.

నేను నేరుగా ఇంట్లేకి పొయ్ ఇరై అయిదు రూపాయలు బొడ్లో దోపుకొని బైటకొచ్చి, బోకు నొకదాన్ని చేపలామె చేతికిచ్చి, "మ్మో కేజీ తూంచు. ఇరై అయిదు రూపాయలకే తూంచు. నాకు నీ కష్టం వొద్దు తల్లా! ఎవురెవురి కష్టమో తిని ఈ జల్మ ఎత్తినాం. మళ్లా నీ కష్టం తిని నీకు పుట్టి రుడం తీర్చుకోలేను." అన్నా.

నా పెళ్లాం నన్ను వడేసి పట్టుకోబొయ్ వీలుగాక నా చేతల్లో వుండే ఇరై అయిదును పెరుక్కుందామని జూసింది. చేపలామె కేజీ తూంచి బోకులో పోసింది. నేను డబ్బును గంపలో యేసేసి ఆ బోకునెత్తుకుని ఇంట్లేకి పొయ్నా. నా పెళ్లాం – ఇంక ఎక్కువ మాట్లాడితే వూళ్లోవోళ్లు నవ్వుకుంటారన్జెప్పి గమ్మనుండి పొయ్యింది. నా తమాస చూస్తా బొమ్మలాల నిలుచుకునిన ఆడోళ్లు కడాకు నోళ్లు తెరిచి, "వొరె, కోతి నా బట్టా!" అనేసి పూడ్సినారు.

ఇంట్లో నేనూ, ఇంటి ముందర నా పెళ్లాం మిగిల్నాం. ఇంక ఎంత యిద్దం జరగబోతాదో!

ఈ చేపల్ని ఎప్పుడెప్పుడు తోమి – తినేద్దామా అన్నట్టు నా పెళ్లాం గూడా తపన్లో వుండాది. నేనిదే చాన్సనుకోని, "ప్రబావొతీ! మూతి మూరడు పొడుగు పెట్టుకోవద్దమ్మా! నా బుజ్జి గదా! నువ్విప్పుడు నవ్వుతావు. నవ్వకుంటే నేను చచ్చినట్టు!" అని నెత్తిన చెయ్యి పెట్టుకున్నా. ప్రబావొతి నవ్వి నా నెత్తిన చెయ్యి తీసేసింది.

నేనూ నా పెళ్లాం పెళ్లో చేరి బూడిద ముందర పోస్కోని చేపలు తోమే దానికి పెట్టుకున్నాం. "నువ్వేన్నన్నా అను ప్రబల్ కన్నా! నాకు ముండమోపులంటే బలే యిష్టిం!" అన్నా.

"అవున్లే వాళ్లకైతే మొగుళ్లుండరు. ఇష్టమొచ్చినట్టు ఆడించొచ్చని నీ ప్లాను!" అనిందది నన్ను జడతో వొకటి కొట్టి.

"అంత వక్రంగా అంటే నేనేం జెప్పేది? ఇప్పుడా ముండమోపి ఆడమనిషి నిద్దర్లేచి రాయలచెరువు పేట నుంచి పది కేజీల చేపల్ను మారు బేరానికి

తెచ్చుంటాది. అక్కణ్ణే పద్దైదు రూపాయలు పడుంటాయి కేజీ. ఇంక వూళ్ల మింద పడి తిరిగితే కేజీ మింద రెం(డ్రూపాయలు ఇయ్యబోతారు మహా అయితే. అంటే ఆమె దినుమంతా కష్టపడితే ఇరై రూపాయలు. చెరువెండిపోతే ఆ ఆదాయికమూ వుండదు. నేను ఆంధ్రజోతిలో ప్యానుకింద కూచ్చోని నెలకు రెండున్నర వేలు తెస్తుండానే! ఆ డబ్బు మదంతోనే నీకిప్పుడు బాదలనేవి తెలవ్వ . ఒకేళ నేను మర్గయా అయినాననుకో. నువ్వు నీ బిడ్డల్ను సాక్కనే దానికి ఏం జేస్తావు – వూళ్లో నాలుగు లీటర్లు పాలు పట్టుకోని పెరుగు జేస్కోని పెరుగ్గంపెత్తుకోని తిరప్తికి పొయ్ ఈదీదీ తిరగతావు. ఎంత కష్టమో చెప్పు–" నన్నింకేం చెప్పనీకుండా నోరు మూసేసింది. ఈ సందులోనే–

ఎగవీది నుంచి ముగ్గురాడోళ్లు,

"నువ్వంత మాహరాజు నాబట్టవా?"

"నీ ఇంట్లో చెట్టుకు రూపాయలు కాస్తుండాయా?"

"గెరిగేన్లకు ఇరై అయిదు రూపాయలిచ్చినావా? మా మొగోళ్లు నీకన్నా ముతాలి ఎదవలే! ఇరై అయిదిచ్చి తీస్కోమని పోరతా వుండారే! ఆ చేపలది ఎంతసేపూ – దిగవీదిలో ఒకన్నకు ఇరై అయిదు లెక్కనిచ్చినా – అని పాట పాడతుండాది!" అంటా వొచ్చినారు.

"ఎగవీది అత్తలాలా! నేను గెరినేన్లను ఇరై అయిదుకే తీసుకున్నా. నా లెక్క పకారం వాటికి ముప్పై ఇయ్యొచ్చు." అని చెప్పి పంపించినా.

సడే. నా పెళ్లాం బమ్మాండంగా జేసింది చేపలకూర – దండిగా చింత పులుసు పోసి. సంగటేస్కోని తింటావుంటే– ఎవురో ఒకామె పొరక్కట్టలు ఎత్తకొచ్చి, "జత నాలుగు రూపాయలు. కావాల్నా?" అనడిగింది.

నా పెళ్లాం ఆమె నోటి మాట నోట్లో వుండంగానే కతక్కన, "మాకేం పన్లా. మొన్ననే తీస్కున్నాం. నువ్వు పద!" అనేసింది.

"సరే, అంత సంగటి తినేసి పోదువు రామ్మా! మీది ఏవూరో ఏమో–" అని పిలిచినా, నా పెళ్లాం నాకల్లా వురిమి చూస్తుండినా పట్టించుకోకుండా.

పసి పిలగాడికి మిఠాయిస్తే చెయ్యి జాపినట్టుగా, పాపం ఆమె నా మాటతో గూడా నెత్తి బరువు మా తిన్నె మింద దించి 'హమ్మ' అని నోటి గుండా గసొదిలి అంగలార్చింది.

"ఏ వూరమ్మా మీది?" అన్నా.


"పిగిలేరు." అనిందాయమ్మ. ఆయమ్మా ముండమోపిదే, ముప్పై అయిదేండ్లుంటాయి మఖా అవితే!

నా పెళ్లాం నన్ను నడవింట్లోకి పిలిచి, "ఏం నువ్వాడే ఆట? దినామూ ఒక మనిసికి సంగటెయ్యాలంటే జరిగే పనేనా? పొరక్కట్టలమ్మే ఆడది కనబడగూడదు, గాజలామె కనబడగూడదు, ముంతమాడి పొండ్లు తెచ్చే ముసిల్ది కనబడగూడదు – నువ్వీ రకంతో దినానికొకర్ని సంగటికి పిలస్తా వుంటే నీకూ నీ పిలకాయలు వుండారు నాయినా! గుర్తు బెట్టుకో!" అని నసకు తగులుకొని మూతి మూరడు పొడుగు బెట్టింది.

"సంగటి తింటావా అనడగంగానే బేదం బెట్టుకోకుండా మన పంచన కుచ్చొనింది. ముద్ద సంగటి, తిన్నన్ని చేపలూ బెట్టు. మనకు మంచిది! 'నన్ను ఇజీవాడకు తొడకపో, నేను కనకదుర్గ గుడి జూడాల' అని నన్ను చంపతా వుంటావు గదా! ఇందాక మనింటి ముందరికి చేపలు తెచ్చిందెవరను కున్నావు? దుర్గమ్మ తల్లే! మన పెండ్లి రోజు వొచ్చినప్పుడల్లా చిత్తానూరు గుడికి పొయ్ దండం బెట్టుకుంటాం గదా! ఏదీ, కండ్లు బాగా తెరిచి చూడు – ఇప్పుడు మనింటి ముందర కుచ్చోనుండే ఆ ఆడామె అలిమేలు మంగమ్మ కాదేమో చెప్పు?"

ఇంతే సంగతులు కింద నా చేవ్రాలు–

# మునికన్నడి సేద్యం



మా బూశమ్మకు ...
మా అమ్మ తోడబుట్టిన వాళ్లను కూడా
సినమ్మా, పెదమ్మా అనే పిలస్తాం.
మా అన్నా, మా అక్కా, నేనూ మా బూశమ్మను మాత్రం 'అమా మే'
అని ఎంతో సొంతంగా పిలస్తాం.

# మునికన్నడి సేద్యం

"అయ్యో నా బతకా!" అని నెత్తి మింద చేతులు బెట్టుకునేసినాడు ఇలామంతు నాయుడు.

"బతకాలని బాయి దొవ్వితే బండ బడిపాయెనే" అని దేముడి మింద నిష్టూర పోయి, "మన తల రాత ఎట్టుంటే అట్ట జరిగితింది. సందల గూకన నువ్వానెత్తి మింద చేతులు తియ్ సామీ" అని మొగుడితో ఒద్దిక మాటలు మాట్లాడింది యెంగటమ్మ.

ఆమె కాళ్ళను చాపేసి, ఆమెకల్లా ఎగ జూపెట్టుకొని వుండిన సిన్న కొడుకుని, సిన్న కూతుర్ని జవురుకొని ఒళ్ళో కూచ్చన బెట్టుకొని, "మిమ్మల్ను సాకి సంతరించ బొయ్యేది ఎట్టనే తంద్రులాలా? ప్రాయిమంతా అయి పొయ్‌నాక ఈ కూలి పొయ్‌న కడుపులో ఎందుకు పడితిరి రా నా అమాయిక చక్రొర్తులాలా!" అని దుఃఖపడింది.

యెంగటమ్మకు అయిదు మంది పిలకాయలు. ముగ్గురు మొగ పిలకాయిలు, ఇద్దురాడ పిలకాయిలు. వరసగా యిద్దురు మొగ పిలకాయిలు పుట్నారు. మళ్ళ ఒక ఆడబిడ్డి పుట్టింది. ఇంగ యింతే అనుకుంటే అయిదారేండ్లు తాలినాక ఒక ఆడబిడ్డి పుట్టింది. మళ్ళ రెండేండ్లకు కడగొట్టుగా ఒక కొడుకు పుట్నాడు, అదొక యెర్రి కాలం గాబట్టి వాళ్ళు పుట్నారు గాని ఈ మిగల నేర్చిన కాలంలో అయితేనా! అప్పటికీ యెంగటమ్మ, "మనం సాకలేం పున్యాత్ముడా! ఈ వుడ్డనంతా ఏ గంప కింద మూసి పెట్టేది దర్మాత్ముడా!" అని నెత్తిన నోరు బెట్టుకొని అరవనే అరిచింది. "ఎంత మంది పుడతారో అంత మందిని పుట్టనియ్యేమి! మనం చచ్చినాక–పదీ పదైదు మంది పిలకాయిలు–మన పైనా పక్కలా పడి కొట్టుకుంటా వుంటే–అదే గదే పదేలు" అనే వాడు ఇలామంతు నాయుడు. ఇప్పుడు ముగ్గురు పిలకాయిలు పెద్దోళ్ళయి పొయ్‌నారు. పెద్దోడికి ఇర్వై రెండు, రెండో వోడికి ఇర్వై, మూడో అమ్మికి పద్మూడు పద్నాలుగేండ్లు, గోష్ట అంతా సిన్న కొడుకుదీ సిన్న కూతురుదే, ఆరేడేండ్లుంటాయి. యెంగటమ్మ కడుపు మంటంతా ఈ యిద్దరి గురిచ్చే.

పెద్దోడు – మునికన్నమ నాయుడు – యాడ నుంచో యింట్లోకి రాంగానే యెంగటమ్మకు కండ్లలో నీళ్ళు పెరక్కొచ్చినాయి.

“కుక్క ఆశి గుండ్రాయితో పాయ గదరా మునికన్నా! ‘మనం ఈ వూర్నొదిలేసి ఆ వూరికి పోదాం అమా! ఈ వూళ్ళో మనకు బతుకులా, ఆ వూరికి బొయ్ మానోవరిగా బతకదాం అమా!’ అని ముది మాటలన్నీ చెప్తివి గదరా. బతుకు యారవ కోసరం ఈ వూరొచ్చినా ఈడా మనల్ను దరిద్దరం వొదిలి పెట్టేటట్టు లేదు గదరా యెర్రి నాకొడకా!” అని బొరోమని ఏడ్చేసింది యెంగటమ్మ.

అప్పుడు నాగరాణి నట్టింట దీపం బెట్టి, దండం పెట్టుకుంటా వుండింది.

ఇలామంతు నాయుడు గొంతులో నుంచి కరుగ్గా మాట రానిచ్చి, “అగ్గో, పెద్దమ్మి దీపం గదా పెడతా వుండేది. ఈయాళప్పుడు ఆడదానేడుపు యింటికి శీనాగతి, గమ్మనుండు తల్లా!” అన్నాడు.

యెంగటమ్మ బలంతాన ఏడుపునాపుకొని, ఒళ్ళో వుండే పిలకాయిల తలల్లో యేళ్ళు దూరస్తా తీస్తా వుండింది.

మునికన్నడు కూచ్చోనన్నా కూచ్చోకుండా నిలబడుకొనే, “నాయినా నాయినా అద్దాలామె ఏమనింది నాయినా? ఆమె రమ్మని చెప్పి అంపిస్తేనే గదా మనం ఆ రాజ్జెం నుంచి ఈ రాజ్జెం వచ్చింది. అద్దాలామె ఏమనింది నాయినా?” అనడిగినాడు.

ఈ మాటకు ఇలామంతు లోగొంతులో నుంచి మాటలు రానిచ్చి, “అది జరిగే పనిగా లేదురా పెద్దోడా! అద్దాలామె చుక్కల్ను చూస్తా వుండాది” అని అన్నాడు.

ఇలామంతునాయుడు వాళ్ళది ఈ వూరు గాదు. ఈ వూరు మిట్టూరు, ఇలామంతుకి అత్తగారూరు. వాళ్ళ సొంతూరు రంగంపేట. యాడ మిట్టూరు, యాడ రంగంపేట? తిరపతి దాటుకోని, మంగాపురం దాటుకోని పోవాల రంగంపేటకు. ఆ రంగంపేట అయితే యింకా గొట్టు కూలిపొయ్న చోటు. ఆడ చెరువుల కింద సేద్యం జరుపుకోవాలంట. అంతా యిసికి నేల.

చెరువులోకి నీళ్ళొస్తేనే పంట. అక్కడుండేదంతా యెలి చేనేనంట. మడి కింద చేను ఎవురికో మత్తేపులకే వుంటిందంట. అదంతా వొట్టి ముండమోపి నేలంట. అక్కడన్నా గోచి పాతంత కయ్య లేదు ఇలామంతుకి. పియ్యి దినో, పిడకలేరో ఈ సంసారాన్ని యింత మటుకు ఎలనీదుకొచ్చినాడు. ఇప్పుడు పిలకాయిలు పెద్దోళ్ళయి పొయ్‌నారు. గింజి కర్చు జాస్తయి పూడిసింది, కాపరం నిగ్గలా.

ఇలామంతు బామార్ది మిట్టూరే. ఒకనాడు గురప్పనాయుడు రంగంపేట కొచ్చి, "ఈ వూరు మీకు అచ్చిరాలా. ఎంత కష్టం జేసినా బూడిదిలో పోసిన వుచ్చ మాదిరిగా నిలవకుండా పోతుండాది. ఈడ జేసే కష్టం ఆడ జేసుకోవచ్చులే. వొచ్చేయండి, మా వూరికి. నన్ను జూపెట్టుకొని మీరు, మిమ్మల్ని జూపెట్టుకొని నేను బతికి పోదారి" అన్నాడు.

ఇలామంతు ఆ మాటకు ఒప్పుకోనేలా, "వుండూర్లో ఎప్పుడో పలచనై పొయ్‌నాం. అత్తగారూర్లోనన్నా మానంగా వుండనియ్యేమి? ఆడికొచ్చి, ఆడ కూలి పన్లు చేసి ఆడా ఎందుకు బైసాట్లయి పొయ్యేది? మంచి నీళ్ళు తాగినా మా వూళ్ళో వుండేదే మేలు" అనేసినాడు.

"ఏంది బావా! ఏందో మా వూరు మా వూరని పట్టుకొని వూగలాడతా వుండావు? ఏమూరిది? రెండేండ్లు వానల్లేకుంటే మీ వూళ్ళో తాగు నీళ్ళేడివి చెప్పా? శెనిగి తోటలు, చెరుకు దోటలు తప్పించి వరిమళ్లు యాడివి ఈ వూళ్లో? నిండా గొట్టు కూలిపోయిన చోటు గదా మీ వూరు! మా వూరుకొచ్చి రెండేండ్లు వుండా, నీ గాది నిండక పోతే అప్పుడు నన్నడుగా!" అన్నాడు గురప్ప నాయుడు పెగ్గిగా. ఇలామంతు నవ్వు మొకంతో, "మీ తూరుపు రాజ్జెమోళ్ళకు మా పరంట రాజ్జెమంటే కంట్లో గూడ పడదులే. మా రంగం పేటోళ్ళకు మీ రాయల చెరువు రోడ్డు పల్లెలంటే దూదికన్నా సులకననుకో. మీరు మా వూరినంటారా? బ్రమ్మం గారు చెప్పినట్టు జరగాల్నే గాని ఏడూళ్లకొకూరు మిగిల్నా అది మా వూరే గదా!" అన్నాడు.

మొగుడి బడాయి మాటలకు యెంగటమ్మ అడ్డాం వచ్చి, "నిలుపు నిలుపు, మీ వూరు బలే మొగలాయి వూరుగాని! ముప్పై యేండ్ల నుంచి ఈ కూలిపొయ్‌న వూర్లో వన వాసరం చేస్తా వుండానే! నా ముందర్నా నువ్వు మాట్లాడేది?" అని అన్నకు సపోరట మాట్లాడింది.

అప్పుడనంగా గురప్ప నాయుడు మనుసులో వుండే మాటను చెప్పేసి నాడు. "నాకు జూడ మీకు బట్టిన శని ఈ దినంతో ఈడేరి పొయ్‌నట్టే వుండాది. అనుకున్న పని జరగాల్నే గాని మీ యెంటికల్లో చేతులు బెట్టే వాడే లేడు బావా!" అని కొంచేపు నిదానించి, మొకం నిండికీ కళదెచ్చుకొని, "మా వూళ్లో అద్దాలామె అని వుండలేదా! మీ కాడికి ఆమె అంపించింది నన్ను. ఆమె కయ్యను గుత్తకిస్తిందంట. ముండమోపి మనిసి గదా. ఈ కాలంలో మాలా మాదిగోళ్ళకు కూలులిచ్చి, వాళ్లతో సేద్యం జరుపుకో లేక యాష్ట వచ్చేసిందా మనిసికి. అందుకని వుండే కయ్యను గుత్తకిచ్చేసి, గుత్త కింద ఒచ్చింది తింటా, కొడుకుని చదివించుకుంటా తిరప్తిలో కాపరం వుండిపోతిందంట. మీరు గుత్తకు చేస్తారో చెయ్యరో అని ఒక మాట అడిగి కనుక్కొని రమ్మని అడిగింది" అన్నాడు.

బామార్ది దగ్గిర్నుంచి ఈ మాటలినిన ఇలామంతు పదర లేదు. నోటి మాటెత్తకుండా మూగెద్దు మాదిరిగా గమ్మనుండినాడు. మేనమామ మాటల్ను వినిన మునికన్నడు మాత్రం నోటినిండా గస బెట్టుకొని, "చేతి నిండికి సేద్యం వుండాల్నేగాని మామా! మొగలాయి బతుకు బతకమా! అద్దాలామెకి ఎంత కయ్య ఉండాది? నీటి సౌక్రిం ఎంత మటుకు? నేల మంచి నేలేనా?" అని గబగబా అడిగేసినాడు.

అల్లుడి తెంపుకు మునాశ పడిన గురప్ప, "నువ్వు చెయ్యాల్నేగాని చేతి నిండికీ కయ్యేరా మునికన్నా! ఎవురిదైతేనేమి, ఆ కయ్య మీ వూరి కయ్యల మాదిరిగా తొండలు గుడ్లు బెట్టే నేల గాదు. ఆ కయ్యలో బంగారు పండించు కోవచ్చు. జాగ నేల, కష్టిం చేసే కొందికీ ఫలితమే గదరా యెర్రి నాయాలా! ఇంక నీళ్ళంటావా, ఆ బాయిని ముందు జెప్పి, మళ్ళ జెప్పాల ఏ బాయినన్నా! కీనీరు బాయంటే అదే. సమ్మచ్చరం వానల్లేక పొయ్‌నా ఒక్క అడుగు తియ్యదు. రెండు అయిదార్సు పవరు మోటార్లుండాయి ఆ బాయికి. ముందు ముందు కాలాలు ఎట్టుంటాయో గాని, ఈనాటికి ఆ బాయికింద నీళ్లు లేక పైరెండింది లా. ఎల్లాకొల్లిగా నీళ్లుండే బాయి. చేస్తే ఆ బాయి కింద చెయ్యాల సేద్యం. అద్దాలామెకు కరంటు మోటారు గూడా ఉండాది. నేను చెప్పేదేముండాది. మీరే అంతా చూసుకుందురు రండి" అన్నాడు.

బామార్ది యిన్ని మాటలు చెప్పినా నోటి మాటెత్తకుండానే వుండాడు ఇలామంతు నాయుడు. మునికన్నడి కులుకుకు మాత్రం పట్ట పగ్గాల్లేకుండా పొయ్‌నాయి.

మునికన్నడు చిన్న చెల్లిల్ని ఎత్తి బుజానేసుకోని, "అమా, నేను చెప్పలా, ఇంగ మన దశ తిరిగిపోతుందని! అమా, దేముడు వుండాడమా, దేము డుండాడు" అని చెల్లిని గిరగిరా అప్పాలు తిప్పినాడు. ఆ పిల్ల ఒకే నవ్వాటంతో వుండిపోయింది.

యెంగటమ్మ గురప్పన్నతో, "అనా, నిన్నగాక మొన్న-మొన్న రాత్రినే గదరా మునికన్నా, ఆ, మొన్ననే! మొన్న రాత్రి ఎంత పని జరిగి పొయ్యిందను కున్నావు?! మునికన్నడు ఈదిలో మంచమేసుకొని పొనుకోని వుండాడు. అనా, ఆ నాగుబాము యాడనుంచి వచ్చిందోగాని వచ్చింది, మంచం మిందికెక్కి కోడి ఆదారనతో, మునికన్నడికి పడగ బట్టిందన్నా. తిన్నె మింద కూచ్చోని మునికన్నడితో ఆమాటా ఈమాటా మాట్లాడతా వుండిన ఒక సావాసకోపు ఆ పామును జూసేసి బిత్తరతో, 'మునికన్నా! పాము!' అని అరస్తానే వుండాడు. రాత్రి పూట గదా-వీడు దాన్ని జూసుకోకుండా వాడేమో వాడి మాటలేమో! అంతే, మునికన్నడు పామును జూసి రెండు చేతల్తో దండాలు పెడతా పెడతానే మంచం దిసేసినాడు. ఆ నాగేంద్రుడు వచ్చిన దోవనే కోడు దిగి చెట్లల్లోకి పూడ్సినాడు. అప్పట్నించి మునికన్నడికి అదేపాట- 'అమా, ఇంగ మన దశ తిరిగి పోతింది' అని చెప్పటమే పనిగా బెట్టుకున్నాడు" అనింది.

ఈ మాటలినిన గురప్ప గూడా మునికన్నడి కల్లా యిచ్చిత్ర పోయి చూస్తా "మహన్నబావులకు గదా నాగేంద్రుడు పడగ బడతాడు. నువ్వు చెప్తా వుంటే నాకు కత యిన్నట్టుండాది" అన్నాడు.

ఇంత సేపు అయినాక ఇలామంతు నోరు తెరిచి, "కయ్యను వారానికి దున్నడమంటే మాటల్తో పనా! ఒట్టి వొళ్ళుతో రెండు చేతులూగిస్తా బొయ్ కూలిపని చేసేసి రావచ్చు. సేద్యం అట్ట గాదే. సేద్యానికి ఎన్ని వసద్దులుండాల! ముప్పై మూడూ అరైయ్యారు కొరముట్లు గావద్దా! ఈ యింట్లో ఒక్క గొనం పార, చిన్న లిక్కి అన్నా వుండాదా? ఎవురో గుత్తకు కయ్య ఇస్తాం

దున్నుకుందురు రండి అంటే, ఇక్కడ మనం కాళ్ళకు గెజ్జిలు గట్టుకోని కేళీయిలాసంతో ఎగిర్తే సరిపాయనా!" అని కొడుకుతో అన్నట్టుగా గురప్పతో అన్నాడు.

అందుకు మునికన్నడు "నాయినా! ముందు కూచ్చోని గదా పొనుకోవాల. ముందు ఎట్టనో ఒకట్ట మనం చేతి కింద అంత కయ్యాగాలవ పెట్టుకుందారి. ఒకేసారి సేద్యాన్ని టాకట్రలతో జరిపించగలుగుదుమా? ఆ బాయిలో బండ బడనంత కాలం, మన బక్కెద్దులు కింద బడనంత కాలం మన సేద్యానికి అడ్డం ఏమి చెప్పు?" అని అంటా వుంటే గురప్ప అడ్డం వచ్చి, "ఇలామంతు బావా, యెనక తొక్కులు తొక్కద్దు. పిలగాడు జూడు ఎంత తెగవతో మాట్లాడతా వుండాడో! నువ్వీ మాదిరిగా సళ్ళిడిసేస్తే ఎట్ట చెప్పు, దైర్నం చెప్పాల్సినోడివి. నేనేమన్నా చచ్చినానా! బామార్దిగా ఆ వూళ్ళోనే వుండాను గదా. ఆ మాత్రం నీ బతుకు కోరనా? ఇంకొక మాట మాట్లాడద్దు, మంచి రోజుగా చూసుకొని ఈవూరు ఎలబారి వచ్చెయ్యండి" అన్నాడు.

ఇలామంతు, "నువ్వు గడ్డి యాపారం మింద బండి తోలుకొని తిరప్తికి పో. మేమా వూర్లో కన్నగచాట్లు పడతా వుంటాం" అని నవ్వు మొకంతోనే నిష్టూర పోయి, "పిలకాయలు పెద్దోళ్ళయి పొయ్‌నాక నా మాట చెల్లితిందా?" అనేసి పైగుడ్డ బుజానేసుకొని ఈదిలోకి పూడ్సినాడు.

యెంగటమ్మ రెండో కొడుకు ధర్మడు గూడా మిట్టూరు మిందనే కలవరం బెట్టుకున్నాడు.

ఆరోజు నుంచి మునికన్నడు, ధర్మడు ఒకరు మార్చి ఒకరు, "మిట్టూరుకు పోయి దీనికి మించిన బతుకు బతకదాం" అని తల్లీదండ్రిని ఉపద్ర పెట్టినారు.

ఆ మాదిరితో ఇలామంతు నాయుడి కుటుంబరం మిట్టూరికొచ్చేసింది. మిట్టూరులో ఒక కుటుంబరానికి కయ్యాగాలవ వూరికి దూరంగా వుండడంతో, ఆ కుటుంబరం కయ్య దగ్గిర్నే యిల్లు గట్టుకొని అక్కడ్నే కాపరంగా సేద్యంగా వుండి పొయ్‌నారు.

వాళ్ళు ఇలామంతుతో, "కట్టుగుడ్డల్తో మా వూర్లోకి వస్తివి. నువ్వు మా ఇంట్లోనే వుండి నీ బతుకు నువ్వు బతుక్కో, నీ బోటోడికి ఇల్లిస్తే మేము

చెడిపోము. ఆ ఇంట్లో దూదరగూళ్ళను తోసుకోని, కరంటు శార్జీ వరకు కట్టుకోని వుండు బొండి" అని చెప్పినారు. వూరి కడాన, ఒకర్తో సమందం లేకుండా వుండే ఆ యిల్లు బలే బొటువుగా వుండింది. రెండు అడ్డాపిండ్లు, ఒక చుట్టు గుడిసి, వచ్చిన దినమే అమ్మా గూతురు – యెంగటమ్మ, నాగరాణి – ఇండ్లలికి ముగ్గులు పోసేసినారు. ఆ ఇంట్లో కాపరం చేరే సరికి, యాడలేని నాణ్ణెం అంతా వచ్చేసింది.

రంగంపేటోళ్ళు మిట్టూరులోకి వచ్చినాక అన్ని ఏరుపాట్లూ దేముడు దర్మాన బాగనే జరిగినాయిగాని, అద్దాలామె మాత్రం బిగింపుకు పోయి ఎగ నీలిగేసింది.

గురప్ప నాయుడు ఇలామంతుని తొడుకోని అద్దాలామె దగ్గిరికి పొయ్ మాట్లాడబోతే ఆమె నిమిసానికి ఒక మాట మాట్లాడింది. ఒక దపా, "గురప్పా! సొంత కయ్యను ఎరవలోళ్ళ చేతుల్లో బెట్టి గుత్తకిస్తే మళ్ళ అది రక్తికొస్తిందా? మన కయ్యను మనమే చేతల్లో బెట్టుకొని బతకాల గాని –" అనింది. గురప్ప, "అదేంది వొదినా! యిప్పుడు ఈ వాటంతో మాట్లాడతుండావు? నువ్వే గదా నన్ను ఉపద్ర బెట్టి రంగంపేట అంపించింది" అనడిగితే, "ఇప్పుడు గూడ నేనేమి పొరబాటుగా మాట్లాడ లేదే! నా కయ్యను వాళ్ళనే చేసుకోమను. నేనేమన్నా కాదన్నానా?" అని తిరుక్కొనింది.

"నువ్వు గుత్తకు చేసుకోమని చెప్పందే వాళ్ళు నీ కయ్యలో మడక ఎట్ట కడతారు వొదినా?" అంటే, "వాళ్ళ కష్టం నాకేమిటికి? నా కష్టమే ఎవుడెవుడో తినేసి పోతా వుంటే! వాళ్ళ రెక్కల కష్టానికి ఎఱ్ర నయాపైసాతో సహా కూలిస్తాన్లే" అనింది.

దీంతో గురప్ప నాయుడికి కోపంతో ఉచ్చి మింద యెంటిక చివక్కన పైకి లేచి, నిష్టూరంగా, "ఆ రంగంపేట ఇలాకాలో చేసేదానికి కూలిపన్లు లేకనా వాళ్ళింత దూరం వొచ్చింది? వారానికి కయ్య ఇస్తే దున్నుకొని బిడ్లను పెద్దోళ్ళను చేసుకుందామని గదా మా ఇలామంతు బావ ఆ రాజ్జెం నుంచి వచ్చింది" అనన్నాడు.

అద్దాలామె కడ మాటగా, "గురప్పా, నీ పెద్దల్లుడ్ని – మునికన్నడ్ని చూస్తా వుంటే కడుపు నిండిపోతా వుండాది. వాడ్ని నా యింటి కాడ సేద్యానికి

కుదిరించు, పలితానికి మున్నూర్రూపాయలెక్కన జీతమిస్తా, తిండీ తీర్తం, గుడ్డాగుసురు అంతా నేనే ఎగేస్తా. వాడు నన్ను నమ్మి నాకాడ నాలుగేండ్లుంటే నేనే యాడన్నా ఒక బిడ్డిని జూసి పెండ్లి గూడ జరిపిస్తా, సరేనా?" అనింది కంటద్దాలు ఎగదోసుకుంటా.

అద్దాలామె సంగతి పాలుదాగే పసి బిడ్డకు కూడా తెలిసిందే. సెగ తగలకుండా ఇన్నాళ్ళూ కాలిమింద కాలేసుకొని బతికిపోయ్న మనిసి. మొగుడు జచ్చిపోయ్ ముప్పైయ్యేండ్లు కావస్తా వుండినా–ఆ పాయకట్టులో కంతా తలకాయి నెప్పి అనే సాకుతో కండ్లకు అద్దాలు తగిలించుకొని – ఏ పొద్దూ ముల్లు గుచ్చుకున్నంత బాద పడిన మనిసి గాదు. తిరప్తిలో ఒక ఇల్లును గూడా సంపాదిచ్చు కొనింది. అంత శాల్తయిన మనిసి. మనిసిని నిట్ట నిలువునా పెరక్క తినేసే రకం. ఏ సేద్యగాడు గూడా ఆమె దాపున మూణ్ణెల్లంటే మూణ్ణెల్లు పని జెయ్యలేక పొయ్నాడు. ఆ మనిసి దాపున పచ్చంగా ఒక కాపరం బతికి పోతా వుంటే రొండు కండ్లతో చూసే మనిసేనా?

'పోపో వొదినా పో' అని ఇలామంతును తొడుకోని నిప్పుల మింద నడస్తా వచ్చేసినాడు గురప్ప నాయుడు.

ఇలామంత నిష్టూరంతో "మట్టి గుర్రాన్ని నమ్మి యేట్లో దిగమంటివే" అన్నాడు.

ఇందుకు గురప్ప, "నువ్వేం మనేద బెట్టుకోవద్దు. దాని బుద్దే అంత. దాని కయ్యను దున్నే నాకొడుకెవ్వడూ లేడీ పాయకట్టులో! దాంతో ఎవుడూ యేగలేరు. అది కూడా యిప్పుడు బిత్తరక పొయ్ వుండాది. కూలోళ్ళు నాలోళ్ళు గూడా యిప్పుడెవురూ దానికి పలకతా లేరు. దాని జుట్టే మన చేతుల్లో వుండాదనుకో. అది ఎట్టా, తిరప్తిలో బొయ్ కాపరం పెట్టాల్సిందే. అది ఈ వూళ్ళేనే వుండేటట్టుగా వుంటే నేను రంగంపేటే వచ్చుండనే! మనం అడుక్కునే కొందికి అది ఎందుకు ముడుక్కుంటా వుండాదంటే గుత్త ఒకటికి రెండింతలు దొబ్బదామని. అది నాతో అప్పుడొకటి మాట్లాడి యిప్పుడొకటి మాట్లాడతా వుండాది. రెండు బాగాల పంట అదెత్తుకొని, ఒక బాగం మనకిద్దామని దాని సూపు. నువ్వు గమ్మనుండు. అదే మన కాళ్ళ కాడికి వస్తింది గాని!" అని దైర్నం జెప్పినాడు.

అయినా ఇలామంతు యింటికొచ్చి అదురు గుండికాయతో, "అయ్యో నా బతకా!" అని నెత్తి మింద చేతులు బెట్టుకొనేసినాడు.

గురప్ప నాయుడు చెప్పిన మాటే రైస్టయి పోయింది. అద్దాలామె మళ్ళా రంగంబెట్టి, "ఇంకా మాటలెందుకు గాని గుత్తకే చేసుకో పొండి. కయ్య నాది, నీళ్ళు నావి, కరంటు శార్జీ గూడా నాదే. సత్తవలు మీరు బెట్టుకోని పైరెక్కించండి. రెండు బాగాలు నాకు ఒక బాగం మీకు" అని ఒక మాట అని చూసింది.

ఇలామంతు మాట్లాడకుండా గమ్మనుంటే, "ఏమొదినా, ఈ వూరింకా గొడ్డుబోలేదు గదా. ఇంకా నలుగురు పెద్ద మనుసుల్ను చేర్చి మాట్లాడదారి. వాళ్ళు ఏ దోవన పొమ్మంటే ఆ దోవన పోదాం. సరా?" అన్నాడు గురప్ప నాయుడు.

అద్దాలామె పొడుగ్గా మాటలను రానిచ్చి, "ఈ మద్దిస్తానికి ఏడూర్ల పెద్ద మనుసులు రావాల్నే? నా కయ్య ఏమన్నా పనికి మాలిందా? నా బాయేమన్నా ముండమోపిదా? ఒకే దిక్కడ సోలుపుగా యాపై గుంటల కయ్య వుండాదే! వూరికి వుత్తరంగా పది గుంటలు, దచ్చినంగా నాలుగ్గుంటలు, తూరూగా రూంత, పరంటగా రూంత వుండాదా? యాపై గుంటలు, ఒకటా రెండా మూడున్నర ఎకరాల నేల పట్టెడ పట్టెడగా వుండాదే! దాన్ని దున్నుకొనే దానికి మీకేమి గాశి?" అనింది.

గురప్ప నాయుడు లైకీకంగా, "నువ్వు జెప్పేదంతా నిజమే వొదినా, అయితే గుడ్డు బెట్టే కోడికి గదొదినా గుద్ద నెప్పి తెలిసేది. ఈ కాలం యెవసాయంలో ఏమి వస్తా వుండాది? ఎంత జేసినా రాతి మింద సేద్యంగానే వుండాది. నువ్వు గూడ ముందూ యెనకా అన్నీ చూసుకోని చెప్పు. అన్నీ తెలిసిందానివే గదా!" అన్నాడు. గురప్ప యింకా యింకా అద్దాలామెని వుబ్బేస్తా, "పలానా వాళ్ళు పలానా తల్లి కయ్య జేసి బాగు పడినారంటే అది నీకే గదా గవరం. ఆ మకాతల్లి కయ్యను పైరుజేసి రంగంపేటోళ్ళు నిండా మునిగి పొయ్‌నారంటే నీకు మాత్రం ఏం మతింపు?" అన్నాడు.

ఇటుమంటి మాటలకంతా మనం లోపడ కూడదనుకున్న అద్దాలది, "నువ్వు చెప్పేదేంది గురప్పా? మీకేమిటికి అంత పులుపు? కయ్యా నాదే,

నీళ్ళూ నావే గదా! మీరేమన్నా గంటల మింద మిసినీ నీళ్ళు కొని పైర్ల మింద యెయ్యబోతారా? నా నీళ్ళు, నా మిసినీ గదా! కరంటు శార్జీ కూడా నేనే కట్టుకుంటానని చెప్తానే వుండానే! ఇంకా ఏమి మీకు పులుపు?" అని మాట్లాడింది. అద్దాలామె ఇలామంతును గూడా కలుపుకోని, "ఇలామంతన్నా! నువ్వు జెప్పు ఇలామంతన్నా! కష్టిం చేసేటోడివి నువ్వు, నీ దగ్గర చెయ్యించు కునే దాన్ని నేను. నువ్వు గూడ మాట్లాడు" అనింది.

ఇలామంతు, "మీరిద్దరుదా పడతా లేస్తా వుండారే. మీరే పడండి లెయ్యండి. నాకొక దోవ జూపిచ్చండి. బిడ్లగల్లోణ్ణి అక్కో, అది మాత్రం గెమనం బెట్టుకో" అనే అన్నాడు.

గురప్ప నాయుడు దీన్ని యింతటితో వొగదెంచేద్దామని, "అద్దాలొదినా! అన్నిటికన్నా దర గలిగింది రెక్కల కష్టిం గదా. చేసుకో లేక, మాలా మాదిగోళ్ళకు కూలులిచ్చి చెయ్యించుకో లేకనే గదా నువ్వు కయ్యను గుత్తకిస్తా వుండేది. ఎంత చేస్తే కయ్య పండేది? ఈ కాలం ఈరీ, లైట్రేటు దరలు ఏ వాటంతో వుండాయి? మనం కయ్యలో ఎంత పెడితే అంతే గదా చేతికి వస్తా వుండేది. నీ పంచన చేరతా వుండే మనిసి గూడా ఎవుడో తక్కవ జాతోడు గాదు. నీ సరి కమ్మోడే" అని మాట్లాడినాడు.

ఈ రకం మాటల్లోనే జాము సేపు పడినారు, లేచినారు. కిందా మిందా అయినారు. కడాకు ఒక వొప్పందానికి వచ్చినారు. ఒక్కొక్క పలితానికి – ఇలామంతు ఆ మూడున్నర ఎకరాను పైరు జేసుకొని అద్దాలామెకు ఇరై అయిదు మూటల వడ్లగింజలు యిచ్చెయ్యాల. కయ్య మాత్రమే అద్దాలామెది. ఆమెది యింగేమీలా. కరంటు శార్జీ గూడా రంగంపేటోళ్ళదే. అసలు అద్దాలామె యింట్లో కాలు బైట పెట్టే పనేలా. అదీ ఏరుపాటు.

"మంచి చాన్సు గద బావా! పీతి మింద రూకను నాలికతో అద్దుకునే రకం అనుకో అద్దాలామెది. ఇంత దారాళంగా వుండిందంటే వోయమ్మో ఎంతో మేలు" అన్నాడు గురప్ప నాయుడు.

"ఆ మాట చిన్నంగా అంటావా?" అన్నాడు మునికన్నడు, ఆయన తమ్ముడు ధర్మానాయుడు.

“ఏం మేలు? ఈ మేలంతా అద్దాలామెదే గదా! ఊరికే కాళ్ళు జాపేసి యింట్లో వుండిన మనిసికి, పలితానికి ఇరై అయిదు మూటల లెక్కన సమ్మచ్చరానికి యాపై మూటలంటే చిన్న మేలా? రెక్కల కష్టం ఏమయింది, సత్తవలు ఏమయింది, కరెంటు శార్జీ ఏమయింది? దిగితే గదా లోతు తెలవబొయ్యేది?” అన్నారు ఇలామంతూ, ఆయన పెండ్లాం యెంగటమ్మా.

## 2

అమ్మలు బిడ్లు అందురూ ఇత్తనాల వడ్లను – నీళ్ళలో నానబోస్తా వుండారు. అన్ని వడ్లగింజల్ను నారు కోసరం అని చెప్పి నీళ్ళల్లో నాన బోస్తా వుంటే యెంగటమ్మకు ఒక పక్క కేళీ యిలాసం, యింగొక పక్క దుఃఖం కలిగినాయి.

ఆమె అదొక రకం గొంతుతో, “మడక దున్నే ఒక మొగోడి చేత బొట్టు కట్టించుకొని ఇరై అయిదు సమ్మచ్చరాలు కావస్తా వుండాది. ఏ పొద్దన్నా యిన్ని వడ్లను ఇత్తనాలకని నీళ్ళల్లో నానబోసుందునా? బగమంతుడా, యిప్పుడన్నా నాకీ బోగం కలిగించినందుకు దండాలు తండిరీ!” అని ఉత్తరంగా తిరిగి తిరమల కొండలకు దండం బెట్టుకొనింది.

ఆ మరసనాడు మూడు గుంటల కయ్యలో మునికన్నడు మడక గట్టినాడు. ధర్మానాయుడు అయిదార్సు పవరు మోటారు సిచ్చి నొక్కినాడు. జొడజొడా దూకినాయి నీళ్ళు. ఇలామంతు మడవను కయ్య మింద యేసినాడు. అది బాయి, యిది కయ్య, మడవ మార్చకుండా, మిసినేస్తే నీళ్ళు కయ్యలో వుండాయి. ఇంత సౌక్రిం ఎవురికి వస్తింది. ఆ అబ్బుల బిడ్లల్లో ఆనందం ఆడతా వుండాది.

మునికాలి కట్టితో ఎద్దుల్ని అదిలించినాడు మునికన్నడు. అవి బక్కెద్దులు. ఆరు దుక్కిలో ఏడు దుక్కిలో వుంటాయి. రంగంపేటలో వుండంగా ఆ ఎద్దుల్ను తోలుకొని, ఎవురు పిలిస్తే వాళ్ళకు బాడిగ మడకలకు పొయ్యేవాడు ఇలామంతు నాయుడు. ఇంగ బాడిగ మడకలకు పొయ్యే బాదలా. దున్నే కొందికి కయ్య. ఈ యాపై గుంటల కయ్యని ఈ జోడు బక్కెద్దులే దున్నలేవు. అవీ చేసినంత కాలం చేసినాయిగాని, యింగా జేస్తాయా?

ఆ ఎద్దులు దున్నపోతులు మాదిరిగా మునక్కడగా నడిసినాయి. చద్దేళకు మూడు, నాలుగు చాళ్ళు దున్నేసినాడు మునికన్నడు. అన్న దున్నతా వుంటే తమ్ముడు కయ్య చుట్టూరా అండామూల తీసేసినాడు. ఎద్దులు దున్నిందాంతో సమానంగా కయ్యను పారతోనే కుళ్ళగించేసినాడు ధర్మడు. ఆయన అంత శ్రద్ధతో పని చేస్తా వుంటే, "ఇది ఒకరోజూ రెండు రోజుల పనిగాదురా ధర్మా! ఎల్లకాలం యింత కుశాలతోనే చెయ్యాల" అని నవ్వినాడు మునికన్నడు.

"నాకు తెలుసుగానీరా అనా! నీ పని నువ్వు జెయ్, నా పని నేను జేసుకుంటా. నీకే గాదు నాకు కూడా అక్కరే లేరా" అన్నాడు ధర్మడు నవ్వు మొకంతో.

"అట్టయితే దిగులేముండాది?" అన్నాడు మునికన్నడు.

అన్నాదమ్ముళ్ళు ఈ మాదిర్తో మారట్లు పడుకుంటా వుంటే ఇలామంతు నోట్లో కానగ పుల్ల బెట్టుకొని కయ్య నాలుగు మూలలూ తిరగతా వుండినాడు.

అబ్బులు బిడ్లకు యెంగటమ్మ చద్ది బోసుకొని వచ్చింది. చద్ది మొకం చూడంగానే పనై పోబట్టి మునికన్నడు మడకా కాడిమాను యిప్పేసినాడు. మిసినీ నీళ్లతో ఎద్దల్ను కడిగేసి, బొటూగా కాళ్ళూ జేతులు కడుక్కొని చద్దికి కూచ్చున్నాడు. ధర్మడు మాత్రం ఇంకా గనిమ ఎక్కి చద్దికి రాకుండా పార పనిలోనే వుండాడు.

యెంగటమ్మ నవ్వు మొకంతో, "మన దొంగోడు చద్దికి రాకుండా యింకా పనిలోనే వుండాడు. ఏమబ్బా తిండీ నీళ్ళు కూడా అక్కరలేదా ఏమి?" అనింది.

మునికన్నడు పకపకా నవ్వి, "కొత్త బిచ్చిగోడు పొద్దెరగడు గదమా. కొత్త మునాశ గదా. ఈ రోజూ రేపు యిద్దర మనసల పని చేస్తాడా, మళ్ల కాళ్లు జాపేస్తాడు" అన్నాడు.

ఈ మాటల్ను చెవుల్లో యేసుకొన్న ధర్మడు, "అనారే, ఏందిరా పొడుగు పొడుగ్గా మాట్లాడతా వుండావు? ఏమి కత? ఈపు చిట్లాల్నా?" అని పెడేసుకొని వచ్చి కాళ్లూజేతులు కడుక్కున్నాడు.

వాళ్ళిద్దరికి సమ్మచ్చరం రెండేండ్లే వారా గాబట్టి ధర్మడు మునికన్నడ్ని 'అనా!' అని పిలవకుండా 'అనా రే' అనే పిలస్తాడు. అవితే, మునికన్నడంటే

మాత్రం పక్కలో బయమే. అదొక రకం ముదిగారంలే. ఇలామంతు నాయుడు వచ్చి, పుల్లను కడగా పారేసి కాళ్లుజేతులు కడుక్కొని చద్దికి కూచ్చున్నాడు.

యెంగటమ్మ చద్దిని దోసిళ్లలో పోస్తా వుంటే అబ్బలు బిడ్లు తాగతా వుండారు.

నారు చల్లాల్సిన అడుసు కయ్య అద్దం మాదిరిగా వుండాది, మొలకలెత్తిన ఇత్తనాల వడ్లను యింగ రెండు నాళ్లల్లో చల్లేదే పని.

"ఈ వొట్టి నీళ్లల్లో నారును ఏమని చల్లుదుం? దిబ్బ ఎరువునన్నా నాలుగు తట్టలు పోసినామా?" అన్నాడు మునికన్నడు వాళ్ల నాయనతో.

"దిబ్బ ఎరువు యాడనుంచి తెద్దుమురా. మనకేమన్నా గొడ్లుండాయా, పేడ వుండేదానికి? ఈ వూళ్ళోకొచ్చి వారంగాలా యింకా, యింతలేకే మనకు దిబ్బ యాడ నుంచి వస్తింది? ఈ నీళ్లల్లోనే చల్లదాం. కయ్యలో మట్టే నారుకు సత్తువ. దేముడుండ లేదా, చాల్లే!" అన్నాడు ఇలామంతు.

ధర్మడు నవ్వు మింద నవ్వు నవ్వతా, "అద్దాలామె కయ్య సంపాయించింది, బాయి సంపాయించింది, మిసినీ సంపాయించింది గాని కయ్య చుట్టూరా నాలుగు చెట్లు సంపాయించ లేదే. ఆమికి గాని రెండు చెట్లుండుంటే, ఆ చెట్లల్లో ఆకును కొట్టి అడుసులో పోసుంటే కుళ్ళిపోయి నారుకు దొబ్బుమాలిన సత్తువ అయివుండును" అన్నాడు.

అది లోకం మింద రైతులందురూ చేసే పనే అయినా ధర్మడికి సేద్యం మింద ఆ మాత్రం కలవరం వుండినందుకు మునికన్నడు ముదిగారంతో యిచ్చిత్ర పోయి ధర్మడి కల్లా చూస్తా, "ధర్మా, నువ్వీ మిట్టూరులో వుండాల్సినోడివి గాదురా, నీళ్లకవతల వుండాది జూడు యింగలాండు, ఆడ పుట్టాల్సినోడివిరా. తప్పాయ్ మాలో పడిపొయ్‌నావు" అన్నాడు.

అంతే, మళ్ల ఒక్క నిమిసం గూడా ఆడ నిలబడలేదు. మునికన్నడు నేరుగా యింటికొచ్చినాడు.

"అమా, నాలుగు కొడవండ్లు సంపాయించాల గదమా, మ్మరే, నాలుగు మోపుల ఆకు నారుమడిలోకి గావాల. తిరిగితే యాడన్నా జిల్లేడు చెట్లూ

అవీ దొరక్క పోతాయా? నువ్వు ముందు కొడవండ్లు జూడు" అని అమ్మను ఉపద్ర బెట్టినాడు.

"బైసాట్ల బతుకాయ గదరా పెదబ్బా. ఇప్పుడు జూడు, ఎవురింటికో ఒకరింటికి పొయ్ చెయ్యి చాపద్దా! 'ఈ నా సవితి ఒకరికి అయిదు మంది బిడ్లను కనింది. ముప్పైయ్యేండ్లు మొగుడి కింద కాపరం జేసింది. నాలుగు కొడవండ్లను చేతిలో పెట్టుకొని బతికిందేమో చూడు' అని నా మొకాన ఏరగరా?" అని వగస్తా ఆమె కొడవండ్ల కోసరం గడప దిగి వూళ్లోకి ఎలబారింది.

అన్ని మాటల్నా ఆమె అక్కసు కొొందికీ మాట్లాడిందేగాని – ఆమెకి ఆ వూళ్ళో అమ్మగారిల్లు లేదా ఏమి?

నేరుగా గురప్పన్న వాళ్ల యింటికి బొయ్, "వదినా, నాలుగు కొడమండ్లు ఇయ్యి, పనిబడింది" అనడిగింది.

యెంగటమ్మ నోట్లో మాట నోట్లో వుండంగానే వాళ్ల ఒదిన, "మాకు యాడివి కొడవండ్లు? ఈ సందల్లో యాడనో రెండు మూడు వుండాయి. వాటికి కొక్కు రాయించి నాలుగేండ్లాయ" అనేసింది.

ఆ మాటతో చిటామనిపించేసింది యెంగటమ్మకు.

'నా ఆడబిడ్డిగా వుండి కొడవండ్లు లేవనేసింది చూస్తివా' అనుకొని తలగొట్టేసి నట్టయిపోయింది యెంగటమ్మకు.

కొడవండ్లు గల్లమ్మను యింగొకమ్మను అడిగితే నోటి మాటతో గూడా ఎత్తిచ్చింది.

యెంగటమ్మ ఆ నాలుగు కొడవండ్లనూ ఎత్తుకొని గస పోసుకుంటా కొడుకు దగ్గిరికి వచ్చి, "ఆ ఆడంగుల్నాబట్ట ఆ రోజు రంగంపేటకొచ్చి, 'మీకు నేనుండాను, మా వూరొచ్చి బతికి పోదురు రండి' అని పెగ్గి మాటలన్నీ మాట్లాడినాడు గదరా పెదబ్బా. ఈరోజు వోడి పెండ్లాం, కొడమండ్లు ఎంతా ఎంత, అడిగితే నా దగ్గిర లేనే లేవని పుల్లించి నేలేసేసింది గదరా మునికన్నా. ఒరే, గురవడు దగ్గిరుండే కతంతా నాకు దెలుసురా. ఆ నా బట్టకు

తోడబుట్టినా, ఈ రోజుటికి నన్ను పిలచక పొయ్ ఒక కోక బెట్టి 'కట్టకపో' అనిన పాపాన పోలా. వాడంట మనల్ను బతికిచ్చేది. ఒరే పెదబ్బా, మన బతుకు మనిదే, వాడ్నిగా కడుపులో వూపిరున్నంత కాలం ఒక వస్తవను అడగబాకండి. మనల్ను తొడకొచ్చి ఈ వూళ్ళో వొదిలేసి, తిరప్తికి బండి దోలుకోని యాపారానికి పూడ్సినాడు. మళ్లగాని మనకల్లా తిరిగీ మళ్ళీ సూసినాడా?" అని అన్నదమ్ముడి కుటుంబరం మింద వుండిందంతా యెళ్లబోసుకొనింది.

మునికన్నడు తెరలు తెరలుగా నవ్వి, "అప్పుడే వాళ్ళ మింద కత్తి గట్టేసి నావా! ఏమ్మా, వాళ్లు మాత్రం ఏమన్నా సేద్యాలు చేస్తా వుండారా? ఆయన గడ్డి దోలుకొని తిరపతికి పోతే పది నాళ్లు యింటికి రాడనుకో. వాళ్లకు మాత్రం కొడమండ్లు యాడుంటాయి? నిజంగానే లేవో ఏమో! పాపం పున్యం తెలవకుండా ఆ మాదిర్తో బొక్కలాడేస్తే ఎట్టమా?" అనేసి కొడమండ్లను ఎత్తుకొని నారుమడి కాడికి వచ్చేసినాడు.

ఇంక పదీ పదైదు దినాలల్లో నోముల పండగ వుండాది గాబట్టి, యాడ జూసినా చెట్టూ చేమ పచ్చంగా వుండాది.

అబ్బా గొడుకులు ముగ్గురూ మూడు కొడమండ్లు తీసుకున్నారు. కయ్యల మింద చూస్తే యాడనో ఒక దిక్కడ జిల్లేడు చెట్లు కనిపిస్తా వుండాయి. ఒక చెట్టును మొదుళ్లతో కూడా కోసేస్తే నాలుగు మండలు అవతా వుండాయి. రెండు మూడు జిల్లేడు చెట్లను కోసుకున్నాక మునికన్నడికి కొంచిం దూరంలో నడవలూరు వంక అని ఒగటి కనిపిచ్చింది. మునికన్నడు నేరుగా ఆడికి వచ్చినాడు.

కాకెదురు వంక పొడుగూకునా పదీ పదైదు బారల దూరం చెరుకాకు వున్నట్టు నమనమలాడతా వుండింది. నాలుగు బారలు దాన్ని కోసుకుంటే చాలు, ఆ నారుమడి మింద ఆకును ఒక వరస పరిచెయ్యొచ్చు.

"ఒరే దర్మా, నాయన్ను గూడా పిలువు. జిల్లేడు కోసరం అదంతా తారుకులాడేది ఏమిటికి గాని, ఈ కాకెదురును కోసుకుందారి రమ్మను" అని అరిచి ధర్మడ్ని పిలిచినాడు.

అందురూ కాకెదురు కాడికే చేరుకున్నారు.

"బలే అయిడీ యేసినావు గదరే పెదబ్బా" అని కాకెదురు మింద వంగన బడి కొయ్యడం మొదులు బెట్టినాడు ఇలామంతు.

"ఆ, యిది బొయ్ బలే అయిడీ గదా, యిదేమన్నా సత్తవా, పాడా? నాలుగు మోపులైనా జిల్లేడాకే గదా సత్తవ. ఇదేమిటికి, దండగ" అని తీసి పారేసినట్టు మాట్లాడేసినాడు ధర్మడు.

ఇలామంతు ధర్మడి కల్లా ఎగజూసి, "అట్టనద్దురా నడిపోడా! పచ్చంగా వుండేది ఏదన్నా సత్తవే గదరా యెమ్మన్నా! అడుసులో కాకెదురును తొక్కేస్తే నాలుగు నాళ్లల్లో కుళ్ళిపోయ్ సత్తవై పోదా!" అన్నాడు.

అబ్బలూ కొడుకులు ఆ కాకెదురును ఎంత మటుకు వుండాదో అంత మటుకూ కోసేసినారు. మొత్తం ఇరవై బొలువులు దాకా అయింది. దాన్ని నారుమడి దగ్గిరికి మోసేసి, మడి మింద పరిచేసినారు. ఆ ఆకును అరికాళ్ళతో తొక్కతావుంటే, ఆడికి సొసైటీ ఆయన అనే ఆయన వచ్చినాడు.

సొసైటీ ఆయన అద్దాలామె మర్ది. అద్దాలామె కయ్య పక్కన్నే ఆయనకు యెచ్చూతక్కవ ఎనపై గుంటల దాకా కయ్య ఉండాది. అద్దాలామె బాయిలోనే ఆయనకూ అర్ధ బాగం ఉండాది. ఆ బాయిలో రెండు అయిదార్సు పవరు మోటర్లు వుండాయి గదా. దాంట్లో ఒక మోటరు ఆయనదే. సొసైటీ ఆయనకు దొబ్బుమాలినంత కయ్య వుండాదేగాని ఎప్పుడూ దరిద్దరమే. మాటి మాటికీ కయ్యను అడుమానం బెట్టను, సొసైటీలో నుంచి లోను తెచ్చుకోను, ఆ అప్పు పెరగను – ఈ మాదిర్తోనే ఆయనకు యాపై, యాపై అయిదేండ్లు వచ్చేసినాయి.

సొసైటీ ఆయన వచ్చీ రాంగానే, "మా మిట్టూరోళ్లకు కనిపిచ్చని కాకెదురు మీకు కనిపిచ్చిందా? ఏరోజన్నా మేము దాంట్లో యేలు బెట్టి, యిటుమంటి పని చేసుకున్నామా? రంగంపేట నాయాండ్లు పనికి మొగలాయిలుగా వుండారే!" అని అన్నాడు.

ఆ మాటకు ఇలామంతు, "ఏం జేద్దుం బావా! ఇన్ని బండాటలు ఆడినా అందరాల బతకలేక పోతా ఉండామే! మీ కయ్య పక్కన జేరినాం, మమ్మల్ను కడుపులో బెట్టుకోని చూసుకో సామీ" అన్నాడు.

ఇందుకు సొసైటీ ఆయన, "మా వొదిన కయ్య పైరు జేసినోళ్ళు ఎవ్వరూ బాగుపడింది లా. అందురూ నెత్తిన గుడ్డేసుకోని తూరుగా పొయ్‌నోళ్ళే. మా వొదిన పలితానికి పద్దైదు మూటలిచ్చేసి నన్ను గుత్తకు చేసుకోమని పెద్ద మనుసుల్ను పంపితే నేను 'వూరికే యిచ్చినా నాకొద్దు తల్లా' అని తేల్చేస్తినే. మీరేమో ఇరై అయిదు మూటలకు ఒప్పుకుంటిరి. ఎట్టికి చెడి పోతారే" – అని మాట్లాడినాడు.

ఇన్ని మాటలకూ ఇలామంతు, "నా పాలిట దేముడొకడుండాడు. అంతగా చెడి పొయ్యే రాతుంటే తప్పించుకోగలమా? ఇన్నాళ్ళూ కయ్య గుత్తకు చేసే బతికినామా? నీసితే చూస్తాము, నీసకుంటే – మేముండాము, మా రెక్కలుండాయి" అని తెంపుతో మాట్లాడినాడు.

మళ్ళా సొసైటీ ఆయన, "ఒకరు బతికితే చూసే వాడ్నేగాని, చెడిపోతే చూసే వాడ్ని గాను. వూరికే మాట సాంగానికి అన్నమాటే. మా కయ్యల్లో కొచ్చి బాగ బతకాల్నేగాని, ఆ పేరు మాకే గదా. మీరంటే నాకేమన్నా పగా? నా కయ్యే నేను చేసుకో లేక చస్తా వుండాను, మా వొదిన కయ్యను మాలోడు గుత్తకు చేసినా నాకు సమ్మతమే. మీరు అట్టని అనుకొనేరు" అనేసి ఆయన దోవన ఆయన పొయ్‌నాడు.

ఆయన్ను పోనిచ్చి, మునికన్నడు, "నీ మాదిర్తో చెడ్డ చేతులంటరా మావి, సొసైటీ నాకొడకా! నువ్వు బూమమ్మ మింద పైరు పెడితే అది అగ్గి తగిలినట్టు సుంద్రక పోతిందనుకో. ఏ పొద్దూ ఈ యెదవ చేతిలో ఎకరా పది మూటల వడ్లు కాలేదంట నాయినా!" అన్నాడు.

ఈ మాత్రం మాటలకే ఇలామంతు నొచ్చుకోని, "ఆ మామ వొట్టి ఇకారపోడుగా ఉండాడు. ఆయన మాటలకు మీరుగాని తగరార్లకు దిగేరురో, కయ్య పక్కోడితో, కాలవ పక్కోడితో సొంపనగా ఉండాల" అనన్నాడు.

"తమాస తమాసగానే ఆ మామను లొంగేసుకుని మనమే పనులు జరుపుకోమా? ఆయన్ను పగ జేసుకుంటామా? ఆయన నోటి తుత్తర మనిసేగాని, తగరారు మనసి గాదు. బలే బయస్తుడు సామీ. నేను వచ్చిన రోజే – అంతా యింత సేపా, గెంట సేపు మాట్లాడుండ్లా. ఆయనంటే ఊళ్ళో పెద్దోళ్ళ మొదులుకోని పిలకాయిల దాకా అందరికీ 'సొసైటీ ఆయన

– సొసైటీ ఆయన' అని ఎగతాళే గదా! ఆయన్తో మంచిగా ఉండినా నష్టంలా సెడ్డగా ఉండినా నష్టం లేదుగాని, మీరు గమ్మనుండండి" అన్నాడు ధర్మడు.

"ఇటువంటి సమాచారాలు చెప్పడంలో మాత్రం మా నడిపోడు మొగలాయి అబ్బా. ఈ వూరికి నేను తొంబైసార్లు వచ్చుంటా. పది సార్లన్నా వచ్చి నాలుగునాళ్ళు ఉండినాడో లేదో ధర్మడు అంతా చెప్పేస్తా వుండాడే, ఉండూరోడి మాదిరిగా" అన్నాడు ఇలామంతు.

సందేళ అయ్యేకొందికి కాకెదురు అడుసులో తొక్కే పంగ అయి పూడ్సింది.

"దీంట్లో నారు చల్లాల్నేగాని నాయినా, నమ నమా అంటా ఎక్కిరాదా?" అని కుశాల పడినాడు మునికన్నడు కాకెదురు తొక్కేసిన అడుసును చూసుకుంటా.

ఆ మరసనాడు తెల్లారే గేగులు గేగులుగా మొలకలెత్తేసిన అయ్యార్ టొంటీ ఇత్తనాల వడ్లను అడుసులో చల్లేసి, పది మంది పిలకాయిలకు నాన బియ్యం పంచేసినాడు.

అవి టొంటీలు గాబట్టి నెల లోపల్నే నారు నాటకానికి వచ్చేస్తింది. ఈలోపల్నే యాపై గుంటల మడినీ, చేడ యేసేసి, అడుసు దున్నేసి, గనిమలు పెట్టేసి నాటకానికి సిద్దం జేసెయ్యాల. టొంటీల నారుగాని ముదిరిందంటే మళ్ళ ఏమిటికీ పనికిరాదు. మొలగొలుకులో, మస్సూరానో అవితే రెండు నెలల నారును నాటినా గూడ ఫరవాలా. టొంటీలను రెండు నెలలు తాలినాకగాని నాటితే మళ్ళ ఏమిటికిగా పనికొచ్చును? గుంతల్లోనే ఎన్నుబోవునే! ఇరై నాళ్ళల్లోనే చేడ యేసుకోని, అడుసు దున్నుకోవాలంటే యిప్పుడు మార్గమెట్ట? ఉండే ఎద్దులా? గిత్తలు, అవీ బక్కవి. వాటితో మఖా అంటే పది గుంటల్ను అడుసు జేసుకోవచ్చు.

ఈ యాదనతో యెంగటమ్మ మొదులుకోని నాగరాణి దాకా కుంగి కునారిల్లి పోతుండారు.

బాడిగ మడకలతో యాపై గుంటల కయ్యను అడుసు చేసి, నాటకానికి పక్కం జేసుకోవాలంటే ఎన్ని రూపాయిలైతే? ఒక్క మడకకు పదైదు రూపాయలియ్యాలనే! బాడిగ మడకలకు వచ్చేవాళ్ళు దున్నతారా పడతారా?

చద్దిగింజేళకు కయ్యలోకి వచ్చి ఎండ పడంగానే, పది గెంటలు ఎప్పుడయి తిందా అని చూపెట్టుకొని మడకలిప్పేస్తారు. సంగటేళ దాకా అయినా దున్నతారా? దున్నినా కర్రును బూమిలోకి దిగనిస్తారా? గిర్రలు గదా గీసేసి పోతారు.

అట్టగూడ, సొంత కయ్య అయినా బాడిగో సాడిగో పెట్టి దున్నుకోవచ్చు. ఎరవల కయ్యలో గుత్తకు చేస్తా, బాడిగ మడకలు పెడితే – గుత్త ఏమిచ్చేది, మనం ఏమి తినేది?

"నేనాపొద్దే చెప్పినా, మీరంతా నీళ్ళు తాగేసినంత లేసుగా మాట్లాడేస్తిరి. గెడ్డన నిలబడుకోని చూస్తే ఏముండాదిలే – అనిపిస్తింది. దిగితే గదా లోతు తెలిస్తింది. ఈ పొద్దు కష్టం ఆ పొద్దు తెలిసిందా? యాపై గుంటల పైరును ఎక్కించి, ఇరై అయిదు మూటల వడ్లను వారం యిచ్చి – మనం తినేదేంది మళ్ళ?" అని యాష్టగా మాట్లాడేసినాడు ఇలామంతు నాయుడు.

ధర్మడు గూడా సళ్ళిడిచేసి, "ఫలానా పని చెయ్యమంటే చేసే వాడ్నే గాని నాకేమీ తెలవదు సాములాలా. చెప్పింది చేసి – యేసింది తినేసి, పోసింది తాగేసి పొయ్యేవాడ్ని" అనేసి బీడీలు తాక్కుంటా ఊళ్లో పిలకాయిల్తో తిరగతా ఉండిపోదామనుకున్నాడు.

ఇదంతా చూస్తా వుంటే యెంగటమ్మకు నోట్లో తేమ లేకుండా పూడిసింది.

మునికన్నడికి గూడా బిత్తరగానే ఉండింది. అయినా జరిగే పన్లు చూడాల గదా. అందురూ 'ఎరగనోచ్' అంటా ఉండిపోతే ఎట్ట?

ఆ సమియంలో ఊళ్ళో – పిలిస్తే పలికేదానికి మనిసి లేకుండా ఉండినాడు. మంచి పనుల కాలం. మనుసులంతా పనుల మింద పడి బీజారి గోజారతా ఉండారు.

అటువంటప్పుడు చెంగమ నాయుడు అనే ఒంటిగోడు పనులు చేసు కోలేక మునికన్నడ్ని జూసి, "ఏమిరే అల్లుడా! నాకు పనికన్నా రాకూడదంటరా, ఇరై బండ్ల ఎరువుండాది దిబ్బలో. బండి కడతా, తట్టల్తో ఎరువెత్తి దొళ్ళలో పోద్దువు రారా నాయాలా?" అని పిలిచినాడు.

ఆ మాటతో గూడా మునికన్నడు, "వస్తాను మామా వస్తా. నువ్వెప్పుడు పిలిచినా పలకతా. అవితే నాదొక మాట సామీ, ఇంగొక నాలుగైదు నాళ్ళల్లో మేము అద్దాలామె కయ్య దున్నాల. నువ్వొక్క రోజు మాకు మడక గట్టాలనే!" అన్నాడు.

మునికన్నడి చాతుర్రానికి చెంగమ నాయుడు నవ్వి, "ఒరె నాయాలా, అల్లుడంతోడివి. నువ్వడిగితే కాదనే అతార్టీ ఉండాదంట్రా నాకు? నువ్వు నాలుగు నాళ్ళు నాకు పనికిరా, నీకు ఒకరోజు ఒక్క జోడు గాదు నాలుగు మద్యానాలు మడక కడతా. ముందు నా తొక్కడ అణిగిపోనీ. సరేనా?" అన్నాడు.

ఎగిరి లగ్గేసినాడు మునికన్నడు.

మునికన్నడు – ధర్మడికి గూడా పని చూసిపెట్టినాడు. ఒక అవసరం గల్లాయన అడుసులోకి మాకుల్లో వుండే ఆకు కొట్టే అందుకు మనిసి దొరక్క అల్లాడి పోతా వుండినాడు.

మాకులెక్కి ఆకు కొట్టాటంలో మునికన్నడి కన్నా మొగలాయి ధర్మడు. వరసగా ధర్మడు ఆ పనికి నాలుగు నాళ్ళుపోతే నాలుగు జోళ్ల మడకలు కయ్యలేకి దిగతాయి గదా.

ఒక ఊరన్నాక ఎవురికి తగిన పని వాళ్ళకు లేకనే ఉంటిందా? ఈ మడకల కోసరం అని చెప్పి యెంగటమ్మ, ఇలామంతు, నాగరాణి దాక అందురూ వాళ్ళకు తగిన పనులు వాళ్లు చేసినారు.

వారం దినాలు ఈ వాటంతో అందురూ రెండుగాళ్లూ ఒక చోట పెట్టకుండా పనులు చేసినారు.

ఎనిమిదో దినం కయ్యల మింద నీళ్లేసినారు.

కయ్యల్లోకి ఏడుజోళ్ల మడకలు వచ్చినాయి.

మడకల పని మడకలు చేస్తా వుంటే ఇలామంతు, ధర్మడు పార పని చేసేసినారు.

చేడ పని అయిపోయింది.

మళ్ల నాలుగు నాళ్లకు అడుసులో – మళ్లా ఆరు మడకలు వచ్చినాయి. రంగంపేటోళ్లకు మడకలు కడితే, ఆ నాయాండ్లు మనకెప్పుడు పనున్నా వచ్చి చేస్తారు. వాళ్ల దగ్గిర యాడికీ పోదు – అనుకొని వూళ్లోవోళ్లు తలా ఒక జోడు మడకను రంగంపేటోళ్లు ఎప్పుడు పిలిస్తే అప్పుడు కట్టినారు.

దీంతో అడుసు కూడా అయిపోయింది. ఒకరోజు మాను కట్టి మిట్టా పల్లాల్ని ఒకటిగా చేసి చదరం కట్టేసినారు.

పాపం ఇలామంతు బక్కెద్దులు అడుసు యేసినంత కాలం శక్తి కొందికీ పెరుకు లాడినాయి. అవి బదులుకు వచ్చిన మడకలతో గూడా దున్నలేక చచ్చి సున్నమైనాయి. బూమ్మింద కాళ్ళు పెట్టలేకుండా వాటికి మెత్తగాళ్ళు పడిపొయ్‌నాయి. అవి ఆ నాలుగు నాళ్లూ మునికన్నడి చేతల మోపున గదా పనిచేసినాయి.

ఇంక నారు నాటేదే పని.

యాపై గుంటల్లో నాటాల్సిన నారును పెరికే దానికి మాలామాదిగోళ్లను ఒక్కర్నీ పిలవలేదు. ఇలామంతు, మునికన్నడు, ధర్మడే పెరికేసినారు.

పెరికిన పైరును తట్టలతో ఎత్తక పొయ్ అడుసు మళ్లల్లో చెదరేసినారు.

పైరంటే అబ్బలు గొడుకులు పెరికినారు గాని నాటను గూడ నాటతారా ఏమి?

పైరు నాటకంలో మాదిగోళ్ళకన్నా మాలోళ్ళు పనోళ్ళని మునికన్నడు మాలపల్లికి పొయ్‌నాడు.

ఆ మాలపల్లి ఆడోళ్ళు, “య్యో, అది అద్దాలామె దొంపు. ఆ దొంపంతా చేరి అర్రై గుంటలన్నా వుంటింది. దాన్ని నాటాలంటే యాపై యాపై అయిదు మంది ఆడోళ్ళన్నా గావాల” అని ఎగనీలిగినారు.

మునికన్నడు, “ఎవురుమా దాన్ని అర్రై గుంటలని మీతో చెప్పింది. వాళ్ళను ఇట్ట రమ్మనా! మీ రెక్కల కష్టం మాకేమిటికి? నడవలూరు కరణాన్ని పిలచకొచ్చి గొలుసులుతో కొలిపిద్దాం రండి. అది సరిగ్గా నలపై అయిదు గుంటలంటే నలపై అయిదు గుంటలే. ఒక్క గుంట గూడ యెచ్చూ తక్కువలా.

ఆ మాట కొస్తే ఒక్క సెంటు గూడ–" అని నాలుగైదు కూలులు మిగిలినట్టే గదా అని అయిదు గుంటల కాడ అపద్దమాడినాడు.

మాలోళ్ళు ఎటుమంటోళ్ళు? వాళ్ళ దగ్గిర అపద్దాలు జరుగునా?

"రంగంపేట నుంచి వచ్చిన మా మేనమామ కొడకా. నీకు అద్దాలామె కయ్య ఈ రోజు కొత్త. మాకది బలే పాతగాని నువ్వు రెండూ రెండు చేతల్తో మూసుకో" అని వాళ్ళల్లో ఒకామె యాసండం పడి, "యాపై గుంటల్లో పైరు నాటేదానికి నలపై అయిదు కూలులు అవతాయి, సరా?" అనడిగింది.

అవితే – చేతి కొందికీ నాటితే ముప్పై అయిదు మందవితే బలే జాస్తి.

"మీరు మద్యానాలకు మఖరాజులై పోవాలనే రకమే" అని మునికన్నడు నిష్టూర పోయి, గంగిరెడ్డి పల్లి రెడ్డి నౌకాయన్ను పిలచకొచ్చి మద్యస్తం బెట్టబోయినాడు. కడాకు, ముప్పైమూడు కూలులిచ్చేటట్టు కుదిరింది.

చద్దేళ దాటి గంటయినాక వక్కాకులు నములుకుంటా వచ్చినారు మాలపల్లి ఆడోళ్ళు. ముప్పైమూడు కూలులు గదా అడిగినారు, మనుషులు మాత్రం ఇరై ఏడు మందే వచ్చినారు.

"అదేందివో, ఇరవై ఏడు మందే వచ్చినారు?" అనడిగినాడు మునికన్నడు.

"మేము నలగరమే గూడ వస్తాం. దాంతో నీకేమి పని? పొద్దు బారదుండంగానే పని కాకుంటే అప్పుడడుగు మైనీరు పిలగా!" అనిందొకామె. ఈ మాటకు బొదులుగా యింక మాట్లాడేదేముండాది? వాళ్ళు జెప్పినట్లు నిజ్జంగానే రెండూ రెండు చేతల్తో మూసి పెట్టుకున్నాడు మునికన్నడు.

మాలోళ్ళు నారు కట్టల్ను చేతల్లోకి తీసుకొని మునాలు పట్టినారు.

యెంగటమ్మ పైరు నాటకం సరిగ్గా రాని రకం.

ఆమె గనిమ మిందనే చేరుకొని, ఒక నారుకట్ట చేతల్లోకి తీసుకొని, వారలా వొత్తలా నాటతా, "తల్లులాలా, కర్ర కొంచిం వొత్తుగా యెయ్యండి. ఆడొక కర్ర ఈడొక కర్ర యేసిన సాంగిం చెయ్యబాకండి, మీకు పున్నె ముంటాది. ఇది ఎరవల కయ్య, వారం యిచ్చుకోవాల. కొంచెం చూసి

నాటండమ్మో” అని అంటే వాళ్ళల్లో యిద్దరు ముగ్గురు ఒకే దపా, “లోకానికే యిచ్చిత్రంగా నువ్వే నాటిస్తా వుండావులే మా – పైరు! మేము పేరుకు మాలోళ్ళమైనా మేం గూడ మంచి మద్యానమైనా సంసార్లమేలే. ఇంగ నువ్వు నిలిపెయ్” అన్నారు.

వాళ్ళ నాటకాన్ని గమనించిన యెంగటమ్మ మళ్ళా, “మో తల్లులాలా, ఈ కయ్యను నమ్ముకోని రంగంపేట నుంచి వచ్చినాం. కొంచిం వత్తుగా నాటండి. వరి పైరు తీగలు పారితిందా ఏమి? ఈ పొద్దు ఎంత నాటితే అంతే కదా, ఈ పలితమంతా” అనింది. మనుసు ఒప్పక, చూస్తా వుండబట్ట లేక ఇదే మాదిరితో యెంగటమ్మ కొంచేపు మాలోళ్ళతో నసకు దిగింది.

వాళ్ళు కొంచేపు చూసి వాళ్లల్లో ఒకామె, “ఈ పని మాకొదిలేసి నువ్వు యింటికి బొయ్ సంగటి రడీ చెయ్ బో. ఉత్త మిరక్కాయి, గోగాకు తేకుండా కొంచిం లొట్టలేసే కూర చేసకరా, మునక్కాయలూ పాడూ చెయ్. ఆ పని చూద్దామనుకోకుండా ఈడనే వుంటావా?” అనడిగింది. యింగొక పెండ్లిగాని అమ్మి, పైరు నాటడం రూంత సేపు ఆపి, “అవును రంగంపేటామి అనుకోవాల్నే గాని మనందరికి కోడిగుడ్ల పులుసు చేసక రాదా? చూస్తా వుంటే బలే దారాళం మనిసిగా కనిపిస్తా వుండాదే!” అని యిరగబడి నవ్వింది.

ఈ ఎగతాళికి యెంగటమ్మకు రగిలి పొయ్యింది.

“మేం కోడిగుడ్లు, చియ్యాల కూర తిని బతికి నోళ్ళం గాదు తల్లా. ఇన్ని రోజులకు నా సిన్నకొడుక్కి ఒక గుడ్డు తినిపించబోతాను నేను” అనింది నిష్టూరంగా.

‘ఓయమ్మో, రంగంపేట మాలోళ్ళే అనుకుంటే ఈళ్లు – వాళ్ల జుట్లో దూరిపోయ్యే టట్టుండారే! వాళ్ళకేమి? గవుర్మెట్టు వాళ్ళ సొత్తయిపాయ. సిమిటీతో యిండ్లు కట్టిచ్చి, లోన్లిచ్చి మంచి మంచి పాలావుల్ను పట్టిచ్చే దానికి వాళ్ళకు గవుర్మెట్టుండాది. అదీ వాళ్ళ పవురు. ఈ కాలం మాల పుట్టక పుట్టినా మానంగా బతికి పోవచ్చు’ అని అనుకుంటా యెంగటమ్మ యింటి కొచ్చేసింది.

కూలోళ్ళకు, యింట్లో వాళ్ళకు అరవై డెబ్బై ముద్దలు బట్టే బానబెట్టి సంగటి చేసింది.

ఈ మాత్రం దానికే, ‘కూలోళ్ళను పెట్టి సేద్యాలు జరిపించుకునే వాళ్ళంతా ఎట్టదా బతకతుండారో! కూలోళ్ళను మేపను మనబోటోళ్ళ వల్లా అయితిందా? ఎంత సంగటి కర్జు?’ అని కుళ్ళిపోయింది.

సంగటి కెలికి కిందికి దించింది.

యెంగటమ్మ ఒకటికి నాలుగీదులు తిరిగి, “తల్లులాలా, ఈ పొద్దు మాకు ముప్పై మంది కూలోళ్లు. సంగటి కెలకాల, పలకల మింద పోసి సంగటి ముద్దలు జెయ్యాల పలకలియ్యండి” అని ఆ అమ్మను ఈ అమ్మను అడిగి సంగటి పలకలు తెచ్చి, ముద్దలు జేసింది.

ఆ అంత మందికీ సంగటి చేస్తావుంటే యెంగటమ్మ కులుకే కులుకుగా ఉండింది.

రెండు మూడు మానికలు యెసుట్లో పోసి సంగటి చేసిన మనిసే గాని, ఒక్కసారిగా అన్ని ముద్దల్ను ఆ మనిసి ఏ పొద్దు చేసిందని?

## 3

“దూకు దూకు అని దూకినాము. ఈ రోజుటికి కయ్యలో పైరు నాటినాము, ఈ మాత్రం దానికే ఎంత దుడ్డు ఎగేసినామో లెక్కెయ్యండి. తల్చుకుంటేనే, ఎదగుండె పడిపోతా వుండాది” అన్నాడు ఇలామంతు నాయుడు ముక్కుల గుండా గాలిని పొడుగ్గా వొదిలి.

అడుసులో పైరు నాటేసే కొందికి తెరపగా వుండాది. ఇప్పుడు ఆ మడికి నీళ్ళు కట్టుకునే పనేగాని యేరే పని లేకుండా వుండాది.

మంచి మద్యానం పూట ఇలామంతు నాయుడి కుటుంబరం అంతా సంగటికి కూచ్చుని తింటా ఉండింది.

“నారు నాటిన కూలోళ్ళకే ఇన్నూర్రూపాయిల దాకా అచ్చుకున్నాం. ఇంక మన రెక్కల కష్టం, ఎద్దల కష్టం, మడకలకు బాడిగ అంతా లెక్కేసుకుంటే – మనకు మిగిలేదేంది, మట్టిపెళ్లా?” అన్నాడు ఇలామంతు నవ్వుతా. “పుట్టిన కాడ నుంచి కూలికి పోతా వుంటే రాని గాశి, యాపై గుంటల్లో పైరెక్కించే సరికి వచ్చేసింది. వొళ్లంతా ఒకే నెప్పులు గాని–” అన్నాడు.

ఇంతసేపూ గమ్మనుండిన మునికన్నడు, "మన రైతుల రాత – ఎద్దుల గొట్టేది, ముద్దలు తినేది! సేద్యం చేసి యెనకాన కుప్పలు పోసుకోవాలంటే – ఇదేమన్నా యాపారమా?" అన్నాడు.

ఆయనకు పుట్టిన కొడుకు దగ్గిర ఆయన చెప్పించుకోవాల్నా? ఆ మాత్రం ఇలామంతుకు తెలవదా ఏమి?

కయ్యల్లో పైరెక్కించేసినాక చేతి నిండా పనిలేక పొయ్యింది. తెల్లారి నిద్రలేస్తానే మడికాడికి పోయి రెండు గెంటల సేపు మిసనేస్తే వరిమడి నీళ్లతో పారిపోతా వుండాది. మునికన్నడికి, ధర్మడికి కాసు పని లేకుండా వుండాది.

"మన చేతి కింద యింక యాపై గుంటలుంటే మాత్రం నష్టం ఏమి? ఏ అగచాట్లో ఒక అగచాట్లు పడి పైరెక్కించెయ్యమా?" అని ఆశిగా మాట్లాడినాడు మునికన్నడు వాళ్ల అమ్మ దగ్గిర.

కాపరం మింద సేద్యం మింద పెద్ద కుమారుడికి వుండే శ్రద్ధకు యెంగటమ్మ, "ఆశికి గూడా మితం వుండాలరా మునికన్నా! ఆశికి బోతే గోశి అడ్డమొస్తిందనే సామిత వుండనే వుండాది కదా. వూరికే పరుగులెత్తేది ఏమిటికి? ఈ కయ్యను బొటూగా సేద్యం జేసుకొని నెగ్గుకుంటే చాలు నాయినా!" అనింది.

యెంగటమ్మ వూరికే మాట సాంగానికి ఆ మాట అనిందేగాని, మునికన్నడికి సేద్యం మింద అంత అక్కర ఎందుకుగా పుట్టిందో, కన్న కడుపు, ఆమికి తెలవదా ఏమి? మునికన్నడికి ఇరై రెండో సమ్మచ్చరం జరగతా ఉండాది. మనిసి నల్ల రూపాన ఎంత పొడుగ్గా, ఎంత ధాటీగా వుంటాడు! ధర్మడు మాత్రమా? ఇన్నినాళ్లూ రెక్కల కష్టం అంతా ఏట్లో పోసినట్టే గదా. తెల్లారి లేచి మడక దున్నను పోతే – అది వూల్లోళ్ల కయ్య, తెల్లారి లేచి ఎవురికన్నా వరి కోతకు పోతే – అది వూల్లోళ్ల కయ్య. బతికినంతగాలం కష్టమంతా వూల్లోళ్ల కయ్యల్లోనే దారబోసుకున్నారే! ఈ పొద్దు, అది గుత్తకు తీసుకున్న కయ్యే అయినా, అంతా సొంత పని మాదిరితో ఉండాది. పలితానికి ఇరై అయిదు మూటల వడ్ల గింజలు వారం కింద పారేస్తే, ఎంత చేసుకుంటే

అంతా మనకే గదా! సొంత కయ్య ఎంతో ఇదీ అంతేగదా. అటుమంటప్పుడు సేద్యగాడికి ఎందుకుండదు అక్కర?

పని లేని కాలంలో గూడా పని బెట్టుకున్నాడు మునికన్నడు.

మిట్టూరికి పరంటగా చిన్న అడివి ఉండాది. అడివికి వూరికి మైలు గూడా ఉండదు. ఆ అడివిలోకి పచ్చిక కాలం గాబట్టి, వూళ్లో వాళ్లందురూ గొడ్లను తోలక పోతారు. ఆ ఒక్క వూరి గొడ్లేనా? కమ్మపల్లి, గంగిరెడ్డిపల్లి, గొల్లపల్లి, మూడు రామాపరాలు, కూచంద్రపేట, దుర్గసముద్రం – ఈ వూళ్ల గొడ్లన్నీ ఆడనే తిరగతా వుంటాయి పొగులు పొద్దల గూకునా. గొడ్లను తోలక పోయినోళ్లు, పేడ కోసరం తట్టలు ఎత్తుకొని పోకనే వుంటారా? పోతే పోనీ, ఎన్నాళ్ల గొడ్లు అడివిలో ఉండేది!

"వూరికే ఈగిలు కొట్టుకుంటా యింట్లో ఉండేది ఎందుకమా? అటా అడివిలోకి పోయ్‌నామంటే గెంటలో తలా ఒక తట్ట పేడ జిక్కితింది గదమా!" అని తట్ట ఎత్తుకున్నాడు మునికన్నడు.

"ఆడ పుట్టక బుట్టి పేడ మింద కలవరం నాకు లేకపాయ గదరా పెదబ్బా. ఏమిరా నీకు బతుకు మింద యింత కలవరం బుట్టిపొయ్యింది? ఉంటావా, పోతావారా, నా కడుపు కాల్చేసి–" అని ముదిగారానికి పోయి, యెంగటమ్మ గూడా ఒక పేడ తట్ట ఎత్తుకొనింది.

"ఇట్లా ఆడంగి పన్లు జేసి మఖరాజులై పొయ్యేది లేదురా, అనా!" అని అంటా ధర్మడు వూళ్లేకి పూడవడానికి గడప దిగబొయ్‌నాడు.

మునికన్నడు గబీమని మాటను రానిచ్చి, "వొరే ముండా! పేడ మహలచ్చింరా. అందుకనే నట్టింట దీపం కిందన చలవ బెడతారు. మంచి మాటల్తో పేడతట్ట చేతికెత్తుకో. అడివి నుంచి పేడ తెస్తే నీ తలగుడ్డ నేల పడి పోదులే" అన్నాడు.

ధర్మడు మొండికి తిరుక్కొని – బాగా నీళ్లు బెట్టి అణగ దువ్వి, కర్లింగు లెత్తుకునిన తలను తడుముకుంటా ఈదిలోకి పూడ్సినాడు.

నడిపోడి దొంగేసికానికి యెంగటమ్మ తిట్టబొయ్యింది.

మునికన్నడే తమ్ముడికి సపోరటగా నిలబడి, "అట్ట జావనీ అమా, ఆ దొంగ నాయాల్ని. మడి దున్నినప్పుడు పది నాళ్లు బాగ పెరకలాడినాడు. దొంగోడు, పనికి ఆ మాత్రమన్నా నిలబడతాడని అనుకోలా నేను. అట్ట బోనీలే" అన్నాడు.

"ఈ పొద్దొచ్చిన వాడికే గదరా రేపు గూడా. ఈ మాదిర్తోనే అలవాటయి పోతే, మళ్ల వాడు వొంగతాడా, మనకు?" అనింది యెంగటమ్మ.

అమ్మను, అన్నను జూసి నాగరాణి మారు మాట్లాడకుండా తట్టెత్తుకొనింది.

"కబడీ ఆడిపిస్తా వుండావు గదరా పెదబ్బా. మొన్నటి దాకా ఆ అడుసులో చంపితివి. నాలుగు నాళ్లన్నా రెక్కార్చుకోనియ్యేమిరా?" అని అంటానే తట్ట కోసరం యెతుకులాడి తట్టెత్తుకున్నాడు ఇలామంతు. కొడుకు పనులు ఆయన కంటికి బలే ముదిగారంగా వుండాయి.

ధర్మడు గూడా అడివిలోకి వచ్చుంటే – తట్టకు కొరవ వచ్చుండును. ఇంట్లో వుండే తట్టలు నాలుగే. ఆ నాలుగిట్ని ఎత్తుకొని నలుగురూ అడివికి ఎలబారినారు.

వాళ్లు ఈదిలో గుండా నడిచి పోతా వుంటే చెంగమ నాయుడి పెండ్లాం లచ్చుమమ్మ, "ఏమి రంగం పేటామే! యాడ పూడ్చిపెట్టి వుండారు, లిబ్బిని? కుటుంబరం మొత్తం ఎలబారినారే!" అనింది నవ్వతా.

యెంగటమ్మ గూడ నవ్వతానే, "లిబ్బి కోసరం గాదు వొదినా! పేడ కోసరం గదా. పరంటగా పోతే నాలుగు పేడకళ్లు దొరకతాయని అందరం పోతా వుండాం" అనింది.

లచ్చుమమ్మ అంతటితో గమ్మనుండకుండా, "దొడ్డితో దొడ్డి ఆవల్ను అడివిలేకి తోలినోళ్లు గూడ ఎత్తకపోరే అన్ని తట్టలు? ఒక్క ఎనప దూడకు గూడా గెతి లేదు, లచ్చా తొంబైయ్యారు తట్టలెత్తుకొని పోతుండారే!" అని మాట్లాడింది.

యెంగటమ్మ యింగ ఒక్క మాట గూడా మాట్లాడకుండా, 'నువు బోయే ఇడిసి పెట్టిన దానా!' అనుకొని గమ్మన నడిచింది.

'గెతిలేక ఒక వూరికి వచ్చినామని, కయ్యాగాలవలు సంపాదించ లేదని మేమంటే ఎంత లేసో - కన్న నా బట్టకు, కన్న నా సవితికి! దోవన బొయ్యే వాళ్ళను ఎంత బాగ జగడానికి గీరిందో చూడు ఆ లంజి! అది ఈ సిత్తూరు జిల్లాకే పటంగి. దాంతో ఒకటి మాట్లాడితే తక్కువ, రెండు మాట్లాడితే ఎక్కువ. తక్కువ లంజిలు. 'అంత అన్నం పెట్టండి తల్లా' అని మీ యింటి ముందిరికి వచ్చినప్పుడు అడగండి. ఈ వూళ్లో ఆడ నా సవుతులు పెతీదీ పట్టి పట్టి చూస్తా వుంటే! మీకు కలిగుంటే రోజుకి పదారు సార్లు తినండి, ముప్పై రెండు సార్లు ఏరగండి, నేను రోషగల్లరాలును. నాకుగాని రేగిందంటే - పండబెట్టి పచ్చ పోసేద్దును. ఏమండి సేయ్, నేను మీ కండ్లకు నీళ్ళ కన్నా పలసంగా, దూది కన్నా సులకంగా కనిపిస్తా వుండేది! మాకు ఎనప దూడకు గెతిలేని సంగతి నిన్ను చెప్పమన్నామంట సేయ్! నీ కొట్టంలోనేనా జెర్సీ ఆవులు డిల్లీ ఎనుములు వుండేది! లంజి నా సవితీ-' యెంగటమ్మ అడివి జేరే దాకా లచ్చుమమ్మ అనిన ఆ మాట మిందనే వుండి నోటి కొందికి తిట్టు కొనింది. అడివి జేరేదాక మునికన్నడితో గాని, నాగరాణితో గాని నోరు తెరిచి మాట్లాడుంటే!

అడివిలోకి పోతే, పేడకొచ్చిన యిటుమంటోళ్ళు యాడ జూసినా వుండారు. అయితే మాత్రం? తెల్లరాళ్ళ మిట్ట దాటి, నూగుజేను మిట్ట దాటి, అడ్డొంక గుండా అండాసామి గెండి చేరుకునే కాడికి నాలుగు తట్టలూ పేడతో పొల్లుగా నిండి పొయ్‌నాయి.

నాగరాణి యింగా యింగా కనిపించే పేడను జూసి మనుసొప్పక, "అమా అమా, ఈ తట్టల్లో వుండే పేడనంతా యిక్కడ వుడ్డేసి యింగా తిరగదాం. తిరిగే కొందికి దొరికేటట్టుండాది పేడ" అనింది మునాశ పడి. ఆడబిడ్డి లచ్చినం అంటే యిదే.

నాగరాణి చెప్పినట్టు నాలుగు తట్టల్లో వుండే పేడనూ అక్కడ కుమ్మరించేసి, పేడ కోసరం గెండి కిందంతా తిరుగులాడినారు. మళ్లా గెంటకు తట్టలు నిండిపొయ్ నాయి.

ఉడ్డేసిన పేడ దగ్గిర ఇలామంతును కావిలి బెట్టేసి, అమ్మలు బిడ్లు తట్టలతో యింటికి ఎలబారినారు. పచ్చి పేడ గదా యిండ్లకు వచ్చే కొందికి మెడ

కాయిలు అట్టా యిట్టా తిరక్కుండా నీలగక పొయ్‌నాయి. మళ్లా అడివిలోకి పొయ్, వుడ్డేసి వుండిన పేడను గూడా తెచ్చుకొనేసినారు. ఆ పేడను యింటి కాడ యేసినాక, మునికన్నడు కావాలనే, "మళ్లా పోదామా, అడివిలోకి" అన్నాడు.

దీనికి వాళ్ళ నాయిన, "నువ్వు పోవాలంటే పోరా. మేం రాముగాని!" అని అనేసినాడు కచ్చితంగా.

యెంగటమ్మ గూడ మొగుడికి సపోరటగా నిలబడి, "లేకుంటే ఏందిరా పెద్దోడా! ఏ రోజనుకున్న పని ఆ రోజే అయిపోవాలంటే జరిగితిందా? ముందే వూళ్లో నా సవుతులు దిష్టి పెట్టేస్తా వుండారు, చాలు చాలు, ఈ మాత్రం చాలు. దినుమ్మూ రెండు తడవలు తెచ్చుకుంటే చాలు గానీ" అనేసింది.

"అబ్బ, నేను గూడ తమాసకు అనిన మాటేలే గానీయండి" అన్నాడు మునికన్నడు.

అడివిలో అడ్డవంక సాగే దాక గొడ్లు అడివికి పోతా వస్తా వుంటాయి. అడ్డొంక యింగా ఎట్ట లేదన్నా నెల పారితింది. అసలు వానలు బాగ పడుంటే మాసి నెల దాక కూడా సాగుంటింది.

నెలనాళ్లా రంగంపేటోళ్ళు ఆ అడివిలోకి బొయ్ పేడ తెచ్చుకున్నారు.

ఇంటి దగ్గిర్నే జాగా దండిగా వుండడంతో అక్కడ్నే దిబ్బ యేసుకున్నారు. ఎట్ట లేదన్నా నాలుగైదు బండ్ల పేడన్నా వుంటింది.

ఆ దిబ్బను జూసి ఎవురన్నా ఒకమ్మ, లచ్చుమమ్మకు తోడుబోయిన ఆడది, "ఒక పింటిక యేసే దానికి గొర్రిపిల్ల గూడ లేదనుకో మీకు. మీ దిబ్బ జూస్తే దొడ్డి ఆవు లున్నట్టుండాది" అనంటే అందుకు బొదులుగా యెంగటమ్మ, "ఏమి జేసేది? మేమూ మీ ఒప్పందం కమ్మ పుట్టక పుట్టినాము గదా. పుట్టేమి సుకం, మాల బతుకు కన్నా ఈనంగా బతికినాము. ఒక్క గుంట నేల కలిగి బతికినామా? ఈ రోజేదో బగమంతుడు ఒక దోవ చూపిచ్చినాడు. దాన్ని నిలపెట్టుకోవాలంటే, అగ్గో యిటుమంటి బండాటలు ఆడద్దా? మేమూ మీ ఒప్పందం నీళ్లో నిప్పులో తాగద్దా తల్లా!" అని అనేది.

సందేళ సందేళ మునికన్నడు ఆ దిబ్బను చూసును, "వచ్చే పలితం ఇదే ఇరై గుంటలకు సత్తవ" అని అనును.

యెంగటమ్మ ఈ మాటిని, "ఒరే, అట్టనొద్దు రారే, దిష్టిరా!" అని అంటానే, "ఈరీలు లైట్రేటులు ఏమి చెయ్యాలరా ఈ పేడ దగ్గిర? పేడే గదా పైరుకు నిజ్జిమైన సత్తవ. మా కాలంలో వరి మడికి పేడా, ఆకే సత్తవ. ఇప్పుడు ఈ ఈరీలు, లైట్రేటులు యేసి గదా మనసలకు కొత్త కొత్త రోగాలంతా వస్తా వుండేది! వచ్చే పలితం ఈ ఎరువే చాలు, మన కయ్యికి" అని ఆమే దిష్టి తగిలినట్టు మాట్లాడేది.

అమ్మా గొడుకు ఈ రకం మాటల్లో వుండంగానే అక్కడికి ఒంటిగోడు చెంగమ నాయుడు వచ్చినాడు.

"ఏమిరే అల్లుడా!" అని పైగుడ్డ కిందేసుకొని కూచ్చున్నాడు.

"చెప్పు మామా, నోటార అల్లుడా అని పిలిచే దానికి నువ్వుండావు ఈ వూళ్లో నాకు" అన్నాడు మునికన్నడు.

చెంగమ నాయుడికి ఆ వూళ్ళో ఒంటిగోడని పేరు. చెంగమ నాయుడు ఒంటిగోడు ఎందుకైనాడు, ఆయనకుగాని పెళ్ళాం చచ్చిందా అంటే – ఎందుకు చచ్చింది, లచ్చుములు అనే ఆమె కోకలు రైకలు కట్టుకోని తిరగతానే వుండాది గదా. పిలకాయల్లేక ఒంటిగోడు అయినాడా అంటే, ఎందుకు లేరు, గాడిదిలు గాడిదిలుగా ఇద్దురు మొగ పిలకాయిలు, ఒక ఆడ పిలకాయి వుండారే. అవితే వాళ్ళు వుండేమి సుకం, లేకేమి సుకం? ఆ యిద్దురు మొగ పిలకాయిలు యిప్పుడు ధర్మడు, మునికన్నడు వొగిసులోనే వుండారు. వాళ్ళు వుండే వుండటానికి చూసేసి రమ్మంటే కాల్చేసి రావచ్చును. కాని, వాళ్ళు సచ్చు నాయాండ్లు. ఒకడు యింటర్మెట్టు పయిలై పోయినాడు, యింగొకడు పది పయిలై పోయినాడు. అట్ట చదువుకూ పనికి రాకుండా, ఇట్ట సేద్యానికీ పనికి రాకుండా అయిపొయ్‌నారు. ఇంక ఆ ఆడబిడ్డి గురిచ్చి చెప్పుకుంటే కడుపు అగోత్రంగా రగిలి పోతింది. ఆ బిడ్డికి గూడా నాగరాణి వొగిసే వుంటాది. నాగరాణి ఎంత పని చేస్తా వుండాది! ఉత్తర కొండను, దచ్చిన కొండను పొల్లించి దొల్లిస్తా వుండాది గదా. చెంగమ నాయుడి కూతురు రజిని ఇట్టుండే పుల్ల అట్ట యేసే రకం గాదు. ముగ్గురు బిడ్లుంటే

ముగ్గురు బిడ్లనూ ఈ వాటంతో తీర్చేసింది వాళ్ళమ్మ లచ్చుములే. ఆయందరికీ అమ్మ బుద్దులే వచ్చినాయి గాని, అయ్య బుద్దులు ఒక్కటంటే ఒక్కటి రాలా. సేద్యాలు చేసుకొనే వాళ్ళు తెల్లారి నిద్దర లేవంగానే కాపీలు పెట్టుకుంటే జరిగితిందా? కాపీ అంటే వుడుకుడుగ్గా నాలుగు గుక్కలు తాగితే చాలు గదా. వాళ్ళకు ఒక్కొక్క దుత్త గావాల, ఇంక లచ్చుములంటే – ఒకే ఒక మాటలో ఒళ్ళు బలిసిన ఆడది. ఆ యాడది పేడతట్ట ఎత్తుకొని ఏ పొద్దూ మడి కాడికి వచ్చుండదు. పిలకాయిలు కోరింది చేసి పెట్టి, కోరిన కోకారైకా యేసుకొని వూళ్ళు తిరగడమే ఆ ఆడదాని పని. కుటుంబరం పరిస్తితి ఈ వాటంతో వుంటే ఇంగ చెంగమ నాయుడు ఒంటిగోడు అవతాడంటే అవడా?

చెంగమ నాయుడికి దేముడి దర్మాన కయ్యాగాలవకు దిగులు లేదు. మంచి బాయి కింద నాలుగెకరాల సేద్యం వుండాది. కాలాలు మారిపోయ్ నాయి గదా. ఈ కాలం సేద్యం చేసుకొనే దానికి సొంతంగా పెరుకులాడే మనుసులు వుండాల్నేగాని సీటికి మాటికి కూలోళ్ళ సేద్యం రక్తికొచ్చునా? ఆయనకు ముప్పైయేండ్లుగా పెండ్లాం వుండినా, యింటికి యిల్లాలు దొంతికి కడవ అమరకుండా ఆయన పియ్యి ఆయన తింటా వుండాడు.

చెంగమ నాయుడు వొగిసులో సగానికి సగం వుండే మునికన్నడి మింద రెండు చేతులూ యేసి, "మల్లా నీతో అక్కర బడింది రా రే" అన్నాడు.

"నీ కాళ్ళు, నా చేతులు – చెప్పు సామీ, చెప్పు" అన్నాడు మునికన్నడు నవ్వతా.

"నాకు మొలగొలుకుల మడి రెండెకరాల్లో వుండాది. కలుపుకొచ్చేసింది. నా కెవురూ కూలోళ్ళు పలకలా. మీ మడి కలుపుకొచ్చే దానికి యింగా నెలనాళ్ళ టయిం వుండలేదా? మీ అమ్మలు బిడ్లు అందురూ అయిదారు నాళ్ళు వచ్చినారంటే నేను గెండుకుంటాన్రా. నువ్వడిగితే ఆ ముప్పై గుంటల్లో కలుపు తీసినందుకు ఇన్నూర్రూపాయిలు దుడ్డు గూడ తీసుకో" అన్నాడు చెంగమ నాయుడు. మునికన్నడు ఈ మాటలకు నవ్వతానే, "మామా, కూలి ప్రస్తాపన యింగెత్తద్దు. నేను నీ మాట పకారమే నీ పని చేస్తా. నాకు నువ్వ వచ్చే పలితం ఒక్క నెల నీ ఎద్దుల్ని నాకియ్. బక్కెద్దలోడ్ని. యాపై గుంటల

సేద్యం ఆ ఎద్దల్తో జరగదు గదా. నువ్వు నాకు అడిగినప్పుడు ఎద్దుల సకాయం చేస్తే చాలు మామా!" అన్నాడు.

"నువ్వు గీసిన గీటు దాటను పోవాయ్" అనేసి ఒంటిగోడు కుశాలగా పూడ్సినాడు.

ఈ సంగతి మునికన్నడు యింట్లో చెప్పంగానే అమ్మా నాయిన యిద్దరూ ఈడెగిరి ఆడ దూకినారు.

"ఇంక నెల నాళ్ళల్లో మన పైరూ కలుపుకొస్తింది గదా – నా తెలివి జూడు, నెల గూడ పనిలా – వారం లోపలనే రావచ్చు. ఇంతలోనే ఎవురిదో ఎందుకు ఒప్పుకున్నావు? మొన్నంటే మడకల కోసరం అని చెప్పి పనులు చేస్తిమి. ఒరే, నీ దగ్గిరుండే సులువును కనుక్కున్నాడ్రా ఆ ఒంటిగోడు. ఆయన్నొచ్చి చీటికి మాటికి పనులకు పిలిచేదేందిరా? ఇచ్చిత్రంగా వుండాదే! ఇప్పుడు మాలా మాదిగోళ్ళు పన్లు లేక అల్లాడి పోతుండారనుకో. ఆ దుడ్డు వాళ్ళకిచ్చి పనులు జరిపించుకోగూడదో? మాలా మాదిగోళ్ళయితే, కలుపు తియ్యకుండా నీళ్ళల్లో చేతులుబెట్టి మురుకులు చేసేసి గెడ్డెక్కేస్తారు. మనమైతే పని బొటూగా జరిపిస్తాం గదా. అదీ, ఆయన్న అయిడీ!" అని మాట్లాడేసింది యెంగటమ్మ.

మునికన్నడు కొంచేపు చూసినాడు. మళ్ళ మెత్త మెత్తంగానే తిరుక్కున్నాడు.

"అది గాదమా, రేపు మనం మడి కోసేస్తే, మళ్ళ దాన్ని అడుసో, యెలిదుక్కో దున్నుకొనే మార్గమా? ఈ రోజు నీకు మూడు దినాలు కలుపు తీసే కష్టమే కనిపిస్తా వుండాదే, వచ్చే పలితం ఆ మామ ఎద్దుల్ని ఒక్క నెల మనం మన గాట్లోనే కట్టేసుకొని పని జరుపుకుంటాము. ఈ సంగతి నీకు తెలవడం లేదే!" అని మాట్లాడే కొందికి యెంగటమ్మ నోటికి బీగాలు పడిపొయ్నాయి.

"ఈ పొద్దుటికి నా పెద్ద కొడుకు చేత చెప్పించుకునేటట్టయి పొయ్యిందబ్బా నా బతుకు" అని నవ్వతా ఆవిలించేసింది.

ఆ రాత్రి అన్నాలు తిన్నాక ఏందో అర్తమైనోడి మాదిరిగా ఇలామంతు, "ఆ చెంగమ నాయుడికి మన పెద్దోడి మింద చూపు పడినట్టుగా వుండాది.

అందుకే పద్దానికి మన పెద్దోడ్నే ఆశిరిస్తా వుండాడు. కూతుర్నేమన్నా యిచ్చి, అల్లుడ్ని చేసుకుంటాడో ఏమో!" అన్నాడు.

ఈ మాటతో కుశాల పడిపోయిన యెంగటమ్మ, "నీ వాక్కెం బెమ్మోక్కెం కావాల్నే గాని, మనం కోరిన కొండ మింద వాన కురిసినట్టే గదా. అట్ట చెంగన్న సేద్యమూ మానోవరిగా గడిసి పూడిస్తింది, ఇట్ట మన బతుకూ గడిసి పూడిస్తింది. కయ్యాగాలవ గల్లోడికి అల్లుడిగాబొయ్యే బోగం వుండాదా మన మునికన్నడికి? అయ్యో అయ్యో, అది జరగాల్నే గాని, మళ్ళ మనకు దిగులేమి, బయమేమి? అటుమంటోళ్ళ ఆదారన మనకు జిక్కితే మనకేం తక్కువ? నాకేమో నమ్మకం లేదబ్బా. అది సరేలే, నేనే రోజూ కల్లో గూడ అనుకోలా – కరంటు వుండే యింట్లో మనం కాపరంగా సేద్యంగా వుంటా మని. ఈ రోజు వుండలేదా? ఆ శ్రీమన్నారాయణుడు అనుకోవాల్నేగాని ఆ పని జరిగేదెంత సేపు?" – ఆ ఒక్క మాటను పట్టుకొని ఇన్ని మాటలు మాట్లాడేసింది.

గమ్మున యిదంతా యింటా వుండిన మునికన్నడు, "చాలు చాల్లే. ఇంగ ఆ కతలన్నీ ఆడికి కట్టిపెట్టండి" అని మాత్రం అని పొనుకొనేసినాడు.

మూడంటే మూడు నాళ్ళల్లో చెంగమ నాయుడి పైరులో కలుపు తీసే పనిని ముగించేసినారు.

మళ్ళ నాలుగైదు నాళ్ళల్లో రెక్కార్చుకోంగానే రంగంపేటోళ్ళ పైరుకూడా కలుపుకొచ్చేసింది.

అది చిన్న కలుపు కాదు. ఎల్లాకొల్లిగా పడిపొయ్యింది.

ఆ కలుపును చూస్తా యెంగటమ్మ, "ఎట్ట సామీ, పైరేదో కలుపేదో తెలవకుండా పడిపొయ్యిందే! దీన్ని తియ్యబొయ్యేది ఎట్టరా పరమాత్మా!" అని దిగులు పడిపొయ్యింది.

"కష్టమైతే అయ్యిందిగాని, మన కెంతో లాబం గదమా, కలుపు ఎక్కువగా పడితే! కష్టానికి మించినట్టు గదా లాబం. పెరికిన కలుపు పెరికినట్టే – గెనిమల మింద పారెయ్యకుండా, బురదలోనే కాళ్ళతో పూడ్చి పెట్టేస్తామనుకో. అదంతా మురిగితే ఏమైనట్టు? ఈరీలు, లైట్రేట్లు ఏమి జెయ్యాల?

బ్రమ్మాండమైన సత్తవ గదా. దీని కలుపే దీని సత్తవ పో" అన్నాడు మునికన్నడు.

"అదే అనుకుంటా వుండాను నేను గూడా, కానీ పెరికితే గదరా కష్టం తెలిసేది" అనింది యెంగటమ్మ.

"ఇంతకు మించిన పనేముండాది మనకు?" అని మాటలు మాత్రం చెప్పేసినాడు ధర్మడు.

అయిదారు నాళ్ళు ఆ కలుపుతో పెరుకులాడే కొందికి పీనుగులు పీనుగులై పోయినారు అందురూ.

మునికన్నడు సందేళవితే, ముసిలోడి మాదిరిగా బోల పొనుకొని నాగరాణి చేత ఒళ్ళు తొక్కించుకునే వాడు. రాత్రిళ్ళలో నిద్ర అనేదిగాని పడితే. దీనికి తోడు, పొగులు పొద్దలగూకు నీళ్ళల్లో వుండిన పని గదా - అరికాళ్ళు అరిచేతులు తెగ దినేసినాయి. కర్రలు గీసక పొయ్ మోచేతులు మోకాళ్ళు అంతా మంటలు.

"రంగంపేటలో వుండినా యిదే బతుకు, మిట్టూరుకొచ్చినా యిదే బతుకై పాయ గదరా సామీ పరమాత్మా!" అనుకొనేసినారు నాగరాణితో సఖా అందురూ.

## 4

"కూలీనాలి బెట్టకుండా ఇరై నాలుగ్గంటలూ బూమమ్మకు రెక్కల కష్టం చేస్తే, ఈ మాత్రం పలితమన్నా!" వడ్ల రాశిని ఎదురు గుండా బెట్టుకొని అనింది యెంగటమ్మ.

ధర్మడు వేప మానెక్కి పిడికిడు వేపాకు పెరక్కొచ్చి, పొలిగోడ్ని జేసి వడ్లరాశి మింద గుచ్చినాడు. ఇటుమంటి పన్లు జెయ్యడంలో ధర్మడు బలే పెద్ద.

ఇరై నాలుగ్గంటలూ కసువు యాపారం జేస్తా తిరప్తిలోనే పొద్దు గడిపే గురప్ప నాయుడు గూడా ఆ సమియంలో కళ్ళంలోనే వుండినాడు. గురప్ప నాయుడికి మంచి బండి, అయిదు జానల దాకా వుండే ఎద్దులు వుండాయి.

సూళ్ళూరుపేట నుంచి, గూడూరు నుంచి యాపారస్తులు లారీలు లారీలుగా వరి కసువును తిరపతికి తోలకొస్తే, ఆ కసువును బండిలో యేసుకొని తిరపతిలో ఈది ఈదీ తిరిగి అమ్మతాడు. ఆయన ఆ యాపారస్తులకు మంచి నమ్మకస్తుడు. ఆయన్ను వాళ్ళు వదలరు. రెండు మూడు నెల్లయ్యింది ఆయన తిరపతికి పోయి. తిరపతి నుంచి రాంగానే కళ్ళాం దగ్గిరికి వచ్చినాడు.

"రంగంపేట నుంచి మమ్మల తొడకొస్తివి. ఈ ఊర్లో మమ్మల్నొదిలి తిరప్తికి పూడిస్తివి. ఏమిగా వుండారో, ఎట్టగా వుండారో అని తలిస్తివా, అన్నా? ఒకసారి నీ ఇంటికి బొయ్ కొడమండ్లు అడిగితే నీ పెండ్లాం లేదని టెంకాయ కొట్టినట్టు చెప్పేసింది" అనింది యెంగటమ్మ నవ్వతా.

గురప్ప నాయుడు ఒక కసువు పోచను ఎత్తుకొని అదే పనిగా తుంచతా, "దాని సంగతి నీకు తెలవదా చెల్లా? దాని మాటల్ను లెక్కలో యేసుకొని నన్ను అనేటట్టుగా వుంటే అను, ఇంటా. ఈ మిట్టూరు కొచ్చి కష్టం చేసుకుందురు రండి - అనే పిలిస్తిని నేను. నేను సంపాదించిన కుప్పల మింద కూర్చుని తిందురు రండి - అని పిలవ లేదే! నీకేం అమ్మీ, కొండల్ను పిండి జేసే కొడుకులుండారు. వాళ్ళ కష్టానికి పలితం జిక్కినన్నాళ్ళు నువ్వు నాకన్నా ఎక్కవే. నువ్వంత పెడితే నేను చెయ్యి చాపాల్సినోడ్నేగాని, నేను నీ చేతిలో అంత పెట్టే యోగ్గిత నాకు లేదు చెల్లా!" అని కడుపులో వుండింది దాంచుకోకుండా అనేసినాడు.

ఇంక గురప్ప నాయుడు మాటల్ను యేరే దోవకు మళ్ళించి, "ఇసిక రాలి పొయ్‌నట్టు రాలి పొయ్‌నాయి వడ్ల గింజలు. బాగ పండినట్టు గద బావా!" అన్నాడు.

ఇలామంతు నాయుడు వడ్ల రాశిని నిండు చెరువును చూసినట్టు చూసి, "ఎడ పిలకాయల కష్టం గదా, బూమమ్మకు ఆ మాత్రం తెలవదా?" అని, "డెబ్బై మూటలన్నా అవునా?" అనడిగినాడు.

గురప్ప నాయుడు నవ్వతా, "డెబ్బై మూటలకు డబ్బు కట్టేస్తా. ఈ రాశిని నాకు వొదిలేస్తావా? ఏంది బావా నువ్వు జెప్పేది, ఎనపై మూటలకు పైమాటే గాని, కింది మాటా?" అన్నాడు.

"ఎన్నన్నా గానీ, దేముడు బెట్టినన్ని!" అన్నాడు ఇలామంతు.

ఆ మరసనాడు అద్దాలామె వచ్చింది తిరప్తి నుంచి.

ఆమె చెప్పిన కుంచంతోనే ఇరై అయిదు మూటల వడ్ల గింజల్ను కొలిచి యిచ్చినాడు ఇలామంతు.

యెంగటమ్మ, "కుంచం పెద్దదొదినా!" అని గొణిగింది.

ఆ మాటలకు ఇలామంతు అడ్డం వచ్చి, "ఆ మకాతల్లి కయ్యను మనకు వారానికి ఇయ్యబట్టే గదా, మనం కష్టం జేసుకుని నాలుగ్గింజలు కండ్ల జూడగలిగినాము. నువ్వు నోరు మూసుకొని గమ్మునుండు. ఆమె యింకెంత పెద్ద కుంచం చూపించినా మనం దాంతో కొలిచి ఇయ్యాల్సిందే" అన్నాడు.

ఈ మాటలకు అద్దాలామె కుశాల పడి, "చాన్సు అంతా నీదే గద ఇలామంతన్నా! ఆ రోజు నన్నీరకం మాటలతోనే లొంగేసుకుని సలీసుగా గుత్త కొట్టేసినావు. నాకు ఫలితానికి నలపై మూటలిచ్చినా నీకేం పులుపులా. సడేలే, నా పేరు జెప్పుకొని బతుక్కో పొండి" అనింది దారాళంగా.

ఇలామంతు గూడా ఈ ఒక్క మాటకు పన్నెండు మాటలు మాట్లాడకుండా, "నీ పేరు జెప్పుకునే గదక్కా బతకతా వుండాం" అన్నాడు.

అద్దాలామె వారం కొలుచుకుని కులుకుగానే తిరపతికి పూడ్సింది. కయ్య గలిగినోళ్ళు చేసుకున్న పుణ్యమే అంత. ఇట్ట వుండే పుల్ల అట్ట యేసిన పాపాన పోయుండునా అద్దాలామె? ఆర్నెల్లు కాంగానే వచ్చింది, ఇరై అయిదు మూటల వడ్లగింజల్ను దొబ్బక పొయ్యింది. అద్దాలామె కులుకుగా పోతిందంటే పోదా?

"బండి కడతాను. మూటలకు పోసుకుని తోలకొచ్చేద్దారి, వడ్ల గింజల్ను" అన్నాడు గురప్ప నాయుడు.

ఈ మాటలకు మునికన్నడు ఒప్పుకోనేలా.

"గురవ బావా, మేం ఆశిదీరా ఆ వడ్లగింజిల్ని గంపల్తో మా యింటికి మోసుకుంటాం బావా, ఇంక బండెందుకు బావా, బండెందుకు? నాలుగు నాళ్లు పడితే పట్టనీ, మా అమ్మలం బిడ్లం పైనా కిందా పడతా ఆ వడ్లను

గంపల్తో తెచ్చి మా నట్టింట్లో పోసుకుంటాం. మాకు పట్టిన దరిద్దరం ఆ మహాలచ్చిం మోతతో ఈడేరి పోవాల బావా!" అన్నాడు.

ఈ మాటలకు గురప్ప నాయుడు యిచ్చిత్ర పోతా చెల్లికల్లా జూసి, "అమ్మీ, ఈ నాయాలు ఈ కాలం మనిసిగా లేడు. ఈడెపుడో మన తాతలకు తాతగా వుండాడు. పాత కాలం నాయాలు, అన్నీ పాత కాలం బుద్దులు, పాత కాలపు మాటలు" అని నవ్వినాడు.

ధర్మడు మాత్రం గస పోసుకుంటా తగరారుకు దిగి, "యాపై అరై మూటల వడ్లను ఎపుడు మోసేది? బండయితే నాలుగు బండ్లుగా తోలక పోవచ్చు. ఎందుకూరికే అనావశింగా కష్టం? మనం పోదాం పద బావా, బండి కట్టుకోని వద్దారి" అని కూచ్చున్నాడు.

ఈ మాటే యెంగటమ్మకు గూడా నచ్చింది. "అవున్రే పెదబ్బా, ఎందుకురే వూరికే నడుములు నెప్పులు బుట్టేటట్టు మోసేది? బండి బాట లేకనో, బండీ ఎద్దుల్ను ఎవుర్నిబొయ్ అడగతాములే – అనుకుంటే అన్నా ఎట్టన్నా ఆయ. బస్సుబాట వున్నట్టు బండి బాట వుండాది, గురవ బావ ఎద్దులూ బండీ వుండాయి. ఎందుకు అనావశింగా గాశి బెట్టుకునేది? నాయినా, నీ అమ్మా నాయిన నీ మాదిరిగా మైనీరు పిలగోళ్ళు కాదు నాయినా! తలలు నెరిసిపొయ్ నడుము లిరిగిపొయ్ వుండాము. అది గూడ గుర్తు బెట్టుకో, నీతో గూడ మమ్మల్ను ఆడిపించొద్దు" అనింది యెంగటమ్మ తమాస తమాసగానే.

కడకు ఎద్దల బండితోనే వడ్లను తోలక పొయ్నారు.

ఇలామంతు నాయుడి నట్టింట దీపం మలగతా వుంటే దాని కింద పచ్చంగా చేరిపొయ్ వుండాది వడ్లరాశి.

ఆ వడ్ల రాశిని చూస్తా, పైగుడ్డను ఇదిలించుకుని, "ఒట్టి మంచి నీళ్ళలో ఎత్తక పొయ్ నాటినాం పైరును. ఎరువుల జోలికి పోలేక ఒక్క మూట ఈరీనన్నా ఇదిలించినామా? మూడు మూటల ఈరీనిగాని కలుపు తీస్తానే యేసుంటే, మనం కోరినన్ని వడ్లు అయ్యుండవా?" అన్నాడు మునికన్నమ నాయుడు.

మునికన్నడు ఈ రకంతో మాట్లాడతా వుంటే ధర్మా నాయుడు, "బండిలోకి మూటలెత్తి యేసే కొందికే గూళ్ళతో గూడా నెప్పిగా వుండాదనుకో. వాటినన్నిట్నీ గాని గంపల్తో మోసుంటే నాలుగు నాళ్ళు ఎవురూ పైకి లేచుండరు" అన్నాడు యెనిక్కి వాలి ఈపును బట్టుకోని.

మునికన్నడు మాట వరసకు తమ్ముడికల్లా రోతగా జూసి, "వీడయితే వొట్టి చావు నాయాలుగా వుండాడు. ఏమమా, కళ్ళాంలో యిప్పుడు యింగ యిన్ని వొడ్లుండి నాయనుకో, మొయ్యలేమని చెప్పి వొదిలేస్తామా, అమా! కండ్లకద్దుకోని గంపల్తో మొయ్యమా? అంతకు మించిన ఆఫీసు పనా, మనకు?" అన్నాడు.

"నువ్వు బోరా ముసిల్నా కొడకా!" అని చిన్న కొడుకుని చంక నేసుకొని వూళ్ళోకి పొయ్యింది యెంగటమ్మ.

ఇంట్లో గింజ వచ్చి చేరినాక వాళ్ళు ఇన్నాళ్ళు చేసిన అప్పును తీర్చెయ్యాలను కున్నారు.

రంగంపేట నుంచి వాళ్ళు మిట్టూరుకు కట్టుగుడ్డలతో, బక్కెద్దులతో గదా వచ్చినారు. అప్పట్నుంచి యిప్పటికి ఎంతయి వుంటింది గింజి కర్చు? ఏమన్నా చిన్న కాపరమా? అందునా యెంగటమ్మ దండి మనిసి. పిలకాయిలకు పెట్టటంలో, పొయ్యటంలో ఆమెకి చెయ్యి పెద్దది. పిలకాయిలకు బూములు బావులు పంచి యియ్యలేక పొయ్‌నా కనీసం వాళ్ళ కాళ్ళ మింద వాళ్ళు నిలబడుకునేటట్లు పెద్దోళ్ళనన్నా చెయ్యాల గదా.

రంగంపేటలో వాళ్ళ కాపరం అంతా అంగిడి బియ్యం, తంగేడు కట్టెగా సాగిందే.

మిట్టూరుకు వస్తా వస్తా మానిడు గింజిల్ను కుండలో పోసుకొని రాగలిగినారా అంటే, లేదే! మ్మరే, అప్పట్నించి యిప్పటికి పన్నెండు మూటల వడ్ల గింజలన్నా చలవ అయ్యుండవా? గురప్ప నాయుడు తిరపతిలో వడ్ల యాపారస్తుడి చేత, నోటి మాట మింద వడ్ల గింజల్ని అప్పు తీసిచ్చినాడు. మాట మింద నిలబడి ఆ యాపారస్తుడికి చెల్లుబాటు చెయ్యద్దా!

గురప్ప నాయుడు తల గీరుకుంటా ఇలామంతు గడప తొక్కినాడు.

"తలకాయ గీరుకోవద్దులే, మేమేం మరిచి పోలేదుగాని" అన్నాడు ఇలామంతు.

"రేపు బండిదోలుకొని తిరప్తి పోతుండాను, రేపు కొలత కానిచ్చెయ్యండి" అన్నాడు గురప్ప. పన్నెండు మూటలు ఆ వాటంతో పొయ్‌నాయి. ఇర్రై అయిదు మూటలూ వారానికి పోంగా, ఈ పన్నెండు మూటలు ఈ రకంతో పోంగా – యింక నలపై మూటలు మిగిల్నాయి.

ఇర్రై అయిదు గోతాలను సంపాదిచ్చి ఆ గోతాలల్లో వడ్లను పోసేసి, ఇంటి వాడికకని నెట్టుకట్టి పెట్టేసినారు. ఆ ఇర్రై అయిదు మూటలు ఎంత దారాళంగా తిని తాగినా పదీ పన్నెండు నెలలు రాకుండా పోవు.

మిగిలిన పద్దైదు మూటల్నూ యాపారస్తుడ్ని పిల్చి కొలిచేసినారు.

నూట మూప్పై పద్దైదులు – చేతిలో పడినాయి.

ఆ రూపాయిలను కండ్ల జూడంగానే యెంగటమ్మకు ఒక పిచ్చి పట్టుకొనింది.

"ఎందుకీ రూపాయల్ను చిల్లాకులు పల్లాకులు చేసేది? దేని మిందన్నా పెడితే సొత్తుగా పడుంటింది గదా" అనిందామె.

ఇలామంతు నాయుడు ముందూ యెనకా సూడకుండా, "ఎప్పుడే అక్కరొస్తిందో! ఇన్నాళ్ళూ పది రూపాయిలు చేతిలో పెట్టుకోకుండా బతికినాము. ఇంగన్నా నాలుగు రూకలు చేతిలో పెట్టుకుని బతకనియ్యేమి?" అన్నాడు పెళ్ళాంతో నిష్ఠూరంగా.

"అప్పటికి నువ్వు బతికిచ్చేటోడివి, నేను చెడిపేసే దాన్నీనా? ఏందే నువ్వు మాట్లాడేది?" అని యెంగటమ్మ తకరారుకు దిగి లగుడ్సుకొనింది.

చెయ్యాలనుకున్న పనికి అడ్డమొస్తుండాడు గదా అనే అక్కసుతో, "నీ మొకాన అగ్గిబెట్ట, దరిద్రుడా! నిన్ను కట్టుకోని ముప్పైయ్యేండ్లు కావస్తా వుండాది. పద్మూడేండ్ల ప్రాయంలో నీ ఎదాన తోసినారు నన్ను. ఏ పొద్దన్నా ఈ సంసారం సంసారంగా రక్తి గట్టిందా! నా పిలకాయిలు పెద్దోళ్ళయినాక ఈ మాత్రం జరగతా వుండాది. నువ్వు పుట్టు దరిద్రుడివి గదా మంచి పనికి ఏ పొద్దూ నువ్వు ముగసవే!" అని మొగుడితో తగలాటం పెట్టుకొనింది.

అమ్మా, నాయిన తమాస తమాసగానే తగరారుకు దిగతారని బయిపడిన మునికన్నడు, "ఏమమా, ఈ దుడ్డుతో ఏం పని చేద్దామనమా, నీ అయిడీ?" అనడిగినాడు.

"పెదబ్బా, సంసారమన్నాక పిల్లా మేక, గొడ్డూ గోదా వుండాల్నా వొద్దా, రా? సేద్యంలోనే మిగలబెట్టి ఎవురూ పెద్దోళ్ళయి పోరు. పాడీ పంటా అంటారు పెద్దోళ్ళు. దేముడి ధర్మాన పంట కలిగింది. ఈ సారి యాపై గుంటల్లో వరి కసువు అయింది గదా. ఆ కసువునంతా ఈ బక్కెద్దులే తినెయ్యబోతాయా? యాడన్నా చూసి ఒక మంచి పాల గొడ్డుగా పట్టుకుంటే – దాన్నేమి మనం పగ్గంబట్టి మేపబొయ్యేది? వరి కసువు తిని, అన్ని కడుగు నీళ్ళు తాగితే పాలిస్తింది, చిల్లర మల్లర కర్సులు ఏగేసేస్తింది. అదిరా నా ఆశి" అనింది యెంగటమ్మ.

మునికన్నడు అమ్మకే సపోరటగా నిలబడి, "రెండు వేల రూపాయిలు యింట్లో పెట్టుకుంటే అది మనకు తెలవకుండానే అట్టా యిట్టా చలవై పూడిస్తింది. అమ్మ జెప్పినట్టు ఒక గొడ్డును పట్టుకుంటేనే మనకు ఆదాయికం" అన్నాడు.

ఇటుమంటి బుద్ధి మాటలు మాట్లాడే పనికన్నా ఇంతకు మించిన పని మనకే ముండాదన్నట్టు వాళ్ళు అదే మాటల్లో మునిగిపొయ్‌నారు.

"పెదబ్బా, ఆ తిక్కలెదవతో నీకేం పనిగాని, నువ్వు తిరపతికి బొయ్ మీ గురవ బావను గెట్టంగా పట్టు. గురవ బావ తిరప్తిలో వరి కసువు యాపారం గదా చేస్తుండాడు. ఆయనకు తెలిసుంటాయి ఎనపగొడ్ల పట్టిడుపులు. కసువు కొని మేపలేక తిరప్తిలో ఎంతోమంది గొడ్లను కూట్నీళ్ళకు దార బోసేస్తా వుంటారు. గురవ బావ అయితే ఎనప గొడ్డును సలీసుగా పట్టిస్తాడు" అనింది యెంగటమ్మ.

"అమ్మాగొడుకు ఒకటైపొయ్‌నాక యింగ నాదేముండాది. మీ యబ్బతోడు, మీ దోవన్నే నేనూ వస్తా పదండి" అనేసినాడు ఇలామంతు నాయుడు.

"మా దోవన నువ్వు నడవక పోతే నీకు సంగటి యాడిది సేయ్" అనింది మొగుడితో యెంగటమ్మ యాసండంగా.

మునికన్నడు తావకాశింగా ఆలోసినలు జేసి, "అమామే, ఈ కాలం ఎనుముల్ను ఎవురు పడతా వుండారమా? ఎనుముల వల్ల ఏమి లాబం జెప్పు? అవి సరిగ్గా కట్టవు, ఈనవు, జెర్సీ ఆవులైతే సమ్మచ్చరం దూడే గదా. మనం అడిగినన్ని పాలిస్తాయే! ఒక మంచి ఆవుగా చూసి పట్టుకుంటే చిన్న సంసారాన్ని ఎలనీదెయ్యొచ్చు. ఆవైతే ఈనేదాకా రేటేళా, మాటేళా పాలిస్తాది. మంచి పాలావైతే రేటేళా, మాటేళా నాలుగు లీటర్లు మొత్తం ఎనిమిది లీటర్లు గదమా, జెర్సీ ఆవు మింద రెండు మూడేలు పెట్టినా మనకు పులుపు లేదే" అన్నాడు.

యెంగటమ్మ కొడుకు చేత ఆ మాటా ఈ మాటా యింగా యింగా మాట్లాడి పిచ్చాలని, "నువ్వు కొండకు నిచ్చెన్లు యేస్తా వుండావు రే, పెదబ్బా. జెర్సీ ఆవును మనం మేపలేమురా సామీ, వాటికి పిండీ తవుడు యాడ నుంచి తెచ్చి యేసేది? ఒక చిన్న పడ్డ ఎనుమైతే దరా సలీసుగా వుంటింది. మనకు అణకవగానూ వుంటింది. ఇదబ్బా నా మాట" అనింది.

కొడుకు జెర్సీ ఆవు మాటెత్తినాక యెంగటమ్మకు ఎనుము ఆలోసినే పొయ్యింది. అయినా ఆ రీతిగా మాట్లాడింది.

"జెర్సీ ఆవును మేపేది బొయ్ పెద్ద బ్రమ్మాండమా అమా? ఏమీలా, మనం బాయికాడ ఒక్క గుంట నేలను గవుర్మెట్టు కసువు మొక్కలు నాటేస్తాం. రెండు కుంచాల ఈరీని చల్లేసినామంటే కసువు బొసబొసమని పెరిగి పోతింది. రోజూ ఒక వాది కోసకొచ్చి దాని ముందర యేసేస్తే దాని పంగ అంతటితో అయిపాయ. అంతేమిటికి ఈ వూళ్లో జూడేమి, డెబ్బై యిండ్లుండే ఈ వూళ్ళోనే పది దాకా జెర్సీవి వుండాయంటే తెలుసుకో. వాటి మోపన సంసారాలు నెగ్గకొచ్చేవోళ్ళు ఎంత మంది లేరు?" అన్నాడు మునికన్నడు.

"అయితే జెర్సీ ఆవునే పడదామంటావా?" అనింది యెంగటమ్మ కుశాలతో గస పోసుకుంటా.

"అంతగాక!" అన్నాడు మునికన్నడు నవ్వతా.

"రేపేనా నీ పయానం, తిరప్తికి?" అనడిగింది వాళ్లమ్మ.

"ఏ పొద్దనుకున్న పని ఆ పొద్దేనా?" అని అమ్మ ఎప్పుడూ అనే మాటను తిరగ జెప్పినాడు మునికన్నడు.

“ఇంక ఆలిశ్యం దేనికిరా?” అన్నాడు ఇలామంతునాయుడు.

“వుండండి. రేపు కసువు మోపులు గట్టాల. వామెయ్యాల. అప్పుడు గదా మనకు తీరికి! ఆయాళ దాకా తొందరేమిటికి?” అన్నాడు మునికన్నడు.

ఆ మరుసనాడు యింట్లో ఎంత మంది వుంటే అంత మందీ కసువు కళ్ళం దగ్గిరికి వచ్చి కసువును మోపులు కట్టినారు.

కసువు వామి వెయ్యడంలో మునికన్నడు బలే మొగలాయి. పెద పెద్దోళ్ళు కూడా అంత తీరుగా వామి యెయ్యలేరు. రంగంపేటలో సగానికి సగం వాములు మునికన్నడు వేసినాటివే. వామి వేసే కాలంలో రంగంపేటలో మునికన్నడికి బలే గిరాకీగా వుండేది.

అద్దాలామె బాయి దగ్గిరనే వామి వేసినారు. యాపై గుంటల్లో కసువు గదా వామి ఒక రకంగానే పడింది. పొట్టి రకాలు గాబట్టి ఆ మాత్రం. అదే మొలగొలుకులో, బుచ్చిరెడ్డి పాలెమో, మస్సూరానో అయ్యుంటే - ఆ వామికల్లా చూసి తలగుడ్డను కింద పడేసుకోవాల్సిందే. సందేళకు వామి పని పూర్తయి పూడ్సింది.

ఆ రాత్రి యెంగటమ్మ రెండు కుంచాలేమో వడ్లు కొలిచి డజను కోడిగుడ్లను తెచ్చింది అంగిట్లో నుంచి. వుడకబెట్టి పులుసును చేసింది. నూరి పెట్టిన చారు బెట్టింది.

పిలకాయిల్నందర్నీ కూచ్చునబెట్టి కోడిగుడ్ల కూర యేస్తావుంటే ఆ మకాతల్లికి కుశాలతో ఏనుగునెక్కినంత పనయ్యింది.

“కోడిగుడ్లకు దుడ్డు యాడిదమా?” అనడిగినాడు మునికన్నడు గుడ్డు తింటా.

“నా చేతిలో రూక యాడుండింది. వడ్లు కొలిచి గదా తెచ్చినాను” అనింది యెంగటమ్మ.

మునికన్నడు నవ్వతానే “నువ్వు ఉప్పు చేపలకు, కోడిగుడ్లకు వడ్లగింజ ల్నెయ్యబాక. నలపై పైసాలతో పొయ్యే రూకకు, మానెడు వడ్లగింజలు గదా. అయిన కాడికి మద్యానంగా చెయ్యకు తల్లా!” అన్నాడు.

ఈ మాటలకు యెంగటమ్మ కులుకుగా పకపకా నవ్వి, “మెట్టుతో మూతికి బట్టి కొట్టరా కుళ్ళు యెదవును. వీడంత కుళ్ళు నా బట్ట యాడా వుండద్రా సామీ” అనింది మునికన్నడి కల్లా చెయ్యి చూపించి.

కోడిగుడ్లకే ముక్కులు చీదుకుంటా అన్నాలు తింటా వుండిన చిన్న కొడుకూ కూతుర్తో గూడ అందురూ నవ్వులాడుకున్నారు.

అన్నాలు తినేసి, అప్పటికే ఎండా కాలం పెట్టేసినందు వల్ల అందురూ బయటనే పొనుకున్నారు. యెన్నిల పాలాల కాస్తా వుండాది.

ఇలామంతు నాయుడు గమ్మన పొనుకోకుండా లోడినాడు.

“ఒరే పెద్దోడా! రంగంపేట నుంచి మిట్టూరుకు వచ్చిన కాడ నుంచి అంతా లెక్కెయ్‌రా. కయ్యను గుత్తకు దీసుకోని మనం ఏమి వారుకున్నామో తేలిపోతింది” అని గెలిమినాడాయన.

మునికన్నడు పొనుకున్నోడల్లా పైకి లేచి కూచ్చోని, “కోమిటాయనా, గమ్మన పొనుకుంటావా, ఏమి జెప్తావు” అన్నాడు తమాసకు.

“లెక్క లెక్క అని కలవరిస్తా వుండాడు. అన్ని లెక్కలూ యెయ్యేమిరా” అనింది యెంగటమ్మ.

ఆ సమియంలో ధర్మడు ఆడ లేడు. ధర్మడు రంగంపేటలో వుండిన కాడ నుంచే రాత్రి పూట యింటి దగ్గిర పొనుకునే అలవాటే లేదు. మిట్టూరులోకి వచ్చిన రోజే, వాడు సావాసుకోపులను సంపాదించుకుని, ఆరాత్రే యాడనో పొయ్ పొనుకున్నాడు. బాడిగ సైకిలు దీసుకుని తిరప్తికో, కట్టకింద యెంగటాపురం టెంటుకో – కిష్టా డిష్కుం డిష్కుం సినిమాకు పూడ్సుంటాడు. ఇంటి ముందర పొనుకుంటే సినిమాలు చూడలేము గదా.

మునికన్నడికి గూడ అంత సందలగూకనే నిద్దర పట్టక “సరే లెక్కలేద్దాం, పట్టండా!” అని మళ్ళా పొనుకున్నాడు.

“ఆ యాపై గుంటలు అడుసు చేసే దానికి ఎన్ని మడకలైనాయి? ఎట్ట లేదన్నా ఇరై ఇరై అయిదు మడకలై యుండును గదా. ఈ రోజు బాడిక్కి పోతే నడవలూరు రెడ్లు మడక్కు ఎంతిస్తుండారు? పదైదు రూపాయి

లిస్తుండారు. ఇరై అయిదు పదైదుల ఏమైనట్టు?" అన్నాడు ఇలామంతు, లెక్కలకు మునం ఏర్పరిచి.

"ఇరై అయిదు పదుల ఇన్నూటా యాపై, ఇరై అయిదు అయిదుల నూట ఇరై అయిదు. అంతా గలిసి యెచ్చూ తక్కవగా నన్నూర్రూపాయిలెయ్" అనింది యెంగటమ్మ.

"లెక్కెయ్, ఇత్తనాల వడ్లకు ఒక మూటకు ఏమైనట్లు? నూటిరై అయిదు గాలా. అదీ యిదీ అంతా ఎంతాయ? అయిదు నూర్లుగాలా, కయ్యను అడుసు చేసి యిత్తనాల వడ్లను చల్లే కాడికి అయిదు నూర్లు కర్జు" అన్నాడు ఇలామంతు.

"పైరు నాటకానికి కూలోళ్ళకు ఇన్నూర్రూపాయిలు చెక్కుగా యిచ్చినామే. ఆరోజు కూలోళ్ళ సంగటి కర్చు కనాగష్టం యాపై రూపాయిలే పెట్టుకో. ఆ అయిదు నూర్లు ఈ ఇన్నూరు – ఏడ్నూర్లు" అన్నాడు ఇలామంతునాయుడే.

ఈ లెక్కలిని మునికన్నమ నాయుడు పొడుగ్గా గాలి పీల్చినాడు.

అది వినిన ఇలామంతు నాయుడు, "ఇంతలేకే ఏమయిందిరా నా పెద్ద కొడకా. ఆ పైరులో పడిన కలుపును తియ్యడానికి ఎంత మంది కూలోళ్ళయి వుంటే? ముప్పై మంది పట్టివుండరా? అది మనమే తీసినామనుకో. అది యేరే సంగతి, ఆ రెక్కల కష్టం ఇన్నూర్రూపాయిలుండవా? ఏడు నూర్లు, ఇన్నూరు తొమ్మిది నూర్లుగాలా. కరంటు శార్జీ ఎంత? మీటరు మింద ఈనిట్టు కింత అని కట్టుంటే కిల్లా మునిగి పొయ్యుందుము. ఇప్పుడుండే పద్దతి పకారం కట్టబట్టే నెలకు ముప్పై నలపై కాలా. అయిదు నెల్లకు ఇన్నూరు గదా. తొమ్మిది, ఒక రెండూ – పదకొండు నూర్లు ఇప్పటికి" అని లెక్కేసినాడు.

ఇదంతా ఇంటా వుంటే మునికన్నడికే బిత్తరగా వుండాది.

"వుండుండు వుండేదంతా ఇంకనే గదా. యాపై గుంటల కయ్యను కోసి, పనగొట్టాలంటే మాలోళ్ళు గాని, మాదిగోళ్ళు గాని అయ్యుంటే ఎంత అడిగుంటారు? పైరు ఐబ్రీడు, పొట్టి రకం, పన సరిగ్గా చేతికందదు, చస్తాం కొట్టలేక – అని గుంటకు ఇరై అడిగుండరా? పోనీ పదైదు రూపాయిలకు

తక్కువ ఏ నీ కొడుకు అడిగుంటాడు? పద్దైదు యాపైల లెక్కెయ్ ఎంతయ్యింది. మ్ – ఏడ్నూర్లు గాలేదంటరా? పదకొండు నూర్లు, ఏడునూర్లూ – పజ్జెనిమిది నూర్లు. ఎక్కడ ఏం జారిపొయ్యిందో, లెక్కగా రెండు యేలకు యేసుకో. ఏమి, లెక్క యాడన్నా పొరబాటుగా వుండాదా? అంతా తెల్ల కాతికం మింద నల్లచ్చిరాలున్నట్టు ఇలావరిగా వుండాదా లేదా?" అన్నాడు ఇలామంతు నాయుడు.

అచ్చులు పచ్చులు ఆలకించేటట్టు అందరి రైతులు మాదిరిగానే తమాసకు లెక్కలేస్తా వుండిన ఇలామంతు నాయుడు యింగా, "సరే, ఈ రెండేలూ పక్కన బెట్టు. మనం వారం ఎంతిచ్చినాము మునికన్నమ నాయుడా? ఇరై అయిదు మూటలు కొలిచిన మాట అపద్దమా తండిరీ? నూట ముప్పై ఇరై అయిదుల దగ్గిర దగ్గిర మూడున్నర యేలు గాలా. అదీ మన కష్టమే. మన కష్టం వల్లానే గదా ఆ ఇరై అయిదు మూటలూ పండినాయి. దొంగలొచ్చి కష్టం చేసేసి పోలేదు గదా. ఆ రెండేలు ఈ మూడున్నరా అంతా కలుపుకుంటే అయిదున్నర గాలా. ఇంకబోతే, కయ్యను వారం జేసేదానికి మన కుటుంబరానికి గింజి కర్చు ఎంతయ్యింది? పన్నెండు మూటలు చప్పరించి పారేసినాము గదా. ఆ వారపు కయ్యిలో పని ఎక్కువబడే కొందికి ఒక్కొక్కరం మూడు ముద్దల లెక్కన వూది పారేసినామే. ఆ పన్నెండు వడ్ల మూటల్నూ డబ్బులోకి మార్చు. ఒకటిన్నర యేలనుకో. అయిదున్నర ఒక ఒగిటిన్నర, ఏడేలు మొత్తం మింద. ఇదంతా పైపైన లెక్కేస్తే, దినామూ తెల్లారి నిద్దర లేస్తేనే పైరు మొకం జూసి నాలుగు నెల్లపాటు మిసినీ యేసి మడికి నీళ్ళు పారగట్టినాము. ఆ కూలి దీంట్లో లెక్కేసినామా? ఇప్పుడు ఆ కయ్య పైరు చేసినందువల్ల మనకు ఈనాటికి మిగిలిందేంది? ఇరై అయిదు మూటల వడ్లు తిండి కర్చుకు పెట్టుకున్నాము. పద్దైదు మూటల్ను రెండు వేలకు యాపారస్తుడికి కొలిచినాము. ఆ నెట్టుకట్టి పెట్టిన వడ్ల ధర మూడేలు. మొత్తం మనకొచ్చింది అయిదువేలు. ఏమి నాయినా మునికన్నమా? మన రెక్కల కష్టం ఏడేలు, మనకు గిట్టుబాటు కలిగింది అయి దేలు. మనకు రెండేలు నష్టం, ఈ ఆర్నెల్లలోకి!" అని తేల్చినాడు.

"యాడ నేర్చినావు నాయినా నువ్వీ లెక్కలన్నీ?" అని అన్నాడు మునికన్నడు నవ్వుతా ఎగతాళికి.

"ఈ లెక్కలన్నీ నేను పెద కాలోజిలో నేర్చినాన్లే. నువ్వీ ఎగతాళి ఆడికి కట్టిపెట్టు" అని యాసండం పడినాడు ఇలామంతు. "అంతా ఎదురుంగా కనబడతా వుంటే లెక్కలంట లెక్కలు" అనన్నాడు మళ్ళా.

మొగుడి లెక్కలకు కడుపు అట్టనే కాలి పోయింది యెంగటమ్మకు.

ఆమె అక్కుసుగా, "యింగ జాల్లే. రెండూ రెండు చేతల్తో మూసుకోని పొనుకో. బొక్క తెరిస్తే ఒప్పుకొనేది లా. బలే జూసిందిది లెక్కలు. కయ్యల్లో ఏరిగిందానికి ఎంతేసినావు లెక్క? ఈరోజు యింట్లో ఇరై అయిదు మూటల వడ్లు వుండాయా లేవా? ఎదురు గుండా అన్ని వడ్ల గింజల్ను పుట్టి బుద్దెరిగినాక చూసినావా నువ్వు? బలే లెక్కలేసింది, ఈ దొంగ మొకంది!" అని కాసుకు గాకుండా మాట్లాడేసింది. ఇలామంతు గుత్తను కూడా రెక్కల కష్టంలో కలిపెయ్యడంతో లెక్క కొంచెం తప్పిన సంగతి అమ్మా కొడుకులకు తెల్దా! "నువు బోయే నియ్యమ్మా జిప్పిరి నాయాలీ ముండా. వున్న మాటంటే వూరికి పగ గాని. ఈ లెక్కలు లోకానికి యిచ్చిత్రం అన్నట్టు మాట్లాడతుండావే. తమాస తమాసగా లెక్కలేస్తే యిది తేలింది. తప్పుంటే అడుగా!" అన్నాడు ఇలామంతు.

ఈ సందులో మునికన్నడు పైకిలేచి, గొంతు కూచ్చొని, "నాయినా! మనం లెక్కలేసుకుంటే మనకు రెండేల రూపాయిల నష్టం వచ్చింది గదా. ఆ లెక్కన అద్దాలామె లెక్కలేస్తే....? ఆమె నష్టం దగ్గర మన నష్టం ఎంత నాయినా?" అన్నాడు.

యెంగటమ్మ ఇచ్చిత్ర పోయి, "అద్దాలామెకు ఏమి నష్టం రా? అది కాళ్ళు జాపేసి తిరప్తిలో కుచ్చుంటే, మనం దాని కాళ్ళ దగ్గిర ఇరై అయిదు మూటల వడ్లగింజల్ని రాశి పోసితిమే! ఆమెకేమి నష్టంరా పెదబ్బా? లాబమంతా ఆమెకే గదరా?" అనింది.

"అమా, అన్నీ లెక్కలేస్తా వుంటే అంతా యింతే. అద్దాలామె చేసుకోలేక గదా మనకు కయ్యను గుత్తకిచ్చింది. చేసుకోలేని కయ్య మన కేమిటికని ఆమె మనకు వారానికియ్యకుండా, ఆ కయ్యనంతా బేరానికి పెట్టిందనుకో. ఆ కయ్యను దొంగ చేతిలో పెట్టినా గుంటకు రెండు యేలు లెక్కన యాపై గుంటలకు లచ్చ రూపాయలు ఇయ్యరా? ఆ లచ్చిని అద్దాలామె తిరప్తిలో

బాంకీలో యేసిందనుకో. మన రైతులం సొసైటీలో నుంచి లోను తీసుకుంటేనే వడ్డీ ఏమాయ? నూటికి తొంబై నయాపైసలు గదా. ఇంక బేంకీవోళ్ళు నూటికి రూపాయే వడ్డీ యిచ్చినా నెలకు లచ్చికి ఎంత? ఆ లెక్కన ఈ ఆర్నెల్లలో అద్దాలామెకు వడ్డీ మింద ఎంత వచ్చుండును? ఆర్నెల్లకు ఇరై అయిదు మూటల వడ్లు ఎంతా ఎంత? మహా అవితే మూడేలు. మనకు సేద్యం మింద కలవరం వుండినట్టు, అద్దాలామెకు బూమ్మింద కలవరం వుండాది. ఆ కాడికి కుశాల పడు. సేద్యం చేసి ఏమీ లాబదాయకం లేదని అద్దాలామె కయ్య అమ్మేసుంటే? మనకీ బోగం వుండునా? అందుకని యింగ లెక్కలు కట్టిపెట్టి గమ్మన పొనుకోండి" అనేసి మునికన్నడు నిద్రకు పొనుకునేసినాడు మళ్ళా.

ఆ తెల్లారి మునికన్నడు రూకలెత్తుకొని – గురవ బావను కలుసుకొని, యాడన్నా ఒక జెర్సీ ఆవును పట్టుకొని వద్దామని తిరప్తికి ఎలబారినాడు.

మునికన్నడు తిరప్తికి పయానం అవతా వుంటే, ధర్మడు, "ఏమిరా అనా! నువ్వేనా ఆవులు బట్టే పెద్ద. మేం గూడ పట్టక రాగలగతామురా అబ్బా!" అని తగులుకున్నాడు.

మునికన్నడు ఆ మాటతో గూడా, పంచ పైకెత్తి డాయరు జేబీలో నుంచి పళపళమంటా వుండిన పది రూపాయిల కాతికాన్ని, అయిదు రూపాయిల కాతికాన్ని ఎత్తి ధర్మడి చేతిలో బెట్టి, "తిరప్తికి బో. వరసగా మూడు సినిమాలు చూసి రాకుండా మద్యానం యాడన్నా మంచి మటన బోజనం చెయ్. కడుపుకు తింటే సుకంగాని, ఆ ఇకారపు సినిమాలు ఎందుకురా చూస్తావు?" అన్నాడు. ధర్మడు అదే పదైదు వేలనుకొని, సబ్బుతో ఒకటికి పదైదు మాట్లు మొకం కడిగి తిరప్తికి ఎలబారే దానికి పెళ్ళోకి బొయ్‌నాడు.

పెద కొడుకుతో కూడా ఆ మాటా ఈ మాటా మాట్లాడతా బస్సులు తిరిగే రోడ్డు బాట దాకా వచ్చింది యెంగటమ్మ.

"ఆవు లేతదిగా, అణకవగా వుండాల, బొదప బొదపగా ఏనుగు మాదిర్తో వుండగూడదు. ఇంటి ముందర కట్టేస్తే మకలచ్చిం మాదిరిగా అందగించాల. లోపొదుగుతో వుండాల ఆవు. మంచి జాతావుగా చూడు నాయినా. తిరప్తిలో

మోసపు నా బట్టలు జాస్తి. లొంగద్దు. మీ గ౦రవ బావ వుండాడులే” అని యెచ్చరికలు జెప్పి కొడుకును బస్సెక్కించి యింటికొచ్చింది.

## 5

జెర్సీ ఆవు యింటికొచ్చిన యేళా యిసోసం నాగరాణి ఋజువై పూడ్సింది. ఇరై ఇరై అయిదు నాళ్ళల్లో ఈనబొయ్యే జెర్సీ ఆవును గాట్లో కట్టేసి యింట్లేకి వచ్చినాడో లేదో యెంగటమ్మ మునికన్నడితో, “పెదబ్బా, మన పెద్దమ్మి పెద్ద మనిసయ్యిందిరా. కొత్త కర్చు ఒగటొచ్చి నెత్తిన పడిందిరా నాయినా!” అనింది.

మునికన్నడు చెల్లి మింద వుండే దీంతో, “మకలచ్చిమి పెద్ద మని సయ్యిందా? నా తిరమలకొండ పెద్ద మనిసయ్యిందా!” అంటా నవ్వతా – కాళ్ళూ జేతులు కడుక్కొని తిండికి కూచ్చున్నాడు మునికన్నడు. వాళ్ళమ్మ లోటాలో నీళ్ళు తెచ్చి పెట్టింది.

నాగరాణి ముష్టి మండల దడిలో కూచ్చుని వుండాది. అన్న వచ్చింది చూసిన నాగరాణి అమ్మను పిలిచి, “ఆవు ఎట్టుండాదమా? ఈతలీనిన ఆవా? తరుపా? ఎంతంట దర?” అనడిగింది.

యెంగటమ్మ నవ్వు మొకంతో, “అదంతా నీకేమిటికే కూతరా! రేపో ఎల్లుండో పరాయోళ్ళింటికి కాపరానికి పొయ్యేదానివి. నీకు అమ్మగారింటి మింద అంత కలవరం ఏమిటికే నా ఎర్రిదానా!” అనింది.

ఆ మాట ముదిగారం మాటే గాని, మళ్ళా కూతురితో, “ఆవును చూస్తా వుంటే లేతావుగానే కనిపిస్తా వుండాది. వుండు, అన్ననడగతా. నేను మాత్రం యింతలేకే అడిగినానా?” అని అంటా మునికన్నడి దగ్గిరికి వచ్చింది.

“ఏమిరా ఆవు సంగతి చెప్పనే లేదే! దాని దరేమి, సంగతేమి? పోకూవర్తి చెప్పురా నాయినా!” అనడిగింది కొడుకును.

ఆ ఆవును గురించి యింక నెల వరసబెట్టి మాట్లాడినా ఆ అమ్మా గొడుకులకు కుశాల తీరదు.

“ఆవును చూస్తా వుండావు గదమా, నువ్వే చెప్పు, ధర ఎంత జేసునో?” అన్నాడు మునికన్నడు.

"చెయ్యదా యెయ్యో, యెయ్యిన్ని యిన్నూరో!" అనింది యెంగటమ్మ మతింపు చేసి.

మునికన్నడు తినేది నిలిపేసి, అమ్మకల్లా తలెత్తి చూసి, "బలేటి దానివే! రెండు వేలా ఇన్నూర్రూపాయిలమా! ఎర్ర నయాపైసా తక్కవ లేదు అందులో. ఆవు ఎట్టుండాది! చూస్తా వుంటే కడుపు నిండిపోతా వుండాదే! అచ్చం జెర్సీదే, చీమంత బెరికి కూడా లేదు. దానమ్మది మంచి సాంపర్దాయకమంట. నీకింకొక సంగతి చెప్పనా? మనింట్లో ఈనబొయ్యేదే తొలీత" అని చెప్పినాడు.

"ఒరె ఒరె, బలే ఆవును పట్టకొచ్చినావే!" అనింది యెంగటమ్మ అదొక రకం గొంతుతో.

"ఆ మాట చిన్నంగా అంటావా? తిరపతిలో గాబట్టి కసువును కొనలేక యిచ్చేసినారు. అదే వూళ్ళో అయితేనా ఇదే ఆవు మూడు వేలకు యిస్తారా? అప్పుటికీ రెండు వేలా అయిదు నూర్లు చెప్పినారు. నేనూ, మా బావ ఇంకా కొంచిం దిగమన్నాము. వాళ్ళు ఒక్క వందకు దిగినారు. కడాకు మా బావను తోసుకో లేక ఈ మాత్రం రేటుకు ఇచ్చినారు. తెలవనోళ్ళయితే తిరప్తిలో అయినా ఈ ఆవు మూడు వేలుగాక! నీకు గాని పులుపుగా వుంటే చెప్పు, ఎనిమిది నూర్లు లాబం దీసుకోని యిచ్చేద్దారి" అన్నాడు మునికన్నడు.

కంటి మింద రెప్పెయ్యకుండా కొడుకును చూసి, "వొరె వొరె, ఈ సేద్యం మానేసి ఆవల యాపారం జేసినా నువ్వు మంచి మంచి లాబాలు కొట్టేటట్టుండావే!" అనింది యెంగటమ్మ.

"అయ్యూ, అయ్యూ మనావు రెండేలా ఇన్నూర్రూపాయిలా! నేను చూస్తానమా!" అనింది నాగరాణి దడిలో నుంచే.

నాగరాణి ఆ వాటంతో దడిలో నుంచి మాట్లాడడం వినిన యెంగటమ్మ, "మూస్తావా, ముయ్యవా బొక్క? ఇంక నువ్వు చానా తగ్గాల. అప్పుటి మాదిరిగా పైయ్యేసుకొని రాగూడదింక. నువ్వు యాడుండావో తెలవగూడదు బాంచత్" అని కసిరేసింది.

దీంతో నాగరాణి ఆ బారడు దడిలో కట్టేసినట్టుగా వుండి పూడిసింది.

మునికన్నడు కూడు తినేసి అమ్మతో కూడా ఆవు కాడికి వచ్చినాడు.

"ఇది ఈనినాక పాలు పిండేటప్పుడు తైతక్కలాడితిందో ఏమో!" అని అంటా యెంగటమ్మ చేతిని ఆవుమీద యేసింది.

ఆవు సగించినట్టు గమ్మనుండి పొయ్యింది. ఎఱ్రమట్టి రంగులో వుండే ఆ ఆవు మింద తెల్ల తెల్ల బట్టలు వుండడంతో ఆవుకు లచ్చిందేవమ్మ కళ వచ్చింది. మునికన్నడు చెప్పినట్టు ఆవును చూస్తా వుంటే కడుపు నిండిపోతా వుండాది.

"పేగు దూడ ఈనాల కూతరా, నువ్వీ బీదరాలి యింట్లో పేగు దూడను ఈనాలనే కూతరా!" అని యెంగటమ్మ ఆవు మింద రెండు చేతులూ యేసి సరదిద్దింది.

యెంగటమ్మ ఉత్తరంగా వుండే తిరమల కొండలకల్లా తిరిగి, దగద్ద మానంగా, సోలుపుగా మండతా వుండిన కొండ దీపాలకల్లా చేతులు జోడించి, "బగమంతుడా! నీ పుణ్యాన ఆవు పేగుదూడనే ఈనిందంటే నాలుగు సొలిగిల నెయ్యిని నీ కొడిస్తంబంలో పోసి, యెంటికలిచ్చేసి వస్తాను సామీ" అని మొక్కుకునింది.

"ఆవు పేగుదూడను ఈనాలనే గాని, ఆవూదూడ అయిదేల రూపాయిలు గదమా. సమ్మచ్చరంలో దూడగూడా కట్టుకు రాదా?" అన్నాడు మునికన్నడు.

ఇలామంతు నాయుడొచ్చి ఆవును చూసీ చూడాటంతోనే, "మంచి పాలావుగా వుండాది గదరా" అనేసి, "ఇంగ రండి రండి. మనమే దానికి దిష్టి పెట్టెయ్యబొయ్యేది. కరుపోరం యెలిగించి దిష్టి తియ్" అని యింట్లేకి వచ్చేసినాడు.

అప్పటికప్పుడు సిన్నకొడుకు చేతికి ఇరై నయా పైసాలిచ్చి కరుపోరం తెమ్మని అంగిడికి పంపించింది యెంగటమ్మ.

ఆమె గంగాళంలో కరుపోరాన్ని పెట్టి ముట్టించి ఆవుకు ఆర్తి పడతా వుంటే ఆమె నడిపి కొడుకు ధర్మడు తిరపతి నుంచి సినిమా చూసుకొని వచ్చేసినాడు.

ధర్మడికి పతి దాని మింద కొత్త మునాశ జాస్తి గదా. ధర్మడు ఆవు పగ్గాన్ని యిప్పి మంచినీళ్ళ తొట్టి కాడికి తోలక పోయి, 'కియ్యో కియ్యో' మని ఈస యేసినాడు. ఆవు మంచినీళ్ళల్లో మూతిబెట్టి మూచూసిందేగాని తాగలా.

"కొత్త చోటు గదా" అనింది యెంగటమ్మ.

ధర్మడు అప్పటికప్పుడే ఇంట్లేకి పొయ్ చాటడు తవుడు బకిడీలో పోసి, అన్ని నీళ్ళల్లో కలిపి పెట్టినాడు. ఆవు ఆ తవుడును బొక్కలాడేసింది.

"తిరప్తి గొడ్డు గదా. ఇన్ని నీళ్ళూ, తవుడు మోపనే పెరిగి పెద్దదయి వుంటింది. తిరప్తోళ్ళకు పచ్చి కసువు, ఎండు కసువు యాడిది? కసువు కొనే దానికన్నా తవుడు కొనేది మేలనుకోని తవుడు అలవాటు చేసుంటారు. మనింటి కాడ ఆవు పచ్చి కసువు, ఎండు కసువు తిని బాగ యిడిగిపోదా?" అనింది యెంగటమ్మ ఆవునే పొడుగ్గా చూస్తా.

ధర్మడు అర గెంట సేపు ఆవు నొదిలి అట్లా యిట్లా పోకుండా వుండేది చూసి మునికన్నడు తమాసకు, "మన నడిపోడు చూడమా, ఇప్పుడు ఆవునెంత శ్రద్దగా జూస్తా వుండాడో? అదే నాలుగు నాళ్ళు పోతే అది అంబా అని అల్లాడతా వుండినా అన్ని నీళ్ళు తాపతాడా!" అన్నాడు.

"నిజమేలే గాని, నువ్వు గమ్మనుండరా అనా! నాకు గాన మళ్ళ కోపమొచ్చిందంటే –" అని యెచ్చిరిక చేసినాడు ధర్మడు.

"కోపమొస్తే ఏమి చేస్తావురా? కోడి పియ్యి నాకతావా?" – ఆవును పట్టకొచ్చిన కుశాలలో వుండిన మునికన్నడు ఈ తమాస మాట ఒకటి అనేసి యింట్లేకి పొయ్‌నాడు.

మునికన్నడు అమ్మ పక్కన ఒద్దికగా చేరి, "అమా, అమామే. పెద్ద మనిసైన మన చెల్లికి సాంగిం చేసేది లేదో? ఆ సంగతేమన్నా అనుకున్నావా లేదా?" అనడిగినాడు.

కొడుకుతో కొంచేపు ఏమీ మాట్లాడకుండా గమ్మనుండింది యెంగటమ్మ.

మళ్ళా మునికన్నడే, "అది గాదమా, యింట్లో ఏమన్నా సామానం వుండాదా లేదా? ఇన్నినాళ్ళూ మన అమ్మి మాల కష్టం చేసింది. ఆడబిడ్డి

అని కూడ అనుకోకుండా కూలి పన్లకు పంపి ఆ యమ్మిని పెరక్క తినేస్తిమి. ఈ నాలుగు నాళ్ళన్నా దడిలో అమ్మికి తినే అంత ఏదన్నా చేసి పెట్టు, అమ్మి పెద్ద మనిసైందని మనకు చుట్టాలు బందుగులు వుండి ఎవురు వొండుకొని వంటలు తేబోతారు మనింటికి? ఉద్దిపొప్పు వడలు, సుగీలు – తినే అంత పెట్టు ఆ అమ్మి వరకు. ఆడబిడ్డికి ఒక రూపు ఏరుపడి, యిడిగేది యిప్పుడే గదమా!" అన్నాడు.

యెంగటమ్మ ఈ మాటలింటా కండ్లల్లో నీళ్ళు బెట్టుకొని, "మన కుటుంబరంలో ఒకరి మింద ఒకరికి ఎంత కలవరం వుండాదిరా, యెర్రి నాకొడకా! లోకాన మనంత ఒద్దికగా ఎవురన్నా వుందురా?" అని, మళ్ళా, "ఆడదానికి నువ్వు యివన్నీ చెప్పాలంటరా కున్ని కొడకా! అంత బిడ్డప్పుడు నేను మాత్రం కాలా పెద్ద మనిసిని? నన్ను దడిలో కూచ్చున బెట్టి అప్పుడు మా అమ్మ నాకు ఏమేమి పెట్టిందో, నేను నా కూతురికి అవన్నీ పెట్టి మేపనా? ఆడోళ్ళ పద్దతుల్ను నువ్వు నాకు చెప్తావా?" అని మాట్లాడింది.

అంగిట్లో నుంచి నాలుగు కేజీల ఉద్దిపప్పు తెచ్చి నాగరాణికి నాలుగు నాళ్ళుగా అరువుగా చేసి పెట్టింది యెంగటమ్మ.

మళ్ళా ఒక రోజు మునికన్నడే, "ఏమమా యింతకూ సాంగిం చేద్దా మంటావా వద్దా అమా!" అనడిగినాడు.

యెంగటమ్మ పొడుగ్గా కొడుకుకల్లా జూసి, "నాగరాణి యింటికి పెద్దాడబిడ్డి గదరా. చెయ్యకుంటే ఎట్ట?" అనింది.

మునికన్నడు, "అట్టయితే జరిగే పన్లు చూడాల గదమా. నాలుగు మూటల వడ్లు వుడకేద్దాం పట్టు. నూరో యిన్నూరో కర్చయినా కారాసూ లడ్డూ చెయ్యాల, యింటికొక మనిసి లెక్కన బోజినాలెయ్యాల" అన్నాడు.

యెంగటమ్మ కుశాలకు పట్ట పగ్గాల్లేకుండా పోయింది.

"ఏ పొద్దన్నా మనింట్లో నలుగురు వచ్చి చేతులు కడిగుందురా? మనం మిట్టూరికి రాకుండా రంగంపేటలోనే గాన, వుండుంటే – మన అమ్మి పెద్ద మనిసైతే మనం ఏం చేసుందుము? నెత్తిన అన్ని వుడుకు నీళ్లు బోసి కుండాజట్లల్లోకి రమ్మనుందుము. ఈ రోజు నట్టింట్లో నెట్టు గట్టి పెట్టుండే

వద్ద గింజలుండబట్టి గదా మనం ఈ రకంగా మాట్లాడుకుంటా వుండాము" అనింది యెంగటమ్మ కులుకుతో.

నాగరాణి పెద్ద మనిసైన తొమ్మిదో రోజు మంచి రోజు. ఆ రోజు సాంగిం పెట్టుకున్నారు.

"ఇంట్లో కరంటు కూడ వుండాది. యింత కర్చు పెడతా వుండాం, ముప్పై రూపాయిలిచ్చి మైకు సెట్టు మాట్లాడదాము. ఇంట్లో గలాం బులాం అని రేడీ పాడతా వుంటే బాగుంటిింది" అని అయిడీ యేసి అన్నతో చెప్పినాడు ధర్మడు.

ఈ అయిడీని ఎత్తక పొయ్ అమ్మతో చెప్పినాడు మునికన్నడు.

కూతురి మింద కొడుకులకుండే తపన జూసిన యెంగటమ్మ, "మీ కుశాలను నేనెందుకు కాదంటాన్రా మునికన్నా! అట్టనే రేడీ గూడ పెట్టండి. మన అమ్మి పెద్ద మనిసైనట్టు నాలుగూళ్ళకు తెలిస్తిందా, ఎవుడో ఒకడు పెత్తనానికి వస్తాడు" అని నవ్వింది.

అన్నాదమ్ముళ్ళిద్దరూ యాడనో నాలుగు టెంకాయ మట్టలు తెచ్చి యింటి ముందర చూడ చక్కని పందిలి గూడ యేసినారు.

ఆ రోజు మద్యానం మూడు గంటలకే రేడీ గూడా వచ్చింది, తొలి పాటగా "ఏడుకొండల వాడా యెంగట రమణా" పాట పెట్టించినాడు ధర్మడు. అప్పుట్నించి అతగాడు రికారుడు ప్లేయరును వదలకుండా వుండి వరసగా క్రిష్ణా పాటలే పెట్టించినాడు. తప్పీ తగిలి కూడా శోబనబాబు సిన్మా పాటలు గాని, ఎంటీ రామారావు సిన్మా పాటలు గాని పెట్టించిన పాపాన పోలా. అదొక రకం కుశాల ధర్మడికి.

రంగంపేటోళ్ళ యింట్లో జరిగే కార్నానికి మిట్టూరోళ్ళు పిలవంగానే యింటికొక మనిసి లెక్కన వచ్చినారు. వీళ్ళకు తోడు వూళ్లో పిలకాయి లందురూ ఇలామంతు వాళ్ళ యింటి కాడనే చేరిపొయ్, టెంకాయ ఆకు, నేరేడాకు పెరుక్కుని పీకలు చేసుకుంటా వూదుకుంటా వుండినారు. దీంతో రంగంపేటోళ్ళ యింటి ముందరికి కైలాసం వచ్చి చేరి పొయ్యింది.

యింటి ముందర అంత జనాన్ని చూస్తా వుంటే ఇలామంతు కులుకు బండ్ల కొందికీ అయ్యింది.

ఆ వూర్లో రైతులంతా ఇలామంతు యింటి ముందర చేరి –

"ముందు ముందు బతుకంతా రంగంపేటోళ్ళదేనబ్బా. చూడండి. గుత్తకు ఒక్క పలితం చేసినారో లేదో, అప్పుడే ఇరై ఇరై అయిదు మూటల వడ్ల గింజల్ను ఇరుపులో పెట్టుకున్నారు. అన్నో యిన్నో అమ్ముకోని ఒక పాల గొడ్డును పట్టుకున్నారు".

"పోనీ పాపం, రంగంపేటలో కన్నోడి అగచాట్లన్నీ పడొచ్చినారు. మనూర్లో అన్నా మంచి బతుకు బతకనీ".

"బతక్కా? యిద్దురు మొగ పిలకాయిలు చేతికెక్కొచ్చేసినారు. నాయాలు పెద్దోడు వుండాడు జూడు, అగ్గి నాయాలు. వన మొలక అంటే వాడే గదా. బలే శాల్తయిన నాయాలు లే. అట్ట గాకుంటే నడవలూరు వొంకన వుండే లేత కాకెదురును కోసి నారుమడిలో తొక్కునా? పేడ తట్టలు అడివిలోకి ఎత్తకపొయ్ ఒక పేడ దిబ్బదు పేడ ఏరకొచ్చునా? వాడికి ఎంత సేద్యమైనా యెంటిక్కి కట్టుకోని గిరగిరా అప్పాలు తిప్పేస్తా వుంటే!"

"అంత గాకుంటే యాపై గుంటల్లో వరిపైరును కోసి, ఒక్క కూలోడ్ని పిలవకుండా, వూళ్లో పనులు జేసి, బొదులు మనసల్తోనే పన కొట్టించేసునా? వుండాల్సిన పిలగోడు గదా! వూళ్ళో వుండారు ఆ ఈడు పిలకాయలు. ఏమిటికి? గంగమ్మ కాడ నరకనా? ఆ పొరంబోకు నాయాండ్ల కోసరమన్నా ఈసారి జాతర జెయ్యాల".

– ఈ మాదిరి మాటలు, రైతులు మాట్లాడతా వుంటే ఆ మాటల్ను కన్న కడుపులు ఇంటా వుంటే, అదే గదా బోగమంటే!

యెంగటమ్మకు ఇలామంతుకు కేళీ యిలాసంగా వుండాది. వాళ్ళ మొకాలు దగద్దమానమై పొయ్నాయి.

"ఇది గదా అందరాల బతుకంటే!" అనుకున్నారిద్దురూ.

ఆ రాత్రి యింటికొచ్చిన జనాలు – మూడు బంతులకైనారు బోజనాలకు. తలా ఒక లడ్డు, అంత కారాసు పోసినారు యిస్తరాకుల్లో.

“పెండ్లి జరిగినట్టే వుండాది గాని, పెద్దమనిసి సాంగిం మాదిరిగా లేదిది” అనింది ఒక అమ్మగల్లరాలు.

ఒంటిగోడు చెంగమ నాయుడైతే సొంత మనిసి మాదిరితో మునికన్నడినే కాపెట్టుకుని వుండి, వడ్డించినాడు. గురప్ప నాయుడు యాపారాన్ని వొదిలి పెట్టి తిరప్తి నుంచి వచ్చినాడు.

పెద్ద మనిసి సాంగిం వైబోగంగా జరిగినందుకు నాగరాణికి బలే బడాయి అయింది. ఆ రోజంతా పూల జడ కుట్టించుకోని యింట్లోనే ఆ పక్కకు ఈ పక్కకు తిరగతా ఓ అని ఇచ్చుకొనింది.

ఈ పెద్ద మనిసి సాంగానికి ఒక మూట బియ్యం కర్చు అయింది. అదట్ట వుండనిస్తే రూకగా తక్కవలో తక్కవ మున్నూరు రూపాయిలు కర్చయింది. మొన్న చేతిలో వుండిన రూకంతా పెట్టి ఆవును పట్టుకొనేసినారు గదా. సమియానికి మున్నూరు రూపాయిలు పెళ్ళానికి తెలవకుండా, ఎర్ర నయాపైసా వడ్డీ లేకుండా అప్పుగా యిచ్చినోడు ఒంటిగోడు చెంగమ నాయుడే. ఆ మిట్టూరు అనే వూరు ఏమంత న్యాయమైన వూరు గాదు. మాలోళ్ళకు, మాదిగోళ్ళకు, గొల్లోళ్ళకు, తురకోళ్లకు, పూటకు గడవని కమ్మోళ్ళకు కూడా ఆ వూరి కమ్మోళ్ళు నూటికి పది రూపాయిలకు కూడా వడ్డీకి తిప్పే ఆడోళ్ళుండారు.

“మా నాయిన జెప్పినట్టు నా మింద చెంగ మామకు చూపు పడినట్టే వుండాదమా. నాకు కాళ్ళు కడిగి కన్నాదానం చేస్తాడో ఏమో చెంగ మామ” అని మునికన్నడు వాళ్ళ అమ్మతో అంటా వుంటే, “ఒరే అల్లుడా!” అంటా వచ్చినాడు ఒంటిగోడు.

“చెంగన్నకు నూరేండ్లు” అనింది యెంగటమ్మ.

“ఈ పాపిష్టి కాలంలో నూరేండ్లేమిటికి తల్లా! ఎప్పుడెప్పుడు ఈ జీవుడు ఎలబారి పోతాడా అని చూస్తుండాను” అంటా తిన్నె మింద కూచ్చున్నాడు చెంగమ నాయుడు.

“అదేందన్నా ఆ మాటంటావు? ఉలవ గింజా వొగిచి, కంది గింజా వొగిస్తే ఎట్టనా? బూములు బావులుండే మీ బోటోళ్ళే ఇట్టంటా వుంటే

దున్ని బతికే దానికి బూమి లేక, దూకి చచ్చే దానికి బాయి లేక కన్నోడి అగచాట్లు పడే మేము ఏమనాల?" అని మాట్లాడింది యెంగటమ్మ.

ఒంటిగోడు పొడుగ్గా గాలి పీల్చి, మళ్లా యదా పకారంగా, "ఏమిరే, రంగంపేట నాయాలా! నాకన్నా యెనకాన మడి నాటినావు, నా కన్నా ముందర్నే వడ్లను తెచ్చి యింట్లో పోసుకున్నావు, వామి పని గూడ అయిపాయ నీది. నన్ను గూడా నీతో కలుసుకోనీరా నాయాలా!" అన్నాడు.

"నువు జెప్పేది బాగుండాది సామీ, నావి టొంటీలై పాయ, నీవి మొల గొలుకు లైపాయ. పొట్టి రకాల సేద్యగాడ్ని, ముందుంటానంటే వుండనా?" అని నవ్వినాడు మునికన్నడు.

ఒంటిగోడికి యిప్పుడు అర్జంటుగా పని బడింది. ఆయన గూడ నిన్నా మొన్ననే మడి కోసేసి, పన కొట్టేసినాడు గాని, యింగా వామి యెయ్యాలా. వామి యెయ్యడంలో ఆ వూళ్ళోకి పేరెత్తుకున్నాడు చెంగ మామ. ఆయన వామి యేస్తావుంటే కసువుమోపులు అందించే దానికి మగ దిక్కు వుండాల గదా. ఆయన యిద్దురు మొగ పిలకాయలకు వరి కసువంటే గొడ్లకు మేత గాదు. వాళ్ళు దాన్ని "ధూ నస నాశినం" అనుకుంటారు. వాళ్ళు గాని కసువు మోపులను వాళ్ళ నాయినకు అందిస్తే, చెంగమనాయుడు గడ్డివామిని బ్రమ్మాండంగా యేసేస్తాడు.

"నాకు గూడ యిప్పుడు పనేమి లేదు. ఈగిలు కొట్టుకుంటా, యింటికి దరిద్రంగా వుండాను. వామి యేద్దాం పద" అని కదలబారినాడు మునికన్నడు.

మునికన్నడు వామెయ్యడానికి వస్తా వుంటే చెంగమ నాయుడు కసువు మోపులు నెత్తిన బెట్టుకొని అందిస్తాడే గాని, "నేనేస్తాను వామిని" అని అంటాడా?

కసువు మోపుల్ను చెంగమ నాయుడు ఒక్కడే నెత్తికెత్తుకొని అందిస్తా వుంటే మునికన్నడు వామి యేస్తా వుండాడు.

ఇక్కడ యింటి కాడ వుండే మునికన్నడి అమ్మ యెంగటమ్మ వూరికే వుండకుండా చెంగమ నాయుడి యింటికి పొయ్యింది. ఆ సమియంలో

చెంగమ నాయుడి పెండ్లాం లచ్చుములు తలకాయ నెప్పి అని జెప్పి కాపీ బెట్టుకొని వూదుకొని సగించినట్టు తాగతా వుండింది.

యెంగటమ్మ రాంగానే లచ్చుములమ్మ మరేదగా, "ఏమి, రంగంపేటా యన పెండ్లామా, కూచ్చో!" అనింది.

"కుచ్చుంటానే వుండాను గదొదినా, ఏం పని గూడ లేదే, ఎప్పుడూ కూచ్చునే పనే గదా" అని మాటకు బొదులుగా వొక మాట అని గోడకు ఆనుకొని కూచ్చొనింది యెంగటమ్మ.

లచ్చుములు తీరిగ్గా ముక్కల గుండా పొడుగ్గా గాలిపీల్చి, "అమ్మ, కాపీ తాగినాక అణసరయ్యింది ఈ కూలిపొయ్న తలకాయ నెప్పి! కాపీ అంత వుండాది తాగతావా రంగంపేటామె?" అని ఆమే అని, మళ్ళా "కాపీలు గీపీలు నీకేమి అలవాటులే. ఎడ్డీమడ్డీ తిండ్లే గాని, కాపీలు నాష్టాలు మీకేమి వాడిక? మాబోటోళ్ళకే వస్తుండాయి యాడ లేని రోగాలన్నీ" అని బడాయి మాటలు మాట్లాడింది.

రంగంపేటామె తలకాయ గీరుకుని, "కాపీలు నాకొద్దుగాని, మడి కాడ మామా అల్లుడు వామి యేస్తా వుండారే. వాళ్ళ కంత కాపీ పోసుకోని పో ఏమి? తాగతారు" మన బిడ్డి అంత కాపీ తాగతాడు గదా అనే సంసారితనంతో ఆమె ఆ మాట అనింది.

ఈ మాటకే మూతి నల్లంగా బెట్టి, "వోడెవుడు, నా మొగుడికి అల్లుడంటా వుండావే, వోడెవుడు?" అనింది లచ్చుములు.

ముందూ యెనక చూసుకోకుండా యెంగటమ్మ తమాస తమాసగానే, "నీ మొగుడికేనా వొదినా, నీకు గూడా అల్లుడే గదా మా మునికన్నడు! నీ కూతుర్నిచ్చి బంగారుగా నా కొడుక్కి చేసుకో ఏమి? మీ ఇంటాయనకు దాపుగా వుండి మీ సేద్యం అంతా చిటికినేల్తో చేసెయ్యడా! మేము ఈ వూరికి వచ్చినప్పట్నుంచి మా చెంగన్నకు మా పెద్దోడి మిందనే గదా సూపు" అనింది.

ఆ కొంచేపుట్లోనే లచ్చుమమ్మకు యాడ నుంచి వచ్చిందో గాని సందిట్లావు గస బెట్టుకొని శిగమెత్తేసింది.

“ఒసే రంగంపేట దానా! నా గడప దిగతావా, మెడబట్టి గెంటమంటావా? ఏమి సే నీ అతికారం, ఏమి సే నీ ఆంకారం?” అని ఈదిలేకి చెయ్యి చూపించింది లచ్చుములు.

యెంగటమ్మ, పాపం కన్నారు, బిత్తర పోయి “అవరా! అవరా! ఇప్పుడు నేను అంత కాని మాట ఏమన్నాను వొదినా!” అని మాట్లాడబోయింది.

లచ్చుములు ఆ గసను ఏమాత్రం తగ్గించుకోకుండా, “రంగంపేటలో మామిడి పొండ్ల యాపారం చేసే తురకోళ్ళ దగ్గిర దొబ్బించుకున్న దానా! మంచి మాటల్తో నా గడప దిగతావా, తోటోడ్ని పిలిపించి జుట్టుబట్టి ఈడిపించేదా?” అని యింగా కొంచేపు యెంగటమ్మకు మరేద యిచ్చినట్టు మాట్లాడింది.

ఆ కానీగాని మాటతో చివక్కమని యెంగటమ్మ గడప దిగి ఈదిలో బడింది.

“నా సవితీ ఎంత దైర్నమే నీకు? నా కూతురు గిన్నె కాడ రాలింది తినే యోగ్గిత వుండాదా నీ కొడుక్కి? అడక్క దొబ్బను ఈ వూరికొచ్చి నా యింటికి నైసు నైసుగా పెండ్లి పెత్తనానికి వస్తావంట సేయ్? నా సవితీ, ఏమి సేయ్ నీ కంటికి మేమంత ఈనంగా కనిపించుండేది?” అని లచ్చుములు గూడ ఈదిలోకి వచ్చి శాపించను మొదలుపెట్టింది.

ఎదురుగా తిరుక్కోని యింక ఒక్క మాట మాట్లాడితే చెడి పోతిందని గమనించిన యెంగటమ్మ – తిడితే ఆమె నోరే గదా పోతిందని మానంగా యింటికి పూడిసింది.

యెంగటమ్మ యింటికి పొయ్‌నా లచ్చుములు యింట్లేకి వచ్చి ఆమె పని ఆమె చూసుకోకుండా, ఈదిలో ఏరక తింటా వుండిన కోడి మింద కోపంతో ఒక కసువు పోసను యిసిరేసి, “లంజా, మాల సాకలోడికన్నా ఈనం గదే నీ కొడుకు! వాడికి నా కూతుర్నియ్యమని అడిగే దానికి నీకెన్ని గుండికాయిలే, దొమ్మర నా సవితీ! వారపు కయ్య చెయ్యబట్టే నీకింత తిమురుగా వుండాదే, అదే నాలుగు గుంటల ఏరగడకు గెతి గలిగుంటే నా కూతుర్ని ఎత్తక పొయ్ చేసుకుంటామని సవాలేసి వుండవా? అడక తినేదానా,

నీ అంతరం యాడ, నా అంతరం యాడ? నాకు డెబ్బై గుంటల కయ్య. కీనీరు బాయి వుండాదే! నీకా? నీ కొడుకు నెత్తిన రూపాయి బెట్టి అమ్మితే ఏ నాబట్టా అద్ద రూపాయికి కొనడు గదే లంజి నా సవితీ! నా సవితీ ఎగవ గెనిమి, దిగవ గెనిమి అని తలువు, నీకు యింగన్నా దేముడు మంచి రాత రాస్తాడు, అవరా అవరా, నా సవితీ డిల్లీ దాక ప్లాను యేసినావు గదే లంజి నా సవితీ!" అని తిట్టింది.

లచ్చుములు అక్కుసును అణసర జేసుకోలేక గబగబా యింట్లేకి పొయ్యి కాపీ పెట్టి, "ఆ నా సవితి చచ్చిందని మళ్ళా తలకాయి నెప్పి వచ్చింది గదమ్మా. యింక లచ్చి సార్లు కాపీ బెట్టుకుని తాగినా ఈ నెప్పి తీరునా?" అనేసి మళ్ళా ఈదిలేకి వచ్చింది.

"ఒక పనికి మాలోడ్ని పిలిచినట్టే నీ కొడుకునీ పిలచినాం. ఆ మాత్రానికి ఆ ఒక్కల ముక్కల నా బట్ట మింద మాకు సూపు బడినట్టా? ఈ సంగతి గాని నా అణకవైన కూతురిగ్గాని, నా కొడకలకు గాని తెలిస్తే వొచ్చి నిన్ను నిలబెట్టి దొబ్బుతారు లంజా!" అని రవ్వాటించింది.

ఈ మాటలు వినలేక రోసంతో మళ్ళా వచ్చింది యెంగటమ్మ, ఆమె వచ్చే కొందికి లచ్చుములు యింకా రేగి పొయ్యింది. దానికి యింగేమన్నా కయ్యా గాలవ, గొడ్డూ గోద అని పనుంటే గదా. తలకాయి నెప్పులు రాను, కాపీలు బెట్టుకోని తాగను, ఎవురితోనన్నా ముడ్డీ మొకం తెలవకుండా ఈ వాటంతో జగడాలు పెట్టుకొనేదే గదా దాని పని.

యెంగటమ్మ దోవన బొయ్యే ఒక ఆడామెను పెద్ద మనిసిగా బెట్టుకుని, "చూడక్కా నేనేమి తప్పుడు మాట మాట్లాడినట్టు? ఆ మనిసి జూడు దాన్ని వదల్తా వుండాదేమో! ఆమె అనే మాటలు యింటా వుంటే గుండికాయల్తో గూడ పెరక్కొస్తా వుండాయి" అనింది.

దీనికి, "ఒక నా సవితి పెద్ద మనిసిగా ఏమీ వుండాల్సిన పన్లా. ఈ వూర్లో ఆడోళ్లకు న్యాయం అనేది వుంటే, రంగంపేటది ఎప్పుడైతే ఆ మాట అనిందో అప్పుడే నాలుగు పక్కలా నలుగురాడోళ్ళు మళ్ళుకోని రంగంపేట దాన్ని పట్టుకోని తుక్కు పద్నాలుగణాలు లేవగొట్టుండరా? ఈ వూళ్లో న్యాయం

లేకనే గదా దాన్నేమి అనలేకుండా, రెండూ రెండు చేతల్తో మూసుకోని వుండేది!" అని ఆ పెద్ద మనిసికి కూడా లచ్చుములు ఒక వాత యేసింది.

దీంతో రంగంపేటామెతో ఆ పెద్ద మనిసి, "నువ్వు మానస్తురాలైతే గమ్మన యింటికి పొయ్ చెవల్లో దూది బెట్టుకో. దాంతో మాట్లాడి గెలాయించే వోళ్లు ఈ సిత్తూరు జిల్లాలో ఏ నా సవితీ లేదు" అనేసి ఆమె దోవన ఆమె పొయ్యింది.

మనసును కటీనం జేసుకోని రంగంపేటామె మళ్ళా యింటికి పూడిసింది. 'లంజా, నీతో మాట్లాడితే నేనూ లంజినే. కొండను జూసి కుక్క మొరిగితే కొండకు చేటా, కుక్కకు చేటా సేయ్' అనుకొని యెంగటమ్మ బలంతాన మనసును నిమ్మళం జేసుకొనింది.

ఇంట్లో పొయ్యి మింద బెట్టిన కాపీ సంగతే మరిచి పొయ్, లచ్చుమమ్మ ఈదిలో బొటువుగా కూచ్చునేసి, "ఒసేయ్, నువ్వు మమ్మల్ను సన్నాబన్నా వోళ్లనుకున్నావేమో! తిరమల కొండ మింద సెకుర్టి గార్డంట. సంబళం నెలకు ఏడు నూర్లంట, మా బిడ్డ కోసరం వచ్చి కండ్లకద్దుకోని చేసుకుంటాం యిచ్చెయ్యండి అని కాళ్లూ చేతులు పట్టుకుంటే మా అమ్మి కేరేజాట్ అని వాడి మొకంకల్లా ఎగాదిగా కూడ చూళ్ళా. ఆ బిడ్డి కోసరం నువ్వు పెత్తనానికి వొచ్చినావంటే నీ దైర్నానికి మెచ్చి పిడికిడు బొచ్చు పెరికి నీ చేతల్లో పెట్టాల" అని ఇష్టం వచ్చినట్టు మాట్లాడతా నోటి జిల అణుచుకొనింది.

సందేళ వామి యేసేసి, మునికన్నడు యింటికి రాంగానే యెంగటమ్మకు కండ్లల్లో నీళ్ళు పెరక్కొచ్చినాయి. ఆమె ఎగదీసుకుంటా అంతా చెప్పేసింది.

"ఒక మొగోడి దగ్గిర బొట్టు కట్టించుకొని గూడ అన్ని తిట్లు తినుండనురా. అనావశంగా దాని నోట్లో పడినాను. నా తలకాయ గిల్లి మొలేసినట్టుండాది. అయ్యో అయ్యో తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టిందిరా అది. పెదబ్బా నువ్వు దాని కూతుర్ని పెండ్లిజేసుకొనే యోగ్గితే లేదంటావా రా?" అని నంగిగా ఏడ్చింది యెంగటమ్మ.

ఈ మాటలినంగానే మునికన్నడు కోపంతో, "నువ్వుబోయే నియ్యమ్మా అష్ట దరిద్రప నాయాలీ ముండా! నువ్వు దాని జోలికెందుకు పోతివి? అది

నాయెత్తు రూపాయిలు పోసినా నేను దాని కూతురి మెళ్ళో కడతానా బొట్టు? దాన్ని గాని నేను పెండ్లి జేసుకుంటే దానికి సబ్బుతో ఈపు రుద్దను సరిపోదా నా బతుకు? థూ థూ, చూసి చూసి దాని మెళ్ళో ఎట్టమా బొట్టు గట్టేది?" అని మాట్లాడేసినాడు.

మునికన్నడు కొన్ని తిట్లు తిట్టినా, ఆ మాటలన్నీ కండ్ల నీళ్ళు తుడిచినట్టుగా వుండడంతో నిమ్మళించింది యెంగటమ్మ.

మునికన్నడు పెళ్ళోకి పోయి ఒంటి మింద వుడుకు నీళ్ళు పోసుకుంటా వుంటే యెంగటమ్మ ఈపు రుద్దే దానికి పోయి, "అదీ నిజిమే గదరా పెదబ్బా. అది ఈరోజు అనిందని మనం బాద పడ గూడదు. మనకెవురిస్తార్రా బిడ్డను? రెక్కలు దప్ప గుంటడు నేలకు గతి యాడిదిరా?" అని బాద పడింది.

"నువ్వా నంగి మాటలు నిలపతావా నిలపవా?" అని కసురుకుంటే మళ్ళ ఆ మాటే మరిచి పోయింది యెంగటమ్మ.

అమ్మ అన్నం యేస్తే తింటా వుండినప్పుడు మునికన్నమ నాయుడే ఆ ప్రస్తాపన ఎత్తి, "అమా నీ అట్టా పెళ్లాం గాని దొరికితే నాకు దిగుల్లేదమా. కష్టిం జేసుకుని బతికి పూడస్తా" అని అన్నాడు.

యెంగటమ్మ నవ్వు మొకంతో, "ఆ మాటనద్దురా రేయ్, సామీ, అట్ట అనకూడదంట" అనింది.

మునికన్నడు బిత్తర పోయి "తప్పా అమా?" అని అని, "నీ అట్టా కష్టిం జేసే ఆడామె పెండ్లాంగా దొరికితే యింట్లో గోడలకు బంగారు పూత యెయ్యనా అమా? ఆ మాట అంటే తప్పా అమా?" అనడిగినాడు.

యెంగటమ్మ కొడుకు కల్లా అదొ్క రకం చూపు చూస్తా, "ఇప్పుడు మీ నాయిన బంగారు పూత యేస్తా వుండాడు చూడు అట్టనా?" అనింది. ఆమె కొంచేపు తాలినాక "పెదబ్బా నువ్వు ఇనాయకుడు రా. అన్నీ ఇగ్నేస్పర స్వామి బుద్ధులే నీకు" అనింది.

మునికన్నడు "ఏమమా?" అనంటే కొడుక్కి కత జెప్పింది యెంగటమ్మ.

"ఇనాయకుడిది ఏనుగు మొకం గదా. ఆయన కెవ్వరూ బిడ్డను ఇయ్యనే లేదంట పెండ్లి జేసుకొనే దానికి. పిల్ల కోసరం వాళ్ళ అమ్మా నాయిన

తిరిగినారు తిరిగినారు చాలుకునేసినారు. కడాకు యిగ్నేస్సరుడు 'అమా నీ అట్టా పెళ్లాం గావాలమా నాకు!' అనేసినాడంట, వాళ్ళమ్మ పారువొతితో. ఆ మకా తల్లికి కోపం వచ్చి 'నాయట్టా పెళ్ళాన్నే చేసుకుందువులే వుండు. అగ్గో ఆ వూరి మొగదాల్లో కూచ్చో. నా అట్టా ఆడది కనిపిస్తే బొట్టు కట్టు' అని చెప్పిందంట. పాపం స్వామి అమ్మ మాట నమ్మి అక్కడనే కూచున్నాడంట. పారువొతి మాదిరి ఆడది స్వామికి దొరికితిందా పెదబ్బా" అని శాస్త్రం చెప్పింది యెంగటమ్మ.

మునికన్నడు కతంతా యిని, ఏదో అనబోతా వుంటే యెంగటమ్మ అడ్డం వచ్చి, "పెదబ్బా, నేనెటుమంటి ఆడదాన్ని, కాపరం మింద సేద్యం మింద నాకుండే అక్కర ఎవురికొస్తింది? నా అట్టా ఆడది ఏ కాలానికి పుడితిందిరా యింక?? అయ్యా అయ్యా నా యంత కష్టజీవి–" అని ఆమె గురిచ్చి ఆమే నవ్వు మొకంతో చెప్పుకునింది.

అమ్మా గొడుకు మాట మింద మాట మాట్లాడుకుంటా వుంటే ఒంటిగోడు చెంగమ నాయుడు వచ్చినాడు. ఆయన నొచ్చుకున్నట్టు మూతి బెట్టి, "నాకు అన్నీ తెలిసినాయి యెంగటమ్మ చెల్లా! వూళ్ళో ఆడోళ్ళు నేను అడక్కనే – నలుగురు చెప్పినారు. మా ఇంట్లో ఆడది నిన్ను బలే మాట్లాడిందంట గదా! దానెమ్మ పెవడ నాయాలీ ముండాయెలే. నువ్వు మర్చిపో. ఈ నాయాలు మాకు అల్లుడయ్యే రాత మాకే లేదు" అన్నాడు.

"నువ్వు పో మామా! అడోళ్ళ మద్దిస్తం మొగోళ్ళకేమిటికిగాని నువ్వు పో మామా!" అని చెంగమ నాయుడ్ని పంపించేసినాడు మునికన్నడు.

## 6

"ఒదినా, యింట్లో పిలకాయలు వుండారా?" అంటా యింట్లేకొచ్చినాడు సొసైటీ ఆయన.

యెంగటమ్మ యింట్లో పిలకాయలు వుండేదీ లేనిది చెప్పేదాన్ని పక్కన బెట్టి "ఏమన్నా, నేను నీకు ఒదిన్నా?" అని ఇచ్చిత్రపోయి అడిగింది. సొసైటీ ఆయన యెంగటమ్మను 'ఒదినా' అని పిలవడం యిది మూడో యావత్తు.

"ఈ కాలం వరస లెవురు చూస్తా వుండారమ్మీ? వొదినైతే ఏమి, చెల్లయితే ఏమి?" అనేసి, మళ్ళా "మునికన్నడు ఎట్ల బొయ్‌నాడు?" అనడిగినాడు సొసైటీ ఆయన.

ఓపినంత కయ్యను బెట్టుకొని మాటి మాటికీ సొసైటీలో నుంచి అప్పులు తీసుకోని, అప్పుల పాలై పోయిన ఈ సొసైటీ నా బట్టతో నాకేమి పని - అనుకొని యెంగటమ్మ, "మా మునికన్నడు మడి కాడనే వుండాడనా!" అనింది.

సొసైటీ ఆయన, "ఈ రంగంపేట నాయాండ్లు నన్ను వుడకాడిపించి చంపతా వుండారే! నేను మడి కాడికొస్తే యింటికీ, యింటికొస్తే మడి కాడికీ బొయ్–" అనేసి ఒక్కడుగు గూడా అక్కడుండకుండా ఈదిలోకి పొయ్‌నాడు.

'ఇకారం బట్టినోడుగా వుండాడే ఈ సొసైటీ వోడు' అనుకొని కూతుర్ని "నాగరాణీ!" అని పిలిచి, "ఆ సొసైటీ ఆయన దగ్గిర కొంచిం జాగర్తగా వుండు కూతరా! వాడికి తప్పేదీ తగిలేదీ తెలిసేటట్టు లా. ఈ కాలం వరస లెవురూ చూసేది లేదంట. ఏమనుకుని ఆమాట అన్నాడు ఆ నా బట్ట? నేనెప్పుడూ ఆనా బట్టతో నోరు తెరిచి మాట్లాడ లేదే! నాలుగు సార్లో అయిదు సార్లో మడి కాడ కనిపిస్తే మాట సాంగానికి మాట్లాడుకున్నాము. అంతే. ఆ నా బట్ట సొసైటీల చుట్టూ తిరిగే వోడే గాని మడి కాడికి వచ్చేటోడు గాదులే. అయినా జాగర్త. ఎదిగిన బిడ్డి అని గూడ అనుకోకుండా మడి కాడ ఒంటిగా చూసి ఏమన్నా అనబోతాడు?" అని కూతురికి బుద్ది మాటలు చెప్పింది యెంగటమ్మ.

దీంతో నాగరాణి శౌర్రింతో, "సొసైటీ వోడు నా జోలికి వస్తాడా? నా కత తెలవలా, నేను వొటక్కాయలు పట్టుకున్నానంటే జాముసేపు వదలను మళ్ల ఆడనే వూపిరి యిడవాల ఆ నా బట్ట - ఓయమ్మల్లో ఓయక్కల్లో అని అరస్తా" అనింది.

కూతురు అక్కుసుకు ముదిగారం అయిపోయిన యెంగటమ్మ కూతురి కల్లా పొడుగ్గా చూసి "నువ్వు చానా తగ్గాల, ఆ మాటలు కొంచిం కట్టిపెట్టు" అని తిట్టింది.

ఈ లోపల ధర్మడు యింటికొచ్చినాడు.

ధర్మడిని చూస్తానే, “అన్న యాడరా?” అనడిగింది.

“ఆవును పట్టుకొని వస్తా వుండాడు” అన్నాడు ధర్మడు.

మునికన్నడు ఆవును కట్టేసి యింట్లేకి వచ్చినాడు.

“ఒరే పెదబ్బా, నీకోసరం సొసైటీ ఆయన వచ్చి పొయ్‌నాడురా, ఇందాక” అని చెప్పింది యెంగటమ్మ.

“దోవలో కనిపించి మాట్లాడినాడులే” అనేసి పీటేసుకొని మద్యానం సంగటికి కూచ్చున్నాడు మునికన్నడు.

కొడకలకిద్దరికీ సంగటేసి “ఏమంటాఁడ్రా!” అనడిగింది.

“ఆ నా కొడుకు సేద్యం చెయ్యలేక మన మింద పడి కొట్టుకుంటా వుండాడు. వాడితో వైశాక పలితం ఎట్ట యేగులాడేదో ఏమో!” అన్నాడు మునికన్నడు.

“అత్త ఎంటికలకు అల్లుడు మీసాలకు ముడేసి యేడిక జూసే నా బట్టగా వుండాడే సొసైటీవోడు. ఏమంటా వుండాడురా? ఏమన్నా గుద్దులాట గాని పెట్టుకుంటా వుండాడా?” అనడిగింది యెంగటమ్మ. అదే సమియంలో ఇలామంతు నాయుడు గూడా కాళ్ళూజేతులు కడుక్కుని సంగటికొచ్చి కూచ్చున్నాడు.

“పంబడా రేగి పోవును, మనతో గుద్దులాట బెట్టుకుంటే! మనమేమన్నా వాడి సొత్తుకు పొయ్‌నామా? మన బతుకు మనం బతకతా వుంటే–” అనన్నాడు మునికన్నడు.

“అట్టయితే వాడితో వచ్చుండే జంజికాటం ఏమి?” అనడిగింది యెంగటమ్మ.

“ఏమీలా, అద్దాలామె బాయిలో వాడూ సగ బాగస్తుడు గదా. అందుకని బాయిలో జాములేసుకొని, ఆ జాముల పకారం నీళ్ళు కట్టుకుందామని అంటా వుండాడు” అన్నాడు మునికన్నడు.

ఇది యినేసినాక మళ్ల కాలు గంట సేపు యెంగటమ్మ ఏమి గానీ మాట్లాడ కుండా గమ్మనుండి పొయ్యింది.

"బాయిలో జాములేసుకుంటే నష్టిమంతా మనదే. వాడు బాయిలో అర్ద బాగస్తుడే గాని పైరు సక్రంగా పండిస్తే గదా, నీళ్ళు కట్టుకునే దానికి. ఎప్పుడూ అర్ధం కయ్య బీడు బెట్టుకొనే గదా వుంటాడు. ఇప్పుడు జాము లేసుకుంటే దినానికి పన్నెండు గంటలు వాడికీ, పన్నెండు గంటల నీళ్ళు మనకూ. వాడు వాడి పన్నెండు గంటలల్లో మనల్ను మిసినీ యేసుకోని నీళ్ళు పారగట్టుకోనీడు. వాడి ఒప్పందం మనమూ బీడు పెట్టుకొని వుండాలని కోరతా వుండాడు ఆ కుళ్ళు నా కొడుకు" అని అమ్మకు ఇలావరి చేసినాడు మునికన్నడు.

యెంగటమ్మ ముక్కుల గుండా పొడుగ్గా గాలి పీల్చి, "ఏమిరా పెదబ్బా, మన పన్నెండు గంటల జాములో నీళ్ళు మన కయ్యకు చాలవా రా? కారు పలితంలో మనం దినమ్మా పన్నెండు గంటల సేపు మిసినీని యేసినామా? యాపై గుంటల కయ్యకి దినామూ పన్నెండు గంటల నీళ్లు కావాలనా? కారు పలితం మాదిర్తోనే వైశాక పలితం పండించుకోలేమంటావా?" అనింది.

"కారు పలితానికి వైశాక పలితానికి సమందం ఏమే కోతిదానా! అప్పుడు బాయిలో నీళ్ళు దండిగా వున్నాయి గదా! ఇప్పుడు గూడ జాములేసుకోని గీత గీసుకోకుంటే ఆ బాయిలో నీళ్లే జాస్తి. కాని ఆ మనిసి ఒప్పుకోలేదే!" అన్నాడు ఇలామంతు నాయుడు.

"అదీగాక కారు పలితంలో జాములేసుకో లేదుగదా! మనం ఎప్పుడు నీళ్ళేసు కోవాలని అనుకున్నామో అప్పుడు బొయ్ మిసినీ నొక్కినాము. ఇంక వచ్చే పలితం ఎండ కారు కదా. అసలిదంతా గాదు, మొన్న నాతో అన్నాడు సొసైటీ వోడు – 'మీరొచ్చి చేరినారు నా పక్కలో! నా పెళ్ళాం నన్ను ఎగిసెగిసి తంతా వుండాది రా. వారపు కయ్య జేసి వాళ్ళు నాలుగు గింజలు మిగల బెట్టుకోనుండారు. నువ్వు సొంత కయ్య పెట్టుకొని పలిత పలితం లోను మింద అప్పు తెస్తుండావని నా పెళ్ళాం నన్ను కసర్తా వుండాదిరా. మీరొచ్చి నాకు పెళ్ళాం సౌక్రిం లేకుండా జేసినారు' అని నవ్వతా మాట్లాడినాడు నాతో. అన్ని సంగతులూ చెప్పేస్తాడే నాతో! అవితే, మనిసి మాత్రం బలే తమాస మనిసి, బుద్ది ఎట్టున్నా!" అన్నాడు ధర్మడు.

“నీ ముండ మొకాన ఎండ కాసిందిలే, నువ్వు గమ్మనుండు” అని కసిరింది యెంగటమ్మ ధర్మడి మాటలిని.

అబ్బా కొడుకులు సంగట్లు తినేసి యింట్లో వుండిన చేంతాడుతో పాటు వూళ్ళో యింకా మూడు నాలుగు చేంతాళ్లు దండుకొని బాయి దగ్గిరికి వచ్చినారు.

అది ఏడు మట్టుల బాయి. దాంట్లోకి వచ్చి చేరే వూట అంతా పక్కూట. యాడ నుంచి వచ్చి ఆ వూట చేరతా వుండాదో తెలవదు. ఎల్లాకొల్లిగా వానలు పడినప్పుడు ఆ బాయి పొర్లి పారిన దినాలు కూడా వుండాయి. ఆ బాయిలో మూడూ మూడూ ఆరు దూలాలుండాయి. రెండు కరంటు మోటార్లుండాయి. ఆ దూలాల్లో మూడు అద్దాలామెవి, మిగతావి సొసైటీ ఆయనవి. ఇప్పుడు మోటార్లు నడి మద్యన వుండే దూలాల మింద వుండాయి. మొన్నసారి వానలు మొక్కుబడిగా నాలుగు చినుకులు రాలి పొయ్‌నాయిగాని మంచి వానలు పడలేదు. దాంతో మోటారు – నడి మద్య దూలం నుంచి కింది దూలం పైన పెట్టకుంటే మిసినీ నీళ్ళను లాగలేదు. కారు పలితంలో ఆ బాయిలో వుండే రెండు మోటార్లూ నడిమద్య దూలాల మిందనే వుండినాయి. అప్పుడు రెండు మిసినీలను యేసినా బాయి నీళ్ళను సప్లీ చేస్తా వుండింది. ఇంక కింది దూలాల మింద పెడితే ఒక మిసినీ పోతా వుంటే యింగొక మిసినీ నిలిపెయ్యాల్సిందే. అవితే యిప్పటి వరకు మంచి ఎండా కాలంలో కూడా ఆ బాయి అర్దమో నిర్దమో ఒక్క మిసినీకి నీళ్ళను అందిస్తానే వుండింది.

ధర్మడు పైపు గుండా జారి రెండో దూలం మిందికి చేరినాడు. స్పానర్లతో పంపుకూ మోటారుకూ మద్యన వుండే నట్‌లను వూడదీసి, మోటారుకు చేంతాళ్ళు పట్టుగా చుట్టినాడు.

మోటారును చేంతాళ్ళ గుండా కింది దూలం మిందికి దించి, అక్కడ పంపులకు బిగించేసి పని పూర్తి చేసినాడు.

వాళ్ళను యెతుకులాడుకుంటా అక్కడికి చూసి పోదామని గురప్ప నాయుడు వచ్చినాడు.

గురప్ప నాయుడు బాయిలోకి తొంగి చూసి, "బారడు లోతే వుండాయే నీళ్ళు. మిసినీ – కింది దూలం మిందికి దించినారా? ఈ పలితం నీళ్లు నిగ్గతాయో నిగ్గవో?" అని అన్నాడు.

ఈ మాటలకు ఇలామంతు, మునికన్నడు బయిపడి పోయి, "ఎట్లా – అని మాలో మేమే మలగుల్లాములు పడి కుళ్ళి చస్తా వుండాం. ఇంతలో నువ్వొచ్చి, నువ్వూ అదే మాట అంటా వుండావు" అని అన్నారు.

"దీనికే కుళ్ళి చావాల్నో? మీరు బలే యిచ్చిత్రపు మనుసులు సామీ. అప్పుడు అద్దాలామె వారం కాడ కొంచెం ఎగ నీలిగే కొందికి ఆమె కయ్యను గుత్తకియ్యదేమోనని ఎంత మందుంటే అంత మందీ జెరాలు తెచ్చుకుంటిరి" అనన్నాడు నవ్వు మొకంతో గురప్ప.

"అది గాదు బావా. మా పొరుగు మనిసి పొరికైతే బతికేది కస్టం గదా. ఆ సొసైటీ ఆయన బాయిలో జాములేసుకుందామని కుచ్చోనుండాడు" అని బాద పడిపోతున్నట్టు చెప్పినాడు మునికన్నడు.

దీనికి, "ఏమిరా రంగంపేటోడా! నువ్వు బలేటి నాయాలుగా వుండావు గదరే! మీదా పొరికి బుద్ధి, సొసైటీ ఆయనదా? వాడికి ఆడోళ్ళ పిచ్చి తప్ప యింకే చెడ్డ బుద్ధీ లేనోడు. మీకు బూమి పిచ్చి. ఇద్దురూ ఇద్దురే పొండి" అని నవ్వినాడు గురప్ప నాయుడు.

చేంతాళ్ళతో యింటికి ఎలబారతా మునికన్నడు, "ఏంది బావా, నువ్వు జెప్పేది, జాములేసుకుంటే మనకు నస్టిం గద బావా!" అన్నాడు.

గురప్ప నాయుడు మునికన్నడికల్లా పొడుగ్గా చూసి " ఈ బాయీ కయ్యా అంతా మీకే వొదిలేసి సొసైటీ ఆయన్ను నెత్తిన గుద్దేసుకొని పూడవ మంటావా?" అనన్నాడు.

మునికన్నడు ముక్కుల గుండా పొడుగ్గా గాలి ఒదిలి, "సడే సడే!" అన్నాడు.

గురప్ప నాయుడు కరుగ్గా మాట రానిచ్చి,"లేకుంటే ఏందిరా? మీ రంగంపేటలో సేద్యాలు ఎట్ట జరిగినాయో మర్చిపొయ్‌నారా? ఎండ కారు పలితంలో బాగాలుండే బాయిలో బాగస్తులు జాములేసుకోరా? సొసైటీ

ఆయన మీ మింద కత్తిగట్టి గాదు జాములేసింది. ఎండ కారులో అది ఏ బాయిలోనన్నా పద్దతి గాబట్టి జాములెయ్య మన్నాడు. వాన కారు పలితంలో జాములేసినా అనావశిం గాబట్టి యెయ్యలా. ఇట్ట జూడా, ఈ కారులో సొసైటీ ఆయన జాములెయ్యకుంటే ఇరై నాలుగ్గంటలూ మీరే నీళ్ళు తోలుకోని, ఆయన్ను గెంటిడు పైరును కండ్ల జూడనిద్దురా?" అని నవ్వినాడు.

ఈ మాటకు ఇలామంతు గూడా నవ్వేసి, "అదేందోనబ్బా, ఈ జాముల గురిచ్చి గెంట సేపు అమ్మతో మీటంగి బెట్నాడు" అన్నాడు.

అప్పుటికి నిమ్మళ పడినాడు గాని మునికన్నడికి యింకా బయం బయంగానే వుండాది ఒక మూల.

"మీరెన్నన్నా అనండి, ఈ పలితం కొంచెం కష్టమే. వానలు బాగ పడే దాక" అనన్నాడు మునికన్నడు.

"అది నీకొక్కడికేనా వూరందరికీనా?" అనడిగేకొందికి మునికన్నడి నోటికి బీగం పడిపొయ్యింది.

ఇంటికొచ్చే కొందికి యెంగటమ్మ మొకంలో యాడ లేని కళంతా వుండాది.

"ఏమమా?" అని మునికన్నడు అడిగితే, "గాట్లోకల్లా పొయ్ చూడుబో" అనింది యెంగటమ్మ.

"మనావు పేగుదూడ ఈనింది గదా" అని అంటా ఆవు దగ్గిరికి వచ్చినాడు మునికన్నడు. ఇలామంతు, గురప్ప, ధర్మడు కూడా ఆవు దగ్గిరికి వచ్చినారు. దూడ జాగిలంగా బాగుండాది.

"ఒరె, దూడ గూడ జెర్సీనే. చూస్తా వుంటే తెలస్తా వుండాది గదా" అన్నాడు ఇలామంతు.

ఇయ్యాళ దాక చూసింది చాలక, మళ్ళా ఆవును, దూడను చూసే దానికి వచ్చిన యెంగటమ్మ, "ఈ తెలివికి యాడబొయ్యేది? తిరప్తిలో జెర్సీ ఆవుకు జెర్సీ సూది యెయ్యకుండా, నాటు సూది యేస్తారా తిక్కల మొకమా?" అని నవ్వింది.

"అమ్మీ, మీ పంట పండింది పొండి. అయితే ఒక మాట, తెల్లారి మూడు సందేళ మూడు లీటర్లు పిండాల కావాల అనుకోకుండా ఒక రొమ్మును దూడకే యిడిచిపెట్టు. లేకుంటే లోబికి నాలుగందాల నష్టం అని దూడ ఎందుకూ పనికిరాదు. బాగ గాని పాలు తాపినారంటే యింక పది నెలలకు దూడ గూడ కట్టుకొస్తింది. అప్పుడు ఆవూ దూడ కలిసి ఎంత లేదన్నా ఆరేడు వేలు. మంచి చాన్సు కొట్టేసినారు పొండి. ఒరే పెద్దోడా నిజంగానే మీ దశి మారిందిరా, నాగుబాము నీ నెత్తిన పడగ బట్టిన కాడి నుంచి" అన్నాడు గురప్ప నాయుడు కుశాలగా, చెల్లి కాపరం ఆయన కండ్ల ముందర్నే పచ్చంగా కనిపిస్తా వుంటే ఆయన మొకంలో ఆనందం ఆడతా వుండాది.

వాళ్ళందురూ ఆవు దగ్గర్నుంచి కడగా వచ్చేసినారు.

మునికన్నడు అందర్నీ విడిచి పెట్టి వాళ్లమ్మను చేరి, "అమా, అపుడే మర్చిపొయ్‌నావా?" అన్నాడు.

ఆమె కొడుకు కల్లా జూసి, "ఏందిరా?" అనింది.

మళ్ళా మునికన్నడు, "అగ్గో, అప్పుడే మరిచి పొయ్‌నావు" అన్నాడు.

యెంగటమ్మ కొడుకు మొకంలోకి నవ్వు మొకంతో బారడు పొడుగు యదాదీక్షగా చూసి, "ఏందిరా" అనడిగింది.

"ఇంక ఏందీలా, బూందీలా. అప్పుడే మరిచి పొయ్‌నావు. నీ కత నాకు తెలవదా అమా! పుట్టినప్పుట్నుంచి చూస్తా వుండానే!" అన్నాడు.

యెంగటమ్మ కడ సారిగా, "చెప్తావ, చెప్పవ రా?" అనింది నవ్వు మింద నవ్వు నవ్వతా.

మునికన్నడు – నాయనతో మాట్లాడతా వుండిన గురవ బావ దగ్గిరికి వచ్చి, "గురవ బావా గురవ బావా! చూడు బావా, మా అమ్మ ఎటుమంటి మోసకారో!" అన్నాడు.

ఆ నాయాలి కుశాలలో గురప్ప నాయుడు గూడా బాగం పంచుకొని, "ఏందిరా, ఏమిరా తిక్కల నాయాలా!" అన్నాడు.

మునికన్నడు తోసుకొస్తా వుండిన నవ్వునాపి, "చూడు బావా, మా అమ్మ ఆవును పట్టకొచ్చినప్పుడు వుత్తరంగా తిరిగి తిరమల కొండల కల్లా చేతులు జోడిచ్చి, 'సామీ పరమాత్మా, ఆవుగాని పేగుదూడ ఈనిందంటే నాలుగు సొలిగల నెయ్యి నీ కొడిస్తంబంలో పోసి, యెంటికలిచ్చేస్తాను' అని మొక్కు కొనింది. పేగుదూడ పుట్టింది గదా, అంతే మరిచి పొయ్యింది. అక్కర తీరినాక అక్క మొగుడు కుక్కయితే ఎట్ట బావా?" అని మాట్లాడినాడు.

యెంగటమ్మ మసి గుడ్డను గూడా చేత్తో ఈదిలోకి తీసకొచ్చి, "చూడనా, ఈ మాదిర్తో నన్ను ఉడికాడిపిస్తాడూ! అయ్యో అయ్యో నేను మరవనే లేదనుకో. మొక్కుకున్న మొక్కు తీరవకుంటే కండ్లుంటాయా? అదీ గాక యిదే కడ మొక్కా? ఇంగ లేవా మొక్కులు? ఏమిరా పెదబ్బా నేను ఏ మొక్కును మరిచినానురా యెదవా! మొన్న మన పైరును ఎలికలు కొట్టకుండా వుంటే ఎలికలమ్మకు పెడతానని మొక్కుకున్నా, నట్టింట్లేకి వడ్ల గింజలు రాంగానే ఎలికలమ్మకు ఆశి దీరా పొంగలి బెట్టి మొక్కు తీరిస్తినా తీర్చలేదా?" అనింది.

"ఆ కతలన్నీ నాకు తెలవ్వు తల్లా. నువ్వు యెగటేస్పర సామికి మాత్రం మూడు నామాలు పెట్టద్దు" అన్నాడు మునికన్నడు నవ్వు మొకంతో.

గురప్ప నాయుడు యింటికి పొయ్ మళ్ళా రాత్రి అన్నాలు తిన్నాక ఇలామంతు ఇంటికి వచ్చినాడు.

"ఏం బావా, బండీ పాడు తోలుకోని వచ్చేసి యింటి కాడనే ఈ దినమంతా మకాం పెట్టేసినావు?" అన్నాడు మునికన్నడు, ఆ ఒక్క మాటే ఆయన్ను గురించి మాట్లాడి, మళ్ళా అతగాడి కుటుంబరం గురిచ్చే మాట్లాడడం మొదలుబెట్టినాడు.

"ఈసారి నీళ్ళు తక్కవ గాబట్టి ఇరై గుంటలు చెరుకు, పదైదు గుంటల మడి, పదైదు గుంటలు శెనిగా యెయ్యాలనుకుంటా వుండాం బావా! నీ మాట ఏమి చెప్పు?" అనడిగినాడు మునికన్నడు.

"చెరుక్కు, శెనిక్కి గూడా తక్కవ నీళ్ళు పట్టవనుకో. అయినా వరిమడి కన్నా సుమారే గదా! నీ యిష్ట పకారమే చెయ్యి. సేద్యంలో పట్టిడుపులు

నీకు తెలవ్వా ఏమి? బాగ శార్వీసు అయిపోయ్‌నావు గదా" అనన్నాడు గురప్ప నాయుడు.

ఇలామంతు నాయుడు అడ్డంగా ఒక పుల్ల యేసి, "ఉప్పు దిన్న ప్రాణానికి ఉపద్ర పెట్టుకొనేదెందుకబ్బా, నాకు జూడ చెరుకు తోట యెయ్యకుండా అంతా శెనిగి తోట యేసుకునేది సుమారు. ఏదో పది గుంటలు – వడ్ల గింజలు కొనకుండా, ఇంటి వాడిక్కి అయ్యేటట్టుగా పది గుంటలు మడి నాటుకోని మిగతా అంతా శెనిగి యేసుకుంటే హాయయిన పని గదా. చెరుకు తోట సమచ్చరం పైరు. మనం గానిగలు ఆడి బెల్లం జేసుకొనే కొందికి దేముళ్ళు కనిపిస్తారు. పెద్దోడేమో చెరుకు తోట చెరుకు తోట అని ఎగర్తా వుండాడు" అని దైర్నం లేకుండా మాట్లాడినాడు.

యెంగటమ్మ మొగుడి బుజాన్ని బట్టుకొని తోసి, "ఈ అదురు గుండికా యోడితో ఎట్ట గురప్పన్నా! మీ బావ మాటలే గాని యింటా వుండుంటే ఈపాటికి నా బిడ్లు రంగంపేటలో కూలికి బొయ్ చింత మాకులెక్కి చింత కాయలు రాలస్తా వుందురు. మొగోడికి తెంపూ తెగవా వుండాల" అని మాట్లాడింది.

ఇలామంతు నాయుడు నిష్టూరంగా, "ఇదబ్బా కత. నేను నోరు తెరిస్తే మీ చెల్లికి రేగి పోతిందబ్బా" అని, "అంతా మీ యబ్బతోడు" అనేసి అంతా వాళ్ళ నెత్తిన్నే పెట్టేసినట్టు గమ్మనుండి పొయ్‌నాడు.

"చెరుకు తోట సమ్మచ్చరం పైరయినా డబ్బు ఒక్కసారిగా చేతి కొస్తింది గద బావా. మన చంద్రబాబు నాయుడి వూరు – నారోళ్ళపల్లి – రైతులు చెరుకు తోట యేసే మన కండ్ల ముందర పెద్దోళ్ళయి పోలా. ఇప్పుడు ఈ వూర్లో కూడ యింటి వాడిక్కి అయ్యేటట్టు వరిమడి నాటుకోని మిగతా అంతా శెనిగి తోట, చెరుకు తోట యేసుకోని నాలుగు రూకల్ను చేతల్లో పెట్టుకోనుండ లేదా?" అని చెరుకు తోటకు పటం గట్టినట్టు మాట్లాడినాడు మునికన్నడు.

ఇలామంతు నాయుడు గమ్మనుండకుండా నోరు తెరిచి, "చెరుకు తోట నాటేటప్పుడు తెలవదు కష్టిమంతా. దాన్ని కొట్టి చెరుకు గానిగ ఆడి బెల్లం వంటలు దించేటప్పుడు తెలిస్తింది. ఆ బక్కెద్దులతో ఇరై గుంటల చెరుకు

తోటను ఆడగలగతామా?" అని అన్నాడు, రేణిగుంటకాడ చక్కిరి ఫాక్ట్రీ వుండాదని తెలిసి గూడ.

"నువ్వు ఏ కాలంలో వుండావు? రేణిగుంటలో చక్కిర ఫాక్ట్రీ వుండేది తెలవదా? ఆ మాత్రం తెలిస్తే ఇంక మాకు దిగులేమి?" అని అర్తం వచ్చేటట్టు ఆవులిస్తా మాట్లాడింది యెంగటమ్మ.

దీనికి మునికన్నడు వుడుకు నెత్తురుతో, "అవునవును, రేణిగుంట చక్కిరి ఫాక్ట్రీకి చెరుకును తోలి ఎంత మంది రైతులు చచ్చి పొయ్యుండేది!" అని ఎగతాళి పడినాడు.

దాని మింద వాళ్ళు ఆ మాటా ఈ మాటా రెండు గంటల సేపు మాట్లాడినారు గురప్ప నాయుడితో.

ఆ మరసనాడు మునికన్నడు ఒంటిగోడు చెంగమ నాయుడ్ని యింటికాడ గాకుండా మడి కాడ కలిసి, "చెంగ మామా! నాకు ఇరై గుంటల్లోకి చెరుకు యిత్తనం యియ్యాల గదే!" అనడిగినాడు.

"ఇంక వారం పది దినాల్లో నాకు చక్కిరి మిల్లు నుంచి పర్మిట్టు వస్తిందిరా అప్పుడు నీకు కావాలసినంత సోగ కోసుకో. నువ్వడిగేదీ, నేను కాదనేదీ వుండాదా?" అనన్నాడు చెంగమ నాయుడు.

"నీకు గుంటకు ముప్పై రూపాయిల లెక్కన ఏ పొద్దో ఒక పొద్దు ఇచ్చేస్తాను మామా. ఇప్పుడు మాత్రం ఇయ్యలేను సేయ్" అనన్నాడు మునికన్నడు.

చెంగమ నాయుడు ఈ మాటకు గుండి కాయల్లో నుంచి మాటలు రానిచ్చి, "నీకు చేతిలో రూక మెదిలినప్పుడే ఇయ్యిబోరా. అవితే చక్కిరి మిల్లునుంచి లారీ ఎప్పుడొస్తిందో ఏమో తెలవకుండా వుండాది. నేను తోట కొట్టినన్నాళ్ళు నీ మనుసులు ముగ్గురు నలుగురు నా తోటలో వుండకుంటే నేను తిప్పలు పడిపోతాను రా. వట్టి కూలోళ్లనే నమ్ముకోని నేనీ చెరుకును మిల్లుకు సబిలీ చెయ్యలేను" అనన్నాడు.

మళ్ళా సేద్యం పనులు ఒకదాని మింద ఒకటి వచ్చి పడి పొయ్‌నాయి. ముప్పై గుంటల దాక కయ్యను ఎలి దుక్కి దున్నే పని, ఇరై గుంటలు అడుసు దున్నే పని బడింది. మాట పకారం చెంగమ నాయుడు ఎద్దుల్ని

ఒక్క నెల మునికన్నడు తోలకొచ్చి గాట్లోనే కట్టేసుకొని సేద్యం జరుపుకున్నాడు. ఆ ఎద్దులతో కూడా బక్కెద్దులు కూడా పెరుకులాడినాయి. కూలులు తీసుకోకుండా బదుళ్ళకు పోయిన రైతులు కూడా ఏడెనిమిది మడకలు కట్టినారు. ఎలి దుక్కి నాలుగు దుక్కులు దున్నే కొందికి పెళ్ళ లేకుండా దుక్కి అంతా పేలపిండి మాదిరిగా అయిపొయ్యింది. అడుసు పనిగూడ సులువుగానే అయిపొయ్యింది.

మొగోళ్ళు మడక పనుల్లో, పార పనుల్లో మునిగి పొయ్ వుంటే యెంగటమ్మ, నాగరాణి ఇద్దురూ యింటికాడ వుండిన పేడను తట్టల్తో తెచ్చి చెదరేసినారు.

మునికన్నడు "మీ ఇద్దురూ ఎంత సేపయితే ఆ దిబ్బ ఎరువును పోసేది? అందరం తలా ఒక చెయ్యేస్తే బిరీన పనయిపోతింది వుండమా!" అని అంటా వుండినా యెంగటమ్మ చెవల్లో యేసుకోలేదు. నిదానంగా నాలుగు నాళ్ళు మోసే కొందికి వొంటికి కష్టిం తెలవకుండా ఆ పని అయిపొయ్యింది.

ఈ వైశాక పలితంలో గూడా కారు పలితంలో మాదిరిగానే పొట్టి వడ్లనే నారు పోసినారు, నాలుగు నెలల్లో కోతకు వచ్చేస్తింది గదా అని.

మునికన్నడు పొగుటి పూట జాములో మిసినీ యేస్తే – చెరుకు నాటే పనిని మొదులు బెట్టినారు.

ధర్మడు మడవలు తిప్పతా వుంటే ఆరేడు మంది ఇత్తనం నాటే దానికి మళ్ళుకున్నారు. గురవ బావ గూడా సమియానికి వూళ్ళోకి వచ్చుండడంతో ఆయన గూడా ఇత్తనం నాటే పనికి వచ్చినాడు.

మునికన్నడు, యెంగటమ్మ పక్క పక్కనే ఇత్తనం నాటతానే మాటలకు తగులు కున్నారు.

"అది గాదురా పెద్దోడా! ఇరై గుంటలు చెరుకు తోట నాటిస్తా వుండావు, పది గుంటలు శెనిగి తోట యేస్తా వుండావు. కేవిలం ఇరై గుంటల్లోనే మడి నాటే దానికి నారుపోసినావు. మనం ఏమి తినేది, అద్దాలామెకు ఇరై అయిదు మూటలు వారం ఏమిచ్చేది? చెరుకు తోటలో, శెనిగి తోటలో వచ్చిన మాసూలుతో అద్దాలామెకు వడ్లను కొనిస్తేనే గదా!" అనింది యెంగటమ్మ.

మునికన్నడు చెరుకు నాటకాన్ని ఒక రకంతో మరిచి పోయి, అమ్మ కల్లా మళ్ళుకొని, "మూడు మొకాలు తెలవకుండా మాట్లాడతా వుండా వేందమా, ఇరై గుంటల్లో చెరుకు తోట కేవిలం బొయ్‌నా అరై టన్నుల చెరుకు అయితింది గదా. టన్ను ఎంత? ఇన్నూరు ఇన్నూట యిరవై. అంతా లెక్కేస్తే పదైదు వేలవతా వుండాది గదా. ఇరవై అయిదు మూటల వడ్ల గింజలకు మూడువేల రూపాయిలు మఖా అవితే. అద్దాలామెకు ధర కట్టించేస్తే సరిపాయ. మళ్ళ మన నెత్తిన చెత్తేసేటోడు ఎవురు?" అన్నాడు.

యెంగటమ్మ బోదెలో చెరుకిత్తనం గుచ్చి, " పెద్ద కొడుకు మాటలింటా వుంటే కడుపు నిండిపోతిందబ్బా. అది సరే గాని రా మునికన్నా, సమ్మచ్చరంలో రెండు దపాలుగా ఇరై అయిదు మూటలకు దర గట్టియ్యాల గదరా సామీ" అని మాట్లాడింది.

"నీతో ఎట్ల ఏగులాడేదిమా నేను, ఈ పలితం పది గుంటల శెనిగి తోట యేస్తా వుండాం గదా. పది గుంటల్లో పన్నెండు మూటలనైనా మనం యాపారస్తుడికి కొలవమా – ఇంట్లేకి చమురు కోసరం రెండు మూటల కాయలు పెట్టుకోంగా ఆ పన్నెండు మూటలూ ఇన్నూరు రూపాయిల లెక్కన ఏమాయ? రెండు వేలా నాలుగు నూర్లు. సమ్మచ్చరంలో రెండు సార్లు ఆ పది గుంటల్లో చెనిక్కాయలు యేస్తాం గదా. అంటే సమ్మచ్చరానికి అయిదు వేలు. దీంతో అద్దాలామెకియ్యాల్సిన గుత్త తీరిపాయ" అని మునికన్నడు చేతులు తిప్పబోయి వాటం తప్పి యెల్లాలకల పడి పోబొయ్‌నాడు.

దీన్ని చూసిన గురప్ప నాయుడు నవ్వతా "వొరే, పనై పొయ్‌నాక మళ్ళ మాట్లాడుకుందురు లెండిరా సాములాలా" అని యాసండం పడినాడు.

"అమ్మా గొడకలకు పొగులు పన్నెండు గంటలు, రాత్రి పన్నెండు గంటలూ చాలవబ్బా మాట్లాడుకునే దానికి! ఏం మాటలుంటాయో గాని నోళ్ళు గూడ నెప్పులుండవు ఆ యిద్దరికి మటుకు" అన్నాడు ఇలామంతు నాయుడు.

చెరుకు తోట నాటే పంగ అయిపూడ్సింది. ఇంక పది నాళ్ళల్లో వరి మడి నాటేసి, ఆ పది గుంటల్లో శెనిగి తోట యేసేస్తే పైపై పని అయిపొయ్‌నట్టే లెక్క.

ఒక రోజు ఆవును పాలు పిండతా యెంగటమ్మ మునికన్నడితో మాటలకు దిగింది.

“మన ఆవు దర్మరాజురా. పాలు పిండతా వుంటే కాలు అట్టా యిట్టా అనునా? అయితే రెండు చేపులు దొంగ కూలిపోయ్‌న గొడ్డుకు” అనింది.

“రెండు చేపులూ లేదు పాడూ లేదు. ఏమమా, ఏ ఆవు అన్నా దాని దూడకు కొన్ని పాలను మిగల బెట్టుకోకుండా వుంటాదా? తెల్లారి రెండున్నర, సందేళ రెండున్నర చాలు గాని, నువ్వు మూడు లీటర్ల కోసరం దాన్ని చంపద్దు లెయ్” అన్నాడు మునికన్నమ నాయుడు.

యెంగటమ్మ పాలు పిండేది అయిపోనిచ్చి, పైకి లేచి నడుములు పట్టుకొనింది నెప్పికి.

“ఒరే, పాలు పిండే దానికి ధర్మడు ఎత్తిన గురువురా. ఎప్పుడు పొదుగు కాడ కూచ్చుంటాడో, ఎప్పుడు పైకి లేస్తాడో చేతిలో మూడు లీటర్ల పాలుంటాయి. వాడు వూళ్ళో ఆడోళ్ళకు పాలు పిండిచ్చి పిండిచ్చి శార్వీసై పొయ్‌నాడు. మన రంగంపేటలో ఆవులు గల్లోళ్ళందురూ మన ధర్మడ్ని పిలచకపొయ్యే దానికి తనకలాడిపొయ్యే వోళ్లు గదా!” అనింది.

ఇంట్లోకి వచ్చినాక, “మునికన్నా, మనం పైరు నాటకానికి ముందర్నే తిరమల కొండకు పొయ్ వచ్చేద్దుమా?” అనడిగింది యెంగటమ్మ. ఈ మాట కొడుకుతో అనాలనే అర గంట నుంచి మునికన్నడితో మాటలు పెట్టుకొనింది.

“నువ్వు ఒక్క సొలిగ పాలను గూడా యింట్లోకి పెట్టుకోకుండా పోసేస్తా వుండావే, నాలుగు సొలిగల నెయ్యిని కొడి స్తంబంలో ఎట్ట పోద్దుం?” అన్నాడు మునికన్నడు.

“అదీ నీ తెలివిరా పెద్దోడా, ఆ పనులన్ని నేనెప్పుడో మట్టసంగా చేసి పెట్నాను. నాలుగు సొలిగిల నెయ్యి కొని, ఇత్తలి సొమ్ములో పోసి పెట్టుండాను, అలమారలో వుండాది పొయ్ చూడుబో” అనింది యెంగటమ్మ.

ఆ మరసనాడే శనివారం, ఇల్లలికింది ఆవు పేడతో. మునికన్నడు, యెంగటమ్మ, ఆమె సిన్న కొడుకు, సిన్న కూతురు తిరమల కొండకు శనివారం తెల్లారి ఎలబారినారు.

ధర్మడు "నేనేమమ్మా, నెల తక్కవగా పుట్నానా?" అని నిష్టూర పొయ్‌నాడు.

"తిరమల కొండ మింద కిష్ణా సినిమాలు ఆడవు గదరా దొంగ నా కొడకా" అనింది నవ్వు మొకంతో.

మునికన్నడు రెండు రూపాయిలతో వాడి మొండిని అణిచి పెట్టినాడు. ఆ రెండు రూపాయిలెత్తుకుని ఆ సందేళ ధర్మడు కట్ట కింద యెంగటాపరంలో మోసగాళ్ళకు మోసగాడు సినిమాకు ఎలబారతాడు.

చేతిలో యాపై అరై రూపాయిలు పెట్టుకుని వాళ్ళు తిరమల కొండకు కదిలినారు. సందేళకంతా బోడి గుండ్లతో చూడ చక్కంగా వూరు జేరుకున్నారు.

## 7

పొగులు పొద్దల గూకూ రెయ్యి తెల్లవాదులూ మడి కాడనే సరిపోతా వుండాది మునికన్నడి పని. రంగంపేటోళ్ళు ఇరై గుంటల్లో చెరుకు తోట నాటేసినారు, ఇరై గుంటల్లో వరి పైరు నాటినారు, పది గుంటల్లో శెనిగి తోట యేసినారు.

ఈ రోజుటికి అద్దాలామె కయ్య అంతా పైరుతో కళకళలాడతా వుండాది. బాయిలో గూడ నీళ్ళు పరవాలా. వాళ్ళ జాము నీళ్ళతోనే కయ్య కష్టిం మింద పారిపోతా వుండాది. అప్పులతో పడ లేకనో ఏమో సొసైటీ ఆయన గూడా సేద్యంలో వుండే మర్మం కనుక్కున్నట్టుండాడు.

ఆయనకుండే కయ్యిలో అంతా – రెండు లోడ్ల చెరుకు ఇత్తనం ఏ ఊరు నుంచో లారీతో తోలకొచ్చి – చెరుకు నాటేసినాడు. దీంతో సొసైటీ ఆయన పని జమ్మాచారంగా వుండాది.

"నా పెళ్ళాం పోరు పడలేక నాకుండే కయ్యనంతా యిన్నాళ్ళు పొరంబోకును చేసి పారేసినా. నాలుగు గుంటల్లో రాగి నాటి, నాలుగు గుంటల్లో మిరప తోట నాటి, ఇరై గుంటల్లో మడి నాటి, పదైదు గుంటల్లో శెనిగి చెట్టేసి ఇన్నేండ్లూ సేద్యంతో చావుదొంపులై పొయ్‌నాను. ఈ రోజుటికి నా పని ఇశిలాయంగా వుండాది. నా పన్నెండు గంటల జాములో మిసినీ యేసి నా పట్టిడ మింద నీళ్ళేసేసి గెనిమ మింద కూచ్చుంటే తోటంతా

పారిపోతింది. సమ్మచ్చరంలో నా చేతికి నలపై యాపైయ్యేల చెక్కు వచ్చేస్తింది. ఈ సొసైటీ అప్పు నా వొట్టి కాలి మింది శెంతాన్ని గూడ పెరుక్కోదు" అని సొసైటీ ఆయన బాయి గడ్డ మింద కూచ్చోని సవాలేసినాడు.

ఆ వూళ్ళకల్లా చెరుకు పైరు యిసోసంగా వచ్చి అయిదారేండ్లే అయ్యింది. అంతకు ముందు గూడా ఎఱ్ఱ చెరుకు వుండింది గాని ఇంత ఎక్కువగా చెరుకు పైరు చేసేవాళ్ళు గాదు. అప్పుట్లో గానిగలాడి బెల్లం జేసుకొని యాపారస్తులకు అమ్ముకునే వాళ్ళు. అయితే ఆ బెల్లంతో – మట్టి గుర్రాన్ని నమ్ముకోని యేట్లో దిగినట్టుగానే వుండేది. పదీ పద్దైదేండ్లకు ముందర సొసైటీ ఆయన ముప్పై గుంటల్లో – ఎంతో దైర్నం జేసి రెండెకరాల్లో చెరుకు నాటినాడు. చెయ్యెత్తు పెరిగింది పైరు. ఆయన అంతకు మూడేండ్ల ముందర తనఖా బేంకీలో కయ్య అడుమానం బెట్టి పదివేలు అప్పు తెచ్చినాడు. ఆ అప్పు ఆ చెరుకు తోట గానిగి ఆడంగానే ఎగిరి పోతిందని ఆశలు బెట్టుకున్నాడు సొసైటీ ఆయన. చెరుకు తోట గానిగ ఆడితే – గుంట ఆరు జోళ్ళు తిరిగింది. సొసైటీ ఆయన గానిగ ఆడంగానే అయిన బెల్లాన్నంతా ఇంట్లో యేస్తే రెండిండ్లు పట్టింది. అప్పుట్లో యాపారస్తులు బాగ తిరిగి, "కట్ట డెబ్బయి రూపాయిలకు తూకం యేస్తావా సొసైటీ నాయుడా!" అని కుయ్యో మొఱ్రో అని అల్లాడినారు. అప్పుడు సొసైటీ ఆయన పెండ్లాం ఎగనీలిగింది. "నూర్రూపాయిల రేటు పలికినప్పుడు యేద్దాం నువ్వు గమ్మనుండు మొగదానా!" అని సొసైటీ ఆయన్ను కసురుకొనింది. సొసైటీ ఆయనా ఏరోజుటికారోజు రైసు మిల్లు కాడికి బొయ్ పేపర్ చూస్తానే వుండాడు. నెలలోనే బెల్లాన్ని అడిగే నీ కొడుకు లేకుండా పొయ్‌నాడు. నట్టింట్లో ముద్దలు ముద్దలుగా పేర్చి పెట్టిన బెల్లమంతా కారడం మొదులు బెట్టింది. దోసిళ్ళతో తోసి పోసి తవుట్లో పెట్టి ఎద్దలకు పెట్టాల్సొచ్చింది. అప్పుడు సొసైటీ ఆయన బేరగాళ్ళను కాళ్ళో యేళ్ళో పట్టుకుంటే కట్ట పదేడు రూపాయిలకు ఎత్తక పొయ్‌నారు.

ఇప్పుడు దేముడి దర్మాన రేణిగుంట కాడ చక్కిరి పాకిట్రీ పడబట్టి చెరుకును పండించే రైతులకు అంత కూడు దొరికే సొక్రిం వచ్చింది. ఎట్ట లేదన్నా టన్ను చెరుకుకు ఇన్నూరు ఇన్నూటా యాపై రూపాయిలు వస్తా వుండాది. చెరుకు కొట్టేటప్పుడు కొంచిం అగచాట్లు పడిపోతే చాలు. అదీగాక

చెరుకు తోటకు పడాల్సిన కష్టం మటుకు ఏముండాది? తొవ్వకానికి వచ్చినప్పుడు గడ్డీగాదం తవ్వేసి, దండేలు యేసేటప్పుడు దండేలు యేసేస్తే సరిపాయ. నీళ్ళు వుండాల్నేగాని తోట మింద మడవ యేసేసి కాలు మింద కాలేస్కోని గెనిమ్మింద కూచ్చుంటే చెరుకు తోట సపాయిగా పారిపోతింది. ఈ మాదిరితో రోజూ ఏడెనిమిది గుంటలు పారినా, తోట ఎప్పుడూ నల్ల తేమ తియ్యకుండా వుండి, గుంట మూడు నాలుగు టన్నుల చెరుకు పండి పోతింది. అందుకని నీటి ఆదారం వుండే రైతులందురూ ఈ మద్యకాలంలో చెరుకు దోటల మింద మరిగి పొయ్‌నారు.

సొసైటీ ఆయనకు బాయిలో పొగుటి పూట జాము వుండినప్పుడు రంగంపేటోళ్ళకు రాత్రి పూట జాము. ఆయన జాములో సొసైటీ ఆయన ఒక్క గెంట గూడా రుధాగా పోనియ్యకుండా పన్నెండు గంటల నీళ్ళూ చెరుకు తోట మిందనే యేసి పారగడతా వుండాడు. ఆయన తెల్లారి మిసినీ యేసేసి ఇంటికి గూడ పూడస్తా వుండాడు. సందేళ వచ్చి నిలుపుకోని పోతా వుండాడు.

“సొసైటీ వోడు బలే కరట్టుగా జరిపిస్తా వుండాడమా సేద్యం. మనకు ఈ రోజుటికి అరదట్లుగా సరిపోతా వుండాయి నీళ్ళు, ముందు ముందు ఎబ్బిడి జేసేది కాయం” అనన్నాడు మునికన్నడు బోడిగుండు తలకు శెనిగి చమురు పెట్టుకుంటా.

“బగమంతుడు పెట్టినట్టు అయితింది లేరా మునికన్నా! నువ్వు అదే మనేదతో దిగ కుంగి పోవద్దు” అని కొడుక్కి చద్ది పోసింది యెంగటమ్మ.

ఆమె ఆవుకు ఒక మోపు కసువు యేసేసొచ్చి, “మన కూలిపొయ్‌న గొడ్డు కసువు సరిగ్గానే తినదు రా, అట్టబొయ్ చూడుబో, వూళ్ళో గొడ్లు ఏ వాటంతో తింటా వుండాయో!” అనింది.

దీనికి మునికన్నడు, “కసువు దొబ్బుమాలినంత వుండాది గదాని, యేసింది యేసినట్టేగా వుంటే అది మాత్రం యాడ తినేదమా! యింక ముడ్డితో గూడా తింటేనే అది!” అని నవ్వినాడు. యెంగటమ్మ మునికన్నడికి ఎదురుంగా గొంతు కూచ్చోని, “ఈరోజు పాలోడు రూకలిచ్చినాడబ్బా. మళ్ల చెప్పలేదనేవు. నీ సొత్తు గదా, అందుకని చెప్తా వుండా” అనింది.

"ఎంతొచ్చిందమ్మా, ఈ నెల?" అని ఆత్ర పడినాడు మునికన్నడు.

"వొచ్చింది లిబ్బి, మిద్ది కట్టుదువుండు" అని కొడుకుతో యాసండం పడింది.

యెంగటమ్మ మళ్ళా, "మున్నూటా పది రూపాయిలొచ్చిందిరా" అని చెప్పకుండా వుండలేక పొయ్యింది.

ఈ సందులో ఇలామంతు నాయుడు, ధర్మా నాయుడు కూడా మడి కాడ నుంచి వచ్చినారు. వాళ్ళ యెనకాన్నే ఎవురో యిద్దురు గొడుగులేసుకోని వచ్చినారు. వాళ్ళను చూస్తానే యెంగటమ్మకు అవ్వాల్సిందంతా అర్తమై పొయ్యింది.

మొగుడ్ని తినేసేటట్టు చూస్తా వుండినా ఆ అమాయిక చక్రొర్తి, "ఆవు కోసరం బేరగోళ్ళొచ్చినారు. మంచి బేరం, చెప్పేసినా. ఇన్నూర్రూపాయిలు లాబం" అని బేరగోళ్ళను దగ్గిర బెట్టుకోనే మాట్లాడినాడు.

యెంగటమ్మకు తిక్క రేగిపొయ్, "య్యో, అదొట్టి పనికిరాని గొడ్డు యా! మేము తిరప్తిలో మోసపొయ్ పట్టేసినాము. దాని కోసరం వచ్చినారు, మీరెట్టాటోళ్ళుగా వుందురు?" అనింది.

ఆ బేరగోళ్ళలో ఒకాయన ఇచ్చిత్ర పొయ్, "అదేందిమా, అట్టంటా వుండావు? రెండున్నర యేలు పెట్టే దానికి గూడ మేము సిద్దంగా వుండామే! మీ ఆయనేమో అట్టన్నాడు, నువ్వేమో ఇట్టంటా వుండావు" అనన్నాడు.

యెంగటమ్మ వచ్చే కోపాన్ని అణగ దొక్కుకొని, "నాయనా, పాల గొడ్డు కాడ అపద్దాలు చెప్పరాదంట. ఆ గొడ్డు వామిడు కసువు తినేసి తెల్లారి ఒకటిన్నర, సందేళ ఒక లీటరు ఇచ్చేదానికే తనకలాడి పోతా వుండాది. దాన్ని పాలు పిండను బ్రమ్మదేముళ్ళు రావాల్సిందే గాని నరమానుల తరంగాదు. మేము గాబట్టి దాంతో యేగులాడతా వుండాము. ఆ గొడ్డును మేము నెత్తిన పెట్టుకోనుండాము. దాన్ని, బీదా సాదాగా వుండారు, మీ నెత్తిన తోసేదెందుకులే. మీరు పొండి" అనింది.

ధర్మడు గూడ దాన్ని అమ్మెయ్యాలనే చూపు వుండడంతో, "య్యో మాయమ్మ ఎగతాళికి మాట్లాడతా వుండాది" అనన్నాడు నవ్వతా.

"ఆ మకాతల్లి మాటలు యింటా వుంటే తెలస్తా వుండాయి గదా. ఈమె బలేటామెగా వుండాదే!" అనన్నాడు బేరగాడు.

"ఆ కతలన్నీ యాల? నువ్వు ఆవును యిస్తావా యియ్యవా?" అని తలకాయి గీరుకున్నాడు ఇలామంతు నాయుడు.

యెంగటమ్మ, "నాయినా, మంచి మాటల్తో యిక్కడ్నుంచి కదలబారండి. తప్పు మాది గాబట్టి మా మొకాలకు బట్టి మేమే మెట్లతో కొట్టుకుంటాము. దరమాత్ములాలా యింగెప్పుడూ ఈ సాయికల్లా రాబాకండి" అనింది. బేర గాళ్ళు అట్ట పోంగానే యెంగటమ్మ మొగుడ్ని తగులుకొనింది చూడూ –

"ఒక సొత్తును సంపారిచ్చాలంటే లేని కుశాల దారబొయ్యాలంటే యిది బలే మొనగత్తె" అని కూచ్చోనుండిన ఇలామంతును తలకుబట్టి ఒక్కటిచ్చింది.

"బాంగారట్టా ఆవు, దాని మింద పెట్టుకున్నావా పాపిష్టోడా? ఏమి వాయ్, దాని మింద నీకంత అతికారం? దాన్ని అమ్మేసే దాక ఒంటికాలి మింద వుండే టట్టుండావే! అవరా అవరా, మొనగోడా! ఏమమ్మా, నువ్వు దాన్ని రాళ్లుగొట్టి, చెమట దీసి సంపారిచ్చి వుండేది! నీకూ దానికి సమందం ఏమి? అది నా కొడకల లేత రెక్కల కష్టిం గదా. దాన్ని కూట్నీళ్లకు దారబొయ్యాలని పతిజ్ఞ బట్టుండావా?" అని మొగుడి బుజాలు బట్టి ఒక్క తోపు తోసింది.

మొగుడ్ని నోట మాట ఎత్తనీకుండా, "నియ్యమ్మా కోయి, యింగ నిలుపు. ముయ్ బొక్క, మంచి బేరం తెచ్చిందంట యిది, మంచి బేరం! నా కొడకా, రోజుకొక బేరం తెచ్చి, దానికి దిష్టి తగిలి పాలు పిండేటప్పుడు ఎగిసెగిసి తంతా వుండాదే! ఎట్టా గొడ్డు అది! దిష్టి తగిలినప్పుడు కరుపోరం ఆరతి బడితే అది బెదురునా? గంగాళంలో మూతిబెట్టి సగించినట్టు వాసన చూస్తా వుండాదే! ఆ మకలచ్చింని యింట్లో నుంచి తోలెయ్యాలని పంతం బట్టింది, ఈ ముండ మొకంది!" అని కాసుకు గాకుండా మాట్లాడేసింది.

"ఇంగ నిలిపెయ్, చాలుగాని!" అని అగుమానం పడతా వుండినట్టు అన్నాడు ఇలామంతు నాయుడు.

"అయ్యో నంగా!" అని బారడు పొడుగు దీర్గం దీసింది యెంగటమ్మ ఎగతాళిగా.

ఆమెకి నడిమధ్యలో ఎందుకనో నవ్వు వచ్చి, నవ్వి, "కడుపు మంట బొయ్ నవ్వొస్తింది ఈ కోతి మొకం యెదవ చేష్టలు తలుచుకుంటే! మునికన్నా, ఈ మొగోడి చేత యేలు తొక్కించుకొని, బొట్టు కట్టించుకొన్నప్పటి నుంచి ఈ వాటంతోనే గదరా ఈ దరిద్రుడితో యేగతా వుండేది? నేను గాబట్టి పడతా వుండా, యింగొక ఆడది గానయ్యుంటే కాపరానికొచ్చిన మూడో నాడే కుండాసట్టి వక్కలేసేసి దొబ్బేసుండదా! పతివొర్త కూతుర్ని గాబట్టి పడతా వుండాను పాటు. లేకుంటే చూడేమి, ఒక గొడ్డును సంపాయించుకోని, దాని పాలసుక్కను కండ్ల జూస్తా వుండామనుకో. దాని మింద ఎంత పెద్ద కత్తి కట్టుండాడో చూడు! దాన్నిప్పుడు అమ్మే పనేమొచ్చె?" అని మొగుడి పైపైకి పొయ్ మాట్లాడింది.

ఇంట్లో ఈ గంగ జాతర జరగతా వుంటే, ఇంట్లో ఎంత మందుండారో అంత మందికీ కట్టకింద యెంగటాపరంలో సిల్మా కొటాయిలో ఆట జూసినట్టే వుండింది. తగరారు, మొగుడితో ఆడడంలో యెంగటమ్మకు మించిన ఆడామె ఈ కలిగ్గంలో వుండదు.

ఇలామంతు నాయుడు, "ఆ బేరగాళ్ళ ముందర నా మొకానికి మసి పూసింది చాల్లే, ఇంక గమ్మనుండు. ఇంకెప్పుడన్నా బేరం తెస్తే పేడా చెత్తా తోసే చాటా పొరకతోనే వాయించు తల్లా. నేను మంచి బేరం వచ్చినప్పుడు ఆమ్మేస్తే, దానబ్బుట్టా ఆవును పట్టుకోవచ్చు గదా అని ఆశి పడి నీ దగ్గిర దొబ్బించుకున్నా" అనన్నాడు నిష్టూరంగా.

"చొచ్చొచ్చొ, బతికించేటోడా! మమ్మల్ని ఉద్దరించేటోడా! మద్యానాలకే మకరాజును చేసేసేవు సామీ, కొంచిం కుదురూగా వుండు మేనమామ కొడకా!" అని గేలి చేసింది యెంగటమ్మ.

"నేను మీతో ఎగతాళి బడే వోదాలో లేనమ్మా! నేనెవుర్ని ఈ యింట్లో! మీ కింద సేద్యగోడ్ని. ఉడుంకేల వూర్లో పెత్తనం?" అని యాష్ట పొయ్‌నాడు ఇలామంతు నాయుడు.

ఈ మాటలిని కికీకీ అని నవ్వినాడు మునికన్నడు.

ఇలామంతు నాయుడికి కొంచిం కొంచింగా కోపమొచ్చి, "రేపు ఉగాది పండక్కు కొంచిం పెట్టుకోరా, అంతా యిప్పుడే నవ్వేసేవు రోయ్" అనన్నాడు.

ఈ మాటకు యెంగటమ్మ, "చేసింది చాలకుండా ఏమి, అందరి మిందికి ఒంటి కాలి మింద పోతుండావు?" అని కసిరింది.

"నువ్వు బోయే నియ్యమ్మా రవుడీ నాయాలీ ముండా" అనేసి ఆయన చద్ది తాగకుండా మడి కాడికి పూడ్సినాడు అలిగి.

యెంగటమ్మ ఆయన పొయ్‌నాక, "ఇంక ఆయనది గెరడ గొమ్మం అని మనం ఆయన యెనకాన్నే చద్దెత్తుకొని పోవాల, పడతా లేస్తా. అదీ యిప్పుడు నేను జేసిన లాబం" అనింది యెంగటమ్మ నవ్వతా.

ఆ రోజు నుంచి మునికన్నడి వాళ్ళకి బాయిలో రాత్రి పూట జాము. మునికన్నడు సందేళ అయితే బాయి దగ్గరికి వచ్చి, మిసినీ యేసి అక్కడే పొనుకునే వాడు. బాయిలో బాగా నీళ్ళుంటే గంటలో పారిపోవలసిన ఇరై గుంటల మడి, ఇప్పుడు రెండు గంటలు నీళ్ళు పొయ్‌నా పారడం లేదు. మునికన్నడు రెండూ రెండున్నర గంటల నీళ్ళు మడి మింద యేసి, మళ్ళ చెరుకు తోట మింద యేసే వాడు. చెరుకు తోటకు కూడా ఈనాటికి పారుదల బాగనే వుండాది. ఇప్పుటికి శెనిగి తోటకు రెండు తడులు వేసినాడు. ఆరు తళ్ళు వేస్తేగాని దాన్ని పెరకలేము.

ఒక రోజు సందేళ మునికన్నడు బాయి కాడికి వచ్చుండి నడవలూరు వంకన ఒక పెద్ద ఈత చెట్టుకు ఒకాయన కల్లు దుత్త కట్టతా వుండడం పొడుగ్గా చూసినాడు.

"రాత్రికి నా చేతిలో దీనికి పనుండాది" అనుకొని నవ్వుకున్నాడు. చెట్టుకు కల్లు దుత్త కట్టిన ఆయన మునికన్నడికి బాగా తెలిసిన వాడే. ఆయన దగ్గిరికి పొయ్ మాటల్లో పడినాడు మునికన్నడు.

కల్లాయన మునికన్నడ్ని చూడగానే, "ఏమి మునికన్నా, తెల్లారి దుత్త యిప్పేటప్పుడు చెట్టుకాడికి రా. రెండు గలాసుల కల్లిస్తా, తాగుదువు గాని. ఏందియా, మొగ పుట్టక పుట్టి కనీసం బీడీ అన్నా తాగకుండా" అని అన్నాడు.

మునికన్నడు ఆ మాటకు మూతి చిటకరించుకొని, "కల్లు తాగే పనా? మా కమ్మిరకంలోనే ఆ పని లేదుయా" అనన్నాడు.

కల్లాయన 'పోరా బోసడీకీ' అన్నట్లు మునికన్నడ్ని చూసి "గుంత కమ్మపల్లిలో వుండేది కమ్మోళ్లా, నేతగిరిపల్లి మాలోళ్లా? నాకు తెలవక అడగతా, చెప్పు?" అనన్నాడు.

మునికన్నడు, "గుంత కమ్మపల్లిలో వుండేది మా కమ్మోళ్ళే గదా" అని అన్నాడు.

"ఆ వూర్లో ఏ చెట్టుకు దుత్త గట్టినా, నా కొడుకులు తెల్లారే కొందికి కల్లంతా తాగేసి దుత్తను కూడ పగలగొట్టేస్తారు. కమ్మోళ్ళను గురించి నాకు చెప్తావు నువ్వు శాస్త్రాలు? అందురూ నీ బోటి కమ్మోళ్ళే వుంటారని అనుకోవద్దు" అని కల్లాయన మునికన్నడి నోటి నిండికి గెడ్డి బెట్నాడు.

"ఏమి నాశనమో, మా వొంగిసంలో తాగేది తందనాలాడేది మాకు తెలవదు" అని మునికన్నడన్న మాటకు, "అవును మీ నాయిన అయితేనేమి, మీ గురవ బావ అయితేనేమి బలే సంసారి మొగోళ్లు గదా!" అనన్నాడు.

ఆ తెల్లారి జామున బాయి కాడ నుంచి చక్కా ఈత చెట్టు కాడికొచ్చినాడు మునికన్నడు. ఈత చెట్టు మొదులుకు ఒక దండం పెట్టేసి సరసరా మాకెక్కేసినాడు. ముక్కాలు వాశి దుత్తకు నిండి పొయ్యుండాది కల్లు. దుత్త నిప్పుకోని చివల్ రూట్ మింద దిగేసినాడు మునికన్నడు.

మునికన్నడు ఆ ఈత చెట్టు కింద తిరపతి జాతర జరుపుకున్నాడు. దుత్త కాడ నుంచి మూతిని తియ్యాలనిపించలా. ఆ కల్లులో ముక్కాలు వాశి గుట గుటామని తాగేసి మళ్లా చెట్టెక్కి దుత్తను యదా పకారంగా కట్టేసి బాయి కాడికి పొయ్ మిసినీ దగ్గిర నంగ మాదిరిగా పొనుకున్నాడు.

తెల్లారి నిద్ర మొకంతోనే చెట్టు దగ్గిరికి వచ్చినాడు మళ్ళా. వాసనా పాడూ వచ్చి కల్లాయనకు డవుటు వస్తిందేమోనని గెనాలకుండే గుంట గింజేరి ఆకును నమిలి పొండ్లు తోముకున్నట్టు పుక్కిలించి వూంచేసినాడు.

కల్లాయన ఈత మానెక్కి దుత్తనిప్పి నమ్మలేకుండా, మొకం చిట్లించి, "అంతా కరమ్మ" అని, "ఆకార పుష్టి నైవేద్ధి నష్టి అంటే యిదే. దీనమ్మా కడుపు కాలా, ఇంత చెట్టుకు యింత నీరేనా? ఈ చెట్టు యాపై రూపాయిలకు

కాంట్రాటుయా? ఏమి జేద్దాము, టయాలు! తొలి రోజు కదా – రేపు చూడనా?" అనేసి పూడ్సినాడు.

వరసగా రెండో రోజు గూడ అదే పని చేసినాడు మునికన్నడు. ఈసారి, మళ్ళా దుత్తనెత్తి చెట్టుకు కట్టేదానికి ఒళ్ళవక చెట్టు కిందనే పెట్టేసినాడు.

ఆసారి కల్లాయన బూమండలంలో వుండే మనుసులందరి మిందా డవుటు పడి, మునికన్నడ్ని మాత్రం నమ్మి, "నేను చెప్పలా, యిది గుంత కమ్మపల్లోళ్ళ పనే. లేకుంటే ఏందియా, ఇరై రూపాయిల కల్లు కారాల్సిన చెట్టు రెండు రూపాయిల కల్లు కూడా కారలా నిన్న. రేపు ఇద్దర మనసలం వొచ్చి కావిలన్నా వుంటాం. ఇంక ఏమిదా చేద్దుమయా?" అనన్నాడు.

ఆ రాత్రి మునికన్నడు ధర్మడిని మడి కాడికి పిలిస్తే అతగాడు, "మళ్ళ నేనేమిటికి, నీకు తోడా?" అని ఎగ నీలిగినాడు.

కల్లు సంగతి చెప్పగానే మేక పిల్ల కూడా వచ్చినట్టు యెనకన్నే వచ్చినాడు ధర్మడు.

తెల్లారి జూమున ఈత చెట్టుకు అంత దూరంలో నిలబడే ధర్మడు, మునికన్నడు చెట్ల కల్లా మట్టి పెళ్ళలను యిసిరేసినారు.

ఈత చెట్టు కాడ కావిలుండిన వాళ్ళు ఓయమ్మల్లో, ఓయక్కల్లో అని పరుగు లెత్తేసినారు.

నాలుగు రాళ్ళెత్తుకోని ధర్మడు చెట్టు కాడ నిలిచుంటే మునికన్నడు కల్లు దుత్త యిప్పుకోనొచ్చేసినాడు. ఇద్దురూ చెరి సగం తాగేసి కైలాసం చూసినారు.

"మా కయ్యల కాడ చెట్టు కల్లును మీరు అనుబోగిస్తారా రామాపరం నాయాండ్లాలా!" అని పాట పాడి ఎగతాళి పడినాడు మునికన్నడు.

ఆ తెల్లారి కల్లాయన బాయి దగ్గిర పొనుకోనుండే మునికన్నడి దగ్గిరికొచ్చి, "నేను చెప్పలా మునికన్నమ నాయుడా! ఈ పక్క ఈత చెట్లల్లో కల్లును కాపాడే దానికి బ్రహ్మ దేముండ్లు రావాలని? యింక ఈ పక్కలోకి కల్లు కోసరం వస్తే మా మొకాలకు బట్టి మెట్లతోనే కొట్టండి!" అని గుంత కమ్మపల్లె రైతుల మింద నిష్టూర పడి, అదే పోవాటం!

మునికన్నడు యింటికి పొయ్ వాళ్ళమ్మతో, "అమా, నాలుగు నాళ్ళు మంచి చాన్సు కొట్టినానమా! నూరు రూపాయిల కల్లు తాగుంటా. కల్లాయన్ను ఏడిపించి ఏడు చెరువుల నీళ్ళు తాపించినా. అయినా నా మింద దవుటు పడలేదనుకో. నా చాతుర్రిం చూడమా!" అని మొగలాయి మాటలన్నీ చెప్పుకున్నాడు.

"పోనీలేరా ఎర్రి నా కొడకా! వుడుకు జేసిన నీ ఒళ్ళు దీంతో శాంబరిస్తింది లే" అని ముదిగారానికి పొయ్యింది యెంగటమ్మ.

## 8

వరి మడి కలుపు తీసేసినాక ఎన్ని నీళ్ళు యేసినా, కయ్యలో తెల్లారే కొందికి తేమ కనిపించకుండా పోతా వుండాది. ఎండలు ఆ మాదిర్తో మిడిమేలంగా కాస్తా వుండాయి. అద్దాలామె బాయిలో మొన్న మొన్న బారట్లోతు వుండిన నీళ్ళు యిప్పుడు మూరట్లోతుకు వచ్చి నిలిచి పొయ్నాయి. ఆ బాయి అయిదార్సు పవరు మోటారుకు నీళ్ళు సబిలీ చెయ్యలేక ముక్కతా వుండాది. ఆ బాయిలో పేరుకు రెండు మోటార్లు – అయిదార్సు పవరువి – వుండాయే గాని, అవి ఎత్తిపోసే నీళ్ళు, మూడార్సు పవరు మోటారు నీళ్ళన్ని గూడా లేవు. రంగపేటోళ్లు పుట్‌బాలుకు సంచిపట్ట కట్టాల్సొచ్చింది. సొసైటీ ఆయన అయితే పంపుకు గేటువాలు పెట్టి నీళ్ళు తోలుకుంటా వుండాడు.

"యెన్న బడేటప్పుడు బాన పగిలిందంటే యిదే గదా! వరి మడి పొట్ట కరుకు మింద, శెనిగ తోట వూడలు దిగతా, చెరుకు తోట గెణుపెక్కతా వుండేటప్పుడు బాయి మోసం చేసేస్తా వుండాదే! ఈ పలితం నిగ్గబొయ్యేది ఎట్ట, సామీ!" అని రంగంపేటోళ్ళకు ఎదగుండె పడిపొయ్యింది.

మునికన్నడు చెరుకు తోట మింద నీళ్ళేసి ఇరవై నాళ్ళవతా వుండాది. వూడలు దిగినాక మూడో తడి నాలుగు గుంటల శెనిగి తోట మిందనే పడింది. యింక ఆరు గుంటల శెనిగితోట నిట్ట నిలువున వాడిపొయ్ గలగలంటా వుండాది, నీళ్ళన్నీ యిరై గుంటల వరి మడికే చాలటంలా.

మిట్టూరికి పది బారల దూరంలోనే వంక దాటినాక దిగూరు అని వుండాది. ఆ వూరికి గుంత కమ్మపల్లి అని గూడ పేరు. నీటి జాడలో

మిట్టూరికీ, దిగూరికీ – నక్కకు నాగలోకానికి వున్నెంత వారా వుండాది. దిగూరు అనే ఆ వూరు, గుంతలో వుండబట్టో ఏమో ఆ వూరి బావులు మాత్రం ఈ ఎండాకాలంలో గూడ పరవాలా. దిగూరులో చేందబావుల్లో గూడ ఈనాటికీ దిగూరు ఆడోళ్ళు చేందుకుంటా వుండారు. అదే మిట్టూరాడోళ్ళు గుండికాయల్లోకి నీళ్లు దిగేటట్టుగా బోరింగులను కొట్టి చస్తా వుండారు. ఆ వూళ్లో ఒక తలకశిం వుండాది. రాయలచెర్లో నీళ్లుంటే ఆ కాలవ పారతానే వుంటాది. ఆ నీళ్లే సగం కయ్యలకు సరిపోతాయి దిగూరోళ్లకు.

దిగూరులో మత్తేపు అని ఒక పెద్ద రైతు వుండాడు. అంత పెద్ద రైతు గాబట్టే ఆయన ఆ పేరెత్తుకున్నాడు. ఆయనకు కసిమి కాలవ పక్క బ్రమ్మాండమైన బావులు రెండుండాయి. ఆ రెండు బావల్లో ఏడార్సు పవరు మోటార్లుండాయి. పెద్దోళ్ళ కాలంలో కసిం కాలవ ఎండింది లేదంట. అది మన కాలంలో ఎండిపొయ్‌నా ఆ కసిం కాలవ సొబాయం ఈ మత్తేపు బావులకు తగిలినట్టుండాది. ఆ కాలవ దర్మాన దిగూరు బావులు నయంగా వుండాయి.

మత్తేపుకు ఇన్నూరు గుంటల కయ్య వుండాది. ఆ పద్మూడెకరాలకు ఒక బాయిలో నీళ్ళే జాస్తి ఆయనకు. మత్తేపు యింకొక బాయిలో నీళ్ళు దిగూరులో బావులు లేని రైతులకు, వుండినా నీళ్ళు చాలనోళ్ళకు నీళ్ళిస్తాడు. ఏడార్సు పవరు మోటారుతో ఒక్క గంట నీళ్ళిడిస్తే ఎండా కాలంలో ఎనిమిది రూపాయిలు. అన్ని రూపాయిలిచ్చి కట్టుకోవాలన్నా ఎంత మంది ఆయన చుట్టూరా! మత్తేపుకు ఇన్నూరు గుంటల కయ్య ఎంత ఆస్తో, ఆ రెండు బావులూ అంత ఆస్తి. ఆయనకు ఆరు మంది తమ్ముళ్ళు. వాళ్ళంతా యేర్లుబోతే వాళ్ళూ చిన్న రైతులయి పోతారు. వాళ్ళకు ఇరై అయిదు నుంచి నలపై ఏళ్లుండి, అందరికీ పెండ్లిండ్లు అయిపొయ్‌నాయి. 'అందరం ఒకటిగా వుంటేనే వూళ్ళో మనకు పట్టు' అని తెలుసు ఆ అన్నాదమ్ముళ్ళకు. వాళ్ళ పెళ్లాలకు ఒకర్ని జూస్తే ఒకరికి కాసుకు పడదు. ఆ ఆడోళ్ళు ఎవురి సబ్బుల్ను వాళ్ళు రుద్దుకోని, వాళ్ల పిలకాయలకు రుద్ది, ఎవురి సబ్బుల్ను వాళ్ళు పెట్లల్లో పెట్టుకుంటారు. వాళ్ళింట్లో పేరుకు వుండేది ఒక పొయ్యే గాని, ఎవురి మొగుళ్లకు వాళ్ళు కోడిగుడ్లు వుడకబెట్టు కుంటారు. వాళ్లింట్లో వాళ్లకు ఎన్ని

వుండినా, యేర్లు మటుకు పోలేదు. మత్తేపుకు గాని, మత్తేపు అన్నాదమ్ముళ్ళకు గాని మడక పిడి పట్టుకోని చక్కంగా కొంౡ యేసేది తెలవదు. వాళ్ళకు ముగ్గురు మాలోళ్ళు సేద్యగోళ్ళుగా వుండారు గాని, సన్నా బన్నా రైతులందురూ వాళ్ళకు సేద్యగోళ్ళే.

"మత్తేపు చేతిలో గంగ వున్నెంత కాలం వాళ్ళకేమి, దిగులా బయమా?" అనుకుంటారు ఆ వూరి రైతులు.

ఉన్నట్టుండి చెరుకు మిల్లు నుంచి లారీ వచ్చిందంటే, మత్తేపు దగ్గిరికి నీళ్ళకొచ్చిన రైతులే తలా ఒక మోపు యేసి లారీని నింపేస్తారు. పిలిచినప్పుడు పలక్కుంటే నీళ్ళకు గతి లా. వాళ్ళు కాల్తో చెప్పిన పని చేత్తో చేసేవోళ్లు బొచ్చుడంత మంది.

ఇలామంతు నాయుడు మత్తేపు దగ్గిరికి పొయ్, ఎంతో చిన్నోడ్ని అయిన మత్తేపును బట్టుకోని, "మామా!" అని, "నువ్వు మాకల్లా గూడ ఒక చూపు చూడకుంటే మాకు ఈ తూరుపు రాజ్యంలో గూడ బతుకు లేదు మామా!" అనన్నాడు.

"చెరుకు తోట తుత్రమారంగా ఎండి పోతుండాది. మడిని, శెనిగి తోటను మా నీళ్ళతోనే ఏ ఆటో వొక ఆట ఆడి పారగట్టుకుంటా వుండాము. మన నీళ్ళు చెరుకు దోటకు రావాల మామా! లేకుంటే నోటి కొచ్చిన పైరు పనికి రాకుండా పొయ్యేటట్టుండాది. తోట గెఱపు యేసేటప్పుడు తోటలో చెమ్మ తియ్యొచ్చా? ఇప్పుడు బొయ్ ఆ తోటలేకల్లా చూడుబో, అప్పచ్చుల పెనుం మాదిరితో మాడిపొయ్ వుండాది" అనన్నాడు ఇలామంతు నాయుడు మళ్ళా. ఈ మాటలకు మత్తేపు, "నాలుగు నాళ్ళు నాకు నిండా తొక్కడగా వుండాది. నాలుగునాళ్లు నిదానించి మళ్ళ పంపించుబో, నీ కొడకల" అనన్నాడు.

నాలుగో నాడు మునికన్నడు పోతే నీళ్లిచ్చినాడు. మునికన్నడు ఆ ఇరై గుంటల చెరుకు తోట మిందికి ఆరు గెంటలు పోనిచ్చినాడు. చెరుకు తోటకు ప్రాణం లేచి వచ్చింది. మునికన్నడి చెరుకు తోటకు, మత్తేపు బాయికీ చానా దూరం. నీళ్ళు సాగి వచ్చే దానికే అరగంట సుమారుగా పట్టింది. మళ్ళ రెండూ రెండున్నర గంటలు పోతే శెనిగి తోట కళకళ లాడింది.

శెనిగి తోటకు నీళ్ళేసి వుండిన మునికన్నడికి యెంగటమ్మ సంగటెత్తుకొని వచ్చి, బతుకు మింద వుండిన ధైర్యాన్నంతా యిడిచి పెట్టేసి, "ఏమిరే మునికన్నా, గుత్తకు చేసే కయ్యను నీళ్ళు కొని పారగట్టాలంటే మనవల్లా అయితిందా రా?" అని బాద పడింది.

"యింకేమి చేద్దామమా, మన తాతలు మత్తేపు తాతలు మాదిర్తో అన్నీ అమిర్చి పెట్టి పోలేదే! మనల్ను కష్ట పడమన్నారు, కూడు తినమన్నారు" అనన్నాడు మునికన్నడు.

సొసైటీ ఆయన ఒక్క సెంటు నేల గూడ మడి దున్నక పొయ్‌నా ఆయన జాము నీళ్ళే ఆయన చెరుకు దోటకు చాలకుండా పోతుండాయి. ఆయన గూడా మత్తేపు బాయి నీళ్ళు యేసుకుంటా వుండాడు.

ఒక్క నెలలోనే ఇరై గుంటల చెరుకు తోటకూ ఇరై గంటల నీళ్ళు కొనాల్సి వచ్చింది ఇలామంతు నాయుడు.

మత్తేపు చేతిలో వందలు వందలు పెట్టినా యాడికీ పోవనుకుంటారు రైతులు. ఆయన ఎప్పుడన్నా నీళ్లిస్తాడు గదాని. నీటి యారవ లేని బీదాబిక్కి రైతులు పదో ఇరవయ్యో రూకలు ఆయన చేత ఇచ్చి పెట్టుకుంటారు.

ఇరై గంటల నీళ్ళకూ నూటా అరై రూపాయిలు అచ్చుకోవలసి వచ్చింది రంగంపేటోళ్ళు.

యెంగటమ్మ ఒక మట్టి వుండీలో పాల రూకలు యేస్తా వచ్చింది. ఆమె చానా నాళ్ళ నుంచి పొంత కోసరమని ఒక ఇత్తలి అండాను కొనుక్కుందామని అనుకుంటా వుండింది. ఇప్పుడు నీళ్ళకయిన దుడ్డు కోసరం దాన్ని పగల గొట్టాల్సొచ్చింది.

"పాల సుక్కను అమ్మి నీటి సుక్క కొనాల్సి వచ్చింది గదరా మునికన్నా" అని యాదకు పోయి ఆమె నూటా అరై రూపాయిలను మునికన్నడి చేతికి ఇచ్చింది.

మునికన్నడు మాత్రం తెంపుగా వుండి, "ఏమమా, అన్నీ తెలిసి గూడ నువ్వీ రకంతో కుళ్ళిపోతే ఎట్ట? పది రూకలు వచ్చేటప్పుడు నాలుగు రూకలు పోకుండా వుంటాయా?

మనం పీతి మింద రూకను నాలికతో అద్దుకుంటా కూచ్చుంటే చెరుకు తోట ఏమిటికి పనికొస్తింది చెప్పు? మత్తేపు మామకు పిలిచినప్పుడు పలకతా వుంటే ఆయన చెరుకు తోటకు నీళ్ళిస్తా వుంటాడు. ఇంక రెండు నెల్లు అగచాట్లు పడిపోతే మన మడి కోతకొచ్చేస్తింది, శెనిగి చెట్లు పెరికేస్తాం. మళ్ళ మన బాయి నీళ్ళే చెరుకు తోటకు సరిపోతాయి. ఈ లోపల వాన కారు వచ్చేస్తింది. వానలు పడిపోతాయి, మళ్ళా మడి దున్నుకోవచ్చు, పై దూలం మింద మోటారు పెట్టుకోవచ్చు" అని నొచ్చుకోని మాట్లాడినాడు.

'మనం బయపడితే మన బిడ్లు కూడ బయపడతారు' అని చెప్పి యెంగటమ్మ దారాళంగా కొడుకు చేతిలో దుడ్డు పెట్టింది.

మరసనాడు తెల్లారి యెంగటమ్మ తెంపు చేసి పాల రూకల్లో మిగిలిన దుడ్డును కొంచెం ధర్మడి చేతికిచ్చి గంగిరెడ్డి పల్లికి పంపించింది. ధర్మడు గంగిరెడ్డి పల్లి నుంచి యాపై రూపాయిలిచ్చి సీకూర తెచ్చినాడు.

ధర్మడు మడి కాడికి పోయి, "య్యో, మా అమ్మ నాచేత దుడ్డిచ్చి ఒకటిన్నర కేజీ మాంసం కూర తెమ్మనింది, నేను తెచ్చినా" అని కుశాలగా నాయినతో చెప్పినాడు.

ఇలామంతు నాయుడు పరంట పక్కకు చూసి, మళ్ళా తూరుపు కల్లా చూసినాడు. తూరుపు కల్లా పొద్దు కనిపించే సరికి, "పొద్దు పరంటగా లేదు గదరా!" అనన్నాడు.

"ఈ రోజు వాన గ్యారంటు" అంటా నవ్వు మొకంతో ఇంట్లేకి వచ్చినాడు ఇలామంతు నాయుడు.

"నీ నోటోక్కెం బెమ్మోక్కెం కావాల్నేగాని పండబెట్టి నీ నోటి నిండికి చక్కిరి పొయ్యనా!" అనింది యెంగటమ్మ నవ్వతా.

ఇలామంతు నాయుడు మళ్లా నవ్వతా, "ఏమబ్బా, ఏమి, తెగాయిం చేసినావే! వొచ్చేదీ పొయ్యేదీ చూడకుండా యాపై రూపాయిలు బెట్టి ఒగటిన్నర కేజీ కూర తెచ్చేసినావే!" అని యాసండం పడినాడు.

ఆ రోజు సొర్గమంతా రంగంపేటోళ్ళ యింటికి దిగొచ్చేసింది. యెంగటమ్మ దారాళంగా గెంటిని ఆడించి, వాళ్ళు ఎగదీసుకొని తింటా వుంటే చూసే దానికి రొండు కండ్లూ చాల్లా ఆమెకు.

ఆమె మునికన్నడి మొకంలోకి బారడు పొడుగు చూసి, "కష్టింజేసే రైతులకు చియ్యల కూర కన్నా యిష్టం ఏదీ వుండదు రా" అనింది.

ఈ కత అట్ట వుండనిస్తే, నాలుగు నాళ్ళు ధర్మడు ఇట్టుండే పుల్ల అట్టెత్తెయ్యకుండా మొండికేసుకున్నాడు.

"ఏమిరా నీకొచ్చిన సంకటం మిగల నేర్చిన నా బట్టా!" అని యెంగటమ్మ తిడితే పలానా అని చెప్పడు. రేత్రి పూట యెంగటాపరం కొటాయికి బొయ్ సినిమా చూసేసి రావడంతో, పొగులు పూట ఎవురింటి కాడనో ఒకరింటి కాడ పొనుకోని నిద్ర పోవడంతో పొద్దు పోగొడతా వుండాడు. ఇంటి కాడ అన్నం తింటాడా అంటే అదీ లేదు.

"ఈ నా బట్టకు వూళ్ళో ఏ ఆడది సంగటేస్తా వుండాదో, తెల్లేదే! తెలిస్తే దాన్ని కొట్టేద్దును చాటా పొరకతో" అని తిట్టింది యెంగటమ్మ. వూళ్ళో ఎవుడన్నా చెడిపోతే చూసే దానికి చానా మందే వుంటారు.

ఒకరోజు మునికన్నడు కండ్ల నిండికీ నీళ్ళు బెట్టుకొని, "తూరుపీదిలో మన నడిపోడు శారదమ్మకు తుండ్లు చీలేస్తా వుండాడమా గొడ్డలితో! ఆ పన్లుచేసి పొట్ట గడుపుకుంటా వున్నెట్టుండాడు ఈనపు నాయాలు!" అని చెప్పినాడు.

యెంగటమ్మ గూడా కొడుకుతో పాటు కండ్ల నీళ్ళు బెట్టుకోని, "ఆ నా బట్టకు ఎట్టా కాలం వచ్చిందమ్మా! యాపై గుంటల సేద్యం కల్లా తలెత్తి చూడకుండా వూళ్లో ఆడోళ్లకు పైపై పనులు చేసి పెట్టి అన్ని నీళ్ళు తాగే కరమ్మ వాడికెందు కొచ్చింది తల్లా!" అని ఏడుపు పాట పాడింది.

ఆ ఎనిమిదో దినం పెద్ద తగరారై పొయ్యింది యింట్లో. మునికన్నడు ఏందో అనను, దానికి ధర్మడు మొరుసుకోను, ఇద్దరూ గుద్దులాటకు దిగను అయ్యింది. ఆరోజు ధర్మడు అసలు సంగతి చెప్పేసినాడు.

ధర్మడికి గొడ్లను పాలు పిండాటంలో రంగంపేటలో నుంచే బలే శార్వీసు వుండాది.

మిట్టూరులో పది పన్నెండేండ్ల నుంచి ఒక పాల యాపారస్తుడు పాలు పడతా వస్తా వుండాడు. ఆయనది తిరప్తి. ఈ వూళ్లో బాగా నమ్మకస్తుడై పోయి వాడికదారుడై పొయ్నాడు.

ఆ వూళ్ళో ఆడోళ్ళు బలే చలాకీలు. పాల యాపారస్తుడూ నీళ్ళు కలిపి, పాలు పిండేవోళ్ళూ నీళ్ళు పెడితే యాపారం అంతే సంగతులని తెలిసిన ఆ పాలాయన గొడ్లకాడనే వచ్చి నిలబడుకోని పాలు పిండేటప్పుడు చెమ్మును బోలయేసి పొదుగు దగ్గిర కూచ్చోమంటాడు. పాలాయన దినామూ తెల్లారి అయిదూ ఆరు గంటలకే వస్తాడు. అయితే ఆ వూరికి బస్సులు వచ్చే రాయల చెరువు రూటు ముండమోపిదని ఆ పాయకట్టుకే పేరు. ఆయన రోజూ తెల్లారి ఆరు గంటలకు రావాల్సినోడు ఏడూ ఎనిమిది తొమ్మిది అయిన దినాలు కూడా వుండాయి. దీంతో ఆడోళ్ళు, "నువ్వు లాటు గోయిందుడువని నువ్వొచ్చే దాక యాడ కాపెట్టుకొని వుండేది యా? ఆయాళ దాక గొడ్లు గమ్మనుంటాయా? యాళదాటే కొందికి పొదుగుల్లో నుంచి పాలు కారిపోతా వుంటే!" అనేసి వాళ్ళ పాటికి వాళ్లు నీళ్లు పెట్టి పిండేసే వాళ్లు.

యెంగటమ్మే ఒకసారి, "ఒక లీటరకు ఒక గలాసుడు నీళ్ళన్నా పెట్టకుంటే యింటికి దరిద్రం రా పెదబ్బా!" అని మునికన్నడితో అనుండాది.

అందుకని ఆ పాలాయన ఈ నీళ్ళ చెర పడలేక ఒక మనిసిని పెట్టుకుందా మని కలవరంతో వుండినాడు. ఆడోళ్లతో మాట్లాడే పద్దతి గాని, పాలు పిండడంలో వున్న పట్టుగాని, ధర్మడిలో చూసినాడు ఆయన.

ధర్మడు తెల్లారీ సందేళా వూళ్లో ఎన్ని గొడ్లుండాయో వాటన్నిటి కాడికి పోయి, ధర్మడే సొయంగా పిండి పాలు పట్టాల. ఆడోళ్లు పొదుగుల దగ్గిర కుచ్చునే పనే వుండగూడదు.

తెల్లారీ సందేళా ఆ వాటంతో పాలుపట్టి కేనును బస్సులు తిరుగులాడే రోడ్డు బాటకాడ పెట్టెయ్యాల.

తెల్లారీ సందేళా చెరొక గెంటా గెంటన్నర చేసే ధర్మడి పనికి పాలాయన నెలకు ఇన్నూర్రూపాయి లిచ్చేటట్టు మాటలయినాయి.

ధర్మడు చానా నాళ్ళుగా పాలు పిండి, కేనును బస్సు మార్గంలో మోసక పొయ్యే బిళ్ల జవాను పనులు చేస్తా వుండినాడు.

ఇదంతా తెలిసినాక యెంగటమ్మ ధర్మడ్ని ఎదురు గుండా పెట్టుకొని మునికన్నడితో, "ఎంతో సుమారు గదా, తెల్లారి ఎంతసేపు పాలు పట్టబోతాడు,

సందేళ ఎంత సేపు పాలు పట్టబోతాడు! ఏదన్నా పరా వూరికి చద్దికూడు మూట ఎత్తకపోయ్ పాలు పట్టేసి రాబోతాడా! ఈ వూళ్ళోనే గదా! నెలబెట్టే కొందికి సంబళంగా చేతికి ఇన్నూరు రూపాయిలు వస్తాయి గదరా. నాకు జూడ మేలుగా వుండాది" అనసింది.

దీనికి మునికన్నడు, "అయ్యూ చిన్న మేలా!" అనన్నాడు ముక్కు మింద యేలేసుకోని.

ఒక్క నిమిసం తాలినాక యెంగటమ్మకు పెద్ద కొడుకు నిష్టూరం అర్తమయ్యింది.

సందలగూక ధర్మడు లేంది జూసి యెంగటమ్మ మునికన్నడితో కల బెట్టింది.

"గమ్మనుండమా, నా కడుపు కాల్చద్దు" అనన్నాడు మునికన్నడు తొలి మాటే నిష్టూరంగా. మళ్ళా కొంచేపు గమ్మనుండి పొయ్యింది యెంగటమ్మ.

మునికన్నడే మళ్ళా, "ఏమమా! మన దొంగోడి సంగతి తెలిసీ నువ్వట్ట మాట్లాడినావంటే నాకు ఇచ్చిత్రంగా వుండాది. వాడు నెలకు ఇన్నూ ర్రూపాయిలు సంపారిచ్చే సంసారి యెదవే అయితే, ఆ సంగతి చెప్పే దానికి ఎందుకంత జంకినాడు? వారం పద్దినాలు సంగటీ నీళ్ళు తాక్కుండా ఎందుకు డ్రామా యేసినాడు? దీనికి బదులు జెప్పు" అనన్నాడు.

యెంగటమ్మ ఏం మాట్లాడాల్నో తెలవకుండా ఈసారి గూడా గమ్మనుండి పొయ్యింది.

"ఆ నాయాలు కుడుమిస్తే పండగనేటోడు. ఆ పాలు పిండే పనిని నెత్తినేసుకుంటే వాడు కయ్యా గాలవ మొకం చూస్తాడా? మెడ మింద కాడిని యిసిరేసే దానికి వాడు ప్లాను గీస్తా వుండాడు. వాడితో గూడ మీరూ ఆడతా వుండారు. ఆడండి" అనన్నాడు నిష్టూరంగా.

"అదీ నిజ్జిమే రేయ్" అననకుండా యెంగటమ్మ, "ఆపాట్ని పట్టలు వూడదీసెయ్యమా యెదవను, కయ్యాగాలవను కనిపెట్టుకోనే ఏ సందులోనో ఒక సందులో పాలు పడతాడు" అనసింది.

"అట్టయితే మళ్ల దిగులేమిటికి? అంత బొటువు మనోడి దగ్గిరి యాడుండాది? అయ్యో రామా–" అని తల పట్టుకున్నాడు.

"ఆ మాటా వాడి దగ్గిర అడిగి కనుక్కుందాము దా" అనింది యెంగటమ్మ.

"అడిగి కనుక్కోని బాండూ పత్రాలు తెచ్చి, రాయించుకో వాడి తావన" అని యాసండం పడినాడు మునికన్నడు.

ధర్మడు మొదుట్నుంచి కొంచిం దొంగోడు. ఉబ్బుల మింద చేస్తే ఇద్దరి మనసల పని చేస్తాడు. మొండికెత్తినాడంటే సాధించడానికి బ్రమ్మదేముళ్ళు దిగి రావాల్సిందే. పదీ పద్దైదు దినాలు గూడా కూలికి పోకుండా రంగంపేటలో ఏపించే వాడు.

యెంగటమ్మ ధర్మడికి సళువివ్వకుండా, "యాపై గుంటల సేద్యాన్ని వొదులుకోని నువ్వు పాలోడికి బిళ్ళ జవాను పని చేస్తానంటుండావే, అది చాలదా!" అని మాట్లాడింది.

ధర్మడు అమ్మలో కలుసుకోని, "అదేందమ్మా, అట్ట మాట్లాడుతుండావు. సేద్యం పని సేద్యందే. పాల పని పాలదే! దానికి దీనికి సమందం ఏముండాది? చేతి పని శాస్పితం గదమా. తిరప్తిలో ఆవల పాలు పిండి యేలు సంపాదిచ్చే వాళ్ళుండారు. మీరు కాదంటే తిరప్తికి పూడిసి, నా బతుకు నేను బతికి పోదునే!" అని మాట్లాడినాడు.

ఎట్టయితేనేమి ధర్మడు పాలు పట్టే పనికి కుదిరి పొయ్‌నాడు.

ఒక నెలనాళ్ళు ధర్మడు బలే యెచ్చిరికతో వుండినాడు. తెల్లారి మబ్బు మబ్బుగా వుండగానే నిద్ర లేచి పాలు పట్టేసి, రోడ్డులో నుంచి నేరుగా మడి కాడికి వచ్చి పని చూసుకునేవాడు. మళ్ళా సందేళ అయ్యేదాక మడి కాడనే వుండి ఆ పనీ ఈ పనీ చూసుకుంటా పాలు పట్టేసి యింటికి వచ్చేవాడు.

ధర్మడి పనితనం చూసి యెంగటమ్మ మునికన్నడితో, "నేను చెప్పలా, వాడింగా పసిబిడ్డా? వాడికి మాత్రం నీకు తెలిసినన్ని బరువు బాద్దెతలు తెలవ్వా, ఏమి? ధర్మడు గూడ నీ అంత మాత్రం సంసారే లేరా!" అనింది కులుకుగా.

ఒక్క నెలయినాక జీతం ఇన్నూరు రూపాయిలు చేతిలో యేసుకొని యింటికన్నా రాకుండా తిరప్తికి పూడ్సినాడు ధర్మడు.

తిరప్తి నుంచి వస్తా వస్తా పసుపు చేతి చిత్తితో చేతి చిత్తుడు సామాన్లతో యింటికి దిగినాడు.

ధర్మడు తొలి జీతంతో చెల్లికి పావడ, దావిని తెచ్చినాడు. అమ్మకు నలపై అయిదు రూపాయిలు పెట్టి ఒక నేత కోక తెచ్చినాడు.

చేతి చిత్తిలో నుంచి ఆ వస్తవలన్నీ తీసిన యెంగటమ్మకు బండ్ల కొందికీ బడాయి అయిపొయ్యింది. కూరకు డజను కోడిగుడ్లు, రెండు కట్టల మునక్కాయలు కూడా తెచ్చినాడు ధర్మడు.

యెంగటమ్మ పెద్ద కొడుకుతో కుశాలగా, "నువ్వేనా మమ్మల్ను బతికిచ్చేది మునికన్నా! అప్పలు చెల్లిళ్లన్నా, అయ్యా అమ్మ అన్నా ధర్మడికి ప్రాణం గదరా. వాడి శాల్తి చూడు, జీతం వస్తానే తిరప్తికి పొయ్ ఎంత సామానం తెచ్చినాడో! నువ్వయ్యుంటే - రూక మిగల బెట్టేటోడివే గాని తనా మనా అని ఎంచే వోడివా? ఏ పొద్దుటికన్నా మా నోట్లో అన్ని నీళ్ళు పొయ్యబొయ్యేది ధర్మడే గదరా! మొగోడన్నాక ఇరై పైసాలు సంపాయించాల, పదైదు పైసాలు కర్సుబెట్టాల, ధర్మడి దోవే యేరు గదా!" అని జాము సేపు మాట్లాడింది.

నాగరాణి కూడా ధర్మడు తెచ్చిన శెనిగ పూల పైటను యేసుకోని మునికన్న అన్న దగ్గిరికి వచ్చి, "నువ్వయ్యుంటే తెచ్చుంటావా అన్నాయనా! నీ అంత కుళ్ళు మొకం ఆయన ఎవురుంటారులే. ధర్మడు చూడు–" అని ముదిగారానికి పొయ్యింది.

మునికన్నడికి కూడా ధర్మడి పనికి ఎంతో కులకయి పొయ్యింది.

"మీరూ మీరూ ఒకటై పోతిరి, ఇప్పుడు నేనెందుకూ పనికి రాకుండా పోతినే! నేనెక్కడ తెస్తానమా, ఈ సామానంతా! నేనేదో మట్టి పిసుక్కునేటోడ్ని, ఆయన మాదిరిగా నేను నెల జీతగాడినా?" అని నవ్వు మొకంతో అన్నాడు మునికన్నడు.

ఆ ఇంట్లో అప్పట్నుంచి యింకా తమాస తమాస మాటలు ఇనిపించడం మొదులైనాయి.

ధర్మడ్ని దర్మడు అని చెప్పుకోకుండా జీతగాడు జీతగాడు అని చెప్పు కోవడం ఆరంబించినారు.

పొద్దు గూట్లో పడతా వుండినా ధర్మడు యింకా పాలు పిండను రాకుంటే "ఏమిరా మునికన్నా, జీతగాడు యాడుండాడో! యింటికే రాలేదే!" అని అనేది యెంగటమ్మ.

అన్నం యేసేటప్పుడు, "ఎవురికన్నా ఎట్టన్నా ఆయ. జీతగానికి కొరత చేస్తే ఎట్టబ్బా?" అని ధర్మడికి అన్నం పెట్టేటప్పుడు యెంగటమ్మ ముదిగారానికి పొయ్యేది.

ఒక రోజు యెంగటమ్మ మునికన్నడితో, "జీతగత్తె కట్టుకొచ్చిందిరా పెద్దోడా!" అనింది.

ఈ మాటకు యెంగటమ్మతో పాటు మునికన్నడు గూడ జాము సేపు పడి పడి నవ్వులాడుకున్నారు. ఆవు కూడా నెల నెలా మున్నూర్రూపాయిల దాకా సంపాయిస్తా వుండబట్టి, ఆ యింట్లో అది గూడ జీతగత్తె అయి పొయ్యింది. జీతగత్తెను నడవలూరుకు తోలక పోయి సూది యెయ్యించ కొచ్చినాడు ఇలామంతు నాయుడు.

"ఒరే మడి కాడికి రారా!" అని పిలిచే దాకా జీతగాడు మడి కాడికి పోకుండా మొదలు బెట్టినాడు.

ధర్మడి సంగతి తెలిసిందే గదా. వాడు మళ్ళా మొదటికొచ్చినాడు. మునికన్నడు గాని, యెంగటమ్మ గాని ఏదన్నా పని చెప్తే, "నాకు పన్నెండు చేతులు లేవు" అని తిరుక్కోను మొదలు బెట్టినాడు.

''అవితే నీకు సంగట్లేదు'' అని యెంగటమ్మ అంటే జీతగాడు, "ఎందుకులా, నెలకు ఇన్నూరు తెస్తా వుండానే, మళ్ళ మడి కాడ గూడ అడ్డదుడ్డాల పన్లు చేస్తుండానే!" అనే దానికి మళ్ళుకున్నాడు.

యెంగటమ్మ నడిపి కొడుకు దొంగేసికాలు చూసి, "దేముడు వాడికా మాత్రం బుద్ధి బెట్నాడు. ఆ రాతను మనం మార్చగలుగుదుమా మునికన్నా.

అట్ట చావనీ! నీకు మిగిలి పోయ్న సేద్యమా? ఆ నా బట్ట చస్తే ఏమి, బతికితే ఏమి? కాపరానికొకడు అటుమంటోడుంటాడు" అనింది.

## 9

యెంగటేస్పర సామి దర్మాన రంగంపేటోళ్ళు ఇరై గుంటల్లో వరి మడిని, పది గుంటల్లో శెనిగి తోటను కాపాడుకోగలిగినారు. చెరుకు తోటను కొట్టి రేణిగుంట చక్కిరి మిల్లుకు తోలే పనికి యింకా అయిదు నెలలు పోవాల.

ఇరై గుంటల మడిని పన కొడితే ముప్పై, ముప్పై రెండు మూటల వడ్లు రాలినాయి. పది గుంటల్లో శెనిక్కాయలను వొలుచుకుంటే పద్నాలుగు మూటలైనాయి.

"మడి, శెనిగి తోట నీళ్ళుగాని బాగ పారుంటే యింక పది మూటల వడ్లయ్యుంటాయి, యింక అయిదారు మూటల చెనిక్కాయలు అయ్యుంటాయి." అనింది ఆశిగా యెంగటమ్మ.

ఇలామంతు నాయుడు, "ఈ మాత్రమన్నా దక్కతాయని కూడా ఆశి లేకుండా వుండెనే! అప్పుటికీ మత్తేపాయన నీళ్ళను మడికే యేస్తే ఈ మాత్రం పలితమన్నా!" అన్నాడు.

రంగంపేటోళ్లు వడ్లను, చెనిక్కాయలను యిల్లు జేర్చుకున్నారు.

ఆ రాత్రి అమ్మలు బిడ్లు చేరి పెద్ద మీటంగి బెట్టుకున్నారు. ఆడదానికి యింట్లో వడ్ల గింజలుంటే వుండే కుశాల దేంట్లోనూ వుండదు. గింజితో సమందం వుండే మనిసి గదా.

"ఈ పలితం అద్దాలామెకు వడ్లు కొలిచేది లేదు. దేముడి దర్మాన శెనిక్కాయ ధర బాగా పలకతా వుండాది. శెనిక్కాయలమ్మేసి, ఇరై అయిదు మూటల దర కట్టించేద్దాము, అద్దాలామెకి" అననింది యెంగటమ్మ.

దీనికి ఇలామంతు అడ్డం వచ్చి "ఆ మాటే ఎత్తద్దు. ఈసారి బాయిలో నీళ్ళు చూస్తా వుంటే, మడి దున్నగలగతామని అనిపించటంలా. ముప్పై గుంటలూ శెనిగి తోటే యేద్దారి. దీనికి మూడు మూటల ఇత్తనాలు పెట్టుకోవాల, ఒక మూట శెనిక్కాయలను చమురుకు పెట్టుకుందాము, మిగతా

పది మూటలనూ అమ్మేసి ఎద్దులను పట్టుకోవాల. ఆ బక్కెద్దులతో యింక చెయ్యలేను, ఈ యాపై గుంటల సేద్యం!" అనన్నాడు.

యెంగటమ్మ కోపం తెచ్చుకోని, "అయ్యో నువ్వు గదా, యాపై గుంటలను సంపాదిచ్చి, సేద్యం జరిపిస్తా వుండేది!" అని మాట్లాడింది.

ఆమె మళ్ళా నోరు తెరిచి, "యింట్లో యింక ఏడెనిమిది మూటల వడ్లే వుండాయి. ఈ ముప్పై రెండు మూటలతో కలుపుకుంటే నలపై మూటల వతాయి. ముందు ముందు కాలాలెట్టుంటాయో, గింజని అమ్మే దానికి లా. ఎదిగిన బిడ్డి యింట్లో వుండే పని. వుండే గింజల్ను గూడ అమ్ముకుంటే దానికి పెళ్లెట్ట చేద్దును? రేపు చెరుకు తోట కొట్టంగానే, అమ్మికి పెండ్లి పెట్టుకోవద్దా!" అనింది.

"అమ్మికి పెండ్లయ్యే సంగతి యిప్పుడెందుకులే గానీ! నాకు గూడ బండెద్దులను పట్టాలనే సూపే వుండాదమా!" అనన్నాడు మునికన్నడు నాయినలో కలుసుకొని.

నలపై మూటల వడ్లగింజలను ఇంట్లోనే పెట్టుకొనే యోగ్గిత ఆ కుటుంబరానికి లేదని యెంగటమ్మకు తెలిసే ఆ రకంతో మాట్లాడింది, ఎవురెవురు ఎట్టెట్ట మాట్లాడతారో యిందామని.

"ఇరై అయిదు మూటల వడ్ల గింజల్ని అద్దాలామెకు వారం కొలిచేద్దాం. బండెద్దులు పట్టుకుంటే ఎందుకన్నా మేలు. ఈ బక్కెద్దులమ్మంగా వొచ్చిన దుడ్డూ అంతా కలుపుకోని అయిదు జానల ఎద్దుల్ను పట్టుకుంటే మళ్ళ మనకు దిగులులా" అనన్నాడు మునికన్నడు.

యెంగటమ్మకు ఈ మాటలతో బుద్ధి మారిపొయ్యింది. మునికన్నడు అయిదు జానల ఎద్దులకు అయిడీ యేస్తే, యెంగటమ్మ యింకొంచిం ముందుకు పొయ్, "అయిదు జానల ఎద్దులను పట్టే మొగలాయి బండిని కొనకుంటే ఎట్ట? బండి లేకుండా బండెద్దులు వుండి ఏమి సుకం? అప్పో సప్పో చేసి – అప్పున్నోడికే గదా ఆస్తుండేది – రెండేలకో మూడేలకో ఒక బండిని కొనుక్కుంటే, మన పనై పోతానే బండి తోలుకోని మీ నాయిన బాడిక్కి పొయ్ దినానికి నలపై రూపాయిలు జోబీలో యేసకొస్తాడు. బండిలో

అయితే అట్ట కూచ్చోని పోతాడు గాని, ఆయనింక మడి పనులు చెయ్యలేడు రా. ఆయన్ను చూస్తా వుంటే పై వూపిరి పైన్నే పోతుండాది" అని బండి కూడా కొనే దానికి ప్లాను గీసింది.

మునికన్నడు అమ్మను ఇచ్చిత్రంగా చూసి, "అప్పు చెయ్యను మన వల్లా అయితిందా అమా? కనాకష్టం నెలకు రెండు రూపాయిల వడ్డీ అన్నా మనం కట్టగలతామా? బండిని కొనాలంటే చెరుకు తోట కొట్టే దాకా ఆగాల్సిందే!" అని అన్నాడు.

ఇందుకు యెంగటమ్మ వుసారుగా, "ఏందిరా కోడి గుండికాయోడా, అట్టంటా వుండావు! గాటి దగ్గర్నే ఈ రోజు ఆరు వేల రూపాయిల సొత్తు వుండాదిరా మనకు. పాలు బాగా యిడవబట్టి మన జీతగత్తె కుమార్తె అమ్మను మించినట్టు వుండాది. యింక మూడు నెలల్లో దూడ కూడా పలానికి రాదా! దూడ సూడిదయ్యిందంటే అదే ఈ కాలంలో మూడు వేలు. ఆవు తొలీతలోనే మిక్సిరీ, శెనిగి పిండి యెయ్యకుండానే, గలాసుడు నీళ్ళు పెట్టకుండానే మూడూ మూడున్నర లీటర్ల పాలిచ్చిందే. యింకొక్క ఈతకు తెల్లారి అయిదు, సందేళ అయిదు. ఒక్క ఆవే అయిదువేల రూపాయిలు గదరా. మనకు అప్పు ఎవురియ్యరు? నేను పాలల్లో, బండి బాడిగల్లోనే మిగలబెట్టి బండి అప్పు తీర్చెయ్యనా! నేను ఆడదాన్నయి పోతిని. మొగోడ్నయ్యుండుంటే ఏ రకంతో అప్పు తెచ్చుంటానో, ఏ రకంతో అప్పు తీర్చుంటానో రెండో కంటికి తెలవనిచ్చుందునా రా మునికన్నా! ప్రతి దానికి ఆడది ముందుండాలంటే ఎట్టమ్మా ఈ యింట్లో?" అనింది లోకానికే యిచ్చిత్రమైన మాట తీరుతో.

"అప్పు జేసి తీర్చే అంత తెంపు మా అబ్బా గొడకల దగ్గర లేదు తల్లా. నువ్వన్నా ముందరుండి తీర్చు" అనన్నాడు యాసండానికి పొయ్ మునికన్నడు.

ఎప్పుడనుకున్న మాట అప్పుడే ఏదో ఒకటి తేలి పొయ్యే దాకా మాటలు సాగదీసుకొనే ఆ యింట్లో యెంగటమ్మ మళ్ళా మాటల్నెత్తుకొని, "అది గాదురా మునికన్నా, సంసారాన్ని నెట్టకొచ్చే బాద్దెత నాది. నాలుగొస్తవలు చేతిలో పెట్టుకోని వుంటేనే మతింపు. ఈ రోజు మన యింట్లో రెండు ఆవుగొడ్లు వుండాయని ఆయమ్మా ఈయమ్మా పంచితాలకు, పేడకు వస్తా వుంటే నాకు ఎంత మతింపుగా వుంటిందో నాకు తెలుసు, పైన మండేవోడికి తెలుసు.

మీరు మూడువేలు అప్పు తెస్తే సరే. దైర్నం లేక తేకుంటే యింట్లో ఒక వడ్లగింజి గూడ లేకుండా అన్నీ కొలతకు యేసేసి తెచ్చెయ్యండి బండిని” అననింది.

ఇంతకుముందు ఆ రకంతో మాట్లాడిన మనిసి, కొంచేపుట్లోనే ఈ రకంతో తిరుక్కునే కొందికి మునికన్నడు ఇచ్చిత్ర పోయి, “అదేందమా అన్ని వడ్లనూ యాపారస్తుడికి కొలిచేస్తే మళ్ళ మనకు తిండికా?” అనడిగినాడు.

ఆ మాటకు యెంగటమ్మ, “ఒరే యిది కొడవటికంటోళ్ళ ఆడబిడ్డిరా” అనింది ఒకే మాటగా.

“అబ్బా!” అన్నాడు ఇలామంతు నాయుడు ఎగసుల్లిగా.

ఆ మాటలన్నిట్నీ అక్కడికి కట్టి పెడితే–

ఇలామంతు నాయుడు నెలకు మూడు రూపాయిల వడ్డీ మింద రంగంపేటకు పొయ్ మూడువేల రూపాయిలు తెచ్చినాడు.

ఒక రోజు ఒంటిగోడు చెంగమ నాయుడు ఇంటి ముందర తిన్ని మింద కూర్చుని వుండి, ఆ దోవన పోతా వుండిన మునికన్నడ్ని పిలిచినాడు. అప్పుడు చెంగమ నాయుడి పెండ్లాం కూడా గడపలో కూచ్చోని కాపీ పెట్టుకొని తాగినా అణగని తలకాయ నెప్పితో బాద పడతా వుండింది పాపం!

చెంగమ నాయుడు ఆయన పెండ్లాం లచ్చుములకు యినిపించేటట్టుగా, “మునికన్నా! నీకేమో బండీ ఎద్దుల్ను కొనాలని చూపు పడిందంటనే! అవునా!” అనడిగినాడు.

మునికన్నడు గూడా తిన్నె మింద కూచ్చోని, “అవును మామా! అందుకనే వుండే బక్కెద్దల్ను కూడా ఒక మాలాయనకు అయిదు నూర్లకు అమ్మేస్తినే! చేతిలో బండీ ఎద్దులుంటే ఎందుకన్నా మంచిదనే దీంతో వుండాం నేనూ మా నాయిన. యాడన్నా బండీ ఎద్దుల్ను వుంటే చూడు మామా అని నీకు చెప్తినే! మళ్ళా అడగుతుండావా?” అన్నాడు.

ఒంటిగోడు పొడుగ్గా ముక్కుల గుండా గాలి వొదిలి, “ఈ మాల కష్టిం నేను చెయ్యలేక పోతుండాను రా, బతికినంత గాలం ఒక్కడ్నే ఎంతని జేసేది!

నేను గూడా కాళ్ళు చాపేసినా. ఇంట్లో ఆడవాటికి జరిగేది మొగోడ్ని, నాకు జరగదా?" అనన్నాడు.

ఈ మాటలు ఆయన పెండ్లానికి తగలగా, "ఆ, బంగారుగా కాళ్ళు చాపెయ్. నువ్వీడ ఎవుడ్ని బెదిరిస్తావు?" అని కసువు పోచ తీసి పారేసినట్టు మాట్లాడింది.

చెంగమ నాయుడు కోపం తెచ్చుకొని, "నీతో ఈడెవుడూ మాట్లాళ్ళా. పైకి లేచినానంటే పియ్యి తినే దానిక్కూడా మూతి పండ్లు దొరకవు. మంచి మాటల్తో గమ్మనుండు" అని కసిరినాడు.

లచ్చుములు తల పట్టుకొని మళ్ళా కాఫీ పెట్టుకొనే దానికో ఏమో యింట్లేకి పూడిసింది.

చెంగమ నాయుడు, "నిజ్జింతో అంటా వుండాను రా. నా బండీ ఎద్దల్ను కొనుక్కో, నీకు గాకపోయ్‌నా ఎవురికో ఒకరికి అమ్మేసేది మాత్రం కాయం. అంతగా నాకు పొట్ట గడవక పోతే వుండే కయ్యను బాడిగో సాడిగో పెట్టి దున్నించుకుంటా" అనన్నాడు.

మునికన్నడు, "ఎందుకు మామా, యాష్ట మాటలు మాట్లాడతావు" అని అన్నాడు నొచ్చుకోని.

"నాకు ఒకరి మింద యాష్ట ఏమీ లేదు వాయ్. కడుపులో వుండింది కక్కేస్తా వుండాను, నీకు తెలవదులే గమ్మనుండు – నేను రెండేండ్లకు ముందర బండీ ఎద్దల్ను అయిదున్నర వేలకు కొనినా. అయిదునూర్లు తోపుడు తోసుకోని బండీ ఎద్దల్ను తోలుకో" అనన్నాడు చెంగమ నాయుడు.

మునికన్నడు, యింటికి రాంగానే, అంతా చెప్పి, "ఈ వాటంతో అన్నాడమా చెంగమామ!" అన్నాడు.

యెంగటమ్మ ఆ మాటతో గూడ, "నాకు జూడ, నువ్వు చెంగన్న అల్లుడయ్యేది గ్యారంటు" అనింది.

"గమ్మనుండు చాలు గాని" అన్నాడు మునికన్నడు.

"లేదురా మునికన్నా, ఒంటిగన్న యింట్లో జరిగే కతలు మనకు తెలవటంలా సరిగ్గా. ఆయన్నకు నీ మింద చూపు యింకా అట్టనే చెక్కు

చెదరకుండా వుండాది. ఒంటిగోడు గదా, నీ బోటోడు అల్లుడైతే ఆయనకే గదరా లాబమంతా, ఆ యమ్మిని సాగనంపాలంటే లచ్చి రూపాయిలు పెడితే గదా, లేకుంటే దాని మెళ్ళో బొట్టుగట్టే నాదుడెవుడు? అద్దో, మన బోటి కయ్య లేనోళ్ళకైతే, ఒక ఎకరా మన పేరన రాసేస్తే పనై పోతింది. మనమే సేద్యం జరిపించేస్తాము. నీకు తెల్దు, ఒంటిగాయన నీకే పిల్లనియ్యాలని బలే పట్టుగా వుండాడు. పెళ్ళాంతో, బిడ్డల్తో ఈ తగరారు పెట్టుకొని మూడు నాళ్ళయిందంట యింట్లో చెయ్యి కడిగి!" అని చెప్పింది రాసికంగా.

మునికన్నడు నవ్వు మొకంతో, "మళ్ళా పెత్తనానికి పొయ్, నాలుగు దొబ్బించుకోబో, ఆ తలకాయి నెప్పి మొకం దాంతో" అనన్నాడు.

మళ్ళ రెండు నాళ్ళకు నిజంగానే ఒంటిగోడు బండీ ఎద్దులను బేరం చెప్పేసినాడు.

ఇలామంతు నాయుడింటికి బండీ ఎద్దులు, ఒంటిగోడు చేతిలోకి అయిదువేలూ చేరిపొయ్‌నాయి.

ఆ ఎద్దులు సొంతమయిపొయ్యే కొందికి మునికన్నడికి పట్ట పగ్గాల్లేకుండా అయిపొయ్యింది.

ధర్మడు నాలుగు నాళ్ళు వుసారుగా గెనాలకు పట్టి అయిదు జానల ఎద్దుల్ను కడుపు వూదేటట్టుగా మేపినాడు.

ధర్మడు పాల పనిలో వుంటే, ఇలామంతు నాయుడు సందు జూసుకొని బండి బాడిగకు పోతా వుంటే, మునికన్నడు సేద్యంలో కిందా మిందా పడతా వుండాడు.

యెంగటమ్మ, నాగరాణి తమాస తమాసగానే ఇత్తనాలకని పెట్టుకున్న మూడు మూటల చెనిక్కాయలను వొలిచి పెట్టుకున్నారు.

ఇంక బూమ్మింద వానలు కురిస్తే ఇత్తనం యెయ్యడమే పని.

మునికన్నడు పన్నెండు గెంటల జాము నీళ్ళన్నీ చెరుకు తోట మిందే యేసుకొని పారగట్టుకుంటా వుండాడు, వరి మడి కోసేసినాక శెనిగి తోట పెరికేసినాక మత్తేపు నీళ్ళను తోటకు కొనే పని లేకుండా పొయ్యింది.

అద్దాలామె బాయిలో నీళ్ళు మాత్రం అద్దోన్నంగా వుండాయి. సంచి పట్ట కట్టినా లాబం లేకుండా పొయ్యింది. సొసైటీ ఆయన, రంగంపేట వాళ్ళు పూడి ఎత్తినా కూడా పలితం దక్కలా. ఒక గంట నిలిపితే రెండుగంటల నీళ్ళు వస్తా వుండాయి. ఆ బాయి కొంచిం సంసారి బాయి గాబట్టి సరిపొయ్యింది. కొన్ని బావులైతే నిండా అద్దోన్నం అయిపొయ్‌నాయి. కొన్నవితే తుట్రమారం నేల మట్టంగా ఎండిపొయ్‌నాయి గూడ. వాన ఈ పొద్దు పడక పోతిందా, రేపు పడక పోతిందా అని అనుకుంటానే రంగంపేటోళ్ళు కాలం గడిపినారు.

ఒక రోజు యెంగటమ్మ, "ఒరే మునికన్నా, ఇత్తనాల శెనిగ్గింజలు మురిసి పోతా వుండాయిరా పురుగు బట్టి! ఇంక నెలుంటే, గింజ మిగల్దు పొట్టే మిగల బొయ్యేది!" అని బాదతో చెప్పింది.

ఇప్పుడు యాపై గుంటలకు గాను ఇరై గుంటల చెరుకు తోట తప్పనిచ్చి మిగతా అంతా బీడుగా వుండాది. దున్నదామంటే నీళ్ళు లా.

"ఒరే, ఈ పలితం అద్దాలామెకు ఏమి వారం యిచ్చేదిరోయ్, కయ్యంతా బీడుగానే వుంటే! ఆ చెరుకు తోటలో వచ్చింది ఆమెకిచ్చి, బాకీ మూడేలు తీర్చేస్తే మళ్ళ అమ్మికి పెండ్లి ఎట్ట చేసేది రేయ్?" అని యెంగటమ్మ మునికన్నడితో చెప్పి చెప్పి యాదన పడింది.

వూళ్ళో నీటి సౌక్రిం వుండే రైతులు దైర్నం చేసి దుక్కిల్ను మిసినీ నీళ్ళతో తడిపేసి, శెనిగి పప్పును యేసేసినారు.

ఇంక వాన కోసరం చూస్తే లాబం లేదని మునికన్నడు గూడా ముప్పై గుంటల బీడును తడపాలని నిర్నయం జేసుకున్నాడు

అద్దాలామె బాయిలో వుండే జాము నీళ్ళనే నమ్ముకుంటే – రెండెకరాల బీడును తడిపేది గగనం.

మునికన్నడు మత్తేపు దగ్గిరికి నీళ్ళ కోసరం పొయ్‌నాడు. ఆయన కాల్తో చెప్పిన పనల్లా వారం పదినాళ్ళు చేత్తో చేసినాడు. మత్తేపు పనికి అప్పుడు ధర్మడు గూడా అవసరమై, 'మీ తమ్ముడ్ని గూడ రమ్మను' అనన్నాడు.

మునికన్నడు ధర్మడ్ని, 'ఒరే, మత్తేపు దగ్గిరికి నీళ్ళకు పోయ్ వద్దాం రారా!' అనంటే, అతగాడు, 'నువ్వెక్కడికన్నా నన్ను పిలువు. మత్తేపు దగ్గిరికి మాత్రం పిలవద్దు. వాడు వొట్టి లేబర్ నాయాలు. శిండకు పన్నెండు పన్లు చెప్తాడు' అని దొబ్బినాడు.

మునికన్నడు ఆ మాటలకు, 'కయ్యాగాలవ చేతిలో పెట్టుకోనుండేటోడు లేబరు, బిళ్ళ జవాను పన్లు చేసేటోడు గవునీరా?' అని గుద్దులాట పెట్టుకొనేసి వచ్చేసినాడు.

మత్తేపు పది నాళ్ళకు మునికన్నడికి నీళ్ళొదిలినాడు. ఆ నీళ్ళతోపాటు సొంత నీళ్ళు గూడా యేసినాడు.

బూమి బాగ వుడుకెగిరి పొయ్యుండాది. దీంతో ఎనిమిది గెంటల నీళ్లు పట్టినాయి ఆ రెండెకరాల బీడు పారే దానికి. బీడు నీళ్ళతో నిండి పోతా వుంటే ఎక్కడెక్కడి కొంగలో వచ్చి చేరుకున్నాయి.

నాలుగు నాళ్ళల్లోనే దుక్కి ఆరిపొయ్యింది.

మునికన్నడు అయిదు జానల ఎద్దులతో మడక దున్నతా వుంటే యెంగటమ్మ, ఇలామంతు, ధర్మడు, నాగరాణి శెనిగ పప్పు యేసినారు.

తెల్లారి కట్టిన మడక సందేళ దాక తిరిగితే, ఆ రెండెకరాలకు పప్పు యేసే పని అయిపొయ్యింది. దగ్గిర దగ్గిరగా వారవలు యెగేసి పార పని గూడ పూర్తి చేసినారు.

వుడుకు పొదునులో సరిగ్గా మొలవదేమో అని బయపడింది యెంగటమ్మ. కాని వారం దినాలల్లో చిగరాకు కొట్టినట్టు పచ్చంగా మొలిచి పొయ్యింది.

"యేసిన గింజ యేసినట్టే మొలిచి పొయ్యిందిరా. అయినా దీనికి మనకు నీళ్లుండి పార గట్టబోతామా? వాన పైరే గదా!" అని మొలిచిన శెనిగి తోట కల్లా చూస్తా మదన పడింది యెంగటమ్మ.

మిట్టూరికి ఒక మైలు దూరంలో వుండే రామాపరంలో దర్మరాజుల తిర్నాళ్ళు మొదలైనాయి. వానలు పడాలని తిరనాళ్ళను తొందరగానే మొదులు బెట్టినారు ఆసారి. మిట్టూరికి రామాపరం నుంచి ధర్మరాజులు, ద్రౌపతమ్మ,

పోతురాజు, అర్జునుడు – శిలలు కూడా వచ్చినాయి. యెంగటమ్మ గంగిరెడ్డి పల్లి నుంచి ఒక టెంకాయ కొనుక్కోనొచ్చి శిలలకు కొట్టి దండం పెట్టుకొనింది.

పద్దైదు రోజుల బారతం అయిపొయ్యి, అగ్గికూడా తొక్కేసినారు గాని బూమ్మిందా చినుకే పడలా. అగ్గి తొక్కే వాళ్ళు నీళ్ళు లేక రామాపరం చెరువులో మునక్కుండా మళ్ళకాడ వుండే బావల్లో మునిగేసి పొయ్ అగ్గి తొక్కాల్సి వచ్చింది. ఈ కలిగ్గంలో ద్రౌపతమ్మ సత్యం ఆ మాదిర్తో వుంటే యింకేమి చెయ్యాల?

'చింత కాయల వాన, మాడి కాయల వాన, ఇటికి సూలల వాన అని ఎన్ని వానలు వుండేది? ఏది, ఒక్క వానేది? తిరపతి జాతరకే వాన పడ లేదే! యింక రామాపరం తిర్నాలకు వానలు పడునా?' అని యెంగటమ్మ నిరామయం అయిపొయ్యింది.

రైతులందురూ యిండ్లల్లో వుండే ఇత్తనాలను బూముల్లో యేసేసి వాన కోసరం ఎగ జూపెట్టుకొని వుండారు.

వూళ్ళో రైతులు కప్పను మెరవణ చేసినారు. గుండాల గంగమ్మకు పొంగళ్ళు బెట్టినారు. మూలస్తానమమ్మకు మొక్కుకున్నారు.

ఆకాశంలో మాత్రం మబ్బులు బిరి బిరా ఎక్కును, గాలి తిప్పించి మళ్ళించి కొట్టును, చినుకు మాత్రం నేల రాలేది లా.

చేతిలో రూక మెదిలే వోళ్ళు ఏడు మట్ల లోతు బావల్లో మళ్లా వందడుగులు బోరింగులు వెయ్యించుకున్నా నీళ్ళు పడితె పడె, లేకుంటే లా.

దినాలు గడిచే కొందికి అద్దాలామె బాయిలో గెంట నిలిపితే గెంట వస్తా వుండాయి నీళ్ళు. ఆ కాడికి ఎంతో మేలుగా వుండాది.

మునికన్నడు మత్తేపు దగ్గిరికి పొయ్, "మామా మామా, ఒక్క తడికి నీళ్ళిచ్చినావంటే నా శెనిగి తోట పూత పట్టేస్తింది" అని వొడ్డుకోని అడుక్కున్నాడు.

మత్తేపు 'ఈ పొద్దు, రేపు' అని మూడు నాళ్ళు తిప్పించుకొని నాలుగో నాడు, "మీ నాయిన్ను బండీ, ఎద్దల తోలుకోని రమ్మనాల్నే. మనకొ్కంచిం

బండీ ఎద్దులు గావాల. ఏట్లో ఇసికి యాబై బండ్లకు కావాల. ఇంక రెండు బండ్లు వస్తాయి. మీది మూడో బండి" అని అన్నాడు.

ఇలామంతు బండి కట్టుకొని పొయ్‌నాడు.

శెనిగి మొలక వాడు మొకం చూసినాక నీళ్ళు వదిల్నాడు మత్తేపు.

అయినా మునికన్నడి శెనిగి మొలక తెపురుకొనింది.

ఒక రోజు మునికన్నడు సొసైటీ ఆయనతో, "ఎన్ని రోజులని నువ్వూ నేను మత్తేపు నీళ్ళ కోసరం దేబిరించుకునేది మామా! అద్దాలామెతో నువ్వూ కలుసుకోని బాయిలో బోరింగు యేసేస్తే పోదా? మేము బొయ్ అద్దాలామెతో మాట్లాడుదుమా! బాయిలో బోరింగు యెయ్యకుంటే కష్టికాలంలో పైరును కాపాడుకోలేము బావా!" అనన్నాడు.

ఈ మాటలకు సొసైటీ ఆయన నవ్వతా, "వుండరా నాయాలా నా పెళ్ళాం మైనీరు పిలకాయల్తో పోతా వుండాదని తెలిసింది. దాన్ని ఏమి చేస్తే పాపం తీరును రేయ్? నన్ను ఎగిసెగిసి తన్ని అది నీబోటి మైనీరు పిలగోళ్ళను మళ్ళు కొనిందంటే –" అని కోతి మాటలు మాట్లాడినాడు.

'కయ్యగల్లోడు, అప్పుగల్లోడు ఏ పొద్దుటికన్నా మకరాజే!' అనుకొని గమ్మునుండి పొయ్‌నాడు మునికన్నడు.

## 10

కరువు – రైతుల్ని ఒక రకంగా మోసం చేస్తావుంటే, కరంటోళ్లు – రెండు రకాలుగా మోసాలు చేస్తుండారు. కరంటు ఎప్పుడొచ్చి ఎప్పుడు పోతిందో తెలవకుండా పొయ్యింది. బావల్లో వుండే ఆ కాసిన్ని నీళ్ళను గూడా మిసినీలు యేసి పైర్లను పారగట్టుకో లేక అగసాట్లు పడిపోతుండారు.

మత్తేపు నీళ్లతో రెండు తడులు పారిన మునికన్నడి శెనిగి తోట వూడలు దిగినాక తడి మొకం చూసి ఇరవై నాళ్ళయి పొయ్యింది.

వాడు మొకం పట్టిపొయ్‌న శెనిగి తోటను చూస్తా వుంటే మునికన్నడి కడుపు రగలక పోతా వుండాది.

'యింక రెండు మూడు నాళ్ళల్లో తడి పారకుంటే శెనిగి తోటను వొదిలియ్యాల్సిందే!" అనుకొని యాదన పడినాడు.

శెనిగి తోటను చూసి ధర్మడికి గూడ బిత్తర తగిలింది. పాలు పిండేసి, యింట్లో పొనుకునే దానికి సగించక నేరుగా బాయి దగ్గిరికి వచ్చినాడు.

మునికన్నడు నీళ్ళ కోసరం మత్తేపు దగ్గిరికి తిరిగింది తిరిగినట్టే వుండాడు.

మత్తేపు పరిస్తితి గూడ యిప్పుడు ఎట్టరా అయిపొయ్యిందంటే, ఈ కరంటు లేక, కరంటు వుండినంత సేపు మిసినీ ఆయన పైరు మిందనే పొయ్‌నా పారటం లా.

మత్తేపు చేతులు పైకెత్తేసి, "నన్ను నిష్టూరం చెయ్యబాకండి సాములాలా, ఈ కరంటు తక్కవై పొయ్ నీళ్ళుండీ లేనోడ్నయి పూడిస్తిని. కరంటోళ్ళు చేసిన మోసానికి నన్ను కొట్టండి చెప్పుల్తో. కరంటు ఇరై నాలుగ్గంటలు వుంటే నా నీళ్ళు ఈ రెండూళ్ళకు సరిపోంగా మిగల్తా వుండినాయి గదా. ఇప్పుడు నన్ను మాత్రం ఏమి జెయ్యమంటారు?" – ఆయన దగ్గిరికి నీళ్ళకొచ్చిన రైతులతో మత్తేపు నిష్టూరపు మాటలు మాట్లాడతా వుండాడు.

మునికన్నడు మత్తేపును పట్టుకున్నోడు వొదలకుండా, "వూరందరి దోవ ఒకటి, నా దోవ ఒకటి. నీకు తెలవందేముండాది మామా! ఇంక నాలుగు నాళ్ళల్లోగాని తోట పారకుంటే నేను కిల్లా మునిగి పోతా. వారపు కయ్య ముప్పై గుంటల్ను ఎండ వాతన పెట్టేస్తే, మళ్ళ మాకు గతి ఏది సామీ!" అనంటే, మత్తేపు నవ్వు మొకంతో, "అవున్రా నాయాలా! నేను మాత్రం ఏమి చేద్దునురా! కరంటు రాంగానే నా ఇరై గుంటల శెనిగి తోట పారంగానే, నువ్వు మడవ యేసుకోని పారగట్టుకో పో" అన్నాడు.

మునికన్నడు కరంటు కోసరం మత్తేపు బాయి కాడ ఏడార్సు పవరు మోటారు సిచ్చి బోర్డు కాడనే వనవాసం చేస్తా వుండినాడు.

ఇక్కడ ధర్మడు గూడ అద్దాలామె బాయి కాడనే వుండి మాటిమాటికి సిచ్చ్ బోర్డు స్టార్టరును నొక్కను, అది గుయ్ అనక పొయ్యే సరికి పెదాలతో చప్పట్లు కొట్టనుగా వుండాడు.

సంగటేళ మించి పొయ్యే సరికి యెంగటమ్మ, యింట్లో లైటు యేసుకోని చూసి చూసి కరంటు మింద రోత బుట్టి, కొడకలకు సంగటెత్తుకోని మడి కాడికి ఎలబారింది.

యెంగటమ్మ ఈదిలోకి రాంగానే ఎండకు కాళ్ళు అంటక పోతుండాయి.

"ఈ కూలిపొయ్న ఎండ ఎప్పుడు గుల్లేరి పోబోతిందో! ఈ ఎండలో మనిసికే యింత కష్టంగా వుంటే, యింక పైరు ఏ వాటంతో బతుకును?" అని పైకే అంటా ఆమె అద్దాలామె బాయి కాడికి వచ్చింది.

ధర్మడు స్టార్టరు నొక్కి మళ్ళా, ప్చ్ అని "కరెంటే రాలేదమా!" అన్నాడు.

యెంగటమ్మ మొకం నల్లంగా పెట్టుకొని, "కరంటు అంత తొందరగా ఏమిటి కొస్తిందిరా! నిన్న సందేళనంగా పొయ్న కరంటు ఈ రోజు మద్యానాని కంతా వచ్చేస్తే దాన్ని కరంటు అని ఎందుకంటారు? ఒకేసారి మన చావు కండ్ల జూసుకొనే దానికి, అది తినీ తాగి తీరిగ్గా రాబోతింది. ఆ యాళదాక అది, వొస్తిందా!" అని ఆమె కరంటు మింద బారడు పొడుగు నిస్టూర పొయ్యింది.

ధర్మడు కాళ్ళూజేతులు కడుక్కోకుండానే అరిచేతిలో సంగటి ముద్ద యెయ్యించుకొని కవణాలను తుంచుకొని తుంచుకొని తినడం మొదలు బెట్టినాడు.

యెంగటమ్మ నీళ్ళు లేకుండా ఎండిపోతా వుండిన రెండెకరాల శెనిగి తోట కల్లా మదన పడతా చూసి, "ఈ సంగటన్నా యింక మనకు దొరికి తిందంట్రా యెర్రి నా కొడకా, ఈ సంగటన్నా యింక మనకు దొరికితిందా! కండ్ల ముందర శెనిగి తోట ఎండి పోతా వుంటే మనం చేతులు కట్టేసినట్టయి పొయ్నాం గదరా! ఇంక ఎట్టరా దర్మా, మనం బతిక బొయ్యేది యింకెట్టరా దర్మా!" అని ఆమె ఓ అని దుఃక్కపడింది.

ధర్మడు తొలి ముద్ద తినేసి, మళ్ళా చెయ్యి చాపి రెండో ముద్ద వెయ్యించు కొని గుంత చేసుకున్నాడు. సంగటి మింద గుంతలో ఎలక్కాయంత గోగాకు వూరుబిండి యేసింది యెంగటమ్మ.

“మునికన్నడు మత్తేపు బాయి కాడ కరంటుకల్లా ఎగ జూపెట్టుకొని వుండాడా!” అనడిగింది యెంగటమ్మ.

అవునని తలకాయి తిప్పుతా సంగటి తింటా వుండి పొయ్‌నాడు ధర్మడు.

ధర్మడు సంగటి తినేసినాక యెంగటమ్మ ఆ ఎండలో గెనాల మింద పడతా లేస్తా మత్తేబాయి కాడికి చేరుకొనింది.

మునికన్నడు యెల్లాలకల పైగుడ్డేసుకుని పొనుకున్నోడల్లా అమ్మను చూడంగానే పైకి లేచి, “ఈ సంతోసంలో సంగటి తినకుంటే ఎట్టని ఈ ఎండ మింద పడతా లేస్తా వచ్చినావా?” అని అన్నాడు.

ధర్మడి దగ్గిర బలంతాన అణుచుకున్న దుఃక్కం యెంగటమ్మకు పెరుక్కొని వచ్చి, “కరంటు కోసరం కానీ గానోళ్ళ బావల దగ్గిర వనవాసరం చేస్తుండావా పెద్దోడా! ఈ వూరికొచ్చిన ఒక్క సమ్మచ్చరంలోనే మనకీ రాత ఏమిటికిగా పట్టినట్టురా ముని కన్నా!” అని ఏడ్చింది.

యెంగటమ్మ సంగటి దించి కొడుకు అరిచేతిలో ముద్దేసి తింటా వుంటే చూస్తా వుండి పొయ్యింది.

కొడుక్కి యాడలేని దైర్నాన్నంతా చెప్పకుంటే మునికన్నడు గూడా దైర్నం యిడిచేసి దిగులుతో సగానికి సగం అయిపోతాడని బయపడి, “మత్తేపన్న నీళ్ళిస్తామన్నాడు గదా. శెనిగి తోట యిప్పటికి పక్కం చెడలేదు లే, ఈ తడి పారిపోతే వూడలు దిగి సగానికి సగమన్నా దక్కతాయి లే, నువ్వు దైర్నంతో వుండురే నాయనా!” అనింది.

మునికన్నడు ఒక్క ముద్దకే చేతులు కడిగేస్తా, “యింక మూడు తళ్లు పారందే శెనిగి చెట్టును పెరికి కాయల్ను ఒబ్బిడి చేసుకోలేము” అని బాదగా అన్నాడు.

రెండు ముద్దల సంగటిని దూది మిటాయిలు మాదిరితో చప్పరించెయ్యాల్సిన వొగిసు మింద వున్న మునికన్నడు అప్పుడే లేచెయ్యడం చూసి యెంగటమ్మకు మళ్ళా దుఃక్కం తన్నకొచ్చింది.

మిగిలిన ముద్ద సంగటి యింటికి పొయ్యే కొందికి ఎండిపోయ్ చెక్కులు గట్టక పోతిందని యెంగటమ్మ ఆ కాసింత సంగటిని తింటా, "ఈ అన్నం తినే దానికి నాకు ఆడే చేతులు, నా బిడ్డకు ఆడలేదే! కర్మురాల్ని, ఈ తిండి నాకు సగిస్తా వుండాదే" అనింది.

మునికన్నడు కరంటును కాపెట్టుకొని, యెంగటమ్మ మునికన్నడ్ని కాపెట్టుకొని అరగంట సేపు వుండే కొందికి సిచ్చి బోర్డు దగ్గరుండే బలుపు మలిగింది.

"అమా కరంటొచ్చింది" అని ప్రాణం లేచి వచ్చిన మునికన్నడు చివక్కన పైకి లేచి స్టార్టరు సిచ్చి నొక్కినాడు.

అది గుయ్‌మనింది గాని నీళ్ళెత్తలేదు.

మునికన్నడి మొకం నల్లంగా అయిపొయ్, అమ్మతో, "కరంటు రెండు పేసుల్లో వస్తా వుండాది" అన్నాడు.

"కరెంటు రెండు పేసుల్లో వస్తా వుండాదా? అవితే మిసినీ నీళ్ళెత్తదా రా?" అనడిగింది యెంగటమ్మ ఆత్రపడి.

మునికన్నడు నోట్లో తేమ లేకుండా, "రెండు పేసుల్లో కరంటు వస్తే మూడార్సు పవరు మోటరే నీళ్ళెత్తలేదు. యింక ఏడార్సు పవరు మోటారు సంగతి చెప్పాల్సిన పనేలా" అని అన్నాడు.

మునికన్నడు మళ్లా చెట్టు నీడన పొనుకోని గుడ్డిగా మలగతా వుండే బలుపుకల్లా చూస్తా, "కరంటోళ్ళు రైతుల్ను కోతినాడిపించినట్టు ఆడిపిస్తా వుండారు. వాళ్ళకేమి మంచి కాలం రాబోతిందో!" అని ఆడది నిస్టూర పొయ్‌నట్టు నిస్టూరపొయ్‌నాడు.

యెంగటమ్మ మాత్రం ముందూ యెనక చూడకుండా, "దొంగ నా బట్టలు ఏ పొద్దన్నా పైర్లు చేసుంటే తెలిసుండును బాదలు" అని మొగోడి తిట్టు తిట్టింది.

ఒంటి గెంటకు రెండు పేసుల్లో వచ్చిన కరంటు మూడు గెంటల దాకా రైతులను వుడకాడిపించింది.

రైతులు కొందరు ఆత్రంతో మాటి మాటికీ యెయ్యబట్టి ఆ ట్రాన్సుపారం కింద ఆ కొంచేపుట్లో నాలుగు మోటార్లకు కాయిలు కాలి పొయ్‌నాయి.

“బావలకు వొదిలే కరంటు – దీపాలు పెట్టుకునే దానికా? ఆ మాత్రం తెలవదా కరంటోళ్ళకు? కోతి నా బట్టలుగా వుండారే యాడనో? వాళ్ళ నోళ్లల్లో గండు మల్లి పుండు బుట్టా” అని తిట్టేసి యెంగటమ్మ యింటికి పూడిసింది.

సందేళ నాలుగు గంటలకు మూడు పేసుల్లో కరంటు వచ్చింది. ఈ సంగతి తెలిసి మత్తేపు కూడా బాయి కాడికి వచ్చినాడు.

మునికన్నడు మత్తేపు కయ్య మింద మడవ యేసి శెనిగి తోటకు నీళ్ళు పారగట్టినాడు.

పొద్దు గూట్లో పడంగానే కరంటు పూడిసింది. అప్పటికి పది గుంటల శెనిగి తోట పారి యింకా పది గుంటల శెనిగి తోట అట్టనే మిగిలి పొయ్యింది.

ఇంక కరంటు ఎప్పుడొస్తిందో! వచ్చినా మత్తేపు శెనిగి తోట యింకా పది గుంటలు పారాల గదా. అదీ గాక మత్తేపుకు మూడెకరాల దాక ఎన్ను బోతావుండే వరి మడి వుండాది. దాని మింద గూడ రోజూ నీళ్ళెయ్యాల గదా, ఇంక కరంటు వచ్చినా మడవ మనకు దొరకదు అని నిరామయం అయిపోయింది మునికన్నడి పని.

“ఇంక ఈ రోజుటికి కుదరదులే. కరంటు వచ్చినా నా వరిమడి పారద్దా! రేపు రాబోరా మునికన్నా!” అనేసినాడు మత్తేపు.

ఏమి గానీ మాట్లాడ లేక మునికన్నడు నేరుగా అద్దాలామె బాయి కాడికి వచ్చినాడు.

ఆ రోజు అద్దాలామె బాయిలో రంగంపేటోళ్లకు పొగుటి పూట జాము. ఇప్పుడు సందేళ అయిపొయ్యింది గదా. ఇంక కరంటు వచ్చినా సొసైటీ ఆయనే మిసినీ యేసుకుంటాడు.

కరంటు వచ్చిన ఆ రెండు గంటలూ మిసినీ యేసి ధర్మడు మూడు గుంటల శెనిగి తోటను పారగట్టినాడు. ఈ వాటంతో పన్నెండు గంటలకు

గాను రెండు గెంటలు కరంటు వస్తే మిగతా ఇరై ఏడు గుంటలూ పారేదెప్పుడు? అయ్యే పనేనా అని బయమేసింది మునికన్నడికి.

ధర్మడు పాలు బట్టేదానికి బిరబిరా వూళ్లోకి పూడ్సినాడు.

జాము అయిపోవడంతో పారిన శెనిగి తోటను చూసుకొని మడికాడ నుంచి యింటికి వచ్చేసినాడు మునికన్నడు. యింటికి రాంగానే యెంగటమ్మ తిన్ని మింద కుదురు లేకుండా కూర్చొని వుండింది. నాగరాణి నట్టింట దీపం పెడతా వుండింది.

“ఈ పలితం నిండా మునిగి పోతామురా మనం, మునికన్నా!” అని అంటా యెంగటమ్మ ఉత్తరంగా చూసింది.

తిరమల కొండ మింద బలుపులు సోలుపుగా దగద్దమానంగా మండతా వుండినాయి.

“నా బట్టా దేముడా, నీ కొండకు వుండే కరంటు మా పైరుకు లేకపాయ గదరా కూలిపొయ్‌న దేముడా!” అని పాపం యెంగటేస్పర సామిని పట్టుకొని తిట్టింది.

ఈ మాటలకు మునికన్నడు నవ్వి, “ఏమమా, దినానికి కొన్ని లచ్చిలు సంపాయించే వోడనుకో! ఆయనకు కరంటు లేకుంటే గవుర్మెట్టును వొంగన బెట్టి ఆయన ఎడం కాలికేసుకొనే వెండి మెట్టుతో పదారు పదారు ముప్పైరెండు దెబ్బలు కొట్టడా!” అని మాట్లాడినాడు.

వూర్లో చానా మంది రైతులు శెనిగి చెట్ల మింద ఆశలు వొదులు కొనేసినారు. కరంటు వచ్చినంత సేపు రైతులు నీళ్ళను – అంతో ఇంతో చేసుకున్న వరిమడి మిందనే నీళ్ళేసి – వరి మడినన్నా కాపాడుకుందామని అనుకున్నారు.

పదినాళ్ళలో – ఒక దినం కరంటు సుమారుగా వచ్చింది. ఆ దినం పొగుటి పూటే ఆరు గెంటల దాకా వచ్చింది.

అయిదో గెంటలో మత్తేపు నీళ్ళొదిలినాడు.

మత్తేపు బాయికి మునికన్నడి కయ్యకి చానా దూరం గదా. మునికన్నడు మత్తేపు మిసినీ యేసి పార చేత బట్టుకున్నాడు. నీళ్ళు పారడానికి కాలవలు కూడా సరిగ్గా లేవు. ఎద్దులు తొక్కేసి, కసువు బలిసి పొయ్ నిండా అద్దోన్నంగా వుండాయి కాలవలు. మునికన్నడు కాలవల్లో వొంగి నీళ్లకు అడ్డంగా వుండే కసువునంతా పెరుక్కుంటా నీళ్ళతో పాటుగా వచ్చినాడు.

మత్తేపు నీళ్ళు అద్దాలామె కయ్యలోకి రావడానికి మునికన్నడు ఆ కాలవల్లో పీనిగి కష్టిం పడినాడు.

అయినా ఏమి సుకం?

కరంటు ఆపయి పొయ్యింది.

“ఛూ దీనెమ్మా కరంటు” అని అంటా మునికన్నడు పారను యిసిరేసినాడు.

కాలవల్లో నీళ్ళు కయ్యలేకి రాకనే యింకిపొయ్‌నాయి. మునికన్నడికి నిజ్జంగా దుక్కం పెరకొచ్చింది.

ఎండిపోతా వుండిన శెనిగి తోట గెనిమిపై గొంతు కూచ్చుని బొరోమని ఏడ్చేసినాడు. ఆరుగాలం కష్టిం చేసి పైరెక్కించినోడు గదా, ఆ కష్టిం ఆయనకే తెలిస్తింది!

మళ్ళ వారం దినాలకు రంగంపేటోళ్ళ శెనిగతోట గలగలమని ఎండిపొయ్ పనికి రాకుండా పూడిసింది. ఆ రెండెకరాల్లో నాలుగు గుంటల తోటను మాత్రం కాపాడుకున్నారు.

ఎండిపొయ్‌న శెనిగి తోటలో నాలుగు చెట్లు పెరికి చూస్తే – ఎండ తగిలిన వూడలు కాయగట్టక వరటక పొయ్ పుల్లలుగా అయిపొయ్ వుండాయి. ఇంక వాన కుమ్మరించినా లాబంలా.

కట్టు గూటాల కాడ “అంబా” అని అరస్తా వుండిన ఆవును, యింక రెండు మూడు నెలలకు పలానికి రాబొయ్యే దూడను ఇడిసి పెట్టి యెంగటమ్మ మడి కాడికి తోలకొచ్చింది.

ఆరోజు బండి బాడిగకు తిరప్తి పోని ఇలామంతు నాయుడు అయిదు జానల ఎద్దులను ఎండిపొయ్‌న శెనిగి తోట మింద తోలి, ఎండకు నెత్తిన పైగుడ్డేసుకొని నిలబడుకోనుండాడు.

ఆవుగొడ్లు కూడ ఎండిపొయ్‌న పైరు మింద పడి “బతికితిమా, చస్తిమా” అని ఆవురావురుమనినాయి.

యెంగటమ్మ అక్కడ పైరు మింద గొడ్లను తోలి మేపుకుంటా వుంటే నాగరాణి వచ్చి, “అమా కరంటోళ్లు వచ్చినారు. శార్జీలు కట్టమంటా వుండారు. యింటిది, బాయిది కూడా కట్టాలంట.” అంటా వచ్చింది.

“కరంటు బిల్లోడు వూళ్ళో యింకా బతికుండాడా? ఎవురూ పట్టుకోని కొట్టలా? మన మాదిర్తో పైర్లు ఎండబెట్టుకోని కడుపు కాలినోళ్లు ఎవురూ కరంటు బిల్లోడ్ని వాయించలా. ఇట్టరా సేయ్” – యెంగటమ్మ వొళ్ళు తెలవని కోపానికి పొయ్, నాగరాణిని పిలిచి, “నువ్వు మీ నాయిన్తో గూడ ఈడనే గొడ్లకాడ వుండు, నేను పొయ్ కరంటు శార్జీ పూలల్లో బెట్టి కట్టేసొస్తా” అనింది.

యెంగటమ్మ గస పోసుకుంటా బజిని గుడి కాడికి వచ్చే కొందికి కరంటు బిల్లాయన, ఎవురో తెచ్చి యేసిన కుర్జీ మింద కూచ్చోని, ఎవురో గలాసుతో యిచ్చిన మజ్జిగను తాగేసి, కరంటు బిల్లులు కట్టించుకుంటా వుండినాడు.

తొలీత యెంగటమ్మ నవ్వు మొకం బెట్టి, “అందరూ కడగా తలండి, మా మామతో నేను కొంచిం మాట్లాడాల” అని కోపంగా మాట్లాడేసింది.

యెంగటమ్మ, “య్యో కరంటాయనా, ఏ మొకం బెట్టుకొని ఈ వూళ్లోకి అడుగు బెట్నావుయా!” అనడిగింది.

ఇదంతా ఎగతాళికి అనుకొని కరంటాయన, “నా మొకం బెట్టుకొనే వచ్చినాను మా” అని అన్నాడు.

యెంగటమ్మ అసింకంగా మొకం బెట్టి, “అయ్యో, ఆ అందమైన మొకానికి కొంచిం గందం తెండి తల్లులాలా, పూద్దారి!” అనింది.

యెంగటమ్మ బజిని గుడి కాడికి వచ్చింది మొదలు మాట్లాడే మాటల్ను వినిన కొందురాడోళ్ళు, “మనం కొంచేపు గమ్మనుందాము పట్టండి. రంగంపేటామెను యిడిస్తే కరంటాయనకు నలుగు పెట్టేటట్టుండాది. లేకుంటే కరంటోళ్ల బడాయి మాత్రం ఏంది? కరువుకు తోడుగా కరంటొదలక పైర్లన్నీ

ఎండబెట్టేసే దాక కరంటు నా బట్టలు వొంటికాలి మింద వుండిరి గదమ్మా!" అని మాట్లాడినారు.

ఈ మాటలినిన యెంగటమ్మ, "అందుకే, ఆవల మేపతా వుండిందాన్ని పరిగెత్తతా వచ్చింది. మీరందరూ నంగలు గదా. అడగలేరనే నేను పడతా లేస్తా వచ్చింది! నోటి కొవ్వు పట్టిందాన్నని అనిపించుకున్నా పరవా లా. అడగాల్సినవన్నీ అడిగేసి నా కడుపు మంట తీర్చుకుంటా!" అనేసి, "కరంటాయనా, నాకల్లా మొకమెత్తి చూడు, మళ్ళ కట్టించుకుందువు గాని బిల్లులు!" అనింది.

కరంటాయన ఒళ్ళుగాని తనంతో తలెత్తి చూసి, "ఏందిమా నీ చాట బారతం?" అనన్నాడు.

యెంగటమ్మ కరుగ్గా నోటిలో నుంచి మాటలు రానిచ్చి, "చాట బారతమో పొరక బారతమో ఆడ కట్టిపెట్టి నాతోకూడా రా. నిన్ను నా మడి కాడికి తొడక పోతా. ఎండి పొయ్‌న పైరును చూసేసి ఏం జబాబు చెప్తావో చెప్పు" అనడిగింది.

కరంటాయనకు కోపం వచ్చేసింది. "పోనీ పోనీ అని గమ్మనుంటే పైకెక్కి పోతుండావే! ఏంది నీ సమాచారం? ఏం జేస్తావు మా నువ్వు, ఏం జేస్తావు? శార్జీ తెచ్చి కట్టు లేకుంటే పో!" అన్నాడు.

యెంగటమ్మకు రగలక పోయి, "నీకేగాదు కోపాలుండేవి, మాకు కూడా వుండాయి మేనమామా! ఏమి చేస్తావంట, ఏమి చేస్తావు? ఈ వూళ్ళో నీకు దిక్కెవుడు? నిన్ను ఈడ్చుక పొయ్ నా ఎండి పొయ్‌న పైరు కాడ చెట్టుకు కట్టేస్తే – నిన్ను ఏ కరంటోడు వచ్చి యిడచక పోతాడో చూస్తా!" అని రంకేసింది.

అక్కడుండిన ఆడోళ్ళు గూడా కరంటాయనను తగులుకొని, "లేకుంటే ఏందియా? వచ్చినప్పట్నుంచి అడగతా వుంటే చెవల్లో యేసుకుంటుండావా నువ్వు? బావల్లో వుండే చారడో దోసిడో నీళ్ళను గూడ యేసుకోనీకుండా పొద్దలగూకన కరంటు ఆపు జేస్తావుంటే మేము మీ పెళ్ళాల మింద పడి కొట్టుకునేదా! శార్జీలు కట్టుకొనేది తెలుసునే, రైతులకు సక్రంగా కరంటు

వొదిలేది తెలవదా మీకు? మళ్ళ బొక్క యింత చేసుకుంటా వుండావే? కడుపు కాలినమ్మ అడగతా వుండాది, గుండికాయ వుంటే జబాబు చెప్పు" అని రంగంపేటామెకు సపోరటగా నిలబడినారు.

ఈ సందులో యిద్దరు ముగ్గురు మొగోళ్ళొచ్చి, "ఆడోళ్ళతో ఏమి పనిలే అబ్బా, నీ పని నువ్వు చేసుకోని పో. వాళ్ళేదో అంటా వుంటారు. యినీ యిన్నట్టు పోకుంటే నీకు జరిగితిందా?" అని సర్దినారు.

ఒకాడామె చేతులు తిప్పతా, "యిట్టా మొగళ్ళుండే యిట్టా కాలాలు వస్తుండేది!" అని నిష్టూర పొయ్యింది.

కొంచేపు తాలినాక యెంగటమ్మ మళ్ళా నోరు జేసుకొని, "ఆపీసల్లో ప్యాన్ల కింద కూచ్చోని వొళ్ళు కదలకుండా జీతాలు తీసుకునే పనా! మేమూ మా బిడ్లు ఎండలో గాశి పడితే గదా పైరు ఆ మాత్రం అయ్యుండేది! నోటికొచ్చిన పైరును మీ నోళ్ళల్లో పెట్టి నీళ్ళు పోసేసినాము గదండిరా కరంటు నా బట్టలాలా! అడిగే దానికి జబాబు చెప్పకుండా మళ్లా మాట్లాడతా వుండావు గదా!" అని అంటా ఆమె అక్కణ్నించి యింటికి పోబొయ్యింది.

కరంటాయన, "గవుర్మెట్టు వుజ్జోగస్తుడి సంగతి మీకెవురికీ తెలిసినట్టు లేదు. నేను గాని నన్ను కొట్టనొచ్చినారని పోలీసోళ్లతో రిపోర్టిచ్చినానంటే యింక అంతే!" అని బెదిరించబొయ్‌నాడు.

దీంతో యెంగటమ్మ, "నాకన్నా చిన్నోడిగానే వుంటావు – ఇచ్చుకో బోరా నా బట్టా, పోలీసోళ్ళకు గాకుంటే వాళ్ళమ్మా మిండగోళ్ళకిచ్చుకోబో, నా యెంటిక గూడ పెరుక్కోలేరు. నా బట్టల్లాలా! ఆ వుజ్జోగాలు పొయ్‌నాయంటే మీరూ మీ పెళ్ళాలూ కుక్కలు బతికినట్టు బతకాల్సిందే గదండ్రా. మీరు కరంటు ఎట్ట ఆపు జేసుకున్నా – మేముండాము, మా రెక్కలుండాయి. మా రెక్కలున్నంతగాలం మా నోటికాడ కూడును పెరుక్కునే దానికి మీ తాతలు రావాల రా" అని మాట్లాడేసి నేరుగా మడి కాడికి పొయ్యింది.

ఆ కరంటాయన, "వానలు పడక కరంటు యాడా లేదుమా! నదులెండి పోతా వుంటే కరంటు లేదని నా మింద పడితే నేనేమి చేద్దును తల్లులాలా!" అని చెప్పడానికి సతాయించినాడు. ఎంత సేపటికీ ఆయన ఆమాట అనకనే

వుండడం వల్ల ఆడోళ్ళ దగ్గిర తీపులు తియ్యించుకుంటా బిల్లులు కట్టించు కుంటా వుండినాడు.

యెంగటమ్మ నేరుగా మడి కాడికొచ్చి, నాగరాణితో, "ఆ కరంటోడు పోబోతాడు, మళ్ళ నెలకు అపరాదంతో గూడ కట్టాల, ఎవుడమ్మను దొబ్బిన సొత్తు. పెట్టి బీగం నట్టింట దీగూట్లో వుండాదిగాని పొయ్ కట్టేసి రాబో – మళ్ళా ఏమిటికి వస్తావులే, ఎసురు పెట్టుకొని యింటి కాడనే వుండుబో కూతరా!" అనింది.

నాగరాణి ఇచ్చిత్రక పోయి అమ్మకల్లా చూసి, "నువ్వు వూళ్ళోకి పొయ్ కరంటు శార్జీ కట్టకనే వచ్చినావా? ఇంతసేపు యాడ పెత్తానం చేస్తా వుండినావమా!" అనింది.

"నీళ్ళులేని బాయిలోకి దూకి నడుములిరిగి చస్తానేగాని ఆ కరంటోడికి ఎదురుంగా నిలబడి నా చేతల్తో నేను బిల్లు కడతానా? వాడ్ని యాడికొస్తే ఆడికి అడిగేసి వొచ్చినానే! గొంతు కానేటట్టు సాడు పోసేసి, చేతికి సద్ద రొట్టి గదా యిచ్చేసొచ్చింది!" అనింది యెంగటమ్మ అక్కుసుతో.

నాగరాణి యింటికి పొయ్యింది.

నాలుగు నాళ్ళు తాలినాక మిట్టూరికి సుట్టూపక్కల వుండే నాలు గూళ్ళోళ్లు ఒక అయిడీకి వచ్చినారు. ఎండిపోవాల్సిన పైర్లన్నీ – నీళ్ళులేక, నీళ్లుండినోళ్ళకు గూడా కరంటు రీతిగా వచ్చి చావక – సగానికి సగం ఎండిపొయ్‌నాయి.

మిట్టూరు, రామాపరం, నడవలూరు, గంగిరెడ్డి పల్లి, గొల్లపల్లి, గెరికి చేనుపల్లి – ఈ గ్రామాల రైతులందరూ ఒకటి అనుకున్నారు.

పలాన రోజున రైతులందరూ రామచంద్రాపరం కాడ చేరి బస్సులు నిలేసి, గాలులు పెరికేసి, కిరసనాయిల్తో కాల్చేసినా పాపం లేదనుకున్నారు. అనుప్పల్లి, పచ్చికాపలం, చిత్తూరు పొయ్యే బస్సులు, ఇట్ట బోయలగడ్డ, వడమాలపేట, అప్లాయిగుంట, పుత్తూరుకు పొయ్యే బస్సులన్నిట్నీ రామచంద్రపరం కాడ నిలేసి ఏదన్నా దౌర్జన్యం చెయ్యాలనుకున్నారు.

పలాన దినం చద్దేళకంతా రామచంద్రాపరం చేరాలనుకున్నారు.

ఈ పని మునికన్నడికి గూడ బలే ఇష్టమైపొయ్యింది.

యెంగటమ్మ, "బస్సులన్నీ కాల్చెయ్యండిరా. ఈ సంగతి ఎంటీ రామారావు దాక తెలిసి పోవాల. నా కడుపు అట్ట కాలిపోతా వుండాది!" అని మునికన్నడ్ని ఎగదోలి, "అయితే బద్రం రే, అన్నిటికీ నువ్వే ముందుండొద్దు" అని యెచ్చిరిక జెప్పింది.

ఆరోజు చద్దేళ అయిపోతా వుండాది గాని మునికన్నడు బజిన గుడి కాడికి వస్తే నలుగురు రైతులు లేరు.

"ఇదేమి పెండ్లా, వక్కాకు బెట్టి పిలిచేదానికి, రండి మామా!" అని మునికన్నడు ముందరుండి అందర్నీ పిలిస్తే –,

ఒకాయన, "మీరు పదండిరా. నేనొక్కడ్ని వస్తే పనై పోతిందా, రాకుంటే నిలిచి పోతిందా, నేను వస్తాన్లే మీరు పదండి" అన్నాడు.

ఇంగొక రైతు, "చద్ది తాగేసి వస్తా, నా కోసరం చూడకుండా మీరు రామచంద్రాపరం చేరండి!" అన్నాడు.

ఇంగొకాయన, "ఇట్టా మంత్రాలకు చింత కాయలు రాలునా!" అనేసి మడి కాడికి పొయ్‌నాడు.

రామచంద్రాపరం కాడ మొత్తానికి యాపై మంది రైతులు చేరినారు. వచ్చిన బస్సును వచ్చినట్టే యెనక తొక్కులు తొక్కతా ఆపినారు.

బస్సుల్లో వుండినోళ్ళు రామచంద్రాపరం కాడ నాష్టా తినేసి మళ్ళా బస్సల్లో ఎక్కి కూచ్చున్నారు.

ఒక రైతు, "ఈపాటికి తిరప్తిలో అయ్యుంటే యాపై అర్రై బస్సులు కాలి పొయ్యుండును. మనమేమన్నా కాలేజీ చదువులు చదువుకొనే పిలకాయిలమా!" అని అన్నాడు.

ఒక్క గెంట తాలినాక బస్సులు యదాపకారం పొయ్‌నాయి.

రైతులందురూ ఈ రకంతో చేసినారని చెప్తే బాదూరులో వుండే కరంటు ఆపీసోళ్ళు చెవల్లో గూడ యేసుకోలా.

## 11

మునికన్నడు యింట్లో నుంచి ఈదిలోకొచ్చి, తలెత్తి ఆకాశంలో నాలుగు మూలలా మెరిసే మెరుపుల్ని పిరింతో చూసి, "నాలుగు పక్కలా కొరివిలు ఎగేసినట్టుండాది. ఈ రాత్రికి వాన గ్యారంటు" అని అంటా యింట్లేకి వచ్చినాడు.

మునికన్నడు ఈ వాటంతో యింట్లేకి బైటికి గెంట సేపుట్నించి తిరగతానే వుండాడు.

వాన కోసరం కొడుకు ఆత్రం జూసి, యెంగటమ్మ, "పొయ్, ఈదిలోనన్నా పొనుకోరా, మునికన్నా! నువ్వా వాటంతో తిరగలేవు!" అనింది.

"అది గాదమా! ఈ రేత్రికి మాత్రం వాన తప్పదు. అట్ట బొయ్ చూడుబో, ఒక్క చుక్క కనిపిస్తా వుండాదేమో! ఆకాశిం అంతా మొబ్బులు మోడాలుగా వుండాది" అనన్నాడు ఆశిగా.

దీనికి యెంగటమ్మ, "ఈకాలం మొబ్బుల్ని నమ్మలేమురా మునికన్నా, అవి ఊపులు డాపులు చేస్తాయే గాని నాలుగు చినుకుల్ను కురవ్వు" అనింది.

అప్పటికే రెయ్యి తొమ్మిది గంటలవతా వుండాది. ఇలామంతు నాయుడు యేసింది తిని, పోసింది తాగి మంచం మింద చేరుకొని గురకలు కానిస్తా వుండాడు.

మునికన్నడు మళ్ళా, "మబ్బులన్నీ రాయల చెరువు కల్లా పరిగెత్తతా వుండాయమా. మబ్బులు దచ్చినంగా పరిగెత్తితే వాన పడితింది గదమా!" అనడిగినాడు. యెంగటమ్మ 'ప్చ్' అని పొడుగ్గా అని, "పెదబ్బా, పదీ పదైదు ఏండ్లకు ముందర గూడ రాయల చెరువు నీళ్ళు గదరా ఇదంతా వచ్చి పారతా వుండింది! రాయల చెరువంటే చిన్న చెరువా? అదిగాని తెగిపోతే – కాళాస్తిరి గోపరం మింద గువ్వ మోరొంచకుండా నీళ్ళు తాగాలంట, పెద్దోళ్ళు చెప్పుకొనే వోళ్ళు. అటుమంటి చెరువే పూడిపొయ్ బారళ్ళు

బారళ్లుగా నెర్రిలు చీలి పొయ్యింది. ఆ చెరువులో నీళ్ళుంటే ఈ బావల్లో నీళ్ళు" అని యెంగటమ్మ మిట్టూరికి మూడు మైళ్ల దూరంలో వుండే రాయల చెరువును గురించి చెప్పింది.

ఈ మాదిర్తో వుడకాడిపించినాక ఒక్క పొద్దును వాన కురిసేసింది! ఆ మాత్రం కురవడానికన్నా వానకు మనుసొప్పినందుకు రైతులు కుశాల పడినారు.

ఎండకు బూమమ్మ వుడికి గదా పొయ్యుండేది! ఆ వానకు కొంచిం చల్లబడింది.

"యింక వానకాలం పెట్టేసింది గదా! తిరమల నెల్లో, నోమల నెల్లో వానలు జోరుగా పడకనే పోతాయా? చెరుకు తోటకు దిగుల్లేదింక" అన్నాడు మునికన్నడు యెంగటమ్మతో.

దేముడి దర్మాన వాన కొంచిం దారాళంగా చినావిటి నెల్లో ఒక వాన, పెదావిటి నెల్లో ఒక వాన, పడిపొయ్యింది. దీంతో గొడ్డూ గోదకు దిగుల్లేకుండా ఓ అని యాడ జూసినా పచ్చిక పడి పొయ్యింది.

బావల్లో బిత్తెడెత్తు గూడ నీళ్ళు మాత్రం పెరగలా.

మునికన్నడి చెరుకు తోట సగించినట్టు పెరిగి పొయ్యింది.

చినావిట్లో ఒక వాన, పెదావిట్లో ఒక వాన పడిపొయ్యే కొందికి మునికన్నడి కుశాలకు పట్టపగ్గాల్లేకుండా అయిపొయ్యింది. ఆవు కోసరమని రెండు గుంటల్లో జొన్న చల్లినాడు మునికన్నడు.

"అయా అయా! ఎట్టా రెండెకరాల బీడు వూరికే పడుండాది! నారు పోసేద్దారి. వానాకాలం పెట్టేసింది. ఈ పలితం బీడు పోకుండా జయ వడ్లు నారు పోసేస్తే రెండూ రెండున్నర నెలల్లో కోత కొచ్చేస్తింది. మనం గెండు కుంటాము" అని నాయనతో అన్నాడు మునికన్నడు.

ఇలామంతు నాయుడు పదరకుండా, "బాయిలో నీసులా? వుండే నీసులు చెరుకు తోటకే చాలక చస్తా వుండామనుకో! బలే పోసును నారును. నువ్వు

పిల్లాటలు ఆడకుండా గమ్మనుండు. ఏమిటికి, వడ్లు దండగయి పోతాయి రుధాగా, మూట ఇత్తనాల వడ్లు" అని అన్నాడు.

మొగుడి మాటలకు యెంగటమ్మ ఒంటి కాలిమింద బొయ్యింది.

"నోరు తెరిస్తే దరిద్రపు మాటేనా? పిలగోడు అంత మునాశ పడతా వుంటే, నిప్పుల మింద నీళ్ళు జల్లినట్టు మాట్లాడతా వుండావే! నువ్వు మూస్కోని గమ్మనుండు. ఒరే పెదబ్బా, నారు పొయ్యాల కావాలరా!" అనింది యెంగటమ్మ.

ఆ రెండు వానలకే నారు పోసినాడు మునికన్నడు దైర్నంతో. బావికి నీళ్ళు ఎక్కిరాంది అడుసు దున్నలేము.

తిరమల నెల పెట్టింది. కొండ మింద బ్రమ్మోత్సవాలు గూడా మొదలైనాయి. తిరమల నెల మొత్తం మింద ఒక్క చినుకు గాని బూమ్మింద పడుంటే!

"చెప్తే యింటివా పిలగా! అమ్మాగొడుకు లిద్దురూ నా మింద శౌర్రానికి పొయ్ నారు పోసి – ఒక్క మూట వడ్లు ఎవురు తిన్న పాడు!" అని అంటా ఎద్దుల పగ్గాలను యిప్పి నారు మింద తోలినాడు ఇలామంతు నాయుడు.

"బతకాలని బాయి దొవ్వినాము, బండ పడేది కలగన్నామా? నువ్వు కానియ్ – బిడ్డని బెదరగొట్టద్దు" అని మునికన్నడికి సపోరటగా నిలబడింది యెంగటమ్మ.

ఆ జానాబిత్తెడు నారులో గూడా ఎద్దుల్ను తోలి మేపెయ్యాల్సి వచ్చింది.

మునికన్నడు బాయి దగ్గిర ఏందో పనిలో వుండాడు. ఇలామంతు నాయుడు నారు దగ్గిర ఎద్దల్ని మేపుకుంటా వుండినాడు.

ఆవు గొడ్లు రెండూ పచ్చి మేత లేక అంబా అని అరస్తా వుంటాయని అనిపించి, ఎట్టా మడి కాడికి వచ్చినాము, నాలుగు చెరుకు మోడుదులు పెరుక్కోని పోదారనుకొనింది యెంగటమ్మ. ఆమెకు వాళ్ళ చెరుకు తోటలో మోడుదులు పెరకడానికి మనసొప్పక సొసైటీ ఆయన చెరుకు తోటలోకి దూరి కొంచేపుట్లోనే వాదిడు మోడుదులు పెరుక్కొనింది.

తోటలో గలగలమని అనిపించి, తిరిగి చూస్తే యెంగటమ్మకు సొసైటీ ఆయన కనిపించినాడు.

ఆమె తోటను అక్కడ బెట్టుకొని పరావోళ్ళ తోటలో మోడుదులు పెరికి నందుకు యెంగటమ్మకు లజ్జ అయిపొయ్, "మా తోటలో మోడుదులు లేవన్నా, నీ తోటలో పెరుక్కుంటా వుండా" అనింది.

సొసైటీ ఆయన యెంగటమ్మ దాపుకు అదొక రకం చూపుతో వచ్చి, "నీ రైకలో చెయ్యెయ్యాల గద వొదినా! చాలా దినాల నుంచి గెమనంగా వుండాది" అని ఇకారపు నవ్వు నవ్వినాడు.

యెంగటమ్మ ముక్కల గుండా నోటి గుండా సందిట్లావు గస బెట్టుకుని వుక్రోషంతో, "నా బట్టా! నా ఒంటి మింద చెయ్యెయ్య గలతావా నువ్వు? నీ పేగులు దీసి నా మెళ్ళో జంద్యమేసుకోనా!" అని సవాలేసింది.

సొసైటీ ఆయనకు నోట్లో తేమ లేకుండా అయిపొయ్ బిత్తర పొయ్నాడు.

యెంగటమ్మ కాలు పైకెత్తుకొని పొయ్, "నా బట్టా, నేను నీ కంటికి అంత అదవగా కనిపించినానా! ఆడంగుల్నా బట్టా! నేను నీకు కావాల్సొచ్చినానా? నా బట్టా, నా బిడ్డకు గాని ఈ సంగతి చెప్తే నిన్ను నరికి మా చెరుకు తోట మింద పొలి జల్లేస్తాడు. గుణానికి ఎక్కవే, కులానికి ఎక్కవేరా నేను" అని శౌర్రింతో మాట్లాడింది.

సొసైటీ ఆయనకు దడపుట్టి పొయ్ వణికి పోయినాడు.

"ఉత్తరంగా మళ్లుకొని చెంపదెబ్బ లేసుకుంటా వుండాను చెల్లా! చెరుకు తోటలో జరిగి పొయ్యిందాన్ని చెరుకు తోటలోనే మర్చిపో అమ్మీ! ఈసారి గాని నీ జోలికొస్తే నీ కొడకల్తోనే గాదు, మా ఇలామంతు మామతోనే చెప్పు. అయ్యయ్యో వరస కూడా లేదీ పాపిష్టోడికి!" అని బిత్తర బిత్తరగా ఆయన చెరుకు తోట నుంచి బయట పడి, "మా ఒళ్లు బలిసిన ఆడది మోడుదులు జోలికే రాదుగాని, నువ్వు దినామూ వచ్చి పెరుక్కో యెంగటమ్మా!" అని అదొక రకం గొంతుతో అనేసి అదే పోవాటం.

యెంగటమ్మ, "బతికి పొయ్‌నావు బో – తెలివి గల్లోడేనమ్మా సొసైటీ నా బట్ట!" అని పైకే అని, చెరుకు మోడుదుల్ని మోపు గట్టుకొని తోట బయటికి వచ్చింది.

'సొసైటీ వోడికి ఎన్ని గుండికాయలు రా బగమంతుడా! నా మొగుడ్ని ఒక పక్క, నా కొడుకుని ఒక పక్క పెట్టుకోని నా దగ్గరికి రావాలనుకున్నాడే! వాడి దైర్నానికి మెచ్చుకోవాల! ఒక్క మాట యెతిరేకంగా అనే కొందికి ఒ(్రాకు మందాన బేదిపొయ్యింది తిక్కలెదవకు!' అనుకొని యెంగటమ్మ నవ్వుకొనింది.

ఆమె మునికన్నడి దగ్గిరికి పొయ్యే కొందికి ఈ సంగతే మరిచి పొయ్యింది. నాగుబాముకైతే బెదరాలగాని, నీళ్ళపామును ఒక ఆట ఆడిపించచ్చు గదా! అనుకొని ఆమె సొసైటీ ఆయన కోతి పనిని లెక్కలో యేసుకోలా.

మునికన్నడి దగ్గిర చెరుకు మోడుదుల మోపును దించి కూచ్చునింది.

"ఏమిరే పెదబ్బా! ఎరగనోచ్ అని అందరూ గమ్మనుండారే, ఆ మాట గూడా నేనే చెప్పాల్నా?" అనింది యెంగటమ్మ కొడుకు పక్కన కూచ్చుంటా.

అమ్మ నోటి నుంచి ఏమి వస్తిందోనని "ఏందమా?" అనడిగినాడు మునికన్నడు.

"ఏంది – అంటే ఏమి చెప్పుదు? శెనిగి తోట ఎండిపొయ్ ఎన్నాళ్ళాయ! ఒక్కరన్నా ఈ సంగతిని అద్దాలామెకు చెప్పకుంటే ఎట్ట? ఆర్నెల్ల పలితంలో ముప్పై గుంటల్లో పైరు నిట్ట నిలువునా ఎండిపోలా! వారం సగానికి సగమే యిస్తామని అద్దాలామెకు చెప్పాల గదరా!" అననింది.

దీనికి మునికన్నడు, "చెప్పి ఏమి సుకం అమా! పైరెండి పొయ్యిందానికి నేనేమి జేద్దునని తిరుక్కోదా అద్దాలామె! ఆమి దగ్గర మన బుడ బుడకలు వాగునా?" అనన్నాడు.

"మన మాట మనం చెప్పాల గదా! పలితం బాగా పండినప్పుడు వారం మొక్క బోకుండా యిచ్చినాము గదా! ఈసారి ఎండిపొయ్యింది – అంత వారం యియ్యలేమని చెప్పుకోవాల గదరా!" అననింది యెంగటమ్మ.

“అట్టయితే మా నాయిన దినామూ బండి బాడిక్కి తిరపతికి పోతా వస్తానే వుండాడు గదా! ఒక మాట, అద్దాలామె దగ్గరికి పొయ్ చెప్పుంటే ఆయన తలగుడ్డ నేల పడిపోతిందంటనా!” అని అమ్మ దగ్గిర నాయన మింద నిస్టూర పొయ్‌నాడు మునికన్నడు.

“ఆ మొగోడికి ఆ మాత్రం తెలివుంటే, ఆయన బిడ్లకు మీకూ ఆయన పెళ్ళాన్ని నాకూ ఈ రాత ఎందుకు పట్టుంటింది?” అనింది యెంగటమ్మ.

యెంగటమ్మ మొగుడ్ని పిలిచి, “ఎండిపొయ్‌న పైర్ల మింద గొడ్లను తోలి మేపే దానికి యిది బలే మొగలాయి. ఇట్ట చావు!” అనరిచింది.

ఇలామంతు నాయుడు మాటతో గూడా బాయి గడ్డ మిందికి వచ్చినాడు.

ఆయన వచ్చీ రాంగానే యెంగటమ్మ “చేతులూగించుకుంటా నడిచేది తెలుసునే! ఇన్ని రోజులుగా బండి నొగ మింద కూచ్చోని తిరప్తికి పోతా వస్తా వుండావు. ఒక్క రోజు అద్దాలామె దగ్గరికి పొయ్ శెనిగి తోట ఎండిపొయ్యింది, వారం తగ్గించి తీసుకోమని చెప్పి చచ్చుంటే నీయబ్బ గంటు పోతిందా?” అనడిగింది.

పెళ్ళాం నోటి నుంచి వచ్చిన మాటలకు ఇలామంతు మొకం చిటకరించు కొని, “నువ్వెందుకు ఎద్దు మంచమెక్కినట్టు - మాట్లాడేది! నీ మాటలకు ఆదీ నిదానం లేదా? శెనిగి తోట ఎండిపోక ముందే నేను గురవడ్ని తొడుకోని పొయ్ మాట్లాడితి. అద్దాలామె సంగతి తెలవదా! పదేల రూపాయిలకు రేపు చెరుకు గాదా - ఈసారే గదా మీకు మంచి పలితం - అని దొబ్బుతా వుండాది అద్దాలామె. వచ్చే పలితం నుంచి వారం ఎక్కువ అడిగితిందంట” అని అన్నాడు.

దీనికి యెంగటమ్మ కొంచిం తగ్గి, “ఈ సంగతి మాకు చెప్పుంటే నీ నోటి ముత్యాలు జల్లన రాలి పొయ్యుంటాయా?” అనింది.

“మంచి మాటయితే చెప్పచ్చు. దీన్ని గూడ చెప్పాల్నా? బాగ నీళ్ళుండి, పలితం బాగ అయినపుడు అద్దాలామెకు మనం వారం ఎక్కువిచ్చినామా? ఈసారి ఎండి పొయ్యిందని వారం ఇయ్యాపంటే ఆమె ఒప్పుకుంటిందా? వూర్లో పూరిల్లు బెట్టుకొని, తిరప్తిలో కిందాపైనా మిద్ది కట్టుండే మనిసామె.

మన దగ్గిరుండే అష్ట తెలువులు ఆమి దగ్గర వుండవా!" అనేసి మళ్లా ఎద్దుల కాడికి పొయ్‌నాడు ఇలామంతు నాయుడు.

"నిమ్మళం జేస్కోరా పెదబ్బా, చెరుకు తోట దుడ్డులో మూడు వేల రూక మంది గాదు. ఇంక అంతే! వానలు గాని పడుండి, బావుల్లోకి నీళ్ళు వచ్చుండి, ఆ నారు గాని నాటుందుమా! ఈ పలితం గూడ మనకు నష్టం వుండుండదు. అంతా ఆయన దయ, మన ప్రాప్తం!" అనింది యెంగటమ్మ చెరుకు మోడుదులు నెత్తిన పెట్టుకుంటా.

మునికన్నడు గూడా అమ్మతో పాటు యింటికి ఎలబారి, "నిరుటి కన్నా ఈసారే మేలులే అమా! చెరుకు తోటకు పదీ పన్నెండు వేలు ఒకేసారి వస్తుండ్లా!" అనన్నాడు.

"మనకు రూకను చూసే కొందికి అట్టనే అనిపిస్తింది గాని ముందు పలితమే మేలు. ఇరై అయిదు మూటల వడ్లగింజల్ను యిరుపులో పెట్టుకున్నాము. కొన్ని అమ్ముకున్నాము. ఎంత బాగ జరిగింది. యింక ఏ కాలానికి మనం ఇరై అయిదు మూటల వడ్ల గింజల్ను యింట్లో పెట్టుకో బొయ్యేది!" అని మాట్లాడింది యెంగటమ్మ.

నోమల నెల్లో గూడ వానలు మొక్కుబడికి నాలుగు పదున్లు అప్పుడప్పుడు కురిసినాయే గాని వంకలు సాగలేదు. కయ్య నీళ్ళు కయ్యకు పొల్లలేదు, యెల్లవలు రాలేదు. దీంతో బావల్లో నీళ్ళు ఎక్కనే లా.

## 12

వానలు పడకనే పొయ్ ఎండకారు పెట్టేసింది. అద్దాలామె బాయిలో నీళ్లు – రెండు గెంటలు నిలిపితే మిసినీకి ఒక గెంటే వస్తుండాయి.

ఇరై గుంటల్లో నమనమలాడతా చెరకుతోట వుండాది తప్ప, మిగతా ముప్పై గుంటలు అంతా బీడు బీడుగానే వుండాది.

"ఆ బాయిలో వుండే నీళ్ళను నమ్ముకోని యాపై గుంటలను పైరెక్కించ లేము. ఈసారి ఇరై అయిదు గుంటల్నే వారానికి తీసుకుందాము. ఎట్టా

ఇరై గుంటల్లో చెరుకు పైరుండాది. రేపు దాన్ని పండగల్లో కొట్టెయ్యంగానే మళ్ళా మొక్క యిడిచేద్దాము. ఇంకొక అయిదు గుంటల్లో అంత మడి దున్నుకుంటాము. అంతే మనకు ప్రాప్తి. యాపై గుంటల సేద్యం ఒకటిన్నర సమ్మచ్చరంలోనే ఇరై అయిదు గుంటల సేద్యమైపాయ. కాలం మారిపొయ్యే దానికి ఎంత కాలం గావాల?" అని మాట్లాడింది యెంగటమ్మ.

మునికన్నడు గూడా పొడుగ్గా ఆలోసిన జేసినాడు. యాపై గుంటలను వారానికి దున్నితే ఆర్నెల్లకు ఇరై అయిదు మూటల వడ్ల గింజల నియ్యాల. అదే, ఇరై అయిదు గుంటల్నే పైరు చేసుకుంటే పన్నెండు పన్నెండున్నర మూటలిచ్చుకుంటే చాలు. ఈ సమ్మచ్చరం అంటే వానలు ఎగేసేసినాయి, వచ్చే సమ్మచ్చరమన్నా బాగ పడక పోతాయా? అప్పుడు కావాల్సుంటే బూమినంతా దున్ని పైరెక్కించి అనుకున్న ప్రకారం వారం ఇచ్చినా నష్టం వుండదు. ఈ రకంగా అనుకుంటే నిమ్మళంగానే వుండాది మునికన్నడికి.

అవితే ఒక పక్క మునికన్నడి గుండికాయల్లో జెరం గూడ కాస్తుండాది.

అద్దాలామె మొండిదే, ఇరై అయిదు గుంటలు బీడుపెట్టి ఇరై అయిదు గుంటలు వారానికిచ్చునా?

మునికన్నడికి ఎదురుంగా అద్దాలామె నిలబడి, "దొబ్బుదురుండండి దోసపండు, మీకేగాదు - తెలువులు మాకూ వుండాయి. మీరు బీడు పెట్టుకుంటారో పైరు చేసుకొంటారో అనావశిం. నా గుత్త నాకిచ్చెయ్యండి" అని ఎక్కిరింపుగా మాట్లాడినట్టనిపించింది.

అద్దాలామె అదే పట్టులో వుంటే మనం కయ్యను వొదులుకోవాల్సిందే. ఇంక యేరే మార్గం లేదు. ఆ బాయిని చూస్తా వుంటే ఒకిటిన్నర సమ్మ చ్చరంలోనే యింత మారిపొయ్యిందంటే ముందు ముందు నేలమట్టంగా ఎండిపొయ్‌నా ఇచ్చిత్రపోవాల్సిన పన్లా.

చేతికొచ్చిన కయ్యను వొదులుకో లేక ఈ మాత్రం తపన పడాల్సిందే! నిజ్జిం మాట్లాడుకుంటే ఆ బాయిలో నీళ్ళు ఇరై అయిదు గుంటలకు గూడ ఇబ్బంది చేసేటట్టే వుండాయి. అటుమంటప్పుడు అంతా దున్నితే పైరును ఎండబెట్టుకొని నెత్తినేసు కోవలసిందే.

ఒకవేళ మనం, "ఇరై అయిదు గుంటలు వారానికిస్తేనే మేము పైరు చేస్తాము, లేకుంటే మాకు నీ కయ్య అనావశిం తల్లా. మీ కయ్యలో కూలోళ్ళకన్నా ఈనంగా కష్టిం చేసి రెండు ఆవుగొడ్లను, బండిని, ఎద్దుల్ను సంపాదించుకున్నాము. కరువు కాలంలో, నీ కయ్యను పైరుచేసి ఎండ బెట్టుకొని నీకు వారం యిచ్చి సంపాదిచ్చిన సొత్తును పోగొట్టుకోలేము" అని గాని నిష్టూర పోతే అద్దాలామే వొంగి రాదా!

నీళ్ళు అరదట్లు అయిపొయ్‌న ఆ బాయి కింద ఏ రైతు గుత్తకు దున్న బోతాడు? ఇప్పుడు గూడా ఆమె ఇరై అయిదు గుంటలనే వారానికిచ్చిందంటే, ఆ బాయిలో నీళ్ళు ఏ పది గుంటలకో పారతాయి. మత్తేపు పిలిచినప్పుడు పలికి, ఆయన కాళ్ళోయేళ్ళో పట్టి – నీళ్లకని – ఆ ఇరై అయిదు గుంటల పైరునన్నా కాపాడుకోవాల్సిందే. అటుమంటప్పుడు వారానికి అద్దాలామె యాపై గుంటలనూ దున్నే దానికి ఏ రైతు ముగస్తాడు? అందరికీ బయమే గదా! మునికన్నడు ఇక్కవలు ఇక్కవలుగా ఆలోసిన్లు చేసుకున్నాడు. ఇంక పదినాళ్ళు పోతే పండగ నెల పెడితింది. పండగ నెలను చూసీ చూడంగానే చెరుకును చక్కెరి మిల్లుకు తోలాల. ఈ పది నాళ్ళల్లో అద్దాలామెతో అన్నీ మాట్లాడుకుంటే గదా!

"అమా! నాయిన్ని అద్దాలామె కాడికి అంపిద్దాం. అన్నీ మాట్లాడేసి రమ్మని! ఆమెగాని 'మ్' అంటే అయిదు గుంటలకు నారు పోసుకోని దున్నుకుందాము. ఎట్టా యిరై గుంటల్లో చెరుకు తోట వుండె, యింకొక అయిదు గుంటల్లో వరిమడి దున్నుకుంటే యింట్లో ఒకటికి నాలుగు గొడ్లయిపొయ్‌నాయి, ఇంట్లో వడ్లగింజ గూడ లేకుండా పొయ్యింది గదా!" అని ఆశిగా మాట్లాడినాడు మునికన్నడు.

దీనికి యెంగటమ్మ, "ఈ పనికి మీ నాయినొద్దులే. నువ్వే ఒక నాటికి బండి తోలుకొని తిరప్తికి పొయ్ గురవ బావను తోడుకొని అద్దాలామెతో మాట్లాడు. మీ నాయినయితే అంతా ఒగటి సగంగా చేసుకొని వస్తాడ్రా సామీ!" అనింది.

ఒక కట్టెల యాపారస్తుడు మిట్టూరులో ఒక రాగి మానును కొని దాన్ని కొట్టించినాడు. ఆ కట్టిని తిరప్తికి తోలుకొని పొయ్యేదానికి అయిదారు బండ్లు

మాట్లాడినాడు యాపారస్తుడు. ఆ బండ్లల్లో ఇలామంతు నాయుడి బండి గూడా ఒకటి, ఆ మరసనాడు తెల్లార జాముున బండి కట్టాల.

ఆ రాత్రి అమ్మలు బిడ్లు అందరూ ఒగిటిగా పొనుకొని, "అద్దాలామె ఒప్పుకుంటిందో ఒప్పుకోదో? ఒప్పుకోక ఏమి చేస్తిందిలే" అని సందేకంగా, దైర్నంగా మాట్లాడతానే వుండిపొయ్‌నారు. ఆ రోజు దర్మడు గూడ యింటి కాడనే పొనుకున్నాడు, వూళ్ళోకి పొయ్ ఎక్కడెక్కడో పొనుకోకుండా.

ధర్మడికి ఒక కష్టిం వచ్చి పడింది.

పిచ్చాటూరులో పాలను యెన్నజేసే పాలకేంద్రం ఒకటుండాది. ఆ కేంద్రానికి పాలుపొయ్‌మని మిట్టూరులో పాల డిపో పెట్టినారు గవుర్మె ట్టోళ్ళు. అంతా దినాల మింద పని జరిగి పొయ్యింది.

ఈ కరువు కాలాన్ని రైతులకు ఆవల్ను పట్టించి ఎదుర్కోవాల అని ఎంటీ రామారావు, ఆయన మంత్రులు బలే పట్టు మింద వుండారు.

మిట్టూరులో పాల డిపో పడే కొందికి రైతుల కుశాల చెప్పనలివి గాకుండా పొయ్యింది. రైతులందురూ, "నీకూ మాకూ రుడం తీరిపొయ్యింది. మా వూళ్ళో పాల డిపో పడి పొయ్యింది" అని పాలాయనతో చెప్పేసినారు.

పాలాయన రేటు కాలు రూపాయి పెంచి చూసినాడు గాని లాబం జిక్కలా. రేపో ఎల్లుండో పడబొయ్యే డిపోకే రైతులంతా పాలు పోస్తారు.

ధర్మడు డికిరీ చేతిలో బట్టుకోని, ఒక చోట కదుపు కదలకుండా కూచ్చోని పాలుపట్టి శాంపిలు పాలు, కమీసను దొబ్బదామనుకున్నాడు. అవితే, వూళ్ళో ఏండ్ల తరబడి వుండేటోళ్ళు ఆ చాన్సు ధర్మడికి దొరకనిస్తారా?

ఒక కలిగినాయనకే ఆ పని కుదిరి పొయ్యింది.

దీంతో ధర్మడికి నెలకు ఇన్నూర్రూపాయిల ఆదాయం పూడిసింది.

దీనికి యెంగటమ్మ బలే బాదపడి, "నెలబెట్టే కొందికి ధర్మడు ఇన్నూరు రూపాయిలు తెస్తుండె, ఆ నోటికాడ కూడూ బగమంతుడు పెరికేసినాడే!

కష్టాలన్నీ కుమ్ముగా వచ్చి పైనబడి పోతా వుంటే ఏమి చెయ్యాలరా నాయినా! అద్దాలామె ఇరై అయిదు గుంటలు వారానికి యిచ్చినా, ఇరై గుంటలు చెరుకు తోట, అయిదు గుంటలు మడి. ఆ సేద్యం నా పెద్దకొడుకి చిటికినేలికి చాలదే! ఇంక నా నడిపి కొడుకుని నేను నిజ్జింతో మేపాల్సిందే తేరకు! కూలి పన్లకు పొమ్మన్నా ఒక్కరోజు పోతే నాలుగు రోజులు గదా మొండికేస్తాడు. మిట్టూరు కొచ్చినా రంగంపేట వాటం తప్పలేదే!" అనింది.

ధర్మడు నోరు తెరిచిందే తెరిచినట్టుగా, "మీరు నన్ను అంతగా మేప లేకుంటే యేర్లు పోదాం పట్టండి. అన్ని పన్లూ చేసేది యాలొచ్చె, మీ దగ్గిర అనిపించుకునేది యాలొచ్చె?" అని తిరుక్కున్నాడు.

మునికన్నడు రోషం తెచ్చుకోని, "కొత్రా ఆ నాయాల్ని చెప్తూతో. ఇక్కడుండే బూములు బావల్ను పంచుకోని యేర్లు పోవాలంట యిది! సిగ్గులా, ఆ మాటనే దానికి! నాయాలా యేర్లు పొయ్యే దానికి యిక్కడ ఏమి సంపాదన వుండాది వాయ్. నీ ఒంటిమింద వుండే గుడ్డల్తో నువ్వూ, నా ఒంటిమింద వుండే గుడ్డల్తో నేనూ యేర్లు పోదాం పట్టు. సిగ్గులేని నాయాలా, పైకి లేచినానంటే! ఇందుకా ఈ రాత్రి నువ్విక్కడ మా పక్కల్లో పొనుకొనింది?" అని అన్నాడు.

ధర్మడు శిగమెత్తి పొయ్ పైకి లేచి, "మీ మొకాలు చూస్తేనే గోవును చంపినంత పాతకం నా కొడకలాలా! మీ చావు మీరు చావండి, నా దోవ నాది. నేను రామచంద్రాపరం కాడుండే కొయ్యలు కోసే మిసినీలో చేరి పోతుండా, నెలకు అయిదు నూర్ల జీతం. నా సొత్తు తినేదానికి మీకు ప్రాప్తం లేదు పొండి" అనేసి పొయ్నాడు. ధర్మడు నిదానం మింద ఈ మాటలు చెప్పి, అందర్నీ యిచ్చిత్ర పొయ్యేటట్టు చేద్దామనుకున్నాడు మొదట. అయితే దరిద్రంగా అది ఈ రకంతో గుద్దులాట అయిపొయ్యింది. ధర్మడు యెనిక్కి వచ్చి, ఒద్దిక అయిపోయి, అన్నీ చెప్పదామనుకుని, రోషానికి పొయ్, మళ్ళా యెనిక్కి రాలేక పొయ్నాడు.

ఇలామంతు నాయుడు నోరు తెరిచి, "నాయాండ్లు బైసాట్లు అని గూడ అనుకోకుండా ఈ వాటంతో గుద్దులాడుకుంటా వుండారే!" అని అనాలనుకొని గమ్మనుండి పోయినాడు.

ధర్మడు అట్ట అనేసి, అట్ట పొయినాడో లేదో అందరికీ యాడలేని కుశాల వచ్చేసింది. ఇప్పుడు లోకం మింద వుండే కరువును జూసి, ధర్మడి మాటలకు కుశాల పడక దుఃక్క పడతారా?

యెంగటమ్మ నోటి నిండికి కులుకు బెట్టుకుని, "ఆ నా బట్టను గురించి నేనే పొద్దూ దుఃక్క పడలా. నక్క తెలువుల నా బట్ట గదా వాడు. ఏ తెలివితోనో ఒక తెలివితో వాడు బతికి పోతాడు. సేద్యం వుండిందా, కమ్మ పని జేస్తాడు. సేద్యం లేదు, బాద పడడు, కంసలి పని చేస్తాడు. వాడిని గురించిన బాద నాకు రూంత గూడ లేదే! చూడా, వాడి తెలివి చూడా, కొయ్య పని ఎప్పుడు నేర్చుకున్నాడో గాని నేర్చుకున్నాడే! తలుపులను కోసేది, దాలముందరాలను కోసేది – అదేమి చిన్న పనా? రామచంద్రాపరం కాడికి బీడీ కట్టలు కొనను పోతా వున్నెట్టుంటాడా, ఎప్పుడో అక్కడుండే సా మిల్లుకాడ పని నేర్చుకొనేసి నాడు! ఒకసారి వాడు 'అమా కొయ్యలు కోసే దానికి నన్ను క్రిష్ణమాచారి చేరమని చంపతుండాడు' అనంటే 'వాడి మొకంలే' అనుకున్నా. అమ్మో, పనోడంటే పనోడు! చూడా, ఒక పనిని వొదులుకున్నాడు. యింగొక పనిలో కుదురుకున్నాడు. లచ్చిలు సంపాదిచ్చే శాల్తి వుండ్లా నా నడిపి కొడుకు తావన. నా పెద్ద కొడుకే గదా, నంగమ్మా నంగ! ఎట్ట బతకబోతాడో నా యెర్రి నాయిన!" అని బారడు పొడుగు పాటం చదివినట్టు చదివింది.

ఆ తెల్లారి జామున్నే మునికన్నకడు, యెంగటమ్మ నిద్ర లేచేసినారు. ఇంక మునికన్నడు బండి కట్టాల.

మునికన్నడు ఎద్దలకు తవుడు పెట్టి యింట్లేకి వచ్చినాడు.

"అమా, కడుపులో మంటగాని, అన్ని కూట్నీళ్ళు యియ్యమా!" అనడిగి నాడు.

యెంగటమ్మ, "నేను గొడ్డు ముండను గాదురా యెదవా!" అని కొడుకు చేతికి ముగ్గు పిండి చిప్ప యిచ్చి, పండ్లు తోముకోమనింది.

మునికన్నడు పండ్లు తోముకోని మొకం కడుక్కొని గిన్నె దగ్గిర కూచ్చుంటే–

గిన్నిలో గిన్నిడు కూడు, కూడంత పెరుగు, నంజుకొనే దానికి రెండు ఎరగెడ్డలు వుండాయి.

మునికన్నడు కలుపుకోని కలుపుకోని పెరుగూ కూడు తింటా వుంటే యెంగటమ్మ, ఆ మబ్బులో ఉత్తరంగా తిరిగి, తిరమల కొండల కల్లా చేతులు జోడించి, "నా బిడ్ల నోటికాడ కూడు పెరకొద్దు, మహన్నబావా!" అనింది.

మునికన్నడు చద్దికూడు తినేసి, తేపు మింద తేపు తేపతా వుంటే యెంగటమ్మ-

"యింత ఆకలితో వుండినావే, కడుపులో అన్ని కూట్నీళ్ళు పోసుకోని పొయ్యుంటే ఏమయ్యుంటావు? తిరప్తిలో రెండు రూపాయిలు ఆడ పారేసి అంత నాష్టా అన్నా చేసే రకంగాదే! కడుపుకు తినకుండా మనం ఎత్తక పొయ్యేది ఏమీ లేదురా మునికన్నా!" అనింది.

మునికన్నడు బండి కట్టినాడు.

యెంగటమ్మ అట్ల పోయి, మళ్లా బండికి ఎదురుంగా వచ్చింది.

"అద్దాలామె దగ్గిర అణకవగా వుండి అన్నీ బొటువుగా మాట్లాడుకోని రా కొడకా!" అని సాగనంపింది యెంగటమ్మ.

ఆ ఎరవ నుంచి మద్యానం మూడు గెంటల దాక యెంగటమ్మ 'కొడుకెప్పు డొస్తాడా' అని ఒంటి కాలి మింద వుండింది.

మునికన్నడు బండి తోలుకొని రాంగానే గిన్నెలో సంగటేసి, రెండు గలాసులతో నీళ్ళు పెట్టేసింది.

మునికన్నడు గిన్నెకాడ కూచ్చోని, ఎంతో దైర్నం జేసుకొని, "అద్దాలామె కయ్యకూ మనకూ రుడం తీరిపొయ్యిందమా! ఇంక పది నాళ్ళల్లో ఆ చెరుకు తోటను కొట్టుకుంటే దాంతో వొగదెగి పోతింది" అనన్నాడు.

కొడుకు వచ్చి ఈ మాట చెప్పక ముందు వుండినంత ఆత్రం, చెప్పినాక లేకుండా పొయ్యింది యెంగటమ్మకు.

ఆమె పైమాటగా, "పోనీలే బో. మన నెత్తిరాయి నేల బడిపొయ్‌నట్టే లెక్క. ఆ కయ్యల్లో చేసిన కష్టిం ఇంక యాడన్నా చేస్తే బతక్కుండా పోము గాని! ఇన్నినాళ్ళూ అద్దాలామె కయ్యలో నుంచి తెచ్చుకోని తినేనా వూపిర్లు పెట్టుకొని తిరిగినాము" అనింది.

దీనికి మునికన్నడు కొంచేపు గమ్మనుండి పొయ్‌నాడు.

మళ్లా యెంగటమ్మే, “ఏమిరా అద్దాలామె అర్ధం కయ్యను వారానికిచ్చే దానికి పులుపంటనా, లంజికి?” అనడిగింది.

“అదంతా గాదమా, అసలు అద్దాల దాని అయిడీలే మారిపొయ్‌నాయి. నేను గాని ఈ దినం తిరప్తికి పోకుంటే ఆమే మన దగ్గిరికి వచ్చుండును. మనమనుకోనట్టు అంతా యిచ్చిత్రంగా జరిగిపొయ్యింది” అని చెప్పినాడు మునికన్నడు.

మునికన్నడు సంగటి తినేసి మంచం మింద యెల్లాలకల పడిపొయ్ నాడు. యెంగటమ్మ మంచం కోడు మిందనే కూచ్చొని, “అంతా చెప్పేమిరా, యిందాము” అనింది. మునికన్నడు వొడ్డిగిల పొనుకొని అమ్మకల్లా చూస్తా, “అమా, మొదటసల్లో అద్దాలామె కయ్యను మత్తేపుకి బేరం పెట్టేసింది. మాటలన్నీ అయిపోయినాయి. ఇంక పారీకత్తులు రాసుకునే పనే” అని మునికన్నడు అంటా వుంటే, యెంగటమ్మ, “నాతో కుశాల పడతుండావా?” అనింది నవ్వును తెచ్చి మొకానికి తగిలించుకొని.

“అయ్యయ్యో కుశాలలకు కాలమా అమా, యిది?” అని మునికన్నడు అంతా చెప్పినాడు.

“అద్దాలామె మనమనుకున్నంత సన్న మనిసి గాదు. చెయ్యలేని కయ్య మనకెందుకని మంచి బేరమొస్తే అమ్మెయ్యాలనుకొనింది. కూతురికి లక్సరు సమందం వచ్చిందంట. కట్నం లచ్చ రూపాయిలంట. ఆమె కయ్య ఎత్తుకోమంటే ఆ అల్లుడు ‘ఆ కయ్యను నేనేమి చేసుకొనేది. నెలకు మూడు వేలొచ్చే ఉజ్జోగాన్ని వొదులుకోని ఆ కయ్యలో మట్టి పిసుక్కోమంటావా?’ అనడిగినాడంట. తిరప్తిలో యిల్లు ఈ రోజు లచ్చయితే ఇంగొక సమ్మచ్చరంలో రెండు లచ్చలు గదా. అదే కయ్య అయితే! ఈ కరువు కాలాల్లో అది పండేదేంది, వచ్చేదేందని అద్దాలామె కయ్యనే బేరానికి పెట్టేసింది. మత్తేపుకు చేతిలో నీళ్ళుండాయి, రూకా వుండాది. అన్నాదమ్ముళ్ళు దండిగా వుండారు గదా. ఈ సారి చెరుకు తోటలోనే అరై డెబ్బై వేలు కండ్ల జూస్తారే! వాళ్ళకది

లెక్కా, కొంటా వుండారు, మన నోట్లో దుమ్ము కొట్టి” అని మునికన్నడు మొకానికి అడ్డంగా చేతులు బెట్టుకున్నాడు.

మునికన్నడు మోచేతిని అడ్డం బెట్టుకొని కండ్లల్లో నీళ్ళు పెట్టుకుంటా వుండాడేమోనని యెంగటమ్మ బయపడి చేతుల్ను కడగా తీసేసింది.

ఈ సందులో ఇలామంతు నాయుడు గూడా వచ్చి గోడకానుకుని కూచ్చోని అంతా తెలుసుకున్నాడు.

ఇలామంతు నాయుడు పెద్దకొడుకు బాదతో వుండాడనిపించి, “కయ్యి అమ్ము కున్నోళ్ళకు లేని బాద మనకేమిటికిరా? ఏమీ బాద పడాల్సిన పన్లా. బండీ ఎద్దులుండాయి, రెండు ఆవుగొడ్లుండాయి. వాటితో బతికి పోవచ్చు. నువ్వు గమ్మనుండు”. అన్నాడు.

మళ్ళా ఇలామంతు నాయుడు కరుగ్గా మాటలు రానిచ్చి, పకపకమని నవ్వి, “ఈ మాదిర్తో అయిందానికి కాందానికి నేను మొకానికడ్డంగా చేతులు బెట్టుకోని బాద పడతా వుండుంటే అయిదు మంది పిలకాయల్ను కనుండేది లా, సాకుండేది లా. వొట్టి అడవ నాయాలుగా వుండాడు వీడు. లెయ్ రా ఎమ్మన్నా!” అనేసి ఈదిలోకి పూడ్సినాడు.

మునికన్నడు గూడా తెంపుజేసి పైకి లేచి, వూళ్ళేకి పోకుండా నేరుగా మడి కాడికి వచ్చినాడు.

మునికన్నడు నెలనాళ్ళ ముందర బాయిగడ్డన పదీ పన్నెండు టెంకాయ చెట్లు నాటితే బాగుంటింది గదా అని మూరట్లోతు గుంతలు తవ్వి వుండినాడు.

వాటిల్లోకి చూస్తా వుంటే మునికన్నడి కండ్లు చెమ్మగిల్లినాయి.

మునికన్నడు అద్దాలామె కయ్యను చూస్తా, “నా తావన కష్టిం చెయ్యించు కొనే దానికి నీకు ప్రాప్తం లేదే బూమమ్మా!” అనేసి యింటికి వచ్చేసినాడు.

## 13

రంగంపేటోళ్ళు పండగ నెల పెట్టీ పెట్టంగానే చెరుకును కొట్టి, రేణిగుంట కాడ వుండే చక్కిరి మిల్లుకు తోలేసినారు. ఆ పనిని కూలీనాలి పెట్టి చేసుంటే టన్నుకు ఇర్తై రూపాయిలు చలవ అయ్యుండును.

"బండి బాడిగా, పాల రూకలూ యెగేసి చెరుకు తోట కొట్టే పనిని కూలోళ్ళకు మగతాకు యిచ్చేద్దారి. లేకుంటే, దినామూ చక్కిరి మిల్లు నుంచి వచ్చే లారీకి మనం చెరుకును సబిలీ చెయ్యలేము" అని ఇలామంతు నాయుడు శత పోరినాడు.

"ఇదే గద కడ సేద్యం, దీన్ని కూలోళ్ళకిద్దారా?" అని మునికన్నడు అనే కొందికి ఇలామంతు నాయుడు మళ్ల మాట్లాడలేదు.

చెరుకు తోట దేముడు ధర్మాన బాగ పైరవబట్టి ఆ ఇరై గుంటలు యాపై టన్నుల చెరుకయ్యింది.

రేణిగుంట చక్కిరి మిల్లోళ్లు మునికన్నడి పేరు మింద పన్నెండు వేల రూపాయిల చెక్కు ఇచ్చినారు.

యెంగటమ్మ యెచ్చిరికతో కాపరం చెయ్యబట్టి బండి బాడిగలతో, పాల రూకలతో రంగంపేటలో తెచ్చిన అప్పును తీర్చేసింది.

ఈ పన్నెండు వేలల్లో గుత్త కింద నాలుగు వేల దాకా అద్దాలామెకు పొయ్‌నాయి. సమ్మచ్చర కాలంలో మొన్న పలితం శెనిగి తోట అంతా ఎండిపోంగా ఈ పది వేలే పలితం. పది వేల రూపాయిలు యింట్లో వుండే ఆ సమియంలో ఇంట్లో మానెడు వడ్ల గింజిలు లేవు.

"ఈ రూక మొక్క పోనిచ్చేదే లేదు. మూడు వేలకు యింగొక ఆవును పట్టుకోని, మిగతా అంతా నాగరాణి పెండ్లికే" అనింది యెంగటమ్మ.

ఆ మరసనాడు తెల్లారి గురప్ప నాయుడు ఒక పిలగోడ్ని యెంట బెట్టుకొని వచ్చినాడు పెండ్లి చూపులకు.

యెంగటమ్మ ఆ పిలగోడ్ని చూసి, "పిలగోడు అణకవగా బాగుండాడు, ఇచ్చేస్తే మన బిడ్డి బతికి పోతింది" అని ఆశి పడింది.

గురప్ప నాయుడు, "మంచి పిలగోడు. బేలుదారి పని జేస్తాడు తిరప్తిలో. తెల్లారి కరిణి బట్టుకోని పొయ్‌నాడంటే సందేళకు నలపై రూపాయిలు తెస్తాడు. బీడీ గూడ తాగడే! మనకు దొరకాల్సినోడే గాదు. బిడ్డి మంచిదిగా వుంటే చాలని వచ్చినాడు" అని చెప్పినాడు.

యెంగటమ్మ ఆ పిలగోడితో, "నాయినా మేము పెట్టలేము, పొయ్యలేము. పెండ్లి గూడ చేసియ్య లేము. మా చేతిలో వుండింది మీ చేతల్లో పెడతాము. మా బిడ్డికి చెవల్లోకి కమ్మలు తెస్తాము. అది యిన్నినాళ్ళు పొరక పుల్లలు పెట్టుకొనే వుండింది. అయిదు వేల రూపాయిలు నీకు కట్నం. ఇష్టిం అయితే బంగారుగా చేసుకో" అనింది.

పిలగోడు పిల్ల నచ్చిందని గురప్పతో చెప్పినాడు. నాగరాణి గూడ, పెద్దోళ్ళ మాట నేను దాటే దానికి వుండాదా! అన్నట్టు గమ్మనుండింది.

"మునికన్నా యింక నువ్వే రా!" అనడిగింది యెంగటమ్మ.

యెంగటమ్మ మొగుడ్ని అడిగి కనుక్కుంటే, "మన మాదిరిగా మట్టి పిసుక్కునే వాడు కాదు గదా. మన బిడ్డికి సుకపడే రాత వుండాదిలే" అనేసినాడు.

ధర్మడయితే బామ్మర్దిని అప్పుడే ఈదిలోకి తొడక పోయి మాట్లాడింది మాట్లాడినట్టుగానే వుండాడు.

వాళ్ళు తిన్నెల మింద కూచ్చోని యిదంతా మాట్లాడతా వుంటే మునికన్నడు నట్టింట్లోకి పొయ్ బోల పొనుకొని ఓ అని ఏడస్తా వుండాడు ఆయనలో ఆయనే.

యెంగటమ్మ దుఃక్కంతో పెద్ద కొడుకు చేతులు బట్టుకోని, "వొద్దనుకుంటే వొద్దులే, నిన్ను యెగటాయించి పోతామా?" అనింది.

మునికన్నడు పైకిలేచి అమ్మను పట్టుకొని, "వొద్దని నేను అనలేదమా! మన నాగరాణి ఎంత కష్టిం జేసే బిడ్డి! పది గుంటలో, పదైదు గుంటలో చేతిలో పెట్టుకోనుండే సేద్యగోడికి పెళ్ళాంగా బోతే మన అమ్మి కష్టిం చేసుకొని అందరికన్నా ఎక్కువగా బతకదా! ఆ బోగం మనమ్మికి లేకపాయ గదమా!" అని బొరోమని ఏడ్చేసినాడు.

"ఎట్టరే పెదబ్బా, నీ దుఃక్కంతో?" అని యెంగటమ్మ గూడ ఏడస్తా కొడుకు కండ్లు తుడిచింది.

గురప్ప నాయుడు లోపలకొచ్చి, "ఏమి, పెండ్లికొడుక్కి కయ్యాగాలవ లేదనా, మనోడు యింగా ఏడస్తా వుండేది!" అనన్నాడు.

"వాడి బాద అందరికీ అర్తమైతిందా అనా?" అనింది యెంగటమ్మ.

"మీకేమి తక్కవ లా. బావ బండి బాడిక్కి పోతా వుంటాడు. ధర్మడు కొయ్య పనికి పోతా వుంటాడు, మీరు ఈ మూడు ఆవుగొడ్లను మేపుకున్నా పొద్దు గడిసి పోతింది. ఆ కయ్య చేతిలో వున్నప్పుడు కన్నా బాగ బతకతారు" అని మాట్లాడినాడు.

"అది గాదులే అన్నా!" అని గురవన్న మాటల్ను ఆపు జేసింది యెంగటమ్మ.

మునికన్నడు పైకిలేచి, "మాట చెప్పెయ్యండి" అనన్నాడు.

పది మందికి అన్నాలు కూడా యేసే పని బెట్టుకోకుండా, వూరికే ఆంజినేయులు సామి గుడికాడ బొట్టు కట్టేటట్టు మాటయి పొయ్యింది. గురవ బావను, పెండ్లి కొడుకును – సాగనంపేసినారు. అందరూ చద్దులు తాగేసినారు.

ధర్మడు కొయ్య పనికి – సా మిల్లు కాడికి ఎలబారినాడు.

ఇలామంతు నాయుడు బండి కట్టి, "నువ్వు పోదువురారా తిరప్తికి." అని మునికన్నడ్ని పిలిచినాడు.


నాయినైతే బండి మింద కూచ్చోని పొయ్, కూచ్చోని వస్తాడు, ఆ సౌక్రిం ఆయనకే వుండనియ్యి – అనుకొని మునికన్నడు 'నువ్వే పొయ్‌రా నాయినా!' అనేసినాడు.

యెంగటమ్మ, "నేను ఆవుగొడ్లకు యాడన్నా అంత పచ్చి కసువు పెరక్కొచ్చు కుంటానురా పెద్దోడా! బిరీన వచ్చేసి, గుంతకమ్మపల్లిలో రేసిను బియ్యం వచ్చినాయంట, తెచ్చుకోవాల!" అనేసి తట్టెత్తుకొని వూల్లోళ్ళ కయ్యల మింద పడి పొయ్యింది.

ఈ కరువు కాలంలో, ఒక పని చేసినట్టు వుంటిందని గవుర్మెట్టు నడవలూరు వంక కాడ చెక్కు డాము కట్టిస్తుండాది.

రంగంపేటోళ్ళు ఈ మిట్టూరు వచ్చిన కొత్తల్లో కాకెదురు కోసి, నారు మళ్లో తొక్కినారే - అక్కడికి, యిటికి రాళ్ళు మోసేదానికి పొయ్‌నాడు మునికన్నడు.

# పాల పొదుగు



మా అక్క కూతురు
తులసి కోసరం...

# పాల పొదుగు

బంక చేనులో ఎనుమును విడిచి పెట్టి, సన్నంగా మూరడు యెడం ఉండే కాలిబాట మింద గొంతుకూచ్చునింది కర్రెక్క. మోచిప్పల మింద మోచేతులు వేసుకొని తల పట్టుకొనింది. అది పండగ నెల గావడం వల్ల, అంతకు ముందర టపాసుల పండగప్పుడు బూమి మింద వాన సయించినట్టు కురిసి వుండడం వల్ల, ఆ బంకచేనులో చీకి చెట్ల కిందా, అద్దారపాకు పొదల కిందా, బలుస కంపచెట్ల కిందా – పచ్చి కసువు మొలిచి వుండాది. ఆ చెట్ల సందున ఆ కసువుకు ఎప్పుడూ నీడ దాపు ఉండడంతో, అదీగాక అక్కడంతా ఊరి ఆడోళ్ళు దొడ్డికి పోవడంతో, మాలా మాదిగోళ్ళు అప్పుడప్పుడూ అక్కడనే గొడ్లను గూడా కోసుకోవడంతో – నీసునీసుగా వుండాది ఆ చోటంతా. అక్కడ ఎనుము మెడ వంచి కనీసం నేలను గూడా మూచ్చూడలేదు. ఒక చెట్టు కింద చీకి కాయలు రాలి వుండడంతో నాలుగిట్ని ఏరుకొని పరపరమని నమిలింది ఎనుము. అసలది ఎనుమును మేపడానికి కాని చోటు. ఎనుముకు కాళ్లయినా సాగతాయి గదా–అని వూరికినే తోలుకొని వచ్చింది కర్రెక్క. అక్కడికి దగ్గిర్లోనే ఉండే మాదిగి పల్లిని దాటుకుంటే బస్సులు తిరుగులాడే రోడ్డుబాట – మట్టిది – వస్తింది. అది పచ్చిక కాలం గావడం వల్ల, రోడ్డు బాటకు ఆ పక్కా ఈ పక్కా కల్లల కింద పచ్చి కసువు వుంటింది. రేపో ఎల్లుండో ఈనబడిన గొడ్డును అంత దూరం తోలకపోయి ఉడకాడిపించడం ఎందుకులే – అని ఇక్కడికి తోలుకొని వచ్చింది కర్రెక్క.

చెట్టూ జేమతో, బోదగడ్డితో నిండి పోయిన నల్లటి గుట్ట మాదిర కంటికి నిండుగా వుండాది ఆ ఎనుము. అది రెండు రోజుల నుంచి ప్రియంతో కసువు తినక పోయినా నీళ్లు తాగక పోయినా – దాని నీళ్ళ దొక్క, కసువు దొక్క నిండుగా వుండాయి. అది దొక్కలను దిగేసుకొని, బొడ్డులోకి పాలు దించి వుండాది. గంటకు నాలుగు మాట్లు తోక పైకెత్తి, ఉచ్చా పుర్రూ పోయడంతో దాని యెనక కాళ్లు రోత రోతగా వుండాయి. కర్రెక్క చూస్తా చూస్తా వుండంగానే ఎనుముది వెదురు పొదను జేరి గబుక్కున బొక్కడుతో

బొక్కడాకు పెరుక్కోని నమిలేసింది. 'యెదురాకు తినే కర్మ నీకెందుకే హీనపు ముండా' అంటా ఎనుము దగ్గిరికి పోయి, కడగా తోలేసి యెదురు పొద దగ్గిరే కూచ్చునింది కద్రెక్క.

ఎనుము వీపు పైనుంచి పగ్గం నేల జారి, ఎనుము కాళ్ళకు అడ్డం పడింది. కద్రెక్క వెదురు పొద దగ్గర నుంచి పైకిలేచి, పగ్గాన్ని పొందిగ్గా మళ్లీ దాని వీపు మిందనే వేసింది. పొద్దు గూట్లో పడడానికి ఇంక రెండు బారలే ఉండడం జూసి, కుదురుగా ఎనుమును తోలుకొని ఇంటికి ఎలబారింది.

మెడ కంతం కింద మూరడు పొడుగు తెల్లని చార వుండే ఆ ఎనుము కద్రెక్కది గాదు. ఈమాట అంటే కద్రెక్కకు కోపం వస్తింది గాని, ఆ ఎనుము కద్రెక్క కొట్టంలో పుట్టింది గాదు. కొన్ని నూర్లు దారబోసి కూడా ఆమె ఆ ఎనుమును కొనలేదు. ఎట్టయినా సరే అయిదారు నూర్లు జమ చేసి ఒక ఎనుమును పట్టుకోవాలని ఆమెకు నాలుగేండ్ల నుంచి మనసు వుండింది గాని, రెక్కల కష్టంజేసి పొట్టబోసుకొనే ఆమె కాపరానికి అది వల్ల పడలేదు. ఏ ఊరి గొడ్డో అని ఇప్పటికీ తెలవని ఆ ఎనుము ఒక అపరాత్రి పూట మదాన్ని అణచుకోలేక, మెడతాడుతో సఖా తెంపుకొని, అడ్డం వచ్చిన పైర్లను తొక్కుకుంటా, కొనలను మేసుకుంటా – తెల్లారే సరికంతా కద్రెక్క ఊరు చేరుకొనింది. కడుపు వుబ్బేసుకొని, మెడతాడుతో సఖా బురద కాళ్లతో కళ్లాపి చల్లి ముగ్గులు పెట్టి వున్న వీదుల్లో అది తిరుగులాడతూ ఉంటే చూసిన ప్రతి అమ్మా అక్కా, "దొంగ కూలిపోయిన గొడ్డు. ఎవురి పైరునో నోట్లో పెట్టుకొని నీళ్లు పోసుకొనింది" అని అనడమే పనిగా పెట్టుకున్నారు. కద్రెక్క పక్క ఇల్లయిన కమలమ్మ కొట్టంలో దూరి కుడితి నీళ్ల తొట్టిని సగానికి సగం తాగేసింది. అది గమనించిన కమలమ్మ, బారడు పొడుగు దుడ్డు కట్టితో – వచ్చే పాపం రానే వస్తిందని ఆ ఎనుము వీపుమింద చావగొట్టేసింది. బిత్తర పోయిన ఎనుముది – కద్రెక్క కొట్టంలో దూరేసింది. అప్పుడు కద్రెక్క – కొట్టంలో బక్కెద్దుల కింద పేడా చెత్త తోసి తట్టలో వేస్తా వుండింది. కమలమ్మ దెబ్బలకు ఒళ్లు అలిసి పోయిన ఆ ఎనుము – కద్రెక్క కొట్టంలో పడక వేసేసి, నెమరు వేయడం మొదులు పెట్టింది. కద్రెక్క ఆ ఎనుమును దయదలచిన దాని మాదిర కొట్టంలో నుంచి బయటకు తోలెయ్య కుండా గమ్మున వుండింది. పొద్దు నాలుగు బారలెక్కే సరికి కూడా పడుకొన్న ఆ ఎనుము లేవక పోవడం జూసిన కద్రెక్క – మొగుడు

రామచంద్రమ నాయుడు చేతికి ఒక పాత చేంతాడు ముక్క ఇచ్చి దాన్ని ఒక కట్టుగూటానికి కట్టెయ్యమనింది. సందేళ దాకా ఆ ఎనుము మాదంటూ ఎవరూ రాకపోవడం జూసి "ఈ ఎనుము దరిద్రం మనింట్లో ఎందుకు? ఉండే రెండు గిత్తలనే పొస్తులుబెట్టి చంపతా వుండాం కసువు లేక. దీని గోష్ట కూడా మనం నెత్తిన వేసుకోవాల్నా? యిడిచిపెట్టి తోలేద్దాం" అన్నాడు రామచంద్రమ నాయుడు. మొగుడి మాటలకు కర్రెక్క "పాపం, మన కొట్టాన్ని యెతుక్కుంటా వచ్చింది. యెందుకు తోలేస్తావు? దాని గల్లోళ్లు వచ్చేదాక అది ఈడనే వుంటిందిలే గాని –" అనింది.

కర్రెక్క వూరు మిట్టూరు. చుట్టూరా దగ్గిరి దగ్గిర్లోనే పది ఊర్లదాకా వుండాయి. మరీ మైళ్ల కవతల నుంచి పారిపోయి వచ్చి వుండదు గదా అది, ఈ చుట్టుపక్కల వూర్లల్లోదే అయివుంటింది. నాలుగైదు నాళ్లల్లోనన్నా దాన్ని యెతుక్కుంటా ఎవురన్నా రారా? అనుకొని కర్రెక్క నాలుగైదు నాళ్లు ఆ ఎనుము మింద కన్నే పెట్టలేదు. రామచంద్రమ నాయుడు రాత్రి పూట ఎద్దుల గాట్లో నాలుగు కసువు పోచలను విదిలించేటప్పుడు ఆ ఎనుము ముందర గూడా పిడికిడు విదిలిస్తే కర్రెక్క ఒద్దొద్దు అని గూడా అనేది. అదేమి యిచ్చిత్రమో గాని నెలనాళ్లు దాటినా దాని జాడ యెతుకులాడుకుంటా ఎవురూ రాలేదు.

ఆ ఊరికి మూడుమైళ్ల దూరాన వుండే యెంగటాపరం అయిస్కూల్లో ఆరు చదివి, సందేళ అయిదూ అయిదున్నరకల్లా ఇల్లు చేరుకునే ఆమె కొడుకు జనాద్రి నాయుడి చేతికి ఒక కట్టె ఇచ్చి, "మన ఎనుమును విడిచి పెట్టి, ఊరిబైట దాకా తోలుకొని పోయి తిప్పుకొని రారా నాయినా" అనడం గూడా మొదులుబెట్టింది కర్రెక్క. వాడు అమ్మకల్లా అదొక రకం చూపుజూసి సందేళ సందేళ ఎనుమును విడిచి పెట్టేవాడు. వాళ్లదిగాని ఆ ఎనుము వెంట, మేపడానికని వాడు పోతా వుంటే వూళ్లో ఒకరిద్దరు ఆడోళ్లు వాడ్ని ఎగతాళి జేసేవాళ్లు. "ఏమిరా నా బట్టా, సొంత ఎనుమును మేపినట్టు మేపతా వుండావు?" అనే వాళ్లు. ఒక నెల పోయినాక ఆ ఎనుము కట్టుకొచ్చి 'ఓ' అని అరిచింది. అది పలమైందని అర్తం చేసుకొన్న కర్రెక్క కొట్టంలోకి ఒక దున్నపోతును తోలుకొని వస్తా వుంటే అందరికీ ఎగతాళిగా వుండింది. ఆ ఎనుము మళ్లా అరవలేదు. అది కట్టి పోయింది.

అది సూడిదైన మూడు నెలలకు నలుగురు మగవాళ్లను పిలిచి కర్రెక్క ఆ ఎనుము ముక్కుకు తాడు కుట్టించింది. కర్రెక్క ఆ ఎనుముకు ఇంత జేస్తావుంటే ఊరి ఆడోళ్ల కండ్లన్నీ ఆ ఎనుము మిందనే పడినాయి. ఒక రోజు కర్రెక్క పక్కింటామె అయిన కమలమ్మ కర్రెక్కను పిలిచి, నిజం మొకంతో, "ఒసె ఒసె, కర్రా! మా ఎనుము తప్పిపోయిందంటా, నడవలూరు నించి ఇద్దరు మొగోళ్లు వూళ్లోకి వచ్చినారు. వాళ్ల ఎనుమేనేమో ఇప్పుడు మీ కొట్టంలో వుండే ఎనుము?" అనింది. నిజంగానే నడవలూరు రెడ్లు ఎనుము కోసరం వచ్చినారేమోననుకొని కర్రెక్క గుండికాయలు నీళ్లయిపోయినాయి. నల్లంగా అయిపోయిన కర్రెక్క మొకాన్ని జూసి కమలమ్మ పకపకమని నవ్వి, "ఊరికేనే అన్నా, నిన్ను ఎగతాళి జేద్దామని. ఆ ఎనుము మింద నువ్వు పెట్టుకోని వుండే ఆశను జూసి నాకు నవ్వొచ్చింది. ఈ రోజు మటుకు ఎనుము కోసరం ఎవురూ రాలేదులే. నువ్వేమీ ఉచ్చ బోసుకొని కోకను తడుపుకోవద్దు" అనింది. కర్రెక్కకు కోపంతో ఉచ్చి మింది యెంటిక చివక్కన పైకి లేచింది. కర్రెక్క మొకం చిన్నబెట్టుకొని, "ఆ ఎనుము గల్లోళ్లు వస్తే ఉచ్చ బోసుకోవాల్సిన కర్మ నాకేం బట్టిందక్కా? నిజంగానే దాని గల్లోళ్లు ఎవురన్నా వస్తే తోలుకొని పోతారు. నేను కాదంటానా? ఎందుకు ఈ రకంగా నన్ను బట్టుకోని అగుమానించేది? నీ ఒప్పందం బూములు బావులు లేవనే గదా – నన్ను యెంటికతో సమానం జేసి ఈ రీతిగా ఎగతాళి పడతా వుండావు?" అనేసి ఇంటికి వచ్చింది. దాని లావు వుంటే దాని వరకే వుంటింది. పట్టుకొని జాడించేద్దాం అనుకొనింది కర్రెక్క. కానీ, కోపంతో వచ్చే గసను పట్ల బలంతాన అణుచుకొని బయట పడింది. కర్రెక్క యెడం పక్క ఇంటామె ఈ రీతిగా ఎగతాళి పడతావుంటే, కర్రెక్క కుడి పక్క ఇంటామె అయిన తులిశమ్మ, అయిస్కూలు చదువులు చదువుకొని ఆ ఊరి మిందగా గంగిరెడ్డిపల్లికి పోయే పిలికాయలను పిలిచి కర్రెక్కకు వినపడేటట్టుగా, "ఒరే, మావూరికి ఒక దొంగ గొడ్డు వొచ్చి మూడు నెలలవతా వుండాది. అది మీ వూరిదేమో కొంచెం మీ పెద్దోళ్లకు జెప్పండి" అనేది.

రామచంద్రమ నాయుడు కమ్మ కులంలో పుట్టినాడేగాని సెంటు కయ్యలేని వాడు. తెల్లారి లేస్తే కర్రెక్క, రామచంద్రమ నాయుడు – కమలమ్మ, తులిశమ్మ బూముల్లోకి పోయి ఒంగాల్సిందే గదా! వాళ్లు ఎన్ని అన్నా మనం వాళ్లకు

చెడ్డయిపోగూడదని కర్రెక్క మనసుకు కష్టం వేసే అటుమంటి మాటలకు కూడా తల వంచింది. ఒకసారి కర్రెక్క పనికి పోయి సందేళ నాలుగు కంప కట్టెలను పొయ్యిలోకి అని చెప్పి, సందిట పెట్టుకొని ఇంటికి వస్తా వుంటే, ఊర్లో నుంచి ఒక సీసాలో అర్ధ రూపాయికి కిరసనాయిలు పోయించుకుని, కాలు రూపాయికి నాలుగు మిరపకాయలు చేత బట్టుకొని మాదిగపల్లె కల్లా పోతా వుండిన ఒక మాదిగది నిలబడి, “కర్రెక్కా! శ్రీరామాపరం నుంచి ఇద్దురాడోళ్లొచ్చి వాళ్ల ఎనుమును వాళ్లు తోలుకొని పోయినారు. మద్యానం పూట జరిగిందా పని, ఆ ఎనుమును పసిబిడ్డను జూసుకున్నట్లు జూసుకుంటివి. అంతా రుధా గదా?” అని ఎగతాళి పడింది. వొళ్లంతా అదిరి పోయే కోపంతో, కర్రెక్క కన్నా పదేండ్ల పెద్దదైన మాదిగామెను పట్టుకొని, “పెవడ లంజా, యెల్లాలకల పండేసి పచ్చ బోసేస్తొన్లంజా! నా సరి కమ్మ నా సవుతులంటే నన్నంటారు, నేను వింటాను. మాదిగ పుట్టక పుట్టిన నీకు గూడా నా బతుకు నీటికన్నా పలసంగా, దూదికన్నా సులకంగా కనిపిస్తా వుండాదంటే –” అని ఇష్టం వచ్చినట్టు తిట్టేసి కర్రెక్క అక్కుసునంతా తీర్చుకొనింది. మాదిగామెని అన్ని తిట్లు తిడతా వుండినా కర్రెక్కకు ఒక పక్క జరం కాస్తానే వుండింది.

ఇంటికి వచ్చి కొట్టంలో నెమరు వేస్తా వుండిన ఎనుమును సూసే దాకా నిమ్మళం లేకపోయింది. ఒకసారి మాత్రం కూపుచంద్రపేట నుంచి ఒక ముసిలాయన ఎనుమును వెతుక్కుంటానే వచ్చినాడు. వూళ్లోవాళ్లు ఇరవై మందయినా కర్రెక్క ఇల్లును చూపించి వుంటారాయనకు. ఆయన కర్రెక్క ఇంటి దగ్గిరికి వచ్చి ఆ ఎనుమును జూసి, “ఇదిగాదు, దీని కొమ్ములు ఒకదాన్ని జూసినట్టు ఒకటి వుండాయే. ఇది గాదు మాది. మాది బోడి కొమ్మల ఎనుము. అదీగాక మాది నాలుగీతల ఎనుము. ఇది పడ్డ ఎనుమే!” అనేసి అదే పోతా. ఆ ముసిలాయన కర్రెక్క కంటికి ఎంతో నాయస్తుడుగా కనిపించినాడు. ఆ వీది మలుపు తిరిగేసిన ముసలాయనతో కర్రెక్క, “ముసిలాయనా! నువ్వొన్నా నా కొట్టంలో వుండే ఈ ఎనుమును తోలుకొని పోతావా – అని ఈ ఊరోళ్లు గంపిడాశ పెట్టుకున్నారు. ఈ కొట్టంలో ఈ ఎనుము ఇంక వద్దు. నీది గాకపోయినా నీదేనని అపద్దం జెప్పేసైనా తోలక పో. ఆ ఎనుము కోసరం ఎవరూ రాలేదే. ఆ ఎనుము కర్రెక్క సొంతమే అయిపోతా వుండాదే – అని ఈ వూళ్లో వుండే కొంతమంది ఆడోళ్లు మొగుళ్ల పక్కన గూడా పొనుకోకుండా

దిగులు బెట్టుకొని కుంగి పోతుండారు. నువ్వు గాన ఈ ఎనుమును తోలక పోయినావంటే–మా ఊళ్లో ఇద్దరు ముగ్గురన్నా తిరుమల కొండకు పోయి మొక్కు తీర్చుకొని, సామి దరిశనం జేసుకొని గుండు కొట్టించుకుంటారు" అంటా కర్రెక్క వాళ్ల మిందా వీళ్ల మిందా వుండే నిష్టూరాన్నంతా ఈ రకమైన ఎగతాళి మాటలతో యెళ్లబోసుకొనింది.

బంకచేను దగ్గిర్నుంచి కర్రెక్క ఎనుమును ఇంటికి తోలుకొని వచ్చి కట్టేసింది. వూరికి పరంటగా వుండే అడ్డవంక మిట్ట దగ్గర మొగుడు చెక్కుకొని వచ్చిన పచ్చి కసువును తీసి కొంచెం ఎనుము ముందర వేసింది. ఈనబడిన ఆ ఎనుము పండ్లతో సగించీ సగించనట్టు పచ్చి కసువును కొరకతా వుండడం జూసి 'దీని కెప్పుడో నేను రుణపడి వుండినాను. నా దగ్గిర సేవలు జేయించుకునే దానికే నన్ను యెతుక్కుంటా వచ్చింది యెర్రి నా కూతురు!' అనుకొని కర్రెక్క నిమ్మళంగా, పొడుగ్గా గాలి పీల్చుకొనింది.

## 2

ఇంటి ముందర వుండే మట్టి తిన్నె మింద అమ్మలు బిడ్డలందరూ కూచ్చోని వుండారు. అమాశి మబ్బు వల్ల పైన ఆకాశంలో చుక్కలు తేటగా కనిపిస్తా వుండాయి. టయిము అప్పటికే తొమ్మిది గంటలను మీరి వుండాది. అయిదు ఇండ్లు వుండే ఆ యీదిలో జనమంతా అప్పుడే నిద్దర్లు పోతా వుండారు.

జనాద్రి నాయుడు తిన్నెమింద నుంచి ఒక్క దూకు దూకి కొట్టంలోకి పోయి రెండు నిమిసాలు నిలబడుకొని, "అమ్మా, అమ్మా ఎనుము పడుకోనూ లేవనుగా వుండాది. అది ఎప్పుడెప్పుడు ఈనబోతామా అని కలవరిస్తా వుండాది" అన్నాడు. వాడికి, కుశాల వల్ల ముక్కుల గుండా, నోటి గుండా సందిట్లావు గస వస్తా వుండాది. కర్రెక్క కొడుకు కులుకును జూసి ముచ్చట పడి, నోట ఏ మాటా పెట్టుకోకుండా వుండింది. ఇంతలో ఆమె ఒడిలో – తిన్నె మింద నుంచి కింద పడిపొయ్యేటట్టుగా – కూర్చుని వుండిన వాడి చెల్లి అంజిలి, అమ్మ మూతికల్లా ఎగజూసి, "అమా, అమా, వీడే మన ఎనుముకు సగం దిష్టి. దాని టయిమొస్తే అది ఈనదా, అమా? దానికి నువ్వా నేనూ చెప్పాల్నా ఏమి? వీడెందుకు మాటిమాటికి ఎనుము దగ్గరికి పోయి చూసి వచ్చేది?" అంటూ అమ్మచేత అన్నకు దొబ్బులు పెట్టించాలని చూసింది. కర్రెక్క

ముదిగారం నిండిన గొంతుతో "ఒరే, జనాద్రిగా! ఇది మొగుడికి కాపరం చేసే ఆడది గాదు. అత్తగారింటికి పోయిన మూడునాళ్లల్లోనే ఇది మొగుడి నెత్తిమింద కుండా చట్టి యేసేసి – అమ్మగారిల్లు యెతుక్కుంటా వచ్చేసే లంజగా వుండాది ఇది" అంటా ఆమె కొడుకు పక్క మాట్లాడింది. నల్లదై పోయిన అంజిలి మూతి యింతై పోయింది. ఆ అమ్మి, అమ్మ ఒళ్లో నుంచి మెల్లగా జారి, బారడకు దూరంగా వీదిలో నిలబడి, "కర్రి నా సవితీ, నా కాపరం నాకు ఎట్ట చేసుకోవాలనో తెలుసులే సేయ్! మొగుడు నెత్తిన కుండా చట్టి వేస్తానంట? ఒసే, యేసినా గూడా నీ ఇంటికి రానులేగాని, నువ్వేమి బయపడుద్దులే! లంజి నా సవితి" అంటా ఆ అమ్మి నవ్వు మొకంతో గొణిగింది. దాని తెలివికి ఎప్పుడూ యిచిత్రపోయే కర్రెక్క చిన్న గొంతుతో, "పెదబ్బా, ఇది బలే తెలివైనదిరా. దాని గురించి చింత నాకు లేదు. నువ్వే తిక్కలోడివి. ఎట్ట బతకబోతావో..." అనింది.

పదిటికి ఒక మాట మాట్లాడే రామచంద్రమ నాయుడు తిన్నె మింద నుంచే వొంగి కొట్టంలోకి తొంగి చూసి, ఆ మబ్బులో ఎనుము కనబడక పొయ్యేసరికి, "యిప్పుడా మబ్బులోనా ఎనుము ఈనబొయ్యేది? చేసే కష్టమంతా, బూడిదలో ఉచ్చబోసినట్టు పోతా వుందేగాని ఏమన్నా పలితం వుండాదా? ఇన్ని ఏండ్ల నుంచి కాపరం చేస్తా వుండాం. ఒక లాంతరు కొనుక్కునేది లేదా?" అంటా ఆయన పెళ్లాం మింద నిష్టూర పోయినాడు. ఈ మాటలకు కర్రెక్క గూడా కోపం నిండిన గొంతుతో గాకుండా యదాప్రకారం గొంతుతోనే, "నువ్వు సందేళ అయ్యేసరికి బండ్లతో తోలకొచ్చే సంపదనంతా నేను తెల్లారే సరికల్లా లారీలు మాట్లాడి మా అమ్మ గారింటికి తోలేస్తా వుండాను గదా! అటుమంటప్పుడు నీ పెళ్లాం నీ యింట్లోకి ఒక లాంతరు కొని పెడదామనే ఆలోసిన జేసునా" అని ఎత్తి పొడిచినట్టుగా మాట్లాడింది. రామచంద్రమ నాయుడు, "నేనీ అపరాత్రి పూట నీతో తగరారుకు దిగలేదు తల్లా" అన్నాడు. మళ్ల కర్రెక్క గమ్మున వుండిపోయింది.

ఎనుము మాత్రం రాత్రి నడి జాముకన్నా ఈనేస్తిందే గాని ఈనకుండా పోదు. అది తెల్లారి నుంచి తీగలు కూడా యేస్తా వుండింది. అది మెడిమి గూడా చేసింది. ఆ కొట్టంలో అది ఈనినా, ఆ మబ్బులో దాని దూడ దానికి కనిపించునా? లాంతరు లేకుండా మాత్రం పని జరగదు. నట్టింట్లో వేప

చమురు దీపం తప్పించి, కనీసం బుడ్డీ దీపం కూడా లేకుండా ఇన్నాళ్లూ కాపరం చేసేసింది కర్రెక్క. ఆమె ముక్కుల గుండా పొడుగ్గా గాలి పీల్చి 'మ్' అని మూలిగి ఎదురు గుండా కూతురు ఒకటికి రెండు మాట్లు ఆవిలించడం జూసి "ఇంకబొయ్, పడుకోబో సేయ్" అనింది. ఆ అమ్మితో మాట్లాడిన అమ్మను జూసి, ఇదే అదనుగా "వాడ్ని గూడా రమ్మను. నాకొక్క దానికే ఇంట్లో బయం గదమా" అని అంజిలి గడప మింద కూర్చొనింది. ఈ ఎనుము ఈనే కుశాలలో పడిపోయిన పెదబ్బకు ఇప్పుడల్లా నిద్ర రాదనిపించిన కర్రెక్క, "వాడు పొడుకోడులే. నువ్వేబోయి పడుకో. నీ పెద మాదిగోడొచ్చి నిన్ను ఎత్తకపోడు గాని–" అనేసి ఆమె లేచి నిలబడింది. కమలమ్మ ఇంట్లో, తులిశమ్మ ఇంట్లో ఇద్దరిండ్లలో గూడా కరంటు వుండాది. వాళ్లిద్దరికి లాంతర్లు గూడా వుండాయి. ఈ లంజ నా సవుతుల్ని అడిగినా, ఒక మంచి పనికి లాంతరు ఇయ్యబోతారా? అడిగి నోరు కడుక్కోవలసిందే గదా. అయినా, ఒకర్ని ఒక వస్తవ అడక్కుండా మనం అంత మానంగా బతకతా వుండామా? ఒక మాట అడిగి చూద్దాం. అవి బిడ్డలు కనిన ముండలైతే యిస్తాయి, కిరాతపు ముండలైతే యియ్యవు– అనుకొని కర్రెక్క తులిశమ్మ యింటికి నడిచింది.

మొగుడు ఎప్పుడో చచ్చిపోయి ముండమోపిగా వుండే తులిశమ్మ ఇంట్లో లైట్లు ఆర్పుకొని బిడ్డల పక్కన పడుకొని వుండాది. ఆమె తలుపులన్నీ బారగా తీసేసే పడుకొని వుండింది. ఎంతో యెచ్చరిక గలిగిన తులిశమ్మ నిద్దర్లోనే కర్రెక్క అలికిడికి వులిక్కిపడి బిత్తరపోయిన దాని మాదిర, "ఎవురాడ, ఈ అపరాత్రి పూట ఎవురాడ? ఆ, ఎవురాడ, అడిగేది యినపళ్లా" అని గొంతు పెంచింది. "తులిశక్కా, నేను గదా, నేను" అని కర్రెక్క ఒకటికి పదిసార్లు అన్నాక తులిశమ్మకు నిమ్మళం గలిగింది. తులిశమ్మ, 'దొంగ దొంగ' అని ఎక్కడ అరిచేస్తాదోనని బయపడి చచ్చింది కర్రెక్క. తులిశమ్మ ఆగడం జూసి 'ఛీ మాటిమాటికీ ఒకరి మింద ఆదార పడే ఈ మానం చెడ్డ బతుకు బతకగూడదబ్బా' అనిపిచ్చింది కర్రెక్కకు. తులిశమ్మ నిమ్మళమైన గొంతుతో, "కర్రా, వొసె కర్రా! నువ్వు నిలబడుకొని వుండేకాడ సిచ్చి వుండాది, లైటు యెయ్" అనింది. కర్రెక్క లైటు వేసింది. "అక్కా, ఎనుము ఈనబడింది. ఈ రాత్రికే ఈనేస్తింది. లాంతరు గావాలని" అనింది కర్రెక్క. "కర్రిదానా! నేను నీ కంటికి బమ్మ రాచ్చసిగా కనిపిస్తా వుండానా ఏంది? కనాగష్టం లాంతరుకు

నిద్రపోతా వుండిన దాన్ని లేపి అడగాల్నా? నా యింట్లో నీకు అడ్డమేంది? పొయ్యి గడ్డ మింద వుండాది లాంతర, ఎత్తకపోయి పని జరుపుకో బో. కిరసనాయిలు గూడా నిండికి వుండాది లే” అనింది తులిశమ్మ పడకలో నుంచే. లాంతరును చేతికి తీసుకొని, లైటు ఆర్పి బయట పడింది కర్రెక్క. ‘పోకిరి పోకిరిగా ఒక మాట తూలితిందే గాని ఇది మెతక ముండే, కమలమ్మ అట్టా లంజి నా సవితి గాదు’ అనిపించింది కర్రెక్కకు.

లాంతరు కొట్టంలో తగిలించిన కాసేపటికి ఎనుము ఈనబడింది. అది నిలుచున్న చోట నిలుచుకోకుండా చుట్టూరా తిరిగి ఆపసోపాలు పడతా వుండింది. కొంచేపట్లోనే దాని మెడిమి గుండా దూడ కాళ్లు కనిపించినాయి కర్రెక్కకు. “ఇంక కొంచేపు వార్చుకో కూతరా! ఈనేస్తావు. నీ నెత్తి బరువు నేల దిగి పోతింది” అనింది కర్రెక్క ఎనుముది పడుతున్న అవస్త జూసి. అక్కడే నిలబడి చూస్తా వుండడం మంచిది గాదనిపించి, జనాద్రి నాయుడిని గూడా తోడుకొని కొట్టంలో నుంచి తిన్నె మిందికి వచ్చింది. ఉత్తరంగా తిరమల కొండ మింద దగద్ధమానంగా వెలిగిపోతా వుండిన పాల బల్బుల సోలుపును జూసి, కర్రెక్క రెండు చేతులూ జోడించి, “మహన్నబావా! బారం అంతా నీదే సామీ, ఎనుమూ దూడా సక్కరంగా వుంటే, ఈనిన వారం రోజుల్లో నీ కొడిస్తంబంలో సొలిగెడు నెయ్యి పోసి నిన్ను దరిశనం చేసుకుంటాము సామీ” అని మొక్కుకుంటా వుంటే జనాద్రి నాయుడు గూడా తిరమల కొండకు చేతులు జోడిచ్చినాడు. అది చూసిన కర్రెక్క వాడ్ని పక్కలోకి జరుపుకొని ముదిగారం పోయింది. గడప మింద కూర్చునిన మాటకారి అంజిలి అక్కడే నిద్రతో తూగడం జూసి యింతకు ముందరే రామచంద్రమ నాయుడు, కూతుర్ని గుడిసిలో చాపమింద పడుకోబెట్టినాడు. కర్రెక్క తిన్నె దిగి మళ్లా కొట్టంలోకి పోతుంటే వెనకన్నే వచ్చినాడు జనాద్రి.

మెడిమిలో నుంచి సగం దూడ కంటికి కనిపించిందమ్మా గొడుక్కి. ఎనుము వాళ్ల కండ్ల ముందర్నే ఎంతో చురుగ్గా ఒక్క చుట్టు తిరిగే సరికి – దూడ కింద పడి పోయింది. ఎంతో పిరింతో దూడను చూసుకుంటా ఎనుము నాకడం మొదలు బెట్టింది. కర్రెక్క దూడ తోక పైకెత్తి – ఒరే, పేగుదూడ అనింది కుశాలతో. దున్నపోతు పుట్టకుండా పేగుదూడ పుట్టడంతో జనాద్రి నాయుడు కిందా మిందా పడిపోతా, నాయినను జేరి “మూగెద్దు మాదిర తిన్నె మింద

కూచ్చోకుంటే కొట్టంలోకి పో ఏమి? ఎనుము పేగుదూడ ఈనింది, చూడుబో" అన్నాడు. అందుకు రామచంద్ర నాయుడు, "ఇంకేమీ దిగులు లేదులే, ఎనుము పేగుదూడ ఈనేసింది గదా, యింక మనకే దిగులూ లేదులే" అని ఎగతాళి ఆడినాడు, ఎనుము పేగుదూడ ఈనినంతలోనే మన యెతలు తీరునా? అన్నట్టుగా. కర్రెక్క కొట్టంలోనే చేరుకొని దూడ గిట్టలను కొంచిం గిల్లి, ఎనుము నోటికి అందించగా అది నమిలి మింగేసింది. ఎనుము ఈనిన ఒక గంటకంతా, దూడ నేలమింద నిలదొక్కుకొని లేచింది. ఇప్పుడే దూడ ఎన్ని ముర్రుపాలు తాగినా మంచిదే గదా – అని తెలిసిన కర్రెక్క రొమ్ములను దూడ నోటికి అందించింది.

జనార్ది నాయుడు నిద్రను తట్టుకోలేక చెల్లి పక్కలో జేరి నిద్ర పోయినాడు. రామ చంద్రమ నాయుడికి కూడా కండ్లు మూతలు పడి 'ఓ' అని ఆవులింతలు రావడం మొదలుబెట్టినాయి. ఆయన చుక్కలను జూసి, 'అమ్మో, వొంటి గంట దాటుండదా టయిము?' అనుకొన్నాడు. నిద్రపోతే, పెళ్లాం 'నీ కన్నా పసిబిడ్డ సుమారు గదా!' అని దొబ్బులు పెడుతుందని బయపడి మేలుకుని వుండే అందుకు తంటాలు పడతా వుండినాడు. ఆయన నిద్ర మొకంతో కాళ్లు ఈడ్చుకుంటా వచ్చి "పేగుదూడంట గదా? నువ్వు కోరిన కొండ మింద వాన కురిసింది పో" అన్నాడాయన, గొంతు కూర్చుని వుండిన పెళ్లాంతో. మొగుడి ఆగచాట్లు చూడలేక, "నన్ను మచ్చిక జేసుకొనే మాటలు ఎందుకు గాని, నువ్వుపోయి పడుకో బో, పిలకాయల పక్కన, నీ నిద్దర కండ్లను నేను జూడలేను. నా గుక్కెదూపిరి బోతే ఎట్ట బతకబోతావో గదా" అనింది కర్రెక్క నవ్వు మొకంతో. రామచంద్ర నాయుడు ఆ మాట చాలన్నట్టుగా, కాళ్లీడ్చుకుంటా గుడిసె కల్లా పోతుండగా, "కాళ్లను కొంచెం ఎత్తి నడువు, కాళ్లు తగులుకొని పడబొయ్యేవు. వూళ్లో టించరు గూడా లేదు సామీ" అనింది ఎగతాళిగా. పెళ్లాన్ని ఒక్కసారి యెనిక్కి తిరిగి జూసి 'నాతోనా నీ యాసండం' అనేసి ఆయన పిలకాయల పక్కన జేరినాడు.

కర్రెక్కకు గూడా మూదేవి కమ్మడంతో ఆమె రెండు సార్లు ఆవులించి, నోటి దగ్గిర చిటికలు వేసుకొనింది. గొడ్డుకు ఈనడం వొక కష్టమైతే, మాయ వేయడం యింగొక కష్టం అనుకొనిందామె. కడుపుతో కడుపుడు వుండిన ఎనుము ఒక్క నిమిసంలో దొక్కలను దిగేసుకొని, బోలుబోలుగా అయి

పోయింది. కర్రెక్క పైకిలేచి, కొట్టంలో ఒక మూల వుండిన తట్టలో నుంచి చెక్కుడు కసుపు వేసింది, ఎనుము ముందర. బక్కెద్దులు కర్రెక్క కల్లా నిష్టూరంగా, “యింగ మాకల్లా చూడవు గదా!’ అన్నట్లు చూసే సరికి, ఆ గిత్తల గాడిలో కూడా కొంచెం కసువును విదిలించింది. ఎనుము ఆ పచ్చి కసువును చూడనే లేదు. వరి కసువు – ఎండుది – గాన వేస్తే పర పరమని నమిలి తింటే, గంటలో వేసేస్తుంది మాయ – అనుకొనింది కర్రెక్క. నాలుగు పోచల గడ్డివామి కూడా ఆమెకు లేదు. యాడ నుంచి వుంటింది – గడ్డివామి? పాపం, కొంద్ర బూమి లేకుంటే యాడ నుంచి వస్తుంది గడ్డివామి?

ఇప్పుడెట్ట? ఎండు కసువు లేకుంటే అది మాయ వేయడం కష్టమే అనుకొని కర్రెక్క మదన పడింది. తులిశమ్మకు పాపం మగ దిక్కు లేక పోవడంతో ఆమెకు కలిగిన రెండెకరాల కయ్యనూ వారానికి ఇచ్చేసింది. అందుకని ఆమెకు గొడ్డూగోదా లేదు. వరిపోచల అవసరమే తులిశమ్మకు వుండదే. ఎక్కడన్నా ఒక కట్ట ఎండు కసువు సంపాయించకుంటే ఎట్టబ్బా – అని దిగులు పెట్టు కొనింది. కమలమ్మను ఈ యేళప్పుడు నిద్దర లేపి అడిగినా నోరు కడుక్కో వాలసిందే. ఒక కట్ట ఎండు కసువును దానం చేసే మంచి బుద్ధి దాని దగ్గిర యాడిది? అనిపించిందామెకు.

కర్రెక్క రూంత సేపు గూడా ఆలోచించకుండా కమలమ్మ కొట్టంలోకి నడిచింది. కమలమ్మ గాడి ముందర పడుకొని వుండిన ఎద్దులు కర్రెక్కను చూసి బుసకొట్టి కొమ్ములు విసిరినాయి. ‘మీరు గమ్మున వుండండే నా బట్టా ఎద్దులాలా’ అని గొణిగి ఆమె చెయ్యెత్తితే అందేటట్టుగా వుండే అటకలో ఒక కట్టను కిందకు లాగింది. అప్పుడనంగా కమలమ్మ – దేముడే లేపిన రీతిగా – కొట్టంలోకి వొంటేలు పోసుకుందామని వచ్చి కర్రెక్కను జూసి, “ఏమే కర్రా! ఎనుము ఈనిందా ఏమి? ఏమి దూడ?” అని ఆత్రంగా అడిగింది.

గుండెల్లో రాయి పడిన కర్రెక్క కమలమ్మ గొంతులోని నిమ్మళాన్ని జూసి, “పేగుదూడ ఈనిందక్కా! ఎంతకీ మాయ వెయ్యకుంటే పిడికిడు కసువు తీసకపోదామని వస్తిని. నిద్దర పోయే మనిసిని లేపేదెందుకులే అని నిన్ను లేపలా” అనింది. “కసువే గదా, అదేమన్నా బంగారా? తీసకపో” అనింది కమలమ్మ.

కర్రెక్క నమ్మలేనట్టుగా ఆ కట్ట కసువూ ఎత్తుకొని వచ్చేసింది. ఏ వుబ్బు మింద వుండిందో గాని, దీని బుద్ధి ఇప్పుడు బాగుండింది. లేకుంటే ఈ పాటికి నన్ను యెంటిక్కి కట్టుకొని గిరగిరా అప్పాలు తిప్పేసి వుండదా? అనుకొనింది కర్రెక్క. మొత్తానికి మన టయం బాగుండాది ఈ రోజు – అనిపించిందామెకు.

ఎనుము ఎండు గడ్డిని వంచిన మూతి లేపకుండా తినేసింది. అది తెల్లారు జాము నాలుగు గంటలకంతా మాయ – చాటడు – వేసేసింది. కర్రెక్క కొట్టం చూట్టూరానే నక్క మాదిర తిరుగాడతా వుండిన ఒక కుక్కను రాయితో తీసికొట్టి, ఇంటిలోకి పోయి పార తీసుకొని వచ్చింది. చాటలోని మాయనూ, పారనూ తీసుకొని, ఇంటికి దక్షిణం పక్కగా పది బారల్లోనే వుండిన వూరవతల కొంకి పొద దగ్గిరికి వచ్చింది. మొగుడ్ని లేపుకొని వద్దాం – అనుకొనింది గాని, తెల్లారి లేస్తే పాపం ఆయన ఆ బక్కెద్దుల యెనకాన పోయి బాడుగ మడక దున్నాల గదా– అనిపించి కనికరం కలగడంతో లేపలేదు. కర్రెక్క కొంకి పొద కింద వుండిన పుట్టను చేతెడు లోతు తవ్వింది. మాయను ఆ గుంతలో పోసేసి, మట్టితో పూడ్చేసి చాటా పారతో ఎనుము దగ్గిరికి వచ్చింది. దూడ అప్పుడే తల్లి చుట్టూరా తిరగ లాడడం కూడా నేర్చుకునేసింది. మళ్ళ కర్రెక్క పడుకుని కాసేపు నడుము వాల్చింది గాదు.

పొయ్యి రగలేసి బానడు నీళ్లను కాగబెట్టింది. తెల్లారినాక ఎనుము పాలను పిండింది. ముర్రుపాలు గదా – అది అర్ధశేరు మాత్రమే యిచ్చింది. ఎనుమును నడీదిలోకి తోలుకొని వచ్చి, దాని మింద ముంతలతో వుడుకు నీళ్లను కుమ్మరించింది. దాని ఒళ్లు ఆరక ముందే బూడిదతో, దాని వీపు మిందా, ముణుకుల మిందా పట్టీలు గీసింది. రామచంద్ర నాయుడు రాత్రే పేని పెట్టిన యెంటికల తాడుతో కాల్చిన టెంకాయ చిప్పను దూర్చి దాని మెడలో కట్టింది. అప్పుడు అమ్మ పక్కనే నిలబడుకొని వుండిన అంజిలి, "అమా అమా, రాత్రి నువ్వు పడుకొనే సరికి యాళ ఎంతయిందమా?" అప్పుడే గుర్తుకు వచ్చినట్టుగా అడిగింది. "నీకు నీ అమ్మ వుండాది. నీ నాయనకు పెళ్లాం వుండాది. పడుకుంటారు. పోవాలసినంత నిద్దర పోతారు. నాకెవురు వుండారు కూతరా? నేను పడుకొంటే నాకు జరుగునా?" అనింది కర్రెక్క నవ్వు మొకంతో.

ఆ తెల్లారి ముర్రు పాల జున్నును కర్రెక్క కాసింత కూడా పిలకాయలకు పెట్టలేదు. ఆ పూట పిలకాయలకు కడుపు నిండా చద్దిపోసి, కర్రెక్క చద్ది తాగకుండా, జున్నునే తినేసింది. రెండు రోజులూ ఎనుము పాలు జున్నే అయింది. రెండో రోజు సాయంకాలం మాత్రం కొడుక్కి, కూతురుకి జున్నులో కొంచెం చక్కిరిని కలిపి, తినమని యిచ్చింది. పిలకాయలకు జున్ను మంచిది గాదు, పైత్యం జాస్తి, నడుములు పట్టక పోతాయి – అని అనుకోవడంతో ఆమె బయపడి జున్నును పిలకాయలు కోరినంతగా పెట్టలేదు. కర్రెక్క ఈ రెండు రోజుల జున్నునూ ఇంటి గడప దాటనీలేదు. ఇక్కనా పక్కనా వాళ్లయిన తులిశమ్మకు, కమలమ్మకు కూడా యింత తుంచి పెట్టలేదు. ఈవూరి కోడాలుగా వొచ్చి పన్నెండు పద్మూడేండ్లవతా వుండాది. డెబ్బై ఎనభై గడప వుండే ఈ పాడు వూర్లో సమచ్చరానికి నలపై ఎనుముల లెక్కన ఈనతానే వుండాయి. నాకు జున్నంటే అమ్మా అబ్బను చూసినట్టే గదా. ఏ నా సవితన్నా 'కర్రెక్కా, పట్టు' అని నా చేతిలో యింత జున్ను పెట్టి వుండునా? ఇందమ్మా తియ్యగూర అంటేనే గదా ఇందమ్మా పుల్లగూర అని అంటాం. నేను మాత్రం ఎందుకు పెట్టాల జున్నును, ఒక నా సవితికి, ఒక నా లంజికి? అనే కసితో ఆమె జున్నును ఇతరులకు వాసన కూడా చూపించ లేదు.

## 3

కర్రెక్క ఎనుము కాళ్ల దగ్గిర గొంతు కూర్చొని, చెంబులోని నీళ్ళను చేరడు ఎగరజల్లి, వేళ్ళతో రొమ్ములను సర దిద్దింది. అందాకా వదులు వదులుగా వుండిన ఎనుము రొమ్ములు ఒక్కసారి కుడుములు మాదిరి బిర్రుగా అయిపోయినాయి. 'అమ్మ, చేపు విడిచిందిరా!' అని అనంగానే జనార్ధి నాయుడు దూడను కడగా లాగేసి కట్టేసినాడు. ఆ లేత దూడకు తాడు మెడకు గాకుండా కాలికి వుండాది. కర్రెక్క లోటా నీళ్ళను చెంబులో పెట్టుకొనే పాలు పిండడం మొదలు బెట్టేసింది. పాల చుక్కలు ఆ నీళ్ళలో సరక్ సరక్‌మని శబ్దం జేస్తావుంటే అమ్మకల్లా యిచ్చిత్రంగా చూసినాడు జనార్ది నాయుడు. అప్పుడనంగానే లింగులింగుమని సైకిలు బెల్లు మోగించుకుంటా పాలాయన – సహదేవ రెడ్డి వచ్చి కొట్టం ముందర ఆగినాడు. కర్రెక్క పాలు పిండతా వుండడం జూసి, సహదేవ రెడ్డి మొకాన్ని కంద గడ్డగా జేసుకొని, "ఇదేం అన్నాయం కర్రెక్కా? ఇది నీకు నాలుగో యావత్తు చెప్పటం. ఇంగ నుంచి

నువ్వు నా ముందర చెంబు బోల వేసి చూపించందే పాలు పిండొద్దు. ఇదే కడ మాటగా చెప్పటం" అన్నాడు. కర్రెక్క సహదేవ రెడ్డి నిస్టూరానికి బదులుగా ఏ మాటా అనకుండా పాలు పిండతానే వుండి పోయింది. వారం నుంచి ఈ పాలోడు ఇదే రకంగా తగరారు పెట్టుకుంటానే ఉండాడు. కర్రెక్క మాత్రం ఆయన వచ్చే సరికే పాలు పిండి పెట్టేస్తా వుండాది.

పాల చెంబుతో కొట్టం బయటకు వచ్చిన కర్రెక్క "నా మింద నీకు అంత అనుమానంగా వుంటే డిగిరీ తెచ్చి యేసుకో సహదేవన్నా! పాలల్లో ఏదన్నా మిస్టీకు గాన వుంటే, నీ ఎడం కాలి చెప్పుతో నా పాపిడి దీసి పదారు యేట్లు కొట్టు, అప్పుడు తలొంచతా" అని బెట్టుగా మాట్లాడింది. ఈ మాటలకు ఒళ్ళంతా రగలక పోయిన పాలాయన, గోరెచ్చగా వుండిన చెంబులో చూపుడు వేలు బెట్టి, ఒక పాల చుక్కను బులుగు రంగులో వుండే సైకిలు సీటు మింద వేసి, 'చూడు కర్రామె! పాలు వుత్తరంగా నీళ్ళు దచ్చినంగా..... ఒకదానికి ఒకటి సమందం లేకుండా పోతుండాయి!" అని అక్కసుగా మాట్లాడినాడు.

చిన్నతనమై పోయిన కర్రెక్క అనుకోకుండా, "సహదేవన్నా! పాల సుక్కల కాడ అబద్దాలు జెప్తానా? నేనేమీ ఒట్టిగా లేను, ఒకరికి ఇద్దరు బిడ్డల్ను పెట్టుకొని వుండాను. నేను – యెంగటేస్పర సామి స్నానమాడే పాలసుక్క కాడ అపద్దం జెప్తానా?" అనేసింది. జనార్ది నాయుడికి అక్కడ వుండను సగించక బజన గుడికాడికి బలీనమైన నడత నడుచుకుంటా పోయినాడు.

సహదేవ రెడ్డి గొంతు ఏ మాత్రం తగ్గించకుండా, ఎక్కించే, "కర్రెక్కా! ఈ నంగి మాటల వల్ల కాసు ఆదాయికం లేదు. నీకూ నాకూ దినుమ్మా రచ్చ దేనికి? ఇక్కనా పక్కనోళ్ళు ఇట్లాగే పిండతా వుండారా అడిగి కనుక్కో ! నన్ను ఎదురు గుండా పెట్టుకొనే ఎనుము దగ్గిర కుచ్చుంటా వుండారు, ఇది పాల యాపారం, పాలల్లో ఏదన్నా పాల్టుగాన వచ్చిందంటే తిరపతి టీ అంగిడోళ్ళు మా అమ్మను అంతపొద్దుకాడ ఒంగనబెట్టి చేస్తారు తల్లా!" అన్నాడు కరుగ్గా.

కర్రెక్క నోటి మాటెత్తకుండా శేరు పాలనూ కేనులో పోసేసి, 'నా బట్టా, నువ్వు ఊరి బయటకు పోయి ఆ కేనులో తూకుడు నీళ్ళు పోసుకొనే సంగతి ఎవుడికి తెల్దు?' అని అనుకుంటా ఇంట్లోకి పోతా వుంటే పాలాయన, 'చెప్పింది

మర్చిపోయ్యేవు తల్లా!' అని మళ్ళీ యెచ్చరిక జేసేసి సైకిలేసుకొని పోయినాడు. ఇంట్లోకి వచ్చిన కర్రెక్కకు మనసుకు చిటామనిపించి రోతబుట్టింది. 'ఆ మొండి నా బట్ట ఒప్పుకొనే ఘటమా? ఈ రోజు కాకున్నా రేపుట్నించన్నా వాడ్ని దగ్గిర పెట్టుకొనే పాలు పిండాల గదా! ఇంతలో మాత్రానికి ఈ పియ్యితినే నోటికీ అపద్దాలెందుకు? ఛూ, అనావశింగా బిడ్డలమింద కూడా సాచ్చిం చేస్తినే! హీనపు ముండను' అని ఆమెను ఆమే తిట్టుకొనింది.

ఎనుము తెల్లారీ సందేళా శేరు లెక్కన పాలు ఇస్తా వుండాది. సందేళ పాలను కర్రెక్క అరశేరు – రామచంద్రాపరం టీ అంగిడోళ్లకు పోసేసి, మిగతా అర శేరును కాగబెట్టి, చేమిరి వేసి మజ్జిగ చేసుకుంటా వుండాది. కర్రెక్క ఎక్కడ నీళ్ళల్లో పాలు పెట్టేస్తిందేమోనని బయపడి రామచంద్రాపురం టీ అంగిడామె ఎంతో కరట్టుగా నెల రోజుల పాలకు ముందే అరవై రూపాయలు అడమాన్స్ కూడా ఇచ్చి దగ్గిరుండి పిండించుకుని పోతాది. 'ఈ కాలం యాపారం చేసే ఒక నా బట్టా ఒక నా సవితీ మనల్ని నమ్మతారా?' అనుకొనింది కర్రెక్క. ఒట్టి చెంబులోకి పాలు పిండాలంటే మనసు చివుక్కు మంటాది కర్రెక్కకు. 'ఇదెక్కడి చట్టమో!' అనుకొని ఆమెకు రోత కలిగింది.

పెరుగు చట్టిలో కవ్వం పెట్టి చిలకతా వుంటే, ఎగిరి పడే మజ్జిగ చుక్కల పక్కనే కూర్చుని ఉంది అంజిలి. అమ్మ మూతి నల్లంగా పెట్టుకొని ఉండడం వల్ల ఆ పిల్ల ఉలుకూ పలుకూ లేకుండా గమ్మున కూర్చొనింది. రెండు మజ్జిగ చుక్కలు ఎగిరొచ్చి అంజిలి కండ్లల్లో పడినాయి. కుశాలతో యింతెత్తు ఎగిరిందా అమ్మి. "అమా అమా, మజ్జిగ చుక్కలు కండ్లల్లో పడతా వుండాయి. బలే వుండాది నాకిప్పుడు" అని అమ్మతో ముదిగారంగా చెప్పింది.

అప్పుడనంగానే కర్రెక్క గడప మింద ఒక కాలు, వీదిలో ఒక కాలూ వేసుకొని నిలబడిన కమలమ్మ, మూతి మూరడు పొడుగు పెట్టుకొని, ముక్కుల గుండా కోపంతో సందిట్లావు గసను విడస్తా, "ఒసె కర్రిదానా! ఎనుమును – సంపాయించిన దానివి – కొట్టంలో కట్టేసుకొనేది తెలవదా? ఆ కూలిపోయిన గొడ్డును, దాని దొమ్మ రోగం వచ్చి దాన్ని ఎత్తుకు పోనానీ – యింగన్నా దాన్ని కట్టేసుకో, నా కొట్టంలో కుడితి నీళ్ళను సగం తాగేసింది. ఒక కట్ట కసువు తినేసింది! దాని మాదిగోళ్ళు దాన్ని కోసుకొని తిననానీ–" అనింది.

"ఒసె అంజిలా ఆ ఎనుమును కొట్టంలో కట్టేసిరాయే" అనింది కర్రెక్క. అంజిలి ఎనుమును కొట్టంలో కట్టేసి వచ్చి, "అమా...ఆ కమల లంజి ఎనుమును చావ గొట్టేసింది. వీపు మింద వాతలు దేలిపోయి వుండాయి" అని చెప్పింది. ఎనుమును వచ్చి చూసుకున్న కర్రెక్కకు కడుపు కాలిపోయింది. 'పాలు పిండతానే కట్టేసేదెందుకని కట్టెయ్యలా. గొడ్డు గదా, దానికి తనా మనా తెలుసునా? దాని కొట్టంలోకి పోయిందే అనుకో, ఈ రీతిగా కొట్టొచ్చా!' అని మదన పడి, కమలమ్మను తిడతా వీదిలో ఒక్కమాట కూడా అనలేక కర్రెక్క యింట్లోకి వచ్చింది. బజనగుడి దగ్గిర్నించి వచ్చిన జనాద్రి నాయుడు సంగతి తెలుసుకొని, "లోబికి నాలుగందాలా నస్టమంటే యిదేనే, ఈనపు నాయాలీ ముండా, పాలు పిండతానే కొట్టంలో మన ఎనుమును మనం కట్టేసుకొనేది తెలవదంటే లంజి నాయాలీ ముండా. ఊరోళ్ల కొట్టంలోకి పోయి గడ్డి తిని, కుడితి నీళ్ళు తాగేసి రానీలే – అనే దుర్బుద్ధితోనే నువ్వు ఎనుమును కట్టెయ్యవు. నాకు తెలుసుగదా నీ బుద్ధి! యిప్పుడు బాగుండాదా, నీకు?" అని వాడు అమ్మను బాగా దొబ్బులు పెట్టినాడు. పాపం కర్రెక్క కొడుకు నోటికి బయపడి గమ్మున వుండిపోయింది.

నడీదిలో కూచ్చోని 'వొసె కమలా!' అని దానిపేరు పెట్టి, నా సాడును కడవల కొద్దీ దాని గొంతులో పోస్తే ఎంత బాగుండును! అది గొడ్డును కొట్టినా నేను దాన్ని ఒక్క మాట అనలేక పోతా వుండాను గదా! ఎంత ఈనం బతుకు! అని ఆమె కుళ్లిపోయింది. కర్రెక్క ఇంట్లో వుంటే తులిశమ్మ అరిజంటుగా ఏదో పని తగిలినట్టుగా, "కర్రె, వొసే కర్రా! ఏమే కర్రిదానా!" అని వరసబెట్టి నాలుగు కూతలు పిలిచేసింది. మజ్జిగా కూడు తింటా వుండిన కర్రామెకు ఈ కూతలన్నీ చెవులకు వినిపించినా పలక్కుండా గమ్మున వుండిపోయింది. 'ఇది మాత్రం తక్కవైన లంజా! దీన్ని తియ్యాల్సిన పనిలా, దాన్ని తొయ్యాల్సిన పనిలా, రెండూ రెండే లంజిలు. దాని కొవ్వు జూడు! అది పిలిచే తీరు జూడు. అది, 'వొసె కర్రా!' అని పిలిస్తే నేను దాని ముంగిట వాలి మడిజేతులు కట్టుకొని వొంగి, 'ఏమక్కా, అక్కా, ఓ తులిశక్కా! నీ అంతటి దానికి ఈ దీనురాలితో ఏం పని బడిందక్కా!' అని నేను అడగాల్నేమో! ఒక్కొక్క దాని కొవ్వు జూస్తా వుంటే... అనుకొని కర్రెక్క ఆమె మానాన ఆమె వుండిపోయింది. కొంచేపట్లో తులిశమ్మ కొడుకైన పదేండ్ల పిలగాడు, చేతిలో ఒక చెంబు

పట్టుకోనొచ్చి, "వోమ్మో! మా అమ్మ నీ దగ్గిర మజ్జిగ పోయించుకొని రమ్మనింది". అని నిలబడిన చోటున్నే నిలబడినాడు. వాడ్ని అక్కడ నిలబెట్టే కర్రెక్క కావాలని మజ్జిగా కూడును నిదానం మింద తింటా వుండిపోయింది. అయిదు నిమిసాల తరవాత చేతులు కడుక్కొని లేచింది. 'మజ్జిగ ఈరోజు పోనీగదా అని పోస్తే మనమే వొక దోవ ఏర్పరచినట్టు. దానికేమన్నా సిగ్గా శరమా? రోజూ పంపించదా? ధూ, దరిద్రపు నా సవితి! ఇప్పుడెందుకు దానికి మజ్జిగ! ఒక్క కోడిగుడ్డు కూరతోనే నాలుగు గిన్నెల కూడు మింగేస్తిందే! దానికెందుకు మజ్జిగ... కావాలని... నన్ను ఏడిపించి యేడిక జూడాలని! పోస్తిందో పొయ్యదో టెస్ట్‌జేసి చూద్దామని!' తులిశమ్మ మొకాన తుపుక్కుమని ఎంగిలూంచదామన్నంత కోపం వచ్చింది కర్రెక్కకు. పసి పిలగాడ్ని అయిదు నిమిసాలు నిలపెట్టుకొని వొట్టి చెంబుతో పంపడం బాగుండక కర్రెక్క ఆ చెంబులో మజ్జిగ పోసి, "మా కెక్కడివిరా మజ్జిగ? మేము పాలను ఎక్కడ కాగబెడతా వుండాం?" అని వాడ్ని పంపించేసింది కర్రెక్క.

టయిం పది గంటలయినాక ఎనుమును విడిచి ఊరికి వుత్తరంగా వుండే వరి మళ్లలోకి తోలుకొని పోయింది. సన్నంగా వుండే ఒక నీళ్ల కాలవలోకి ఎనుమును తోలింది. ఆ కాలవలో అయిదార్సు పవరు మోటారు నీళ్లు పోతా వుండాయి. అది ఎప్పుడూ నీళ్లు పారే కాలవ గాబట్టి, కాలవకు ఆ పక్కా ఈ పక్కా పచ్చి కసువు వుండాది. ఎనుము బుస కొడతా, కసువును పెరుక్కు తింటా వుంటే కర్రెక్క ఎండ తగలకుండా కొంగును నెత్తి మింద వేసుకొనింది. ఆమె ఆ ఆలోసినా ఈ ఆలోసినా చేసుకుంటా వుండంగానే దూరంగా నుంచి ఒకాయన, "ఏమే కర్రా! ఓ కర్రిదానా! ఎనుమును కడగా తోలే నీ కడుపు కాలా! నీళ్లు పారే కాలవ గదా అది! ఎనప గొడ్డును తోలి ఆ మాదిరిగా యిష్టం వచ్చినట్టు తొక్కిచ్చేస్తే ఆ కాలవ మళ్ల పనికొస్తాదా!" అని గెట్టంగా అరిచినాడు. కర్రెక్క ఆయన అరుపును విని, సమాదానంగా, 'తోలేస్తా, కొంచేపు మేపుకొని యింటికి పోతా' అని అక్కడే ఎనుమును మేపుకుంటానే వుండింది. ఆయన ఒకటంటే ఒకటే నిమిసం టైమిచ్చి, మళ్లా, "చెప్పేది నీకు గాదంటే కర్రిదానా! అక్కడికొచ్చి తోలేస్తేనా నీకు మరేద? తోలు తోలు" అని మళ్లా అరిచినాడు. 'ఈ ఆడంగుల నా బట్ట యింక వదలడు' అనుకొని కర్రెక్క ఎనుమును ఆ కాలవలో నుంచి యింకొంచెం ముందుకు తోలింది.

ఇప్పుడు కర్రెక్క మేపతా వుండిన గనిమ తులిశమ్మది. ఈ గనిమ గల్ల కయ్యలో వరి పైరు వుండాది. ఎనుము వరి పైరును పెరికి తినకుండా, గడ్డే పెరుక్కుని తినేటట్టుగా జాగర్త పడి ఎనుమును మేపతా వుండాది కర్రెక్క. దూరాన్నుంచి తులిశమ్మ గనిమల మింద పడతా లేస్తా రావడం కర్రెక్క కంటికి కనిపించింది. 'ఎప్పుడూ పైరు మొకం చూడని లంజి. ఈ పొద్దు ఎందుకు వస్తావుండాదబ్బా మడి కాడికి?' అని యిచ్చిత్ర పోయింది ఆమె. పది బారల దూరం నుంచే చురుకైన గొంతుతో, "కర్రిదానా, తోలు, ఎనుమును నా కయ్యలో నుంచి కడగా తోలు" అని తగరారుకు దిగుతున్నట్టుగా అరిచింది. కర్రెక్కను నోటి మాటను ఎత్తనీయకుండా, "ఏమి సేయ్, నీకూ నాకూ ఏమి చుట్టరికం అని నా కయ్యలో తోలి ఎనుమును మేపతా వుండావు? నువ్వేమన్నా నా పెద్దమ కూతురివా, పిన్నమ కూతురివా? లేకుంటే నా అయ్యకేమన్నా పుట్టినావా నువ్వు? తోలు, మరేదగా ఎనుమును కడగా తోలు, దొంగనా సవితీ, సేతిలో టికాణా లేని దానివి నీదగ్గిరే యింత పనితనం వుంటే యింక మా బోటివాళ్ల దగ్గిర ఎంత చాతుర్యం వుండాల! నా సవితీ, బిడ్డ మజ్జిగా కూడూ అని ఏడస్తా వుంటే గదా నీ దగ్గిరికి సిగ్గిడిచి వాడి చేతికి చెంబు యిచ్చి పంపించింది! ఆ చెంబులో లోటాడు మజ్జిగ నీళ్లు పొయ్యరాదా? వాడ్ని రెండు జాములు ఇంట్లో నిలువుగాళ్లతో నిలపెట్టి చేరడంటే చేరడు చేమిరికి అన్నట్టుగా పోసి పంపతావా నా సవితీ, నేను లాంతర యిచ్చే దాకా నీకు గతిలేక పాయగదే ముండా! జున్నయ్యింది గదా... నా బిడ్డని నీ యింట్లో కన్నా పిలిచి చీమంత తుంచి పెట్టినావా? పొయ్యి మింద ఎసురుబెట్టి, బియ్యం కోసరం నా గడప ఎన్నిసార్లు తొక్కలేదు నువ్వు?" అని తులిశమ్మ కర్రెక్కను పైన్నుంచి కిందికి కడిగి పారేసింది.

కొంచెం బయపడిన కర్రెక్క, "తులిశక్కా, ఈ బీదరాలిని ఎందుకిన్ని మాటలంటావు? రెండు లోటాల మజ్జిగ పోసి పంపితే... చేరడు కూడా పొయ్యలేదని అంటా వుండావే, ఇంక నీతో మాట్లాడేది ఏముండాది?" అంటా ఎనుముని తోలుకొని వూరి మొకం పట్టింది. తులశమ్మ మడికాడ చెయ్యాల్సిన పనంతా అయిపోయినట్టుగా కర్రెక్కను తొలగదోసుకొని ఇంటికి పోయింది. కర్రెక్కకు మనుసు చివుక్కుమనింది. అది దాని బిడ్డను మజ్జిక్కి పంపించగానే మనం పెరుగు చట్టినంతా వాడి చేతిలో పెట్టలేదని దాని అక్కుసంతా! నా

సవితీ... నీకు బిడ్లున్నా గొడ్డురాలవే అనుకుంటానే నేను, నువ్వు దినుమ్మూ సుయ్ సుయ్ మని పెనుమ్మింద దోసులు పోసుకుంటా వుంటే నా బిడ్లు... నీ గడప ముందర ఎన్ని నాళ్లు నిలబడుకోలా? నువ్వే పొద్దన్నా నా కూతురి చేతిలో అంత తుంచి పెట్టుందువా? 'కూలిపోయిన బిడ్డలాలా! మీ గుండంలోకి మీరు పోండి'. అని ఎన్నిసార్లు నా బిడ్డల్ని గుండెల్లోకి నెత్తురు దిగేటట్టు గుద్దలేదు నువ్వు? అప్పుడంతా 'యిదే మని' నేనడిగినానా? అడగగూడదు. మీరు వుండినోళ్లు, మీరేం జేసినా నేను పడాల. కానీ నేను మాత్రం మీ దగ్గిర బయంగా, బక్తిగా మసులుకోవాల' – అనుకొని ఆమె బతుకు మింద రోత పడింది.

ఎనుమును తోలుకొని ముందుకు కదులుతూనే, ఉత్తరంగా తిరిగి, స్వామి కొండకల్లా జూసి "మనిసి మానంగా బతికితే నువ్వు ఓర్చుకోలేవంటరా కూలిపోయిన నా బట్టా దేముడా! ఒక మనిసి ముందర యింగొక మనిసిని ఎందుకింత నోట్లో నాలిక లేకుండా బతకనిస్తావు! అది నన్ను అన్ని మాటలనింది, నేను దాన్ని ఒక మాట అనలేక పోతిని గదరా, నీ ముండ మొకాన ఎండ కాయ" అని కర్రెక్క దేముడ్ని అక్కుసుతో తిట్టింది.

## 4

కర్రెక్క ఎనుమును వెంటబెట్టుకొని కూలికి ఎలబారింది. ఎనుమును ఇంటి దగ్గిర్నే కట్టేసి పోతే అది తినను కసువు లేక, తాగను నీళ్ళు లేక – చచ్చి సున్నమైతింది. ఆమె మొగుడు రామచంద్రమ నాయుడు – బాడుగ మడకకు పోయినాడు. కొడుకు పరావూర్లో వుండే అయిస్కూలుకు, కూతురు వూళ్ళోనే వుండే ఇస్కూలుకు పోయినారు.

కమలమ్మ వరి మడిలో కలుపు తియ్యడం – ఆ రోజు పని. అది నాలుగు గుంటల కయ్యగాబట్టి కమలమ్మ – వొక్క కర్రెక్కను తప్పించి మిగతా ఎవ్వర్నీ పనికి పిలవలేదు. కయ్య దగ్గిరికి వొచ్చినాక, అక్కడ ఒక వేపచెట్టు వుంటే దాని మొదులుకు ఎనుమును కట్టేసి కలుపు తీయడానికి వొంగింది కర్రెక్క. అప్పటికే మునం పట్టి కలుపు తీస్తా వుండిన కమలమ్మ, పనికి దిగిన కర్రెక్కతో, "కర్రా! ఎనుము మింద కలవరం పెట్టుకోకుండా కలుపు మింద కలవరం పెట్టుకొని తియ్. పనికి వస్తా వస్తా–పిల్లిని చంకలో పెట్టుకొని వచ్చినట్టు

ఎనుము ఎందుకు నీతో కూడా? పదకొండు గంటల పొద్దు ఎక్కంగానే – నేను సంగటి చేసుకొని రావడానికి ఇంటికి పోతా. ఆ కాసేపు కయ్యలోనే వుండు. ఎనుమును విడిచి కయ్య గనిమలకు పట్టి మేపేవు తల్లా!" అనింది.

ఈ కానీగాని మాటలకు కర్రెక్కకు మూతి ఇంతై పోయింది. కర్రెక్క నోట్లో నాలిక లేని దాని మాదిర అయిదు నిమిసాల సేపు ఏం మాట్లాడకుండా గమ్మున వుండిపోయింది. కర్రెక్కకు ఎనుమును బరాయించడం బలే కష్టంగా వుండాది. ఈ రోజుకు కూలికి పోగూడదు. ఎనుమును మేపుకుంటే చాలులే, పాలన్నా ఎగస్ట్రాగా ఇస్తింది, అని నిమ్మళపడే దానికి కూడా లేదు. చీమంత కయ్య లేకుండా ఆమె, ఆమె మొగుడు ఈ బూమండలాన పడినారు గదా! ఎక్కడ మేపుకోవాల ఎనుమును? వూరోళ్ళ కయ్యల్లోకి తోలుకొని పోతే మేపుకోనిస్తారా? ఇన్ని రోజులూ ఏ ఆటో ఒక ఆట ఆడి ఎనుముకు మేత అందిస్తా వచ్చింది కర్రెక్క.

మొన్నమొన్నటి దాకా చెరుకును చక్కెర మిల్లులకు తోలినారు వూళ్ళో వాళ్ళు. కర్రెక్క నిద్ర పడకతోనే లేచి చెరుకు తోటలోకి పొయ్యేది. ఒక మనిసి మోసే అన్ని చెరుకు సోగలను కోసుకునేది. ఆ సోగలను వూరికే కోసుకొని వచ్చెయ్యొచ్చునా, ఏమి? కుదరదు. మొదుళ్లు కొట్టాల, చెరుకులకు అంటుకొని వుండే ఎండాకులను కొడవళ్లతో చెలగాల. ఆ చెరుకును లారీ ఎక్కడ నిలిపి వుంటే అక్కడికి మోసుకొని పోవాల. ఈ మూడు పనులూ చేస్తేనే – సోగను మనం ఇంటికి తెచ్చుకోవచ్చు. వూళ్ళో చెరుకు తోటల పని వున్నన్నాళ్ళు కర్రెక్కకు దిగులే లేకుండా వుండింది. కూలికి పొయ్యే వేళ దాకా చెరుకు తోటల్లో పనిచేస్తే–దండిగానే అయ్యేవి సోగలు. చద్దేళకంతా సోగల కట్టను తెచ్చి ఇంట్లో వేసి, కూలి పనికి ఎలబారేది. అప్పుడు ఎనుమును కొట్టంలోనే కట్టేసి వొక్కటే పనికి పొయ్యేది. సందెడు సోగలు ఎనుము ముందర వేస్తే అది సందేళ దాకా సగించినట్టుగా తినుకుంటా వుండేది.

ఎవురికి కూలికి పోయినా, మద్యానం సంగటి తిన్నాక, ఒక గంట రెక్కార్చుకొనే దానికి టయిం వుంటింది గదా! ఆ కాసేపిట్లో కర్రెక్క ఇంటికి వచ్చి ఎనుమును విడిచి, నీళ్ళు తాపి, మళ్ళీ దాన్ని కట్టేసి కూలికి పొయ్యేది. నాలుగు రోజులుగా నిండా కష్టమై పోతా వుంది. మొన్న అయితే – పేడదిబ్బలో

పేడ మరకలు అంటుకొని వుండే కసువునంతా బీజారి–సందెడు ఎత్తుకొని పోతే ఆ కసువును కూడా తినేసింది, ఎనుముది.

కర్రెక్క నడుము పైకి లేపి, కలుపు తీస్తా వుండిన కయ్యలో నుంచే యెనిక్కి తిరిగి ఎనుముకల్లా జూసింది. మునంలో కమలమ్మ కన్నా మూరడు ముందే వుండాది కర్రెక్క. ఇంత సేపటికి కర్రెక్క నోరు తెరిచి, నిష్టూరంగా, “ఎందుకక్కా మనిసికి వాతలు వేసినట్టుగా మాట్లాడేది నువ్వ?” అని, మళ్ళీ మునంలోకి వొంగింది. “వొసె నా సవితీ? ఇప్పుడు నేనేమన్నానే! ఇందాకా ఆ మాటనే కడుపులో పెట్టుకొని కుళ్లిపోతా వుండావా ఏంది?” అని నవ్వ మొకంతో అనింది కమలమ్మ. కర్రెక్క నిష్టూరం నిండిన గొంతుతో, “ఏమన్నా అనాల్నా? కొట్టాల్నా, తిట్టాల్నా? ఒక మాట జాలు గదా, శూలం మాదిరిగా–” అనింది. మళ్ళ ఇద్దరూ వొకరుకొకరు ఏం మాట్లాడు కోకుండా పని కానిచ్చినారు. కలుపు తీయడానికి వాళ్లు వొంగుతూ వుంటే– పొడుగ్గా పెరిగి పోయిన పైరు వాళ్ల కండ్లకు తగలతా వుండాది. ఈరోజు తీద్దాంలే, రేపు తీద్దాంలే – అనుకుంటా కలుపు తియ్యడం తాంచారం చేసినట్టుండారు. కలుపేదో, పైరేదో తెలవకుండా అయిపోయింది. కలుపు కూడా మూరడు పొడుగు అయిపోయి వుండాది. మెత్తంగా వుండే ఆ కలుపును పెరికి, బురదలోనే పూడ్చి పెడతా వుండారు. ‘ఆ కలుపు మొక్కలన్నీగాని, కయ్య గనిమ మీదికి విసిరేస్తే బాగుండును. నీళ్ళల్లో నానేసి, బురదా గిరదా అంతా కడిగేసి ఎనుము ముందర గాన వేస్తే–లడ్డు తినినట్టు తినును గదా, వోయమ్మో, ఈ లంజి నా సవితి అందుకు వొప్పుకుణ్ణా, ఏమి? కలుపు కూడా కయ్యలోనే పూడ్చేస్తే నాలుగు నాళ్ళల్లో అదంతా మురిగి పోయి, ఎరువై పోయి పైరుకు సత్తవ అయిపోతింది. ఈ సంగతి దీనికి తెలవదా ఏమి?’– అనుకొనింది కర్రెక్క.

పచ్చంగా నమనమలాడతా వుండిన ఆ కలుపు మొక్కలను బురదలో తొక్కెయ్యడానికి కర్రెక్కకు మనసే వొప్పలేదు. ఆమె పొద్దు ఎక్కడుండాదోనని పైకిలేచి చూసింది. ‘టయిం పదకొండు అవతా వుండును. ఈ లంజ సంగటి చేసుకొని రావడానికి ఇంక ఇంటి కాడికి పోదా ఏమి?’ – అని అనుకుంటా వుండంగానే, “కర్రా! నేను ఇంటికి పోతావుండా. నువ్వ కలుపు తీస్తావుండు. నువ్వ తెలివైందానివని అనుకుంటానే గాని వుత్త అమాయికు రాలివే కర్రిదానా! ఆ కలుపును బురదలో ఎందుకు తొక్కేస్తావు? గనిమ మింద విసిరేస్కో. నీ

ఎనపగొడ్డుకన్నా పనికొస్తాది గదా!" కమలమ్మ ఈ మాటలను అని గనిమ ఎక్కేసింది. ఈ మాటలకు కర్రెక్క "నాకు ఆ అయిడీయే రాలేదక్కా! ఆ ఆలోసిన గాని నాకు తట్టుంటే నేను నువ్వు జెప్పిన పనే చేసుండనా? ఈ కలుపు మొక్కలేమన్నా బంగారా?" అనింది. కమలమ్మ ఇంటికి పోయింది. కనీసం మూడు తట్టల కలుపు మొక్కలనైనా నీళ్లల్లో నానేసి బురదను కడిగేసి ఎనుము ముందర పోసింది. ఎనుము రెండు తట్టల కసువును కడుపు నిండికి తినేసింది. మిగతా తట్టడు, సందేళ పనై పోయినాక ఇంటికి వస్తా తెచ్చుకొనింది. 'ఈరోజు బక్కెద్దులకు కూడా కసువు కరువు తీరిపోతింది' అనుకొనింది కర్రెక్క.

ఎనుమును తోలుకొని, నెత్తిన కలుపు మొక్కల తట్ట పెట్టుకొని కర్రెక్క నడస్తా వుంటే, "కర్రిదానా! నీ పనే మేలుగా వుండాది. సందేళ దాకా నా కయ్యిలో పొద్దు పోగొట్టినావు. ఇంటికి పోతానే నాలుగు రూపాయలు చేతిలో వేసుకొంటావు. పది రూపాయలు పెట్టి కొనుంటే వొస్తిందా నీ కింత పచ్చి కసువు? దీన్నంతా కయ్యిలోనే తొక్కేసి వుంటే నా కయ్యికి ఎంత సత్తువ వచ్చి వుండును? పైరుకు ఈరియా కూడా చల్లకుండానే పోయుందుము. పది రూపాయిల కసువైనా ఎత్తకపోతా వుండావుగదా! ఏమో నమ్మా, మళ్ళీ చెప్పలేదనుకొనేవు – నీకు కూలి యియ్యబొయ్యేది లా". అని కమలమ్మ నవ్వు మొకంతోనే బెదిరించింది. 'లంజా! తూనీకట్టై తోకకు తాడుగట్టి ఆడించినట్టు ఆడిస్తా వుండావు గదే కిరాతకపు లంజా!' అనుకొని, గమ్మున వుండిపోయింది కర్రెక్క.

కర్రెక్క ఇంటికి వచ్చే సరికి మొగుడూ పిలకాయలూ అందరూ చేరిపోయి వుండారు. అన్నం వార్చి కూర చెయ్యబోతుండగా – వూర్లో వేటను కోస్తా వుండినట్టు చెవిలో పడింది. అడివిలో ఒకరి మేకను పొట్టినక్క మెడ కొరికేసిందంట. మేక చావను గూడా లేదంట. ఇంక బతకదు గదా–అని మేకగల్లోళ్ళే కోసేస్తా వుండారు. కేజీ మింద నాలుగు రూపాయలు తగ్గిచ్చి అమ్మేస్తా వుండారు–అని తెలిసింది. కర్రెక్క జనాద్రి నాయుడ్ని పిలిచి, చేతికి డబ్బూ, గిన్నె యిచ్చి 'అరకేజీ తేబోరా!' అనింది. వాడూ, వాడి చెల్లీ ఆ కుశాల్లో పడేదీ లేచేదీ తెలవకుండా పరిగెత్తినారు. జనాద్రి నాయుడు అరకేజీ కూరను ఇంట్లోకి తెస్తా ఉంటే వాళ్ల ఇంటి ముందర కూర్చుని వుండిన తులిశమ్మ, "ఈరోజు వానొస్తాదిరా జనాద్రిగా! మీ అమ్మ అరకేజీ కూర–పండగ పూట

గాకపోయినా–తెచ్చిందంటే... ఈ రోజు చాటంత మబ్బులోనుంచి చెరువాన దిగిపోతిందిరా జనాద్రిగా!" అని ఎగతాళి పడి, ఇంట్లో వుండిన కర్రామెను నోరారా పిలిచి, "కర్రిదానా! ఈ రోజు నాకు కూడా కూరెయ్యి! దిగులు పడి చావొద్దులే, వొక గెంటిడు కూర నాకు గూడా వెయ్" అని అరిచింది.

కర్రెక్క లోపల్లోపల తులిశమ్మ ఎగతాళికి పండ్లు నూరుకొని పైకి మాత్రం, "అయ్యో నువ్వడగాల్నే గాని, ఎయ్యకుండా పోవడానికి నాకెంత దైర్నం అక్కా?" అనింది. ఇంట్లోకి కూర తెచ్చి, లోపల పండగ మాదిరి జరగతా వుండినా రామచంద్ర నాయుడు మాత్రం తిన్నెదిగి యింట్లోకి రాలేదు. ఆయన ఏందో పోగొట్టుకున్న వాడి మాదిరి దిగులుగా వుండి తిన్నె దిగనే లేదు. పిలకాయలిద్దరికీ చియ్యల కూరతో అన్నం వేసేసినాక, వాళ్ల గిన్నిలు కడిగేసి–తిండికి మొగుడూ పెళ్లాలూ కూచ్చున్నారు. చియ్యల కూరతో అద్దుకొని తింటా వుండిన మొగుడ్ని రెప్పార్పకుండా చూస్తా వుండిన కర్రెక్క, "ఏమబ్బా, రామచంద్రమ నాయుడా! ఆ నోరు కొంచిం తెరిచి మంచీ చెడ్డా మాట్లాడబ్బా! అట్టగూడ ముత్యాలు దొర్లి కింద పడిపోతే ఏరుకొని కొంగులో పోసుకుంటానులే!" అనింది ముదిగారంగా.

వాళ్ల కొట్టంలో వుండే బక్కెద్దులు పన్నెండు సమ్మచ్చరాలుగా ఆ ఇంట్లోనే వుండి సేద్దిం చేస్తా వుండాయి. వొంటి మింద చురుకు లేకుండా అయిపోయి నాయి. ఆ వూళ్లో అవితే ఆ ఎద్దులను దున్నడానికి ఎవరూ పిలవరు. నడవలూరి రెడ్లకు బూములు ఎక్కువ వుండటం వల్ల, ఈ ఎద్దుల సంగతి వాళ్లకు తెలవక పోవడం వల్ల–రామచంద్రమ నాయుడ్ని బాడుగకు పిలుస్తారు. బాడుగ మడకకు పోకుంటే కర్రెక్క 'ఓ' అని నసపెట్టి చంపేది. "కర్రు దిగనీకుండా సులువుగా దున్నితే గదా మడక. కర్రును జానడు లోతు దిగనిస్తావు. అవి దున్న గలుగతాయా? నాక్ తెలవని మనిసివి నువ్వు." అని గూడా మొగుడ్ని చేతుల మోపున బాడుగ మడకకు పంపేది. తెల్లారి ఆరు గంటలకు కట్టిన మడక పన్నెండుకు విప్పాల. ఆ బక్కవి పది గంటలవతానే కయ్యిలో పడక వేసేసేవి. పదిమంది మొగోళ్ళు మడక దున్నతా వుంటే–ఒక్క రామచంద్రమ నాయుడి బక్కెద్దులు మాత్రం దున్నలేక కయ్యిలో పడక యేసేస్తుంటే అది ఎంత అగుమానం ఆయనకు? అని కర్రెక్క మదన పడింది. "నేను చెప్పినట్టు గాన వినుకుంటే మనం వొకరి కింద వొంగి బతక్కుండా, తలెత్తుకొని బతకచ్చు.

నువ్వు వింటే గదా! మానం చెడ్డ బతుకే నాకు గావాల!" అనింది మొగుడితో నిష్టూరంగా 'ఆ ఎద్దుల్ని కోతకు మాదిగోళ్లకు అమ్మేద్దాం. అవెందుకు దండగ?' అంటింది కర్రెక్క. అందుకు ఆరు నెలల నుంచి వొప్పుకోడు ఆయన. ఈ రకమైన తగరారులో వుండాది ఎద్దుల కత. అన్నం అంతా తిననిచ్చినాక, "నాకు నువ్వు ఎదురు చెప్పద్దు. అందులో తప్పేమి వుండాది! మూడు నూర్లకు మాదిగ యెంగటడు అడగతా వుండాడు గిత్తలను, కోతకు. రేపు నరకంలో నేనే శిచ్చ అనుబోగిస్తానులే" అని కర్రెక్క ఆ మాటా ఈ మాటా చెప్పి మొగుడ్ని ఎట్టనో ఒకట్ట వొప్పించేసింది.

## 5

"నీ వుచ్చ తాగబట్టి ఈ మాత్రం బతుకన్నా బతకతా వుండాం. తెల్లారీ సందేళా నీ కాళ్ళకాడ జేరి నీ గుండెల్లోకి నెత్తురు దిగేటట్టుగా, వొక్క చుక్క మిగల్నీకుండా అంతా పిండుకొనేసి, నీకు తినే అంత కసువెయ్యకుండా తాగే అన్ని కుడితి నీళ్ళు పెట్టకుండా నిన్ను ఎండగట్టి... అగ్గో ఈ మాత్రం కోకలు రైకలు కట్టుకొని నేనూ ఒక ఆడదాని నన్నట్టు వీదుల్లో తిరగతా వుండాను – కనాగష్టం ఊపిరి పెట్టుకొని!" ఇన్నూటా నలపై రూపాయల దాకా నిండుకొని వుండిన మట్టి వుండీని చేతిలో పెట్టుకొని, కర్రెక్క మనుసులో గాకుండా పైకే ఎనుముకు పటంగట్టి ఆమె మింద ఆమె నిష్టూర పోయి రోత పడింది.

బక్కెద్దులు అమ్మేసినాక, బీడుగా వుండిన గాట్లో ఒక్క కసువు పోచలేదు. పేరుకు కొట్టంలో కుడితి తొట్టి వుండాదే గాని దాంట్లో కడుగునీళ్ళు గాకుండా చేందబాయి  నీళ్ళు బిందెడు తేటగా వుండాయి. 'యింగ ఏ కొట్టంలోనన్నా వుండుంటే నువ్వెంత రాణివాసం చేసుందువే కూతరా!' ఎనుము వీపు మింద చెయ్యేసి మదన పడింది కర్రామె. అమ్మ ఇంట్లోకి వచ్చి ఎప్పుడెప్పుడు వుండీని పగలగొట్టి, అందులోని దుడ్డును ఎంచుతుందా అని కర్రెక్క కాళ్ళ కాడనే నిలబడి వుండాది అంజిలి. ఎనుము సూడిదిగా వుండినప్పుడే కర్రెక్క ఎన్నో ఆలోసినలు చేసి పెట్టుకొనింది. ఆ కొంపలో ఈ రోజుకీ పొంత మట్టిదే. ఒక పెద్ద ఇత్తలి అండాను కొనుక్కోవాలనుకొనింది.

అంజిలి చూస్తా వుండంగానే ఎదిగి మూల కూచ్చోదా? వచ్చేవాడు ఏమి జూసి దాని మెళ్ళో బొట్టు గడతాడు? ఇంట్లో ఈతాకు చాప తప్పించి శిరిచాప

వుండాదా? నొక్కులు బోయిన సత్తులోటా తప్పించి నిగనిగలాడే ఒక టీలు గలాసు వుండాదా? అన్నీ సమకూర్చు కొంటేనే గదా రేపు దానికి పెండ్లి? వుండీతో సఖా నట్టింట్లోకి వచ్చి దీపం పెట్టింది కర్రామె. అప్పుడు పగలగొట్టింది వుండీని. పది నిమిసాలు డబ్బును పిసుకులాడతా వుండి పోయింది. 'దొంగిలించి, ముచ్చిలించి, వాడికీ ఈడికీ కొంగు పరిచి సంపాదిచ్చిన డబ్బు గాదిది. ఎంతో మానంగా, నాయంగా, కన్న బిడ్డకన్నా ఎక్కువగా ఎనుమును జూసుకొని, సంపాదిచ్చిన డబ్బిది.' కర్రామె డబ్బు మింద అరిచేతులు పెట్టి అంజిలి కండ్లకు అద్ది, ఆమె కండ్లకు అద్దుకొనింది. కర్రెక్క ఎంత మానస్తురాలంటే, పాలాయన సహదేవ రెడ్డే, పాలడబ్బు – నెలది–కర్రెక్క చేతికి యిస్తా, "నీయట్టా మనిసి ఈ ఎండలు కాసే బూ మండలం మింద లేదు కర్రెక్కా!" అని నవ్వినాడు. ఒక బోడిగాడి దగ్గిర మాట ఎందుకు పడాల – అని కర్రెక్క నెల నాళ్ళుగా సహదేవ రెడ్డిని దగ్గిర పెట్టుకొనే పిండతా వుండాది పాలు. 'ఒకరి సేత మనం ఎందుకు యేలెత్తి సూపించుకోవాల? బతికినంత కాలం మానం మింద గుష్టి పెట్టుకొని గదా బతకాల' అని మనసును స్తిమితం జేసుకొనింది ఆమె.

కర్రెక్క నట్టింట్లో డబ్బును ముందర పెట్టుకొని వుండంగానే రామచంద్రమ నాయుడు వచ్చినాడు. ఆయన గిత్తలను అమ్ముకున్నాక మాలామాదిగోళ్ళతో కలిసి బావి పనికి పది దినాలుగా పోతా వుండాడు. 'కమ్మ పుట్టక పుట్టి, మాదిగోళ్ళతో కూలి పని జేసే రాత నీకెందుకు వచ్చింది సామీ!' – ఎంతో పొడగరైన మొగుడ్ని జూసి కర్రామె కండ్లలో నీళ్ళు గమ్మినాయి. 'ఈ కర్రిది సామాన్నిరాలుగాదు. ఒక ఆరునెల్లు కండ్లు మూసుకొని వుండు. ఎనుము వొట్టిపొయ్యేసరికల్లా రూకలు మిగలేసి, నీకు ఎద్దుల్ని పట్టియ్యకుంటే అప్పుడడుగు. మడక దున్నడం సులువే గాని, వొళ్ళంతా అదిరి పొయ్యే పనిగదా బాయి పని? నువ్వు ఎట్ట వోర్చుకుంటా వుండావు? అంత కష్టానికి నువ్వు ఎట్ట వోర్చుకుంటా ఉండావు?' అని మొగుడి కష్టాన్ని తలుచుకొని ఆమె బూమి లోతుకు కుంగిపోయింది.

మోకాళ్ళ సందున తలపెట్టుకొని వుండిన రామచంద్రమ నాయుడు, తల పైకెత్తకుండానే, "మరిచి పోయినావో? కర్మురాలా, నువ్వా సంగతి మరిచి పోయినావా ఏమి?" అనడిగినాడు. ఎనుము ఈని నెల అయింది. ఎనుము

ఈనిన రోజున్నే కర్రెక్క మొక్కుకొనింది – ఎనుమూ దూడా బద్రంగా వుంటే స్వామి కొండకు వచ్చి మొక్కు తీర్చుకుంటానని. కర్రెక్క, "ఇన్నాళ్ళూ ఎక్కడ కుదిరింది? నువ్వు చూస్తానే వుండావు గదా! మన మానం చెడ్డ బతుకు ఆ యెండి కొండ మింద చేరుకొని వుండే సాములోరికి తెలవదా ఏమి? నేనేమి మరిచిపోలా." ఈ ముప్పయి రూపాయలూ సామి కొండకు అని డబ్బులో నుంచి ముప్పై రూపాయలు ఎత్తి కడగాపెట్టింది. "రేపు ఆ మాదిగోళ్ళతో గూడా బావి పనికి పోకుంటే ఏం బోదులే, రేపు కొండకు పోయి మా అందరి తరపన మొక్కు తీర్చుకొని, దరిశనం జేసుకొని రా" అనింది కర్రెక్క గొంతును ఎంతో తియ్యంగా పెట్టుకొని. రామచంద్రమ నాయుడికి వొళ్ళంతా ఈపులు పడిపోయినాయి. చెప్పుకో గూడదు గానీ తొడలమింద వుండే యెంటికల్లో, మోచేతుల మిందా అంతా ఈర్లు పడిపోయినాయి. ఇదంతా మొక్కుకున్నాకే జరిగింది. 'ఎన్ని సమ్మచ్చరాలైయ్యిందో, స్వామి కొండకు పోయి. బోడిగుండు కొట్టుకొనియ్యాల. తల ఇశిలాయంగా, సుబ్బరంగా వుండును. వొంటికి ఎంతో తేలిక గదా!' అనుకొని రామచంద్రమ నాయుడు ఎక్కడ లేని కుశాల పడినాడు. ఈ లోపల అంజిలి దైర్నం జేసి అమ్మ మోకాళ్ళను అరిచేతుల్తో కొట్టి, "అమా అమా, బస్సోడు నాకు శార్జీ గూడా అడగడు కదా! మా అయ్యతో గూడా నేంగూడా కొండకు బోతానమ్మా." అని ముదిగారానికి పోయింది. 'అదీ నిజమే గదా. దానికి శార్జీ వుండదు. సామిని దరిశనం చేసుకుంటే దానికి పట్టిన దరిద్దరం అన్నా ఈడేరి పోవును' అనుకొనిన కర్రెక్క కూతురుతో, "అవితే నువ్వు కొండకు పోయి బోడి కొట్టుకుంటానంటే – నిన్నూ మీ అయ్యతో గూడా అంపిస్తా" అనింది. ఈ మాటతో కుక్కిన పేను మాదిరిగా గమ్మున అయిపోయింది అంజిలి. ఆ అమ్మికి ఎంతో లావుగా పొడుగ్గా జడ పడతాది. అమ్మ పోలికతో పుట్టిన అంజిలికి దండిగా వుంటాయి యెంటికలు. తీరుబాటు లేదు. నీకు జడలేస్తా కుచ్చునే దానికి – అని అంటా వుండినా, అమ్మ చేత పట్లబలంతాన రెండు జడలూ వేయించు కొనేది ఆ అమ్మి. ఆ జడల్లోకి చెండుమల్లి పూల కోసరం పరాయి వాళ్ల మిరప తోటల్లోకి పోయి రెండు పూలను తెచ్చుకొని, జడల్లో పెట్టుకొని మురిసి పొయ్యేది ఆ అమ్మి. దాని తెలివికి యిచ్చిత్ర పోయిన కర్రెక్క, ఆ అమ్మిని ఒళ్లో కుచ్చున పెట్టుకొని, "కూతరా! చెప్పిన మాట యిను. ఎప్పుడో సమ్మచ్చరం బిడ్డగా వుండినప్పుడు

– నీకు గుండు కొట్టించినాను. ఈ ఒక్కసారి గుండు కొట్టించుకో. మళ్లా సమ్మచ్చరంలో పెరిగిపోవా నీ యెంటికలు? దేముడి దగ్గరికి పోయిన నీబోటి పసిబిడ్డ యెంటికలతో రాగూడదమ్మా!" అని కూతుర్ని ఒప్పించింది.

ఆ మరసటి రోజు అబ్బాగూతురు కొండకు ఎలబారినారు. సందేళ మొగుడు వచ్చే సరికి – కర్రెక్క శానా పనులు చేసి పెట్టేసింది. మొగుడు యిచ్చిత్ర పోవాలని, ఆ వూరికి పక్కనే వుండే మచ్చేరెడ్డిపల్లికి పోయి రెండు బండ్ల కసువును– నూటా ఎనపై రూపాయలకు కొనేసింది. ఈ మాదిరిగా తెగింపు చెయ్యకుంటే లాబం లేదు. కొట్టంలో ఈనిన గొడ్డును పెట్టుకొని, దాని పాలు పిండుకొని అమ్ముకొని, చీమంత కసువు గూడా లేక వాళ్ళ కాళ్ళూ ఈళ్ళ కాళ్ళూ పట్టుకొని ఎన్ని రోజులని అగుమానం పడాల?– అని తెగింపు చేసుకొని కర్రెక్క కసువును కొనేసింది. 'మనమన్నా పస్తులుందాం. గొడ్డుకు మాత్రం కొదవ చెయ్యగూడదు' అనుకొని పది రూపాయలిచ్చి ఒక మూట తవుడు, ఇంకొక పదిరూపాయలు పెట్టి రెండు కేజీల శెనగ పిండిని– రైసు మిల్లులో కొనేసింది. మిగిలిన డబ్బుతో తొమ్మిదే తొమ్మిది రూపాయలు పెట్టి టీలు సామాను ఆయన దగ్గిర జనాద్రి నాయుడి కోసరం అని జెప్పి ఒక టెయిన్‌లెస్ టీలు కేరీరు కొనింది. దాన్ని జూసి జనాద్రి నాయుడు, "ఎట్లా కొంటా వుండినావు, వొకేసారి టీలు కేరీజీ కొనేసి వుండగూడదో," – అని యాష్ట పోయినాడు. "వొరే పెదబ్బా! ఒకేసారిగా ఎవురన్నా పడుకుంటారా! కుచ్చోని గదా పడుకోవాల. వుండు, ముందు కూచ్చుందాం, మళ్ళ పడుకుందాము" అని బుద్ధి మాటలు జెప్పి వాడి నిష్టూరాన్ని పోగొట్టింది. గిత్తలను అమ్మగా వచ్చిన మున్నూరు రూపాయిలు మాత్రం టంకు పెట్టిలో బద్రంగా వుండాయి. ఎన్ని కష్టాలు వచ్చినా వాటిలో కర్రెక్క యేలు పెడతాదా, ఏమి?

## 6

కమలమ్మ అదలాబదలా కర్రెక్క యింట్లోకి పోయి, "ఎలబారు, పొద్దు నాలుగు బారలు ఎక్కిపొయ్యింది గదా! యింక ఎలబారు. చద్ది కూడా తాగేస్తివే, యింగ తాంచారం ఏంటికి? మద్యానం అయినాక నా కయ్యలో అడుగుబెట్టి, వొక రోజుకంతా కూలి దొబ్బేద్దామని అనుకుంటుండావా ఏంది?" అని కర్రెక్కను తొందర బెట్టింది. అంత గబగబా మాట్లాడిన కమలమ్మను కర్రెక్క నిదానం

మింద చూసి, నిమ్మళమైన గొంతుతో, "ఈరోజు నీకు కూలికొస్తానని నేనెప్పుడు బాండు కాతికం రాసిచ్చినాను కమలక్కా?" అనింది.

ఈ మాటతో కమలమ్మకు నోటి మింద వాత వేసినట్టయింది. ఆమె మూతి నల్లంగా పెట్టుకొని "పొరబాటై పొయ్యింది కఱ్రామె, పొరబాటై పొయ్యింది. నన్ను వొదిలీ తల్లా, వొదిలీ. నిన్నా మొన్నా నువ్వు కూలిజేస్తా వుంటే నిన్ను కూలిదాన్ని అనుకొని బమతజెంది ఈ కూలికి పిలిస్తి. ఈ లోపల్నే నీ యింట్లో అలివిగాని సంపత వొచ్చి పడినట్టు నువ్వు కూలికి పోకుండా రాణివాసం జేస్తా వుండినట్టు తెలవక నీ గడప తొక్కి నిన్ను కూలికి పిలిస్తి. యింగెప్పుడూ పిలవను. యింగ గాని పిలిస్తే నీ ఎనుము పేడనూ, చెత్తనూ తోసిపోసే పొరక కట్టతో నన్ను వొంగన బెట్టి కొట్టు. వొస్తానమ్మా యిందిరీ గాందీ, వొస్తాను...." అని ఎగసుల్లిగా మాట్లాడేసి పోయింది.

'నేను మాట్లాడింది ఎట్టుండాది, అది మాట్లాడింది ఎట్టుండాది?' కమలమ్మ మాట తీరుకు కఱ్రెక్క మదన పడింది. 'నా వొంటికి వచ్చి వుండే సంకటం దానికి తెలుసునా? అదేమి నాశినమో రొండు దినాలుగా ఎఱ్రగుడ్డ పోతా వుండాది. మనిసిని ఎంత బలీనం అయిపోయి వుండా! కుచ్చోగుండలా, నిలబడగ వుండలా! నా వొళ్లు నా సోదీనంలో వుండాదా? ఒక పక్క నా వొంటిలో నుంచి నెత్తురు కాలవలు గట్టి పోతా వుండినా, ఆ రాణీ మాలినీదేవి కూలికి పిలిచింది గదా అని పోయి మునం పట్టాల్నా? థూ ఇది బలే దరిద్రపు బతుకు తల్లా!' అని కఱ్రామె బతుకు మింద 'థుపూ' అని రోత పడింది. 'థూపూ! వొకరి కింద వొంగి బతకడం ఎంత కనాగష్టం?' అనుకొని ఆమె ఇంటిలో మొన్నెప్పుడో అలికి వుండిన నేలమింద తుపుక్కుమని కేకరించి ఎంగిలూంచింది. 'మూడు మొకాలు తెలవని ఒక ముండమొకం వాడ్ని కట్టుకొని, వూరికే వుండకుండా వాడ్ని పక్కలో యేసుకొని జిల అణుచుకొని, వొకరికి యిద్దరు బిడ్డల్ని కని, వాళ్లని సాకలేక ఈ మానం చెడ్డ బతుకు బతికే కన్నా నేను నీళ్లులేని బాయిలో దూకి, నడుము లిరిగి చస్తే నన్నెవుడు అడ్డం పెడతాడు?' – అనుకొని ఆమెలో ఆమె అక్కుసునంతా యెళ్లబోసుకొనింది. 'నిన్న మాత్రం నా వొళ్ళు బాగుండిందా? అయినా తొడల సందన తడుపుబోత పెట్టుకొని, పచ్చని పైరులో వొంగి పని జేస్తినే! నా వొంట్లోకి వొచ్చిన ఈ

సంకటాన్ని నేను ఎవురికి జెప్పుకుందును? ఒక మొగుడికి పెళ్లాంగా యిద్దరు బిడ్డకు తల్లిగా నేనుండానే గాని, నాకెవురుండారు? కష్టం, సుకం యినే అందుకు నాకు దిక్కెవురు? నా అంత దీనురాలు ఎవురుండారు లోకం మింద? ఈ రోగాన్ని కమలతో చెప్పుకుంటే అది 'అయ్యో పాపం' అని అనునా? నా రోగం విని అది పకపకమని నవ్వి ఎగతాలి పడదా?' – ఈ మాదిరిగా ఆమె ఏది పడితే అది మనసులో అనుకొని దుఃక్కాన్ని తెచ్చుకొనింది.

మొగుడు మాదిగోళ్లతో బాయి పనికి పోగా, పిలకాయలు యిస్కూలుకు పోగా యింట్లో ఒంటిగా మిగిలిన కఱ్రామె ఎక్కిళ్లతో ఎగదీసుకుంటా ఏడుపు పాట ఎత్తుకొనింది. కొంచేపు తాలినాక ఆమె వొళ్లు దూదికన్నా సులకంగా తేలిక అయ్యింది. ఆమె మొకం కడుక్కొని, దిగులు దిగులుగా వుండే ఆమె మొకం మింద పెద్ద కుంకుమ బొట్టు పెట్టుకొనింది. దీగూడులో వేలెడు పొడుగు డబ్బా వుంటే, దాంట్లో నుంచి చిటికెడు వీబూదిని నోట్లో వేసుకొని, తిరుత్తణి కొండ వుండే తూరుపు దిక్కుకల్లా తిరిగి, చేతులు జోడించి దండం పెట్టి, "మహన్నబావా! ఈ బీదరాలి మింద ఎందుకు కత్తి గట్టినావు సామీ. నేనేదన్నా ఒక గతి అయిపోతే మళ్ల నా బిడ్డలకు, నామొగుడికి దిక్కెవురు తండ్రీ! కడంత గాలం నా సంసారంలో నన్ను వుండనియ్యి దేవరా! నాకీ ఎఱ్రగుడ్డగాని టకీమని నిలిచిపోతే నీ అగలాండంలో ఈ దీనురాలు కేజీ కరుపోరం యేసి నీ రుడం తీర్చుకుంటాను తండ్రీ!" అని ఆమె మనసులో గాకుండా పైకే అనుకొని చెంగఱ్రాయ స్వామికి మొక్కుకొనింది. ఇంక మంచయినా, చెడ్డయినా దేముడి మిందనే బారం అంతా యేసేసి ఆమె గడప దాటి వీదిలోకి వచ్చింది.

పదినాళ్ల కిందట ఆమె రెండు బండ్ల కసువు కొని, కొట్టంలో వుండే అటకలో కట్టలు కట్టలుగా కట్టి, బటువుగా పేర్చి పెట్టేసింది గదా! అటక మింద నుంచి ఒక కట్ట కసువు దించి ఎనుము ముందర వేసింది. ఇంక మద్యానం దాకా ఎనుము మొకం చూడాల్సిన పని లేదనిపించి, ఆమె కొట్టం నుంచి బయట పడింది. వాళ్ల కాళ్లూ, వీళ్ల కాళ్లూ పట్టుకొని అడుక్కున్న కసువు గాకుండా, సొంత కసువును ఎనుము ముందర వెయ్యడంలో వుండే దర్జాను, కుశాలను ఆమె అనుబోగించింది. కఱ్రెక్క – యింటికి దగ్గిర్లోనే వుండే చింతచెట్టు కిందికి వచ్చి నిమ్మళంగా నీడన కూచ్చొనింది. ఆమె మోకాళ్లు చాపేసి జారుముడిగా వేసుకున్న తల యెంటికలను విప్పేసి, అలివిగాని

యెంటికలను మెడ మింద నుంచి అట్టనొక పాయ, యిట్ట నొక పాయ ఎదాన విరబోసుకొని, రెప్పార్చ కుండా యెంటికలను చూసుకుంటా వుండిపోయింది. 'ఈ యెంటికలు గాన లేకుంటే నేనూ వొక ఆడదాన్నేనా? నా నాణ్యం అంతా ఈ యెంటికల్లోనే గదా వుండేది!' అని అనుకుంటా వుండగా ఆమె మొకం తేటగా అయిపోయింది. ఇంతలో మడి కాడా, యింటి కాడా ఏ పనీలేని తులిశమ్మ చింతచెట్టు కాడికి వచ్చి, కర్రెక్క తీరుబాటుగా వొక చోట రొండుగాళ్లూ పెట్టి వుండడం జూసి, "శెనుగులు తిని చేతులు కడుక్కున్నట్టు నీ పనే యిశిలాయంగా వుండాదే కర్రా! ఏ పొద్దయితే నీ యింటికి ఎనుము వచ్చి చేరిందో, ఆ పొద్దే నువ్వు లోకాన్నే కేరేజాట్ అనేసినావు గదా! లేకుంటే కూలి దొరక్క ఎంత అల్లాడి పొయ్యేదానివి! అటుమంటి దానివి.... పాపం కమల నీ యింటికొచ్చి, బొట్టుపెట్టి పిలిచినా... రాననేసి తెగేసినట్టు చెప్పేస్తివే... నీ దైర్నం తలుచుకుంటా వుంటే నాకు మూర్చ వస్తా వుండాదే కర్రిదానా! ఈ ఎనుమును జూసుకొని మనసల్ని దూరం చేసుకోబాక. యింగ ఆర్నెల్లకన్నా అది వొట్టిపోదా! మళ్లన్నా నువ్వు కూలికి పోవాల్సిందే గదా! ఈ లోగా అందరి సేతా రాణివని అనిపిచ్చుకోబాక" అని పుస్తకం చదివినట్టు చదివి గొంతు కూర్చొనింది. 'ఈ విడిచి పెట్టిన లంజితో మనం ఎందుకు నోరు జేసుకోవాల?' అనుకొనిన కర్రెక్క గొంతులోకి కోపాన్ని రానీకుండా జేసుకొని, నిమ్మళంగానే, "తులిశక్కా, తలకాయి వొకే నొచ్చుతా వుంటే... వొళ్లంతా తుమతుమా అని ఏమీ బాగ లేకుండా వుంటే... ఈరోజు కూలికి పోకుండా యింటి కాడనే మిగిలిపోతి" అనింది.

ఈ మాటలనినాక, ఆమె గొంతులోకి ఎక్కడ లేని అక్కసు తోసుకు రావడంతో, "నేను వొక పక్క చస్తా వుండినా, యింగొక పక్క కూలికి పోవాల్సిందే గదా! ఈ రోజు కూలికి పోకుండా వుండిన నేరానికి ఈ వూరోళ్లంతా కలిసి వడమాలపేటకు పోయి పోలీసోళ్లను పిలచకొచ్చి, నన్ను జెమినీలో తోసేటట్టుండారు. ఇదే బయంగా వుండాది నాకు–" అనింది ఎగతాళి నిండిన గొంతుతో. ఏమనుకొనిందో ఏమో తులిశమ్మ ఒక నవ్వును నవ్వేసి యింటికి పోయింది.

పది దినాలు తాలినాక, దేముడి మహత్యం వల్ల కర్రెక్కకు ఎర్రగుడ్డ నిలవనే నిలిచి పోయింది. ఆమె వొక రోజు తెల్లవారి పొంతడు నీళ్లు కాగబెట్టింది.

పిలకాయలకు తలంటి పోసింది. మొగుడ్ని గూడా ఆరోజు కూలి పనికి పోనివ్వకుండా, యింటి కాడనే వుండమని జెప్పి, ఒంటికి నీళ్లు పోసుకోమనింది. కర్రెక్క తలంటి పోసుకొని, యెంటికలను జారుముడి వేసుకోకుండా జడ వేసుకొనింది. ఆ రోజనంగా వూళ్లోకి మల్లెపూలాయన వస్తే నాలుగణాలు యిచ్చి వొక మూర కొనుక్కొని జడలో పెట్టుకొనింది. కర్రెక్క చాకలాయనకు ఒక యిరవై రూపాయలు మొన్నెప్పుడో అప్పుగా యిచ్చి వుండింది. కర్రామె, చాకలాయన దగ్గరికి పోయి, 'వొక అమిరికను జారిజట్టు చీర వుంటే, దానికి మేచీ అయ్యే రైక వుంటే ఈయి'మని అడిగితే ఆయన ఇచ్చినాడు. అవి తిరప్తి గుడ్డలు. ఆ కోకా రైకా కట్టుకొనింది కర్రెక్క. ఎనుము ముందర రెండు కట్టల కసువు వేసి, కుడితి తొట్టిలో చాటడు తవుడు, దోసిడు శెనగపిండి వేసి ఎనుమును విడిచి పెట్టి, "సందేల దాకా రాము, కడుపు నిండికి తాగు" అనింది. కర్రెక్క ఎనుమును కట్టేసి, మొగుడ్ని బిడ్డల్ను తోడుకొని సిలిమా చూసి వద్దామని తిరప్తికి ఎలబారింది.

కమలమ్మ – తులిశమ్మతో, "చూస్తివా దాని టెంపరమెంటు? అది కోక లోపల పావడ గట్టి, రైక లోపల లోబాడి వెయ్యడం చూస్తివా? తిరపతి కర్నాల యీదిలో వుండే లంజిలకూ దానికీ ఏమన్నా తేడా వుండాదా? అక్కో, దానికి సెంటు బూమి లేకపోబట్టి సరిపొయ్యింది గాని, అది వుండుంటే దాని దగ్గిర యిందిరీగాందీ నిలబడి సలాము చేసి వుండదా?" అని చెవి కొరికిందే గాని, కర్రెక్క తీరుజూసి గట్టిగా అనడానికి జంకేసింది.

## 7

పొద్దు గూట్లో పడబోతుండగా, కర్రెక్క గుండు చెంబుతో కొట్టంలోకి పోయి పొదుగు దగ్గిర గొంతు కూర్చొనింది. ఎనుము ఉరికురికి పడతా వుండాదేగాని రొమ్ముల్లో చెయ్యిని పెట్టనీయడం లేదు. ఎనుము చేష్టలను జూసి, "ఒసె, నీ ముండ మొకాన ఎండగాయ!" అనింది కర్రెక్క నవ్వు మొకంతో. ఎనుము దగ్గిర లాబం లేక, ఆమె యింట్లోకి వచ్చి, నిన్నా మొన్ననే కొత్త నులకతో అల్లిన మంచం మింద యెల్లాలకలా పడుకొని వుండిన రామచంద్రమ నాయుడుతో, "మన కోతిది సందేళపూట పాలు ఎగరేసేసింది" అని చెప్పింది. ఆ మాట విని, రెండు నిమిసాల దాకా గమ్మునే వుండి, మళ్ల ప్రయాస పడి

నోరు తెరిచి, "ఎనుము ఈని మూడు నెలలు కావస్తా వుండాది గదా! ఇన్ని దినాలు సందేళ పాలు పిండిందంటే మేలే అనుకో!" అన్నాడాయన.

మొగుడు నోరు తెరిచి ఆ మాత్రం మాట అనినందుకు కుశాల పడిన కర్రెక్క, "చూడబోతే నువ్వు జెప్పిందే నిజ్జింగా వుండాది. మన ఎనుము సంపర్దాయికం కలిగిన గొడ్డు గాకపోతే, మూడు నెలలుగా శేరుపాలు లెక్కన సందేళ సందేళ పిండునా ఏమి?" అనింది. పెళ్లాం ఒద్దికగా వుండడం జూసి రామచంద్రమ నాయుడు, "లెక్కా పక్కా నాకు చెప్పేది లేదో? తొలినెల ఏమో – ఎనుముకు కసువూ తవుడూ అని కొంటివి. ఈ రెండు నెలల దుడ్డూ దుగ్గాణి ఏం జేస్తివి? అగ్గో, యిట్ట వచ్చి కూర్చోని కొంచెం యిలావరిగా జెప్పు." అని మంచం మింద జరిగి పెళ్లానికి చోటు చూపించినాడు.

సంసారం గురిచ్చి ఇంత ఆత్రం చూపిస్తా వుండే మొగుడ్ని జూసి కర్రెక్క పదారేండ్ల పిల్ల మాదిరి చురుగ్గా అయిపోయింది. ఆమె వక్క కొరికినంత సేపటిలో మంచం మింద వాలి, మొగుడి నడుముకు ఆ పక్కన వుండే కోడుమింద చెయ్యి వేసి, మొగుడి కండ్లల్లోకి చూస్తా, "పెండ్లయి పదీ పదైదు యేండ్లు అవతా వుండాది. ఎప్పుడూ లెక్కలడగనోడివి, ఈ రోజు ఏమబ్బా పూస గుచ్చినట్టు లెక్క జెప్పమంటా వుండావు? ఈ కర్రిదాని మింద రామచంద్రమ నాయుడికి నమ్మకం పొయ్‌నట్టు వుండాది! అవును గదా?" ఈ మాటలకు ఎలిక వడ్లగింజ కొరికినట్టుగా నవ్వీ నవ్వనట్టు వుండి, రామచంద్రమ నాయుడు మొకాన్ని అట్ట తిప్పుకొన్నాడు. "ఈ సందేళ పూట నేను నీతో యాసండానికి దిగలేదు" అన్నాడు నవ్వి.

యింక ఎగతాళికి పోతే మొగుడు మాట్లాడడం మానేస్తాడని జంకిన కర్రామె, "పియ్యి తినో, పిడకలు యేరో... నా మానం చెడ్డ బతుకును నేను బతకబట్టి... ఈ రెండు నెలల్లో మున్నూరు రూపాయలను సిరమానంలో వుంచితిని. గిత్తలను కోతకు అమ్మంగా వచ్చిన దుడ్డు మున్నూరు రూపాయలు, ఈ పాల దుడ్డు మున్నూరు రూపాయిలు... మొత్తం ఆర్నూర్లు... ఇప్పుడు తెమ్మంటే యిప్పుడు తెచ్చి చూపిస్తా నీకు." ఈ మాటలంటానే కర్రెక్క టంకు పెట్టిని తెరిచి, మద్యన వుండిన ఒక పసుపు రంగు ప్లాస్టీకు కాతికం మూటను మంచం కాడికి తెచ్చింది.

ప్లాస్టీకు కాతికంలోని డబ్బును అరిచేత్తో తీసి నవ్వతా మొగుడి ఎదాన పెట్టింది. చక్కల గిల్లి పెట్టినట్టుగా రామచంద్రమ నాయుడు అదే పనిగా పకపకమని నవ్వడం మొదలు బెట్టినాడు. "నువ్వు అల్లిం తినడానికి మా యింటికి వచ్చినప్పుడు నవ్వినావు యింత నవ్వు. మళ్లా యిప్పుడు నవ్వతా వుండావు. నీ మొకాన ఈ మాత్రం నవ్వుజూసి ఎన్నేండ్లు కావస్తా వుండాదో గదా, నా యెర్రి సామీ!" అనింది కర్రెక్క.

కర్రెక్క – యేలెడు పొడుగు యెంటికలు వుండిన – మొగుడి తలలో వేళ్లను దూర్చింది. ఇదే సమియంలో తల గీరుకుంటా అంజిలి యింట్లోకి వచ్చింది. కూతుర్ని చూసి ఒక మాట గూడా అనకుండా, మొగుడితో మాట్లాడను, నవ్వనూగా వుండిపోయింది కర్రెక్క. ఈ అగుమానంతో ఒళ్లంతా రగిలి పోయిన అంజిలి, దైర్నం జేసి, "అబ్బ, ఓయబ్బ, మొగుడూ, పెళ్లాలూ బలే యిచ్చుకుంటా వుండారే. రేపో ఎల్లుండో పండగ వస్తా వుండాది. కొంచెం దాచి పెట్టుకోండి నవ్వును. అంతా ఈ పొద్దే నవ్వుకొనేసేరు!" అనేసి ఆ పిల్ల గడప మింద కూర్చొనింది. రామచంద్రమ నాయుడు, "కుశాల యింక జాలులే." కడగా తలు– అనేసి మంచం మింద నుంచి పైకిలేచి బజన గుడి కాడికి వచ్చి కూచ్చున్నాడు.

ఆయన బజన గుడి కాడికి వచ్చే సరికే, అక్కడ ఉత్తర రాజ్జిం నుంచి అమ్మకానికి వచ్చిన కోడె దూడలు జతలు జతలుగా వుండాయి. ఒక్క గంటలో జరగాల్సిన పనంతా జరిగి పోయింది. ఆ దూడలు పుట్టి సమ్మచ్చరం మింద రెండు మూడు నెలలు అయ్యుంటాది.

ఒకటి ఒకటిన్నర సమ్మచ్చరం మేపితే అవి గిత్తలు గాకుండా ఎద్దులవతాయి. 'దున్నితే అటుమంటి ఎద్దులతో గదా మడక దున్నాల!' అనిపిస్తా వుండాది రామచంద్రమ నాయుడికి. అందుకే అచ్చిరాలా ఆరునూర్ల రూపాయలకు ఆ దూడలను పట్టేసినాడు. అవి కొట్టంలో గాడి ముందర చెరొక పక్కా వుంటే ఇంటికే కళగా వుండాది. ఇంటి ముందర కోడె దూడలను జూసి జనాద్రి నాయుడి కుశాలకు పట్ట పగ్గాల్లేకుండా పోయినాయి. 'ఏ అగచాట్లో వొక అగచాట్లు పడి, సమ్మచ్చరం మేపితే... మడకకు అంది వస్తాయి. మళ్ల ఆయన బాడుగ మడక దున్నతా పొద్దు పోగొడతా వుంటాడు. లేకుంటే ఈ కూలి

పనిలో సగానికి సగమై పోతాడు' అనిపించి కర్రెక్కకు బలే సుకంగా వుండాది ప్రాణానికి.

మిట్టూరికి రెండు పర్లాంగుల దూరంలోనే ఒక గుట్ట, అడివి వుండాయి. రామచంద్రమ నాయుడికి కోడె దూడల్ని అణవరించడం కష్టం అయిపోయింది. ఎనుము కోసరమని కొనిన కసువు గూడా అయిపోవచ్చింది. మళ్లా రెండు బండ్లు కసువు కొనాల్సిందే. ఈ బాద పడలేక ఆయన తెల్లవారి లేచి కోడె దూడలను అడివిలో తోలేసి రావడం మొదలు బెట్టినాడు. ఆయన కూలికి పోయి సందేళ యింటికి వచ్చే సరికి దూడలు గూడా అడివిలో బోదగడ్డి, మదన కట్టి మేసి యింటికి తిరిగి వస్తా వుండాయి. ఆ కోడెదూడల వైబోగం జూసి, ఒకరోజు కర్రెక్క, "ఏమే, యింగటాల నుంచి ఎనుమును గూడా దూడలతో పాటు అడివిలో తోలేసి వస్తే పోదా? ఎందుకు అది పొగులు పొద్దల గూకునా ఈ కొట్టంలో పడి అగోరించేది?" అనింది మొగుడితో. రామచంద్రమ నాయుడు, "నేనేమన్నా దాన్ని అడివి దాకా మొయ్యబోతానా? నువ్వు తోలేసి రమ్మంటే తోలేసి వస్తా" అని ఆ రోజు నుంచి ఎనుమును గూడా అడివిలో తోలేసి రావడం ఆరంబించినాడు.

అంతకు ముందు ఎనుమును అడవిలో తోలడమంటే కర్రామె బయపడి చచ్చేది. వూరోళ్లు గూడా చానామంది గొడ్డూగోదను అడవిలోకే తోలేసి వస్తారు. 'అన్ని గొడ్లల్లో మన గొడ్డు ఏం మేస్తిందిలే. యిది ముందే బెదురు గొడ్డు. మన మాదిరిగానే అదీ మానస్తురాలు. కొట్లాటలు దానికి తెలుసునా? ఏ ముండమోపి గొడ్డన్నా పొడిస్తే, మళ్ల ఏ దేముడి మింద పడి నోరు కొట్టుకోవాల?' అని బయపడేది. కానీ, ఆ ఎనుము అయిదారు రోజుల నుంచి అడివికి బాగా అలవాటు పడిపోయిన దాని మాదిర, కడుపార మేసి రావడం జూసి కర్రెక్క కుశాల పడింది.

పొద్దు గూట్లో పడే సరికల్లా, యింటికి వచ్చే ఎనుము ఒక రోజు కూటేళ అయినా రాకుండా వుండింది. అమ్మ యాతన జూసి వాళ్లల్లో వాళ్లు గూడా కొట్టుకోవడం మానేసినారు జనాద్రి నాయుడు, అంజిలి. తులిశమ్మను లాంతరు అడగడం సయించక, "పదాం పద, అడవిలోకి బోయి యెతకదాం!" అనింది కర్రెక్క మొగుడితో. ఈ మాటను పక్కింటిలో నుంచి వినిన తులిశమ్మ, "యింక

యెతికేది ఏముండాది? ఎట్ట వొచ్చిన గొడ్డు  అట్టనే పోయింది" అనింది. యింగొక పక్క కమలమ్మకు యిదంతా ఒక యేడికగా వుండాది.

"దీంతో దీని రెట్ట మదం అణిగినట్టే. ఇన్నాళ్లూ ఆపీసర్లకు లేని లెవ్వలు చేసినావే, ఇంగ జూడు నీ కత–" అని కమలమ్మ నవ్వతానే అనింది. ఈ మాటలకు కగ్రామె కుమిలి పోయింది. ఆమె మళ్లీ మొగుడ్ని, "కదులు, పూడుబాము మాదిర ఎందుకు మెదలకుండా ఉంటావు సామీ, కదులు!" అని మొగుడ్ని తొందరబెట్టి అడవికి ఎలబారింది.

కోనలో బాయి దాకా మొగుడూ పెళ్లాలు పోయినారు. ఎక్కడా ఎనుము జాడే కనబడ లేదు. 'ఆ ఎనుము అండ జూసికొని ఎంత మంచి బతుకు బతికినాం. కూర కర్చూ, చింతపండు కర్చూ తగ్గిపాయ. అంత కూట్లో మజ్జిగ బోసుకొని తాగేస్తే కడుపు ఎంత నిమ్మళ పడేది? కాలు నొచ్చినా, కన్ను నొచ్చినా కూలికి పోకపోయినా ఎబ్బిడి లేకుండా వుండింది! ఈ నాలుగు నాళ్లూ ఎంత మానంగా బతికితి! ఏమి దేముడా, నా బతుకును జూసి వోర్చలేదా నువ్వు' అని మదన పడతా అడివంతా తిరిగింది కగ్రెక్క. ఆ అడవి పక్కన్నే దుర్గసముద్రం, కూపుచంద్రపేట వుండాయి. 'తెల్లారి ఆ వూళ్లల్లోకి పొయ్ కనుక్కుంటాలే!' అని దైర్నం పలికినాడు రామచంద్ర నాయుడు.

మొగుడూ పెళ్ళాలూ యింటికి వచ్చే సరికి– ఎనుముది కొట్టంలో వుండాది! కగ్రెక్క కొట్టంలో వుండిన ఎనుమును చూసి నీళ్లు నిండిన చెరువు మాదిర నిమ్మళ పడింది. అంత కూడు తినేసి పడుకున్నారు ఆ అర్ధరాత్రి పూట. కగ్రెక్కకు దరిద్దరపు కలలన్నీ వచ్చినాయి. అడవికి మేతకు పోయిన ఎనుమును పురుగు నాకేసింది. ఎనుము కడుపు వుబ్బేసుకొని చచ్చిపోయినట్టుగా కలొచ్చింది. బలంతాన నిద్దర లేచిన కగ్రెక్క అక్కు పిడచ గట్టక పోయింది. ఆమె కొట్టంలోకి వచ్చి చూస్తే ఎనుముది పడుకొని నెమరు వేస్తా వుండింది.

కగ్రెక్క ఆ తెల్లారి జాము పూట, పాల డబ్బుతోనే కొనిన ఒక టీలు ప్లేట్లో కరుపోరాన్ని పెట్టుకొని వెలిగిచ్చింది. ఎనుముకు ఆరతి పట్టి ఇంట్లోకి పోయి ఆ ఆరతిని – పిలకాయలను, మొగుడ్ని నిద్దర లేపి కండ్లకు అద్దుకోమనింది.

# సుందరమ్మ కొడుకులు



నా విస్తరాకు
కె.ఎన్.వై. పతంజలి...

# సుందరమ్మ కొడుకులు

రాత్రంతా గాలి బలే తోలింది. ఆ గాలికి చినుకులు గాని రాలి వుంటే– ఇక్కడ పడవలసిన చినుకు అక్కడ పడి వుండును. నిద్ర లేచిన నీల ఈ మాదిరిగా అనుకుంటా వుండంగానే మళ్లా గాలి తోలింది. ఈదిలోని దుమ్ము రేగి పక్కనే బండపై పడుకొని వుండిన ఆమె దుప్పిటి పైన రాలింది. దుమ్ము రేగినప్పుడే, ముక్కుల గుండా, తెరిచి వుంచిన నోటి గుండా నిండికి గాలి పీల్చబోవడంతో ఆమెకు దగ్గు రాబోయింది. దగ్గొచ్చినపుడు దగ్గేసి వుంటే ఆమెకు నిమ్మళంగా వుండును. సమాలించుకున్నందు వల్ల ఎదలో ఆమెకు వూపిరాళ్లా. కొంచేపటికి తేరుకొని, దుమ్ముతో నిండిన దుప్పిట్ని శబద్దం జేస్తా యిదిలించకుండా, మెల్లంగా తీసి వారగా పెట్టి గొంతు కూర్చొనింది.

బండ పక్కన్నే నులక మంచం వేసుకొని ఒళ్ళు తెలవని నిద్రలో వుండిన సిద్దమ నాయుడ్ని జూసి, 'పెళ్ళాన్ని పక్కలో యేసుకొని ఒకరికి యిద్దరు బిడ్డల్ని కనడం తెలిసింది, ఈ మొగోడికి! లోకాన యింత గాలి తోలతా వుంటే – ఈ మనిషి అమ్మకూ అబ్బకూ చక్కంగా పుట్టినోడైతే – యింత మొద్దు నిద్దర పోవునా? ఏ జలమలో ఏ పాపం జేస్తినో ఈ జెలమలో అనుబోగిస్తా వుండాను.' అనుకొని మదన పడింది.

సిద్దమ నాయుడి మంచానికి ఎగుదల ఒకే మంచం మింద కేశవులు నాయుడు, ఆయన పెళ్ళాం సరోజా – దిగులూ బయమూ లేకుండా నిద్రపోతా వుండారు. 'వాళ్ళకేమి? ఒక బిడ్డా, ఒక బీరకాయా! పిలకాయల్లేని ఆలీ మొగుడికి ఆయైన బతుకు గదా! తెల్లారి నిద్దర లేచీ లేవంగానే నా యిద్దురు బిడ్డలూ పండ్లు తోముకుని– అమ్మా, చద్దికూడు – అంటా నా కాళ్ళకాడ చేరతారే! ఈ జంజికాటం ఆ సరోజకు లేదు గదా!' – నీల తిన్నె మింద నుంచి కిందికి దిగింది. 'కోళ్ళు గూడా కూయలేదే! యాళ ఎంతయిందో ఏమో!' నని ఆమె పైకి ఎగజూసింది. చుక్కలను జూసి యాళ కనుక్కోవడం ఆమెకు చేతనైంది గాదు.

'ఇంక ఒక్క నిమిసం కూడా యిక్కడ తాంచారం చెయ్యిగూడదు. ఈ లోపలనే సరోజగాని నిద్దర లేచిందో, ఇందాకా తోలిన గాలి అంతా ఏట్లో

పోసినట్టే. చింతచెట్టు కాడికి తొందరగా పోవాల'. అనుకొని ముందుకు అడుగేసింది నీల. గొడ్ల కొట్టంలో అత్త సుందరమ్మ – నీల యిద్దరు బిడ్డల్ని చెరొక పక్క వేసుకొని గురక పెడతా వుండాది. కొట్టం దాటుకుని తిరిగీ మళ్ళీ చూడకుండా నడవబట్టింది నీల.

ఎండాకాలం గావడం వల్ల ఉక్కకు బయపడి వూళ్లో జనమంతా ఈదుల్లోనే నిద్దర పోతా వుండారు. సూడబోతే అందురూ మొద్దు మొకాలుగానే వుండారు. ఒక్కరన్నా మేలుకోని వుండుంటే, 'నీలా, యాడికి, యింత రాత్తిరి పూట?' అని అడిగి వుండరా?

ఊరి బైటకు వచ్చిన నీలకు – ముందర కాళ్ళకు బందాలు వుండిన – ఒక గాడిద చీకి కంప చెట్ల కింద చేరి, ఎగురుకుంటా కాయల్ని ఏరుకొని పరపరమని తింటా కనిపించింది. 'దీనికి బలే ఆత్రంగా వుండాది. ముందర కాళ్ళకు బందాలు వుండినా ఎగురుకుంటా వచ్చింది. నా బోటిదే!' అనుకొని పొదుగ్గా గాలి వొదిలింది. బాటకీ పక్కా, ఆ పక్కా వొట్టి చీకి చెట్లే. గాలికి చెట్లలోనుంచి ఎండు కంపలు రాలి బాట నిండా వుండాయి. వాటిని తొక్కకుండా నడవడం నీలకు కష్టంగా వుండాది. మబ్బు మబ్బుగా వుండడం వల్ల కంటికి కంప పుల్లలు రీతిగా కనిపించి చావడం లేదు. 'ఏ నిమిసంలో ముండ్ల కంప మింద అడుగేసేస్తానో' అని బయ పడతా వుండంగానే నీల ముల్లు తొక్కేసింది. గుదికాల్లో లోతుగా దిగబడి పోయింది ముల్లు. 'అమ్మా' అని ముల్లు గుచ్చుకున్న కాలును చివక్కన పైకి లేపే సరికి అరికాలు పిర్రను గుద్దుకొనింది. దీంతో అంతకు ముందెప్పుడో వేసుకొన్న జుట్టుముడి కూడా వూడిపోయింది.

నీల ముల్లును బలంగా పెరికేసింది. నెత్తురు కారి చేతికి మందంగా తడి తగిలింది. జుట్టు ముడేసుకుంటా మళ్లా నడవబట్టింది. 'లోబికి నాలుగందాలా నష్టమే – అంటే యిదే గదా! ఈ ముల్లు నెప్పి నాలుగు దినాలు నన్ను వదులునా?' అనుకొనింది.

మళ్ళ పది బారలు నడిచే సరికి చింతచెట్టు వచ్చేసింది. చెట్టుకు ఎడం పక్క ఇందాకా నీల నడిచి వచ్చిన బాటే. కుడి పక్కన రెండు పేడ దిబ్బలు. ఒకటి నీలది. ఇంగొకటి తోడకోడలు సరోజది.

నీల చెట్టు కిందికి రాంగానే అరికాళ్ళ కింద పడి చింతకాయల బొప్పెలు చిట్లిపోయి పళ పళమని శబద్దం జేసినాయి. ఆమెకు చెట్టుకింద బాటలో గాలికి రాలి పోయిన చింతకాయలు కంటికైతే కనిపించలేదు. వొంగి చేతుల్తో తడిమితే కాయలు తగలడం మొదులుబెట్టినాయి.

నీల తొలుత చెట్టు కింద బాట అంతా ఒకటికి రెండుసార్లు వొంగొని కాయలు ఏరుకొని ఒళ్ళో వేసుకొనింది. మళ్ళ ఆమె దిబ్బల మిందికి చేరింది. దిబ్బల నిండా పేడ, చెత్త, కసువు వుండడంతో – వీటి మద్య బిత్తేడేసి చింతకాయల జాడ తెలవడం లా. దిబ్బల మిందికి ఎక్కిన నీల అరికాళ్ళకు మెత్తంగా పేడ తగలతా వుండాదేగాని ఆ చెత్త నడుమ పడి చింతకాయల నలిగిన శబద్దం కూడా వినిపించడం లేదు. దిబ్బల మింద లాబం కనిపించక పోవడంతో – దిబ్బకూ దిబ్బకూ నడుమ వుండిన బారడు ఖాళీ జాగాలోకి దిగి నీల కాయల్ని ఏరుకొనింది. నీల ఒడి బరువెక్కింది. చాటడు చింత కాయలైనా వుంటాయి. మళ్లా నీల కాలిబాట చేరింది. బాటలో తిరిగే కొద్దీ ఒకటీ అరా కాయలు కాళ్ళకు తగలతానే వుండాయి. నీలకు చింతచెట్టును వొదిలి రావాలంటే మనసుకు నెప్పి తగిలింది. 'ఆశకు పోతే గోచి అడ్డం వస్తింది. ఆశకు మితం వుండాల గదా' అనుకొనింది. 'ఒకవేళ సరోజ ఈ పాటికి నిద్ర లేచి – తిన్నె మింద నేను లేనిది గమనించి వుండాల. ఓయమ్మో, శిగమెత్తిన ఆడదాని మాదిరి మొగుడ్ని కూడా తోడుకొని చింతచెట్టు కాడికి పరిగెత్తతా రాదా? తీరా అది వొచ్చి నా ఒడి జూస్తే – మళ్ళేమైనా వుండాదా? కలిగ్గం మునిగిపోదా!' – అనిపించగానే నీలకు ఒళ్ళంతా బరువై బయం వేసింది. 'సరోజ నిద్దర లేవక ముందరే మనం తిన్నె మింద వుండాల.' అనుకుంటా నీల వూరికల్లా నడిచింది.

'మనం ఎరగనోచ్ అన్నట్టుగా యింటికి పోయి సీమ చిటుక్కుమనకుండా తలుపు తీసి యింట్లో చింతకాయల్ని కుమ్మరించేసి మూడో కంటికి తెలవకుండా తిన్నె మింద చేరి దుప్పిటి కప్పుకోవాల. అది – సరోజ – నిద్దర లేచి చింతచెట్టు కాడికి ఎలబారేది జూసి మనమూ లేచి దాంతోపాటుగా యదాప్రకారం రోజూ మాదిర చింతచెట్టు కాడికి రావాల. బాటలో ఒకటికి పన్నెండు సార్లు తిరిగినా పిడికిడు కాయలు దొరికి చావవు. మనమే పొద్దుగ్గా గాలి వొదిలి – చింతచెట్టుకు దగ్గర్లో వుండే మాదిగి పల్లె నా సవుతులు ఒక్క కాయ లేకుండా ఏరుకునేసినారు,

ఏ రాతిరి పూటో వొచ్చి! వాళ్ళ నోళ్ళల్లో గండుమల్లి పుండు పుట్టదా – అని తిట్టాల. లేకుంటే దానికి డవుటు రాదా? అంత గాలికి యిన్ని కాయలేనా? – అని! – లోపల్లోపల ఇట్లా అనుకుంటా నడుస్తుండగానే చీకి కాయలు తింటా వుండిన గాడిద దగ్గరికి వచ్చేసింది నీల. ఇల్లు దగ్గర పడే కొద్దీ ఆమె గుండెలు వొడికన్నా ఎక్కువగా బరువైనాయి.

మంచం మింద మొగుడి పక్కలో పడుకొని వుండాల్సిన సరోజ – యీది వార ఒంటేలు పోసుకుంటా కనిపించడంతో నీలకు గబీమనిపించింది. 'యిప్పుడేం జెయ్యను బగమంతుడా!' – నీల గుండెల్లో జెరం గాసింది. 'అది వూలోళ్ల చెట్టు కాదు గదా. నా మొగుడు సంపాదించిన చెట్టే గదా!' అనే దైర్నంతో నీల ముందుకు అడుగేసి తలుపు తీసింది.

ఎక్కడో తట్ట కింద కోడి రెక్కలు కొట్టుకొని కూస్తుండగా, "సిగ్గా సింగారం లేని మనిసి ఏం మనిసి? థూ థూ" అంటా – సరోజ గొంతులో ఎక్కడ వుండిందో ఏమో కణికెడు ఎంగిలి కేకరించి వూంచింది. సరోజ కేకరింపు కోడి కూతకన్నా ఎక్కువ శబద్దం జేసింది.

ఒడిలోని చింతకాయల్ని వెదురు దబ్బలతో అల్లిన తట్టలో కుమ్మరిస్తా వుండిన నీలకు – తోడికోడాలి మాటలు సూదిపోట్లయినాయి. సరోజ కేకరించి రెండు నిమిసాలైంది. ఏమీ అనకుండా తప్పు చేసిన దాని మాదిరి తలొంచి అణిగి వుండడం – నీలకు అగుమానంగా తోచింది. 'నాకు తెలిసినంత సిగ్గా ఎగ్గా ఈ సిత్తూరు జిల్లాలో ఏ ఆడదానికి తెలుసు?' అనిపించి నీల మనుసుకు కష్టంగా తోచింది.

"నోటికి తగిన కవళం ఎత్తుకో. నోరు పారేస్కో వద్దు. నేను సంసారి ఆడదాన్నే. నన్ను నా మొగుడు యిడిసి పెట్టీలేదు" అంటా వచ్చి నీల బండ మింద కూర్చోలేక పడుకొనింది.

కోపంతోనో, అక్కుసుతోనో మంచం మింద కూర్చుని వున్న సరోజ వొదులుతున్న వూపిరి శబద్దం నీలకు వినిపిస్తా వుండాది.

"ఆ చింతచెట్టు నీ మొగుడే దొబ్బి సంపాదించలా. నా మొగుడు గూడా నీ మొగుడి నాయినకు పుట్టినోడే గాని గంగిరెడ్డిపల్లె మాలోడికి పుట్టలా. ఆ

చెంతచెట్టు మింద నీ మొగుడికి ఎంత అక్కు వుండాదో నా మొగుడికీ అంతే అక్కు వుండాది. అటుమంటి చెట్టు కాడికి తెల్లారినాకనో తెల్లారక ముందో యిద్దరం ఒకటిగా పోయి కాయలేరుకొని, చెరి సగం పంచుకోవాల. అదీ పద్దతి, మామూలు. అంతేగాని, ఇట్టా దొంగపనులు సమసారం జేసే ఆడవి చెయ్యగూడదు." సరోజ కోపాన్ని అణసర చేసుకోలేక పుల్ల యించి నేల వేసినట్టుగా మాట్లాడింది.

పెళ్ళాం మాటలకు కేశవులు నాయుడు మేలుకున్నాడు. "పరగడుపున్నే ఇదేం రచ్చ?" అని ఆయన కసురుకొన్నాడు. "చింతచెట్టును నువ్వు సంపాదించ లేదంట. నీల మొగుడే మెద్రాసులో విత్తు తెచ్చి, డిల్లీలో నుంచి బండ్లతో నీళ్లు తోలకొచ్చి గొర్రెకూ మేకకూ అందకుండా నీళ్ల కవతల యింగలాండు వుండాది జూడు – ఆడ నుంచి కంప తెచ్చి చెట్టు సుట్టూరా నాటి కాపాడినాడంట. అందుకూ ఈ రచ్చ!" – యాడలేని కోపం తెచ్చుకున్న సరోజ, మొగుడుతో జోరుగా అనింది.

నీలకు వొళ్లంతా తేలికై కండ్లల్లో నీళ్లు గమ్మినాయి. 'దానికీ దాని మొగుడికీ సమ్మచ్చరమంతా మఖా అవితే నాలుగీశల చింతపండు! నేను బిడ్డల తల్లిని గదా! అదీగాక ముసిల్ది గూడా నా పంచన్నే పడి వుండాది గదా. చారు కర్చ్చా, కూర కర్చ్చా నాకెంత! దానికెంత? ఏదో బుద్దుండో బుద్ది లేకనో – ఈ పని చేసినానే అనుకో. ఇంత రగడ జెయ్యాల్నా! 'దరిద్రప నా సవితి. ఏదో చేసింది. చూసీ చూడనట్టు పోదాం. లేదా ఒక మాట అని గమ్మున వుందాం.' అని అనుకొనిందా? ఈ ఆడోళ్ల తగరారును మొగోళ్ల దాకా తీసక పోతా వుండాది గదా!

సరోజ నోరు పడే తీరును విని నీలకు రేగిపోయింది. అప్పుడామెకు మంచీ చెడ్డా తెలవకుండా పోయింది. "ఈ రోజు చేసింది నేను దొంగతనమే, కాదన్ను. మొన్నా మొన్నా నువ్వు నడిజామున్నే లేచిపోయి ఏరుకొచ్చినావు గదా! అప్పుడు నేను చూడలేదనా! మానస్తురాల్ని గాబట్టి, మనలో మనకెందుకు జగడాలు, చుట్టూ పక్కా వింటే నవ్వులాడుకుంటారనే గమ్మన వుండినా." అనింది నీల. ఈ మాట అనడానికి నీలకే మనసొప్పింది గాదు. కానీ సరోజ నోరణచడానికి ఈ మాత్రం మాట అనినా తప్పు లేదనిపించింది.

ఈ మాటలు నీల నోటి నుంచి వినిన సరోజ జాతరలో గొర్రెను కొరకబోతున్న గొల్లాయనకు మాదిరి – ఉగ్రం వచ్చింది. ఆమె కోపంతో గస పోసుకుంటా, "పాపం పుణ్యం తెలవకుండా మాట్లాడొద్దు. పరగడుపున్నే బొంకొద్దు. నేనంటే గొడ్డు ముండను. నువ్వు నా మాదిరి వుత్త మనిసివి గాదు. నోటికి తలుపూ, దాలముందరమూ లేవు గదాని నోటిని యిష్టం వచ్చినట్టు యిడిచెయ్యొద్దు, ఇట్టా కానీ గానీ మాటలు మాట్లాడినావంటే నీ ఇద్దురు బిడ్డలు నీ మొకాన వుండరు!" అని శాపం పెట్టింది.

సరోజ బిడ్డల ప్రస్తాపన ఎత్తి శాపం పెట్టడంతో నీల మనిసి గాకుండా పోయింది. ఆమె వొళ్లంతా కోపంతో వొణికింది.

"యెంటికతో సమానమైన చింతకాయలకు – నా బిడ్డలు నా మొకాన వుండరా! ఎంత మాట అన్నావే కర్మురాలా! నన్ను లచ్చ అను యినుకుంటా, నా బిడ్డల మాట ఎత్తితే వూరుకోనే గొడ్డు నా సవితీ! నేనిప్పుడు ఏరుకొచ్చిన చింతకాయల్లో సగం తీస్కో. అంతేగాని నా బిడ్డల ప్రస్తాపన నీకేలనే ఈనపు ముండా! నా బిడ్లకూ నీకూ ఏమి సమందం వుండాదే? ఏ దినుమన్నా నా బిడ్లను పిలిచి నీ చేత్తో అంత తుంచి పెట్టినావా? నా బిడ్డల్ని ఎందుకొక మాట అంటావే పటంగి దానా?" – నీల మొగుడు సిద్దమ నాయుడు ఉలిక్కిపడి లేచినాడు. "మన బిడ్డలు మన మొకాన ఉండరంట. నీ వొదిన – ఆ పతివొర్త కూతురు – శాపిని బెట్టింది." అని చెప్పింది నీల గస పోసుకుంటా. సిద్దమ నాయుడు ఈ తగరారు ఎందుకు వచ్చిందో కొంచేపట్లోనే అర్తం చేసుకోగలిగి నాడు. నిరుడు చింతకాయల కాలంలో కూడా ఈ మాదిరి జగడమే జరిగింది.

అనరాని మాట అనినందుకు గాను సరోజ పిల్లి మాదిరి అయిపోయింది. 'గొడ్డు ముండను. బిడ్డల్ని అనవసరంగా అంటినే!' అనుకొని ఆమె మదన పడింది. 'నేను మాత్రం అనాలని అంటినా! అది నన్నే దొంగను జేసేసరికి కోపంలో నోరు జారితిని. బిడ్డలు ఎవరికైనా బిడ్డలే గదా! రేపు నేను చచ్చినా, నా మొగుడు చచ్చినా ఆ బిడ్డలే గదా తలగొరివి పెట్టాల.' – సరోజకు కోపం పోయి, చింతకాయల సంగతే మరిచిపోయింది.

ఈ లోగా సిద్దమ నాయుడు పెండ్లాంతో అన్నాడు –

"ఆమె అన్నంత మాత్తరాన్నే మన బిడ్డలు మన మొకాన వుండకుండా చచ్చిపోరులే. ఆమె ఎన్నయినా అంటాది. ఆమెకు నోటి మింద జానడెత్తు కొవ్వు బట్టింది". నిద్దర లేచీ లేవగానే ఈ రగడ వినడంతో ఆయన వొళ్ళును సోదీనంలో పెట్టుకోలేక పోయినాడు.

అంతమాట అనిన మొగుడ్ని నీల గొణిగి, "బాగనే మాట్లడతా వుండావులే, గమ్మనుండు." అని కోపంగా మోచేత్తో పొత్తి కడుపున కుమ్మింది. "వొదిన తల్లితో సమానం గదా. ఈ రోజుతో కాదనుకునేస్తామా? అంతమాట అనొచ్చా! నీ నోట్లో పుండు పుట్టా" అని ఇంకా మెల్లంగా గొణిగి సిద్దమ నాయుడ్ని ఇష్టం వచ్చినట్టు గిల్లి పెట్టేసింది నీల. అప్పటిగ్గానీ సిద్దమ నాయుడికి తప్పు తెలిసి రాలా.

"ఒరే, సిద్దా! తెల్లారి లేచి ఒకరి మొకాలు ఒకరు చూసుకోవద్దా! మాటలు కొంచెం చిన్నంగా రానీరా నాయినా!" అని కేశవులు నాయుడు అంటా వుంటే సిద్దమ నాయుడు అక్కడ వుండడానికి మొకం లేక మంచం దిగి ఈది గుండా నడుచుకుంటా పోయినాడు.

మరిది అన్న మాటకు సరోజకు కోపం రాలేదు. 'బిడ్డల మింద నేను నోరు జారినట్టే ఆ అబ్బ వొదిన మింద నోరు జారినాడు.' అనుకొనింది.

– ఇదంతా వింటానే వుండిన సుందరమ్మ పెద్ద కొడుకు కేశవులు నాయుడితో, "ఒరేయ్, పెదబ్బా ఆ చింతకాయలు మనసల మానాలు తీసేసేటట్టుండాయి. తెల్లారంగానే ఆ మానెక్కి కొమ్మల్ని వూగించెయ్యండి. కాయల్ని చెరి సగం పంచుకొనీయండి. ఎందుకు రాని పోని తగరార్లు, వూళ్ళో బైసాట్లు" అని కడ మాటగా చెప్పింది.

## 2

నీల ఇంట్లో పాచి పనంతా చేసేసింది. గొడ్ల కొట్టంలో పేడా చెత్తా తోసి చింతచెట్టు కాడ దిబ్బలో వేసేసి వచ్చింది. అంత ముగ్గు పిండిని నోట్లో వేసుకొని పండ్లు తోముకొనింది. పెళ్లో మొకం కడుక్కొని దీగూడులో వున్న అరి చేతెడు అద్దాన్ని తీసుకొనింది. అద్దంలో మొకం చూసుకుంటే నీలకు మొకం కనబళ్లా. 'కడుపు మంట పోయి నవ్వు వస్తింది, ఈ అద్దాన్ని జూస్తే' – అనుకొని పైట

కొంగుతో అద్దాన్ని తుడిచింది. ఆ అద్దానికి వెనక వైపున వుండే ఎర్రని అద్దకం అక్కడక్కడా పోయింది. అది పేరుకు అద్దంగా యింట్లో వుండాదే గాని సరిగ్గా మొకం అగుపడే చావదు. నీల గుండ్రాటంగా పెద్ద బొట్టు పెట్టుకొనింది నొష్టన.

నీలకు ఎంత లేదన్నా ముప్పై సమ్మచ్చురాలుంటాయి. మనిసి బలే నలుపు. ఎత్తు మితంగా వుండే నీల నల్ల రూపాన నాణ్ణెంగా వుండును. మనిషికి తగినట్టుగానే యెంటికలు కూడా వుండాయి. అయిదారేండ్లకు ముందర ఆమె తమ్ముడి పెండ్లయినప్పుడు వేసుకొనింది జడ. ఆ పొడుగును జూసి పెండ్లికి వొచ్చిన ఆడోళ్లందురూ – 'అది సవరమా ఏమి? ఎంత? యాడ కొంటివి?' అని కూడా అడిగినారు. అంతే. ఆరోజు వేసుకున్న జడే. మళ్లా ఈనాటికీ వేసుకోలా. సదా కొప్పుముడే. ఇద్దరు బిడ్డల తల్లయిపోయినాక యింకెందుకు జడ? ఆ బిడ్డలు తలల్లోకి చమురు లేక బిసురోమంటా వుంటే మనం వేసుకొన్న జడ ఎవుడు జూసేదానికి? – అనుకొని ఆమె జడ వేసుకోవడం మానేసింది.

మొకం కడుక్కొని తడి తడిగా వచ్చిన కొడుక్కి పైటకొంగుతో మొకం తుడిచింది. వాడి పేరు ఆర్ముగం నాయుడు. మూడు మైళ్ల దూరాన వుండే అయిస్కూల్లో ఎనిమిదో తరగతి చదువుకుంటా వుండాడు. ఏడో తరగతిలో కూడా వాడికి మంచి మార్కులే వచ్చి పస్టులో పాసయినాడంట.

నీల చద్ది చట్టిలో చేయి పెట్టింది. చేతికి అన్ని మెతుకులు తగిలినాయి. ఆ చట్టిలోని మెతుకులే దోసెడు తీసి, పెరుగు కలిపి ఆర్ముగం సత్తు కేరీరును నింపింది. నంజుకొనేందుకు ఒక ఎరగడ్డ కూడా వేసింది.

ఇంకొక గిన్నెలో పిడికెడు మెతుకులు వేసి మరిన్ని నీళ్లు పోసి సరిపడా వుప్పేసింది. ఆర్ముగం గిన్నె ముందర కూర్చున్నాడు. వాడు బలే మానస్తుడు. ఒక మాటను ఒకసారే అంటాడు గాని యింకొకసారి అనడు. ఏడో తరగతి పాసవ్వగానే 'అమా! రబ్బరు చెప్పులు తీసియ్యి. ఈ సత్తుకేరీరు మార్చి టీలుది తీసియ్యి' అనడిగినాడు. అప్పుడు నీల, "ఎనుమును ఈననియ్యి, తీసిస్తా" అనింది. ఎనుము ఈని ఈరోజుకు రెండు నెలలు కావస్తా వుండాది. సత్తు కేరీరు మాట, చెప్పుల మాటా ఎత్తిన పాపాన పోలా. అటుమంటి మానస్తుడు వాడు.

ఈదిన బడి అయిస్కూలుకు పోతుండిన ఆర్మగాన్ని పోయినంత దూరమూ చూసుకొని యింట్లోకి వచ్చింది నీల. ఆమె మళ్ళా చద్ది చట్టి దగ్గిరికి పోయి ఒక తెల్లటి గుండు చెంబులో కూట్నీళ్లను వొంచుకొని వుప్పేసుకుని గుటగుటా తాగింది. ఆమె కడుపు నీళ్లతో నిండిపోయింది. అదే గుండు చెంబులో సగానికి కూట్నీళ్లు నింపుకొని, అంత వుప్పేసుకుని కొట్టంలో మంచం మిందున్న అత్త దగ్గిరికి పోయింది.

కోడాలి చేతినుంచి చెంబును తీసీ తీసుకోంగానే ఏదో రాసికం చూడ బోతున్న దాని మాదిరిగా సుందరమ్మ చెంబులో నరాలు కనిపించే చేత్తో తడిమింది. ఒక్క మెతుకైనా చేతికి తగలక పోవడంతో ఆమె నిస్టూరంగా పొడుగ్గా గాలి వొదిలింది. 'పదేండ్ల నుంచి దీని చేతి కూడు తింటా వుండాను. దినదినానికి దిగ్గరిగి పోతా వుండాను. పందేనికైనా చూస్తా వుండాను, ఛ – ఒక్క పొద్దున పూటైనా చేరడు మెతుకులేసి కూట్నీళ్లు పోసిందా? దీని కడుపు కాలి పోనానీ' అని ఇంట్లోకి పోయిన చిన్న కోడాలికి వినిపించకుండా గొణుక్కొనింది.

సుందరమ్మకు డెబ్భైయ్యేండ్ల పైన్నే వుంటాయి. కొడుకులిద్దరూ బిళ్లంగోడి ఆడే వొయిసులోనే ఆమె మొగుడు చచ్చిపోయినాడు.

'నా సవితీ, నువ్వు రాత్రవితే మొగుడ్ని యెచ్చంగా పక్కలో యేసుకుని పడుకుంటావు చూడు – వాడ్ని సాకడానికి నేను ఎన్ని అగచాట్లు పడినానో నాకు తెలుసు, పైన దగద్దమానంగా మండేవోడికి తెలుసు. నీకు తెలుసంటనే బోగం దానా! ఈ ఆయకట్టులో నా చెమట కారని కయ్యాకాలవ ఏదో చూపించే విడిచి పెట్టిన ముండా! కడంత కాలంలో ఈ ముసిల్దానికి కడుపు నిండికీ పెడదామని – నీకు ఒకప్పుడు గాకున్నా యింగొకప్పుడు అనిపించదా ఈనపు ముండా!' అని గొణగతా ఆమె కండ్ల నిండికీ నీళ్లు పెట్టుకొనింది.

కొడుకులిద్దరికీ పెండ్లిండయి మూడేండ్లయిందో లేదో పొసక్క వేరు పడినారు. చిన్న కొడుక్కి బిడ్డలు వుండడం వల్ల వాళ్లను ఎత్తుకుంటా ఇక్కడ్నే వుండి పోయింది ముసిల్ది.

సుందరమ్మ చెవుల్ని తడుముకొని 'ఈ కమ్మలు వుండబట్టి గదా – ఈపాటి కూట్నీళ్లైనా! లేకుంటే నీళ్లకు కూడా గతిలేక ఈ గుక్కెడు వూపిరి పోగొట్టు

కోవాల్సిందే గదా!' అనుకొనింది. కొంచెం గట్టిగా వున్న తెల్లరాళ్లతో పొదిగి వుండిన ఆ సవరం కమ్మలు ఆమె మొగుడు వుండంగా ఒద్దికగా కాపరం చేసుకొని సంపాదించి పెట్టుకొన్నాటివి. కొడుకులకిద్దరికీ ఎన్ని అవసరాలు వచ్చినా – కుదవ పెట్టుకోవడానికి కమ్మల్ని మాత్రం ఇచ్చింది గాదు.

సిద్ధడు ఈదిలో నుంచి యింట్లోకి పోతుండగా చూసి చెంబును నోటి దగ్గిర పెట్టుకొని నిమిసంలో నీళ్లన్నీ గుటగుటా తాగేసి, "సిద్దారేయ్ ఇంద కూట్నీళ్ల చెమ్ము" అని పిలిచి యిచ్చేసింది.

సిద్ధమ నాయుడు చెంబు తీసుకుని యింట్లోకి వచ్చినాడు. ఆయన అంతట ఆయనే చద్ది చట్టిలో నుంచి అన్ని కూటినీళ్లు తాగి, "ఈరోజు చింతకాయలు రాల్చేద్దాం. ఎందుకు మనలో మనకు గుద్దులాటలు. మీరు తట్టలెత్తుకొని రండి. నేను మానెక్కి రాలస్తా వుంటాను" అనేసి చింతమాకు కాడికి కదలబారినాడు.

సిద్ధమ నాయుడు అనిన మాటలు పక్కింట్లో వుండిన సరోజకు వినిపించే వుంటాయి. ఆ ఇంట్లో రెండు పొయ్యిలైతే వుండాయి గాని ఇల్లంతా ఒకే చూరు. ఈ ఇంట్లో పొగ ఆ యింట్లోకి, ఆ ఇంట్లో పొగ ఈ యింట్లోకి వస్తా పోతా వుంటింది.

మెతుకుల్లేని ఒట్టి కూట్నీళ్లు తాగి కష్టం చెయ్యడానికి ఎలబారిన మొగుడ్ని చూస్తా వుంటే నీలకు కడుపులో ఏపించింది.

తట్టలో చిన్న చిన్న బుట్టలు వేసుకొని నీల, సరోజ ముందూ వెనకగా చింతచెట్టు కాడికి ఎలబారినారు.

సిద్ధమ నాయుడు కొన కొమ్మల్లో వుండి వూగిస్తున్నాడు. చింతకాయలు బాటమింద పడి శబద్దం చేస్తా వుండాయి. బాట మింద గొడ్డూ గోదా తిరగతా వుంటాయి గదా. చింతకాయలు బాటలో వుంటే గొడ్డూ గోద కింద పడి నలిగి పోతాయని – నీలా, సరోజా ముందుగా బాటలో వొంగి ఏరడం మొదలు పెట్టినారు. వారి చేతుల్లో వుండిన బుట్టలు నిండగానే దిబ్బల నడుమ వున్న సందులో కుప్పగా పోసినారు. రాలుతున్న కాయల్లో అక్కడక్కడా పచ్చివి కూడా వుండాయి.

కేశవులు నాయుడు చింతచెట్టు దగ్గిరికే రాలేదు. ఆయనకు మాకులెక్కను చేతగాదు. ఒక దఫా మర్రి ఆకుల్ని కోసుకొద్దాం పద, యిస్తరాకులైనా కుట్టుకోవచ్చని సరోజ – కేశవులు నాయుడ్ని ఉపద్ర పెట్టింది. ఆ నస పడలేక కేశవులు నాయుడు మర్రి చెట్టు చేరినాడు. దండం పెట్టి ఎక్కినాడు. కొమ్మల్లోకి పోయి కిందికి చూస్తే – ఆయనకు వణుకు పుట్టింది. అందునా ఆయన కాళ్లు మంచివి గావు. అరికాళ్లు నెర్రెలు చీలి వుంటాయి. అందులో గులక రాళ్లు చేరి పోవడంతో ఆయన సరిగా నడవ లేదు కూడా. ఎగరేసుకుంటా నడస్తాడు. ఆయనవి – ఆనిగాళ్లు. కొమ్మల్లో చేరిన కేశవులు నాయుడి కండ్లు బూజులు కమ్మినాయి. ఎట్లనో మాకు దిసేసినాడు. ఆరోజు నుంచి ఈ రోజుటికి కూడా కేశవులు నాయుడు కానగ మాను కూడా ఎక్కిన పాపాన పోలేదు. సరోజ కూడా బలంతం చేసేది గాదు.

నీలా, సరోజా నడుములు వొంచి గబగబా చింతకాయలు ఏరుకుంటా వుండగా, అదే దోవన పోతుండిన ఒక ఏడేండ్ల పిలగాడు టకీమని వొంగి నాలుగు చింతకాయలు ఏరుకుని నిక్కర జేబీలో దూరుపుకున్నాడు. ఇది జూసిన నీల – నోటి నుంచి కరుగ్గా మాటలు రానిచ్చింది : “ఒరేయ్, దొంగ మొకమోడా! ఆ చింతకాయల్ని అక్కడ వెయ్. ఏమి నాయినా, ఏ వూరు మంది? వూరోళ్ల సొత్తును వుక్కళంగా ఎత్తకపోవాలంటావా, దొంగ నాబట్టా!”

వెనకాన, వుత్తరం వైపునుంచి ఆ పిలగాడి అమ్మ లచ్చుములు నెత్తిన పచ్చి కసువు తట్ట పెట్టుకుని వస్తా వుండడం నీల గమనించలా. నీల మాటలతో అగుమానం పడిన పిలగాడు జేబీలో చెయ్యిపెట్టి ఒక్కొక్క కాయే కింద వేసేసినాడు. ‘పిలగాడు పిడికిడు చింతకాయలు ఏరుకుంటే లంజ ఎంత మాట అనిందో చూస్తివా?’ అనుకుని లచ్చుములు మనసును కష్ట పెట్టుకొనింది.

“నోటికి అద్దంబద్దం వుండాలనే, నీలా. నా బిడ్డి దొంగతనం జేసినాడా ఏమి? మీ ముందర్నే పబ్బిలీగ్గా నాలుగు చింతకాయలు ఏరుకున్నాడు. అంతలో మాత్రానికి కొడుకు వరసైన బిడ్డను పట్టుకోని ‘దొంగ నాబట్టా’ అని అంటావా?” – అంటా లచ్చుములు బారడు పొడుగు నిష్టూరం పోయింది. లచ్చుములు అంతటి బరువైన తట్టను పెట్టుకొని గూడా ప్రయత్నం మింద వొంగి కొడుకి జుట్టును చేతికి తీసుకుని, “నాబట్టా, దోవన పోయేటోడివి గమ్మన పోలేవా?

ఎందుకని వొంగి ఆ నాలుగు కాయలు ఏరుకుంటివి? కానీగానీ ఆ నా సవితి నోట్లో ఎందుకు పడితివి? అది గొంతుకు ఆనేటట్టు సాదు పోస్తింది. ఊరగాయ నంజుకుని సగించినట్టు తాగు నా కొడకా!" అంటా కోప్పడి నాలుగు వాయించింది. నీల యిందుకు మారుగా నోరు తెరిచి ఏమీ మాటాడలేదు. లచ్చుములూ పిలగాడూ దూరమై పోయినారు. అందాకా ఈ జగడం వింటానే గమ్మున వుండిన సరోజ, 'యిది బిడ్డల్ని కనినా గొడ్డు ముండే' అనుకొనింది.

నీలకు కూడా ఒక్క నిమిసం పాటు కలుక్కుమనింది. అయిదా(రోజుల ముందర జరిగిన ఒక సంగటం గుర్తుకు రాంగానే నీల మళ్లా బిగుసు కొనింది.

మొన్నా నడమ కయ్య దగ్గర్నించి ఏదో పని జూసుకుని యింటికి వస్తా వుండింది నీల. ఆమెతో పాటుగా ఎనిమిదేండ్ల కూతురు సరస్వతి కూడా వుండిందప్పుడు. సరస్వతి నడస్తా నడస్తా ఆగిపోయి కొంగుపట్టి లాగి, 'అమామే చెరుకు' అనడిగింది. సరస్వతి ఆగిన చోటుకు పక్కన్నే, లచ్చుములు వాళ్లు చెరుకు గానుగ ఆడుతూ వుండినారు. 'దగ్గరికి పోయి ఒక బిళ్ల అడుగు. ఇస్తార'ని కూతుర్తో చెప్పింది నీల. పాపం సరస్వతి గానుగ దగ్గరికి చేరి నానస్తా నిలబడుకొనింది. అప్పుడక్కడ లచ్చుములు గానుగకు చెరుకు అందిస్తా వుండింది. ఇరవైయేండ్ల ఆమె పెద్దకొడుకు గానుగకు కట్టిన ఎద్దుల్ని అదిలిస్తా వుండినాడు. లచ్చుములు మొగుడు చెరకు పాలు కాగే పెనుము దగ్గిర చేరుకొని ఎండు చెరకాకును పొయ్యిలో దూరస్తా వుండినాడు. లచ్చుములు కూతురు ఇద్దరు కూలి మనుసుల్తో పాటు కొడవలి చేత బట్టుకొని చెరుకాకును వొలస్తా వుండింది. గానుగ దగ్గిర వుండి యింతమందీ సరస్వతిని చూసినా చూడనట్టే వుండిపోయినారు. సరస్వతి పసిబిడ్డ గదా. తిని పారేసే చెరుక్కు ఆశ పడింది గదా. ఆ అంతమందీ బిడ్డ చేతిలో మూరడు చెరుకు బిళ్లను పెట్టలేక పోయినారు. నీల పిలిచే సరికి సరస్వతి వొట్టి చేతుల్తో గానుగ దగ్గిర్నించి తిరిగొచ్చేసింది. కవళం కోసరం గడప దగ్గిర నిలబడిన కుక్క ఆశ గుం(డ్రాయితో తీరిపోయినట్టు అయింది సరస్వతి యిది గూడా.

ఇదంతా తలుచుకొని, 'వాళ్ల సొత్తు దగ్గిర వాళ్లు అంత కరట్టుగా వుండినప్పుడు – మన సొత్తు దగ్గిర మనం వుంటే తప్పా? మనం చేసింది పొరబాటేమీ లేద'ని నిమ్మళించింది నీల.

సిద్దమ నాయుడు చింతమాను దిగి దండం పెట్టుకున్నాడు. ఇంగ ఇక్కడ నా పనైపోయింది – అన్నట్టుగా ఆయన అక్కడ నుంచి తూరూగా పోయినాడు.

నీలా, సరోజా చింతకాయలన్నీ ఏరి కుప్ప పోసేసినారు. ఇంక వాటిని పంచుకోవాల. నీలో సరోజో కాయల్లో బాగం పెడితే వలపచ్చికానికి చోటు వుండవచ్చునని – ఆ ఇద్దరూ పంపకంలో చెయ్యి వెయ్యడానికి జంకుతూ వుండిపోయినారు.

ఇంతలో చంకన తట్ట పెట్టుకుని, గూని వంచుకొని నడుచుకుంటా కయ్యల దగ్గిరికి పోతా పోతా కనిపించింది నారమ్మ. 'అత్తా అత్తా! పోదువురా' అంటా పిలిచింది సరోజ. తోడికోడాళ్లను, చింతకాయల కుప్పనూ చూసే సరికి నారమ్మకు సంగతి తెలిసి వచ్చింది.

నారమ్మ సంకలోని తట్టను నేల పెట్టి చింతకాయల కుప్ప దగ్గరికి వస్తా, "ఇదేమన్నా బంగారా, త్రాసు తెచ్చి కచ్చితంగా తూచేటందుకు? వీటిని మీరే చెరి సగం పంచుకోరాదా?" అనింది. ఇందుకు బదులుగా సరోజ మెల్లంగా నవ్వింది, నీల మాత్రం గమ్మనుండింది.

నారమ్మ దిక్కులేని దీనురాలు. ఒక్క అంకణం మాత్రం వుండే గుండు గుడిసెలో అన్ని నూకల్ని వుడకేసుకుని బతకతా వుండాది. ముసలితనంలో అంత సంగటి వేసేటందుకు ఆమెకు పిలకాయలు లేరు. అరవైయ్యేండ్లు దాటిన నారమ్మకు ఒక బక్కావు వుండాది. ఆమెకు కయ్యాగాలవ లేకపోవడం వల్ల ఆ ఆవుకు కసువు సంపాదించడం పెద్ద గండం. వాళ్లకూ వీళ్లకూ పనిచేసి పెట్టి – వాళ్ల కయ్యల్లోని పచ్చి కసువును పెరుక్కుంటా పొట్టబోసుకుంటాది. ఆమె వొంటి మిందకి తెల్లటి రవిక వేసుకోవడం ముప్పైయ్యేండ్లకు ముందర్నే మానేసింది.

నారమ్మ చింతకాయల కుప్పలో తట్టదూర్చి అటొక తట్ట, యిటొక తట్ట పోసింది. మొత్తం కాయల్ని చెరి సమానంగా పంచేసింది. 'ఒక కాయ తక్కువుండదు, ఒక కాయ ఎక్కువుండదు. చెరీ సమానం' అనింది నారమ్మ. పనైపోయిన నారమ్మ కొంచెం దూరం జరిగి నడుము మింద ఒక చెయ్యి ఆనించి శబద్దం అయ్యే మాదిరిగా గాలి వొదలతా నిలబడుకొనింది, నా పని అయిపోయింది, యింక మీ పనే వుండాది అన్నట్టు.

నీలా సరోజా – నారమ్మ మాట మరిచిపోయి పంచిన కాయల్ని తట్టల్లో నింపుకుంటా వుండి పోయినారు.

నారమ్మకు మొకం నల్లంగా అయిపోయింది. ఆమె తట్టను నడుమున ఇరికించుకుని కదలబారింది. తోడికోడళ్ల యిద్దరి మిందా నారమ్మకు గొంతుకాడికి కోపం కలిగింది.

'నా సవుతులాలా, చెరి మూడు తట్టల చింతకాయలు మీకు దక్కినాయిగదా. నేను దిక్కులేని దీనురాల్ని గదా. పని మింద పోతా వుండిన నన్ను అడ్డగించుకుని – నా చేత పంపకం చేయించుకున్నారు గదా. నాకు చెరొక చేటడు కాయల్ని – పోనీ దర్మంగా పెట్టి వుండినా సమ్మచ్చర కాలం నాకు చారులోకి చింతపండు కరువు లేకుండా గడిచి వుండదా! ఆరు తట్టల చింతకాయల్లో రెండు చేటల చింతకాయలు నాకిచ్చి వుంటే – మీ చేతులు పడిపోయి వుంటాయా? ఆ మాత్రం కాయలు పెట్టక పోతారా అని పంచినాను. యిట్ట చేస్తారని తెలిసుంటే – మీరు తలకిందులుగా తవుసు చేసినా– పంచి వుందునా? థూ, నా సవుతులు చచ్చి పాడె మింద వుండినా ఈ రెండు కండ్లతో చూడకూడదు'. నారమ్మ రోతగా కేకరూంచింది!

## 3

గుడిసెలో చింతకాయల్ని ముందర పోసుకొని, దుడ్డుకట్టి తీసుకుని అదరగొడతా వుండాది నీల. 'దుబ్ దుబ్'మని శబద్దం వస్తా వుండాది. ఆమె ఒకచేత్తో దుడ్డు కట్టితో అదర గొడతా, ఇంకొక చేత్తో చింతకాయల్ని– దుడ్డుకట్టి దెబ్బ తగిలే రీతిగా–ఎగదోసుకుంటా వుండాది. ఇరుకైన ఆ ఇంట్లో ఆ రీతిగా పనిజేయడం యిబ్బందిగా వుండాది.

సరస్వతి ముసిల్దాని దగ్గిర జేరుకొని ముదిగారాలు పోతా వుండాది. ఆదివారం గావడం వల్ల ఇస్కూలుకు లీవు వుండడంతో ఆర్ముగం బయట వీదుల్లో ఎక్కడో ఆట్లాడుకుంటా వుండాడు.

'మాకెక్కి చింతకాయల్ను రాల్చడమంటే సామాన్నిమా? ఆ పనికి కూలోడ్ని పెట్టి వుంటే అయిదు రూపాయిలు అడిగి వుండును. మానెక్కి రాల్చింది నా మొగుడు కదా. రెండు చేటల చింతకాయలు నా బాగానికి ఎగస్ట్రాగా

వొచ్చుండాల్సింది. నారమ్మ కాయలు పంచేటప్పుడు ఈమాట అడిగి వుండా ల్సింది. దానికైె తెలిసుండాల. అడిగేదేంది మళ్లా–' అనుకుంటా నీల సరోజను తిట్టుకుంటా పనిలో మునిగి పోయింది.

ఆర్ముగం పరిగెత్తుకొని వచ్చినందువల్ల గస పోసుకుంటా, "అమా మ్మే, పెదనాయిన వేటను నరకతా వుండాడు. ఒక కేజీ కూర తేమ్మా" అని అడిగినాడు.

నీల చేస్తా వుండిన పని జోరు తగ్గించి, తల వాలేసుకుని గమ్మనుండింది. అడిగిన పాటున అమ్మ 'చట్టి తీసకపోయి ఒక కేజీ కూర తేబో' అనక పోవడంతో ఆర్ముగం మొకం యింతైపోయింది. మారు మాట్లాడకుండా ఆ పిలగాడు గడప దిగి యీదిలోకి వచ్చినాడు.

వాడికి వూళ్లో ఎక్కడా కాలు నిలవక పొట్టేలు నరికిన తావుకాడికి వచ్చి నిలబడినాడు. ఎవురో యిద్దురు మనుసులు పొట్టేలు తోలు తీసి, మెత్తమెత్తని కండలను వొక వారగా, ఎముకలను వొక వారగా వేస్తూ వుండినారు. పొట్టేలు సొంత గల్లాయన అయిన వాడి పెదనాయన కేశవులు నాయుడు మటుకు ఒక చిన్న బండ మింద కూర్చొని బీడీ తాగతా వుండినాడు.

ఇప్పుడక్కడ కోస్తుండిన పొట్టేలు సంవత్సరం నాటిది. ఒక శనివారం సందేళ పూట ఏదో పనిమింద కేశవులు నాయుడు బసులు పోయే రోడ్డుబాట కాడికి వచ్చినాడు. అప్పుడనంగా ఎవురో యిద్దురు మొగోళ్లు గొర్రెల్ని, పొట్టేండ్లని తిరప్తికి కోతకు తోలుకుని పోతా వుండినారు. ఆ గొర్రెల మందతో పాటుగా వొక గొర్రిపిల్ల నడవలేక పోతుండడంతో వాళ్లల్లో ఒక మనిసి దాన్ని బుజాన వేసుకుని పోతా వుండినాడు. అప్పుడు కేశవులు నాయుడు, 'ఆ పిల్లని నాకిస్తారా? యెంట మేపుకుంటాను' అనడిగి నాడు. 'బేరం కుదిరితే ఇస్తా'మన్నారు. ఇరవై రూపాయలకు ఆ పొట్టేలు పిల్లను కొనేసినాడు. అది పచ్చి కసువు తిని, ఒక్కో సంగటి పిడచను నాకి నాకి పిల్ల తేరుకొనింది. బాగా పెరిగి పెద్దదయింది.

సంసారమన్నాక ఎన్ని అవసరాలు. ఒకసారి కేశవులు నాయుడు ఏదో అవసరం మింద సరోజ చెవి కమ్మలను మార్వాడి అంగడిలో కుదవ బెట్టినాడు. నెలకు నూటికి మూడు రూపాయిల వడ్డీ. మొన్ననే మార్వాడీ వాడి నుంచి, 'వాయిదా పోయింద'ని కాతికం వచ్చింది.

ఈ ఆపితి సమయాన్ని తప్పించుకునేటందుకే యిప్పుడు కేశవులు నాయుడు ఆ లేత పొట్టేల్ని కోసినాడు. లాబముండినా, నష్టముండినా కేశవులు నాయుడికే వుంటింది గదా. అందుకనే–ఒకటి సగానికి అడిగే–బేరగాళ్లకు అమ్మకుండా ఆయనే కోసుకుంటున్నాడు.

పొట్టేల్ని కోస్తున్న ఆ కొట్టంలోకి వొక్కొక్కరే సత్తు గిన్నెలు తీసుకొని వస్తా వుండారు. "నేను కత్తి గొంతు మిందికి రాబట్టే పొట్టేల్ని నరికినా. ఈ డబ్బుతో నగను మార్వాడీ వోడి దగ్గిర్నించి విడిపించుకొని రావాల. డబ్బు చేతిలో పెట్టేసి కూరను తీసక పొండి. మళ్ల నిష్టూరాలొద్దని ముందే చెప్పేస్తా వుండాను." అంటా చియ్యల కూర కోసరం వచ్చిన వాళ్లతో కచ్చితంగా చెప్పేసినాడు కేశవులు నాయుడు.

పద్నాలుగు కేజీల కూర – అప్పటికప్పుడే డబ్బు చేతిలో పెట్టి తీసకపోయే పద్దతి మిందనే అయిపోయింది. కాళ్లూ తలకాయ కూడా అదే పద్దతి మింద ఎవురో తీసకపోయినారు. ఇంక మూడు కేజీల కూర మిగిలి పోయింది. ఇంతలో వొకామె బాగా మాసిపోయిన కోకతో, కుంకుం బొట్టు లేని మొకంతో సత్తుగిన్నె చేత బట్టుకొని వచ్చింది. నలబై అయిదేండ్ల వయసు కలిగిన ఆమె ఆ నడుమ తిరమల కొండకు పోయి గుండు గీయించు కోవడం వల్ల నెత్తిమింద యెంటికలు వేలెడేసి కూడా లేవు. వెనకాన్నించి రెండు చేతుల్తో సత్తుగిన్నెను కూడా పట్టుకొని ఆమె కేశవులు నాయుడు దగ్గిరికి వచ్చి "వోన్నా, కేజీ కూర గావాల. రూక మటుకు రేపిస్తా" అనింది. ఆమె నోట్లోని మాట నోట్లో వుండగానే కేశవులు నాయుడు, 'వల్లపడదు' అని చెప్పేసినాడు.

ఆమెకు తలకాయ కొట్టేసినట్టయింది. "అడవిలో వుండే బందేరు చెట్టయినా వొకనాటికి పనికొస్తుందన్నా. నువ్వు కలిగినోడివి మాదిరిగా మాట్లాడొద్దు. నువ్వూ నా మాదిరే చద్దికి వుంటే సంగటికి లేక, సంగటికి వుంటే చద్దికి లేక, అరవా కొరవగానే బతకతా వుండావు. నీకేమీ కుప్పలు కుప్పలుగా లేదు. నాబిడ్డ గర్భం మింద వుండాది. దాని నోరు చవి చెడి పోయింది గదా–ఈ చియ్యల కూర అయినా పెడదాం రెండు పూటలని నీ దగ్గిరికి వొచ్చి అడిగినా, నోరంతా తెరిచి అడిగినందుకైనా – నువ్వు కేజీ కూర ఇచ్చి పంపరాదా? నేను నీతో కూడా పేగు తెంచుకొని పుట్టక పోయినా–వరసకు అప్ప చెల్లిని

గదా. నన్నీరకంగా నువ్వు అగుమానించొచ్చా? రేపు మరసనాటికి–నిన్ను నేను ఎగాదిగా చూస్తాననుకున్నావా? తిని ఏరిగేసే మాంసమెంతా ఎంత? మనిసెంత! ఛూ ఛూ – " ఆమె నిష్టూరపోతూ సత్తుగిన్నెను వూగులాడించుకుంటా పోయింది.

కేశవులు నాయుడు పొడుగ్గా గాలి వొదిలి పంచె కట్టులోని బీడీ తీసుకుని ముట్టించుకొన్నాడు. ఇంతలో వూళ్లో వుండే పలుకొటంలో చదువు చెప్పే అయ్యవారి పెళ్లాం వచ్చి ఒక కేజీ కూర తీసకపోయింది.

మిగిలిన రెండు కేజీల్లో వొక కేజీ యింటికి తీసుకుని పోదామనుకున్నాడు. 'మేపిన మనకు కూర లేకుంటే ఎట్ట?' అనుకున్నాడు.

ఆర్ముగాన్ని పిలిచి వొక కేజీ కూరను చేతిలో పెట్టి తమ్ముడు సిద్దమ నాయుడి యింటికి పంపించినాడు.

చేతిలోని కేజీ కూరను చూసుకున్న ఆర్ముగానికి బలే కుశాల కలిగింది. ఇంటికి వచ్చి, "అమా! పెదనాయిన మనకు కూర పంపినాడు. దూరంగా వుండిన నన్ను పిలిచి నా చేతిలో పెట్టినాడు." కొడుకు చెప్పిందే చెప్తా వుండాడు. అప్పటికే నీల చింతకాయల పని ముగించి నీళ్లల్లో బియ్యం నానబోస్తూ వుండింది.

సంగటీ, చియ్యల కూరా చేసేసింది నీల. చట్టిలో చియ్యల కూర వుండాది గాబట్టి సరస్పతి, ఆర్ముగం కళకళలాడి పోతా వుండారు. 'రోజూ మాంసం కూరే అయితే నా బిడ్డల్ని చూసే దానికి రొండు కండ్లూ చాలవనుకో' అనింది నీల. ఈ మాట వినిన సరస్పతి నీల కాళ్లను కావిలించుకొని మొగం దాచుకొనింది. కాళ్లూ జేతులూ సుబ్బరంగా కడుక్కొని అందురూ కూర్చున్నారు. మద్యమద్య నీళ్లు కూడ తాగకుండా రెండు ముద్దలు తినేసి చెయ్యి కడుక్కున్నాడు సిద్దమ నాయుడు. రోజూ అయితే ఆయన, 'బెండకాయ కూర జూడు– నీళ్లు నీళ్లుగా ఎంత పలచంగా వుండాదో!' అంటా సొట్టలు చెప్పేవాడు. ఈ రోజు నోటిమాట ఎత్తకుండా రెండు ముద్దలూ తినేసి వీదిలోకి పోయి చీమిడి చీది, తేపుకుంటా లోనికి వచ్చినాడు. ఆర్ముగం ఎముకల్ని కూడా వదలకుండా నమిలేసినాడు. కానీ సరస్పతి మాత్రం ఎముకల్ని మిగిల్చేసింది. "కండల్లో ఏముంటాది? ఎముకల్లోనే గదా సత్తా అంతా వుండేది" అంటా సరస్పతి మిగిల్చిన ఎముకల్ని నమిలేసింది నీల. ఆ నమలడమే నీలకు మిగిలింది.

ఆమె సంగటిలో పులుసు మాత్రమే పోసుకునింది గాని వొక్క తునక గూడా వేసుకోలా. పిలకాయలు తినడానికి రాత్రికి కూడా కొంచెం కూర దాచి పెట్టింది.

నీల మట్టి మూకుడు చేతికి తీసుకుని, సంగటి ముద్దా, కూరా వేసుకొని సుందరమ్మ దగ్గిరికి వచ్చింది. పిలకాయలంతా తిన్నారా? అని మాట వరసకు అడగతా మూకుడు అందుకొనింది సుందరమ్మ. “తిన్నారు, నువ్వు తిను” అంటా ఎడమ చేతిలో వుండిన నీళ్ల చెంబును కింద పెట్టి గుడిసెలోకి వచ్చేసింది నీల.

మూకుట్లోని తునకల్ని పిసికి పిసికి చూస్తే సుందరమ్మకు నోట్లో తేమ లేకుండా పోయింది. మూడు తునకలు, రెండు ఎముకలు మాత్రమే వుండాయి మూకుట్లో. పువ్వులు పడిన సుందరమ్మ కళ్లల్లో నీళ్లు కమ్మినాయి.

‘ఈ ముద్ద సంగట్లో గెంటిడు మెత్తని కూర యేసుంటే నా మనసుకు ఎంత నిమ్మళం కలిగి వుండును! ఒకేళ అది అంత కూర వేసి వుండినా– నేనొక్కదాన్నీ ముందూ యెనకా చూడకుండా తినేసి వుంటానా? ఛీ ఛీ, దాని బిడ్డల్నే పిలిచి నాకేసిన కూర అంతా వాళ్లకే తినిపించి వుండనా! మంచోళ్ల బుద్ధి మాంసం కాడ తెలిస్తిందంటారు. చెడ్డ నా సవితీ... చెడ్డ నా సవితీ...’ కండ్లలో నుంచి కారిన నీళ్లు సుందరమ్మ ముక్కు మింద నిలిచినాయి.

‘చెవుల్లో కమ్మలు వుండబట్టి ఈ మాత్రం ఎముకలైనా! అవీ లేకుంటే నన్ను నిలువునా–ఈ గొడ్ల కొట్టంలో–ఎండబెట్టి వుండదా పస్తులతో! నా సవితీ, నువ్వు నా కమ్మల కోసరం అని నీ చేత్తో నాకు సంగటి ఎయ్యద్దు. నీ చెడ్డ బుద్ధి ఎంత వుండినా, నేను చచ్చినాక ఈ నా కమ్మలు నా మనవరాలికే’ అనుకొనింది సుందరమ్మ. ఆమె మనస్తాపంలో ఆమె వుండిపోయింది.

ఆర్ముగం, సరస్వతి మూతులు తుడుచుకుంటా సుందరమ్మ పిలిచినా పలక్కుండా యింట్లోకి పోయినారు. నీలకు సంగతి తెలిసినా, “ఏమిరా ఎక్కడనించి వస్తుండారు? మూతులు తుడుచుకుంటా వుండారే–ఎక్కడ తిన్నార్రా?” అనడిగింది మెల్లంగా.

“యిప్పుడే తిన్నాం, వొద్దంటా వుండినా మా పెద్దమ్మ సంగటి పెట్టింది.” అని చెప్పినాడు ఆర్ముగం. నీల నవ్వుకొనింది. “చియ్యల కూర ఎంతెంత

యేసింది మీ పెద్దం?" అనడిగింది. "రెండు గెంటిలు వేసింది. నాకు రెండు, అన్నకు రెండు" అని చెప్పింది సరస్వతి. నీలకు బలే కుశాల కలిగింది.

ఈ లోపల ఆర్ముగం చెప్పినాడు. "అమ్మా, అమ్మా పెద్దమ్మ కేజీ కూరకు డబ్బు తీసుకొని రమ్మంటా వుండాది. ఇందాక చెప్పింది. పజ్జెనిమిది రూపాయలంట. మా పెదనాయిన డబ్బు తీసుకొని అర్జంటు మింద తిరప్తికి పోవాలంట" ఆర్ముగం గుక్క తిప్పుకోకుండా చెప్పేసినాడు.

ఆర్ముగం మాటతో గబీమనింది నీలకు.

'తినిన చెయ్యి తడారక ముందే డబ్బు కోసరం పంపించింది గదా. ఈ మోసం ముందే తెలిసి వుంటే – వాళ్ల మాంసం కూరను నా గడప ఎక్కనిచ్చే దాన్నేగాదు' అనుకొనింది నీల. 'మనుసులు యింత కరట్టుగా ఎట్ట వుంటారో ఏమో! అదేమన్నా మూడు నూర్ల రూపాయిలకు కొనిన పొట్టేలా? ఎప్పుడో చిన్నప్పుడు పట్టుకొని యెంట మేపింది గదా! ఒక్క కేజీ కూర 'పోనీ' అని వొదిలెయ్యరాదా?' – నీల మనసుకు కష్టం తెచ్చిపెట్టుకొనింది.

వూరిమింద పోయి ఎక్కడో చేబదులుగా ఇరవై రూపాయిలు తెచ్చింది. "రెండు రూపాయలు మనకు తిరిగి రావాల. తీసకరా" – ఇరవై రూపాయలను ఆర్ముగం చేతిలో పెట్టి, పక్కింట్లో సరోజకు వినిపించే రీతిగా గొంతు పెంచి అనింది నీల.

ఇది వినిన సరోజ, "మాంసానికి డబ్బు అడిగినందుకు నీ మరదాలికి ఎంత నిష్టూరమో చూడు" అనింది కేశవులు నాయుడితో.

"మనకు రావలసిన దుడ్డు మన చేతిలోకి వచ్చేస్తా వుండాది గదా. ఎన్ని అనుకుంటే మనకేమి?" అన్నాడు కేశవులు నాయుడు.

ఆర్ముగం మాటాపలుకూ లేకుండా వొచ్చి యిరవై రూపాయల కాగితం సరోజ చేతికిచ్చి, రెండు రూపాయల చిల్లర కోసరం అన్నట్టుగా నిలబడినాడు. సరోజ ఆర్ముగానికి ఇవ్వాల్సిన రెండ్రూపాయలూ యిచ్చేసింది. ఆర్ముగం పోబోతుండగా ఆపి, "మీ అమ్మకు చెప్పద్దు, కొడకా. పుస్తకమన్నా ఏమన్నా కొనుక్కో" అని పది రూపాయిల కాగితం వాడి చొక్కా జోబీలో పెట్టింది. "పుస్కాలన్నీ ఉండాయి పెద్దమ్మా" అంటా వాడు చొక్కా జేబీలో వుండిన పది

రూపాయిల కాగితాన్ని నిక్కర జేబీలో పెట్టుకున్నాడు. "రాత్రికి అన్నం మీ ఇంటికాడ తినద్దు. చెల్లీ నువ్వూ ఇక్కడ తిందురు గాని. మరిచిపొయ్యేవు రే" అనింది సరోజ గడప దిగిన ఆర్ముగంతో.

ఆర్ముగం రెండు రూపాయిలూ అమ్మకిచ్చేసినాడు. పది రూపాయల సంగతి మాత్రం బైట పెట్టినోడు గాదు.

నీల, మొగుడు యింటికి వొచ్చినాక గుసగుసగా అనింది – "నీ అన్నా వొదినా– వూరికినే కేజి కూర పంపినారని అనుకొనేవు. అదేంగాదు. నా మానం తీసి, మాకులకు కట్టేసి వొసూలు జేసుకున్నారు. అప్పుజేసి – వాళ్ల పజ్జెనిమిది రూపాయలూ వాళ్లకు చెల్లించేసినా. ఇప్పుడు – శెనగలు తిని చేతులు కడుక్కున్నంత ఆయిగా వుండాది నాకు".

ఇందుకు బదులుగా సిద్దమ నాయుడు కరుగ్గా మాట్లాడలేదు. నోటి నిండికీ నవ్వి, "అంత కచ్చితంగా వుండి, ఎంత సంపాదిస్తారో అంతా సంపాదించనీ. వాళ్ల మిగులుబాటంతా మన పిలకాయలకే గదా. వాళ్లకేమన్నా పిలకాయ లుండారా, వాళ్లు సంపాయించిన సంపాదనను అనుబోగించేటందుకు?" అనన్నాడు.

## 4

పొద్దు నడి మిట్టన వుండాది. ఎండ మిడిమేలంగా కాస్తా వుండాది. శెనగచెట్టు వున్న కయ్యి గనిమ మింద గొంతు కూర్చొని పచ్చుటి కసువును కొడమలితో కోస్తా వుండాది సరోజ.

సరోజకు దప్పికగా వుండి నోరెండుకు పోతా వుండాది. దగ్గర ఎక్కడా కాలవలో నీళ్లు పోతా లేవు. ఎంగిలి మింగతా పని కానిస్తా వుండాది. గనిమ కిందన వుండిన తట్టలో పచ్చి కసువు సగానికి పైన్నే నిండిపోయింది.

ఎదురు గుండా బలిసిన వొక తెల్లటి ఎద్దు కనిపించే సరికి బిత్తరక పోయింది సరోజ. ఎద్దు మూతికి ముగు జింబరం వుండాది. చూడ బయం గొలిపే దాని కొమ్ములకు ఇత్తడి కుప్పులు వుండాయి. నడుముకు నల్ల వెంట్రుకల దారం వుండాది. దాన్ని చూడంగానే– ఇది దేవరెద్దు! అని తెలిసి పోతా వుండాది. అది మామూలు ఎద్దు మాదిరిగా గాకుండా– పుట్టినప్పటి నుంచి

రాజిబోగం జూసిన గొడ్డు మాదిరిగా కనిపిస్తా వుండాది. దాని మెడ మింద కాడి మోపిన ఆనవాలు ఏమీ లేదు.

సరోజకు గుండెలు నీళ్లయినాయి. చుట్టూరా జూస్తే కనుచూపులో నరమానుడే లేడు. బలమైన కండల్ని వూగించుకుంటా, మెడలోని గంటను మోగించుకుంటా ఎద్దు సరోజకల్లా నేరుగా వచ్చేస్తా వుండాది.

లేచి పరుగెత్తదామంటే సరోజకు కాలూ చెయ్యీ ఆడలేదు. గొంతులో నుంచి మాటగానీ అరుపుగానీ రాలా.

దగ్గిరికి వొచ్చేసిన ఎద్దుతో, "ఎద్దా, ఎద్దా! నీకు పుణ్ణెం వుంటాది, దేవరెద్దా! నన్ను కుమ్మబాక. నీకు దండం పెడతా, నన్ను కుమ్మబాక!" అనింది సరోజ కుయ్యో మొర్రో అంటా. ఎద్దు కుమ్మకుండా నిమ్మళమైన దాని మొకంతో నవ్వింది.

"నరురాలా, నేను ఎద్దును గానే! దేముడ్ని, యెంగటేస్పర సామిని. నేను నిన్ను కుమ్మి యింస పెట్టేందుకు రాలా. నీకు వొరమిచ్చేటందుకు వొచ్చినా. నీ కడుపున పుడతానని చెప్పేటందుకు వొచ్చినా. తెల్లవారినాక నా కొండకు రా." అనేసి ఎద్దు వున్నట్టుండి మాయమై పోయింది.

సరోజకు అప్పటికప్పుడే మెలకవ వచ్చింది. ఈదిలో మంచం మింద నుంచి దిగి, కేశవులు నాయుడ్ని లేపకుండా, యింటి బీగం తీసి లోనికి వచ్చింది. అగ్గిపుల్ల గీసి ముట్టించింది. గుడిసెలో పొగసూరి వుండిన యెంగటేస్పర సామి పటానికి దండం పెట్టుకొనింది.

'మహన్నబావా! మాట నిలుపుకో నాయినా!' అని మొక్కుకొనింది.

సరోజకు పెండ్లయి పదైదేండ్లు కావస్తా వుండాది. బిడ్డలు కలగక పోవడం ఆమెకు బలే మనస్తాపంగా వుండేది. మాసిన కోకా మాసిన రైకా వేసుకుని ఎండలో పనిమింద పడి అల్లాడతా వుంటే వాళ్లూవీళ్లూ, "ఏమే సరోజా! ఈ మాదిరిగా అల్లాడి ఆకులు మేస్తా వుండావు. పొయ్యేటప్పుడు ఏమి ఎత్తుకు పోబోతావు? బిడ్డా బీరకాయ లేని దానిని–వొంటికి సుకం కలిగేటట్టు బతుకేమి!" అనినపుడు సరోజ మనసుకు మరింత కష్టం వేసేది. తెల్లవారీ తెల్లవారంగానే నీలా, సరోజా యిద్దురూ ఇంటి ముందరకు వచ్చి ముగ్గులు పోసేవాళ్లు.

సరోజ నిమిసంలో ముగ్గు పూర్తి చేసేసేది. కానీ, నీల కాళ్లను కావిలించుకుని వుండే సరస్వతి – అమ్మ పెట్టే చుక్కల్ని తుడిపేస్తూ వుండడంతో నీలకు కాలు గంట పట్టేది ముగ్గు పోయడానికి. సరోజ – ముగ్గు చకచకా పోసేటప్పుడల్లా దిగులు దిగులై పోయేది.

'నా కేమన్నా తల నెరిసిందా? నడుం వొంగిందా? పిలకాయల్ని కనే వొయిసు లోనే వుండాను గదా!' – ఈ కల నిజమవుతుందనే అనిపిస్తా వుండాది సరోజకు.

ఈదిలో మంచం మింద పడుకొని వుండిన కేశవులు నాయుడ్ని నిద్దర లేపి యింట్లోకి తోడుకొని పోయింది. కల అంతా – పూస గుచ్చినట్టు చెప్పింది. కేశవులు నాయుడు నోట యింకో రకం మాట పెట్టకుండా, చేతులు జోడించి ఇదే మాట అన్నాడు. "దేముడు అనుకుంటే అదెంత సేపు పని. అంతా ఆయన దయ."

"అయితే తెల్లారంగానే కొండకు పోదామంటావా!" అనడిగింది సరోజ.

"ఆ మాట చిన్నంగా అంటావా. తప్పకుండా పోవాల గదా." అన్నాడు కేశవులు నాయుడు.

తిరమల కొండ వాళ్లకు దూరాబారం గాదు. కొండకీ ఆ వూరికీ ఒకటీ ఒకటిన్నర రూపాయ బస్సు టికటు. అంతే! తెల్లారి ఎలబారితే సందేళకంతా దేముడ్ని దరిశనం జేసుకుని ఇల్లు జేరొచ్చు. అయినా నూర్రూపాయలు అప్పు జెయ్యాల. చద్దేళకంతా నూరు రడీ జేస్తానన్నాడు. సరోజను – యింక మళ్లీ నిద్దర పోకుండా ఇల్లు అలికే పని చూడమన్నాడు కేశవులు నాయుడు.

మళ్ళ సరోజకు నిద్దర పట్టలేదసలు. ఆమె ముట్టించిన దీపం ఆర్పలేదు. కొట్టంలో రెండెద్దులు, ఒక ఎనుము వుండాయి గానీ వాటి పేడతో – ఇటుమంటి సమయాన ఇల్లు అలకరాదనిపించింది. ఎక్కడైనా ఆవు పేడ అవితే బాగుండు ననిపించింది. ఆవులు శారదమ్మ గొడ్ల కొట్టంలో రెండు వుండాయి. అందుకని రెండు బారలు అవతల వుండే ఆ కొట్టంలోకి దూరింది. శారదమ్మ ఆ వేళప్పుడు ఎక్కడ వుండిందో ఏమోగాని, "ఎవురాడ? నా కొట్టంలోకి పోయింది ఎవుత్తె అది? యాడబడిన నా సవితి అది?" అంటా అరిచి గోలజేసింది. పేడ కోసరం

వొంగబోయిన సరోజ ఆగి, "నేనక్కా, నేను" అని పలికింది. సరోజ మళ్లా ఏదో అనబోతుంటే, "ఏమే, సరోజా, ఇది నీకు నాయంగా వుంటే చెప్పు. నీ కొట్టంలో అన్ని గొడ్లు పెట్టుకొని – నా కొట్టంలోకి పేడకు రావడం నీకు నాయంగా వుంటే చెప్పు. నాకు రెండెకరాల సేద్దిం వుండాది. అందులోకి ఈరీ కొనలేక చస్తా వుండాను. తెల్లారి లేచే కొందికి చూద్దును గదా – కొట్టంలో ఒక్క పేడ కడి కూడా వుండటం లేదు. దొంగను పడదామని ఈ రోజు దాపున కాపు గాచినా." అంటా శారదమ్మ అడ్డం వచ్చి పుస్తకం తెరిచి చదివినట్టుగా మాట్లాడింది. "అక్కా, అక్కా పరగడుపున్నే నన్ను దొంగను చెయ్యద్దు. కనాగష్టం పేడను నేను దొంగిలిద్దునా? నాకు గొడ్డూగోదా లేదా ఎట్ట? గాడిదలు మాత్రమే వుండే చాకలిదాన్నా ఏమి నేను? తెల్లారితే కొండకు పోదామను కుంటిమి. ఆవు పేడతో ఇల్లలకాలని –" కల వచ్చిన సంగతి కూడా చెప్పేసింది సరోజ.

దీంతో నిప్పుల మింద నీళ్ళు జల్లినట్టయిపోయింది శారదమ్మ. "దేముడి దరమ్మాన నీ కోరిక తీరితే పరవాలా. నాకూ కుశాలే!" అనింది. సరోజ రెండు పేడకళ్లు అరిచేతిలో పెట్టుకొని బయట పడతా వుంటే శారదమ్మ నిష్టూరంగా మనసులో అనుకొనింది: 'దీనికి ఆవులు లేవు, నిజమే. వొక మంచి పని కోసరం ఆవుపేడ కావాల్సి వొచ్చింది. నా కొట్టంలో దూరింది. అందుకు నేనేమీ కాదనను. అవితే, దీనికి బరిగొడ్లు రెండు వుండాయి గదా. వాటి పేడ కొంచెం తీసకొచ్చి దానికి బదులుగా నా ఆవుపేడ తీసకపోవచ్చు గదా – ఇది పెద్దమనిషి అయితే! దీని కొట్టాంలోని పేడ మాత్రం చెక్కు చెదరకుండా దీని దిబ్బను చేరాల. నా పేడ మాత్రం అలకడానికి దీని యిల్లు జేరాల. ఎక్కడ పుట్టినాయో ఈ నాయాలు. అందురూ దొంగ ముండలే!

సరోజ యింటి పనంతా కానిచ్చేసింది. పొద్దు నాలుగు బారలు ఎక్కేసరికి – ఆమె కొండ మింద తినడానికి పెరుగన్నం కూడా తయారుజేసేసింది. ఆ లోపల చేతులూగించుకుంటా కేశవులు నాయుడు వచ్చినాడు. "డబ్బు చక్కబడిందా?" అనడిగింది సరోజ ఆత్రంగా. "కుదిరింది, కుదిరింది!" అని చెప్పినాడు కేశవులు నాయుడు.

ఒంటి మింద పోసుకోవడానికి మొగుడికి వుడుకు నీళ్లను బకెట్లోకి తోడింది సరోజ. కూకుడు కాయల వూటతో తలకు కూడా పోసుకున్నాడు కేశవులు

నాయుడు. ఉతికిన పంచె, అత్తగారు పద్దెదేండ్లకు ముందర కుట్టించిన టెరీకాట్న చొక్కాయ వేసుకున్నాడు.

సరస్వతి అమ్మతో కూడా చేదబావి దగ్గిరికి పోతావుంటే, "సరస్వతీ! ఇట్రామ్మా!" అని పిలిచింది సరోజ. సరస్వతి పెద్దమ్మ పిలస్తా వుంటే చెవులో వేసుకోకుండా దాని పాటున అది పోతానే వుంది. సరోజ పరుగున వచ్చి సరస్వతిని చంకకు ఎత్తుకొనింది. అప్పుడు నీల మొకాన్ని కళకళలాడించిందే గాని నల్లంగా పెట్టుకో లేదు. ఒకవేళ సరోజ దగ్గిరికి పోనని సరస్వతి ఏడవబోతే, 'పిలిచినప్పుడు పోవాల' అని కసరదామని కూడా అనుకొనింది. అవితే సరస్వతి ఏడవలేదు. పెద్దమ్మ చంకన జేరి నవ్వతా వుండింది.

'ఎక్కడికబ్బా పయానం? తెల్లారి లేచి యిల్లు అలకడం ఏంది? అన్నాలు వొండి తిరగబోతలు పెట్టడం ఏంది? అమ్మగారింటికి పయానమా, ఏమి?' అనుకొంటా నీల చేందబాయి దగ్గిరికి పోయింది. అక్కడ నీలను వారగా పిలిచింది శారదమ్మ. సరోజకు వచ్చిన కల ఆమెకే వచ్చినట్టుగా – పొల్లుబోకుండా అంతా చెప్పేసింది శారదమ్మ.

మళ్ల అక్కడ వుండడానికి సగించనే లేదు నీలకు. ఆమె మూతి మూరడు పొడుగు పోయింది. ఇంటికి వచ్చి నీళ్ల బిందెను దించకనే "సరస్వతీ! యాడ చచ్చినావే ఈనపు ముండా, రావా, యిట్ట!" అంటా అరిచింది.

సరస్వతి అమ్మ పెట్టిన కేక వినినా పెద్దమ్మను విడిచి పెట్టలేదు. సరస్వతి పెద్దమ్మ చేత తలంటు పోయించుకొనింది. తల దువ్వించుకొనింది, చెండుమల్లె పూవును పెట్టించుకొనింది.

సరస్వతిని చంకన పెట్టుకొని సరోజ, ఏవో సామానుతో వుండిన చేతి సంచిని పట్టుకొని కేశవులు నాయుడు కొండకు పోవడానికని యీదిలోకి వచ్చినారు. గడప మిందే కూర్చుని వుండిన నీల, "వొసే, మాదిగ ముండా, సిగ్గులేని ముండా, యిట్టరా!" అని పిలిచింది కూతుర్ని. సరస్వతి దిగులైన మొకంతో పెద్దమ్మ కల్లా జూసింది. సరోజ అడుగు ముందుకేసింది.

"సరస్వతీ! చంక దిగతావా దిగవా! గొంతు మింద కాలేసి తొక్కేస్తాను లంజా! మరేదగా చంక దిగు. మొన్నగాక మొన్న నా బిడ్డలు నా మొకాన

వుండకూడదని కోరుకొనింది. అటుమంటి మనిసి చంకనెక్కేటందుకు సిగ్గులేదంటనే అరవదానా!" – గెట్టింగా అరిచింది నీల.

సరస్వతి పెద్దమ్మ చంకలో నుంచి దిగజారబోయింది. సరోజ సరస్వతిని కిందికి దించేసి నీలకల్లా ఎగజూసింది. నీల మొకం మసిచట్టి మాదిరి వుంది. సరస్వతి బెదురు బెదురుగా తల్లిని జేరింది. కూతురి వీపు వాయించేసింది నీల. "మా మింద కోపాన్ని పసిబిడ్డ మింద ఎందుకు చూపిస్తావు? నీకు అంత కసిగా వుంటే నీ గొడ్ల కొట్టాంలో వుండే పొరకతో మమ్ముల కొట్టుగాని–" అనింది సరోజ నిష్టూరంగా. ఈ మాటలు వినిన నీల, ఇందాకా సరోజ వేసిన కూతురి జడలను విప్పేస్తా, "మీకూ మాకూ ఏమి సమందం వుండాది? మీరెవురో, మేమెవురమో! మిమ్మల్ని మేమెందుకు కొడతామమ్మా!" అంటా, సరస్వతిని కొట్టుకుంటా ఇంట్లోకి పోయింది.

నీళ్లు కమ్మిన కండ్లను తుడుచుకుంటా వుత్తి చంకతో కదిలింది సరోజ. ఆపాటికే కేశవులు నాయుడు – అక్కడ ఆగకుండా – ముందుకు పోయి వుండినాడు. శారదమ్మ దగ్గిరికి పోయి మళ్ల బస్సుబాట చేరుకొనింది సరోజ. శారదమ్మ, "నేనే చెప్పినాను దానికి. ఏమి, కుళ్లుకుంటా వుండాదా ఎట్ట?" అనింది. ఏమీ మాట్లాడకుండా సరోజ బాట చేరింది.

"సరస్వతి యాడ?" అనడిగినాడు కేశవులు నాయుడు.

"చెడ్డ నా సవితి, చెడ్డ నా సవితి, చెడ్డ నా సవితి –" మూడుసార్లు మూడు రకాలుగా అనింది సరోజ.

"ఏంది, చెప్పు?" అన్నాడు కేశవులు నాయుడు.

"మనం దేముడి దగ్గిరికి పోకముందే... నీ మరదలు ఈపాటికి ముడుపు కట్టేసి వుంటాది – మనకు పిలకాయలు పుట్టకూడదని. మనకూ వొక బిడ్డ పుడితే మన ఆస్తి దానికి... దాని బిడ్డలకి దక్కదు గదా. అదీ దాని కడుపు మంట. చెడ్డ ముండ... థూ థూ –" అనింది సరోజ.

పొద్దుపోయే లోపలనే వాళ్లు కొండ మింద నుంచి తిరిగొచ్చేసినారు. తిరిగి వచ్చేటప్పుడు ఇరవై రూపాయలకు సరస్వతి కోసరమని వొక గవును – రెడీమేడుది తీసుకొనింది సరోజ. మీటరు మింద పన్నెండు రూపాయలు పెట్టి

ఆర్ముగానికి వొక గళ్లగళ్ల చొక్కాయి కొనింది. ఇద్దరికీ స్వామి బొమ్మలు కలిగిన వుంగరాలు కొనింది.

సరోజ ఇంటికి వొచ్చీ రాంగానే వొక సత్తుగిన్నెను చేతికి తీసుకొని అందులో – నాలుగు దోసిళ్ల బొరుగులు, రెండు కొండ లడ్లు, వొకవడ, దోసిడు శెనగపప్పు, అరడజను అంటిపండ్లూ వేసి, సొయానా నీల యింటికి పోయి సత్తుగిన్నె అక్కడ పెట్టేసి, సరస్వతిని జవురుకొని వచ్చేసింది. సరస్వతికి కొత్త గవును వేసింది. "ఇప్పుడు నువ్వు బలే వుండావు. జయపరద నీ కాళ్ల సందున దూరాల్సిందే!" సరస్వతిని గెట్టింగా ఎదకేసి అదుముకొనింది సరోజ. ఆర్ముగానికి తీసుకొచ్చిన చొక్కాయ గుడ్డను ఎత్తుకొని – గుడ్డలు కుట్టే సాయిబూ దగ్గిరికి వచ్చింది. "తొందరగా కుట్టు సాయిబా, వాడు ఇస్కూలుకు పోయే పిలగాడు గదా. తొందరగా కుట్టు" అని వొత్తిడి పెట్టింది. "పిలగాడు ఇస్కూలు నుంచి ఇంకా రాలా. వొచ్చీ రాంగానే ఆల్తి కోసరం నీ దగ్గిరికి అంపిస్తా". అని చెప్పేసి యింటికి వొచ్చింది.

ఆర్ముగం ఇస్కూలు నుంచి ఎప్పుడొస్తాడా – అని కనిపెట్టుకోని వుండింది సరోజ. వాడు వస్తానే టయిలరు దగ్గిరికి పంపించింది.

కొంచేపు తాలి నీల – కాళీ సత్తుగిన్నెను సరస్వతి చేతపెట్టి, "మీ పెద్దమ్మకు ఇచ్చేసిరా!" అని అంటా వుండడం సరోజకు వినిపించింది.

సరస్వతి – ఇంటికి వచ్చినాక సరోజ అడిగింది – "సరసా, సరసా! మీ అమ్మ లడ్డు తినిందా?"

తినిందని చెప్పడానికి సరస్వతి 'ఓ' అని బారడు పొడుగు దీర్గం తీసి, "లడ్డును కండ్లకు అద్దుకొని తినింది మాయమ్మ" అని చెప్పింది.

ఇందుకు సరోజ బలే కుశాల పడింది.

## 5

కేశవులు నాయుడు బావి దగ్గిరికి వచ్చినాడు. వాళ్ల నాయిన సంపాయించింది వొకేవొక ఎకరా కయ్య. అందులో కేశవులు నాయుడి బాగానికి గాను ఎనిమిది గుంటలు వచ్చింది. ఆయన తమ్ముడు సిద్దమ నాయుడు బాగానికి గాను ఏడు గుంటల కయ్య పోయింది. కేశవులు నాయుడు తండ్రికి పెద్ద

కొడుకు గావడం వల్ల – ఆయనే వాళ్ల నాయిన చచ్చిపోయినప్పుడు తలగొరివి పెట్టినాడు. అందుకు గాను వొక గుంట నేల ఆయనకు ఎక్కువగా వచ్చింది. జ్యేష్ట బాగం అంటే యిదే. నీటి సౌక్రిం కోసం గాను ఆ ఎకరా నేలకు వొక బావి వుండాది. ఆ బావిలో అన్నాదమ్ముళ్లిద్దరికీ మూడు గంటల బాగం వుండాది. కేశవులు నాయుడికి వొకిటన్నర గంట, సిద్దమ నాయుడికి వొకిటన్నర గంట.

సందేళ ఆరు గంటలయ్యింది. అప్పటికే ఎండాకాలం పెట్టి వుండడం వల్ల యింకా పొద్దుగూట్లో పడలేదు. ఇప్పట్నించి ఏడున్నర గంటల దాకా బావిలోని వూట అంతా కేశవులు నాయుడి కయ్య పరమే. కేశవులు నాయుడు ఎనిమిది గుంటల్లోనూ వేరుశెనగ యేసినాడు. ఇంక రెండు తడులు పారితే, ఆ తోటను పెరికేసి కాయలను వొబ్బిడి చేసుకోవచ్చు.

కేశవులు నాయుడు మూడు ఆర్సు పవరు మోటారు సిచ్చిని నొక్కినాడు. నీళ్లెత్తింది మోటారు. అది మంచి వూట బావి. అయితే అంతా పక్కూట. ఎండా కాలంలో కూడా అది వొక మోటారుకు నీళ్లందిస్తాది. అన్నాదమ్ముళ్లిద్దరికీ వొకే వొక మోటారు. ఎవురెన్ని యూనిట్లు వాడుకుంటే, ఆ లెక్క ప్రకారం కరంటు శార్జి కట్టేస్తారు.

కేశవులు నాయుడు నీళ్లను కయ్యిలో పెట్టేసి మళ్లా మోటారు దగ్గిరికి వచ్చి చూసే సరికి – మోటారు నీళ్లెత్తకుండా మూగెద్దు మాదిరిగా నిలిచిపోయి వుండాది. ఇంతలోనే ఆయన ముక్కులకు కమురు వాసన తగిలింది. కేశవులు నాయుడు బిత్తర పోయి మోటారు సిచ్చిని నొక్కినాడు. 'గుయ్' మని కూడా మిసిను సౌండు చెయ్యలేదు. 'వొరె, దీనమ్మా నాయలీ మిసనా! పైరు నోటికందే సమియాన కాయిలు కాల్చుకొనిందే! ఎట్టబ్బా!' – అనుకొని తలకాయ గీరుకున్నాడు.

కేశవులు నాయుడు యింటికి పోను మనసొప్పక బావి చుట్టూతానే తిరగతా వుండిపోయినాడు. ఇంతలోనే గంట ఏడున్నర అయిపోయే సరికి – సిద్దమ నాయుడు బావి దగ్గిరికి వచ్చేసినాడు. ఏడున్నర నుంచి తొమ్మిది గంటల దాకా బావి ఆయన పరం. సిద్దమ నాయుడు మిసినీ సిచ్చి నొక్కబోతుంటే కేశవులు నాయుడు లోగొంతుతో చెప్పినాడు: “వొరే, కరంటు రెండు పేసుల్లో

వచ్చినట్టుండాది. శెనిగితోట దగ్గిరికి పోయి వచ్చేసరికి చూద్దును గదా – కాయిలు కాలిపోయి వుండింది, కర్మ!"

అన్న మాటలు వినిన సిద్దమ నాయుడికి గుండెల్లో గబిక్‌మనగా, "ఇది కర్మగాదు, పొగురు! మిసినీ యేసిన మనిసి మిసినీ దగ్గిర కాపెట్టుకొని వుండక – కయ్యల దగ్గిరికి ఎందుకు పోతివి? ఉడతలు పట్టేదానికి పోతివా, ఎట్ట? థూ థూ –" అంటా నోరు జేసుకున్నాడు. కేశవులు నాయుడి మనుసులో కలుక్కుమనింది. ఏదో అందామని ఆయన నోరు తెరిచే సరికి నిప్పుల మింద నడిచినట్టుగా సిద్దమ నాయుడు కయ్యల దగ్గిరికి పోతూ కనిపించినాడు.

ఆరేండ్లయ్యింది – ఆ మిసినీ కొని. ఇదే తొలిసారి కాయిలు కాలడం. కాయిలు కాలిపోవడం మొదులయింది కాబట్టి – యింక కొత్త కాయిలు చుట్టించినా దాని బతుకింక అంతే. మూడు మూణ్ణాళ్ళకూ కాలిపోతాదో ఏమో!

కేశవులు నాయుడిదంటే శెనగ తోట. కానీ సిద్దమ నాయుడిది వరిమడి. ఇంట్లో జనం ఎక్కువ గదా. అందుకని ఏడు గుంటల్లోనూ వరిమడే వేసినాడు. ఇప్పుడా మడి ఎన్నును పొట్టలో పెట్టుకొని వుండాది. శెనగతోట అవితే నీళ్లు లేకపోయినా నాలుగు దినాలు వోర్చుకొంటాది. కానీ వరిమడి పాలుతాగే పసిబిడ్డతో సమానం. దినుమ్మూ నీళ్లు పారాల్సిందే.

సిద్దమ నాయుడికి గుక్క తిరక్కుండా పోయింది. అదే బావిలో పన్నెండు గంటల బాగం వుండిన అయిదెకరాల రైతుతో మాట్లాడి ఆయన మిసను వేసుకునే ఏర్పాటు చేసుకున్నాడు. ఆ రైతు మోటారు – అయిదు ఆర్సు పవరుది. గంటకు నాలుగు రూపాయలు లెక్క. గంటలో సిద్దమ నాయుడి వరిమడి నిండిపోయింది నీళ్లతో.

సిద్దమ నాయుడు పని ముగించుకొని యింటికి వచ్చేసినాడు. మొగుడు అదొక మాదిరిగా వుండడం చూసి, "ముకం మటమటలాడిస్తా వుండావు. ఏమి కత?" అనడిగింది నీల.

మొగుడు చెప్పింది విన్నాక నీల తలపట్టుకొని కూర్చొనింది. ఇంక అక్కడ వుండలేక సిద్దమ నాయుడు యీదిన పడినాడు. డెబ్బైదాకా గడపలు వుండిన ఆ వూళ్లో క్రిష్ణమనాయుడు – అని వొక ఇరవై అయిదేండ్లవాడు మోటార్లకు

కాయిలు చుట్టడం నేర్చుకుని వుండాడు. ఆ చుట్టుపక్కల వూళ్లల్లో కూడా క్రిష్ణమ నాయుడు పనిచేస్తాడు. సిద్దమ నాయుడు నేరుగా క్రిష్ణమ నాయుడి యింటి గడప ఎక్కినాడు. ఎప్పుడూ యింటి దగ్గర దొరకని క్రిష్ణమ నాయుడు ఆరోజు ఇంట్లోనే వుండినాడు.

“వొరె, కిష్టా! నీతో పని బడిందిరా. ఇన్నాళ్లూ నిన్ను తలచకుండా వుంటిని. ఈరోజే నీతో పని బడిందిరా, నాయాలా!” అంటా తిన్నెమింద కూర్చున్నాడు సిద్దమ నాయుడు.

“మోటారు కాలిపోయిందా, ఎట్ట?” అన్నాడు క్రిష్ణమ నాయుడు.

“నా మోటారు ఎందుకు కాల్తిందిరా! మా మూగిమొకం నాయాలు వొజ్రం అట్టా మోటార్ని కాల్చేసినాడు” అన్నాడు సిద్దమ నాయుడు.

“ఏం మాటలు బావా, అవి? నీ మోటారు కాలిపోయింది, ఆరూ ఆరున్నర గంటల కాడ కదా! అవును, నాకు తెలుసు, అప్పుడు కరంటు రెండు పేసుల్లో వొచ్చింది. దానికి ఎవుడేం జేసేది? అందునా నీ కాయిలు బాగా వీక్ అయి వుంటాయిలే!” – అని చెప్పినాడు క్రిష్ణమ నాయుడు. అక్కడే కూర్చుని క్రిష్ణమ నాయుడి పెండ్లాం చేత గలాసుడు నీళ్లు తెప్పించుకొని తాగినాడు. కాసేపు నిమ్మళ పడినాక సిద్దమ నాయుడికి కూడా నిజమేననిపించింది. ‘అప్పట్లో మిసినీ దగ్గిర నేను వుండినా కాలిపోయి వుండును’ అనుకున్నాడు.

సిద్దమ నాయుడు యిందాకా మాట్లాడిన గొంతుతో గాకుండా వేరొక గొంతుతో అన్నాడు: “నిజమేరా కిష్టా, నువ్వు జెప్పింది నిజమే! అవితే మన యెచ్చరికలో మనం వుండాల గదా. ఆపైన దేవుడి యత్నం. మనమేం పెద్దపెద్ద రైతులమా! మిసినీ యేసిన మనిసి మిసినీ కాడనే వుండాల గదా, అదీ నా కోపం.”

“మిసినీ యేసిన మనిసి మిసినీ కాడనే వుంటే వరిమడి కాడికి నీళ్లెట్ట పోతాయి!” అన్నాడు నవ్వి క్రిష్ణమ నాయుడు.

“సరే ఆ సబువులు అక్కడ కట్టిపెట్టరా, నీ ఆలి ముండమొయ్యా!... కిష్టా! యెల్లాలకల పడుకోని ఎంగిలూంచుకుంటే మన మొకాన్నే పడితింది గదా!సిగ్గు వొదిలేసి చెప్పతా వుండా – నా బిడ్డల్ని మూడు పూటల కొకపూట పొస్తులు

పెడతా వుండాను రా! నీలిగి తంతే – నా యింట్లో పైసా లేదిప్పుడు. ఈ కష్ట కాలంలో నేనేమి చెయ్యాలనో చెప్పు? కాయిలు చుట్టించే దానికి మూడు నూర్లయినా చలవ అవతాది గదా. నేనూ నా బాగం నూటయాపై రూపాయిలు యిచ్చుకోవాల. నా తరంగాదిప్పుడు. అందునా మా అన్నే కాయిలు కాల్చినాడు. ఈ డబ్బు ఆయన్నే పెట్టుకోమను. రేపో ఎల్లుండో కాయిల్ని కట్టించెయ్యమను. నా మోటారు కాయిలు కాలిపోయిందని తెలిసిన కాడ నుంచి – నా పెండ్లాం నెత్తి మింద చేతులు తియ్యనే లేదురా!" అన్నాడు సిద్దమ నాయుడు.

ఈ మాటలన్నీ వినిన క్రిష్ణమ నాయుడు పొడుగ్గా గాలి వొదిలి, "మీ అన్నకు చెప్పి చూస్తా" అన్నాడు, సిద్దమ నాయుడు బిడ్డల గల్లోడు గదాని.

"చెప్పి చూడడం గాదు. వొప్పించాల." అంటా తిన్నె దిగినాడు సిద్దమ నాయుడు.

ఆ ఇద్దరూ యీదిలోకి వచ్చినారు. సిద్దమ నాయుడు వాళ్ల యింట్లోకి పోయినాడు. క్రిష్ణమ నాయుడు – కేశవులు నాయుడి ఇంట్లోకి నడిచినాడు.

ఈ రాయబారం గురించి పెళ్ళానికి చెప్పినాడు సిద్దమ నాయుడు. పక్కింట్లో ఏమి జరగతా వుండాదో విందామని నీలా, సిద్దమ నాయుడు చెవుల్ని యెడం చేసుకున్నారు. అప్పుడనంగానే 'అమా, అమా...' అంటా ఏదో చెప్పబోయిన సరస్పతిని చూసి నీల – నోటి మింద చూపుడు వేలు వేసి – సైగ జేసింది. సరస్పతి మళ్ల నోరు తెరవలా.

పక్కింట్లో క్రిష్ణమ నాయుడ్ని అంతా మాట్లాడనిచ్చి సరోజ వొకే మాట అనింది– "కిష్టన్నా! నామొగుడు కిరసనాయిలు పోసి అగ్గిపుల్ల గీసి ముట్టించి, కాయిల్ని కాల్చేసి వుంటే చెప్పు. నేనే మూడు నూర్లు బరాయించుకోని కాయిలు చుట్టిస్తా." ఈ మాటలు వినిన నీల యివతల యింట్లో నుంచి మొగుడి మొకంలోకి చూసింది. ఇంతలో కేశవులు నాయుడు నోరు తెరిచి, "నా బండాట కూడా మా తమ్ముడి కన్నా ఈనంగా వుండాదిరా కిష్టా! చెప్పుకుంటే బైసాట్లు. మొన్న వొక మొక్కు వుండి కొండకు పోవడానికి నూరు రూపాయలు అప్పు తెచ్చినాను. అదీ నా పరిస్తితి. మూడు నూర్లు పెట్టి నేనొక్కడ్ని కాయలు కట్టించలేను. నా బాగం నేను అప్పుజేసి ఇస్తానంతే!" అనేసినాడు.

క్రిష్ణమ నాయుడు ఒక్క నిమిసం తరవాత సిద్దమ నాయుడు యింట్లోకొచ్చి నోరు తెరవబోతే, "ఏం చెప్పొద్దు అన్నీ యిన్నాము" అనింది నీల.

"ఇంగొక మార్గం లేదు బావా. చెరి నూటయాపై రూపాయలు వేసుకొని కాయలు కట్టించి, పైరు కాపాడుకోవడమే!" అన్నాడు క్రిష్ణమ నాయుడు.

"నాకా సంగతి ముందే తెలుసున్రా. అయినా బుద్ధి పియ్యి తినటం వల్ల నేను నిన్ను వాళ్లదగ్గిరికి పంపించినా. నాకు పగోళ్లైనా వొకపైసా సగాయం చేస్తారే గాని వాళ్లు చేస్తారా ఏమి? సరేలే, నువ్వు పద. నేను రేపు సందేళ లోపల నా బాగం నూటయాపై ఇచ్చేస్తా. రేపు వాళ్ల దగ్గిర నువ్వే వసూలు జేస్కో. ఎల్లుండి కంతా మిసినీ రడీ అయిపోవాల. నువ్వే తిరప్తి పోయి కొత్త కాయిలు తెచ్చుకో. సరేనా?" – అన్నాడు సిద్దమ నాయుడు. క్రిష్ణమ నాయుడు వాళ్ల ఇంటికి కదిలినాడు.

ఆ రాత్రి అన్నం తిన్నాక కట్ట బీడీలు తాగినా నిద్దర పట్టింది గాదు సిద్దమ నాయుడికి. నీల కూడా మేలుకునే వుండింది. "ఎందుకు ఆ రీతిగా కుమిలి పోయేది! ఎట్టా రాసి వుంటే అట్ట జరగతాది! నువ్వేమీ మదన పడబాక!"అనింది నీల.

తెల్లావారినాక సిద్దమ నాయుడు – మునిరత్నమ నాయుడ్ని కలిసినాడు. మునిరత్నమ నాయుడు కట్టి వ్యాపారం చేసే మనిసి. వూళ్లల్లో ఎవురైనా చెట్లు అమ్మేస్తా వుంటే – కొని, వాటిని నరికి ఆ కట్టిని ఎద్దుల బండ్లతో తిరప్తి చేర్చి అమ్మేస్తాడు.

సిద్దమ నాయుడి కయ్యకీ, కేశవులు నాయుడి కయ్యకీ నడుమ నొక బిరసల చెట్టు వుండాది. అన్నాదమ్ముల్లిద్దురూ వేరు పడేటప్పుడు ఆ చెట్టు పలానా వాళ్లదేనని తేల్చలా. ఆ చెట్టును బేరానికి పెట్టినాడు సిద్దమ నాయుడు. 'మీ అన్నను వొకమాట అడిగినావా?' అని కూడా అడగలేదు మునిరత్నమ నాయుడు. సరిగ్గా నూటయాభై రూపాయిలకే బేరం కుదిరింది. ఆ చెట్టును అంతకు ముందు మునిరత్నం నాయుడు చూసే వుండినాడు. "మద్యానం పన్నెండు గంటలకు వస్తాను, చెట్టు కాడికి. డబ్బు అప్పుడే యిస్తాను సరేనా?" అన్నాడు మునిరత్నమ నాయుడు. వొప్పుకున్నాడు సిద్దమ నాయుడు.

సిద్దమ నాయుడు ఈ సంగతి అన్నకూ వొదినకూ తెలియకుండానే వుండాలను కున్నాడు. 'తీరా మునిరత్నం నాయుడు చెట్టును పడగొట్టేసినాక, నూటాయాభై రూపాయలు మన చేతిలో పడిపోయినాక, ఎవూరూ ఏమీ చెయ్యలేరు గదా. మూతి నల్లంగా పెట్టుకోని వొకమాట అంటే అననీ గాక!' అనుకున్నాడాయన.

మద్యానం పన్నెండు గంటల కాడ మునిరత్నమ నాయుడు ముగ్గురు పనోళ్లను తోడుకొని, రంపంతో, గొడ్డళ్లతో, కత్తులతో చెట్టుకాడికి చేరుకున్నాడు. డబ్బు చేతికి తీసుకోవడానికి గాను సిద్దమనాయుడు కూడా అక్కడికి వచ్చినాడు.

శెనగతోట కయ్యలో పచ్చి కసువు కోసుకుంటా వుండిన సరోజ – చెట్టు దగ్గిర వ్యాపారస్తుడు రంపంతో వుండడం చూసి గస పోసుకుంటా పరిగెత్తింది. ఆమె పరుగును చూసిన మునిరత్నమ నాయుడు సిద్దమ నాయుడి కల్లా చూసినాడు.

"ఏం, మునిరత్నం బావా! ఈరోజు దాకా నిన్ను పెద్దమనిసి అనుకున్నా, కదులు కదులు మా చెట్టు కాడ్నించి కదులు. దాని మింద నాకూ, నీలకూ సరి సమానమైన పెత్తనం వుండాది. మమ్మల్ని ఒక మాట కూడా అడక్కుండా – ఈ చెట్టును నరికేటందుకు వస్తివే, నువ్వు పెద్ద మనిసివేనా?" అని కరుగ్గా అడిగింది సరోజ.

మరిది సిద్దమ నాయుడి కల్లా తిరిగి, "ఏమబ్బా, మా మింద ఎందుకీ రీతిగా కత్తి గట్టినావు? నీకు దర్మంగా వుండాదా? వొక్క రోజు మమ్మల్నిద్దర్నీ గొంతు పిసికి చంపెయ్. అంతేగాని ఎందుకీ రకం పనులకు పాలుపడి సాదిస్తావు?" అనింది.

"మునిరత్నం బావా! యింకా ఎందుకీడ నాన్చేది? నీకంతగా చెట్టును నరకాలనే వుంటే – ముందు నన్ను నరికేసి మళ్ల నరుకు – ఆ చెట్టును!" అని ఖండితంగా చెప్పేసింది సరోజ.

మునిరత్నమ నాయుడు మళ్ల ఏమీ మాట్లాడ లేదు. "ముగ్గురు మనుసులకు పంచేటు చేస్తివి గదరా సిద్దా!" అనేసి పోయినాడు.

తలతీసి మొలేసినట్టయింది సిద్దమ నాయుడి పని.

వొదిన – అని కూడా తలవకుండా సిద్దమ నాయుడు పెళ్లాం దగ్గిరికి పోయి, "చెట్టును నరకనీయ లేదు రాకాసి లంజ!" అన్నాడు గట్టిగా.

## 6

నెలనాళ్లు మంచం మిందనే వుండిన సుందరమ్మ, వొకరోజు చచ్చి పోయింది. ఆ రోజు తెల్లవారి గొడ్లకొట్టం లోని పేడా చెత్తా వూడద్దాం గదా – అని వచ్చిన నీల కంటికి, సుందరమ్మ మొకం మింద నల్ల చీమలు పారాడతా కనిపించినాయి.

పీనిగను తీసుకొని వచ్చి యింట్లో పడుకోబెట్టినారు. ఆ రోజంతా సరోజ, కేశవులు నాయుడు – నీల గుడిసెను వదలి పెట్టిన పాపాన పోలా.

కేశవులు నాయుడు నూరు రూపాయలు తెచ్చి, పీనుగను వొలికిల మిట్ట చేర్చడానికయ్యే సామాను కోసరం వొక మనిసిని పంపే ఏర్పాటు చూసినాడు. మద్యానాని కంతా పీనిగ వొలికిల మిట్ట చేరింది. అక్కడ సుందరమ్మ చెవుల్లోని కమ్మలను ఎవురో వలిచి, ఆమె పెద్దకొడుకైన కేశవులు నాయుడి చేతిలో పెట్టబోయినారు. అప్పుడు కేశవులు నాయుడు, "మావాడి చేతికియ్" అని గొణిగినాడు. సిద్దమ నాయుడు కమ్మలను పంచె చెంగులో జాగర్త చేసుకొని అక్కడ నుంచి యింటికి వచ్చినాక పెళ్లాం చేతికి యిచ్చేసినాడు.

పీనిగతో పాటుగా పలకలు కొడతా పోయిన అయిదారు మంది మాదిగోళ్లు కూడా యింటికి వచ్చేసినారు. వాళ్లు యాపై రూపాయలు ఇవ్వందే జరగదని – కూర్చున్నారు. అడిగిందాని కన్నా పది తక్కవ యిచ్చి, వాళ్లను పంపించేసినాడు.

చావు కర్చు మొత్తం కేశవులు నాయుడే బరిస్తూ వుండడం గురించి – నీలకు చెప్పినాడు సిద్దమ నాయుడు.

అప్పుడు నీల నవ్వి, "చావు కర్చు నువ్వు పెట్టు. చెవి కమ్మల్లో బాగం దొబ్బచ్చునని గాని నీ వొదిన చెప్పిందా, ఎట్ట?" అనింది. సిద్దమ నాయుడు కూడా నవ్వి ఏమీ మాట్లాడలేదు.

సుందరమ్మ చచ్చిపోయిన పదారోనాడు దినం పెట్టుకున్నారు.

దినానికి వూళ్లో యింటికొక మనిసి లెక్కన వస్తారు. అర మూట బియ్యమైనా చలవ అవతాయి. ఇంక ఆ సామానూ ఈ సామానూ వుండనే వుండాది గదా! దానికి నూరు రూపాయలైనా అవతాది.

"మా అన్నను అర మూట బియ్యం కొనియ్యమను. మిగతా దినం కర్చంతా నేను బరించుకుంటాను." అంటా సిద్దమ నాయుడు అన్న దగ్గిరికి వొక మనిసిని రాయబారం పంపినాడు. ఆ ఆడమనిసి కేశవులు నాయుడి దగ్గిరికి పోయి చెప్పింది.

కేశవులు నాయుడు కోపంతో యిక్కడ ఎగిరి అక్కడ దూకినాడు – "అంతా వాడు ఆడిందే ఆటగా వుండాదే! చావు కర్చు అంతా నేను బరించుకుంటిని గదా, మావాడ్ని వొక పైసా అడిగితినా? బియ్యం నన్ను కొనమంటాడా ఆ అన్నాయస్తుడు? వాడికి రేపో ఎల్లుండో మడి కోస్తే – పద్దైదు మూటల వడ్లగింజలు అవతాయి గదా! వాటిల్లో వొక మూట వడ్లగింజల్ని – దినం కోసరం కర్చు పెట్టలేడా! నాది శెనగతోట అయిపోయింది. నాదీ వరిమడి గాని అయివుంటే నేనే ముందరుండి దినం కూడా జరిపిద్దును!" అన్నాడు కేశవులు నాయుడు.

రాయబారం పోయిన ఆ ఆడమనిసి, నీల తరపున వొక మాట అని చూసింది.

"పది మూటల వడ్లగింజలు అవతాయి సరే, కానీ సిద్దడికి యిద్దరు పిలకాయలు గదా ఆ పదిమూటలు ఎన్ని దినాలు ఆగతాయి?"

పక్కింట్లో జరుగుతున్న మాటలన్నీ నీలా, సిద్దమనాయుడు వింటానే వుండారు.

నీల తరపన మాట్లాడిన ఆడమనిసితో చెప్పింది సరోజ: "వాళ్లకు ఇద్దురు పిలకాయలు వుండారు. ఎప్పుడూ అదే మాట! మాకు బిడ్డల్లేరు! వాళ్లకు వుండారు!! ఆ మాట కూడా యింక అనలేరు గదా!"

అప్పుడా ఆడమనిసి అడిగింది: "అదేందే సరోజా, అట్ట మాట్లాడతుండావు? నీళ్లు పోసుకొని వుండావా, ఏంది?"

“అవునక్కా, రెండు నెలలుగా అంటు కాలా. దేముడు యిన్నాళ్లకు దయదలిచినాడు. నాకిప్పుడు మూడో నెల” అని సరోజ అనడం నీలా, సిద్దమ నాయుడు మొకాన నెత్తురు చుక్క లేకుండా విన్నారు.

ఆ రాత్రి నీల – సరస్వతినీ, ఆర్ముగాన్నీ దగ్గిరికి తీసుకొని, “మీకు ఎవురుండారు నా బిడ్డలాలా! ఒక పెద్దమా, వొక పెద నాయినా? వొక అత్తా, వొక మామా? మీరు దిక్కులేని పచ్చులు గదంఁడ్రా. మీ అమ్మ రెక్కలూ, మీ అయ్య రెక్కలూ తప్పించి మీకు ఆస్తులేమి వుండాయిరా, యెఁర్రి నాగన్నలాలా!” అని ఏడుపు పాట పాడింది, అక్కుసుతో.

# నా కుశాల - నా మనేద

నేను రాసిన వాటిని వరసబెట్టి
ఆంధ్రజ్యోతి వీక్లీలో వేస్తూ వచ్చిన
పురాణం సుబ్రహ్మణ్య శర్మ...

# నా కుశాల - నా మనేద

మా ఇస్కూల్లో నాతో గూడా చదువుకొనే వాళ్లందరి అమ్మలూ మంచి వొగిసు మింద వుండేవాళ్లు. నారాగోరాగా కష్టిం చెయ్యకుండా, నిమ్మతిగా బతికే ఉమామహేస్పర నాయుడి అమ్మ ముత్యాలక్క - నల్ల రూపాన నమనమలాడతా వుండి, మొన్నామొన్ననే మనోరమ అనే ఆడబిడ్డిని కని వుండింది. మా పెద నాయన కోడాలు సాయిత్ర వొదిన కూడా అప్పట్లో కడుపుతోనే వుండిందంటే అర్తం, ఉమ్మడి అమ్మ ముత్యాలక్కకూ, మా వొదినకూ వురామారిగ్గా అంతే వొగిసు అని గదా. ముత్యాలక్క ఎప్పుడూ ఎనిమిది మూర నేత కోక - పచ్చది - కట్టుకోని, తెల్ల రైక యేసుకోని, నవ్వు మొకాన పెద్ద బొట్టు బెట్టుకోని 'నాకేమి దిగులా బయమా?' అన్నట్టుండేది.

రాజగోపాల నాయుడి అమ్మ గూడా వొక్క యెంటిక గూడా నెరవకుండా వుండి, రేపో ఎల్లుండో నీళ్లు పోసుకోబోయే ఆమె మాదిరిగా వుండేది. (నిజ్జంతోనే, ఆమె నేను ఏడో తరగతిలో వుండంగా మేనక అనే ఆడబిడ్డిని కనింది.) నా కన్నా ఒక తరగతి పైన వుండే రామా నాయుడి అమ్మ కిష్టమ్మ అవితే పచ్చ పసుపుగొమ్ము తుంచి చూస్తే ఏ మాదిరిగా వుండేదో, ఆ మాదిరిగా వుండి తొమ్మిది నెలల బిడ్డిని కడుపులో బెట్టుకొని వుండేది. అందరి అమ్మలూ యీ మాదిరి పచ్చంగా వుంటే నా వొక్కడి అమ్మ మటుకు బక్కబక్కగా వుండి, వొంటి మింద చియ్య లేకుండా ఎండక పోయి, ఇందిరీగాందీకి మాదిర ముందర యెంటికల్ని నెరవబెట్టుకోని వుండేది. మా ఇస్కూలు మొత్తం మింద నాకు తోడుగా వుండినోడు వొక్క వూదోడు మాత్రమే. వాడి అమ్మ ముసిలమ్మా, మా అమ్మా వొకే వొగిసులో వుండే వోళ్లు. వాడు గూడా యీ కలిగ్గం మింద వాడి పని వాడు జూసుకోని నన్ను వొంటి గాణ్ణి జేసి కైలాసానికి పూడ్సినాడు. ఇంక నాతో గూడా మిగిలిన ఉమ్మడు, రాముడు, రాజగోపాలుడు - వీళ్ల అవ్వల వొగిసు వుండేది మా అమ్మది. ఉమ్మడొచ్చి మా అమ్మను 'అమా' అని గాకుండా 'అవా' అని పిలిచేయొచ్చు. రాజగోపాల నాయుడి అవ్వ రామస్తానమ్మయితే మా అమ్మ దోవలో యాడన్నా ఎదురు పడితే

ఆమె మా అమ్మను 'వో వొదినా!' అని పిలిచేది. ఇంగ జూడండి, వాళ్ల అవ్వల వొగిసు మా అమ్మకు వుంటే యింగ నా కడుపు ఎట్ట రగలక పోవును!

మా అమ్మకూ నాకూ నడి మద్యన వుండే ముదిగారం, యీ ఎండలు గాసే బూ మండలాన ఏ అమ్మకూ కొడుక్కీ వుండక పోవును. మేమిద్దరం అమ్మా గొడుకులం మాదిరిగానే గాకుండా అచ్చు బావామర్దాళ్లుగా గూడా వుండేటోళ్లం. మా అమ్మ నన్ను ఎక్కడలేని నవ్వు మొకంతో, 'నువ్వు బోరా ముండ నా బట్టా' అని అంటే, నేను గూడా అంతే నవ్వు మొకంతో 'నువ్వు బోయే రండ నాయాలీ ముండా!' అని కొంగును బట్టి యిట్ట లాగేస్తాను. మా యమ్మ నెలకొక్క సారి, రెండు నెలలకొక్క సారి మడికాడ నుంచి ఆమె పని ఆమె జేసుకొని వచ్చిందల్లా, నేరుగా యింట్లోకి రాకుండా వీదిలోనే నిలబడి పోయి, మా అక్కను 'నీళ్లు కాగబెట్టమ'నేది. అప్పుడు నేను మా అమ్మ దగ్గిరికి 'అమామే' అని పరిగెత్తతా బోయి కాళ్ళను కావిలించుకోబోతే మా అమ్మ, "ఒరె వొరె, తాకద్దు. కడగా వుండు." అని నన్ను తాకనీకుండా అరిచేతుల్ని అడ్డం బెట్టి కొంచిం దూరంగా జరిగేది. 'ఎట్టయినా సరే, ఈ మనిసిని యిప్పుడే తాకాల, కావాల!' అని నేను మొండి పట్టుకు పొయ్యేవాడ్ని. "ఏమమా, తాకితే? నేను తాకతా." అని నోటితో కన్నా కండ్లతోనే ఎక్కువగా మాట్లాడే వాడ్ని. మా అమ్మకు అప్పుడేమయ్యిందో నాకు చిటికేసినంత సేపుట్లో తెలిసిపొయ్యేది గాని, నేను మాత్రం తెలవనట్టుగా వుండి, 'అంటుకోన్లే, అంటుకోన్లే' అని మా అమ్మను ఏమార్చి గబీమని మా అమ్మ కోకను పట్టుకొనేసి, "అమ్మ, పట్టుకొనేసినా, బాగ పట్టుకొనేసినా. అయికోరట్లో దావా యేస్కో బో యింక." అని నిమ్మళ పడే వాడ్ని. మా అమ్మ మొకం నిండా బారడు పొడుగు నవ్వును బెట్టుకోని, "తంతా పట్టుకోని. కోతి మొకమోడా!" అనేది. మా అమ్మకూ, నాకూ మద్దెన ఈ రకం ముదిగారం గూడా తొందర్లోనే పూడిసింది. నేను గమనిస్తానే వుండినాను గదా– నేను అయిదో తరగతిలోనో దేనిలోనో వుండంగా, మా అమ్మకూ నాకూ మద్దెన ఇటుమంటి ముదిగారం జరగనే లేదు. అయిదారు నెల్లు గడస్తా వుండినా మా అమ్మ నన్నెప్పుడూ, 'కడగా బో. నేను బైట జేరినాను. నన్నంటుకోబాక.' అని నాతో అననే లా. నేను ఈ మాట మా అమ్మను మాత్రం అడగలేదు గాని 'ఏమిరా, మన అమ్మ బైట జేరడం మానేసిందా ఏమి?' అని నాలో నేనే అనుకుంటా

వచ్చినాను. 'ఆమె కావాలనుకుంటే బైట జేరి వొద్దనుకుంటే కాకుండా వుండచ్చా ఏమి?' అని నాకు సందేకంగా వుండేది. ఒక రోజు బూశమ్మ అనే మా వూరాడామెతో మా అమ్మ మాట మింద మాట అంటా ఈ మాట గూడా అనింది: "ఆర్నెలయ్యిందమ్మీ, నేను అంటయ్యి–" అని దిగులు మొకంతో అనింది. ఆ మాటను నేను వినిన కాడ నుంచి 'అయ్యో, మన అమ్మ వొంట్లో ఏందో మిస్టీకు వుండాది. యింగెట్ట సామీ.' అని నేను ఒకే మదన బెట్టుకున్నాను.

ఒక రోజు మా అమ్మ మా కయ్యిలో ఎండలో వొంటిగా పని చేస్తా కుశాల మింద వుండినప్పుడు నేను ఒక మాట అడగాలని, ఆ మాటా ఈ మాటా మాట్లాడి ఆమెను లొంగేసుకుని, "ఏమమా! నువ్వు అంటు గావాటం లేదేమమా?" అనడిగినాను. ఈ మాట అనినందుకు నన్ను మా అమ్మ, "నా సిన్న కొడుక్కి పెశండాలు జాస్తి!" అని ముదిగారంతో అని అప్పుటికప్పుడే గొంతును మార్చి, "నేనేమన్నా కొత్త పెండ్లి కూతుర్నంటరా సినబ్బా? నాది అంతా అయిపొయ్యింది గదా. ఏ పొద్దు సినిగిపోబోతాదో నా సీటీ!" అని పొడుగ్గా ముక్కుల గుండా, నోటి గుండా ఒకే దపాగా గాలి వొదిలింది. కొంచేపు గమ్మున వుండి, "ఎమికల్లప్ప నాలో ఏముండాది రా! నేన్నీ కంటికి అన్నిందాలా సక్రంగా వుండే ఆడదాని మాదిర కనబడతా వుండానా, ఎట్ట? నాలో నెత్తురు యాడిది చెప్పు, నెలనెలా ముట్టయ్యే అందుకు?" అని యాష్టగా మాట్లాడింది. ముందే బయస్తుడ్నయిన నాకు ఈ మాటలతో వూపిరి తిరక్కుండా పొయ్యింది. 'ఈ మనిసి ఏ పొద్దో ఒక పొద్దు మన నెత్తిన రాయి యేసేసి ఆమె పాటికి ఆమి పోబోతాది.' అనిపించి నాకు గుండికాయలు నీళ్లయి పొయ్యేవి. నాతో కూడా చదువుకునే వాళ్ళ అమ్మలు, వాళ్ళ పిలకాయల పెండ్లిండ్లు జూసి, వాళ్ళ పిలకాయలకు పుట్టిన పిలకాయలను గూడా ఎత్తుకొని అచ్చటా ముచ్చటా తీర్చుకుంటారు గదా! మన అమ్మకు ఆ బాగ్గిం వుంటాదో వుండదో! – ఈ రకమైన బాద బెట్టుకొని నేను సగానికి సగమైపొయ్యే వాడ్ని. దీనికి తోడుగా మా అమ్మ గూడా అప్పుడప్పుడూ నవ్వతానే, "సినబ్బా! నువ్వు పక్కలోకి పెళ్ళాన్ని తెచ్చుకొనేదాక నేనుంటానో వుండనో రేయ్! నీకు పిలకాయలు పుడతారు గదా! వాళ్ళతో నా పేరు చెప్పుకుంటావో చెప్పుకోవో? 'ఒక వొక్కల ముక్కల ఆడది నన్ను కనింది. అది నన్ను సాకి సంతరించడానికి

ఎద్దును మోసినంత, గువ్వను పట్టినంత – అగచాట్లు పడింది పాపం!' అని నన్ను గుర్తులో బెట్టుకొని నీ బిడ్లకు చెబతావా చెప్పవా? ఏమోనబ్బా నిన్ను జూస్తా వుంటే నా పేరు జెప్పే వోడివిగా కనబళ్ళా నువ్వు." అని మా అమ్మ 'ముందుముందు బతికే వాడివి గదబ్బా నువ్వు, నేనంటే చచ్చేదాన్ని' అన్నట్టు నిష్టూరం మాటలన్నీ మాట్లాడేది. మళ్ళ ఎంత బతుకు బతికినా మాత్రం అదేమి బతుకు? 'అమా మే' అని పిలిస్తే పలికేటందుకు అమ్మ లేకపోతే అదేమి బతుకు అనిపించి మా అమ్మ మాటలకు నేను ఎంతగానో నొచ్చుకుంటా, ఒక పక్క బయపడతానే ఇంగొక పక్క దైర్నం కూడ గట్టుకోని, "అమా, ఇట్టా మాటల వల్ల ఏమి పలం? కూటికొస్తాయా గుడ్డకొస్తాయా? ఇట్లా దరిద్రపు మాటలు ఎప్పుడూ మాట్లాడద్దమా!" అనేవాడ్ని. ఇటుమంటి దైర్నం మాటలను నోట బెట్టేటప్పుడు – కడుపులో అంత బయం వుండాది గదా – అందుకని నా గొంతు నాకు తెలవకుండానే మారిపొయ్యేది. నేను దిగులు నిండిన గొంతుతోనే, నాకు నేనుగా నిమ్మళం పడడానికి, "అదంతా ఏమి గాదు. దేముడు అంత కర్మిడా ఏమి? మనం ఒకర్లో ఒకరం బాగా కలసక పొయ్‌నాం గదా. ఆయన మాత్రం మనల్నెందుకు యేరు జేస్తాడు? ఇంక నువ్వు ఎట్ట లేదన్నా నలపై యాపై ఏండ్లన్నా బతకతావు... నా మాట తప్పైతే అప్పుడడుగు." అని నేను మా అమ్మ ఆయుసును చూసేసి వచ్చినోడి మాదిరిగా చెప్పేవాడ్ని. 'మన బిడ్డి కడుపులో యేదో అల్లాటం బెట్టుకొని కుంగిపోతా వుండాడు. వాణ్ణెందుకు యింగా బయపెట్టి చంపడం?' అనుకోని మా అమ్మ గమ్మన వుండకుండా, "నలపై యాపై గాదు, ఇంగ అరై డెబ్బై య్యేండ్లు బతకతాను వుండండి, నా చేత కస్టం చెయ్యించుకోని తిందురు." అనేది. నేను వులసరక పోయి మా అమ్మకల్లా చూస్తా వుండినా మా అమ్మ "బయపడద్దురా యెర్రి నా కొడకా! ఇంక నూరేండ్లు నిన్ను కాపెట్టుకొని వుండనంటరా సినబ్బా!" అని అనకుండా, "ఇంక మహా అవితే, నిగిడి నిగిడి అయిదారేండ్లు బతకబోతా!" అని నన్ను యింగా యింగా బాద పెట్టేది. ఇంగ అయిదారేండ్లు పోయినాక మనము ఏమిగా వుందుము? పదో తరగతి చదవతా వుందుము. అప్పటికంతా మన అమ్మ మనకు వుండదా? మనం పదో తరగతి పరీచ్చలను వొడమాలపేట సెంటర్లో రాస్తా వుంటే మన అమ్మ చచ్చిపోయినట్టు మనకు కబురు వస్తిందా ఏమి? 'ఛూ

తప్పు. ఈ మాదిరి దరిద్దరంగా ఆలోసినలు జెయ్యగూడదు. అంతా మన బెమత.' అని ఆ సంగతిని ఎంత మరిచిపోదామన్నా మరుపు వచ్చేది గాదు. 'పదిలో గాకుంటే యింటర్మేట్టులోనన్నా–' అనిపించి నా గుండికాయల్లో జెరం గాసేది.

నాకీ యాద గుర్తుకు వస్తేనే దప్ప – మిగతా అప్పుడంతా నేను ఎంతో కుశాలగా వుండేవాణ్ణి. ఒక పక్క వొక్కల ముక్కల కూడు తింటానే వుండినా, యింగొక పక్క వొక్కల ముక్కల గుడ్డ కట్టుకుంటానే వుండినా, మా అమ్మతో కోటలు దాటే మాటలను చెప్పతా నేను ఎక్కడ లేని సుకాన్నంతా అనుబోగించే వాడ్ని. పసిబిడ్డిగానే వుండినా మాటలు జెప్పతానే బతక లేదు నేను. నాకు చేతనైన పనిని నేను చేస్తానే మా అమ్మకు, మా నాయినకు ఎంతో సకాయంగా వుండినాను. నేను అడివిలోకి ఎనుమును తోలుకొని పోయి (ఇస్కూలు లీవులప్పుడు) మేపుకొని వచ్చే వాడ్నిగదా! కాళ్ళకు చెప్పులు లేని నేను కాళ్ళ నిండికి ముండ్లను తొక్కుకొని వచ్చేవాడ్ని. అడుగు కింద బెడితే సురక్ సురక్ మనేది నా పాదం. ఆ కాసింత నెప్పికే నేను మా అమ్మ దగ్గర వూరెత్తక పొయ్యేటట్టు అరిచేసే వాడ్ని. 'మన కాళ్ళకు చెప్పులుంటే ఈ ముండ్లు యిరిగేవి గాదు గదా, మనకు చెప్పులు లేకపాయినే!' అని నేనెప్పుడూ మదన పడలా. ఎనుమును తోలుకొని సందేళ ఇంటికి వచ్చేసరికి మా అమ్మ వోపినన్ని పనుల్లో మునిగిపోయి వుండేది. ఆ మబ్బులో పిన్నీతో ముండ్లు కుట్టమని నేను మా అమ్మతో పోరకలాడే వాడ్ని. మా అమ్మ సందేళ పూట చెయ్యాల్సిన పనులన్నీ బిరిబిరా చేసేసి దీపం ముందర కూర్చోని, "కట్టెల మోపు మోసే నాకు పూల గుత్తి బరువా?" అనంటా నా పాదాన్ని ఒళ్ళోకి తీసుకోని కుచ్చునేది. దీంతో ముండ్ల బాదను నేను మరిచిపోయి ఎంతో దరజాను అనుబోగించే వాడ్ని. మా అమ్మ దగ్గర గెంటసేపు ముండ్లు కుట్టించుకోని, ఆ గెంటా నేను కైలాసాన్ని చూసేవాడ్ని. మా అమ్మ ముండ్లన్నీ కుట్టేసినాక కుశాల నిండిన గొంతుతో, "నన్ను ఏపించే దానికి పుట్టినావు నువ్వు. అదేమోరా సినబ్బా – నువ్వు వొద్దంటే పుట్టినోడివి గదా, అందుకే నేమో నువ్వంటే నాకింత ప్రానం." అనేది. ఈ రకం మాటల కోసరం నేను కావాలనన్నా ముండ్లు తొక్కి, మా అమ్మ చేత కుట్టించుకోని నేను కుశాలతో నా కడుపును నింపుకునే వాడ్ని. ఇదంతా గూడా ఎందుకు? దీన్ని జూడండేమి

– మా ఇంట్లో ఒకే ఒక దుప్పిటి (మా నాయినది) తప్ప యింగొకటి వుండేది గాదు. చింత మాకులు కూడా గజగజ వొణికే కాలంలో కూడా నేను నా వొంటి నిండికి దుప్పిటి కప్పుకోలేదు. ఉమామహేస్పర నాయుడికైతే ఇరైనాలుగు రూపాయల దర జేసే సోలాపురి దుప్పిటి వుండేది. దీంట్లో పొనుకుంటే ఎంత యెచ్చంగా వుంటాదో – అని వాడు నన్ను మాటి మాటికీ వూరించే వాడు. నేను మాత్రం రాత్రి పూట ఎప్పుడూ మా అమ్మ విప్పేసిన కోకనే కప్పుకొనే వాడ్ని. ఆ కోకకు ఎన్నో చిరుగులు వుండేవి. మా అమ్మ రాత్రి పూట నన్ను పడుకో బెట్టి నా మింద కోకను జాగర్తగా కప్పి, “కదలకుండా మెదలకుండా పొనుకో. అట్టా ఇట్లా మెసిల్నావో, గొంతు మింద కాలేసి తొక్కేస్తా, కోక పూరాగా చినిగి పోతింది మళ్ళ–” అని నాకు యెచ్చరిక జేసేది. మా అమ్మ కోక యెచ్చంగా వుండే బదులు ఎంతో చల్లంగా వుండేది. ఉమామహేస్పర నాయుడి దుప్పిటి తల బిరుసుగా వుండి, బలే పోజులు కొడతా వుండినట్టు అనిపించేది నాకు. నేను కప్పుకునే కోక మాత్రం ఎంతో అణకవగా వుండి, నాకెంతో ఇస్టంగా వుండేది. నేను చలికాలంలో నిద్దర లేచి, అదే కోకను మా అమ్మ దగ్గర యెచ్చిరికగా కప్పించుకోని – మా మడి కాడికి పోయి దొడ్డికి కూర్చుని వచ్చేవాడ్ని. సోలాపూరు దుప్పిట్లు కప్పుకోని మళ్ళ కాడ తిరుగులాడే సిన్నా పెద్దా నా కోకను జూసి, “వొరె ఆడంగులోడా! సిగ్గు లా, ఆడోళ్ళ కోకల్ను కప్పుకొనేదానికి?” అని తమాసకు గేళి జేసే వాళ్ళు. వాళ్ళ – ఎగతాళ్ళకు నేను మూతి మూరడు పొడుగు బెట్టుకొని, “మాకు దేముడిచ్చింది ఇదేనయా! కడంత గాలం కప్పుకునే దానికి మాకీ కోక వుండినా చాల్లే పొండి.” అనే వాడ్ని. ‘కోకలో వుండే అనుబోగం మీకేమి తెలుసురా ముండ నా కొడకలాలా!’ అని లోపల అనుకునే వాడ్నే గాని ‘వాళ్ళకు వుండే దుప్పిటి మనకు లేకపాయ గదా!’ అని నేనెప్పుడూ కుళ్ళి పోలేదు. (ఇప్పుడు నా బారిలోకి కొత్తగా ఒక ఆడది పెళ్ళాంగా వచ్చింది గదా! దాన్ని నేను చెప్పుతో కొట్టే వాణ్ణి కాకపోవడంతో అదెప్పుడూ ఎంతో పొందిగ్గా వుండే నేత కోకలు కట్టకుండా, ఇంట్లో గూడా సదా అమిరికను జారిజట్టు, నైలాను కోకలు కట్టడంతో నా ఆశిని తీర్చుకోలేక పోతా వుండాను. నేను దాని నోటికి బయపడి ఇప్పుడు నా వొంటి మిందికి దుప్పిట్లనే కప్పుకుంటా అరాకొరా నిద్దర్లతో యికారపు బతుకు బతకతా వుండాను.)

మా ఇంట్లో మా నాయినకు రెండు పై గుడ్డలు వుండేవి. అవి ఎప్పుడూ బలే యికారంగా వుండే చెమట వాసనతో వుండేవి. నేను సందేళ సందేళ నీళ్లు పోసుకుని పెళ్ళో నుంచి బైటికి వస్తే మా నాయిన, "యింద. తుడుచుకో." అని పై గుడ్డను అందించే వాడు. నేను దాన్ని అందుకోకుండా మా అమ్మ కొంగు కోసరం అల్లాడే వాడ్ని. ఆ సమియానికి మా అమ్మ ఇంట్లో లేకుండా వుంటే మా కాడిమాను దండెం మింద – మా అక్క పావళ్ళు వుండేవి. ఆ పావడతో నేను నా వొంటి మింది తేమను ఎంతో కుశాలగా తుడుచుకునే వాడ్ని. ఈ రకంగా పావడతోనే ఒళ్ళు తుడుచుకోవడం అలవాటై పోయింది నాకు. ఒకవేళ మా నాయిన పైగుడ్డ – వుతికింది – దండెం మింద వుండినా నేను దాని జోలికి పోయేవాడ్ని గాను. మా అక్కకు గూడా రెండంటే రెండే పావళ్లు వుండేవి. మా అమ్మకు దండిగా వయసైపోయింది గదా. (అంటే ముప్పై అయిదేండ్లుంటాయి మఖా అయితే!) అందుకని మా అమ్మ – రామా నాయుడి అమ్మ, ఉమామహేస్వర నాయుడి అమ్మల మాదిరిగా కోక కింద పావళ్ళు కట్టేది గాదు. మా అక్క ఒక పావడను ఎప్పుడూ కట్టుకొనే వుంటాది గదా. మిగిలిన పావడ – చాకలోళ్లకని విప్పేసి వుండినా – నేను నీళ్లు పోసుకుంటానే, పాత గుడ్డల కాడికిపోయి యెతుకులాడి తుడుచుకొని నిమ్మళపడే వాడ్ని. ఒక దపా నిజంగానే, మానాయిన పై గుడ్డలు చలవ అయివుండినా, వాటిని నేను ఎడం చేత్తో గూడా తాకకుండా, మరకలతో నిండి వుండిన మా అక్క పావడను చేతికి తీసుకొని తుడుచుకుంటా వుంటే, మా అక్క చూసి, "ఆడంగుల నా బట్టా, మొగ పుట్టక ఎట్ట పుడితివి రా? అది ముట్టు పావడ గదా!" అని నన్ను చావగొట్టేసింది. తుడుచుకోవాలసిన నా పని అయిపోయింది గదా. అందుకుని "నీ యిష్టం వచ్చినట్టు కొట్టుకో." అని మా అక్కకు వొళ్ళు అప్పజెప్పేసి నేను నవ్వతా నిలబడి పోతిని. (మా అమ్మ నాకు మళ్లా నీళ్లు పోసింది.) 'మన వొళ్లు సుబ్బరంగా తుడుచుకు నేటందుకు మనకు టరికీ టవళ్లు ఒకటికి రెండు లేకపాయ గదా!' అని నేనెప్పుడూ మనుసులోకి రానియ్య లేదు.

ఇప్పుడు నేను చెప్పతా వుండేది ఏందంటే– అది గావాల, ఇది గావాల– అని నేను అనకనే వుండినానా అంటే, అనినాను. అవితే, ఎప్పటికప్పుడు అవన్నీ మర్చిపొయ్యే వాడినే గాని, ఎల్లకాలం అదే మనుసులో బెట్టుకొని

నేను దిగకుంగి పోలేదు. 'బూములు బావులు మనకు దండిగా లేకపాయనే! అందరాల బతుకు మనిది కాకపాయెనే!' అని దిగులు బెట్టుకోకుండా, 'ఇప్పుడు మనకేమి తక్కవగా ఇచ్చినాడు దేముడు? మాలామాదిగి కొలంలో పుట్టించ కుండా కమ్మ కొలంలో పుట్టించినాడు. ఎవురికీ దొరకని అమ్మను యిచ్చినాడు. అంతోయింతో కయ్యాగాలవ ఇచ్చినాడు. ఒక అక్క, ఒక అన్నా వుండారు. అన్నిటికీ మించి మనల్ని తల్లీదండ్రికి సిన్న కొడుకుగా పుట్టించినాడు. ఆయైన బతుకు గదా బతకతా వుండాం.' అని అనుకొని నాకు నేను ఎంతో నిమ్మళం పొందతా వుంటే ఎవురూ తీర్చలేని ఇదొక యాదన బట్టుకొని నన్ను వుడకాడిపించింది.

నాకన్నా రెండుమూడు సమ్మచ్చరాలు చిన్నవాడైన దేవానందమ నాయుడి అమ్మ – జయమ్మ – ఒక నాడు వున్నట్టుండి ఉరుబోసుకొని చచ్చిపొయ్యింది. బిచ్చిగాడికి, అచ్చిగాడికి సంగటి కవణాలు బాగా యేస్తిందని, చేతికి సన్న యెమిక గూడా లేని దరమాత్తుమురాలని ఆ మకాతల్లి వూళ్ళో మంచి పేరెత్తుకొని వుండింది. "ఇక్కడ మనుసులకు కొరత బడింది. నా పూల తోటకు నీళ్లు పోస్తా నా దగ్గిరే వుందువు రా." అని దేముడు ఆమెని పిలిచి శత పోరకుంటే, చిన్న పిలగాడ్ని వొదులుకొని వురుబోసుకుందారని ఆమికి ఎందుకు పుట్టినట్టు ఆ బుద్ది? ఏడెనిమిదేండ్ల ప్రాయంలోనే అమ్మను పోగొట్టుకున్న దేవడంటే వూళ్ళో తల్లులందరికీ అయ్యోమని వుండేది. దేవానందడి అవ్వ (వాళ్ళ అమ్మ అమ్మ )– మా అమ్మ కంటే కొంచిం పెద్దది – వాడ్ని సాకి సమరచ్చిస్తా వుండింది. 'వాళ్ల అవ్వ మాత్రం యింగెన్నేండ్లు బతక బోతాది? మఖా అంటే పదేండ్లు. మళ్ల దేవడు దిక్కు లేనోడే! పాపం ఏ పొద్దుటి కన్నా దేవడు దిక్కు లేనోడే!' అని మా వూరాడోళ్లు కొందురు అనుకొనినారు. దేవడి అవ్వ పండు జిల్లేడాకు రంగులో వుండి, చూసే దానికి మాత్రం మా అమ్మకంటే బలంగానే వుండేది. వాళ్లు మా కన్నా గూడా కొంచిం మకరాజులుగా వుండడంతో – ఆమె వొంటికి మించిన కష్టం గూడా చేసేది గాదు. అటుమంటి ఆమే ఇంక పదేండ్లు బతికితే, ఇంక మన అమ్మ ఎన్నేండ్లు బతకబోతాది! – అని నాకు నా యాద రెండింత లయింది. అమ్మను మింగేసిన దేవడు సందేళ ఆరున్నర గెంటలయినా నీళ్లు పోసుకోవడానికి వాళ్ల అవ్వ దగ్గరికి పోకుండా, దిగులుతో మొండిగోడల

దగ్గిర కూచ్చోని వాడిలో వాడే వుండిపొయ్యేవాడు. 'అమ్మ యాడికి బోతే ఆడికి బోయి, ఆ మాటా ఈ మాటా మాట్లాడేటందుకు వాడికి అమ్మ లేకుండా పోయింది గదా' అనిపించి వాడ్ని జూసి నాకే కండ్ల నీళ్లు గమ్మేవి. 'అదే గతి గదా– ఇంక పదేండ్లు బోతే మనకు గూడా!' అని అనిపించే సరికి నేను మనిసిని గాకుండా పొయ్యేవాడ్ని. ఒక రోజు మా అమ్మ శెనగ తోటలో కసువును తొలికతో తొవ్వతా వుంటే నేను పక్కన జేరి, "నువ్వు చచ్చిపోతే మళ్ల ఎట్టమా నా గెతి? మళ్ల నేను మాత్రం వూపిరి పెట్టుకొని వుండబోతానా?" అని అడిగేసినాను. మా అమ్మ అందుకు బదులుగా గబక్కన, "ఆ, వుండక. నువ్వు గూడా నాతో చచ్చిపోబోతావా ఏమి?" అనింది. ఈ మాటకు నేను గూడా ఏమన్నా అందామని అనుకుంటా వుండంగానే మా అమ్మ, నాకా తావకాశం ఇయ్యకుండా "సినబ్బా, ఇప్పుడంటే నువ్వు – పసిబిడ్డివి గాబట్టి నామింద ఇంత అల్లాటం పెట్టుకుంటివి. ఇంక పదేండ్లకో పదైదేండ్లకో ఒకదాని మెళ్లో బొట్టు కడతావు గదా. ఒకేళ మళ్ల నేను బతికుండినా నువ్వు నన్ను తలస్తావా? పెళ్లాం మైకంలో బడిపోవా? ఇప్పుడందురూ ఇట్టనే అంటారు – కాలం గడుపుకునే దానికి. మళ్ల ఎవ్వరూ తల్లుల మాట యినరు. నేను చచ్చినాననుకో ఈడ్చి ఆడ పారేస్తారు. నువ్వు పెద్దయినాక యింతే జాతిగా వుండినావే అనుకో – నా మింద గ్యాపకం నా దినం తీరేదాకా వుంటాది. మళ్ల వుండనే వుండదు. మళ్ల నువ్వెవ్వరో నేనెవుర్నో?" అనింది. ఆ మనిషితో యింక ఏమీ మాట్లాడలేక, అక్కడ వుండాలేక – నేను మా అమ్మ దగ్గిర్నించి ఎట్ట వొస్తినో గాని ఎవురూ లేకుండా దూరాన వుండే ఒక కానగమాకు దగ్గిరికి వస్తిని. అక్కడికి వచ్చినాక నా కడుపులో ఎన్నోనాళ్ల నుంచి పేరక పోయిన దుఃక్కాన్నంతా యెళ్లబోసుకుంటిని. 'ఓ' అని ఎక్కిళ్లు పెట్టేస్తిని. నా ఏడుపంతా నేను ఏడుచుకునేసినాక ఎన్నో జాగర్తలతో వుండాలను కున్నాను. ఇంక పదేండ్లలో మనకు పెండ్లీడు వస్తింది గదా. అప్పుడు నిదానమ్మింద బాగా చూసుకుని, ఒక్క గుంట నా పేరన రాసియ్యక పోయినా– మంచి గుణమంతురాలై వుండి, నాకూ మాయమ్మకూ అణిగే ఒక ఆడబిడ్డని జూసి పెండ్లి జేసుకోవాల. అప్పుడు నేనూ, నా పెండ్లాం – మా అమ్మ చేత యిట్ట వుండే పుట్ట అట్ట వెయ్యించకుండా వుండి, మా ఇద్దరమే కష్టం చేసి, మా అమ్మను కూర్చున బెట్టి కూడెయ్యాల. ఏ అగచాట్లో

ఒక అగచాట్లు పడి మా అమ్మ మెళ్ళోకి మేము మూడు సవరాల బంగారుతో ఒక బొందారాన్ని చెయ్యించి మెళ్లో యెయ్యాల. మా అమ్మ చేతలకు నాలుగు బంగారు గాజులు చెయ్యించాల. నేను పెండ్లి చేసుకున్నాక గూడా ముందు అమ్మను అనుకొని, మళ్ల పెళ్లాన్ని అనుకోవాల. మన అమ్మకు మన పెళ్లాం యెతిరేకంగా యేదన్నా చేసిందంటే, వచ్చే పాపం రాసే వస్తిందని, దాన్ని పిడి గుద్దులు గుద్దాల. మనం పెండ్లి చేసుకున్నాక గూడా – రాత్రి పదీ పదకొండు గంటల దాకా మనం మన అమ్మతో మంచీ చెడ్డా అదీయిదీ మాట్లాడి, మళ్లనే పెళ్లాం దగ్గిరికి పోయి పడుకోవాల. పెద్దయినాక మనం ఎట్లా సేద్యమే గదా చెయ్యబోతాము. అప్పుడు మనకు ఒక గొర్రీమేకా వుంటాది గదా. ఆరేడు నెలలకు ఒక గొర్రిని కోసి, ఎండేసి ఆ వుప్పాంసులను మన అమ్మకు పూటపూటా పెట్టాల. మనం, మన పిలకాయలం ఒక్క తునకను గూడా ఆశించగూడదు. ఆమి పేరు మింద గొర్రిని నరికి, మనము, మన పెండ్లాము, మన పిలకాయలు తినెయ్య గూడదు. మన అమ్మ – మనం తినకుండా ఆమె ఒక్కటే తింటిందా? తినకపోయినా, మనం బలంతాన తినమనాల. పసి పిలకాయలైన మన బిడ్డలను పిలిచి మన అమ్మ చియ్యలకూర అంతా వాళ్లకే పెట్టేస్తింది. మన అమ్మ బుద్ధి మనకు తెలుసు గదా! అందుకని మనం మన పిలకాయలను అంటే మాయమ్మ మనవళ్లనూ, మనవరాళ్లనూ మన అమ్మ తిండి తినేటప్పుడు దగ్గిర చేరనీ గూడదు. ఇవన్నీ మనం కట్టుగా అములు పరచాల. నేను వీటినన్నిటిని యోచన జేసుకుంటా 'వీటిని ఎక్కడ మనం తప్పతామో' అని బయపడి, ముందుగానే ఒక పచ్చనాకును చెట్టులో నుంచి పెరుక్కొని, దాన్ని నెత్తిన పెట్టుకొని, "పచ్చనాకు సత్తెంగా – వీటి నన్నిటిని నేను మరవను. ఒకేళ మరిసినానే అనుకో – నాకు మారు జల్మ వుండగూడదు. నాకు పచ్చివాతం వచ్చి కాలూజెయ్యి ఆడకుండా పూడవాల. పెద్దయినాక నేను మా అమ్మను ఇప్పుడు మా అమ్మ నన్ను జూసినట్టుగా నేను మా అమ్మను జాగర్తగా, ఎన్ను మింద గువ్వ మాదిరిగా చూసుకోకపోతే, దేముడా, పైన దగద్దమానంగా మండే ఓ పరమాత్తమా! నాకు నువ్వు తప్పకుండా పెద రోగాన్ని రానివ్వు. నా కాళ్లూజేతులు పెద రోగంతో తిననియ్యి. ఇదే నా శపత్తం!" అని నేను దేముడితో పతిగ్న జేసుకునే వాడ్ని. నేను మా అమ్మను మరిచే వాడ్ని

గాకపోవడంతో, 'మనకేమీ తగలవులే' అనుకొని నాకు నేను ఎన్నయినా శాపనార్తాలు పెట్టుకునే వాడ్ని.

ఒంట్లో సత్తా లేని మా అమ్మ ఒకేళ నా పెండ్లికి ముందరే చచ్చిపోతే? ఇంగ మనం పదీ పద్దైదేండ్లకు గదా పెండ్లి చేసుకోబోతాము. నా పెండ్లయిన అయిదారేండ్లకే నిజంగానే ఈ మనిసి అప్పుడే చచ్చిపోబోతాది. మళ్ల ఎట్ట సామీ! అమ్మను పోగొట్టుకున్న మనం మళ్ల మన పెళ్లాం పక్కలో పడుకోని బిడ్డిల్ని సాక్కొని, సమసారం చెయ్యబోతామా? ఎవురన్నా ఎట్టనో గాని మనం జెయ్యలేము. అదే కలవరం బెట్టుకొని మనం దినదినానికి దిగ కరిగి పోతాము. ఆ బాద పడలేక ఒక రోజు మనమే పెళ్లాం బిడ్డల మొకం తప్పించేసి, జయమ్మ మాదిరిగా మనమూ వురుబోసుకుని చచ్చిపోబోతాము! ఇదంతా వొట్టిదేనేమో! మన అమ్మ జెప్పినట్టు మనం మన అమ్మ దినం తీరే సరికంతా మరిచిపోయి, పెళ్లాం బిడ్డల మాయిలో బడిపోయి సమసారం చేసుకుంటామేమో! ఒకేళ ఇదే నిజమయినా, మన అమ్మ చచ్చిపోయినా, మనం మన అమ్మను మాత్రం మరిచిపోగూదు. ఆమెనే కలవరంలో పెట్టుకుని వుండాల. ప్రతిరోజూ రాత్రికి మన అమ్మను మనం కలలోకి తెచ్చుకొని చూసుకోవాల. ఆమి కలలో ఏమి నారు పోయమంటే అదే నారును పోయాల మనము. ఆమె మాట పకారం మనం సేద్దాన్ని చేసుకోవాల. మనకు పుట్టిన ఆడబిడ్డికి 'సినక్క' అని మన అమ్మ పేరే పెట్టుకోవాల. మన అమ్మ చచ్చిపోతే ఆమి తప్పకుండా మన కడుపులో పుట్టకుండా పోదు. అక్క కడుపులో, అన్న కడుపులో గూడా పడదు మన అమ్మ. మనమంటే గ్యాపకం జాస్తి గాబట్టి ఆమె తప్పక మన కడుపులోనే పడును. మనకు పుట్టిన మన అమ్మను మనం జాగర్తగా – కింద బెడితే మట్టయితిందని, పైన బెడితే గెద్ద తన్నకపోతింది – అన్నట్టు సాక్కోవాల. ఏదేమన్నా మన అమ్మను మనం కన్రెప్పల్లోనే బెట్టుకొని చూసుకోవాల. మన అమ్మ చచ్చిపోతానే– అది నూరుగానీ ఇన్నూరు గానీ – పోటాలు రాసే వాళ్ళతో చెప్పి మన అమ్మను పెద్ద పోటాలో రాయించి, గోడకు తగలెయ్యాల. రోజూ కొత్త పూలారం తెచ్చి యేస్తా వుండాల. నిద్దర లేస్తానే మన అమ్మకు మనం దండం బెట్టుకోని, మళ్ళ మడకా కాడిమాను బుజాన బెట్టి మనం పనిలోకి దిగాల. సమ్మచ్చరం సమ్మచ్చరం పెద్దల పండగ వస్తాది గదా. ఆ పండగ రోజున మనమంతా

వొక్క పొద్దులుండి, మన అమ్మకు కొత్త కోకలు రైకలు పెట్టాల. మన పెళ్ళాం దీనికి వొప్పుకోకుండా తగలాటానికి దిగతాదేమో! అప్పుడు మనం అందుకు సయించ గూడదు. అది ఆ మాట అననే అంటే మనం దాన్ని – సున్నపు రాళ్ళ తొట్టిలో వేసి విడగ బోసియ్యాల. పాపమే రాదు.

'థూ, మనం మన అమ్మను ఎదురుగుండా పెట్టుకొనే మనమే ఆమికి పాడె గడతా వుండాం గదా! అయ్యో, అయ్యో! ఈ రకంగా మనం మనుసును ఎట్ట బడితే అట్ట పోనియ్యొచ్చా?' అని అనిపించి నా తప్పుకు నేను చెంప దెబ్బలు కొట్టుకునే వాడ్ని. అయినా సరే ఇటుమంటి యాదలు నన్ను వొదిలిపోక చిత్రింసలు పెట్టేవి. మనకు పని లేకపోబట్టి గదా ఇటుమంటి రోత రోత కలవరాలు. మనం పని మింద బడితే ఇవి రావు గదా– అనుకొని నేను ఎనుమును మేపడానికి మా వూరికి పరంటగా వుండే కోనేరు దగ్గరికి తోలుకు పొయ్యేవాడ్ని. అక్కడనే మేము పీనిగలు పూడస్తాము. దాన్ని చూసేసరికి నేను బయపడి పొయ్యేవాడ్ని. మా ఎనుము ఏ బయ్యమూ లేకుండా ఆ స్మశానంలోకి పోయి గుంతల మింద వుండే తులసి చెట్టును మూచూస్తా, అక్కడ వుండే పచ్చి కసువును నాకతా వుండేది. నేను ఎనుమును యివతలికి తోలెయ్యడానికి బయపడి చచ్చేవాడ్ని. అక్కడ కొంత మంది పిలకాయలు – పీనుగలు పూడ్చిన గుంతల మింద వుచ్చలు గూడా పోసే వాళ్లు. వాళ్ళ దైర్నానికి నేను యిచిత్ర పోయి బయపడే వాడ్ని. నేను ఆ వొలికిల మిట్టని అరికాళ్ళతో తొక్కడానికే తనుకులాడి చచ్చేవాడ్ని. నేను స్మశానంలోకి పోలేక దూరాన్నుంచి, "ఇట్ట రాయే ముండ నాయాలీ గొడ్డా! నీకు ఆడేమి పని?" అని మా ఎనుమును దూరం నుంచే రాయితో కొట్టి యివతలకు తోలేసే వాడ్ని. నేను స్మశానానికి కొంచిం దూరంగా నిలబడి, వొంగి గుంతలను కండ్లకు అద్దుకొనే వాడ్ని. ఆ సమియంలో నాకు వొగిసుకు మించిన ఆలోసినలు వచ్చేవి. అక్కడ దేముడు నిలబడుకోని ఒక్కొక్కర్నే, "రండి, ఆ వూరులో ఏమి బాగుంటాది. ఈడయితే అంతా బాగుంటాది. రండి." అని పిలస్తా వుండినట్టు అనిపించేది. ఇదీ నిజిమే గదా. వూరు మనిదా? ఆ ఇల్లు మనిదా? ఇంక పదేండ్లు గాకుంటే ఇరై ఏండ్లు, మఖా అవితే నూరేండ్లు బతకబోతాము. మళ్ళన్నా ఈడికి రావాల్సిందే గదా. ఇదే గదా మనకు శాస్పితం. వూళ్ళో అవితే మనం నూరేండ్లుంటాము. ఈడయితే

లచ్చ ఏండ్లు, శతకోటి సమ్మచ్చరాలు వుంటాము గదా! – అనిపించి నాకు అదంటే బయమూ బక్తీ ఏర్పడినాయి. అక్కడ ఎవురిదో ఎనుము తిరగలాడతా వుంటే – దాన్ని రాళ్ళతో కొట్టి కడగా తోలేసి నిమ్మళ పడినాను. అదంటే బుద్దిలేని గొడ్డు. తెలిసో తెలవకో స్మశానాన్ని కాళ్ళతో తొక్కేస్తా వుంటే, మనకు బుద్దీ గానం వుండి గూడా మనం చూస్తా వుంటామా? – అనుకొని నేను ఒక మంచి పని చేసినట్టు గాలి పీల్చుకున్నాను. ఆ వొలికిల మిట్టని ఎదురుగుండా బెట్టుకొని నేను దూరాన వుండే పుష్పావతిని పిలిచి వొక పెశండం అడిగినాను: "పుస్పా, పుస్పా! నువ్వు ఎవ్వరికన్నా బాకీ వుండావా మే?" అనడిగినాను. ఆ అమ్మి నెత్తిమింద చెయ్యి దించకుండా, "పచ్చనాకు సత్తెంతో సుబ్రమణీ! నేనెవ్వరికీ బాకీ లేననుకో. మొన్న మన బూలోకకు రెండు బలపమ్ముక్కలు యియ్యాల్సుంటే ఇచ్చేస్తి. 'నువ్వు మళ్ళ నాకు యియ్యాల్సిందే పన్లా' అని అన్నా గూడా నేను జమునకు ఇయ్యాల్సిన చెండుమల్లి పువ్వును ఇచ్చేసినా. బాకీలు పెట్టుకోగూడదు సామీ. నేను అయిసుకు గూడా నా దగ్గిర వుంటేనే తీసుకుంటాను గాని, అయిదు నైనా పైసల్ను గూడా బాకీ మాత్రం పెట్టను. తీర్చకుంటే మళ్ల జల్మలో వాళ్ళకు పుట్టి తీర్చాల్సుంటాదంట." అని బారడు పొడుగు పుస్కం చదివినట్టు చదివింది. ఆ అమ్మిని అంతా మాట్లాడనిచ్చి, నేను మెల్లంగా లోగొంతుతో, "'లేదు! పుస్పావతీ! లేదు, నువ్వింగా నీ బాకీ తీర్చుకోలేదు. నువ్వింకా బాకీ పెట్టుకునే వుండావు, వొకరికి" అన్నాను.

ఆ అమ్మి నా మాటలకు బిత్తరకపోయి, నన్ను పెద్దోళ్లు పిలిచినట్టు 'సినబ్బా!' అని పిలిచి, "లేదురా, నీకెవురన్నా నేను బాకీ అని జల్లి జెప్పినారేమో. చెప్పు, అపద్దం చెప్పిన నా బట్టను, నా సవితిని వాయించేస్తా" ననింది ఎక్కడలేని రోసంతో. "నీకు ఆర్నెల్లు టయిమిస్తా వుండాను. నువ్వు ఎవ్వరికి బాకీయో చెప్పుకో" అనేసి నేను ఎనుమును ఇంటికి తోలుకోని రాబోయినాను. పాపం పుస్పావతి కొంచేపు ఆ అమ్మిలో ఆ అమ్మే ఆలోసిన జేసుకొని, "నువ్వే సెప్పు సుబ్రమణీ! నాకు తెలవదు. నువ్వే సెప్పు నేనెవ్వరికి బాకీయో. తీర్చేస్తాను ఇప్పుటికిప్పుడే, నీ కండ్ల ముందర్నే" అనింది ఆ రోసగత్తె. నేను నిదానంతో మాటలను రానిచ్చి, "పుస్పావతీ! నువ్వీ పొద్దు గాకున్నా రేపు గాకున్నా నూరేండ్లు తాలినాకన్నా చచ్చిపోతావు గదా. నువ్వు చచ్చిపోతే

గాని నీ బాకీ తీర్దు. అదే గుంత బాకీ. మనం చచ్చినాక ఒక గుంతను లోడి దాంట్లో మనల్ను పూడస్తారు. అందుకని నీ గుంతకు నువ్వు బలపాలు, అయిసులు గాదమా బాకీ. నీ వొంటిని నువ్వు గుంతకు బాకీగా వుండావా లేదా చెప్పు?" అనడిగినాను. పాపం పుస్పావతికి అప్పుటికి అర్తమయింది. ఆయమ్మి గూడా నా మాటలకు నిరామయం అయిపొయ్యింది.

ఇదే కలవరంతో వుండేవాడ్ని గాబట్టి నాకు ఒక రోజు మా అమ్మ చచ్చిపొయ్‌నట్టు కలొచ్చింది. మా అమ్మమింద పడి నేను లబలబా నోరూ, ఎదుర్రొమ్మూ కొట్టుకొనేసి ఏడిచేస్తా వుండాను. నన్ను పట్టుకొనే దానికి మా వూరోళ్ల వల్ల ఎవ్వురి వల్లా గాలేదు. ఇది కల, నిజం గాదు అని నాకు తెలస్తానే వుండినా నేను మెలకవలోకి రాలేకుండా పోయినాను. మనమిప్పుడు నిద్దర గాని లేస్తే మనం మన అమ్మను బతికి వుండినట్టు చూసుకోవచ్చని నాకు అనిపిస్తా వుండినా లేవలేక పోతిని. వూళ్లో వాళ్లు మా అమ్మను బైటికి తీసుకొచ్చి వుడుకు నీళ్లు పోసినారు. మా ఇంటి ముందర మంట వేసుకొని మాలోళ్లు పలకలను కాగ బెట్టుకుంటా వుండారు. వాళ్లు దరువు మొదలు బెడతా వుంటే మా అమ్మను పాడి మిందికి చేరస్తా వుంటే నేను నోరు కొట్టుకొని, కొట్టుకొని సోదీనాన్ని తప్పి పోతిని. ఇంక మనం మన అమ్మను చూసుకోలేము. ఇంకెప్పుడూ మనమ్మ మనకు నీళ్లు బోసి కూడెయ్యదు. మనమ్మ ఇంగ మన కయ్యలోకి వచ్చి పని జెయ్యదు – అనిపించి నేను ఓ అని తపన పడిపోయినాను. నాకు తెలవకుండానే నా కండ్లల్లో నీళ్లు జొడజొడ కారిపోయినాయి. 'అమామే, అమామే' అని మూలగతా వుండి పోయినాను. అవితే మన అమ్మ మనల్ను వొదలదు. మనం వుండే దాక మన అమ్మ గూడా వుంటింది. మనల్ని బయిపించాలని, మన బిడ్డి మన చావుకు ఏ రకంగా అల్లాడి పోతాడో చూద్దామని మన అమ్మ నాటకం ఆడింది. మన అమ్మ పాడెని దింపుడు కళ్లం కాడ దించతారు గదా. అక్కడ మన అమ్మ, 'నా సిన్న కొడుకేడి? నా సిన్నకొడుకేడి?" అని పైకి లేస్తింది. మనం మన అమ్మను మళ్లా ఇంటికి తొడుకోని వచ్చి, అమ్మను జాగర్తగా చూసుకుంటాము అని ఒక పక్క అనిపిస్తా వుండాది. నా దింపుడు గళ్లం ఆశి గూడా దేముడు నెరవేర్చ లేదు. నేను కండ్లు మూసుకుని మా అమ్మ గుంత మింద పిడికిడు మట్టేసి రుడం తీర్చుకుంటా వుంటే – నేను నిలుపుకో లేక ఎక్కిళ్లు పెట్టేసినాను

నిద్దరలోనే. మా అమ్మ, నా పక్కనే పడుకోని వుండిన – నా గోలుకొండ – వులిక్కిపడి 'సినబ్బా, ఒరే సినబ్బా!" అని బిత్తరక పోయి, పైకి లేచి మంచినీళ్ల లోటాను నా నోటికి కరిపించింది. "నువ్వు చచ్చిపోయ్‌నట్టు కలొచ్చిందమ్మా!" అని మా అమ్మను కరుచుకొని దుఃక్కాన్ని అణసర జేసుకున్నాను.

అప్పుడు నన్ను మా అమ్మ మోకాళ్ల మింద పండేసుకొని, మోకాళ్లను కొంచెం కొంచెం పైకిలేపి నన్ను వూగించి వూగించి, "ఒరే సిన్నయిలూ! ఇదే యాదన బెట్టుకొని నన్ను ఎత్తేస్తావా ఏమి? ఒద్దు కొడకా. ఒద్దు. నీకిదేమి యాదన రా ఎ(ర్రి నా కొడకా! నేను ఎక్కడికి బోతా? నీ పిలకాయలను పెద్దోళ్లను జేసి, వాళ్లకు గూడా ఒక దోవ జూపించి గదా నేను చావబోతాను. నీ యాదన లోకాన యాడన్నా వుండునా? అందుకేనా నువ్వు మొన్నా మొన్న నన్ను గుచ్చి గుచ్చి అడిగింది– 'అమా నువ్వు జచ్చిపోతే మళ్ల నా గతెట్ట?' అని. ఈ దిగులు బెట్టుకో వద్దురా ముండమోపి యెదవా! ఎట్ట బతక బోతావో నా కొడకా నువ్వు?" అని మా అమ్మ ఆ రోజు నన్ను నిమ్మళించింది. నాకు ఇటుమంటి కలలు వస్తే కుశాలగా కూడా వుండేది. నాకొచ్చే కలలు ఎప్పుడూ జరిగేవి గాదు. అందుకని మన అమ్మ చచ్చిపోదు – అనిపించి నా మనసుకు ఎంతో ఆయిగా వుండును. మనం మన అమ్మను గురించి కడుపులో ఇన్ని ఆశిలు పెట్టుకోని వుండాం గదా. కుచ్చున్న చోట కుచ్చోకుండా, నిలబడిన చోట నిలబడుకోకుండా ఆమిని గురిచ్చే మదన పడతా వుండాం గదా. ఇంత యిదిగా అమ్మను గురిచ్చి తపన బడేటోళ్లెవురు? ఇది మంచిదే గదా. మంచి బుద్దే గదా. అందుకని మనం పెద్దయినాక గూడ దేముడు మనకే చెరుపూ జెయ్యకుండా కన్న కొడుకు మాదిరిగా జూసుకుంటాడులే– అని అనిపించింది నాకు. మంచీ చెడ్డా తెలిసినోడు గదా దేముడు. మనమేమన్నా నాకు చదువులు బాగ రావాల. పెద్ద సంబళంతో గవుర్మెట్టు వుజ్జోగం రావాల – అని కోరుకుంటే ఆయనకు కోపం రావాల. మనం అదంతా ఏమీ అడగటం లేదు గదా. మా అమ్మను, మా నాయిన్ను – నా కడంతగాలం నా కండ్ల ముందర వుండియ్యి మహన్న బావా – అనే గదా కోరుకుంటా వుండాం. దేముడు గూడా తప్పకుండా ఇటుమంటి కోరిక్కి మురిసిపోయి మనకు వరమిస్తాడులే అనుకుని నేను ఎక్కడలేని వైబోగాన్ని చూసుకునే వాడ్ని. ఇన్ని అనుకుంటా వుండినా నాకు ఒక పక్క ఆ బగమానుడి మింద అపనమ్మకం గానే వుండేది.

మా పిలకాయలు అనుకునే మాటల ప్రకారం అవితే – దేముడికి కైలాసంలో ఇక్కడ మనకు బూమండలం ఎంత వుండాదో ఆయనకు అక్కడ అంత పూల తోట వుండాది. అంత పెద్ద పూల తోటకు దినమ్మూ నీళ్లు పొయ్యాలంటే మాటలా? దేముడికి ఆ పూల తోట మింద బలే కలవరమంట. ఒక్క ఆకు రాలి కింద పడిపోయ్‌నా అప్పుటికప్పుడే దాన్ని ఎత్తియ్యాలంట. అంత శుబ్బరంగా పెట్టుకుంటాడంట ఆయన ఆ తోటను. ఇంక జూడండి – ఆ తోటను సమరచ్చించడానికి ఎంత మంది గావాల్నో మనుసులు? అందుకని బూలోకంలో వుండే మన మింద పడతాడంట ఆయన. మనం ఎన్ని జెప్పుకున్నా – మనం గూడా ఆయన పుట్టిస్తే పుట్టినోళ్లమే గదా. అందుకని మనల్ని పిలుచుకొని పొయ్యే అక్కు, అతార్టీ ఆయనకే వుండాయి. అక్కడ కైలాసంలో పూల తోటకు నీళ్లు పోసే వాళ్లల్లో – తగలాటాలు పెట్టుకునే వాళ్లను, పని ఎగదొబ్బి దొంగేసికాలు యేసేవాళ్లను ఆయన ఎప్పటికప్పుడు నరమానులుగా పుట్టించి, బూలోకం మిందికి పంపిస్తాడు. ఇదేనంట మనకు జైలు శిచ్చ. మీరు ఈ రోజుటిగ్గాడా కోతికోతి ఆలోసినలన్నీ పక్కన బెట్టి జూడండి ఇదే నిజ్జిమనిపిస్తాది. దీన్నట్ట వుండియ్యండి. ఈ మాదిరిగా పూల తోటకు నీళ్ళు పోసే వాళ్లను ఒక్కొక్కర్నే కిందికి అంపించెయ్యడంతో మనుసులు అక్కడ కొరవ బడిపోతారు గదా. అప్పుడు దేముడు బూలోకాన వుండే మనలో – ఎవురైతే నిమ్మళంగా వుండి, మంచిగా వుంటారో, ఎవురైతే వాళ్ళ పని వాళ్లు జేసుకొని పని మింద కలవరంతో వుంటారో – అటువంటి వాళ్లను ఆయన పిలుచుకొని పోతాడు. అందుకనే పాపాలు జేసే వాళ్లను ఆయన బిరీన పిలచుకోనే పోడు – ఎందుకు పూల తోటలో రానీపోనీ తగరార్లు అని. మా పిలకాయల మాటలు నిజ్జిమైనా అపద్దమైనా దేముడు మాత్రం ఒక మనిసిని – కలిగ్గం మింద వుండాలనుకున్నన్నాళ్లు వుండనీడు. మనం ఒకరి మింద ఒకరం ఎన్ని గాపకాల్తో వుండినా ఆయనకు అదేమీ పట్టదు. ఆయనకు – ఆయన పూలతోట కళకళ లాడతా వుండడమే కావాల్సింది. ఈ ఒక్కటే ఆయన మింద నాకుండే నిష్టూరం. పాపం యిరణ్యాసుపుడు అంటే నాకెంతో జాలిగా, ఆ మహన్నబావుడి చావు నాకెంతో బాదగా వుండేది. ఇరణ్యాసుపుడు బతకదాం గదాని, ఎల్లకాలం బతకదాం గదాని అనిపించిన వాడు. కాని, దేముడు ఆయన బతికితే చూడలేక

పోయినాడు గదా. ఏ ఆటో ఒక ఆట ఆడి ఆయన కొడుకునే ఆయనకు అడ్డంగా బెట్టి పొట్టన బెట్టుకున్నాడే. ఒక రకంగా గాదు, ఎన్ని రకాలుగా జూసినా గూడా మన ఇరణ్యాసుపుడు తిక్కలోడే. అదే పనిగా తవుసు జేసి, దేముడ్ని రప్పించుకోని వొరం అడిగేటప్పుడు జాగర్తతో వుండాల గదా. ఎందుకంటే దేముడు అన్నిందాల తెలివిమంతుడు. ఆయన ఏ నరమానుడ్నీ కండతగాలం బూమండలం మింద బతకనీడు. అందుకని ఆయన వరాలను గూడా జాగర్తగా యిస్తాడు. ఆ సమయంలో ఆయన ఎంతో యెచ్చిరకతో వుంటాడు. ఇది తెలుసుకోలా మన ఇరణ్యాసుపుడు. 'నన్ను మనుసులూ చంపగూడదు, దేముళ్లూ చంపగూడదు. నేను పొగులు పూటా చావగూడదు. రాత్తిరి పూటా చావగూడదు' అని కోరుకున్నాడు. దేముడు 'సరేలే, నా కొడకా!' అని వరమిచ్చేసి దొంగ బుద్ధిని కడుపులో బెట్టుకున్నాడు. తీరా ఇరణ్యాసుపుడి పని ఏమయ్యింది? ఆయన ఈ బూమండలం నిలిచినంత కాలం బతికినాడా? అట్ట పొగులు పూటా గాకుండా, ఇట్ట రాత్తిరి పూటా గాకుండా, అట్ట మనిసి చేతా గాకుండా, ఇట్ట దేముడి చేతా గాకుండా బలే తెలివితో, ఎంతో మోసంతో దేముడాయన్ని పొట్టన బెట్టుకున్నాడు. నన్నుగాని దేముడు పిలిచి 'ఒకటే ఒకటి వరం గోరుకో, తీరస్తా' అని గాని అంటే నేను ఒక మాట తక్కవగా, రెండు మాటలు ఎక్కవగా మాట్లాడకుండా బలే తెలివిగా అడగాలని అనుకొనేవాడ్ని.

మీరు నమ్మనన్నా నమ్మండి, నమ్మకుండా అన్నా పొండి – ఒక రోజు నేను ఎనుమును తోలుకొని మా మడి కాడికి పోయినాను. అప్పుడు నాలో నేనే వుండి, వొకా వొకడ్నిగా వొంటిగా వుండి పోయినాను. నన్ను ఇటుమంటి ఆలోసినలే తేనీగల మాదిరిగా నా చుట్టూ జేరి నన్ను బాద బెట్టినాయి. ఆ మాదిరిగా నేను ఎనుము దగ్గిర వొంటిగా వుంటే – అప్పుడు సాచ్చాత్తూ ఆ మహన్నబావుడు తిరత్తని కొండల్లో కేళీయిలాసంగా వుండే సుబ్రమణిం సామి నాకు కల్లో మాదిరిగా కనపడినాడు. ఆయన సుబ్రమణిం సామే గాని నరమానుడు మటుకు గాదు. ఆయన మా పటంలో మా గోడకు వుండే ఆయన గదా. అందరి దేముళ్లల్లోకి నా పేరే వుండే ఆ దేముడంటే నాకు బలే ఇష్టం గూడా. మాగన్నుగా వుండినట్టుండి, మైకంలో వుండిన నాకు ఆయన శూలంతో, నెమిలితో పాటుగా కనపడి, "నీకు ఏమి గావాల్నో

అదుక్కో ఇస్తా" అన్నాడు. నేను అప్పుడు యెంతో యెచ్చిరికతో వుండి, 'మా అమ్మను, నన్ను – కడంతగాలం బతకనియ్యి. ఈ కలిగ్గిం ఎన్నేండ్లుంటిందో అన్నేండ్లు' అని మాత్రం అని గమ్మున వుండినాను. దీనికి దేముడు ఎంతో తెలివిగా వుండి నోటి మాట ఎత్తకుండా వుండినాడు. నేను ఆయన పరామారికను జూసి ఆయన్ను ఎట్టయినా సరే మాట్లాడిపించాలని, "నువ్వు జెప్పే వాటికన్నీ ఒప్పుకుంటా, ఈ ఒక్క మాటను మాత్రం నువ్వొప్పుకో. సరా?" అన్నాను. ఆయన గూడా జంకూగింకూ అన్నీ వొదిలేసి మన మనిసి మాదిరే మాట్లాడడం మొదలుబెట్టినాడు. "నిన్ను ఎన్నో పరీచ్చలు బెడతాం. అన్నిట్నీ నువ్వు బరాయించగలతావా?" అనడిగినాడాయన. ఆయన మాట తీరు గూడా పసి బిడ్డికి మాదిరిగానే వుండింది. "ఓ" అని నేను బారడు పొడుగు దీర్గం దీసి, "నువ్వు కావాల్సుంటే ఎంత చెడ్డన్నా జేసుకో. నన్ను పదో తరగతిని మాటి మాటికి పయిలు జేసెయ్యి, మార్చికి, సెప్టెంబరుకి, మార్చికి, సెప్టెంబరుకి – ఈ మాదిరిగా ఎన్నిసార్లన్నా జెయ్యి, నాకు బాదలా" అన్నాను నేను. దేముడు నాతో, "నువ్వు పెద్దయినాక పైర్లు బెడతావు గదా. నువ్వు పెట్టిన పైర్లు పెట్టినట్టే గలగలమని ఎండిపోతాయి. నువ్వు మోట తోలడానికి తెల్లారు జామున బాయికాడికి మోట బానను ఎత్తకపోయి ఎంతసేపు మోట తోలినా, నీ మడి నీళ్లతో పారదు. నువ్వు ఏ కయ్య మింద మడవ యేసినా దెయ్యం వచ్చి తెంపేస్తుంది సరా?" అన్నాడు.  సరే, కానీ! పైర్లు పండించుకోకుండా కూలి పన్లన్నా జేసి బతక్కోలేమా అనిపించి ఈ మాటే అంటిని ఆ బగమంతుడితో, "చద్దికుంటే సంగటికి లేకుండా, సంగటికుంటే చద్దికి లేకుండా, తలకు వుంటే మొలకు లేకుండా, మొలకు వుంటే తలకు లేకుండా – నిన్ను ఈనపు బతుకు బతకనిస్తాం, నీకే రోత బుట్టేట్టు, వొప్పుకుంటావా?" అనడిగినాడాయన. ఇప్పుడు గూడా మా కుటుంబరం ఆయన జెప్పినట్టే జరగతా వుండినా, మా ఇంట్లో వుండే అయిదు మందిమి ఒకర్నొకరు చూసుకుంటా, ఒకర్తో ఒకరం మాట్లాడుకుంటా సుకంగానే జీవనం సాగిస్తా వుండాం గదా అనిపించి దేముడు అనిన ఆ మాటకూ ఒప్పుకుంటిని, "ఇంతెందుకు సామీ? ఇంక ఈ కలిగ్గం మింద కొత్త మనుసుల్ని ఎవుర్నీ పుట్టించనియ్యొద్దు. అదే రకంతో – వుండే మనుసుల్ని ఎవుర్నీ చంపుకొని పోవద్దు. మా అమ్మ అదే వొగిసులో ఎల్లకాలం

వుండిపోవాల. నేను ఇదే రకంతో వుండిపోవాల. ఇట్టయితే లోకంలో ఎంతో తెరపగా వుండును గదా? ఈ ఏరుపాటును జెయ్యరాదా? దీంతో కలిగ్గవాసుల కస్టమంతా ఈడేరి పోదా?"– అని నా మనసులో ఎన్నో దినాల్నుంచి నానతా వుండిన కోరికను బైటికి చెప్పేస్తిని.

దీనికి దేముడు నవ్వు మొకం బెట్టి, "ఒరె ఒరె, నువ్వు నరమానుడివైనా అష్ట తెలువులు కలిగి వుండావే! అవన్నీ అయ్యే పని గాదు గాని, ఇప్పుడు జరిగే పని జూడు" అని దేముడు నా మింద దయదలవకుండా, "నీకు అరవైయ్యో సమ్మచ్చురం వొచ్చేదాక మీ యమ్మను, అయ్యను బతికిస్తా. దీనికి ఒప్పుకుంటావా?" అనడిగినాడు. నేను అరైయ్యేండ్ల వాడినయ్యే దాకా మన అమ్మా అయ్యా మన కండ్ల ముందర వుంటే చాలులే, మళ్ళ పదేండ్లే గదా మనం మాత్రం బతకబోతాం అనుకొని, "దేనికి ఒప్పుకోమంటావో చెప్పు. వొప్పుకొనేదీ లేనిదీ చెప్తా" అనడిగితిని. అప్పుడు దేముడు, "నీకు పుట్టే పిలకాయలంతా కుంటిగా, గుడ్డిగా, మూగిగా పుడతారు సరేనా?" అనడిగి నాడు. 'ఏమబ్బా దేముడు యింత కర్ముడుగా వుండాడు. ఇంత కటీనుడా దేముడు?" అనుకోని, ఈ అనుకొనింది ఎక్కడ దేముడికి తెలిసిపోతాదోనని బయపడి, "'కన్నాక, తప్పతాదా? మూగి పిలకాయలు, గుడ్డి పిలకాయలే గదా లోకాన అష్ట తెలువుల్తో వుండేది! సరే. కానీ!–" అని ఆ మాటకూ ఒప్పుకుంటే దేముడు, "అహ, అట్టగాదు. యిట్ట– నీ పెళ్ళాం తొలి కానుపులోనే బిడ్డని కనలేక చచ్చిపోతాది. మళ్ళ నువ్వు రెండో పెండ్లి మాట ఎత్తగూడదబ్బో" అన్నాడు. నేను ఈ మాటతో అదొక మాదిరిగా వుండిన మైకంలో నుంచి మన సోదీనంలోకి వొచ్చేసినాను. 'మన అల్లాటం దేముడికి గూడా ఎగతాళి అయిపొయ్యింది గదా' అనిపించి నేను దిగులు దిగులుగా ఎనుమును ఇంటికి తోలుకొని వచ్చేసినాను. నాకు తెలుసు గదా దేముడు ఏ మనిసీ ఎల్లకాలం బతికితే వోర్చుకోలేడు.

ఇన్ని అనుకుంటా వుండాం మనం. ఎవ్వరి చావు ఎవ్వరికీ తెలవదు గదా! ఒకేళ వూదోడి మాదిరిగా మనకు ఉబ్బసం ముదిరో లేదా యింగేమన్నా సంగటం వచ్చో మన అమ్మ కన్నా మనమే ముందు జారుకుంటే? అని గూడా అనిపించేది అప్పుడప్పుడూ. మనం చచ్చిపోతే మన అమ్మ ఏమిగా అయిపోతిందో గదా! అప్పుటికప్పుడే కొంచేపు నేను చచ్చి పోయినట్టుగా

అనుకొనే వాడ్ని. అప్పుడు నా కండ్ల ముందర అంతా కనపడేది. పదీ పదైదు మంది ఆడోళ్ళు, మొగోళ్ళు కలిసి నా పీనిగ మింద పడి నోరు కొట్టుకుని ఏడస్తా వుండిన మా అమ్మను లాక్కోని వచ్చేసినారు. మా అమ్మ "మీకు పున్నిముంటాది, నన్నొదలండి సాములాలా, నన్నొదలండి. నా సిన్నకొడుకి దగ్గిరికి పోనియ్యండి. వాడు నన్ను చూడకుండా వొక నిమిసం వుండలేడు. నన్నొదలండి" అని పెరుకులాడతా వుండింది. మా అమ్మ పాట ఎత్తుకొని నేల మింద పడి, తలకాయిని ఇస్టం వచ్చినట్టు కొట్టుకుంటా వుంటే ఆపడానికి వూరోళ్ళ వల్ల గాకుండా పోయింది. మా నాయిన మాత్రం గొడ్ల కొట్టంలో వొంటిగా కూచ్చోని– కండ్లనూ ముక్కునూ కార్చుకుంటా ఆయనలో ఆయనే ఎగదీసుకుంటా వుండిపోయినాడు. మా నాయిన దగ్గిరికి పోయి, "నారయ్యా! ఏడవబాక!" అని వూళ్ళోవాళ్ళు ఎవ్వరూ అనలేదు గాని మా అమ్మను మాత్రం అందురూ కాపెట్టుకొని వుండినారు. మా అమ్మ, "మీరెవ్వరూ రాబాకండి నాతో గూడా. నేను ఇంట్లేకి పొయ్ గలాసుడు మంచి నీళ్ళు తాగేసి వస్తా" అనేసి ఇంట్లోకి పోబోతే నలుగురైదుగురు మా అమ్మను పట్టి ఆపి, "గుండు జెంబుడు నీళ్ళు పక్కన్నే పెట్టుకొని యింట్లో కేమిటికి?" అని అన్నారు. మా అమ్మ ఇంట్లోకి పోయి తలుపు గెడేసుకుని వురి బోసుకొని నాతో కూడా చచ్చిపోదా మనుకుంటే– ఎక్కడ, వూరోళ్ళు అడ్డగిస్తా వుంటే! వీదిలో మాల చెంగడు నా పీనిగను ఎత్తకపొయ్యేటందుకు వొంటి పాడెని కడతా వుండినాడు. నేను చచ్చిపొయ్ ఒక పక్కన పడి వుంటే, మా అమ్మ మన మతిలో లేకండా, "ఎవురు చెప్పింది? మా సినబ్బ చచ్చి పొయ్నాడా? మీకు ఎవరు చెప్పింది? నా ఇక్లామార్కుడికి చావులేదు. నా మొగలాయికి చావు లేదు. నన్నొదిలి వాడు యాడికి బోతాడు. నన్నొదలండి, మద్యానమయింది– నా సిన్నకొడుక్కి ఆకిలిగా వుంటాది– నేను వాడికి సంగటెయ్యాల, ఉప్పు చేపను కాల్చి యియ్యాల వాడికి నేను. దరమాత్ములాలా, నన్నొదలండి" అని మా అమ్మ పిచ్చి పిచ్చిగా, మతి దప్పిన దాని మాదిరిగా అనింది. పాపం, నా చావు మా వూరోళ్ళకు గూడా బాదగానే వుండింది. "వాడు బతికే వుండుంటేనా? సినక్క ఏ అగచాట్లో ఒక అగచాట్లు పడి వాడ్ని పెద్ద చదువే చదివించి వుంటాది. వాడికి బతికే యోగం లేకపొయ్యింది గదా. కన్న కడుపును కాల్చేసి పొయ్నాడు. అట్ల బొయ్ జూడుబొండి–

సినక్క గోష్ట!" అని వూళ్ళో వాళ్ళు ఒకర్తో ఒకరు అనుకుంటా వుండారు. నన్ను ఎత్తి పాడె మింద బెట్టేటప్పుడు మటుకు మా అమ్మకు యాడ నుంచి వొచ్చిందో గాని అంత సత్తా వచ్చింది. మా అమ్మను పట్టుకోని వుండే మా వూరోళ్ళను మా అమ్మ ఒక తోపు తోసింది. ఆ తోపుకు వాళ్ళందురూ తొంబై ఆమడల దూరంలో పోయి పడినారు. మా అమ్మ నా పాడె మింద బడి నన్ను జవురుకొని, "యాడికిరా నా సిన్నకొడకా? యాడికి, నా రెక్కల కష్టం నీకు సగించలేదా నాయినా? నూరేండ్లు నా చేత రెక్కల కష్టం చెయ్యించుకోని తినకుండా నన్నొదిలి పోతా వుండావా నా కొడకా! ఈ మోసాన్ని కడుపులో పెట్టుకోనే పుట్టినావా నాయినా? ఒరే కర్ముడా – నువ్వు పాడె దిగి నాతో మాటలు చెప్పుదువు రారా నా కున్ని కొడకా!" అని మా అమ్మ వీదిలో బడి అల్లాడి పొల్లాడతా వుంటే నా పాడె వొలికిలి మిట్టకు ఎలబారింది. మా అమ్మ ఈ మాదిరిగా అల్లాడి పోతా వుంటే మా అక్క ఏడ్చి ఏడ్చి మూర్చ దెచ్చుకొని ఎప్పుడో కిందబడి పోయింది. నా పీనిగతో పాటు స్మశానం దాకా ఏడ్చుకుంటా వొచ్చినోళ్ళు మా అయ్య, మా అన్న. మా అమ్మను, మా అక్కను రానీలేదు వూళ్లోవాళ్లు. నా పాడెని కిందికి దించి, మాలోళ్ళు గుంత తవ్వతా వుంటే మా అన్నా, మా నాయినా నా కాళ్ళ దగ్గిర జేరి వాళ్ళల్లో వాళ్ళే ఎగదీసుకొని దుఃక్కపడతా వుండారు. అప్పుడు నా పీనిగి బయంతో చచ్చి సున్నమైంది. 'మనల్నిపుడు అంత లోతు గుంతలో పూడస్తారా? ఇంకెట్ట సామీ! అంత లోతులో మనల్ని పూడ్చేస్తే మనకు వూపిరాడితిందా?' అనిపించి నా పీనిగి చలీ జెరం వచ్చినట్టుగా గజగజ వణికి పోయింది. 'నన్ను కట్టెల్లో బెట్టి కాలిస్తే ఎంత బాగుండును' అనుకొనింది గాని మళ్ళా 'అయ్యో వొళ్ళంతా కాలిపోయి పిడికిడు బూడిదిగా మారిపోమా?' అనిపించి పాడె మింద వుండిన నా పీనిగ ఓ అని మదన పడింది. నన్నిప్పుడు పూడ్చబొయ్యే ఆ స్మశానం దగ్గిర్నే ఒక పెద్ద గుట్ట వుండాది. ఆ గుట్ట మింద నా పీనిగిని విసిరేస్తే బాగుండును. కాకులు గెద్దలు పొడుచుకోని పొడుచుకోని తినినా మేలే, మట్టిలో పూడిపించుకొని వూపిరి తిరక్కుండా అయిపొయ్యే దానికన్నా, కట్టెల్లో కాలిపించుకొని బూడిదయి పొయ్యే దానికన్నా! ఈ మాదిరిగా నా పీనిగలో నా పీనిగే మలగుల్లాములు పడతా వుండంగా– నా పీనిగనెత్తి గుంతలో పండబెట్టినారు.

మాల చెంగడు వొంగి నా పీనిగ మింద పారతో మట్టిని దొల్లిస్తా వుంటే, మా అన్నా, మా నాయినా నోళ్ళల్లో పై గుడ్డలు దూరుపుకొని పిడికెడు మట్టిని వేసి, కోనేట్లో దిగి అన్ని నీళ్ళను నెత్తిన జల్లుకొని వూరికల్లా పోయినారు. మా అమ్మ ఏడుపు అంతకంతకు ఎక్కువవతా వుండాదే గాని రూంత గూడా తగ్గడం లేదు. వీదిన బడి వస్తా వుండిన మా నాయినకల్లా మా అమ్మ పరిగెత్తి "మన సినబ్బను గుంతలో పెట్టి పూడ్చేసి 'ఎరగనోచ్' అని వస్తా వుండావా కర్మడా?" అని మా నాయిన్ని వొంగదీసుకొని యెంటికల్ని పెరికేసి, కాల్తో చేత్తో కాల్తో చేత్తో తన్నేసింది. మా నాయిన వొంటిని ఆమికి అప్పజెప్పేసి తలొంచుకొని ఏడస్తా నిలబడిపోయినాడు. నా దినం తీరిపొయ్‌నాక గూడా మా అమ్మ మన మతిలోకి రాలేదు. మా అమ్మ దినామూ దొడ్డికి కూచ్చోని వస్తానని అపద్దాలు జెప్పేసి స్మశానం కల్లా వచ్చి నా గుంత మింద పడి లబలబమని నోరు కొట్టుకొనేది. నేను బతికి వుండంగా పదారు పదారు ముప్పై రెండు చేతల్తో పని చేసే మా అమ్మ నేను చచ్చి పోయినాక – ఇట్ట వుండే పుల్ల అట్ట ఎత్తెయ్యకుండా– ఏడస్తానే వుండిపొయ్యింది. వీదిన పొయ్యేవాళ్ళనందర్నీ మా అమ్మ పిలిచి పిలిచి, "చూసినారా, మా సినబ్బ చేసి పోయిన అన్నాయం? ఈ అన్నాయం మీ అందరికీ జరిగిందా?" అని బొరోమని ఏడ్చి ఏడుపు పాట ఎత్తుకొని "సినబ్బా, ఓ సినబ్బా, నా సినబ్బా–" అని మూలగతా వుండిపొయ్యేది. ఎవురన్నా ఒక గలాసులో మజ్జిగ పోసుకొని తెచ్చి యిస్తే, మా అమ్మ ఎంతో వుక్కురోసంతో ఆ గలాసును నోటి దగ్గిర పెట్టుకున్నట్టే పెట్టుకొని గబీమని కుమ్మరించేసి, "నా సవుతులాలా! నన్నిదే మాదిరిగా ఏడ్చి ఏడ్చి చావనియ్యండే! నా దగ్గిరికి ఎవ్వురూ రాకండే!" అని మజ్జిగ తెచ్చి యిచ్చినోళ్ళను నోటి కొందికి తిట్టేసేది. నేను చచ్చి పొయ్‌నాక మా అమ్మ పచ్చి మంచినీళ్ళు తప్ప వొక్క మింగడ గూడా మింగలేదు. 'సినబ్బా. ఇంగ పదేండ్లు వుండుంటే నీకు చూడ చక్కని దాన్ని తెచ్చి పెండ్లి జేసుండనా కొడకా! నిన్ను యింతలోనే దేముడు ఎందుకు జవరక పొయ్‌నాడు కొడకా? ఏ జల్మలో ఏ పాపం చేస్తినో, ఈ జల్మలో అనుబోగిస్తా వుండాను గదమ్మా!" అని ఏడవడమే పనిగా పెట్టుకొనింది మా అమ్మ. నేను చచ్చిపొయ్‌న నెలకే మా అమ్మ కంపకట్టి మాదిరిగా ఎండిపోయి గలగలమంటా అయి పోయింది. నేను చచ్చి పోయినాక పేరుకు కైలాసంలో చేరుకొని పూల

తోటకు నీళ్ళు పోస్తా వుండినానే గాని, నా ప్రానం మాత్రం మా అమ్మ సుట్టూరా, మా ఇంటి సుట్టూరా, మా కయ్యాగాలవ సుట్టూరానే తిరగలాడతా వుండింది. నా పీనిగను గుంతలో పెట్టి పూడ్చంగానే నా కోసరం యమ బటులు పగ్గాలెత్తుకొని రాకుండా, శివ బటులు పూల రతం యేసుకోని వచ్చినారు. నేను మీ బూలోకంలో బతికింది మఖా అంటే పదీ పద్దైదేండ్లే గదా! ఆ పదేండ్లల్లో నేనే పాపం పున్యం ఎరిగి లేనే! ఒకేళ నేను బూలోకంలో యాపై అర్వై ఏండ్లు బతికే వుంటే పాపాలు చేసే వుంటానేమో! ఏమో ఎవురికేమి దెలుసు, చిన్నప్పుడంటే నంగి నంగిగా ఒక్కరికి ఏ చెరుపూ చెయ్‌కుండా బతికినాను. ఇట్ట గాకుండా నేను మీ లోకంలోనే బతికే వుంటే – నేను పెద్దయినాక ఒకరి కిద్దురు లంజిల్ని పెట్టుకొని, వాళ్ళకూ ఈళ్ళకూ ద్రోకం జేసి బతికే వుందును. నేను చిన్న ప్రాయంలోనే చచ్చి పోవడం వల్ల నా కోసరం శివ బటులు రతమేసుకొని వచ్చి నన్ను ఎక్కించుకొని పూల తోటలోకి తెచ్చినారు. ఇక్కడికి వచ్చినప్పట్నుంచి నేను ముంతను చేతల్లో బెట్టుకొని, చెట్టు పొదలోకి వంచకుండా వుండి, నాలో నేనే, "మన యింటి దగ్గిర మనోళ్ళంతా ఏమిగా వుండారో? మన అమ్మ మనం చచ్చి పోయ్‌న దిగులులో నుంచి ఎప్పుటికి తేరుకోబోతాదో? మన అమ్మ మనల్ని మరిచిపోయ్ ఎప్పుడు ఆమె పనిలోకి ఆమె దిగబోతాదో! మనం చచ్చిపోయ్‌న దుఃకంలో పడి మనోళ్ళు మన తూరరూగా వరి మడిని కొయ్యకుండానే మొలకలు ఎత్తించబోతారు' అని మదన బెట్టుకొని నేను కైలాసంలో గూడా సుకంగా వుండకుండా కండ్ల నిండికి నీళ్ళు తెచ్చుకున్నాను. నేను బతికి వుండంగానే మా అమ్మ మా వూళ్ళో నాకు ఒక కత జెప్పేది. "సినబ్బా! అబిమన్నుడి మింద అజ్జునుడికి ఎంతో కలవరంగా వుండేది గదా. అబిమన్నుడు ఒక నాడు పద్మయూకంలోకి బోయి తిరిగి వచ్చే యిద్ది తెలవక చచ్చిపోతాడు గదా. అప్పుట్నుంచి బూలోకంలో అజ్జునుడు తిండీ నీళ్ళూ అంటుకోకుండా ఎప్పుడూ దుఃక్క పడతానే వుండినాడు. బామార్ది దుఃక్కాన్ని చూడలేని కిస్న పరమాత్తుముడు – అజ్జునా! కైలాసానికి వస్తావా? నీకు అబిమన్నుడ్ని చూపిస్తా– అనడిగినాడు. అజ్జునుడు ఎంతో కుశాల పడి కొడుకును చూసుకుందామని కైలాసానికి వచ్చినాడు. పూల తోటకు నీళ్ళు పోస్తా వుండిన కొడుకును జూసి అజ్జునయ్య, 'అభిమన్నా!' అని దగ్గిరికి పోయి కావిలించు

కుంటే, అభిమన్నుడు అజ్జునుడి చెంప మింద చేతి కొందికీ వాయించి, 'ఎవురు నువ్వు? నీకూ నాకు ఏమి సమందం?' అనడిగినాడు. దీంతో అజ్జునుడికి అభిమన్నుడి మింద చిటామనిపించి రోత బుట్టింది. పాపం అజ్జునుడు బూ మండలానికి కాళ్లీడ్చుకుంటా వచ్చి– కొడుకు సంగతే మరిచిపొయ్‌నాడు. ఆ మాదిరిగా చచ్చిపోయినాక మనం ఒకరి కొకరం ఏమీ గాము. అందుకని నువ్వు నీ మనసును ఎట్టబడితే అట్ట పొల్లించుకోని లేనిపోని యాదను పెట్టుకో వద్దు నాయినా!" అని మా అమ్మ నాకు చిన్నప్పుడు చెప్పింది. కానీ నేను కైలాసానికి వచ్చినాక అబిమన్నుడి మాదిరిగా కన్న తల్లిని, కన్న తండిరిని, తోడబుట్టిన ఆడబిడ్డని, అన్నదమ్ముడ్ని మరవకుండా వుండినాను. మా అమ్మ నా కోసరం కైలాసానికి వస్తే నేను కావిలించుకోని బొరోమని ఏడస్తానే గాని 'నువ్వెవ్వురివి? నీకూ నాకూ ఏమి సమందం?' అని అనలేను. అబిమన్నుడికి మాదిరిగా నాకు మతి మరుపు లేదు. 'మనమంటే కైలాసానికి వచ్చినాము. ఇంక మన అమ్మ గూడా వచ్చేస్తే మళ్ళ మన నాయిన గతి, మన అక్క గతి ఎట్ట? వద్దులే ఆమెను అక్కడే వుండిపోనీ'– అని నేను కైలాసంలో దినుమొక యుగంగా గడుపుకుంటా వచ్చినాను. అవితే బూలోకంలో మా అమ్మ నేను చచ్చిపోయినాక రోజు రోజుకు కుమిలిపోతా వుండాదే గాని నిమ్మళం మాత్రం పడలేదు. ఎన్నోసార్లు మా అమ్మ తాడెత్తుకొని వురి బోసుకోబోతా వుంటే వూళ్ళో వాళ్ళూ, మా అక్కా అడ్డం వుండినారు. మా అమ్మ చేతికి తీసుకున్న తాడును కిందెయ్య కుండా, "నన్ను చావనియ్యండి. ఒకేళ నేనే చచ్చి, నా సిన్నకొడుకు గాని బతికే వుండుంటే వాడు నా మాదిరిగా ఏడస్తా వుండడు. నాతో గూడా చచ్చిపొయ్ వుంటాడు. అటుమంటి నా యెర్రి కొడుకు చచ్చిపోతే నేను బతికుండడం గోరం గదా!" అని పాట పాడేది గాని, మా అమ్మ నేను చచ్చి పోయినాక బతుకు మింద కలవరం పెట్టుకోని బతకదామని ఒకప్పుడు గాకున్నా ఇంగొకప్పుడన్నా అనుకోలేదు. నేను ఇదంతా జరిగే కత కాదులే అని ఒక రోజు మా అమ్మ కల్లో కనబడి చెప్పేసినాను. "అమ్మా, వొచ్చెయ్యి. ఇద్దరం ఒకర్నొకరం చూసుకుంటా, ఆ మాటా ఈ మాటా మాట్లాడుకుంటా చెట్లకు నీళ్ళు పోసుకుంటా వుండి పోదారి" అని నేను మా అమ్మను పిలిచేసినాను.

ఇదంతా తలుచుకుంటూ వుండిన నేను బలంతాన నాలో నుంచి నేను బైట పడినాక– నామింద పడి కాస్తా వుండే ఎండతో సఖా నాకు అంతా మాయగా అనిపించింది. మనమనే గాదు, ఎవురు చచ్చిపోయినా ఇదంతా జరిగితింది గదా నిజంగానే; ఎంత దిక్కులేని పీనిగకయినా అయినోళ్ళు పోయినోళ్ళు వుండనే వుంటారు గదా. మనకు మన అమ్మ వుండినట్టు, ఇంగొకడికి ఆయన పెండ్లాం వుంటాది గదా. వాళ్ళంతా ఈ బాదను సొయంగా అనుబోగించాల్సిందే గదా. ఇది ఒక్కటే గాక, మనలో నుంచి – మనల్ని కాపెట్టుకోని వుండిన జీవుడు ఒక్క విడతగా బయట పడడానికి ఎంత తపన పడునో! ఈ రకమైన ఆలోసినలను నేను ఆపకుండా చేసుకుంటూ పొయ్యే సరికి నా కొక్కడికే ఎన్నో సంగతులు తెలిసి వచ్చేయి. మనిసికి చావు అంటే ఏంది? దీన్ని నేను విప్పరించి చూసుకుంటే– నాకు అంటి పొండు వొలిచి చేతిలో పెట్టుకొన్నట్టుగా యిశిలాయంగా అంతా అర్తమై పోయింది.

మాకు ఒకటికి రెండు బావులు వుండేవి. కొత్త బావి– అనే పేరుతో ఒకటుండాది మాకు. ఎప్పుడో మా పెద్దోళ్ళ కాలంలో తొవ్వినారు. నాలుగు మట్టుల లోతు తవ్వంగానే దాంట్లో బండ పడి పోయింది. ఆ బండను తొలచ లేక మా వాళ్ళు దాన్ని అట్టనే వొదిలేసినారు. ఆ బావిలోకి దానంతట అదిగా వూట వచ్చేది గాదు. వానా కాలంలో దానిలో పడిన వాన నీళ్ళే గాని, దానిలోకి నీళ్ళు వొచ్చే వూట మార్గమే లేకుండా పోయింది. వానా కాలం పోతానే ఆ నీళ్ళు ఆ బావిలో అట్టనే వుండేవి. ఎండిపోయి రాలిపోయిన ఆకులు, గువ్వగూళ్ళు, కట్టి పుల్లలతో అది నానా చెత్తా చెదారంతో వుండేది. కొన్ని నాళ్ళు పోయినాక పాములతో, కప్పలతో ఆ బావి కుళ్ళి గబ్బుగొట్టేది. మంచి ఎండాకాలం రాంగానే దాంట్లో వుండే చెత్తంతా ఎండి పోయి దాన్లోనే వుండిపొయ్యేది. మళ్ళీ వానప్పుడు దాంట్లోకి కొన్ని నీళ్ళు వచ్చేవి. ఈ వాటంతో ఆ బావి గబ్బు కొడతా దాంట్లోకి తొొంగి చూడాలంటేనే బయంగా వుండేది. ఈ బావి ఈ రకంతో వుంటే, మా ఇంగొక బావి వుండాది అని అన్నాను గదా– ఆ బావికి మంచి వూట సొౖరం వుండేది. దాంట్లోకి వూట ఎప్పుడూ వస్తానే వుంటాది. ఎండాకాలంలో అవితే– నీళ్ళు అడుగుకు పోయిన ఆ బావిని గంటలు గంటలు చూస్తా వుండాలనిపించేది. వూట ఒక్క చోట

కుదురుగా వుండలేదు గదా! ఎక్కడెక్కడ్నించో ఆ బావిలోకి పాయలు పాయలుగా సన్నంగా వచ్చి మా బావిలో తలదాచుకుంటా వుండేది. రాలిపోయే ఆకులు రాలిపోతా వుంటే, వేసుకొనే చిగుర్లు వేసుకుంటా వుండినట్లుగా మా బావి కళకళలాడతా వుండేది నిత్తెం వూటతో. ఆ బావి నీళ్ళను మేము ఒక పక్క మోటలతోనో, కరంటు మిసినీలతోనో మా మళ్ళను మేము పారించుకొని తడుపుకుంటా వుంటాము. మా యీ బావి ఎప్పుడు గానీ గబ్బు కొట్టలేదు. పాత నీళ్లు పోయి కొత్తనీళ్లు వస్తేనే గబ్బు లేకుండా వుంటాదనే దేముడు యీ లోకంలో చావుల్నీ, పుట్టకల్నీ పెట్నాడేమో!

ఇదంతా అనుకున్నాక నాకు మనిసికి చావు అంటే ఏందో ఇలావరిగా అర్తమై పోయింది. మన బతుకులో బండ పడిపోవడమే చావు అనేది. మా కొత్త బావిలోకి వూట రానట్టే మనలోకి వూపిరి రాదు మళ్ళ, చచ్చి పోయినాక. వూపిరి అంటే ఏంది, గాలే గదా! మన ముక్కుల్లో నుంచి మనం గాలిని పీల్చుకొని అదే ముక్కుల్తో వదిలేసే సొక్రిం వున్నంత కాలం– మనం చచ్చి తవుసు జేసినా చావు రాదు మనకు. ఇందుకనేనేమో మా అమ్మ గూడా అప్పుడప్పుడు 'మనిదంతా కట్టే గదా. ఆ కట్టిలో గాలి ఉన్నంత సేపే ఈ బాగోతమంతా. ముక్కులో వూపిరి పెట్టుకున్నంత వొరకే!' అని అంటా వుండేది. మా అమ్మ మాట గూడా ఇప్పుడు నాకు బటువుగా అర్తమై పోయింది. కాబట్టి ఈ గాలి అనేది మనలోకి వస్తా పోతా వుండక పోవడం వల్ల మనకు చావు వస్తా వుండాది. గాలి మన ముక్కులోకి రాలేక పోవడంతో మనం వూపిరి తిరక్క కండ్లు మూసుకొనేసినంత మాత్రాన– మనకు మనమే చచ్చిపోయినాం గదా అనుకొని మనల్ని మనం పూడ్చుకోని కాల్చుకోవాలనా? ఆ అవసరం ఏమి వుండాది చెప్పండి? ఈ బూమండలం మింద గాలికి, నీళ్ళకి కరువు బడి లేము గదా మనం? గాలి తిరగక, వూపిరాడక కిందబడి పోయిన మనిసిలోకి– గాలి తిరిగి, వూపిరాడి బతికి వుండే మనుసులు– గాలిని పంపించొచ్చు గదా. ఒకేళ ఆ గాలి అనేది మనం పంపిస్తే పొయ్యేది గాదు, రప్పిస్తే వొచ్చేది గాదు– అని అనుకోని, మనం ఆ పని చెయ్యలేక పోయినా, గాలి తిరగని మనిసిని చచ్చినోడి కింద లెక్కేసేసి గుంతలో బెట్టి పూడ్చి, కట్టిల్లో బెట్టి కాల్చి ఆ మనిసిని గురిచ్చిన ఆనవాలును ఈ బూమి మింద లేకుండా ఎందుకు జెయ్యాల? మా కొత్త బావిలో బండ బడిపొయ్యింది

గదాని– ఆ బావిని మేము మా తల్లి సాచ్చిగా పూడ్చెయ్యలేదు. దాని దగ్గిరికి పోయినప్పుడల్లా దానిలోకి తొంగి చూసుకొని, "దీనంత ముండమోపి బావి యింగొకటుండదు లోకాన!" అనసుకుంటాం. ఒకేళ రేపు మరసనాటికి మా ఇంగొక బావిలోకి వూటే రాకుండా మానేసిందనుకో. అప్పుడు గూడా అంత లోతు బావిని మేము పూడ్చము. ఆ బావిని అట్టనే వుంచి, "అగ్గో! ఆ బావి ఒకప్పుడు మంచి ఎండల కాలంలో గూడా అయిదెకరాల పైరును కాపాడింది!" అని దాని గురిచ్చి చెప్పుకుంటాం గాని దాని ఆనవాలు లేకుండా మేమెందుకు జేస్తాం? అదే మాదిరిగా గాలి తిరగనంత మాత్రాన చెట్టంత మనిసిని పీనిగను జేసేసి, ఆ మనిసిని శాస్పితంగా మట్టికి అప్పగించెయ్యడం దర్మం గాదు అనిపించి నా మనసు బలే గుంజాటన పడేది. వీటినన్నిట్నీ నిదానం మింద ఎవ్వరూ యోసిన చెయ్యకనే వుంటారా ఏమి?– అని నేను కొన్ని ఏండ్లకు చావబోయి, యిప్పటికి మాత్రం బతకతా వుండే మనుసుల కల్లా యిచ్చిత్ర పోయి చూసేవాడ్ని. మనిసికి వూపిరి తిరక్క చచ్చిపోతే, ఆ మనిసిని పూడ్చి పెట్టెయ్యడమే మనకు తెలిసింది. ఈ వూపిరి తిరగని మనిసిని, ఎట్ట వుండినట్టు అట్టనే, నిద్దరబోయే మనిషికి మాదిరిగా బద్దర పరద్దాం అని మనోళ్ళు ఎప్పుడన్నా అనుకున్నారా? ఎందుకనుకుంటారు? వూళ్ళో పీనిగి పడితే చాలు, అప్పుడే ఒక యెదుర్ని కొట్టుకొని వచ్చి, మాలా మాదిగోళ్ళను పిలిపిచ్చి, పలకలు వాయించమని, అదేదో కేళీ విలాసం మాదిరిగా ఆడుకుంటా పోయి ఆ మనిసిని పూడ్చేసి వస్తారు. ఎవురన్నా చచ్చిపోతే ఆ పీనిగిని పూడ్చడానికి గుంపుగా పోతావుంటే నాకు నిరా మయంగా వుండేది. ఎందుకంటే – రేపో ఎల్లుండో కాకపోయినా యింక పదేండ్లకో ఇరవై ఏండ్లకో చావబొయ్యే వోళ్లు యిప్పుడు చచ్చినోణ్ణి పూడ్చేదేందని! మా వూళ్ళో పీనిగ పడితే నేను పీనిగను చూడలేక పొయ్యేవాడ్ని. మా ఇంట్లో వాళ్ళు మాత్రం అక్కడనే పోయి వుంటారు. మా అమ్మ మిందా, మా అక్క మిందా, "ఆ పీనిగ కాడికి పోవద్దని మీకు ఎన్నిసార్లు చెప్పేది? మీకు ఆడ ఏమి పని?" అని నేను ఎగిరి దూకతా వుంటాను. మాలా మాదిగోళ్లు పలకలు కొట్టేటప్పుడైతే నేను ఆ చుట్టుపక్కల ఎక్కడా వుండలేను. మా తూరూగా మడి కాడికి వచ్చేస్తాను. ఎందుకంటే ఆ పలకలు జేసే శబద్దాలు వినను నా వల్ల గాదు. నా చెవుల్లో నా చూపుడు వేళ్ళను పెట్టుకొని

ఎంత సేపు వుండినా, వూరికినే కావాలని చూద్దాం గదా– అని చూపుడు వేళ్ళను బైటికి తీసుకుంటే, చెవుల్లో సీసం కరిగించి పోసినట్టుగా బాద పడేవాడ్ని. ఆ చావు దరువు విని, చావు అంటే యింత బయం వుండేవాడ్ని గూడా నేను మా పెద నాయిన చావును మాత్రం కండ్లారా చూస్తిని. మా పెద నాయిన మింద మా అమ్మకు గొంతు కాడికి కోపం వుండడంతో, అదే కోపం ఆయన మింద నాకు గూడా వుంటా వచ్చింది. అందుకుని ఆయన చావు దగ్గిర జరిగిన తతంగమంతా చూస్తిని. నాకు అన్నిట్లోకీ నచ్చింది, అది న్యాయమనిపించిందీ– చావు తతంగంలో నేను వొకదాన్ని చూసినాను. మంచి మద్యానం, ఎండ మిడిమేలంగా కాస్తా వుంటే మా పెద నాయినను పాడె మింద పెట్టినారు. అంత ఎండ గదా పాపం అని పీనిగి మొకానికి ఎండ తగలకుండా చిరుగులు పడని ఒక మంచి గొడుగును ఒకాయన చెయ్యి పైకెత్తి పట్టుకొని పీనిగతో పాటుగా నడిచినాడు. చచ్చిపోయిన మనిసి మింద ఎండ గాస్తే ఏమి, వాన కురిస్తే ఏమి– అని అనుకోలేదు గదా! అప్పుడు ఆ గొడుగు పట్టిన పెద్ద మనిసే, మా పెదనాయిన్ను బారట్లోతు గుంత తవ్వి పూడ్చి పెడతా వుంటే మాత్రం "వొద్దు పాపం, గుక్క తిరగక్క అల్లాడబోతాడు" అనిపించింది. నిజానికి మనుసులు చచ్చిపోయినా గూడా మనం ఏమీ వగచాల్సిన పనిలా. ఆ మనిసిని బద్రపరిచే ఏరుపాట్లు గాని మనం చేసుకున్నామంటే మన దిగులు తీరిపోయినట్టే లెక్క. ఎందుకంటే మనం పిడికిడు మట్టయి పోము. మన చావు– అప్పుడు పిడికిడు మట్టి కిందికి రాదు. శాస్పిత నిద్ర కిందికి వస్తింది. ఒక రాత్రంతా మనం పడుకోని నిద్ర పోతాం గదా! అదే మాదిరిగా ఈ కలిగ్గం వున్నంత కాలం మనం బూమి మిందనే, మనిసి మాదిరిగానే వుండి మొద్దు నిద్రలో వుంటాం. అప్పుడు మన ముని ముని ముని మనవళ్లూ, మనవరాళ్ళూ గూడా మనల్ని చూసుకొని మురిసి పోతా వుంటారు. ఇదే నిజ్జిమయితే ఎంత బాగుండును.

ఒకేళ నేను ఇంట్లో అన్నం తింటా వుండినప్పుడు– మా నాయిన మడికాడ మడక దున్నతా దున్నతానే వుండి, వూపిరి తిరక్క యెల్లాలకల పడిపోయి చచ్చిపోతే ఈ కబురు తెలిసిన నేనుగాని, మా అమ్మగాని 'ఓ యమ్మల్లో ఓయక్కల్లో' అని మా ఎదుర్రొమ్ములను మేము కొట్టుకుంటా గస పోసుకుంటా పరుగులెత్తనవసరం లేదు. 'ఓహో, అట్టనా! మా నాయిన చచ్చిపోయినాడా!'

అని నిమ్మళంగానే మా అమ్మా నేనూ ఆ మాటా ఈ మాటా మాట్లాడుకుంటా మడి కాడికి పోయి, ఎల్లకాలం నిద్దరలోకి దిగి పోయిన మా నాయిన్ను ఎత్తుకొని ఇంటికి వస్తాము. 'అయ్యో! మన మొగుడు చచ్చిపోయినాడే! యింగెట్ట. ఈ సేద్యమంతా ఎవురు జేసి ఈ బిడ్డల్ని పెద్దోళ్ళను జెయ్యబోతారు?' అని మా అమ్మ మదన పెట్టుకోవచ్చును. నాకన్నా పదైదేండ్లు పెద్దగా మా అన్న ఒకడు వుండాడు గదా. మా అమ్మ ఒక్కటే అంత బాద పడిపోతా వుంటే మా అన్న వూరికినే వుంటాడా? "అమ్మా, నేను చేతికి ఎక్కొచ్చేస్తిని గదా. నాకు మడక పిడి పట్టుకునే ప్రాయం వచ్చేసింది గదా. నాయనకు బదులు నేనుండి ఈ సేద్యం జరిపిస్తానులే. మన సినబ్బను గూడా మనం చదువును మానిపించ నక్కర లేదులే. నీకు ఒక కొండ మాదిరిగా నేనుండాను గదమా– పెద్ద కొడుకుగా! నీకింక దిగులు వొద్దులే" అని మా అమ్మకు దైర్నం చెప్పడానికి మా అన్న వుంటాడు గదా. 'అయ్యో మన మొగుడు మనం బతికినంత కాలం బతకలేక పోయినాడే! ఆయన కడంత గాలం వూపిరి బెట్టుకుని మన కండ్ల ముందర చేతులూగించుకుంటా తిరగలేక పోయినాడే!' అనే బాద మా అమ్మకు ఎవురూ తీర్చలేక పోయినా, ఆ మాత్రం బాద మానుడి జల్మ ఎత్తినాక తప్పునా? అసలు ఈ మాత్రం బాద పడడం గూడా అనావశిమే. ఆయన ఆయుసు తీరిపోయింది, శాస్పిత నిద్దరకు పోయినాడు. దీనిలో పడడానికి ఏమి బాద వుండాది? ఒకేళ మా అమ్మ ఈ బాదనే బరిచ్చలేక బొరోమని ఏడ్చిందంటే అప్పుడు నేను ఏడ్వకుండా వుండి, "ఎందుకమా నీకా ఏడుపు? మన నాయన యాడికి పోయినాడు? మన యింట్లోనే మన కండ్ల ముందర్నే– మనం కంసలాయన చేత చేయించిన జాజికాయల పెట్టెలో శాస్పితంగా నిద్రపోతా వుండాడు గదా! రా చూద్దావు" అని నేను మా అమ్మ కొంగును బట్టి జాజికాయల పెట్టె దగ్గిరికి నవ్వు మొకంతో లాక్కొని పోతాను. నేను జాజికాయల పెట్టె మూత తెరిచి, నిద్దర పోతా వుండిన మా నాయినను చూపిస్తాను. అంతటితో వూరుకోకుండా నేను ఒక సన్నటి పొరక పుల్లను తీసుకొని వచ్చి, నిద్దరబోతా వుండిన మా నాయిన చెవల్లో, ముక్కల్లో దోపి మా నాయినను గంగిరెద్దులాట ఆడిపిస్తాను. పాపం మా నాయిన చచ్చిపోయి నిద్దర పోతా వుండాడు గదా! ఆయన నేను ఏమి చేసినా, 'తంతా, పట్టుకోని!' అని దొంగ నిద్రలో వుండిన మనిసి

మాదిరిగా కసురుకోకుండా, నిజం నిద్రలో వుండినట్టుగా వుండి, ఆయన నిద్రను ఆయన పోతా వుంటాడు. నా లెక్క ప్రకారం – బతకడం అంటే దొంగ నిద్ర, చచ్చిపోవడం అంటే నిజం నిద్ర. మా నాయిన్ను నేను వుడకాడిపించే యిదానం జూసి, మా అమ్మ నన్ను ముదిగారంతో కసురుకోని, "ఇంక మూసియ్యి, ఆ జాజికాయల పెట్టెని, యింగ మూసియ్యిరా ముండమొకం యెదవా!" అని, "ఒరే సినబ్బా, నిన్ను నమ్మగూడదురా సామీ. రేపు మరసనాటికి నేను చచ్చిపోయి, జాజికాయల పెట్టెలో నిద్రపోతా వుంటే నువ్వీ రకంగానే గదా నన్ను గూడా చెయ్యబోతావు!" అని నిష్టూర పోవును. అబ్బ, ఇది ఎంత బాగా వుండాది. దీన్ని తలుచుకుంటా వుంటేనే ఎంతో బాగుండాది. ఈ ఏరుపాటు నిజంగానే మనం చేసుకుంటే చావుగూడా ముదిగారం అయి పోయి, అది ఒక పెండ్లిగా అయిపోదా? అప్పుడు మనం చావుకు గూడా మాలా మాదిగోళ్ళను పిలిపించి, దరిద్దరపు పలకలు వాయించి, యికారపు కొమ్ములను వూదించకుండా– మొకాన కుంకుం బొట్లు పెట్టుకొని, తెల్ల పంచెలు కట్టుకొని వుండే మంగలోళ్లను పిలిపించి మనం మన చావులకు మంగళమేళాలు పెట్టుకోవచ్చు. మనిసి చచ్చిపోయినా, కోట్ల సమ్మచ్చరాలు మన ఇంట్లో వుండినా కాసింత వాసన రాకుండా చెక్కు చెదరకుండా, మంచం మింద నిద్రపోయే మనిసి ఎట్ట వుంటాడో అట్ట వుంటే ఈ బూలోకం కైలాసం గాక బూలోకమైతిందా! వూరికే అదీయిదీ తలచుకున్నట్టు, దీన్ని గూడా తలచుకుంటేనే– మనందరికీ యింత కుశాలగా వుండాదే, ఇదంతా అచ్చు గుద్దినట్టు జరిగితే, ఆ అనుబోగం యింగెంత తియ్యంగా వుండును? మనం ఒకరి గుద్దల్లో ఒకరు యేళ్ళు పెట్టుకోనుగా, ఒకరికి ఒకరం వూనం తెచ్చుకోనుగా వుండి, ఎంతో ఆయైన బతుకులోకి కనాగష్టాన్నంతా తెచ్చుకుంటా వుండామే గాని– మనం ఆదీ నిదానంతో అన్నీ ఆలోసినలు జేసుకొని మనకు మనమే ఒక మార్గాన్ని తెచ్చుకోలేకపోతా వుండాం. మనకు ఎంతో అనావశిమైన గుడుగుడు మోటార్లని, పై మోటార్లని కనిపెట్టుకొని మన ఆదీనంలోకి తెచ్చుకొనే బదులు – ఇటుమంటి వాటికి ఏమన్నా చూడచ్చు గదా! ఈ యిసయంలో మటుకు నర మానుడు– వుడికిన పొట్ట పేగును కూడా తెంపుకోలేనంత బలీనంలో– ఎందుకు వుండినట్టు?

వాడికి ఆ తపన, ఆ యాదన వుంటే గదా! అనిపించి మనుసులందరి మిందా ఎక్కడలేని నిష్టూరంతో వుండేవాడ్ని.

వుతారు కోసరమని ఒక ఆడామె చచ్చే పోయిందను కోండి. ఆ ఆడామె గల్లోళ్లు ఆమిని పూడ్చి పెట్టి చేతులు కడుక్కునే యత్నంలోనే వుండిపోతే ఎట్ట? ఆమి కొంగులో దోసిడు జిలకరా, మిరాలూ మూటగా కడితే ఆ మనిసి బతికి లేచి కుచ్చుంటాదేమో? ఒకేళ ఆ మనిసి బతక్క పోయినా, చీమంత వాసన గూడా పట్టకుండా ఎల్లకాలం బద్రంగా వుండిపోతాదేమో! ఈ రకంగా ఎవురన్నా సరే, ఇటుమంటి యత్నాలు చేసినారా? చేసినాక పలితం లేకపోతే దానికి మనం ఏమీ జెయ్యలేము. మన యత్నం అన్నా మనం చెయ్యాలగదా! ఒక మండలో నుంచి చింత చిగురును తెంపుకోని వచ్చి పీనిగ మింద అంతా చల్లితే– ఆ మనిసి ఎల్లకాలం బద్రంగా వుండిపోతాడేమో! ఎవుడు చూసొచ్చినాడు, ఇదే నిజమేమో!– అని గూడా అనిపించేది నాకు. ఈ బూమండలం మింద కాళ్లూజేతులూ వూగులా డించుకుంటా తిరిగే ఏ మనిషిని జూసినా, 'యెనకాన పెద్ద సంపత వుండినట్టు తిరుగులాడతా వుండాడు. యితగాడికి తెలవదేమో– ఎప్పుటికైనా ఒక రోజుటికి అంతెత్తు మొనగాడు పిడికిడు మట్టిపెళ్ల అయిపోతాడని. ఈ మాత్రంలో దానికి ఎందుకో, అంత పెగ్గి, బడాయి?' అనిపించి నాకు మనుసుల్ని ఎవుర్ని జూసినా ఎగతాళిగానే వుండేది.

మా అమ్మను గురిచ్చి నేను నిజంగానే ఎవురికీ ఏమీ చెప్పలేను. ఆ మనిసిలో పలానా పలానావి, ఈ ఈ మాదిర్లుగా వుంటాయి– అని చెప్పడానికి మా అమ్మను పుట్టించిన బెమ్మ దేముడుగూడా జంకి పోవాల్సిందే. కట్టి వరస మనిసే అయినా, ఎంతో సన్నంగానే వుండినా, బలే పొడుగు తక్కువ మనిసే అయినా– మా అమ్మ కంటికి మాత్రం బలే యింపుగా వుండేది. బాపనోళ్ల పుట్టక మాయమ్మది. మా అమ్మ ముక్కులు ఈ కలిగ్గంలో యింగొకరికి అమిరేవి గావు. మా అమ్మ ముక్కుమింద అడ్డంగా కనీ కనిపించకుండా వుండే ఒక గీతను, మా అమ్మ దగ్గిరికి పోయి చూసేసి రావాల్నేగాని అది చెప్తే అర్తమయ్యేది గాదు. మా అమ్మ ముక్కులకు ఆ పక్క ఒకటీ ఈ పక్క ఒకటీ పచ్చదీ, ఎర్రదీ ముక్కురాళ్లు– మా అమ్మ ముక్కుల్లో చేరుకొని లేత ఎండకు, మద్యానం ఎండకూ ఏ రకంగా మెరిసి బడాయిలు

పొయ్యేదీ వాటికే తెలవదు. మా అమ్మ చెవల్లోకి రాళ్ల కమ్మలు– తెల్లవి– వుండేవి గాని, అవి దయాదాచ్చిన్యం లేనివై మా ఆ అవసరానికి, ఈ అవసరానికి పనికి వస్తా ఎప్పుడూ తిరపతి మార్వాడీ అంగిట్లోనే చదువుకుంటా వుండేయి. కాని మా అమ్మ చెవి దుంకల్లో చేరుకొని వుండే యింత పొడుగు పొరక పుల్లలు మాత్రం, 'మనం జారిపోతే సినక్క ఎక్కడ నొచ్చుకుంటాదో!' అని ఒకదాన్తో వొకొటి కలిసి మాట్లాడుకున్నట్టుగా మా అమ్మ చెవుల్నే కాపెట్టుకొని వుండేవి. మా అమ్మ రెండు కండ్లూ పిలకాయలు ఆడుకొనే గోలీ గుండ్లకన్నా మురిగారంతో వుండి, ఒకచోట వుండకుండా అట్టాయిట్టా దొర్లుకుంటా పోయే పుచ్చుక్కాయల మాదిరి ఎప్పుడూ నమనమలాడతా వుండేవి. ఈ రీతిగా నేను – మా అమ్మ కట్టుకొనే నేత కోకను గురిచ్చి, ఆమి పెట్టుకునే కుంకం బొట్టును గురిచ్చీ చెప్పుకోవాల్నే గాని మా అమ్మను గురించి ఏమి చెప్పడానికీ నాకు నోట మాట రాదు. అ మనిసి ఆమిని గురిచ్చి ఆమే, "నేను ఏమి మనిసిని. వొక్కల ముక్కలగా వుండే యికారపు దాన్ని" అని చిన్న బెట్టుకుంటిందే గాని, ఇదంతా ఆమి యికారం గాకపోతే ఆమిని యికారపు మనిసిని ఎవురన్నా అనగలుగుదురా? అని బతక గలుగుదురా? మా అమ్మ ఎప్పుడు ఏ మాటను నోట బెట్టేదీ ఆమెకే తెలవదే! తట్టలో గుడ్డు పెట్టేసి, కడగా వచ్చేసిన కోడి, 'కొక్కొక్కోక్కోక్కో' అని లచ్చా తొంబైయ్యారు సార్లు ఇల్లంతా అది తిరుగులాడి రచ్చ చేస్తా వుంటే, నేను గూడా దాని మాదిరిగానే అని నా గొంతును నేను ఎండబెట్టుకుంటా వుంటే, "సినబ్బా, దాంతో పాటు నువ్వా రాద్ధాంతం జేస్తా వుండావా, యింట్లో?" అనేది. నా వుడకాడింపులకు మా అమ్మ, "సినబ్బా, నీ మానాన నువ్వు కుదురుగా వుండు రా రేయ్!" అనే మాట, ఇప్పుడు అది మాటగానే వుంటింది గాని, అది మా అమ్మ నోటిలో బడి యిప్పటి వరకూ ఎవురూ పాడని ఒక కొత్త పాటగా వుండేది. 'సినబ్బా!' అనే కూత మా అమ్మ గొంతులో వుండే మిట్ట పల్లాలల్లో పడి బైటికి వస్తే, ఆ కూత ఎంత తియ్యంగా వుంటాదో అది ఒకరు చెప్పి, యింగొకరు వింటే అర్తమయ్యే ఎవ్వారం గాదు. ఈ వైబోగాలన్నీ గూడా మన అమ్మ చచ్చిపోతానే– అన్నీ పోతాయి గదా. వీటినన్నిట్నీ మళ్ల మనం – తలుచుకోని, తలుచుకోని దుఃక్క పడాల్సిందే గాని, కండ్లారా చూసుకొని, చెవులారా వినుకొనే పని వుండదుగదా అనిపించి నాకు వొళ్లంతా గబీమనేది. సినిమా యాకట్రల బిడ్డలు ఎంతో పున్నాత్ములుగా అనిపించే

వాళ్లు. సినిమా యాకట్రలు చచ్చిపోయినా వాళ్ల బిడ్డలు ఆ సిన్మాలు చూసి వాళ్లను దినామూ గుర్తుకు తెచ్చుకోవచ్చు. మన అమ్మ చేష్టల్ని, మన అమ్మ మాటల్ని ఏమీ గూడా పొల్లు బోనీకుండా అన్నిట్నీ సినిమాలు సినిమాలుగా ఎవురన్నా వొచ్చి తీస్తే బాగుండును. ఒంటిమింద బాగా కండలు వుండి, ఎంతో పొడుగ్గా వుండే మనుషుల్ని బెట్టుకొని సినిమాలు తీస్తారు గానీ, మన అమ్మను బెట్టి అంతా సినిమాగా తీస్తారా అని గూడా నాకు నేను అనుకొని మూతిని నల్లంగా బెట్టుకొని, నన్నెవురో వచ్చి ఎగతాళి చేసిపోయి నట్టుగా కుళ్లిపోయ్యే వాడ్ని. ఇట్ట గాకుండా మన పక్కకు సినిమాలు తీసే వాళ్లు ఎవురన్నా వస్తే బాగుండును మొత్తానికి. ఇప్పుడు రామారావో, నాగేస్పర్రావో రైతు బిడ్డగా యాక్సను జేస్తా వుండి, పన గొట్టినట్టు వుండినాడనుకోండి. అప్పుడు మా అమ్మ మోచేతుల సందున పన బెట్టుకొని రామారావుకు యిచ్చినట్టుగా సినిమా తియ్యొచ్చు గదా. సందు జూసుకొని మా అమ్మచేత గూడా, 'ఇంద, పన!' అని ఒక మాటను మాట్లాడించాల. అటుమంటప్పుడు ఆ సినిమా ఏ వూళ్లో ఏ కొటాయిలో ఆడతా వుండినా, మనమూ మన పెళ్ళాం పిలకాయలము – ఆ ఒక్క మాటా వినే దానికి, ఆ ఒక్క నిమిసమూ మన అమ్మను మనం చూసుకొనే దానికి – ఎద్దుల బండి కట్టుకొని పోయి చూసేసి వచ్చి, ఆ కొంచేపు మన అమ్మ చచ్చిపోయిన దిగులులో నుంచి మనం తెరిపిన పడవచ్చు. ఈ మాదిరిగా చింత పడి, 'దేముడు జెప్పినట్టు జరగతాది అంతా! మనం నిమ్మళంగా వుండాల' అని అనుకుందామంటే, ఎక్కడ – వీలవతా వుంటే గదా! మనం మద్యానం పూట మనింట్లో కూచ్చొని సంగటి తింటా వుంటే – వొక కుక్క నోట్లో బురుగు పెట్టుకొని వొగుర్చుకుంటా వస్తింది కదా! దాన్ని చూస్తా మనం సంగటి తినడానికి సగించక, దాన్ని వీదిలోకి తోలేసి మళ్లా వచ్చి సంగటి దగ్గిర కూచ్చుంటే, ఆ కుక్కది ఎంతో సొంతంగా మళ్లా మన యెనకాన్నే వచ్చి మన ముందర నిలబడుకోని వగురుస్తాది. ఈ మాదిరిగానే ఆలోసినలు అనేవాటికి గూడా కుక్క బుద్దే నిజంగా. మనం వాటిని మనలో నుంచి ఎంత దూరంగా తోలేసినా, అవి తోలినంత సేపే దూరాన వుండి, మళ్ళా మనం ఇట్ట వచ్చి కూచ్చోంగానే అవి మనలోకి వచ్చి చేరిపోతాయి. ఇంక వాటితో వేగులాడలేక నాకు ఎక్కడలేని అరోసికం పుట్టిపోయింది. నేను నా

చెవల్లో వేళ్ళను దోపి బలంగా మూసేసి, కండ్లను రెప్పలు నెప్పిబుట్టేటట్టు మూసేసికొని, నోటిని గాలి కూడా పోనీకుండా పెదాలను నొక్కి పట్టేసి, నాలో ఎక్కడైతే దుంకలు వుండాయో అక్కడంతా కట్టుజేసి పడేసినాను. అయినా సరే, నేను కండ్లు మూసుకున్నా నాకు యిచ్చిత్రమైన రంగు వకటి నా కండ్లల్లో కనిపించింది. మనం కండ్లు మూసుకుంటే అంతా నిరామయమై పోవాల గదా. నాకు అట్ట గాకుండా, నా ఎదుట – అట్ట కుంకమా గాకుండా, ఇట్ట పసుపూ గాకుండా, నడీ మధ్యలో వుండే ఒక రంగును ఎవురో ఎగర జల్లినట్టుగా కనిపిచ్చింది. నాకు కండ్లు మూసుకున్నా కూడా అదేందో ఒక రంగు కనిపిస్తానే వుండాదే! యిదెక్కడి యిచ్చిత్రం రా బగమంతుడా! – అనిపించి నాకు పొద్దు పరంటన పుట్టినట్టుగా ఎంతో బయపడి పోతిని. మనలో మనమే వుండిపోయి, దేన్నీ చూడకుండా, దేన్నీ వినకుండా వుండడం సాధ్దిం గాదా ఏమి? అనిపించింది. మా ఇంటికి ఒక తలుపు వుండాది గాబట్టి నేను ఆ కుక్కను తోలేసి, తలుపు మూసేసి దాని బారి నుంచి తప్పుకొని, నా సంగటిని నేను కుశాలగా తినినట్టే, మనిషైన నాకు కూడా ఒక తలుపు వుంటే ఎంత బాగుండును? దాన్ని మూసుకునేస్తే మళ్ల మనకు ఏ ఆలోసినా రాకుండా వుండి, మనం వొకావొకిగా వొంటిగా వుండిపోవచ్చును గదా – అనే ఆలోసిన తట్టేది నాకు.

యింగొొక కర్మ గాచ్చారం జూడండి. మా వూళ్లో శేషమ నాయుడని వొకాయన వుండాడు. ఆయనొక రోజు నన్ను పిలిచ్చి, నా చేతిలో పది పైసాలు బెట్టి బక్తిమాల బీడీలు తీసక రమ్మన్నాడు. నేను అంగిడికి పొయ్ తీసుకోని వాళ్లింటికి పోతే వాళ్ల గుడిసి గోడ మింద ఒక బొమ్మను చూసి నేను దెయ్యాన్ని చూసినట్టు వొణికి పొయ్‌నాను. అది నరక లోకానికి సమందించిన బొమ్మలతో వుండాది, సిల్మా పోస్టరంత. చచ్చిపోయినాక పాపాలు జేసిన వాళ్లను నరకంలో ఎట్టెట్ట చిత్రింసలు బెడతారో బొమ్మలు బొమ్మలుగా ఆ గోడ మింద వుండాయి. దాన్ని చూస్తే మానుడి జల్మ ఎందుకు ఎత్తినామా అనిపించింది. బూమ్మింద లంజరికం చేసినోళ్లను నరకంలో ఏమి చేస్తారు, వొడ్డీలకు మార్చినోళ్లను ఏమి చేస్తారు, అపద్దాలు చెప్పినోళ్లను ఏమి చేస్తారు అనేవన్నీ యిలావరిగా చూపించి వుండారు. బెల్లప్పాగు కంటే వుడుగ్గా వుండే బానలో పడి ఒక పాపాత్ముడు కేకలు బెడతా వుండాడు.

చెడ్డ పనులు చేసిన వాళ్లు కొందురు అగ్గిలో దూకతా వుండారు. సలసల కాగే నూనెలో కొందురు అల్లాడతా వుండారు.

శేషమ నాయుడికి బీడీలిచ్చేసి వచ్చినాక వొకే మనేద పట్టుకునేసింది. ఎనిమిదో తరగతి లోగా నేను చిన్న చిన్న దొంగతనాలు చేసినానే గానీ పెద్ద పాపాలు ఏమీ చెయ్యలేదు. యిప్పుటికిప్పుడు నేను చచ్చిపోతే నరకంలో చిన్న చిన్న శిచ్చలతో వేగి మళ్ల సొర్గానికి పూడవచ్చు. నలపై యేండ్ల దాకా బతకడం అనావశం అనిపించేసింది. మా అమ్మను తలుచుకుంటే బిత్తరెత్తు కునింది. మా అమ్మకు నరకం గ్యారంటనిపించింది. ఏమిటికంటే యింటి ముందరకొచ్చిన బిచ్చిగోడికి కూడా ఒక కడి సంగటి యెయ్యలేదే! లోబి గాబట్టి మాయమ్మ చచ్చి పోయినాక నరకానికి పోయి నూనెలో కాగతాదా! వొళ్లంతా అదురు బుట్టి పొయ్యింది. అసలీ బూమ్మింద చేతు లూగించుకుంటా అందరూ ఎందుకిన్ని పన్లల్లో వుండారు, యీ నరకాన్ని గురిచ్చి యోచన జెయ్యకుండా? బూమ్మింద వోడు ఎవుడన్నా సరే నూరేండ్లే, పైన వుండాల్సింది శతకోటి సమ్మచ్చరాలు.

ఇంక అంతే. ఎప్పుడూ దేముడి గురించిన యోచనలే చేసినా, కొన్ని నెలలు దీని మింద ఆలోచించంగా – నేను కనిపెట్టింది ఏమంటే కచ్చితంగా నరకమైతే వుండదు, దేముడనే వాడే వుంటే. శిచ్చలనేటివే దేముడు యెయ్యడసలు.

ఇది జూడండి. డెబ్బై ఏండ్ల ముసిలోడి జేబీలో పదైదేండ్ల పిలగాడొకడు పది పైసాలు దొంగిలించేస్తే ఆ డెబ్బై ఏండ్ల ముసిలాయన ఏమి చేస్తాడు! పిలగాడు చేసింది కచ్చితంగా దొంగతనమే. అగ్గిలో దూకుమంటాడా, కాగే నూనెలో యేగమంటాడా? మఖా అయితే చిన్న చెంప దెబ్బ తమాసగా కొట్టి, "పది పైసాలు నన్నడిగుంటే యిచ్చుండనా?" అనే అంటాడు. యింతకీ ముసిలోడి వొగిసులో పిలగాడి వొగిసు అయిదో వంతే! ఇంక దేముడి దగ్గిరికి పదాం పదండి. ఆయనకెన్నేండ్లుంటాయి? కనాగష్టం కోటి సమ్మచ్చ రాలనుకుందాము. మఖామఖా ముసిలోళ్లకు కూడా బూమండలం మింద తొంబై య్యేండ్లు దాటవు. తొంబైయ్యేండ్లు కోటి సమ్మచ్చరాల్లో ఎన్నో వొంతని! కోటి సమ్మచ్చరాల దేముడి ముందర ఎన్నేండ్ల మనిసయినా పురిట్లో బిడ్డతో

సమానం. ఇప్పుడు మా అమ్మ రేపు నరకానికే పోయిందనుకోండి. కూలోళ్లకు గూడా సరిగ్గా సంగటేసేది కాదు గాబట్టి, కోటి సమ్మచ్చరాల దేముడు మాయమ్మను యిశారిస్తాడా? మా యమ్మ దోగాడే బిడ్డతో సమానం ఆ దేముడికి. మాయమ్మ నరకానికి పోంగానే ఒకేళ దేముడు ఆడ వుంటే దోగాడతా దోగాడతా పొయ్ ఆయన వొళ్లో కూచ్చుంటాది. వోడు యముడైనా గానీ దేముడైనా గానీ ఏ మనిసికీ గూడా శిచ్చలు యెయ్యనే యెయ్యడు. కోట్ల సమ్మచ్చరాల వొగిసు వున్న దేముడికి మనం చీమలతో సమానం. మన పాప పుణ్యాలను ఆయన యిశారిచ్చే ప్రశంసే వుండదు.

ఆ నరకానికి సమందించిన పటంలో వుండింది జరిగే పనే గాదని తీర్మానం జేసుకున్నాక నాకు నిమ్మళం దొరికింది. నరకం వుండాదని అనుకోవడం, అక్కడ పాపాలు జేసిన వాళ్లకు దేముడు శిచ్చలు యేస్తాడని అనుకోవడం గూడా మనిసి ఆంకారమే. దేముణ్ణి పలచన జెయ్యడమే. యిప్పుడు యిందిరీ గాందీనే తీసుకుందాము. ఒక యాపై యేండ్ల వాడు ఆమె బతికి వుండంగా ఆమె ముందరికి పోయి వొక కాని పని చేసి ఆమెకి కోపం తెప్పించి ఆమె చేత మొకాన ఎంగిలూయించుకోని శిచ్చి యెయ్యించు కోవడం అయ్యే పనేనా?

ఈ బయాలే నాకు చాలవన్నట్టు నాకు యింగొక బయం వచ్చి తగులుకొనింది. అయితే, అది నాలోకి ఎంత తొందరగా వచ్చిందో, అంత తొందరగానే పోయింది పాపం. ఎంతో ఎత్తులో వుండే ఆకాశాన్ని మేము కొండ అని అంటాము. ఆ కొండ బులుగు రంగులో వుండి, ఈ కలిగ్గం నెత్తిన ఏ పొద్దో ఒక పొద్దు పడిపోయి, జీవుల్ని అందర్నీ అప్పచ్చులు అప్పచ్చులుగా చేసీబోతాది అనిపించి పైకి ఎగజూసినప్పుడల్లా నాకు చచ్చే చావుగా వుండేది. అంత పెద్ద కొండకు అక్కడ ఏమి ఆదారం వుండబోతాది? అది మాత్రం పడి మనమంతా జజ్జనకం – అయ్యేది తప్పదేమో, అనుకొని నేను చావు దరువు వినబడినట్టు బయిపడే వాడ్ని. ఈ సంగతిని నేను మా అమ్మ ముందర బయటబెడితే, మా అమ్మ నవ్వి నాకు ఒక కతజెప్పి, శాస్పితంగా ఆ బయాన్ని మాత్రం పోగొట్టింది. ఆ కత ఏమి అంటే– ఒకప్పుడు పెద్దోళ్ళ కాలంలో ఆ కొండ ఎంతో దిగువన వుండి, మనం ఎగిరి అందుకుంటే అందుకొనేటట్టుగా వుండిందంట. అప్పట్లో పసి పిలకాయలు గూడా చుక్కల్తో

ఆట్లాడుకునే వాళ్లంట. అయితే ఒక బాసేలి – మడికాడ మడక దున్నే మొగుడికి, చద్దేళ పూట చద్ది ఎత్తుకొని కదల బారిందంట. ఆ మొగుడి కడుపు కడుపు గాదంట. ఆయన కడుపు మా రాయల చెరువు తూము అంత వుండేదంట. అందుకని ఆ ఆడామె దుత్త మింద దుత్త నాలుగు దుత్తలుగా పెట్టుకొని, దండిగా చద్ది పోసుకొని పోతా వుంటే, ఎగవన వుండే ఆ కొండ తగిలి దుత్తలన్నీ కిందబడి పగిలిపోయి, చద్ది నేల పాలై పోయిం దంట. అప్పుడు గంపడు నోరు గలిగిన ఆ ఆడామె, "నా సవితి కొండా! నీకు యింత దిగవన ఏమి పని? దూరంగా పొయ్ కూలిపో ఏమి?" అని తిట్టిందంట. ఇంత బతుకు బతికి దీని దగ్గిర మనం ఇంత మాట అనిపించుకున్నాం గదా – అని కొండ అలిగి దూరంగా, ఇప్పుడుండే అంతలోకి పొయ్యిందంట. అందుకని ఇంక అది కిండబడే ప్రసంశే వుండదని మా అమ్మ కత జెప్పింది. అప్పట్నించి నాకు కొండకల్లా ఎగజూడడమంటే బయం బోయి ఇష్టం గలిగింది.

ఈ కతను చెప్పనిచ్చి, నేను మళ్ళా మొదుటికి వచ్చి, "అమా, నీకు వొగిసు ఎంత వుంటాదమా?" అనడిగినాను. ఇప్పుడనే గాదు, ఈ మాటను నేను దప దపాలుగా అడిగి చాలుకోని వుండాను. మా అమ్మ ఏ వస్తవ దర ఎంత వుంటాదో కచ్చితంగా చెప్పగలిగేది. అటుమంటి ఆమె వొగిసు దగ్గిరికి వచ్చేటప్పటికి, తిక్కల మనిసి మాదిరిగా మాట్లాడేది. మా నాయినకు అవితే – ఆయనకేమీ తెలవదులే, అని అనుకోవచ్చు. ఎన్నో శాత్రాలు, ఎంతో మంచి మంచి చాటవలు తెలిసి పెట్టుకుని వుండే మా అమ్మ వొగిసు దగ్గిర మాత్రం – పసిబిడ్డ కన్నా అద్దోన్నంగా మాట్లాడేది. మా అమ్మ ఎంత లోకం తెలిసిన మనిసియ్యా – అంటే, అంత లోకం తెలిసిన మనిసి. మా అమ్మ వంకాయలు అమ్మి ఒక దపా, తిరప్తిలో నుంచి మా నాయినకు రెండు సవకాలు తెచ్చింది. ఆ పైగుడ్డలను మా నాయిన చేతుల్లో పెట్టి, "ఇంక రెండేండ్లు పై గుడ్డలు – అని తలవగూడదు. చూడు ఎంత మందంగా, ఎంత గెట్టంగా వుండాయో! జత పై గుడ్డలు ముప్పై రూపాయిలు! వాటిని అటా వుండాయి – అని అనుకునేవు. బలే మంచివి" అనింది మా అమ్మ. ఈ మాటలకు మా నాయినలో మా నాయినే నవ్వులాడుకుంటా, "వొరె, పై గుడ్డలు బలే సలీసుగా వుండాయే! నేనవితే ఒక్కొక్కటే ఇరై అయిదు రూపాయిల దర జేస్తాయని అనుకున్నా" అని మురిసి పోయినాడు. మా అమ్మ – మా

నాయిన దగ్గిర ఏ మాటా మాట్లాడకుండా వుండి, నన్ను వారగా పిలిచి, “నువ్వూ మీ నాయినా యెర్రితనంలో ఒకరి జుట్టులో వొకరు దూరిపోతారు రా సినబ్బా! ఆ జత పై గుడ్డల దర ఎంతో తెలుసునా! పదకొండు రూపాయలకు పైన ఎర్ర నయాపైసా గూడా పెట్టలేదు. అంగిడోడు మటుకు చెప్పడం చెప్పడంతోనే ఇరై రూపాయలని చెప్పినాడు. నేను ఎనిమిది రూపాయిలకు అడిగినా. కడకు పదకొండు రూపాయలకు బేరం కుదిరింది. మీ నాయినా, నువ్వూ గాని అవితే, అవే పై గుడ్డలకు నలపై రూపాయలు ఇచ్చే వుంటారు. అదీ మీ నామిని జాతికీ, మా కొడవటికంటి జాతికీ వుండే తేడా!” అని మా అమ్మ చెప్తా వుంటే ఆమె మాటల్లో కైలాసాన్ని చూసుకుంటా వుండిపోయినాను నేను. ‘పలాతుకురాలుగా వుండాది ఈమె ఎవురో. ఇందిరీగాంది యాడబోవాల మన అమ్మ దగ్గిర!’ అని ఆమె తెలివి నాకెంతో యిచ్చిత్రంగా వుండేది. అటుమంటి జాంతానం వుండే మా అమ్మ, ‘అమా, నీ వొగిసు ఎంతమా?’ అనడిగితే ఆమె, “వుండవా నాకు అరై డెబ్బై అన్నా!” అనేది. ఆమె కొడుకుని ఏడో, ఎనిమిదో చదవతా నేను వుండాను గదా, అరైడెబ్బై ఏండ్ల ముసిలామికి నా అంత పసిపిలగోడు కొడుకుగా వుంటాడా ఎక్కడన్నా? “నీకు ఏమీ తెలవదమా. నోట్లో యేలు బెడితే కొరక లేని పసిబిడ్డతో సమానమనుకో నువ్వు. అట్టగాకుంటే, నీకు ఇంతలేకే అరైయ్యేండ్లు వుంటాయా?” అనేవాడ్ని నేను. నేనెందుకు ఇటుమంటి పెశండాలను నిలుకు లేకుండా అడగతా వుండానో తెలుసుకొన్న మా అమ్మ, “ఏమిరా, నా సిన్న కొడకా? నా వొగిసుతో సఖా అడిగి కనుక్కుంటా వుండావు. ఏమి కత? మళ్ళా రాత్రికి ఆ కలవరం, ఈ కలవరం తెచ్చుకోని ఏడ్చుకొనేదానికా, ఏమి?” అని బయపడేది. ఈ మాటకు నేను “వూరికే అడగతా వుండానమా... తెలుసుకుంటే తప్పా ఏమి? మన అమ్మ వొగిసు మనకు తెలిస్తే తప్పా?” అనే వాడ్ని. “నేనేమన్నా ఈ కాలపు మనిసినా? నేనెంతో పాత కాలం మనిసిని గదా!” అనేది మా అమ్మ. “కనీసం యాపై యాపై అయిదన్నా వుంటాయి” అనేది కడ మాటగా. ఈ మాట గూడా నేను నమ్మే వాడ్ని గాను. నేను నా అంతట నేనే అంతా ఆలోచించుకొని మా అమ్మ వొగిసును లెక్కగట్టాల, కావాల! – అనుకొని ఒక తెగింపుకు వచ్చే వాడ్ని. ఇది మన వల్ల సాద్దిమా? – అని అనుకోకుండా మనం కొంచేపు అన్ని లెక్కలూ యేసుకుంటే అయిదు

నిమిసాల్లో మన అమ్మ వొగిసును మనం కనుక్కోవచ్చు. ఈ లెక్క ఎట్ట గట్టాలో నేను మార్గాలను కనిపెట్టుకున్నాను. మా అమ్మను ఎట్ట అడగాల్నో తెలవక, "నువ్వు ఎప్పుడు ఏ సమ్మచ్చరంలో పుట్టినావు, మా?" అని అడిగినాను నేను తొలిగా. ఇందుకు మా అమ్మ నవ్వు మొకంతో, "లెక్కా పత్రం లేదే, నేనెట్ట జెప్పుదు?" అనింది. ఈ మాటతో నా బుద్ది తక్కువ తనానికి నాకే నవ్వు వచ్చింది. లేకుంటే నేను ఆ మాదిరిగా అడగడం ఏంది? నేనే ఏ సమ్మచ్చరంలో పుట్టినానో మా అమ్మకు తెలవదు. 'అమా నేనెప్పుడు పుట్టినానమా?' అనడిగితే మా అమ్మ, "నువ్వు మంచి చిత్తకార్తిలో పుట్టినావు. అప్పుడు జొరోమని వాన! నువ్వూ బూలోక రంబా ఒకటే ఈడు గదా!" అనేది గాని కచ్చితంగా చెప్పగలిగేది గాదు. నేను నిష్టూరంతో, "ఏమి, నీ మొగుడు సంపాయించిన సొమ్ము ఏమి పొయ్యుంటాది? నేను పుట్టంగానే ఒక బొగ్గుతో మన గోడ మింద ఒక గీత గీసి లెక్కేసి పెట్టుంటే నీ సొత్తు ఏమి పొయ్యుంటాది?" అనేవాడ్ని. మా అమ్మ నేనామాట అనినందుకు ముదిగారానికి పోయి, "అన్ని తెలువులే వుండి బతికుంటే మేమిప్పుడు ఈ రీతిగా ఎందుకుంటాము కొడకా?" అని మా నాయిన్ని గూడా కలుపుకొని అనేది మా అమ్మ. మన అమ్మ వొగిసును లెక్కగట్టుకొనేది గదా మనకు ముక్యము. నేను మా అమ్మ కల్లా జూసి, "నేను లెక్కేస్తానుండు నీ వొగిసు, ఏమమా, నువ్వు సుమారు ఎన్నో సమ్మచ్చరంలో రుజువైనావో చెప్పు." అనడిగినాను. మా అమ్మ దీనికి పొడుగ్గా ఆలోచించుకొని, "నేనా? పదేడో సమ్మచ్చరంలోనో, పజ్జెనిమిదిలోనో పెద్ద మనిసినై వుంటా" అని చెప్పింది. ఆ తప్పుడు సమాదానానికి నేను, "నీ మొకం" అని కసురుకొని, "పన్నెండు పద్మూడు సమ్మచ్చరాల కంతా ఆడ పిల కాయలు పెద్ద మనుసులవతారనుకో. మా ఐస్కూల్లో ఎనిమిది చదివే మునెమ్మ ఏడులోనే పుష్పవతయ్యిందంట తెల్సునా? లోకానికే యిరుడ్డంగా పదేడో సమ్మచ్చరంలోనో, పజ్జెనిమిదో సమ్మచ్చరంలోనో అయిందంట!" అని నేను మా అమ్మకు అచ్చుటా ముచ్చుటా కలిగే రీతిలో మాట్లాడినాను. అప్పుడు మా అమ్మ, "మా కాలం వేరు గదరా. అదొక వెర్రి కాలమైపాయ. ఇప్పుడంటే తొందర తొందరగా అన్నీ తెలిసిపోతా వుండాయి. అప్పుడు అట్ట గాదు గదా! అప్పట్లో మేమంతా లేటు లేటుగా పెద్ద మనుసులం అయ్యేవాళ్ళము" అనేది.

నేను ఎట్టయినా సరే మా అమ్మ వొగిసు తక్కువగా వుండాలని చూస్తా వుంటే, ఎక్కడ మా అమ్మ వొక్కొక్క పుల్లే అడ్డంగా వేస్తా వుండాదే! మా అమ్మ పద్నాలుగేండ్ల కంతా పెద్దమనిషి అయినట్టుగా లెక్కేసుకున్నాను. మళ్లా నేను మా అమ్మను "పెద్ద మనిషి అవినాక నువ్వు ఎన్నేండ్లు తాలి పెండ్లి చేసుకున్నావు?" అనడిగితే, "మా అమ్మ వొకటీ వొకటిన్నర సమ్మచ్చరమే–" అనింది. అంటే మా అమ్మకు పదారేండ్ల కంతా పెండ్లయినట్టు లెక్కగట్టినాను. "నీకు అన్న ఎప్పుడు కడుపులో పడినాడు? పెండ్లయినాక ఎన్నేండ్లకు పుట్టినాడు అన్న?" అనడిగినాను. దీనికి మా అమ్మ, "అన్నకు ముందర నాకు ఒకడు పుట్టి చచ్చిపోయినాడు. పెండ్లయిన సమ్మచ్చరంలోనే పుట్టినాడు. మళ్ళ సమ్మచ్చరం, అన్న పుట్టింది నాకు" అని చెప్పింది. మా అమ్మ ఈ సంగతిని నాకు యింతకు ముందెప్పుడూ చెప్పలేదు. నేను మా అమ్మకు - మేం ముగ్గరమే బిడ్లం– అనుకున్నాను. 'అయ్యో, మనకు తెలవకుండానే ఒక అన్న పుట్టి, చచ్చిపొయ్‌నాడా?' అనిపించి నేను నిర్‌జీవిని అయిపొయ్‌నాను. నేను లెక్క గట్టడం కొంచిం పక్కన బెట్టి చచ్చిపోయిన మా అన్నను గురిచ్చి అడగడం ఆరంబం చేసినాను. "మా అన్న పుట్టి ఎన్నేండ్లు బతికినాడమా?" అనడిగితే, మా అమ్మ, "ఆ ఎన్నో ఏండ్లు యాడిది? పుట్టినాడు నాలుగైదు రోజులుండి చచ్చిపొయ్‌నాడు." అని చెప్పింది. "ఆయన ఎవురి పోలికలో వుండినాడమా? నీ పోలికా, మా అయ్య పోలికా? ఆయన చచ్చిపోతే నువ్వు ఏడవలేదా అమా?" అనడిగినాను నేను దిగులుబడి పోయి. (పురుట్లోనే చచ్చిపోయిన బిడ్డిని పట్టుకొని నేను మా అన్న, మా అన్న అని అనడం నాకు బలే కుశాలగా వుండింది.) మా అమ్మ నవ్వు మొకం పెట్టుకొని, "ఎందుకురా ఏడ్చేది? ఇక్కడుండే బూములు బావులు పంచుకోకుండా, చచ్చిపోయినాడని ఏడ్వమంటావా? వాడు చచ్చిపోయి నన్నెంతో సుకపెట్టి నాడు. వాడు గూడా బతికుంటే మీ నలగర్నీ నేను ఏ గంప కింద మూసి పెట్టేది?" అనింది. నాకు ఈ మాటల వల్ల బలే బాద అనిపించింది. ఒకేళ మనం గూడా పురిట్లోనే చచ్చిపోయి వుండినామనుకో. మన అమ్మ మనల్ని గురించి గూడా మన తమ్ముడితో ఈ రకంతోనే గదా చెప్పి వుండును– అనిపించి నాకు కొంచిం నిష్టూరం వేసింది. మా అమ్మ పైకి ఈ మాదిరిగా అంటా వుండాదేగాని, ఆ రోజు నిజింతోనే ఏడ్చి వుంటాది. పేగు తెంచుకొని

పుట్టిన బిడ్డ గదా, నాలుగు రోజులే బతికి పురిట్లోనే చచ్చిపోతే మాత్రం ఏమి– ఏడుపు రాకుండా వుంటిందా? మన అమ్మకు పుట్టిన మనం, మన అమ్మ రెక్కల కష్టం తింటా వుండాం గదా! ఆ మాత్రం చచ్చిపోయిన మా అన్న తినలేక పోయినాడు గదా!– అని నిమిసం ముందర వినిన ఆయన గురించి నేను బలే చింత పడినాను. ఆ రోజుటికి మా అమ్మ వయస్సును లెక్కగట్టే పనిని, మూలబెట్టేసినాను. మళ్ళా నాలుగు రోజులకు ఎత్తుకొని, "అవితే పెండ్లయిన రెండో సమ్మచ్చరంలో అన్న కడుపులో పడినాడు, అంటే నీ పజ్జెనిమిదో సమ్మచ్చరంలో నీకు అన్న బుట్టినట్టు లెక్క" అన్నాను నేను. "అన్న పుట్టిన ఎన్నాళ్ళకమా, నీకు అక్క బుట్టింది?" అనడిగితే, "మళ్ళా అయిదారేండ్లకు గదా!" అని చెప్పింది మా అమ్మ. అంటే ఇరవై నాలుగో సమ్మచ్చ రంలో మా అమ్మకు మా అక్క పుట్టిందని నేను మనుసులో బెట్టుకొని, "అక్కకూ, నాకూ ఎడం ఎంతమా?" అనడిగినాను. "ఓ యమ్మో! నీకూ, అక్కకూ నడిమద్దెన ఏడెనిమిదేండ్లు!" అని చెప్పింది మా అమ్మ. అంటే ముప్పై రెండేండ్ల వొగిసులో మాయమ్మకు నేను పుట్టినాను. నేను పుట్టిన అయిదేండ్లకు మా అమ్మోళ్ళు నన్ను ఇస్కూలు చేరిపించినారు. ఇప్పుడు నేను ఎనిమిదో తరగతి అనుకోండి! కాబట్టి ఒక ముప్పై రెంటికి ఒక పద్మూడు కలుపుకొని "అమా, నీ ఒగిసు యెచ్చూ, తక్కువగా నలపై నలపై మూడు" అని నేను చేతులిదిలించుకున్నాను. మా అమ్మ నా లెక్కను జూసి, "అంత సిన్న మనిసినా రా నేను?" అని ఆమెకు ఆమే యిచ్చిత్రపోయింది. నలపై అంటే మాటలా?– అని నేను ఒక పక్క బెదురు పెట్టుకొని అల్లాడిపోతా వుంటే, మా అమ్మ అదే తక్కవ అనుకొని బాద పడిపోతా వుండాది. ఈ కర్మకు నేను యాడికి బోదును?

అందరమ్మలకూ ముప్పైయ్యేండ్లకు మించి వుండవే. మా అమ్మకు అప్పుడే నలపై పైనంటే ఇదేమన్నా తక్కువా? అదీ నేను ఎంతో కరట్టుగా, తూంచి తూంచి తక్కవగా, తక్కవగా లెక్క వేస్తేనే ఇంత వచ్చిందే! అంటే మన అమ్మ నడి తరం మనిసా? ఈ రకంగా యిన్ని యాదనలు బెట్టుకుని అల్లాడి పోతా వుండినా– మా అమ్మకు గూడా నాయిన వుండడం, నాకు ఎంతో యిచ్చిత్రంతోనూ, బలే కుశాలతోనూ వుండేది. మా తాత మాకు కనిపిస్తానే వుండే పక్కూళ్లో కాపరంగా, సేద్యంగా వుండేవాడు. వాళ్ల యింటికి, మా

ఇంటికి రాకపోకలు ఎక్కువగా వుండేవి గావు. ఆయన మా తాత అని నాకు దెలుసు, నేను మనవణ్ణని ఆయనకు తెలుసు. మా ఇద్దరి మద్యనా సమందం ఇంత మటుకే వుండేది. ఆయన మా అమ్మను "ఏమమ్మీ, సిన్నమ్మీ!" అని పిలవొచ్చును గదా. నా కర్మకు ఆయన గూడా బాద్యుడై, ఆయనకు సొయానా కూతురైన మా అమ్మను పట్టుకొని మా తాత "అక్కా, అక్కా!" అనేవాడు. వీళ్ళెక్కడి అబ్బా కూతుర్లు రా సామీ– అని అర్తం గాక నేను చచ్చి సున్నమయ్యే వాణ్ని. మా తాత వల్లా, ఒక్కొక్క దపా నాకు మా అమ్మను చూస్తే ఈసుగా వుండేది. ఒకసారి అనేసినాను గూడా, "నీకేమమా, నువ్వింత పెద్దయినా, 'నాయినా, నాయినా' అని పిలుచుకొనే అందుకు నీకింకా నాయిన వుండాడు. నీ వొయిసు వచ్చినాక నాకు అమ్మా నాయినా వుండబోతారా!" అని!

మా అమ్మకు ఎవురన్నా అంటే ఏమోగాని, మా తాత అంటే మటుకు అరికాలి మంట ఉచ్చికి ఎక్కతా వుండేది. నేనా మాట అనినందుకు మా అమ్మ, "వాడు వుండేమి సుకం, లేకేమి సుకం? వాడ్ని నేను నాయినని ఎప్పుడూ అనుకోలేదే!" అని నా మింద మా అమ్మ ప్రతాపం అంతా చూపించేది. మా అమ్మకు మా తాత గింజ సకాయం, రూక సకాయం చెయ్యడం లేదని మంట మా అమ్మకు. ఇదే రకంగా మా అమ్మ వొగిసు వాళ్లకు కొంతమందికి ఇంకా అమ్మానాయిన్లు వుండడం చూసి లోపల్లోపల కుళ్లుకునే వాడ్ని. అటువంటి వాళ్లు నా కంటికి పున్యాత్ములుగా అనిపించే వాళ్లు. అంతదాకా ఏమిటికి? నాకన్నా మా అన్నే అదురుష్టమంతుడు గదా! నా కన్నా పద్మూడేండ్లు పెద్ద ఆయన. మన అమ్మకు కొడుగ్గా మనకన్నా మన అన్నే ఎక్కువ కాలం వుండినట్టుగా లెక్కేసుకుని– నేను మా అన్నను జూసి ఈసు పడేవాడ్ని. మా అమ్మ చచ్చిపొయ్యేటప్పటికి నేను మంచి ఈడు మింద వుండి, మా అన్న మాత్రం మళ్లిన వొయిసులో వుంటాడనుకొని – మన అన్నకు వుండినంత అదురుస్టం మనకు లేకపాయనే అని గూడా అనిపించి కొంచేపు ఈ దిగులును కూడా పడేవాడ్ని. తిక్కలోడ్ని, యెర్రి యెదవనూ గాకపోతే– నేను అప్పుడప్పుడూ, మన అమ్మకు మనం సిన్న కొడుకుగా పుట్టినందుకు లోపల్లోపల కుశాల పడేవాడ్ని గదా. ఇప్పుడు నాలుగు మూలలూ చూసుకుంటే– సిన్న కొడుకుగా ఒక తల్లికి, ఒక తండ్రికి పుట్టడమే పొరబాటు. వీటినన్నిట్నీ అనుకొని నేను యాదన మింద యాదన

పెట్టుకుంటా వుంటే నాకనిపించింది- కనీసం మనమన్నా మన పదారో సమ్మచ్చరంలోనే పెండ్లి చేసుకొనేసి, బిరీన బిడ్డల్ని కనేస్తే, మన బిడ్డల్ని మనం పెద్దోళ్లను చేసేసి, వాళ్లకు ఒక దోవను ఏరుపాటు జేసేసి, మన చావును మనం సుకంగా చచ్చిపోవచ్చు- అని! అట్ట గాకుండా మనం వొయిసు ముదిరినాక చేసుకుంటే- మన చిన్న కొడుకి పెండ్లి, మన చిన్న కూతురి పెండ్లీ మనం కండ్ల జూడలేము. వాళ్లు పెండ్లిండ్లు చేసుకునే వొగిసులో గాని మనం చచ్చిపోతే, వాళ్ల సంగతి గూడా యిప్పుడు మన సంగతి మాదిరిగానే బిత్తర బిత్తరగా అయిపోతింది. అందుకని మనం తొందరగానే పెండ్లి చేసుకొనే ఏర్పాటు చేసుకోవాల. ఈ ఆలోసిన మనకు రావడంతో ఎంతో మేలు జరిగిందని అనుకున్నాను.

దేముడనే వాడే లేకుండా వుండుంటే ఒకరోజు మా ఇంట్లో పెద్ద గోరం జరిగిపోయి వుండును. మా మేనత్త అయిన రామక్క కొడుకు ఎత్తిరాజులు బావ మోట తోలుకొని అయిదెకరాల కయ్యను పైరెక్కించుకోలేక ఆయిలు మిసినీ పెట్టినాడు కొత్తగా. ఆయిలు మిసినీకి ఏర్పాటు ఎట్ట వుండునంటే- ఆ మిసినీ వల్ల మంచి నీళ్ల పంపు ఒకటి, వుడుకు నీళ్ల పంపు ఒకటి వుండేవి. ఆ కాసిన్ని వుడుకు నీళ్లతోనే మా కొంచెం కయ్య పారిపోయేది. అందుకని మాకు మోట తోలే పని తప్పిపోయింది. మా మోట బానతో పాటు, కొయ్యతో చేసిన బండి చక్రం వొకటి వుండేది. ఆ బండిలో నుంచే మోటను ఈడ్చే మోకుతాడు తిరిగేది. అగ్గో, ఆ బండితో ఏమీ పనిలేక మా నాయిన దాన్ని అయిదారేండ్ల కింద ఒక తాడుకు కట్టి మా త్రావుకు ఒక చీల గొట్టి యేలాడదీసినాడు. ఒక రాత్రి నేను, మా అమ్మ, మా అక్క చాప మింద వొకర్నొకరం కరుసుకోని పడుకోని నిద్ర పోతా వుంటే- ఎప్పుడో కట్టిన దాని తాడు నుసిబట్టి పొయ్యిందేమో తెగిపోయి ఆ మోట బండి చక్రం బానతో సఖా దబీమని కిందపడి పోయింది. నేను, మా అక్క మా మొద్దు నిద్దర్లను మేము పోతావుంటే, మా అమ్మ మాత్రం బిత్తర పోయి లేచిందంట. ఆ శబ్దానికి మా పెద నాయినింట్లో వోళ్లు కూడా వొచ్చేసి నారంట. అది గాని మా నెత్తుల మింద పడి వుంటే- మా ముగ్గరి తలకాయలు పిచ్చిలు పిచ్చిలుగా పగిలిపోయి వుంటాయి.


మా అమ్మ నిద్ర పోతా వుండే నన్ను, మా అక్కను లేపకుండా– యిక్కనా పక్కనా వుండినోళ్ల నందర్ని లేపుకొని వచ్చి "చూద్దురు రండి. నా రెక్కల కష్టం ఎంత మంచిదో! కాకుంటే నా బిడ్డల నెత్తి మింద అది పడి వుండదా?" అని చెప్పుకొనిందంట. ఆ తెల్లారినాక మా అమ్మ ఇదంతా పొల్లుబోకుండా చెప్పింది. మళ్లొక రోజవితే నేనూ మా అక్కా మా వామిలోకి పోయి, పొయ్యిలోకని చెప్పి తట్టలో బెట్టుకొని కొన్ని కట్టెల్ని తెచ్చినాము. మా అక్క ఇంటికి వచ్చినాక, తట్టను దొల్లించితే బయటకొచ్చిన కట్లపామును జూసి ఆ అమ్మి బిత్తరపోయి, "ఓయమ్మల్లో" అంటా కడగా పరిగెత్తింది. దాన్ని మేము చంపేసినాక, మా యమ్మ దాన్ని ఒక కట్టిపుల్లకు తగిలించుకోని, వూరంతా తిరుగులాడి, "చూసినారా, నా రెక్కల కష్టం ఎంత మంచిదో! లేకుంటే నా బిడ్డల గతి ఏమై వుండునంటారు?" అని బడాయి బడాయిగా చెప్పుకొనింది. మా అమ్మల బిడ్డలకు ఇంక చావు లేదులే– అని ఆ రోజుటికి నేను అలివిగాని కుశాల పడినా, ఏ పొద్దో ఒక పొద్దు మనకు–మన అమ్మను గురించిన దుఃక్కం తప్పదు గదా అనుకొని, నేను మళ్లా మొదుటికొచ్చి, నా బయాల్నన్నిట్నీ కడుపులో బద్రంగా పెట్టుకొని బతుక్కుంటా వస్తుండాను.

✡

# మిట్టూరోళ్ల
# ఫోటోలు కొన్ని...



సినక్క



నారప్ప



అక్కకూతురు తులసితో సినబ్బ



అణకువైన అక్క జయలక్ష్మి



బూలోక రంబ



ఆరోగ్య శాఖామంత్రి ఉమ్మడు



వ్యవసాయ శాఖామంత్రి రాముడు



నవ్వులోడు: నాగరాజు



గెడ్డాం అయ్యోరు



గూనయ్యోరు



సరోజత్త కూతురు యిజాలచ్చిం



మిట్టమింద సుబ్బి





బక్కత్త



బక్కత్త కూతురు దనలచ్చిం



బీకత్త కూతురు నీలావొతి



కదుపక్క



కర్రెక్క



జుట్టు బావ

శివమ్మ



శివమ్మ

శివమ్మ కూతురు




శివమ్మ కూతురు




రామస్తానం కొడుకు కుక్కల బావ



పొట్టవ్వ కొడుకు వేట్లాయన



మునికన్నడు



ఇలామంతు నాయుడు



మునికన్నడి వాళ్లమ్మ యెంగటమ్మ



ధర్మడు



నాగరాణి



## బతుకు గోరే తల్లి సరోజత్త

"ఇందాక నా కూతురు నోరంతా తెరిచి అడిగితే ఇరై రూపాయలు లేదన్నాను గదా. ఇప్పుడే ఇనూర్రూపాయలెత్తుకోని తిరప్తికి పోతుండా. నా మనవరాలు– అదే దాని కూతురు – అడుగు తీసి అడుగేస్తా వుండాది గదా. ఈ ప్రాయంలో దానికి యెండి గొలుసులు కావొద్దా?"